అన్నమయ్య వెలుగుబాట

(అన్నమయ్య సంకీర్తనల విపుల వ్యాఖ్య)

వ్యాఖ్యానము

కొండవీటి జ్యోతిర్మయి

సహకారం

కొండవీటి వీరవేంకట చలపతిరావు

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2018

ANNAMAYYA VELUGUBATA

by
Kondaveeti Jyothirmayee

T.T.D. Religious Publications Series No. 1274

First Print : 2018

Copies : 500

Published by
SRI ANIL KUMAR SINGHAL, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507.

D.T.P:
Publications Division,
T.T.D., Tirupati.

Printed at :
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

ముందుమాట

భారతీయ విజ్ఞాన సర్వస్వానికి మూలకందాలైన వేదోపనిషత్తులలోని సారాన్ని శ్రీవేంకటేశ్వర తత్త్వ, మహత్త్వాలకు సమన్వయపరిచి సంకీర్తనా వాఙ్మయాన్ని సృష్టించిన తొలి తెలుగు వాగ్గేయకారుడు శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యులు. పదకవితా పితామహునిగా ఖ్యాతిగాంచిన అన్నమాచార్యులు తమ 16వ యేటనే తిరుమల శ్రీనివాసుని సాక్షాత్కారం పొంది అతని ఆజ్ఞచేత రోజుకొక్కటికి తక్కువ కాకుండా ముప్పైరెండు వేల సంకీర్తనలను రాసిన ధన్యజీవి.

శ్రీహరి నందక ఖడ్గాంశగా జన్మించిన అన్నమాచార్యుల వారి 32వేల సంకీర్తనలలో ప్రస్తుతం మనకు లభిస్తున్నవి 14,358 సంకీర్తనలు మాత్రమే. అపురూపమైన తాళ్ళపాక కవుల సాహిత్యాన్ని పెదతిరుమలాచార్యులవారు రాగిరేకులపై చెక్కించి మనకు అందించారు.

అన్నమయ్య సంకీర్తనలలో నాలుగు అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. అవి 1.భక్తి 2.సాహిత్యం 3.సంగీతం 4.భాష.

సమకాలీన ప్రబంధ భాషను ప్రక్కకు పెట్టిన అన్నమాచార్యులు ప్రజల వ్యవహారంలో ఉన్న తెలుగుభాషకు పట్టం కట్టారు. తమ సంకీర్తనల ద్వారా భక్తిభావాన్ని సామాన్య ప్రజలకు కూడా అందించారు.

అన్నమయ్య వాగ్గేయకారుడే కాదు. గొప్ప ప్రవక్త, బహుముఖ ప్రజ్ఞాశీలి, ద్రష్ట, విశాల దృక్పథం ఉన్న సామాజికవాది కూడా. ఆయనకు ఈ విశ్వమంతా విష్ణుస్వరూపమే. అందుకే విశ్వాన్నే శ్రీహరిగా భావించి ప్రేమతో, ఆర్తితో, శరణాగతితో అర్చించి తన్మయుడైనాడు. ఆయన సంకీర్తనలలోని ఉపదేశాలకు, ప్రేమకు ఎల్లలు లేవు. సంకీర్తనల ద్వారా వీరిచ్చే ఉపదేశాలు నేరుగా శ్రోతల, పాఠకుల గుండెలకు హత్తుకుంటాయి.

తిరుమల తిరుపతి దేవస్థానములు అన్నమాచార్యుల పేరిట ప్రత్యేకంగా ఒక ప్రాజెక్టును నెలకొల్పి ఆ ప్రాజెక్టుద్వారా అన్నమాచార్యుల సంకీర్తనలను నిరంతరం ప్రచారం చేయించడమే కాక, అన్నమాచార్యుల సంకీర్తనలకు దేశ విదేశాలలో విశేష ప్రాచుర్యాన్ని కల్పించేందుకు కృషిచేస్తున్నది. వివిధ విశ్వవిద్యాలయాలలో అన్నమాచార్యుల సాహిత్యంపై జాతీయ సదస్సులు, పరిశోధనలు నిర్వహింపజేస్తూ ప్రోత్సాహకాలను అందిస్తున్నది. ఈ నేపథ్యంలోనే అన్నమాచార్యుల సాహిత్యానికి వ్యాఖ్యానాలు, పదకోశాలు వ్రాయించడం, మారుతున్న సమాజానికి అనుగుణంగా సీడీలను తయారు చేయించడం, తి.తి.దే. వెబ్‌సైట్స్‌లో పెట్టించడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నది.

ఇందులో భాగంగా అన్నమాచార్య సంకీర్తనలను సామాన్యుల చెంతకు తీసుకుకెళ్ళడంలో విశేషంగా కృషిచేస్తూ విస్తృత ప్రచారం చేస్తున్న విద్వచ్ఛి రోమణి శ్రీమతి కొండవీటి జ్యోతిర్మయి గారు వ్రాసిన "అన్నమయ్య వెలుగుబాట" గ్రంథాన్ని పాఠకులకు అందిస్తున్నాం.

51 సంకీర్తనలను ఎంచుకొని ప్రతి సంకీర్తనకు టీక, పరిచయం, తాత్పర్యం, వేదాంతపరంగా విపులవ్యాఖ్య అందించారు శ్రీమతి కొండవీటి జ్యోతిర్మయిగారు. ఈ గ్రంథం సాధారణ పాఠకులకే కాక అన్నమాచార్య సాహిత్య పరిశోధకులకు కూడా ఉపయోగకారి అవుతుంది. తి.తి. దేవస్థానములకు ఇంత చక్కటి గ్రంథాన్ని అందించిన కొండవీటి జ్యోతిర్మయి గారికి శ్రీనివాసుని అనుగ్రహం ఎల్లవేళలా ప్రసాదించాలని కోరుకుంటూ....

సదా శ్రీవారి సేవలో...

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

ఓం నమో అన్నమాచార్యాయ!



గురు స్తుతి

శ్రీ నిరంతరానంద నిశ్శ్రేయసార్థ
సాధకము సర్వకిల్బిష బాధకము స
మగ్ర విజ్ఞానదము మహామహిమ ఘనము
శరణమగు మాకు సద్గురు చరణ యుగము.

– మహాయోగి శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

ఆత్మనివేదన

అన్నమయ్యకు నేను ఒక పరికరంగా ఉపయోగపడుట నా భాగ్యము. మా గురుదేవులు చెప్పిన పతంజలి యోగసూత్రములు, నారద భక్తిసూత్రములు, ఇంక ఎన్నో విన్నాను. గురుదేవులు ఎక్కిరాల కృష్ణమాచార్యులు గారు అంటారు, మంచిపని మొదలుపెడితేకాని జీవితంలో క్రమశిక్షణ రాదు అని. దీన్ని పూర్తిగా విశ్వసించాను, మొదలుపెట్టాను. 5 సంవత్సరాల క్రితం పడిన తపన ఇప్పుడు మీ ముందుకు పుస్తక రూపంలో ప్రచురితమై వచ్చింది. ఈ వ్యాఖ్య వ్రాయటము పున్నయ్య నాన్న ఆదేశిస్తే సాగింది. గురుదేవుల ఆశీర్వాదబలమే మా ఈ ప్రయత్నం. ఎంతో ప్రోత్సాహం ఇచ్చి నాన్న నాకు అర్థంకానిది చెప్పారు. ఈ వ్యాఖ్య రచన మా ఇర్వురి సంయుక్త తపస్సుగా సాగినది. నాలో ఉన్న లోటు సంకీర్తన పాడినా, చదివినా అనుభూతికి వస్తుంది. అది ఇది అని చెప్పటానికి మాటలు రావు, ఆ మాటలు వచ్చేటట్లు మా నాన్న నన్ను ముందుకు కదిలించారు. ఈ వ్యాఖ్యానం వ్రాసేటప్పుడు అపారమైన పారవశ్యం, ఒక్కోసారి ముందుకు వెళ్లేది కాదు. అలా **'ఎన్నడు విజ్ఞానమిక నాకు'** వ్రాసినపుడు జరిగింది. ఇందులో ప్రచురితం కాని సంకీర్తనలు **'ఏమొకో చిగురుటధ్ధమున'** లాంటి ఇంకా సంకీర్తనల వ్యాఖ్య వ్రాసినవి ఉన్నవి పాఠకులకు 51 సంకీర్తనలే ఇవ్వటం జరిగింది. ఇలాంటి సంకీర్తనలు వ్రాసినపుడు చాలా ఆనందము కలిగేది. నాకు ఒక సమస్య ఉంది. నాకు పారవశ్యం కలిగినపుడు మనస్సు ఆగిపోయేది. నాన్న నన్ను ముందుకు తోసేవారు. అన్నమయ్య మనకు అందినట్లు వాగ్గేయకారుడే కాదు. గొప్ప ప్రవక్త, బహుముఖ ప్రజ్ఞ గలవాడు, ద్రష్ట. ఆయనది ఎల్లప్పుడూ భాగవత దర్శనమే. ఈ మహానుభావుని సంకీర్తనము గానము చేయుటే కాదు దానిలోపల ఉన్న లోతుభావము ఆయన దృక్పథము అత్యంత ఆనందాన్ని ఇస్తాయి. అప్పుడు పాడేవారు ఆర్తితో, భక్తితో హృదయమార పాడెదరు. ఈ జ్ఞానాగ్ని, వాగగ్ని నాది ఏమాత్రం కాదని వినయపూర్వకంగా నమ్రతతో చెప్పుచున్నాను.

ఇదంతా నా గురుదేవుల అనుగ్రహం, వేటూరి ప్రభాకరశాస్త్రిగారి ఆశీర్వాదము. సృష్టిలోని విజ్ఞానభాండాగారాన్ని మహాత్ములు ఎంతో తేలికగా చెప్పారు. కానీ దాని లోతు అనుభవించాలే తప్ప... వారు మనల్ని తికమకపెట్టరు. సర్వ ప్రాణులయందు అపార వాత్సల్యంతో తేలికైన పదాలు వాటంతట అవే దిగివచ్చాయి. ప్రాస, యతి లెక్కలు మనం లెక్కలు వేయలేంగాని వారికి వాటితో పనిలేదు, రసామృత సాగరంలో ముంచి ఉంచుతారు. అలాంటి సందర్భాలు కోకొల్లలు. వేదధ్వని లేనిదే ఋషి కవిగా ఉండడు. అన్నమయ్య సంకీర్తనలలో అన్ని పదాలు నిండుగా ధ్వనిగర్భం దాల్చినవి, ఎక్కడా అనవసరమైన మాటలు ఉండవు. ఎక్కడైనా వ్యాఖ్యలో ఉండవచ్చేమో. భారతదేశం నలుదిశలకు కాంతిని వెదజల్లిన సంకీర్తనలు ఇవి. జాతిని మేల్కొల్పడానికి వ్రాసిన సంకీర్తనలు. ఇవి భక్తి అనే చల్లని నిర్మల ప్రవాహంలో స్వయంప్రకాశమైన అమృతనాద ధారలు. కనుకనే వ్యాఖ్య అనే వాక్ ప్రవాహం ఆగకుండా సాగింది. శాస్త్రము, కళ, యోగము ఏ సంగీతానికైనా ఉండే పార్శ్వాలు. మనం యోగ జీవితానికి ప్రవేశించే సాధన అన్నమయ్య ప్రసాదించాడు.

మనకు మన ఉనికిని మరపును ఇచ్చేదే సంకీర్తన యోగము. అది ఈ ఋషి కవి యొక్క సంకీర్తనల ద్వారా కలుగుతుంది. వేదము, రామాయణం, భాగవతం, గీత – వీని సారములు సంకీర్తనగా దిగివచ్చాయి. వాటిలో ఉన్న కథలు, శాస్త్రసంబంధములు, ఆచరణ ఇవి చెప్పే ప్రయత్నం చేశాము. ఇది అంతా గురుదేవుల అనుగ్రహమే. అన్నమయ్య గ్రామీణ జీవనమును దర్శించి తనిసాడు. చెంచులు, బోయలు, గిరిజనులు, హరిదాసులు, రైతులు, చేతివృత్తులవారు ఈతనికి ఆరాధ్యమూర్తులు. ఈయన పల్లె సొబగులను అనుక్షణం అనుస రించాడు. అందునుండే మనకు స్వచ్ఛత వస్తుంది. వీరి అందరినీ కలవడం ద్వారా ఈయన సమాజంలో ఉన్న ఎందరికో కృతజ్ఞతలు ప్రేమపూర్వకంగా చెప్పాడు.

అన్నమయ్య ప్రజలు నవ్వితే నవ్వాడు, ప్రజలు ఏడిస్తే ఏడ్చాడు. అదే ఆచార్యపురుషుడికి గుర్తు. దేశం సుభిక్షంగా, శాంతితో, సస్యశ్యామలంగా ఉండాలని, దాని కొరకు వారి ఆధ్యాత్మిక సాధన, వ్యక్తిగత జీవితం త్యాగం చెయ్యగా వారి తపస్సు ఫలితమే సమాజము ఇంకా అస్తవ్యస్తంగా ఉన్నా ఆనందంగా ఉండటానికి కారణం. మాటను వాడటంలో ఒకే మాట కానీ రెండు, మూడు అర్థాలు ఉంటాయి. వాటిని చెప్పే ప్రయత్నం చేశాం. అన్నమయ్య రాధాకృష్ణులు, గరుత్మంతుడు, శబరి, గుహుడు, సుగ్రీవుడు, విభీషణుడు, అర్జునుడు, సాందీపని – ఏ పాత్ర గురించి చెప్పినా తాను ఆ పాత్రగా భక్తుడిగా పరమాత్మ సాన్నిధ్యాన్ని అనుభవిస్తూ సంకీర్తన చెపుతాడు. అది ఆత్మనివేదనమైనా, శ్రవణభక్తియైనా, కీర్తన సాధనమైనా, పాదసేవనమైనా, సఖ్యమైనా, స్మరణలో ఎప్పుడూ స్వామికి వందనాన్ని వినయంగా తెలుపుతూ.. అన్నమయ్య సంకీర్తనలో తాను తనని వింటూ.. అపూర్వం అని మనం అంటే అవునా, మీలాగే నేనూ విన్నాను అని అన్నట్లు అనిపించేది. ఏ సంకీర్తన విన్నా ఇది నా స్వీయ అనుభూతి, ఇంద్రియములు గుర్తులేవు, చోటు, కాలము గుర్తుకు రాలేదు. కొన్ని సంకీర్తనలు మంత్రపూర్వకములుగా ఉన్నాయి. అందులోనుండి మంత్రములు తియ్యడం కష్టం. అది రాలేదు. మున్ముందు గురుదేవులు అనుగ్రహిస్తారేమో.. నాకు తెలియదు. శబ్దముల స్పర్శ కూడా ఒక్కోసారి అనుభూతిలోకి వచ్చేవి. అందులో **'అతిశోభితేఽయం రాధా'** రాధ అన్నప్పుడల్లా ఆమెను తాకినంత ఆనందం. అది సాధ్యంకానిది. కానీ సంకీర్తనలో సాధ్యం. చదువుని గూర్చి చెప్పినప్పుడు చదువు పేరు 'అక్షరాస్యత అమ్మబడుతున్నది' అని అనిపించటం, 'భగవంతుని ప్రకటించు చదువే చదువు' అన్నప్పుడు ఎంత సంతోషంగా ఆ పదాలు వ్రాయడం. అన్నమయ్య అప్పటికి ఇప్పటి చదువు గూర్చి ఎంతో హృద్యంగా స్ఫూర్తిని కలిగించేటట్లుగా చెవులలో రింగురింగు మనేట్లు వ్రాయడం, అది ఒక్క ఋషికి మాత్రమే తెలుస్తుంది.

సంగీతం సంగీతం కొరకు కాదు,
సంగీతం తాత్కాలికానందం కొరకు కాదు,
సంగీతం ప్రజలనే ప్రతిబింబాలను కదిలించటానికి
స్పందన స్ఫూర్తి ఇచ్చుటకు, కరగిపోవుటకు,

మనం మరపు వచ్చుటకు, ఎప్పటికప్పుడు చెవిలో వినబడేటట్లు ఉంటే నిజమైన సంగీతం అది మానవుని దివ్యుడిగా చేస్తుంది. ప్రతి మానవుడు ఒక వెలుగు కొరకు పరితపిస్తాడు. అదే భగవంతుడు ఒక మహనీయుడిలా వెలుగుతూ ఉంటాడు. ఏకత్వం వైపు నడుపుతాడు. మనం చక్కగా వెలుగులు చూడవచ్చు. అన్నమయ్య ఇచ్చిన స్ఫూర్తితోనే అన్నమయ్య పూలరథం, విష్ణుహారతి, అఖండ హరినామ సంకీర్తన, రుక్మిణీ సంకీర్తన కల్యాణం, లక్ష్మీనారాయణ హోమం, నేను–నా ఊరు, వేద అన్నమయ్య శిక్షణ, సామాన్యుడు మొదలైన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాము. ఆయన ప్రతీ సంకీర్తనలో సామాజిక ఔచిత్యాన్ని, వ్యక్తిగత సాధనను చెపుతాడు. ఉపనిషత్ సారాన్ని సంకీర్తనలో శ్రేయస్సును ప్రేయస్సుగా ఇచ్చి ప్రతి మనిషినీ ఆచరణ వైపు తీర్చిదిద్దుతాడు. ఆచార్యపురుషుల నడక, చూపు, నవ్వు ఎంతో ఆర్ద్రత కలిగినవి. మనం అన్నమయ్యను చూడకపోయినా అనేకమార్లు తలవడం ద్వారా పునీతమౌతాము. అదే మన జన్మ సుకృతి. ఎంత పని వారికోసం చేస్తామన్నది మనకు తెలియనిది గానీ ఒక్కటి మాత్రం సత్యం, అలా కాకపోతే మనకు ఇలాంటి ఆలోచనలు రావు. ఇది భాగ్యమే తప్ప మరొకటి కాదు. ప్రతి సంకీర్తనం, వ్యాఖ్యలలో ఆయన పడిన తపన, ఆర్తి, గుర్తుకొచ్చాయి. హృదయం ద్రవించింది. అదీ నేను గుర్తున్నప్పుడు. నేను లేకపోతే ఆనందంతో సమాధి కలిగేది. సంకీర్తన శరీరము వంటిది. పల్లవి ఆత్మ. మూడు చరణములును, మూడు ధాతువులను శుద్ధిచేస్తాయి. సంకీర్తనే నా గమనం, గమ్యం. ఆరోహణగా అనుభూతికి అవరోహణగా వ్యాఖ్య చెప్పుకున్నాడు అన్నమయ్య.

గురుదేవుల పాదారవిందములకు నమస్కారములు సమర్పిస్తూ...

– కొండవీటి జ్యోతిర్మయి

అన్నమయ్యకు అక్షరహారతి

ఆంధ్రదేశమున అన్నమయ్య పేరెఱుగనివారు లేరు. అట్టి ఆ మహాత్ముని దివ్య సంకీర్తనములను హృదయము నుండి వెలువడు ఆర్తితో, అరుదైన భక్తితో, ఆత్మానుభూతితో, తేనెసోనల తీయని స్వనములతో గానము చేయుచు ఆంధ్రదేశము నలరించు చున్న చి॥ల॥సౌ॥ కొండవీటి జ్యోతిర్మయియు ఎల్లరి ఎఱుకలో గల తల్లియే. దైవసంకల్ప వశాత్తు, ఈ తల్లితో గల ఆత్మీయానుబంధము వలన అన్నమయ్య ఆశీస్సులు, సాన్నిధ్యము నాకు లభించుచున్నవి. ఇది మా గురుదేవులు మాస్టర్ ఇ.కె.గారి కరుణ. అన్నమయ్య ప్రథమ వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు, మహాభక్తుడు. అయినను ఈ యంశములన్నియు కలిసి పాక్షిక సత్యము మాత్రమే. ఆయన విశాల దృక్పథము గల సామాజికవాదియను నంశము గూడ సత్యమే గాని, పాక్షిక సత్యము. ఏమయినను ఆతని సమగ్రమూర్తి హృదయ సమర్పణ గలవారికి అందునది గాని, వట్టి మేధకు గాదు. ఈ యందుటకును ఆయన కృపయే కారణము. ఈయన వేదర్షి. విశాల మానవతావాది. జాతీయ భావుకుడు. సంఘమును ఆధ్యాత్మికత యాధారముగా ఏకత్వమునందు, దేశభక్తియందు, పరస్పర ప్రేమతోడి సామూహిక జీవనమునందు మేలుకొలిపిన వైతాళికుడు. ధర్మసంస్థాపనార్థమై భగవదంశతో దివి నుండి భువికి దిగివచ్చిన దివ్య మానవుడు. ఇది యది యననేల! ఒక ప్రవక్తయే. **'ఒరులను తానుగా భావించువాడె'** హరిభక్తుడని చాటుట ఇందులకు మచ్చుతునక. భక్తి యనగా నిట్టి పరమప్రేమయే అని ఈయన భావము. తనకు స్వామి నియమించిన లోకకల్యాణ కార్యమును దీర్చుటకై ఈతని ద్వారమున సంకీర్తన పథము వెలువడినది. అన్నమయ్యకు వేంకటేశ్వరుడు తిరుమలపై వెలసిన దివ్య సుందర మోహన మంగళ విగ్రహుడే కాదు, సమస్త సృష్టిలోని యంతర్యామి. ఇతని కిట్టి యనుభూతిని స్వామియే ప్రసాదించెను. ఈ సందర్భమున మా మిత్రుడు శ్రీ అవ్వారి నరసింహమూర్తి గావించిన అన్నమాచార్య స్తుతిని ఉటంకించుచున్నాను.

వందే నందక ఖడ్గాంశం అన్నమాచార్య దైవతం
తిరువేంకట పాదాబ్జ మధుపాయినమన్వహమ్

అన్నమయ్య సంకీర్తనలు దివ్యానుభూతి నుండి భావములుగ, భాషాపదములుగ వెలువడినవి. ఇవి ఈయన రచన లనజాలము. స్వామి ఈయన హృదయము నావేశింపగా, స్వామి నుండియే భాషలోని కవతరించినవి. ఇవి బ్రహ్మానందసాగరపు టలల ఒయ్యారపు టూయలలు. అవి నా ఆత్మపుత్రిక యగు చి॥ల॥సౌ॥ జ్యోతిర్మయి హృదయమును, కంఠమును వరించినవి. జన్మ సంస్కారము వలన, దైవానుగ్రహము వలన ఈమె ప్రకృతిమాత యొక్క విశాలత్వమును, స్వచ్ఛతను పుణికిపుచ్చుకొన్నది.

అన్నమయ్యకు విశ్వమే విష్ణువు. కావున ఈయన స్వామి యొక్క నామ రూప గుణ వైభవములను కీర్తించుటలో తనియలేదు. విశ్వమునే స్వామిగా ప్రేమతో, శరణాగతితో అర్చించెను. దివ్యానుభూతిని,

కైవల్యమును పొందెను. దానినే ప్రబోధించెను. వ్యక్తికి, సమాజమునకు నడుమ పరమప్రేమతోడి సత్సంబంధమును నెలకొలిపెను. ప్రవక్తయై ఉదాత్త సమాజమును తన సంకీర్తనలలో ఆవిష్కరించెను. ఈయన సందేశములకు, ఉపదేశములకు, ప్రేమకు కుల మత జాతి దేశ పరము లయిన ఎల్లలు లేవు. ఈయన హృదయము విశాల విశ్వము యొక్క నమూనా. ఈయన విశ్వమానవుడు. స్వామి ఈయనకు తనతో, విశ్వముతో తాదాత్మ్య సిద్ధిని అనుగ్రహించెను. ఈయన హృదయములో సమస్త జీవులకు స్థానమున్నది. ఎట్టి వివక్ష లేదు. ఈయన జీవితమే మహాయజ్ఞము.

కొన్ని ఏండ్లుగా అన్నమయ్య చి॥ల॥సౌ॥ జ్యోతిర్మయి లోగనులకు పైవిధముగా సాక్షాత్కరించుచున్నాడు. అన్నమాచార్యులవారు ఈమెకు ఆచార్యుడై, పరోక్ష గురువై, మార్గదర్శకుడై ఈమెను నడిపించుచున్నారు. ఆయన చూపిన వెలుగుబాటకు తనను తాను సమర్పించుకొని ఈ తల్లి సమాజమును అర్చించుచున్నది. సార్వకాలికములగు అన్నమయ్య విశాల సందేశములను లోకమున కందీయవలెనని ఈమె తపింప సాగినది. అన్నమయ్య యొక్క 51 సంకీర్తనములను వ్యాఖ్యానమునకై ఈమె ఎంపిక చేసికొనినది. ఈ వ్యాఖ్యాన రచనలో నుపకరణముగా తోడుపడ నన్ను గోరినది. ఇది నాకు ధన్యత, మహాభాగ్యము. అర్హత యనరాదు. అన్నమయ్య ఏ స్థాయినుండి వీనిని వెలువరించెనో, ఆ భావానుభూతిని మాకు ప్రసాదింపుమని ఆయననే మే మిర్వురము ప్రార్థించితిమి. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు మహాయోగులు. వీరు మొదటగా అన్నమయ్య సంకీర్తనలను వెలికిదెచ్చిరి. వీరి గురుదేవులు, యోగేశ్వరులు మాస్టరు సి.వి.వి. గారి ప్రేరణ వీరి కృషి వెనుకనున్నది. మాస్టరు ఇ.కె. గారు (శ్రీమాన్ ఎక్కిరాల కృష్ణమాచార్యులవారు) విశ్వమానవ కల్యాణమూర్తియయిన మహానుభావులు. వీరు మా గురుదేవులు. శ్రీ శాస్త్రిగారి యంతేవాసులు, తపస్వి శ్రీ కొత్త రామకోటయ్య గారు తాతగారు. ఈ మహాత్ములెల్లరి దివ్యాశీస్సులు, స్ఫూర్తి, అనుగ్రహము, సాన్నిధ్యము ఈ వ్యాఖ్యకు నేపథ్యమున ఆధారములై యున్నవి. మేమిర్వురము గురుదేవుల పరికరములము మాత్రమే యని సవినయముగ మనవి చేయుచున్నాను.

అన్నమయ్య సంకీర్తనములందు భాష మిక్కిలి సరళ సుందరము. పాండిత్య భారము లేనిది. వీరి సందేశము నేరుగా శ్రోతల గుండియలలోనికి జొచ్చును, వారిని తట్టి మేలుకొలుపును. ఆయన సొగసైన తెలుగు పలుకుబడుల వెంట దివ్యభావములు పరుగులెత్తినవి. ఈయన సంకీర్తనములు సామవేద సూక్తములు. సరస సంగీత సాహిత్య భక్తులను మూడు నదులు కలిసిన ప్రయాగ వీరి రచన. ఈయన క్రొత్త దారిని నెలుకొలుపలేదు. వేదర్షులు, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు చూపిన వెలుగునే తిరిగి ఈయన క్రొత్త శైలిలో మనకు దర్శింపజేసెను. వీరి పథము నవము గాదు. నవ్యము–నిత్యనూతనము. అందువలన వీరి భావములకు, భాషా ప్రయోగములకు, సందేశములకు వేదోపనిషత్తుల తోను, భగవద్గీతతోను, రామాయణ భాగవతాదులతోను సంధానమున్నది. సాహిత్యమున నవరసములు గలవు. మహాకవుల సాహిత్యము బ్రహ్మానంద సహోదరమగు రసానందము వరకు అందించును. కాని వాల్మీకి, వ్యాసుల రామాయణ భాగవతములు, తెలుగులో పోతన భాగవతము బ్రహ్మానందమునే ప్రసాదించును. వీనియందు వేదార్థము,

బ్రహ్మానంద రసధ్వని గలవు. అన్నమయ్య సంకీర్తనలు గూడ ఇట్టివే. ఈయన నవవిధ భక్తులను కీర్తించెను. శిఖరాయమానమగు ఆత్మనివేదనమును అనుభవించి ప్రకటించెను. దీని పూర్ణతయే శృంగారము లేక మధురభక్తి. శృంగారమనగా అంతర్యామి యెడ ఆకర్షణ. ఆతని యనుభూతిలోని తీయదనము. అన్నమయ్య ముందుగా తన హృదయమును అమ్మవారితో తాదాత్మ్యసిద్ధి నొందించెను. జనులకు అమ్మ ఆయెను. తన యెదను స్వామికి భార్యగా భావించి, భర్త యగు నాతనికి సమర్పించుకొనెను.

ఈయన సంకీర్తనములలో మధురభక్తి యున్నది. పరిపూర్ణ శరణాగతి యున్నది. శ్రీరామ శ్రీకృష్ణుల జీవిత మర్మములున్నవి. వాల్మీకి వ్యాసుల హృదయమున్నది. రాముని పాదగమన మున్నది. కృష్ణుని వేణుగాన మున్నది. ఉత్తమ సమాజము యొక్క రూపురేఖ లున్నవి. గ్రామరాజ్య మున్నది. పాడిపంటలే సంపద యని నిరూపణ యున్నది. పరస్పర ప్రేమ యున్నది. విలువల విద్యావిధాన మున్నది. ధర్మబద్ధ మగు ఆర్థిక వ్యవస్థ యున్నది. కర్షక కార్మికుల ప్రాధాన్యమున్నది. వివిధ శాస్త్రము లున్నవి. పదములను చెక్కిన శిల్పకళ యున్నది. ఇవియన్నియు ఆధ్యాత్మికత యను పునాదిపై గలవు. వేదమున అన్ని జీవన రంగములును, సర్వశాస్త్రములను, ఆధ్యాత్మికత యను పూవున రేకలు. వేదర్షి యగు అన్నమయ్య గూడ ఇట్టి దర్శనమునే పొంది మన కందించెను. లేకున్న ఈ యంశము లెంత గొప్పగా కట్టినను పేకమేడ వలె కూలిపోవునని హెచ్చరిక జేసెను. ఆధ్యాత్మికత యనగా ఐహిక జీవితమున కర్తవ్యములను విడిచి, దేవుని పూజించుట, ధ్యానించుటే గాదు. అన్నమయ్యకు ఐహికమని, ఆధ్యాత్మికత యని రెండు విభాగములు లేవు. కుటుంబము నెడల, సమాజము నెడల కర్తవ్యములను, బ్రతుకునే యజ్ఞములుగా అంతర్యామికి సమర్పింపవలెనను సందేశము అన్నమయ్య సంకీర్తనలందు గలదు. ఇందు మానవతకు నిలువెత్తు నీరాజనమున్నది. నరుని నారాయణునిగ దీర్చు నాదప్రసారమున్నది. మానవుని యునికిని, అంతర్యామియను ప్రేమానందసాగరమున అల వలె కరగించు మహిమ యున్నది. విశ్వజీవ సోదరత్వ మున్నది. ఇది 'ఆత్మ' ఎల్లరకొకటే అను సూత్రముపై నాధారపడినది. అన్నమయ్య తడుమని జీవనరంగము లేదు, అంశము లేదు. కాని ఇవియన్నియు ఆధ్యాత్మిక సాధన యను చెట్టుకు కొమ్మలే. ఈయన వాస్తవ జీవితమునకు దూరముగా జరిగిన తత్త్వవేత్త గాదు. ఆచరణవాది. అనుభూతిస్వరూపుడు. ప్రేమమూర్తి. తేజోమూర్తి. ఈయన సంకీర్తనలు మానవుని ధర్మపథమునందు నడిపించునవి.

ఇతని దృక్పథమును, సందేశములను ప్రతినినదించు సంకీర్తనములు పెక్కులు. ఉదాహరణకు అంతర్యామి దర్శనము, ఉత్తమ మానవ సంబంధములు **'వేతొక్కరూ లేరు, తందనాన'** లలో సందేశములయినవి. పరస్పర ప్రేమ, బృందజీవితము, మానవైక్యము **'చల్లరే హరిపై జాజర జాజ'** లో స్థాపింపబడినవి. కర్మయోగ సారము **'అనరాదు వినరాదు, చంచలము మానితేను సంసారమే సుఖము'** లలో నుపదేశింపబడినది. ఆర్థిక వ్యవస్థ ఉండవలసిన తీరు **'రూకలై మాడలై'** అను సంకీర్తనమునను, ఆదర్శ విద్యావిధానము **'నాటికి నాడే చదువు'** లోను, సామాజికత, యథార్థమయిన భక్తి **'ఏకులజుడైననేమి'** లోను ప్రసక్తము చేయబడినవి. ధనము, అధికారము, ఆడంబరములపై ఆధారపడిన ఆధునిక కృత్రిమ

నాగరికత యొక్క డొల్లతనము **'పట్టినదెల్లా బ్రహ్మము'**న ప్రదర్శింప బడినది. పురుషునికి స్త్రీ ఆరాధ్యదేవత యని **'ఆటది రాజ్య మేలితే'**లో నెలకొలుపబడినది. సైన్సు, అధ్యాత్మవిద్య జమిలిగా కలిసి **'అదియే విష్ణుపదము, ఆతుమకు నెలవు'** అను సంకీర్తనమున దర్శింపబడినవి. భావి విజ్ఞానద్రష్ట అన్నమయ్య.

ఈ రచనలో నొక క్రమవిధానము పాటింపబడినది. మొదట సంకీర్తన, ఆపై టీక, తర్వాత పరిచయము, తాత్పర్యము, ఆ పిదప వ్యాఖ్య ఈయబడినవి. కొన్ని ప్రతులలో సంకీర్తనలలోని పదములలో మొదట 'యకారమును', 'వు, వూ, వొ, వో' లును గానవచ్చుచున్నవి. ఇవి తెలుగు పలుకుబడికి అసహజములు. అన్నమయ్యది సజీవ భాష. సమాధి భాష. ఈయన పల్లెసీమలలోని పామరు లనబడు జనుల నాలుకలపై నాట్యమాడుచుండు సరస్వతిని గొలిచి పల్లెపదములను ప్రయోగించెను. అయినను అంతమాత్రమున, ఉచ్చారణకు సంబంధము లేని లిపిని అన్నమయ్య వాడె ననరాదు. ఇప్పటికిని ఉచ్చారణలో పై అక్షర ధ్వనులు లేవు. కావున నివి సరిదిద్దబడినవి.

దీనిని ప్రోత్సహించిన ముఖ్యులెవరో గాదు, చి॥ల॥సౌ॥ జ్యోతిర్మయి యొక్క జీవన ప్రయాణమున సహచరుడగు చి॥ కొండవీటి వీరవెంకటాచలపతిరావే. ఈతడే ఈ రచనను గ్రంథ రూపమునకు దెచ్చిన అభినందనీయుడు. ఈ రచన క్రతువు నందొక ఋత్విక్కు. నా శ్రీమతి కమలయు అన్నమయ్య యందు భక్తితో దీనిని ఆద్యంతము ప్రోత్సహించినది. చి॥ అవ్వారి నరసింహమూర్తి సంస్కృత సంకీర్తనలను వివరించుటలో మాకు తోడ్పడెను. చి॥ల॥సౌ॥ లలితాపరమేశ్వరి ముద్రణ ప్రతిని సిద్ధము చేసినది. శ్రీ రత్తయ్య గారు డి.టి.పి.ని తయారుచేసిరి. తిరుమల తిరుపతి దేవస్థానముల వారు ఈ గ్రంథమును ముద్రిస్తున్నారు. వారి ప్రచురణ వెనుక దైవప్రేరణ యున్నది. చి॥ల॥సౌ॥ జ్యోతిర్మయికి, పైవారెల్లరికి, ఈమె కుటుంబమునకు, పాఠకులకు, అఖిలాంధ్ర లోకమునకు, ఎల్లరకు అలివేలుమంగా సమేతుడగు శ్రీనివాసుడు దీర్ఘాయురారోగ్యములను, తన సాన్నిధ్యమును అపార కరుణతో అనుగ్రహించుగాక. చి॥ల॥సౌ॥ జ్యోతిర్మయి తల్లి ద్వారమున నింకను ఇట్టి దివ్య రచనలు వెలువడుగాక.

అనంతగిరి నాథావేశిత దివ్యాత్మరూపిణం
అంతర్యామి దర్శనాఖండ ప్రేమదీపకం
భజేఽహ మన్నమాచార్యం కీర్తనానందదేశికమ్.

శ్రీజయ
పుష్య శుద్ధ షష్ఠి
శనివారము

వ్యాఖ్యాత
మల్లాది పున్నయ్య

విషయసూచిక



1వ సం-23

అదివో అల్లదివో

మధ్యమావతి

అదివో అల్లదివో హరివాసము
పదివేల శేషుల పడగలమయము. ॥ పల్లవి ॥

అదె వేంకటాచల మఖిలోన్నతము
అదివో బ్రహ్మాదుల కపురూపము
అదివో నిత్యనివాస మఖిల మునులకు
అదె చూడు డదె మ్రొక్కు డానందమయము. ॥ అదివో ॥

చెంగట నల్లదివో శేషాచలము
నింగినున్న దేవతల నిజవాసము
ముంగిట నల్లదివో మూలనున్న ధనము
బంగారు శిఖరాల బహుబ్రహ్మమయము. ॥ అదివో ॥

కైవల్యపదము వేంకటనగ మదివో
శ్రీవేంకటపతికి సిరులైనది
భావింప సకల సంపదరూప మదివో
పావనములకెల్ల పావనమయము. ॥ అదివో ॥

సర్వాంతర్యామిని ప్రేమించి సేవించుట అత్యున్నత జ్ఞానము.

టీక

అపురూవము = వింతయైనది, చెంగటన్ = దగ్గరగా.

పరిచయము

అన్నమయ్య కౌమార ప్రాయమున తిరుమల నెక్కుచుండగా ఏడుకొండల పైన వెలసిన శ్రీవేంకటేశ్వరుని దర్శింపబోవుచున్నాననను ఉత్సాహముతోబాటు, ఆ కొండపై శ్రీహరి వెలయుట వలన దానిని గూర్చియు ఆనందోత్సాహములు అతనిలో మిన్ను ముట్టెను. కొండపై చుట్టునున్న ప్రదేశములు భౌతికములుగా గాక, దివ్యసుందరములుగా గానవచ్చినవి. ఈ కొండ యొక్క వాస్తవ తత్త్వము లోగన్నులకు పొడసూపినది. కలియుగ వైకుంఠముగా కానుపించినది. ఆదిశేషుడే ఈ కొండగా రూపుదాల్చిన వైభవమును, సృష్టిలోను, జీవుని జీవితములోను అన్నిటికన్న మిన్నయగు బ్రహ్మానంద స్థితియే ఈ కొండ యొక్క ఉన్నతిగను, ఈ స్థితినందిన మునులకు నివాసముగను, భగవంతునియందు భాగములైన ప్రజ్ఞలగు దేవతలు నింగినుండి దిగివచ్చి, ఇచట స్వామిని సేవించుచున్న వైనమును దర్శనమిచ్చినవి. క్రమముగా స్వామిని సమీపించు చుండగా, అన్నమయ్యలో అనుభూతి అఖండము కాసాగినది. జగత్తు మొత్తమునకు మూలమయిన వెలుగే వేంకటేశ్వర మూర్తిగా వెలసిన విధము అతనిలో వెలిగినది. ఎందరో బ్రహ్మలు స్వామి ఆలయ శిఖరములను ఆవహించిన దృశ్యము దర్శన మిచ్చినది. వేంకటాద్రి మోక్షస్థాన మనియు, పరమ పవిత్రమైనదనియు అతనికి తోచినది. దర్శనము, తోచుట ఇవి అనుభూతి నుండి బుద్ధికి తట్టుటను సూచించు పదములు. తన మేధతో, తర్కముతో నూహించు సామర్థ్యమును సూచించునవి గావు. ముందుగా అన్నమయ్యలో అనుభవము నిండినది. ఆపైన బుద్ధిలోనికి అనుభూతియే తానగు స్వామి నుండి ఈ మనోజ్ఞ భావములు, అపురూపమగు పదముల పొందిక వెల్లివిరిసి దిగివచ్చినవి. అన్నమయ్యకు కలిగిన అనుభూతి నందుకొన్న వానికి ఈ సంకీర్తనము పూర్ణమయిన ఆనందము నొసంగును. సాధకులు తిరుపతి కొండ నెక్కుచు సమష్టిగా ఈ సంకీర్తనమును అన్నమయ్య యొక్క భావనతో కలిపి గానము చేయుచు నెక్కినచో, స్వామి యొక్క నిజదర్శనము కలుగుటతో ధన్యులగుదురు. అన్నమయ్య చరణారవిందములను స్మరించి మ్రొక్కి, కొండ నెక్కుట ప్రారంభింపవలయును. గరుడుని వంటి భాగవతోత్తముడగు ఇతనికి మ్రొక్కినచో, ఇతని సిఫార్సుతో స్వామి దర్శనము అంతరంగమున వెన్నెల పండించును.

పూర్వజన్మమున స్వామి సన్నిధిలో తరించినవాడగుట చేతనే అన్నమయ్యకు ఈ కొండ నెక్కుచున్నప్పుడు కొలువరాని ఇంతటి అనుభూతి కలిగినది. తన తల్లిదండ్రులను, వారి నివాసమును చూడబోవుచున్న కుమారునికి కలుగు ఆనందోత్సాహముల కన్న వేల రెట్లు అన్నమయ్యకు కలిగెను.

ఈ తిరుపతి కొండ నెక్కుచుండగా మూడు విధములుగ అన్నమయ్యకు ఈ కొండయొక్క వైభవము దర్శనమైనదని ఈ సంకీర్తనము సూచించుచున్నది. 1. భౌతికమైన ఈ కొండ యొక్క మనోహర సౌందర్యము. 2. మూలాధారమున నున్న ప్రజ్ఞ క్రమముగ సహస్రారమును చేరుచు ఏడు స్థాయిలలో ఆనందానుభూతి

కలిగినది. మూలాధారమనగా భౌతిక జగత్తు. సహస్రారమనగా పరమాత్మకు, ఆయనకు సంబంధించిన అఖండానందమునకు నిలయము. ఈ ఆనందము అన్నిటికన్న మిన్న. అన్నమయ్య ప్రజ్ఞ శరీరమును, ఇంద్రియములను, ప్రాణమును, మనస్సును, బుద్ధిని, అహంకారమును దాటి అంతరాత్మ యగు శ్రీహరిని చేరినది. దీనినే క్షీరసాగరము నందలి వైకుంఠ స్థితి యందురు. ఇతనికి తన దేహ వ్యూహమే తిరుపతియై అంతరాత్మగా స్వామి దర్శనమిచ్చెను. ఇట్టి దర్శనమే ఈ సంకీర్తనగా వెలువడినది. 3. ఇవిగాక ఆకాశమున క్షీరసాగరమను ఒక తారకా వ్యూహము కలదు. ఇందు ఆదిశేషుడు, గరుడుడు, విష్వక్సేనుడు, సనకాదులు, బ్రహ్మ, నారదాది భాగవతోత్తములు తారకా స్వరూపులై నిలిచియున్నారు. వీరెల్లరు ఒక తారకను ఆశ్రయించి ఉందురు. అదియే 'శ్రవణ' యను తారక. ఇది విష్ణుని దేహమని వేదము నందలి జ్యోతిశ్శాస్త్రమున చెప్పబడినది. ఇది సంపూర్ణ నారాయణమయమైన ప్రజ్ఞతో వెలుగొందుచుండును. అనగా ఇందు వసించువాని దేహము నారాయణ మయమైన ఆనందానుభూతియే గాని, వేరుగా నుండదు. కలియుగ మానవులను సులభముగా తరింపజేయుటకై నారాయణుడు సంకల్పించి, ఆకాశమున శ్వాసరూపుడై యున్న గరుత్మంతుని కొక ఆదేశమిచ్చెను. దాని ననుసరించి ఆతడు భూమియందలి కొన్ని పరమాణువులను పరిపూర్ణ నారాయణమయమైన అనుభూతితో నింపి తిరుపతి కొండగా కొనివచ్చెను. ఈ కొండలోని ప్రతి అణువునందు గరుడుడు చైతన్య తేజమును మేల్కొల్పెను. ఇందు విష్ణు సాన్నిధ్యమును కల్పించెను. కావున ఈ కొండ యందలి అణువులు భౌతికముగా కన్పడినను, నారాయణ సాన్నిధ్యముతో శోభిల్లుచుండును. అణువణువు మనకు విష్ణు దర్శనానందమును కలిగించును. ఇట్లు తిరుపతి కొండ చోటులోని విష్ణుతారకకు భూమిపై ప్రతీక యని అన్నమయ్యకు దర్శనమిచ్చెను. కొండపైనే గాక, ఇచటి ప్రతి అణువున అన్నమయ్య వంటి భక్తునకు స్వామి దర్శన మొసంగుటలో వింత లేదు. ఆకాశమున ధ్రువతార యున్నది. దానిపైన కొన్ని శక్తులు సుడిగుండముగా పనిచేయుచున్నవి. ఆ తావు విష్ణుతారక యొక్క అంచు. దీనినే విష్ణు పాదపు బొటనవ్రేలు అందురు. దీనినుండి ఒక శక్తి వెలుగుధారగా చైతన్యమయమై ప్రవహించుచున్నది. దీనికే ఆకాశగంగ యని పేరు. ఇందేర్పడు ఆకారములే తారకలు, సప్తర్షులు, సూర్యాది గ్రహములు. ఈ చోటులోని ఆకాశగంగ యను వెలుగుధారయే తిరుమలపై 'ఆకాశగంగ' అను భౌతికమగు ఏరుగా రూపు గట్టుకొన్నది. ఇక శేషుడు ఒక తారకగా నున్నాడు. బ్రహ్మాండముల పరిభ్రమణమునకు, జీవుల దేహముల స్థితులకును ఆధారమైన శక్తిగా నున్నాడు. ఈ శేషుడే శేషాద్రిగా రూపొందిన విధము కూడ అన్నమయ్యకు దర్శనమిచ్చెను. అంతట విష్ణువున్నాడు. అయినను తిరుపతి యందు మనము స్వామి సాన్నిధ్యమును వేగముగను, అధికము గను పొందగలుగుట అనుభవసత్యము. ఈ కొండను, కొండపైని స్వామి మూర్తిని దర్శించిన పిమ్మట, అన్నమయ్యకు స్వామి అంతట, అందరిలో సాక్షాత్కరించెను. ఈ యంశమును సూచించు సంకీర్తనములు అనేకములు. ఈ సంకీర్తనము, దీనికి ఒక ప్రాతిపదిక. ఈ సంకీర్తనము కొండ నెక్కుచు సమకాలికముగా, గానము గావించినదే గాని, తర్వాత రచించినది కాదు. తిరుపతి కొండయు స్వామి యొక్క లీలావైభవ రూపమే. ముందుగా ఆ కొండను కీర్తించుచు అన్నమయ్య తనియుచున్నాడు. కొండ జడము కాదు. చైతన్యముతో విలసిల్లుచున్నది.

పల్లవి యొక్క తాత్పర్యము

అదివో, అల్లదివో ఆ శ్రీహరి వసించు ప్రదేశము. ఇది శేషుని యొక్క పదివేల పడగలతో నిండినది.

వ్యాఖ్య

అన్నమయ్య తిరుపతి కొండ నెక్కుచున్న కొలదియు అతనిలో ఉత్సాహము ఉరకలు వేసినది. స్వామికి చేరువగుచున్నాను, స్వామిని చూడబోవుచున్నానను ఆనందము ఆరంభమాయెను. క్రింద నుండి పైకి చేరుటలో ఈ యనుభూతి క్రమముగా చిక్క బడుట జరిగినది.

మన తల్లిదండ్రులను, ఇష్టులను చూడబోవుచున్నప్పుడే ప్రయాణ ప్రారంభము నుండి ఉత్సాహము పెరుగుచుండును కదా. ఇక సకల జగత్పితయు, తన హృదయేశ్వరుడగు స్వామిని చూడబోవునప్పుడు అన్నమయ్య కెట్లుండునో మనము గూడ అన్నమయ్య అయితే గాని అన్పించదు. అపుడు తెలియుట ఉండదు. ఆనందము ననుభవించుటే గాని తెలివితో ఊహించుట సాధ్యము కాదు. ఆదివో! అనుటే కాక అల్లదివో యనియు అన్నమయ్య ఎలుగెత్తి గానము చేసెను. స్వామికి ఇంకను చేరువ అగుచుండగను, కొండను ఎక్కుట కొంతమేర దాటిన పిదపను ఉత్సాహము పెరిగి 'అల్లదివో' అని పాడెను. ఆనందము అధికమయ్యెను. సృష్టికి మూలమైన నారాయణుడే అంతర్యామిగా దిగివచ్చునపుడు 'హరి' యనబడును. ఈయన శోభయే 'శ్రీ'. 'శ్రీతో కూడిన హరి', 'శ్రీహరి' యనబడును. కావున 'శ్రీహరి' యనగా ప్రకృతి కూడిన పరమపురుషుడు. ప్రకృతి యగు 'శ్రీ' తో కూడుట వలననే 'శ్రీవేంకటేశ్వరుడు' గా పరిపూర్ణ సాలగ్రామ శిలామూర్తియై వెలసియున్నాడు. విశ్వమునందు అంతర్యామి యగు స్వామియే ఆకాశమున ప్రత్యేకముగ ఒకచోట తారకా దేహరూపుడై యుండి, తన హృదయములోను ఉన్నవాడై, వెలుపల కొండపై శ్రీవేంకటేశ్వర లలితమూర్తిగా వసించుచున్నాడని అన్నమయ్యకు అనిపించి అతడు పులకించి 'అదివో శ్రీహరివాసమ'ని గొంతెత్తి కీర్తించెను. శేషుడు భూమికి పరిభ్రమణమును కల్పించి దాని భారమును వహించుచున్నాడు. ఇతడే మన దేహములందు మూలాధారమునకు దిగువ శక్తిగా నుండి, దేహమందలి ఘనపదార్థముల పొందికను చెదరిపోకుండ పట్టియుంచు చున్నాడు. అతడు కుండలినీశక్తిగా వర్ణింపబడుచున్నాడు. అనంత కాలస్వరూపుడగు శేషుని యొక్క దేహము శక్తిమయము. ఇది భౌతికము కాదు. ఇది భూగర్భము నుండి చుట్టలు చుట్టుకొని వ్యాపించుచున్నది. భూమి తనచుట్టు తాను తిరుగుచు, సూర్యుని చుట్టును తిరుగుచున్నది. ఈ భ్రమణమునకు ఆధారమైన శక్తియే శేషుడు. భూమి సూర్యుని చుట్టు చేయుచున్న పరిభ్రమణములే శేషుని చుట్టలు. ఇవి అంతకంతకు వ్యాపించుచు, భూగోళమును దాటి, ఆకాశగోళ మంతయును వ్యాపించియున్నవి. అతని పడగలపై భూమి ఆవగింజ వలె నిలబడియున్నది. పడగల యందు లోకము లమరియున్నవి. తోక యనగా అణువు యొక్క స్థితి. పడగలనగా బ్రహ్మాండ వ్యాప్తి. అతని పడగల పైన గల విశ్వమునందు వేలవేల సౌరకుటుంబములు గలవు. ఒక్కొక్క సౌరకుటుంబమున ఒక్కొక్క భూమి యుండును. ఇట్లు శేషుని పడగలపై ఎన్నో వేల భూగోళములుండును. అన్నమయ్య అనంతుడైన శేషుని గౌరవించుచు 'శేషుని యొక్క' అను అర్థములో 'శేషుల' అను బహువచన

ప్రయోగమును గావించెను. ఇప్పుడు 'పదివేల' ను సంఖ్య పడగలకు సంబంధించినది. 'ఎన్నో వేలు' అని చెప్పుటకు గాను అన్నమయ్య 'పది వేలు' అని ప్రయోగించెను. ఇట్లు శేషుని యొక్క 'పది వేల పడగల'నగా అతని శక్తిమయ దేహముపైని ఎన్నో వేల సౌర కుటుంబములు, అందలి భూగోళములు. నారాయణుడు వేంకటేశ్వరుడుగా రాగా, ఈ అనంతశక్తి యగు శేషుడే తాను ఆయనకు శయ్య గావున తిరుపతి కొండగా వెలసెను. కావుననే దీనికి 'శేషాద్రి' యని పేరు వచ్చినది. శేషుని అనంతశక్తి ఈ కొండయందు నిక్షిప్తమై యున్నది. ఈ శేషాద్రి అనంత బ్రహ్మాండములకు భౌతికమైన నమూనా. కావుననే అన్నమయ్య శ్రీహరివాసమైన ఏడవ కొండను శేషుని పదివేల పడగలమయ మనెను. కావున ఈ కొండపై ప్రయాణించునపుడు అనంత విశ్వము హృదయములో ముద్రిత మగును. విశ్వశక్తి మనలో ప్రవేశించును. మనలను సత్కర్మల వైపు ప్రేరేపించును. జీవుని దేహమునందు వెన్నెముకపై ఆరు చక్రములు, సహస్రారము గలవు. ఇవి కంటికి కనపడునవి కావు. తేజోమయములు, శక్తిమయములు. మూలాధారమందలి శక్తి పామువలె చుట్టలు విప్పుకొని, సహస్రారము వరకు సాధకునిలో వెలయును. కావున వీనికి సంకేతములుగ ఏడుకొండలు తిరుమలగా వెలసినవి. అన్నమయ్యకు ఇట్లు స్వామి దర్శనమునకు ముందుగా, శేషాద్రియే శేషునిగాను, తనలోని వెన్నెముక యందలి సర్పము వంటి శక్తిగాను దర్శనమొసగెను.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"అదియే వేంకటగిరి. ఇది అన్నిటికన్న ఎత్తైనది. అదియే బ్రహ్మ మున్నగు వారికిని ఆశ్చర్యకరమైనది. అదియే ఎల్లరు మునులు ఎల్లప్పుడు నివసించు స్థానము. అదిగో చూడుడు. అదిగో మ్రొక్కుడు. ఈ గిరి ఆనందముతో నిండినది."

వ్యాఖ్య

అన్నమయ్య తిరుమల నెక్కుచు ఆ కొండ యొక్క వైభవము, మహిమ తన నాకర్షింపగా దివ్యభావోన్మత్తత కలిగి దానిని వాని హృదయమార కీర్తించు చున్నాడు. వేంకటాచలము అన్నిటికన్న ఎత్తైనది. వేంకటాచల మనగా పాపములను ఖండించు కొండ. అచల మనగా కదలిక లేక స్థిరమైన కొండ మరియు పాపములను ఖండించుటలో ఇది స్థిరమైనదనియు అర్థము. దీనిపై ఎక్కుటచే, దీనిని తాకుటచే, దీనిని స్మరించుటచేత గూడ పాపవాసనలు తొలగిపోవును. ఈ కొండ అన్ని కొండలలో ఎత్తైనది అని మాత్రమే ఇచట అర్థము చెప్పరాదు. అన్నిటిలో శ్రేష్ఠమైనదని భావము. స్వామి స్వయముగా వెలయుటచేత ఇది శ్రేష్ఠమయినది. మరల ఏల శ్రేష్ఠమో క్రింద అన్నమయ్య వివరించుచున్నాడు. అంతియేగాక ఉన్నతము అనగా ఉత్+నతము అని అర్థము. 'ఉత్' అనగా అందరిలో శ్రేష్ఠుడగు పరమాత్మ యని యర్థము. పరమాత్మ తనపై నిలువగా, ఆ స్వామియెడల నతము అనగా వంగియున్న కొండ ఇది. వంగుట అనగా వినయముతో వర్తించుట. శేషుడే ఈ కొండ యొక్క రూపము దాల్చి స్వామికి సేవ చేయుచు వినయము నెరపుచున్నాడు. శేషుడు స్వామికి శయ్యగా నగు సేవలో తృప్తిచెందక, భూమిపై కొండగా రూపొంది సేవించుచున్నాడు. ఈ కొండ బ్రహ్మాది దేవతలకును ఆశ్చర్యమును కల్గించు వైభవము గలది. బ్రహ్మ సృష్టి కర్త. ఇంద్రుడు మెరపులతోడి

మబ్బులకును, ఇంద్రియములతోడి మనస్సునకును అధిదేవత. ఒక్కొక్క దిక్కుకు ఒక్కొక్క అధిదేవత యున్నాడు. వీరెల్లరు ప్రకృతి ధర్మములు. వీరెల్లరును అన్ని దిక్కుల వ్యాపించినవాడును, విశ్వరూపుడును అగు స్వామిలో భాగములై యున్నారు. స్వామి మొత్తము. వీరు భాగములు. స్వామి సాగరము. వీరు అలలు. స్వామి అఖండమయిన 'నేను'. వీరు జీవులలోను, సృష్టిలోను అంతర్యామిగ నున్న స్వామినే సేవించుచున్నారు. జీవుల మనస్సుకు, బుద్ధికి, ప్రాణమునకు, ఇంద్రియములకు, ఆకలి దప్పికలకు అధిపతులై వీరు జీవుల రూపమున నున్న అంతర్యామి యగు స్వామిని సేవించుచున్నారు. సృష్టిలో అనేక కక్ష్యలు గలవు. మనలోను గలవు. అన్నిటికన్న ఆనందము శ్రేష్ఠమయిన కక్ష్య. దానితో మిగిలినవి చేయబడినవి. ఆనందసాగరుడగు స్వామిని గూర్చి బ్రహ్మాది దేవతలు గ్రహింపలేరు. స్వామి స్థితిని పూర్తిగా భావింపలేరు. భాగములు, మొత్తము నెట్లు ఊహింపగలవు? స్వామి యొక్క నిలయమగు వేంకటాచలము భక్తులకు స్వామి సాన్నిధ్యమను ఆనందము నొసగునట్టిది. దీని ప్రభావము బ్రహ్మాది దేవతలకు వింతగొలుపునది. మరియు భగవదానందస్థితియే – చోటులో గల పరిపూర్ణ నారాయణమయ దివ్యతేజస్సే ఇచట వేంకటాచలమను ఒక భౌతికరూపము దాల్చుట వీనికి వింతగొలుపుచున్నది. కొందరు మునులు ఈ కొండపై తపస్సు చేసి స్వామిని ధ్యానించి, సేవించి, తరించిరి. కొందరు ఇప్పటికిని పక్షులు, చెట్ల రూపమున, రాళ్ల రూపమున, కొలనులు మున్నగు రూపములలో ఇచట నిత్యము నివసించుచున్నారు. లోకకల్యాణమునకై, విశ్వశాంతికై, భగవంతుని గూర్చి తపస్సు చేయుచున్నారు. మానవులు భగవంతుని సన్నిధిని పొందవలెనని దయతో మంచి భావములను తరంగములుగా చోటులోనికి ఇచటనుండి పంపుచున్నారు. మరికొందరు మునులు భౌతికముగ ఎచటనున్నను వేంకటాచలమును నిత్యము ధ్యానమున స్మరించుచు, తమ ప్రజ్ఞలను ఇచటనే వసింపజేయుచున్నారు. ఇట్టి మహిమ గల వేంకటాచలమును అదిగో చూడుడు, అదిగో దానికి వినయముతో, భక్తితో మ్రొక్కుడని అన్నమయ్య మానవుల నుద్దేశించి దయతో పిలుపు నిచ్చుచున్నాడు. ఈ కొండ ఆనందస్వరూపుడగు స్వామికి స్థానమగుటచే ఇదియు ఆనందముతో నిండినదే. ఈ ఆనందమెట్టిది? కోరికలు నెరవేరినపుడు, పరిస్థితులు తన అభిప్రాయముతో అనుకూలించునపుడు కలుగునది కాదు. అట్టిది సుఖము కాదు. సుఖభ్రాంతి. మరి దివ్యానందమునకు కారణముండదు. మానవుని సహజ లక్షణమిది. ఐహిక సుఖభ్రాంతి పరిమితము. దివ్యానందము అపరిమితము. పసి శిశువు స్థితి ఇది. తిరుమలలోని ప్రతి యణువున దేవుని సాన్నిధ్యము మిక్కుటముగా వెలుగుచున్నది. విద్యుత్తు అన్ని బల్బులలోను ఉన్నను, కొన్నిటిలో వేల కిలోవాట్లతో వెలుగును విరజిమ్మును గదా. తిరుమలలోని ప్రతి యణువును భక్తితో తాకినను పారవశ్యము, దివ్యానందము సిద్ధించును. ఇది అన్నమయ్య అనుభూతి.

2వ చరణము యొక్క తాత్పర్యము

"అదిగో శేషాద్రి దగ్గరగా నున్నది, గమనింపుడు. ఆకాశమున గల దేవతల సహజమయిన నివాసమిది. మన ముందు అదిగో మూలనున్న ధనమైన స్వామి యున్నాడు. ఈ కొండ యొక్క శిఖరములు బంగారముతో చేయబడినవి. ఇది ఎందరో బ్రహ్మలతో నిండినది."

వ్యాఖ్య

శేషాద్రి నెక్కుచు, దగ్గరగా నున్నదని అననేల? కొండ నెక్కుచున్న తన చుట్టును కొండ యున్నది. అందు దివ్యప్రదేశములున్నవి. మరియు తన హృదయమునకు దగ్గరగా నెలకొనియున్నదని అన్నమయ్య భావము. తన బయటనే గాక, తనలోను వెన్నెముక వెంబడి గల బ్రహ్మరంధ్రము లేక సుషుమ్న అను తేజోమయ ప్రదేశమే శేషాచలముగా తనకు దర్శనమిచ్చుచున్నది. ఇదియే దగ్గరగా నుండుట. ఎల్లరిలోను ఇది యున్నది. కాని ఎల్లరు దీనిని హృదయముతో దర్శింపరు. అన్నమయ్య దర్శించెను. సాక్షాత్తుగా శేషుడే ఈ కొండగా మరియొకమారు అన్నమయ్యకు బుద్ధిలో నిలిచి, దివ్యోత్సాహమును కల్గించుచు స్వామి సన్నిధికి చేర్చుచున్నాడు. మరియు అన్నమయ్యకు తన హృదయమే స్వామికి శయ్య యగు శేషుని వలె భాసించుచున్నది. ఇదియే దగ్గరితనము. 'చెంగటన్' అను మాటలో ఇంతటి భావానుభూతి యున్నది. ఇది పాండిత్యమునకు సంబంధించిన అర్థము కాదు. స్వీయ దివ్యానుభూతితోడి అర్థము. మనమును అన్నమయ్యకు, స్వామికి శరణందినచో ఇట్టి అనుభూతి కలుగుటలో వింత లేదు. చోటు దేవుని శరీరము. అందు దేవతలు స్వామికి అంగభూతులై (భాగములై) పనిచేయుచున్నారు. చోటులోని వెలుగే ఆకాశము. ఇందు స్పందన యున్నది. ఇదియే వాయువు. విద్యుత్తు, వేడిమి మున్నగు వానితోడి శక్తి యున్నది. ఇదియే అగ్ని. సూర్యచంద్రాదులున్నారు. మబ్బులున్నవి. మెఱపులున్నవి. తారక లున్నవి. నీటికి ప్రవాహము, దప్పిక కూర్చు ధర్మములున్నవి. పృథివికి మన కాధారముగా నిలుచు సామర్థ్యమున్నది. నదీ సాగర పర్వతాదులున్నవి. ఇట్లు ఈ యన్నిటికి అధిప్రజ్ఞలై, ప్రకృతి ధర్మములను నడిపించు దేవతలు చోటులో పనిచేయు చున్నారు. వీరెల్లరును తిరుమలలో గూడ సహజముగా వసించుచున్నారు. బయట నదులున్నవి. మనలో నాడులుగ నున్నవి. అట్లే దేవతలు బయట ఉన్నారు. మనలో ఉన్నారు. వీరికి శరీరము లేదు. ప్రజ్ఞామయులు గావున తిరుమలలో గూడ వసించు చున్నారు. వీరికిష్టమయిన నివాసస్థాన మిది. చోటులోని అంతర్యామి యగు విష్ణువే వేంకటేశ్వరుడుగా దిగిరాగా, అందలి దేవతలు ఆయనను కొలుచుటకై తిరుమలకు వేంచేసిరి. మనము భక్తితో కొండ నెక్కుచుండగా, ఈ దేవతల సాన్నిధ్యము గూడ మన హృదయములోన భాసించుట సహజము. ఒక మానవుడొక వాహనము నెక్కగనే అతని శరీర భాగములు గూడ ఎక్కినట్లే గదా. కొండపైన మనకు తెలియ కుండగనే మనలో దివ్యభావములు, పవిత్ర సంస్కారములు మొలకెత్తుటకు కారణము మునుల యొక్క, దేవతల యొక్క ఆశీస్సులే. మనలోను ఈ దేవతలు పనిచేయుచున్నట్లు క్రమముగా అనుభవమునకు వచ్చును. ఇదంతయు అన్నమయ్య అనుభూతియే గాని, సాధారణ కవులు చేయు కొండ యొక్క వట్టి సాహిత్య సంబంధ వర్ణనము గాదు. అన్నమయ్యకు మునులు, దేవతలు సాక్షాత్కరించిరి. ఆపై ఇక అతనిలో స్వామిని గూర్చిన మహోత్తమ దివ్యభావ మొకటి ఉప్పొంగి అతని గుండెను ఆనందవర్షములో తడిపినది. ఆ భావపు టుయ్యాలలో అతడూగెను. ఆ భావానుభూతి ఎంతటిదో మనమేమి చెప్పగలము? ముంగలిచోట మూలన ధన మున్నది. మూలన అనగా ఏడవ కొండపైన ఒక మూలన అన్నిటికన్న శ్రేష్ఠమైన ధనమున్నది. ధన మనగా ధేనువుల సంపద యని వాస్తవమయిన అర్థము. వేదకాలమున

ధేనువులే ధనముగా వ్యవహరింపబడుట జరిగినది. మనము వాక్కును ఉచ్చారణ చేయుట వలన కదలు శక్తులను గూడ ధేనువులే యని వేదములందు పేర్కొనిరి. ఇవి మనము మాట్లాడు పదముల భావములు. వీనిలో సారమేది? బ్రహ్మానంద రసానుభూతి. ఇదియే అసలయిన ధనము. ఇట్టి ధనము తన సంకీర్తనలోని పదముల సారమై యున్నదని అన్నమయ్య భావము. ఈ రసానుభూతి అఖండమైనది. స్వామి స్వరూప మిదియే. స్వామి ఆకారము ధరించియున్నను ఆ యాకారము అఖండ బ్రహ్మానంద రసానుభూతి యొక్క మూర్తియే గాని, మన శరీరము వంటిది గాదు. కావుననే వేంకటేశ్వరస్వామిని దర్శించినను, స్మరించినను, కీర్తించినను, సేవించినను, హృదయమున ధ్యానించినను, అంతర్యామిగా భావించినను అపరిమితానందము కలుగును. ఇది అన్నమయ్య స్వీయానుభవము. ఆనందము గాక ధనమేమున్నది? ఐహికమైన డబ్బు ఉన్నను, ఆనందము లేకున్న వ్యర్థమే కదా. అంతేకాక 'మూలన' అనునది తెనుగు పదముగనే గాక, సంస్కృత పదమును గూడ తెనుగులోనికి మార్చి అన్నమయ్య ప్రయోగించెను. ఇట్టి తనదైన క్రొత్త రీతిలో భాషాప్రయోగముల నాతడు చేపట్టెను. 'మూలన' అనగా 'మూలమైయున్న' అనియు సంస్కృత పదముగా అన్నమయ్య వాడెను. సర్వ సృష్టికి మూలమైన పరమాత్మ కట్టెదుట నిలిచియున్నాడని అన్నమయ్య ఉబ్బితలూగుచున్నాడు. స్వామిని చేరక మునుపే ఈ యుత్సాహ మతనికి కలిగినది. "సృష్టి యను వృక్షమునకు తాను విత్తనము" నని శ్రీకృష్ణుడు గీతలో చెప్పెను. సృష్టిని మఱ్ఱిచెట్టుతో బోల్చి దానికి మూలముగా (వేరుగా) భగవంతు డున్నాడని ఆదిశంకరులును అభివర్ణించిరి. వేరు లేక విత్తనమే గదా వృక్షముగా విస్తరించునది. కావున వేప విత్తు నుండి వేపచెట్టే వచ్చును. విత్తులోనే చెట్టు ప్రజ్ఞా స్థాయిలో నుండును. ఆపై చెట్టుగా భౌతిక స్థాయిలో విస్తరించును. కుమ్మరివాని మనస్సులో దాగిన కుండయే, ఆపై భౌతికమయిన కుండగా వచ్చుచున్నది గదా. ఇల్లు కట్టు నిపుణుని మనసులో దాని ప్రణాళిక ఉండి, ఆపై నిర్మాణమగును గదా. ఇట్లు 'మూలనున్న' అను ప్రయోగమున స్వామియే సృష్టికి విత్తనమనియు, సృష్టి అను చెట్టుగా తానే విస్తరించెననియు, కావున సృష్టిని దేవుని స్వరూపముగా సేవింప వలెననియు అన్నమయ్య భావించెను. వేంకటాచలము బంగారు శిఖరములతో విరాజిల్లుచున్నది. ఆనందనిలయమను ప్రధాన దేవాలయము, దాని శిఖరము బంగారు తాపడము పొందియున్నవి. కాని ఆ యర్థమున అన్నమయ్య 'బంగారు శిఖరాలు' అని ప్రయోగింపలేదు. అతని దృష్టి స్వామిపైననే గాని బంగారముపై నుండదు. బంగారము కావలెనని స్వామి కోరలేదు. మానవుడే దానిని స్వామికి సమర్పించెను. అదియు స్వామి కృపయే. సూర్యోదయ కాంతులు బంగారురంగులో మెరయుచుండును. ఉపనిషత్తులలో సూర్యబింబమును బంగారు పాత్రతో ఋషులు పోల్చిరి. అన్నమయ్య సూర్యోదయ కాంతుల సమూహమును బంగారు శిఖర మను చున్నాడు. ఒక్కొక్క సౌరకుటుంబమునకు ఇట్టి శిఖర మొకటి గలదు. తారకలన్నియు సూర్యులే గదా. అసంఖ్యాకములగు సూర్యోదయ కాంతులతో వేంకటాచలము మెఱయుచున్నది. కారణము ఇందరు సూర్యుల ఉదయకాంతుల కాధారము వీరెల్లరి లోపల వర్తించుచున్న నారాయణుడే. అతడే వేంకటేశ్వరుడుగా వెలసిన కొండ ఇది గనుక ఈ కాంతులన్నిటి ప్రభావము ఈ కొండయందు నిండియున్నదని అన్నమయ్య భావము. అన్నమయ్య 'మయము' అను పదమును వాడెను. ఇది బంగారు శిఖరాల కును, బహుబ్రహ్మలకును వర్తించును.

వేంకటాచలము మనలోని మూలాధారము నుండి సహస్రారము వరకు వ్యాపించిన వెలుగుకు గుర్తు. సహస్రారమునే మేరువనియు, మూలాధారమునే మందరమనియు భాగవతమున పేర్కొనుట జరిగినది. మేరువును ఒక బంగారుకొండగా ఋషులు పోల్చిరి. కావున ఈ భూమిపైన వేంకటాచలము యొక్క శిఖరము ఎందరో జీవుల సహస్రారముల గుంపుకు గుర్తు కావున బంగారు శిఖరాల మయమని అన్నమయ్య వర్ణించెను. ఈ కొండ చివరకు భక్తితో ఎక్కినవాని ప్రజ్ఞ సహస్రారమును జేరి ఆనందమున మునుగును. వానికి బంగారము వంటి బ్రహ్మతేజము కలుగును. ఒక్కొక్క బ్రహ్మాండ గోళమును ఒక్కొక్క బ్రహ్మ సృష్టించెను. కావున ఎందరో బ్రహ్మలు గలరు. వీరెల్లరికి తండ్రి నారాయణుడే. ఈ కథ మహా భారతమున అశ్వమేథ పర్వమున గలదు. ఎందరో బ్రహ్మలు నారాయణుని నుండి ప్రేరణను, ఆజ్ఞను, జ్ఞానమును గైకొని బ్రహ్మాండముల సృష్టి గావించిరి. ఈ ప్రక్రియను నారాయణ సేవగా భావించిరని భాగవతము ద్వితీయ స్కంధమున గలదు. ఇందరు బ్రహ్మలును నేలపై వెలసిన తమ తండ్రియగు స్వామిని ధ్యానమార్గమున సేవించు చుందురు. కావున వేంకటాచలము బహుబ్రహ్మలతో గూడియున్నది.

3వ చరణము యొక్క తాత్పర్యము

"అదియే వేంకటగిరి, కైవల్యమునకు స్థానము. శ్రీవేంకటేశ్వరస్వామికి ఆహ్లాదమును గూర్చునది. భావించినచో ఇది సకల సంపదల రూపమని తెలియవచ్చును. ఇది పవిత్రమయిన వానిలోకెల్ల పరమ పవిత్రతతో గూడినది."

వ్యాఖ్య

గమనము లేక స్థిరముగా నిలిచియుండుటచే వేంకటనగమని ఈ కొండ పేర్కొనబడినది. కొండ గావున నిశ్చలము. అంతియేగాక దీనిని దర్శించి, స్మరించు వారి బుద్ధియు నిశ్చలమగునట్లు ఈ కొండ యొక్క ప్రభావము పనిచేయును. కైవల్య మనగా కేవలత్వము. తాను ఒక్కటే అయిన స్థితి. జీవుని ప్రజ్ఞ అనునది, అంతర్యామి యగు స్వామి ప్రజ్ఞ అను సాగరమున లీనమైనపుడు ఆ సాగరమే యుండును. అదియే కైవల్యస్థితి. జీవుని మనస్సు యొక్క స్థానమున దేవుడే నిలుచును. దేవుడే ఇతని ద్వారమున బ్రతుకు సాగించును. జీవుడు ఆనందసాగరమున మునిగి తన యునికిని కోల్పోవును. భక్తుడు, భగవంతుడు అని వేరుగా నుండరు. భగవంతు డొక్కడే యుండును. ఇట్టి కైవల్యమునకు స్థానము వేంకటనగము. అనగా ఈ కొండపై శ్రద్ధతో నెక్కువారికి, దీనిని స్మరించువారికి ఈ కైవల్యస్థితి ప్రసాదింపబడునని యర్థము. ఈ కొండపై సమర్పణ బుద్ధితో కాలు పెట్టగనే ఈ యానందప్రవాహము భక్తుని ముంచెత్తసాగును. స్వామికి ఈ కొండ సిరులైనది. సిరి అనగా శ్రీ లేక శోభ లేక ఆహ్లాదము. ఇచట స్వామికి ఇది ఆహ్లాదమును గూర్చునది యని యర్థము. స్వామికిది సంతోషమును గూర్చును గావున ఇందు అతడు వెలసియున్నాడు. మరియు ఈ కొండ నెక్కు భక్తులకు ఆహ్లాదము కలుగుచుండును. వారి రూపములలో నున్నది వేంకటేశ్వరుడే గావున ఆయనకు ఈ కొండ ఆహ్లాదకరమే. ఇది సకల సంపదల రూపము. సంపద యనగా నేమి?

డబ్బు, సొమ్ము గాదు. స్వామియే అంతట, అందరిలో నున్నాడను భావనయే సంపద. ఇది భావించిన వారికే కల్గుచుండును. స్వామి అంతర్యామి అయినను భావింపని వారికట్లు అన్పించదు గదా. భక్తితో ఈ కొండను తాకి, తలచి, ఎక్కిన వారికి స్వామి అంతర్యామి యను భావన అనగా అనుభవము తప్పక కలుగును. ఇదంతయు అన్నమయ్య స్వీయానుభూతి. సకల సంపద లనగా కళలతో గూడిన సంపదలనియు అర్థము. స్వామి యొక్క పదునారు కళల ప్రకాశమే సంపదయే ఈ కొండగా రూపుదాల్చినది. స్వామి యొక్క కల్యాణ గుణములును సంపదయే. ఇవి ఈ కొండలో ప్రభావము చూపుచుండుట చేతనే ఇది పావనమయ మయినది. పవిత్ర గుణములగు ప్రేమ, దయ, ఓర్పు, త్యాగము, ధీరత, నిర్భీతి, ధర్మాచరణము మున్నగునవి మానవునిలో సహజముగా నున్నవి. ఈ గుణములు గల సజ్జనులెందరో కొన్ని స్థానములందు వసించుట చేతను, ఈ గుణములు పూర్ణముగా గల పావనుడగు స్వామి నెలకొనుట చేతను కొన్ని ప్రదేశములు పుణ్యక్షేత్రములయినవి. తిరుమల ఇట్టి క్షేత్రములలోకెల్ల శ్రేష్ఠమయినది. స్వామి ఇచట నిలిచియున్నాడు. సకల సద్గుణముల గుంపు అతని శోభ గదా. పరమపావను డైన స్వామికి నిలయమై, ఈ కొండ పవిత్రములలో కెల్ల పవిత్రతతో నిండియున్నది. ఈ కొండపై నెక్కిన వారిలో, దీనిని స్మరించిన వారిలో, దీనిపై తపస్సు, సంకీర్తనము చేయు వారిలో స్వామి యొక్క పావనగుణము లన్నియు గుబాళించును. ఎట్టి పాపవాసనలైనను తొలగి, పరిశుద్ధులగుదురు. ఇట్లు మానవులను తరింపజేయుటకే స్వామి ఈ కొండను నెలకొలిపి, తాను దీనిపై వెలసియున్నాడు. కైవల్యమునే అనుగ్రహింపగల వేంకటాచలము ముందుగా పావన గుణముల నిచ్చుటలో వింత లేదు. అన్నమయ్య ఇట్లు పరమపావనుడై, మనలకు ఈ గిరి యొక్క మహిమను తెలుపుచున్నాడు. ఇట్టి పావనత్వము ఈ కొండకు కలుగుటకు గల కారణములను పై చరణ పాదములలో అన్నమయ్య తెలిపెను.

* * *

2

6వ సం-48 **అతిశోభితేఽయం రాధా** సింధుభైరవి

అతిశోభితేఽయం రాధా
సతత విలాసవశా రాధా. ॥ పల్లవి ॥

దర్పకబలబోధా రాధా
తర్పణగంధవిధా రాధా
దర్పయుతక్రోధా రాధా
దర్పకరసవిధా రాధా. ॥ అతి ॥

తారితావరోధా రాధా
తారుణ్యోద్బోధా రాధా
దారితానురోధా రాధా
దారితాపరాధా రాధా. ॥ అతి ॥

తరుణీమరుగాధా రాధా
ధరసమకుచబాధా రాధా
తరుణసదనుబోధా రాధా
ధరణి దుస్సాధా రాధా. ॥ అతి ॥

తనుభవ గురుగాధా రాధా
స్తనకృతగిరిరోధా రాధా
తనువర వచన సుధా రాధా
ధ్వనిజితపికమేధా రాధా. ॥ అతి ॥

తరుణసఖీసవిధా రాధా
దరశశిరుచిసౌధా రాధా
తరళితతటిద్విధా రాధా
దరహసవరోధా రాధా. ॥ అతి ॥

ధనగర్వనిషేధా రాధా
స్తవతత్పర విబుధా రాధా
ద్రవ ధునీకృతసుధా రాధా
దవమదన వ్యాధా రాధా. ॥ అతి ॥

తరుణత్వపురోధా రాధా
తరుణ స్మరయోధా రాధా
తరుపశుమణి గుణధారక బహుల వి
తరణపరా బహుధా రాధా
దైవిక సుఖోపధా రాధా. ॥ అతి ॥

ద్రావకనిజాభిధా రాధా
శ్రీవేంకటగిరి దేవకృపాము
దా వైభవనాథా రాధా. ॥ అతి ॥

జ్ఞాని ఏ ఒక్కరియందును వ్యామోహపడక, ప్రేమానంద రాజ్యములో వసించును.

టీక

ఇయం రాధా = ఈ రాధ, అతిశోభితా = మిక్కిలిగా శోభ గలది, సతత = ఎల్లప్పుడు, విలాస = విశేషమయిన ఆనందమునకు, వశా = వశమైనది, దర్పక = మన్మథుని యొక్క, బల = బలమునందు, బోధా = (కృష్ణుని) మేలుకొలుపునది, తర్పణ = ఆఘ్రాణింపదగిన, గంధ = సువాసనతో, విధా = నిండినది, దర్పయుత = రీవితో గూడిన, క్రోధా = అలుక గలిగినది, దర్పకర = రీవిని కలిగించు, సవిధా = సామీప్యము గలది, తారిత = తరింపజేయబడిన – దాటింపబడిన, అవరోధా = ఆటంకములు గలది, తారుణ్య = (తన) యౌవనమునందు, ఉత్+బోధా= ఉత్తమస్థాయిలో మెలకువ కలిగించునది, ధారిత = ధరింపబడిన, అనురోధా= అనుసరణము గలది, దారిత = చీల్చబడిన, అపరాధా = (భక్తుల) దోషములు గలది, తరుణీ = యువతి యొక్క, మరు = మన్మథ సంబంధమైన, గాధా = గాధ, ధరసమ = అన్నిటిని ధరించు భూమితో సమానమైన, కుచ = కుచముల యొక్క, బాధా = బాధ గలది, తరుణసత్= యౌవనము యొక్క ఉనికిని, అనుబోధా = అనుసరించి మేలుకొల్పునది, ధరణి = భూమిపై గల జీవు లెవ్వరికిని, దుస్సాధా = సాధించుట కష్టమైన స్థితి గలది, తనుభవ = శరీరము నుండి పుట్టిన మన్మథునకు, గురు = తండ్రి యగు కృష్ణుని యొక్క, గాధా = గాధయైనది, స్తనకృత = తన స్తనముల చేత చేయబడిన, గిరిరోధా = కొండలను ఆటంకపరచుట గలది, తనువర = వరింపదగిన (శ్రేష్ఠమయిన) దేహమును, వచనసుధా = అమృతము వంటి వాక్కులును గలది, ధ్వనిజిత = తన కంఠస్వరము చేత జయింపబడిన, పికమేధా = కోయిల యొక్క తెలివిగలది, తరుణసఖీ = యౌవనములోనున్న స్నేహితురాండ్రు, సవిధా = తనకు సమీపముగా గలది, దర = మందమైన (అనగా శుద్ధాష్టమినందున్న), శశి = చంద్రుని యొక్క, రుచి = కాంతివంటి, సౌధా = సుధ – అమృతము గలది, తరళిత = మెఱయుచున్న, తటిత్ = మెఱపువంటి, విధా = పద్ధతి గలది, దరహాస = చిరునవ్వు, నవ = క్రొత్తగా ఏర్పడినపుడెల్ల, రోధా = ఆపబడుచున్నది, ధనగర్వ = ధనము వలని గర్వమును, నిషేధా = నిషేధించినది, స్తవతత్పర= తనను స్తుతించుట యందు ఆసక్తి గల, విబుధా = విశేషమైన బుద్ధి గలవారు, దేవతలు గలది, ద్రవధునీకృత = ద్రవప్రవాహముగా చేయబడిన, సుధా= అమృతము గలది, దవ = దావాగ్ని వంటి, మదన = మన్మథుని, వ్యాధా = బాధింపగలది, తరుణత్వ = యౌవనము, పురోధా = ముందుకు పోవుట గలది, తరుణ = యౌవనములోని, స్మర = స్మరణమాత్రము చేత నెలకొను మన్మథుని యొక్క, యోధా = యుద్ధమునకు వలయు శక్తి, తరు = కల్పవృక్షము యొక్కయు, పశు = కామధేనువు యొక్కయు, మణి = చింతామణి యొక్కయు, గుణ = గుణములను, ధారక = ధరించినదై, బహుల = విస్తారముగా, బహుధా = అనేక విధములుగా, వితరణపరా = దానము చేయుట యందు ఆసక్తి గలది, దైవికసుఖ = దివ్యానందమును, ఉపధా = పరీక్షించు నది, ద్రావిక = కరగింపబడిన, నిజ = తనయొక్క, అభిధా = పేరుగలది, శ్రీవేంకటగిరి దేవ = శ్రీవేంకటాద్రీశ్వరుడగు స్వామి యొక్క, కృపా = దయకు, ముదా = ఆనందము నకు, వైభవ = వైభవమునకు (పుట్టుట కతీతమైన శాశ్వత స్థితికి), నాథా = రాణి.

పరిచయము

ఈ సంకీర్తనము తీయదనముకన్న తీయనైనది. తీయదనమే తానైన రాధాదేవిని గుండెనిండుగ అన్నమయ్య ఇందు స్తుతించెను. అతని యెద రాధను భావించుటతో అఖండ దివ్యానుభూతిలో కరగిపోయినది. ఆ యనుభూతియే దివ్యభావములుగ, మృదుమధురములగు పదముల పొందికగా దిగివచ్చినది. ఇతనికి రాధాదేవి దర్శన మొసంగినది. ఇతడు రాధాదేవితో ఐక్యమయ్యెను. రాధయే యయ్యెను. కావున ఈ సంకీర్తనము రాధాదేవి యొక్క స్వరూపమే. దీనిని శ్రద్ధాభక్తులతో పాడినవారు, వినినవారు రాధానుగ్రహపాత్రులై, నిర్మల ప్రేమతో నిండిన యెద గలవారై, శ్రీకృష్ణ దేవుని యందు కరగిపోవుచున్నారు. స్వామితో తాదాత్మ్యము పొందుచున్నారు. అన్నమయ్యకిట్టి స్థితి కల్గినది. మనకును కలుగవలెనను అతని తపన వలన, రాధయే ఈ సంకీర్తన రూపమున అవతరించినది. రాధాదేవి బృందావన సంచారిణి. ఆమె యొక్క కృప లేనిది, ఎవరును కృష్ణుని తెలియలేరు. కృష్ణుని యనుభవింపలేరు. శ్రీకృష్ణుని యొక్క హ్లాదినీ శక్తియే రాధ. అనగా కృష్ణుని స్వరూపమైన ప్రేమ, ఆనందము రాధయే. వానిని భక్తులకు పంచిపెట్టు తల్లి ఆమె. రాధ యొక్క ప్రస్తావన భాగవతము నందు లేదు. రాధ యొక్క పేరు తలచిన మాత్రముననే తానుండక, బ్రహ్మమే యుండు స్థితిలోనికి చొచ్చుదునను భావముతో, అందువలన భాగవతము వెలువడ దను భావముతో శుకుడు రాధ యొక్కపేరును స్మరింపలేదని మహాత్ములు తెలుపు చున్నారు. అయినను గోపికల కెల్లరికి ఆమెయే కేంద్రమని శుకుడు పరోక్షముగా సూచించెను. గోపికలను తమవంటి భాగ్యశాలురు లేరను అతిశయభావ మొకసారి ఉదయింపగా, కృష్ణు డంతర్ధానమయ్యెను. గోపికలు బృందావనమంతయు ఆతనికై వెదకిరి. కృష్ణుని రెండు పాదములతో గలిసి నడిచిన ఒక స్త్రీ యొక్క రెండు పాదము లను వారు గమనించిరని భాగవతమున గలదు. ఆ స్త్రీ రాధయే, సందేహము లేదు. రాధాదేవి యొక్క వృత్తాంతము దేవీభాగవతము నందును, బ్రహ్మవైవర్త పురాణము నందలి గోలోక వృత్తాంతముననను గలదు. నిర్వాణమును అనగా భగవ దైక్యమును ప్రసాదించునదని బ్రహ్మవైవర్తముననను, కావలసినవన్నిటిని తీర్చునది యని దేవీభాగవతమునందును 'రాధ' అను పదమునకు అర్థములుగా వ్యాసుడు సెలవిచ్చెను.

రాధ ఎవరు? గోలోకమునకు రాణి. గోలోకమనగా సర్వకారణస్థితి యగు వైకుంఠమే. సమస్త సృష్టి ఎచటినుండి వచ్చినదో అట్టి దివ్యానంద ప్రళయస్థితియే గోలోకము. అచట తెలియువాడు, తెలియునది, తెలియుట అను మూడు ఉండవు. వట్టి అచ్చమైన 'తాను, నేను' అను ఎరుకయే యుండును. 'గోవు' అనగా ఈ సందర్భమున ఇదియే అర్థము. సృష్టి యంతయు పరమాత్మ యందు కరగియుండు స్థితి ఇది. పానకములో పటికబెల్లము కరగినపుడు దాని తీయని రుచి యుండును. కాని బెల్లపు స్థితి యుండదు. ఈ రుచి మరల రాబోవు పటికబెల్లమునకు సారము, మూలము. అట్లే సృష్టికి మూలద్రవ్యము (ఇది భౌతిక పదార్థము గాదు) ప్రళయము నందుండును. ఇది రాబోవు సృష్టి యను చెట్టుకు విత్తనము. మరి ప్రళయమున స్వామి యొక్కడే యున్నాడు గదా, ఇది ఏమి? స్వామికన్న వేరుగా గాక స్వామిగా నున్నదియే. అనగా ప్రళయమున స్వామి ప్రేమగా నుండును. ఈ ప్రేమయే మూల ప్రకృతి యనియు, నీలాదేవి యనియు,

రాధ యనియు వ్యాసుడు కీర్తించెను. స్వామి దేహమగు ఆకాశము యొక్క వర్ణము నీలము గదా. సత్యమునకది ఏ వర్ణమును గాని స్థితి. ఈ స్థితిలో ప్రేమయన్నను, దేవుడన్నను ఒకటియే. కావున రాధాకృష్ణు లొకటియే. స్వామియందు తాను ప్రేమింపవలెనను సంకల్ప ముదయించెను. తనచే ప్రేమింపబడుటకు జగత్తు, జీవులు గావలెను. తనకన్న వేరు లేనపుడు వీరు ఎట్లు వచ్చెదరు? తానే వీరుగానయ్యెను. అదియే సృష్టి. ఇపుడు ప్రేమించు దేవుడు, జీవులతో గూడిన జగత్తుపై దేవుని యొక్క ప్రేమ, స్వామిచే ప్రేమింపబడు జగత్తు గలదు. దేవుడే ప్రేమగా నున్నప్పుడు ఆ ప్రేమయే రాధాదేవి. దేవుని యొక్క ప్రేమయే శ్రీదేవి లేక లక్ష్మి. దేవునిచేత ప్రేమింపబడు జగత్తుగా రూపొందినదే భూదేవి. నీల లేక రాధయే మూలప్రకృతి. లక్ష్మియే పరాప్రకృతి. భూదేవియే అపరాప్రకృతి. 'పరా' అనగా ఉన్నతస్థాయి. 'అపరా' అనగా తక్కువ స్థాయి. ఈ మూడును ఒకే ప్రకృతి యొక్క మూడు దశలు. స్వామి ముప్వురితో శ్రీవేంకటేశ్వరుడుగా వెలసెను. కనుకనే వేంకటేశ్వరుడు శ్రీ భూ నీలా సహితుడని కీర్తింపబడెను. రాధ, వేంకటేశ్వరుడు అభిన్నులు. కావుననే అన్నమయ్య రాధాదేవిని సంకీర్తించుట జరిగినది. స్వామి శ్రీకృష్ణుడుగా అవతరించిన సందర్భమున మూలప్రకృతి రాధ యను పేరుతోను, లక్ష్మీదేవి రుక్మిణిగాను, భూదేవి సత్యభామగాను దిగివచ్చిరి. రాధాకృష్ణు లభిన్ను లగుట వలన వారి నడుమ వివాహ ప్రసక్తి లేదు.

కృష్ణావతారమున రాధ గోపికలకు ఆదర్శమైన మహాభక్తురాలు. భక్తికి ఉదాహరణ ములుగా గోపికలను నారదుడు తన భక్తిసూత్రములలో నిర్దేశించెను. ఈ గోపికలకు కేంద్రము రాధ. వాస్తవమునకు కృష్ణుని కన్న రాధ పదునైదేండ్లు పెద్ద వయసు గలది. కృష్ణ శిశువును లాలించినది. వారి నడుమ భౌతిక సంబంధము ఏ లేశమును లేదు. రాధాకృష్ణు లొకరియందొకరు పొందినది ఆత్మాకర్షణ, దివ్యాకర్షణ. వారి ప్రజ్ఞ శరీర స్థాయిది గాదు. రాధ హృదయమే కృష్ణుడు. కృష్ణుని యెదయే రాధ. కృష్ణు డనగా జనుల నాకర్షించు పరమప్రేమ. ఆ ప్రేమయే రాధ. అదియే దివ్య సౌందర్యము. రాధ నవవిధ భక్తులలో మకుటాయమానమగు ఆత్మ నివేదనము నవలంబించినది. తనవి యనబడునవే గాక, తానే స్వామికి సమర్పణమైనది. గోపికల హృదయములను తాకి, వారి సూక్ష్మదేహములతో తానాడి కృష్ణుడు వారికి రసమును అనగా బ్రహ్మానందమగు తన స్థితినే అనుగ్రహించెను. ఈ యాటయే రాసలీల. ఈ యనుగ్రహమే రాధ. కావున రాసమండలమునకు కేంద్రమున రాధాకృష్ణులు, పరిధిపై గోపికా కృష్ణులు నర్తించిరి. రాధ రాసమండలమునకు రాణి. ఈ రాసలీలలో, గోపికలలో ఒకరికొకరు కృష్ణుడుగా దర్శనమిచ్చిరి. ఆపై ఎవరికి వారు కృష్ణుడైరి. రాధ సహజముగనే కృష్ణునితో తాదాత్మ్య స్థితిలో నున్నది. రాధాకృష్ణుల ఆత్మానుబంధము దివ్యమధురము. ఇందలి విశేషములను, ఘట్టములను, రాధ యొక్క దివ్యగుణము లను అన్నమయ్య వర్ణించిన తీరు అత్యద్భుతము. కారణ మీతడు దానిని తన లోగన్ను లతో దర్శించుట జరిగినది. ఈ సంకీర్తనమున వర్ణింపబడిన రాధాకృష్ణుల దివ్యాను బంధమును ప్రాతిపదికగా భావించినచో అన్నమయ్య మంగాంబా వేంకటేశ్వరుల అనురాగ సంబంధమును గూర్చి వర్ణించిన సంకీర్తనల విశేష భావము, భక్తులగు పాఠకుల బుద్ధులందు సరిగా ముద్రితమగును. ఈ అనురాగ సంబంధము భౌతికము గాదనియు, ప్రకృతి పురుషుల

దివ్యోల్లాసమనియు తెలియవచ్చును. అన్నమయ్య ప్రయోగించిన పదములు భౌతికమును సూచించునట్లు భావించినను, అవి దివ్యార్థ ధ్వని గలవని తోచును. ఈ సంకీర్తనమున అన్నమయ్యకు గల వేదపురాణ పరిజ్ఞానము, తంత్రయోగశాస్త్ర ప్రావీణ్యము, భాగవత సిద్ధి దాగియున్నవి. ఇతనికి దైవానుగ్రహ మున ఇవి సిద్ధించినవి. వట్టి సంగీత ప్రావీణ్యమునకు, సాహితీ పాండిత్యమునకు అన్నమయ్య అందడు. భాగవతమార్గ సంప్రదాయమును శుకుడు, అన్నమయ్య వంటి వారల వద్ద, వారి చరణధూళి శిరసున ధరించి అభ్యసించి, అనుష్ఠించి, అనుభూతి నందవలెను. అన్నమయ్య స్వయముగా రాధాకృష్ణుల సాన్నిధ్య మాధుర్యము ననుభవించెను. ఆ సాన్నిధ్య మాధుర్యమును పూర్వజన్మమునందే అనుభవించిన వాడన్నమయ్య. రాధానుగ్రహ వర్షమున తడిసి, తనిసిన అన్నమయ్య మనల నిచట అందులకై ఇట్లు ఆహ్వానించుచున్నాడు.

పల్లవి యొక్క తాత్పర్యము

"ఈ రాధ మిక్కిలిగా శోభిల్లుచున్నది. ఎల్లప్పుడును విశేషమయిన ఆనందమునకు వశమైనది."

వ్యాఖ్య

శోభ యనగా కాంతి, కళ. స్వామి యొక్క కళయే రాధ. ప్రకృతి యంతయు రాధ యొక్క శోభయే. వైభవమే. సూర్యచంద్రాగ్నుల వెలుగులు, మేఘుని మెఱపులు, నదీవృక్షాదుల సౌందర్యమంతయు రాధ యొక్క దివ్యశోభయే. ఆమె గోకులమున ధరించిన దేహము గూడ దివ్యకాంతితో మెఱయుచున్నది. కారణము ఆమె సృష్టి కాధారమైన మూలప్రకృతి. మరియు అంతర్యామి యగు కృష్ణునియందు ప్రకృతి యగు రాధకు గల నిర్మల ప్రేమయే రాధ యొక్క శోభ. విలాస మనగా శరీరము యొక్క చక్కని భంగిమ యని సామాన్యార్థము. కాని ఇచట విశేషమయిన భగవ దానందమని విశేషార్థము. నిరంతరము భగవదానందమునకు వశమైన రాధ పరవశత్వములో నుండెను. పారవశ్యమే రాధగా మూర్తిగొన్నది. అన్నమయ్య వలెనే మనమును రాధను స్మరించి పరవశుల మగుదుముగాక.

చరణములు / పాదములు

1. తాత్పర్యము

"మన్మథుని బలమునందు కృష్ణునికి మెలకువ కలిగించినది రాధ."

వ్యాఖ్య

మన్మథుడనగా ఇచట భౌతికాకర్షణ యగు కామము గాదు. రాధ తన దివ్య సౌందర్యమునందు, అంతరంగము యొక్క అందమునందు శ్రీకృష్ణుని మేలుకొలిపినది. అనగా వాని నాతడు గ్రహించునట్లు చేసినది.

2. తాత్పర్యము

"ఆఘ్రాణింపదగిన దివ్యపరిమళముతో ఆమె దేహము విలసిల్లుచున్నది."

వ్యాఖ్య

పరమ భాగవతోత్తముల సన్నిధిలో దివ్యసుగంధము పరిసరములందు వ్యాపించుట సహజమే. ఇక భాగవత మార్గమున కాది గురువగు రాధాదేవి విషయమున ఏమని వివరింపగలము? రాధ యొక్క దేహము మానవ దేహము వలె కన్పట్టినను, దాని చుట్టు ఆమెకు దివ్యదేహ మొకటి గలదు. ఆ దివ్యదేహము నుండి దివ్యమగు సువాసన వెలువడి, బృందావనమున నిండినది. గోకులవాసులు దాని నాఘ్రాణించి పవిత్రులై, ధన్యులైరి. గంధ మనగా పరమాణు సముదాయము యొక్క కదలిక వలన ఏర్పడు వాసన. రాధ యొక్క దివ్యదేహమునకు సంబంధించినదే ఈ దివ్యగంధము. మొదటి పాదమున రాధ దివ్యరూపము, ఈ పాదమున అందుండి వెలువడి దివ్యగంధము అన్నమయ్యచే తెలుపబడెను. ఇతడు రాధ రూపమును చూచెను. ఆమె యొక్క దివ్యగంధము నాఘ్రాణించెను.

3. తాత్పర్యము

"ఠీవితో గూడిన అలుక గలిగినది రాధ."

వ్యాఖ్య

కృష్ణునితోడి రాధకు గల అనుబంధము యొక్క ఒక చారిత్రక దశ ఇది. శ్రీకృష్ణుని రాకకై రాధ ఒకచోట వేచి చూచినది. అతడు సమయమునకు రాకుండుటచే ఆమెకు అలుక వచ్చినది. తీరా అతడు వచ్చుసరికి, ఆమె తన ఠీవిని అభినయించి, అలుకను ప్రదర్శించినది. (ఇచట దర్ప మనగా గర్వము గాదు. ఠీవి. తన దివ్య ప్రేమను కృష్ణు డెరుగవలెనని రాధ ఠీవి నిట్లు అభినయించినది. కృష్ణుడు తనయెడ ప్రసన్ను డగుటకే అలుకను ప్రదర్శించినది.)

4. తాత్పర్యము

"ఈమె సామీప్యమే ఈమె ఠీవిని తెలుపును."

వ్యాఖ్య

మరియు తన సమీపమునకు వచ్చిన కృష్ణునకు తన ఠీవిని గూర్చి తెలిపినది. ఆమె తన మాటలతో చెప్పకుండగనే ఆమె ఠీవి, మహిమ కృష్ణునికి తెలిసినవి. ఆమె సామీప్య ప్రభావమట్టిది. ఆమె అలుకకు కారణము అతని కవగతమైనది. ఇక ఆమెను ప్రసన్నురాలినిగా జేసికొనుటకై స్వామియే తపించి, కృషి చేయక తప్పలేదని అన్నమయ్య భావము. కృష్ణు డెల్లరను ఆకర్షించును. రాధ కృష్ణునే ఆకర్షించినదని అన్నమయ్య చమత్కారము.

5. తాత్పర్యము

"దాటింపబడిన అడ్డంకులు గలది రాధ."

వ్యాఖ్య

భక్తులకు సాధనలో ఆటంకములు, విఘ్నములు వచ్చుచుండును. ఇవి వెలుపలివి గాక, లోపలివే. వెలుపలి పరిస్థితులలో, వ్యక్తులలో, పరిసరములలో ఆటంకములు గలవను భావమే భగవంతుని పొందుట కాటంకమగును. రాధాదేవి శ్రీకృష్ణుని యనుగ్రహస్వరూపిణి గావున, ఆమెను స్మరింపగనే ఇట్టి భావము వైదొలగును. అంతియేగాక పూర్వము గావించిన దుష్కర్మ యొక్క ఫలితములుగా వచ్చు కష్టములు గూడ రాధాదేవిని భక్తితో తలచుట వలన వాని ప్రభావము భక్తుల మనస్సున కంటదు. క్రమముగా ఆపదలును దాటింపబడును. రాధ జగన్మాత. కావున రాధ యొక్క నిర్మలమగు వాత్సల్యమును భావించుట దట్టమయిన కొలది, సాధకునకు రాధా గుణము లబ్బును. ఇతరులకు వారి ఆపదలలో తోడ్పడుట, వారి యెడ మాతృ వాత్సల్యమును నెరపుట జరుగును. దానివలన సాధకుడు పవిత్రుడై, ఆపదలను దాటును.

6. తాత్పర్యము

"తన యౌవనమునందు కృష్ణునకు ఉత్తమ స్థాయిలో మెలకువ కలిగించునది."

వ్యాఖ్య

యౌవన మనగా రాధాదేవి విషయమున వయస్సుకు చెందినది గాదు. రాధ యొక్క దివ్యత్వము, ఆమె దివ్య దేహ సౌందర్యము, దివ్యగుణసంపద తరుగనివి. నిత్యోత్సాహముతో రాధ జీవించినది. కృష్ణుడు వీనియందు మేల్కొని, ఆమె యొక్క దివ్యత్వమును చక్కగా గుర్తించి గ్రహించెను.

7. తాత్పర్యము

"రాధ నిత్యము అనుసరణమునే ధరించినది."

వ్యాఖ్య

రాధ నిత్యము కృష్ణుని భౌతికముగను, మానసికముగను, ఆత్మస్థాయిలోను అనుసరించుచు, అట్టి అనుసరణమే తన బ్రతుకుగా తీర్చుకొన్నది. ఈమె స్వామి ననుసరించినది. అనగా అంతర్యామిత్వము నందినది. మనకు తన అనుసరణము మార్గముగా నిల్పినది. అనగా ఆమె యొక్క నిర్మలప్రేమ పథమున పయనించుచు, సమర్పణమును పాటించినచో మనకును ఆమె వలెనే కృష్ణుని సాన్నిధ్యము లభించును. రాధ లోకమాత. ఆమె స్థితి మనకు లభించినచో, కృష్ణుడు ఆమెను వలెనే మనలను గైకొనును.

8. తాత్పర్యము

"దోషములను చీల్చునది."

వ్యాఖ్య

భక్తులలో పూర్వవాసనల వలన దోషములు వర్తింపవచ్చును. దేహమున కంటిన బురద తొలగవలెనన్నచో స్వచ్ఛమైన నీటితో కడుగవలెను. అట్లే మనలోని మలిన వాసనలు తొలగుటకు అత్యంత

నిర్మలత్వమే తానైన రాధను తలచవలెను. లోకమును రాధా స్వరూపముగా ఆరాధింపవలెను. వట్టి స్వప్రయత్నమున మన మాలిన్యము తొలగిపోదు. రాధానుగ్రహమున తొలగును. చివరకు మనమే రాధ యగుదుము.

9. తాత్పర్యము

"యువతి యొక్క మన్మథ సంబంధమగు గాథయే రాధ."

వ్యాఖ్య

కృష్ణుని యెడ మన్మథ సంబంధమయిన తలంపులు, భావనలు, సన్నివేశములు, అనుభూతులు, విరహవేదనలు, క్రీడలతో గూడిన జీవితగాథయే రాధ. ఇచట 'మన్మథ' యనగా భౌతికాకర్షణ రూపమగు కామమని తలంపరాదు. మనసును మథించుచు దివ్యానందమును గూర్చు స్వామియే వాస్తవమయిన మన్మథుడు. కావున రాధ భగవంతుడను శ్రీకృష్ణుని యెడల దివ్యాకర్షణ పొందినది. తనను తాను సంపూర్ణముగా స్వామికి సమర్పించుకొని, భగవంతుని సాన్నిధ్య మాధుర్యము కొరకై ఆర్తి నందినది. కావున రాధ జీవితము కృష్ణునితో నిండినది. కృష్ణ సంబంధము లేని క్షణము, జీవితాంశము, ఏ సన్నివేశమును రాధ బ్రతుకులో లేదు. ఆమె బ్రతుకు కృష్ణునిదే. ఆమె బ్రతుకే కృష్ణుడని అన్నమయ్య భావన.

10. తాత్పర్యము

"అన్నిటిని ధరించు భూమితో సమానమైన కుచముల యొక్క బాధ గలది ఈమె."

వ్యాఖ్య

భూమి సకల వస్తుసముదాయమును ధరించును గాన 'ధర' యనబడును. ఇట్లు భూమి ఎంతయో బరువును మోయుచున్నది. నేలతల్లి జీవులకు తన స్తన్యముగా సంపద నిచ్చుచున్నది. అట్లే రాధ యొక్క కుచములును భారమైనవి. ఈమెయే భూమిగా దిగివచ్చినదని అన్నమయ్య ఆంతరిక భావము. కావున రాధ యొక్క కుచములు భూమి వలెనే బరువైనవి. ఎల్లరకును పాడిపంటలను సంపద యను స్తన్య మొసగుటయే దీనికి కారణము. మరియు అన్నమయ్య 'కుచ' అను పదమునేల ప్రయోగించెను? కుచములనగా సంకోచ వ్యాకోచాత్మక ప్రక్రియ కాధారములు. జీవులలోని ఇట్టి శ్వాసక్రియకు ఆధారమయిన అమ్మ రాధయే. అందరికి ఆమె శ్వాస నొసగి వారిని పాలించుచున్నది. ఎల్లరి ప్రాణభారమును భూమి వలెనే తన కుచము లందు భరించుచున్నది. ఆ తల్లి కుచములు జీవులపై భూమికి వలెనే వాత్సల్యమునే స్తన్యముగా గలవి.

11. తాత్పర్యము

"యౌవనము యొక్క అస్తిత్వమును అనుసరించి శ్రీకృష్ణుని మేలుకొలుపునది రాధ."

వ్యాఖ్య

రాధ యొక్క యౌవన మనగా శాశ్వత దివ్యసౌందర్యమే గాని భౌతికమగు అందముతోడి వయసు గాదు. రాధ సదా పదునారేండ్ల యువతి యని రాధామానస తంత్రగ్రంథమున తెలుపబడినది. రాధ తన యొక్క నిత్యములగు దివ్యసౌందర్యమును, దివ్యతేజస్సును, దివ్యగుణములను కృష్ణుడు గ్రహించునట్లు చేయునది. యౌవన మనగా రాధ విషయమున వీని కూడిక. ఆమె ఉత్సాహశక్తి, దివ్యప్రేమ తరుగనివి. అంతులేనివి. రాధ కనులు, కన్య కనులని వ్యాసుడు వర్ణించెను. కావున ఇచట యౌవన మనగా భౌతికాకర్షణ ఏర్పడని స్వచ్ఛమయిన హృదయ స్థితియే యని అన్నమయ్య భావము.

12. తాత్పర్యము

"ఈమె స్థితిని పొందుట కష్టము."

వ్యాఖ్య

భూమిపై గల జీవు లెవ్వరికిని రాధ యొక్క స్థితి తేలికగా గ్రహింపగలది గాదు, పొందగలిగినది గాదు. రాధ యొక్క హృదయపు లోతు ఎవరును ఎరుగజాలరు. ఆమెకు కృష్ణుని యందు గల దివ్యప్రేమ, కృష్ణునితోడి ఏకత్వానుభూతి పొందుట చాల కష్టము. అట్లే జీవులపై గల అఖండ మాతృ వాత్సల్యమును పొందుట గూడ మిక్కిలి కష్టము. అన్నమయ్య 'దుస్సాధా' అను పదమును వాడెనే కాని, 'అసాధ్యా' అనలేదు. అనగా రాధ స్థితిని మనము పొందుట అసాధ్యము గాదు. రాధను నిత్యము భావించుచు, జగమునే ఆమెగా దర్శించుచు, తన హృదయమునే రాధగా వికాసము పొందించుకొన్నచో సాధ్యమే. అనగా తన ఎదలో అంతర్యామి యగు కృష్ణునియందు ప్రేమ, జీవులపై మాతృ వాత్సల్యము గలవాడు రాధ యొక్క స్థితిని పొందగలుగును. ఇదియు రాధాదేవి యనుగ్రహమున.

13. తాత్పర్యము

"తనువు నుండి పుట్టు మన్మథునకు తండ్రి యగు కృష్ణుని కథయే రాధ."

వ్యాఖ్య

తనువనగా విస్తారమని యర్థము. ఆత్మయగు దేవుని వెలుగు యొక్క విస్తారమే శరీరము గావున దీనికి తనువని పేరు గలిగెను. దీనినుండి పుట్టునది భౌతికాకర్షణ రూపమున మన్మథ భావము. మన్మథుడు శరీరాకర్షణను కల్గించి మనస్సును చిలుకును. కాని రాధను ఆకర్షించినది ఇట్టి మన్మథ సంబంధమైన ఆకర్షణ గాదని అన్నమయ్య ఇచట స్పష్టము చేయుచున్నాడు. మన్మథుని కన్నతండ్రియు, భగవంతుడగు కృష్ణుని యందు పొందిన దివ్యాకర్షణ. కామాకర్షణ స్త్రీ పురుష దేహసంబంధి. రాధ పొందిన దిదిగాదు. దేహమునకు మూలమయిన ఆత్మకు సంబంధించినదని అన్నమయ్య 'తను భవ గురుగాధా' అని ప్రయోగించుటలో సూటిగా సూచించెను. ఆత్మయే కృష్ణుడు. కృష్ణుని యందు రాధ పొందిన దివ్యాకర్షణ

ఎంతటిది? అతని కథయే తానైనదట. ప్రేమ యొక్క ఎంతటి మహోన్నత శిఖరాయమైన స్థితి ఇది! వర్ణింప నలవిగాదని అన్నమయ్య సూచన. కృష్ణుని కథయే రాధ యని అతడు అత్యద్భుతముగా కీర్తించెను. ఇతడును శ్రీవేంకటేశ్వరుని కథయే. రాధకు తనకని కృష్ణుడు గాక వేరు బ్రతుకు లేదు. వీరిర్వురు అభిన్నులు. అంతగా రాధ కృష్ణునితో ఏకత్వసిద్ధి నందినది. అన్నమయ్యకును శ్రీవేంకటేశ్వరునితో ఇట్టి స్థితియే కలిగినది.

14. తాత్పర్యము

"తన స్తనముల చేత ఏర్పాటుచేయబడిన ఆటంకము పొందిన కొండలు గలది రాధ."

వ్యాఖ్య

రాధ యొక్క స్తనములు కొండలకంటె దృఢములయినవి. విశ్వమే రాధ యొక్క దేహము కాగా, కొండ లామె స్తనములని అన్నమయ్య దర్శనము. రాధ తన విశ్వ రూపము నాతని కనుగ్రహించినది. (అంతేగాని ఈ వర్ణనలో అసభ్యతను గమనింప రాదు.) మరియు ఇందొక వేదార్థమున్నది. గిరి యనగా వాక్కు. రాధ యొక్క స్తనములు హృదయము నుండి పుట్టిన దివ్యానుభూతితో నిండినవి. భగవదనుభూతి చిక్కనై ఎదలో నిండుటచే మాటలు రాకుండెనని అన్నమయ్య భావన. బ్రహ్మానందమును వర్ణింపలేక మనస్సు, వాక్కులు వెనుకకు మరలునని తైత్తిరీయోపనిషత్తు నందు తెలుప బడినది.

15. తాత్పర్యము

"శ్రేష్ఠమైన దేహమును, అమృతము వంటి వాక్కులును గలది రాధ."

వ్యాఖ్య

'తనువర' అనగా శ్రేష్ఠమైన దేహము. అనగా దివ్యతేజోమయ మగు దేహము. ఇది మనమును పొందదగినది. ఇది భగవదనుభూతితో నిండియుండునే గాని ఇందు భౌతికపదార్థ ముండదనియు, దీనినే భాగవతదేహ మందురనియు భాగవతము - 1వ స్కంధమున శుకుడు తెలిపెను. ఇట్టివారికి తమలోన, వెలుపల భగవంతుడే నిత్యము దర్శనమిచ్చుచుండును. ఈ దర్శనానుభూతియే వీరి దివ్యదేహము. రాధకు భౌతికదేహ మున్నను, ఈ దివ్యదేహమే ప్రధానమయినది. ఈమెకు కృష్ణుడే ఆత్మ. అంతయు కృష్ణుడే. తాను గూడ కృష్ణుడే. ఇట్టి దివ్యానుభవమే ఈమె వరతనువు. ఈమె వాక్కులు అమృతమయములు. శ్రీకృష్ణునితోను, తోటి గోపికలతోను, జీవుల తోను ఆమె మాటలాడు పలుకులు పున్నమిచంద్రుని వెన్నెల వంటివై ఆహ్లాదమును కలిగించును. ఆమె యొక్క దివ్యదేహ దర్శనము, మధుర వాక్కుల శ్రవణము కృష్ణునకు, జీవులకు కూడ ఆహ్లాదకరమే.

16. తాత్పర్యము

"ఈమె కంఠస్వరము చేత కోకిల యొక్క తెలివి జయింపబడినది."

వ్యాఖ్య

కోయిల తన తెలివిని, నేర్పును ఉపయోగించి ప్రయత్నపూర్వకముగా తీయగా పాడును. కాని రాధ కంఠము నుండి అప్రయత్నముగా తెలివితో, నేర్పుతో ప్రమేయము లేక ధ్వని వెలువడినది. పైన చెప్పినట్లు దివ్యానుభూతితో హృదయము నిండగా, ఆ యనుభూతియే నేరుగా కంఠధ్వనిగా రూపొందినది. కావున రాధ యొక్క కంఠధ్వని, కోయిల కూతకన్న తీయనయినది. ఈమె మాటయు పాటయే. అనుభూతి నుండి వాక్కు వెలువడుట గాక, అనుభూతియే వాక్కుగా వెలువడినది. సంకీర్తనము యొక్క లక్షణమును అన్నమయ్య ఇచట నిర్దేశించుచున్నాడు. ఆతడిట్లు సంకీర్తనము గావించెను, మాటలాడెను గూడ. ఆతని ననుసరించు వారిలో, అతని సంకీర్తనలే గాక, ఏ పాట అయినను, మాట అయినను ఇంతియే. వాస్తవమునకు విశ్వమే రాధ రూపము. విశ్వమున కతీతము గూడ. విశ్వములోని గ్రహతారకాది గోళముల పరిభ్రమణ గానములు, మబ్బుల ఉరుములు, నదీ సాగర ఘోషలు, సెలయేర్ల జలజలలు, పిట్టల కూతలు, నెమళ్ళ అరుపులు, కోయిల యొక్క కమ్మని 'కుహూ'లు, సజ్జనుల సంభాషణలు, భక్తుల సంకీర్తనములు రాధాదేవి యొక్క గానములోని స్వల్ప భాగములే. కోయిలకే కూత నేర్పగలది రాధ. వినుటకు సిద్ధపడువారికి ఇవియెల్లయు రాధాదేవి కంఠధ్వనులుగనే విన్పించును. అన్నమయ్య ఇట్లు వినెను, పాడెను.

17. తాత్పర్యము

"యౌవనములోనున్న స్నేహితురాండ్రు తనకు సమీపముగా గలది రాధ."

వ్యాఖ్య

రాధ యొక్క సఖులు ఎనిమిదిమంది. వారు లలిత, విశాఖ, చిత్ర, ఇందురేఖ, చంపకలత, రంగదేవి, తుంగవిద్య, సుదేవి. (వీరి విగ్రహములు, పాదముద్రలు బృందావనమున గలవు). వీరు కూడ రాధ ననుసరించి, కృష్ణుని యందు సమర్పణ పొంది, ఆతని ఆకర్షణకు లోనయినవారు. వారును రాధ వలెనే దివ్యసౌందర్యము గలవారు. నిత్యము తరుగని ఉత్సాహముతో స్వామిని సేవించిరి. శ్రీకృష్ణుని యందు వారు పొందిన దివ్యాకర్షణ, స్వచ్ఛత, దివ్యగుణవైభవమే వారి యౌవనము. ఈ సఖులు నిత్యము రాధాదేవి సమీపమున, అనగా భౌతికముగానే గాక ఆత్మకు దగ్గరగా జీవించిరి. రాధా సాన్నిధ్యమున జీవించుటచేత వారికిని రాధ యొక్క స్వచ్ఛత, నిత్యోత్సాహము, కృష్ణుని యందు ఆత్మసమర్పణతో గూడిన ఆకర్షణ, భగవదనుభూతి మాధుర్యము సిద్ధించినవి. రాధ కృపయే వీరిని స్వామి దగ్గరకు చేర్చినది. సర్వాంతర్యామి యందు లీనమయిన ప్రజ్ఞ గల వారగుటచేత రాధయు, ఆమె సఖులును నిత్య యువతులు. వీరి యౌవనము భౌతిక శరీర సంబంధి గాదు, వీరి యనుభూతికి సంబంధించినది. రాధాదేవి సఖులగు గోపికలు బృందావనమున గల కాత్యాయనీ దేవిని గూర్చి ధనుర్మాస వ్రతము నాచరించిరనియు, అమ్మవారి కనులు గల కృష్ణుని తమ హృదయనాథుడుగా రసానుభూతి నొసంగునట్లు చేయుమని అమ్మవారిని ప్రార్థించిరనియు భాగవతమున శుకుడు వర్ణించెను. ఈ భక్తియందు ఉద్వేగము లేదు. ఇది సదా శ్రద్ధతో గూడియున్నది. ఇదియే వారి యౌవనమని అన్నమయ్య భావము. వీరి అభీష్టమునురాధ నెరవేర్చినది.

18. తాత్పర్యము

"మందమైన చంద్రుని యొక్క కాంతి వంటి అమృతము గలది రాధ."

వ్యాఖ్య

ఇచట 'సౌధ' యనగా సుధ గలదనియే గాని, మేడ గలదని యర్థము గాదు. సుధ యనగా అమృతము. ప్రేమరసానుభూతియే నశించనిది. మిగిలిన విషయ సుఖము లన్నియు నశించునవే. మందమైన చంద్రుడనగా శుద్ధాష్టమి నాటి చంద్రుడు. అతని కాంతి యనగా వెన్నెల. చంద్రుడు మాతృకారకుడు. కావున చంద్రుని వెన్నెల జీవులపై ప్రకృతిమాత కురియు వాత్సల్యవర్షమే. కావుననే అన్నమయ్య రాధను అష్టమి చంద్రుని వెన్నెల వంటి అమృతము గలదని స్తుతించెను. చంద్రుడు స్వామి యొక్క మనస్సునుండి పుట్టెనని పురుషసూక్తము చెప్పుచున్నది. కావున ఆతని వెన్నెల జీవుల మనస్సులకు ఆహ్లాదము కలిగించునది. ఇది తరుగనిది. రాధయు జీవుల మనస్సులకు ఆహ్లాదమును కల్గించును. రామాయణము సుందరకాండలో చంద్రుని వెన్నెల, సీతాదేవి స్తన్యముగా హనుమంతుని కనుభూతి కల్గినట్లు చెప్పబడినది. సూర్యుని వెలుగు జ్ఞానమునకు, చంద్రుని వెన్నెల ప్రేమకు చిహ్నములని శ్రీసూక్తము చెప్పుచున్నది. కావున నశించని దివ్యప్రేమ గలది రాధయని అన్నమయ్య కొనియాడెను. ఇది జీవులపై వాత్సల్యమై విరియునని ఆతని యనుభవము. చంద్రుని వెన్నెల వలన ఓషధులు పెరుగుట, స్త్రీలలో ఋతుక్రమ మేర్పడుట, గర్భధారణము జరుగుచున్నవని వేదమున గలదు. రాధాదేవి అమృతవాత్సల్యమే చంద్రుని వెన్నెలగా విరిసి, ఈ విధములయిన ప్రకృతి విశేషములను కల్గించుచున్నదని అన్నమయ్య భావము. భక్తుల ముఖము చంద్రఖండమని తంత్రశాస్త్రము చెప్పుచున్నది. వారి ముఖమున విరియు ప్రసన్నత, రాధ యొక్క అనుగ్రహమున ఏర్పడునది. కావున నిజమైన భక్తుల సన్నిధికి చేరువారికి భక్తుల ముఖముల నుండి రాధాదేవి కరుణ లభించునని అన్నమయ్య ఉద్దేశ్యము.

19. తాత్పర్యము

"మెఱయుచున్న మెఱపు వంటి విధానము గలది రాధ."

వ్యాఖ్య

రాధ యొక్క దివ్యత్వము మెఱపు మెఱసినట్లున్నది. మబ్బులలోని మెఱపు, మానవునిలో వెన్నెముక యందు పయనించు మెఱపుతీగ వంటి కుండలినీశక్తి రాధ యొక్క స్వరూపములే. (అన్నమయ్య వేదమున, తంత్రగ్రంథములందు గల అమ్మవారిని గూర్చిన తీయని భావముల నిందు రమణీయముగ ప్రకటించెను.) మెఱపులలో విద్యుత్తు ఉండును. సూర్యకాంతి నుండియు గూడ విద్యుత్తు భూమిపై వెలయును. ఇదియే ప్రాణశక్తి. దీనిని భూమి, జీవులకు పంచిపెట్టుచున్నది. ప్రాణశక్తి వలననే జీవులు బ్రతుకుచున్నారు. ఇట్లు జీవుల జీవమున కాధారము రాధయే యని అన్నమయ్య వర్ణించుచున్నాడు.

20. తాత్పర్యము

"రాధలో చిరునవ్వు క్రొత్తగా ఏర్పడినపుడెల్ల ఆపబడుచున్నది."

వ్యాఖ్య

రాధకు చిరునవ్వు కృష్ణునికి సంబంధించిన తీయని యనుభూతిలో జనించినది. పెద్దగా నవ్వుట పరిహాసమును సూచించును. చిరునవ్వు, గుండెలో కలిగిన తీయని అనుభూతి యొక్క ఒక దశను సూచించును. కాని యనుభూతి పరిమితిని దాటి క్రొత్తగా చిక్కబడినపుడెల్ల, చిరునవ్వు ఆపబడుచుండును. ఏలననగా నిండైన అనుభూతిని నవ్వురూపమున వ్యక్తము చేయుట సాధ్యముగాదు. వ్యక్త స్థాయిని దాటినదే నిండైన అనుభూతి. ఇది రాధలో క్రొత్తక్రొత్తగా అనగా ఎప్పటికప్పుడు కలుగుచుండును. అనగా ఒక క్షణము ఆమెకు కృష్ణుని యెడల గల అనుభూతి చిరునవ్వుగా వ్యక్తమగు చుండును. మరల వెనువెంటనే కృష్ణుడు గుండెనిండుగా నెలకొనుటచే ఈ యనుభూతి పూర్ణమై నవ్వు ఆగిపోవుచుండును. ఇట్లు మాటిమాటికి క్రొత్తక్రొత్తగా తటస్థించుచున్న దని అన్నమయ్య దర్శనము. రాధాకృష్ణుల అనుబంధమునకు చెందిన సన్నివేశములు అన్నమయ్యకు గతములు గావు, వర్తమానములే. నవ్వును రాధ ఆపదు. ఆమె ప్రజ్ఞ కృష్ణుని యందు కరగినది, మరగినది. కావున నవ్వు ఆపబడినది. 'రోధా' అను పదములో రాధ యొక్క ఈ స్థితిని అన్నమయ్య వర్ణించెను. ఈ స్థితి ఇతనికి గూడ ప్రసాదింపబడినది. రాధ యొక్క తల్లి ఆమెకు పెరుగుకుండల నిచ్చి, కవ్వముతో త్రచ్చుమని ఆదేశించెను. రాధ మనసు కృష్ణునికి అర్పితమైనది. కావున పెరుగు లేని కుండలు చిలుకబడుచున్నవని లీలాశుకుడు తెలిపెను.

21. తాత్పర్యము

"రాధ ధనము వలని గర్వమును నిషేధించినది."

వ్యాఖ్య

ధనము వలని గర్వము గలవారికి రాధ యొక్క సాన్నిధ్యము సిద్ధముగాదు, అనగా అలభ్యము. గర్వము తొలగినచో మాత్రమే రాధ యొక్క దివ్యప్రేమస్థితి, దివ్యానంద మాధుర్యస్థితి లభించును. అహంకారము, ఆనందము – రెండును ఒకే సమయమున నుండుట పొసగదు. అహంకారము పనిచేయువారిలో పరమప్రేమకు స్థానము లేదు. అహంకారము పూర్తిగా తొలగినపుడే – అనగా శరణాగతి పూర్ణ మైనపుడే రాధాదేవి స్థితి కలుగును. రాధ యనుగ్రహము సూర్యరశ్మి వంటిది. సూర్యరశ్మి ఎల్లరి ఇండ్లలోను ఒకేరీతిగ ప్రవేశించును. కాని కిటికీలు, తలుపులు మూసినవారి ఇండ్లలోనికి జొరబడదు. దానికి బాధ్యులు ఇవి మూసినవారే గాని, సూర్యరశ్మి గాదు. అట్లే రాధాదేవి ఎల్లరి యెడల ఒకేరీతిగ కృపను ప్రసరింపజేయును. కాని ధనముచేత గాని, అధికారముచేత గాని, వంశముచేత గాని, పాండిత్యముచేత గాని గర్వించువారి హృదయ కవాటములు మూయబడుటచే, జగన్మాత యగు రాధాదేవి

యొక్క కృపాకిరణము వారిలోనికి ప్రసరింపదు. ధన గర్వ మేమాత్రము లేని గోపికలు, గోపాలకులు రాధాదేవి కృపకు పాత్రులై, శ్రీకృష్ణ సాన్నిధ్యము ననుభవించిరి.

22. తాత్పర్యము

"తనను స్తుతించుట యందు ఆసక్తిగల విశేషమయిన బుద్ధి గలవారును, దేవతలును గలది రాధ."

వ్యాఖ్య

సకల జగత్తుకు మూలమయినదియు, తమ పుట్టుకకు కారణమయినదియు నగు రాధాదేవిని స్తుతించుట దేవతలకు మిక్కిలి ఇష్టము. బ్రహ్మేంద్రాది దేవతలు శ్రీహరిలో భాగములే. పొరపాటున వారికి తమ యునికి వేరుగా గుర్తువచ్చునపుడు పతనము తప్పదు. బ్రహ్మయు, ఇంద్రుడును గర్వించి, భంగపడి, పశ్చాత్తాపపడిన సందర్భములు భాగవతమున వర్ణింపబడినవి. రాధాదేవి తన యునికియే గుర్తులేని భక్తురాలు. కృష్ణునికి, ఆమెకు భిన్నత్వము లేదు. రాధ కృష్ణుని యందెపుడును తన్మయురాలే. కావున దేవతలు రాధ యొక్క స్థితిని బొందుటకై ఆమె నెప్పుడును స్తుతించుట యందు ఆసక్తి గొనియుందురు. పంచభూతాధి దేవతలు, సూర్యచంద్రులు, ఇంద్రియాధి దేవతలకు వారు నిర్వర్తించు ధర్మములకు వలయు శక్తి రాధయే గదా. ఆమెను స్తుతించుట అమ్మ నర్చించుట. దేవతలు చేపట్టు క్రియాకలాపములు జీవులకు మేలుగూర్చును. జీవులలోని ప్రాణశక్తిగానున్న రాధ కివి స్తుతులగుచున్నవి. మరియు రాధను స్తుతించుచు, ఆమె వలె శరణాగతులైన వారు క్రమముగ తమ ఆధ్యాత్మిక పరిణామమున ఈ గ్రహమున ముక్తులై, శుక్రాది ఇతర గ్రహములందు ప్రవేశించి, క్రమముగ సూర్యకిరణములై దేవతలగుచున్నారని వేదపురాణములందు సూచింప బడినది. కనుకనే అన్నమయ్య 'స్తవ తత్పర విబుధా రాధా' యని వ్యత్యస్తములైన రెండర్థములలో ప్రయోగించెను. రాధను స్తుతించుటలో దేవతల కాసక్తి గలదని యొక యర్థము. రాధను స్తుతించుటలో ఆసక్తి గలవారు దేవతలగుదురని వేరొక యర్థము. మరియు విబుధు లనగా విశేషమయిన బుద్ధి గలవారనియు నర్థము. స్వంత తెలివితో ధర్మాధర్మములను నిర్ణయింపక, ప్రకృతిరూపములోని రాధాదేవి యొక్క సంకల్పముల ననుసరించి చరించువారన్నమాట. దేవతలిట్టివారే. వీరి కర్తవ్యములు వీరికి సహజములు. పశువులు గూడ నింతియే. పశువులు ఆకలి గొన్నపుడే భుజించును. నరునకు ప్రకృతి స్వేచ్ఛ నొసంగినది. సొంత నిర్ణయములతో నరుడు విషయసుఖములకు బానిసయై ప్రకృతిని ఉల్లంఘించుచున్నాడు. అట్లుగాక, మనలో అంతరాత్మగా నుండి, రాధాదేవి సంకల్పములను ప్రసరింపజేయుచుండగా వానిని స్వీకరించుచు, పాటించువారు విశేషమయిన బుద్ధి గలవారును, దేవతలును అగుచున్నారు. సాధారణ నరులది స్వయంబుద్ధి. రాధాదేవిని స్తుతించుచు, శరణాగతు లైన వారి బుద్ధి రాధయే. ఎవరు రాధాదేవిని స్తుతింతురో వారిని, ఆమెను గూర్చిన స్తుతి పవిత్రము చేయును. వారికి మంచిబుద్ధిని, దేవతాత్వమును ప్రసాదించును.

23. తాత్పర్యము

"ద్రవప్రవాహముగా చేయబడిన అమృతము గలది రాధ."

వ్యాఖ్య

ఇచట అమృత మనగా భగవంతుడగు కృష్ణుని యందలి దివ్యానురాగము, జీవుల యందు గల అపార వాత్సల్యము. ఈ ప్రేమ తరుగనిది. మొదలు లేనిది గావున చివర లేనిది. రాధ ప్రకృతిగా రూపొంది, తనలో అంతర్యామిగా నున్న శ్రీకృష్ణునితో నిరంతరము తీయని యనుబంధము గలిగియున్నది. ఇది లేకున్న సృష్టియే లేదు. ప్రళయమునందు దేవుడన్నను, ప్రేమయన్నను ఒకటే. వీరే రాధాకృష్ణులు. ఈ ప్రేమ మహాప్రవాహము. ఇదియే క్షీరసాగరము. సృష్టియందు దేవుని యొక్క ప్రేమ ఏర్పడును. ఇపుడును ఈ ప్రేమ తరుగని మహాప్రవాహమే. రాధకు కృష్ణుని యందు గల అనురాగము ద్రవరూపమైనది. కావున ప్రవాహమైనది. ప్రేమ యనునది ఒక జీవనది. అది ప్రేమించువారిని, ప్రేమింపబడువారిని తడిపి, స్నానము చేయించును. ప్రేమ యను నదీప్రవాహములో మునుకలెత్తిన వారి వ్యక్తిత్వములందు మంచుగడ్డల వలె కరగిపోవును. రాధాకృష్ణుల దివ్యానుబంధ మిట్టిది. కృష్ణుడు, రాధ ఒకరియందు ఒకరు కరగిపోయిరి. రాధ యొక్క ప్రేమ, జీవులపై వాత్సల్య ప్రవాహమైనది. వాననీరు, నదీజలాదులు ఆ తల్లియొక్క వాత్సల్య ప్రవాహములే. ఒక నది తాత్కాలిక ముగ ఎండినను, సర్వ నదులుగా దిగివచ్చిన రాధా వాత్సల్యము తరుగనిదిగనే యుండును. తప్పు చేసిన బిడ్డను అమ్మ క్షమించును. ఎల్లరికి అమ్మ యగు రాధ, ఎవరి తప్పునయినను క్షమించుట యుండదు. సహించును. వారిని క్రమముగా ఉత్తమ స్థితికి ఉద్ధరించును. క్షమించుటలో తప్పును గమనించుట యుండును. రాధకు అట్టి గమనింపే ఉండదు. ఆమె యెదయే ప్రేమామృత మహాప్రవాహమని అన్నమయ్య అందులోని మునుకలతో కీర్తించుచున్నాడు. అన్నమయ్య యొక్క ఈ స్తుతి, ప్రేమతత్త్వమునకు మనోహరభాష్యము. రాధ గోవులను, పక్షులను, గోపాలకు లను, గోపికలనే గాక, గిరిజనులగు చెంచితలను, బోయెతలను గూడ తన ప్రేమసుధా వర్షమున స్నానము చేయించినట్లు వ్యాసుడు వర్ణించెను. రాధాదేవి యొక్క ప్రేమామృతమే విష్ణువు దేవతలకు పంచిపెట్టినది. సద్గుణములు గలవారు దీనిని గ్రహించుటకు సిద్ధపడుదురు. ఈ ప్రవాహమే ఆకాశమందలి తారక లన్నిటికి మూల మయిన కాంతిప్రవాహమగు ఆకాశగంగగా రూపొందినదని పురాణప్రశస్తి. వేదము నందలి నీలాసూక్తమున రాధా మహిమ సూచింపబడినది.

24. తాత్పర్యము

"దావాగ్ని వంటి మన్మథుని బాధించగలది రాధ."

వ్యాఖ్య

మన్మథుడు భౌతిక శరీరాకర్షణను మనసులో పుట్టించి జీవులను కార్చిచ్చు వలె బాధించును. వారి స్వస్వరూపమగు దివ్యత్వమును దహించును. తాము ఆత్మ యనియు, దేవుని కిరణములనియు గుర్తుండక,

శరీరమను భ్రాంతికి లోనగునట్లు చేయును. రాధలో భౌతిక వాసన ఇసుమంతయు లేదు. అత్యంత నిర్మలమగు ఆత్మీయ ప్రేమమూర్తి యగు రాధను స్మరించినచో స్త్రీలు మగవారికి జగన్మాత యగు రాధగా దర్శన మొసంగుదురు. స్త్రీలకు మగవారు స్వామిగా కన్పడుదురు. ఇక భౌతిక వాసనకు తావుండదు. సాధన పక్వమగుచున్న కొలది స్త్రీ పురుష లెవ్వరికైనను హృదయము రాధవలె ఎల్లరికి అమ్మ యగును. ఇక కామమునకు చోటెక్కడ? రాధా స్మరణము దివ్యత్వమును తిరిగి బ్రతికించును. ఇట్లు ఎల్లరిని బాధించు మన్మథుని గూడ బాధింపగల శక్తి గలది రాధ. మన్మథుడు భౌతికసంబంధమగు కామమున కధిపతి. రాధ ఆత్మసంబంధి యగు దివ్యప్రేమకు అధిదేవత యని అన్నమయ్య భావము.

25. తాత్పర్యము

"యౌవనము ఎపుడును ముందుకు సాగునది రాధ."

వ్యాఖ్య

రాధ జీవితములో యౌవన మెప్పుడును ముందుకే సాగును. అనగా ఆమెకు నడిమి వయస్సు, ముసలితనము లేవు. ఆమె ఎల్లప్పుడు పదునారేండ్ల వయస్సుననే యుండునని రాధామానస తంత్రమున తెలుపబడినది. ఇట్లు ఆమె నిత్యయౌవనము గలది. ఈమె యొక్క ఈ నిత్యయౌవనము ఆమె యొక్క భౌతిక శరీరమునకు చెందినది గాదు. భౌతికమునకు అతీతమగు దివ్యతేజశ్శరీరమునకు చెందినది. ఆ దివ్యదేహము నిత్యయౌవనము గలది. నిత్యము పరమాత్ముని యెడల అనురాగము తోను, జీవుల యెడల వాత్సల్యముతోను కూడినది. ఇవి అనుభూతులే గాని, ద్రవ్యములు గావు గదా. కావుననే ఆమె యౌవనము ముందుకు సాగుటే గాని, తరుగుట యుండదని అన్నమయ్య కీర్తించెను.

26. తాత్పర్యము

"యౌవనములో నున్నవాడై, స్మరణ మాత్రముచేత నెలకొనువాని యుద్ధశక్తి రాధ."

వ్యాఖ్య

ఇచట స్మరు డనగా మన్మథుడని యర్థము గాదు. సామాన్యముగా మనసులో స్మరించగనే బలముగా ప్రవేశించి నెలకొనునది కామము. దీని కధిపతి మన్మథుడు. కాని ఇచట రాధకు సంబంధించి, ఆమె స్మరించునది కామమున కధిదేవత యగు మన్మథుని గాదు. ఆమె నిత్యము స్మరించునది శ్రీకృష్ణునే. కాన ఇచట రాధ విషయములో స్మరు డనగా కృష్ణుడే యని అన్నమయ్య భావము. మన మనస్సులను చిలుకునట్టి మన్మథుని మనస్సునే చిలుకు సామర్థ్యము గలవాడు మన్మథ మన్మథుడగు స్వామి. కావున స్వామిని మన్మథుని తండ్రి యని పేర్కొనుట జరిగినది. మనస్సు దేనిని స్మరించునో ఆ భావము క్రమముగా దృఢముగా నెలకొనును. కామమైనను అంతియే. భగవంతుడైనను అంతియే. ఏ వస్తువు నెడల, విషయము నెడల కోరిక కలుగుచున్నదో అవియు, ఏ వ్యక్తిపై శారీరకాకర్షణ యగు కామము కలుగుచున్నదో ఆ

వ్యక్తియు భగవంతుని స్వరూపములే యని శ్రద్ధతో స్మరించినచో, ఆ కోరిక, కామము వైదొలగును. ఆ వ్యక్తి శరీరములోని అణువణువులలో దాగియున్నది అంతర్యామి యగు స్వామియే. పై పాదమున రాధ యొక్క నిత్యయౌవనమును అన్నమయ్య కీర్తించెను. ఈ పాదమున ఆమెకు స్మరుడగు శ్రీకృష్ణుని నిత్యయౌవనమును కీర్తించెను. కృష్ణుడు గూడ నిత్యయౌవనము గల దివ్యతేజశ్శరీరము గలవాడని భాగవతమున గలదు. ఈ దేహము పంచభూతమయమగు ప్రకృతితో చేయబడినది గాదని శుకుడు సూచించెను. అన్నమయ్య పూర్వజన్మమున శ్రీకృష్ణుని ఈ దివ్యదేహ దర్శనము, స్పర్శ, సాంగత్యము, సాన్నిధ్యము ననుభవించియుండుటచే స్వామిని తరుణస్మరుడని కీర్తింపగలుగుచున్నాడు. కృష్ణుడు శరణాగతులగు వారి యంతశ్శత్రువు లగు కామక్రోధాదులను హరించుటకు 'రాధ'ను తన యుద్ధశక్తిగా ప్రయోగించును. రాధాదేవి కామక్రోధాదులు లేనిది. దివ్యప్రేమయే రాధగా రూపుదాల్చినది. కృష్ణ ప్రేమయే రాధ. అట్టి రాధను భక్తితో తలంపగనే అంతశ్శత్రువులు హరింపబడును. నిర్మలప్రేమతో నిండిన హృదయమున కామక్రోధములకు, అహంభావమునకు, అసూయకు, లోభమునకు తావు లేదు గదా. ఈ పవిత్ర బోధనే అన్నమయ్య ఈ పాదమున వెలయించుచున్నాడు. ఇక రాధ కృప లభించినవానికి స్వామి సన్నిధి యను అఖండానందము సిద్ధించుటలో వింత లేదు.

27. తాత్పర్యము

"చెట్టు, పశువు, మణి – వీని యొక్క గుణములను ధరించినదై, విస్తారముగా, బహువిధములుగా దానము చేయుట యందు ఆసక్తిగలది రాధ."

వ్యాఖ్య

ఇచట చెట్టు అనగా కల్పవృక్షము. పశు వనగా కామధేనువు. మణి యనగా చింతామణి. ఈ మూడును పాలకడలి యందు లక్ష్మీదేవితో బాటు ఉద్భవించినవని భాగవతమున వర్ణింపబడినది. ఈ మూడును అంతర్యామి నాశ్రయించిన వారికి వలసినవి ప్రసాదించునవి. ఈ మూటి గుణములు కూడ రాధలో గలవని అన్నమయ్య వర్ణించుచున్నాడు. అనగా రాధ నాశ్రయించిన చాలును. ఈ మూటిని వేరుగా నాశ్రయింప బనిలేదనమాట. రాధ ఈ గుణములతోడ విస్తారముగను, ఎన్నో విధములుగను తన ఆశ్రితులకు వలసినవి ప్రసాదించును. అనగా ఆమె సంకల్పించి నచో దేనినయినను, ఎంతగానయినను అనుగ్రహింపగలది. చింతామణి యనగా అంతర్యామి యగు స్వామిని గూర్చిన చింతనమను మణి. అనగా ఒకడు జీవుల హితమును గూర్చి చింతించుచో, ఆ చింతనయే రత్నమై అతనిలో ప్రకాశించి, అతని మనస్సును స్వామి యను వెలుగుతో నింపి ప్రకాశించును. ఇక ఇతరులకు ఆహ్లాదమును, హితమును గూర్చు మాటయే కామధేనువని వేదము నందలి సరస్వతీ సూక్తమున చెప్పబడినది. ఇతరులతో ఇట్టి తీయని మంచిమాటలు పలికినచో, అట్టివానికి కావలసినవి ఆ వాక్కే ప్రసాదించును. ఆవు పాలిచ్చును. మంచి తీయనిమాట పలుకువారికి, వినువారికి ఆహ్లాదమను పాల నొసంగును. వలసినవి గూడ క్షీరముగా

నందించును. "నోరు మంచిదైతే ఊరు మంచిదగును" అను తెలుగు సామెత కామధేనువును వర్ణించునదే. ఇక కల్పవృక్షమనగా నేమి? మనము శరీరముతో కల్పించు మంచిపనుల సముదాయము. ఇతరులకు మేలు గూర్చుట, తన వృత్తి ధర్మమును గూడ స్వామికి సేవగా అర్పించుటే కల్పవృక్షమై ఇట్టివానికి కావలసినవి సమకూర్చును. సమాజము విష్ణుని దేహము. దేహము నందలి ప్రతి భాగము, దేహము మొత్తము యొక్క బాగుకొరకై పనిచేయును. ఒక చేతికి దురద పుట్టినచో దానికది గీకుకొనలేదు. వేరొక చేయి గీకవలయును. అట్లే ప్రతి జీవియును మిగిలిన వారి హితమునకై పనిచేయునపుడే తనకు కావలసినవి గూడ సహజముగా నెరవేరును. ఇది ప్రకృతిధర్మము. భగవంతుని అమరిక. ఎవనికివాడే తన ప్రయోజనమునే కాంక్షించి పనిచేయుచో, అట్టి సమాజము రాచపుండుతో నశించును. ఇట్లు చింతామణి మనస్సుకు, కామధేనువు వాక్కుకు, కల్పవృక్షము చేతలకు సంబంధించిన సమాజ హితము కొరకైనవి. ఈ మూడును నిర్మలములగుటే త్రికరణశుద్ధి యనబడును. ఈ మూడే మనలో పనిచేయు మూడు పనిముట్లు. దేవుడు మనకు మనస్సును, వాక్కును, దేహమును సమాజ హితార్థ జీవనమునకై ప్రసాదించును. ఈ మూటి తర్వాత అమ్మవారు, ఆపై అమృతము వెలువడినవి. అనగా పవిత్ర మనస్సు, ఆహ్లాదకరమగు వాక్కు, లోకహితార్థ కర్మ చేయు దేహము గల జీవిలో స్వామి యొక్క దివ్యశోభ యగు లక్ష్మి, ఆనందమను అమృతము లభించును. ఇట్టి జీవితమే పాలకడలి. మరి అన్నమయ్య ఈ వరుసను ఏల చమత్కారముగా తలక్రిందులు గావించెను? అనగా శరీరముతో చేయు మంచిపనులు బాహ్యముగా కన్పడును. ఆపై మంచిమాటలు పలుకవలెను. మంచి తలంపులు కూడ కూర్పవలెను. రాధాదేవిలో కల్పవృక్షము, కామధేనువు, చింతామణి – ఈ మూటి యొక్క గుణములు గలవట. అనగా రాధాదేవి అనంతమగు నిర్మలప్రేమ సుధైకమూర్తి. ప్రేమయే గదా మంచి తలంపులకు, మంచిమాటలకు, మంచిపనులకు నేపథ్యమున నున్నది. కావున రాధను భక్తితో స్మరించినచో ఈ మూటి గుణములును మనల నావేశించునని అన్నమయ్య ఉపదేశము. (మంచిని కోరు మాట చాలదు. అవి తీయగా గూడ నుండవలెను.) రాధ ఆశ్రితులకు గావలసిన ఐహికములను నెరవేర్చును. ఆపదలను దాటించును. కామక్రోధములను తొలగించును. తన దివ్యగుణముల నొసంగును. భగవంతుని యందు ఆకర్షణను కల్గించును. ఆపైన అంతర్యామి యను సాగరప్రజ్ఞ యందు లీనమగు కైవల్యమును గూడ కరుణించును. ఇంతియే గాదు, తన హృదయమగు కృష్ణునే శరణాగతులకై ఈయగలిగిన ఔదార్యము గలది.

28. తాత్పర్యము

"దేవుని సంబంధమగు సుఖమును రాధ పరీక్షించును."

వ్యాఖ్య

భౌతిక సుఖములకు అంతమున్నది. అల్పత్వమున్నది. భగవంతునికి సంబంధించిన సుఖమునే ఆనందమందురు. ఇది అఖండము. అన్ని సుఖములు సుఖముల వలె గాన్పించునే గాని నిజమైన సుఖములు

గావు. నిజసుఖము దైవిక సుఖమే. ప్రతి మానవుడు సహజముగా దేవుని యంశయే గాన ఈ దైవిక సుఖమే ఇతని స్వస్వరూపము. దీని నుండి జీవులు దూరముగా జరుగుదురు. ప్రేమ పరిమితమయిన కొలది దివ్యానందము దూరమగును. ప్రేమ అపరిమితమయినచో, అది దివ్యమగును. దివ్యానందము కలుగును. సాధారణ సుఖములలో సుఖించువాడు, సుఖము నిచ్చునని భ్రమగొల్పు విషయము ఉండును. దైవిక సుఖములో ఆనందమే తానైన స్వామియే యుండును. మిగిలినవి ఉండవు. దేవుడెట్లు జీవులతో పరమప్రేమతో మెలగునో, జీవుడు గూడ తోటివారితో మెలగినచో దైవికసుఖము సిద్ధించును. ఇట్టి పరమప్రేమ యొక్క పూర్ణవికాసము కొరకై, మానవుడెంతయో సాధన చేయవలెను. దైవానుగ్రహము తోడు గావలెను. స్వామి యొక్క అనుగ్రహశక్తియే రాధ. కావున ఆయన సాధకులకు ఇచ్చిన దివ్యసుఖమును ఎంతగా అనుభవించుచున్నారో రాధ పరీక్షించును. అనగా వీరి యునికి, అంతర్యామిలో లీనమగు స్థితి వచ్చినదా, లేదా యని పరీక్షించి, చివరకు తన దయతో ఆ స్థితిని అనుగ్రహించును. మానవుని దేవునిగా – జీవుని అంతర్యామిగా వికాసము కలిగించు తల్లి రాధ. అమ్మయే గదా బిడ్డలను తండ్రి యొడికి చేర్చునది.

29. తాత్పర్యము

"తన యొక్క పేరు, కరగింపబడిన స్థితి గలది రాధ."

వ్యాఖ్య

అనగా రాధ నిరంతరము తన లోపల, వెలుపల కృష్ణునే దర్శించెను. అంతర్యామి యగు స్వామికే ఈమె తనను తాను అర్పించుకొన్నది. రాధ హృదయమంతయు కృష్ణుడే నిండెను. తాను రాధనను, ఒక జీవినను స్థితి మరపునకు వచ్చినవి. అంతర్యామి ప్రజ్ఞ యను సాగర జలమున ఈమె యొక్క ప్రత్యేక ప్రజ్ఞ మంచుగడ్డ నీటియందు వలె కరగినది.

30. తాత్పర్యము

"శ్రీవేంకటాద్రీశ్వరుడగు స్వామి యొక్క దయకు, ఆనందమునకు, వైభవములకు రాణి రాధ."

వ్యాఖ్య

స్వామి దయామూర్తి. ఆనందస్వరూపుడు. వైభవము గలవాడు. 'నాథ' యనగా న+అథ. ఇంతకంటె ఇక ఎవరు లేరు అని యర్థము. స్వామికి ఈ మూడు గుణము లుండుటకు రాధ తప్ప ఇంకెవరును కారణము గాదు. స్వామి యొక్క దయకు, ఆనందమునకు, వైభవమునకు రాణి రాధయే. ఈ మూడు సాత్త్విక గుణములు సృష్టికాధారభూతమైన రాధ యందు మొదట నెలకొనియున్నవి. కావున స్వామి మనకు దయను, ఆనందమును, వైభవమును ఇచ్చుటకు గాను ఆయనను గూడ ప్రేరేపించు శక్తి రాధయే. ఈ మూడును ఆమెయే, ఆయనయందు ప్రకటించినది. ఈ యంశము వేంకటేశ్వరునకు సంబంధించిన పురాణ గాథలలో తెలుపబడినది. రాధయే సీతాదేవిగ, స్వామి మూర్తికి వెనుక గల నీలకాంతి వలయముగ

రూపొంది నది. ఈ దర్శనమును అన్నమయ్యకు ఆమె కరుణించినది. వైభవమనగా భవమునకు – పుట్టుకకు అతీత స్థితి యనియు, విశేషమయిన భవమనియు నర్థములు గలవు. వేంకటేశ్వరస్వామి పుట్టలేదు. వెలసెను. ఆ వెలయుటయు విశేషమయిన విధమున, సంపూర్ణ కళలతో. ఇట్లు తిరుమలపైన స్వామి యొక్క ఉనికి విశిష్టమైనది. దీనికి కారణము 'రాధయే' అని అన్నమయ్య దర్శించుటతో ఈ దివ్య సంకీర్తనము రాధమ్మ నుండియే వెలువడినదని భావించవలెను. రాధ స్వామి యొక్క నీలవర్ణము మొత్తమునకు అధిదేవత. స్వామికన్న వేరు గాదు. వీరిర్వురిని అన్నిట దర్శించి సేవించువారలకును అపార దయ, ఆనందము, వైభవము అనగా పుట్టుట కతీతమయిన ఆత్మగా జీవించుటయు సిద్ధించును.

* * *

3

5వ సం-160 **అలమేలుమంగ** పాడి

అలమేలుమంగ నీవభినవరూపము
జలజాక్షు కన్నులకు చవులిచ్చేవమ్మా. ॥ పల్లవి ॥

గరుడాచలాధీశు ఘనవక్షమున నుండి
పరమానందసంభరితవై
నెరతనములు చూపి నిరంతరము నాథుని
హరుషించఁగఁ జేసితి గదమ్మా! ॥ అల ॥

శశికిరణములకు చలువల చూపులు
విశదముగా మీఁద వెదచల్లుచు
రసికత పెంపునఁ గరఁగించి యెప్పుడు నీ...
వశము చేసుకొంటి వల్లభునోయమ్మా. ॥ అల ॥

రట్టడి శ్రీవేంకటరాయనికి నీవు
పట్టపురాణివై పరఁగుచు
వట్టిమాఁకులిగిరించు వలపు మాటల విభు
జట్టిగొని ఉరమున సతమైతివమ్మా. ॥ అల ॥

అశాశ్వతములయిన ధనమును, గౌరవాన్ని, కీర్తిని, హోదాను
కోరుట అహంకారముతోడి మోహము.

టీక

చవులు = రుచులు, ఆనందము, నెరతనములు = నేర్పులు, రట్టడి= అధిపతి, జట్టిగొని = జగడమాడి, అలమేలుమంగ = అలరు మేలు మంగ.

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య జగన్మాత యగు అలమేలుమంగను స్తుతించుచున్నాడు. అమ్మ స్వామి అనుగ్రహ రూపమే కదా! అమ్మయే స్వామి ఒడిలోనికి కుమారుడగు భక్తుని చేర్చునది. కావున ఆమెను రామానుజులు 'పురుషకారము' అని కీర్తించిరి. అనగా పురుషునిగా – భగవంతుడుగా (జీవుని) చేయునది. అమ్మ ప్రకృతి. ఇచ్చట పురుషుడనగా మగవాడని అర్థము కాదు. వేదమునందు పురుషుడనగా పురమును – నివాసమును గోరువాడు. ప్రళయమునందు అఖండ చైతన్యమగు పురుషుడొక్కడే యుండును. ఆయనయందు సృష్టి కావలెనని సంకల్పము కలిగెను. ఆయన సంకల్పించలేదు. కల్గించుకొన్నచో మన వలెనే తన సంకల్పమునకు బద్ధుడై, అవి నెరవేరుటకై శ్రమించుచు, చికాకుపడు వాడయ్యెడివాడు. ఆయన యందు అది కలిగినది. అతని యనుమతితో సంకల్పము కల్గినదన్నమాట. ఆ సంకల్పశక్తియే అమ్మవారు. ఈమెతో స్వామి గూడుట వలననే లోకములు సృష్టి అగుచున్నవి. తిరిగి లయమగుచున్నవి. ఈమె వలననే జీవుడు, దేవునికన్న వేరుగాకున్నను, వేరుగా లేను అను భావము కలిగి వేరయినట్లు భాసించుచున్నాడు. కావున జీవులకీ శక్తి అమ్మ. స్వామి తండ్రి. అమ్మ తన బిడ్డలగు జీవులను తిరిగి తండ్రి వద్దకు ప్రేమతో చేర్చును. ఆమె తోడు లేనిదే జీవుడు దేనిని పొందజాలడు. ఈమెనే 'మాయ' అందురు. మాయ అనగా మోసము కాదు. లేనిదానిని ఉన్నట్లు భ్రమింపజేయు శక్తి. జగత్తు రూపమున, జీవుల రూపమున ఉన్నది దేవుడే అయినను వీరిని వేరుగా చూచునట్లు భ్రమింపజేయు శక్తి మాయ. మనకామె మాయ. దేవుడు మన వలె మాయాబద్ధుడు గాదు. మాయతో అతడు క్రీడించును. జీవులను సృజియించి, తనవద్దకు చేర్చుకొనును. జగత్తు అంతయు అతని యాట. కావున మనకేది మాయయో, స్వామికది లీల లేక క్రీడ. క్రొత్తగా వివాహమైన దంపతులలో సరసము గల భర్త, భార్యకు విధేయుడై ఆమెకు వలసిన పూలు, అలంకారములు తెచ్చును. అంతమాత్రమున అతడు భార్యకు బానిస అని అర్థము గాదు. సరసుడు, సహృదయుడని అర్థము. అట్లే స్వామి తన భార్య యగు ప్రకృతితో సరసముగా నాడుకొనుచున్నాడు. ప్రకృతితో గూడుట వలననే స్వామి కదలగలుగుచున్నాడు. అనగా సృష్టి వచ్చుచున్నది. లేకున్నచో ఎప్పుడును ప్రళయమే. సృష్టి స్థితి లయములు చేయునది, అనుగ్రహము చూపునది నిజముగా ప్రకృతిమాత. కాని ఒక ఇల్లాలు ఇతరుల నాదరించినను, ఆ మంచి పేరు యజమానికి వచ్చునట్లుగా, సృష్టి స్థితి లయ కారకుడుగా, అనుగ్రహించువాడుగా పురుషుడగు స్వామికి ఖ్యాతి దక్కుచున్నది. పురుషుడగు స్వామి నేపథ్యమున నిలువగా ప్రకృతి యగు అమ్మనుండియే పంచభూతాదులు, పంచేంద్రియాదులు, సౌరకుటుంబములు, నదీ పర్వతారణ్య సాగరములు, సకల జీవజాలము వచ్చుట, పరిణామము సాగుట జరుగుచున్నది. ఒకవైపు సృష్టి పరిణామము, వేరొకవైపు జీవ పరిణామమునకును ప్రకృతియే ఆధారము. ప్రకృతి పురుషుల క్రీడా నాటకరంగమే జగతి.

ఉదాహరణకు ప్రత్తి వంటివాడు పురుషుడు. నూలుపోగు వంటిది ప్రకృతి. చొక్కా వంటిది జగత్తు. మాయమగు ప్రకృతి పురుషునికన్న భిన్నము గాకున్నను, భిన్నమైనట్లు భాసించును. సూర్యునికి, సూర్యకాంతికి వంటి సంబంధమే వీరి నడుమ గలదు. దేవుని మాయా శక్తి యగు ప్రకృతి పురుషుని ఆకర్షించును, మోహింపజేయును. తనయందు పరవశత పొందునట్లు చేయును. ఇంతమాత్రమున పురుషుడు ఆమెకు బద్ధుడని కాదు. ఆమె యందు సరస ప్రేమతో ఆమె యొక్క ఆకర్షణను, మోహమును ఆనందించుచు, అనుమతించుట ఆయనకు క్రీడ. వాస్తవమునకు దేవుడు తానే ప్రేమ అయిన స్థితిలో నుండుటయే ప్రళయము. (ఇది ప్రథమా విభక్తి ప్రయోగము). దేవుని యొక్క ప్రేమ వెలికివచ్చి, సృష్టి సాగును. (ఇది షష్ఠీ విభక్తి). దేవుని ప్రేమయే అమ్మవారు. ఇక వేంకటేశ్వరుని, అమ్మవారగు అలమేలుమంగ ఎట్లు ఆకర్షించుచుండునో, ఆమె మహత్వ మెంతటిదో అన్నమయ్య సంకీర్తనలో అనుభవింతముగాక! అమ్మ ద్వార అతడు స్వామిని చేరదలచెను. ఇదియే సరియైన దారి.

పల్లవి యొక్క తాత్పర్యము

"అలమేలుమంగమ్మా! నీ రూపము ఎప్పటికప్పుడే రమ్యమై పద్మముల వంటి కనులు గల స్వామికి ఆనందము కలిగించునమ్మా!"

వ్యాఖ్య

అమ్మవారి దివ్యస్వరూపము యొక్క సౌందర్యము తరుగునది కాదు. పుట్టుక, గిట్టుక లేని ఆ తల్లి యొక్క సౌందర్యము ఎప్పటికప్పుడే రమ్యమైనది, ఆకర్షణ గలది. ప్రళయమునందును ఆ తల్లి స్వామియందు, పానకమునందు పటికబెల్లము వలె లీనమై యుండును. సృష్టిలో ఎప్పటికప్పుడే ప్రకృతి యను అమ్మ క్రొత్త అందమును కూర్చుకొనుచుండును. వాస్తవమునకు నదీ పర్వతాదులు, స్త్రీ పురుషులు మున్నగు వారి రూపములందలి సొబగంతయు అమ్మదే. ఆమె రాశీభూత సౌందర్యము. సౌందర్యమునకు మూలము. జీవులపై ఆమెకు గల మాతృప్రేమయే ప్రకృతిలోని అందముగా రూపొందుచున్నది. సృష్టిలో క్రొత్త క్రొత్త రూపము లేర్పడుచున్నవి. మార్పులు జరుగుచుండును. వీని అందమంతయు అమ్మదే. ఆ తల్లి ఏడుకొండల క్రింద వసియించుచుండును. స్వామి ఏడుకొండల పైన ఉన్నాడు. అయినను ఎల్లప్పుడును స్వామిని అమ్మ చూచుచునే యుండును. ఆమె కన్నులకు పూసికొన్న కాటుక, ఆమె చూపులలో గలిసి స్వామిని నల్లవానిని చేయుచున్నది. అమ్మ చూపులు కలిసినపుడే స్వామి పని చేయగల్గును. ప్రకృతి యొక్క తోడు లేనిది దేవుడు ఏమియు చేయలేడు. సప్త లోకములకు మూలము ఆమె. ఆవల స్వామి. జీవియందును మొదటి చక్రమగు మూలాధారమున కుండలినీ శక్తిగా అమ్మ నెలకొనియుండును. ఏడవదగు సహస్రారము స్వామి నివాసము. అమ్మ జీవిని స్వామి వద్దకు చేర్చును. ఏడుకొండల నెక్కి స్వామిని చూడ పయనించు ప్రతి భక్తునకు తోడుగా అమ్మ యుండి, స్వామి దరికి చేర్చును. అన్నమయ్యకును ఇది అనుభవమే. అమ్మ యొక్క దివ్య సౌందర్యము స్వామి కనులకు ఆహ్లాదము కల్గించుచుండును. సహజముగ గుణములు లేనివాడయినను,

అమ్మ చూపుల కాకర్షింపబడి స్వామి త్రిగుణములతో గూడి సృష్టి స్థితి లయములను చేయగల్గుచున్నాడని అన్నమయ్య భావము. స్వామి కనులు నీటి యందు పుట్టిన పద్మముల వంటివి. పద్మము రాత్రిపూట ముడుచుకొని, సూర్యోదయ ముతో వికసింపసాగును. అట్లే విశ్వమను పద్మము స్వామి కనులలో ముందు దాగి యుండి, ఆపై క్రమముగ వికాసమునందును. ఇంకను నీటియందు పుట్టినవి చేపలు. జ్యోతిశ్శాస్త్రమున చేపలు మీనరాశికి సంకేతము. స్వామి దేహము రాశిచక్రము. మీనరాశి ఆయన కనులు. చేపలకు ఱెప్పపాటుండదు. అట్లే స్వామి కనులకును. ఆయన కనులు మూసిన ప్రళయమే. ఎప్పుడును సగము తెరచుకొని యుండును. అనగా ఒకే సమయమున కొన్ని సౌర కుటుంబములు చోటులో లీనమగుచుండగా, కొన్ని క్రొత్తవి పుట్టుచుండును. జగత్తు మొత్తము ఒకేసారి అంతమొందదు. మీనరాశి పరమప్రేమకు ప్రతీక. కావున స్వామి జలజాక్షు డనుటలో పరమప్రేమతోడి చూపులు గలవాడు స్వామి యని అన్నమయ్య భావము. ఇతడు జ్యోతిశ్శాస్త్ర పారీణుడు. ఆ శాస్త్రమును స్వామిని సంకీర్తన గావించుకొనుటకై వాడుకొనెను.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"తిరుమల ఏడు కొండలతో గూడియున్నది. దానిలో ఒకటి గరుడాద్రి. గరుత్మంతుడే ఆ కొండగా అవతరింపగా, స్వామి దానిపై నిలిచెను. అట్టి స్వామి విశాల హృదయ మున అమ్మ ఉండి పరమానందముతో నిండియున్నది. తన నేర్పులు చూపి, క్షణము సందులేకుండ, తన భర్తకు ఆనందమును కల్గించుచున్నది."

వ్యాఖ్య

స్వామి హృదయము ఉదారమయినది. అందు శ్రీదేవి నిత్యము నిలిచియుండును. వాస్తవముగా స్వామి హృదయమే మంగమ్మ. హృదయమనగా భౌతికమయిన గుండె కాదు. ప్రేమకు స్థానము. వేంకటేశ్వరునికి జీవులపై గల ప్రేమయే అమ్మవారు. మనము కూడ ఎవరయిన ఇష్టులయిన వారు కన్పడినప్పుడు ప్రేమతో గుండెపై చేయి వేసికొందుము. తలమీద కాదు. స్వామి ప్రేమ వలననే ఎల్లరకు శ్వాస, గుండె ఆడుట, ఆకలి, దప్పిక, నిద్ర ఏర్పడుచున్నవి. ఇవి ఎల్లరకును సమానములే. కావున స్వామి ప్రేమ ఎల్లరకు సమానమే. ఆ ప్రేమయే అమ్మవారు. ఇందులో అన్నమయ్య సందేశ మిట్లున్నది. మనము అందరిలో ప్రేమగా నున్న అమ్మవారిని, స్వామిని చూడవలెను. మనము కూడ అట్టి ప్రేమను పొందుటయే వారిని చేరుటకు మార్గము. ప్రేమ లేకుండ ఏ సాధన మయినను వృథా. భగవానుడు ఊహింపనలవిగాని శ్రేష్ఠ మయిన ఆనందము స్వరూపమైనవాడు. ఆయన హృదయమే తానయిన అమ్మవారు కూడ అట్టి ఆనందముతో నిండినది. ఇట్లు చెప్పుటలో అన్నమయ్య భావమేమనగా జీవులపైని మాతృప్రేమను నెరపుటయే భగవదానందమునకు కారణమగుచున్నది. అమ్మవారు చాల నేర్పులు గలది. తన సద్గుణములు, పవిత్ర ప్రేమ – ఇవియే ఆమె నేర్పులు. ప్రకృతి అమ్మవారే కదా! సాగరఘోష, నదీప్రవాహముల జలజల, సెలయేళ్ళ గలగల, గ్రహ తారకాదుల గమగమ, నేలతల్లి ఇచ్చు పంట అంతయు స్వామిని గూర్చిన సామ సంకీర్తనమే గదా! ఇదియంతయు అమ్మవారి నేర్పు. తమ బిడ్డలయిన జీవులపై ప్రకృతిమాత నెరపు

దయయే. దేవునకు సంతోషము కల్గించు అమ్మవారి నేర్పు. నాథుడనగా ఇక ఇతడు గాక తనకు వేరు లేదని భావము. అమ్మవారికి అయ్యవారు గాక వేరు ఆశ్రయ మెవ్వరు? స్వామిని ఎల్లప్పుడు ఆశ్రయించియుండుట చేతనే ఆమెకు శ్రీదేవి అని పేరు వచ్చినది. ఎల్లప్పుడును భర్తకు ఆమె ఆనందమును కల్గించుచున్నది. ఆమెకు గల ప్రేమ, కరుణలకు స్వామి మురిసిపోవుచుండును. ఇంతకును అమ్మవారి ఆనందము స్వామి. స్వామి ఆనందము అమ్మవారు. వీరిర్వురు ఒకరి నుండి వేరొకరు ఏమియు కోరుటలేదు. సీతారాముల అనుబంధమిట్టిది. వీరిలో ఒకరి సాన్నిధ్యమే అవతలివారి ఆనందము. అట్లే మంగాంబా వేంకటేశ్వరుల దాంపత్యము. ఇది మానవ దంపతుల కాదర్శము. మనము కూడ అమ్మవారితో తాదాత్మ్యము నంది, తోటివారిపై అమ్మ ప్రేమ కలిగి భగవదానందమును పొంద వలెను. మరియు మన ప్రేమ వలన తోటి జీవులు ఆనందింపవలెను. అపుడు వారి రూపమున దేవుడే ఆనందించును. తోటివారి ఆనందమును గూర్చుటయే మన యానందమునకు కారణమని ఈ చరణమున అన్నమయ్య ఉపదేశ సారము.

2వ చరణము యొక్క తాత్పర్యము

"చంద్రుని కిరణములకు సరిపోవు చల్లని చూపులు విస్తారముగా స్వామి మీద వెదజల్లుచు, భర్తయెడల అధికమగు సరసప్రేమతో ఆయననే కరగించి, నీ భర్తను ఎప్పుడును వశము చేసికొంటివిగదమ్మా!"

వ్యాఖ్య

అమ్మవారి కనులు సూర్యచంద్రులని వేద పురాణములలో చెప్పబడినది. కుడి కన్ను సూర్యుడు, ఎడమ కన్ను చంద్రుడు. ఒక కంటి చూపు వేడిమికి, జ్ఞానమునకు ప్రతీక. రెండవ కంటి చూపు చల్లదనమునకు, ప్రసన్నతకు, సరసప్రేమకు ప్రతీక. అమ్మవారిపుడు తన ఎడమ కంటి నుండి వెలువడు చల్లని చూపులను పెంపుగా, విరామము లేకుండ తన భర్తపై వెదజల్లుచున్నది. స్వామి సూర్యాంతర్వర్తి. అమ్మవారి చూపులతో సూర్యుని వేడిమి తగ్గి, చంద్రుని చల్లదనముగా ప్రతిఫలించుచున్నది. సూర్యుని వేడిమి అట్లేయున్నచో భూమి దహించుకొనిపోవును. ఇచట స్వామిని తన చల్లని చూపులతో, రసికత అనగా ప్రేమరసము ఆ చూపులలో నింపుచు, కరగించినవి. ఇచట రసికత అనగా బాహ్యకామమని భావింపరాదు. రసికత అనగా రసముతో కూడిన హృదయానుభవము. అది నిర్మలప్రేమయే. దీనికి దేవుడు కూడ కరగును, వశమగును. వేదములలో చెప్పబడినట్లుగా దేవుడు గుణాతీతుడు గావున జడుడని భావింపరాదు. దేవుడు సరసగుణ సంపన్నుడు. రసము, ఆనందమే, ప్రేమయే దేవుడు.

సూర్యునిలోని వేడిమి భూమి కెంతవరకు ఆవశ్యకమో అంతవరకే అందుచున్నది. ఇట్లు అందునట్లు చేయుచున్నది అమ్మవారు. జ్యోతిశ్శాస్త్రమున సూర్యుడు తండ్రిగను, చంద్రుడు తల్లిగను చెప్పబడెను. ఒకని జాతకమున తండ్రిని గూర్చి తెలియవలెనన్నచో సూర్యుని స్థితిని, తల్లిని గూర్చి తెలియవలెనన్నచో చంద్రుని స్థితిని గమనింపవలెను. విశిష్టాద్వైతమున చమత్కారముగా ఇదియే ఇట్లు చెప్పబడినది. సూర్యాంతర్వర్తి యగు నారాయణుడు నిగ్రహానుగ్రహ సమర్థుడు. భగవంతునికి దయతో బాటు కర్మఫలముల నిచ్చు

లక్షణమున్నది. కాని చంద్రుని వంటి చల్లని వెన్నెల చూపులు గల అమ్మవారిలో అనుగ్రహ మొక్కటియే గలదు. కావున రామానుజులు సద్గురువును అమ్మవారితో పోల్చిరి. సద్గురుడు దయనే నెరపును. భక్తుని కొరకు భగవంతునికి సద్గురువు అమ్మవారి వలెనే సిఫార్సు చేయును. కావున ఇపుడు ఈ చరణమున అన్నమయ్య భావమేమనగా అమ్మవారు స్వామివారిని తన చలువ చూపులతో కరగించి, తన ప్రేమతో ఆయనను వశము చేసికొని, ఆయన శక్తిని చల్లదనముగా తీర్చిదిద్ది అపార వాత్సల్యముగా జీవుల కందించుచున్నది. కావున ముందుగా మనము అమ్మవారిని ఆశ్రయింప వలెను. అపుడే స్వామివారి ఆశ్రయము మనకు లభించును. అమ్మవారి నాశ్రయించు విధానమెట్టిది? శ్రీసూక్తమును, లక్ష్మీదేవి స్తోత్రములను మున్నగు దేవీ స్తోత్రములను పారాయణము చేయుటయేనా? ఎల్లరు స్త్రీలలో అమ్మవారి తత్త్వము నిలిచియున్నది గదా! ఆధ్యాత్మిక కక్ష్యలో ప్రకృతి పురుషుల కలయిక వలన జీవు లేర్పడుచున్నారు. అట్లే భౌతిక కక్ష్యలో దంపతుల శారీరకమగు కలయిక వలన జీవుల శరీరము లేర్పడుచున్నవి. కాని దానికి ముందు దంపతుల నడుమ, ప్రకృతి పురుషుల నడుమ వలెనే ఆత్మీయానుబంధ మేర్పడవలెను. అపుడే సత్సంతతి కలుగును. ప్రకృతిగా జీవులపై అమ్మవారు వాత్సల్యము కురియించుచున్నది. స్త్రీలును తమ సంతతికి స్తన్యమొసగి, వాత్సల్యమును గురియుచున్నారు. తల్లి వాత్సల్యమే స్తన్యముగా వ్యక్తమగు చున్నది. తల్లులు పిల్లల మాలిన్యమును తొలగించుచున్నారు. అమ్మవారి సహనము స్త్రీలయందు రూపొందుచున్నది. కావున ప్రకృతి నంతటిని, ఎల్లరు స్త్రీలను అమ్మవారిగా నారాధించుటయే అమ్మవారి నాశ్రయించుట. క్రమముగా ఇట్టి భక్తుని హృదయమే అమ్మవారితో తాదాత్మ్యము నొందును. ఏది సదా మనస్సు భావించునో, అదియే యగును గదా! అపుడు ఇట్టి భక్తుడు ఎల్లరు జీవులకు అమ్మ యగును. వారిని బిడ్డలుగా భావించి మాతృ వాత్సల్యమును గురియును. నిజమయిన మాతృప్రేమలో తనచే ప్రేమింపబడువారు తన అజమాయిషీ క్రింద ఉండవలెననియు, తన ప్రేమను గుర్తింపవలెననియు ఆరాటముండదు. గుర్తింపును కోరిన వారు దానినే ప్రేమించినట్లు గదా! కావున పైవిధముగా జగన్మాతృత్వము నందుటే శ్రీవిద్యోపాసనము. పై స్తోత్రములు శ్రద్ధతో పఠించిన ఈ స్థితికి దోహదము చేయుట మాత్రమే జరుగును. ఇపుడు భక్తుని హృదయమే అమ్మవారగుటచే, స్వామికి ప్రియమైన భార్య యగును. ఇదియే మధుర భక్తి. ఆపై స్వామి అనుభూతిలో కరగును. ఇదియే బ్రహ్మవిద్యా పరమార్థము. శ్రీవిద్య లేనిది బ్రహ్మవిద్య లేదు. అమ్మవారు కాకున్నచో భక్తుడు భగవంతుడు కాలేడు. ఇట్లు ఈ చరణమున నాలుగు సోపానములు తెలుపబడినవి. 1. స్త్రీలను, ప్రకృతిని అమ్మవారుగా ఆరాధించుట. 2. తానే అమ్మ యగుట. ఆదిశంకరులు దీని నుద్బోధించిరి. 3. జీవులెల్లరిలో దేవుని దర్శించి సేవించుట. 4. తానే దేవుడే యగుట. భగవత్సాక్షాత్కారమనగా నిదియే. భక్తుడు భగవంతుడే యగుట అనగా నేమి? భగవంతుడు అంతర్యామి. భక్తుడును అంతర్యామి యగుటయే. ఇది ఎట్లు సాధ్యము? భగవంతుడు అఖండ ప్రేమరసమూర్తి. స్వామికి జీవులపై గల ప్రేమ, భక్తుడును పొంది ప్రేమగా ఎల్లరిలోకి వ్యాపించి అంతర్యామి యగును. ఇదియే భాగవత సారము. రామాయణమున సీత యొక్క అనుగ్రహము పొందిన తర్వాతనే హనుమంతుడు శ్రీరాముని

కౌగిలిలో కరగిపోవుట దీనికి సంకేతము. అన్నమయ్య సందేశ సారమిది. మనము జీవులకు అమ్మ అయి, వారిని ప్రేమించినపుడే దేవుడు మనకు తన యనుభూతి నొసంగును.

3వ చరణము యొక్క తాత్పర్యము

"అమ్మా! సమస్త లోకములకు ప్రభువగు శ్రీవేంకటేశ్వరునికి నీవు పట్టపురాణివై వెలుగుచు చెట్టుకు క్రొత్త క్రొత్త మారాకులను చిగురింపజేయు మాటలతో నీ భర్త యగు స్వామిని జయించి, ఆయన హృదయమున నిరతము నిలిచియున్నావు."

వ్యాఖ్య

శ్రీవేంకటేశ్వరుడు మనలోను, జగత్తులోను అన్ని లోకములలోను అంతర్యామి గావున ప్రభువు. ఆతనికి శ్రీదేవి, భూదేవి యను ఇద్దరు సతులు గలరు. అయినను శ్రీదేవియే పట్టపురాణి. స్వామి కిచట పక్షపాతమున్నదని యర్థము కాదు. భూదేవి మనకు కన్పడు జగత్తుగా రూపొందిన ప్రకృతి. శ్రీదేవి దీనికాధారమయిన స్వామి యొక్క ప్రేమ, సంకల్పము, శక్తి, గుణ వైభవములు తానైనది. స్వామి గుణము శ్రీదేవి. స్వామి రూపము భూదేవి. గుణమయిన శ్రీదేవి పట్టపురాణి. శ్రీదేవియే భూదేవిగా మార్పునొందినది. స్వామి గుణమగు ప్రేమయే జగత్తుగా రూపొందినది. అమ్మవారి ప్రేమపు మాటలు, స్వామితో తన అనుబంధమను చెట్టుకు క్రొత్తవగు మారాకులు తొడిగించునవి. అనగా అనుబంధమును ఎప్పటికప్పుడు క్రొత్తదిగా దృఢపరచుచుండును. మనము కూడ మాతృప్రేమపు పలుకులతో జీవులకు ఆహ్లాదము కలిగించినచో వారిలోని అంతర్యామి యగు స్వామికి సంతసము కలుగును. వ్యక్తికి, సమాజమునకు అనుబంధము దృఢమగును. చేతలే గాక, మాటలు కూడ తీయగా, తేనెసోనలుగా నుండవలెను. మన మెవరినయిన నిందించి, బాధించినచో ఆ కర్మఫల మనుభవింపక తప్పదు. ప్రేమపు పలుకులతో అలరించినచో మనకు కావలసినవి స్వామి నెరవేర్చును. కావున తీయని వాక్కును వేదములో 'కామధేనువ'ని పేర్కొనిరి. గోవుకు వాక్కు అను అర్థము గలదు. ఆవు పాల నిచ్చునట్లు, ప్రేమపు పలుకు తనకు, వినువారికి ఆహ్లాదమును ఇచ్చును. ఇతరుల ఆహ్లాదమే నిజముగా తన యాహ్లాదము. ఆనందము నొసగు వాక్కునే 'నంది' యందురు. నందివాహనుడు శివుడు. అనగా ఆనందము కల్గించు పలుకుల నధిష్ఠించి దేవుడుండును. ప్రేమపు మాటలతో అమ్మవారు స్వామినే జయించినది. అతని హృదయమున నిరతము నిలిచియున్నది. అట్లే మనము ఆహ్లాదము నొసగు తీయని మాటలతో జీవులుగా నున్న స్వామిని ఆకట్టుకొని, ఆయన హృదయమున సదా స్థానము గొనవచ్చును. అన్నమయ్య ఇట్లు అమ్మవారి నాశ్రయించి, తాను అమ్మయై, తోటి జీవులను తన తేనెవాకల వాక్కులతో అలరించి స్వామి యెదయైనాడనియు, ఈ సంకీర్తన అతని సాధనకు, అనుభూతికి అద్దము పట్టుచున్నదనియు, మన కాదర్శమై నిలిచినదనియు గ్రహింపవలెను. దీనిని పాడుటయు, వినుటయు మనకును అన్నమయ్య స్థితినే ప్రసాదించును. తన ప్రేమతో, తీయని పలుకులతో భర్త యగు స్వామి

యెదను కట్టివేసి, ఆయన హృదయము తానే అయిన ఉదాహరణముగా 'సీతాదేవి'ని గుర్తింపవలెను. సీతకు ఆనందము రాముడే. రాముని ఆనందము సీతయే. ఇంకేమియు గాదు. మంగాంబా వేంకటేశ్వరుల నెపమున ఈ సంకీర్తనమున సీతారాముల అనురాగ మయమగు అనుబంధము దాగియున్నది. వేదర్షులు, వాల్మీకి, కాళిదాసులు తీయని వాక్కును అమ్మవారుగను, అందు దాగిన తీయని భావమును అయ్యవారుగను అభివర్ణించిరి. ఈ సంకీర్తనమున అన్నమయ్య మంగాంబికకు భర్తపై గల ప్రేమను వర్ణించినట్లు కన్పడినను, వ్యక్తి, సమాజముల సత్సంబంధములను వ్యంగ్యముగా స్థాపించెను.

* * *

4

2వ సం-167 **అనరాదు వినరాదు** దేసాక్షి

అనరాదు వినరాదు ఆతని మాయలు నేఁడు
దినదిన క్రొత్తలాయ దృష్ట మిదే మాకు. ॥ పల్లవి ॥

ఆడెడి బాలుల హరి అంగిలి చూపుమని
తోడనే వాండ్లనోర దుమ్ములు చల్లి
యీడ మాతోఁ జెప్పఁగాను యిందరముఁ గూడి పోయి
చూడఁబోతే పంచదారై చోద్యమాయనమ్మా. ॥ అన ॥

తీఁటతీగెలు సొమ్మంటా దేహము నిండాఁ గట్టి
తీఁటకుఁ గాక బాలులు తెగి వాపోఁగా
పాటించి యీసుద్ది విని పారితెంచి చూచితేను
కోటికోటి సొమ్ములాయ కొత్తలోయమ్మా. ॥ అన ॥

కాకిజున్ను జున్నులంటా గంపెఁడేసి తినిపించి
వాకొలిపి బాలులెల్ల వాపోవఁగా
ఆకడ శ్రీవేంకటేశుఁ డాబాలుల కంటినీరు
జోకగ ముత్యాలు సేసెఁ జూడఁగానే నేము. ॥ అన ॥

ప్రవర్తనతో ప్రమేయము లేని దీర్ఘాయుస్సు వ్యర్థము.
సత్ప్రవర్తనతోడి ఆయుర్దాయమే జీవితము.

టీక

దృష్టము = దర్శింపబడినది; కాకిజున్ను = కాకి ఎంగిలి జున్ను; ఆకడ = ఆ తర్వాత, ఆవైపుగా; వాకొలిపి = ఏడ్పించి; జోకగ = అందముగా.

పరిచయము

ఈ సంకీర్తనమున శ్రీవేంకటేశ్వరస్వామి బాలగోపాలకృష్ణ రూపమున తోటి బాలురతో ఆడిన ఆటలను అన్నమయ్య వర్ణించుచున్నాడు. బాలకృష్ణు డాడిన ఆటలలో తాను కూడ ఒక గోపాలబాలుడై పాల్గొనిన అనుభూతి నందెను. ఆహా ఎంతటి ధన్యుడు అన్నమయ్య! శ్రీకృష్ణుడు తన అవతారమున గోకులమునందు గోపబాలురతో ఆడిన ఆటలను అన్నమయ్యకు దర్శింపజేసెను. అంతేగాక అన్నమయ్యను గూడ భాగస్వామిని జేసెను. ఇతనిపై స్వామి అనుగ్రహమట్టిది. శ్రీవేంకటేశ్వరుని బాలుడుగ అన్నమయ్య చూచె ననుటకన్న, స్వామియే అట్లు ఇతనికి దర్శనమిచ్చె ననుట సరి యైనది. ఈ కీర్తనలోని దృశ్యములు అన్నమయ్య భావవీథులలో విహరించిన ఊహలు గావు. అతనికి స్వామి కరుణించిన వాస్తవ దృశ్యములు. అన్నమయ్యకు దివ్యదృష్టి నొసగి, అతని నొక యోగస్థితికి గొనితెచ్చి, అతనికి స్వామి ఈ దివ్యదృశ్యములను గానిపింపజేసెను. అన్నమయ్య కూడ స్వామి దయ వలన ఒక గోపబాలు డయ్యెను. గోకులవాసులగు గోపాలబాలురకు పట్టిన మహాభాగ్యము ఇతనికి పట్టినది. గోప బాలుర వలెనే స్వచ్ఛ సరళమైన శిశు హృదయము కలవాడు గదా. ఒకవిధముగా సఖ్యభక్తికి పరాకాష్ఠను ఈ సంకీర్తన నిరూపించుచున్నది. ఇట్లే లీలాశుకునకు కూడ కృష్ణుడు తన బాల్యలీలలను చూపించినట్లు శ్రీకృష్ణకర్ణామృతమున తెలియనగును. కృష్ణునితో అన్నమయ్యకు పూర్వజన్మానుబంధము తప్పక గలదు. ఇక బాలకృష్ణుని ఆటలలో మనమును పాల్గొన్న అనుభూతి ఈ సంకీర్తన ప్రసాదింపగలదు. ఈ యనుభూతిని మనకు కరుణతో పంచిపెట్టవలయునని అన్నమయ్య దలంచెను. ఇదియే నిజమైన కరుణ.

పల్లవి యొక్క తాత్పర్యము

"ఈ దినమున స్వామి మాయలు అనరాదు, వినరాదు. ఆతని మాయలు దిన దినమునకు మాచే ఎప్పటికప్పుడే క్రొత్తవిగా దర్శింపబడుచున్నవి."

వ్యాఖ్య

అనరాదు, వినరాదు అనగా హేయమైనవని అర్థము గాదు. ఊహింపలేనివి. వర్ణింపలేనివి. ఎంత వినుచున్నను వినుట సాధ్యము కాదు. అనుటకు, వినుటకు భక్తుల వలన గాదు. ఏల? అపుడు ఆనందసాగరమున మునుగుట జరుగును. అనువారు, వినువారు ఉండరు. వారి దేహములు మాత్రమే ఉండును. ఏ దినమున కాదినమే క్రొత్త క్రొత్తగా స్వామి మాయలు దర్శింపబడుచున్నవి. అనగా ఈతడు దర్శించుటలేదు. అవియే స్వామి దయ వలన కానవచ్చుచున్నవి. మాయలనగా వంచనలని కాదు. పైకి చూచినచో అల్లరి వలె కన్పడినను, నిజముగా దివ్యార్థములు గలవి. అనుభూతిని కలిగించునవి అని

అర్థము. స్వామి మాయ లెంత క్రొత్తవో, అవి కల్గించు అనుభూతులు కూడ ఎప్పటికప్పుడు క్రొత్తవే. కావుననే వీనిని నవ్యము లందురు. నవములు కాదు. ప్రతిదినము భోజనము చేయుచున్నను, ఎప్పటి రుచి యొక్క అనుభవమప్పటిదే. భోజనము విషయముననే దినదినమునకు క్రొత్త రుచులు కలుగు చుండగా స్వామి చూపించు దివ్య లీలాదృశ్యముల వలన కలుగు అనుభూతి లెంత క్రొత్తక్రొత్తగా నుండును? అనుభూతిస్వరూపుడయిన స్వామి ఆ అనుభూతిలో భక్తుని ముంచుట వలన భక్తుడు వానిని గూర్చి అనుటకు, వినుటకు అశక్తుడగును. ఏలనన అనువాడు, అనుట ఉండదు. వినుటలో కూడ ఇంతియే. అన్నమయ్య స్వయముగా స్వామి ఆటలను గూర్చి పొందిన అనుభూతి ఇట్టిది.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"హరి తనతో ఆడుకొనుచున్న బాలురను ఒకసారి అంగిలి చూపుడని యడిగెను. వారు నోరులు తెఱచిన వెంటనే అందు దుమ్ము చల్లెను. ఆ బాలురు వచ్చి ఇక్కడ నాతోను, ఇంకను కొందరు బాలురతోను చెప్పగా అందరము కలసి పోయి ఆ బాలుర నోళ్లను తెఱపించి చూడగా దుమ్ము పంచదారైనది. ఇది ఆశ్చర్యమాయనమ్మా!"

వ్యాఖ్య

అన్నమయ్య 'అమ్మా' అని తన సంకీర్తన వినువారలను, చదువువారలను ప్రీతితో సంబోధించెను. అన్నమయ్యతో కలిసి ఇంకను కొందరు, శ్రీకృష్ణుడు దుమ్ము చల్లిన బాలుర వద్దకు వెళ్లిరి. వీరు అన్నమయ్య యొక్క మిత్రులయిన తోటి భక్తులు. ఈ దృశ్యమంతయు అతనికి స్వామి అనుగ్రహించిన దివ్యదర్శనానుభూతి. భౌతిక కక్ష్యకు సంబంధించినది గాదు. బాలకృష్ణుని ఆటలు భాగవతమున ఎన్నియో వర్ణింపబడినవి. వానిలో ఇవి లేవు. కాని అన్నమయ్యకు కనిపించుకొన్న దివ్యదృశ్యములు గావున ఇవియు ప్రామాణికములే. బాలకృష్ణునకు తోటివారిని ఏడ్పించి, ఆపై నవ్వించుట ఒక ఆట. భగవంతుని స్పర్శనందిన దుమ్ము అయినను పంచదారయే అగుననుటలో వింత లేదు. దుమ్ము, పంచదార – రెండును తన రూపములే కదా. ఇతర బాలురకు దుమ్ము అందించుట యేమి? తానే ఒకసారి మన్ను తినెను గదా. విశ్వరూపదర్శనము దాక ఆ ఘట్టము చేరినది. ఇచట దుమ్ము అనగా విశ్వమున గల భౌతిక కక్ష్యలోని పదార్థము. పంచభూతములలో చివరిదయిన పృథివి అనగా ఘనపదార్థ స్థితి. ఇది ప్రపంచమున కన్పడునట్టిది. జీవుల శరీరములు కూడ ఈ దుమ్ము నందలి పదార్థముతోనే చేయబడుచున్నవి. తిరిగి దుమ్ములోనికే అంతమగుచున్నవి. కొందరు వేదాంతము పేర, కన్పడుచున్న జగత్తును, దేహములను నిర్లక్ష్యము చేయుట పరిపాటి. కొందరు తమ దేహములను గూడ ఉపవాసములకు గురిచేసి, క్షీణింప చేయుదురు. ధర్మమును, దైవమును చింతించుట చాలదు. తోటివారి రూపములలోని దైవమునకు సేవ చేయవలెనన్న, వారి శరీరములకును చేయవలెను. అందుకుగాను, తన శరీరమును ఉపయోగపెట్టవలెను. ఉదాహరణకు ఆకలి గొన్నవానికి మానసికముగా అన్నము పెట్టినను, అన్నపు ఫోటో చూపెట్టినను ఆకలి తీరదు. అన్నము పెట్టుట తప్ప వేరు దారి లేదు. పోనీ అవతలివాని ఆకలితో తనకేమి పని, అవతలివాని

కర్మఫలములో వ్రేలు పెట్టనని తప్పించుకొనువారలకు తమ ఆకలికైనను అన్నము భుజింపక తప్పదు. అట్లే, ఇతరుల ఆకలిని తీర్చవలెను. తమ ఆకలిని కొందరు తీర్చుచున్నారు. ప్రకృతి, భౌతిక స్థాయిలో గూడ పరస్పర ప్రేమ వలననే జీవజాతి బ్రతుకునట్లు అమర్చినది. వృక్షపదార్థములు మన కాహార మగుచున్నవి. జంతువులగు ఆవు, ఎద్దు పాడిపంటలను ఇచ్చుచున్నవి. కర్షకులు ఆహారమును పండించుచున్నారు. ఇందరి సాయము లేనిది, ఎవడి ఆకలియు తీరదు. ఇందులో ఒక విచిత్రమున్నది. ఒకడు తన శరీరముతో, ధనముతో, పదార్థములతో తోటివారి దేహములకు సేవ చేసినను కలుగునది మహాతృప్తి. ఇదియే బ్రహ్మానందము. ఆకలి రూపమున నున్నది, స్వామియే కదా. కనుక మెలగునది శరీర సేవతో, కాని కల్గునది ఆత్మానందము. ఇదియే బాలకృష్ణు డిచ్చిన పంచదార. కృష్ణు డీఉపదేశమును తన ఆటగా మన కుపదేశించెను. దీనిని అన్నమయ్య దర్శించి మనకందించెను. సమాజము నెడ అట్టి అనురక్తి, సమాజముతో తాదాత్మ్యసిద్ధి గలవాడు గావున అతని కీలీల దర్శనమై, ఈ యుపదేశము అతని సంకీర్తన ద్వారమున స్వామి వెలువరించెను. అతడందులకు అర్హుడు. వాస్తవమునకు శరీరము అనుదానికి ఉనికి లేదు. అనేక శక్తులు పనిచేయు చుండగా, వాని సమగ్ర ప్రభావము దేహముగా కనపడుచున్నది. ఆ శక్తులకు వెనుక అంతర్యామి ప్రేమ యున్నది. చొక్కాకు ఉనికి లేదు. అది నూలుపోగులతో చేయబడినది. ఇవి ప్రత్తితో చేయబడినవి. అయినను ప్రత్తిని, ప్రత్తిగా వాడలేము. చొక్కాగనే వాడుదుము. ఇచట చొక్కా భౌతిక శరీరము – దుమ్ముతో చేయబడినది; నూలుపోగులు – ప్రాణశక్తి ప్రవాహములు; ప్రత్తి – ఆత్మగా నున్న దేవుడు. కావున శరీరములకు శరీరముతో సేవ చేసినపుడు, తోటివారి దేహములలో అంతరాత్మగా నున్న దేవుడు మెచ్చి ఆత్మానందము నిచ్చును. శరీర మిచ్చిన స్వామియే దీని నిచ్చు చున్నాడు. దుమ్ము నిచ్చిన బాలకృష్ణుడే పంచదారగా మార్చుచున్నాడు. ఆత్మానంద మనగా నేమి? అవతలవానికి తృప్తి యయినచో తనకే అయిన స్థితి. ఇట్లు సమాజముతో వివిధ సేవల ద్వారమున తాదాత్మ్యము పొందినవానికే దేవుడాత్మానందమును ప్రసాదించును. దుమ్ము నిచ్చినది ఎందుకు? పంచదారగా మార్చుటకే. శరీరముల నిచ్చినది ఎందుకు? సమాజ సేవ ద్వారమున ఆత్మానందము నొందుట కొరకే. పరోపకారము చేయుచునే తాను చేయుచున్నానని మరచినపుడే ఇది కలుగును. 'ప్లేటో' అను గ్రీసు దేశపు మహనీయు డిట్లు చెప్పెను, "ఇతరులకు సేవ చేయుటతో మనకు వచ్చు ఫలితమేమి? తృప్తియే." మరియు దేవుడు మన నోటికి మాటలాడు శక్తి నిచ్చెను. దాని వినియోగమేమి? ఇతరులకు ఆహ్లాదమును గూర్చుటయే. అపుడు వారిలోని స్వామి సంతోషించును. అదియే మన సంతోషమగును. దుమ్ము పంచదారగా మారవలెను. అయితే మార్చునది స్వామియే. కావున మనము ఇతరులతో మాట లాడుటకు ముందు సర్వాంతర్యామి యయిన స్వామిని ఇట్లు ప్రార్థించవలెను. "నా మాటలలో నీవే నిలిచి, అవతలి వారికి ప్రీతిగూర్చి నాకును ప్రీతిగూర్చుము." అపుడు మన మాటలు కూడ పంచదార వలె తీయనగును. తైత్తిరీయోపనిషత్తులో ఇట్లు చెప్పబడినది. "మన నాలుక నుండి ఎల్లప్పుడును తేనె ఊరవలెను." ఇట్టివారి మాటలు కూడ, దేవుని పాటలగును. ఇదియే సామగానము. తీయని మాటలతో ఒరులకు ప్రీతిగొలుపు వారికి కలుగు రసానుభూతినే సోమరసమని వేదము చెప్పు చున్నది. దీనులయిన వారికి కలిగించు ఓదార్పు, వాస్తవమునకు మనకు

సోమరస మును పిండును. ఇట్టి తీయని పలుకును కామధేను వనియు నందురు. మనకు వలసినవి ఇది ప్రసాదించును. ఆనందమను పాలను పిండి, పాల చక్కెర నిచ్చును. అన్నమయ్య బాలకృష్ణుని లీలలో ఈ దర్శనము నంది ధన్యుడాయెను. ఇతనికి తోటిబాలుర నోరులలో పంచదార కన్పడెను. తనకును ఇట్టి స్థితియే స్వామి ఇచ్చెనని వ్యంగ్యముగా చెప్పుచున్నాడు. స్వామి యొక్క ఇట్టి లీల నరుల కాశ్చర్యమే కదా.

2వ చరణము యొక్క తాత్పర్యము

"బాలకృష్ణుడు వేరొకసారి తోటిబాలుర దేహమునకు అలంకారములుగా దురదను పుట్టించు తీగలను కట్టెను. దురద వలన మంట పుట్టి, బాలురు మిక్కిలిగా ఏడ్చిరి. ఈ మంచిమాట విన్నవారమై, దీనిని నమ్మి, మేము పర్వెత్తి చూచితిమి. అపుడు దురద తీగలకు బదులుగా బాలుర దేహములపై ఎన్నో సొమ్ములు గానవచ్చెను. ఈ సొమ్ములు క్రొత్తరకములైనవి. దురద తీగలను నగలుగా మార్చుటయు ఎరుగని క్రొత్త వింతలు."

వ్యాఖ్య

పల్లెలలో దురదగుంటాకు గలదు. బాలురు ఆటకొర్కై ఒకరికొకరు దీనిని అంటించుట పరిపాటి. కొన్ని తీగలు కూడ దురదపుట్టించునవి గలవు. బాలకృష్ణుడు తనను చేరిన గోపాలబాలుర దేహములకు ఇట్టి తీగలను ఆభరణములుగా కట్టెను. అమాయికులు గదా ఈ బాలురు. కృష్ణుని, అతని మైత్రిని విశ్వసించిన నిర్మల హృదయులు గదా. అందువలన కృష్ణుడు తేలికగా వారికి ఇట్టి తీగలను కట్టుచుండగా, వారు కాదనక కట్టించుకొనిరి. వారు ఈ తీగలు నగలని పొరపడి కావలెనని కోరలేదు. స్వామియే సఖులను మోసపుచ్చి, ఈ తీగలను అలంకారములుగా వారికి కట్టెను. అయితే వారికి దానితో దురదపుట్టి, మంట గలిగి, తట్టుకొనలేక ఏడ్వసాగిరి. ఈ సమాచారము అన్నమయ్యకు తెలిసినది. ఇది సుద్దియట. సుద్ది యనగా సూక్తి. అనగా మంచిమాట. పిల్లలు దురదపుట్టి ఏడ్చుచుండగా ఇది మంచిమాట ఎట్లయ్యెను? అన్నమయ్య ఈ వార్తను 'సుద్ది' అని ఏల అనెను? ఆయన పొందిన అనుభూతితో తాదాత్మ్యము పొందిన గాని ఈ అంశము తెలియరాదు. మామూలు దురద గాదిది. తన సర్వస్వమయిన స్వామి తన సొంత చేతులతో తీగలను కట్టగా ఏర్పడిన దురద ఇది. కావున అన్నమయ్యకు ఇది మంచి సమాచారమయ్యెను. అనగా "ఆహా! ఈ గోపబాలు రెంతటి అదృష్టవంతులు. స్వామియే స్వయముగా వీరికి తీగలను కట్టెను. స్వామి దివ్యస్పర్శ కలిగెను గదా. వారి యాభాగ్యమును వింటిని. నేనును ఆ మనోహర దృశ్యమును దర్శించి యానందించెదను గాక" అన్పించినది. ఆతనికి స్వామి దివ్యస్పర్శానుభూతియే ఎదలో నున్నది. దురద, మంట, ఏడ్పులపై దృష్టి యున్నను స్వామి స్పర్శలోని మాధుర్యము గదా వీనికి కారణము. దురద పుట్టించు తీగలను స్వామి బాలురకు కట్టెననగా, నరసింహస్వామిగా తన చేతులతో ప్రహ్లాదుని నిమిరి నట్లుగా, తన కరుణాకటాక్షములను, దివ్యత్వమును, తన కల్యాణగుణములను, వారికి అంటించెను. ఇనుపముక్కపై అయస్కాంతమును రుద్దగా అదియు అయస్కాంత మగును. అంతేగాని అయస్కాంతత్వ మను గ్రంథమును రుద్దినను, దానిని గూర్చి ఉపన్యసించినను గాదు. భగవదనుభూతి ప్రవచనములను

చెప్పుట వలన, వినుట వలన మాత్రమే కలుగదు. స్వామికి తన్ను దాను సమర్పించుకొనవలెను. అపుడు స్వామి కూడ అట్టివారికి తన్నుదాను సమర్పించు కొనును అని కఠోపనిషత్తు చెప్పుచున్నది. ఇది గోకులవాసుల విషయమున జరిగినది. స్వామి కరుణాకటాక్షములు తీగలను కట్టు నెపముగ బాలురకు చేసినదియే. భౌతికముగా దురద తీగలను కట్టిన మాట నిజమే. కాని తీగలా అవి, స్వామి కరుణాకటాక్షములు. అనుభూతితో కట్టిపడవేసిన తనతోడి దివ్యములయిన అనుబంధములు, అనుసంధానముల ప్రతీకలు. భక్తులగు బాలురకు దివ్యానుభూతి కలిగినది. దానికి ప్రతీకయే దురద భగవంతుని వెలుగు వారిని ఆవేశించినది. ఈ భగవదావేశమే దురద వలన గోకగా ఏర్పడిన మంటలు. అనుభూతితో పరవళ్లు త్రొక్కు గుండెకు భగవదావేశము కలిగినది. ఆపై ఇట్టి ఆవేశస్థితిని దేహము, మనస్సు తట్టుకొనలేకపోయినవి. కావున కన్నీరు వచ్చెను. ఇవి ఆనందబాష్పములు. మరల ఈ దివ్యానుభూతి స్థిరముగా నిలువవలెనని ఆరాటము కలిగినది. ఈ ఆరాటము వలన కూడ ఏడ్పు వచ్చినది. ఇట్టి విచిత్ర స్థితిని నారదుడు కూడ పూర్వజన్మలో పొందినట్లు భాగవతము మొదట కలదు. భగవానుడు సర్వాంతర్యామి గదా. తన హృదయము నంతను స్వామి ఆవేశించినపుడు, వెలుపల, లోపల అని యుండక అంతయు నారాయణమయ మగును. అపుడు భక్తుని యునికికి తావు లేదు. భక్తుని స్థానమున భగవంతుడే యుండును. భక్తుడు భగవంతుడే అయి సర్వాంతర్యామి యగును. ఆనందించువాడుండడు. ఆనందమే యుండును. కాని ఇంతలో ఈ ఆనందము స్థిరమయితే బాగుండునని భక్తున కనిపించును. ఇట్లు అన్పించుట మరల భక్తుని ప్రజ్ఞ, భగవంతుని కన్న వేరుగాకున్నను వేరు వలె అన్పించును. నారాయణుడు మాయమగును. నారాయణమయ మయిన హృదయము మరల తన ప్రజ్ఞతో మిగిలిపోవును. కాని అత్యంత మధురానుభూతి ఒకసారి కలిగిన తర్వాత, మరల మరల నిలువవలెనని సాధన కొనసాగి, క్రమముగా ఆ సిద్ధి స్వామి దయ వలన స్థిరమగును. ఆ స్థితి నారదునకు తర్వాతి జన్మలో స్థిరమయినది. ఇపుడు గోపబాలురకు, అన్నమయ్యకు స్థిరముగా నున్నది. భక్తునకు భగవంతుని యందు ఆర్తితోడి ప్రేమ, భక్తులపై స్వామి కరుణ, ఆయనతో అనుసంధానము, దివ్యానుభూతి, ఆయన ఆవేశము, అంతర్యామిత్వము, ఆ యనుభూతి స్థిరమగుటకై ఆరాటము – ఈ దశలు ఈ చరణమున అన్నమయ్య సంకేతాత్మకముగ వర్ణించెను. పై స్థితులు అంటువ్యాధి వంటివి. అనగా ఒక భక్తుని నుండి వేరొక భక్తునకు సంక్రమించునవి. తీరా అన్నమయ్య వెళ్లి చూడగా తీగలు, క్రొత్త ఆభరణములుగా మారి దర్శనమిచ్చెను. భగవంతుని లీలకు అసాధ్యమేది? ఇట్టి ఆట క్రొత్తది. ఎప్పటి కప్పుడు స్వామి క్రొత్త క్రొత్త ఆటలను కల్పించుకొనుచుండును. మానవుని దృష్టికి తీగలు, క్రొత్త అలంకారము లగుట మాయ. దేవుని దృష్టికి లీల లేక క్రీడ. ఇచట అలంకారములేవి? తీగలే. అనగా భగవంతుని కరుణతోడి అనుభూతి సంధానములే. దేవునితో విడువని, మాసిపోని దివ్యానుబంధములు. ఈ అలంకారములు ఎవరికి వారికే క్రొత్తవి. ఇట్లు తనతోడి అనుభూతి మధురాను బంధములను భక్తులకు కల్గించుటయు ఎప్పటికప్పుడే దేవునకు క్రొత్త. దేవుని కరుణా కటాక్షములు, అనుభూతులు – అతనితోడి అనుబంధముల కన్న జీవున కిక అలంకారము లేవి కలవు? ధనము, బంగారము, ఆస్తిపాస్తులు, ఖరీదయిన వస్త్రములు, ఉన్నతాధికారములు అలంకారము లగునా? ఖరీదయినవి వేరు, విలువ అయినవి వేరు.

ఖరీదయినవి అశాశ్వతములు. విలువ అయినవి భగవదనుభూతి, ఆయన గుణములు, ఆయనతోడి సంగమము. ఇవి శాశ్వతములు. ఇపుడు గోపబాలురలో అన్నమయ్యయు ఒకడై, ఈ శాశ్వతాలంకారములను పొందెను. వేంకటేశ్వరుని దయ అట్టిది. ఇందు మరియొక్క విశేషమున్నది. దేవుడు కట్టిన తీగలు భక్తునకు, భగవంతునికి తీయని అనుసంధానము లనగా దేవుని స్వరూపమగు సమాజముతో భక్తుని కేర్పడిన సత్సంబంధములు. ఇవియే అసలయిన అలంకారములు. సంఘమునే దేవుడుగా భావించు అన్నమయ్యకు ఇట్లు తోచుట, ఇవి కలుగుట జరిగెను. ఇట్టి భక్తునకు జీవితమున తారసిల్లు సన్నివేశములు, వ్యక్తులు భగవన్మూర్తులై కానవచ్చి ఎప్పటి కప్పుడే క్రొత్త క్రొత్త దివ్యానుభూతులు కలుగుచుండును.

3వ చరణము యొక్క తాత్పర్యము

"ఆపై శ్రీవేంకటేశుడు బాలకృష్ణుడుగా తనవద్ద నున్న జున్నంతటిని కాకిజున్నుగా గంపెడుగా బాలురచే తినిపించెను. దానిని వారు తిను స్థాయికి మించి పెట్టి ఏడ్పించెను. వారేడ్వగా ఆపైన మేము చూడగా ఆ బాలుర కన్నీటిని అందమయిన ముత్యాలుగా చేసెను."

వ్యాఖ్య

పల్లెలలో బాలురు ఆడుకొనుచు ఒకడు తాను ఇంటినుండి తెచ్చుకొన్న ఆహార పదార్థమును తన బట్టలో పెట్టి, బట్ట అడ్డము పెట్టుకొని ఎంగిలి చేసి, తోటి మిత్రున కందించును. దీనిని కాకి ఎంగిలి యందురు. శ్రీవేంకటేశ్వరుడు బాలకృష్ణుని రూపము ధరించి, భక్తులగు గోపాలబాలురకు జున్నును ఒక్కొక్కని నోటికి పట్టనట్లు గంపెడుగా కాకి ఎంగిలి చేసి పెట్టెను. అప్పుడే ప్రసవించిన ఆవు పాలను కాచగా, విరిగి, జున్ను తయారగును. పాలే జున్నుగా మారును. అన్నమయ్య ఈ చరణమున కూడ తనకు స్వామి ప్రసాదించిన దివ్యదర్శన మధురానుభూతిని వర్ణించెను. ఆవులు స్వామి పలికిన తీయని పలుకులు. వేణుగానస్వరములు. ప్రణవ నాదములే, వేణుగానముగా ప్రస్తారము చేసెను. షడ్జమను స్వరమును అనంతకాలమున లీనము చేసి, మిగిలిన ఆరు స్వరములను ఆరు ఋతువుల శోభలుగా కృష్ణు డనుభవింపజేసెను. అతని గానమును విన్న గోకులవాసులకు కలిగినది సాధారణ సంతోషము గాక, బ్రహ్మానందము. ఇది ఆత్మను తాకినది. ఈ బ్రహ్మానందమే ఆవుపాల నుండి తీసిన జున్ను. ఎంగిలి ఇచ్చుట అనగా తన స్వరూపమయిన బ్రహ్మానందమును సూటిగా ఇచ్చుట. కాకి ఎంగిలి చేసి జున్నును ఇచ్చుట యనగా తన స్వరూపమగు బ్రహ్మానందమును బట్టను అడ్డము పెట్టుకొని – ఒక మహనీయుడగు సద్గురుని ద్వారమున ప్రసాదించుట. గంపెడేసి అనగా అనంతము, అఖండము, ఊహాతీతమైనదని భావము. దీనిని భరింపలేక బాలురు ఏడ్చిరి. బాలకృష్ణుడు ఇట్లు వారి నేడ్పించెను. అనగా ఒక్కసారిగా మహోత్తమ దివ్యానుభవము ఇయ్యగా వారు ఆ యురవడి కాగజాలక, ఆనందమును పట్టజాలక పరవశించి తలక్రిందులగుచున్నారన్నమాట. ఇట్టిదే అనుభవము కృష్ణుడు ఒక గోపబాలున కీయగా, అతడు భరింపలేకుండుటను ఆ బాలుని తల్లి, యశోదకు నివేదించుట ఇట్లు భాగవతమున వర్ణింపబడినది. "నా కుమారుని పొట్ట పట్టనంతగా బానెడు వెన్నపూస తెచ్చి నీ

కొడుకు పెట్టెను. దానితో మా పిల్లవాని కూపిరాడదు. పైగా ఉక్కిరిబిక్కిరైనాడు. నా కుమారునకు బాలకృష్ణుని వలన కలిగిన బాధను నీవే స్వయముగా వచ్చి చూడుము.” అర్జునుడు కూడ ఒక్కసారిగా భగవానుడు ప్రసాదించిన విశ్వరూప సందర్శనమను అనుభవమును తట్టుకొనజాలక గిలగిలలాడెను. అయితే గోపాలబాలురు ఈ అనుభవమును కొద్దిసేపు మాత్రమే తట్టుకొనలేకపోయిరి. ఆపైన, బాలురు దివ్యానుభూతిని భరింపలేని స్థితిని గమనించి, స్వామి అటు దృష్టి సారించెను. శ్రీవేంకటేశుడు ఆ బాలుర కంటి నీటిని అందమైన ముత్యములుగా చేసెను. దీనిని అన్నమయ్య దర్శించి ఆశ్చర్యము, ఆనందము పొందెను. గోపబాలురు స్వామి ప్రసాదించిన జున్నును అనగా దివ్యమాధుర్య సుఖానుభూతిని సహింపలేక విలవిలలాడిరి. వారికి కన్నీరు వచ్చెను. సుఖానుభవము వలన ఆనందబాష్పములు, దానిని సహింపలేక బోవుట వలన శోకబాష్పములు గలిసి కన్నీరాయెను. దానిని స్వామి అందమైన ముత్యములుగా జేసెను. స్వాతివాన నీటిచుక్క ముత్యపుచిప్పలో బడి ముత్యమగును. ఇచట బాలుర కన్నీరు స్వామి దయ వలన, మహిమ వలన ముత్యములాయెను. ఇచట శ్రీకృష్ణుని జాతకము నందలి ఒక విశేషమును అన్నమయ్య సూచించెను. శ్రీకృష్ణుడు జన్మించిన సమయమున పరమప్రేమకారకుడగు శుక్రు డను గ్రహము తన స్వక్షేత్రమున, స్వాతీ నక్షత్రమున నుండెను. అనగా కృష్ణుడు అఖండ దివ్య ప్రేమమూర్తి. ఇపుడు స్వాతివానచినుకు ముత్యపుచిప్పలో బడి ముత్యమగునట్లుగా బాలకృష్ణుని రూపమున నున్న శ్రీవేంకటేశుడు బాలుర కంటినీటిని చక్కని ముత్యములుగా జేసెను. కారణము అతని అఖండ దివ్యప్రేమయే. భగవంతుడు తానిచ్చిన పూర్ణదివ్యానుభూతిని తట్టుకొను శక్తిని బాలురకిచ్చి, కన్నీటిలో శోకబాష్పములను తొలగించి, ఆనందబాష్పములనే నిలిపెను. ఇవియే ముత్యములు. ఇక దివ్యానుభవము ఈ బాలురలో స్థిరము, శాశ్వతమైనది. అర్జునునిలో స్థిరముగా లేకపోయినది. కాని గోపబాలురలో స్వామి స్థిరము చేసెను. ఈ బాలురు అమాయిక బాలురు, ఏమాత్రము సొంత ప్రజ్ఞ లేక పూర్ణముగా బాలకృష్ణునకు శరణందినవారు. అర్జునుడు భక్తుడు, సజ్జనుడే అయినప్పటికి అతనిలో శరణాగతి పూర్ణము కాలేదు. అన్నమయ్యయు గోపబాలురలో చేరి వారికి స్వామి ప్రసాదించిన శాశ్వత బ్రహ్మానుభూతి నెరిగెను. దానికి కారణము ఆతడు వారిలో ఒకడై వారివంటి సరళత, స్వచ్ఛత, శరణాగతి కలిగి వారు పొందిన అనుభూతి నందుటయే. తాను అనుభూతి నందనివాడు ఇతరుల అనుభూతిని దర్శింపలేడు. ఇట్లు అన్నమయ్యకు ఇట్టి భాగ్యమును శ్రీవేంకటేశుడే అనుగ్రహించెను. కావున తనకును స్వామి బాల్యలీలలు దర్శన మయినవని పల్లవిలో అన్నమయ్య ప్రకటించుట జరిగినది.

* * *

5

2వ సం-402 **అదియే విష్ణుపదము** శంకరాభరణం

అదియే విష్ణుపదము ఆతుమకు నెలవు
అదే జననకారణ మాకాశపదము. ॥ పల్లవి ॥

మంచిమాటలైనాఁ గానిమాటలైన నొకచోట
ముంచి ముంచి యాకాశముననే యణఁగును
ఎంచరాని నిట్టూర్పు లెన్ని వొడమినాను
అంచల నణఁగిపోవు నాకాశమునను. ॥ అదియే ॥

చూపు లెంతదవ్వైనా సూర్యచంద్రులఁ దాఁకి
ఆపొంతనే యణఁగు నాకాశమునను
రూపుల మైనీడలును రుచులఁ గాలత్రయము
పైపైనే యణఁగును బహిరాకాశమున. ॥ అదియే ॥

ఇలఁ జీఁకటి వెలుఁగు యెంచ నహోరాత్రాల
గలసి మెలఁగు నాకాశతత్త్వమున
చలువై శ్రీవేంకటేశు సాకార నిరాకారా
లలరి వెలుఁగుచుండు నంతరాకాశమున. ॥ అదియే ॥

భక్తునకు బ్రతుకులో తటస్థించు సన్నివేశములన్నియు వివేక సాధనకుపకరించు భగవదుపదేశములే.

టీక

ఆతుమ = ఆత్మ, అంచలన్ = అంచెలంచెలుగా, హంసలుగా, తత్త్వము = సత్యము.

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య ఆకాశము యొక్క మహిమను వర్ణించుచున్నాడు. వేదములలోను, బ్రహ్మసూత్రములలోను ఆకాశమును గూర్చి స్పష్టముగా చెప్పబడి యున్నది. ఆకాశమనగా చాలమంది ఖాళీచోటు అనుకొందురు. కంటికి కనపడు చోటు, పంచభూతములలో మొదటిది గావున ద్రవ్యము లేక పదార్థముగా కని పించును. ఇందు వేడిమి, వెలుతురు, అయస్కాంతత్వము, విద్యుత్తు, శబ్దము, రేడియం చర్యలు శక్తులుగా దాగియున్నవి. ఈ ఆరు లక్షణములనే అగ్ని యొక్క ఆరు ముఖము లనియు, ఈ అగ్నినే పురాణములందు కుమారస్వామి అనియు పేర్కొనిరి. ఇట్లు చోటులో శక్తి దాగియున్నది. ఈ శక్తి తరంగముల వలె స్పందించుచుండును. ఈ కక్ష్యను రోదసి లేక అంతరిక్షమందురు. ఇదిగాక దీనికి వెనుక, దీని కాధారముగ చైతన్యము దాగియున్నది. ఇందుండి కన్పడని ప్రజ్ఞ కాంతులుగా వెలువడుచుండును. ఈ చైతన్యము యొక్క మహోత్తమ స్వరూపమే 'ఆత్మ'. ఆత్మ యనగా సంస్కృతమున 'తాను' అని యర్థము. ప్రతి జీవుడును తనకు తాను 'తాను' అని యెట్లు భావించునో, చోటు కూడ భావించును. చోటులో దాగిన ఆత్మయే విష్ణువు. చోటులో దాగిన దివ్యతేజోమయ చైతన్యమునే ఆకాశమందురు. ఆకాశమనగా బాగుగా ప్రకాశించు నది అని అర్థము. మన మనస్సు నుండి భావములు వెలువడుచున్నవి. హృదయమున ప్రేమ వెలువడుచున్నది. బుద్ధిలో నిశ్చయము, విజ్ఞానరేఖలు వెలువడుచున్నవి. ఇట్లు వెలువరించు లక్షణములనే ప్రకాశమందురు. ఇది కంటికి కనపడని వెలుతురు. ఇట్లు దివ్యచైతన్యముతో గూడిన చోటే ఆకాశము. వేదములో సమస్త భూతసృష్టికి ఈ ఆకాశమే నేపథ్యమని వర్ణింపబడినది. ఇది ప్రధానముగా 'శబ్దము' గుణముగా గలది. ప్రణవనాదము నుండియే ఆకాశము వెలువడినది. మరల ఆకాశమున శబ్దము దాగియున్నది. అన్నమయ్య వేదమును ఋషుల వలెనే దర్శించెను. వేదమనగా శాశ్వత సృష్టి ధర్మముల కూడలి. వేదర్షులకు వలెనే ప్రకృతిలోని రహస్యములు దైవానుగ్రహమున ఇతనికి దర్శనమిచ్చినవి. ఈ ధర్మములను వ్యక్తముచేయు గ్రంథములే వేదగ్రంథములు. అన్నమయ్య వేదవిజ్ఞానఖని. సంకీర్తనమును, శరణాగతిని, భక్తియోగమును విశ్వసించి ఆచరించిన అన్నమయ్యకు వేదవిజ్ఞానము దాని కదియే తెరచుకొనెను. వేదసరస్వతి ఆతని నోట పలికి ఈ సంకీర్తనముగా వెలువడు చున్నది. ప్రస్తుత విజ్ఞానశాస్త్రమున కందని గంభీరాంశము లిందు గలవు. భక్తుడు, మహాకవి, ఉత్తమ సమాజద్రష్ట, ఆర్థిక వ్యవస్థ యెట్లుండవలెనో నిరూపించినవాడే గాక, ఈతడు వేదకవి, విజ్ఞాన శాస్త్రవేత్త గూడ. అనేక కోణములలో ఇతని ప్రతిభ గుబాళించినది. బహుముఖ ప్రజ్ఞ ఇతనిది. అయితే ఇతనిది పుస్తక పాండిత్యము కాదు. ప్రేమార్ద్రమయిన ఇతని హృదయపద్మమును శ్రీవేంకటేశ్వరుడు సూర్యుని వలె పూర్ణముగా వికసింపజేయగా, ఆ పద్మమున సహజముగా నేర్పడిన పరిమళమే ఇతని సర్వతోముఖ ప్రతిభ, జ్ఞానము. కావున ఇది దైవానుగ్రహము. స్వయముగా ఆర్జించిన విజ్ఞానము గాదు. ఇది దర్శన జ్ఞానము. వేదర్షుల కెట్లు భగవంతుని నుండి

విజ్ఞానము దిగివచ్చి లోనజొచ్చి పలికెనో, ఈతనికిని అంతియే. ఆధునిక వేద మనదగు ఈ సంకీర్తనమును ఆనందించెదముగాక. ఆకాశము, గాలి, అగ్ని, నీరు, నేల అందరి సంపద.

పల్లవి యొక్క తాత్పర్యము

"ఆకాశపదమే సమస్త సృష్టి యొక్క జననమునకు కారణము. అదియే విష్ణుపదము. అదియే ఆత్మకు స్థానము."

వ్యాఖ్య

దివ్యతేజస్సుతో గూడినచోటే మిగిలిన భూతముల సృష్టి కాధారము. ఆకాశమున కొంతభాగము కదలినపుడు వాయువేర్పడును. వాయువనగా గాలికాదు. స్పందనాత్మక ప్రక్రియ. చోటు గూడ శ్వాసించును. చోటుకు శ్వాస ఉండుటవలననే మనకు శ్వాస ఏర్పడినది. వాయువునుండి వేడిమి, వెలుతురు మున్నగు శక్తుల కూడలియగు అగ్ని పుట్టినది. అగ్నినుండి ద్రవములు, వానినుండి ఘనపదార్థములు పుట్టినవి. ఉదాహరణకు మంచుగడ్డ ఘనపదార్థము. దీనినే పృథివి అందురు. నీరు ద్రవము. దీనికి కారణము ఆవిరి. ఇది వాయువు. కాని ఈ రెంటి నడుమ వేడిమి పనిచేయు చున్నది. ఇది అగ్ని. వేడిమి అత్యధికముగా పెరిగినచో నీరే ఆవిరి యగును. అత్యల్ప మగుచో మంచుగడ్డ ఆగును. మఱి యీ ఆవిరిని ఏది స్వీకరించుచున్నది. ఆవిరి దేనిలోనికి ప్రవేశించుచున్నది? అదియే ఆకాశము. ఇపుడు పరిణామక్రమమున ఆకాశము నుండి వాయువు, దానినుండి అగ్ని, దానినుండి ద్రవములు, వానినుండి ఘన పదార్థములు వచ్చినవి. ఈ అయిదింటికి గల గుణములను తన్మాత్రలందురు. ఆకాశమునకు శబ్దము, వాయువుకు శబ్దము తోబాటు స్పర్శ, అగ్నికి ఈ రెంటితోబాటు రూపమును కల్పించి చూపించు శక్తి, ద్రవములకు వీనితోబాటు రుచి, ఘనపదార్థము లకు ఈ నాల్గింటితో బాటు అణువుల కదలిక వచ్చినవి. ఈ కదలిక వలననే వాసన పుట్టును. ఇవిగాక ఆకాశమునందే విశ్వమనస్సు పుట్టును. బ్రహ్మాండ గోళములు పుట్టుచున్నవి. ఒక్కొక్క తారక ఒక్కొక్క సూర్యుడు. ప్రతి సూర్యునకు కొన్ని గ్రహముల తోడి కుటుంబము. ఇక భూమి పుట్టుచున్నది. ఇట్లు ప్రకృతి పరిణామమును నిర్వహించు ప్రజ్ఞలగు దేవతలు సూర్యుని, పితృదేవతలు చంద్రుని ఆశ్రయించుచున్నారు. ఇక జీవ పరిణామము గూడ సమకాలికముగ జరుగుచు నరజాతి వచ్చినది. ఇట్లు సమస్త సృష్టియొక్క పుట్టుటకు ఆధారము ఆకాశమను స్థానము. ఇచట ఆకాశపదమని ప్రయోగించెను. పదమనగా శబ్దమనియు గూడ అర్థము. ఆకాశము శబ్దము గుణముగా గలదని అన్నమయ్యా చమత్కారముగా చెప్పుచున్నాడు. ఆకాశమును బ్రహ్మమునకు అనగా దేవునకు శరీరమని వేదోపనిషత్తులు వర్ణించినవి. అసలు ఆకాశ రూపములోనే దేవుడు వర్తించుచున్నాడని కొందరు భావించుచున్నారని బ్రహ్మ సూత్రములలో చెప్పబడినది. మనకు శరీరమెట్లో, దేవునకు కూడ ఆకాశమే శరీరముగానున్నది. ఇది ఆయన విరాట్ దేహము. ఇందలి భాగములే సమస్త దేవతలు, ఋషులు, జీవులు. వాస్తవమునకు ఆయనయందు సమస్తమున్నది గావున సమస్తమున ఆయన వ్యాపించెనని చెప్పుచున్నారు. ఉదాహరణకు చొక్కా అంతట

ప్రత్తి యున్నది, కుండ అంతట మట్టి యున్నది, హారమంతట బంగారమున్నదియని భావించుచున్నాము. సత్యమేమనగా ప్రత్తిచే చొక్కా, మట్టిచే కుండలు, బంగారముచే నగలు తయారగుచుండుట చేత ప్రత్తియందు చొక్కాలున్నవి. మట్టియందు కుండ లున్నవి. బంగారము నందు నగలున్నవి. సమస్త సృష్టి విష్ణునందు నెలకొనియున్నది. మనకు 'నేను', 'తాను', వ్యక్తిగత ప్రజ్ఞ కలదు. ఉదయము మేల్కొంచగానే 'నేన'ను ప్రజ్ఞ బయటకు వచ్చును. కాని నిద్రలో కూడ నేను ఉన్నాడు. మెలకువ వచ్చిన తర్వాత పనిచేయు 'నేను' ఖండ ప్రజ్ఞ. పరిమిత ప్రజ్ఞ. నిద్రలోనిది అఖండము, అపరిమితమునగు ప్రజ్ఞ. ఇది సముద్రము వంటిది. వ్యక్తిగతమగు 'నేను' కెరటము వంటిది. కావున ఆకాశమనునది చైతన్యసాగరము. ఇందుండు అఖండము, అనంతము నగు ప్రజ్ఞయే విష్ణువు. ఈ విష్ణువే ఆకాశమునకు ఆత్మ. సమస్త జీవులుగా వచ్చుచున్నదియు విష్ణువే. ఈతడే మనలోను ఆత్మగా నెలకొనియున్నాడు. మనలో రెండు 'నేను' లు పనిచేయుచున్నారు. ఒకటి వ్యక్తిగతమగు 'నేను'. రెండు సర్వవ్యాపకమగు 'నేను'. ఈ మొదటి నేనునే జీవుడనియు, రెండవ 'నేను' నే బ్రహ్మము లేక విష్ణువనియు అందురు. వాస్తవమునకు ఎన్ని అలలు కన్పడుచున్నను, ఉన్నదొక్కటే సాగరము. అట్లే సృష్టిలో ఎందరో, ఎన్నో ఉన్నట్లు కన్పడుచున్నను ఉన్నదొక్కడే. ఆతడే విష్ణుడు. ఆతడే సత్యము. ఇట్లు ఆకాశము విష్ణువునకు నిలయము. 'అదియే' అనగా మనము ఆకాశములోనే ఉండి, దానినుండి వేరుగా పొరపడి ప్రథమ పురుషలో పలుకు చుందుము. కావున అన్నమయ్య 'అదియే' అని ప్రయోగించుట జరిగినది. అది యనబడునది, నీవు ఒకటే అని చెప్పునదే 'తత్త్వమసి' అను మహావాక్యము. ఉదాహరణకు ఒక నీటి ప్రవాహమున మధ్యలో ఒక సుడిగుండ మేర్పడినది. దానికి ఇటు అటు ఉన్నది నీరే. అదియు నీరే. ఆకృతులే తేడా, ఉన్న వస్తువొకటే. అట్లే ప్రతి దానిలోను చోటు ఉన్నది. దానికి గల ప్రజ్ఞయే విష్ణువు. ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకొను చున్నారు. వాస్తవమునకు ఇద్దరు లేరు. ఒకే చోటులోని ప్రజ్ఞ లేక ఆత్మయగు విష్ణువే రెండు రూపములనెత్తి మాటలాడుచున్నాడు. ఈ యిర్వురి నడుమ చోటుండును. అందున్నదియు విష్ణువే. ఇట్లు విష్ణువే వ్యక్తులు, వారి నడుమ గల చోటు గూడ. ఆకాశమునకు ఆత్మయగు విష్ణువే – తానొక్కడే ఉన్నచో బాగుగా లేదని, తానే ఇన్ని రూపములుగా వచ్చి ఒకరితో నొకరుగా వ్యవహరించుచున్నాడు. అయితే ఆత్మ యొక్క స్వరూపమెట్టిది? కన్పడదు. ఇది పదార్థము గాదు, శక్తి గాదు. శుద్ధచైతన్యము, విశుద్ధ ప్రజ్ఞ. అనగా అఖండ ప్రేమ, అఖండానందము. కావుననే సర్వాత్మయగు విష్ణుని సచ్చిదానందుడందురు. సత్ – అనగా ఉన్నవాడు. ఉన్నదాయనే. మిగిలినవి ఉన్నట్లు భ్రమగొలుపును. చిత్ అనగా చైతన్యము లేక అఖండ ప్రేమ ప్రవాహము. ఆనందము – ఈ మూడు కలిసి విష్ణుని స్వరూపము. మనలో ప్రేమ, ముక్కలైనది. ఇది పరిపూర్ణమయినచో మనము దేవుడగుదుము. విష్ణువగుదుము. అఖండానందమగుదుము. ఆత్మయగుదుము. మనము 'ప్రేమ'ను కల్గియుండుటకాక ప్రేమగా నయినచో సర్వాంతర్యామిత్వము లేక విష్ణుత్వము నందుచున్నాము. విష్ణుని పరాక్రమము కొలతల కందనిదని వేదములందలి విష్ణుసూక్తములు చెప్పుచున్నవి. పరాక్రమమనగా శౌర్యమని గాదు. పరమును ఆక్రమించుట, తనకు ఇతరము లేకుండట. కావున గ్రహించుటే గాక అనుభవింపవలసిన దేమనగా మనలోని 'నేను', ఆకాశమందలి 'నేను' ఒకటియే అని. ఆత్మ శరీరములో నెచ్చటనుండును? అంతటను ఉండును. పదార్థము,

శక్తి మాత్రమే కాదు. కాని యివియు ఆత్మ యొక్క పరిణామ రూపములు. నీటి యావిరి, నీరు మంచుగడ్డ వలె. విష్ణువు సర్వమున వ్యాపించుటయే గాదు, సర్వమును అయి ఉన్నాడు.

ఇదిగాక ఈ పల్లవిలో ఒక ఖగోళశాస్త్ర రహస్యము దాగియున్నది. అన్నమయ్య జ్యోతిశ్శాస్త్రము, మంత్రయోగ శాస్త్రములందే గాక ఖగోళ శాస్త్రము నందును దైవకృప వలన విజ్ఞానమునందినవాడు. దివ్యానందములో నున్నవానికి ఆనందస్వరూపు డయిన దేవుడే వలసిన విజ్ఞానమునిచ్చును. ఇతడు లోకహితమునకు విజ్ఞానమును ఎంతగా వినియోగపరచునో దానిని బట్టి దేవుడు క్రమముగా దాని ననుగ్రహించును. జీవులపై పరమ ప్రేమ నిండుగానుండి, జీవితమును స్వామికి సమర్పణ పొందినచో దేవుడు ఎంతటి విజ్ఞానమునయినను ప్రసాదించును. కృష్ణుడు గీతలో ఇట్లు చెప్పెను. "ఏది తెలిసినచో, ఇక తెలియవలసినది ఉండదో దానిని నీకు చెప్పెదను." భగవంతుని అనుభూతి పొందినచో, సృష్టిలోని వివిధాంశ విజ్ఞానమదియే వచ్చును. అన్నమయ్యకిట్లే లభించినది. ఆకాశమంతట విష్ణువు వ్యాపించినను, ప్రత్యేకముగా ధర్మసంస్థాప నార్థము శ్రీరామ, శ్రీకృష్ణులుగా అవతరించినట్లుగా, భక్తోద్ధారమునకు, పాపనాశనమునకు వేంకటేశ్వరుడుగా గూడ దిగివచ్చినట్లు ఆకాశమున ప్రత్యేకముగా ఒక తారకను దేహముగా ధరించియున్నాడు. దానిని గూర్చి అన్నమయ్య ఇచట ప్రస్తావించుచున్నాడు. కావుననే, ఆత్మకు స్థానమయినను, ఆకాశము విష్ణువు యొక్క దేహమయినను, ప్రత్యేకముగా ఒక తారకగా వెలసియున్నాడు అని అన్నమయ్య 'విష్ణుపదము' అని ప్రయోగించి తెలుపుచున్నాడు. ఇక అన్నమయ్యతో బాటు జ్యోతిర్మయ లోకమగు ఆకాశములోనికి ప్రయాణించి విష్ణుపదమును చేరుదుము గాక. మన సూర్యునివంటి సూర్యులు అయిదుగురు కలరు. వీరు కుబ్జసూర్యులు. ఇట్టి వారికి దివ్యోపదేశములను చైతన్య స్థాయిలో ఇచ్చి, వీరికి గురువులయిన వారు ఏడు గురు తారకలు గలరు. ఈ తారకలకు అన్నిటికి ప్రజ్ఞలుండును. ఏడుగురు తారకల ప్రజ్ఞలే సప్తర్షులు. మన భూమి యొక్క ఉత్తర ధ్రువమున కెదురుగా ఆకాశమున సప్తర్షిమండల మున్నది. వానికన్న ఉత్తరముగా, అనగా మన భూమిపైని ధ్రువములకు సూటిగా ఆకాశమున ధ్రువతారయున్నది. ఇందలి ప్రజ్ఞయే ధ్రువుడు. ఇతడు భూ పరిభ్రమణమునకు ఇరుసుగా పనిచేయుచుండును. ధ్రువతారకును పైన ఆకాశమున్నది. ఈ ఆకాశమున తెల్లని కాంతి ప్రవాహముగా గానవచ్చు క్షీరసాగరమను తారకావ్యూహ మున్నది. అందు 'శ్రవణ' అను తారక యున్నది. ఇదియే విష్ణుని జ్యోతిర్దేహము. ఈ తారకనే విష్ణుతారక మనియు, విష్ణుపదమనియు నందురు. దీనిని గూర్చి వేదమున చెప్పబడినది. అన్నమయ్య ఈ తారకలోనికి ప్రవేశించుచున్నాడు. ధ్రువతారకు పైన ఉన్న ఆకాశములో కొన్ని శక్తులు సుడిగుండ ముగా పనిచేయుచున్నవి. ఈ తావు శ్రవణ లేక విష్ణు తారక యొక్క అంచునకు సమీపమున నున్నది. ఈ విష్ణుతారక అంచు నుండి శక్తిమయ కాంతిధార ప్రవహించు చుండును. దీనికిని ప్రజ్ఞ గలదు. దీనినే ఆకాశగంగ యందురు. కావుననే విష్ణు పదములనుండి ఆకాశగంగ పుట్టినదని పెద్దలు వేదమునందు, పురాణములందు చెప్పిరి. ఈ ఆకాశగంగ యను పేరు గల ప్రజ్ఞామయ శక్తిధార పైన చెప్పబడిన సుడిగుండమున్న తావున ప్రవహించుచున్నది. కావున 'ఈ తావునే విష్ణుపదము యొక్క బొటన వ్రేలు' అందురు. ఈ కాంతిధార యగు ఆకాశగంగయే ముందుగా ఆర్ద్రాతారకను తడుపుచున్నది. దీనికధిపతి

శివుడు. కావుననే శివునకు గంగాధరుడని పేరు వచ్చినది. ఆ తర్వాత అనేక తారకలకు కాంతిని అనగా ప్రజ్ఞామయ శక్తిని ఈ ఆకాశగంగ సరఫరా చేయుచు మన సప్తర్షులకు, ఆపైన సూర్యునకు సరఫరా చేయుచున్నది. ఇదియే చంద్రుని పున్నమ వెన్నెలగా ప్రతిఫలించి, హిమాలయము లందు పడి, మందాకినిగా దిగివచ్చుచున్నది. మన సూర్యులు 7+5=12. వీరిని ద్వాదశాదిత్యులందురు. వీరు మరి ఇంతకంటె పెద్దవాడగు ఒక సూర్యుని చుట్టు తిరుగుచున్నారు. ఇట్లు లక్షల తారకలు శంఖ వలయాకృతిగా చుట్టలు చుట్టలై తిరుగుచు, పైన చెప్పబడిన 'విష్ణుపదము' అను తారక దిశగా ప్రయాణము చేయుచున్నవి. ఎల్లరు సూర్యులును విష్ణుపదమునే వీక్షించుచున్నారు. వేదములందలి విష్ణుసూక్తములలో ఒక మంత్రమున్నది. 'తద్విష్ణోఃపరమంపదం, సదాపశ్యంతి సూరయః'. ఇది అనుదినము శ్రీవేంకటేశ్వరాలయమున ఉచ్చరింపబడుచుండును. దీని సామాన్యార్థ మేమనగా సూరులు – జ్ఞానులయినవారు ఎల్లప్పుడు ఆ విష్ణువు యొక్క పరమపదమును – బ్రహ్మానంద స్థితిని వీక్షించుచు, అందుకై సాధన చేయుచున్నారు. ఖగోళశాస్త్రపరమయిన విశేషార్థమొకటి గలదు. సూర్యులెల్లరు విష్ణుని పరమపదమగు తారకవైపుగా తమ ప్రయాణమును పరిభ్రమణ విధానమున సాగించుచున్నారు. ఈ మంత్రమునందు వేదర్షులచే ప్రయోగింపబడిన 'విష్ణుపదము' అను పదమే నేరుగా అన్నమయ్యచే కూడ ప్రయోగింపబడెను. ఈ రెండు అర్థములను సూచించుట కొఱకే ఆత్మకు నెలవని కూడ చెప్పబడినది. కావున తేలినదేమనగా సర్వాంతర్యామియగు విష్ణుడే విష్ణుతారక యను కాంతిమయ రూపమును దాల్చి యున్నాడు. మఱల ఆ స్వామియే తిరుమలలో శ్రీవేంకటేశ్వరుడుగా వెలసియున్నాడు. స్వామి సన్నిధిన నిత్యముండు సూరులు, నారదాది పరమ భాగవతోత్తముల స్థితిని అన్నమయ్య కూడ పొందియున్నాడనుటలో సందియము లేదు. ఈ పల్లవిలో ఈ అంశము కూడ సూచింపబడినది. ఈతడును ఒక సూరియే. మహాభారతమున, అశ్వమేధ పర్వమున ఒక కథ గలదు. ధర్మరాజు చేయుచున్న అశ్వమేధయాగమునకు రమ్మని ఆహ్వానించుటకై బకదాల్భ్యుడను ఒక మహర్షిని శ్రీకృష్ణార్జునులు చేరిరి. ఆ సందర్భమున ఆ మహర్షి శ్రీకృష్ణుని మహిమను అర్జునునకు వివరించుచు ఇట్లు సూచించెను. అనేక తారకలను, ప్రతి తారక చుట్టు ఒక బ్రహ్మాండగోళమును సృజించి వానితో ఆటలాడుచు, సర్వమున వ్యాపించి విష్ణు తారకారూపుడుగానున్న స్వామియే శ్రీకృష్ణుడు. కృష్ణుని దేహము భౌతికము వలె కన్పట్టినను, అది విష్ణు తారకాకాంతిచే తయారయినది. అట్లే శ్రీవేంకటేశ్వరమూర్తి చుట్టు ఇట్టి కాంతిమయ దివ్య దేహమొక దానిని అన్నమయ్య దర్శించెను. ఆ దివ్య దేహము, అన్నమయ్యకు విష్ణుని పరమ పదముగా గోచరించెను. ఆకాశముననే ఈ విష్ణువు తారక నెలకొని యుండుటచేతను, విష్ణువునకిది నిలయమగుట చేతను విష్ణుపదమని పేర్కొనబడినది."

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"జీవులు మంచి మాటలు మాట్లాడినను, వాడకూడని మాటలను పలికినను అవి యెల్లను చోటులోనికి ప్రవేశించి, ఆకాశమున మునిగి, అచట అణగిపోవును. ఊహించుటకు వీలులేని నిట్టూర్పులెన్ని వచ్చినను అవి యెల్లను ఆకాశముననే అంచెలంచెలుగా అణగిపోవును."

వ్యాఖ్య

జీవులు మాట్లాడు మాటలన్నియు చోటులోన ప్రవేశించును. ఆకాశము శూన్యము గాదు. ఏమియు లేనట్టిదిగా కన్పడినను, అన్నిటికాధారమగు చైతన్యశక్తి ధారా సాగరము. ఇందు మన మాటలు మునిగిపోయి, అణగియుండును. ఆకాశమునందున్న స్వామియే మంచి మాటల ఫలితములను, చెడు మాటల ఫలితమును రెంటినీ మఱల మనకందించును. మంచిమాటలు ఇతరులకు ఆహ్లాదము కలిగించు మాటలు, భగవత్ సంకీర్తనలు ఆకాశమున అణగి యుండును. ఇవి ఇతరుల రూపములలోని విష్ణువునకు సంతోషము నిచ్చును. మనతో ఇతరులు కూడ మంచి మాటలు మాటలాడి, హితము కూర్చుదురు. అట్లు వారిని ప్రేరేపించునది వారి యందు గల విష్ణుడే. 'నోరు మంచిదయితే, ఊరు మంచిదగున'ని మంచి సామెత తెనుగున కలదు. చెడుమాటల ఫలితము కూడ లిఖింపక తప్పదు. మానవుని హృదయమున కూడ ఆకాశము కొద్ది పరిమితిలో నున్నది. ఈ చోటు గర్భస్థుడయిన జీవునిలో మొదట చొచ్చును. దీనియందే గుండె నెలకొని యుండును. జీవులలోని యీ ఆకాశమును దహరాకాశ మందురు. మనము మాటలాడిన మాటలు ముందు శ్రోతయొక్క దహరాకాశము లోనికి చొచ్చి, ఆపై విశాలాకాశములోనికి ప్రవేశించును. మాటల ప్రభావము అలలు, అలలుగా తర్వాత పని చేయును. మన మంచిమాటలు వినువారిపైననే గాక, విశాలాకాశమున దాగియుండి, ఇతర జీవులపై ప్రభావము చూపును. చెడుమాటలు కూడ ఇట్లే ఇతరులలో చెడుపనులను ప్రేరేపించును. ఏ మాటల ప్రభావము ఎవరిమీద ఎట్లు పనిచేయునో వారి సంస్కార దశపై కూడ ఆధారపడి యుండును. సాధకులు జపతపాదులు చేయుచునే, కోపతాపాదులకు లొంగి పరుషవాక్యములు పలికినచో, ఈ వాక్కులు ఇంకను బలవత్తరములై ఆకాశముగుండా అలలుగా ప్రయాణించి, పగగొనియున్న సాధారణ మానవులలోనికి ప్రవేశించి వారిని హత్య మున్నగు ఘోరపాపములు చేయుటకు పురికొల్పును. కావున సాధకులు మాటలాడుటలో చాల జాగ్రత్తగా నుండవలెను. ఇతరుల మనసులను కలుషితము చేయరాదు. తేనెలూరుచు ఆహ్లాదమును, ప్రేమను ప్రోత్సహింపగలిగి యుండవలెను. మనమొకరిని గూర్చి వారి పరోక్షమునను ఏ విధముగ మాట్లాడిన, ఆ శబ్దములు తరంగాత్మకంగా ఆకాశమున ప్రయాణించి, వారిలోనికి చేరి, దానికనుగుణమయిన ప్రతిచర్యను పురిగొల్పును. ఒకరి మేలు మనము చెప్పదలచుకొన్నపుడు వారిలో తప్పున్నదని స్పష్టంగా దెలిసిన, వారిని సరిదిద్దవలెనని హృదయపూర్వకంగా అన్పించినచో వారితోనే నేరుగా చెప్పవలెను. అంతేకాని వారి పరోక్షమున వారిని గూర్చి నిందావాక్యములు పలుకరాదు. పలికినచో, ఆ శబ్దముల తరంగములు ఎవరెక్కడ ఉన్నను వారిలో ప్రతిచర్యను పురికొల్పును. అంతేకాదు గతములోని సంభాషణలలోని శబ్దములు తరంగములుగా మార్పుచెంది ఇప్పటికిని ఆకాశమున నిలిచియుండును. 5000 ఏండ్ల క్రితము శ్రీకృష్ణుడు బోధించిన గీతను, అతని వేణుగానమును ఆయన కంఠధ్వనిలోనే విను కాలము వచ్చును. ఆ రకముగా మన హృదయములకు కృష్ణుని గీతలో సామరస్యము సాధింపవచ్చును. ఈ జన్మలో మనము మాట్లాడిన మాటలు తర్వాతి జన్మకు కూడ మాసిపోకుండ ఆకాశము దాచియుంచును. మనము జీవితములో ఊహింపరానన్ని నిట్టూర్పులను శోకముతో విడిచినను, అవి

అన్నియు అంచెలంచెలుగా ఆకాశమున అణగిపోవును. అంతేగాదు, నిట్టూర్పు అనగా పొడవైన నిశ్వాస, మనము నిశ్వసించిన గాలి, ఆకాశము నందలి స్వామిని చేరును. ఆ ఈశ్వరుడు విడిచిన గాలిన మనము పీల్చుటతో అది మనలోని దహరాకాశ మందున్న స్వామిని చేరును. మొత్తము ఉచ్ఛ్వాస నిశ్వాసలు స్వామినుండియే బయలుదేరి, స్వామినే చేరుచున్నవి. శ్వాసలకు హంసలని యోగపరిభాష. కనుక అన్నమయ్య తెనుగున అంచలను పదమును, హంసలను అర్థమున వాడెను. మన శ్వాసలకు హంసలని పేరు కలుగుటకు కారణము గాలిని విడుచునపుడు 'హ' అను ధ్వనియు, పీల్చునపుడు 'సో' అను ధ్వనియు శ్వాసలందు పనిచేయును. మనము వినవచ్చును. 'హంస' అను ధ్వనినే హంసగాయత్రి అందురు. ఇది అజప. అనగా మనము జపింప పనిలేకయే, దానికదియే శ్వాసలందు ధ్వనించును. శ్వాసవలననే వాక్కు వెడలును. కావున వాగ్దేవి యగు సరస్వతి హంస వాహనగా స్తుతింపబడినది. ప్రాణమను పక్షికి రెండు రకములయిన శ్వాసలు రెండు రెక్కలు. ఈ పక్షియే గరుడుడు. ఈతనిపై మన ఆత్మయగు విష్ణువుండును. కావున విష్ణువు గరుడవాహనుడు.

2వ చరణము యొక్క తాత్పర్యము

"మన చూపులు ఎంత దూరమయినను సూర్యచంద్రులను తాకి, ఆ చెంతనే ఆకాశమునందు అణగిపోవును. మన రూపములకు చెందిన శరీరముల నీడలు, గతమున, ప్రస్తుతము, జరుగబోవు కాలమున మన మనుభవించు రుచులును బయటి ఆకాశమున పైపైననే అణగును."

వ్యాఖ్య

మన మాటలు, శ్వాసల వలెనే చూపులు కూడ ఆకాశములన అణగి నిలిచిపోవును. కుడికంటి చూపుకు సూర్యుడును, ఎడమకంటి చూపుకు చంద్రుడును అధి దేవతలు. జ్యోతిశ్శాస్త్రమున ఈ అంశము చెప్పబడినది. కావుననే ఒక జాతకమున ఈ రెండు గ్రహములలో ఎవరి పరిస్థితి బాగుండదో, దానికి అనుగుణమయిన కంటిచూపు దెబ్బతినును. అన్నమయ్య జ్యోతిర్విద్యా పరిజ్ఞానము ఈ చరణమున తెలియుచున్నది. సూర్యచంద్రుల దయ వలననే మనకు చూపు ఏర్పడుచున్నది. ఆకాశమే దేహముగా గల విష్ణువునకు వీరిద్దరు కండ్లని పురాణములు వర్ణించుచున్నవి. మన చూపుల కాధారము దేవుని కరుణాకటాక్షములు సూర్యచంద్రుల ద్వారమున మనపై పడుటయే. తిరిగి మన చూపులు సూర్యచంద్రులను తాకి, వీరిని నేత్రములుగా గల విష్ణుని చేరుచున్నవి. విష్ణునే మన మాటలు, చూపులు మున్నగునవి చేరుచున్నవని గుర్తించి శ్రద్ధాభక్తులు కలిగియుండవలెనని అన్నమయ్య ఉపదేశము. మనము మాటలతో ఎవరిని నిందించి నను విష్ణుని నిందించినట్లే. మనము ఎవరిని ప్రేమగా చూచినను విష్ణుని ప్రేమగా చూచినట్లే. ఎవరిని కోపముతోగాని, అసూయతో గాని చూచినను, ఆ విధముగ విష్ణుని చూచినట్లే. ఈ యుపదేశమునిచ్చుట అన్నమయ్య పరమోద్దేశ్యము. కావుననే పల్లవిలో విష్ణుని స్థానము ఆకాశమనియు, చరణములందు మాటలు, ఊర్పులు, చూపులు మున్నగునవి ఆకాశమును చేరుననియు చెప్పుచున్నాడు.

పల్లవిని, చరణములను కలిపి చదువుకొన్నచో మన ప్రవర్తనలు విష్ణునే చేరుచున్నవని తెలియనగును. పూజ అయిపోయిన పిదప, చివఱలో శరీరము, వాక్కు, మనస్సు, ఇంద్రియముల, బుద్ధి, హృదయముల ద్వారమున నాచేత చేయబడినవన్నియు నారాయణునకు సమర్పించుచున్నానని ప్రకటించుచుందురు. కామక్రోధాదులతోడి మన మాటలు, చూపులు కూడ దేవునకే సమర్పింపగలమా? ఎవడికి వాడు తనలో తాను శోధించు కొనవలసి యున్నది. ఉదాహరణకు స్త్రీరూపమున నున్నదియు విష్ణువే కదా. స్త్రీని కామదృష్టితో చూచినచో దేవుని చూచినట్లే అని గుర్తింపనగును. దేవుడే మన తల్లియు, తండ్రియు. కావున మన తల్లిని ఆ దృష్టితో చూచినట్లే. కామక్రోధములు, అసూయాదులతో ఇతరులను చూచువాడు ఈ జన్మలో గాని, తర్వాతి జన్మమున తప్పకుండా గాని చూపును కోల్పోవలసి యుండును. అట్టివాని జాతకమున సూర్యచంద్రుల స్థితి చెడినచో, అతని పూర్వకర్మను సూచించును. గ్రహము లేమియు చేయవు. మన పూర్వ కర్మను సూచించును. సూర్యచంద్రు లెంత దూరమున నున్నను మన చూపులు వారిని చేరగలవు. ఈ పాదమున అన్నమయ్య ఇంకొక ఉపదేశము నిచ్చుచున్నాడు. ఆకాశము తన దేహముగా, సూర్యచంద్రులు తన కనులుగా గల విష్ణునే విశ్వమున చూచుచుండవలెను గాని, వ్యక్తులను గాదు. మఱియు చూచుట అనగా ఆదరించుట అనియు అర్థము. మనము ఇపుడు ఎవరినెట్లు ఆదరింతుమో, తర్వాతి జన్మమున మనకు అట్టి ఆదరణయే ప్రాప్తించును. దీనిని గూడ జాతకమున సూర్యచంద్రుల స్థితి సూచించును. శ్రీకృష్ణుని రూపము, చూపులు కూడ ఇప్పటికిని ఆకాశమున దాగియున్నది. మహాభక్తులగు అన్నమయ్య వంటివారు ఆ చూపులను ఇప్పుడును గుర్తించి, స్వీకరింపగలరు. మన శరీరములలో ఒక్కొక్కనికి ఒక్కొక్క రూపముండును. ఈ శరీరముల నీడలును ఆకాశమునుచేరి అందుదాగియుండును. మనమీ శరీరములతో ఎవరిని బాధించినను, సుఖపెట్టినను, ఎచటికి వెళ్ళినను, ఏమి చేసినను వాని ముద్రలు ఆకాశమునదాగి, పైజన్మలో ఈ చేష్టలకు తగిన శరీరమును పొందవలసి వచ్చును. ఇంకొకరికి అన్నము పెట్టనివాడు దరిద్రుడగును లేదా అజీర్ణరోగి యగును. ఇతరులను కొట్టినవాడు దెబ్బలు తినవలసి వచ్చును. హత్య చేసినవాడు హత్యకు గురికాక తప్పదు. ఇతరుల కాలు విరుగ గొట్టినవాడు పై జన్మలో పుట్టుకతోనే కాలులేని వాడుగా పుట్టవలసి వచ్చును. స్త్రీయందు కామదృష్టి గలవానికి పై జన్మలో ఎట్టి అవయవలోపము, వ్యాధియయినను సోకవచ్చును. ఇట్లు ప్రస్తుత శరీరముతో చేసిన చేష్టల ముద్రలు చోటు తనలో దాచియుంచును. ఇతరులకు మేలుచేసినవాడు ఆరోగ్యవంతుడై జన్మించును. ఇతనికి ఎపుడు ఏ అవసరము కలిగినను అది తీరుచుండును. చోటుతో బాటు కలిసి కాలము పనిచేయు చుండును. కాలక్రమమున మన యీ చేష్టల ఫలితములు అనుభవమునకు రాక తప్పదు.

మన ఆహార విహారములందు గల రుచుల ఫలితములు కూడ అనుభవమునకు రాకపోవు. ఆహారమును రుచిగా నున్నదని ఎక్కువ తిన్నచో దానిముద్ర ఆకాశములో నిలిచి, తర్వాత దాని ఫలితమును ఆకాశములోని చైతన్యమయుడగు విష్ణువు అనుభవమునిచ్చును. ఆహారశుద్ధి వలన స్వభావశుద్ధి గలుగును. గీతలో కృష్ణుడిట్లు చెప్పెను. "ఆహారములలో మూడు రకములు గలవు. ఆయుస్సును, కార్యభారమును ఎక్కువ కాలము

భరింపగల శక్తిని, ఆరోగ్యమును, మనస్సుకు సమత్వమునిచ్చు శక్తిగల ఆహారములు – రస్యములు – రసముగల పండ్లు, చమురు గల పదార్థములు, తేనె, నేయి, మున్నగు గుండెకు బలమునిచ్చు పదార్థములు సత్త్వగుణము గలవానికి నచ్చును. మనస్సునకు దిగులు పెంపొందించు ఉప్పు, పులుపు, కారము, మంట పుట్టించునవి మున్నగునవి రజోగుణము గలవారికి నచ్చును. వండిన వెనుక మూడు గంటలు దాటినవి, రుచి తప్పువరకు నిల్వయున్నవి, దుర్వాసన పుట్టినవి, ఒకపూట దాటిన చద్ది పదార్థములు, తిని మిగిల్చిన ఎంగిలివి, మేధను, చురుకుదనమును చంపునవి తమోగుణము గలవానికి ఇష్టము." అంతేకాక, ఈ మూడు రకములగు ఆహారపదార్థములను భుజించువారికి ఆయా గుణములు పెరుగును. ఇట్లు మనము గ్రహించు వివిధ రుచులు ఆకాశమును జేరును. అందలి చైతన్యమగు స్వామి ఆయా రుచుల ఆహారములనుబట్టి వానికి తగు స్వభావములను, ఆరోగ్య – అనారోగ్యములను ఇచ్చును. ఈ ఆహారమునందలి రుచులేగాక, విషయ భోగము లందలి రుచులు కూడ పైన కన్పడుచోటునందు దాగును. వాని ఫలితములను కూడ ఆకాశదేహుడగు విష్ణువు ఇచ్చును. లోకహితము కొఱకు పనిచేయుటలోను, శరణాగతియందును, భగవానుని గుణసంకీర్తన మందును రుచి మరగినచో, ఆ రుచులును చోటులో దాగియుండును. ఆ ప్రభావము తర్వాత సంస్కారముగా పనిచేయును. తర్వాతి కాలమున ఇట్టివారికి సత్పురుష సాంగత్యము, సద్గురువుల కృప, భగవదనుభూతి వీరికి విష్ణు విచ్చును. భగవంతునియందలి రుచి అన్నిటికన్న శ్రేష్ఠ మయినది, బలమైనది. ఇది పెరిగిన వాని విషయమున ఆకాశ దేహుడగు స్వామియే మిగిలిన రుచులను పోగొట్టును" అని గీతలో కృష్ణుడు చెప్పెను. భగవద్రుచికి పెరుగుటయే గాని, విరుగుట యుండదు. అట్లే కాలక్రమము, చోటుతో గలిసి పని చేయును. కాలము, చోటు నిలువుగీత, అడ్డగీత వలె పరస్పర లంబకోణము నేర్పఱచును. మూడు కాలములని వాస్తవమునకు లేవు. ప్రస్తుత వర్తమానము, గతములోనికి జారిపోవును. గతకాలమప్పుడు వర్తమానము. ఇప్పటి దృష్టిలో భవిష్యత్తు కూడ అది వచ్చినపుడు వర్తమానమగును. కావున ఉన్నది ఒకటే కాలము. వర్తమానమే. కాలమనంతము. కాలపురుషుడగు శేషుని చుట్టలలో ఆకాశము ఇమిడియున్నది. మూడు కాలములుగా కన్పడువానిలో జరిగిన సంఘటనలన్నియు చోటులో దాగి యుండును. ప్రపంచపు నడకలో జరిగిన సన్నివేశములు చోటులో నిలిచియున్నవి. యోగి ప్రజ్ఞ, చోటునందలి ప్రజ్ఞతో సామరస్యము కలిగియుండును. ఒక వీణ యందలి తీగకు, ఆ వీణతో సంబంధమున్నట్లు యోగి ప్రజ్ఞకు, చోటునందలి ప్రజ్ఞతో సంబంధముండును. కావున అన్నమయ్య వంటి యోగీశ్వరులకు గత చరిత్రలో జరిగిన శ్రీరామ, శ్రీకృష్ణాదుల గాథా సన్నివేశములు మున్నగునవి తలంచగనే ఆకాశమునుండి వీరి తలంపులలోనికి తట్టును. గతమే కాదు వర్తమాన నందు జరుగుచున్నవి, రాబోవు ప్రపంచ పరిస్థితి గూడ ఇట్లే తట్టును. ఇక సాధారణ మానవుని విషయములో ఇట్టి సామరస్యముండదు. అతనికి సొంత తెలివియే పని చేయును గావున తట్టవు. మహాభక్తులు, త్రికాలవేదులు. తమ సాయము గోరిన వారికి తగు సూచన లీయగలరు. సామాన్య మానవుల జీవితములలో జరిగిన సన్నివేశములును, చోటులో దాగియుండును. కాలము స్వామి యొక్క మనస్సు వంటిది. చోటు ఆయన దేహము. కావున మనము గతములో చేసిన పనుల ఫలితములు భవిష్యత్తులో ఇచ్చును. భవిష్యత్తులో చేయబోవు వాని ఫలితములు

ఆ పై భవిష్యత్తులో ఇచ్చును. కర్మకు రెండు ప్రభావములు గలవు. 1. కర్మఫలానుభవము. 2. కర్మబంధము లేక వాసన. ఉదాహరణకు కొంతకాలంగా మద్యపానం చేయువానికి ఫలంగా రోగం అనుభవమునకు వచ్చును. ఇదికాక మద్యపానం చేయకుండ ఉండలేని స్వభావము మనస్సులో ఏర్పడును. ఇది అభ్యాసబలం వలన ఏర్పడిన కర్మబంధము, మొదటిదానిని తప్పింపలేము. రెండవదానిని భగవత్ సంకీర్తన, సేవలయందు మనస్సును నిమగ్నము చేయగా ఆ రుచి పెరిగి, పూర్వపు చెడురుచి యొక్క ప్రభావము మనస్సుపై పనిచేయుట ఆగిపోవును. మంచి అభ్యాసముల వలన మంచి సంస్కారము లేర్పడి, పూర్వపు మలిన సంస్కారములు క్రమముగా వైదొలగును. మంచి రుచులు మాత్రము బలపడునేకాని, వైదొలగవు. దయామయుడగు భగవంతుడు ఇట్టి ఏర్పాటుచేసెను. ఎప్పటికయినను మానవుడు చెడును వదలించుకొనుటకు అవకాశము గలదు. మంచి మాత్రము విడిచిపెట్టదు, తర్వాతి జన్మయందు కూడ ఈ జన్మలోని సంస్కారముల మూట పనిచేయక మానదు. శరీరము మారినను, భార్యాపుత్రాది సంబంధములు మారినను, సంస్కారములు మారవు. జన్మలిన్ని ఎందుకీయబడినవి? కాల క్రమమున మంచి సంస్కారములను, భగవద్భక్తిని పెంచుకొనుటకు, చెడువానిని వదిలించుకొనుటకు. మీరాబాయి జీవితమున చిత్రము జరిగినది. ఆమె పుట్టినప్పటి నుండియు ఏడ్చుట కొనసాగించెను. ఊయలలో పడవేసినను, పాలిచ్చినను, గిలక్కాయలతో ఆడించినను, ఏమి చేసినను ఏడుపు ఆగలేదు.ఇంతలో ఒక దినము వీరి యింటి బయట ఒక భక్తుడు హరినామ సంకీర్తన చేయుచుండగా ఊయలలో నుండి విన్న యీ పసిపిల్ల వెంటనే ఏడుపు ఆపినది. ఇక ఆమె తల్లిదండ్రులును నిత్యము హరి సంకీర్తనము కొనసాగించిరి. ఇది మీరాబాయికి గత జన్మనుండి ఆకాశము సంక్రమింపజేసిన సంస్కారము. ఇట్లే బృందావనమున ఒక గోవు కృష్ణుని వేణుగానమును వినుచు పరవశయై పాలు స్రవించెను. ఆ పాలబిందు వొకటి కృష్ణుని తలపై బడెను. మరుజన్మలో ఆమె పండరిపురమున 'సుశీల' అను భక్తురాలుగా పుట్టి పాండురంగని సాక్షాత్కార భాగ్య మందినది. ఈ కథ తెనాలి రామకృష్ణుని పాండురంగ మాహాత్మ్యమునందున్నది.

3వ చరణము యొక్క తాత్పర్యము

"వెలుగు, చీకటి, పగలు, రాత్రి కలిసియే ఆకాశతత్త్వమున చరించును. లోపలి ఆకాశమున చల్లనై శ్రీవేంకటేశుని ఆకారముతో గూడిన తత్వము, నిరాకారమయిన తత్త్వము రెండును మనోహరముగా వెలుగుచున్నవి."

వ్యాఖ్య

ఆకాశతత్త్వము అనగా ఆకాశము యొక్క సత్యస్థితి. అనగా ఆకాశముగానయిన పరబ్రహ్మస్థితియే. పరబ్రహ్మ కాలస్వరూపుడై ఆకాశ గమనమును నడిపించుచున్నాడు. ఇందు చీకటి వెలుగులు రెండును కలిసి మెలగును. ఈ రెండును పరస్పర భిన్నములు. పగటిపూట వెలుగు, రాత్రివేళ వెలుగు చరించునుగాని రెండును కలిసి ఒకేసారి ఎట్లు చరించును? దీనికి సమాధానము గీతలో నున్నది. శ్రీకృష్ణుడు అర్జునునకు

విశ్వమును తన రూపముగా గ్రహించు దివ్యజ్ఞాన దృష్టిని ప్రసాదించెను. అనగా గీతను బోధించు సమయమునగల విశ్వముయొక్క రూపమనియే గాదు, చివఱలో నేను 'కాలమును' అని కృష్ణుడు తన వాస్తవ స్థితిని చెప్పెను. కాలము అనంతము. అనంత కాలము నందు దేవుని దృష్టితో చూచినచో చీకటి వెలుతురు, రాత్రింబవళ్ళు ఒకేసారి కలిసి లోగంటికి గానవచ్చును. నరుని పరిమితమగు భౌతిక దృష్టి ఈ రెంటినీ ఒకేసారి చూడలేదు. కావుననే కృష్ణుడు దివ్యదృష్టి నిచ్చెను. దివ్యమనగా తన దృష్టియే. స్వామి దృష్టితో జీవుడు చూచినపుడు జరుగుచున్న కాలములోని విశ్వమే కాక, అన్ని కాలము లందలి విశ్వము స్వామి రూపముగా దర్శనమిచ్చును. చోటు, కాలము కలిసి స్వామి విశ్వరూపము. కావుననే ఇచట అన్నమయ్య ఆకాశతత్త్వ మనెను. వేదమునందలి పురుషసూక్తమున అహోరాత్రములు విరాట్పురుషునకు రెండు పార్శ్వములని చెప్ప బడెను. ఆకాశతత్త్వము విష్ణువే. ఆ స్వామికి కుడి, ఎడమ ప్రక్కలు పగలు, రాత్రి; వెలుగు, చీకటి. అంతేకాదు సూర్యచంద్రులు స్వామి కనులని చెప్పబడినది. ఒకేసారి సూర్యచంద్రులు కలిసి ఆకాశమున కనపడరుగదా, ఇది ఎట్లు పొసగును? భూమి తన చుట్టు తాను తిరుగుచు, సూర్యుని చుట్టు తిరుగును. సూర్యుడే భూమి చుట్టు తిరుగుచున్నట్లు భౌతికమయిన కంటికి కానవచ్చును. చంద్రుడు భూమి చుట్టును తిరుగుచుండును. ఈ మూడు గ్రహములు తిరుగుటను లోగంటితో గమనించినచో ఒకేసారి సూర్యచంద్రులు ఆకాశమున నున్నట్లు తెలియును. అట్లే చీకటి వెలుగులు, రాత్రింబవళ్ళు ఒకేసారి కలిసి వర్తించుటను గ్రహింపవచ్చును. ఇట్లు ఈ జంటలు ఆకాశతత్త్వమున కలిసి మెలగుచున్నవి. ఇవియేగాక శుక్ల, కృష్ణ పక్షములు, ఉత్తరాయణ దక్షిణాయనములు, చల్లదనము, వేడిమి కూడ. వీనిలో ఒకటి పనికివచ్చును. రెండవది పనికిరాదని యుండదు. రెండును కాలస్వరూపుడగు దేవునికి రెండు ప్రక్కలలోని భాగములే. మానవుడు చలిని వద్దనును. ఎండను వద్దనును. ఈ జంటలలో ఒక్కొక్క దానియందు ఏమి చేయవలెనో దానిని చేయవలెను గాని చింతింప బనిలేదు. పగటిపూట దినచర్యయు, కర్తవ్యములను ఆచరించుటయు, రాత్రివేళ విశ్రాంతికై నిదురించుటయు చేయవలెను. పగటిపూట కుటుంబముతోను, వృత్తిలోను, సమాజముతోను వ్యవహరించునపుడు కలుగు ఉద్వేగములు, కోపతాపాదు లకు నిద్ర విరామ మిచ్చును. లేకున్న నరుడు అల్పకాలములోనే చనిపోవును. ఆహార విహారములు, నిద్ర, మెలకువలలో తగిన విధముగా వర్తించువానికే యోగ మబ్బునని కృష్ణుడు స్పష్టము చేసెను. ఇట్లే జనన మరణములును. మరణానంతర స్థితి దీర్ఘకాల నిద్ర. అపుడు మనకు గల రాగద్వేషములు వాసనలుగా మాత్రమే ఉండును గాని, ఎవరిపైననో వర్తించవు. కారణము వారు గుర్తుండరు. ఇట్లు భగవంతుడిచ్చిన సదుపాయములే రెండును. మన మాయాసమయమును బట్టి చేయవలసిన దానిని చేయవలెను. పగలు నిద్రించుట, రాత్రి మేల్కాంచుట అనారోగ్య కరము. అట్లే చీకటివేళ చంద్రునిలోను, వెలుగు వేళ సూర్యునిలోను భగవంతుని చూచి నమస్కరింపవలెను. అసలు మొత్తము కాలము, చోటు కలిపిన దేవుని స్వరూపమునకు మ్రొక్కవలెను. బ్రతుకులో కూడ కొన్నాళ్ళు కష్టములు, కొన్నాళ్ళు సుఖములు – ఐహికములు వర్తించును. దీని నెఱిగి భక్తుడు రెంటిని దేవుని విభూతులుగా గ్రహించి ఆత్మసుఖములో, సమత్వముతో జీవించును. స్వామి సాకారుడు, నిరాకారుడు కూడ. స్వామి ఆనందము తానయినవాడు. కాల మీయనలో భాగము. ఇట్టి

స్థితిలో దేవుడు నిరాకారుడే. కాని ఆకాశముగను, అందలి విశ్వముగను, అందలి సమస్త జీవుల దేహములును తానే అయిన స్థితిలో సాకారుడు. నిరాకారుడే సాకారుడయ్యెను. నిరాకార దేవుడు, సాకార దేవునికన్న గొప్పవాడని భావించుట మానవుని సంకుచితత్వమే గాని దేవునిలో ఈ భేదము లేదు. రెండుగా నున్నది ఒకడే. దీని కుదాహరణము వేదములందు ఋషులిచ్చిరి. దేవుని ఊర్ణనాభి యందురు. సాలెపురుగుతో పోల్చుదురు. సాలెపురుగు తనలో నుండి వచ్చు దారముతోనే గూడును కట్టుకొని అందు వసియించును. బయటనుండి చూచువారికి సాలెపురుగు, దారములు, గూడు వేరుగా కనబడును. కాని లోగంటితో చూచువానికి సాలెపురుగే దారములుగను, గూడుగను అయినట్లు తెలియును. అట్లే నిరాకారుడయిన దేవుడే ఇచట సాలెపురుగుతో పోల్చబడెను. దారములు మాయాశక్తి యగు అమ్మవారు. ఆమెయు ఆయనయే. గూడు జగత్తు. ఇది ఆకారము. ఇదియు ఆయనయే. ఆకారములు లేనివాడును, అన్ని ఆకారములును తానే అయిన వాడును ఒకే దేవుడే. ఆకారములు లేని స్థితిలో నారాయణుడనియు, ఆకారములు దాల్చిన స్థితిలో విష్ణువనియు అందురు. విశ్వమే తన ఆకారమై, అందు మరల అంతర్యామిగ విష్ణువుండును. గూడు తానే అయి, సాలెపురుగు అందున్నట్లుగా. కనుక సాధనలో నిరాకారుని, నిర్గుణుని చింతించుట సాధ్యము కాదు. మన ఊహకందదు. నిరాకార నిర్గుణోపాసన దుఃఖము నిచ్చునని కృష్ణుడు చెప్పెను; కావున చేయవలసినది అన్ని ఆకారములు తానయిన వానిని, విశ్వాకారుని – అంతర్యామిని – ప్రేమ, దయ, ఔదార్యము, సహనము మున్నగు దివ్య గుణములు గలవానిని చింతించుట. ఇందులకు మొదటగా జీవులను ఉద్ధరించుటకు వచ్చిన అవతారమూర్తులనో, వేంకటేశ్వరుని వంటి అర్చామూర్తినో స్వీకరించి, ఈయనయే సర్వాంతర్యామి అయిన వెలుగుగా అంతట, అన్ని రూపములుగ దర్శించి సేవింప వలెను. ఇది సాధన. సిద్ధి స్థితిలో అఖండానందము కలుగును. జీవుడే ఆనంద మగును. అనగా దేవుడే యగును. సాధన పూర్తి అయిన తర్వాత మాత్రమే ఈ ఆనందము కల్గుట గాదు, సాధన సాగుచుండగనే ఆనందానుభూతిగ జీవింపనగును. సాధన విశిష్టాద్వైతము, సిద్ధి అద్వైతము. ఈ రెంటి విషయమున అయోమయములో పడరాదు. అన్నమయ్య ఈ రెంటినీ ఉపదేశమందినవాడు. తన లోపలి దహరాకాశమున – అనగా తన గుండె నెలకొనియున్న చోటులో దేవుని నిరాకారుడుగ నున్నాడని దర్శించుచున్నాడు. కాని ఆ స్వామియే ప్రేమతో మనకు గుండె యొక్క స్పందనను, శ్వాసను కల్గించుచున్నాడు. మన మనస్సు, బుద్ధి, ఇంద్రియములు, శరీరముగను ఆ స్వామియే రూపుదాల్చెను అని అన్నమయ్య గ్రహించెను. మన శరీరము కూడ లోనున్న స్వామికి శరీరమే. ఎల్ల రూపులును, ఆయన రూపములే. ఎల్లరి దేహములు ఆయన దేహములే. ఈ సాధన చేసినవాడు అన్నమయ్య. దీనినే సారూప్య ముక్తి యందురు. తన శరీరమును తుచ్ఛమని భావింపరాదు. అది దేవాలయమని వేదము చెప్పుచున్నది. మన చెడు ప్రవర్తనతో తుచ్ఛము చేసికొన్నచో అగును. అంతియే. మెట్టవేదాంతము చెప్పరాదు. ఈ శరీరము దేమున్నది? అనువాడు భోజనమును మానడు గదా. భోజనము చేసియే గదా ఈ మాటలు చెప్పునది. కావున ఇది ఆత్మ వంచన, పరవంచన. తన శరీరమును దేవుని రూపముగా భావించి, దానిని దైవ సేవకై వినియోగపెట్టవలెను. ఎల్లరి శరీరములను దేవుని రూపములుగా భావించి, శరీరముతో, వాక్కుతో, మనస్సుతో అట్టి

విశ్వరూపుడయిన దేవుని అర్చింపవలెను. ఇది అన్నమయ్య వంటి మహాభక్తుని సాధన. ఇట్లు తనలోనే దేవుని ఆనందస్థితి యగు నిరాకారమును, ప్రేమాది దివ్యగుణములు గలిగి సర్వాకారుడగు సాకారుని దర్శించిన సమగ్ర దృష్టి గలిగిన భక్తుడు అన్నమయ్య. వట్టి మెట్టవేదాంతి గాదు. మనచే సేవింపబడుట, కీర్తింపబడుట, స్మరింపబడుట కూడ గుణములే కదా. ఇట్లు సగుణుని సేవింపవలెను గాని, నిర్గుణ నిరాకారుని చింతించుట గాలిని మూటగట్ట యత్నించుట వంటిది. కుండలు తయారు చేయుటకు ముందు పెట్టుకొన్న మట్టి వంటివాడు నిరాకారుడు, నిర్గుణుడు. కుండలలోని మట్టి వంటివాడు సగుణుడు, సాకారుడయిన అంతర్యామి యగు స్వామి. చపాతీలు తయారు చేయుటకు ముందు పళ్ళెములో పెట్టుకొన్న గోధుమపిండి వంటివాడు నిరాకారుడు. చపాతీలలోని గోధుమపిండి సాకారుడు. మంచుగడ్డలుగా కాక ముందలి నీరు నిరాకారుడు. మంచుగడ్డలలో అంతర్యామి యగు నీరు సాకారుడు. అన్నమయ్య సాకారుని కొలిచి, నిరాకారమగు అనుభూతిని పొందుచున్నాడు. ముందుగా శ్రీరాముని, శ్రీకృష్ణుని, శ్రీవేంకటేశ్వరుని వంటి సగుణ సాకారబ్రహ్మమును స్మరించి, కీర్తించి, సేవించుటలోనే ఆనందము కలుగును గాని నిరాకారుని ధ్యానించుటలో ఏమి కల్గును? ఏదో ఆనందము కలిగినట్లు అనిపించును. ఎండమావిలో నీటి వంటిది ఈ అన్పించుట. నిరాకారోపాసకులు చాలమంది సమాజమున భగవంతుని చూడక, కర్తవ్యముల నుండి పారిపోవ యత్నించువారు. వీరు సోమరులు. స్వామి నిరాకారుడు, సాకారుడును. యజుర్వేదమున స్వామి రూపము లేనివాడుగను, విశ్వమే తన రూపమైన వాడుగను వర్ణింపబడెను. ఇక తనలోనే వెలుగుచున్న నిరాకారుడును, సాకారుడును అయిన స్వామి చల్లదనమును అనగా అనుగ్రహమను వెన్నెలను అన్నమయ్య కురిపించుట వలననే సాకార సేవ, నిరాకారమగు అనుభూతిలోన కల్గినవని అన్నమయ్య ప్రకటించుచున్నాడు. అనుగ్రహము అను అర్థములో 'చలువ' అను తెనుగు పదము చాల సొగసుగా, గుండెకు హత్తుకొనునట్లుగా నున్నది. ఇట్టి ప్రయోగము అన్నమయ్య యొక్క కవితలోని విశిష్టత.

* * *

6

28వ సం-419 **అమరెగదె** దేవగాంధారి

అమరెఁగదె నేఁ డన్నిసొబగులును
సమరతి చిన్నలు సతి నీమేనా. ॥ పల్లవి ॥

చెలపల చెమటలు చెక్కిళ్ళ
మొలకల నవ్వులు మొక్కిళ్ళ
సొలపుల వేడుకలు చొక్కిళ్ళ
తొలఁగని యాసలు తొక్కిళ్ళ. ॥ అమరె ॥

నెఱవగు చూపులు నిక్కిళ్ళ
మెఱసెను తమకము మిక్కిళ్ళ
గుఱుతగు నధరము గుక్కిళ్ళ
తఱచగు వలపులు దక్కిళ్ళ. ॥ అమరె ॥

నును గోరికొనలు నొక్కిళ్ళ
పొనుఁగని తములము పుక్కిళ్ళ
ఘనుఁడగు శ్రీవేంకటపతి కాఁగిట
ఎనసెను పంతము లెక్కిళ్ళ. ॥ అమరె ॥

అంతర్యామి నుపాసించు వానికి వెలుగుబాటయే గాని చీకటిదారి యుండదు.

టీక

సమరతి = వయస్సు వచ్చిన స్త్రీ; చిన్నలు = చిహ్నములు, గుర్తులు; మొలక= అంకురము; చెలపల = శోభ గల; మొక్కిళ్లు = కెంపు నందలి అధిక కాంతి; సొలపు= పరవశత; చొక్కిళ్లు = సొట్టలు; తొక్కిళ్లు = గుంపు; నెఱవు = వ్యాపనము; నిక్కిళ్ల = పైకి సారించు; దక్కిళ్ల = దక్కించుకొనుటలు; పొనుగని = శుభమయిన, రుచి గల; పుక్కిళ్లు = బుగ్గ యొక్క లోపలి భాగములు; ఎనసెను = కలిగించెను.

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య అలవేలుమంగాదేవి, శ్రీవేంకటేశ్వరుని యెడల పొందిన మధుర భావనను, మధురానుభవములను వర్ణించుచున్నాడు. వాస్తవమునకు ఈ భావనలు, అనుభవములు భౌతిక కక్ష్యకు సంబంధించినవి గావు. భర్త యొక్క సన్నిధి, కౌగిలిలో భార్య పొందు భౌతిక సుఖముల వలె ఇవి అన్పించును. ప్రకృతి పురుషుల నడుమ ఏర్పడు మధురములయిన అనుభవములు చైతన్య కక్ష్యకు సంబంధించినవే. వారిద్దరి నడుమ ఏకమైన అనుబంధమే సృష్టి యొక్క గమనము. స్వామి, ఆయన ప్రేమ లేక శక్తి వేరు గావు. స్వామి యొక్క మాయాశక్తి లేక ఆయన ప్రేమ యొక్క నిత్యసాంగత్యమునకై తహతహలాడి అందు ఓలలాడును. కారణము సృష్టి నడచుటకు, బిడ్డలగు జీవుల జీవన ప్రయాణము సాఫీగా సాగుటకు, పరమావధిగా బిడ్డడగు జీవుడు స్వామియందు కరగుటకు అమ్మవారి వాత్సల్య మావశ్యకము. అమ్మవారు అందులకై స్వామి సాంగత్యభాగ్యమున నోలలాడుచుండును. అనగా ఆమెయు ఏమియు చేయజాలదు. ఆయన కూడ ఆమె తోడు లేనిది ఏమియు చేయజాలడు. ఉదాహరణకు ఒక తల్లి తన బిడ్డనికి అన్నము పెట్టునపుడు ఉపయోగించు పరికరము చేయి. అది భౌతిక ద్రవ్యము. అందులో ప్రాణశక్తి ఉండవలెను. ఆ శక్తియే అమ్మవారు. శక్తి చాలదు. శక్తి యున్నను బిడ్డకు అన్నము పెట్టుటకు సమర్థము గాదు. శక్తికి నేపథ్యముగ 'నేను' అను ప్రజ్ఞ ఉండవలెను. అందరిలోనున్న ఈ అఖండ ప్రజ్ఞ లేక ఆత్మచైతన్యమే భగవంతుడు. శక్తికి, ఈ అఖండ ప్రజ్ఞకు నడుమ మనోబుద్ధులున్నవి. వీనిచే అంటబడినచో ఈ ప్రజ్ఞనే జీవుడందురు. అంటక అవతల ఉండి, అందరిలో సమానమై విశుద్ధమయినచో 'ఆత్మ' లేక దేవుడందురు. పలక ఉన్నచో గదా దానిపైన ఏదయిన వ్రాయుట. ఏమియు వ్రాయబడని పలక, వ్రాతలకు నేపథ్యమున గలదు. వ్రాయు శక్తి అమ్మవారు. పలక స్వామి. వ్రాతలు జీవులు. ఈ శక్తి యనగా, స్వామికి జీవులపై గల ప్రేమయే జీవశక్తిగా రూపొందు చున్నది. ఎల్లరి జీవశక్తికిని ఈ ప్రేమయే కారణము. ఎంత గొప్పవాడయినను తాను బ్రతుకుటకు జీవశక్తిపై ఆధారపడి యున్నాడు. ఇట్లు జీవులకు తనకు గల వాత్సల్యముతో, అమ్మవారు స్వామియొక్క నిత్య సాంగత్యమున నుండును. ప్రజ్ఞ, శక్తి రెండును ఉండవలెను. శక్తి గలవానినే ప్రజ్ఞ యందురు. ప్రేమ గలవానినే దేవుడందురు. ప్రేమయే అమ్మవారు. అది గలవాడే స్వామి. ఈ ఇర్వురు ఒకటిగా నున్న స్థితి – దేవుడు ప్రేమతో గాక, తానే ప్రేమయై యున్న స్థితియే ప్రళయము. సృష్టిలో దేవుడు, దేవుని ప్రేమ అని రెండు తత్త్వములు భాసించును. వాస్తవమునకు దేవునియందే ఆయన ప్రేమ

నిలిచియుండును. మానవునిలోనయినను అతని గుణములు, అతనికన్న భిన్నముగా నుండజాలవు గదా. ఇట్లు అమ్మవారు, స్వామి యొక్క నిత్య సాంగత్యములో ఉండుట చేతనే సృష్టి సాగుచున్నది. జీవులు బ్రతుకు చున్నారు. చివరకు దేవుని చేరుచున్నారు. వీరిర్వురి సాంగత్యమును అన్నమయ్య భౌతిక సంకేతములతో ఈ కీర్తనలలో తెలిపెను. పైకి భార్యాభర్తల నడుమ గల భౌతికాకర్షణ సంబంధములయిన వర్తనముల వలె అన్పించినను, ఇవి అన్నియు వారిర్వురి ఆత్మీయమగు అనుబంధమునకు చిహ్నములుగా అన్నమయ్య దర్శించెను. ఇపుడు పురుషుడగు స్వామితో గూడి ఆనందపారవశ్యమున వర్తించు తీరుకు సంకేతములను పరిశీలింతము. వీనిని రసాత్మకముగా, అనుప్రాసలతోడి తెనుగు మాటలలో అన్నమయ్య వర్ణించిన తీరు కొనియాడదగినది.

పల్లవి యొక్క తాత్పర్యము

“అమ్మా! అలివేలుమంగమ్మ తల్లీ! నీవు స్వామికి సతివి. ఆయన సాంగత్యము వలని ఆనందపారవశ్యమున నీకు నేడు అన్ని సొగసులును అమరినవి. యుక్తవయస్సు వచ్చిన స్త్రీకి వలె గుర్తులమరినవి.”

వ్యాఖ్య

బాల్యము నుండి యౌవనమునకు పరిణామము చెందునప్పటికి మగవానికిని, మహిళకును శరీరమున కొన్ని మార్పులను ప్రకృతి అమర్చినది. యుక్తవయస్సు వచ్చిన స్త్రీ, భర్త కౌగిలిలో ఇమిడిపోవును. భౌతిక దాంపత్యమునకు వలయు కొన్ని చిహ్నములు ఆమె శరీరమున పొడసూపును. ఇట్టివి మంగాదేవి దేహమున పొడసూపినవని అన్నమయ్య వర్ణించుచున్నాడు. పల్లవిలోనే అమ్మవారి నుద్దేశించి అన్నమయ్య ఒక పరమ పవిత్రమయిన పదమును ప్రయోగించెను. ఇదే పదమును కొన్ని ఇతర కీర్తనలందును వాడెను. ఆ పదము ‘సతి’. సతి యనగా భార్య యని బాహ్యార్థము. ఈ శబ్దము వేదము నుండి వచ్చినది. జగత్తు యొక్క అస్తిత్వమునకు – ఉనికికి ఆధారమయిన శక్తి లేక దేవుని పరమప్రేమ అని ‘సతి’ యను పదమునకు వేదార్థము. సాధారణ జీవితమున గూడ పిల్లల బ్రతుకుకు తల్లి ప్రేమయే ఆధారము. కావున ఇచట ‘సతి’ యనగా జగన్మాతయనియే మనము గ్రహింపవలెను. జగత్పిత యగు స్వామికి ఆమె సతి. స్వామి యున్నట్లు మనము తెలియవలెనన్నను ఆమె దయయే కారణము. ఇట్లు జగత్తు, అందలి జీవులలో ప్రాణశక్తి పనిచేయుటకై సర్వాంతర్యామి యగు స్వామితో కూడుటకు తగిన చిహ్నములు కలిగియున్నది. ఆమె నిత్య యువతి. ఈ చిహ్నము లెప్పుడును కలిగియుండును. అనగా నిర్మల ప్రేమ, అందరికిని ప్రాణమును పంచిపెట్టగల సామర్థ్యము, అందరియందును ఆత్మయగు స్వామిని నెలకొలుపుట మున్నగు లక్షణములు. వట్టి మబ్బు వర్షింపజాలదు. మెఱపుతో గూడవలెను. అట్లే అమ్మవారు మెఱపు వంటిదై, స్వామి యను మబ్బుతో కూడినదై, బిడ్డలగు జీవులను కని వారిపై దయావర్షము స్వామి నుండి కురిపింప జేయుటకు తగినదై యున్నది.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"స్వామి తన వద్దకు చేరగనే మధురభావమొలికి, పారవశ్యమున సొగసైన చెమటలు ఆమె చెక్కిళ్లపై పట్టుచున్నవి. అపుడామె చెంపలు కెంపుల వలె నునుసిగ్గుతో ఎఱ్ఱబడినవి. తీయని చిఱునవ్వులు మొలకెత్తుచున్నవి. భర్త యొక్క సాన్నిధ్యము వలన పరవశురాలై ప్రీతిపొందగా, ఆమె బుగ్గలు సొట్టలు పడుచున్నవి. ఈమెకు భర్తలో ఇమిడిపోవలెనను ఆశలు గుంపులుగా కూడుచున్నవి."

వ్యాఖ్య

ప్రకృతియే పంచ భూతములకు, సూర్యాది గ్రహములకు కారణమగుచున్నది. ఇచట పల్లవిలో వాడిన 'సతి' యను పదమును అనుసంధింపవలయును. ఈ చెమటలు సృష్టిలోని జలము లను కురియుచున్న వర్షధారలు. చిఱునవ్వులు కెంపుల కాంతితో మెఱయుచున్నవి. 'కెంపు' జ్యోతిశ్శాస్త్రము ననుసరించి సూర్యునితో సంబంధము గల రత్నము. కావున అమ్మవారి చిఱునవ్వులు ఉదయ సమయమున సూర్యుని అరుణకాంతులు. అమ్మవారి ముఖము చంద్రమండలము. నునుసిగ్గుతోడి ప్రీతి వలన అమ్మవారి బుగ్గలు సొట్టలు పడుచున్నవనగా శుక్ల, కృష్ణ పక్షములు; పూర్ణిమ, అమావాస్యలు ఏర్పడుచున్నవి. ఇట్లు సూర్య చంద్ర మేఘములే కాదు, ప్రకృతి అంతయు తమలోని అంతర్యామితో గూడవలెనను ఆశించుచున్నది. ఈ కోరికలు మిక్కుటమై గుంపుగా చేరుచున్నవి. అనగా సృష్టిలోని అన్ని పదార్థములందును ప్రకృతి–శక్తి; పురుషుని–ప్రజ్ఞను కూడ కోరుచున్నది. ఈ ఇర్వురి కలయికయే జగత్తు.

2వ చరణము యొక్క తాత్పర్యము

"అమ్మవారి చూపులు వ్యాపించునవై పైకి సారింపబడుచున్నవి. స్వామిలోనికి ఒదగవలెనను తహతహ మిక్కిలిగా మెఱసినది. భర్తయందు ఆమెకు గల అనురాగము నకు చిహ్నముగా క్రింది పెదవి గుక్కపట్టుచున్న స్థితిలో నున్నది. స్వామియందు వెంటవెంటనే మధురానురాగ భావములు స్థిరముగా నిలిచియున్నవి."

వ్యాఖ్య

అమ్మవారి చూపులు సూర్య, చంద్ర తత్త్వముల నుండి వెలువడిన వేడిమి, వెన్నెలలు. మొదటిది జ్ఞానమును, ప్రాణశక్తిని; రెండవది ఆహ్లాదమును, ప్రేమను ప్రసాదించునవి. సూర్యుని ద్వారమున అమ్మవారి చూపులు మనకు మనమున్నామని మెలకువ నిచ్చును. సూర్యకిరణముల నుండి భూమికి వలసిన ప్రాణశక్తి చేరుచున్నది. చంద్రుని నుండి వచ్చు వెన్నెల వలన రాత్రిపూట ఓషధులు ఎదుగుచున్నవి. జీవునిలో పనిచేయు ఇంద్రియ ప్రజ్ఞలగు దేవతలు సూర్యుని నుండియు, శరీరము తయారగుటకును గాను పనిచేయు ప్రజ్ఞలగు పితృదేవతలు చంద్రుని నుండియు పనిచేయుచున్నారు. ఇట్లు అమ్మవారి చూపులగు సూర్య, చంద్ర కిరణముల కాంతి అంతట వ్యాపించుచు, సూర్య చంద్ర మండలముల పైకిగూడ సారింపబడుచున్నవి. అంతర్యామి యగు పరమాత్మ పొందుకై ప్రకృతి యొక్క క్రొత్తదనము గలిగియుండును. ఇట్లే స్వామి యందలి అనురాగము యొక్క అనుభవము అమ్మవారికి ఎప్పటికప్పుడే. కావున అనంతకాలమున సృష్టి

సాగుచున్నది. ఇది జగత్తు. అనగా ఎపుడు కదలుచుండును. ఎప్పుడట్లే యుండదు. బుద్ధిలో ఉన్నట్లుండి మనకు సత్సంకల్పము తోచినపుడు 'మెఱసినది' అని అందుము. ఇట్లు స్వామి చేరగనే, అమ్మవారిలో కుతూహలము మాటిమాటికి లోపల తోచుచున్నది. మెఱపు ఉత్సాహమును కల్గించును. అట్లే ఈ తమకము ఆమెకు ఉత్సాహమును కల్గించినది. వేదములలో స్వామి మేఘరూపుడు గను, అమ్మవారు మెఱపు రూపమునను వెలసియున్నారని వర్ణింపబడినది. 'మెఱసినద'నుటలో అమ్మవారి తమకము దివ్యమైనదనియు, భౌతిక కక్ష్యకు చెందినది కాదనియు సూచించెను. కావున అమ్మవారు స్వయముగా స్వామియందు తమకమును కల్గించుకొనలేదనియు, అదియే మెఱపు వలె తోచినదనియు భావము. పోతనగారికి సీతారాములు ప్రత్యక్షము కాగా, రాముడు మెఱపుతో గూడిన మబ్బు వలె నున్నాడని ఆ భక్తకవి వర్ణించెను. అమ్మవారి క్రింది పెదవి అదరుచు స్వామియందు గల ప్రీతికి గుర్తుగా గుక్కిళ్లు పట్టుచున్నట్లున్న స్థితిలో నున్నది. అధరమనగా ధర గానిది. పృథివి గానిది. అనగా ఆకాశము. ఇది అదరుట అనగా శ్వాసించుట. ఇది అమ్మవారి శక్తికి గుర్తు. ఇది గుక్కపట్టినట్లున్నదనగా గాలి విడుచుటయు, లోపలికి పీల్చుటయు చేయుచున్నదనమాట. మనము విడిచిన గాలి ఆకాశము స్వీకరించుచున్నది. అమ్మ వారికి స్వామియందు అనురాగ భావములు స్థిరములై దక్కుచున్నవి. ఇవి శాశ్వత ములు. ఏ క్షణము వీనికి ఎడము ఏర్పడినను, ఏ పదార్థమునకును మనుగడ నిలువజాలదు. ప్రతిదానియందు ప్రకృతి పురుషుల కలయిక ఉండును. నిర్జీవములని పేర్కొనబడుచున్న ఱాళ్లు, లోహముల యందు గూడ శక్తి గలదు. చైతన్యము నిద్రా స్థితిలో నుండును. ప్రతి పరమాణువు ఈ ఇర్వురికి ఆలయము.

3వ చరణము యొక్క తాత్పర్యము

"అమ్మవారిని స్వామివారు తమ నున్నని గోళ్లతో తాకెను. ఆ గోళ్ల కొనలు తాకుట వలన ఈమె దేహముపై నొక్కులు పడెను. ఈమె తాంబూలము స్వీకరించుట జరిగినది. ఈ తమలపాకులు మిక్కిలి శుభములైనవి. రుచిగలవి. సర్వోత్తముడగు శ్రీవేంకటేశ్వరుని కౌగిలిలో ఆమె పంతములు ఎక్కిళ్లను కలిగించెను."

వ్యాఖ్య

స్వామి గోళ్లు ఎంతో నునుపైనవి. గోళ్లు చేతివ్రేళ్ల చివరలు. స్వామి దివ్యతేజః ప్రసారములకు ఇవి గుర్తులు. ఇవి మంట, నొప్పి కల్గించునవి గావు. అయినను ఆ ప్రసారముల స్పర్శచే ప్రకృతికి నొక్కులు పడినవి. అనగా పులకరింతలు గలిగినవి. ఈ పులకరింత యొక్క గుర్తు చెట్లు పెరిగి, కొమ్మలు, ఆకులు వచ్చి, పూలు విరబూయగా, చెట్లు వానిని జలదరింపులతో రాల్చుట. ఎంతయో రుచి గల తాంబూలము ఈమె పుక్కిట – అనగా బుగ్గ యొక్క లోపలి భాగమున శోభిల్లినదనగా, తనయందు అగ్నిని దాల్చినదని భావము. అగ్ని, ఆకాశమునందు, సూర్యునందు, భూమియందును గల విద్యుదయస్కాంత శక్తి, వేడిమి, వెలుగుల కూడిక. అమ్మవారు స్వామి నాకర్షించి, ఆతడు తనను కౌగిలించవలెనని పట్టుపట్టినది. ఆ పట్టుదల నెఱవేఱినది. స్వామి యెంతటి శ్రేష్ఠుడయినను, ఈమె పంతముతో కూడిన ఈమె ఆకర్షణకు

లొంగెను. స్వామి సరసము, సరదా అట్టివి. అమ్మవారికి ఆ కౌగిలింత వలని ఆనందమఖండమై, ఎక్కిళ్లు వచ్చినంత పని అయినది. నవ్వు అధికమైనపుడిట్లే జరుగును. ప్రకృతిని సర్వాంతర్యామి యగు ఆత్మ నిండుగా కూడి తనలో ఇముడ్చుకొన్నది. ప్రకృతి యందు పురుషుడున్నాడని ముందుగా భావించుచుందుము. క్రమముగా పురుషు నందు ప్రకృతి యున్నదనియు, కావున ప్రకృతి యందు పురుషుడుండుట కలిగె ననియు తెలియును. ఉదాహరణకు ఒక గోడను చూచినపుడు అందు సిమెంటు మున్నగు పదార్థము లున్నవనియు, ఆపైన పరమాణువు లున్నవనియు, ఆపైన శక్తి యున్న దనియు, ఆపైన చైతన్యము ఉన్నదనియు తెలియును. క్రమముగా చైతన్యము నందు శక్తి, శక్తి యందు పరమాణువులు... ఇట్లున్నవని తెలియును. వాస్తవమునకు చైతన్యము యొక్క స్థితి మార్పే శక్తి. శక్తి యొక్క స్థితి మార్పే పరమాణువులు. అఖండ చైతన్యమగు స్వామి యొక్క వేరొక స్థితియే శక్తి యగు అమ్మవారు. ఆమె యొక్క స్థితి మార్పే జగత్తు.

ఈ అలివేలుమంగాంబా వేంకటేశ్వరుల అనురాగమును, ఆనంద విహారమును అన్నమయ్య తనలోనే అనుభూతి నందెనని ఈ సంకీర్తనమున వ్యంగ్యముగా సూచింప బడినది. తనలోని మూలాధారమే తిరుచానూరు. అచటనున్న మాయాశక్తి యగు కుండలినియే అలివేలుమంగాంబిక. సహస్రారమే తిరుమల శిఖరము. అందున్న పరమాత్మయే వేంకటేశ్వరుడు. తనలోని కుండలిని హృదయకమలము మీదుగా భక్తియోగ సాధన వలన సహస్రారమును చేరినది. అనగా ప్రేమ యొక్క వికాసము మీదుగా, శరణాగతి మీదుగా చేరినది. అచట కుండలిని, పరమాత్మతో కలిసిపోయి ఒకటి యగుటయే, మంగాంబిక వేంకటేశ్వరుని కౌగిలిలో ఒదిగి ఒకటి యగుట. మాయాశక్తి స్వామియందు లీనము కాగానే, జీవుడును పరమాత్మ యందు కరగి పోవును. మాయయే ఇర్వురిని వేరుచేయునది. ఇక ఈ సంకీర్తనమున చెప్పబడినట్లుగా తనలోనే సహస్రారమున అమ్మవారు స్వామివారి కౌగిలిలో నొదుగుట జరిగినది. ఇక అన్నమయ్య యను జీవప్రజ్ఞ వేరుగా నుండదు. భగవంతుని కౌగిలిలో ఒదుగును. పరమాత్మ అనుభూతిసాగరుడు. ఆయన యందు అన్నమయ్య ప్రజ్ఞయు లీనమాయెను. ఇతడు అఖండబ్రహ్మానుభూతిలో మునుగుట, ఆపై తానే అనుభూతి యగుట జరిగినది. భాగవతమున ఒక ఘట్టము గలదు. పృథుచక్రవర్తి యను రాజర్షి, లక్ష్మీదేవి నిట్లు ప్రార్థించెను. "అమ్మా, ఎల్లప్పుడును నీవే స్వామి సేవలో మునిగియున్నావు. నాకును నీ స్థితి నిమ్ము." రామాయణమున సీతాదేవి అనుగ్రహము నొందిన హనుమంతునకు శ్రీరాముడు తన కౌగిలిని ప్రసాదించెను. దీని సంకేతము గూడ జీవుడు పరమాత్ముని యందు లయమగుటయే. దేవుని పొందుటకై పాటుపడుట యనరాదు. అన్నమయ్య మార్గమున జీవితము దేవుని గూర్చిన పాట పాడుటయే.

ఈ సంకీర్తనమున అన్నమయ్య మనకును ఉపదేశము నొసంగుచున్నాడు. మన పెదవుల నుండి వెలువడు వాక్కుతో జీవులుగా నున్న స్వామికి ఆహ్లాదము కల్గింప వలెను. మనము సమస్త ప్రకృతిని, సమస్త స్త్రీలను అమ్మవారుగా భావించి, ప్రకృతి వంటి స్వచ్ఛమైన హృదయముతో స్వామి దయను పొందవలెను. మన వ్యక్తిగత ప్రజ్ఞ, స్వామి యొక్క అఖండ ప్రజ్ఞలో లీనము కావలెను. ఇదియే స్వామి కౌగిలిలో ఒదిగిపోవుట. అమ్మవారికున్నంత అఖండప్రేమ మనకు జీవులపై నున్నచో, ఈ స్థితి దైవానుగ్రహమున లభించును.

* * *

7

4వ సం-313

అయమేవ

అయమేవ అయమేవ ఆదిపురుషో
జయకరం తమహం శరణం భజామి. ॥ పల్లవి ॥

అయమేవ ఖలు పురా అవనీధరస్తు సోఽ
ప్యయమేవ వటదళాగ్రాధిశయనః
అయమేవ దశవిధైరవతారరూపైశ్చ
నయమార్గభువి రక్షణం కరోతి. ॥ అయ ॥

అయమేవ సతతం శ్రియఃపతిర్దేవేషు
అయమేవ దుష్టదైత్యాంతకస్తు
అయమేవ సకల భూతాంతరేష్వాక్రమ్య
ప్రియభక్త పోషణం ప్రీత్యా కరోతి. ॥ అయ ॥

అయమేవ శ్రీవేంకటాద్రౌ విరాజతే
అయమేవ వరదోఽపి యాచకానాం
అయమేవ వేదవేదాంతైశ్చ సూచితో
ఽప్యయమేవ వైకుంఠాధీశ్వరస్తు. ॥ అయ ॥

మతము, జాతులతో ప్రమేయము లేక, సత్యస్వరూపుడైన
దేవుని యునికిని అనుభూతి నందుటే మానవత్వము.

టీక

అయమ్+ఏవ = ఇతడే, అయమ్+ఏవ = ఇతడే, ఆదిపురుషః = మొదటి పురుషుడు, జయకరం = జయమును కల్గించునట్టి, తమ్ = అతనిని; శరణం = శరణమైన వానిని; భజామి = భజించుచున్నాను.

అయమ్+ఏవ = ఇతడే; పురా=పూర్వము; అవనీధరః+తు = అవనిని ధరించిన వాడు కూడ; ఖలు=అయియున్నాడు; సః+అపి = అతడే; అయమ్+ఏవ = ఇతడే; వటదళాగ్రాధిశయనః = మఱ్ఱి యాకు యొక్క మొనపై అధిష్ఠించి శయనించువాడు; అయమ్+ఏవ = ఇతడే; దశవిధైః+ అవతారరూపైః +చ = పది విధములయిన అవతార రూపములతోను; నయమార్గభువి = నీతి మార్గము గల భూమియందు (నీతిమార్గము గల దానిగా భూమిని) రక్షణం=రక్షణమును; కరోతి = చేయుచున్నాడు.

అయమ్+ఏవ = ఇతడే; సతతం = ఎల్లప్పుడు; దేవేషు = దేవులయందు (దేవతల యందు); శ్రియః పతిః = శ్రీదేవికి పతియైనవాడు; అయమ్+ఏవ= ఇతడే; దుష్టదైత్య+అంతకః+తు =దుష్టులగు దైత్యులను అంతమొందించు వాడును; అయమ్+ఏవ = ఇతడే; సకల భూత+అంతరేషు = సర్వజీవుల లోపలి భాగములందు; ఆక్రమ్య = ఆక్రమించి; ప్రియభక్తపోషణం = ప్రియులయిన భక్తులను పోషించుట; ప్రీత్యా= ప్రీతితో; కరోతి = చేయుచున్నాడు.

అయమ్+ఏవ = ఇతడే; శ్రీవేంకటాద్రే = శ్రీవేంకటాద్రియందు; విరాజతే = విరాజిల్లుచున్నాడు; అయమ్+ఏవ = ఇతడే; యాచకానాం = అర్థించువారికి; వరదః+అపి = వరములిచ్చువాడు కూడ; అయమ్+ఏవ= ఇతడే; వేదవేద+అంతైః+చ = వేదములందును, ఉపనిషత్తు లందును సూచితః+అపి = సూచింపబడిన వాడు కూడ, అయమ్+ఏవ = ఇతడే, వైకుంఠ+అధ+ఈశ్వరః+తు = వైకుంఠమును అధిష్ఠించిన ప్రభువు కూడ.

పరిచయము

ఈ సంకీర్తనమందు అన్నమయ్య స్వామి యొక్క మహిమను, దివ్యగుణములను, వైభవములను భక్తితో నుతించుచున్నాడు. 'ఇతడే', 'ఇతడే' అని మాటిమాటికి చెప్పుటలో స్వామితో తనకు గల దగ్గరతనమును తెలుపుచున్నాడు. మఱియు స్వామి యొక్క ఒక్కొక్క గుణమునో, వైభవమునో తెలుపు నామమునకు ముందు 'ఇతడే' యని ఇంతటి గుణ మహిమా వైభవములు గలవాడని వక్కాణించుట గలదు. పల్లవిలో స్వామిని మొట్టమొదటి పురుషుడని వర్ణించి, ఆయనకు తాను శరణంది, సేవించుటను ప్రకటించుచున్నాడు. తరువాతి చరణములు ఈ మొదటి పురుషునిలో లీలలు, వైభవములతో గూడినవి. మరల చరణములకు చివరలో పల్లవిని అనుసంధింపవలయును. అనగా ఇట్టి ఆదిపురుషునకు నేను శరణందుచున్నానని మరల మరల చెప్పుచున్నాడు. తిరుమలలో వెలసిన వేంకటేశ్వరుడు భక్తులను ఉద్ధరించుటకై మనకెంతో సన్నిహితుడే కాని, అతడు పరమపురుషుడు. వేంకటేశ్వర స్వామియందు పారమ్యము, సౌలభ్యమును రెండును గలవు. సర్వశ్రేష్ఠుడాయనయే. సర్వులకు సులభుడును ఆయనయే. వేంకటాద్రిపై వెలసినవాడు వెలుగే తానయిన

వాడు. ఆ వెలుగు సర్వజీవుల హృదయములందు వసించుచున్నది. అట్టి వెలుగే ఒకచోట రూపుకట్టి వేంకటేశ్వరుడుగ గానవచ్చుచున్నాడు. వేదపురాణముల యందు, ఉపనిషత్తులయందు కీర్తింపబడిన మహిమ గలవాడుగా అన్నమయ్య భక్తితో స్వామిని నుతించుచున్నాడు. స్వామి తత్త్వము అవగతమగునది గాదు. మానవుని పరిమిత మేధతో కొలువరానిది. ఆకాశపు టెత్తును ఎవడు కొలువగలడు? స్వామి వెలుగు మన కొలతల కతీతమయినదని విష్ణుసూక్తములు చెప్పుచున్నవి. ఆతనిని నుతించుట సాధ్యము కాదు. కాని ఆతనిని నుతించినచో మాత్రము సహజానంద స్థితి గలుగును. భక్తుడు తనకు స్వామి అందించినమేర భావములు. భాషతో స్వామిని కీర్తించును. అనుభూతితో నిండిన అన్నమయ్య హృదయమును వరించి స్వామియే ఈవిధముగా సన్నుతిని సంకీర్తనముగా వెలయించుచున్నాడు.

పల్లవి యొక్క తాత్పర్యము

"ఇతడే, ఇతడే మొదటి పురుషుడు. ఇతడే జయమును కలిగించువాడు. అట్టివానిని నేను శరణంది సేవించుచున్నాను."

వ్యాఖ్య

వేదమునందలి పురుషసూక్తమున ముగ్గురు పురుషులు వర్ణింపబడిరి. మొదటి పురుషుడు సృష్టికి ముందున్నవాడు. ఇతడు గుణాతీతుడు. రెండవవాడు విశ్వసృష్టి యందు అంతర్యామి. ఈతడు సగుణుడు. మూడవవాడు అంతర్యామి నుండి భాగముగా వచ్చిన జీవుడు. ఇతడు త్రిగుణములచే బద్ధుడు. మొదటివాడే రెండవ వానిగా త్రిగుణములు గల మాయతో గూడి అగుచున్నాడు. కావున మొదటివాడే రెండవవాడు. వేషమే వేరు. నటుడొకడే. రెండవవాడు కూడ మాయతో కూడినను దానితో క్రీడించునే గాని, దానికి బద్ధుడు గాడు. మూడవవాడు ఖండ ప్రజ్ఞ అయిన జీవుడు. ఇతడు మాయాబద్ధుడు. ఉదాహరణకు కొందరు నిద్రించుచుండగా, వీరెల్లరిలో ఒకే ప్రజ్ఞ వెలుగుచుండును. అతడే మొదటి పురుషుడు. ఇక ఎల్లరికి మెలకువ వచ్చిన పిమ్మట అందరిలోను ఒకే అంతర్యామి ప్రజ్ఞ. ఇతడు రెండవ పురుషుడు. మొదటివాడే రెండవవాడుగా వేషము మార్చెను. ఇక మెలకువ వచ్చిన పిదప ఎవనికి వాడు ఫలానా వాడనను ప్రజ్ఞ పనిచేయును. ఇతడే జీవుడు. ఇతడు రెండవ వానిలో భాగము. అంతర్యామి యొక్క వివిధ రూపములే జీవులు. ఇంకొక ఉదాహరణము. బంగారముతో చాల నగలు – హారములు, గాజులు, అందెలు, ఉంగరములు మున్నగునవి చేయబడును. నగలుగా గాక పూర్వమున్న బంగారము ఆదిపురుషుడు. ఆయా నగలన్నిటిలో గల బంగారము రెండవ పురుషుడు. ఇక ఏనగ కానగ జీవుడు. పళ్ళెములో గోధుమపిండి యున్నది. దానితో చపాతీలు చేయబడినవి. చపాతీలుగా తయారుగాక పూర్వమున్న గోధుమపిండి ఆదిపురుషుడు. చపాతీలన్నిటిలో దాగిన గోధుమపిండి రెండవ పురుషుడు. ఇతడే అంతర్యామి. ఒక్కొక్క చపాతీ, ఒక్కొక్క జీవుడు. మొదటివాడు అవ్యక్తమగు గుణాతీత పరబ్రహ్మము. ఇతడే సగుణబ్రహ్మముగా సృష్టియందు అంతర్యామి అయ్యెను. ఇతడే జీవులుగా వివిధ రూపములు ధరించెను. వేంకటేశ్వరుడు ఈ

మొదటి పురుషుడని అన్నమయ్య దర్శనము. వాస్తవమునకు వేంకటేశ్వరుడు సాకారుడు. సగుణుడు. అయినను మొదటి పురుషుడే సగుణుడయ్యెను గావున వేంకటేశ్వరునే ఆదిపురుషుడుగా సంభావించుట తగినదే. ఇంతకు పురుషు డనగానేమి? పురము లేనివాడు, పురమను నివాసమును గోరువాడు. ఇట్లు విశ్వమను పురము రాకముందున్న పరమాత్మకు విశ్వమను పురము నందు నివసింప కోరిక కల్గెను. కావున పరమాత్మను పురుషుడందురు. అంతేకాని మగవాడని అర్థము కాదు. ఈ పరమాత్మయే విశ్వమను పురమును తననుండి వెలువరించి, అందు అంతర్యామి అయ్యెను. సర్వదేవతలకు, జీవులకు మూలకారణమైన ఆదిపురుషుడీతడు. శ్రీవేంకటేశ్వరుడు జయమును కల్గించువాడు. జయమనగా నెట్టిది? భగవానుడే ప్రతి జీవిగా దిగివచ్చుటచే, ప్రతివానిలోని దేవుని గుణములయిన ప్రేమ, స్వచ్ఛత, సమత్వము, స్థిరత్వము, కరుణ, ఋజుత్వము, ఔదార్యము, సహనము, నిత్యతుష్టి మున్నగునవి యుండును. కాని దేహబద్ధుడగుట వలన జీవునకు పరిమితత్వ మేర్పడును. ప్రేమ పరిమితమగును. మనము స్వార్థమనుకొనునది పరిమిత ప్రేమ యని స్వామివివేకానందులు పేర్కొనిరి. అతిశయము, అసూయ, కోపము మున్నగు మలినములంటును. మొదటివే ధార్మికములగు దివ్యగుణములు. రెండవవే అధార్మికములగు అసుర గుణములు. ఈ రెంటి నడుమ వ్యక్తిలో సంఘర్షణ ఏర్పడును. సాధారణ పరిస్థితులలో లంచము గ్రహింపనివాడు కూడ, ఒక్కొక్కసారి భార్యకు జబ్బు చేయగా, డబ్బు లేనిచో లంచము తీసికొనుటకు దిగజారు నవకాశము గలదు. ధర్మస్వరూపుడగు స్వామికి శరణాగతి నందినచో, ధార్మిక శక్తులకే, అధార్మిక శక్తులపై విజయమును స్వామి కల్గించును. దీనికి సంకేతమే మహాభారత కథ. ధార్మిక శక్తులయిన పాండవులకు విజయము చేకూర్చినది స్వామి అయిన శ్రీకృష్ణుడు. స్వామియే మనకు శరణము. అనగా స్వామి స్మరణము, సేవ వలననే మనలో ధార్మికత వికసించును. ఆనందము లభించును. ఆయనకు శరణంది భజించుట యనగా, ఆయన మార్గమునకు శరణంది, ఆ బాటలో జీవించుచు, ఆయనను సాటి జీవులలో అంతర్యామిగా సేవించుట. సొంత సంకల్పములు, అభిప్రాయములు, మనస్సు, బుద్ధి, నేను, నాది అను భావములను భగవంతునికి హృదయమార సమర్పణ మొందుటయే శరణము. ఒకసారి రాధాదేవి మురళితో నిట్లనెనట "స్వామి నన్నైనను విడిచి యుండగలడు గాని, నిన్నెప్పుడును విడిచి యుండడు. నీలో విశేషమేమున్నది?" దానికి మురళి రాధాదేవితో నిట్లు బదులు చెప్పినదట. "నాలో ఏమున్నదో నీవే చూడుము". రాధ అంతట మురళిలో తొంగి చూచెను. ఏమియు కనపడలేదు. కావున మనసులో ఎట్టి అభిప్రాయములు లేక శూన్యమయినచో దానిని శరణాగతి యందురు.ఇట్టి శరణాగతితో అన్నమయ్య స్వామిని సేవించుచున్నాడు.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"ఇతడే భూమిని ధరించినవాడై యున్నాడు. అతడే ఇతడు. అవతారముల రూపములతో భూమిపై ధర్మమార్గమును ప్రతిష్ఠించి రక్షించుచున్నాడు."

వ్యాఖ్య

ఈ వేంకటేశ్వరుడే భూమి నిలబడుట కాధారము. భూమి తన చుట్టు తాను తిరుగుచు సూర్యుని చుట్టు తిరుగుచుండును. ఈ మార్గము విద్యుద్వాహికయగు ఒక తీగ చుట్ట వలె వర్తించుచున్నది. దీనినుండి విద్యుదయస్కాంత తరంగములు పుట్టుకొని వచ్చును. ఇవి మన భూమికి ప్రాణశక్తిని ధారవోయును. ఈ ప్రాణశక్తియే జీవులలోనికి ప్రవేశించును. ఇట్లు భూమిని ధరించుచు, భరించుచున్న విద్యుదయస్కాంత శక్తి, సూర్యుని ద్వారమున సూర్యాంతర్వర్తియగు నారాయణుని నుండి ఏర్పడుచున్నది. ఇట్లు భూమిని ధరించుచున్నది స్వామియే. ఇట్లు స్వామికి అవనీధరుడను ప్రసిద్ధి కలిగినది. భూమిపైన జీవులు నిలిచియుండి దానిచే రక్షింపబడుచున్నారు గావున భూమికి 'అవని' అని పేరు వచ్చినది. భూమికి గల రెండు పరిభ్రమణముల వలన మనము క్రింద బడకుండ నిలిచియున్నాము గదా. భూమి యొక్క ప్రాణశక్తియే మనలోనికి ప్రాణముగా వచ్చి, మనలను కాపాడుచున్నది. ఇంతేగాక అన్నమయ్య స్వామిని పూర్వము 'అవనీధరుడాయెను' అని కీర్తించెను. గ్రహ గోళముల భౌతికమగు అస్తిత్వము శూన్యములోనికి ప్రళయకాలమున ప్రవేశించును. ఈ భౌతికమగు యునికినే భూమి యందురు. దీనిని అవ్యక్తమగు ప్రళయము నుండి వెలికిదెచ్చిన స్వామిని వరాహమూర్తి యందురు. వరాహమూర్తి తన కోరల నడుమ గల ముట్టెపై భూమిని ధరించెనని పురాణగాథ. దీని సంకేతభావ మిట్లున్నది. భౌతిక గోళమును ఉద్ధరించుటకు రెండు కిరణములు పుట్టును. అవియే వరాహమూర్తి కోరలు. వాని నడుమనున్న చీకటియే వరాహమూర్తి యొక్క ముట్టె. మన కన్నులకది చీకటి గాని, దానికది మన యూహకందని వెలుగు. వరాహ మనగా మనము వరింపదగిన శరణందవలసిన వెలుగు. తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సమీపముననే వరాహమూర్తి యున్నాడు. ఇర్వురు నొకటియే. అతడే ఇతడు. అతడనగా మన యూహకందని వెలుగయినవాడు. ఇతడనగా మనకు కనపడు వేంకటేశ్వరుడు. ఈతడు వట్టి మూర్తి గాదు. పరంజ్యోతి. ఇతడే వటపత్రము యొక్క చివఱన శయనించినవాడు. ఇది ఒక సంకేతగాథ. వటపత్రమున్న సాగరము ప్రళయములోని చైతన్య ప్రవాహము. వటపత్రమనగా మన యూహకందక ప్రళయమున శూన్యము వలె కన్పించు స్థితి. దానియందు పరమాత్మ శయనించి యున్నవాడు. ఎట్లు? తన చేయి అను తామరతో, పాదమను తామరను, నోరు అను తామరలో చొప్పించియుండును. ఇచట కరపద్మ మనగా సంకల్పమను కిరణము, పాదపద్మ మనగా విశ్వము. ముఖపద్మ మనగా ప్రళయము. తన దివ్య సంకల్పముతో విశ్వమును ప్రళయములోనికి గొనిపోయి, తనలోనికి లీనము గావించుకొని, మన యూహకందని స్థితిలో యోగనిద్రను నటించువాడు స్వామి. ప్రళయస్థితి మన యూహకందదు. కారణము మనమప్పు డుండము గదా. శ్రీవేంకటేశ్వరస్వామి "మత్స్య కూర్మ వరాహ నారసింహ వామన పరశురామ శ్రీరామ బలరామ బుద్ధ కల్కులు" అను దశ విధములగు అవతారములుగ వచ్చి భూమిపై ధర్మమును రక్షించుచున్నాడు. దుష్ట శిక్షణ, సాధు రక్షణ, ధర్మ సంస్థాపనము గావించుచున్నాడు. శ్రీరామ శ్రీకృష్ణులుగా ధర్మమునకు ఆదర్శము నెలకొల్పెను. శ్రీరామునకు ధర్మవిగ్రహుడనియు, శ్రీకృష్ణునకు ధర్మకాయుడనియు పేర్లు గలవు. ధర్మము అనగా తల్లిదండ్రుల యెడల,

సోదరుల యెడల, భార్య యెడల, సంతానము నెడల, సఖుల యెడ, తోటి సమాజ సభ్యుల యెడ పరమ ప్రేమతో కర్తవ్యములను నిర్వహించుచు, జీవితమును కర్తవ్యములతో నింపుట. బరువుబాధ్యతలుగా గాక, ధర్మాచరణమును పరమప్రేమతో, శ్రద్ధతో, నేను చేయు చున్నానను స్పృహ లేకుండ అంతర్యామికి సమర్పణ గావించిన యెడల మోక్షము అపుడే కలుగును. ధర్మాచరణ జీవితమున ఎప్పుడో కలుగునది మోక్షము గాదు. ధర్మాచరణ చేయునప్పుడే మోక్షము కలుగును. ఇట్లు తాను ధర్మము నాచరించుట, స్థాపనము చేయుట, ధార్మిక శక్తులకు విజయము కల్గించుటయే గాక, తన ధర్మ సంస్థాపనా ప్రణాళికకు సమర్పించుకొన్న జీవితమును గడుపు వారికి రక్షణము, మోక్షము నిచ్చినవాడు అవతారమూర్తియగు స్వామి. నయమార్గ మనగా తీసికొని వెళ్ళు మార్గమని యర్థము. తననుండి వచ్చిన జీవులను తిరిగి తన సన్నిధికి గొనివెళ్ళు ధర్మమార్గమును, మోక్షమార్గమును కూడ రక్షించినవాడు దశావతారమూర్తి యగు స్వామి.

2వ చరణము యొక్క తాత్పర్యము

"ఇతడే సదా దేవతలలో 'శ్రీదేవికి' పతి. ఇతడే దుష్టుడగు దైత్యులను అంత మొందించువాడు. ఇతడే సకల జీవుల అంతరములను ఆక్రమించినవాడై, తనకు ప్రియులగు భక్తులను ప్రీతితో పోషించుచున్నవాడు."

వ్యాఖ్య

క్షీరసాగర కన్య యగు లక్ష్మీదేవి, మిగిలిన దేవతలను కాదని విష్ణునే వరించెనని పురాణ కథ. ఈమెనే శ్రీదేవి యందురు. 'శ్రీ' అనగా నిత్యము ఆశ్రయించుకొని యుండునది. ఆమె నారాయణుని ప్రేమ, శోభ, శక్తి, సంకల్పము. కనుక ఆయననే ఆశ్రయించుకొని యుండును. శ్రీదేవికి పతి నారాయణుడే. దేవతలెల్లరిలో శ్రేష్ఠుడాయనయే కదా. కారణము దేవతలెల్లరు స్వామియందు అంగభూతులు – అనగా భాగములు. స్వామి దారము, వీరు పూలు. స్వామి ఆత్మ, వీరు శరీర భాగముల కధిపతులగు ప్రజ్ఞలు. స్వామి సర్వాంతర్యామి, వీరు సర్వాంతర్యాములుగారు. ఉదాహరణకు శరీరములోని ప్రతి అణువునందును 'నేను' అను చైతన్యముండును. అదియే నారాయణుడు. ఏ శరీర భాగమునకు ఆయా దేవత అధిపతియై యుండును. చేతులకు, పాదములకు, వివిధములగు ఇంద్రియములకు, మనస్సు కధిపతులగు దేవతలు. వీరిలో ఏ ఒక్కడును మొత్తము శరీరము నందు అంతర్యాములు గారు. అట్లే విశ్వమునందును నారాయణుడే అంతరాత్మ. ఆయన చేపట్టు ఒక్కొక్క ప్రక్రియను నడిపించు ప్రజ్ఞను దేవత అందురు. దేవత అనగా దివ్యత. దేవుని యొక్క గుణమని భావము. దేవతలకు స్వతంత్రత లేదు. ఒక వ్యక్తియొక్క ప్రేమ అతనికే చెందియుండును గాని, శరీరములోని ఏ భాగమునకును చెందదు. ఒక వ్యక్తి ప్రేమతో తన చేతిమీదుగా కుమారునకు అన్నము పెట్టును. నోటితో తీయగా పలుకును. చెవులతో పిల్లల కేకలు వినును. కనుచూపులతో వారిని చూరగొనును. ఇన్ని శరీర భాగములకు వేరు వేరు ప్రేమలుండవు. ప్రేమ ఆ జీవునిదే. ఆ యా భాగముల ద్వారమున ఆ వ్యక్తి ప్రేమ వ్యక్తమగును. ఆయా భాగములందు పనిచేయు ప్రేమ వ్యక్తి యొక్క వాత్సల్యము. భాగములు కూడ బిడ్డల వంటివారే. బిడ్డలపై చూపు ప్రేమ వాత్సల్యము. కాని ప్రేమ

చెందునది మొత్తము శరీరమునందు అంతర్యామి అయిన వానికే. ఇట్లే మొత్తమునకు ప్రేమ చెందును. భాగములకు పంచిపెట్టబడును. శక్తి విషయము కూడ అంతియే. శరీర భాగములలో ఒక్కొక్కదానిలో వేరు వేరు శక్తులుండవు. జీవికున్న శక్తియే వివిధ భాగములకు పంచిపెట్టబడును. అట్లే విశ్వమునందంతట అంతర్యామియగు విష్ణునకే ప్రేమ, శక్తి చెందును. ఆ రెండును కలిసియే శ్రీదేవి. శ్రీదేవికి పతి, మొత్తమునం దంతర్యామి యగు స్వామియే. దేవతలు ఆయన యందు భాగములు. ఆమెకు బిడ్డలు. వారియెడల ఆమె నెఱపునది వాత్సల్యము. ఆమెకు పతి స్వామియే. ఒక చెట్టులోని భాగములను బోదెకు, కొమ్మలకు, ఆకులకు, పూలకు, పండ్లకు వేరుగా నీరు పోయనక్కఱలేదు. చెట్టు మొదట పోసిన చాలును. అన్నిటికిని దాని ప్రభావము విస్తరించును. కావున అంతర్యామి యగు విష్ణు నర్చించిన చాలును. దేవతలను విడిగా అర్చింప బనిపలేదు. ఒకవేళ అర్చించినను విష్ణుని రూపములని మఱవరాదు. వేదములలో వివిధ సూక్తములలో ఇది చేయబడినది. ప్రతి భాగమును అంతర్యామి స్వరూపముగ నుతించు సూక్తములను ఋషులు దర్శించిరి. కాని ఆ నుతి అంతర్యామికే చెందును. ఇది తెలియని పండితులు కొందరు భారతీయులు గాని, పాశ్చాత్యులు గాని భారతదేశమున బహుదేవతారాధన మున్నదని పొరపడిరి. ఈ దేవతలు – దేవునిలో భాగములు తాము అనియు, ఆయన శక్తియగు శ్రీదేవి వాత్సల్యము వలననే తాము తమ కప్పుజెప్పబడిన చర్యలు చేపట్టుచున్నామనియు మఱచినపుడెల్ల దుష్టులగు దైత్యులు వారిని జయించెదరు. అనగా ఇంద్రియములు, మనస్సు స్వామికి శరణాగతులై యున్నంత కాలము, వానిని అసురగణము లేమియు చేయజాలవు. ధర్మగుణములే వానిలో పనిచేయును. శరణాగతి తప్పగనే అతిశయము, క్రామ కోధ లోభ మత్సరాది దుష్టగుణములు ఇంద్రుని సింహాసనమును అనగా స్వర్గమును – అనగా ఆనందమును పోగొట్టెదరు. మఱల ఇంద్రుడు విష్ణుని పాదములకు శరణాగతి చెందగనే, స్వామి హృదయమున నిలుచుటతో దైత్య గుణములు తప్పుకొనును. దేవాసుర సంగ్రామమున విష్ణుడు దేవతలకు విజయము చేకూర్చును. వ్యక్తిలో గాని, సమాజములో గాని, ధార్మికశక్తులకు, అధార్మిక శక్తులకు నడుమ ఘర్షణ ఏర్పడినపుడు స్వామి ధార్మిక శక్తులకే విజయము చేకూర్చును. సద్గుణములే విజయము నొందును. దుర్గుణములు తొలగును. దితి యనగా ఖండ దృష్టి. దైత్యులనగా ఒకరినొకరు వేరుగా చూచుకొను లక్షణములు. అదితి అనగా అఖండ దృష్టితో సమాజమును సేవించు దృష్టి. ఈమె కుమారులగు కరుణాదులగు సద్గుణములే దేవతలు. కాని నేను సద్గుణములు గలవాడనను అతిశయ భావము మొలకెత్తినచో, మిగిలినవారు తనకంటె తక్కువ స్థాయివారను భేదభావము పుట్టును. ఇదియే దుర్గుణములకు మూలము. ఇట్లు సద్గుణములు గలవాడైనను, అవి గలవాడనని గుర్తున్నచో జీవుడు దుర్గుణములలోనికి పతనమొందును. మఱల ఉద్ధరింప బడుటకై సర్వాంతర్యామి యగు స్వామికి శరణందుటయే దారి. సమాజమున కాలగతిలో ఒక్కొక్కసారి ఈ దైత్య గుణములు – అహంకారము, గర్వము, అసూయ, వంచన, క్రోధము, పగ, క్రౌర్యము, హింస, ప్రజాపీడనము ఎక్కువై జనులకు ఆపద వాటిల్లినపుడు, లోకకంటకుల వలన సాధువులకు, సామాన్యులకు విపత్తు లెక్కువై నప్పుడు దేవుడవతరించి, ఈ దుష్టులను నశింపజేసి, ధర్మమును కాపాడుట జరుగును. దైత్యులనగా

కోరలుండనక్కఱలేదు. భయంకర వేషములతో బనిలేదు. మానవులలోనే లోకకంటకులై పరస్త్రీలను, పర ధనమును, ప్రాణములను హరించు వారిని దైత్యులందరు. నరకుడు, కంసుడు, శిశుపాలుడు, పౌండ్రకుడు ఇట్టివారే. వారి పాలిటి యముడు శ్రీకృష్ణుడు. వాలి, రావణుడు, ఖరదూషనాదు లిట్టివారే. వీరి పాలిటి యముడు శ్రీరాముడు. స్వామియే సకల భూతముల అంతరములను ఆక్రమించియున్నాడు. భూతములనగా పిశాచములు గాదు. అయినవని యర్థము. అనగా 'అగుట' అను మార్పు రాకుండ మూలమగు తానున్న స్థితిలో నుండువాడు నారాయణుడు. ఆయనయే సకల జీవులుగా నయ్యెను, బంగారమే నగలయినట్లుగా. బంగారము నారాయణుడు. నగలు జీవులు. కావున భూతలములనగా పంచభూతము లని యొక అర్థము. ఇచట మాత్రము జీవులను అర్థమును గ్రహింపవలయును. జీవుల అంతరములను అనగా లోపలి హృదయములను స్వామి ఆక్రమించి, అచట వసించుచున్నాడు. శ్రీకృష్ణుడు గీతలో చెప్పెను. "ఈశ్వరుడు సర్వజీవుల హృదయము లలో నిలిచి, తన మాయాశక్తితో వానిని నడుపుచున్నాడు". ఈశ్వరుడు ప్రేమమూర్తి. ఆయన జీవుల హృదయము లందుండి తన ప్రేను పంచుట వలననే గుండె యొక్క స్పందన, శ్వాస, ఆకలి, నిద్ర, దప్పిక మున్నగునవి ఏర్పడుచున్నవి. ఉత్తర ధ్రువ ప్రాంతమున సాగరపు నీరు మంచుగడ్డలుగా మారి, మఱల ఆ మంచుగడ్డలలో నిలుచును. అట్లే పరమాత్మ, జీవులుగా మారి వారి హృదయములందు అంతరాత్మయై యున్నాడు. జీవుడు దేహముతో ముడిపెట్టుకొన్న 'చిన్న నేను' దేవుడు వీరికి ఆధారమై సర్వ దేహములలోని 'పెద్ద నేను'. తనకు ప్రియులయిన భక్తులను స్వామి ప్రేమతో పోషించును. ఎల్లరకు ఆకలి, దప్పిక, శ్వాస మున్నగునవి ఇచ్చుచున్నాడు. కాని శరణాగతులయిన భక్తులను ఆపదల నుండి కాపాడును. కర్మఫలములుగా ఆపదలు భక్తులకును సంభవించును. వారు ఇతరులకు మేలు చేయువారు. స్వామికి శరణందిన వారు. వారిని ఆపదలు తటస్థించినను, కొంతకాలమే నిలిచి, స్వామి దయ వలన తొలగును. ఇట్లు వాత్సల్యముతో తన ప్రియ భక్తులను స్వామి తప్పక పోషించును. ప్రహ్లాదుని, గజేంద్రుని, శబరిని, ద్రౌపదిని, కుబ్జను, కుచేలుని, పాండవులను, గోకుల వాసులను కాపాడినవాడు. కలియుగమునను భక్తరక్షణుడు స్వామి యనుట సత్యమే. భక్తుల యోగక్షేమములను తానే వహింతునని స్వామి అభయ ప్రదానము. భక్తుడు స్వామియొక్క ప్రేమమార్గముననే అనుసరించుచు, దేవుడు తోటి జీవులను చూచునట్లే, తానును చూచును గదా. వీరిని కాపాడుట తన భుజములపై స్వామి వేసికొనును. స్వామికి ప్రియులు, అప్రియులు లేరు. కాని భక్తులు తన లోకహిత కార్యమున పాల్గొనువారగుటచే దగ్గరగుదురు. ప్రియభక్తులెవరు? లోకమునకు ప్రీతి కొల్పువారే స్వామికి ప్రియ భక్తులు.

3వ చరణము యొక్క తాత్పర్యము

"ఇతడే శ్రీవేంకటాద్రియందు విశేషముగా ప్రకాశించుచున్నాడు. ఇతడే అర్థించు వారికి వరములిచ్చువాడు. ఇతడే వేదములందును, వేదాంతములయిన ఉపనిషత్తు లందును సూచింపబడినవాడు. ఇతడే వైకుంఠము నధిష్ఠించిన ప్రభువు".

వ్యాఖ్య

పై చరణములందును, పల్లవి యందును కీర్తింపబడిన ఆదిపురుషుడే శ్రీవేంకటాద్రిపై విశిష్ట శోభతో వెలుగొందుచున్నాడు. స్వామి మోహనమూర్తిని చూడగనే జనులలో శుభగుణములు వికసించ మొదలిడును. తమలో దాగిన దివ్యత్వము వెలికిరా నారంభించును. తమలో ఆనందోత్సాహములు కలుగును. తమ హృదయము లందును ఆ స్వామియే వెలుగుచున్నట్లు అనుభవము గలుగును. స్వామి తేజస్సు వీరిని లోగొని, వీరి బ్రతుకులలో శోభను చేకూర్చును. భక్తులలో నాలుగు దశలుగా, నాలుగు విధములగు భక్తిగల వారున్నారని కృష్ణుడు గీతలో చెప్పెను. 1. ఆర్తులు : ఆపదలో భగవంతునికి మొఱలిడువారు–గజేంద్రుడు, ద్రౌపది వంటివారు. 2. అర్థార్థులు : ప్రయోజనము నాశించి స్వామిని వేడువారు – సుగ్రీవుడు మొదలగువారు. 3. జిజ్ఞాసువులు : భగవంతుని అంతర్యామిత్వమును గుర్తించి సేవించువారు – గుహుడు, విభీషణుడు, అర్జునుడు, భీష్ముడు మున్నగువారు. 4. జ్ఞానులు : భగవంతుని అంతర్యామియని గుర్తించి, దాని ననుభూతినంది, తమ యునికిని దేవునందు కోల్పోయి తమ చిత్తము స్థానమున స్వామియే యున్నవారు. ప్రహ్లాద నారద పరాశర వ్యాసాంబరీష శుకశౌనక గోపికాదులు, ఆంజనేయుడు, ఉద్ధవుడు వంటివారు. వీరెల్లరు సరియయిన మార్గమున ప్రయాణించువారే. కాని జ్ఞానియగు పరమభక్తుడు తానేయని స్వామి చెప్పెను. అయినను పై ముప్వురను స్వామి నిరసించడు. ఆర్తులగు గజేంద్రుని, ద్రౌపదిని కాపాడెను. ప్రయోజనము నాశించి తన వద్దకు వచ్చిన సుగ్రీవుని కాపాడెను. తననుండి జ్ఞానమును గోరి వచ్చిన వారికి విభీషణుడు, అర్జునుడు వంటి వారికి దాని నొసంగెను. వీరెల్లరు అడిగిన దానిని ఇచ్చుచునే, వారికి క్రమముగా తన సాన్నిధ్య స్వరూపమయిన ఆనందమాధుర్యములోనికి గొనిపోవును. ఇదియే ప్రహ్లాదాదుల స్థితి. మొదటి మూడు దశల వారు గూడ నాలుగవ దశకు చేర్చబడుదురు. వరదుడనగా వరములిచ్చువాడు. వరమనగా అర్థించినవాడు అడిగినది అని సామాన్యార్థము. వానికి కావలసినది అని అసలర్థము. అన్నిటికంటె శ్రేష్ఠము, పొందదగినదియగు కైవల్యమని విశేషార్థము. వేంకటేశ్వరస్వామి భక్తుల కోరికలను తీర్చుచున్నట్లుగా వారికన్పించును. అయితే వారి కోరికలలో కావలసినవి మాత్రమే ఇచ్చును. వారి వారి కర్మఫలములను బట్టి ఒసంగును. తనకు వలసినవి తాను వేడినవి తీరుట వలన అర్థార్థి, ఆర్తుడు కూడ దేవుని వీడడు. కర్మఫలములను బట్టి భక్తుడు మ్రొక్కుకొన్నవి కొన్నిటిని స్వామి తీర్చడు, కాని కొన్నిటిని తీర్చెను గదా. ఇక స్వామిని వీడలేదు. మఱియు స్వామి ఇచ్చువానికన్న స్వామి సాన్నిధ్యమే మహా మధురమైన వీరిని లోగొనును. ఈ రుచి మరగినవాడు స్వామిని ఏదియో వేడుటకన్న, స్వామి సాన్నిధ్యమునే వేడుట మంచిదను అభిప్రాయమునకు వచ్చును. ఆపై సాధనలో, భక్తియోగము చిక్కబట్టి ఏదియు స్వామి నడుగక, తనలో శాశ్వతుడై తానుండక ఆనందపరిపూర్ణత సిద్ధించును. ఇదియే అసలయిన వరము. వేంకటేశ్వరుడు తన వద్దకు కోరికలకై వచ్చు వారి నెల్లరను ఎప్పటికయినను ఈ స్థితికి చేర్చును. సాన్నిధ్యమునే కోర పనిలేదు అది నిలుచును. గోపికల స్థితి యిది. అన్నమయ్య స్థితి యిది.

వేంకటేశ్వరుడనగా వేదములందు, ఉపనిషత్తులందు ప్రతిపాదింపబడిన పర బ్రహ్మము. వేదములలో పురుషసూక్తమున, విష్ణుసూక్తములో, సువర్ణ సూక్తములో, అగ్నిసూక్తములో, పది యుపనిషత్తులందును సూచింపబడిన పరబ్రహ్మమే తిరుమలపై జగన్మోహనుడై, శ్రీవేంకటేశ్వరుడుగ వెలసెనని అన్నమయ్య మురిసిపోవుచున్నాడు. వేదోపనిషత్తులలో తెలుపబడిన దేవుని వెదకుట కష్టము. శ్రీవేంకటేశ్వరుని దర్శనము చేత, సాన్నిధ్యము చేత, ఆతని యంతర్యామిత్వమును అర్చించుట చేత, ఆతని పాదసేవ చేత, గుండెనిండుగా అతనికి శరణందుట చేత వేదవేదాంతములందు తెలుపబడిన పరబ్రహ్మమును తేలికగా పొందనగును. మనకు సులభుడగుట కొరకే పరబ్రహ్మము వేంకటేశ్వరుడుగ వెలయుట జరిగినది. ఇతడే వైకుంఠమునకు ప్రభువు. వైకుంఠ మనగానేమి? మనము నివసించు భూమికన్న ఏదియో ఇంకను విలాసములు గల లోకమని గాదు. లోకమనగా చూపు. వైకుంఠము అలోకము. మిగిలిన ఏడు లోకములు మన చూపునకు అందునవి. భౌతికము, శక్తిమయము, మానసికము, వేడిమి, వెలుగుల మయము మున్నగునవి. ఈ లోకము లన్నిటిని స్వామి యొక్క ఏడు ఉచ్చారణలందురు. ఉచ్చరించువాడే వైకుంఠము. ఇచట చూచువాడు, చూచుట ఉండవు. కావున దీనిని భాగవతమున అలోకమనిరి. జీవుడు పరబ్రహ్మానంద సాగరమున లీనమయిన శాశ్వత కైవల్యస్థితియే వైకుంఠము. వైకుంఠమనగా కుంఠము లేనిది. అనగా కుంటుపడని స్థితిని, పరబ్రహ్మానందసాగరమున నిత్యము ఓలలాడు స్థితి నుండి జారిపడుట ఉండదు. కావున దీనిని వైకుంఠమందురు. ఇచట జీవుడు, అతనిని లీనము చేసికొన్న దేవుడు, జీవుడు దేవునియందు పొందు అనుభూతి స్థితియని వేరుగానుండుట జరుగదు. నారాయణుడన్నను, నారాయణుని స్థితి అన్నను ఒకటియే. బ్రహ్మానందమన్నను, బ్రహ్మానందమే తానయినవాడన్నను ఒకటే. కావున వైకుంఠమన్నను, వైకుంఠుడన్నను ఒకటియే. మఱి అన్నమయ్య స్వామిని వైకుంఠము నకు ప్రభువని ఏల నుతించెను? జీవునకు తనను తాను సమర్పించుకొని, తన స్థితి యగు వైకుంఠము నాతనికి ప్రసాదించువాడు గావున స్వామిని వైకుంఠ ప్రభువని అన్నమయ్య పేర్కొనెను. ఇది భక్తియోగ పరమావధి స్థితి. ఈ స్థితిని మహాభక్తుడు పొందును అనుటకన్న, మహాభక్తుడగు జీవుని భగవంతుని యీ ఆనందస్థితియే పొందుననుట మిక్కిలి సత్యము. మోక్షమనగా భక్తుని సాధన యొక్క ఫలితము గాదు. ఇది దేవుని యనుగ్రహము మాత్రమే. మఱి సాధన యెందుకు? అట్టి దైవానుగ్రహ రూపమగు వైకుంఠ స్థితికి వలయు అర్హత పొందుటకు అనుకూల పరిస్థితులను కల్పించుకొనుట వఱకే. దైవానుగ్రహము వర్షము. మన హృదయము క్షేత్రము. మనలోని భక్తి సంస్కారము విత్తనము. మనము కలుపులు దున్ని, ఎరువులు వేసి దున్నుట వంటిది సాధన. పంట వంటిది వైకుంఠమను బ్రహ్మానందస్థితి. మన సాధన రైలు టిక్కెట్టు కొని, రైలుపెట్టెలో కూర్చుండుట వంటిది. మన ప్రయాణమును నడిపించి, క్షేమముగ గమ్యమును చేర్చు రైలు డ్రైవరు దేవుడే. కావున అన్నమయ్య స్వామిని వైకుంఠము నధిష్ఠించు ప్రభువని పేర్కొనెను. ఇట్టి స్వామి అన్నమయ్యకు వలెనే మనకును ఈ స్థితిని ప్రసాదించుగాక. ఈ సంకీర్తనము దానికి వలయు సాధన వంటిది.

* * *

8

4వ సం-278

అతిముతి

గౌళ

అతిముతి హనుమంతుఁ డట్టిబంటు
వెలపులేని రఘువీరునికి బంటు. ॥ పల్లవి ॥

ఏలికను దైవముఁగా నెంచి కొల్చేవాఁడే బంటు
తాలిమిగలిగిన యాతఁడే బంటు
పాలుమాలక యేపొద్దు పనిసేయువాఁడే బంటు
వేళగాచుకయుండేటి వెరవరే బంటు. ॥ అతి ॥

తను మనోవంచన లెంతటా లేనివాఁడే బంటు
ధనము పట్టున శుద్ధాత్మకుఁడే బంటు
అనిశము నెదురుమాటాడనివాఁడే బంటు
అనిమొనఁ దిరుగని యతఁడే బంటు. ॥ అతి ॥

చెప్పినట్లనే నడచిన యాతఁడే బంటు
తప్పులేక హితుఁడైనాతఁడే బంటు
మెప్పించుక విశ్వాసాన మెలఁగువాఁడే బంటు
ఎప్పుడును ద్రోహిగాని హితుఁడే బంటు. ॥ అతి ॥

అక్కర గలిగి కడు నాప్తుఁడైనవాఁడే బంటు
ఎక్కడా విడిచిపోని యిష్టుఁడే బంటు
తక్కక రహస్యములు దాఁచినవాఁడే బంటు
కక్కసీఁడుగాక బత్తిగలవాఁడే బంటు ॥ అతి ॥

కానిపనులకు లోనుగానివాఁడే బంటు
ఆనాజ్ఞ మీరనియాతఁడే బంటు
నానాగతి శ్రీవేంకటోన్నతుఁడైన యతనికి
తా నిన్నిటా దాసుఁడైన ధన్యుఁడే బంటు. ॥ అతి ॥

శరీరము, ఇంద్రియములు నీ మనస్సును లాగినపుడెల్ల అది
అవసరమా, కాదా యని వివేచింపుము.

టీక

అఱిముఱి = నిశ్చయముగా, పాలుమాలక = బద్ధకించక, వెరవరి = ఉపాయము లను కూర్చుకొనువాడు, మొన = ముందు భాగము, తక్కక = తప్పకుండ.

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య నవవిధ భక్తులలో నొకటియగు దాస్యభక్తి యొక్క లక్షణములను చరణములందు వివరించుచు, ఆ భక్తి మార్గమును కొనియాడెను. దాస్యభక్తికి నిర్వచనములు, ఉదాహరణములు ఎందరో చెప్పియుండిరి. అన్నమయ్య దాని లక్షణములను ఐదు చరణములలో సమగ్రముగా వివరించెను. ఇతడు దాస్య భక్తికి ఉదాహరణముగా ప్రసిద్ధుడైన హనుమంతునే పల్లవిలో కీర్తించెను. ముందుగా చరణములలోని భావములను గ్రహించి, ఆపైన పల్లవిని వారితో గూర్చవలసి యున్నది. చరణములలో చెప్పబడిన దాస్యభక్తి యొక్క లక్షణములన్నియు నిండుగా గలవాడని హనుమంతుని పల్లవిలో కీర్తించెను. భగవంతునితో భక్తుడు వివిధ సంబంధములు సంభావించి సేవింపవచ్చును. తండ్రి – కుమారుల సంబంధము; యజమాని – దాసుల సంబంధము; సఖుల సంబంధము; దంపతుల సంబంధము ముఖ్యమైనవి. అర్జునుడు ముఖ్యముగా శ్రీకృష్ణభగవానునితో సఖ్య సంబంధము కలిగియున్నను, వీటన్నిటిని గూడ భావించెను. ఈ సంబంధములు విడదీయరానివి. ఒకదానితో నొకటి కూర్చుకొనదగినవి. ఉదాహరణకు భగవంతునకు దాసుడైన వాడు కుమారుడు గూడ అగుట, సఖుడగుట, జరుగవచ్చును. చివరకు అన్నియు భార్యాభర్తల అనుబంధమునకు దారితీయును. ప్రహ్లాదుడు, తండ్రికి నవవిధ భక్తి మార్గములను భగవంతుని పొందుటకు తెలిపెను. సంస్కృత భాగవతమున దాస్యభక్తి ఏడవదిగా తెలుపబడినది. తెలుగు భాగవతమున మూడవదిగా తెలుపబడినది. చివరిది ఆత్మనివేదనము. అనగా తనను తాను సంపూర్ణముగా భగవంతునికి సమర్పణ పొందుట. ఇది సాధ్వియగు భార్య, భర్తయందు పొందు మధుర భావములో కన్పడును. కనుక దీనినే 'మధురభక్తి' యందురు. మిగిలిన ఎనిమిది భక్తి మార్గములును దీనితో కూడియుండును, దీనికి దారితీయును గూడ. అనగా ఉదాహరణకు దాస్యభక్తిలో శరణాగతి కూడియుండును. ఇది మధుర భక్తికి దారితీయును. అపుడు శరణాగతి పరిపూర్ణమగును. అయితే ఈ తొమ్మిది భక్తి మార్గములను అన్నిటిని అవలంబింప వచ్చును. ఏ ఒక్కటితో ప్రారంభించినను మిగిలిన వానితో కలియును. మఱియు ఈ భక్తి మార్గములను ఎవరియందు పొందవలెనో ప్రహ్లాదుడు స్పష్టము చేసెను. 'సర్వాత్ముడైన హరియందు' పొందవలెను. అనగా హరిని ఒక అవతారమూర్తిగా లేక అర్చామూర్తిగా భావించుటయే గాక, సమస్తమునకు ఆత్మగా భావించి, ఈ భక్తిమార్గములను ఆయన యెడల అవలంబింపవలెను. భగవంతుని యందు ఏ భక్తిమార్గమైనను ఒక వ్యక్తియందు వలె పరిమితము కారాదు. ఇష్టదైవతమును కొలుచుచు, క్రమముగ ఆ దైవతమే సర్వాత్ముడని భావించి, కొలిచి, అనుభూతి నందవలెను. దాస్యభక్తిని గూడ ఇట్లే పాటింపవలెను. మఱియు ఈ తొమ్మిది భక్తి మార్గములను శరీరముతోను, మాటతోను, హృదయముతోను పాటింపవలెనని ప్రహ్లాదుడు బోధించెను. వీనిని పాటించుట వలన ఏమి

ఫలము కలుగునో గూడ తెలిపెను. సజ్జనుడై, సు–భద్ర స్థితిని–అనగా అత్యంత శుభమైన కైవల్యమును పొందుట. అర్జునుడు సఖ్యభక్తితో ఈ స్థితిని సాధించుటకు సంకేతమే 'సుభద్రా కల్యాణము'. హనుమంతుడు దాస్యభక్తులలో అగ్రగణ్యుడు. కావున అన్నమయ్య ఆతనిని కొనియాడెను. పై జెప్పిన విధముగనే హనుమంతుడు దాస్య భక్తిని పాటించి, దేవునకు పరిపూర్ణ శరణాగతుడై, మధురభక్తిలోనికి ప్రవేశించెను. అతడు తన ఇష్టదైవతముగా శ్రీరాముని సేవించెను. 'నేను రామదాసుడ'నని లంకలో చాటుకొనెను. తేలికగా పనులు చేయు రామునకు దాసుడనని తన మీదకు వచ్చిన అసురులకు ప్రకటించెను. 'తేలికగా పనులు చేయుట' అనగానేమి? సాధారణ మానవునకు ఒక మంచిపని చేయవలె నన్పించుటకు, దాని నమలుచేయుటకు నడుమ కొంత విరామముండును. రాముని విషయమున అట్టిది లేదు. హనుమంతుడు రామదాసుడై వర్తించుట వలన, అతనికిని అట్టిది లేదు. ఈ సృష్టిలో స్పష్టముగ తాను స్వామికి దాసుడనని ప్రకటించినవాడు హనుమంతుడు. అంతేకాక, దాస్యభక్తిలో పరిపూర్ణతను సాధించెను. అన్నమయ్య కూడ దాస్యభక్తి నవలంబించి, సాధన చేసి, హనుమంతునితో తాదాత్మ్యమునొంది, అట్టి అనుభూతి నొందుటతో ఈ సంకీర్తనము వెలువడినది. హనుమంతుడే అన్నమయ్యలో ప్రవేశించి ఈ సంకీర్తనమును రచించెనేమో! హనుమంతునకు భారతదేశమంతట ఆలయములు గలవు. రామాలయములందే గాక ప్రతి విష్ణ్వాలయమునందును గరుడునితో పాటు ఇతనికి స్థానము గలదు. పన్నిద్దరాళ్వార్లు గరుడుని తరువాతి స్థానమును హనుమంతుని కొసగిరి. వేంకటేశ్వరుడు బ్రహ్మోత్సవములలో హనుమద్వాహనముపై ఊరేగుట పరిపాటి. భగవంతునితో పాటు అంతటి ప్రఖ్యాతి, ఆరాధనము పొందినవాడు హనుమంతుడొక్కడే. ఇక సంకీర్తనము నానందింప ప్రారంభించెదము.

పల్లవి యొక్క తాత్పర్యము

"హనుమంతుడు నిశ్చయముగాను, అట్టి బంటు. భయమెఱుగని రఘువీరుడైన రామునకు బంటు."

వ్యాఖ్య

హనుమంతుడు ఎట్టి బంటో క్రింది చరణములలో వివరింపబడుచున్నది. బంటు అను పదము 'భటుడు' అను సంస్కృత పదము నుండి పుట్టినది. చక్కని సొగసైన తెనుగు పదము. 'భటుడు' అను పదము కంటె సొగసైనది. 'బంటు' అను మాట తలపుకు రాగానే చేతులు జోడించి, దాసుడై, యజమాని చెప్పినది చేయుటకు హృదయమార సంసిద్ధుడగువాడు గుర్తుకువచ్చును. అట్టి ఆదర్శ దాసమూర్తి యగు ఆంజనేయుడు మనస్సులో మెదలును. ఎట్టి శంకకు తావులేకుండ హనుమంతుడు దాస్యభక్తి గలవాడనియు, ఆ లక్షణములు పరిపూర్ణముగా గలవాడనియు అన్నమయ్య స్పష్టముగా తెలుపుచున్నాడు. రామాయణ కథను జీర్ణించుకొని, అందలి ప్రధాన పాత్రలను దర్శించిన మహాభక్తుడగు అన్నమయ్యకు హనుమంతుడు తన గుణరూపము లను సాక్షాత్కరింపజేసెను. అన్నమయ్య యొక్క ఆ సాక్షాత్కారమే క్రింది చరణములు. రఘువీరుని బంటు హనుమంతుడు. దశరథునికి పూర్వీకుడు, వంశకర్త, త్యాగశీలి, ధర్మపాలకుడగు రఘువు. రఘువంశమున

శ్రేష్ఠుడు రాముడు. ఇచట 'వీర' శబ్దము యుద్ధవీరుడనియే గాక, ఉత్తముడని సూచించుచున్నది. తెలుగునాట రఘురామ నామము సుప్రసిద్ధము. శ్రీరామకృష్ణపరమహంస యొక్క తండ్రియగు క్షుదీరాం ఛటోపాధ్యాయ నిత్యము 'రఘువీర్, రఘువీర్' అని భక్తితో కేకలు వేసెనట. ఇట్లు రామునకు రఘువీరుడని ప్రసిద్ధి గలదు. సాధారణముగా ఆబాల్య పరిచయమున్న గాని, ఎక్కువ కాలము పరిచయమున్నగాని ఒక మహానుభావుని సద్గుణములు వేఱొకనికి తెలిసి, ఆ మహానుభావునకు దాసుడగుట పరిపాటి. కాని, హనుమంతుని విషయమున విచిత్రము గలదు. శ్రీరాముడు 38, 39 సంవత్సరముల ప్రాయమున నుండగా వనవాస సందర్భమున హనుమంతు డాతనిని సుగ్రీవుని పనుపున కలిసెను. రాముని కనిన హనుమంతుడు వెంటనే రామలక్ష్మణులను రాజర్షులుగను, దేవ సమానులుగను, శీలవంతులుగను, దివ్యతేజస్సులుగను దర్శించెను. మఱియు వీరి నిజస్థానము దేవలోకమనియు, వీరు దివినుండి భువికి దిగివచ్చిన సూర్యచంద్రు లనియు, పైకి నరరూపము ధరించినను వాస్తవముగ దేవరూపులనియు గ్రహించి ఆనందించెను. రామునిలోనున్న సద్గుణములు, పరాక్రమము హనుమంతుని యందును గలవు. సామాన్యముగ తనను మించిన వారికి దాసులగుట కద్దు. కాని హనుమంతుడు రాముని సద్గుణములకు పరవశించెను. రామునిలోని దివ్యత్వమును దర్శించి, వెంటనే దాసభావమును పొందెను. రాముడే స్వయముగ 'హనుమంతుడు వేదవేత్త అనియు, హృదయమును హరించు శుభమైన వాక్కుగల వాడని'యు కొనియాడెను. భగవంతుడైన రాముని తన భుజములపై నిడుకొని సుగ్రీవాది వానరుల వద్దకు తెచ్చి, వారి నడుమ సఖ్యము గూర్చెను. దీని భావమేమి? మానవుడు స్వయముగా భగవంతుని చేరలేడు. భగవంతుడే ఒక భక్తుడైన ఆచార్యుని ద్వారమున జీవుని చేరును. హనుమంతుడు భగవంతునకు, జీవునకు వారధి యన మాట. రఘురాముడు భయమెఱుగని వీరుడు. మహావీరులగు రావణ కుంభకర్ణులను, వాలిని వధించెను. పరశురాముని జయించెను. అట్టి రామునికి బంటగు హను మంతుడు గూడ రాముని వలెనే భయమెఱుగని వీరుడు. రణరంగమున నిలిచిన రాముని జూచి దేవతలే భయపడిరి. సుమారు అరగంటలో రాముడు ఖరదూషణాదులగు పదునాలుగువేల మంది రాక్షసులను చంపెను. హనుమంతునకు వేయిమంది రావణులను గూడ సమానులు గారు. ఇతడు గూడ రాముని వలెనే స్వల్పకాలమున భయము లేక, సుమారు ఎనుబది వేలమంది రాక్షసులను లంకలో చంపెను. ఇంతటి వీరుడైనను గర్వింపక, రామునికి బంటుగా నిలిచెను".

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"ఏలికను దేవునిగా భావించి సేవించువాడే బంటు. ఓర్పు కలిగిన వాడే బంటు. బద్ధకించక ఎల్లప్పుడు పనిచేయువాడే బంటు. తగిన వేళకు యజమానిని కాచు కొనుచు, అతనికి కావలసినవి సమకూర్చు ఉపాయములను, సాధనములను సమకూర్చుకొనువాడే బంటు."

వ్యాఖ్య

వేతనము కొఱకు గాని, ప్రతిఫలము నాశించి గాని, నేను నా యజమానికి సేవ చేయుచున్నాను, నేను చేయకున్నచో అతని పని కాదని గాని భావింపక, తన ఏలికయే భగవంతుడని భావించి, ఆయన

పని గూడ ఆయనయే తన ద్వారమున నెఱవేర్చుచున్నాడని తలచి కొలుచువాడే బంటని అన్నమయ్య ఉద్దేశ్యము. హనుమంతునిలో ఈ లక్షణము గలదు. అతడు రాముని దైవముగా నెంచెను. ఆయన చెప్పినట్లు సీతను వెదకుటకై వంద యోజనములు విస్తీర్ణము గల సముద్రమును దాటెను. లంక అంతయు సీత కొఱకు వెదకెను. సీతను దర్శించెను. లంకా దహనము గావించెను. యుద్ధరంగమున ఒకసారి సకల వానరులను, వేఱొకసారి లక్ష్మణుని బ్రతికించెను. కాని ఇన్ని పనులు చేసినను, ప్రతిఫలము నాశింపలేదు. తాను కర్తనని భావింపలేదు. తాను రాముడు విడిచిన బాణమునని తలంచెను. సీతారాముల అనుగ్రహముననే సీతా దర్శనమైనదని ఆనందించెను. సీతను వెదకుటలో అంగదాదులు మధ్య మధ్య నిరాశకు లోనైరి. హనుమంతుడు రాముడే తన ధైర్యమని భావించి, సాగరమును దాటెను. వానరులకు ధైర్యమును కల్పించెను. ఒక్కసారి నిర్వేదము పొందినను వెంటనే సీతారామ లక్ష్మణులకు మనసార నమస్కరించి, ఉత్సాహమును, ఓర్పును పొందెను. తాను బ్రహ్మచారి. అంతఃపుర స్త్రీలను చూడ నిష్టపడడు. అయినను ఓరిమితో సీత కొఱకై రావణుని నగరు గాలించెను. తన పరిశుద్ధిని శోధించుకొనెను. మండోదరితో సహా ఆ స్త్రీ లెల్లరిని సీతా రూపములుగనే దర్శించెను. రాముడు చెప్పిన సీతాన్వేషణమున గాని, యుద్ధరంగమునగాని ఒక్క క్షణము గూడ అతడు బద్ధకించలేదు, వ్యర్థపరచ లేదు. అట్టివాడే నిజమైన బంటు. బద్ధకించినను, వాయిదా వేసినను యజమాని యందు దైవభావన లోపించినట్లే. హనుమంతుడు కర్మయోగి. వానరులకు, లక్ష్మణునకు ప్రాణమొసగుటకై వెంటనే ద్రోణాద్రిని పెకలించి తెచ్చెను. రామ పట్టాభిషేక సమయమున ఆలసింపకుండ భారతదేశమందలి నదుల జలములను తెచ్చెను. శ్రీరామునకు, లక్ష్మణునకు వలసిన సమయమందు సేవ చేయుటకు హనుమంతుడు ఎప్పుడును సంసిద్ధుడుగా నుండెను. కాచుకొని యుండుట యనగా కాపాడుట గాదు, సేవ చేయుటకు సంసిద్ధత కలిగియుండుట. రావణుని శక్తిచే లక్ష్మణుడు మూర్ఛనందెను. రావణు డాతనిని ఎత్తుకొనిపోవ ప్రయత్నించెను. అతని వలన గాలేదు. వెంటనే హనుమంతుడు తన భుజములపై మోసి యుద్ధరంగము నుండి తప్పించెను. ఇట్టివాడే నిజమైన బంటు. అతనికి సాయపడుటకే తాను మంత్రిగా నుండెను గాని తనకు గాను ఏమియు ఆశింపలేదు. అట్టి నిర్మల హృదయుడాతడు. ఎందరు స్త్రీల నడుమనున్నను కామమునకు లొంగక జితేంద్రియుడై నిలిచెను. సుగ్రీవుడు రాజ్యమును, తన భార్య యొక్క ప్రాప్తిని, వాలి వధను ఆశించి రాముని అండన చేరెను. గజేంద్రుడు ఆపదనుండి కాపాడుమని ఆర్తితో స్వామిని ప్రార్థించెను. ఉద్ధవాదులగు కొందరు బ్రహ్మజ్ఞానము నీయుమని స్వామిని వేడిరి. కాని హనుమంతుడు దేనికొఱకును రాముని ఆశ్రయింపలేదు. అకారణముగ రామునికి దాసుడై, ఆతనిని సేవించెను. రామ కార్యమును, వానర కార్యమును నిర్వహించెను. ప్రయోజనము నాశించిన సుగ్రీవాదులు ఒక్కొక్కసారి రామునియందు విశ్వాసమును కోల్పోయిరి. రామునియందు పూర్తి విశ్వాసము ఒక్కొక్కసారి వారిలో సడలినది. రామలక్ష్మణులు నాగపాశ బద్ధులయిన సందర్భమున మిగిలిన వానరులు, విభీషణుడు గూడ రామలక్ష్మణుల మహిమను సందేహించిరి. తమకు రక్షణ ఎట్లని తపించిరి. గరుడుడు నాగపాశములను విడిపించగా, రాముని మాని గరుడుడే తమ రక్షకుడని భ్రమించిరి. గరుడుడే స్వయముగా తమ సేవకుడనని రామునితో పలుకుట విని సంబాళించుకొనిరి. కాని హనుమంతుడు ఏ క్షణమునను రాముని యందలి

విశ్వాసమును చెదరనీయలేదు. యజమానికి ఎదురుచెప్పనివాడే బంటు. హనుమంతుడు, తన యజమాని యగు సుగ్రీవుని లోపములను ఎఱిగినను, ఎదురు మాటలాడక గౌరవించెను. సుగ్రీవుడు, రామలక్ష్మణులు మొదటిసారిగా తనను కలసినపుడు రాముడు తనను రక్షించునను నమ్మకము పొందలేదు. హనుమంతుడు మాత్రము రాముని దివ్యత్వమును మొదటనే గ్రహించెను. అయినను సుగ్రీవుడు స్వయముగా రాముని శౌర్యమును ఎఱుగునంత వఱకు వేచియుండెనే కాని, అతనికి ఎదురు మాటలాడలేదు. సుగ్రీవుడు రామునకు ఆసనము నమర్చి, లక్ష్మణుని లక్ష్యపెట్టలేదు. భగవదపచారముకన్న, భాగవతాపచారము మహాపాపమని హనుమంతు డెఱుగును. కాని యజమాని కెదురుమాటాడరాదు. మాటాడకుండగనే, పాపము నుండి అతనిని కాపాడవలెను. కావున తానే స్వయముగా లక్ష్మణునకు ఉచితాసనమును సమకూర్చి, తాను క్రింద కూర్చుండెను. తన ఆచరణముతోనే, తన యజమానికి వినయమును, భక్తులగు వారిని గౌరవించు రీతిని నేర్పెను. ఆపై సుగ్రీవుడు, హనుమంతుడు చేసిన మంచిపనిని కాదనక అంగీకరించెను. మొదట లక్ష్మణుని గౌరవించని ఫలితముగనే, వాలి చేతిలో దెబ్బలుతిని ఓడిపోయెను. ఆపై హనుమంతుడు లక్ష్మణుని గౌరవించిన పద్ధతి నంగీకరించెను గావున రెండవ మారు రామునిచే రక్షింపడెను. ఇట్లు ధర్మాచరణను నాజూకుగా తన యజమానికి నేర్పి, హనుమంతు డాతనిని కాపాడెనే కాని, ఎదురు మాటలాడలేదు. సుగ్రీవుడు క్రొత్తగా లభించిన రాజ్యభోగములలో మునిగి రామున కిచ్చిన మాట తప్పు సందర్భమున గూడ, హనుమంతు డాతనికి ఎదురు మాటలు చెప్పలేదు. నిందింపలేదు. కాని సీతను వెదకుటకై వానరులను వెంటనే పంపుమనియు, రామునకిచ్చిన మాట నిలబెట్టుకొనుమనియు సున్నితముగా నచ్చచెప్పెను. ఇక రాముని విషయమున హనుమంతుడు ఎదురు మాటలు చెప్ప కుండుటయే గాక, ఆయన అడుగకుండ సలహాలు కూడ చెప్పలేదు. ఆయన చెప్పనివి ఏమియు చేయలేదు. విభీషణుడు రాముని ఆశ్రయించిన సందర్భమున, మిగిలిన వానరులెల్లరు ఆతనిని తమవైపు చేర్చుకొనరాదని రామునకు సూచించిరి. రాముడు వారి అభిప్రాయములను అడిగిన మీదటనే చెప్పిరి. కాని విభీషణుడు సజ్జనుడని, ధార్మికుడని, నమ్మదగినవాడని, రక్షింపదగినవాడని హనుమంతునకు పూర్వమే తెలియును. కాని తానుగా రామునకు సలహా చెప్పలేదు. ఆయన అడిగిన మీదట తానెఱిగిన సత్యమును చెప్పెను. రాముడును ఆతని సలహానే పాటించుచున్నట్లు ప్రకటింపకుండగనే, పాటించెను. హనుమంతునిపై రామునకట్టి విశ్వాసము గలదు. యుద్ధరంగమున కుంభకర్ణుని, రావణుని, ఇంద్రజిత్తును తానే ఎదిరింప సమర్థు డయ్యును రాముడు చెప్పలేదు గావున వారిని వధింప యత్నింపలేదు. రాముని సంకల్పమును పసిగట్టి తానూరకుండెను. యుద్ధరంగమున అగ్రభాగమున నిలిచి యజమానికి ఎప్పుడును బాసటగా నున్నవాడే బంటు.

2వ చరణము యొక్క తాత్పర్యము

"తన మనస్సులో ఏమాత్రము వంచన లేనివాడే బంటు. ధనము పట్టున శుద్ధమైన హృదయము గలవాడే బంటు. ఎప్పుడును ఎదురు మాట్లాడనివాడే బంటు. యుద్ధ రంగమున ముందుభాగమున నిలిచి, వెనుకకు తిరుగనివాడే బంటు".

వ్యాఖ్య

నిజమైన బంటు యజమాని యెడల నిజాయితీగా ప్రవర్తించును. ఇతరుల యెడల గూడ నిజాయితీ నెఱపును. తన యజమాని లోపములను ఇతరులకు చెప్పదు. ఆ లోపములను నాజూకుగా సరిదిద్దును. యజమానితో ఒక మాట చెప్పి, వేఱొకటి అమలుచేయడు. సుగ్రీవుడు హనుమంతునకు మొదటి యజమాని, ఆపైన శ్రీరాముడు. సుగ్రీవుడు వనమున తిరుగుచున్న రామలక్ష్మణులను జూచి, వాలి తనను చంప పంపినవారని పొరపడి, భయపడి పరిశీలనకై హనుమంతుని బంపెను. హనుమంతుడు విప్రవేషమును ధరించి, వారిని జూచిన వెంటనే వారు దైవస్వరూపులని అనుభూతినంది శరణందెను. అట్లని సుగ్రీవుని పొరపాటు అంచనాను, లోపమును వారికి వెల్లడింప లేదు. ఈతనికి మొదటి ప్రభువగు వాలి, సుగ్రీవుని భార్యను హరించి, అతనిని వెడలగొట్టి చంప ప్రయత్నము చేయుచుండెను. హనుమంతుడు తానుగా వాలిని చంప సమర్థుడయ్యును తన ప్రభువును చంపుట వంచన గావున ఊర కుండెను. అయితే అధర్మము చేసిన వాలిని విడిచి, వాలిచే బాధింపబడుచున్న సుగ్రీవుని చేరెను. అతనికి మంచి సలహాలు చెప్పెను. రామునే గొనివచ్చి, సుగ్రీవుని రక్షించుటలో తోడుపడెను. శ్రీరాముని యెడలను చిత్తశుద్ధితో ప్రవర్తించెను. తాను రామునిచే సీతను వెదకి, దర్శించుటకై నియమింపబడినపుడు, సీతను ఇతడు తప్పక చూడగలడను విశ్వాసముతో తన అంగుళీయకమును సీతకిమ్మని రాముడు ఇచ్చెను. హనుమంతుడు రాముని విశ్వాసమును వమ్ముచేయక, నిలబెట్టెను. రామ ముద్రిక సాయమున, సముద్రమును దాటెను. వానరులు దక్షిణదిశన స్వయంప్రభాదేవి గుహలోనికి ప్రవేశించి, ఈవలికి రాలేక నిరాశచెందిరి. హనుమంతుడు అంగదుని ప్రోత్సహించెను. తన పినతండ్రి తమకెట్టి శిక్ష విధించునో అని భయపడిన అంగదునితో సుగ్రీవుని గూర్చి చెడుగా చెప్పక, పైగా మంచిగా చెప్పి ఊరట కలి గించెను. వారి నడుమ పరస్పర విశ్వాసమును కలిగించెను. అంగదునకు హనుమంతుని మాటపై గురి. రాజకుమారుడగు ఆతనిని సముద్రము దాటుటకై పంపుట కిష్టపడలేదు. యువరాజుకు శ్రమ కలిగింపరాదని యెంచెను. సాగరమును దాటు సందర్భమున మైనాకుడు తనను సత్కరించెదనని వేడినపుడును, లక్ష్యశుద్ధితో ముందుకుసాగెనే కాని సత్కారములకు లొంగలేదు. సురసను వినయముతో జయించెను. సింహికను వధించెను. లంక అను రాక్షసిని తాకి, ఆమెలోని అసురత్వమును తొలగించి మంచితనమును, ఆనందమును నింపెను. రాముని కార్యమును మాత్రము విడువక దీక్షతో సాగిపోయెను. రామున కొసగిన మాట నిలబెట్టుకొనెను. సీతారాముల పరస్పర సందేశమున ఉన్నది యున్నట్లుగా అందించెను. సీతను కాపాడ, రాముని ప్రోత్సహించెను. ధనము యొక్క గాని, ప్రతిఫలము యొక్క ప్రలోభమునకు గాని లొంగినవాడు యజమానికి కీడు చేయుటకయినను వెనుకంజవేయడు. ఒక్కొక్కసారి యజమానికి కీడు తలపెట్టు వారితో గూడ చేతులు కలుపుటకు సందేహించడు. భారతదేశ చరిత్రలో భారతీయులలో కొందరు ధనమునకు, ప్రతిఫలమునకు, అధికారమునకు లొంగి మనపై కుట్రలు పన్నిన విదేశీయులతో చేతులు కలిపిన సందర్భము లనేకములు. భారతీయులకు భారతీయులే మొదటి శత్రువులు గాని విదేశీయులు గారు. కాని హనుమంతుడు ధనమునే కాదు, ఎట్టి

ప్రయోజనమును సుగ్రీవుని నుండి ఆశింపలేదు. తానుగా మంత్రిపదవిని కోరలేదు. సుగ్రీవుని వేడికోలుపై ఆతనికి మంత్రియై సాయపడెను.

తనకెంత ప్రాణ విపత్తు వచ్చినను, యజమానిని విడిచిపెట్టి, యుద్ధరంగాగ్ర భాగము నుండి వెనుతిరుగడు నిజమైన బంటు. హనుమంతుడు, యుద్ధరంగమున ముందు నిలిచి ఎందరో అసురులను వధించెను. యుద్ధ ప్రారంభమునకు ముందే లంకలో అసురులను చంపి, రావణ వధకు నాంది పలికెను. రాముని మహిమను లంక అంతట చాటెను. రామ రావణ సంగ్రామమున గూడ ఎక్కువమంది రాక్షస సేనానులను, రాక్షస సైనికులను చంపినది హనుమంతుడే. కుంభకర్ణుని కూడ ముందు ఎదుర్కొనెను. తన దేహము నుండి రక్తము కారినను వెనుదిరుగలేదు. ఇంద్రజిత్తును వధింపబోవు లక్ష్మణుని తన భుజముపై మోసికొని వెళ్ళి, ఇంద్రజిత్తు చేయుచున్న క్షుద్ర తాంత్రిక హోమమునకు విఘ్నము గావించి, లక్ష్మణుని విజయము నకు తోడ్పడెను. విపత్తు తీవ్రముగా వచ్చినపుడెల్ల హనుమంతుడు తన ప్రాణమును పణముగా పెట్టెను. రాముని కొఱకై, వానరుల కొఱకై ముందు నిలిచెను. 80 వేలమంది అసురులు అశోకవనమున తన కెదురు నిలిచినను, భయపడి వెనుకకు మరలలేదు. ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రము తనపై పనిచేయకున్నను రావణుని చూచి, అతనికి హితబోధ చేయు నవకాశము కొఱకై కట్టుపడినట్లు నటించెను. తన తోకను రాక్షసులు కాల్చినపుడును భయపడలేదు. సీతాదేవి కరుణకు కృతజ్ఞు డాయెను.

3వ చరణము యొక్క తాత్పర్యము

"యజమాని చెప్పిన విధముగానే ప్రవర్తించిన వాడే బంటు. ఎట్టి లోపము లేక మేలు కూర్చువాడే బంటు. యజమాని మెప్పు పొందుచు విశ్వాసముతో మెలగువాడే బంటు".

వ్యాఖ్య

యజమాని ఏమి చెప్పిన, దానిని తు.చ. తప్పక ఆచరించుటే బంటు లక్షణము. ప్రశ్నించుట పనికిరాదు. గురువునొద్ద అంతేవాసియు ఇట్లే ప్రవర్తింపవలెను. మనకు కావలసినది మనకంటె బాల్యమున తల్లిదండ్రులకు, ఆపైన ఆచార్యునకు, దైవస్వరూపుడగు యజమానికి బాగుగా తెలియునని విశ్వసింపవలెను. గురువును ఎందుకు, ఏల అను ప్రశ్నలు వేయరాదు. హనుమంతుడు సుగ్రీవుడు గాని, రాముడు గాని ఫలనా పనిచేయుమని ఆదేశించిన సందర్భములలో ఇట్టి ప్రశ్నలు వేయక, తు.చ.తప్పక వారి యాదేశమును పాటించెను. రాముని వద్దకు సుగ్రీవుడు పరిశీలింపు మని పంపగా, ఏలయని యడుగలేదు. రాముడు సీతాన్వేషణకై పంపినపుడు నేనేల ఈ పని చేయవలెనని అతనికి ప్రశ్న పుట్టలేదు. దాస్యభక్తిలో ఇది ప్రధానము. ప్రస్తుత నాగరికతలో భావస్వేచ్ఛ అను నెపమున, వ్యక్తిత్వమును కోల్పోవుట ఏలయను నెపమున క్రమశిక్షణారాహిత్యము, అవినయము పెరుగుచున్నవి. మన స్వేచ్ఛ, ఇంకొకరి స్వేచ్ఛకు అడ్డు అయినపుడు అది రాక్షసత్వమగును. స్వేచ్ఛ కావలె ననువారు తమ మనస్సుకు నచ్చినది చేయగోరుదురు. మనస్సు

పూర్వ సంస్కారములను కోరును. ఉదాహరణకు, జ్వరముతో బాధపడుచున్న రోగి, వైద్యుడు చెప్పిన పథ్యమును పాటింపవలెను. కాని తినకూడనివి తినగోరును. నా స్వేచ్ఛ అనును. దాని వలన విపత్తుకు గురియగును. ప్రస్తుత కాలమున స్వేచ్ఛ యనగా మనస్సు, ఇంద్రియముల యొక్క కోరికయే. కాని నిజమయిన స్వేచ్ఛ, మనస్సు యొక్క బారినుండి, ఇంద్రియముల బారినుండి విముక్తి పొంది అంతరాత్మయగు స్వామి యొక్క ప్రబోధము ననుసరించుట. ఈ విషయమునే స్వామి వివేకానందులు నొక్కిచెప్పిరి. అంతరాత్మ ప్రబోధమను సూర్యరశ్మి చక్కగా ప్రతిఫలించుటకు హృదయమను నీరు నిర్మలము గావలెను. అందుకై నిర్మల భక్తులగు మహనీయులగు సద్గురువులను సేవించుచు, వారు చెప్పినది చెప్పినట్లు పాటింపవలయును. ఇచట వ్యక్తిత్వము కోల్పోవుట అను ప్రశ్నకు తావు లేదు. ఏలననగా, బాహ్యముగా గనపడు గురువు, సర్వాంతర్యామి యగు స్వామి వెలుగుకు ప్రతీక మాత్రమే. అసలు గురువు జగద్గురుడగు పరమాత్మయే. ఒక మహనీయుని కొందరు జగద్గురుడని ప్రశంసింపగా, ఆయన యిట్లనెను. "అసలు జగత్తుకు గురువు భగవంతుడే. అయితే నాబోంట్లు జగత్తు రూపములోని దేవుడే గురువుగా గలవారము." మొదటి అర్థమున పరమాత్మ, జగత్తు యొక్క గురువు – ఇది షష్ఠీతత్పురుష సమాసము. రెండవ అర్థమున జగత్తు. తనకు గురువయినవాడు – ఇది బహువ్రీహిసమాసము. అంతర్యామిత్వమునందిన మహాభక్తులు, యోగీంద్రులు, సిద్ధపురుషులు, జగద్గురువయిన భగవంతుని స్థితిని బొందినవారగుట వలన గురువని పిలువబడుటకు అర్హులు. వీరు తాము గురువులమని భావింపరు. భక్తులు వీరిని గూర్చి భావించినను, తాము ఆ భావనను సమ్మతింపరు. ఇట్టి గురువు, కనపడుచున్న భగవంతుని వెలుగే కావున ప్రేమసాగరము. గురువునకు శరణాగతి యనగా, గురురూపమున దేవునకే యని యర్థము. నది సాగరమును జేరుట వలన సాగరమంత అనంతమగును, విశాలమగును. ఇట్లే సద్గురువు చెప్పినట్లు చేయుట వలన వ్యక్తిత్వము నశింపదు. అనంతము, విశాలమగును. వికాసము నొందును. స్వప్రయోజనము కొఱకై వేఱొకనికి బానిస వలె వర్తించినచో, వ్యక్తిత్వము కోల్పోవుట జరుగును. ఇది నది యెండిపోవుట వంటిది. నది యెండిపోవుటకు, సాగరమున సంగమించుటకును ఎంతయో తేడా యున్నది గదా. బానిసత్వము వేరు, శరణాగతి వేరు. మొదటిది పతనమును, రెండవది వికాసమును కల్గించును. ప్రస్తుత భారతదేశమున బానిసత్వ మెక్కువగుటచే పతనావస్థకు చేరుచున్నది. తిరిగి గురు శరణాగతికి మఱలిన శుభమగును. దాస్యభక్తిలో మొదట కావలసినది శరణాగతి, వినయము, చెప్పినట్లు చేయుట. మధ్యలో మన సొంత తెలివి, తర్కము అడ్డువచ్చును. కొందరు సాధకులు ఇట్లు అయోమయములో పడుచుందురు. "గురువుగారికి భక్తి, ఆధ్యాత్మికత తెలియును గాని, లౌకికమేమి తెలియును?" వీరు మూఢులు. భగవద్భక్తి గలవారెవ్వరి విషయమున నైనను ఏ పరిస్థితుల్లో ఎట్లు ప్రవర్తింపవలెనో, పరిస్థితులు నిర్ణయింపవు. లోనున్న ఆత్మయగు దేవుడు నిర్ణయించి ప్రబోధించును. ఆ ప్రబోధమును వారు అమలు చేయుదురు. కావున సద్గురువులు మన లౌకిక సమస్యలు గూడ పరిష్కరింపబడు మార్గములను సూచింపగలరు. మనకంటె, మన గురువుకు బాగుగా తెలియునని విశ్వాసముండవలెను. మనకు తెలివి యనగా సొంత తెలివి. గురువుకు తెలివియనగా దేవుని గూర్చిన తెలివి. అయితే ఇట్టి సద్గురువులను మనమెట్లు గుర్తింపగలము? మనకెట్లు లభించును? ప్రతి దినము

రాత్రి శయనించుటకు ముందు తనకు సిద్ధపురుషుడయిన సద్గురువును ప్రసాదింపుమని స్వామిని వేడవలెను. ఈలోపు తనకు తెలిసిన సదాచరణము చేయుచుండవలెను. తప్పక దేవుడు సద్గురువును మనవద్దకు పంపును. తక్కువ చదువు చదివిన వాడు, ఎక్కువ చదివిన వానికి మార్కులు వేయలేడు గదా. అట్లే తానే గురువును ఎంపిక చేసికొనుట సాధ్యము గాదు. అదియే సాధ్యమైనచో తానే గురువై యుండెడివాడు గదా. కావున వినయము మిక్కిలి ఆవశ్యకము. హనుమంతుడు బాల్యము నుండి భగవంతునకు శరణంది, ధర్మాచరణమున నిమగ్నుడయ్యెను. సమయమునకు శ్రీరాముడు గురువుగా దర్శనమిచ్చెను. భగవానుడు స్వయముగా గురువై చేరెను. ఇక హనుమంతుని మహాభాగ్యమునకు మేరలేదు. హనుమంతుడు, ఏ క్షణమునను రామునితో తర్కింపలేదు. మఱి సీతను చూచి రమ్మని చెప్పగా, లంకా దహనమేల చేసెను? రాక్షసులే తన తోకను గాల్చి, ఈ పనికి పురికొల్పిరి గదా. సీతాదేవి గూడ హనుమంతునకు గురువుగా సాక్షాత్కరించెను. సీత వద్దకు వెళ్ళుచు ఈతడు మనసా రామునే చేరెను. నాకు సములు, అధికులే గాని తక్కువ వారెవరు వానరులలో లేరని సీతతో పలికెను. సీతాదేవి కాదన్న పిమ్మట, ఆమెను రామునొద్దకు చేర్చు యత్నమును విరమించెను. జాంబవంతుడు ఇట్లు చెప్పెను. సీతారాములు మనకు ఆజ్ఞనీయని దానిని ఆచరించుటకు సిద్ధపడినచో, వారి దయ మనయందు పనిచేయదు. ఆంజనేయుడు ఈ సలహాను వినయముతో తలదాల్చెను. రావణ వధానంతరము, తన విజయమును గూర్చి సమాచారమును సీతాదేవికి నివేదింపుమని రాముడు హనుమంతుని పంపెను. ఈ వార్త హనుమంతుడు సీతమ్మకు నివేదించి, ఆమెను బాధించిన రాక్షస స్త్రీలను వధింప అనుమతికై వేడెను. సీతాదేవి వారిపై కరుణ చూపవలెనని ఆదేశము నిచ్చెను. హనుమంతుడు దానిని పాటించెనే గాని తర్కింపలేదు. మహిళగదా యని ఆమె ఆజ్ఞను నిర్లక్ష్యము చేయలేదు. ఆమెను, రాముని ఒకటిగనే దర్శించెను.

లోపమెట్టిది లేక యజమానికి బంటు మేలుచేయును. సాగరమును దాటకముందు హనుమంతుడిట్లు భావించెను. "రాముని కొఱకు, వానరుల కొఱకు నేను ఈ పనిని చేపట్టవలెను." సీతారాములను అనుసంధించుటకై, ఎవరికిని సాధ్యము గాని పనులు చేసెను. సీతకు, రామునకే కాదు, లక్ష్మణునకు గూడ ప్రాణ రక్షణము అను మేలు గావించెను. తన పాలకుడగు సుగ్రీవుని వద్దకు దైవమునే దెచ్చి, వాలి బారినుండి కాపాడుబడునట్లు చేసెను. అతని భార్య, రాజ్యము లభించునట్లు చేసెను. అన్నిటికన్న పెద్ద మేలు భగవంతుడయిన శ్రీరామునితో స్నేహమును, సాన్నిధ్యమును కల్పించెను. ఐహిక ప్రయోజనమునకై రాముని చేరిన సుగ్రీవుడు క్రమముగా రామ సాన్నిధ్యపు తీపిలో మునిగి భక్తుడాయెను. దీనికి ముఖ్య కారకుడు హనుమంతుడే. యజమాని విశ్వాసమునకు దగినట్లు హనుమంతుడు సీతను దర్శించి, ఆమెతో తాదాత్మ్యము నంది రాముని చేరి, ఆతని చుట్టు ప్రదక్షిణము గావించి, నాచే సీతమ్మ చూడబడెను అని నివేదించెను. నేను చూచితి ననలేదు. నాచేత చూడబడినదనుటలో మీ యిర్వురి దయవలన అను వినయము, దాస్యభక్తి గలవు. సీతారూపము చూడబడినదని అనలేదు. ఆమె యొక్క తత్త్వము నాచే దర్శింపబడినది అనెను. ఆమె జగన్మాతయని అనుభూతి నంది, ఆమె దయవలన తానును ఆమె స్థితినందెను. కావుననే

శ్రీరాముడు హనుమంతునిట్లు కొనియాడెను. "సీత నా హృదయము. ఆమె క్షేమమును గూర్చి వార్త నాకు చెప్పి నాకు అత్యధికమయిన మేలు చేసితివి. నీ ఋణము తీర్చుకొన జాలను." రాముడంతట హనుమంతుని తన హృదయమునకు హత్తుకొని సీతమ్మ యొక్క స్థానమునిచ్చి తనతో ఒకటి చేసెను. ఇదియే మధురభక్తి యొక్క అవధి. ఇట్లు హనుమంతుడు దాస్యభక్తితో ఆరంభించి, చివఱకు శ్రీరాముని కౌగిలిలో నొదిగి, ఆయనయందు రమించి, ఆయనతో ఒకటి ఆయెను. బ్రహ్మానందస్వరూపుడాయెను. ఇక వీరిర్వురకును తేడా లేదు. సీతమ్మతో సమాన స్థానమున రామునియందు పొందుటకన్న ఆతని భక్తి విశ్వాసములకు మెప్పు ఏమున్నది? కావుననే వివేకానంద స్వామి ప్రస్తుత భారతీయులకు హనుమంతుడు ఆదర్శమూర్తియని కొనియాడెను. సత్కర్మను భక్తితో జోడించిన కర్మయోగమగును. ఇదియే హనుమంతుని స్థితి. మనకాదర్శము. గోపికల మధురభక్తికి ముందు, హనుమంతుని దాస్యభక్తిని మన మవలంబించి అందు పరిపూర్ణులము గావలయునని వివేకానందస్వామి ప్రబో ధించెను. తమోగుణము వదలుటకు హనుమదారాధనము దోహదము చేయును. అనగా హనుమంతుని గుణములు మనపై ముద్రపడుట జరుగవలయును. నిజ మయిన బంటు ఎప్పుడును ద్రోహము తలపెట్టక, మేలునే చేకూర్చును. ఎంతటి మంచివాడయినను, తన యునికికి భంగము వచ్చిన సందర్భమున, తన మేలు కొరకను నెపమున యజమానికి గాని, ఎవరికయిన గాని ద్రోహము చేయుటకు సిద్ధపడుటకు అవకాశము గలదు. ఎట్టి క్షణమునయినను అట్టి ద్రోహచింతన లేక, కలసినచో ప్రాణత్యాగమునకు సిద్ధపడి యజమానికి మేలు చేయువాడే బంటు. హనుమంతుడిట్టి బంటు. సురస నోటిలోనికి తనను ప్రవేశింపబెట్టి చంపవలెనని యత్నించినను, లంకిణి యను రాక్షసి తన నెదుర్కొనినను, భయంకర యుద్ధమునను హనుమంతుడు ప్రాణభయమున నయినను రామకార్యము విడిచి ద్రోహము చేయ లేదు. తన ప్రాణము పోవునేమో అని భయపడలేదు. ఎన్ని వేలమంది రాక్షసు లెదుర్కొనినను తప్పించుకొనిపోలేదు. అట్లని తన బలపరాక్రమములను ప్రదర్శింప గలనని మొనగాడనను భావ మితనిలో లేదు. రామునకు, సీతకు మేలు చేయుటకై తన ప్రాణములను కూడ లెక్క చేయలేదు. కావుననే యీతని ద్వారమున రాముని దయ పనిచేసినది.

4వ చరణము యొక్క తాత్పర్యము

"యజమానికి అక్కఱ కలిగిన సందర్భమున మిక్కిలి ఆప్తుడైనవాడే బంటు. ఏ సమయమునను, ఏ పరిస్థితిలోను, యజమానిని విడిచిపోక అతనికి ఇష్టమైనవాడే బంటు. తప్పక రహస్యములు దాచినవాడే బంటు. కర్కశత్వము లేక యజమానిపై భక్తిగలవాడే బంటు."

వ్యాఖ్య

ఆంగ్లమున గూడ ఒక సామెత గలదు. అక్కఱలో సాయపడువాడే నిజమయిన స్నేహితుడని. సేవకులలో, ఉద్యోగులలో రెండు రకముల వారుందురు. యజమాని చెప్పిన ప్రజాహితము కొఱకయిన పనిని చేయకుండ, ఊరక యజమానిని ఒక వ్యక్తిగా భావించి, ఆతని మెప్పు కొఱకు ఆతనికి లేని విశేషముల నంటగట్టి

ప్రశంసలు చేయువారు. వీరు పనిచేసి మెప్పు పొందరు. వ్యక్తిని పొగడి, ఉబ్బించి మెప్పును పొంద యత్నింతురు. దేనికి? పనినుండి తప్పించుకొని స్వప్రయోజనమును సాధించుకొనుటకు. ఇట్టివారి యెడల యజమాని జాగరూకుడై వ్యవహరింపవలెను. లేనిచో వీరు ఇతరులపై కొండెములు చెప్పి, యజమాని మనసును కలుషితము చేసి, అతనిని అవినీతి రొంపిలోనికి దింపగలరు. వైద్యుని పొగడిన ఏమి లాభము? ఆతడిచ్చిన మందును శ్రద్ధగా వాడవలెను గదా. మఱియు యజమానికి, అక్కఱ కలిగినపుడే సాయమునకు సిద్ధపడవలెను. సంఘములో కొందరు ఇతరుల మంచితనమును తమ కొఱకై వినియోగపెట్టు కొనుచు, మేలు చేసిన వారి కక్కఱ కల్గినపుడు, కనపడకుండ జారుకొని, అక్కఱ తీరిన పిమ్మట 'మాకు తెలియలేదు' అని బుకాయించుదురు. తెలియకుండుటలో నిజాయితీ ఉన్నచో ఫరవాలేదు. రెండవ రకమువారు యజమాని చెప్పిన పని చేసి, మెప్పును కోరనివారు. వారి దృష్టి మెప్పుపై నుండదు. శ్రీరాముడు విశ్వామిత్రుని యానతిన తాటకను, సుబాహుని చంపెను. శివుని విల్లు విఱచెను. 'ఇదంతయు తమ ఆశీస్సుల ఫలమని' సవినయముగా విశ్వామిత్రునితో పలికెను. తాటక వధ విషయమున గురుని ఆజ్ఞను పాటించెను.

హనుమంతుడును సుగ్రీవుడు దీనుడై వాలి వలని భయమునను భార్యను గోల్పోయి ఋశ్యమూకాద్రిపై తిరుగుచున్నప్పుడు అతని వెంటనుండి ఓదార్చి, చివరకు అతని కష్టములు తొలగునట్లు తోడ్పడెను. రామునకు పెద్ద అక్కఱ సీతను తిరిగి పొందుట. హనుమంతుని పాత్ర ఈ విషయమున ఎట్టిదియో లోక ప్రసిద్ధము. లక్ష్మణుడు యుద్ధరంగమున పడిపోయినపుడు రాముని విలాపమున కంతులేదు. లక్ష్మణుడు అతనికి బహిఃప్రాణము. ఆ విషయము సీతయు, హనుమంతునికి చెప్పినది. లక్ష్మణుని కాచుకొని యుండుమని ఆదేశించినది. హనుమంతుడామె యాదేశమును పాటించెను. లక్ష్మణుని బ్రదికించెను. రాముని శోకమును తీర్చెను. కొందరు సేవకులు గాని, మిత్రులు గాని వట్టి సమయము లందొకనితో కలిసి యుందురు. వలసిన సమయమున విడిచిపోవుదురు. లేదా కొందరు సేవకులు, తమ కిష్టమయినవి యజమాని చెప్పినంతవఱకు చేయుదురు. తమకు నచ్చనివి, కష్టమైనవి యజమాని ధర్మమైనవి చెప్పినను ఆతనిని విడిచిపోవుదురు. అట్లుగాక యజమాని యొక్క ధర్మబద్ధత యందు విశ్వాసమున్న సేవకులు ఆతని నెప్పుడును విడిచిపెట్టక, ఇష్టులై వర్తింతురు. కొందరి స్నేహము, ఆప్యాయత కూడ కొంతకాలము ఉద్వేగ కక్ష్యలో అతి సన్నిహితముగ సాగును. ఉద్వేగము తగ్గినగాని, తమ కిష్టము గానివి అవతలివాడు చెప్పిన గాని ఆతనిని విడిచిపెట్టుదురు. ఇట్టివారి స్నేహము నిజాయితీతో గూడినది గాదు. కలకాలము నిలువదు, అసలు స్నేహమే గాదు. అవతలవాని అభిప్రాయములు తనకు నచ్చకున్నను, ఆతనిని అతనిగను, భగవంతుని రూపముగను, తన్నుగనే ప్రేమించువాడే యిష్టుడయినవాడు. కొందరు తల్లిదండ్రులు కూడ తమ పిల్లలను పెంచునపుడే, పెద్ద అయిన తర్వాత వారు తమ నాదుకొనవలె నని, జీవితాంతము తమ మాటయే పాటింపవలెనని కోరుచుందురు. పాటింప కున్నచో వారిని దూరము చేసికొనుటకు జంకరు. ప్రేమకన్న, పెత్తనము వారిలో స్థానము వహించును. పంతములు, పట్టుదలలు లేనపుడే ప్రేమ నిలుచును. హనుమంతుడు బ్రహ్మచారి, జితేంద్రియుడు, మహాభక్తుడు, జ్ఞాని. అతని యజమాని యగు సుగ్రీవుడు బలపరాక్రముల

విషయమున గాని, మిగిలిన గుణముల విషయమున గాని హనుమంతుని కన్న అల్పుడే. ఒక్కొక్కసారి హనుమంతునకు నచ్చని విషయ భోగములందు కూడ అతడు మునిగి రామకార్యమును మఱచెను. అట్టి సందర్భములందును హనుమంతుడు, సుగ్రీవుని విడువక సున్నితమైన రీతిలో అతనిని దారిలోపెట్టి అతని కిష్టుడయ్యెను. సుగ్రీవునకు తన బలహీనతలు తెలియును. హనుమంతుని సద్గుణములు తెలియును. కావుననే హనుమంతుడు లంకనుండి తిరిగివచ్చుచు దారిలో నుండగనే లక్ష్మణునితో ఇట్లు నిక్కచ్చిగా చెప్పెను "హనుమంతుని యందు కార్యసిద్ధి, సద్బుద్ధి, నిజాయితీ గూడిన ప్రయత్నము, పరాక్రమము, పెద్దల మాట విని పాటించు వినయము ఉన్నవి. తప్పక ఆతడే సీతను దర్శించియుండును. వేఱొకడు కాదు." ప్రభుని ప్రశంసలందుకొని అతనికి మిక్కిలి యిష్టుడైనాడు హనుమంతుడు. రాముని చూచినది మొదలుకొని యిప్పటికిని రామదాసుడై, రామున కిష్టుడై, రాముని హృదయమై నెలకొనియున్నాడు. యజమానికి సంబంధించిన రహస్యములను తప్పకుండ దాచువాడే నిజమైన బంటు. నిష్కపటత్వముతో ప్రవర్తింప వలెను. నిజమే గాని, అవతలివాడు తన నిష్కపటత్వపు మాటలను దుర్వినియోగము పఱచువాడయినపుడు యజమాని యొక్క గాని, తల్లిదండ్రుల యొక్క గాని రహస్యము లను దాచవలెను. నిష్కపటత్వము పేరవారికి హాని కలుగునట్లు తన ప్రవర్తన దోహము చేయరాదు గదా. సుగ్రీవుడు వాలి పంపిన వారినిగా రామలక్ష్మణులను పంపిన అంశమును హనుమంతుడు వారికి చెప్పక దాచెను. వీరిర్వురు దైవస్వరూపులని గ్రహించిన పిదప, సుగ్రీవుని శంకను వారికి తెలుపబనిలేదు. వీరికి సుగ్రీవునికిని మైత్రి గూర్పదలచిన వాడయినాడు. ఇక సుగ్రీవుని లోపములను చెప్పుటెట్లు? మఱియు సుగ్రీవుడు రామ దర్శనము కాగానే రాముని పరాక్రమమును నమ్మలేదు. కొన్ని పరీక్షలు పెట్టెను. అపుడుగూడ హనుమంతుడు తన ప్రభుని బలహీనతలను గూర్చి ముచ్చటింపలేదు. నిజమైన స్నేహానుబంధమునకు హృదయములే సాక్షులు గాని, వేఱొక సాక్షి ఎందుకు? అగ్నిసాక్షితో పని లేదు. కాని హనుమంతుడు రాముని మంచి హృదయమును, సుగ్రీవుని శంకను రెంటిని గుర్తించినవాడయ్యును సుగ్రీవుని శంకను రామునకు తెలుపక అగ్నిని పేర్చి, వారికి మైత్రిని గూర్చెను. సుగ్రీవుని యిష్ట ప్రకారమే ప్రవర్తించెను. కాని ఎట్లయినను రాముడాతని విడిచిపెట్టక కాపాడుననియు, రాముని సన్నిధిలో, రామసేవలో సుగ్రీవుడు తరించుననియు హనుమంతునికి విశ్వాసము గలదు. రావణుని సభలో రాముని పరాక్రమమును ముచ్చటించెను. వాలి వంటి బలవంతుని ఒక్క బాణముతో చంపెనని తెలిపి రావణుని గుండెలో గుబులు పుట్టించెను. కాని రాముడు చెట్టుచాటు నుండి వాలిపై బాణమును వేసెనని ప్రకటింపలేదు. వాలి నేరస్థుడు, మృగప్రాయుడు గావున ఎట్లయినను చంపదగినవాడే. కాని రాముని పరాక్రమమును గూర్చి రావణునకు సందేహము కలుగరాదు. పైగా తన ప్రభువును గూర్చి అట్లు చెప్పరాదని హనుమంతుని యుద్దేశ్యము. సుగ్రీవునిలోనే రాముడు తన వెలుగును చొప్పించి వాలిని వధింపనెంచెను. కాని సుగ్రీవునకంతటి విశ్వాసము రామునిపై లేదు. కావున అతనిని కాపాడుటకై, రామునకు వేఱొక దారి లేకపోయినది. రాముని ధార్మికతను వాలియే గ్రహించి, ఆతనికి అంగదు నప్పగించెను కాని, దానవరాజగు రావణునకు రాముని ధర్మయుక్తి నచ్చునా? కావున హనుమంతుడు దాచెను. అట్లే, సీతమ్మను గూర్చి ఆమె కాళరాత్రి యనియు, తన పాతివ్రత్య మహిమచే లంకను దహింపగలదనియు రావణునకు

చెప్పెనే కాని ఆమె భర్త కోసమై శోకించు చున్నది గావున ఆమెను రామునికి అప్పగించి దయచూడుమని హనుమంతుడు రావణుని వేడలేదు. సీత యొక్క ఆర్తిని దాచెను. "నీ ప్రాణములు దక్కించుకొనుటకు, ధర్మమును ఆచరించుటకు సీతమ్మను రాముని కప్పగించుమని" రావణునికి సభలో చెప్పెను. కఠినత్వము లేక భక్తి గలవాడే బంటు. భక్తి యనగా పరమప్రేమ. బంక వలె విడువని లక్షణము. భక్తునకు కఠినత్వముండదు. కోమలత్వమే యుండును. హనుమంతుడు బలవంతుడే అయినను కోమల హృదయుడు. బలవంతుడైనంత మాత్రము చేత కఠినుడు కానక్కఱలేదు. ఈ విషయమున శ్రీరాముడును, హనుమంతు డును ఒకటియే. దుష్టులను శిక్షించుటలో ఎంతటి శూరులో వర్ణింపనలవి గాదు. అయినను దీనదయాపరులు. అతి కోమల హృదయులు. రాముడు ప్రజలను, వనవాసులను, వానరులను, రాక్షసులను, పక్షులను గూడ ప్రేమించెను. హనుమంతుడు సీత యొక్క పరితాపమును గ్రహించి తల్లడిల్లిపోయెను. రామునకు సీతాదేవి బాధను, ఆమె సందేశమును చెప్పి, వెంటనే ఆమెను గ్రహించుటకై వెడలుమని వేడెను. లంకలోని స్త్రీల జోలికి పోలేదు. లంకలోని యిండ్లను దహించినను, నివాసులను చంపలేదు. వారికి గుణపాఠము చెప్పునంత వఱకే అతని పని. తనకంటె వానరులెల్లరు అల్పులే కాని వారిని ప్రేమించెనే కాని, వారి అల్పత్వమును మనసున తలచలేదు. వారిని కాపాడుటకై ద్రోణాద్రిని పెకలించుకొని తెచ్చెను. కావుననే రామాయణమున హనుమంతుని గూర్చి యిట్లు చెప్పబడినది. "రాముని కొఱకు, వానరుల కొఱకు అతి కష్టమయిన పనిని హనుమంతుడు చేబట్టెను. అనగా అతని దృష్టిలో రాముడు ఒక వ్యక్తి, గురుడు, యజమాని మాత్రమే కాదు. అంతర్యామి. వానరులందును అతడు రామునే దర్శించెను. రాముని కొఱకన్నను, వానరుల కొఱకన్నను ఒకటే. మనకు హనుమంతుని హృదయము తెలుపుటకై వాల్మీకి యిట్లు ప్రయోగించెను. రామునియందు భక్తియే గాని హనుమంతునకు ఇంక ఏ అపేక్షయు లేదు. ప్రతిఫలము నందు అపేక్ష యున్నచో అది వాణిజ్య మగును. ప్రేమ యెట్లగును? ఎల్లరియందును గల అంతర్యామిపై ప్రేమ నిలిచినపుడు దానిని భక్తి యందురని నారదుడు తన భక్తిసూత్రములలో నిర్వచించెను. హనుమంతుడు సీతారామ సుగ్రీవాది వానరుల సుఖమే కాదు, విభీషణాది రాక్షసుల సుఖమును గూడ కోరెను. దానికి కారణము లేదు. రావణునిపై కూడ అతడు ప్రేమతోనే హెచ్చరించెను. ఈతడు కారణము లేకయే ఇతరులను సుఖపెట్టిన వాడగుటచే కారణము లేకయే ఎప్పుడును సుఖశాంతులు గలవాడయ్యెను. అతని నిజమైన బలము సీతారాముల దయ, తన నిత్య తృప్తి. పట్టాభిషేక సమయమున శ్రీరాముని పాదములను పట్టి సేవించెను. అంతకంటె అతనికి వలసిన మహాభాగ్య మేమున్నది? నిత్యము శ్రీరామ పాదసేవయే దాస్యభక్తికి పరాకాష్ఠ. సీతారామలక్ష్మణులు ఆతని హృదయమే. శ్రీరాముడు తనకు తోడ్పడిన వానరుల్లెరుకు బహుమానము లొసంగెను. హనుమంతుడు అత్యధిక సేవ చేసినవాడు. తనకేమి యిచ్చునా యని ఆతడు రాముని ముఖము వైపు చూడలేదు. సీతారామ లక్ష్మణుల పాదములపైననే ఆతని దృష్టి. ఈతని హృదయమున నివాసియగు రాముని యాజ్ఞతో సీతమ్మ ఇతనికొక హార మొసగెను. "నీకిష్టుడయిన వానికి ఇమ్ము" అని రాముడు సీతతో చెప్పెను. సీతమ్మ హనుమంతునకిచ్చినది. సీతమ్మకు ఇష్టుడయిన సన్నిహితుడు. ఆమెనుండి హారము పొందినవాడు హనుమంతుడొక్కడే. ఎల్లరియందును తల్లికి ఒకే ప్రేమయే యుండును. కాని దగ్గరితనము

కుమారుని బట్టి యుండును. హనుమంతుడు తన భక్తితో సీతారాములకు దగ్గరివాడయ్యెను. భవభూతి అను మహాకవి హనుమంతుని గూర్చి శ్రీరాముడే స్వయముగా సీతమ్మతో ఇట్లు పలికెనని రచించెను. “అంజనాదేవికి ఆనందము పెంపొందించువాడగు హనుమంతుడు పుట్టుట మనకు లోకములకు కూడ అదృష్టము”. ఏలిక యొక్క ఇంతటి మెప్పుదలకు నోచుకొన్న భక్తాగ్రగణ్యుడు దాసాంజనేయుడు.

5వ చరణము యొక్క తాత్పర్యము

“చేయకూడని పనులకు లొంగకుండువాడే బంటు. స్వామి యాజ్ఞ దాటని యాతడే బంటు. చాల విధములుగ శ్రీవేంకటాద్రిమీద ఎత్తుపైనున్న ఆ స్వామికి ఇన్ని విధములుగ దాసుడయిన ధన్యుడే బంటు”.

వ్యాఖ్య

మానవుడు చేయు పనులలో రెండు రకములు గలవు. 1. చేయవలసిన పనులు 2. చేయకూడని పనులు. కాని వీనిని చేయుదమని కోరిక కల్గుచుండును. శ్రీకృష్ణుడు మొదటివానిని కర్తవ్య కర్మలనియు, రెండవ రకము వానిని కామ్య కర్మలనియు ననెను. చేయవలసినవి ప్రకృతి ననుస రించి చేయునవి. లోకము యొక్క క్షేమము కొఱకైనవి. ఉదా : ఆకలివేళకు ఆరోగ్యకరమైన ఆహారమును భుజించుట, ధర్మమార్గమున – సమాజమునకు పనికివచ్చు పనులు చేసి, తన కుటుంబపు మనుగడకు కావలసిన వానిని సమకూర్చుకొనుట. చేయకూడని పనులు ప్రకృతి నియమములకు విరుద్ధములయినవి. లోకమునకు కీడు చేయునవి. తన ఉపాధి కొరకై పనిచేయుట. ఉదా : ఆకలిగా లేకున్నను రుచిగా నున్నదని మఱికొంత భుజించుట. తన ప్రయోజనమునకై ఇతరులను బాధించుట, ఉద్యోగ వ్యాపారాదులను లోకహితముగా గొఱకని గాక వేతనము గొఱకై, స్వలాభము కొఱకై నిర్వహించుట మున్నగునవి. ప్రకృతి ఎట్టి అపేక్ష లేకుండ జీవులకు తన ప్రేమను వెలుగుగా, వెన్నెలగా, వానగా, సస్యములుగా పంచిపెట్టినట్లుగా, మానవుడు గూడ సమాజమును సహజముగా ప్రేమించి పని చేయవలెను. ఇది సత్త్వగుణము. మంచిపనులు చేసినను, ప్రతిఫలమును ఆశించినచో చిక్కులలో పడును. ఇది రజోగుణము. అసలు పని చేయకుండగనే కుటుంబ పోషణ జరుగవలెనని ఆశించుట తమోగుణము. రజస్సుతో చేయు పనులు, చేయకూడనివని అన్నమయ్య భావము. తమోగుణము గలవాడు గూడ సమాజమునకు వలసినవి ఏదియు చేయక సోమరిగా నుండుట గాని, జనులను వంచించి దోపిడీలతోను పనిచేయుచుండును. ఇవియు చేయకూడని పనులు. ప్రస్తుత నాగరిక సమాజమున నరజాతి, సమాజమునకు పనికివచ్చు పనులను గాకుండ, ఎట్లో డబ్బు సంపాదించుటకు జారిపడుచున్నది. సమాజమునకు వలయు పనులు చేయువారికి సంపద దక్కకుండ చేయుట జరుగుచున్నది. ఇవి అన్నియు చేయకూడని పనులే. పరస్త్రీని కామించుట, పరధనము నాశించుట, రోషపడుట, అసత్యము లాడుట, ఇతరులను బాధించుట అధికార ధనపాండిత్యాదులతో తోటివారిని అవమానించుట చేయగూడని పనులు. ఇట్టివి చేయనివాడు బంటు. హనుమంతుడు రావణుని అంతఃపుర స్త్రీలను ఎన్నో విధములయిన రీతులలో చూచియు, వారిని సీతాదేవి రూపములుగ మనసున దర్శించి, చెదరలేదు. ఎట్టి ఫలాపేక్షతో

పనిలేకయే లోకహితమునకై పనిచేసెను. గర్వమెన్నడును ప్రదర్శింపలేదు. రావణుని కూడ ద్వేషింపలేదు. అతనిలోని వేదాధ్యయనము, తపస్సులను గౌరవించెను. లోకకంటకు లగు వారిని కోపము లేకయే వధించెను. రాము నాజ్ఞను హద్దుదాటక వర్తించెను. సీతను దర్శించి రమ్మని రాముడు ఆనతీయగా, అంతవరకు చేసెను. ఇక లంకా దహనము వంటివి తానుగా సంకల్పించి చేయలేదు. అసురులే కల్పించి చేయించిరి. 'సంజీవి' అను ఔషధమును ద్రోణాద్రిపై వెదకుట ఆలస్యమగునని యెంచి, కొండనే పెకలించుకొని తెచ్చెను. అయోధ్యకు పోవు దారిలో గుహుని కలిసికొమ్మని రాము డాదేశించగా, నావంటి మహాభక్తునకు గుహునితో ఏమి పని యని భావింపలేదు. రామాజ్ఞ మేరకు గుహుని కలిసి అతని భక్తి వినయములకు ఆనందించెను.

రాముడే శ్రీవేంకటేశ్వరుడుగా అన్నమయ్యకు దర్శన మొసగెను. హనుమంతుని వలె, అన్నమయ్యయు శ్రీవేంకటేశ్వరుని దాసులై ధన్యులైరి. శ్రీవేంకటోన్నతు డనగా శ్రీవేంకటగిరిపై వెలసిన సర్వశ్రేష్ఠుడగు స్వామి యని ఒక భావము. కాని ఉత్+నతుడు అనగా ఉత్తములకు నమస్కరించి వినయము నెఱపువాడని అర్థము కూడ కలదు. స్వామికన్న శ్రేష్ఠులెవరు? కావున శ్రీవేంకటోన్నతుడనగా–శ్రీవేంకటగిరి సర్వోత్తముడగు తనకు నమస్కరించుచున్నదిగా గలవాడని అర్థము చెప్పవలెను. ఇట్టి పదవైచిత్రిని అన్నమయ్య ప్రదర్శించెను. శ్రీవేంకటగిరి శేషుని స్వరూపము. శేషుడు దేవుని భక్తులలో అగ్రగణ్యుడు. ఇట్లు ఈ కొండ తనపైన గల స్వామికి ఎప్పుడును వినయముతో నమస్కరించుచుండునని అన్నమయ్య దర్శించెను. కొండ నిర్జీవ పదార్థము గాదు. భక్తి, వినయము గల భక్తాగ్రగణ్యుడని ఈతని దర్శనము. ఆహా! ఎంతటి ఉదార హృదయము! ఎంతటి ఉదాత్త దర్శనము! అన్ని విధములుగా – అనగా నవవిధ భక్తిమార్గములతో స్వామిని సర్వాంతర్యామిగా దర్శించి పై చరణములలో చెప్పబడిన విధములన్నిట సేవించి దాసుడై అన్నమయ్య ధన్యుడాయెను. అనగా ధనమును కలుగుటను పొందెను. స్వామి దాస్యము కన్న ధనము వేఱొకటి గలదా! వేఱు కలదను భావమే దారిద్ర్యము. స్వామి దాస్యమే ధనమను భావమే పెద్ద ధనము. మనము హనుమంతుని వలె, అన్నమయ్య వలె ఇన్ని విధములుగా అంతర్యామియగు స్వామికి దాసులమై ధన్యుల మయ్యెదము గాక. ఈ సంకీర్తనమున హనుమంతుని దాస్యభక్తి యొక్క సమగ్ర దర్శనమును తాను పొంది, అన్నమయ్య మనకును ప్రసాదించెను. ఆంధ్రులకు మహాభాగ్యమీ సంకీర్తనము.

* * *

9

23వ సం-364 **ఆటది రాజ్యమేలితే** హరికాంభోజి

ఆటది రాజ్యమేలితే అది మంచిదే కాదా
చాటువగా మాకు నిన్ను సాధించ నేటికి. ॥ పల్లవి ॥

పీటపైనున్న దాపె ప్రియుడవు నిలుచుండి
మాటలాడే నాపెతోను మంచిదే కాదా
గాటముగా వంచనెంత కలిగి మెలగినాను
ఈటున నీవే బదికేవేమి నన నేటికి. ॥ ఆటది ॥

పడతి పవ్వళించగా పాదాలకాడ నుండి
మడిచిచ్చే నాకు నీవు మంచిదే కాదా
ఉడుగక నీవెంత ఊడిగాలు నేర్చినాను
కడు నీకే లాభమయ్యా కాదనగ నేటికి. ॥ ఆటది ॥

ఉరముపైనున్న దాకె ఒగినిట్టే కిందుపడి
మరులుగొంటివి నీవు మంచిదే కాదా
ఇరవై శ్రీవేంకటేశ యెంత మోపెత్తుకొనినా
మరిగి నన్నేలితివి మచ్చరించ నేటికి. ॥ ఆటది ॥

నీ సంకల్పము, దేవుని సంకల్పము కావలెను.
అపుడాతని వాణి నీకు వినపడును.

టీక

చాటువగా = బహిరంగంగా, గాటముగా = అధికముగా, ఈటున= ఈ విధంగా, ఉడుగక = విడిచిపెట్టక, ఊడిగాలు = పరిచర్యలు, ఒగిని= లెస్సగా, ఇరవు = తగిన స్థానము, మోపెత్తుకొని = వహించి (సేవించి), మచ్చరించు = అసూయపడు.

పరిచయము

అన్నమయ్య తన సమకాలీన సంఘమున ఎందరో మగవారు స్త్రీలను తక్కువగా చూచుటను, బాధించుటను, అవమానించుటను గమనించెను. అతని హృదయము ఆవేదనతో ఆర్ద్రమయినది. స్త్రీని గౌరవించుట, ఆరాధించుటను గూర్చిన సందేశ మొసగదలచి నాడతడు. అది ఈ సంకీర్తనమున వెలువడినది. ఇందాతని గుండె చప్పుళ్లు, ఆత్మఘోష వినబడుచున్నవి. కుటుంబమున దంపతు లిరువురకు సమ స్థానమున్నది. కుటుంబ జీవనమను రథయానము లెస్సగా సాగుట కావశ్యకము లగు రెండు చక్రములు భార్యాభర్తలు. చక్రములు రెంటిలో ఏది గొప్పది యను ప్రశ్న, తన ప్రత్యేకతను నిలబెట్టుకొన గోరువాని గర్వమున పుట్టును. భర్త విత్తు, భార్య పొలము వంటివారు. వీనిలో ఏది ముఖ్యమను ప్రశ్న పుట్టరాదు. ఇర్వురకు వ్యవసాయమున సమాన పాత్ర యున్నది. జీవన వ్యవసాయముననను దంపతులకు సమాన పాత్ర యున్నది. వీరి నడుమ నెలకొనవలసినది సామరస్యమే గాని, స్పర్థ గాదు. దివ్యకక్ష్యలో సూర్యుడు, భూమి ఎట్టివారో, జీవితమున సతీపతు లిర్వురు అట్టివారని వేదము చెప్పుచున్నది. సతి యనగా అస్తిత్వమున కాధారమయినది. భర్త యునికి కాధారము భార్య. పతి యనగా పాలించువాడు. పాలించుట అనగా అధికారము చలాయించుట అను నర్థము వేదకాలము తర్వాత పుట్టినది. పాలించుట అనగా పాలితుల ఆవశ్యకములను కనిపెట్టి ఆదరించి సేవించుట. శ్రీరాము డిట్లనెను "లోకము నారాధించుటకే నేనున్నాను. పాలన మనగా ప్రజారాధనమే." అట్లే భర్త యొక్క బాధ్యత భార్యను ఆదరించి, ఆరాధించుట. తన వంశ వృద్ధికి వలయు సంతతిని భార్యయే ప్రసాదించును. సంతతి రూపమున దిగివచ్చునది తండ్రియే. తన ప్రతిరూపమును, ప్రతిబింబమును ప్రసాదించునది భార్యయే గదా. తనకు సంతతి వలని భాగ్యము, ఆహ్లాదము భార్య యొక్క అనుగ్రహములు. కావుననే తెలుగునాట మగవాడు తన భార్య యనడు, మా అబ్బాయి లేదా మా అమ్మాయి యొక్క అమ్మ అనును. కావున మగవాడు తన భార్యను అమ్మగా ఆరాధింపవలయు నని వేదము చెప్పుచున్నది. వేదకాలమునాడు ఏ స్వామ్యమును లేదు. జగత్తును గన్నది, ఆధారమయినదగు పరదేవతను స్త్రీమూర్తిగను, లోకమాతగను ఋషులు భావించి స్తుతించిన సూక్తములే శ్రీసూక్తము, దేవీసూక్తము మున్నగునవి. తన జీవమను పూవు కష్టముల వలన వాడిపోవునపుడెల్ల, సీత యొక్క పలుకులు చెవులకు అమృతములై, మనస్సుకు బలకరములగు రసాయనములై, తన జీవమను పూవును మరల చిగురించ వికసింపజేయుచున్నవని రాముడు పలికెను. పాండవులకు ద్రౌపది మార్గద్రష్ట, శ్రీకృష్ణ సాన్నిధ్యమును ప్రసాదించి ఆపదలను తరింపజేసిన దివ్య వనిత యని భారతమున గలదు. కాని ఎందరో మగవారు స్త్రీని తక్కువగా చూచుట జరుగుచునే యున్నది. అన్నమయ్య తన కాలమునాడు ఈ

దురవస్థను గమనించగా అతని ఎద ఆక్రందించెను. ఈ దురవస్థ స్త్రీలదే గాదు. వారిని అవమానించుట పురుషుల నైతిక పతనమును, సాంఘిక జీవన దోషమును కల్గించును గాన వారికిని దురవస్థయే. కావుననే ఈ సంకీర్తనమున అన్నమయ్య వారిని హెచ్చరించుచు, స్త్రీని ఆరాధింపవలసిన కర్తవ్యమునందు జాగృతిని కలిగించుచున్నాడు. ఫలానా కాలమున పురుషులది పైచేయి, ఫలానా కాలమున స్త్రీలది పైచేయి అని చారిత్రక నిర్ణయము చేయజాలము. కొద్ది వ్యత్యాసములతో ప్రతి శతాబ్దమునను, ఆడువారిని తక్కువగా చూచు మగవారును, స్త్రీని గౌరవించు మగవారును ఉందురు. కొన్ని సంవత్సరముల పాటు స్త్రీలను నిరాదరించి అతిశయము ప్రకటించు మగవారి సంఖ్య ఎక్కువగా నుండుట చారిత్రక వాస్తవము. అన్నమయ్య కాలమున ఇట్టిది గలదు. రాజకీయము గను, ఆర్థికముగను, సాంఘికముగను గూడ కొన్ని ఏండ్లపాటు అవ్యవస్థ సాగిన కాలమది. ఇప్పటికిని భార్యల యెడల న్యూనదృష్టి గల మగవారు గలరు. ఏమయినను అన్నమయ్య ఉద్బోధ ఆ కాలమునకు, ఈ కాలమునకు, ఏ కాలమునకయినను మగవారికి మేలుకొలుపు. కావున ఆతడు నిత్యనూతన వైతాళికుడుగా చరిత్రలో నిలిచిపోవును.

స్త్రీల శరీరములు సుకుమారములు గావున అధికమయిన శారీరక శ్రమను వారు సహింపలేరను భావముతో కొన్ని పనులకు ప్రాచీనులు వారిని నియోగింపలేదు. అంతియేగాని వారిని తక్కువ చేయుటకై గాదు. పురుషుల వలెనే స్త్రీలలో దాగిన కళాకౌశలములు, వృత్తి నిర్వహణ సామర్థ్యములు, అధ్యాపన సామర్థ్యము మున్నగునవి వెలికిరావలసినదే. స్త్రీలును సమాజ హితమునకై తమలోని సామర్థ్యములను, నైపుణ్యము లను సంఘమున బహిరంగముగా ప్రదర్శింపవలసినదే. దానికెట్టి నిరోధముండరాదు. వేదములలో కొన్ని సూక్తములను దర్శించిన వారు గార్గి, మైత్రేయి మున్నగు మహిళలే. రామాయణమునకు వేరొక పేరు గలదు 'మహనీయమగు సీతా చరిత' యని. బౌద్ధ ధర్మ ప్రచారమునను ఎందరో తల్లులు పాల్గొనిరి. ఇంతయేల? సిద్ధార్థుడు బుద్ధు డగుటకు స్ఫూర్తి 'సుజాత' అను తల్లిదే. మంచి పనులకు స్త్రీ పురుషులకు సమానావ కాశములు కావలయును. దురభ్యాసములకు, దుశ్చేష్టలకు స్త్రీ పురుషులలో ఎవరి కయినను హక్కు లేదు. ధర్మ సంస్థాపనకై, దేశ సమైక్యమునకై నడుము బిగించి, విచ్ఛిన్న శక్తులను భగ్నము చేసి రాజ్య పాలనము గావించి వన్నెకెక్కిన స్త్రీలు గూడ గలరు. కాకతి రుద్రమదేవి యట్టివారిలో అగ్రగణ్యురాలు. అన్నమయ్య కాలమునకు నూట ఇరువది ఏండ్ల క్రితము మహాంధ్రదేశము నంతటిని సమర్థముగా, ధర్మముగా ఈమె పాలించినది. రుద్రమదేవి యందు అన్నమయ్యకు తప్పక గౌరవముండి యుండును. కాకతీయ సామ్రాజ్య మంతరించిన తదుపరి, విజయనగర సామ్రాజ్యము ఏర్పడినది. విజయనగర సామ్రాజ్యాధీశుడగు సాళువ నరసింహుని మన్ననలను పొందినవా డన్నమయ్య. ఈ సంకీర్తనమున అన్నమయ్య మహిళకు పురుషునితో సమస్థానమే గాక, ఆరాధ్య స్థాన ముండవలెనని కోరుచున్నాడు. ఇతడు మహిళాభ్యు దయమునకై సాంస్కృతిక విప్లవమును ఇందు ప్రేరేచెనని తెలియనగును. ఇది వెఱ్ఱి తలలు వేయు విప్లవము గాదు. స్త్రీ పురుషుల తేడా శరీరము యొక్క నిర్మాణములోని కొన్ని ప్రత్యేకతలను బట్టి మాత్రమే ఏర్పడినది. ఏ వైద్యుడును ఇది స్త్రీ రక్తము, ఇది పురుష రక్తమని నిర్ణయింపజాలడు. ఇక మనస్సు, బుద్ధి, నైపుణ్యము,

సామర్థ్యము, ప్రేమ, ఆత్మల విషయమున వ్యత్యాసమేమున్నది? భక్తుల పరంపరలో ఆచార్యుడగు నారదుడే గోపికల నాదర్శముగా పూజించెను. కలిలో మీరాబాయి ఇట్టిదే.

పల్లవి యొక్క తాత్పర్యము

"ఆడుది రాజ్యమేలినచో అది మంచిదే కాదా. మంచిదే యగును గదా. ఓ మహిళా! మగవారమయిన మేము నిన్ను రచ్చకెక్కి సాధించుట ఎందులకు?"

వ్యాఖ్య

సమర్థముగను, ధర్మయుక్తముగను దేశమును పరిపాలించగలిగినపుడు మగవాడే పాలింప నర్హుడను నిబంధన ఏమున్నది? ఆడుది రాజ్యమేలినచో మంచిదేకదా! 'కాదా' యని ప్రశ్నించుటలో అన్నమయ్య మగవారి గుండియలు తట్టుచు వక్కాణించు చున్నాడు. ఎవరు కాదనగలరు? మంచి పాలనము గావలెను గాని, అది ఎవరిదని ప్రశ్నించుట అవివేకము. ఇంగితజ్ఞానమునకు విరుద్ధము. రామునిలో జనులు తమ తల్లిని చూచిరని వాల్మీకి పరోక్షముగ సూచించెను. అట్టిచో తల్లియే పాలించినచో ఇంకను మంచిది గదా! సంతతిని అమ్మ వలె జనులను పాలించును గదా! మొదటి పాదము సాధారణముగ ఎల్లరికి హెచ్చరిక. ముఖ్యముగా మగవారికి, రెండవ పాదము మాత్రము ఆడువారిని సంబోధించునది. స్త్రీలు రాజ్యపాలనార్హులు గారని అసూయతో నిందించుట, అభ్యంతరపెట్టి నినాదములు చేయుట, నిరోధించుట, ఆమెపై పగబూనుట న్యాయము గాదు గదా! కాకతి రుద్రమదేవి మహాంధ్రరాజ్య సింహాసన మెక్కినపుడు కొందరు దాయాదులు, బలవంతులగు సామంతులు, ఇతర రాజులు ఆమెను నిరోధింప యత్నించిరి. కాని ఆమె తన నేర్పుతోను, ప్రజల అండ దండలతోను నిలద్రొక్కుకొన్నది. ఆడుది రాజ్యమేలుట మంచిదయినపుడు, ఇంక మిగిలిన కార్యక్రమములందు, వృత్తులు, కళలందు తన సామర్థ్యమును, నేర్పును చూపుటలో అభ్యంతరమేమున్నది? ఆమెను ఆ యా రంగములందు నిరోధించి పంతముతో, స్పర్థతో సాధింపజూచుట యేమి? అని అన్నమయ్య ఆవేదన.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

అన్నమయ్య ఇందు మగవాని నుద్దేశించి హెచ్చరించుచున్నాడు. "నీ భార్య పీటపై నున్నది. ప్రియుడవైన నీవు ఆమె ఎదుట నిలుచుండి ఆమెతో మాటలాడినచో మంచిదే కాదా! అధికముగా నీవు ఆమెపై ఎంత వంచనతో వర్తించుచున్నను, ఈవిధముగా నీవు బ్రదుకుచు, ఆమెను అనుట ఎందులకు?"

వ్యాఖ్య

మగవాడు పీఠముపై – అనగా ఉన్నతాసనముపై కూర్చుండినపుడు, భార్య నేలపై నిలుచుండవలెను అను నిబంధన కర్థము లేదు. ఇది సంకుచితత్వము. ఇర్వురిది సమస్థానమే అయినపుడు ఈ వివక్షయేమి? ఇర్వురును ఒకే స్థాయి ఆసనముపై కూర్చుండుట కభ్యంతర ముండరాదు. అన్నమయ్య ఒక అడుగు

ముందుకు వేసి, ఏమీ! భార్య ఉన్నతాసనముపై కూర్చుండి యుండగా భర్త నిలుచుండి ఆమెతో మాటలాడుట మంచిదే కాదాయని యుద్బోధించుచున్నాడు. భార్యకు తన ప్రేమను, హృదయమును సమర్పించుకొనవలసినవాడు భర్త. కావుననే అన్నమయ్య 'ప్రియుడగు' పదమును ప్రయోగించెను. (ప్రస్తుత కాలమున కాముకుడు అను నర్థమున ఈ పదము హేయముగా వాడబడుచుండుట శోచనీయము). గీతలో అర్జునుడు కృష్ణుని గూర్చి అతనిని తన ప్రియుడనియు, తానాతని ప్రియగా నంగీకరింపుమనియు వేడెను. ఈ శబ్దములు చాల పవిత్రములయినవి. భార్యను ప్రేమించుట, ఆమెకు ప్రీతిగొల్పుట ప్రియుని స్వభావము. ఆమెచే ప్రేమింపబడి యుపచారములు చేయించుకొను భర్త, ఆమెను ప్రేమించి యుపచరించుట కృతజ్ఞత యగును. ఎప్పటికిని భార్య ప్రేమకన్న, భర్త ప్రేమ అధికము గాదని శ్రీరాముడే స్వయముగా చెప్పెను. సీత తనయెడల నెరపినది ప్రేమ యనియు, తాను నెరపునది కృతజ్ఞత మాత్రమే యనియు రాముడు అనసూయతో స్పష్టముగా తెలిపెను. అసలు వివాహ మెందులకు? రెండు కుటుంబముల నుండి వచ్చు ఇద్దరు జీవులు ఒకరి నొకరు హృదయ సమర్పణ చెంది, ఒకరియందొకరు 'తన'నే అనుభూతి నందుటకే యని కల్యాణ మంత్రములు చెప్పుచున్నవి. రాముని పాలిట సీత అయస్కాంతమని హనుమంతుడు భావించెను. అడవిలో రాముడు సీత పాదములను గూడ సేవించి, ఆమె నడక వలన గలిగిన శ్రమను నివారించెను. సేవతో బాటుగ భర్త, భార్యకు ఆహ్లాదము కలుగునట్లు మాటలాడవలయును. మాట్లాడుట మామూలు మాటలను పలుకుట. మాటలాడుట యనగా ప్రేమతో భాషించుట. ఇది రూఢి ప్రయోగము. భార్యతో పరుషముగా పలికినవాడు ఆనందమునకు నోచుకొనడు. పండితుడయినను, పూజలు చేయువాడయి నను, తార్కిక మేధావి అయినను, నాస్తికుడయినను, శాస్త్రవేత్త అయినను – ఒకవేళ భార్యకు చదువు రాకున్నను ఈ సూత్రమింతే సత్యము. నిజమైన ప్రేమ యున్న మనస్సులో అహంభావమునకు తావుండదు. అహంభావము, అవతలి వారికన్న తానధికుడనను అతిశయము ఉన్న మనసులో ప్రేమకు స్థానమెక్కడిది? ప్రేమ నిండిన యెదలో అతిశయముండదు గావున, భార్య తనకన్న ఉన్నతాసనమున కూర్చుండ రాదన్పించదు. పైగా ప్రేమ, ఆరాధనతో పక్వమగును గావున భార్య ఉన్నతాసనముపై కూర్చుండి యుండగా, తాను నిలుచుండుట భర్తకు భార్య యెడల నుండవలసిన ఆరాధనాభావమును సూచించునని అన్నమయ్య భావము. అది భర్తకు సంతోషమునే కలిగించును. అమ్మ స్థానమే గదా భార్యది. అమ్మ, దేవుడెట్లో భార్యయు నట్లే.

కొందరు భర్తలు భార్యల యెడల పైకి ప్రేమను నటించుచు ఎక్కువయిన వంచనతో మెలగుట అన్నమయ్య గమనించెను. అయినను భార్య అతని ప్రేమతో ఉపచరించుట మానదు. ఆమెను తాను వంచించుచు, ఆమెపై నాధారపడి తాను బ్రదుకు మగవాడు ఆమెను మాటలనుట ఎంత కృతఘ్నత, నీచము! ప్రేమ యున్నచోట అభినయ ముండదు. ప్రేమ నిర్మలము. అది ఆకాశము వంటిది. జీవితాంతము మన బ్రదుకుకు ఆధారమై, మనకు హితము గూర్చు భార్యనే వంచించుట, ఆమెను పరుష వాక్కులతో నిందించి బాధించుట హేయము. భక్తి యనగా ఎల్లరిని తానుగా ప్రేమించుట. ఈ లక్షణము నిండుగా గలవాడే భగవంతునికి చేరువై ఆనందించును. తనకు ప్రేమతో హితము గూర్చుచున్న భార్యలోనే భగవంతుని

చూడలేనివాడు, ఆమెనే 'తాను'గా ప్రేమింపలేనివాడు, ఇతరులలో దేవునెట్లు దర్శింపగలడు? వారిని 'తాను'గా ఎట్లు ప్రేమింపగలడు?

2వ చరణము యొక్క తాత్పర్యము

"భార్య శయ్యపై పరుండియుండగా ఆమె పాదముల వద్ద నుండి తమలపాకును మడిచిచ్చినచో మంచిదే కాదా! ఎడము లేక నీవు భార్యకు పరిచర్యలు చేసినచో మిక్కిలిగా నీకే లాభము గదా! కాదనుట ఎందులకు?"

వ్యాఖ్య

ఈ చరణము గూడ మగవాని నుద్దేశించియే ఉద్బోధింపబడుచున్నది. సాధారణ ముగా భోజనానంతరము భర్త శయ్యపై పరుండియుండగా భార్య అతని పాదముల వద్ద కూర్చుండి, అతనికి తమలపాకును మడిచి ఇచ్చుట పరిపాటి. అన్నమయ్య ఈ పరిపాటిని తలక్రిందులు చేయుచున్నాడు. దంపతు లిర్వురిది సమ స్థానము గదా! భార్య శయ్యపై పరుండియుండగా, భర్త ఆమె పాదముల చెంత కూర్చుండి ఆమెకు తమలపాకు మడిచి ఇచ్చుటలో మంచితనమున్నది, ఆహ్లాదమున్నది. ప్రేమలో ఎక్కువ, తక్కువ భావములకు తావు లేదు. కావున భార్యాభర్తలలో ఎవరు ఎవరి పాదముల వద్ద కూర్చుండినను అభ్యంతరము లేదు. ప్రేమయున్న ఎదలలో ఆనందము నిలుచును. ఆనందము కావలెనా! నిండుగా హృదయ మర్పించి ప్రేమింపవలెను. (ప్రేమ యనగా శరీరాకర్షణ గాదు. ఆత్మీయత). అట్టి సందర్భమున భార్య పరుండి యుండగా ఆమె పాదముల చెంత కూర్చుండి ఆకు నిచ్చుట ఆనందము నిచ్చును. ఇట్టి సంబంధమునే సరసమందురు. రస మనగా ఆనందము గదా. సరస మనగా అసభ్య ప్రవర్తన గాదు. ఒకరితో నొకరు ప్రీతిగా ఎక్కువ, తక్కువలు మనసునంటక ప్రవర్తించుట. దీనినే ప్రణయ మనియు నందురు. ప్రణయ మనగా ఒకరి హృదయమును వేరొకరి హృదయమునకు చేర్చి ఒకే హృదయముగా చేయు భావము. ఇది ఏమి? ఆత్మీయ ప్రేమయే. కొన్ని శతాబ్దములుగా సరసము, ప్రణయము అను పవిత్ర పదములు అపభ్రంశములగు అర్థమున వాడబడుచుండుట శోచనీయము. ఒకరి కష్టసుఖములలో ఇంకొకరు పాలుపంచుకొనుట, ఒకరి సుఖమునకై వేరొకరు కృషి చేసి అందు సుఖించుటయే ప్రేమను వెలువరించుట యగును. సరసము, ప్రేమ ఉన్నచో ఆనందము నిలుచును గాని, ఆధిక్యభావము, పంతములు, పట్టింపు లున్నచో శోకమే గతి. శ్రీరాముడు అనుదినము రాత్రివేళ సీతాదేవి నిద్రలోని కొరిగిన పిమ్మట, ఆమె పాదములపై తన శిరసునుంచి మ్రొక్కెడివాడని భవభూతి మహాకవి వర్ణించెను. భార్య భర్తకు సుఖములలో, కష్టములలో, ఆరోగ్యములో, అనారోగ్యములో పరిచర్యలు చేయుచునే యుండును. (సీతాదేవి రాజ్యమునందే గాక, వనవాసమందును రామునికి తోడుగా నుండుటను అనసూయామాత కొనియాడెను.) భర్త కూడ అటులనే భార్యకు పరిచర్యలు, సేవలు చేయవలెను. ఉదాహరణకు భార్య వంట చేయు చుండగా, భర్త కూరలు తరుగవచ్చును. ఆమె వేరు పనిలో నిమగ్నురాలై యుండగా, అతడు వంట

చేయనగును. భార్యకు అనారోగ్యము సోకినపుడు వలసిన శారీరక సేవ చేయవలెను. ఇర్వురును పరస్పర సహకారముతో కుటుంబ జీవితమును సరసముగా సాగింపవలెను. భార్యాభర్తల సంబంధములో ఒకరి యెడల ఒకరి నడవడిలో బలవంతపు నిబంధనలు లేవు. ప్రేమ యొక్కటే వీరిని కలుపు సూత్రము. ఒకరికొకరు పరిచర్యలు చేయుటలో నున్న సంతృప్తికి సాటియేది? భార్యకు సేవ చేయుట వలన భర్తకు తృప్తి లభించును. ఆతని సేవకు తృప్తి పొందిన భార్య వలన అతనికే మేలు గదా. ప్రేమ వాణిజ్యము గాదు. భార్యాభర్తలలో ఒకరి నుండి వేరొకరు ఏమియు ఆశించుట ప్రేమ క్రిందకు రాదు. భార్య తన సేవల వలన బాగున్నచో, తిరిగి ఆమె సేవలను భర్త తానే పొందును గదా. సమాజము బాగుండ వలెనన్నచో, కుటుంబము బాగుండవలెను. కనుక భార్యను ఆదరించి, ఆరాధించు మగవారు గల కుటుంబము, సమాజము బాగుండును. కుటుంబమున సామరస్యము చెడినచో సమాజమున చెడును. ఉట్టికెక్కలేని వాడు స్వర్గమున కెట్లెక్కగలడను సామెత గలదు గదా. కుటుంబ సామరస్యమే సామాజిక సామరస్యమునకు పునాది.

3వ చరణము యొక్క తాత్పర్యము

"భార్య నీ వక్షముపై నున్నవరకు లెస్సగా ఈవిధముగా క్రిందుగా పడియుండి, ఆమెపై మోహమునొంది అందించుచున్న కామభోగమును పొందితివి. అట్లే జీవితమున గూడ నీ భార్య ఉన్నత స్థానమున నుండగా, నీవు క్రింది స్థాయిలో నుండుట మంచిదే కాదా! ఓ వేంకటేశా! తగిన స్థానమై నీవుండగా, నేను నిన్నెంతగా వహించితిని. నా భక్తియందు నీవు మరగి, నన్ను పాలించితివి. ఇక నాపై అసూయ పడుట ఎందులకు?"

వ్యాఖ్య

ఈ చరణములోని మొదటి రెండు పాదములందు అన్నమయ్య స్థాయి దిగి మగవారిని జాగృతము చేయుచున్నాడు. కారణము అట్టడుగు స్థాయిలో కొందరు మగవారుండుటయే. రాత్రివేళ కామభోగ సందర్భమున ఒక వైఖరిలో భర్త పరుండి యుండి, తన వక్షముపై భార్యను నిలుపుకొనుచుండును. ఇపుడు తాను క్రిందపడి భార్య పైననున్నట్లే గదా. ఆమెను మోహించి ఆమెనుండి కామతుష్టిని పొందుటకై ఇట్టి వైఖరి నవలంబించిన పురుషుడు, జీవితమున ఆమె ఉన్నత స్థానమున నుండగా ఓర్వకుండుట విడ్డూరము. ఉన్నతస్థాన మనగా వృత్తిలోనే యని గాదు. భర్త, భార్యను గౌరవించి, మన్నన చేసి, ఆరాధించుట మంచిది గదా. భౌతిక స్థాయి సుఖము కొరకై భార్యను వక్షమున కెక్కించుకొనువాడు బ్రతుకులో ఆమెకు మన్నన నీయకుండుట పచ్చి అవకాశవాదము, హేయమని అన్నమయ్య అభిప్రాయము. అన్నమయ్య అవకాశవాదులయిన మగవారిని చంద్రకోలతో చఱచి వారిని పెనునిద్దుర నుండి మేలుకొలుపుచున్నాడు. అన్నమయ్య రచనలలో మురళీగాన మాధుర్యమున్నది. శంఖారావ మున్నది. అపుడపుడు చంద్రకోల చఱపు ఉన్నది. భార్య భోగ్యవస్తువు గాదు, ఆరాధ్యదేవత యని అన్నమయ్య ఉద్బోధ.

తిరుమలలో నెలకొనియున్న శ్రీవేంకటేశ్వరుడు అన్నమయ్య హృదయమున నెలకొని యున్నాడు. ఇది స్వామికి తగిన స్థిరమైన నెలవు. అన్నమయ్య స్వామిని అర్చామూర్తిగా పూజించి, అంతర్యామిగా

నర్చించి, కొన్ని వేల సంకీర్తనలలో గానము చేసి మోపెత్తు కొనెను. అనగా పైకి ఎత్తి వహించి సేవించెను. స్వామియందు అన్నమయ్య పరవశు డగుట సహజమే. స్వామియే అన్నమయ్య యందు మరగెనట. ఎంతటి ఉదాత్తానుభూతి! అనగా ఇతని నిర్మల భక్తికి, శరణాగతికి, మధుర సంకీర్తనలకు స్వామి మెచ్చి వీనియందు మరగుట జరిగినది. ఇట్లు ఇతని హృదయములో నిలిచి, ఆనందము నొసగి, తా నానందించి పాలించెను. ఇట్టి స్వామి తాను సమాజంలోని స్త్రీల పరిస్థితికి చలించి, స్పందించగా తనకు తోడుగా స్పందించదేమి యని అన్నమయ్య ప్రశ్న. ప్రత్యక్షంగా ప్రశ్న, పరోక్షంగా ప్రార్థన. స్వామి ఇతని యెడల అసూయ చెందుచున్నాడని అర్థం గాదు. ఈ సంకీర్తన యంతయు సామాజిక సంబంధమైనది. మరి చివరి పాదములలో శ్రీవేంకటేశుని స్మరించుట ఎట్లు పొసగును? దీనికి సమాధానమే స్వామి కూడ తన సామాజిక స్పందనలో తోడ్పడవచ్చు గదా యను భావము. మహిళల పరిస్థితి గౌరవనీయమగుటకును, మగవారి మనస్సులలో భార్యలకు మన్నన ఏర్పడి వారి హృదయములు వికసించుటకు, సమాజ హితమునకు అన్నమయ్య కృషి చేయుచున్నాడు. తన కృషి మహిళామతల్లుల రూపంలోని మంగమ్మతల్లికి సేవయే, సమాజ రూపములోని స్వామికి అర్చనయే యని అన్నమయ్య భావము. ఇట్టి తన కృషికి తోడ్పడి, ఆశీర్వదించి, మగవారి హృదయములను వికాసవంతము జేసి, మహిళలకు అభ్యుదయం కల్గించి సంఘమున సామరస్యమును, శ్రేయస్సును నెలకొలుపుమని అన్నమయ్య స్వామిని ప్రార్థించుచున్నాడు. అన్నమయ్య దృష్టిలో మహిళాభ్యుదయము ఒక సిద్ధాంతము గాదని తేలుచున్నది. అతడు తానాచరించి, దానికై పాటుపడి, ఉద్బోధించుచున్నాడే కాని వట్టి నినాదములవాడు గాడు. మానవతా పుష్పవికాసమున మహిళాభ్యుదయమొక రేక విచ్చుకొనుట. సంఘములో ఏ మంచి మార్పునకయినను ఆధ్యాత్మికతయే పునాది గావున శ్రీవేంకటేశుని ఇతడు నుతించు చున్నాడు. భర్త భార్యయందు అంతర్యామిని దర్శించి సేవించుటే మంచి మార్పునకు బీజము. రాజకీయ, సాంఘికోద్యమముల వలన వచ్చు మార్పు ఆవేశపూరితమే గాని, స్థిరముగా నిలబడదు. కావున దంపతు లిర్వురు ఒకరినొకరు అంతర్యామి రూపములుగా దర్శించునట్లు ఆశీర్వదింపుమని అంతర్యామియే అయిన శ్రీవేంకటేశుని అన్నమయ్య వేడుచున్నాడు.

* * *

10

3వ సం-358 **ఆతఁడే** **దేసాళము**

ఆతఁడే బ్రహ్మణ్యదైవ మాదిమూలమైనవాఁడు
ఆతని మానుటలెల్లా నవిధిపూర్వకము. ॥ పల్లవి ॥

ఎవ్వనిపేరఁ బిలుతు రిలఁ బుట్టినజీవుల
నవ్వచు మాసనక్షత్ర నామములను
అవ్వల నెవ్వని కేశవాది నామములే
రవ్వగా నాచమనాలు రచియింతురు. ॥ ఆతఁడే ॥

అచ్చరమే దేవుని నారాయణనామమే గతి
చచ్చేటివారికి సన్న్యాసము వారికి
ఇచ్చ నెవ్వరిఁ దలఁచి యిత్తురు పితాళ్లకు
ముచ్చట నెవ్వని నామములనే సంకల్పము. ॥ ఆతఁడే ॥

నారదుఁడు దలఁచేటి నామ మది యెవ్వనిది
గౌరి నుడిగేటి నామకథ యేదది
తారకమై బ్రహ్మరుద్రతతి కెవ్వరి నామము
ఈరీతి శ్రీవేంకటాద్రి నెవ్వఁడిచ్చీ వరము. ॥ ఆతఁడే ॥

ఇతరులకు సాయము చేయు నవకాశము వచ్చినపుడు, మనసు
ఈ పని నాకు చాల కష్టమనును. బుద్ధిని ప్రయోగింపవలెను.

టీక

బ్రహ్మణ్య = వేదధర్మమును నిలబెట్టునది, రవ్వ = సవ్వడిగా, అచ్చరము (అక్షరము) = నాశనము లేని స్థితి, పితాళ్లు = పితరులు – తండ్రి తాతలు, ఆపై తరముల వారు.

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుని నామము యొక్క మహిమను హృదయమార కీర్తించుచున్నాడు. జీవుడు తన దినచర్యలో పుట్టినప్పటి నుండి శరీరము విడుచు వరకు భగవంతుని నామములను పలుకుటతోనే అనేక క్రియలు సాగించును. వేదమార్గము ననుసరించి అరువదినాలుగు సంస్కారములు మానవునకు ఋషులచే విధింపబడినవి. ఈ యన్ని సంస్కారములందును ముందుగా భగవంతుని నామములను పలికి, ఆయనకు నమస్కరించియే ప్రారంభింతురు. మొదటి సంస్కారము జాతకర్మ. తరువాత వరుసగా నామకరణము, అన్నప్రాశనము, చెవులకు పోగులు కుట్టించుకొనుట, ఉపనయనము మున్నగునవి కలవు. ఈ యన్నిటిలో శ్రీహరి నామసంకీర్తనము తప్పనిసరి. అట్లే హోమాదులందును, పితరుల కాచరించు కర్మలందును గూడ. దీనికి కారణము, ఆయా కర్మలను భగవంతుని సేవగా చేయు భావము లలవరచుకొనుట, జీవితము మొత్తమునే భగవంతునికి అంకితము గావింప వలెనను శ్రద్ధ, సంకల్పము గలిగి వర్తించుట భగవంతుని నామములను కీర్తించుట వలన గలుగును. సన్న్యాసికి కూడ ఇది తప్పదు. మరియు పరమభాగవతోత్తములై, సదా భగవంతుని యందే నిలిచి జీవించువారలైన నారదాదులు గూడ దేవుని నామములను కీర్తించుట మానరు. వీరు, వారనియేల? సాక్షాత్తు జగమునేలు పరాశక్తి యగు పార్వతికి, సృష్టి లయ కారకులగు బ్రహ్మ రుద్రులకును శ్రీహరి నామమే తరింపచేయు గతియై యున్నదని అన్నమయ్య నామ మహిమను మనకు హత్తుకొను నట్లు చెప్పుచున్నాడు. చరణములను పూర్తిచేసి మరల పల్లవితో గూర్చవలయును. ఇట్టి నామములు గల స్వామి వేదధర్మమును ఉద్ధరించువాడు, సర్వమునకు మొదటి కారణమయినవాడు. పల్లవిలో నుతింపబడిన దైవము యొక్క నామముల మహిమ ఇది అని చరణములందును వివరించుచున్నాడు. స్వామి నామములను ధ్వని యంత్రముల వలెనో, ఇతరుల మెప్పుకొరకనియో ఉచ్చరించుట సరిగాదు. హృదయ మును కంఠమునందు చేర్చి తనలోను, వెలుపలను స్వామి వెలసియున్నాడని ఎఱిగి అట్టి స్వామియొక్క నామముల నుచ్చరింపవలెను. అసలు ఉచ్చరింపని వానికన్న యాంత్రికముగా నుచ్చరించువాడు క్రమముగా హృదయపూర్వకదివ్యానుభూతికి చేరును. ప్రతి నామము యొక్క అర్థము తెలిసి, దానిని హృదయములో అనుభవించి ఉచ్చరించుట మంచిదే. కాని అర్థము తెలియుటకన్న ముందే గుండెలో భక్తి నింపుకొని, అనుభూతితో ప్రారంభింపవలెను. అర్థము తెలియుట క్రమముగా అనుభూతికి తోడ్పడును. ఒకవేళ అర్థము తెలియకున్నను నిండుభక్తితో, శరణాగతితో కీర్తించినచో అఖండదివ్యానుభూతి కల్గుననుటలో సందేహము లేదు. భక్తి లేక, అనుభూతి లేక ఊరక అర్థము తెలిసియు లక్ష్యము – అనగా భగవంతుని సాన్నిధ్యమందలి తీపి అందదు, జీవితము నిర్మలము గాదు. బ్రతుకుబాట హాయిగా సాగుటకు భక్తి, దైవానుభూతి ప్రధానములు. మనము మన పిల్లలనో,

తల్లిదండ్రులనో, సఖులనో పిలిచినట్లు, భార్య భర్తను పిలిచినట్లు దేవునిపై ప్రేమపొంగార పిలుచుటయే నామసంకీర్తనము. సంబంధములు వేరుగా కానవచ్చినను ప్రేమ యొకటే. అది ఊహకందని రసానుభూతి. కనుక నామముల నుచ్చరించునపుడు భగవంతుడు సర్వాంతర్యామి యను భావన, ఆయన యందు ప్రేమ, శ్రద్ధ, శరణాగతి ఆవశ్యకములు. అర్థములు తెలియుట ఉపప్రధానము.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"ఇతడే వేదధర్మమును నిలబెట్టు దైవము, సృష్టికి మొదటి కారణము, వేరు అయినవాడు. ఆతని నామమును స్మరించుటను మానుట ఎన్ని రీతుల నయినను నియమమైన పద్ధతి, విధానము గాదు. ఆయన నామమును స్మరింపకుండ ఏ పని చేసినను అది విధివిధానము గాదు."

వ్యాఖ్య

తా నర్చించు మిక్కిలి దగ్గఱివాడయిన వేంకటేశ్వరుడు బ్రహ్మణ్య దైవము. బ్రహ్మము అనగా ఇచట వేదమని యర్థము. అనగా వేదగ్రంథములనియే కాదు, వానియందు చెప్పబడిన ధర్మము. అది యెట్టిది? శాశ్వతమైన ప్రకృతి ధర్మమే. ప్రకృతి తన ప్రేమతో జగత్తును ధరించుచున్నది. కావున పరమప్రేమయే పరమధర్మము. ఇంకను సత్యము, అహింసయు పరమ ధర్మములని చెప్పబడినవి. ఇట్టి వేదధర్మమును నిలబెట్టు వాడు అని బ్రహ్మణ్య పదమున కర్థము. ధర్మమునకు అలసట కలిగినపుడెల్ల స్వామి అవతరించి కాపాడును, ఉద్ధ రించును. అవతారమూర్తులుగనో, భాగవతోత్తముల రూపముననో నిలబెట్టును. కాలకాలమునకు మహాభక్తులు ఉదయించి వేదధర్మము లను నిలబెట్టుచునేయున్నారు. కాని వారు తాము ధర్మోద్ధారకులమని భావింపరు. ధర్మము నాచరించి, బోధించుట ద్వారమున నిలబెట్టుదురు. భగవంతుడే ధర్మోద్ధారకుడు. ఒక్కొక్కసారి నరజాతి వేదధర్మము నుండి పతనము చెందినపుడు, మఱల దాని ననుసరింపక తప్పని పరిస్థితులను దేవుడు కల్గించును. ఉదాహరణకు వేదమునందలి పరస్పర ప్రేమ, సమష్టి జీవనము, లోకహితార్థ జీవనము, పాడిపంటల ప్రాధాన్యము తగ్గినపుడు వీనిని అనుసరింపకపోయినచో మనుగడ సాగని పరిస్థితులు దేవుడు కల్పించును. భాగవతమున శ్రీరాముని, శ్రీకృష్ణుని గూర్చి బ్రహ్మణ్యుడని చెప్పబడినది. స్వామి సృష్టి యను వృక్షమునకు మొదలయిన వేరు. విత్తనమే చెట్టుగా విస్తరించునట్లు దైవమే సృష్టిగా వ్యక్తమై విస్తరించెను. దైవమనగా తనకు తానుగా వెలుగువాడు. అన్నిటిని వెల్గించువాడు. తనకు మాత్రము ఏ వెలుగు కూడ ఆధారముగా లేనివాడు. దైవమను వెలుగు నుండి వెలువడిన కాంతిప్రసారమే విశ్వసృష్టి. ఒక్కొక్క కిరణమే జీవుడు. కావున దైవమే అన్ని వెలుగులకు – సూర్యచంద్రాగ్నులకును మూలమైన వెలుగు. మన బుద్ధులను నడిపించు వెలుగు అనియు గాయత్రి మంత్రమున చెప్ప బడినది. గాయత్రి మంత్రమున ఈ వెలుగు పుంలింగమని గాని, స్త్రీలింగమని గాని చెప్పబడలేదు. మనలను నడిపించు వెలుగు అనియు, లోకములను కన్న వెలుగనియు, ఆ వెలుగునే మనము వరింపవలెననియు, ఆ స్వచ్ఛమైన వెలుగే ధ్యానింపదగిన దనియు చెప్పబడినది. దైవమను ఈ

ఆదిమూలము నుండియే వివిధావతారములు వచ్చినవి. భాగవతమున ద్వితీయ స్కంధమున ఆదిమూలావతార మని ప్రత్యేకముగా పేర్కొనబడినది. గజేంద్రుని రక్షించి, మోక్షమిచ్చిన మూర్తికీపేరు ఏర్పడినది. జీవుడు తల్లి కడుపులో నున్నప్పుడు కల వంటి స్థితిలో నుండును. ఇది మొసలి పట్టు వంటిది. ప్రసవ సమయమున ఉక్కిరిబిక్కిరిగా నుండి శ్వాసరూపమైన భగవంతునికై వేడుకొనుట జరుగును. మావి చీల్చుకొని జీవుడు భూమిపై బడి మొదటి శ్వాస పీల్చుటయే గజేంద్ర మోక్షము. ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములను గరుడుని ఱెక్కలపై దేవుడు శ్వాసతో జీవునిలోనికి దిగివచ్చును. ఇది ఆదిమూలావతారము. దీనినుండియే జీవుడేడ్చుట, ఆకలి కలుగుట మున్నగునవి క్రమముగా ఏర్పడును. ఇట్టి అవతార ములు సర్వ జీవులందును తటస్థించును. ప్రతి సంస్కారమున భగవంతుని స్మరించుట ఋషులు విధించిరి. స్వామిని హృదయమార స్మరింపక, ఎంత శాస్త్రోక్తముగా సంస్కారమును – పెండ్లి మున్నగునవి ఆచరించినను అవి సార్థకములు గావు. ఉదాహరణకు అంతర్యామి యని దేవుని భావింపక, వ్యక్తిగా భావించి ఉద్వేగ పడుటలో భక్తికి చోటు లేదు. ఇట్టి యుద్వేగముతో దేవుని గూర్చి కేకలు పెట్టువాడు భార్యను, సంతతిని "మీరు కూడ నాతోబాటు భగవత్ స్మరణలో పాల్గొనుడ"ని బలవంతము చేయును. వారు దానికి సుముఖులు గాకున్నచో బాధించును, రోషపడును లేదా శోకించును. అట్లే తాను సంకీర్తనము చేయబోవునపుడు స్వామిని అంతర్యామిగా భావింపకపోయినచో శ్రోతలు భక్తులు గారనియు, తాను వారి నుద్ధరించుటకు వచ్చిన పరమభక్తుడననియు గర్వించును. అట్లే దేవుని గూర్చి ప్రసంగములు చేయు వక్త తాను జ్ఞానిననియు, శ్రోతలు అజ్ఞానులనియు, తాను వారికి జ్ఞానోదయము కలుగజేయుటకై వచ్చెనని అతిశయించును. దీనివలన ఇట్టివారు రోషమునకు, దుఃఖమునకు గురియగుదురు. ఇంతకు తన భార్య, పిల్లలలో, శ్రోతలలో వీరు అంతర్యామి యగు స్వామిని దర్శింపకుండుటయే దీనికి కారణము. కావున అంతర్యామి భావనతో దేవుని స్మరించి సంస్కారముల నాచరించినపుడు, అవి విధివిధానముగ జరిగి ఫలించును. ఉదాహరణకు వధూవరులు కల్యాణఘట్టమున ఒకరిలో నొకరు అంతర్యామిని దర్శించినచో, తర్వాత వారి నడుమ ఆత్మీయమగు అనురాగము వర్ధిల్లి, కాపురము చల్లగా సాగును. అంతర్యామి అని దేవుని గూర్చి నమ్ముట చాలదు. నచ్చవలెను. అపుడే ఏ సంస్కారమయినను, దినచర్య అయినను, స్నానాదులయినను, ఏ ప్రక్రియ అయినను, వృత్తిధర్మ మయినను, సంకీర్తనమయినను సార్థకమగును.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"నేలపై పుట్టిన జీవులకు నామకరణ సందర్భమున మూడు నామములను బియ్యములో వ్రాయుట జరుగును. 1. జీవుడు పుట్టిన చాంద్రమాన మాసమును బట్టి, 2. జీవుడు పుట్టిన నక్షత్రమును బట్టి, 3. వాడుకలోనిది. బాలసారెలో ఈ మూడు నామములు గూడ ఎవ్వరిపేర పిలుతురో అతడే భగవంతుడు. ఆపైన పూజ హోమాదులు గాని, బాలసారె, పెళ్లి మున్నగు ఏ కార్యక్రమములందునను ముందుగా ఆచమనము చేయుచు 'కేశవ' మున్నగు దేవుని పేర్లే పలికెదరు."

వ్యాఖ్య

ఎన్నో సంవత్సరముల తరబడిగా, ఏ జీవునకు మాసమును బట్టి గాని, నక్షత్రమును బట్టి గాని, వాడుకలో పిలుచుటకు గాని పేరు పెట్టు సందర్భమున దేవుని పేరే పెట్టుట పరిపాటి అయినది. తెలుగునాట వేంకటేశ్వర, శ్రీనివాస నామములు ప్రఖ్యాతములు. శ్రీరామ, శ్రీకృష్ణ, నారాయణ, మాధవ, గోవింద, గోపాల, నరసింహ మున్నగు దేవుని పేర్లే తల్లిదండ్రులు తమ సంతతికి పెట్టుదురు. ఆడపిల్లలయినచో అమ్మవారి పేర్లు పెట్టుదురు. ఇందులో ఒక లక్ష్యమున్నది. ఇందువలన తమ సంతతిని తాము గాని, ఇతరులు గాని పిలుచునపుడు దేవుని పేరనే పిలువవలసి వచ్చును. అపుడు వారితో దేవునితో వలె మెలగవలసి వచ్చును. వ్యక్తులను గాక, వ్యక్తుల రూపముల లోని భగవానునితోనే మెలగుట అభ్యాసమగును. ఇట్లు ఒకరితో నొకరు వ్యక్తులతో గాక దేవునితో మెలగుట వలన పరస్పర ప్రేమ, మంచి సంబంధములు పెరిగి, సంపద కూడ అందరికి అందుబాటు లోనికి వచ్చును. రాజ్యమున సుఖశాంతులు వర్ధిల్లును. మఱియు సంస్కార కార్యక్రమములనే గాక, ప్రతిదినము చేయు పూజ మొదట్లో ఆచమనము చేయుదురు. మూడుమార్లు నీటిని కుడిచేతిలోనికి గ్రహించి స్వీకరించుట జరుగును. "ఓం కేశవాయస్వాహా, ఓం నారాయణాయస్వాహా, ఓం మాధవాయ స్వాహా" అని మూడుమార్లు ఆచమనముతో దేవుని పేర్లను స్మరించెదరు. దేవునకు సమర్పణమును ఈ పలుకులలో తెలియజేయుదురు. శరణాగతిని సూచించును. కావున ఈ నామముల నుచ్చరించుట మ్రొక్కుబడిగా గాక, శ్రద్ధాభక్తు లతో చేయవలెను. మఱియు లోలోన గాక, బయటకు ఈ నామములు పలుకవలెను. అపుడే వీని ప్రభావము మధురముగా కార్యక్రమము చేయువాని పైనను, పరిసరముల వారిపైనను ప్రభావము చూపును. ఈ నామముల ఉచ్చారణ సంకీర్తనము వంటిది. ఇది బయటకు పలికినపుడే పనిచేయును. భోజనమును మనసార చేయుట చాలదు గదా. భజనము కూడ అంతియే. కంఠము నుండి చేయవలెను. వేదమును ఉద్గీథముగా, హృద్గీతముగా పఠింపవలయునని ఋషులు చెప్పిరి. అనగా పైకి ఉచ్చరింపవలెను, హృదయపూర్వకముగా ఉచ్చరింపవలెను. దేవుని నామములను ఉచ్చరించుట కూడ ఇట్లే చేయవలెను.

2వ చరణము యొక్క తాత్పర్యము

"నారాయణుని నామమే నాశము లేని స్థితికి మార్గము. ఈ అక్షరములే అక్షర స్థితికి గతి – చనిపోవువారికి, సన్న్యాసులకు నాశనము లేని స్థితి కల్గుటకు దేవుని నారాయణ నామమే గతి. పితరులకు తర్పణములు విడుచునపుడు ప్రీతితో ఎవరిని స్మరించి ఈయవలెను? దేవుని. ఏ కార్యక్రమమును తలపెట్టి ప్రారంభించినను ముందుగా సంకల్పము చెప్పునప్పుడు భక్తితో ఎవ్వరి నామములను తలచవలెను? భగవంతుని నామములను."

వ్యాఖ్య

"ఓం నమో నారాయణాయ" అను అష్టాక్షరీ దివ్య మంత్రము భక్తితో జపించువారికి నాశనము లేని అమృతత్వ స్థితి లభించును. ఈ స్థితిలో వేల సూర్యులు మెఱసి నట్లుగా అనిపించును. అపుడు నరుని ప్రజ్ఞ

నారాయణుని యందు కరగిపోవును. నరుని స్థానమున నారాయణుడే ఉండి తలచుట, మాటలాడుట, కర్మలు చేయుట మున్నగునవి ఆచరించి జీవించును. ఇది తెలియక కొందరు నారాయణుని చేరుట యనగా మరణించుట యనియు, మఱికొందరు జన్మరాహిత్య మనియు పొరపడు చుందురు. వాస్తవమునకు అన్నమయ్య చెప్పిన అక్షర స్థితి కలిగినవాడు జన్మలెత్తడు, మరణింపడు. శరీరములను ధరించును, విడుచును. తాను నారాయణ స్థితిలో నుండును. ప్రతి జీవునియందు నర ప్రజ్ఞయు, నారాయణ ప్రజ్ఞయు ఉన్నవి. అనగా జీవప్రజ్ఞయు, అంతర్యామియును. నరనారాయణుల తపోభూమియే జీవితము. నరుడు రథికుడు, నారాయణు సారథి, మనస్సు పగ్గము, ఇంద్రియములు గుఱ్ఱములు, శరీరమే రథము, జీవితమే రథయానము అను సంకేతమును భారతములో కృష్ణార్జునుల రథ ప్రయాణముగ కథగా చెప్పిరి. నారాయణునకు మనస్సను పగ్గ మప్పచెప్పినచో, మనలోని ధర్మ విరుద్ధ గుణములగు కౌరవులు నశించి, ధర్మమునకు పట్టాభిషేక మగును. ఇదియే ధర్మరాజు విజయమునొంది పట్టాభిషిక్తుడగుట. ఇట్లు నిరంతర నారాయణ నామస్మరణ వలన మన హృదయమున ధర్మమే నిలిచి, అమృతత్వ స్థితి కలుగును. దీనినే స్వరాజ్యమని ఉపనిషత్తులు పేర్కొనెను. ఇదియే ఆనంద సామ్రాజ్యము. ఏసుక్రీస్తు దీనినే 'స్వర్గ రాజ్యమ'నెను. శరీరము విడుచునపుడు నారాయణ నామమును ఆ జీవుడు స్మరించి నచో, ఇదే సంస్కారముతో తరువాతి జన్మ ఎత్తును. పూర్వజన్మలో చేసిన సాధన కొనసాగును. కావున దేహత్యాగ సమయమున కంగారు, భీతి పొందకుండ నారాయణ నామమును స్మరించుచు, ప్రజ్ఞను స్వామికి సమర్పించుకొన్నచో అట్టివాడు చనిపోడు. దేహమును విడుచును. అది తొడిమ వలె రాలిపోవును. కాని చనిపోవు నపుడు సాధారణముగా జీవులు తీవ్రమైన భయమునకు లొంగి, నారాయణ నామమును తలచరు. కావుననే కనీసము అతని కుమారులు, చుట్టునున్నవారలు అయినను దేవుని నామమును కీర్తించినచో, ఆ జీవుడు విని నిశ్చలుడై దేహభ్రాంతి విడిచి, ఉత్తమగతి నందునను భావముతో ఒక సంప్రదాయ మేర్పడినది. కాని చనిపోవునపుడు జీవుడు అతి తీవ్రమైన భయాందోళనకు గురియై దేహమునుండి బయటకు వెడలుటకు విముఖుడగును. దీనికి కారణము తానే దేహమను భ్రాంతి. దేహము చనిపోవుట యనగా, తాను చనిపోవుట యను పొరపాటు భావము. ఈ సంగతి తెలిసినను జీవుడు కంగారుపడి, దేహము నుండి వెడలుట కిష్టపడకుండుట వలన ప్రకృతిలోని కొన్ని ప్రజ్ఞలు – వారే యమదూతలు ఇతనికి మత్తుమందు ఇచ్చి బయటకు వెడలింతురు. ఈ మత్తుమందే స్పృహ కోల్పోయిన స్థితి. నిజముగా ఇదియే మృత్యువు. ఏలననగా, ఈ స్థితిలో భగవంతుని స్మరించుట కవకాశము లేదుగదా. కనుక మృత్యు భీతియే మృత్యువు, దేహము విడుచుట గాదు అని భాగవత సందేశము. చనిపోవునపుడు నారాయణ నామము స్మరణకు రావలెనన్న ముందు నుండియే అలవాటు కావలెను. సన్న్యాసులు గూడ నారాయణ నామ స్మరణము చేయక తప్పదు. సన్న్యాస మనగా 'సత్+న్యాసము'= సత్యస్వరూపుడైన నారాయణునితో అనుసంధానము. కొందరు సన్న్యాసులు పొరపడి మాకు జ్ఞానమబ్బినది గావున, ఇంక నారాయణ భక్తియోగముతో పనిలేదని, ఆయన నామమును స్మరింపరు. దీనివలన అతిశయము పెరిగి పతనము చెందెదరు. అయినను సన్న్యాసము మన సాధనను బట్టి వచ్చు స్థితి గాని, మనము పుచ్చుకొనునది కాదు. కావుననే సన్న్యాసు లలో కొందరు బంధములు గలవారుందురు. గృహస్థులలో

కూడ కొందరు పరమ భక్తులై వైరాగ్య సంపన్నులైనవారు సన్న్యాసులే. మేడ ఎక్కితిమి గావున, మెట్లను పడగొట్టవలెనని అనుకొన్నచో అది అవివేకము. అట్లే నాకు వైరాగ్యమబ్బినది, జ్ఞానిని, సన్న్యాసినైతిని, ఇక భక్తి సాధనతో పనిలేదు, నారాయణ నామసంకీర్తనతో పనిలేదు అనుకొనుట అవివేకము. ఇట్టివాడు తానుగా నుండును గాని, నారాయణుడుగా నుండడు. అనగా అహంకారము చావక, ఆనందమునకు దూరమగును. ఇతని జ్ఞానము, వైరాగ్యము, సన్న్యాసము బూటకములగును. కావుననే ఉద్ధవుడు కృష్ణునితో నిట్లనెను. "నిన్ను కనలేని జ్ఞానముకన్న, కనగలుగు అజ్ఞానమే నాకు చాలు." నిజమైన సన్న్యాసులు నారాయణ నామస్మరణ మానరు. ఎవరికైన ఉత్తరము వ్రాసినపుడు కూడ చివరలో 'నారాయణ' నామమును లిఖించి స్మరించెదరు. పితరులకు, అనగా శరీరము విడిచిన తల్లిదండ్రులకు, తాతలకు, ఆపై తరముల వారికి తర్పణములు విడుచునపుడు భగవంతుని భక్తితో తలచెదరు. తమ పితరులకు మంచి ఆరోగ్యము, బుద్ధి, భగవద్భక్తి గల ఉత్తర జన్మలను ప్రసాదింపుమని ప్రార్థించుట ఇందలి ఉద్దేశ్యము. పితరులు దేవతాస్వరూపులు గావలెననియు, పరమపదమును పొందవలె ననియు మంచి ఆశయముతో దేవుని స్మరించుట జరుగును. శరీరములు విడిచిన పితరులకు వారి వారి కర్మఫలములు తప్పవు. కాని తమ వారసులు విడిచిన తర్పణములు, చేసిన నారాయణ స్మరణములు తరువాతి జన్మలో తమ సాధనకు ప్రేరణ కలిగించును. మఱియు ఇట్లు చేసిన వారసులకు పితరుల ఆశీస్సులు, నారాయణుని అనుగ్రహము అనుభవమునకు వచ్చును. పూజాహోమాదులు నిర్వర్తించునపుడు ఆచమనము తరువాత గోవింద, విష్ణు, మధుసూదన మున్నగు నామములను స్మరించి దేవునకు నమస్క రించుట సంప్రదాయము. ఆపైన సంకల్పము చెప్పునపుడు 'శ్రీలక్ష్మీనారాయణ దేవతాముద్దిశ్య' అని శ్రద్ధతో పలికెదరు. అనగా తాను చేయబోవు కార్యక్రమము స్వామి యొక్క ప్రీతి కొఱకు, స్వామిని ఉద్దేశించి అని సంకల్పించుట. ఈ స్మరణ వలన క్రమముగా భక్తిశ్రద్ధలు పెరుగును. దేవుని అనుగ్రహము కన్న, ఆ యను గ్రహము వలన సర్వజనులు క్షేమముగా నుండవలెనని కోరుటకన్న వేరు కోరిక లున్నను జారిపోవును. నారాయణుడు తన సాన్నిధ్యమును క్రమముగ జీవుని సాధనను బట్టి అనుగ్రహించును. జీవితమంతయు నారాయణుని పూజ యగును. దేవుని అనుగ్రహము కలిగినచో, ఇక కోరదగిన దేమున్నది? అదియే లేనిచో అదియే కావలయును గాని, వేఱొకటి కోరదగిన దేమున్నది?

3వ చరణము యొక్క తాత్పర్యము

"నారదుడు తలచు నామ మెవ్వరిది? నారాయణునిదే. పార్వతీదేవి నిత్యము పలుకు నామకథ ఎవ్వరిది? నారాయణునిదే. బ్రహ్మకు, రుద్రునకు, మిగిలిన దేవతలకు ఎవ్వరి నామము తరింపజేయునది? నారాయణునిదే. ఈవిధముగా శ్రీవేంకటాద్రిపై నెలకొని వరమును ఎవ్వరిచ్చెను? నారాయణుడే."

వ్యాఖ్య

నారదుడు పూర్వకల్పమున దాసీ పుత్రుడుగ జన్మించి, హరిదాసులకు సేవ చేసి భక్తుడై, నారాయణాను భూతి నందెను. ప్రళయకాలమున బ్రహ్మతో కలిసి నారాయణుని యందే లీన మాయెను. ఆపై మఱల

సృష్టిలో భాగవత దేహుడై వచ్చెను. అనగా భగవదనుభూతియే అతనికి దేహము గాని, భౌతిక శరీరములతో ఆతనికి పనిలేదు. అందరిలో ప్రవేశించి వెన్నెముకను వీణగా చేసికొని హరినామమును మీటుచుండి, వారిని భగవంతుని వెలుగునందు మేలుకొలుప ప్రయత్నించుచుండును. ఈ సంగతి గుర్తెఱిగి నారదుని భక్తితో స్మరించు వారికి, ఆతడు వారియందు హరి భక్తిని వికాసము నొందించి నారాయణుని సాన్నిధ్యమునకు చేర్చును. ఆవశ్యకములయిన సందర్భము లలో లోక కల్యాణము కొఱకై భౌతిక దేహములను గూడ ధరించి కొందరి యెదుట సాక్షాత్కరించును. ప్రహ్లాదుని, ప్రాచీన బర్హి మహారాజును, వాల్మీకిని, పరాశరుని, వ్యాసుని, ధ్రువుని నారాయణ భక్తియోగ మార్గమున పురోగమింపజేసినది నారదుడే. ఈతని ప్రబోధము వలననే వాల్మీకి రామాయణము, వ్యాసుని భాగవతము నరజాతికి భాగ్యముగా అందినవి. ఇట్టి నారదుడు భారతమున ధర్మరాజుకు కనపడి ప్రహ్లాదుని కథ చెప్పెను. వనవాసమున పాండవులు కృష్ణునందు పూర్ణశరణాగతి నొంది కష్టము లను సహించునట్లు తన సన్నిధితో ఆకర్షించెను. నార మనగా జ్ఞానమనియు నర్థము. నారదుడనగా బ్రహ్మజ్ఞానము నిచ్చువాడు. భక్తియోగమునకు మొదటి ఆచార్య పురుషు డీతడే. భక్తిసూత్రములను రచించెను. ఇంతటివాడయ్యును, మాటిమాటికి ఏదియో నెపమున శ్రీకృష్ణుని దర్శించి యానందించుటకై ద్వారకకు వచ్చెడివాడు. బ్రహ్మానంద స్థితిలో ఎప్పుడు ఉండు నారదుడు గూడ, నారాయణుని నామమును హృదయమున నిత్యము స్మరించుచుండును. దానికి కారణము స్వామి అట్టివాడగుటయే. నారదుడు స్వామి నామమును తలచకుండ ఉండలేడు. నారదుని చేతిలోని వీణ యొక్క తీగల మీద ఎల్లప్పుడు నారాయణ నామము మీటబడుచుండుననియు, నారదుని ముఖము నుండి వెలువడు హరినామమను అమృతధారలో యోగీంద్రులు కూడ పరవశించు చుందురనియు భాగవతమున వర్ణింపబడినది. పార్వతీదేవి నారాయణుని నామమును గానము చేయుచు, దాని ప్రభావము వలన జనులలోను, ప్రకృతిలోను క్రియాశక్తిగా పని చేయగలుగుచున్నది. ప్రకృతి పనిచేయుటకు, మానవుడు పనిచేయుటకు ఆధారమైన శక్తి పార్వతియే. ఆమెకా శక్తి స్వామి నామము నుండి లభించుచుండును. సృష్టి కారకుడగు బ్రహ్మ; లయ కారకుడగు రుద్రుడు; మేఘాధిపతి యగు ఇంద్రుడు; చోటులేని విద్యుత్తుకు ఆధారమైన అగ్ని, వాయువు; మెలకువకు, నిద్రకు నడుమ నున్న సంధుల కధిపతులగు అశ్వినీదేవతలు (వీరు భుజశక్తికి గూడ అధిదేవతలు); చేతల కధిపతి యగు పూషుడు (పోషించువాడు); సూర్యోదయాస్తమయములకు అధిపతులగు మిత్రావరుణులు మున్నగు దేవతలు బ్రహ్మాండమునందును, మన యందు గూడ పనిచేయుచున్నారు. మన ఇంద్రియములను, ప్రాణప్రవృత్తులను, మనస్సును, వాక్కును అధిష్ఠించు ప్రజ్ఞలుగా కూడ దేవతలున్నారు. వీరెల్లరు విష్ణుని యందు అంగములు. సర్వవ్యాపకుడైన స్వామికన్న వీరికి వేఱుగా నునికి లేదు. మన శరీరములోని భాగములన్నియు ఒకే ప్రాణశక్తిపై ఆధారపడి పనిచేయుచున్నట్లు గనే, దేవతలెల్లరు నారాయణుని నుండి తమకు లభించిన శక్తి వలననే పనిచేయు చున్నారు గాని, స్వయముగా దేవతలలో వేరువేరు శక్తులు లేవు. వీరెల్లరు నారాయణుని అంతర్యామిత్వమును స్మరించుచుందురు. అందులకై ఆతని నామమును నిత్యము హృదయమున నిలుపుకొందురు. ఎపుడు శ్రీహరి నామమును వారు మరతురో, అపుడే వారికి తమ తమ యునికి గుర్తుకువచ్చి, తాము నిర్వహించుచున్న

కార్యములకు స్వామి ఆధారమని మఱచి, తామే అందులకు సమర్థులమని అతిశయించుచుందురు. దానితో జారిపడిపోయి మఱల కొంతకాలమునకు స్వామిని స్మరించి శాంతిని పొందుదురు. శ్రీకృష్ణావతార గాథలో ఇంద్రుడు, బ్రహ్మ స్వామిని శోధించబోయి భంగపడి, మఱల ఆతనిని స్మరించి సహజ స్థితికి చేరుకొనిరి. ఇక మన సంగతి చెప్పనేల? కనుక బ్రహ్మ రుద్రాదులకును శ్రీహరి నామమును మఱచుటతో పతనము సంభవించి, తిరిగి అతని నామమును స్మరించుటతో పతనము నుండి విముక్తి పొందెదరు. కనుక నారాయణుని నామము దేవతలకు, ఋషులకు కూడ అజ్ఞానమును దాటింపజేయు నామము. మనము చేయునట్లు కన్పడు పూజాసంకీర్తనాదులు, మంచిపనులు కూడ నారాయణుని నుండి లభించిన సంకల్పము, శక్తి వలననే జరుపబడుచున్నవి. ఇవి మనము చేయుచున్నామనుకొనుట సంసారము. ఇవి మన ద్వారమున స్వామి జరుపుచున్నాడనుకొనుట సంసారము నుండి తరించుట. ఒకసారి తరించిన వాడు వేఱొకసారి సంసారములో పడుటకు అవకాశము గలదు. గావున సదా శ్రీహరి నామస్మరణమే మనలను సంసారము నుండి దాటించు మంత్రము. ఇట్టి నారాయణుడే శ్రీవేంకటాద్రిపై వెలసి తనవైపు జనుల నాకర్షించి తన దర్శన ముతో, తన నామమును స్మరించుటతో వరములిచ్చి కాపాడుచున్నాడు. వర మనగా మనము వరింపదగిన, శ్రేష్ఠమైన కైవల్యస్థితి అని యర్థము. ఇట్లు తన భక్తులకు తాను అమ్ముడుపోవుచున్నానని భాగవతమున పలికెను. అట్టి స్వామి ఐహికముగా వలసిన వానిని, సందర్భమును బట్టి భక్తుల కొసంగుట సహజము.

* * *

11

5వ సం-17 **ఇదిగాక సౌభాగ్య మిదిగాక** **ముఖారి**

ఇదిగాక సౌభాగ్య మిదిగాక తపము మఱి
ఇదిగాక వైభవంబిఁక నొకటి కలదా. ॥ పల్లవి ॥

అతివ జన్మము సఫలమై పరమయోగి వలె
నితర మోహాపేక్షలన్నియును విడిచె
సతి కోరికలు మహాశాంతమై యిదె చూడ
సతత విజ్ఞానవాసన వోలె నుండె. ॥ ఇది ॥

తరుణి హృదయము కృతార్థతఁ బొంది విభుమీఁది
పరవశానంద సంపదకు నిరవాయ
సరసిజానన మనోజయమంది యింతలో
సరిలేక మనసు నిశ్చలభావమాయ. ॥ ఇది ॥

శ్రీవేంకటేశ్వరునిఁ జింతించి పరతత్త్వ
భావంబు నిజముగాఁ బట్టెఁ జెలియాత్మ
దేవోత్తముని కృపాధీనురాలై యిపుడు
లావణ్యవతికి నుల్లంబు దిరమాయ. ॥ ఇది ॥

శరీరము నీకు అశ్వములు బూన్చిన రథము వంటిది. అది నీవే యనుకొని, దాని బంధములో చిక్కుకొనకుము.

టీక

సరిలేక = సహజ లక్షణమగు చాంచల్యమును వీడి.

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య భగవత్‌సేవ కన్న, భగవదానంద స్థితి కన్న వేరు భాగ్యము గలదా యని పలుకుచున్నాడు. తనకు కల్గిన ఈ స్థితి వలని పారవశ్యమున ఈ సంకీర్తనము వెలువడినది. పరవశతానుభూతి మనస్సుకు, మాటలకు ఒదగదు. వీని కతీతమయినది. భగవంతుని వర్ణించుటకు, ఎట్టివాని మనసుకయినను, పలుకుల కయినను సాధ్యము గాదు. కాని మనస్సు పవిత్రమగుటకు, వాక్కు పరిశుద్ధమగుటకు దేవుని వర్ణించుటయే సూటియయిన దారి. కావున మాటలకందినమేర అన్నమయ్య తన యనుభూతిని ప్రకటించుచున్నాడు. నాదమాధుర్యముతో కూడిన మంచి సాహిత్యమునకు దివ్యానుభూతి కొద్దిమేర అయినను అందును. అదియు దైవసంకల్ప మున్న మేర. కావున తన సంకీర్తనలో ఒదిగిన మేర, తనకందిన దివ్యానుభూతిని అన్నమయ్య వెల్లడించుచున్నాడు. అనుభూతి కలుగని వాడిట్లు వ్రాయలేడు. అనుభూతికి ఆచరణ సోపానము. ఈ రెంటితో గూడని వట్టి పాండిత్యమునకు గాని, సాహిత్యము నకు గాని, సంగీతమునకు గాని ఇట్టి సంకీర్తన పొసగదు. ఇచట అన్నమయ్య తనను తాను భగవంతుని కంకితమైన సతిగా భావించుకొన్నాడు.

పల్లవి యొక్క తాత్పర్యము

"భగవంతుడే అఖండానుభూతి. ఈ యనుభూతికన్న మహాభాగ్యము వేరు లేదు. ఇంతకన్న తపము లేదు. ఇంతకన్న వైభవము లేదు."

వ్యాఖ్య

కలదా అను ప్రశ్న వేయుట వలన 'లేదు' అని వక్కాణించుట యున్నది. ఐహిక భోగములెన్ని యున్నను భగవదనుభూతికి సాటిరావు. విషయములు, కీర్తి మున్నగునవి మనకు వెలుపల నున్నవి. అనుభూతి మన లోపలిది. అనుభూతియే మన సహజ స్థితి. మనస్సుకు సంబంధించిన తలంపులు, తెలివి సమాజములోని తోటివారికన్న వేరుగా చూచును గావున రాగద్వేషములను, ఉద్వేగములను కల్గించును. భగవ దనుభూతి యట్టిది గాదు. భగవంతుడు విశ్వాంతర్యామి, విశ్వరూపుడు గావున సమస్త జీవులను స్వామిగా ప్రేమించువానికే అఖండ భగవదనుభూతి కలుగును. ఇది కలిగిన వానికి ఇతరముండదు. తాను, తోటివారు అంతయు స్వామియే. భగవ దనుభూతి గలవానికి సమాజముతో మంచి సామరస్య సంబంధ మేర్పడును. ఈ యనుభూతి, సామరస్యము కన్న సౌభాగ్యము లేదు. సౌభాగ్య మనగా సుభగము యొక్క లక్షణము. సు = చక్కగా, భ = వెలుగునందు, గ = నడుచుట, జీవించుట, ప్రవర్తించుట. సుభగమనగా చక్కగా లోవెలుగయిన భగవంతుని యందు జీవించుట. ఇట్టి జీవన విధానమే సౌభాగ్యము. ప్రతిదినము కొంతసేపు భగవంతుని ధ్యానించుటకో, పూజించుటకో, జపించుటకో, సంకీర్తించుటకో

పరిమితముగాక తన దినచర్య అంతయు భగవంతుని యందు జీవించుటే సౌభాగ్యము. ఇదియే భగవదనుభూతి. కావున భగవదనుభూతి ప్రవర్తన మంతయు, జీవనమంతయు నిండవలెనని అన్నమయ్య ఉపదేశము. ఇక తపమనగా ఏమి? తపమనగా వేడిమి యని సూటి యర్థము. మన మనస్సును భగవంతున కర్పించుటలో పుట్టు ఆర్తియే ఈ వేడిమి. ఇదిగాక తపస్సు మానసిక పవిత్రత, మాటలలో తీయదనము, చేష్టలలో సేవాభావము కలిసియని గీతలో కృష్ణుడు చెప్పెను. అంతేగాని గడ్డములు, మీసములు పెంచుకొని సమాజము నెడ కర్తవ్యములు విడిచి అడవులలోనికి వెళ్ళి జపించుట కాదు. తపమునకు లక్ష్యమేది? కనులు మూసినను, తెరచినను సందులేని అఖండ దివ్యానుభూతియే. ఈ యనుభూతి శరణాగతి, పరమప్రేమ గలవారికి దక్కును. తనను స్వామికి సమర్పణ పొందిన వానికి స్వామి తనను తాను సమర్పించుకొనును. స్వామి యొక్క ఈ సమర్పణకు గుర్తే అఖండ భగవదనుభూతిలో మునుగుట. అనుభూతి పొందుచున్నాననుకొన్నప్పుడు, అనుకొనుచున్న తాను వేరుగా నిలిచి అనుభూతి దూర మగును. కావున ఈ యనుకొనుట ఆగినపుడే అనుభూతి. ఇంతకన్న తపము లేదు. సమర్పణ, ఆర్తి, పరమప్రేమ యనబడు భక్తి లేని వట్టి తపము అనుభూతి నీయ జాలదు. ఇది తపమే గాదు. సమర్పణ ఎవరికి? సమాజ రూపుడగు స్వామికి. భగవదనుభూతి కన్న వైభవ మేమున్నది? వైభవమను పదమును అన్నమయ్య చమత్కారముగా ప్రయోగించెను. వైభవ మనగా వైభోగమని, విశేషమగు అనుభవ మని సామాన్యార్థము. ఇంతమాత్రమయిన అర్థములోనే ఈ పదమును వాడినచో అన్నమయ్య ఎట్లగును? ఇచట అసలయిన అర్థము 'భవము లేని స్థితి' యని యొకటి. విశేషమయిన పుట్టుక యని వేరొకటి. విభవము యొక్క స్థితియే వైభవము. 'వి' అనగా లేనిదనియు, విశేషమనియు రెండు ఉదాత్తములయిన అర్థములు గలవు. కావున అన్నమయ్య భావమేమనగా అఖండ భగవదనుభూతి, దేవుని దయ వలన కల్గినవానికి ఇక పుట్టుక యుండదు. అయితే మిగిలిన జీవులు సుఖదుఃఖాదులను అలల తాకిడికి కొట్టుమిట్టాడుచుండగా, భగవదనుభూతి నందిన మహాభక్తుడు మరల తనకు శరీరమక్కరలేదని, ఆ యనుభూతిలోనే ఉట్టికట్టుకొని ఊరేగుదు ననుకొనడు. అట్లనుకొనువానికి లోపల రెండు దోషములు దాగియుండును. 1. శరీరమును ధరించినచో, మరల దేహభ్రాంతికి లోనై ఈ యనుభూతి జారిపోవునను భయము. 2. మిగిలిన వారికి లేని దివ్యానుభూతి తనకందినది చాలునను ఆధ్యాత్మిక రంగము లోని అతిశయము. కావున నిజమయిన భక్తుడు శరీర ధారణమునకు, పుట్టుకలకు వెరవడు. పుట్టుక దేహమునకే గాని తనకు కాదని యాతని కెఱుకయయిన అనుభవము. తాను ఆత్మనని అతనికి తెలియును. తాను సర్వాంతర్యామి యగు భగవదనుభూతిలోనే శరీరమున్నపుడును, లేనప్పుడును కరగియుండును. ఇట్టివారు మరల మరల పుట్టరు. దేహములోనికి దిగివచ్చెదరు. తోటిజీవుల యందు పరమప్రేమతో తామందుకొన్న దివ్యానుభూతిని సంకల్పము ద్వారమున, చూపు ద్వారమున, మాట ద్వారమున, సంకీర్తన ద్వారమున, స్పర్శ ద్వారమున, సేవ ద్వారమున పంచిపెట్టుదురు. ఎందరి నడుమ వారున్నను, వారు వీరిలోని ఏకమయిన జ్యోతి యగు భగవంతుని యందే ఉందురు. వీరినే అనన్య భక్తులు, ఏకాంత భక్తులు అని శ్రీకృష్ణుడు పేర్కొనెను. సమాజమున కలిసియున్నచో మోహము కల్గునేమో యను మోహము వీరికుండదు. కావున వీరిది విశేషమయిన పుట్టుక.

సామాన్యులు దేహములో నుండి దానికి బద్ధు లగుదురు. అన్నమయ్య వంటి మహాభక్తులలో దేహముండును. వారిలో అదియొక భాగము. వారు దానికి బద్ధులుగాక, భగవదనుభూతి పూర్ణముగా గలిగిన పిదప కూడ, సమాజ రూపుడగు స్వామి సేవకై దేహమును పరికరముగా వాడుకొందురు. ఉదాహరణకు ఒకడు బావిలో కాలు జారిపడెను. వేరొకడు దూకెను. కావున తాను పైకి రాగలడు. మొదటివానిని గూడ పైకి తీసికొనిరాగలడు. ఇద్దరు బావిలోనికి చొచ్చునపుడు చూచినచో ఇద్దరి పద్ధతి ఒకేరీతిగా పైకి కన్పడును. కాని ఇద్దరికి ఎంతో తేడా యున్నది. అట్లే సామాన్య జీవులు పూర్వకర్మ బద్ధులై పుట్టుదురు. మహా భక్తులు తమకు పుట్టుకతో పనిలేకున్నను, తమకందిన దివ్యానుభూతిని ప్రేమగా మిగిలిన వారికి పంచుటకై శరీరములు ధరించెదరు. అదియు మిగిలిన వారజ్ఞానులు, నేను జ్ఞానిని, వారి నుద్ధరించుచున్నానని అనుకొనరు. అట్లనుకొనువారు అజ్ఞాను లయిన పండితులు. మహాభక్తులు తమ ప్రేమను, అనుభూతిని ఇతరుల కందించుట వారి రూపములలోని స్వామికి అర్చనగా భావింతురు. యోగ సంప్రదాయమున సహస్రారమునకు ప్రజ్ఞ చేరుట భగవంతుని యందు జీవుడు లీనమైన దివ్యానుభూతి స్థితి. తిరిగి ఈ ప్రజ్ఞ హృదయకమలమునకు దిగివచ్చి దివ్యప్రేమగా రూపొందును. ఈ స్థితిలో మహాభక్తులు శరీరములు ధరించెదరు. అయినను వారి యఖండ భగవ దనుభూతి చెదరదు. కావున అన్నమయ్య 'వైభవమ'ను పదమును వాడెను. మొత్తము మీద పల్లవిలో అన్నమయ్య ఆశయము, ఉపదేశమిది. భగవదనుభూతి అన్నిటికన్న విశిష్టమయిన అనుభూతి. దీనిని పూర్ణముగా పొందిన వారు కూడ మరల విశేష మయిన పుట్టుకను వహింతురు. కాని వారు శరీరమునకు బద్ధులుగాక, అంతర్యామి యగు స్వామియందే ఉందురు, గావున వారికి పుట్టుక లేనట్లే. ఇదియే మహావైభవము. సిద్ధి వచ్చువరకు సాధన సాగవలెను. సిద్ధి వచ్చిన పిదప ఎట్లును సాధన ఆగదు. ఎందుకనగా వచ్చిన సిద్ధి నిరంతరము నిలబడవలెను గదా! ఇట్లు సాధన దశలోను, సిద్ధి దశలోను కూడ భక్తుడు సమాజముతో కలిసి జీవించి శరీరధారియై భగవత్సేవలో ధన్యుడగును. ఇదియే వేద బోధ. రామానుజులు బోధించిన విశిష్టాద్వైత బోధ. సంస్కృత పదములను, జానుతెనుగు పదములను కూడ ధ్వనితో జాణగా పోతన వలె ప్రయోగింపగల నేర్పరి అన్నమయ్య. మహాకవులు తమ పదములలో వ్యంగార్థ మును చూపగలరు. వాల్మీకి వ్యాస కాళిదాసులు అంతకంటే పైస్థాయిలో గల వేదార్థ మును చూపగలరు. అన్నమయ్య ఇట్టి స్థాయివాడు. ఈ పల్లవిని పరిశీలింపగా, అన్నమయ్య మరల జన్మించి, భగవత్సేవను, సంకీర్తనను, భగవదనుభూతిని పంచుటను కొనసాగింప సంకల్పించినట్లు గానవచ్చుచున్నది. ఇది స్వామి సంకల్పమే. ఇట్టివారే కారణజన్ములు. వీరి జన్మకు కారణము, మానవజాతిపై గల అపార కరుణయే. పూర్వజన్మలో తాను జరిపిన కృషిని అన్నమయ్య కొనసాగింపనున్నాడు. అన్నమయ్య వంటి వారు క్రిందినుండి పైకి వెళ్ళినవారు కాదు. పైనుండి క్రిందకు దిగివచ్చిన వారు. వీరి స్థానము పరమపదము. వీరు నడచుచున్న భగవంతుడే. అన్నమయ్య శరీరము ధరింపక యున్నప్పుడు కూడ, తనకు స్వామి అప్పజెప్పిన పనిలో నిమగ్నులై యున్నాడు. తనను, తన సంకీర్తనలను భక్తితో స్మరించు వారితో అనుసంధానము పెట్టుకొని, వారికి తన సాన్నిధ్యమును ప్రసాదింపగలడు. ఆయన సాన్నిధ్యమునకు గుర్తు ఆయన పొందిన యనుభూతిలో

మనమును నిలుచుటయే. అన్నమయ్యను భక్తితో స్మరించు వారికి అతని సాన్నిధ్యము, మార్గదర్శనము అందును.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"భగవంతున కర్పితమైన అన్నమయ్య హృదయము ఒక గోపిక వంటిది. గోపిక జన్మము వలెనే ఇతని పుట్టుక ఫలవంతమయినది. పరమయోగి వలె ఇతరములయిన మోహమును, అపేక్షలన్నిటిని విడిచినది. ఇతని హృదయము పరిపూర్ణమయిన శాంతమైనది. ఎల్లప్పుడు విజ్ఞానము సంస్కారము వలె హృదయమున నున్నది."

వ్యాఖ్య

తన హృదయము భగవదనుభూతిలో నిండగా, దాని స్థితిని అన్నమయ్య ఈ చరణమున వివరించుచున్నాడు. పుట్టినందుకు ఫలము, ఎవరి నుండి వచ్చితిమో ఆయనను చేరుటయే, ఆయనయే అగుటయే. అనగా భగవంతుని యందు కరిగి, భగవంతుడుగా నగుటయే. ఇదియే సాయుజ్య ముక్తి. జీవన్ముక్తి. ఇది బ్రతికియున్నప్పుడే పొందవలెను, కాని దేహము విడిచిన తర్వాత కాదు. దేహమునే కురుక్షేత్ర మందురు. అనగా భక్తిసాధన అను కర్మను చేయుటకు వలనయిన స్థానము. దేహము విడిచిన తర్వాతి ప్రయాణమును భోగక్షేత్ర మందురు. అనగా అంతకు పూర్వము చేసిన పుణ్య పాప కర్మల ఫలములను సంస్కారములుగా అనుభవించుటయే గాని, పాపము లకు పశ్చాత్తాపపడినను, తిరిగి భక్తిసాధన చేయుటకు అప్పుడు వలనుపడదు. కావున జీవిత మున్నప్పుడే సాఫల్యము నందవలెనని అన్నమయ్య ఉద్దేశ్యము. అతని జీవితము సార్థకమైనది. యోగి యనగా నెవ్వడు? చిత్తము బాహ్య విషయములందు వర్తించుట మాని, అంతర్యామి యగు స్వామి యందు రమించువాడని పతంజలి మహర్షి చెప్పెను. పనులను నేర్పుగా దేవున కర్పితము చేయుటయు, సమత్వము, సమదర్శనము, తనలో అందరిని, అందరిలో తనను దర్శించుటయు యోగమని శ్రీకృష్ణుడు యోగమును నిచ్చెన మీదుగా నిర్వచించెను. అన్నమయ్య పరమయోగి ఆయెను. ఈ అన్ని పరిస్థితులను కొంతసేపు గాక, బ్రతుకంతయు పొందెను. ఇతని కిక ఇతరమే లేదు. తాను, ఇతరము అను వేరుభావము లేదు. తానే అంతర్యామి యగు స్వామి యందున్నాడు. ఇక ఇతరమే లేనప్పుడు, వానియందు మోహము, కోరిక లెట్లుండును? మోహమనగా ఒకదానిని ఇంకొకటిగా పొరపడుట. అసత్యమును సత్యముగా భ్రమించుట. ఉదాహరణకు చొక్కా అసత్యము. అందు దాగిన ప్రత్తి సత్యము. అసత్య మనగా అసలు లేదని గాదు, చిన్న సత్యము. అన్నిటికన్న అసలయిన సత్యము ప్రత్తి. చొక్కా వంటిది జగత్తు. ప్రత్తి వంటివాడు స్వామి. ప్రత్తి కనపడకున్నను చొక్కా అంతయు వ్యాపించియుండును. ప్రత్తి యొక్క ఒక రూపమే చొక్కా. అట్లే అంతర్యామిగా స్వామి జగత్తులో దాగియున్నాడు. జగత్తు ఆయన రూపమే. జగత్తునే స్వామిగా ప్రేమించు భక్తుని అందలి విషయములు – దృశ్యములు, పదార్థములు, మాటలు విడివిడిగా ఆకర్షింపలేవు. ఇతడు చూడకూడనివి, సహజముగా చూడడు. అట్లే అన్ని ఇంద్రియముల

విషయమునను చేయవలసినవే చేయును. చేయగూడనివి ఇతని తలంపులోనికి రావు. ఇతడు జగత్తును సమగ్రముగా దైవస్వరూపముగా దర్శించును. ఇతనిది సమగ్ర దర్శనమార్గమే గాని, విశ్లేషణ మార్గము కాదు. ఉదాహరణకు పూవులోని రేకలను, మొగ్గను, కాడను విడివిడిగా చూచువాడు వృక్ష శాస్త్రవేత్త. కళాతపస్వి పూవు మొత్తము యొక్క – సమగ్ర సౌందర్యమును ఆస్వాదించును. ఒకడు పూవును భోగించు నెపమున, దానిని నలిపివేయును. ఇత డసురుడు. వేరొకడు పూవును ప్రేమించును. తనలోను, పూవులోను ఉన్న దొకటే యని అతనికి స్ఫురించును. పూవును నలుపువాడు భోగలాలసుడు. రెండవవాడు పరమయోగి. అసత్యమును సత్యముగా పొరపడు వానికి అసత్యము లనబడు వాని ననుభవింపవలెనను కోరిక లుండును. ఆ పొరపాటే లేక, అసత్యములందును సత్యమును దర్శించువాని కెట్టి కోరికలును ఉండవు. అన్నమయ్య ఇట్టివాడు. ఇంద్రియములకు, దేహమునకు, మనస్సుకు వలసినంతమేర జగత్తులోని విషయములను వాడుకొనునే గాని, వానికి బద్ధుడుగాడు. ఉదాహరణకు ఆకలిని పూరించుటకై ఆహారమును స్వీకరించును. ఆకలికై రుచిని వాడుకొనువాడు యోగి. రుచిగా నున్నది గదా యని ఆహారము నెక్కువగాను, ఆకలి లేనపుడును తీసికొనువాడు రోగి. వస్త్రమును శరీరమును కప్పు కొనుటకు మాత్రమే ధరించువాడు యోగి. ఫలానా విలాస వస్త్రమునే కట్టెదనని భీష్మించువాడు రోగి. అన్నమయ్య పరమయోగి. ఇతని మనసున కోరికలన్నియు శాంతించినవి. కోరికల కవధి యగు భగవదనుభూతి కలుగగా కోరికలుండునా? అలలు వెనుకకు మరలి సాగరమును చేరినవి. నిండుచందురుని వెన్నెలను త్రావుటలో మత్తెక్కిన చకోరపక్షి, దట్టముగా గ్రమ్మిన మంచులోనికి జొరబడునా? కోరికలు ముసిరినవాని చిత్తము నిరంతరము అసంతృప్తితో క్షోభిల్లుచుండును. కోరికలు లేనపుడు ప్రశాంతి వహించును. పరమయోగులకు ఎల్లప్పుడును విజ్ఞానవాసన లందును. అన్నమయ్య కట్లే అందెను. విజ్ఞాన మనగా ఐహిక శాస్త్రీయవిజ్ఞానమని గాదు. బ్రహ్మజ్ఞానము, వాసనగా అనగా సహజ సంస్కారముగా ఇతనియందు నిలిచెను. ప్రత్యేకముగా దీని నార్జింప ఇతనికి కృషిచేయ బనిలేదు. భగవదనుగ్రహముననే ఈ జ్ఞానము ఇతనిలో ప్రవేశించినది. మరియు అవసరమైన మేర ఐహిక శాస్త్ర విజ్ఞానము కూడ దైవానుగ్రహమున ఇట్టివానికి దర్శనమిచ్చును. దానికై ప్రత్యేక కృషితో పనిలేదు. వాస్తవమునకు యోగి దృష్టిలో బ్రహ్మజ్ఞానము, సైన్సు విజ్ఞానము ఒకే నాణెము యొక్క బొమ్మ, బొరుసు వంటివి. బ్రహ్మజ్ఞానము, భక్తి – వీనితో సమన్వయపడని సైన్సు విజ్ఞానము మానవజాతి వినాశనమునకు దారితీయుట మన మెరుగుదుము. కావున ఏది నేర్చినను అది విజ్ఞానము గాదు. దానిని తోటిజీవుల మేలు కొరకు ఉపయోగించినపుడే అది విజ్ఞానమని ఉపనిషత్తులు చెప్పుచున్నవి. అభ్యసించిన వైద్యము విజ్ఞానము కాదు. దానిని ప్రజాసేవకు వినియోగపరచినపుడే విజ్ఞానము. అట్లు వినియోగపెట్టుటకు ప్రజల యందు ప్రేమ, కరుణ కావలెను. తన ద్వారమున దైవమే ఆ సేవ చేయుచున్నాడని భావింపవలెను. ఇదియే భక్తి. కావున భక్తితో గూడిన విద్యయే విజ్ఞానమని అన్నమయ్య ఇచట నిర్వచించుచున్నాడు. ఇట్టి విజ్ఞానము భవిష్యత్తులో కొరవడునని అన్నమయ్యకు తెలియును. ఈ విజ్ఞానము అతనిలో సహజ లక్షణముగా (వాసనగా) శ్వాస వలె నిలిచినది. మరియు భక్తు లనగా లౌక్యము తెలియనివారని యర్థము కాదు. లౌక్యమును నమ్మక, దేవుని అంతర్యామిత్వము, అనుగ్రహము, మానవత్వము నచ్చినవారని యర్థము.

అన్నమయ్య ఇట్టివాడు. విజ్ఞాన మనునది దైవానుగ్రహమే గాని స్వార్జితము కాదు. భక్తిప్రవాహ మను నీటిలో నిలిచిన హృదయ పద్మము యొక్క గుబాళింపైన మంచి వాసనయే విజ్ఞానము. దేవుని నమ్మట వలన గాక, దేవుడు నచ్చుట వలన ఇది లభించును.

2వ చరణము యొక్క తాత్పర్యము

అన్నమయ్య రెండవ చరణమున తన యనుభూతిని తెలుపుట ఇట్లు కొనసాగించు చున్నాడు. "తన హృదయము స్త్రీ వలె కోమలమయినది. ధన్యమైనది. దేవుడిచ్చి నందుకు దాని ప్రయోజనము నెరవేరినది. పారవశ్యము వలన గలిగిన ఆనందమను సంపదకు నిలయమయినది. తన హృదయము సరస్సు నుండి పుట్టిన పద్మము వంటి ముఖము గల కోమలితో బోల్చదగినది. ఇది మనోజయము నొందినది. ఇక సాటిలేని నిశ్చలభావ స్థితిని మనస్సు పొందినది."

వ్యాఖ్య

స్వామికి సమర్పితమై స్వామి సేవలోను, స్మరణలోను ఎల్లప్పుడు మునుగుచు అతని హృదయము కృతార్థమయినది. అర్థము అనగా ప్రయోజనము. కృతము అనగా నెరవేరినది. దేవుడిచ్చిన హృదయమును దేవున కర్పించుటే కృతార్థత. ఈతని హృదయము సర్వోత్తముడగు స్వామికి వశమై ఆనందమునకు నిలయమయినది. ఇక హృదయ స్థానమున స్వామియే నిలిచియున్నాడు. స్వామి ఆనందసాగరము. ఇదియే అసలయిన సంపద. ఆనందము లేనివాని కెంత ధనము, భోగము లున్నను సంపద లేనట్లే. స్వామికి అధీనమైన అన్నమయ్య హృదయము గూడ ఆనందసాగర మయినది. సరస్సు నుండి పుట్టిన పద్మము వంటి ముఖము గల కోమలితో తన హృదయమును అన్నమయ్య పోల్చుచున్నాడు. సరస్సు అనగా కోనేరు అని బాహ్యార్థము. రసముతో గూడినది అని విశేషార్థము. రస మనగా ఆనందము. ఆనందముతో గూడిన దివ్యభావనల నుండి ఈతని హృదయము పుట్టినది. హృదయము పరమప్రేమ, ఆనందములతో నిండినపుడు మనస్సులోని తలపులు మాయమగును. ఆలోచన ఉన్నంతసేపు ఆనందముండదు. భక్తిపారవశ్యానందము నిండగనే ఆలోచన లాగిపోవును. ఇదియే మనోజయము. మనసే కదా ఆలోచనలకు పుట్టినిల్లు. మనస్సు బాహ్యమగు వస్తువులను, వ్యక్తులను తనకన్న ఇతరముగా గుర్తించి, ఆ వాసనల నంటించుకొనును. దానిని భగవంతుని కర్పించుట, రుమాలులో కర్పూరము పెట్టి వెలిగించుట వంటిది. ఇక మనస్సే అదృశ్యమై, దాని స్థానమున భగవంతుడుండును. బ్రహ్మానందపారవశ్యమున మనస్సు కలిపించు వేరు దృష్టికి తావు లేదు. ఉదాహరణకు ఒక భక్తుడు సంకీర్తనము చేయుచున్నప్పుడు కొంతసేపు అతని రూపురేఖలు, హావ భావములు, ముఖకవళికలు, పరిసరములు, ప్రక్కనున్న వ్యక్తులు, కుటుంబ విషయ ములు గుర్తుండును. క్రమముగా మనస్సు గానమునందే లయమై ఆనందమే మిగులును. ఇవి ఏవియు గుర్తుండవు. అయితే ఇట్టి స్థితి గానకచేరీ లేకపోయినను, సహజముగా సదా నిలుచుటయే కైవల్యము. భగవత్ పరవశానందసంపద. మనోజయమున కిదియే సూటిదారి. చంచలమయిన మనస్సును నిలబెట్ట యత్నించుట

గాలిని మూటకట్ట యత్నించుట వంటిది. ఇది ఎన్ని జన్మలు చేసినను సాధ్యము గాదని గీతలో చెప్పబడినది. ఒక చేతితో ఇంకొక చేయి పోరాడుట వంటిది. మనస్సును నిశ్చలము చేయ యత్నించునది కూడ మనస్సే కదా! ఇక ఇది ఎట్లు సాధ్యమగును? మనస్సు బాహ్య విషయములందే వర్తించుచున్నది వానియందేదో సుఖమున్నదని భ్రమించి కదా! అన్నిటికన్న ఉత్తమమయిన భగవదానందమున అది మునుగగా ఇక విషయ సుఖములందాసక్తి దానికదియే జారిపోవును. మనోలయమే మనోజయము. చిన్నపిల్లవాని చేతిలో బెల్లమున్నదనుకోండి, దానిని వాని చేతినుండి లాగివేసిన పిల్లవాడు కెవ్వుమని ఏడ్చును. అట్లుగాక పైనుండి పటికబెల్ల మందించినచో, బెల్ల మదియే జారిపోవును. అట్లే భగవదానందపు రుచి మరిగినచో, విషయసుఖాసక్తు లవియే జారిపోవును. ఒక రుమాలులో ఏ వాసన గల పదార్థము నుంచిన ఆ వాసన రుమాలుకంటును. అట్లుగాక రుమాలులో కర్పూరము నుంచి వెల్గించినచో, రుమాలు అదృశ్యమగును. అట్లే మనస్సు ఐహికమయిన ఏ విషయమును భావించినచో అదియే యగును. భగవంతుని సేవలోని ఆనందమున మునిగినచో, మనస్సే మాయ మగును. దీనినే అన్నమయ్య ఇచ్చట ఉపదేశించుచున్నాడు. మనస్సు కోతివంటిది. ఆశలను కొమ్మలపై ఎగురుచుండును. భగవంతుడు తన పాదభక్తి అను త్రాటితో దీనిని కట్టి తన అధీనము చేసికొన్నచో ఇక చాంచల్యమాగి నిశ్చలభావ మొందునని ఆదిశంకరులు చెప్పిరి. మనస్సున్నంతసేపు చాంచల్యము తప్పదు. మనస్సు స్థానమున అంతర్యామి యగు స్వామి యుండుటతో అది నిశ్చలమగు భావము అనగా ఇచట అనుభూతి నొందునని యర్థము. ఆళ్వార్లలో విష్ణుచిత్తుడు పెద్ద. ఆయన విష్ణువే తన చిత్తమయినవాడు. అన్నమయ్యయు అంతియే. ఇతడు ఆళ్వార్లతో సమానుడయిన మహాభక్తుడు. మనోజయమునకు ఇంతగా తేలిక మార్గమును చూపిన అపర వ్యాసు డీతడు.

3వ చరణము యొక్క తాత్పర్యము

"శ్రీవేంకటేశ్వరుని సదా స్మరించుచు అన్నమయ్య హృదయమునకు పరతత్త్వ భావము నిజముగా పుట్టినది. ఈ హృదయమను స్త్రీ తన ప్రభువును, దేవతలలో శ్రేష్ఠుడునగు స్వామి యొక్క దయకు వశమయినది. ఇపుడిక ఈ లావణ్యవతికి చిత్తము స్థిరమయినది."

వ్యాఖ్య

పై చరణమందలి భావమునే అన్నమయ్య ఈ చరణమునందు వివరించుచున్నాడు. పరతత్త్వ మనగా పంచభూతాది తత్త్వములకు మూలమయిన గొప్ప తత్త్వము. ఇవి యన్నియు కుండల వంటివి. పరతత్త్వము మట్టి వంటిది. మట్టి కుండలకు అతీత మయినదే గాక, కుండలందు అంతర్యామి కూడ. అట్లే పరబ్రహ్మము. చాలమంది భావించునట్లు సృష్టి కతీతమయినది, గుణాతీతమయినది, నిరాకారమయినదే గాక, సృష్టిగా రూపొంది అందు అంతర్యామి యయినది. అన్ని గుణములు, ఆకారములు తానే అయినది. సృష్టి కతీతుడగు దేవుని ధ్యానించిన దుఃఖమే మిగులునని కృష్ణుడు చెప్పెను. సృష్టిలోని అంతర్యామియు, విశ్వరూపుడునగు దేవుడే భావింపదగినవాడు. సగుణుడు, నిర్గుణుడు అను భేదభావములు మన దృష్టికే గాని దేవునకుండవు.

ఇచట అన్నమయ్య భావనలో వేంకటేశ్వరుడనగా తిరుమలలో వెలసిన అర్చామూర్తి మాత్రమే గాదు. అతని భావనలో విశ్వమునందలి ప్రతి జీవుని రూపములో నున్నది వేంకటేశ్వరుడే. అందులకే 'పరతత్త్వమ'ను పదమును ప్రయోగించెను. అన్ని రూపాల లోని తత్త్వ మనమాట. ఇట్టి భావన యనగా వట్టి తలంపు గాదు. భావన యనగా అనుభూతి యని పతంజలి చెప్పెను. సర్వరూపాలలో వేంకటేశ్వరుని దర్శనము అన్నమయ్యకు అనుభవమయినది. ఇతడు యోగజీవనమును జీవించినవాడు గావుననే యోగపరిభాష యగు 'భావన' అను పదమును ప్రయోగించెను. ఈ అనుభవము మన సాధన వలన మాత్రమే రాదు. దైవానుగ్రహము కూడవలెను. కావున దీనిని స్వామి తనకు ప్రసాదించెనని సవినయముగా అన్నమయ్య మనవి చేసికొనుటకు గాను, ఆ భావనయే నిజముగా తనను పట్టినదనుచున్నాడు. తాను అనుభూతిని పట్టలేదు. పట్టుట సాధ్యముగాదు కూడ. అనుభూతియే తనను పట్టినదట. ఇచట అనుభూతి కర్త. తాను కర్మ. 'పట్టెను' – క్రియ. ఇట్లు రచించుట నిత్యము యోగానుభూతితో జీవించువానికే సాధ్యము. గ్రంథ పరిజ్ఞానము మాత్రమే గలవాడిట్లు వ్రాయ లేడు. 'పట్టెను' అనగా ఒకసారి కలిగి, విడువలేదన్నమాట. శాశ్వతముగా నిలిచిన దన్నమాట. నిజముగా పట్టెనట. వాస్తవముగా పట్టెను. మరియు నిజమనగా జననము లేని స్థితి యని యర్థము. భగవదనుభూతి పుట్టుటకు అతీతమయిన ఆత్మకు సంబంధించినది గదా! దేహోత్తముడనగా సర్వ దేవతలలో శ్రేష్ఠుడు. శరీరమునందలి అవయవము లన్నియు జీవునిలో భాగములు గదా! భాగము కన్న మొత్తము శ్రేష్ఠము గదా! అట్లే సృష్టిలో పంచభూతములు, ఇంద్రియాలు, రవి చంద్ర తారకలు, ప్రాణము మున్నగు దేవతలెల్లరు విశ్వరూపుడగు స్వామియందు భాగములు గావున దేవతలో ఇతడు శ్రేష్ఠుడు. మరియు ఉత్తముడనగా 'ఉత్తమపురుష' అగు 'నేను' అని యర్థము. స్వామి అన్నిట గల 'నేను'. ఈ నేనునే ఆత్మ యందురు. దేవతలలో ఆ 'నేను'కు సంబంధించిన భాగములు. అట్టి విష్ణుని కృపకు వశమై, అన్నమయ్య హృదయము ఆనందమయ మాయెను. ఈతని హృదయము లావణ్యవతి యట. అనగా సౌందర్యము, సౌకుమార్యము గలది. మరియు ముత్యములలో కాంతి ప్రతిబింబించు నట్లు, తన హృదయము స్వామికి ప్రతిబింబము అని యర్థము. అన్నమయ్య స్వామి కన్న వేరుగా లేడు. స్వామి స్థిరమయిన ప్రేమ, ఆనందము. ఇపుడు అన్నమయ్య హృదయము స్వామికి ప్రతిబింబమై, మృదులమై స్థిరమయినది. అన్నమయ్య ఏ చిన్న పదమును గూడ వ్యర్థముగా ప్రయోగించుట జరుగలేదు. ఇతని యనుభూతి సమగ్రము, పరిపూర్ణము గావున, అందుండి వెలువడిన ప్రతి పదము కూడ సార్థకమే. 'లావణ్యవతి' యని గాక వేరొక పదమును వాడియుండినచో, ఇంతటి విశేష భావము రాదు.

* * *

12

2వ సం-461 **ఇహమెట్టో** సాళంగనాట

ఇహమెట్టో పరమెట్టో ఇcక నాకు
సహజమై హరియే శరణము నాకు. ॥ పల్లవి ॥

చిత్తమిది యొకటే చింత వేవేల సంఖ్య
పొత్తుల హరిc దలcచc బొద్దులేదు
జొత్తుల కన్నులు రెండు చూపులైతే ననంతాలు
తత్తఱించి హరిరూపు దగ్గఱి చూడలేదు. ॥ ఇహ ॥

చేతు లివియు రెండే చేష్టలు లక్షోపలక్ష
యీతల హరిc బూజించ నిచ్చ లేదు
జాతి నాలిక ఒకటే చవులు కోటానcగోటి
రీతి హరినామ ముచ్చరించ వేళ లేదు. ॥ ఇహ ॥

వీను లివి రెండే వినికి కొలcది లేదు
పూని హరిభక్తి విన బుద్ధి లేదు
ఈనటన శ్రీవేంకటేశుc డిటు చూచినను
తానే యేలె నిcకc దడcబాటు లేదు. ॥ ఇహ ॥

నీ శరీరావసరములను, మనస్సు అభిలషించు వాంఛలను
విడమరచి గమనింపుము.

టీక

జొత్తుల = పైకి వెడలిన; తత్తఱించి = తొందరపడి; జాతి = పుట్టుక; రీతి = వైఖరి.

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య మానవ శరీర తత్త్వమునందు గల చిత్తము, కన్నులు, చేతులు, నాలుక, చెవులు భగవంతుని సేవించుట కిష్టపడక, ప్రాపంచిక విషయములందు ఆసక్తితో పనిచేయుచుండుట వలన ఆనందము కోల్పోవుట జరుగు చున్నదని ఆవేదన పొందుచున్నాడు. తన చిత్తము, అవయవముల విషయము కాదు ఆతడు ప్రస్తావించుచున్నది. లోకములోని సామాన్య మానవుల స్థితిని గూర్చి ఆవేదన చెందుచున్నాడు. సంతతి యొక్క బాగుకై తల్లిదండ్రుల ఆవేదన ఇది. అయితే పల్లవిలో తన విషయమునే ప్రస్తావించుచున్నాడు గదా యను శంక కలుగవచ్చును. ఇట్లే ఆదిశంకరులు, ధూర్జటి, కులశేఖరాళ్వారు కూడ సామాన్య జనుల పరిస్థితిని తమయందారోపించుకొని దేవునితో మొఱపెట్టుకొనిరి. అన్నమయ్య కూడ సామాన్య జనుల ప్రతినిధిగా మొఱపెట్టుకొనుచున్నాడు. మనస్సు, శరీరావయవములకు భగవత్ సేవలోనే ధన్యత లభించునని అన్నమయ్య ఉపదేశించుచున్నాడు.

పల్లవి యొక్క తాత్పర్యము

"ఇక నాకు ఈ లోకము, పరలోక మెట్లు లభించునో! నాకిక సహజముగా హరియే శరణము."

వ్యాఖ్య

ఈ లోకమనగా ఐహిక జీవితము. పరలోక మనగా మరణము తర్వాత కలుగునది కాదు. పరమనగా ఇహము కానిది. అంతకంటె గొప్పది. అదియేమి? ఆధ్యాత్మిక జీవితము. వాస్తవమునకు ఈ రెండును వేరువేరుగా నుండరాదు. ఆధ్యాత్మికతతో సంబంధము లేని ఐహిక జీవనము దుఃఖమునే కల్గించును. ఆధ్యాత్మికత అనగా దినములో ఏదో కొద్దిసేపు జపతపో ధ్యాన పూజాదులకే పరిమితమయినది గాదు. దినచర్య అంతయు, బ్రతుకంతయు దైవస్మరణతోనే, దైవార్పితముగా సాగవలెను. అపుడు ఐహికమని, ఆధ్యాత్మికమని రెండు ఉండవు. ఇహము, పరములో ఇమిడి పోవును. భక్తి సాధనకు నారదుడు తన భక్తిసూత్రములలో ఒక ఉపాయము చెప్పెను. "అన్ని పనులు అంతర్యామి అయిన దేవునకు అర్పితము కావలెను. దేవుడు మఱపునకు వచ్చినపుడు అధిక వ్యాకులత కలుగవలెను." 'నాకు' ఇవి యెట్లనుటలో సామాన్య జనుల స్థితినే అన్నమయ్య వారి ప్రతినిధిగా ప్రస్తావించుచున్నాడు. జీవితమున చేయవలసినది చేయుట ఇహము. దైవస్మరణ చేయుచు దివ్యానంద స్థితిలో మునుగుట పరము. పనులు చేయుచున్నప్పుడు దైవస్మరణ కుదురదు. దైవస్మరణ చేయుచున్నప్పుడు పనులు చేయుట కుదురదు. కాని దైవస్మరణతో పాటు, పనులు చేయుటయేగాక పనులు తన ద్వారమున దేవుడే జరుపుట కలిసి సాగుట కావలెనని అన్నమయ్య కోరుచున్నాడు. ఈ రెండు కలిసి సిద్ధించుటకుగాను సహజమైన దిక్కు అగు స్వామిని శరణందుటయే సహజమైన దారి. ఇచట ఇహలోక సుఖమును అన్నమయ్య కోరుచున్నాడని అర్థము

చేసికొనరాదు. ఇహలోకమున కర్తవ్యములను స్వామికి అర్పితములుగా చేయుచు, సమకాలికముగా దివ్యానుభూతిలో నుండుటనే అందరికి కలుగవలెనని కోరుచున్నాడు. అందరికి ఈ స్థితిని ఇవ్వుమని హరిని వేడుచున్నాడు. అందరును స్వామినే శరణంది, తమకీ స్థితిని ప్రసాదింపుమని వేడవలెనని అన్నమయ్య ఉపదేశించుచున్నాడు. ఇహపరముల సమన్వయమునకు హరియే శరణము. కొందరు పరమనగా జపతపోధ్యానాదులని భావించి, వానితోనే పూర్తిగా ప్రొద్దుపుచ్చి, ఇహలోక జీవితమున కర్తవ్యములను మరచుచున్నారు. ఎవరియెడలనైనను కర్తవ్యమును విడువరాదు. వీడవలసినది వ్యామోహమునే. పూజా జపాదులన్నియు కర్తవ్యాచరణను, బ్రతుకును స్వామికి సమర్పణ పొందుట కొరకే దోహదపడవలెను. మ్రొక్కుబడులు గూడ తమ కోరికలు తీర్చుకొనుటకు గాదు, స్వామి సన్నిధిని చేరుటకు.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"చిత్తము ఒకటే. కాని అవి చేయు చింతలు వేలవేలు. కాని హరిని ప్రేమతో తలచుటకు దానికి సమయము దొరకుట లేదు. పైకి వెలువడి వచ్చిన కన్నులు రెండే. కాని వాని చూపులు అంతులేనన్ని. తొందరపడి దగ్గరగానే యున్న హరి రూపును ఇవి చూడలేకున్నవి."

వ్యాఖ్య

చిత్తమనగా ఇంద్రియముల ద్వారమున లోకములోని విషయములందు వర్తించు మనస్సు. ఇంద్రియములు స్వతంత్రముగా వర్తింపలేవు. చిత్తమే వీని ద్వారమున పనిచేయును. శవమునకు కన్నులున్నను చూడలేవు గదా. లోకములోని వేనవేల విషయములపై చిత్తము వర్తించుచు వాని నంటించుకొనును. ఇతరులపై అభిప్రాయ ములు, కొన్నిటియందు వాంఛ, కొన్నిటి యందు విముఖత, కొందరియందు రాగము, కొందరియందు ద్వేషము – ఇట్లు జంట భావముల చిక్కులలో ఇరుక్కొనుచుండును. ఫలితముగా సుఖదుః ఖముల ఆటుపోట్లకు గురియై శాంతిని కోల్పోవును. ప్రస్తుత నాగరిక మానవుడు చంద్ర మండలముపై కాలు పెట్టినను, సైన్సులో ఎంత అభివృద్ధి సాధించినను శాంతి మాత్రము పొందుటలేదు. శాంతికి త్రోవ హరిని ప్రేమతో తలచుటయే. తనకు కావలసిన వానియందు వర్తించుచు, వానిని కూడ హరి రూపములుగా తలచవలెను. ఆవశ్యకము గానివాని వైపు చిత్తము పోకుండ ఉండుటకు గూడ హరిని తలచవలెను. ఒకవేళ చిత్తములో ఈ విషయములు చొచ్చినను, వానిని కూడ హరి యొక్క లీలా రూపములుగా దలచినచో చిత్తము వానియందు వర్తించుట మాని హరియందు వర్తించును. ఇదియే ధ్యానమార్గము. అంతేకాని హరిని ధ్యానించు చుండగా, తలచుచుండగా ఇతర విషయములు మనసులోనికి చొరబడుచున్నవని ఆందోళనపడువానికి ఎన్నటికిని చిత్తశాంతి లభింపదు. అయితే వేనవేల విషయములను తలచుటకు, ప్రీతితో కోరుటకు సాధారణ జనుల విషయమున చిత్తమునకు కాలము వెళ్లిపోవును. వార్ధక్యదశలో హరిని తలచవచ్చునులే, ఇపుడే ఎందుకు? హాయిగా యౌవనమున ఐహిక సుఖము లనుభవించుట మానుట ఏల అనుకొను వానికి అభ్యాసబలమున ఐహిక విషయాసక్తి యొక్క పట్టు ఆతని చిత్తముపై బిగిసి, హరిని ప్రీతితో తలచుట ప్రారంభించు లోపలనే మృత్యువు ఆసన్నమగును. అప్పుడు చేయగలిగినదిక ఉండదు.

జన్మ వృథా యగును. శైశవము నుండియే హరిచింతన సాగవలెను. తల్లిదండ్రులు పిల్లలకు అట్టి శిక్షణ నీయవలెను. చిత్తమున త్రికోణము వర్తించును. లోకములోని విషయములు, విషయములను తలచుట, తలచు చిత్తము ఈ మూడు. అంతర్యామి అయిన హరిని తలచువానికి ఈ మూడును హరియే యగును. ఒక గోపిక గోకులము నుండి మధురకు వెళ్లి పాలు, పెరుగు, వెన్నలను అమ్ముచున్నది. ఆమె చిత్తము కృష్ణునందు వర్తించుచున్నది. కావున పాలు, పెరుగు, వెన్న అనుటకు బదులు, వానిని కొనువారి పేర్లను పలుకుటకు బదులు 'గోవింద, దామోదర, మాధవ' అనుచు పారవశ్యము చెందుచున్నదని లీలాశుకుడను భక్తుడు వర్ణించెను. కన్నులు పైకి పొడుచుకొని వచ్చుచున్నవి. ఇవి రెండే. కాని ఇవి చూడగోరు రూపములు, చూచు రూపములు పుట్టినప్పటి నుండి లెక్కవేసినచో అంతులేనివి. ఆ యా రూపాల ఆకర్షణ, వికర్షణలకు లొంగి కన్నులు, వాని ద్వారమున చూచు చిత్తము వ్యర్థము లగుచున్నవి. కన్నులు తొందరపడి, తమకు దగ్గరగానే యున్న హరిని చూచుట లేదు. తిరుమల వెళ్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుట మంచిదే. కాని స్వామి మనకు కనపడు సకల జీవుల రూపములలో, వస్తువుల రూపములలో, ప్రకృతి రూపములో దర్శనమిచ్చుచున్నాడు. ఇట్టి స్వామిని దర్శించుటకు లోగన్ను త్వరగా సిద్ధపడవలెను. అపుడు వెలుపలి కన్నులకు కూడ స్వామి దగ్గరగానే దర్శన మిచ్చును.

2వ చరణము యొక్క తాత్పర్యము

"చేతులు రెండే, కాని చేష్టలు లక్షోపలక్షలు. కాని ఈ తలకు హరిని చేతులతో పూజించు కోరిక కలుగుట లేదు. పుట్టుకతో మనకు వచ్చిన నాలుక ఒకటే. రుచులు కోటానుకోట్లు. చక్కని పద్ధతిలో హరి నామమును ఉచ్చరించుటకు నాలుకకు తీరిక లేదు."

వ్యాఖ్య

రెండు చేతులు దేవుడు మన కిచ్చినది తనను పూజించుట కొరకు. అనగా రేయింబవళ్లు పూజ చేయుడని కాదు. కొంతసేపు దేవుని అర్చామూర్తిని అంతర్యామిగ భావించి భక్తితో పూజింపవలెను. ఆపై కుటుంబ సభ్యులకు, సమాజ సభ్యులకు చేయు సేవ కూడ వారిని హరిగా ప్రేమతో భావించినచో హరి పూజయే యగును. మొదటిది రేడియో, టెలివిజన్‌ల స్విచ్ ఆన్ చేయుట వంటిది. రెండవది ప్రసారమగు చున్న కార్యక్రమములను ఆనందించుట వంటిది. కాని తనకు రెండు చేతులిచ్చిన హరిని, వానితో పూజించవలెనను ప్రీతి మనస్సులో కలుగుటలేదు. మనకు పుట్టుకతో దేవు డిచ్చిన నాలుక ఒకటే. కాని ఎన్నో కోట్ల పదార్థములపై అది రుచి మరగును. నాలుక జ్ఞానేంద్రియము లందును, కర్మేంద్రియము లందును సమానమే. మొదటి దానిగా భుజించి రుచి చూచును. రెండవదానిగా మాటలు పలుకును. నాలుక అనేక పదార్థములను రుచి చూడ ఇష్టపడుచున్నది. కాని ఇచట విచిత్రమున్నది. భుజించి రుచి చూడగోరునది నాలుక. దానిని స్వీకరించునది పొట్ట. రుచి చూచితినని భ్రమించునది మనస్సు. నాలుకకు రుచి అందదు. కారణము రుచి యనునది ఒక అనుభవము గదా. రుచి అందకున్నను, మనస్సే నాలుక ద్వారమున వివిధ రుచులను గోరును. ఏ పదార్థము యొక్క రుచిని గూడ మనస్సు పూర్తిగా పొందలేదు.

ఇంకను భుజింపవలెనను కోరిక, భుజించుచున్నది అయిపోవునేమో అను ఆందోళన రుచి యొక్క అనుభవమును కోల్పోవునట్లు చేయును. మరి రుచిని దేవుడెందుకు ఏర్పాటు చేసెను? ఆకలికి ఆరోగ్యప్రదమైన ఆహారమును భుజించుటతో బాటు రుచిని గూడ జీవిపై ప్రీతితో ఏర్పరచెను. కాని రుచి కోసమై భుజించువాడు రోగి. ఆకలికై రుచిని వినియోగించుకొనువాడు యోగి. రుచిగా నున్నదని మరికొంచెము ఇతడు తినడు. పశువు కూడ లంచమిచ్చినను ఆకలికి మించి తినదు. యుక్తాయుక్త విచక్షణను ప్రకృతి మానవున కిచ్చినది. ఇది కత్తి వంటిది. కత్తితో కూరగాయలు తరుగవచ్చును. గొంతులు కోయవచ్చును, కోసికొనవచ్చును. నిర్ణయము ప్రకృతి నరునకే అప్పజెప్పి నది. జంతువుల విషయమున ప్రకృతియే నడిపించును. నరునకు స్వేచ్ఛ వచ్చుటతో రుచికి లొంగిపోవుచున్నాడు. ఒకవేళ ఆకలికి తగినది భుజించుచు రుచిని అనుభవించి నను అదియు భ్రమయే. నిజమైన రుచి భగవంతుని నామమును సంకీర్తన చేయుట యందు గలదు. కాని అందులకై నాలుకకు పాపము తీరిక లేకున్నది. జీవితాంతము మనము భుజించుట మానుట జరుగదు. కాని భగవంతుని నామమును పలుకుటకు మాత్రము మొగమాటము, కొంతసేపటికి విసుగు కలుగుచుండును. నామసంకీర్తన యందలి గొప్ప రుచిని మరగిన వానికి, మిగిలిన పదార్థములపై ప్రీతి కలుగదు. సంకీర్తన కూడ ప్రీతితో, శ్రద్ధగా ఒక చక్కని వైఖరిలో గావింపవలయునని అన్నమయ్య బోధించుచున్నాడు. సంగీతము రాకున్నను, హృదయమార ఒక చక్కని వైఖరిలో సంకీర్తనము చేయవలెను. దీనికి శిక్షణ ఉపకరించును.

3వ చరణము యొక్క తాత్పర్యము

"వినుటకు దేవు డిచ్చిన చెవులు రెండే. కాని వినుటకు మాటలకు హద్దు లేకున్నది. శ్రద్ధతో ప్రయత్నించి హరిభక్తిని వినుటకు మాత్రము బుద్ధి రాకున్నది. ఇదంతయు శ్రీవేంకటేశ్వరుని నటనయే. ఎట చూచినను ఆయనే ఏలుచున్నాడు. కావున ఇక తడబాటుచెంద పనిలేదు."

వ్యాఖ్య

చెవులున్నది భగవంతుని నామమును, గుణములను, అవతారమూర్తుల కథలను, భక్తుల జీవిత సన్నివేశముల, తోటి మానవులలోని మంచిని వినుటకు. ఇవి యన్నియు వినుట హరిభక్తి క్రిందకే వచ్చును. 'భక్తి' యనగా బంక యని యర్థము. దీనిని వినుట వలన సర్వాంతర్యామి అయిన హరి యందు బంక వలె మానవుని బుద్ధి అతుక్కొనును. ఇవతలికి రాదు. కావున ఆధ్యాత్మిక సాధనలో మొదటి మెట్టు హరిభక్తికి సంబంధించిన అంశములను వినుట. ఇచట విషయములనగా వేదాంతము గాదు, హరి యందు ప్రేమను పుట్టించు నామ గుణ కథలే. మహనీయుల జీవిత సన్నివేశములు, వారి ద్వారమున వ్యక్తమయిన దేవుని గుణములు చూపినంతగా శుష్కవేదాంతము జనులపై ప్రభావము చూపలేదు. వేదవ్యాసుడు వేదములను సంపుటి చేసెను. బ్రహ్మమునకు, జీవునకు దారము కట్టు బ్రహ్మసూత్రములను రచించెను. వేదము నందలి అంశములు సూటిగా అర్థముగావని పదునెనిమిది పురాణములు రచించెను. ఆపైన సమకాలీన చరిత్రను గైకొని దానినొక కావ్యముగా మలచి అర్థ కామములు-భౌతిక ప్రయోజనములు, కావలసినవి నెరవేరుట

ధర్మాచరణ ద్వారమున సాధింపవలెననియు, ధర్మముగా జీవించినచో అవియే వచ్చుననియు, సమాజ గతికి మూలస్తంభము ధర్మమే అనియు నిరూపించుచు మహాభారతమును రచించెను. అయినను అతనికి తృప్తి కలుగలేదు. పామరు లనబడు వారిలోని అంతర్యామికి సమర్పితముగా తాను రచించినట్లు అన్పింపలేదు. తనలోని అంతర్యామికి తృప్తి కలుగలేదు. దీనుడై నిలిచెను. అపుడు నారదులవారు, వ్యాసుని వద్దకేతెంచి ఇట్లుపదేశించెను. "విజ్ఞానమును, దేవుని పొందు విధానమును, ధర్మములను చెప్పిన చాలదు. హరిని కోరి ప్రీతితో నుతింపలేదు. ధర్మమును ఆచరించినచో గుణము లగును. అట్టి అవతారమూర్తుల, మహాభక్తుల గుణములను, జీవితములను చెప్పలేదు. కావుననే నీకీ దైన్యము వచ్చినది. హరి గుణములను, కథలను ప్రీతితో నుతింపుచు రచింపుము. దాని ప్రభావము దేనికిని ఉండదు." అపుడు వ్యాసుడు విష్ణు కథలు, భక్తుల కథలు వ్రాయుచు, శ్రీకృష్ణచరిత కేంద్రముగా పెట్టుకొని భాగవతమును రచించెను. అందు సృష్టి విజ్ఞానము, జీవపరిణామము కూడ కలవు. ఇవి అన్నియు శ్రీహరి లీలలుగా వినువారికి తీయని అనుభూతి కలుగునట్లు రచించెను. భగవ దనుభూతి ఎట్లు కల్గునో మిగిలిన గ్రంథములు చెప్పును. హరిభక్తి తోడి భాగవతము వినువారికి సూటిగా భగవదనుభూతి కలుగును. భాగవతమనగా వ్యాసుడు రచించిన గ్రంథమునకే పరిమితము గాదు. హరిభక్తిని చెప్పుచు, మనకు భగవదనుభూతిని కల్గించు ఏ కథ గాని, సంకీర్తనము గాని భాగవతమే. పంచదార నాలుకపై వేసికొన్నచో ఎట్లుండునో చెప్పుటకన్న, చక్కెరనే నాలుకపై వేయుట చేయవలయును. అట్లే భగవదనుభూతి ఎట్లు కల్గునో చెప్పునవి వేదాంత ములు మున్నగునవి. ఆ యనుభూతిని సూటిగా నిచ్చునవి భాగవతము, సంకీర్తనము. అన్నమయ్య ఇచట హరిభక్తిని వినుటకే రెండు చెవులను ఉపయోగించుడని హెచ్చరించు చున్నాడు. చెవులతో విన పనిలేనివియు, వినకూడనివియు నయిన మాటలు విను చున్నాము. వీనికి మేరలేదు. ఒకరు వేరొకరిపై చెప్పు చెడుమాటలు, రాజకీయములు మున్నగునవి. లోకములో ఎన్నో విషయములున్నవి. అన్నిటితో మనకు పనిలేదు. మనమేమి విందుమో వాని ప్రభావము బుద్ధిపై పనిచేసి, ఆ వినుటయే అలవాటై, మలిన సంస్కారములు మొలకెత్తును. ఇవి అన్నియు చికాకు కల్గించును. ఇతరుల వ్యవహారములలో తలదూర్చరాదు. వాదోపవాదములలో శుకయోగి చొరబడెడు వాడు కాదని భాగవతము చెప్పుచున్నది. ఇతరుల వ్యవహారములు వినుటలో మనకు హద్దు గలదు. వారి బాధలు, దైన్యము విని వారికి ఎంతమేర మన ద్వారమున ఆయా బాధల నివారణకు భగవంతుడు పనిచేయ సంకల్పించునో అంతమేర వారికి సేవ చేయవలెను. అవతలివారి బాధలు వినుటవరకే గాని, వారి విషయములన్నియు వినుట పనికిరాదు. ఇక హరి భక్తుల కథలు, హరి యొక్క కథలు, హరి భక్తిని పెంచు నామములు, సంకీర్తనములు – వీనితో ప్రొద్దుపుచ్చవలెను. వీనిని వినుట వలన మనలో హరిభక్తి పాదుకొనును. శ్రవణము భక్తిమార్గములో మొదటి మెట్టు. ఆపైన విన్నదానిని చింతించుట, అందు మేల్కొని, దాని నాచరించి, ఆ ప్రకారము హరియందు జీవించుచు ఆనందించుట జరుగును.

విష్ణుని అర్చించు చేతులే చేతులు. విష్ణుని పూజింపని చేతులు తెడ్ల వంటివి. స్వామిని కీర్తించు నాలుకయే నాలుక. లేకున్న వట్టి ఢక్క. స్వామిని చూచు చూపులే చూపులు. స్వామిని చూడని కన్నులు శరీరమను గోడలోని కన్నములు. హరిని విను చెవులే చెవులు. లేకున్న కొండబిలములు. భగవంతుని

మీద మనస్సే మనస్సు. హరి స్మరణ లేని జన్మ జన్మ కాదు. చలించిపోవు నీటిబుడగ అని భాగవతమున చెప్పబడినది. అన్నమయ్య ఈ విషయమునే తనకు దేవుడిచ్చిన శైలిలో సంకీర్తనగా ప్రకటించెను. కులశేఖరాళ్వారు ముకుందమాలలో ఇట్లనెను, "ఓ నాలుకా! కేశవుని కీర్తింపుము. ఓ మనసా! మురారిని భజింపుము. ఓ చేతులా! మాధవుని అర్చింపుడు. ఓ చెవులా! అచ్యుత కథలు వినుడు. ఓ కనులా! కృష్ణునే చూడుడు. ఓ పాదములా! హరి ఆలయమునకే వెళ్లుడు. ఓ నాసికా! ముకుందుని పాదములపైని తులసినే వాసన చూడుము. ఓ శిరస్సా! అధోక్షజునికే మ్రొక్కుము." వివిధ శరీరావయవములతో విష్ణు వనగా సంఘముగా రూపొందిన స్వామిని సేవింపవలసియున్నది.

అయితే సాధారణ జనులు తమ శరీరమును, మనస్సును, బ్రతుకును, వృథా చేసికొనుచున్నారను ఆవేదన కలిగిన అన్నమయ్యకు సంబాళింపు కలిగినది. సర్వ జీవుల చేష్టలు వారి వారి మానసిక, ఆధ్యాత్మిక పరిణామ దశలలో జరుగునవే. ఆ పరిణామ మంతయు దేవుని ప్రణాళికలోని భాగమే. కావున ఇందరు జీవుల రూపము లలో శ్రీవేంకటేశుడే నటించుచున్నాడు. తానే ఈ పరిణామమును నడిపించుచున్నాడు. జగన్నాటక రంగమున సూత్రధారుడు, పాత్రధారులు కూడ హరియే. నర్తకుని భంగి పెక్కగు మూర్తులతో ఆడువాడు హరి యొక్కడే. భాగవతమున ప్రాచీన బర్హి అను మహారాజు నారదు నిట్లు ప్రశ్నించెను, "జీవులు కొన్ని జన్మలలో కొంతకాలము హరిని మఱచి విషయములందు ఆసక్తితో చెడుపనులు చేయుట యేల? కొన్ని జన్మలు గడిచిన పిదప ఎప్పుడో హరిభక్తి పొటమరించి, హరికర్పితముగా జీవించి హరిని పొందుటేల? మొదటనే హరిభక్తితో జీవించుట జరుగదేల?" నారదు డిట్లు బదులు చెప్పెను. "ప్రతివాడును శ్రీహరి కళాంశయే. శ్రీహరియే ఇందరు జీవుల రూపములతో నర్తించుచు ఇట్లు ప్రయాణించుచున్నాడు. తనను తానే చివరకు పొందుచున్నాడు. జీవుని వైపు నుండి ఆలోచించుట వలన నీకీ ప్రశ్న కలిగినది. భగవంతుని వైపు నుండి ఆలోచించినచో ఇదంతయు ఆయన ఆడుచున్న నాటకము. ఇట్లేల జరుగవలెనని ప్రశ్నించుటకు ఎవరికిని హక్కు లేదు." అన్నమయ్యకు హరి ఈ జ్ఞానమును ప్రసాదించుటతో తడబాటు తొలగినది. ఎప్పటికయినను, ఎవ రయినను హరిభక్తిని పొంది, భగవానుని చేరక తప్పదు. ఒక్క జన్మలోనే ఈ వికాసము దుర్లభము గావుననే దేవుడు ఎన్నో జన్మలను ఏర్పాటు చేసెను. జన్మలు విద్యాలయమున తరగతుల వంటివి. మానవునిలో గలుగునది మార్పు కాదు. వికాసము. ఏలననగా ప్రతివానిలోను మొగ్గగా హరిభక్తి దాగియున్నది. అది వికసించి, పుష్పించి, ఫలించుటే గమ్యము. రామాయణ భాగవతములు నాదమాధుర్యముతో గూడిన భగవత్కథలను, జీవిత సాధనా విధానమును నిర్దేశించుచున్నవి. కావున వాల్మీకి వ్యాసుల శిష్యులు ఈ గ్రంథములను, సంకీర్తనలుగా భారతదేశ మంతటను పాడి, వినిపించి వానిని పామరజనులకు కూడ అందజేసిరి. అట్లే అన్నమయ్య కీర్తనలకు అట్టి వ్యాప్తి రావలసి యున్నది. వచ్చితీరును. బయలుదేరిన బిందువు హరియే. గమ్యము హరియే. ఈ నడుమ ప్రయాణమును గూడ హరియే నడిపించును. హరిభక్తి కలుగని వానికి కూడ అది కలుగు పరిస్థితులను స్వామి తప్పక ఏర్పరచి, తనవద్దకు చేర్చుకొనును. ఉదాహరణకు, పిల్లికి బిచ్చము వేయని పరమలోభి డబ్బే ప్రధానమని యెంచి, దానితోనే బ్రతుకవచ్చునని భ్రమించును. డబ్బుకన్న మానవుడు ప్రధానమని అతడు గ్రహింపలేదు. ఇతరులు

చెప్పినను, పరిణామమున తగు సమయము వచ్చినపుడు గాని సత్యము నచ్చదు. శరీరమునకు ఒక వయస్సు వచ్చినపుడే గడ్డములు, మీసములు వచ్చుట జరుగునది. ఇట్లే పరమలోభికి, వేరొక మానవుని తోడు తప్పనిసరియగు పరిస్థితిని దేవుడు కల్పించును. ఇట్టి సంఘటనలు కొన్ని జరుగగా అతనికి మానవత్వపు విలువ తెలియును. నవీన నరుడు తాను సృష్టించుకొన్న డబ్బుకు తానే బానిస. తనకన్న, తన హాయికన్న, తోటి జీవులకన్న, దేవునికన్న డబ్బుకే లేని విలువను అంటగట్టి వినాశమునకు దగ్గరగుచున్నాడు. నరజాతి చాలవరకు ఈ స్థితిలో నున్నప్పుడు ప్రకృతి మొత్తము నరజాతికే గుణపాఠములు నేర్పును. ఇవియే ప్రకృతి వైపరీత్యములు. మానవుడు కల్పించుకొన్న యుద్ధములు కూడ గుణపాఠము లను నేర్పును. ఇట్లు శ్రీవేంకటేశుడే ఒక నరుని యొక్క గాని, నరజాతి యొక్క గాని పరిణామమును నడిపించును. అసలు ఇందరు జీవుల మూర్తులుగా నర్తించి ఆడు చున్నది నారాయణుడే. ఇది తెలిసి అన్నమయ్య ఆవేదన నుండి విముక్తుడయ్యెను. కొందరు సాధకులు తాము భగవంతుని సేవ చేయుచున్నామనియు, సమాజములోని దీనుల రూపములలో నున్న స్వామిని సేవించుచున్నామనియు, కాని తమకు సమాజములో కొందరయినను సహకరించుటలేదనియు వంత చెందుచుందురు. సేవ తమ ద్వారమున జరుగునదే గాని, తమ వలన గాదని గుర్తింపవలెను. స్వామి తమ ద్వారమున తానే చేయును. అంతమేర ఆ సేవ జరుగుటకు వాహికగా సిద్ధ పడుటయే మన కర్తవ్యము. సమాజములో ఎవరెవరు ఎప్పుడు మంచి పనులు చేయుదురో, మంచి పనులకు తోడ్పడుదురో అంతయు భగవంతుని ప్రణాళికలో, లీలానాటకములో భాగము. ఇది నచ్చినచో, సాధకులలో తమకు సహకారము లభించుటలేదను నిరుత్సాహము తొలగును. ప్రతి జీవికిని వలసిన పరిణామ దశ వచ్చినపుడు దైవభక్తి, సత్కర్మ నచ్చును. చెట్టు బెరడుగా నున్న దశలోనే ఎంతగా రుద్దినను ఆకు కాదు, పూవు గాదు, ఫలము గాదు. నిన్న మద్రాసులో బయలుదేరు వాడు ఈరోజు హైదరాబాదు చేరును. ఈ దినమున బయలుదేరువాడు రేపు చేరును. ఆది, గమ్యము ఒకటే. కాలగమనములోనే తేడా యున్నది. సంఘ మంతయు వివిధ పరిణామ దశలలోని జీవులతో గూడియున్నది. దానిని మరమ్మత్తు చేయుట ఎవరి పనియు గాదు. ఎవరిని వారే యుద్ధరించుకొనవలెను అని కృష్ణుడు చెప్పెను. స్వామి అట్టి పరిస్థితులను తెచ్చును. సంఘము స్వామి స్వరూపము. తమ ద్వారమున స్వామి అనుమతించినమేర సంఘమును, వ్యక్తులను చూడక వారియందు స్వామిని దర్శించి సేవించి తరించుటయే అన్నమయ్య తేల్చిన అంశము. కావున తడబాటు లేదని చలింపని బుద్ధితో పలుకుచున్నాడు. అసలు సేవ కాదు జరుగునది, సంఘ రూపములో స్వామికి అర్చన. ఇంతమేర సంఘసేవ చేయవలెననియు ఆశింపరాదు. ఎంతమేర తన ద్వారమున సేవ, భక్తియోగ ప్రచారము జరుగవలయునో స్వామి సంకల్పమునకే శరణందుట చివరకు అన్నమయ్య నిశ్చయించుకొన్న అంశము గావున తడబాటు తొలగి నిశ్చలుడై నిలిచెను. భగవంతుని సేవకు మనము ఉపకరణములమే గాని, కర్తలము గాదు. భగవత్ సేవను సదా కొనసాగించుచునే, ఈ భావమును గుర్తుంచుకొనవలయును. అపుడు చికాకు కలుగక, ఆనందము, ఉత్సాహము ఎడము లేక నిలుచును. "తడబాటు లేదు" అను స్థితిని వర్ణించుటలో ఇంత వివరమున్నది.

* * *

13

2వ సం-131 **ఇహమేకాని** లలిత

ఇహమేకాని యిఁకఁ బరమేకాని
బహుళమై హరి నీపై భక్తే చాలు. ॥ పల్లవి ॥

ఎందు జనించిన నేమి యెచ్చోట నున్న నేమి
కందువ నీ దాస్యము గలిగితేఁజాలు
అంది స్వర్గమే కాని అలనరకమే కాని
అందపు నీ నామము నాకబ్బుటే చాలు. ॥ ఇహమే ॥

దొర యైనఁ జాలుఁ గడుఁ దుచ్ఛపుబంటైనఁ జాలు
కరఁగి నిన్నుఁ దలఁచఁగల్గితేఁ జాలు
పరులు మెచ్చిన మేలు పమ్మి దూషించిన మేలు
హరి నీ సేవాపరుఁడౌటే చాలు. ॥ ఇహమే ॥

ఇలఁ జదువులు రానీ యిటు రాక మాననీ
తలఁపు నీపాదముల తగులే చాలు
ఎలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
చలపట్టి నాకు నీ శరణమే చాలు. ॥ ఇహమే ॥

స్వప్నములో గమనింపబడు వివిధ రూపముల వంటివే,
జగత్తులో గమనింపబడు రూపములు కూడ.

టీక

పమ్మి = అధికముగా; కందువ = ప్రీతి; చలపట్టి = పట్టుదలపట్టి.

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య వంశము, ఐహిక స్థితి, మానావమానములు, చదువులు మున్నగునవి ఎట్లున్నను తనకు చింత లేదనియు, హరి భక్తి, భగవన్నామ స్మరణ, భగవంతుని సేవ, ఆయనకు శరణాగతి ఉన్న చాలు, తనకదే భాగ్యము, స్వామి తనను పాలించుచుండగా ఇంక మిగిలినవానితో పని లేదని స్వామి యందలి తన స్థిరభక్తిని, దానివలన కలిగిన సమత్వమును వెల్లడించుచున్నాడు. ఇందలి శరణాగతి, సమత్వము ఆళ్వారుల దివ్యప్రబంధసారము.

పల్లవి యొక్క తాత్పర్యము

"ఇహమైనను సరియే, పరమైనను సరియే, అత్యధికముగా హరీ! నీపై భక్తి ఉన్న చాలును."

వ్యాఖ్య

ఐహిక జీవితమందునను, ఆధ్యాత్మిక జీవితమునందునను స్వామిపై నిండయిన భక్తి చాలును. పరమనగా శరీరము విడిచిన తర్వాత స్థితి గాదు. బ్రతికియున్నప్పుడే భగవంతుని సన్నిధికై సాధన నిర్వహించు జీవితము. ఇహలోక జీవితము శరీరము, మనస్సు, ఇంద్రియాదుల ద్వారమున మనము చేయవలసిన పనులతో కూడినది. పరమనగా హృదయము నందలి దివ్యప్రేమతో గూడిన ఆనంద సామ్రాజ్యము. ఇది భగవంతునితో ముడిపడినది. హృదయవాసి స్వామియే కదా. అన్నమయ్య దృష్టిలో ఐహిక జీవితమని వేరుగా లేదు. మన ద్వారమున ఐహికముగా జరుగు కర్తవ్యములు కూడ కుటుంబము, సమాజము రూపములలోని హరి సేవయే గదా. కావున ఆధ్యాత్మిక సాధన – పరమున జప తపో ధ్యానాదులే కాదు జీవితమంతయు హరి భక్తి నిండిన చాలు అని అన్నమయ్య భావము. హరి భక్తి కొంతకాలమునకు, జీవితమున కొంత భాగమునకు పరిమితము గాదు. అట్లు భావించు సంకుచిత వాదులు, ఒకవైపు దేవుని మూర్తిని పూజించుచునే, సమాజముతో సరిగా వర్తింపక రాగద్వేషములతో ప్రవర్తించుచుందురు. భక్తి అనగా పరమ ప్రేమరూపమైనది. అనగా జీవుల రూపములలోని హరిపై అఖండము, నిరపేక్షమైన ప్రేమ. కారణము లేక ఇతరులను సుఖపెట్టుట వలన, కారణము లేకయే తాను సుఖపడును. మొదటిది భక్తి. రెండవది దివ్యానందము. అన్నమయ్య దృష్టిలో తిరుమలలో వెలసిన మూర్తియే కాదు, విశ్వమంతయు స్వామియే. కావుననే ఇహపరములు రెంటియందును హరి భక్తి చాలని చెప్పుచున్నాడు. భక్తునకు ఇహము కూడ, పరములో ఇమిడిపోవు భాగమే కాని, వేరు కాదు అని అన్నమయ్య ఉపదేశము. ఐహిక జీవితమున చేయ వలసిన పనులు దేవుని సేవగా చేయుటయే గాని, తనకు ఎంతవరకు ఐహిక సుఖములు లభ్యమైనవన్న ప్రమేయము లేదు. కావున ఐహిక సుఖములు వచ్చినను, రాకున్నను అన్నమయ్యకు హరి భక్తి అత్యధికమై

నిలిచిన చాలును. భక్తియే ఆనందము. ఇది లేనపుడు భౌతిక సుఖమున్నను, లేకున్నను ఒకటే. ఇవి అసలయిన సుఖమును ఈయజాలవు. హరి భక్తి ఒక్కటియే అసలయిన ఆనందము. హరి భక్తియు అన్ని చర్యల యందును అనేక విధముల చాలును. దేవునితో అన్ని సంబంధములు అన్నమయ్య పాటించెనని చెప్పుటకే 'బహుళమై' అను పదము వాడబడెను.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"ఎందు పుట్టినను ఏమి? ఎచ్చట నున్న ఏమి? ప్రీతితో నీ దాస్యము కలిగిన జాలును. స్వర్గమే అందినను, నరకమే కలిగినను ఫరవాలేదు. అందమైన నీ నామము నాకు అబ్బిన చాలు."

వ్యాఖ్య

ప్రేమతో గూడిన హరిదాస్యమున్న చాలును. గొప్ప వంశము నందు పుట్టినను, తక్కువ స్థాయి వంశము నందు పుట్టినను సరియే, అంతర్యామి అయిన హరికి దాసుడ నన్న భావము, పలుకు, ఆ దృష్టితో సేవ చాలు. అదియే ఆనందము. హరిదాస్యము, దివ్యానందము లేనపుడు ఎంత గొప్ప వంశమున బుట్టినను, నగరములో హంసతూలికాశయ్యలపై పరుండి విందుభోజనములు భుజించినను తృప్తి ఉండదు. అహంకారము, అసంతృప్తియే దక్కును. హనుమంతుడు వానరు డయినను, రామదాసుడనని ప్రస్ఫుటముగా ప్రకటించెను. ఎట్టి స్వప్రయోజనమును ఆశింపక, రాముని దాస్యమును ఆనందముగా గ్రహించి సాగరమును దాటెను. రాక్షసులతో పోరాడి వారిని చంపెను. లంకా దహనము గావించెను. సీతమ్మను దర్శించెను. లక్ష్మణుని కాపాడెను. భరతుని చేరెను. ఇంత శ్రమపడితినని ఆయన ఎన్నడును భావింపలేదు. రాముని సుగ్రీవాది వానరుల వద్దకు తెచ్చి, భగవంతుని సన్నిధిని వారికిచ్చిన ఆచార్యదేవుడయ్యెను. గుహుడు, శబరి గిరిజన వంశములందు పుట్టిరి. అయితేనేమి, రామునికి దాసులై అతని కాతిథ్య మొసగి, సేవించి ధన్యులయిరి. జటాయువు పక్షి వంశమున పుట్టెను. అయితేనేమి, సీతమ్మను కాపాడుటకై ప్రాణము లను త్యాగముచేసి, రామ దాస్యములో శిఖరమెక్కి మోక్షమునందెను. వానరులు, విభీషణాది రాక్షసులు తమ జన్మతో సంబంధము లేక రాముని సేవ చేసి, ఆయనకు మిక్కిలి దగ్గరయిరి.

భారతమున ముఖ్య పాత్రధారియగు విదురుడు శూద్రుడుగా జన్మించెను. ప్రీతితో అతడు కృష్ణునకు దాసుడై ధర్మమును, కృష్ణభక్తిని లోకమున చాటెను. శ్రీకృష్ణుడు పాండవ దూతగా హస్తినకు వెళ్లినపుడు దుర్యోధనుడు తనను ఆతిథ్యమునకు పిలిచినను వెళ్లలేదు. భీష్మ ద్రోణాదుల ఇళ్లకును వెళ్ళలేదు. విదురుని ఇంటికి తానై వెళ్ళెను. విదురుడు కృష్ణునియందు ప్రీతితో తనను తాను మరచెను. సంజయుడు బండ్లు తోలువాని కుమారుడు. కృష్ణుని భక్తితో సేవించెను. ధృతరాష్ట్రుడు పంపగా ఇతడు ధర్మరాజు వద్దకు రాయబారమునకై వచ్చెను. శ్రీకృష్ణుడు స్వయముగా ఆతనికి ఆసనమిచ్చి కూర్చుండబెట్టి ఆదరించెను. యుయుత్సుడు వేశ్యా పుత్రుడు. కృష్ణ భక్తుడు. అతనిని భారత యుద్ధమున కృష్ణుడు కాపాడెను. ఇతడు పరీక్షిత్తుకు మంత్రి యయ్యెను. కలియుగమున నందనార్, తిన్నడు, ధనుర్దాసు, తిరుప్పాణాళ్వారు, నామదేవుడు,

గోరాకుంభార్, మాలదాసరి మున్నగువారు ఏ వంశమున పుట్టిననేమి, భగవంతుని దాసులై భక్తితో ముక్తినందిరి. గోకులవాసులు కర్షకత్వము, గోపాలనము చేయువారు. వారి నివాసము చిన్న పల్లె. కాని శ్రీకృష్ణునికి ప్రేమతో దాసులై, ఆయనకు అత్యంతము దగ్గరవారైరి. వారు కృష్ణుని నుండి ఏమియు ఆశింపలేదు. మోక్షమును కూడ ఆశింపలేదు. అతనికి వలసిన అన్నపానీయాదులను, స్నానాదులను ఏర్పాటు చేసి, ఆ సేవతోనే తృప్తి పొందిరి. యాదవులు యదువంశము నందు పుట్టిన రాకుమారులు. వారి నివాసము ద్వారకా నగరము. పైగా వారెల్లరు కృష్ణునికి బంధువులు. కృష్ణుని నుండి సుఖభోగముల నాశించిరేగాని, అతనిని సేవింపరైరి. కృష్ణునికి దాసులగుట అనగా అంతర్యామికి దాసులగుట. అది గోకులము వారికి దక్కినది, యాదవులకు దక్కలేదు. వీరు కృష్ణుడు తమవాడని వీరిలో ఎవరికి వారే తమకు దగ్గరనియు, తమవాడనియు పొరపడిరి. చివరకు ఒకరితో నొకరు కలహించి నశించిరి. గోకులవాసులు కృష్ణునివారము తామని భావించి అమృతులైరి. వీరే కాదు, చెంచితలు, బోయతలు గూడ స్వామికి దాసులై ధన్యులైరి. పాండవులు రాజ్యములో నున్నను, అడవులలో నున్నను భగవంతుని స్మరించుట, ఆయనను సేవించుట కలిగి శాంతితో, హాయిగా జీవించిరి. రాజ్యమున్నపుడు, లేనపుడు గూడ ప్రతిదినము వేలకొలది జనులకు భోజనము పెట్టి, వారి రూపములోని స్వామిని సేవించి తృప్తులైరి. ఏనుగు కూడ స్వామియందు భక్తితో ముక్తినొందెను. అన్నమయ్య తనను గొప్ప వంశమున, నాగరిక సుఖముల నడుమ పుట్టింపుమని స్వామి నడుగుట లేదు. నీ దాస్యము చాలనెను. ఆదిశంకరులు కూడ నీ దాస్యమున్నచో, కీటక జన్మ నయినను స్వీకరించుటకు సిద్ధమనిరి. నగరములందు, పల్లెలందు, అడవులందు, స్వగృహమునను, వేరు ఇండ్ల యందును ఉండినను, హంసతూలికా తల్పముపై పరుండినను, గడ్డిపరకలపై, ఱాళ్లపై పరుండినను ఫరవాలేదు, నీ దాస్యమున్నచో ఎచ్చటనున్నను తృప్తియే అని అన్నమయ్య భావము. అన్నమయ్య ప్రయోగించిన స్వర్గమను పదమునకు ఇచట పుణ్యఫలమని అర్థము. ఉదాహరణకు ఇతరులకు మేలు చేసినపుడు గాని, వారికి విద్య బోధించినపుడు గాని, వారు మరల మనలను గౌరవించి ఆదరించెదరు. కొన్ని సౌకర్యములను సమకూర్చెదరు. ఇదియే స్వర్గము. కాని కొంతకాలమునకు పుణ్యఫలము పూర్తికాగానే ఇట్టి స్వర్గము నుండి మానవుడు క్రిందపడునని కృష్ణుడు చెప్పెను. ఉదాహరణకు తనవలన మేలునందిన వారిని స్వార్థమునకై వినియోగించుకొన్నచో కొన్నాళ్లకు వారు ముఖము చాటుచేయుదురు. ఇక నరకమనగా పాపఫలమైన కష్టము లేక రోగము. అన్నిటికన్న అందమైనది, అన్ని అందములు తనలో భాగమైనది, ఆకర్షణీయమైనది, ఆనందస్వరూపమైనది స్వామి నామము. అట్టి నీ నామము నాకబ్బిన చాలు, పుణ్యఫలమైన సుఖము గాని, పాపఫలమైన కష్టము గాని నన్నంటవు. ఈ రెండు స్థితులలో గూడ నీ నామము నాకబ్బినచో ఈ రెంటి కతీతమైన దివ్యానుభూతిలో నిలిచెదనని అన్నమయ్య భావము. దేవుని నామము 'అబ్బుట' యనగా నాలుకపై ఆడుట, మనసున మెదలుటయే కాదు తన జీవితమంతయు నిండుట, నామము లేక బ్రతుకలేకుండుట, హరినామమే తన ప్రాణము, జీవము, తన అస్తిత్వమగుట. ఇది అన్నమయ్య కోరుచున్నది. ఈ కోరిక తీరినది. నామము తనలో మనసా, వాచా, కర్మణా నిండిన చాలును. అనగా అచ్చము పనులు మాని

ఎల్లప్పుడును స్వామి నామమునే పలుకుచుండుట అని అర్థము కాదు. ఇట్టివానికిని ఆహారము కావలయును గదా. నేను నామము చేయు చున్నాను, కావున నాకు సమాజము అన్నము ఊరకనే పెట్టవలెనని ఆశించుట క్షుద్రత్వమే గాని భక్తి గాదు. చేయవలసిన పనులు చేయుచు, పలుకవలసిన పలుకులు పలుకుచు, చిత్తము మాత్రము అంతర్యామియగు స్వామియందు నిలుపవలెను. ఇదియే హరిభక్తి. ఇందులకై మనసున నిరంతరము హరి నామము తలచుచుండ వలెను. ఎవరిని పిలిచినను, ఏమి పలికినను హరి నామమని గుర్తుండవలెను. ఏ పని ఎవరికి చేసిపెట్టినను, ఆ పనియు, ఆ జీవియు హరియే యని లోన తలంప వలెను. అపుడు గూడ హరి నామమును చిత్తము స్మరింపనగును. 'అబ్బుట' యను పదమును అన్నమయ్య పరవశించి ప్రయోగించెను. స్వామి నామము తన యెదలో నినదించిన చాలు, తన నాలుకపై ఆడిన చాలు, తన రక్తకణములలో ప్రవహించిన చాలు, నా నాడులందున ప్రసరించిన చాలు, నా జీవమై, నా జీవనమై భాసించిన చాలు – ఇంత భావము 'అబ్బుట' అను చిన్న తెనుగు పదమున గలదు.

2వ చరణము యొక్క తాత్పర్యము

"రాజయినను ఫరవాలేదు, మిక్కిలి తక్కువ స్థితిలోని బంటయినను ఫరవాలేదు, నిన్ను తలచగలిగి నీయందు నేను కరగిన చాలు. ఓ స్వామీ! నీ సేవయందు ప్రీతి కలిగినవాడనయిన చాలు. ఇతరులు కొనియాడినను మేలే, మిక్కిలిగా నిందించినను మేలే."

వ్యాఖ్య

తాను కరగిపోవునంతగా – తన ఉనికి మరపునకు వచ్చి, పరవశించునంతగా భగవంతుని తలచిన చాలు. ప్రతిదినము కొలదిసేపు ధ్యానమున తలచుటేగాదు, నిత్యజీవితమున దినచర్యలో గూడ తలచగలిగిన చాలు, ఇక సమాజమున తన స్థితితో సంబంధము లేకయే హాయిగా నుండును. భగవంతుని తలచలేని వాడు రాజయినను హాయిగా బ్రతుకజాలడు. ఏలననగా, అతడు ప్రజలలో దేవుని చూడక, అహంకరించినవాడై, రాజ్య పాలనమును అధికారముగా భావించి, ప్రజలను పీడించును. తానును తృప్తిగా జీవింపలేడు. ఉదాహరణకు హిరణ్యకశిపుడు అంతర్యామిని కాదని అహంకరించెను. అయిదేండ్ల పసిబాలుని వలన గూడ భయ పడెను. కంసుడు నంతియే. ధృతరాష్ట్రుడు, దుర్యోధనుడు రాజ్య పాలనను అధికార ముగా భావించి, దానియెడల వ్యామోహముతో పాండవులను కష్టములపాలుచేసి అధర్మము గావించిరి. ఎన్నడును వారికి నిద్ర లేదు, తృప్తి లేదు. కౌరవులు చివరకు నశించిరి. ధృతరాష్ట్రునకు చేయూతగా నొక్క కొడుకు గూడ మిగులలేదు. అంబరీషుడు ఏడు ద్వీపములను ఏలినను, రాజ్య సుఖములు కలిగినను భగవంతుని తలచుట విడువలేదు. రాజ్య పాలనను అధికారముగా భావింపలేదు. ప్రజల రూపములోని స్వామి యొక్క ఆరాధనగా భావించెను. కావున ముక్తుడయ్యెను. ధర్మరాజు గూడ నింతియే. కావుననే అతడు వనవాసమునకు వెళ్ళు సందర్భమున ప్రజలెల్లరు అతని ననుసరించిరి. కలియుగమున రాజర్షి శ్రీకృష్ణదేవరాయలు. వానరులలో సుగ్రీవ హనుమదాది నాయకులే గాక, తక్కువ స్థితిలో బంటులైన వానరులు

గూడ కోట్ల మంది గలరు. వారు రాముని తలచి, సేవించి, అయోధ్య చేరి ముక్తులైరి. రాముడు తన కొరకై మరణించిన వానరులను బ్రతికింపుమని ఇంద్రుని కోరెను. వానరు లున్నచోట చక్కగా తియ్యని ఫలములు, పానీయములు లభించునట్లు వరమీయుడని భరద్వాజ మహర్షిని కోరెను. తనతో పాటు పుష్పకము నెక్కించి, వారి నయోధ్యకు చేర్చి సత్కరించెను. భగవంతుని సేవించుటలో ప్రీతిగలవాడైన చాలును. ఇతరులు మెచ్చినను, నిందించినను సంతోషమే. సర్వాంతర్యామియైన హరిని ప్రీతితో సేవించు వానికి తన సేవకు బదులు పరులు మెచ్చవలె ననిపించదు. కారణము అతనికి పరులు లేరు. అందరు, అంతయు హరియే. తన ద్వారమున సేవను జరిపించు నదియు హరియే. సేవ నందుకొనునదియు హరియే. కావుననే హరి భక్తుడు 'నేను హరి సేవ చేయుచున్నాన'ని భావింపడు. 'నీ సేవను ప్రీతితో చేయించుకొనుమ'ని హరిని తాను వేడవలెనని ఆళ్వారులు, రామానుజులు బోధించిరి. 'భక్తుడు నిమిత్త మాత్రుడే' అని కృష్ణుడు చెప్పెను. భక్తునకు దేవుని కన్న ఇతరులే లేనపుడు వారు మెచ్చినను, మిక్కిలిగా నిందించినను దేవుడే ఇట్లు లీల చూపెనని ఆనందము కలుగును. తనలో మెచ్చదగిన సద్గుణములను ఇతరులు మెచ్చినపుడు, ఆ సద్గుణములు హరివే గావున వారి మెచ్చుకోలును భక్తుడు హరికే సమర్పించును. ఒకవేళ తనలోన లేని సద్గుణములను ఇతరులు మెచ్చినచో, వాని నాతడంగీకరింపడు. ఇతరుల నమస్కారములను గూడ స్వామికి సమర్పించును. తనకు నమస్కరించుచున్నారను కొనుట భ్రాంతి. ఇది నాశ హేతువు. ఎవరైన స్వప్రయోజనమునకై ప్రవర్తింపవలసిన తీరును హరి సూచించును. తనను గురువని ఇతరులు మెచ్చినచో, గురువు దేవుడే అని మనసార నమ్మి గురుపదమును స్వీకరింపడు. ఎవరైన తనలో తప్పులున్నప్పుడు నిందించినపుడు భక్తుడు, స్వామియే తనకు తన తప్పులను సరిదిద్దుకొనుమన్నాడని విశ్వసించును. ఒకవేళ తనలో లేని తప్పులను ఇతరులు ఆరోపించి నిందించినను భక్తుడు ప్రతిక్రియ నెఱపడు. వారి నిందను గూడ స్వామి లీలగా భావించును. తాను అంతర్యామి యొక్క అనుభూతి యందు ఎంతగా కరగియున్నాడో పరీక్షించుటకై ఆయనయే ఇట్లు ఒక వ్యక్తి రూపమున నిందించెనని తృప్తిపడును. ఇట్లు భక్తులు తమను దూషించిన వారిని క్షమించుచున్నామని భావింపరు. అట్లు భావించుచో ఇతరులను, వారి నిందావాక్యములను, వారిలోని తప్పులను గమనించుటే యగును. భక్తుడు వీనిని గమనించడు. స్వామినే దర్శించును. కావున ఎవరు ఎట్లు ఎంతగా దూషించినను భక్తుడు క్రుంగడు, రోషపడడు, ప్రతిక్రియ చూపడు. ఆ దూషణ ఇతని నంటదు. క్షమించుట యను ప్రసక్తి యుండదు. స్వామి యొక్క లీలానుభూతియే నిలుచును. సందర్భము వచ్చినచో తనను నిందించిన వానిని సేవించుటకు కూడ వెనుకాడడు. రామాయణమున తనలో లేని తప్పును ఊహించి, నిందించిన గుహుని భరతుడు ప్రేమించెనేగాని, తిరిగి దూషింపలేదు. తనలో పొరపాటు లేదని నచ్చ చెప్పెను. తాను రాజైనను, గుహుని శిక్షింపలేదు. పైగా అన్నగారిని సేవింపని తననే క్షమింపుమని గుహుని వేడెను. గుహుడు ఆకాశము వంటి నిర్మలుడవని భరతుని కీర్తించెను. ఒకవేళ తనలో పొరపాటు లేనపుడు లేదని ఎంత చెప్పినను అవతలివాడు నమ్మక దూషించినను, భక్తునకు సంతోషమే. తన ప్రేమవికాస సాధన కిది పనికివచ్చు సన్నివేశము. వేదమున సరస్వతీదేవి ఇట్లు పలుకుచున్నది. "నన్ను వినుచునే

కొందరు వినకున్నారు." అనగా ఇతరుల నిందావాక్యముల బయటి భావమునే సామాన్యులు గ్రహించుచున్నారు గాని, వాని వెనుకనుండి భగవంతుడు పరమప్రేమతో శిక్షణ నిచ్చుచున్నాడని గ్రహింపజాలరు. హరి సేవాపరునకు పరీక్ష యేమి? ఏ స్థితియందైనను, మానావమానముల యందును భగవంతుని అస్తిత్వమునే దర్శించి ఆనందించుట యని అన్నమయ్య తన అనుభవము నుండి మన కుపదేశించు చున్నాడు. ఇట్టివాడే సమాజ రూపమున నున్న హరిని సేవింపగలడు. మెప్పులను, నిందలను పట్టించుకొనువాడు సాధనలో గాని, సమాజ సేవలో గాని ముందుకు పోజాలక జారిపడును.

3వ చరణము యొక్క తాత్పర్యము

"ఈ భూమిపై చదువులు వచ్చినను, రాకున్నను ఫరవాలేదు. నా తలపు నీ పాదములందు తగిలియుండుటే చాలు. శ్రీవేంకటేశ్వరా! వాత్సల్యముతో నన్ను ఈ విధముగా ఏలితివి. పట్టుదలపట్టి నిన్ను శరణందుటే చాలు."

వ్యాఖ్య

ఇన్ని చదువులు – అటు విజ్ఞానశాస్త్రములు గాని, ఇటు బ్రహ్మవిద్య గాని వచ్చినను భగవంతుని పాదముల యందు మనసు లేనపుడు వ్యర్థము. భగవంతుని ప్రకటించు చదువే చదువని ప్రహ్లాదుడు చెప్పెను. దేవుని పాదములనగా విశ్వమే. కనుక దేవుని పాద సేవ యనగా జీవుల సేవయే. తనకు వచ్చిన చదువులు ఇతరుల మేలుకై వినియోగింపబడనపుడు వ్యర్థములే గాక హానికరములని తైత్తిరీయోపనిషత్తు చెప్పు చున్నది. భగవంతుని పాదముల నుండి వెలువడు ధూళియే వేదములు. అనగా భగవంతుని పాదస్మరణ కలిగిన వానికి కావలసిన చదువులు స్వామియే ఇచ్చును. భగవంతుని పాదముల యందు తలపు లేని చదువుల వలన ఇతరులకు మేలు జరుగకపోగా, తనకహంకారము, పాండిత్యభారమును మోయుట, ఇతరుల నవమానించు ధోరణి కలుగును. ఇట్టివాని చదువులన్నియు గ్రంథాలయమున పనిచేయు కూలీవాడు తన మస్తకముపై పుస్తకములను మోసినట్లే యగును. భగవంతుని పాదములను స్మరించుట, జీవుల రూపములలోని భగవంతుని సేవ చేయుట యున్నచో, చదువులు రాకున్నను నష్టము లేదు. ఇట్టివాడు ఏదియో ఒక విధముగ సేవ, మేలు చేయకుండ ఆగలేడు. కావున ధన్యుడగును. దేవునకు దగ్గరగును. శబరికి, గుహునకు, గోపకాంతలకు, గోపబాలురకు ఏ చదువులు రాకున్నను స్వామి పాదస్మరణ తగిలి యుండుటయను అసలుసిసలైన చదువు గలదు. వారు స్వామి సాన్నిధ్య మాధుర్యము ననుభవించిరి. సాలెపురుగు, ఏనుగు, పాము, చెంచు – వీరికి ఏ చదువు లేకున్నను నీ పాదసేవతో ముక్తులైరని ధూర్జటి మహాకవి తెలిపెను. స్వామి పాదములందు తలపులు తగులవలెను. అనగా వదలక ప్రీతితో కలుగవలెను. కావున భగవంతుని పాదసంసేవాసక్తియే అసలైన చదువని ధూర్జటి కవి పలికెను. విష్ణుచిత్తుడు అను పెరియాళ్వారు వేదశాస్త్రములందు విద్వాంసుడు కాడు. అయినను స్వామి ఆలయమును కడిగి, తుడిచి, స్వామికి తులసిమాలా కైంకర్యము గావించి, ఆరగింపులందించి స్వామి సాక్షాత్కారమునందెను. ఏవేళయందైనను

అతిథులకు అన్నము పెట్టి, ఆదరించి, విష్ణు కథలతో ప్రొద్దుపుచ్చెను. చదువు రాకున్నను ఇతని భక్తి యను అందుగు తీగచే విష్ణువు అను ఏనుగు కట్టివేయబడెననియు, ఇతడు భగవంతుని యందు కరిగిన ఆనందమును పొందెనని కృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలో వర్ణించెను. పాండ్యరాజ సభలో సర్వాంతర్యామి యగు విష్ణుని మహత్వమును చాటుటకై ఇతడు దేవునిచే నియోగింపబడెను. స్వయముగా అమ్మవారే ఇతని ఇంట కుమార్తెయై వెలసి స్వామిని వివాహమాడినది. చదువులు రాకున్నను, భగవంతుని పాదములయందు తలపు వలన విష్ణుచిత్తుడు స్వామికే మామగారై, ఆయనకు 'పల్లాండు' పలికి 'పెద్దఆళ్వారు' యని ప్రసిద్ధి చెందెను. 'ఇట్టి' అను పదమున అన్నమయ్య పై చరణములన్నిటి యందలి భావమును సంగ్రహించెను. స్వామి తనపై వాత్సల్యముతో తనయందు భక్తిని, దాస్యమును, నామమును, స్మరణను, సేవాసక్తిని, పాదములయందు తలపును ప్రసాదించి పాలించెనని తెలుపుచున్నాడు. దేవుడు మనలను కాపాడుట యనగా నిదియే. తనను మఱవకుండ నిలుపుటయే కాపాడుట. కావున 'ఏలితివి' అను పదము ప్రయోగింపబడెను. గొప్ప వంశము, పదవి, సుఖములు, గౌరవములు, చదువులు – వీనితో నాకు పనిలేదు. విడువకుండ పట్టుదలతో నిన్ను శరణందుటే నాకు చాలని అన్నమయ్య స్వామికి విధేయుడై పలుకుచున్నాడు. ఇట్టి శరణాగతి వలననే పైన చెప్పబడిన వివిధ పరిస్థితుల యందు సమత్వము కలుగును.

* * *

14

2వ సం-208 ఈతఁడు తారకబ్రహ్మ మితడు సాళంగనాట

ఈతఁడు తారకబ్రహ్మ మితఁడు మా దేవుఁడు
కౌతుకానఁ జెప్పే వినఁగదరే వోజనులు. ॥ పల్లవి ॥

రాముఁడు ఇందీవరశ్యాముఁడు నానా సార్వ
భౌముఁడు షోడశకళాసోముఁడు
దోమటి రాక్షసులను తుత్తుమురు సేసినాఁడు
కామితఫలము లిచ్చి కాచినాఁడు సురల. ॥ ఈతడు ॥

పూర్ణుఁడు నీలమేఘవర్ణుఁడు దానమున వి
స్తీర్ణుఁడు వాహన సుపర్ణుఁడు
అర్ణవము దాఁటి రావణాదుల గెలిచినాఁడు
నిర్ణయించి చెప్పరాదు నేఁ డీతని మహిమ. ॥ ఈతడు ॥

వరుఁడు సీతకు పరాత్పరుడు కోదండదీక్షా
గురుఁడు దివ్యామోఘశరుఁ డితఁడు
నిరతి శ్రీవేంకటాద్రి నెలవై యుండేటివాఁడు
సరి భరత లక్ష్మణ శత్రుఘ్న సహితుఁడు. ॥ ఈతడు ॥

నిజమైన జీవితము నీకు కావలయునా,
నీవు జీవితమును సమర్పించుకొనుము.

టీక

దోమటి = దోమల వంటి, తుత్తుమురు = పొడి పొడి.

పరిచయము

ఈ సంకీర్తనమున మహాభక్తుడగు అన్నమయ్య శ్రీవేంకటేశుని యొక్క శ్రీరామావ తారమును హృదయమార అపార ప్రీతితో కీర్తించెను. రాముని రూపమును, గుణము లను, ప్రవర్తనను, మహిమను, రామునిలో దాగిన పరతత్త్వమును పరవశుడై కీర్తించెను. శ్రీరాముడు అన్నమయ్యకు దర్శనమొసగగా ఆతడు దివ్యానుభూతిలో మునిగెను. రాముడే అన్నమయ్య నోటి ద్వారమున ఈ సంకీర్తనను పలికినట్లు తోచుచున్నది. పోతనచే భాగవతము పలికించినది కూడ రామభద్రుడే కదా! రామునిలో ఉత్తమ మానవత్వము మూర్తీభవించి యున్నది. దానితోబాటు లోపల పరబ్రహ్మ తత్త్వము దాగియున్నది. కావుననే అయోధ్యా పౌరులు ధర్మము, శ్రేయస్సు అనగా భగవంతుని స్థితి రాముని యందు నెలకొనియున్నవని కీర్తించిరి. రాముని కీర్తింపకుండ ఏ భక్తు డాగగలడు, ఏ కవి రాముని గూర్చి రచింపకుండ నుండగలడు? మురారి యను కవి రామకథను నాటకముగా రచించుచు ఇట్లనెను, “ఎందరో కవులు రాముని కథను కావ్యములుగా రచించిరి. మరల నేను రచించుటకు కారణమున్నది. రామునిలో అన్నియు మంచి గుణములే కాని ఒక అవగుణమున్నది. అతని గుణములను ఎంతగా కీర్తించినను, తృప్తి కలుగకుండుటయే ఆ లోపము.” జయదేవుడను కవి కూడ రామకథను నాటకముగ రచించుచు ఇట్లనెను, “రామునే ఎందుకు కథా నాయకుడుగ గ్రహింపవలెనను ప్రశ్నకు సమాధానము, అతనిని మించిన కథా నాయకుడు లేకుండుటయే.” తెలుగు భాషలోనే ఎన్నియో రామాయణములు వచ్చినవి. అన్నమయ్య గూడ ద్విపదలో రామాయణమును రచించెను. ఆ గ్రంథ మిపుడు లభ్యమగుటలేదు. ఆంధ్రుల అభాగ్యమిది. రాముడు ధర్మమూర్తి యని మారీచుడే కీర్తించెను. వాలియు నంతియే. ఇదిగాక ఆతని మాటలు, చేష్టలు, నడవడి వెనుక ఆతడు పరబ్రహ్మమను నంశము వ్యంగ్యముగా దాగియున్నది. వ్యంగ్యత్వము గల కథయే కావ్యమునకు తగినది. ఈ సంకీర్తనలో అన్నమయ్య ధన్యుడై, మనలను ధన్యులను చేయుచున్నాడు. శ్రీరామావతార వైభవమును మన కనులకు కట్టించు ఈ కీర్తన గానము చేసినను, విన్నను, తలచినను తరించెదము.

పల్లవి యొక్క తాత్పర్యము

“ఈతడు సంసార సాగరము నుండి మనలను తరింపజేయు బ్రహ్మము, ఇతడు దేవుడు, ఇతనిని గూర్చి అత్యంత కుతూహలముతో నేను చెప్పుచున్నాను. ఓ జనులారా! తప్పక వినుడు.”

వ్యాఖ్య

ఈతడు, ఇతడు అను పదముల ప్రయోగముతో అన్నమయ్యకు తనకు, రామునికి నడుమ గల అత్యంత సాన్నిహిత్యమును తెలుపుచున్నాడు. అంతేగాక జనులను అనగా పుట్టిన జీవులను సంబోధించుచు

రాముడే మీకు గూడ అతి సన్నిహితుడని, అతనిని విడిచిపెట్టవద్దని సూచించుచున్నాడు. నిజమే. మనకు స్వామికన్న దగ్గరెవరు? అన్నమయ్య 'అతడు, ఆతడు' అనలేదు. స్వామి మనకు దూరము కాదుగదా. కృష్ణుని గూర్చి కూడ 'వీడె వీడె' అని మిక్కిలి చనవుగా తెలిపెను. రాముడు ప్రసన్న గంభీరుడు. కనుక 'ఇతడె, ఈతడె' అనెను. కృష్ణుడు ఎప్పుడును క్రీడామయుడే. కనుక 'వీడె, వీడె' అనెను. ఇతడు మా దేవుడు అనగా దేవుడయ్యును, సకలలోక ప్రభువయ్యును మాకు ఎంతో దగ్గర అని భావము. 'మా' అని బహువచన ప్రయోగము చేసెను. ఎందరు తనవలెనే రాముని గూర్చి భక్తితో ప్రేమ, అనుభూతి పొందెదరో వారెల్లరికి ఆయన దగ్గరివాడే. రాముడు ఆదర్శ మానవోత్తముడనే మాట నిజమే. కాని అసలు ఆయన తారకబ్రహ్మము. రాముని నామము, గుణములు, జీవనశైలి స్మరించినచో మనము సంసార సాగరమును దాటుదుము. రామునకు శరణందిన వారెల్లరును తరించిరి. తరించుచున్నారు. బ్రహ్మ మనగా బృంహణము చెందువాడు. విత్తనమే చెట్టుగా విస్తరించును గదా. అట్లే సృష్టి అను చెట్టుకు బీజము రాముడని అన్నమయ్య ఆయన నిజస్వరూపమును తెలుపుచున్నాడు. కృష్ణుడు గీతలో 'నేనే సర్వభూతములకు జీవమున'ని చెప్పెను. రాముని కన్న తల్లిదండ్రులు, అడవికి పంపిన కైక, గురువులగు వశిష్ఠ విశ్వామిత్రులు, అడవిలోని ఋషులు, ఆతిథ్య మిచ్చిన భరద్వాజుడు, అహల్య, కుమార్తె నిచ్చిన జనకుడు, బోయవాడైన స్వచ్ఛ హృదయుడగు గుహుడు, వనచరులు, శబరి, హనుమంతుడు, అంగదుడు, ఆర్తులై చేరి రాముని సేవ చేసికొన్న వానరులు, శరణాగతి నందిన విభీషణుడు, అతని అనుచరులు, రాక్షస స్త్రీలగు త్రిజట, అనల, సరమ మున్నగువారు సంసార సాగరమును తరించిరి. రాముడు ఎక్కడను, ఎవరికిని ఎక్కువసేపు ఉపదేశములు చేయలేదు. ప్రసంగములను చేయలేదు. రాముడు మితభాషి. స్మితభాషి – నవ్వుచు మాటలాడువాడు, హితభాషి – మేలును మాటలాడు వాడు, పూర్వభాషి – ముందుగా పలుకరించువాడు. రాముని సాన్నిధ్యము, సాంగత్యములే చాలు సుఖదుఃఖములను, కామ క్రోధాదులగు సంసార బంధములను దాటింపగలిగెను. తినుట, త్రాగుట, స్త్రీ సుఖములు తప్ప దివ్యానందపు రుచి నెరుగని వానరులు తరించి, దివ్యానందమున ఓలలాడిరి. కారణము రామ సాన్నిధ్యము, రామ సేవాభాగ్యము. తనను బ్రహ్మమని ఎరుగని వారిని కూడ తన సఖ్యముతో తరింపజేసిన దయాసాగరుడు రాముడు. రామ నామమునకే తారకమంత్రమని ప్రసిద్ధి వచ్చెను. ఇందలి మొదటి అక్షరము అగ్నిబీజము. కాలుష్యములను కాల్చివేయు నది. ఎవరియందు ఎల్లరు రమింతురో ఆతడే రాముడు. 'శ్రీరామ రామ రామ' అనిన చాలు విష్ణు సహస్రనామ స్తుతికి సమానమని శివుడు పార్వతికి చెప్పెను. కాశిలో దేహము విడుచువారి చెవులలో విశ్వనాథుడగు శివుడు తారకమంత్రమగు రామనామమును విన్పించునని ప్రతీతి. రామకథను 'దీర్ఘశరణాగతి' అని రామానుజుల వారికి వారి గురుదేవులు ఉద్బోధించిరి. రామనామమును జపించుచు, రామునకు ప్రసన్నులై, ఆతని ననుసరించినవారు ఎప్పటికిని సంసార సాగరమును తరించుచునే యున్నారు. నేను చెప్పే ఈ తీయని పలుకును మీ మేలుగోరి, మీరు సంసార సాగర మును తరింపవలెనని గోరి ఎంతో కుతూహలముతో చెప్పుచున్నాను, వినుడని అన్నమయ్య ఆర్తితో జనుల యెదలను తట్టుచున్నాడు. ఈతడు తారకబ్రహ్మ మనుటలో ఇంకొక విశేషమున్నది. మనము ఎవరినయిన చూచి ఈతడు అనుచుందుము. మనచే తలచబడిన, చూడబడిన లోకములోని

ఎవరి నయినను బ్రహ్మమయిన రాముని స్వరూపముగా దర్శించినచో, రాముడే వారియందు గోచరించి, మనలను తరింపజేయును. ఇది గాయత్రీ మంత్రములోని భావమునకు దగ్గరగా నున్నది. వేరొక విశేషము 'మా దేవుడు' అను ప్రయోగమున గలదు. 'మా' అను పదము సంస్కృత పదమైనచో 'అమ్మవారగు లక్ష్మీదేవి' అని అర్థము. కావున 'మా దేవుడ'నగా మనలను కన్న అమ్మయగు లక్ష్మీదేవికి పూజనీయుడయిన దేవుడితడే. నిజమే. లక్ష్మీదేవియే గదా సీతగా అవతరించి, రాముని సదా అనుసరించి, స్మరించినది. సీతమ్మను గూర్చి వాల్మీకి ఇట్లనెను, 'సర్వాత్మనా రామమనుస్మరంతీ'. ఆమె ఇంద్రియములు, మనస్సు రామునే స్మరించుచు, హృదయము రామమయమై యున్నది. జనులనగా పుట్టినవారు. పుట్టుకను దాటించు దేవుడు రాముడనియు భావము.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

ఈ చరణమున అన్నమయ్య రాముని దివ్యమోహన రూపమును, పరాక్రమ మును, భక్తవాత్సల్యమును ఇట్లు కీర్తించుచున్నాడు, "రాముడు నల్లకలువల వలె చామనచాయ గలవాడు. అనేక విధములయిన సర్వభూముల కధిపతి. నానా విధములుగా సార్వభౌముడు. పదునారు కళలతో ప్రకాశించు చంద్రుడు. దుష్టులు, బలవంతులగు రాక్షసులను దోమలను వలె మిక్కిలి తేలికగా పొడిపొడి చేసినవాడు. దేవతలు కోరిన ఫలములిచ్చి, వారిని కాపాడినవాడు."

వ్యాఖ్య

రాముడు నల్లకలువల దండ వంటి అందమైన చాయ గలవాడు. రామునకు 'పుంసాం మోహనరూపుడ'ని ప్రసిద్ధి గలదు. ఇచట 'పుంసాం' అనగా మగవారికని గాదు. జీవుల కెల్లరకని అర్థము. ఇతడు అయోధ్యా నగరమునకు, కోసల రాజ్యమునకు పాలకుడే గాక, అనేక విధములయిన అన్ని రాజ్యములను ఒక త్రాటిక్రిందకు తెచ్చి రామరాజ్యమును నెలకొల్పెను. ఇతర రాజ్యములను జయించుట వలన గాక, తన ఆదర్శ వర్తనము యొక్క ప్రభావము వలన, వానిని ఒకే గొడుగు క్రిందకు తెచ్చెను. అంతేగాక, నానావిధములుగ రాముడు సార్వభౌముడు. అనగా భౌతిక రాజ్యములకే గాక, ప్రజల హృదయభూము లన్నిటిని పాలించువాడు. తన ప్రేమతో సర్వ హృదయములను గెలుచుకొనెను. దశరథునితో సభలోని సామాన్య ప్రజలు ఇట్లు వేడిరి, "మీరు వెంటనే రాముని యువరాజును చేయుడు. కారణము అతనియందు ధర్మము, దివ్యానందమగు మోక్షము నెలకొనియున్నవి. అతనిని చూచిన మాత్రమున మాలో ఇవి నెలకొనును. మనుష్యులకు బాధలు కల్గినపుడు మిక్కిలిగా రాముడు తపించును. జనులలో ఎవరికయినను సంతోషము కలిగినప్పుడు, తండ్రి వలె రెట్టింపు తృప్తి పొందెడివాడు. పట్టపుటేనుగుపై, గొడుగు క్రింద రాముడు ఊరేగుచున్నప్పుడు చూడ వలెనని మేము కోరుచున్నాము." రాముడు పదునారు కళలతోడి సోముడు. సోము డనగా చంద్రుడని ప్రసిద్ధి. చంద్రునకు 16 తిథులే 16 కళలు. రామచంద్రునకు 16 కల్యాణగుణములే 16 కళలు. రాముని గూర్చి నారదుడు వాల్మీకితో రాముడు సోముని వలె ప్రియదర్శనుడని కీర్తించెను. పూర్ణిమలోనే మిగిలిన పదునారు కళలు ఇమిడియుండును. రామచంద్రుడు పూర్ణిమాచంద్రుని వంటివాడు.

చంద్రుడు మనస్సుకు కారకుడు. రాముని మనస్సు పున్నమిచందురుని వెన్నెల వంటి ప్రసన్న ప్రేమను కురియును. చంద్రుని వెన్నెలకు కలువ విరబూయును. రాముని మనస్సు పున్నమి చంద్రుడు. అతని శరీరము, మనస్సు నుండి వెలువడు మంచితనమునకు అనుగుణ ముగా శోభిల్లు నల్లకలువల జాలు. ఇది అన్నమయ్య విశిష్ట దర్శనము. అంతేకాదు, రామచంద్రుని దర్శించిన వారు, స్మరించిన వారు, సేవించిన వారు కూడ కలువల వలె వికాసము పొంది విరాజిల్లుదురు. రావణుడు కూడ మొదటిసారి రామునితోడి యుద్ధమున, అతని సమ్మోహన దివ్యరూపమునకు పరవశించి, నిశ్చేష్టుడయ్యెను. రాముడు అతనిని నిరాయుధుని గావించి, విడిచిపుచ్చెను. అన్నమయ్య రాముని సోముడనుటలో రాముని జాతక సూక్ష్మము గలదు. అన్నమయ్య ద్విపద రామాయణ కర్త. జ్యోతిశ్శాస్త్రవేత్త. రామాయణమున రాముని జన్మస్థితి చెప్పబడినది. రాముడు సూర్యవంశ శ్రేష్ఠుడు. అతడు పుట్టినపుడు సూర్యుడు మేషమున పరమోచ్చలో నుండెను. కావున రాముడు సంకల్పశక్తి, ధర్మనిష్ఠ, సార్వభౌమత్వము గలవాడు. తనకు పెద్ద కష్టము వచ్చినపుడు వజ్రము కంటె కఠోరుడు. రాముడు పుట్టినపుడు చంద్రుడు కర్కాటకమున స్వక్షేత్రమున గురునితో గూడి వర్గోత్తమము చెంది, దేవమాత ఆధిపత్యమున గల పునర్వసు నందుండెను. కావున రామచంద్రుడను పేరు గూడ వచ్చెను. ప్రసన్నత, నిర్మలప్రేమ, అనంత కరుణను గలవాడు. ఇతరులకు చిన్న కష్టము వచ్చినను పూవు కంటె మెత్తనగువాడు. మరియు వేదములందు సోము డనగా చోటులోని నాదమునకు, జీవుల పరవశతానుభూతికి, సంగీతమునకు అధిపతి యగు గంధర్వుడని చెప్పబడెను. ఇతడు చంద్రుని ద్వారమున పనిచేయుట వలన, తర్వాతి కాలమున సోముడే చంద్రుడను ప్రసిద్ధి కలిగెను. రాముని షోడశకళా సోముడని అన్నమయ్య కీర్తించెను. అనగా ప్రణవనాదస్వరూపుడనియు, రామ నామము అతి మధురమనియు, రాముని నామరూప స్మరణలు పారవశ్యానుభూతిని కల్గించుననియు అన్నమయ్య భావము. మరియు రాముడు గాంధర్వవిద్యలో, ఆనాటి ప్రపంచమున శ్రేష్ఠుడని వాల్మీకి వర్ణించెను. అనగా రాముడు మిక్కిలి తీయనైన గానమును చేసి జనులను ముగ్ధులను గావించి, వారిని బ్రహ్మానందసాగరమున ఓలలాడించెను. రామాయణ తత్త్వరసమును ఆస్వాదించిన అన్నమయ్య రాముని గంధర్వగాన సామర్థ్యము నెఱిగియే ఇట్లు సోముడని వర్ణించుటలో సందేహము లేదు. లోకకంటకులై, బలవంతులయిన విరాధ కబంధులను, బ్రహ్మ ఇచ్చిన వర ప్రభావము గల రావణ కుంభకర్ణులను, ఇతర రాక్షసులను పొడిపొడిగా చేసి ధర్మ స్థాపన చేసినవాడు రాముడు. ఖరదూషణాదులగు పదునాలుగువేల మందిని తానొక్కడే అర్ధాధిక ముహూర్త కాలమున అనగా 24 నిమిషముల కంటె కొంచెము ఎక్కువ కాలమున – సుమారు అరగంట కాలమున వధించెను. ఒక్కొక్కనికి ఒక్కొక్క రాముడుగా కన్పడెను. 'దోమటి' అనగా "దొమ్మి" అని అర్థము. దొమ్మిగా (గుంపులుగా) వచ్చిన బలవంతులయిన దుష్టరాక్షసులను కూడ తుంటలు తుంటలు చేసెనని యర్థము. ఇంద్రజిత్తు హతుడైన తదుపరి రావణుడు తన మహా సైన్య మంతటిని రామునిపైకి పంపెను. నూటనలుబదియైదు కోట్ల ఎనుబది లక్షల కాల్బలము, దానికి నిష్పత్తిలో గల రథములు, ఏనుగులు, గుఱ్ఱములు – వీనిని వానరు లెదుర్కొనలేక పోయిరి. ఈ మొత్తమును రాముడు పగటిలో ఎనిమిదవ

వంతులో అనగా ఒకటిన్నర గంటలలో చంపెను. గాంధర్వాస్త్ర ప్రయోగమున ఈ రాక్షసులు రాముని చూడజాలరైరి. వీరిలో ఒక్కొక్కనికి ఒక్కొక్క రాముడు తన నెదిర్చినట్లు కన్పించెను. తన వింటిని చుట్టు త్రిప్పుచున్న రాముడు సుదర్శనచక్రము వలె కన్పడెను. ఇట్టి దివ్యబలము తనకును, శివునకును మాత్రమే కలదని రాముడే స్వయముగా వానరులకు చెప్పెను. రాముని విశ్వరూపము ఈ సందర్భమున కనిపించెను. రాముడు రాక్షసులను చంపి సురలు కోరిన ఫలముల నిచ్చి కాపాడెను. దేవతలు ధర్మ సంస్థాపనార్థమై రావణ వధను గోరి ప్రార్థింపగా స్వామి రాముడుగా అవతరించెను. దేవతలనగా లోకమున గల పంచభూతాదుల కధిపతులగు ప్రజ్ఞలు, మరియు జీవులలోని ఇంద్రియములను, ప్రాణప్రవృత్తులకు, మనస్సుకు అధిపతులు. కావున దేవతల కోరికయేమి? సకల జీవుల శుభమే. చాలమంది జనుల నొకచోట సమీకరించి, వారి నడుమ సామరస్య మేర్పడుటకై యజ్ఞములను ఋషులు చేసెడి వారు. యజ్ఞ మనగా లోకమునకు మేలుగూర్చు కర్మ. ఇట్టి యజ్ఞములను పాడుచేసి, భారత ప్రజల నడుమ సమైక్యమును రావణుడు చెదరగొట్టెను. రావణుడు, అతని సైనికులు నరమాంస భక్షకులు. వేలమంది స్త్రీలను, వారి భర్తలను చంపి బలాత్కరించి తెచ్చిరి. రావణుడు మిగిలిన ప్రపంచము లోని పాడిపంటలను సంపదను కొల్లగొట్టి, లంకను బంగారముతో నింపెను. కావున జీవులలోనున్న దేవతలే, దేవుని రావణ వధార్థము నరుడుగా దిగిరమ్మని వేడిరి. నరవానరులను, విభీషణాది రాక్షసులను ఉద్ధరించి, రావణాదులను చంపి రాముడు సురలు కోరిన ఫలము నీడేర్చెను. కావున రావణ వధానంతరము, దేవతలు రాముని వద్దకు వచ్చి, అతనిని అమోఘ వీరుడని, పరమాత్మయని సూటిగా స్తుతించిరి. ఇట్లు అన్నమయ్య ఈ చరణమున మొదటి రెండు పాదములు రాముని మనస్సును, దివ్యరూపమును వర్ణించెను. చివరి రెండు పాదములు కలిసి దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మస్థాపనతోడి రాముని అవతార కార్యమును వర్ణించెను. సోముని వలె రాముడు దయాసాగరుడు గదా. మరి రావణాసురులగు రాక్షసులనేల చంపెను? మిగిలిన కోట్లమంది జనుల క్షేమము గోరి, అని ఈ చరణము మొత్తము యొక్క సమన్వయము.

2వ చరణము యొక్క తాత్పర్యము

ఈ చరణమున అన్నమయ్య రాముని వర్ణకాంతిని, మహిమను ఇట్లు కీర్తించు చున్నాడు, "రాముడు పూర్ణమయినవాడు. నీలమేఘము వంటి వర్ణము గలవాడు. విస్తారముగా దానములు చేసినవాడు. దానము చేయు గుణముతో జనుల యెదల యందు విస్తరించినవాడు. సుపర్ణుడయిన గరుత్మంతుడు తన వాహనముగా గలవాడు. సాగరమును దాటి, రావణాది బలవంతులయిన రాక్షసులను గెలిచినవాడు. ఈనాడు, ఈతని మహిమను ఇట్లని, ఇంతయని నిర్ణయించి చెప్పలేము."

వ్యాఖ్య

రాముడు పూర్ణుడు అనగా పరబ్రహ్మము. భగవంతుని వెలుగు పూర్ణమని వేదము చెప్పుచున్నది. పూర్ణ మనగా అనంతము. ఆయన కాధార మెవ్వరును లేరు. తానే సర్వమునకు ఆధారము. ఇంతయని

ఆతని తత్త్వమును ఊహింప నలవికాదు. ఈ అంశమునే చివరి పాదములో అన్నమయ్య చెప్పుచున్నాడు. అదిగాక రాముడు పరిపూర్ణావతార మనియు అర్థము గలదు. దేవుని అవతారములలో మూడు రకములు గలవు. 1. భగవంతుని 16 కళలతో నేలపైన దిగివచ్చి, నరుడుగా వచ్చినను దేవుడుగా ఎంతటి మహిమ చూపగలడో అంతగా చూపగలవాడు. 2. అంశావతారములు : భగవంతుని వెలుగులో కొంత భాగము రూపమెత్తినవారు. కపిల, నరసింహాదులు. 3. ఆవేశావతారములు : లోకమునకు మేలు చేయు ప్రయోజనము కొరకు, ఒక సిద్ధపురుషుని యావేశించి భగవంతుని వెలుగు పనిచేయుట. ఉదా : పరశురాముడు, నారదుడు, వ్యాసుడు, శ్రీరామ, శ్రీకృష్ణులు దేవుని 16 కళలతో దిగివచ్చిన పూర్ణావతారులు. శ్రీరాముడు అవసరమయిన సందర్భములలో అసాధారణ సామర్థ్యమును చూపెను. ఉదా : రావణుని, ఖరదూషణాదులను చంపుటలోను, సముద్రమును ఎండింపజేయుటలోను, అసాధారణ కష్టములు వచ్చినను అతని ధైర్యము చెక్కుచెదరలేదు. ఇక రాముడు నీలమేఘము వంటి వర్ణము గలవాడు. శ్యామలదేహుడు. నీలమేఘము వంటి దివ్యతేజోవలయము తన చుట్టు గలవాడు. కొందరిది తెలియక రాముడు, కృష్ణుడు – వీరి పాత్రలు ధరించినవారి దేహములను నీలిరంగు పులుముచుందురు. వీరి దేహము చామన. దీని చుట్టునున్న దివ్యతేజము నీలము. అన్నమయ్య సంస్కృత పదములను, జానుతెనుగు పదములలో సార్థకముగ ప్రయోగించుటలో నేర్పరి. ఇచట వర్ణమను పదమునకు మూడర్థములు గలవు. 1. కాంతి, 2. స్వరము, 3. వర్తనము. రాముడు ఈ మూటియందును నీలమేఘము వంటివాడే. 1. ఇతని కాంతి నీలము. 2. ఇతని స్వరము మబ్బు యొక్క ఉఱుము వలె నుండును. 3. మబ్బు నేలపైన జీవులకు వలసిన సస్యసంపద నిచ్చు వాన కురియును. రాముడు జనులకు మేలు చేకూర్చు దయను తన సన్నిధి చేత, స్మరణము చేత ఆనందమను వానను కురియును. ఇక ఇతని దానగుణము అతి విస్తారము. రాముడు ధర్మవీరుడు, దయావీరుడు, యుద్ధవీరుడు, అభయవీరుడు మాత్రమే గాక దానవీరుడు. ఇతని దానమును గూర్చి రామాయణమున ప్రత్యేకముగా ఒక సర్గ కలదు. శ్రీరాముడు వనవాసమునకు వెళ్లుటకు ముందు వేదమును చదువుకొన్న వారికి, ఆచార్యులకు, బ్రహ్మచారులకు, సేవకులకు, బాలురకు, ముసలివారికి, దీనులకు, మిత్రులకు, దరిద్రులకు, భిక్షుకులకు వేలకొలది గోవులను, ధనమును దానము చేసెను. ధన కోశాగారమంతయు ఖాళీ చేసెను. చివరలో వచ్చిన ఒక బీద బ్రాహ్మణునకు సరయూ నదీతీరము నుండి అతడు కఱ్ఱ విసిరినంతమేర ఆవలి యొడ్డున గల ఆవులను దానము చేసెను. సీతమ్మయు ఎన్నో నగలను, హారములను, భుజకీర్తులను, ఒడ్డాణమును దానమొనర్చినది. ఇంతగా దానములు చేసినను సీతారాములు వినయముతో నుండిరి. చివరలో పట్టాభిషేకము పొంది, రాముడు రాజ్యపరిపాలన చేయు కాలమున యాగములు చేసి, తాను ప్రజల నుండి వసూలు చేసిన పన్నును మొత్తము ప్రజలకే వ్యయించి, తాను రెండు వస్త్రములు మాత్రమే మిగుల్చుకొనె ననియు, సీతమ్మయు రెండు వస్త్రములు, మంగళసూత్రము తప్ప అంతయు స్త్రీలకు దానము చేసెనని భాగవతము నవమ స్కంధమున చెప్పబడినది. రాముడు తాను జయించిన లంకారాజ్యమును విభీషణునకే ఇచ్చెను కాని తాను స్వాధీనము చేసికొనలేదు. వాలిని చంపి

కిష్కింధకు సుగ్రీవుని రాజును గావించెనే గాని, తన వశము గావించుకొనలేదు. వారి వారి రాజ్యములలో ధర్మము నెలకొల్పెను. సుగ్రీవ విభీషణు లకు అభయ ప్రదానము చేసెను. జటాయువుకు, శబరికి నాశము లేని మోక్షస్థితిని ప్రసాదించెను. కబంధునకు శాపవిముక్తిని కలిగించెను. హనుమంతునకు తన కౌగిలిని – హృదయమునే ఇచ్చెను. హతుడయిన రావణునకు ప్రేతకర్మలు చేయుటకు సిద్ధపడెను. ఇదియు త్యాగమే. తండ్రి మాటపై రాజ్యమునే విడిచి, వనవాసమును చేసెను. లోకము యొక్క క్షేమము కొరకై భార్యా వియోగ దుఃఖమును అనుభవించెను. తనను తానే లోకము కొరకై త్యాగము చేసికొనెను. లోకములోని జనులను దేవునిగా ఆరాధించుటే శ్రీరాముని పాలనము. ఇట్లు రాముడు తనకు చెందిన వానిని, తనను విస్తారముగా దానము చేసెను. మరియు, ఇంతటి దానగుణముచే అతడు జనుల హృదయముల లోనికి వ్యాపించెనని అన్నమయ్య భావము. రామ రాజ్యమున జనుల నోటివెంట నిరంతరము రామనామమే నిండి, రాజ్యము రామమయ మయ్యెను. మరియు జనులు రామచంద్రుడే తమ తండ్రి గదాయని భావించి, తమ తండ్రుల నెల్లరను మరచిరని భాగవతము చెప్పుచున్నది. ఇట్లు రాముడు తన దానముచే, ప్రేమచే, త్యాగముచే ఎల్లరి హృదయములందు వసించెను. వారి హృదయ సామ్రాజ్యములకు కూడ రాజయ్యెను. రాము డసలు నారాయణుడు. కావున ఇతని వాహనము సుపర్ణుడగు గరుడుడు. చోటునకు ప్రాణమున్నది. జీవమున్నది. ఆ జీవమే గరుడుడు. అతని ఱెక్కలే చోటు యొక్క ఉచ్ఛ్వాస, నిశ్వాసలు. అతడు చోటులోని అంతర్యామి యగు విష్ణునికి వాహనము. మనలో కూడ శ్వాస యను గరుడుని పైనెక్కి, అంతరాత్మగా విష్ణువున్నాడు. కావుననే ఇంద్రజిత్తు ప్రయోగించిన నాగపాశములకు బద్ధులయిన రామలక్ష్మణుల వద్దకు గరుడుడు వచ్చి నాగములను పంపివేసి, రాముని సేవకుడనని వినయముగా మ్రొక్కెను. గరుడుడు రక్షకుడని పొరబడుచున్న వానరులకు గరుడుని మాటలతో జ్ఞానోదయమై రాముడే రక్షకుడని తిరిగి భావించిరి. రెండు దినములు భూశయనము చేసినను రామునకు సముద్రుడు త్రోవ ఈయలేదు. అపుడు కోపమును నటించుచు రాముడు ఎఱ్ఱని చూపులతో చూడగా సముద్రపు నీరు ఎండిపోయినదని భాగవతము, ద్వితీయ స్కంధమున చెప్పబడినది. సముద్రు డపుడు కానవచ్చెను. నలుడను వానరుడు ఱాళ్లతో వంతెన కట్టెను. ఇది రాముని మహిమ. రాముడు, వానరులు 100 యోజనముల విస్తీర్ణము గల సాగరమును దాటి రాలేరని రావణుని నమ్మకము. దానిని వమ్ముచేసి, రాముడు లంకను చేరెను. బ్రహ్మ ఇచ్చిన వరములతో మదించిన రావణ కుంభకర్ణాదు లను గెలిచెను. ఇట్టి రాముని మహిమ, ఆ స్వామి తట్టించినంతమేర చెప్పితినేగాని, పూర్తిగా ఇంతయని ఎవరు చెప్పగలరని అన్నమయ్య పలికెను. ఆకాశమున కొంత దూరమేగిన పిట్ట, ఆకాశము యొక్క ఎత్తును కొలువగలదా? సముద్రమున ఒకచోట స్నానమాడిన మానవుడు దాని లోతును త్రాటితో కొలువగలడా? అట్లే భగవంతుని నామ రూప గుణ మహిమలను కీర్తించుట, భగవంతుని తత్త్వమగు ప్రేమానంద సాగరమున మునుగుటకే కాని, భగవంతుని అంతు తేల్చుటకు కాదు. భగవంతుని గూర్చి చెప్పలేక వేదములే వెనుకకు మరలినవి. మహిమ అనగా విస్తారము, సర్వ వ్యాపకత్వము. దేవుడే ఈ మొత్తమైనపుడు, వానిలో రేణువయిన జీవు డెంతటి మహానుభావు డయినను దేవుని గూర్చి ఎట్లు

చెప్పగలడు? దేవు డనుమతించి, తనకు తెలిపినమేర మాత్రమే అల్పముగా చెప్పును. చెప్పగలుగుట అనునది లేదు. దేవుని నుండి తనకు తెలియవచ్చినది తెలుపుటయే గాని, తనకు తెలియుట అనునది లేనేలేదు. దేవుడనగా ప్రేమసాగరము. అనుభూతి సముద్రము. అనుభూతిలో మునుగువరకు, దానిని గూర్చి మనస్సు, వాక్కులు ఊహింపలేవు, చెప్పలేవు గదా. అనుభూతి అననేమో వీనికి తెలియదు. పోనీ, అనుభూతిలో మునిగిన సందర్భమున చెప్పగలవా అన్నచో అపుడు మనసే ఉండదు. ఇక ఊహకు, వాక్కుకు చోటే లేదు. దివ్యానుభూతి రెండు దశలుగా నున్నది. మొదటిది జీవుని ప్రత్యేకమయిన ఉనికి పూర్తిగా బ్రహ్మానుభూతిలో మునుగుట – సాగరమున నది వలె. దీనినే నిర్వికల్ప సమాధి యందురు. ఇచట తాను అనుభూతిలో మునిగి యున్నాననను భావమునకు తావు లేదు. తాను ఉండడు. ఇక రెండవది – దివ్యానుభూతిలో మునుగుచు, తాను మునుగుచున్నాననను భావ మొక్కటి మాత్రము కొంచెము మిగిలియుండుట. దీనినే భావసమాధి యందురు. ఈ స్థితిలో దేవుని నుండి తట్టినమేర చెప్పుట జరుగును. అప్పుడు కూడ పూర్తిగా ఎవడును దేవుని మహిమను వర్ణింపలేడు. తన కాధారమయిన వానిని గూర్తి తానెట్లు చెప్పగలడు? ఏమాత్రము చెప్పినను దేవుని గూర్చియే గాని, దేవుని చెప్పుట ఉండదు. దేవుడే ఈ మొత్తము. ఇది అతని మహిమ లేక వ్యాపనమని పురుషసూక్తము చెప్పుచున్నది. శ్రీరాముని అవతార మహిమను గూర్చి తనకు రాముడు కరుణించిన మేర చెప్పుకొని ఆనందించుటేగాని, పూర్తిగా ఎవరికిని తరముగాదని అన్నమయ్య భక్తి, వినయములతో పలుకుచున్నాడు. రాముని గూర్చి నాకంతయు తెలియునని ఎవడును అనరాదు. అట్లనువానికి ఏమియు తెలియదని అర్థము. ఎవనికెంత తెలిసినను, ఇంకను తెలియవలసినది చాల మిగిలియే యుండును. రాముడు జన్మించి 8 లక్షల ఏండ్లు దాటినా ఇంకను రామకథ, రామనామము సజీవముగనే యున్నవి. చెప్పుకొనుట అయిపోవుట లేదు గదా. ఇక ముందు గూడ చెప్పుకొనుట ఆగదు. ఆనందించుటకు అంతకంటె దారి లేదు. ఇంతని చెప్పలేము గాని ఆనందము కావలయు ననుకొన్నవాడు తనకు తోచిన అల్పస్థాయిలో రాముని కథను చదువుకొనక తప్పదు. కొండలు, సరస్సులు, వాక్కులు, రసభావమున్నంత కాలము రామకథ నిలిచియుండునని బ్రహ్మ, వాల్మీకితో పలికెను.

3వ చరణము యొక్క తాత్పర్యము

ఈ చరణమున అన్నమయ్య రాముని సీతాసమేతుడుగను, భరత లక్ష్మణ శత్రుఘ్న సమేతుడుగా ఇట్లు వర్ణించుచున్నాడు, "సీత కితడు వరుడు. అన్నిటికంటె శ్రేష్ఠుడయిన వానికన్న శ్రేష్ఠుడు. విలువిద్య అను దీక్షలో గురుడు. దివ్యములు, వ్యర్థములు గాక సఫలములగు బాణములు గలవా డితడు. భరత లక్ష్మణ శత్రుఘ్న సహితుడు. అట్టి రాముడు మనపై ప్రేమతో శ్రీవేంకటగిరిపై వెలసి స్థిరముగా నున్నవాడు."

వ్యాఖ్య

రాముని గూర్చి చెప్పుచు, సీతను, రాముని తమ్ములను ప్రస్తావించకుండుట పొసగదు. సీత కితడు వరుడనగా భర్త యనియే కాదు. ఆమెచే వరింపబడినవాడు, శివుని విల్లు విఱచుటతో జనకుని నియమము

ప్రకారము, సీత రాముని వరించినది. వరించుట అనగా హృదయమును సమర్పించుకొనుట అని వేదము లందలి అర్థము. గాయత్రీ మంత్రమందును, ఉపనిషత్తులందును గల ఈ పదమును అన్నమయ్య స్వీకరించెను. అంతేకాని 'వధూవరులను' అను సామాన్యార్థమున గాదు. సీత, రాముని కష్టసుఖములు రెంటి యందును అనుసరించెను. ఒకరి కొకరు ప్రాణము. రాముని అవతార ప్రణాళికలో తోడ్పడి, ఆ తల్లి భర్త యొక్క ఎడబాటును ఓర్వలేక ఓర్చినది. నిరాహారయై లంకలో బాధలు పడినది. సర్వాత్మనా రాముని తలచినది. హనుమంతుడు సీతను సమీపించుచు, మనస్సుతో రామునే చేరెను. సీతారాములు అభిన్నులు – సూర్యుడు, సూర్యకాంతి వలె. తేటతెలుగులో ఇట్లు చెప్పవచ్చును. చీర కట్టుకొన్న రాముడే సీత, ధోవతి ధరించిన సీతయే రాముడు. వారి అనుబంధమట్టిది. ఎల్లరు రాముని స్మరింతురు. రాముడు సీతను స్మరించెను. సీత రాముని మనస్సుపాలిటి అయస్కాంతమని హనుమంతుడు గ్రహించెను. ఇంక ఒక్క మాసము కన్న రాముని విడిచి బ్రతుకలేనని సీత హనుమంతునితో చెప్పినది. క్షణము కూడ సీతను విడిచి బ్రతుకలేనని రాము డాతనితో అనెను. సీతా వరుడనుటలో వేరొక అద్భుత విశేష మున్నది. సీత యనగా నాగటిచాలు. రాముడు నీలమేఘమని అన్నమయ్య పైన చెప్పెను. నాగటిచాలుకు వరుడు నీలమేఘమనుచు ఈతడు కర్షకవృత్తికి, పంటకు ప్రాధాన్య మిచ్చెను. అందరికన్న శ్రేష్ఠులలో శ్రేష్ఠుడు రాముడు. ఏల? తన ఉత్తమోత్తమ గుణముల చేతనే కాదు. తాను ఉత్తమ పురుషు డగుట వలన. అనగా సర్వాంతర్యామి యగు 'నేను' – ఆత్మ యగుట వలన. ఇతని కంటె ఇతర మున్నపుడు గదా, శ్రేష్ఠుడుండుటకు. ఎంత మొనగాడైనను, తన శరీరము వరకే అతని యునికి పరిమితము. కాని దేవుడు అంతర్యామి. అంతయు రామమయమే. 'పరుడు' అను మాటకు ఇతరు డనియు, శ్రేష్ఠ డనియు రెండర్థములు గలవు. తనకన్న ఇతరము లేనివాడు కావున రాముడు పరాత్పరుడు. ఇతడే దారము. ఎల్లరు అందు గ్రుచ్చబడిన పూలు. అర్జునుడు కృష్ణ నిట్లు స్తుతించెను. "నీకు సములే లేరు. ఇక అధికు డెవడుండును? నీ మహిమ సాటిలేనిది." ఇవియే గుణములు రామునకును వర్తించును. రాముని మించిన విలుకాడు ఆనాటి కాలముననే కాదు, ఇక అంతకు ముందు గాని, ఆ తర్వాత గాని పుట్టలేదు. విలుకాడనగా వీరుడనియు చెప్పవచ్చును. అతని వంటి వీరు డెప్పటికిని పుట్టడు, అతడే మరల పుట్టినచో తప్ప. విలువిద్య, అతనికి దీక్ష. దీక్ష అనగా పట్టుదల, శ్రద్ధ అని యొక యర్థము. ఇతడు విలువిద్యను విశ్వామిత్రుని వద్ద నేర్చెను. అగస్త్యుని నుండి ఐంద్రాస్త్రమును పొందెను. మరియు దీక్ష అనగా ఒక మహాకార్యము నెరవేర్చుట కొరకై జీవితాంతము తనను తాను సమర్పణ నొందుట. ఇచట రాముడు విలువిద్యను, దుష్టశిక్షణ, సాధురక్షణ, ధర్మస్థాపన అను మహాకార్యము కొరకై వినియోగించెను. అంతేకాని పరాక్రమ మున్నది గదా యని ఊరకనే ఎవరి జోలికి పోలేదు. ఇతని పరాక్రమము ధర్మరక్షణకై మాత్రమే దీక్షగా వినియోగింపబడినదని నారదుడు వాల్మీకికి చెప్పెను. విలువిద్య అను దీక్షలో రాముడు గురుడని అన్నమయ్య విశిష్ట ప్రయోగము గావించెను. గురుడనగా దీనిని కొందరు శిష్యులకు నేర్పెను అను అర్థముననే కాక, ఆ విద్యలో సర్వశ్రేష్ఠుడు అని అర్థము. ఇతని నుండి విలువిద్య లక్ష్మణునకు సంక్రమించెను. ధర్మరక్షణకై, రాముని స్మరించిన వారిలో కూడ విలువిద్య, శౌర్యము

ప్రకాశించెను. ఎన్ని అస్త్రములు ప్రయోగించినను లక్ష్మణుడు, ఇంద్రజిత్తును వధింపలేకపోయెను. అపుడు చివరగా ఐంద్రాస్త్రమును గూర్చి ఇట్లనెను, “రాముడు ధర్మాత్ముడు, సత్యసంధుడు, సాటిలేని పరాక్రముడయినచో, ఈ అస్త్రము ఇంద్రజిత్తును గూల్చుగాక.” ఈ మాటయే అసలయిన అస్త్రము. ఇట్లు లక్ష్మణుని బాణమున ప్రవేశించి రాముడే, ఇంద్రజిత్తును చంపెను. రాముడు విడిచిన బాణముగా నేను సాగరమును దాటెదనని హనుమంతుడు పలికెను. రామ మహిమ అట్టిది. రాముని అస్త్రములు దివ్యములు. ఆగ్నేయాదులగు దివ్యాస్త్రములే గాక గాంధర్వాస్త్రము, బ్రహ్మాస్త్రము కూడ ఇతని వద్ద కలవు. అసలు రాముని బాణమే దివ్యాస్త్రము. ఇవి అమోఘములు. అనగా రాముడు ఊరకనే దివ్యాస్త్రములను ప్రయోగింపలేదు. లోక కంటకులను వధించి, ధర్మరక్షణ చేయు సందర్భము వచ్చినపుడు ప్రయోగించెను. ఒకసారి ప్రయోగించెనా వ్యర్థమగుట లేదు. లక్ష్యము నెరవేరుటయే గాని వెనుకంజ లేదు. స్త్రీలను అవమానించుట, అపహరించుట, బలాత్కరించుట వంటి నేరములు చేసిన వానికి రాముడు ‘వధ’ అను శిక్షనే విధించెను. తన భార్యను అపహరించిన రావణుని వధింపబోవుచున్న వాడగు రాముడు, సుగ్రీవుని భార్యను అపహరించిన వాలికిని అదే శిక్ష విధించెను. రాముని తమ్ములను గూర్చి ప్రస్తావించునపుడు ముందుగా లక్ష్మణుని పేరు చెప్పుచుండుట పరిపాటి. కాని అన్నమయ్య రామాయణమును జీర్ణం చేసికొని, అనుభూతినందిన మహానుభావుడగుటచే, వయస్సును బట్టి వరుసలో భరతుని, లక్ష్మణుని, శత్రుఘ్నుని ప్రస్తావించెను. చైత్ర శుద్ధ నవమి నాటి మధ్యాహ్నము రాముడు, దశమి నాటి ఉదయము భరతుడు, ఆ మధ్యాహ్నము కవలలగు లక్ష్మణ శత్రుఘ్నులు జన్మించిరి. కావున లక్ష్మణుని కన్న భరతుడు పెద్దవాడు. లక్ష్మణునిది కైంకర్య భక్తి. రాముని వెంటనుండి ఇతడు సేవించెను. భరతునిది పారతంత్ర్య భక్తి. అనగా ఇతడు రాముడు చెప్పినట్లు చేసెను. సొంత ఇష్టమును విడిచెను. శత్రుఘ్నుడు భగవంతుని నేరుగా గాక, భక్తుడగు భరతుని సేవించెను. వీరు ముప్వురు మహనీయులు అన్నదమ్ములై ఒకే ఇంట జన్మించిరి. వీరి సౌజన్యము పరిపూర్ణమగుటకు కారణమేమి? వదినగారగు సీతమ్మను అమ్మగా, దేవతగా, జగదంబగా ఆరాధించుట. ఈ విషయమును హనుమంతుడు తనలో తాననుకొనెను. భరతుడు సామగానమున నేర్పరి. లక్ష్మణుడు అన్ని మంచి లక్షణములు గలవాడు. శత్రుఘ్నుడు భాగవత సేవతో లోని శత్రువులగు కామ క్రోధాదులను నాశనము చేసినవాడు. సీతతోను, వీరితోను గూడి రాముడు పట్టాభిరాముడయ్యెను. వీరి సహితుడు రాముడు. అనగా వీరి హితమే తన హితముగా గల అన్నయని రాముని సోదర వాత్సల్యమును అన్నమయ్య కీర్తించెను. రామాయణమున బాలకాండలో ఈ అన్నదమ్ముల అనుబంధమును గూర్చి ఒక సన్నివేశము కలదు. కుశలవులు శ్రీరాముని సభలోనికి ప్రవేశించి రామాయణమును గానము చేయగోరిన వారైరి. అపుడు రాముడు తన ముప్వురు తమ్ముల వైపు కనుసైగ ప్రకటించెను. వారి అనుమతితో కుమారుల గానమును అనుమతించెను. రాముడు త్రేతాయుగమున జీవించినవాడు మాత్రమే కాదు. జీవులపై అత్యంత వాత్సల్యముతో తన దర్శనభాగ్యము వలన వారిని ధన్యులను చేయుటకై శ్రీవేంకటేశ్వరుడుగా తిరుమలపై వెలసి నెలకొనియున్నాడు. అనగా వేంకటేశ్వరస్వామిని భక్తితో దర్శించి, తలచి, కీర్తించిన వారు రాముని దర్శించి, ఆయనతో చరించి,

స్మరించి, సేవించుకొన్న భరత లక్ష్మణ శత్రుఘ్నులు, హనుమ దాదులు పొందిన స్థితిని పొందెదరని అన్నమయ్య భావము. భాగవతమున ఇట్లు చెప్పబడినది, "రామచంద్రునితోడ రాకలందు, పోకలందు కలిసి తిరిగిన వారు, అతనిని చూచినవారు, అతనిని అంటికొన్న వారు, ఆదియోగు లరుగు పరమగతి యగు కైవల్యము నందిరి." వేంకటేశ్వరునికి సంబంధించి ఇట్లు చెప్పుకొనవచ్చును, "ఈ స్వామిని భక్తితో చూచిన వారు, తలచిన వారు, సంకీర్తనము చేసినవారు ఆదియోగు లరుగు పరమగతి యగు కైవల్యము నందెదరు." ఇది అన్నమయ్య అనుభవమే. మరల పల్లవిలో కూర్చుకొన్నచో రాముడు – వేంకటేశ్వరుడు తారకబ్రహ్మము. ఇతడు మనకెంతో దగ్గరయిన వాడు. వ్యక్తులలో దగ్గర, దూరములున్నవి కాని స్వామి మనందరిలో మనమై యున్నవాడు. అంతకన్న మనకు దగ్గరెవరు? మనలోని అంతరాత్మయే రాముడుగాను, శ్రీవేంకటేశ్వరుడుగాను వెలసియున్నాడని అన్నమయ్య స్థాపించెను. రాముడు ఆత్మారాముడు గదా. ఈ సంకీర్తనము శ్రద్ధతో గానము చేయువారి వద్దకు, భక్తితో వినువారి వద్దకు అన్నమయ్య రాముని వేషమున శ్రీవేంకటేశ్వరుని తీసికొనివచ్చి చూపించుట నిస్సంశయము. ఇతనిని పైవిధముగా సంకీర్తనము చేయుచు, సంసార సాగరమును తరించి, మనమును బ్రహ్మమే యగుదుము గాక. ఈ సంకీర్తనకు మనలను దేవుడుగా తీర్చు మహిమ ఉన్నది.

* * *

15

4వ సం-343 **ఎన్నడు విజ్ఞానమిక** **శివరంజని**

ఎన్నడు విజ్ఞానమిక నాకు
విన్నపమిదె శ్రీవేంకటనాథా. ॥ పల్లవి ॥

పాసిన పాయవు బంధములు
ఆస దేహ మున్నన్నాళ్ళు
కోసిన తొలగవు కోరికలు
గాసిలి చిత్తము కలిగినన్నాళ్ళు. ॥ ఎన్నడు ॥

కొచ్చినఁ గొఱయవు కోపములు
గచ్చుల గుణములు గలనాళ్ళు
తచ్చిన తలగవు తహతహలు
రచ్చల విషయపు రతులన్నాళ్ళు. ॥ ఎన్నడు ॥

ఒకటి కొకటికిని ఒడబడవు
అకట శ్రీవేంకటాధిపుడ
సకలము నీవే శరణంటే యిక
వికటము లణగెను వేడుకనాళ్ళు. ॥ ఎన్నడు ॥

విజ్ఞానపు దారుల వెంట నడచువానికి ప్రతి యంశమను చెట్టు
వెనుక గర్వమను సర్పము చుట్టుకొని దాగియుండును.

టీక

గాసిలి = వేదనతో గూడిన, కొచ్చినను = కోసినను, కొరయవు = కొఱత తీరవు, గచ్చుల = కపటము తోడి, తచ్చిన = త్రవ్వినను, రచ్చల = గుంపుల.

పరిచయము

ఈ సంకీర్తనమున నరునిలోని కామక్రోధాది దుర్గుణములు తొలగక బాధించు విధమును అన్నమ్య ఆవేదనతో ప్రస్తావించుచున్నాడు. మహాత్ముడు గావున తనలో ఈ దుర్గుణములు లేకున్నను, నరుల ప్రతినిధిగా వీనిని గూర్చి ఆవేదన నొందుచు, వీనినుండి విముక్తికై శ్రీవేంకటేశ్వరుని శరణందుచున్నాడు. ఈ దుర్గుణములు ఎంత కాలము, ఏ కారణము వలన తొలగవో మొదటి రెండు చరణములందు సూచించు చున్నాడు. చివరి చరణమున వీనినుండి విముక్తికి, ఆనందప్రాప్తికి 'ప్రపత్తి' యను మార్గము నుపదేశించుచున్నాడు. ఇప్పుడు ఈ చరణములతో పల్లవి ననుసంధించి భావింపవలయును. కామక్రోధాదులున్నంత కాలము భగవంతుని ఎఱుక లభింప దనియు, ఆపై ఆ ఎఱుకను జీవితమున సమన్వయించుకొను సద్బుద్ధియు గలుగ దనియు స్పష్టీకరించుచున్నాడు. ఎల్లరకు ఇట్టి జ్ఞానమును, విజ్ఞానమును ప్రసాదింపు మని స్వామిని వేడుకొనుచున్నాడు.

పల్లవి యొక్క తాత్పర్యము

"నాకెప్పటికి విజ్ఞానము కలుగునో! ఓ వేంకటనాథ! దానిని ప్రసాదింపుమని వేడుకొనుచున్నాను."

వ్యాఖ్య

జ్ఞానము నుండి విజ్ఞానము సిద్ధించును. జ్ఞానమనగా తెలియువాడు, తెలియబడు నది, తెలియుట – ఈ మూడును ఒకటియైన తెలివి. అనగా తనతో గూడి ఎల్లరును స్వామియే అను అనుభవమే జ్ఞానము. ఇది పుస్తక పాండిత్యము వలన లభించునది గాదు. దేవుని యనుగ్రహము వలన, జీవుని శరణాగతి వలన కలుగును. ఇట్లు గలిగిన జ్ఞానమును లోకములోని ఇతర జీవులతో వ్యవహరించునపుడును, ఆయా పరిస్థితులలోను సద్వినియోగము చేయు తెలివినే విజ్ఞానమందురని తైత్తిరీయోపనిషత్తు తెలుపుచున్నది. ఇట్లు విజ్ఞానమనగా పాండిత్యమని అన్నమయ్య భావము గాదు. సాధుజీవనమును, దివ్యానందమును కలిగింపలేని పాండిత్యమునే విజ్ఞానమని భ్రమించువాడును, ఇట్టి పాండిత్యమునే కోరువాడును గాదు అన్నమయ్య. ఇతడు వివేకి. జ్ఞాన విజ్ఞానముల యెడ వేదర్షుల దృష్టి అన్నమయ్యది. క్రింది చరణములలో ప్రస్తావింపబడిన కామక్రోధాదు లున్నంత కాలము జ్ఞాన విజ్ఞానములు సిద్ధింపవు. శుష్కపాండిత్యము లభింపవచ్చును. ఇది తనకును, తోటివారికిని వినియోగపడునది గాదు. మనము పరిస్థితులలోను, పరిసరములందలి జీవులతోను వ్యవహరింపక తప్పదు. అట్లు వ్యవహరించునపుడు వానిపై అభిప్రాయములేర్పడి, కోరికలు, కోపము గలిగి సుఖదుఃఖముల ఆటుపోట్లకు గురికాక తప్పదు. వీనినుండి

విమోచనమునకు ఒకటే దారి. పరిస్థితులను, పరిసరములను, తోటి జీవులను, తనను కూడ అంతర్యామి యగు భగవంతుని స్వరూపులుగా దర్శించుట. దర్శించుట యనగా భావించుట మాత్రమే గాదు. అనుభూతి నొందుట. ఈ స్థితి గలిగిన వారికి ప్రత్యేకముగా కొందరిపైన, కొన్నిటిపైన మమకార వ్యామోహములు, మరి కొందరిపై విముఖత ఉండవు. వీరికి చేయదలచిన పనులనియు, చేయగోరిన పనులనియు సొంతముగా నుండవు. ఏమి చేయవలయునో, ఏమి చేయరాదో తెలియు వివేకము సిద్ధించును. ఆ వివేకము తన సొంత తెలివి వలన కలుగదు. అంతరాత్మయగు వెలుగుగా నెలకొనియున్న స్వామినుండి తెలియవచ్చును. వీరికి స్వీయ సంకల్పములని యుండవు. దేవుని సంకల్పమే వీరి బుద్ధియందు ప్రతిఫలించును. బుద్ధి స్వామికి శుద్ధముగా శరణందియున్నది గదా. ఇట్లు దేవుని సంకల్పములు తమ బ్రతుకులో కార్యరూపము దాల్చుటే విజ్ఞానమని అన్నమయ్య భావము. దీనిని ప్రసాదింపుమని అతడు స్వామిని మనసారా వేడుచున్నాడు. సొంతముగా ఎంత తపస్సుతోడి సాధన చేసినను దైవానుగ్రహము లేనిది జ్ఞాన విజ్ఞానములు కలుగవని శ్రీకృష్ణుడు గీతలో తెలిపెను. దైవానుగ్రహమను సూర్యరశ్మి ఎల్లరిపై ఒకే విధముగనే భాసించును. హృదయ కవాటములు తెఱచుటే శరణాగతి. ఇది గలవారి బ్రతుకు దైవానుగ్రహ జ్యోతిర్మయ మగును. ఆనందమయ మగును. స్వామిని అన్నమయ్య శ్రీవేంకటనాథుడని సంబోధించు చున్నాడు. 'శ్రీ' అనగా లక్ష్మీదేవి. ఈమెయే స్వామి యొక్క అనుగ్రహ రూపిణి. కావున 'శ్రీ' తో గూడిన వేంకటనాథునే వేడవలెను. ఇతడే కామక్రోధాదులను 'వేం' – అనగా పాపములను ఛేదించువాడు. 'ఈశ్వరా' అను పదమును గాక, అన్నమయ్య ఇచట 'నాథా' అను పదమును ప్రయోగించెను. 'నాథ' అనగా 'న–అథ'. ఇక ఇతడు గాక వేరు లేరని భావము. నాకు నీవే అండవు. విజ్ఞానమును ప్రసాదించుటలో నా బ్రతుకులోని పాపభావములను పెకలించుటలో నీవే నాకు అండవని అన్నమయ్య అనన్య శరణము పొందుచున్నాడు. ఇట్లు దేవుని వేడకుండ, తపో దాన జప యజ్ఞాదు లెన్ని చేసినను వ్యర్థములని అన్నమయ్య పరోక్షముగ మనలను హెచ్చరించుచున్నాడు. ఇట్టి వేడికోలే సంకీర్తనము. మిగిలిన సాధనలు జీవుని సొంత యునికితో, తెలివితో ప్రమేయము గలవి. సంకీర్తన మట్లుగాదు. ఇందు గాయకుని యొక్కయు, శ్రోత యొక్కయు తెలివి, ఉనికి స్వామిలో కరగిపోవును. ప్రపత్తికిది ఉత్తమ సాధనము.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"ఆశలతో గూడిన దేహమున్నన్ని దినములు, బంధము లెంత తొలగించుకొన యత్నించినను తొలగవు. మనస్సున వేదన ఉన్నన్నాళ్లు, ఎంత కోయ యత్నించినను కోరికలు తొలగవు."

వ్యాఖ్య

బంధములనగా మనసును బంధించునవి. చిక్కులలో పడవేయునవి. ఫలానిది కావలయునని కోరిక నెఱవేరినచో, ఇంకను ఏదియో కావలె నన్పించును. తృప్తి యుండదు. మొదట కోరిక నెఱవేరనిచో ఎట్లును దుఃఖమే మిగులును. ఒకరిపై రాగము, వేరొకరిపై ద్వేషము కూడ మనస్సును అశాంతికి

గురిచేయును. భార్య, పిల్లలు మున్నగు వారిపై వ్యామోహము వారి బాగోగులతోడి చింతనతో బంధించును. వారిని గూర్చి యుండవలసినది కర్తవ్యపాలనమే గాని వ్యామోహము గాదు. ఎవరి కర్మలోను మనము వ్రేలు పెట్టరాదు. కర్తవ్యము నాచరించుటే మన వంతు. ఫలితమును ఆశించితిమా మనస్సు బంధనములో పడును. ఇట్లు మనస్సుకు అశాంతిని కలిగించి, చిక్కులలో పడవేయునవన్నియు బంధములే. ఇట్టి బంధములు మనకు బయట లేవు. భార్య, పిల్లలు, ఇతరులనబడు వారును, పరిస్థితులును బంధించుట జరుగదు. వానిపై జీవునికి గల అభిప్రాయములే బంధించును. ఇట్లు బంధములు మనలోనే యున్నవి. దేహము చుట్టు ఆశ లల్లుకొనుచుండును. దేహమునకు వలసిన ఆకలి, దప్పిక తీరుట, వస్త్రాదులను అత్యంతావశ్యకముల యెడనే గాక విలాస భోగాదుల యెడ మనసు తిరుగుచుండును. దేహము సుఖమును కోరదు. అవసరము చాలును. జీవుడే దేహ సుఖమును ఆశించి, అది ఎప్పటికిని తీరక దుఃఖితుడగుచున్నాడు. దేహసంబంధులగు వారియెడల మన కర్తవ్యమును అంతర్యామికి సమర్పితమగు ఆరాధనగా నిర్వర్తించుట గాక, దేహ సంబంధములు శాశ్వతములని భ్రమించినచో, వారి చుట్టును మన ఆశ లల్లుకొని, అవి ముండ్లపొదలై మనకు గ్రుచ్చుకొనును. దేహ సంబంధములు అశాశ్వతములు, అసత్యములు. దేహ సుఖములు కూడ అసత్యములు, ఎండమావిలోని నీరు వంటివి. ఇవి అడుగు లేని పళ్లెము వంటివి. ఇందు ఎంతగా నీటిని పోసినను కారిపోవుటయే గాని నిలబడదు. వివిధ దేహములు ధరించిన ఒకే ఒక అంతర్యామి యగు స్వామి యొక్కడే సత్యము. ఆతనితోడి అనుబంధమే సత్యము. ఆతని యనుభూతి నిజమయిన తృప్తి. కావున ఆశలల్లుకొన్న దేహమున్నంత కాలము ఆశలు నెఱవేరినట్లు కనపడినను, నెఱవేరకున్నను గూడ మనలను బంధింపక తప్పదని అన్నమయ్య హెచ్చరిక. దేహమనగా దహింపబడునది యని యర్థము. ఇట్లు కాలిపోవు దేహమునకు సంబంధించిన భోగములను గూర్చిన ఆశలు శాశ్వత సుఖము నెట్లు ఈయగలవు? ఆశల వలన గలుగు బంధనములను మనముగా తొలగించుకొనుటకు ప్రయత్నించినను, అవి తొలగవని అన్నమయ్య ఘంటాపథముగా ఘోషించుచున్నాడు. వస్తు భోగములు, జీవులతోడి బంధములు, వాని రూపములలోని అంతర్యామి యగు శ్రీవేంకటనాథుని సేవ వలన కలుగు దివ్యానందము వలననే తొలగును. దేహ బంధములలో సుఖము, రుచి ఉన్నదని జీవుడు పొరపడుచుండును. అన్నిటికన్న శ్రేష్ఠము, సత్యము నయిన అంతర్యామి సేవలోనే సుఖము, రుచి యున్నవి. ఇందు మరగిన వానిలో దేహ బంధములవియే జారిపోవును. మనకన్న కష్టములలో నున్నవారిని సేవించుటలోని ఆనందము ననుభవించుటలో, మన కష్టములు కష్టము లుగా కన్పింపవు. దుఃఖమును బంధమును కల్గింపవు. దీన సేవయే స్వామి సేవ. అన్నమయ్య హెచ్చరిక, ఉపదేశము ఉపనిషత్తుల యొక్క, గీత యొక్క, ఋషుల యొక్క, తన అనుభవముల యొక్క సారము.

చిత్తమనగా ఇంద్రియముల ద్వారమున బయటి విషయములందు వర్తించు మనస్సు. కంటి ద్వారమున మనస్సు ఫలానిది చూడగోరును. చెవి ద్వారమున కొన్నిటిని వినగోరును. నాలుక ద్వారమున భుజింప గోరును. చర్మము ద్వారమున స్త్రీ పురుష స్పర్శలోని సుఖభ్రమను గోరును. ఇట్లు ఇతర విషయములందు

తమకముతో తగులుకొను మనస్సుకు వేదన తప్పదు. తమకము, ఫలానిది పొందగోరు కుతూహలము వేదన కలిగింపక మానవు. ఇట్టి తమకము, వేదనముతోడి చిత్త మున్నంత కాలము ఎంతగా కోయ ప్రయత్నించినను కోరికలు తొలగవు. చీకటితో ఎంతసేపు పోరాడినను, అది తొలగదు. వెలుగులో జీవించుటయే కర్తవ్యము. కోరికలు కోరినను, వానిని త్రోసివేయ కృషి చేసినను వానిని ధ్యానించుటే యగును గదా. ఇట్లు కోరికలను తొలగింప యత్నించుటలో వాని బలము పెరుగును. వానినుండి విముక్తి ఎన్నటికిని లభింపదు. కోరికలు పుట్టునది చిత్తమున గదా. కోరికలను తొలగింప యత్నించునదియు చిత్తమే. ఇక చిత్తముతో చిత్తము పోరాడుట ఎట్టిది? ఒక చేతితో వేరొక చేయి పోరాడుట వంటిది. ఇది హఠయోగ మార్గము. సరిగానిది. ఇట్టి వ్యర్థ ప్రయత్నము వలన ఆందోళన, రక్తపీడనము పెరుగును. కోరికలను ఆపుకొన యత్నించుటలో కొన్ని గ్రంథులు చెడిపోయి నివారణకు లొంగని తీవ్ర వ్యాధు లేర్పడును. మరి మార్గమేది? కోరికలన్నిటికిని అవధి యగు సర్వాంతర్యామి యగు స్వామిని స్మరించి సేవించుటే. కోరికలను ఆపుకొనుటయు, తీర్చుకొన యత్నించుటయు గాక, కోరికను దేవుని స్మరణము వైపునను, సేవ వైపునను మరల్చ వలెను. బయటి జగత్తులోని ఏ విషయములపై కోరిక కలుగుచున్నదో, వానిని దేవునిగా ధ్యానించుట మంచి పద్ధతి. మనస్సునందు దేవుని నిలుపు యత్నించుట గాక, మనస్సునే దేవుని రూపముగ ధ్యానించుట వలన మనసు మాయమగును. కోరికలు నశించును. అన్నమయ్య ఉద్బోధ ఇది. ఇదియే రాజయోగము. చివరి చరణముతో కలుపుకొనిన గాని ఈ యంశము అవగతము గాదు. మొదటి రెండు చరణములందు కామక్రోధాది వికారము లెట్లు తొలగవో చెప్పెను. చివరి చరణము నందు ఎట్లు తొలగునో ప్రబోధించెను. ముందుగా దేహమును, ఆపై దానితో ముడిపెట్టుకొనిన చిత్తమును ప్రస్తావించెను.

2వ చరణము యొక్క తాత్పర్యము

"కపటపు గుణములున్నంత కాలము, కోసినను కోపములు తీరవు. విషయముల గుంపులందు సుఖాసక్తి యున్నంత కాలము, త్రవ్వినను తహతహలు తొలగవు."

వ్యాఖ్య

కపటపు గుణములనగా పైకి వినయమును అభినయించుచు, లోన అహంభావ మును, అతిశయమును కలిగియుండుట; పైకి ప్రేమ నటించుచు లోపల అసూయ, లోభము కలిగియుండుట. ఈ లక్షణములు గలవాడు ఎంతగా వినయమును కొంతకాలము నటించినను, తనలో దాగిన స్వాతిశయమును, మిగిలిన వారికన్న తా నధికుడనను అహంభావమును ప్రదర్శింపకపోడు. అతిశయము, అహంభావముల నుండి కోపము జనించును. తనను కీర్తించని వారిపై కోపము కలుగును. గౌరవమును కోరినవాడే కపట గుణము గలవాడు. ఇతనికి తప్పక తనను గౌరవింపని వారిపై కోపము కలుగును. ధనము, అధికారము, కీర్తి, పదవి, పాండిత్యము పెరిగిన కొలది దుర్మతికి మదము, దానితోబాటు కోపము పెరుగుచుండునని విదురుడు భారతమున తెలిపెను. మరియు విషయములను తలచిన కొలది, వానియందు మనసు తగులుకొనును. వానిని పొందవలెనని కోరిక కలుగును. ఆ కోరిక తీరనపుడు కోపము కలుగును. తన కోరిక తీరకుండుటకు,

తన చిక్కులకు ఎవరో కారణములని పొరపడి వారిపై దురభిప్రాయములు ఏర్పడి, వారిపై కోపము మనసులో కలుగును. తనకంటె అధికులయిన వారిపై కోపమును ప్రదర్శింపలేకపోవచ్చును. తక్కువ వారిపై కోపమును ప్రదర్శించి వారికి కీడు చేయుట, అనారోగ్యమును కొనితెచ్చుకొనుట జరుగును. కొందరు కోపమున ఒడలు తెలియనివారు ఎవరిని కోపింపలేక తనపై తానే కోపించుట జరుగుటకద్దు. ఇతరుల బాగును ఓర్వలేనివారు, ధనాశ మిక్కుట మయిన వారు గూడ లోపలనో, బయటకో కలిగియుండక తప్పదు. ఒరు లెవరో తనకు శత్రువులను భావమే కోపముగా మారి తనకు శత్రువై పీడించును. కపటపు గుణములయిన అహంభావము, అతిశయము, అసూయ ఉన్నంత కాలము, ఎంతగా తొలగించుకొన యత్నించినను కోపము తీరదు. కొందరిపై కోపమని యాగదు. కోపమటులే ఎందరిపైననో కొనసాగును. తన కోపమునకు గురియైన వారికి ఒక్కొక్కడు హానిచేసి, పగను, క్రౌర్యమును నెఱపును. రంభను పొందినను కామము తీరదనియు, లోకముల నన్నిటిని మ్రింగినను కోపము చల్లారదనియు ధూర్జటి హెచ్చరించెను. తనలో కోపముండరాదని తలంచిన కొలది దాని బలము పెరుగునే గాని, తరుగదు. కావున జీవులలో, పరిస్థితులలో దేవుడే యున్నాడను భావముతో పరమ ప్రేమతో పరిమళింప జేసికొనిన కొలది కోపము మనకు తెలియకుండగనే మాయమగు చుండును.

ఈ చరణమున అన్నమయ్య "రతులు" అను పదమును సుఖాసక్తులు అను అర్థమున ప్రయోగించెను. ఐహిక విషయ సుఖభోగములందు ఆసక్తులు గుంపులు గుంపులై ఒకదాని వెంట నొకటి మనసును వెంబడించుచుండగా, ఇక ఈ సుఖాసక్తి ఎప్పుడు తీరునా అను తహతహ, తీరుట కొరకై కుతూహలము, తీరునో లేదో అను ఆందోళన ఆగవు. సుఖాసక్తి యున్నంత కాలము, అది నెరవేరుటకయిన తహతహలును కొనసాగును. అంతర్యామియగు దేవుని సంస్మరణ, సంకీర్తన, సేవలలోని తీయదనపు రుచి అను సాగరమున మునిగినప్పుడే ఈ తహతహలు తీరును. స్వామి సంకీర్తనము, సేవ తీయదనము కన్న తీయనివి గదా. తోటివారి క్షేమమునకై ఆసక్తి పెరిగినపుడు, తన సుఖమునెడ ఆసక్తి తరుగును. ఏలననగా తోటివారి రూపములలో నున్నది ఆనందస్వరూపుడగు స్వామియే గదా. ఇట్లు మొత్తముమీద అన్నమయ్య సందేశమిది. కోపము, తమకములు తాముగా వైదొలగవు. ప్రేమతోడి ఆనందము వలన మాత్రమే ఇవి వైదొలగును.

3వ చరణము యొక్క తాత్పర్యము

"కొందరు ఐహిక సుఖములందాసక్తులు విడువకుండగనే, ఆధ్యాత్మిక సుఖమును కోరుచుందురు. ఇవి రెండును ఒకదానితో నొకటి పొసగుట స్వామి సమ్మతింపడు. అక్కటా! జగమును పాలించు శ్రీవేంకటేశ్వరా! సకలము నీవేయని శరణన్నచో, ఇక ఆనందము ఎల్లకాలము నెలకొని వికారము లణగును."

వ్యాఖ్య

పై చరణములందు అన్నమయ్య వరుసగా కామ క్రోధముల బలమును ప్రస్తా వించెను. మొదటిది ఆకర్షణ. రెండవది వికర్షణ. ఇవి బంధ కారణములు. చీకటి ముసుర్లు. వీనినుండి బయటపడు వెలుగుదారిని

అన్నమయ్య మూడవ చరణమున ప్రస్తావించుచున్నాడు. సమస్యలను మాత్రము ఎత్తిచూపి, పరిష్కారములను చెప్పలేనిది ప్రస్తుత కాలమున విప్లవకవిత్వ మనబడుచున్నది. అన్నమయ్యది సాంస్కృతిక విప్లవ కవిత్వము. వేదనలను, బాధలను మాత్రము చక్కగా కవిత్వములో పొదుగుట పాశ్చాత్య సాహితీ సంప్రదాయము. కాని పరిష్కారములను సూచించుట అందు జరుగలేదు. భారతీయ సాహితీ స్రష్టలగు వాల్మీకి వ్యాసాది ఋషుల కవిత్వములో సార్వకాలిక సమస్యలు, పరిష్కారములు గూడ గలవు. ఈ కోవకు చెందినదే అన్నమయ్య కవిత్వము. కొందరు ఐహిక భోగములను, ఆధ్యాత్మికానందమును రెంటిని కోరుచుందురు. కాని ఈ రెండు కోరికలకు ఒకదానితో నొకటి పొసగదు. ఐహిక భోగములందు ఆసక్తి గలవానికి, కామ క్రోధ లోభములు గలవానికి భగవదానందము కలలో గూడ కలుగనేరదు. గడపకు అటు ఒక కాలు, ఇటు ఒక కాలు పెట్టి దేవుని తన లౌక్యముతో వంచింపజూచుట అవివేకము. స్వామి దీనిని సమ్మతింపడు. భగవ దానందానుభూతి కావలెనా, ఐహిక భోగాసక్తి, కామ క్రోధములు వీడవలసినదే. అంతమాత్రముచేత భగవద్భక్తునకు ఐహిక సుఖములు భగవత్ప్రసాదితములై కలిగినచో అతడు కాదనడు. ఉదాహరణకు ఆరోగ్యకరమైన విందుభోజనము, హంసతూలికా శయ్య లభించినచో వైరాగ్యము పేర కాదని బిగిసిపోడు. అట్లని వానియందు అతని మనస్సు తగులుకొనదు. భక్తుని మనసు వానియందును దేవునే దర్శించును. సామాన్య భోజనము దొరకినను, నేలపై పరుండవలసి వచ్చినను అతడు హాయిగనే యుండును. వీనియందును అతనికి దైవదర్శనమే. భక్తుడానందించునది స్వామిని స్మరించుట, సంకీర్తించుట, అంతర్యామిగా సేవించుటనే. కామ క్రోధ లోభ పీడితులై చిక్కులలో పడి కొట్టుమిట్టాడే జీవికి ఎప్పటికయినను దేవుడే శరణ్యము. ఈ యంశమును నరుడు మొదట వింతగా తలంచును. పెద్దలు చెప్పినను వీరు ఐహిక భోగములు సాధింపలేని అసమర్థులని కొట్టిపారవేయును. ఈ విషయములు తెలుపుటకే అన్నమయ్య 'అకట' అని ప్రయోగించెను. మరియు సాంసారిక బంధముల వలని బాధలు పడలేక, 'అయ్యో' ఇక నీవే శరణని స్వామిని వేడక తప్పదు. స్వామి లక్ష్మీదేవితో గూడుట వలన, శరణన్న వారిని దయతో కాపాడి, వారి పాపవాసనలను తానుగా తొలగించి పాలించును. వారి వెన్నెముక అను వేంకటాద్రిపై నెలకొని, హృదయమను గర్భాలయమున వెలుగును. అన్నమయ్య దృష్టిలో 'శరణాగతి' అనగా నేమి? 'సకలము నీవే' యని స్వామిని దర్శించుటే. అంతియేగాని మాటిమాటికి స్వామి అర్చామూర్తికో, విగ్రహములకో, పటములకో, గురువుల పాదములకో నమస్కరించుట చాలదు. ఇది దోషము గాదు గాని పరిమితమైన ప్రపత్తి ఇది. పూర్ణ శరణాగతి యనగా అన్ని వస్తువులు, అందరు జీవులు, అన్ని పరిస్థితులు, విశ్వమంతయు విష్ణుమయముగా దర్శనమొంది చివరకు 'తన' మనస్సు స్థానమునను స్వామి నిలుచుటే. బలములో, ధనములో, చదువులో, పదవిలో, కులములో తనకన్న తక్కువ వాడును స్వామిగా అనుభూతి నందుటే శరణాగతికి అగ్నిపరీక్ష. కావుననే అన్నమయ్య 'సకలము' అని వాడెను. వివిధ కళలతో గూడిన జగత్తు అనియు ఈ పదమున కర్థము. కళలనగా ఇచట దేవుని వైభవములే. ఇట్లు స్వామిని విశ్వరూపుడుగా దర్శించి, సేవించుటలో మనస్సు అదృశ్యమగును. దాని స్థానమున భగవానుడే నిలుచును. భగవానుడనగా అఖండమగు ఆనందమే. దీనినే అన్నమయ్య తెలుగులో సొబగుగా 'వేడుక' అని తెలిపెను. వేడుక అనగా

వేడికోలు అనియు, ఉత్సవ మనియు రెండర్థములు గలవు. 'సకలము నీవే' అని స్వామిని వేడుకొన్నచో, స్వామి నిత్యోత్సవ స్వరూపుడై మనలో వెలుగును విరజిమ్మును. అన్ని జీవన పరిస్థితులలోను స్వామిని సకలమయిన వాడుగా దర్శించి శరణందిన వానికి ఎపుడును ఉత్సవమే. ఇట్లు స్వామిని వేడుకొన్న క్షణమెల్ల వేడుకయే. కావుననే ఈ భావమునకు సంకేతముగా శ్రీవేంకటేశ్వరునకు నిత్యోత్సవము ఏర్పాటయినది. ఉత్సవ మాయనకు ఎట్లును, ఎపుడును ఉండును. స్వామి దానిని మనకు ప్రసాదించును. కనుక స్వామి ఉత్సవము మనకుత్సవము. ఇక ఉండకూడని వికారములగు కామ క్రోధ లోభాదులు మటుమాయ మగును. మానవుని సహజ స్థితి దివ్యత్వము. కారణము, ప్రతి జీవుడు దేవుని యంశయే. తన సహజ దివ్యగుణములగు ప్రేమ, కరుణ, తృప్తి, శాంతి, ఓరిమి, ధైర్యములకు బదులుగా వికారములగు కామ క్రోధాదులు విష్ణు మాయా ప్రభావమున ఏర్పడును. ఈ వికార భావములు మనకు ఎవరిపై, వేనిపై ఏర్పడుచున్నవో వారిని గూడ స్వామిగా దర్శించినచో ఇక వికారములకు తావు లేదు. వికారములు అనగా సహజ స్థితి నుండి మార్పులు. అసహజములు. విష్ణు మాయ వలన ఏర్పడిన వికారములను విష్ణుమాయారూపిణి యగు శ్రీదేవియే తొలగించి, తన కుమారులగు భక్తులను స్వామి సాన్నిధ్యమునకు చేర్చును. మానవునిలో మరల సహజ దివ్యత్వము ప్రకాశించును. దీపమునకు పట్టిన మసి తొలగగనే, లోన సహజముగా నున్న జ్యోతి వెలుగును గదా. అన్నమయ్య ఈ చరణమునందు మానవుడు సహజ దివ్య డనియు, దేవు డంతర్యామి యని దర్శించుటే పూర్ణశరణాగతి యనియు, దానివలన మాత్రమే వికార గుణములు తొలగి సహజ దివ్యగుణములు శోభిల్లుననియు స్పష్టముగా ప్రతిపాదించెను. ఈ స్థితిలో ఇక స్వామినుండియే విజ్ఞాన వివేకములు భక్తున కనుగ్రహింపబడును.

* * *

16

1వ సం-292 **ఏ కులజుడేమి** భూపాలము

ఏ కులజుడేమి యెవ్వడైననేమి
ఆకడ నాతడె హరి నెఱిగినవాడు. ॥ పల్లవి ॥

పరగిన సత్యసంపన్నుడైనవాడే
పరనిందసేయ తత్పరుడు కానివాడు
అరుదైన భూతదయానిధి యగువాడే
పరులు తానేయని భావించువాడు. ॥ ఏ కులజు ॥

నిర్మలుడై యాత్మనియతి గలుగువాడే
ధర్మతత్పరబుద్ధి తగిలినవాడు
కర్మమార్గములు గడవనివాడే
మర్మమై హరిభక్తి మఱవనివాడు. ॥ ఏ కులజు ॥

జగతిపై హితముగా చరియించువాడే
పగలేక మతిలోన బ్రదికినవాడు
తెగి సకలము నాత్మ తెలిసినవాడే
తగిలి వేంకటేశు దాసుడైనవాడు. ॥ ఏ కులజు ॥

నిన్ను పొగడు మాటలకు లోబడితివా, జ్ఞానివి కానేరవు.
అజ్ఞానివి మాత్రమే.

టీక

ఆకడన్ = ఆ దిక్కున, ప్రదేశమున; పరగిన = ప్రసిద్ధిగాంచిన, కడవని= విడువని, తెగి = స్పష్టముగా.

పరిచయము

ఈ సంకీర్తనము అన్నమయ్య యొక్క విశ్వవిశాల మానవ హృదయమును పట్టి చూపును. అతని ఆత్మదర్శనానుభూతి కిది అద్దము పట్టును. తాను ఆచరించిన సాధననే ఆతడు సంఘమునకు ఉద్బోధించెను. సూటిగా, స్పష్టముగా, సరళముగా తనకు స్వామినుండి తోచిన ధర్మమును సంకీర్తనమున పొదుగుటలో అన్నమయ్య దిట్ట. పాఠకుల, శ్రోతల గుండెలను తట్టి మేలుకొలుపు భావములిందు గలవు. హరిభక్తి గలవాడు ఏ కులము వాడయినను, ఎవడయినను ధన్యుడే, పూజనీయుడే. హరిభక్తి యనగా సత్యపాలనము, భూతదయ, ఆత్మనిగ్రహము, ధర్మబుద్ధి, నిష్కామ సేవ, లోకహితార్థమయిన ఆచరణము, అంతయు 'నేను'గా అనుభవము, దాస్య భావము కల్గియుండుటే యని విస్ఫుటము గావించిన వాడన్నమయ్య. పూజాదులు భక్తిని పొందుటకు సామగ్రియే గాని భక్తి క్రిందకు రావు అని నారదుడు తన భక్తి సూత్రములలో చెప్పిన యంశమును అన్నమయ్య తేటతెల్లము గావించెను. బ్రతుకులోని ఆచరణకు, శీలమునకు ఆతడు సర్వోత్తమ ప్రాధాన్యము నొసగెను. గీతలో పన్నెండవ అధ్యాయమున కృష్ణుడు భక్తుని గూర్చి తెలిపిన నిర్వచనములకు అన్నమయ్య యొక్క ఈ సంకీర్తనము యొక సామభాష్యము. పల్లవిలో తెలుపబడిన హరిభక్తుడనగా ఎట్టివాడో మూడు చరణములందు అన్నమయ్య చక్కగా వివరించెను. చరణముల నాకళింపు చేసికొననిది పల్లవి అవగతము గాదు. చరణములందలి రెండేసి పాదము లను కలుపుకొని, పల్లవితో అనుసంధింపవలెను. అన్నమయ్య ఉద్బోధ, పండితుని ప్రసంగము వంటిది గాక, ఋషుల బోధ వలె స్ఫూర్తిదాయకము. దీనిని చదివిన వాడు, పాడినవాడు, వినినవాడు, దీనిని ఆచరణలో పెట్టకుండ ఉండజాలడు. తన జీవితమున ప్రతి యడుగున అన్నమయ్య యొక్క ఈ సంకీర్తన గుర్తుకురాక తప్పదు. ఇది వెలుగుబాట.

పల్లవి యొక్క తాత్పర్యము

"ఏ కులమునందు పుట్టిన వాడయినను, ఎవడయినను ఆ దిక్కున, ప్రదేశమున హరి నెఱిగినవాడు ఆతడే. అనగా అసలయిన మానవుడు. ధన్యుడు."

వ్యాఖ్య

కులమనగా వంశమనియు, పదివేల మంది విద్యార్థుల గుంపు అనియు ప్రాచీ నార్థములు. కాని అన్నమయ్య నాటికి కులమనగా జన్మను బట్టి ఏర్పడునదిగా వాడుకలోనికి వచ్చినది. వేదకాలమున వర్ణములున్నవి. కులములు లేవు. వర్ణములు మానవుడు చేపట్టిన వృత్తిపైనను, అభినివేశముల పైనను ఏర్పడునవి. ఏ కులమున పుట్టినను బ్రహ్మవిద్యను నేర్చుట కర్హుడే. తాను నేర్చి, నేర్పువాడు బ్రాహ్మణుడే. నేర్చుటకు గల ఒకే ఒక అర్హత నేర్చుకొనవలయునను అభిలాషయే. దానిని ప్రేరేపించు నది లోనున్న స్వామియే. ఈ ప్రేరణశక్తినే గాయత్రి అందురు. హరిని ఎఱిగినవాడు ఏ కులము వాడయినను, ఎవడయినను

అక్కడ అనగా ఆ దిక్కున, ఆ ప్రదేశమున ధన్యుడే. సృష్టి కతీతమైన పరబ్రహ్మమే నారాయణుడు. ఆతడే సృష్టిలో అంతర్యామియై దిగివచ్చునపుడు 'హరి' యని పేర్కొనబడును. విశ్వాంతర్యామి యగు హరిని ఎఱుగుట అనగా తెలివితో భావించుట గాదు. 'ఎఱుగుట' అనగా అనుభవములో దర్శించుట. 'ఎఱుక' అను తెనుగు మాటలో దాగిన ఈ విశిష్టార్థమునే అన్నమయ్య ఉద్దేశించెను. పోతనయు ప్రహ్లాద చరితలో 'ఆత్మలో నెఱుక' యని ప్రయోగించెను. ఆ దిక్కు, ఆ ప్రదేశమనగా నేమి? మన ఊహకందు దానిని ఈ దిక్కు, ఈ ప్రదేశమందురు. మన యూహకందని దానిని ఆ దిక్కు, ఆ ప్రదేశము అందురు. ఊహకందునది భౌతిక జగత్తు, మరియు భూమియు. ఊహకందనిది ఆత్మయు, ఆకాశమును. ఆకాశములో భూమియు నొక భాగమే. ఆత్మలో బుద్ధి, మనస్సు మున్నగునవి భాగములే. కావున ఆకడను హరి నెఱిగిన వాడనగా నేల, నింగి అంతయు హరియే యనియు, అంతయు ఆత్మ యగు హరితో నిండినవనియు అనుభవమున దర్శించు వాడని యర్థము. ఇట్టివాడు ఏ కులము వాడయినను ధన్యుడే, పూజనీయుడే. సర్వాంతర్యామిగ హరిని అనుభూతి నొందనివాడు బ్రాహ్మణ కులమున పుట్టినను అతని పుట్టుక సార్థకము గాదు. ఇట్టి యనుభూతి నొందినవాడు తక్కువ కులమున పుట్టినను ధన్యుడే. బ్రాహ్మణుడే. నామదేవుడు, నందనారు, తిరుప్పాణ్ ఆళ్వారు మున్నగువారీ యుగమున తక్కువ కులము వారైనను హరిభక్తులై పూజ్యులైరి. పాండురంగాలయములోనికి రానీయకుండ అర్చకులు నామదేవుని నిరోధించిరి. అతడు గుడి వెనుకకు వెళ్ళెను. అపుడు పాండురంగడే ఆలయమును వెనుకకు మరల్చి, తన భక్తున కెదురుగా వెలసెను. ఇక తిరుప్పాణ్ ఆళ్వారు గిరిజనులచే పెంచబడినవాడు. అతడు శ్రీరంగని గూర్చి సంకీర్తనలు గావించుచు ఆ మాధుర్యమున మునిగినవాడు. శ్రీరంగడు, అర్చకుడయిన లోకసారంగమునిని తన భుజములపై తిరుప్పాణ్ ఆళ్వారును మోసికొనుచు గుడిలోనికి తనవద్దకు తెమ్మని యాదేశించెను. ఇట్లు తిరుప్పాణ్, మునివాహనుడను ప్రసిద్ధి నొందెను. స్వామిలో ఐక్యమయ్యెను. రామానుజులవారు కుమ్మరివాడయిన భక్తునిపై ప్రేమతో భార్యను త్యజించిరి. అన్నమయ్య హరిభక్తుల పరిధిని కులముల హద్దులను గూడ దాటించెను. 'ఎవ్వడైననేమి' అని ప్రశ్నించుటలో ఎట్టి హద్దులు కూడ హరిభక్తికి లేవని స్పష్టము గావించెను. ఆహార వ్యవహారములు, మతము, స్త్రీ పురుష భేదము, వృత్తి, రంగు, ప్రాంతము, ధనము, జాతి, దేశము, భాష, వర్గము, నరుడు, జంతువు, పక్షి అను భేదము మున్నగు ఎట్టి ఎల్లలతోను ప్రమేయము లేక ఎవడయినను ప్రేమింపదగినవాడే, హరి నెఱిగినచో పూజ్యుడే, ధన్యుడే. ఏనుగు, సాలెపురుగు, పాము, చెంచు కూడ దేవుని భక్తితో సేవించి ముక్తినందెను గదా! వేంకటేశ్వరుడు కుమ్మరివాడగు తిరువనంబిని కరుణించెను గదా! ఎవ్వడయిన నేమి యనుటలో చరాచర జగత్తులోని సజీవులు, నిర్జీవులు, దేవదానవ నరాదు లెల్లరు ఇమిడిపోయిరి. దైత్యవంశీయులగు ప్రహ్లాద విభీషణులు కూడ స్వామికి పరమభక్తులై, లోకపూజ్యులైరి. ప్రహ్లాదుడు భక్తుల వరుసలో ప్రథమ స్థానము నొందెను. ఎవ్వడైన నేమి యనుటలో అనాగరిక జాతులు కూడ చేరిరి. వీరును హరిభక్తులగుటలో అభ్యంతరము, వింత లేవు. అట్టిచో వీరును స్వామికి సన్నిహితులు, మనకు పూజ్యులే. భాగవతము ద్వితీయ స్కంధమున ఈ యంశము తెలుపబడినది. అనాగరిక జాతులకు చెందిన గుహుడు, శబరి, పక్షి యగు జటాయువు నిర్మల హృదయులై శ్రీరాముని సేవించి, స్వామి సాన్నిధ్యమును, ముక్తిని

పొందిరి. చెంచితలు, బోయతలును శ్రీకృష్ణుని నిర్మలప్రేమతో సేవించి, గోపికల కన్నను స్వామికి దగ్గరై ఆతనితో ఆడిరి. ఇంతకు పూర్వము మిక్కిలిగా పాపములు చేసినవాడు గూడ, ఆపై పశ్చాత్తప్తుడై అంతయు విష్ణువే అని సేవించినచో ఆతడు భక్తుడగు సజ్జనుడే అనియు, ఆతడు తనయందే నిలిచియుండు ననియు శ్రీకృష్ణుడు గీతలో చెప్పెను. ఇట్లు అన్నమయ్య శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వంటి అవతారమూర్తుల ఒరవడిలో 'ఎవ్వడైననేమి?' అని సర్వులను, సర్వమును ఇమిడ్చెను. శరీర రక్తమును బట్టి వైద్యుడు జాతి నిర్ణయము చేయజాలడు గదా! ఇక 'ఆత్మ' విషయమునకు సంబంధించి, ప్రతివాడును తనను గూర్చి తాను 'నేను, తాను' అనియే భావించును. అందరిలోని ఈ 'నేను, తానే' ఆత్మయగు హరి. దీని ననుసరించియే అన్నమయ్య 'ఎవ్వడైననేమి' అను ప్రశ్నార్థకమును ప్రయోగించెను. ఎవ్వడయినను హరి యొక్క రూపమే గదా! ప్రశ్నార్థక ప్రయోగము విలక్షణము. ఈ ప్రశ్నకు సమాధానము దానియందే దాగియున్నది. ఎవ్వడయినను ఒకటే యనియు, శ్రీహరిని చేరుట కర్హుడే యనియు. ఇట్టి ప్రశ్నను ఆంగ్ల భాషలో 'Rhetorical Question' అందురు. ఇట్లు ఎల్లరిని ఒకటిగా అనురాగముతోడి అనుభూతితో తన యక్కున జేర్చి, తన యెదలో వారికి స్వామి వలెనే స్థానము నొసగిన అన్నమయ్య విశ్వవిశాల దృష్టి స్తుతిపాత్రము, అనుసరణీయము. అతని హృదయమే విశ్వము. ఇతని అనురాగము ఆకాశమంత విశాలము. ఇట్టివాడు తెనుగువాడగుట, తెనుగువారి ధన్యత. ఏలననగా అతని సంకీర్తనల నానందించి, ఆతని ననుసరించు భాగ్యము వారికి కలుగుటయే. ఈ పల్లవి ఇతనిని ప్రవక్తల ప్రక్కన నిలబెట్టినది. ఇక హరి నెఱిగిన వాని లక్షణములు, ప్రవర్తన ఎట్లుండునో అన్నమయ్య క్రింది చరణములలో నిరూపించుచున్నాడు. ఈ లక్షణములు గలవాడే హరి నెఱిగినవాడు. హరిభక్తి వేషధారణలో, నామధారణలో మాత్రమే లేదు.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"సత్యమను సంపద గలవాడుగా ప్రసిద్ధి నొందినవాడే ఇతరులను నిందించుటలో ఆసక్తి లేనివాడు. జీవులయందు అరుదైన దయకు గనియగు వాడే, ఇతరులు తానే యని భావించువాడు. ఇతడే హరి నెఱిగినవాడు."

వ్యాఖ్య

సత్యపాలన మనగా అబద్ధమాడక, వాస్తవమును చెప్పుటే గాదు, ఆడినమాట తప్పకుండుటయు. జగత్తులోని విషయములన్నియు క్రిందిస్థాయి సత్యములు. అంతర్యామి యగు స్వామియే పరమసత్యము. అట్టి అంతర్యామిని దర్శించి, మాట లాడుటయే సత్యపాలనము. ఇదియే యథార్థమయిన సంపద. తాను సత్యవాక్కును పాటించువాడనని డప్పు వాయించుకొననక్కఱలేదు. అయినను ఫలానావాడు సత్యమునే పాలించునని పదిమందికి తెలియునట్లు ప్రవర్తింపవలెను. ఇందువలన చెడు పనులు చేయువారు, అబద్ధమాడువారు మన జోలికి రారు. ఇతరులనబడు వారి రూపమున వర్తించుచున్నది పరమాత్మయే. ఇతరులు అనువారు సత్యము వలె అనిపించునే గాని, సత్యమేమి? వారి రూపములలో వర్తించుచున్న

పరమాత్మయే. కావున పరమ సత్యమయిన పరమాత్మను ఇతరులలో దర్శించువాడు, వారిని నిందించుట యందు ఆసక్తి కలిగియుండడు. ఇతరులలోని సద్గుణములను శ్రీహరి గుణములుగా మనసారా కీర్తించును. ఇతరులలో చెడు లేకున్నను అసూయ వలన ఉన్నట్లు సాధారణ మానవునకు అన్పించును. సర్వము హరిమయమైన వారికి అసూయ ఉండదు. ఒకడు తన వద్దకు వచ్చి, వేరొకరిని గూర్చి చెడు మాటలు చెప్పుచున్నను ఇతడు విననొల్లడు. ధర్మరాజు ఎన్నడును దుర్యోధనుని నిందింపలేదు. భీమాదులు నిందించుచున్నను వారించెను. చెడ్డవారెవ్వరును లేరు. వారు చేయు పనులు కొన్ని చెడువి గావచ్చును. ఇతరులను నిందించుట మాయందు జొరబడకుండ కాపాడుమని ధర్మరాజు కృష్ణుని ప్రార్థించెను. ఇదియే దేవుడు ప్రసాదించు వాస్తవమయిన రక్షణ. పరులను గూర్చిన నిందాభావము లన్నియు నిందించువానివే. పరనిందలో అశాంతి గలదు. పరుల గుణములు కీర్తించుటలో శాంతి, సమత్వము గలవు. పరులను నిందించునపుడు తన మనస్సు యొక్క స్థితిని తానే సాక్షిగా గమనించినచో ఇది తేటతెల్లమగును. ఒరులను నిందించుట, హరిని నిందించుటయే యని మఱవరాదు. ఇతరుల నుండి నిందను అపేక్షింపని వాడు, ఇతరులను నిందించుట అవివేకము. శ్రీరామకృష్ణుని ధర్మపత్ని యగు శారదామాత బృందావనమును దర్శించిన సందర్భమున, పరనింద నొల్లని స్వభావము నీయుమని శ్రీకృష్ణుని వేడినది. తన నెవరయినను నిందించునపుడును సహించుటే హరికి ప్రీతి గల్గించును. ఇతరుల తప్పులను క్షమించువాడు, వారిలోని తప్పులను గమనించినట్లే. ఇతరుల చేష్టలను స్వామి వైభవ లీలలుగా దర్శించువానికే దివ్యానుభూతి దక్కునని అన్నమయ్య పల్లవిలో ఈ చరణమును గూర్చి ప్రబోధించుచున్నాడు.

ఎంతటి దయాపరునకయినను కొందరియందే దయ యుండును. కాని నరుల యందే గాక, పశుపక్ష్యాదుల యందును గల దయకు గనిగా మనము కావలెను. ఇట్టివారరుదు. బలములో, చదువులో, ధనములో తక్కువవారే గాక, నిందింపబడు వారును దీనులే. వీరెల్లరి యందును దయ పూర్ణముగా నుండవలెను. ఆకలిగొన్న వానికి భోజనము పెట్టుటే దయ. రోగిని సేవించుటే దయ. దయ నెఱపునపుడు తాను దయను ఫలానావానిపై నెఱపుచున్నానను తలంపు గలిగినచో అది దయగాక, స్వాతిశయముతో గూడిన కీర్తికాముకత యగును. ఇది పతనమునకు దారితీయును. మననుండి దయను గ్రహించువాడు, మనకు దయను నేర్పుటకై దయచూడ వచ్చిన స్వామి రూపమే. దయ యనగానేమి? ఇతరులు తానేయని భావించుట. ఈ భావన తలంపుగాక, అనుభవముగావలయును. (దయకు అన్నమయ్య ప్రసాదించిన అద్భుత నిర్వచనమిది. అతడు స్వయముగా ఇట్టి భావనతోనే ఇతరులయెడ దయ నెఱపెను. అతనికి ఇతరులు లేరు. తానే ఎల్లరు) ఇతరులను తానుగా ప్రేమింపవలెననియు, దేవుడుగా సేవింపవలెననియు మహాత్ముల బోధ. సర్వ భూతములను తానుగా ప్రేమింపుడని ఉపనిషత్తులు బోధించుచున్నవి. సర్వ జీవులను తనయందును, సర్వ జీవుల యందు తనను దర్శించుటే యోగసాధన యని శ్రీకృష్ణుడు గీతలో బోధించెను. ఇట్టివానిని తానెప్పుడును వీడనని వాగ్దానము గావించెను. ఒరులను తానుగా భావించుటే భక్తియని ఆదిశంకరులు బోధించిరి. భావనా స్థాయిలో ప్రేమయనియు, ఆచరణ స్థాయిలో దీనినే దయ యనియు

నందురు. తనలోను, పరులలోను ఉన్నది ఒకడే గదా. అపార భూతదయను ప్రసాదింపుమని మధురలోని మాలాకారుడు కృష్ణుని వేడెను. ఇట్టి భూతదయ యున్నవాడే హరి యొక్క అనుభూతిలో పరవశింప గలడు. లోకహితాచరణములోనే తన మోక్షమున్నదని అన్నమయ్య వివరించెను.

భక్తిమార్గ మనగా భగవంతుని యొక్క ఒక మూర్తినో, తత్త్వమునో వీరాభిమానముతో పూజించుట, కీర్తించుట యని కొందరు భావింతురు. ఇట్టివారిలో ఒకవైపు ఇష్టదేవతపై వీరాభిమానము పెరుగుచుండునే గాని, సమాజముపై ప్రేమ పెరుగదు. తోటి జీవులపై రాగద్వేషములు పెరుగుచునే యుండును. వివిధ దేవతారాధకుల నడుమ పోటీలు, మతములు, మత కలహములు, రక్తపాతములు తప్పలేదని చరిత్ర చెప్పుచున్నది. దీనిని గమనించి, అసలు దైవభక్తియే మూఢమని భ్రమించి మరికొందరు హేతువాద మనియో, సమసమాజవాద మనియో చేపట్టి సమాజ హితమును సాధింప యత్నించు చున్నారు. కాని వీరి శ్రమలో నిజాయితీ ఉన్నను ఫలింపదు. ఏలననగా వీరు సర్వాంతర్యామి యగు చైతన్యము యొక్క యునికిని విశ్వసింపరు. ఒరులను తానుగా భావించు ప్రేమను వికాసము నొందించుకొనరు. ఇట్టి ప్రేమ లేనిది, కార్మిక రాజ్య మేర్పడినను, ధనవంతుడుగా మారిన పేదవాడు, తోటి పేదలను పట్టించుకొనడు. ఇట్టి రాజ్యము కుప్పకూలిపోక తప్పదు. దీనికిని చరిత్రయే సాక్ష్యము. ఎల్లరిని తానుగా ప్రేమించుచు, వారిని దేవునిగా సేవించుచు సమాజ హితమునకై పాటు పడుటయే నిజమైన ఆధ్యాత్మికత. ఆధ్యాత్మికత యను పునాది లేనిది శ్రేయోరాజ్య మనునది స్థిరముగా నెలకొనదు. పై రెండు వాదముల నడుమ నున్నది నిజమైన భక్తిమార్గము, ఆస్తిక్యము. దేవుడనగా పరమప్రేమ ప్రవాహము. నిజమైన భక్తుడు తానును నట్లగును. అన్నమయ్య అవలంబించినదీ మార్గమును. ఇది తాత్కాలిక, సార్వకాలిక మానవజాతి రుగ్మత లన్నిటికిని ఒకే యొక దివ్యౌషధము. దేవుడను పేరును నమ్మకున్నను, ఒరులను తానుగా భావించు ప్రేమను నెఱపువాడు నాస్తికు డయినను ఆస్తికుడే. దేవుని యొక మూర్తిగానో, తానూహించుకొన్న తత్త్వముగనో నమ్మి, తోటివారిని ప్రేమింపలేనివాడు ఆస్తికుడయినను నాస్తికుడే. ఇట్లు నాస్తికులలో ఆస్తికులున్నారు. ఆస్తికులలో నాస్తికులున్నారు. ఎప్పటికయినను నిజాయితీ గల మానవతావాదులు నాస్తికులైనను, ఆస్తికులు గాక తప్పదు.

2వ చరణము యొక్క తాత్పర్యము

"మలినము లేనివాడై, మనస్సును నియమించుట గలవాడే ధర్మమునందు ఆసక్తి గల బుద్ధి తనను అంటినవాడు. ఇతడే హరి నెఱిగినవాడు. చేయవలసిన పనులను ఆచరించుట యను విధానములను విడువని వాడే అతి గోప్యమయిన హరిభక్తిని మఱవనివాడు."

వ్యాఖ్య

కపటము, కల్మషము, మలినమయిన బురద వంటివి. మనస్సు నీరు వంటిది. ఈ మాలిన్యములు తొలగి పవిత్రుడైనపుడే ధర్మము నాచరించు బుద్ధి యందు నిలకడ గలవాడగును. అహంభావము, కామ క్రోధములు, లోభ మాత్సర్యములు మున్నగు మలిన వాసనలు మిగిలియున్న వాని మనస్సు పూర్వపుటభ్యాస

బలమున, వానిచే లాగివేయబడును. ఇది ధర్మమని స్పష్టముగా నెఱిగిన దానిని గూడ ఆచరించు టకు బుద్ధి పుట్టదు. బుద్ధి యనగా మంచి, చెడులను వేరు చేయ గలుగు ప్రజ్ఞ. చేయవలసిన వానిని, చేయగోరిన దానిని వేరుచేయగల విశేషమయిన లోగన్ను. ఇట్టి బుద్ధి, ఆత్మ యగు స్వామివైపు మరలినచో ధర్మమునందే ఆసక్తితో నిలకడగా నుండును. వివేకముతో చేయవలసిన వానినే నిశ్చయించును. మనస్సు మలినమైనచో, బుద్ధి దానిని నియంత్రింపగలిగి యుండవలెను. మనస్సు చెప్పినట్లు బుద్ధి పాటింప రాదు. మనస్సుకు యజమానియై మలినముల వైపు పోకుండ నియంత్రించవలెను. ఇట్లు బుద్ధితో మనస్సును నియంత్రించిన వాడే ఆత్మనియతి గలవాడని అన్నమయ్య పేర్కొనెను. ఇచట అన్నమయ్య వాడిన 'ఆత్మ' అను పదమునకు మనస్సు అని యర్థము. సముద్రపు నీరు అఖండము. కెరటపు నీరు పరిమితము. అఖండ చైతన్యమే 'ఆత్మ' యగు శ్రీహరి. అందు జనించిన కెరటమే మనస్సు. ఇది కూడ ఆత్మ చేతనే చేయబడుటచే దీనిని కూడ సంస్కృత భాషలో 'ఆత్మ' యని పేర్కొనుచుందురు. సందర్భమును బట్టి ఆత్మ శబ్దమునకు అర్థమును గ్రహింపవలెను. మనస్సును నియమించినపుడే బుద్ధి మలిన వాసనల వైపు లాగివేయబడకుండ చేయవలసిన ధర్మమునందే ఆసక్తితో నిలిచియుండును. మనస్సుకు సేవకుడగు బుద్ధి జగత్తులోని అనేక విషయముల వైపు మరలుచుండును. శాంతిని కోల్పోవును. మరి మనస్సును నియంత్రించుట ఎట్లు? మనస్సును మనస్సు చేతనే నియమింపలేము. తుపాను గాలికి ఊగుచుండు నౌక వంటిది మనస్సు. బుద్ధిని అనగా విచక్షణాశక్తిని పరమాత్మ వైపు మరల్చి, శరణందుటే మార్గము. అపుడు తుఫాను ఆగిపోవును. జీవిత ప్రయాణము సాఫీగా సాగును. పరమాత్మ యను వెలుగు నుండి బుద్ధిపై ఏది ధర్మమో అది చక్కగా ప్రతిఫలించును. ఆ ప్రకాశము, మనస్సుకు దారిచూపును. ఇట్లు స్వామికి శరణందినపుడే, మనస్సు నియమింపబడును. బుద్ధి ధర్మమునందే అభిరుచితో ఏకముఖమగును. పతంజలి దీనినే బోధించెను. దీనినే అన్నమయ్య తేలిక పలుకులలో ఒలికించెను. చివరి చరణము యొక్క చివరి పాదముతో ఈ చరణమును గూర్చు కొనవలెను. శ్రీవారి దాస్యమే ధర్మబుద్ధిని, మనో నియమమును కల్గించును.

కుటుంబముతో కలిసియుండి సమాజమున బ్రతుకుచున్నచో కర్మలు చేయవలసి వచ్చుననియు, రాగద్వేషము లంటుకొనుననియు, కావున వీనినుండి దూరముగా వెళ్ళవలెననియు కొందరు మెట్టవేదాంతులు భావించుచున్నారు. ఇట్టివారెచట నున్నను, మనస్సున గల మాలిన్యములు మాసిపోవునా? మరికొందరు రాగద్వేషములతో పనులు చేయుచు, ఫలాసక్తి గలిగి చిక్కులలో పడుచున్నారు. వేదోపనిషత్తులు, గీత, అన్నమయ్య ఈ రెంటి మధ్యన గల సరియయిన వెలుగుబాటను చూపించుట జరిగినది. ఇది యేమి? కుటుంబమును, సమాజమును అంతర్యామి యగు శ్రీహరి యొక్క స్వరూపముగా దర్శించి, వారియెడల తాను చేయవలసిన కర్మలను భగవదర్పణముగా చేయుట. ఈ మార్గమున నేను చేయుచున్నానను భావముండదు. తన ద్వారమున పనులు జరుగును గాని తనవలన గాదు. ఫలాసక్తి యుండదు గావున చిక్కులుండవు. హరిభక్తి పేరున నిత్యము హరినామమును జపించుచు, చేయవలసిన పనులను వీడరాదని అన్నమయ్య హెచ్చరిక. మనసు, బుద్ధియు స్వామికి శ్రద్ధతో సమర్పణము గావించి పనులు చేయుట

సాగించుటే హరిభక్తి. పనులు చేయుట, హరిని స్మరించుట సమకాలికముగా సాగించుటే మర్మమైన హరిభక్తి. మర్మమనగా గూఢము, సార మయినది యని యర్థము. వట్టి పూజా జపాదులు భక్తిగావని అన్నమయ్య పరోక్ష మయిన బోధ. భక్తి యనగా పరమప్రేమ యని నారదుడు సూత్రీకరించెను. జీవులను స్వామిగా భావించి, పరమప్రేమతో చేయవలసిన పనులు చేయుటయే హరిభక్తిని మఱవకుండుట. ఇట్లు కర్తవ్యములను వీడని వాని యందే హరిభక్తి సారము నిరతము నిలుచును. జ్ఞానము లభించినది గదా యని పనులు మానిన వానికి ఇతరులు కన్పడుదురు. స్వామి కానుపింపడు. పతనము తప్పదు. భక్తిని, సంకీర్తన యందును, సత్కర్మ యందును జోడుగా పాటింపవలెను. ఈ రెంటిలో దేనిని కాదన్నను భ్రష్టు డగును. అచ్చులతో ఆగరాదు. అక్షరములన్నియు నేర్వవలెను. అట్లని అచ్చులే చాలు ననరాదు.

3వ చరణము యొక్క తాత్పర్యము

"జగత్తునకు మేలు గూర్చునట్లు ప్రవర్తించువాడే తన మనస్సులో పగ లేక బ్రదికిన వాడగును. ఇట్టివాడే హరి నెఱిగినవాడు. శంకలన్నియు తెగిపోయి, స్పష్టముగా అంతయు 'ఆత్మ' యని తెలిసినవాడే వేంకటేశ్వరునకు నిరంతర దాసుడు. ఇతడే హరి నెఱిగినవాడు."

వ్యాఖ్య

ఈ చరణమునందు నాలుగు పాదములకును కూర్పు ఉన్నది. ఆత్మ యనగా అన్నిటికిని అతీతమైన చైతన్యమని కొందరు భావించుచున్నారు. ఇది ఎట్టిదనగా మంచుగడ్డలకు అతీతమైనది 'నీరు' అని భావించుట వంటిది. స్థితిని బట్టి మంచుగడ్డల కన్న నీరు పైస్థాయిలోనిదే. కాని నీరే కదా మంచుగడ్డలుగా నగుచున్నది. నీటిలోని సారమే మంచుగడ్డలలోను గలదు. అట్లే 'ఆత్మ', జగత్తుకు, అందలి జీవులకు అతీత మయినను, అదియే జగత్తుగా, జీవులుగా నయినది. ఇట్లు సమస్తము 'ఆత్మయే' యని స్పష్టముగా తెలియవలెను. ఈ తెలియుట తర్కములోనే గాక, అనుభవమునకు దిగిరావలెను. ఆత్మ యనగా 'తాను, నేను' యని పేర్కొనబడు చైతన్యము. ఇది పరమప్రేమ ప్రవాహము, పరమానంద సాగరము. ఇట్లు ఎల్లయు, ఎల్లరును 'తానే' యని పరమప్రేమతో అనుభవించువాడే లోకమున ఒరులకు మేలు చేయుచు వర్తించును. పరహితమునకు వెనుక ఆధారముగా నుండవలసిన అనుభూతి సమస్తము ఎల్లరు తానేయని. వేదసారమైన ఈ యంశమును అన్నమయ్య తానాచరించి, అనుభ వించి బోధించెను. ఇతరులను తనకన్న వేరుగా గమనించుచు, వారికి తాను మేలు చేయుచున్నానని భావించువాడు శాంతినొందడు. అహంభావము నొంది, కీర్తికై ప్రాకులాడి చిక్కులలో పడును. 'ఇతరులు తానే' యను అనుభూతియే ప్రేమ. ఇట్టి ప్రేమతో మేలు చేయువానికి ఇతరులు గమనికలో నుండరు గావున శాంతి కల్గును. జగతి అనగా వాక్కు అనియు నర్థము. కావున తన తీయని మాట ద్వారమున గూడ జీవులకు మేలును, ఆహ్లాదమును గూర్చవలెనని అన్నమయ్య ఉద్బోధ. మాట్లాడు నపుడును తన మాటలు, పాటలు వినువాడు 'తానే' యను ప్రేమానుభూతి ఆవశ్యకము. అప్పుడే అది హితమగును. హితమనగా ఉత్తమమైన ఆనందము గూడ. ఇట్లు ఇతరులను తానుగా ప్రేమించుచు,

వారికి మేలు చేయువాని మనస్సులో ఎవరిపైనను పగ యుండదు. తనకని ప్రత్యేకములగు కోరికలుండవు. కావున తన కోరికలు తీరుటకు ఫలానావారు అడ్డుపడుచున్నారను తలంపు కలుగదు. పగ పుట్టదు. ఇతరు లెవరయినను తనకు కీడు చేసినను, తనను అవమానించినను ఆతనిని గూడ భక్తుడు తననుగనే ప్రేమించి సహించును. ఇక శాంతికి ఎడముండదు. దీనినే గీతలో తొమ్మిదవ అధ్యాయమున కృష్ణుడు ఉపదేశించెను. పగ, పగ వలన అణగదని ధర్మరాజు ఉద్యోగపర్వమున పలికెను. పగ మనస్సులో నున్నచో ఇంటిలో పాము తిరుగుచున్నట్లే. ఇతరులపై చెడు భావము కూడ పగయే. ఇట్టిదేదియు లేక తానే అంతయునని ప్రేమించువాని బ్రతుకు శాంతిమయముగా సాగును. ఇట్టివాడు ఎడము లేక వేంకటేశునకు దాసుడై, స్వామిని సేవించుచుండును. జగత్తు యొక్క రూపములో నున్నది స్వామియే యని నిత్యము అతనికి దాసుడై యుండును. తోటివారిని తననుగా ప్రేమింపవలెను. స్వామిగా సేవింపవలెను. స్వామి సేవయందు నిరతము మనస్సు తగిలియుండవలెను. అనగా ఆ సేవకు, దాస్యభావమునకు ఎడము కలిగిన క్షణమును భక్తుడు భరింపలేడు. 'తగిలి' అను చిన్న మాటలో దాస్యభక్తి ఎట్లుండవలెనో అన్నమయ్య సొగసుగా, స్పష్టముగా తెలిపెను. హరిదాసు డెవడో అన్నమయ్య స్పష్టీకరించెను, ఎల్లరిని తననుగా ప్రేమించువాడేనని. ప్రేమప్రవాహమున మునుగువాడే ఆనంద సాగరమున నోలలాడును. స్వామికి దాసుడనన్న భావము వీడినచో అహంభావము చోటుచేసికొని, చిక్కులు, అశాంతి కలుగును. ప్రేమలోని తీయదనము, దాస్యభక్తి లోని తీయదనమును మనకు రుచి చూపించుచున్న అన్నమయ్య ఆదర్శ భక్తుడు. సత్యము, దయ, ధర్మము, సత్కర్మ, భక్తి, పరహితము, హరిదాస్యములను అన్నమయ్య విశిష్ట వైఖరిలో నిర్వచించెను. వ్యక్తిత్వ వికాసమను పేర సాగు నవీన బోధలకన్న, ఈతని ఈ బోధ విశిష్టమైనది. ఇపుడు పల్లవిని మరల అందుకొనవలెను. చరణము లలో సూచింపబడిన లక్షణములు గలిగి, తగిలి వేంకటేశు దాసుడయిన వాడు ఏ కులము వాడయినను, ఎవ్వడయినను హరినే సర్వముగా అనుభూతినొందువాడు.

* * *

17

2వ సం-464

కలిగె మాకు

లలిత

కలిగె మాకు నిది కైవల్యం
కలకాలము హరికథా శ్రవణం. ॥ పల్లవి ॥

అచింత్య మద్భుత మానందం
ప్రచురం దివ్యం పావనం
సుచరిత్రం శ్రుతిశోభితం
అచలం బిదివో హరి కీర్తనం. ॥ కలి ॥

నిరతం నిత్యం నిఖిల శుభకరం
దురిత హరం భవదూరం
పరమ మంగళం భావాతీతం
కరివరదం నిజ కైంకర్యం. ॥ కలి ॥

సులభం సుకరం శోకనాశనం
ఫలదం లలితం భయహరణం
కలితం శ్రీవేంకటపతి శరణం
జలజోదర నిత్య స్తోత్రం. ॥ కలి ॥

తన విజ్ఞానమును గొనియాడువారజ్ఞానులనియు,
తాను జ్ఞాని ననియు భావించుటే అజ్ఞానము.

టీక

కైవల్యము = కేవలత్వము, ఒకటి యగుట, ప్రచురము = ప్రసిద్ధము.

పరిచయము

అన్నమయ్య తనకు సంకీర్తనము ద్వార భగవంతుడు ప్రసాదించిన కేవలత్వ స్థితికి పొంగిపోయి వర్ణించుకున్నాడు. తనకు సంకీర్తనలను రచించి, గానము చేసి, పరవశించి, పరవశింపజేయు భాగ్యమును స్వామియే కరుణించెను. సంకీర్తనము హరిదాసుగా బ్రతుకుటకు, వేంకటేశ్వరుని శరణంది ముక్తినందుటకు వెలుగుదారి చూపినది. పల్లవిలో హరికథా శ్రవణమును, మూడు చరణములందు వరుసగా హరికీర్తనమును, నిజకైంకర్యమును, స్వామి నిత్య స్తోత్రమును కొనియాడుచున్నాడు. ఇవియన్నియు ప్రహ్లాదుడు తెలిపిన నవవిధ భక్తులలో చేరును.

పల్లవి యొక్క తాత్పర్యము

అన్నమయ్య తనకు హరి యొక్క కథలను విను భాగ్యము కలిగినదనియు, దానివలన కైవల్యము కలిగినదనియు పొంగిపోవుచున్నాడు.

వ్యాఖ్య

హరికథ లనగా శ్రీహరి యొక్క లీలలు, అవతారమూర్తుల కథలు, భక్తుల కథలు, సజ్జనుల మంచి గుణములను తెలుపు సన్నివేశములును. ఏలననగా భక్తుల జీవితములందు, సజ్జనుల మంచి నడవడి యందును వ్యక్తమయినది శ్రీహరి దివ్యగుణ వైభవమే కదా. కొందరికి శ్రీరామ, శ్రీకృష్ణుల వంటి అవతారమూర్తుల గాథలను వినుట ఇష్టము. ఇవి శ్రీహరి కథలే. అంతేగాక, మన తోటి సమాజములోని మన మెఱిగిన, ఎఱుగని వారిలోని మంచి గుణములను కీర్తించుటకు ఔదార్యము గావలెను. ఇంకొకరి మంచిని వినుట కూడ హరికథా శ్రవణమే. హరికథలు, సజ్జనుల కథలేవి యయినను భాగవతమే. భాగవత మనగా గ్రంథము కాదు. ఇది సృష్టి యున్నంత కాలము కొనసాగును. ఏలననగా అంతకాలము అవతారమూర్తులు, భక్తులు, సజ్జనులు వచ్చుచునే యుందురు గదా! సత్పురుషుల కలయిక వలన శ్రీహరి కథలను విను భాగ్యమబ్బును. ఇది అన్నమయ్యకు బాల్యము నుండి లభించినది. అన్నమయ్యను తిరుమలకు తీసికొని వెళ్లినది సత్పురుషులే కదా. ఆపై సద్గురువులగు యతుల సేవ దొరకినది. కలకాలము హరికథలను విను భాగ్యము ఇతనికి కలిగినది. కొన్నాళ్లు హరి యొక్క కథలను విని, ఆపై వినుట మానరాదు. బ్రతికినంత కాలము అన్నమయ్య వలె వినుచునే యుండవలెను. హరికథా శ్రవణము ఒకప్పుడు చేసినది – గతము మాత్రమే కారాదు. నిత్య వర్తమానము కావలెను. ఇందువలన తనకు ఇదిగో కైవల్యమే కలిగినదని అన్నమయ్య ఉత్సాహమును వెల్లడించుచున్నాడు. కైవల్య మనగా కేవలత్వము. అనగా మోక్షస్థితి – ఒకటే యగుట. జీవుడు, బ్రహ్మముగా నయినపుడు ఒకటే వెలుగుచుండును. ఇక ఇర్వురుండరు. కైవల్యము నొందిన భక్తుని శరీరమున భగవంతుడే పనిచేయుచుండును. స్నానాది కాలకృత్యములు, దినచర్య,

సత్కర్మలు, అన్నియు దేవుడే చేయుచుండును. దేవుడు ఇతనిలోనుండి జీవించుచుండును. ఇక భక్తుని స్థానమేది? ఆంజనేయుడు శ్రీరాముని పాదముల వద్ద నున్నట్లుగా, స్వామి అను అఖండానుభూతిలో కరగియుండును. మంచుగడ్డ నీటితోనే ఏర్పడును. ఉత్తర సముద్రమున మంచుగడ్డలు నీటిపై తేలియాడుచుండును. ఇపుడు మంచుగడ్డ పగిలి, తన కాధారమయిన నీటిలో కరగి నీరైపోవు స్థితి ఇది. ఎపుడో ధ్యాన సమయమున గాని, సంకీర్తన సమయమున గాని, పూజలో గాని కలుగునది మాత్రమే కాదు. ఈ సమాధిస్థితి బ్రతుకంతయు నిండుటయే కైవల్యమని పతంజలి చెప్పెను. పోతనగారు దీనికొరకై కృష్ణుని నుతించెను. కైవల్యమునే సాయుజ్యముక్తి యందురు. నీటితో నిండిన చెంబును నది నీటిలో బోర్లించి ముంచిన, రెంటియందలి భేదము తొలగి పోవును. ఆవిధముగా దేవుని యందు తాను జీవించుటే కైవల్యము. జగత్తును స్వామి ఆకృతిగా ధ్యానించుటే కైవల్యపథమని ఆదిశంకరులు చెప్పిరి. ఆహారము జీర్ణమైనపుడు తిన్నవానిలో కలియును. అట్లే జీవప్రజ్ఞ అను ఆహారము. భక్తి యను భోజనముచే భగవంతుడను భోక్త యందొకటి యగును. ఇదియే కైవల్యము.

శరణాగతి కలిగినగాని కైవల్యము రాదు. మన మనస్సు పనిచేయునంత కాలము శరణాగతి అవాస్తవము. “నేను శరణాగతి పొందుచున్నాను” అని భావించునపుడును, ప్రకటించునపుడును శరణాగతి పూర్ణము గాదు. ఎందుకనగా మనస్సు పనిచేయు చున్నది గదా. మరి మనస్సు పనిచేయుట ఆగినపుడే శరణాగతి, మనస్సుకు తెలియ కుండగనే జరుగును. ఇది ఎప్పుడు జరుగును? భాగవతమున ధ్రువుడు, తనకు సాక్షాత్కరించిన స్వామితో ఇట్లు వేడెను. “సమర్పణ చేయుదమనుకొన్నను అనుకొనుట పోదు గనుక సమర్పణము జరుగదు. తాను ఒక్కడే కైవల్యము పొందవలెననుకొన్న వానికి తాను గుర్తున్నాడు గావున ఇతనికి కైవల్యము రాదు. మనస్సును మోసగించి, అది లేనపుడు సమర్పణ జరుగునట్టి మార్గమును తీర్చిదిద్దుకొనవలెను. అంతకు ముందే సమర్పణ జరిగిన వారి సాంగత్యము ఆవశ్యకము. భక్తులు, శ్రీహరి కథలను, భక్తుల కథలను చెప్పుచుండగా మనము వినుచున్నప్పుడు మనకు తెలియకుండగనే ఆనందములో మనస్సు సమర్పణ పొందును. ఇదియే శరణాగతి మార్గము. కావున నాకు ఇట్టి భక్తుల పొందును ప్రసాదింపుము.” కావున హరికథా శ్రవణము వలన సమర్పణము, శరణాగతి జరుగును. దానితో సమాధి కలుగును. ఈ యనుభూతి రుచి మరగిన వానికి క్రమముగా జీవితమంతయు ఈ సమాధి నిలుచును. ఇదియే కైవల్యము. ఇట్లు హరికథా సంకీర్తనము చేయువారికే గాక, వానిని వినువారికిని కైవల్యము కలుగునని అన్నమయ్య ఉద్ఘాటించుచున్నాడు. కావున అతని సంకీర్తనలను వినుటకు ఫలశ్రుతి కైవల్యమే. హరికథలను, మహానుభావుల చరితలను విను వారిలో గల పూర్వమున్న వాసనలు పనిచేయవు.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

ఈ చరణమును అన్నమయ్య పల్లవికి అనుసంధించెను. హరి యొక్క కథలను విను భాగ్య మెప్పుడు కల్గును? వానిని కీర్తించువారు కీర్తించుచున్నపుడే కదా. కావున ఈ చరణమున కీర్తన ప్రభావమును ఇట్లు కీర్తించుచున్నాడు. “హరి కీర్తనము ఇదిగో – అనగా మనకు ఒక వస్తువు కన్పడినంత స్పష్టముగా

చింతించుటకు వీలు కానిది, అపూర్వమైనది, ఆనందమైనది, ప్రసిద్ధమైనది, దివ్యము, పవిత్రమైనది. మంచి నడవడిని వర్ణించునది. వినుటకు ఆనందము కల్గించునది. వినువారికి శోభను ఇచ్చునది. ఉత్సాహము నిచ్చునది. 'శ్రుతి'కి అనుగుణమయినది. వేదసమాన మయినది. చలనము లేనిది."

వ్యాఖ్య

హరి యొక్కయు, భక్తుల యొక్కయు నామరూప గుణకథలను కీర్తన చేయుట యొక్క ప్రభావము మన ఊహకందనిది. నిజమైన భక్తులు కూడ నడచుచున్న భగవానుని మహనీయమూర్తులే. హరికీర్తనము పూర్వము లేనిది, ఆశ్చర్యకరమైనది. అపూర్వమనగా సంకీర్తనము వలన గాక ఇంక దేనివలనను ఇంత ఆనందము కలుగదు. మరియు సంకీర్తనము మొదలుపెట్టక ముందున్న స్థితి వేరు. మొదలిడిన తర్వాతి స్థితి వేరు. ఆనందమయినది. ఆనందము నిచ్చునదే కాదు. సంకీర్తనమే ఆనందము. నిండారిన భక్తితో సంకీర్తనము చేయువానికి ఆనందము పొందుట ఉండదు. తన యునికియే యుండదు. ఆనందమే ఉండును. అనగా స్వామియే గదా. సంకీర్తన యొక్క మహిమ ప్రసిద్ధమయినది. ప్రహ్లాద నారద పరాశర పుండరీక వ్యాసాంబరీష శుక శౌనకాదులచే ఇట్టి సంకీర్తనము గావింపబడి, ఇప్పటికిని, ఎప్పటికిని ప్రభావము చూపుచునే ఉన్నది. నారదు డీమార్గమునకు మొదటి ఆచార్యుడు. సంకీర్తనము భగవన్నామాదులను తీయగా గానము చేయుటతో కూడియుండును. ఇది సరస సంగీత సాహిత్య సమ్మేళనము. ఇందు ఈ రెండును భగవదంకితములై యుండును. భగవద్గుణరూప నామ వైభవములను సంకీర్తనము గావించుట యన్నచో తప్పక సాహిత్యముతో గూడి యుండవలెను. అన్నమయ్య సంకీర్తనల ప్రభావము కూడ శాశ్వతమే. ఒకడు భక్తు డెట్లగును? పూర్వ భక్తుల సంకీర్తనలను ప్రస్తుత భక్తులు సంకీర్తించుచుండగా వినుట వలన గదా! సంకీర్తనము దేవునికి చెందినది గావున దివ్యము. ధనము, ప్రాపకము, ఖ్యాతుల కొరకై వ్యక్తులను పొగడుట సంకీర్తనము గాదని, అది పనికిరాదని భాగవతమున పృథుచక్రవర్తి హెచ్చరించెను. భగవంతుని కీర్తించినదే సంకీర్తనము. లేదా వ్యక్తుల మంచి గుణములను కీర్తించినను, వానిని భగవానుని గుణములుగా కీర్తించినను సంకీర్తనమే. వ్యక్తుల గుణములను, వ్యక్తులవిగా భావింపరాదు. సద్గుణ మెచ్చట నున్నను అది తన వైభవమే అని గీతలో కృష్ణుడు చెప్పెను. దివ్యమనగా తనకు తానుగా ప్రకాశించునదని అర్థము. భగవత్ సంకీర్తనకు ఎవరి పొగడ్తలతో పనిలేదు. తనకు తానుగా వెలుగును. బెల్లమున్నచోట ఈగలు ముసిరినట్లుగా, సంకీర్తనము జరుగుచోట చేరవలసిన వారు తప్పక చేరుదురు. మరియు దేవుడు పరమపవిత్రుడు గావున ఆయనను సంకీర్తించుటయు పవిత్రమై, సంకీర్తనము చేయువానిలోను, వినువానిలోను పవిత్రత పాదుకొల్పును. దేవుని నడకయే సృష్టి గమనము. మరియు శ్రీరామ, శ్రీకృష్ణాదుల, మహాభక్తుల మంచి నడవడిని వర్ణించునదే సంకీర్తనము. దీనిని గానము, వినుట చేయువారికి కూడ మంచి నడవడి అబ్బును. ఇది 'శ్రుతి'తో గూడినది. వినువారికి శుభము నిచ్చునది. అన్నిటికన్న శుభమేది? పల్లవిలో చెప్పిన కైవల్యమే. రామాయణమున ఇది నిశ్శ్రేయస మని పేర్కొనబడెను. అనగా ఇంతకన్న శుభము లేనిది. మరియు శ్రుతిశోభితమను ప్రయోగమును ధీరుడై అన్నమయ్య కావించెను. శ్రుతి అనగా వినగా వినగా నేర్చుకొన

బడుచున్న వేదము. హరి సంకీర్తనము కూడ వేదమే. ఇది సంకీర్తన వేదము. ఋషులు ప్రత్యేకముగా దీనిని సామవేదమనిరి. ఋగ్వేదము నందలి మంత్రములనే భక్తితో సంకీర్తనము గావించిన అది సామవేద మగుచున్నది. 'వేదములలో సామవేదమును నేను' అని గీతలో కృష్ణుడు చెప్పెను. అనగా అన్ని విజ్ఞానముల కన్న హరి కీర్తనము నందు నా సాన్నిధ్యము నిండుగా నుండి, ఆనందమగునని కృష్ణుని తాత్పర్యము. నారదుడు స్వయముగా యోగీశ్వరుడయినను, హరి కీర్తనమును ఆపక చేయుచునే యున్నాడు. మన వెన్నెముకనే వీణగా మ్రోయించుచు, మన లోపల హరి కీర్తనము గావించుడని ప్రేరేపించుచున్నాడు. నారదుడు గావించు హరి సంకీర్తనకు ఘనులగు యోగీంద్రుల గుంపులు గూడ చొక్కుచున్నారని భాగవతమున సూతుడు చెప్పెను. హరి సంకీర్తనము వలన సామీప్య ముక్తి కలుగునని ఆదిశంకరులు తెలిపిరి. సామీప్యముక్తి అనగా మొత్తమునందు స్వామియే యున్నాడని తెలిసి తన దేహాదు లందును, ఇతరులందును దేవుడే భాసించుట. అన్నమయ్యది కూడ సంకీర్తన వేదము. హరికీర్తనము చలింపనిది. అనగా దీనిని గావించువానిలో మార్పు రాదు. ఇది చేయువాడు ఎప్పుడును నిశ్చలుడై, సముడై, ఆనందముగా నుండును. దీనిని విడిచిపెట్ట లేదు. 'హరి' అను పదములో ఇంకొక విశేషము భాగవతములో చెప్పబడినది. మనము విడుచు శ్వాసలో 'హ' అను ధ్వని కలదు. ఆపై కంఠము నుండి ఏ పలుకు రావలసియున్నను, అందలి పీకలు రాపిడినొంది 'రి' అను ధ్వని పుట్టును. మన శ్వాసయు, నాదమును కలిసి హరి యగును. తాత్పర్యమేమి? నారాయణుడే ఎల్లరి శ్వాసగా, కంఠధ్వనిగా దిగివచ్చు చున్నాడని గుర్తించి కీర్తనము చేయవలెను. హరి కీర్తనము చేయువాడు తన శ్వాసను, కంఠధ్వనిని స్వామిగా ధ్యానించి మొదలుపెట్ట వలెనని అన్నమయ్య బోధ.

2వ చరణము యొక్క తాత్పర్యము

"స్వామి కైంకర్యము శాశ్వతము. ఎల్లప్పుడు ఉండునది, ఉండవలసినది. అన్ని శుభముల నిచ్చునది. పాపములను తొలగించునది. సంసార భయమును, పుట్టుకను దూరము చేయునది. అత్యంతము శుభమయినది. భావించుటకు వీలు కానిది. గజేంద్రునికి వరమిచ్చి కాపాడునది."

వ్యాఖ్య

కైంకర్య మనగా సేవ. ఏమి చేయుమందువో, దానిని చేయుటకు నేనెప్పుడును సిద్ధమే అను భావమే కైంకర్యభావ మని రామానుజులు తెలిపిరి. అనగా దేవుని సంకల్పమునకు తాను నిత్యము వాహికగా నిలిచి, దానిని అమలు చేయుట. రామాయణమున లక్ష్మణునిది కైంకర్య భక్తి. మరియు జీవులను దేవుని రూపములుగా భావించి సేవించుట. ఇవి అలవడుటకుగాను దేవుని అర్చావిగ్రహమును అంతర్యామిగా భావించి సేవించుట సోపానము. విగ్రహారాధనము యొక్క పరమ ప్రయోజనమేమి? దేవుని సజీవ విగ్రహములను పూజించుటను నేర్చుట. దేవుని ప్రతిమను ఱాయిగనో, కాగితముగనో, మట్టిగనో భావించినచో అది పూజ కాదు. దేవుడే అని భావింపవలెను. ఇది చాలదు. తనచే పూజింపబడుచున్న స్వామి అంతర్యామి అని మఱవరాదు. లేకున్నచో శైవము, వైష్ణవము, శాక్తేయము మున్నగు మతముల ఘర్షణలతో నరజాతి

సతమత మగును. ఏ పేరున నయినను ఉన్నదొకడే సర్వాంతర్యామి అని ధ్యానించి పూజకు ఉపక్రమింపవలెను. అపుడు విగ్రహమునే కాక, విశ్వమునే పూజించువాడగుచున్నాడు. నిజకైంకర్య మనగానేమి? పుట్టుక లేని స్వామి సేవ. మరియు సహజముగా స్వామిని సేవించుట. అనగా ఎవరి మెప్పు కోసమో, కోరిక తీర్చుమనియో గాక, సహజ ప్రేమతో సేవించుట. నీవు దేవుని ఎందుకు సేవించుచున్నావని అడిగినచో, సేవింపకుండ ఉండలేను గనుక అని చెప్పువానిది నిజకైంకర్యము. తల్లి బిడ్డను ప్రేమించును. ఎందుకని లేదు. అది సహజము. మబ్బు వాన కురియును. అది దానికి సహజము. దైవసేవ కూడ అట్లే కావలెనని అన్నమయ్య ఉపదేశము. ప్రేమకు, సేవకు కారణమున్నచో అవి వాణిజ్యములు గాని ప్రేమ, సేవ గానేరవు. కావున ఇచట అన్నమయ్య దృష్టిలో నిజకైంకర్య మనగా భగవంతుని సేవ సహజ స్వభావము గావలెను. వారి సేవ ఎట్లు లభించును? హరి సేవకులయిన వారి సాంగత్యము వలన. అది ఎట్లు లభించును? అపారమయిన భూతదయ వలన. కనుక ఈ మూడును ప్రసాదింపుమని సుదాముడను భక్తుడు కృష్ణుని వేడెను. పుట్టుక లేని దేవుడు పుట్టుచున్న శరీరముల లోనికి జీవుడుగా దిగివచ్చుచున్నాడని గ్రహించి జీవసేవను, హరి సేవగా చేయవలెను. ఇట్టి హరి సేవ శాశ్వతమయినది. ఆగుట లేనిది. సహజము గావున కొంతకాలము తర్వాత ఆపుట ఉండదు. మబ్బు వర్షించుట, సూర్యచంద్రులు వేడిమిని, వెన్నెలను ఇచ్చుట, నదులు మంచినీటి నిచ్చుట ఎప్పటినుండి ఎప్పటిదాక అని యుండదు. ఇవి నిత్యవర్తమానములు. కావున హరిసేవ కూడ ఇట్టిదియే. దీనిని రుచి మరగినవాడు ఎట్లాపగలడు? ఇతని జీవితమే హరి సేవగా అగును. హరి సేవ అన్ని శుభముల నిచ్చునది. శుభ మనగా మన మనస్సులోని శుభభావనయే. ఈ భావన ఉన్నవానికి అంతయు శుభమే. ఇది లేనివానికి పరిస్థితులు, పరిసరములు, సన్నివేశములు అశుభములుగా, విఘ్నములుగా కన్పించును. కావున హరి సేవ చేయువాని కెప్పుడును, అంతయును శుభమే. ఏ సన్నివేశము కూడ ఇతనికి అశుభము కాదు. శుభాశుభములు ఇతనికి బయటి సన్నివేశములపై ఆధారపడియుండక, హరి సేవపై ఆధారపడి యుండును. అశుభ మనగా హరి సేవను, స్మరణను, హరి కీర్తనను మానుట. ఇవి కొనసాగించుటే శుభము. భగవంతుని స్మరణము, సేవ మానుటే అశుభము, పెద్ద ఆపద. ఏలననగా ఇవి మానిన వెంటనే వ్యక్తులు గుర్తుకువచ్చి, వారి చేష్టల ప్రభావము మనపైన పనిచేసి, వారిపై రాగద్వేషములు కలిగి సుఖ దుఃఖములకు గురియగుట జరుగును. హరి సేవ పాపములను తొలగించును. దేవునే జీవులందు దర్శించుట తలపుల వరకు మాత్రమే పరిమితము గాక, మాటలలోన, ఆచరణలోన దిగుటయే హరి సేవ. దీనివలన ఇతరులపై అభిప్రాయములు, తన ప్రయోజనమునకై పరులను బాధించు పాపబుద్ధి తొలగును. ప్రేమ విస్తరించును. హరి సేవ పుట్టుకను దూరము చేయుననగా హరి సేవకుడు మఱల పుట్టడనగా శరీరములు పుట్టుచున్నను, ఇతడు హరి యందే జీవించును గావున ఇతనికి పుట్టుకలు లేనట్లే. హరి సేవలో పండిన వానికి, మరల పుట్టినచో బంధములలో ఇరుక్కొందునను భయముండదు. కారణము తనకు పుట్టుక లేదని అత డెఱుగును. చినిగిన వస్త్రమునకు బదులు క్రొత్త వస్త్రమును వలె నూతన శరీరములను ధరించునంతియే. హరి సేవలో మునిగిన వానికి ఎట్టి భయముండదు. మరల పుట్టరాదను సంకల్పము కూడ ఉండదు. స్వామి సంకల్పము నకు

ఇతడు సమర్పితుడగును. పుట్టుటయే బంధమని భావించినచో పూర్వజన్మలోనే భగవదనుభూతి కలిగిన యోగీశ్వరుడగు అన్నమయ్య మరల ఏల పుట్టెను? తాను పుట్టలేదు. శరీరమును ధరించెను. షిర్డీ సాయిబాబాయు దీనినే చెప్పెను. తన కెన్నియో శరీరములు గడచినవి గాని, తనకు పుట్టుక లేదు. ఇట్టిదానికే పూర్వజన్మ జ్ఞానముండును. సాయిబాబా కిది కలదు. అన్నమయ్యయు ఇట్టివాడు. ఇతనియందు శరీరముండును గాని, ఇతడు శరీరమునందు చిక్కుకొనడు. కావున వారి సేవ భవ దూరమనగా శరీరము పుట్టుచుండగా, తానే పుట్టుచున్నానను భ్రమను హరి సేవ తొలగించుననియే భావము. హరి సేవ పరమ మంగళము. మంగళ మనగా శుభ మనియు, క్షేమ మనియు అర్థము. మొదటి పాదమున 'నిఖిల శుభకరం' అని చెప్పిన అన్నమయ్య మరల పరమ మంగళమని ప్రయోగించెను. హరి సేవ వలన హరి సాన్నిధ్యమను శుభస్థితి కలుగుటతో ఆనందము నిలుచుటతో బాటు, ఐహికముగా ఇతనికి కావలసినవి కూడ దేవుడు తీర్చునని యర్థము. దీనినే క్షేమ మందురు. మొదటిదానిని యోగమందురు. యోగ క్షేమములు రెండును కలిసి పరమ మంగళము. సహజమున తోటివారికి వలసినవి తాను కూర్చుటయను హరిసేవ వలన, వారి రూపములలోని హరి ప్రీతుడై, ఇతనికి వలసినవి సందర్భమును బట్టి సమకూర్చును. వానిని తీర్చునను ఆశతో హరి సేవ చేసిన వానికి హరి మీద గాక తనకు కావలసిన వానిపై ప్రేమ గావున, అవి తీర్చబడవు. ఒకరికి కావలసిన వానిని వేరొకడు తీర్చుట యను అల్లికను భగవంతుడు ఏర్పరచెను. ఇంకొక చిత్ర మయిన అర్థము 'మంగళమ'ను పదమునకు గలదు. వేంకటేశ్వరుడు పరమ మంగళదాయకుడు. మరియు కేశములు, మనస్సులో మొలుచు అభిప్రాయములకు, కామ క్రోధాదులకు గుర్తులు. వీనిని హరి సేవ పూర్తిగా తొలగించి మిక్కిలి హాయిని గూర్చును. హరి సేవ యొక్క మహిమ భావించుట వీలుగానిది. హరి సేవ చేయువాని మనస్సు, భావములు పనిచేయవు. హరియే ప్రేమరూపుడై, రసరూపుడై నిలుచును. హరి సేవ వలననే గజేంద్రుని శ్రీహరి కాపాడెను. తన సొంత బలముతో మొసలితో పోరాడినంత కాలము, దేవుడు కాపాడలేదు. తన బలము క్షీణించి, 'కావవే వరద, సంరక్షించు భద్రాత్మకా' అని ఆర్తితో పిలువగనే శ్రీహరి నిరాయుధుడై ఎదుట నిలిచెను. అతనిని కాపాడెను. వరము నిచ్చెను. అనగా ఎల్లరిచే వరింపదగిన సారూప్య ముక్తి నిచ్చెను. కావుననే గజేంద్రుడు – భగవంతుని స్పర్శతో అజ్ఞాన బంధముల నుండి విముక్తుడై భగవంతుని రూపమునే ధరించి పీతవసనుడు, చతుర్భుజు డయ్యెనని భాగవతమున వ్యాసుడు వర్ణించెను. సారూప్యముక్తి యనగా తన రూపము దేవుని రూపముగా అర్పితమై, తన రూపమున కూడ దేవుడే చరించుచుండెనని అనుభవముగా తెలియుట. ఇదియే వరము. మొసలి బారినుండి కాపాడుట ఒక వంతు. ఇట్టి వరము నిచ్చుట వేరొక వంతు. గజేంద్రుడు ఆపదలో ఆర్తుడయిన భక్తుడు. భగవత్ స్పర్శ వలన ముక్తుడైనాడు. ఆర్తుడు, ప్రయోజనము నపేక్షించువాడు, సాధకుడు, సిద్ధుడయిన జ్ఞాని – నలుగురు తన సేవకులే. మొదటి ముగ్గురు కూడ క్రమముగా నాలుగవ పద్ధతికి చేరుకొందురు. వారిని పరిహసింపరాదు. సుగ్రీవాదు లంతియే. కోరికలతో దేవుని కొలుచు వారిది నిర్మలభక్తి కాని మాట నిజమే. అది ప్రారంభ స్థితి. కాని క్రమముగా వారే దేవునే కోరు స్థితికి చేరుకొందురు. కోరికలతో దేవుని సేవింపరాదని వారిని నిర్బంధించినచో, వారి బుద్ధి చెదరిపోయి, దేవుని సేవించుటయే మానుదురు. వారి పరిణామము నడ్డుకొన్న

పాపము నిర్బంధించిన వారి నంటుకొనునని కృష్ణుడు గీతలో చెప్పెను. కోరికలు తీరినను, సుఖము లభింపక, అసలయిన సుఖము దేవుడే యని గ్రహించి ఆర్తులు దేవుని సహజముగా సేవించు స్థితికి చేరుదురు. దేవుడు ఇట్టివారి కోరికలు కొన్నిటిని తీర్చినట్లు నటించి, తన వైపుకు వారి నాకర్షించి, క్రమముగా తనయందు వారికి నిర్మలభక్తిని పాదుకొల్పును. వేంకటేశ్వరుని లీల ఇది. సాయిబాబాయు దీనినే చెప్పెను. గజేంద్రుడనగా మనలను మనమే కాపాడుకొన గలుగుదుమను అతిశయభావము. మొసలి అనగా సంసార బంధము. అతిశయమును వదలి దేవుని శరణందినచో, సంసార బంధము తొలగి, జీవుడు దేవుడే యగును. జ్ఞాని యనగా పండితుడు గాడు. సర్వము హరిమయమను అనుభవము గలవాడు.

3వ చరణము యొక్క తాత్పర్యము

"పద్మనాభుడగు స్వామిని ఎల్లప్పుడు స్తోత్రము చేయుట సులభ మయినది. చేయుటకు తేలిక అయినది. శోకమును నశింపజేయునది. ఫలము నిచ్చునది. కోమలమయినది. భయమును తొలగించునది. అలంకారమైనది. శ్రీవేంకటేశ్వరుని శరణు పొందుటయే ఆయనను స్తుతించుట."

వ్యాఖ్య

జలజోదరుడనగా పద్మనాభుడగు నారాయణుడు – సృష్టి యొక్క మొగ్గ అగు వెలుగుల ముద్దను తాను కేంద్రముగా ధరించినవాడు. అట్టి స్వామిని స్తుతించుట చాల సులభము. శాస్త్రముల విజ్ఞానము గడించుటకు, ధన సంపాదనకు, ఇతరము లగు ఐహికములగు విషయములను పొందుటకు ఎంతయో శ్రమపడవలెను. ఇందులో చాల కొద్ది వంతు సాధన చేసినచో దేవుని స్తుతింపవచ్చును. ఇందు శ్రమ లేదు. హాయి ఉన్నది. సులభమనగా మంచిగా, హాయిగా లభించునది. దేవుని స్తుతించు కోరిక యున్న చాలును. మాట లవియే వచ్చును. దేవుని స్తుతించు మాటలలో వ్యాకరణ దోషములున్నను, అవి మనస్సను సరస్సులో హృదయ పద్మమును సమర్పించు స్వరములు గావున – పవిత్రములై వేదములుగా వెలుగొందుచున్నవి. స్వామి పాదపద్మము నందలి తేనెయే, మనము స్వామిని స్తుతించు అక్షరముల గుంపు. స్వామిని గూర్చి ఎట్టి వాగుడయినను శాస్త్రము, సాహితీశిల్పమే యగుచున్నది. స్వామిని గూర్చిన స్తుతులు గాక, అలంకారములతో, వ్యాకరణ నిబంధనలతో కూడిన కవిత్వమయినను ఇతరములయినచో అవి పందికొక్కు కన్నములు, కాకుల శబ్దముల వంటివి. అలంకారములు, వ్యాకరణ నిబంధనలు మనము ఏర్పాటు చేసికొన్నవే గదా. కావున భగవంతుని గూర్చి ఇవి లేకున్నను మనసార జానపదులు స్తోత్రము చేసినను ఆ పలుకులు వేదములే. స్వామిని స్తుతించుటకు కావలసినది పాండిత్యము గాదు, నిర్మల భక్తితోడి హృదయము. కావున దేవుని స్తుతించుట తేలిక. దేవుని స్తోత్రము చేయునపుడు ఆనంద పారవశ్యమున కర్త, కర్మ యగుచున్నాడు. అనగా స్తోత్రము చేయు భక్తుడు, స్తుతింపబడు భగవంతుని యందుండును. భగవంతుడు శోకరహితు డగుటచే ఇట్టి భక్తుడు కూడ శోకము లేనివాడగును. పూర్వమున్న శోకములు, మనస్సును పీడించుచున్న చిక్కులు స్వామి స్తుతితో వైదొలగును. స్వామిని స్తుతించుట ఫలము నిచ్చునది. అన్నిటికన్న గొప్ప ఫలమేది?

కైవల్యమే. ఈ చరణమును పల్లవికి అనుసంధింపవలెను. ఫలాపేక్ష కలుగని స్థితియే గొప్ప ఫలము. ఫలాపేక్ష ఎప్పుడు తొలగును? అది మఱపునకు వచ్చినపుడు. ఆ మఱపు ఎప్పుడు కలుగును? భగవన్నామమును, గుణములను స్తోత్రము చేయుచున్నప్పుడు కలుగును. నిర్మల గంగానది అలలపై హాయిగా ఈదులాడు రాజహంస ఇతర నదులలోనికి పోవునా? తీయమామిడి చిగుళ్లు తిని చొక్కుచు కూయు కోకిల కొండమల్లెల వైపు పోవునా? అట్లే భగవంతుని స్తుతించుటలో మత్తెక్కిన మనస్సు ఇతరములయిన ఐహిక ఫలముల వైపు మరలునా? భగవత్ స్తుతి చాల కోమలమయినది. హృదయమునకు మెత్తదనమును, సుకుమారత్వమును కలిగించునది. లలితమైన దనగా ఉల్లాసమును గూర్చునది గూడ. ఐహిక విషయములను గూర్చి, శాస్త్ర విజ్ఞానమును గూర్చి మాటలాడు వానికి, వినువానికి ఎప్పటికయినను విసుగు కలుగకుండ ఉండదు. కాని భగవంతుని స్తోత్రము చేయుకొలది ఉల్లాసము పెరుగుచు పారవశ్యమునకు దారితీయును. హాయి కావలెనని ఎవ దనుకొనడు? కావున ప్రతివాడును ఎప్పటికయినను హాయి, ఉల్లాసము కావలయునని భగవంతుని స్తోత్రము చేయుటకు సిద్ధపడక తప్పదు. భక్తులను, మంచివారిలోని మంచిని స్తుతించుటయు భగవత్ స్తుతియే యగును. తనకన్న ఇతరమును చూచు భేదదృష్టి వలన భయము కలుగును. తాను, ఇతరములు అయి ఉన్న అంతర్యామి యగు భగవంతుని స్తుతించుచుండగా భయమునకు తావుండదు. తన ఆశ నెరవేరదేమో అను భయము, తన భవిష్యత్తు ఎట్లుండునో అను భయము, మృత్యువు కల్గునని భయము కొందరిని పట్టి పీడించుచుండును. తనకు అండ ఎవరను భీతి కొందరిది. కాని భగవంతుని ప్రీతితో స్తుతించుచుండగా, ఆశలే ఉండవు గాన అట్టి భయముండదు. అనంతకాలము తానే అయిన స్వామి అండగా నుండగా అండను గూర్చి, భవిష్యత్తును గూర్చి భయముండదు. భగవంతుని స్తోత్రము చేయువాడు దేహమును విడుచునే గాని మరణింపడు. కావున అతనికి మృత్యుభీతి యుండదు. భారతమున ధర్మరాజును యక్షుడు 'బ్రాహ్మణుడెవర'ని యడిగెను. ధర్మరాజిట్లు బదులు చెప్పెను. "దీర్ఘ క్రోధము లేనివాడు, మరుక్షణ మేమగునో అను చింత లేనివాడు, మృత్యుభీతి లేనివాడు బ్రాహ్మణుడు." భగవంతుని స్తోత్రమే ఆతనిని శరణందుట యగును. శరణందుచున్నాను అను మనస్సు గూడ భగవంతుని గుండె నిండుగా స్తోత్రము చేయునపుడు తన యునికిని గోల్పోవును. అపుడు దేవునకు శరణాగతి జరుగును. కావున శరణాగతిని కోరినవాడు, సదా దేవుని స్తోత్రము చేయుచుండవలయును. ప్రతిదినము ఒకవేళకు చేయుటయే గాక, దినచర్యలో, కర్తవ్య నిర్వహణలో మనస్సులో చేయవలెను. ఇది అలవాటగుటకుగాను ఒకరితో మాటలాడుటకు ముందు, పనిచేయుటకు ముందు భగవన్నామమును మనసా ఉచ్చరింపనగును. మానవునకు అలంకారమేది? నగలు, ధన వస్త్రాదులు, పదవులు, కీర్తి, పాండిత్యము గావు. తనలోని భాగములగు శరీరాదులే తనవి గావు. తానే భగవంతునికి చెందినవాడు. ఇక తన చుట్టునున్న ఆస్తిపాస్తులు, నగల వంటివి తనవి ఎట్లగును? నిజమయిన అలంకారము సర్వాంతర్యామి యగు స్వామిని స్తోత్రము చేయుటయే. స్తోత్రము చేయుకొలది శరణాగతి కూడ పరిపూర్ణమగుట జరుగును. స్తోత్రమే శరణమని అన్నమయ్య నొక్కి చెప్పుచున్నాడు. శరణమే స్తోత్రము కూడ. శరణందిన కొలది స్తోత్రమున ప్రీతి, హాయి పెరుగును. ఈ రెంటి సంబంధము యొక్క అల్లిక ఇది. దేవుని స్తుతించని నోరు ఏవో శబ్దములు చేయు

ధక్క అని భాగవతము చెప్పుచున్నది. ఇట్లు అన్నమయ్య శ్రవణము, సంకీర్తనము, సేవ, స్తోత్రము అను భక్తి మార్గములను ప్రతిపాదించెను. వీనిని పల్లవికి జోడించెను. ఈ భక్తి మార్గములు అంతర్యామికి అన్వయింపబడినచో భక్తి మార్గములగును. ఈ ప్రయత్నము లేకుండ విగ్రహమునో, పటమునో మాత్రమే ప్రేమించి ఈ భక్తి మార్గములను రుద్దినను అంటవు. ఒకప్రక్క భక్తి యను పేర మనమనుకొను ఇష్టదైవముపై మమకారము పెరుగుచుండును. ఇంకొకవైపు సాటివారిపై రాగద్వేషములును పెరుగుచునే యుండును. కావున తన ఇష్టదైవమగు శ్రీవేంకటేశ్వరుని అంతర్యామిగ దర్శించి, తాను చెప్పిన భక్తి మార్గములను అవలంబించుట చేత, అన్నమయ్యకు స్వామి గాక ఇతరము లేదు, తాను గూడ లేదు. కైవల్యము దక్కెను. మన కీతడు ఆదర్శ మార్గమును సూచించెను. ఈ సంకీర్తనమున సామీప్య ముక్తి, సారూప్య ముక్తి, సాయుజ్యముక్తి దాగియున్నవి. సాయుజ్యముక్తి సదా నిలుచుటయే అన్నమయ్యకు దక్కిన కైవల్యము. శ్రీరాముడు వనవాసమున కేగుటకు ముందు కైకమ్మతో ఇట్లు చెప్పెను. “నన్ను కేవలము ధర్మము ఆశ్రయము గలవానిగా ఎఱుగుము”. అనగా తాను, తాను చేయుచున్న ధర్మము, తాను ఎవరియెడల ధర్మము చేయుచున్నానో అట్టివారు ఒకటే అయిన స్థితి తనదియని యర్థము. కైవల్యస్థితి యున్నను, ఆ స్థితిలోని మహాభక్తుని ప్రజ్ఞ యన్నను ఒకటియే. ఇదియే వైకుంఠము. కుంటువడని, జారిపడని ఉత్తమ స్థితి. వైకుంఠమన్నను, వైకుంఠుడయిన విష్ణువన్నను ఒకటియే. అట్లే అన్నమయ్యకును, అతనిని పొందిన కైవల్యమునకు భేదము లేదు. పోతనయు భాగవతమున మొదటి పద్యముననే ‘శ్రీకైవల్యపదంబు’ అని ప్రయోగించెను.

* * *

18

4వ సం-419

కలిగె మాకిదె

భౌళిరామక్రియ

కలిగె మాకిదె కైవల్యసారము
ఫలించె నాడెదఁ బాడెద నేను. ॥ పల్లవి ॥

నీ పాదతీర్థము నీరజభవుని
పైపై కమండలపానీయము
చేపట్టి శంభుని చిరుజడలలో
దీపించు గంగాతీర్థరాజము. ॥ కలిగె ॥

ఘన నీ నామమె గౌరినాలికపై
పనిగొన్న మంత్రపాఠము
అనుఁగువాణికి నాది చదువులఁ
బెనఁచే మొదలి బీజాక్షరము. ॥ కలిగె ॥

శ్రీవేంకటేశ్వర చేరి నీ దాసుల
సేవ నాపాలిఁటి జీవనము
ఆవిటించి శరణాగతులకును
త్రోవయైన దిదె దోషహరము. ॥ కలిగె ॥

దేవుని గనలేని జ్ఞానముకన్న,
ఆతని కనగలుగు అజ్ఞానమే చాలు.

టీక

పెనచు = కూడు, అనుగు = ప్రీతిగొలుపు, మురిపముల, ఆవిటించి= లభించి.

పరిచయము

అన్నమయ్య ఈ సంకీర్తనమున ఉత్సాహ ముప్పొంగగా భగవంతుని నామ మహిమను కీర్తించుచున్నాడు. భగవన్నామ సంకీర్తనమే కలియుగమున కైవల్య ప్రదము. ధ్యాన యాగాదులను కలియుగవాసులు సుదీర్ఘకాలము చేయలేరు. మనస్సు చలించుట చేతను, ప్రక్రియ మీదనున్న శ్రద్ధ భగవంతునిపై నుండుట లేకపోవుట చేతను, అందు రుచి ఎక్కువసేపు సాధకులకు లభింపదు. యాగాదుల కన్న ధ్యానము, అంతకన్న ప్రార్థనము, అంతకన్న పూజ, అంతకన్న భగవన్నామ సంకీర్తనము అతి మధురములై మనస్సును లోగొనును. దినచర్యలో గూడ వలసిన పనులు చేయుట వఱకు మనస్సు పనిచేయుచు లోపల నామ స్మరణ సాగించుట మంచిది. ఎవరితో నయినను వ్యవహరించునపుడు, వారెట్లు ప్రవర్తించుచున్నను నామస్మరణ యున్నచో సాధకుడు సాధననుండి జారిపోడు. ఇతరులలో అంతర్యామిని దర్శించుటకు నామము ఎంతయో ఉపయోగపడును. ఉదాహరణకు, అవతలివాడు గౌరవించినను, కోపించి నను సాధకుడు భగవన్నామపు తీయని రుచి మరగియున్నచో అవతలివానితో ఉద్వేగము లేకుండ ప్రవర్తించును. పరిస్థితులను బట్టి, తోటివారి సరళిని బట్టి సాధకుని మనస్సు చలించదు. నామమెచట ఉండునో, అచట నామియగు స్వామి సాన్నిధ్యము వెలుగుచుండును. దానితో ఆనందానుభూతికి విరామముండదు. నామమునకును, నామికిని భేదము లేదు. నామసంకీర్తన వలననే తుకారాం, మీరాబాయి, అన్నమయ్య మున్నగువారు కైవల్యమునందిరి. ఇది ముక్తికి సులభోపాయము. మొదట్లో అంత భక్తి లేకున్నను నామము సంకీర్తించుచున్న కొలది అనుభూతి మాధుర్యము పెరిగి, క్రమముగా భక్తి పూర్ణమగును. నామ సంకీర్తనము చేయువానినే గాక, పరిసర వ్యక్తులను ఆనందసాగరమున నోలలాడించగలదు. పరిసరములను ప్రభావితము చేయగలదు. అన్నమయ్య మొదటి చరణమున స్వామి పాదజలముల మహిమను, రెండవ చరణమున స్వామి నామము యొక్క మహిమను, మూడవ చరణమున హరిదాసులసేవ యొక్క మహిమను కొనియాడుచున్నాడు. ఈ మూడును సాధనలో ప్రధానములే. చరణములందలి భావమును అనుభవించి, ఆపైన పల్లవితో జోడింపవలెను. పల్లవి, చరణముల సారము వంటిది. అన్నమయ్యలో ఈ ప్రత్యేకత గలదు. తాను రచించిన 'సంగీత లక్షణగ్రంథము'న గూడ ఈ యంశము నాతడు ప్రస్తావించెను. ఈ సంకీర్తన సాధకులకు కరదీపిక. కొంగుబంగారము.

పల్లవి యొక్క తాత్పర్యము

"మాకు ఇదిగో, ఇంత తేలికగా కైవల్యము యొక్క సారము లభించినది. నాకు ఫలించినది. నేనిక ఆడెదను, పాడెదను".

వ్యాఖ్య

చరణములను బట్టి, పల్లవి యొక్క భావము అనుభవమునకు వచ్చును. చరణము లలో చెప్పినట్లుగా స్వామి పాదతీర్థ సేవనము వలన, స్వామి నామ సంకీర్తనము వలన, హరిదాసుల సేవ వలన తనకు కైవల్య సారము కలిగినదని అన్నమయ్య ప్రకటించుచున్నాడు. 'మాకు' అని బహువచనమును ప్రయోగించెను. అనగా తనను తాను పొగడుకొనుట గాదు. తనకును, తనతో బాటు పై కార్యక్రమములందు పాల్గొనిన భక్తులకును కైవల్యసారము లభించినదట. కైవల్యము యొక్క సారమనుట కన్న కైవల్యమనెడి సారమనుట సముచితము. కైవల్యమనగా కేవలత్వము. భగవంతుని నిత్యము స్మరించి, ఆయనను సేవించి ఇక తనయునికి అంతర్యామియందు కరగి తానుండక స్వామియే తన స్థానమున నుండి జీవించుట – అనగా స్వామితో ఒకటి యగుటయే కైవల్యము. ఇదియే జీవిత సారము. జీవించినందులకు సార్థక్యమిదియే. కైవల్యము నందిన అన్నమయ్య వంటి భక్తునిలో భగవంతుడే తలంచును, నిశ్చయించును, నిర్ణయములు గైకొనును, సంకల్పించును, మాటలాడును, శ్వాసించును, సర్వేంద్రియములతో ప్రవర్తించును. బాహ్యప్రపంచముతో వ్యవహరించును. శరీరముతో పనిచేయును. ఇతనికి ఇతరముండదు. తానే ఉండదు. అంతయు, అందరు స్వామియే. స్వామియే ఇతని చిత్తము, బుద్ధి, మనసు, ప్రాణము, ఇంద్రియములు, దేహము. స్నానాది నిత్య దినచర్యలు గూడ ఈతడు చేయడు. స్వామియే చేయును. స్వామియే భుజించును. కావున పరమప్రేమ, ఆనందము తప్ప వేరు అనుభవముండదు. మరి ఈతని స్థానమెక్కడ? ముందు స్వామి పాదముల యందు, ఆపై స్వామి హృదయమందు. హనుమంతుడు చక్కని యుదాహరణము. కావున జీవితసారమే కైవల్యము. కైవల్యమునకు మఱల సారమని యుండదు. కైవల్య సారము – షష్ఠీతత్పురుష కాదు. కైవల్యమే సారమయిన స్థితి. ఈ స్థితికి చేరుకొనుటతో – ఈ స్థితియే అన్నమయ్యను వరించుటతో అతని జీవితము సఫలమయినది. తనకే గాక, తోటి భక్తులకును, కైవల్యము కలుగుటలో వారి సాధనకు ఇతడు తోడ్పడుట వలన గూడ ఇతని జీవితము సఫలమయినది. ఇక పారవశ్యాను భూతిలో మునిగిన అన్నమయ్య స్వామి నామ వైభవములను గూర్చి పాడెదను అనుచున్నాడు. అంతకుముందే, ఆ యనుభూతి తన భౌతికకక్ష్యలోనికి దిగివచ్చి, ఆడకుండ ఉండలేనని ప్రకటించుచున్నాడు. ఆడుట, పాడుట తన వశమున లేవు. స్వామి ఆడించును, పాడించును. క్రమమున స్వామియే తనను పూని ఆడును, పాడును. సాధారణముగ నోటితో పాడుట, ఆపై దేహముతో ఆడుట అను వరుస పాటింపబడును. ఇచట ఈ వరుసను తలక్రిందులు చేసెను. అతని యనుభూతి యది. కాదనుటకు మనమెవ్వరము? అతనిలో ముందుగా పారవశ్యానుభూతితో దేహము ఆడెను – అనగా నృత్యము గావించెను. ఆపైన నోరు పాడెను – అనగా సంకీర్తనము గావించెను. ముందుగా ఏల పాడలేదు? అనుభూతి హృదయమున నుండగా పాడుటకు వాక్కు వెలువడుట సాధ్యము గాదు. వాక్కు మూగవోవును. కావున ఆ యనుభూతి ముందుగా శరీరము మీదకు దిగివచ్చి, నృత్యము సాగును. ఆపైన స్వామియే మన కొఱకై, అన్నమయ్య నోటినుండి తన యనుభూతిని సంకీర్తనము గావింపును. అంతేగాని సాధారణ సాధకులలో వలె, అతనిలో అనుభూతి తరిగినదని భావింపరాదు. అయినను ఈ

ఆట, పాట – రెండును స్వామి అనుభూతి యొక్క అవరోహణములు. ముందు అన్నమయ్య ప్రజ్ఞ స్వామి స్థితికి ఆరోహణ చేసినది. ఆపైన అనుభూతి ఆటగా, పాటగా అవరోహణము చేసినది. స్వామియే ఆట, పాట. కొంతసేపటికి ఆట, పాట సమకాలికములగును. చైతన్యాది మహాభక్తులలో ఇది సాగినది.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"నీ పాదతీర్థము నీటినుండి పుట్టిన పద్మము నుండి పుట్టిన సృష్టి కర్తయగు బ్రహ్మదేవుని చేతి కమండలువు నందలి పానీయము. శివుని చిన్న జడలలో తానుగా ప్రవేశించి ప్రకాశించు గంగాతీర్థము. ఇది తీర్థములలో శ్రేష్ఠమయినది."

వ్యాఖ్య

తీర్థమనగా తరింప జేయునది. స్వామి పాదజలము సంసారమును తరింప జేయును. అన్నమయ్య బ్రహ్మను నీరజభవు డనెను. ప్రళయ స్థితి జలమయమని పురాణములు వర్ణించినవి. ఇవి మన మెటిగిన నీరు కాదు. సముద్ర జలములలో ఉప్పు కరిగియున్నట్లు దేవునియందు సృష్టి కరిగియుండును. నారాయణుని పాదతీర్థమును బ్రహ్మ, శివుడు సేవించి వరుసగా సృష్టి లయములు గావింపగలుగు చున్నారు. ఇర్వురును విశ్వమందు అంతర్యామి యగు విష్ణుని, విశ్వ సృష్టి లయములు గావించుచు సేవించుచున్నారు. సృష్టి లయములు సదా జరుగుచునే యుండును. ప్రతి పదార్థము నందును పాత అణువులు తొలగును, క్రొత్త అణువులు ఏర్పడు చుండును. మధ్యలో స్థితి ఒకే విధముగా నున్నట్లు కనిపించును. ఉదాహరణకు, ఒక సెలయేరు కొండపై నుండి క్రిందకు దిగుచున్న దృశ్యమును పరికింపగా, పాత నీరు పోవుట, క్రొత్త నీరు దూకి పడుట, జలపాతపు ఆకారమట్లే ఒకే రీతిలో కాన వచ్చుట తెలియును. ఇట్లే సృష్టి లయములు పదార్థములలో, సౌర కుటుంబములలో సదా జరుగుచుండును. కొందరు సూర్యులు చోటులో లీనమగుచుండగా, క్రొత్త సూర్యులు వెలువడుచుందురు. అంతయేల? ఒకే క్షణమున భూమిపై ఎందరో జీవుల శరీరములు ఏర్పడుచున్నవి. ఎందరో జీవుల శరీరములు నాశనము పొందుచున్నవి. ఇట్లు నిరంతరము సాగు సృష్టి లయముల నడుమ స్థితి యుండును. సృష్టి లయములు చేయు సామర్థ్యములు బ్రహ్మకు, శివునకు నారాయణుని పాదసేవ వలన సంక్రమించు చున్నవి. లయ కారకుడగు శివుడును తాను చేయు లయ కార్యము విశ్వరూపుడగు విష్ణుని సేవగనే భావించుచున్నాడు. స్వామి బ్రహ్మ, శివులు – వీరిర్వురు తనలో గల వెలుగు కావుననే స్వామికి కేశవుడను పేరువచ్చినది. 'క+ఈశ'– క = బ్రహ్మ. ఈశ = శివుడు – వీరిర్వురును తనయందు గల వెలుగు – పరంజ్యోతి నారాయణుడు గావున ఆతనికి కేశవుడను పేరు వచ్చినది. బ్రహ్మకు, శివునకే పూజ్యములయిన స్వామి పాద తీర్థమును మనము కూడ సేవింపవలెనని అన్నమయ్య తాత్పర్యము. బ్రహ్మ వలె పానము చేయవలెను. శివుని వలె శిరసున ధరింపవలెను. ఇందలి గూఢార్థమిది. సమస్త జీవులను విష్ణునిగా భావించి, వారి సేవలో ధన్యుడు గావలయును. తల్లిదండ్రుల, ఆచార్యుల పాదసేవ చేయవలెను. విశ్వమే స్వామి పాదము. విశ్వ సేవయే

స్వామి పాదసేవ. ఇది చేయునపుడు బ్రహ్మ పొందిన భావన, శివుడు పొందిన భావన పొందవలెను. ఎవరి పాదములకు నమస్కరించినను ఈ భావన పట్టియుంచవలెను. ఇది అన్నమయ్య చేసిన సాధన. వామనావతారమున స్వామి మూడు లోకము లాక్రమింపగా ఆయన పాదములను బ్రహ్మ, నారదుడు తెచ్చిన జలములతో కడిగినట్లు పురాణగాథ. అనగా మూడు కక్ష్యలతోడి విశ్వమునే రూపముగా గల విష్ణుని సేవించెను. అన్నమయ్య ప్రతిదినము శ్రీవేంకటేశ్వరమూర్తి పాదతీర్థములను సేవించె ననుమాట నిజమే. ఇంతమాత్రమే కాదు, విశ్వరూపుడయిన విష్ణునిగా అతనిని సంభావించి సేవించెనే కాని, వట్టి మూర్తిగా గాదు. తన హృదయ మను క్షేత్రమును స్వామి పాదతీర్థముతో తడుపగా భక్తి మొలకలెత్తి కైవల్యమను పంట పండినది. శివుడు, నారాయణుని పాదతీర్థములను తన శిరసున ధరించినట్లు అన్నమయ్య భావించుటలో ఇంకొక విశేషము గలదు. తనను హరి స్వరూపుడుగ భావించి జనులు తన పాదములకు నమస్కరించిన సందర్భమున అతనికిట్లు భావన గల్గినది. తనలోని నారాయణుని పాదములకే వారు నమస్కరించుచున్నారనియు, తన పాదములను శిరసున ధరించువారుగా నున్నది శివుడే అనియు, కావున వారిని తక్కువగా చూడరాదనియు, శివుడన్నను, నారాయణుడన్నను ఒకే వెలుగు యొక్క రెండు స్థితులే గావున, తన పాదములకు శిరస్సుతో మ్రొక్కువారిలో నున్నది దేవుడే అనియు. ఈ జలములు చైతన్యమయములు. ఇందు నాళమొకటి పుట్టెను. అనగా ప్రళయమందలి చోటులో కొంతభాగము నాళము వలె ఏర్పడెను. దీని చివఱ పద్మము రూపమున వెలుగులముద్ద పుట్టి వికసించును. రాబోవు సర్వజగత్తు యొక్క మూలము దీనియందే యుండును. ఈ పద్మము నుండి నారాయణుడే సృష్టి చేయుట కొరకై వేరుగా బ్రహ్మగా వచ్చును. ఉదాహరణకు నిద్రలో నుండినది అంతర్యామి యగు దేవుని ప్రజ్ఞ యగు నేను. ఉదయము అందుండి ఫలానా వాడను 'నేను' అను పరిమిత ప్రజ్ఞ మేల్కాంచును. మొదటి 'నేనే' నారాయణుడు. రెండవదగు పరిమితమగు 'నేనే' బ్రహ్మ. నారాయణునిలో భాగమే బ్రహ్మ. బ్రహ్మ సృష్టిలో అంతర్యామిగ మఱల నారాయణుడు ఉండును. మనము మెలకువగా నున్నపుడు మన జీవప్రజ్ఞ – ఫలానా వాడను నేను అను ప్రజ్ఞతో బాటు, అందరిలో అంతర్యామి యగు అఖండమగు 'నేను' అను ప్రజ్ఞయు ఆధారమై యుండును. ఈతడే స్వామి. దేవునిలో భాగమైన బ్రహ్మ, దేవుని సేవించుట సహజము. బ్రహ్మదేవుడు సృష్టి చేయుటకు వలయు సామర్థ్యము స్వామినుండియే వచ్చును. తన చేతియందలి కమండలువునందు నీటితో స్వామి పాదములను బ్రహ్మ కడుగగా అవి తీర్థమయ్యెను. స్వామి పాదతీర్థమును తన కమండలువు లోనికి బ్రహ్మ నింపి పానము చేయుచున్నాడు. కావుననే అన్నమయ్య 'పానీయమ'ను పదమును వాడెను. ఈ కథ వామనపురాణమునందున్నది. స్వామి పాదతీర్థమును పానము చేయుట వలననే బ్రహ్మకు సృష్టి చేయు సామర్థ్యము కల్గినది. ఇందు వేదార్థమున్నది. స్వామి పాదమనగా విశ్వమే. తాను సృజింపబోవు విశ్వమునే స్వామి పాదముగ భావించి బ్రహ్మ సృష్టి కర్మను నారాయణ పాదసేవగా భావించెను. బ్రహ్మ యొక్క దృష్టిలో విశ్వమును సృజించుటే నారాయణ పాదతీర్థ పానము. తన సృష్టిలోని జీవులను తనకన్న తక్కువ స్థాయివారుగా భావింపక, బ్రహ్మ నారాయణమూర్తులుగ భావించెను. కనుకనే మొదటి భక్తుడు బ్రహ్మయే. సద్గురుపరంపరలో నారాయణుని తరువాత బ్రహ్మ యొక్క స్థానము సంప్రదాయమున నున్నది. మఱియు

స్వామి పాదతీర్థ మనగా స్వామి యొక్క ప్రేమప్రవాహములో భాగమే. దానిని స్వీకరించియే బ్రహ్మ సృష్టి చేయుట జరుగుచున్నది. ఇక స్వామి పాదమున పుట్టిన ఆకాశగంగా జలమే తానుగా శివుని చిన్న జడలలో ప్రకాశించు చున్నది. విష్ణుపదమను పేర బరగు శ్రవణ యను తారక యొకటి గలదు. దానికి సమీపమున ఈ తారకలోకము నుండి వెలువడిన కాంతిప్రవాహము ఒక సుడిగుండముగా రూపొందును. అదియే విష్ణు పాదముల నుండి పుట్టిన ఆకాశగంగ. అందలి కొంత కాంతిప్రవాహము 'ఆర్ద్ర' అను తారక యొక్క శిరముపై పడుచున్నది. ఈ తారకకు అధిదేవుడు రుద్రుడు. ఇట్లు శివుని జడలలో ఈ కాంతిప్రవాహము ప్రకాశించినది. మఱల ఇదియే మిగిలిన సూర్యుల కాంతిగా ప్రసరించినది. ఇంకను వేఱొక విశేషార్థమొకటి గలదు. సూర్యాంతర్వర్తి నారాయణుడు. నారాయణుని పాదతీర్థ మనగా సూర్యకాంతి. ఇదియే చంద్రుని లోనికి ప్రతిఫలించి వెన్నెలగా రూపొందు చున్నది. శివుడు చంద్రశేఖరుడు. కావున స్వామి పాదతీర్థ మితని జడలలో దీపించిన దని అన్నమయ్య వర్ణించెను. శివుని గూర్చి 'శంభుడను' పదమును ప్రయోగించెను. 'శంభు'డనగా జీవులకు కావలసినవి ప్రసాదించువాడు. సూర్యుని వేడిమి ఉన్నది యున్నట్లుగా నేలపై జీవులు భరింపలేరు. దానిని వెన్నెలగా మార్చినవాడై, వెన్నెల సాయముతో ఓషధులను పెంచి, జీవులకు ఆహారమును సమకూర్చును. ఇట్లు సృష్టి కారకుడయిన బ్రహ్మయు, లయ కారకుడయిన శివుడును జీవుల రూపములలోని విష్ణుని సేవించుచున్నారు. తనను గౌరవించు వారి రూపములలో నున్న దేవుడు, తానును వారిని గౌరవింపవలెనని నేర్పుచున్నాడనమాట. వారినే కాదు ఎల్లరిని గూడ. ఇట్లు సాధన చేసిన వానికి జీవన సాఫల్యమగు కైవల్యము దక్కును.

2వ చరణము యొక్క తాత్పర్యము

"గొప్పదైన నీ నామమే పార్వతీదేవి నాలుకపై నడయాడు మంత్రపాఠము. నీ నామమును కీర్తించుటయే ఆమె పని. ఇక ప్రీతిగొలుపునట్టి మురిపముల సరస్వతికి మొదటి చదువులందు కూడునట్టి మొదటి బీజాక్షరము."

వ్యాఖ్య

గౌరి యనగా గిరి రాజు కుమార్తె గావున పార్వతీదేవి యని యర్థము. మఱియు గిరి అనగా వాక్కు. గౌరి యనగా వాక్కు నుచ్చరించుట కాధారమయిన శక్తి. అట్టి పార్వతి స్వామి యొక్క గొప్ప నామమునే పనిగట్టుకొని వేదమంత్ర పాఠముగా సతతము పాడుకొనుచున్నది. ఇది పురాణ ప్రసిద్ధము. వాక్కుకు ఆధారమయిన గౌరికి నీ నామ స్మరణ వలననే ఆ శక్తి వచ్చినదని అన్నమయ్య భావము. వాక్కుతో మనము ఏమి ఉచ్చరించినను స్వామి నామమగు 'ఓంకారము' యొక్క విస్తరణమే. స్వామి నామము 'ఓంకార' మని ఉపనిషత్తులందున్నది. పతంజలియు తన యోగ సూత్రములందు చెప్పెను. ఓంకారనాదము యొక్క విస్తరణమే సమస్త వాఙ్మయము. ఇది తెలిసి యుచ్చరించినపుడు మనము ఇతరులను పిలుచునపుడు స్వామినే పిలిచెదము. అన్ని మాటలు ఆయన నామ విస్తారమే అని ఎఱిగినపుడు ఇతరులతో

మాటలాడునపుడు, స్వామినే గానము చేసినట్లు, సంకీర్తనము చేసినట్లు ఆహ్లాదకరముగా మాటలాడుట జరుగును. అన్నమయ్య వంటి మహాభక్తుని విషయమున ఆతడుచ్చరించిన ప్రతి పదము కూడ భగవంతుని సంకీర్తనమే. ఇట్టివానిదే జీవితము. ఇదియే జీవిత సాఫల్యము, కైవల్య సారము. ఇతరులను నిందించుటకు మనము పార్వతీదేవి యిచ్చిన సామర్థ్యమును ఉపయోగించినచో భగవన్నామమునకు అపచారము చేసినట్లే. ఇతరుల కంటిలోని నలుసును తీయుటకు ముందు నీ కంటిలో దూలమును తొలగించుకొనుమని ఏసుక్రీస్తు చెప్పినదిదియే. సాటివారిని గూర్చి నిందావాక్యములు, అపవాదులు వారితో ప్రత్యక్షముగా గాని, వారి పరోక్షమునగాని పలుకుట గౌరీదేవికి, స్వామికి అపచారము చేసినట్లే. అది అసత్యమయినను, సత్యమే అయినను సర్వాంతర్యామి దర్శనాన్ని భగ్నము గావించి, పవిత్రతను తొలగించి హృదయమును కలుషితము గావించును. సాటివారిని గూర్చి నిందావాక్యములు పలుకుట, వారి పాపములను భుజించినట్లే అని షిర్డీసాయి బాబా సెలవిచ్చెను. మఱియు గౌరి యనగా తెల్లరంగు గలది, అరుణకాంతి గలదనియు అర్థము. వేదమున ఈ యర్థము చెప్పబడినది. కావున గౌరీదేవి యనగా తెల్లని సూర్యరశ్మిలోను, ఉదయించు సూర్యుని అరుణకాంతి లోను గల శక్తి యనమాట. ఇట్టి సూర్యకాంతి ఏమి చేయుచున్నది? సదా స్వామి నామమును మంత్రముగా గానము చేయుచున్నది. మంత్ర మనగా మననము చేయుట వలన రక్షించునది అని యర్థము. మన మెఱిగిన భాషలో గాదు, సూర్యకాంతికిని దాని భాష దానికున్నది. స్వామి యొక్క గొప్ప నామమును మననము చేయుటయు, పఠించుటయు చేయుట వలననే సూర్యకాంతి ప్రకాశించుచు మనకు వెలుగు నిచ్చుచున్నదని అన్నమయ్య భావము. ఇచట అన్నమయ్య సంబోధన చమత్కారముగా నున్నది. 'ఘన నీ నామమె' – నీయొక్క ఘనమైన నామమని సామాన్యార్థము. ఘన నీ నామమె – ఓ గొప్పవాడా, నీ నామమని విశేషార్థము. ఘనమనగా మేఘ మనియు వేదార్థము. సూర్యకాంతి భగవన్నామమును గానము చేయుట అనగా నీటిని ఆవిరిని పైకి తెచ్చి మబ్బును అర్చించుట యని వేదభావము. స్వామి నీలమేఘశ్యాముడు గదా. ఇక సరస్వతీదేవి స్వామికి ప్రీతిగొలుపు కోడలు. మురిపాల తల్లి. అసలు సృష్టి చేయు విజ్ఞానమే సరస్వతి. ఈమెను కల్పించి బ్రహ్మ వద్దకు నారాయణుడు పంపెనని భాగవతమున మైత్రేయుడు తెలిపెను. ఇది ఒక సంకేత కథ. సరస్వతి జ్ఞాన స్వరూపిణి. అట్టి జ్ఞానమును ఒకరినుండి యొకరు గ్రహింప వలెనన్న ప్రసారముగావలెను. ప్రసరించునది గావున ఆమెకు సరస్వతి అని పేరు వచ్చినది. ఎట్లు ప్రసారమగును? వాక్కు ద్వారమున. కావున 'వాణి' అను నామమును అన్నమయ్య ప్రయోగించెను. వాణి అనగా వాక్కు. స్వామికి ప్రీతి గొలుపు, మురిపాల వాణి యనగా తోటివారలలోని అంతర్యామికి ఆహ్లాదము కల్గునట్లు, తేనియలూరు మాటయని యర్థము. సరస్వతీదేవికి సంబంధించిన మొదటి చదువులలో కూడు మొదటి బీజాక్షరము స్వామి నామము. సరస్వతీ ఉపాసనలో అనగా విద్యాభ్యాసమున ప్రారంభ సమయమున స్వామి నామమే విద్యార్థి దిద్దును. ఇది బీజమయిన అక్షరము. మంత్రమని యర్థము. మఱియు ఆపై తాను నేర్వబోవు విద్యలకన్నిటికి స్వామి నామమే బీజము అనగా విత్తనము. అక్షరమనగా నశింపనిది. అనగా ఏ చదువు నేర్చువాడయినను స్వామి నామము అను విత్తనమే

తన చదువు అను చెట్టుగా విస్తరించినదని తెలియవలెను. "చదువులలో మర్మమెల్ల చదివితి" అని ప్రహ్లాదుడు ఈ యంశమునే చెప్పెను. సైన్సు గాని, కళలు గాని, భాషా సాహిత్యములు గాని ఏ చదువులలో విద్వాంసుడయినను స్వామి నామమును మఱచినచో, ఆ చదువులు వ్యర్థములు. సమాజము రూపములోని స్వామి సేవకు వినియోగపడని చదువులు హానికరములు, నశించును. భగవన్నామమును భక్తితో భజించి, సమాజము యొక్క క్షేమము కొఱకు వినియోగించు శాస్త్రమే ఫలించును. ఉదాహరణకు ఒక వైద్యుడు తాను నేర్చిన వైద్యశాస్త్రమును ప్రజాసేవకు గాక, ధన సంపాదనకు దారిగా వినియోగించినచో సమాజమునకు కీడు చేసినవాడై, పాపియై, ఆ ఫల మనుభవింప వలసి వచ్చును. వైద్యమునందలి మెలకువలు గ్రహణమునకు అందకుండ జారిపోవును. అట్లే గాయకులు భగవన్నామ సంకీర్తనమును గావించుచునే, శ్రోతల హృదయములందు వసించుచున్న స్వామికి అంకితము చేయకున్నచో ఆ గానము కూడ వాణిజ్యమే అగును. దైవానుభూతి గాయకులకు గాని, శ్రోతలకు గాని అందదు. అట్టి గానము యాంత్రికమై వ్యర్థమగును. ఒక భక్త హృదయము పాడినట్లుగా గాక, ఒక రేడియో స్వయముగా పాడినట్లుండును. మరి ధనమక్కఱలేదా? తనకు దేవుడిచ్చిన విద్యను ప్రజాహితమునకు, దైవానుభూతికి సమర్పించినచో, వలసిన ధనమదియే కుక్క వలె వెంటవచ్చును. దానియందు మనస్సు అంటుట యనగా కళ మైలపడుటయే. సరస్వతీదేవికి అపచారమే. అన్నమయ్య ఈ సంకీర్తనమున ఇట్లు హెచ్చరించుచున్నాడు. "భక్తితో కూడిన అనుభూతి, ప్రజల రూపములోని దేవునికి అర్చనము అను భావముతో వాక్కును సద్వినియోగము చేయవలెను." ఇవి లేకున్నచో లౌకికమైన చదువులెట్టివో, వేదశాస్త్రాదులు గూడ అంతియే. భారతము అరణ్యపర్వమున రోమశ మహర్షి భవిష్యత్తును గూర్చి యిట్లు చెప్పెను. "విద్వాంసులు కలియుగమున తమ విద్యను అమ్ముకొందురు". "చక్రహస్తుని ప్రకటించు చదువే చదువని" ప్రహ్లాదుడు ఉద్ఘాటించెను. ఒక వక్త గాని, కవి గాని, గాయకుడు గాని తన మాటలు, రచనలు, పాటలు వీనికి బీజము స్వామి నామమే యనియు, ఇవి అన్నియు ఆ నామము యొక్క వృక్షమే అనియు గుర్తుంచుకొనవలెను. ఇదియే వాణికి మొదటి చదువులలో బీజాక్షరము స్వామి నామమని అన్నమయ్య తెలిపిన దాని భావము. సొంతముగా వక్తృత్వము, గానము, శాస్త్రపాండిత్యము గలవాడనని భావించినవాడు వ్యర్థుడై, ఎంతటి విద్వాంసుడయినను పల్లవిలో పేర్కొన్న కైవల్యమును – దివ్యానందానుభూతిని, జీవన సాఫల్యమును పొందలేడు. తానే పొందలేనివాడు, వేఱొకరికి ఎట్లు తోడుపడగలడు? భక్తుడు పుట్టిన వెంటనే శ్రీహరి నామమును పలుకును, లేదా విని యానందించును. కనీసము అక్షరాభ్యాస సందర్భమున హరినామమును భక్తితో ఉచ్చరించును. పిల్లలకు చదువు నేర్పించు తల్లిదండ్రులు కూడ తమ సంతతి చదువుకొని, డబ్బు సంపాదించి, గొప్పవారు కావలెనని గాక, హరినామమును భక్తితో కీర్తించుచు, హరిదాసులై సమాజ సేవకులగు మంచివారు కావలెనని ఉద్దేశింపవలెను.

ఈ చరణమునందలి మూడవ, నాలుగవ పాదములందొక వేదార్థము గలదు. అన్నమయ్య వేదర్షి. సరస్వతి నాలుగు స్థాయిలలో గలదు. ఇవి శబ్దబ్రహ్మ యొక్క నాలుగు ముఖములు. వీనినే పరా, పశ్యంతి, మధ్యమ, వైఖరి యందురు.

1. వైఖరి యనగా మనము కంఠము నుండి మనకు తెలిసిన భాషలో వెలువరించు వాక్కు. 2. మధ్యమ యనగా అంతకు ముందు మనస్సున నిలిచిన భాషా రూపమయిన వాక్కు. 3. అంతకు ముందు పశ్యంతి గలదు. ఇది మనలో పుట్టిన భావము-సర్వ భాషల కతీతమైన వాక్కు. 4. అంతకు ముందు పరావాక్కు గలదు.

ఇది సంకల్ప రూపమగు వాక్కు. అనగా ఉచ్చరింపవలెనను ప్రజ్ఞ. వాణికి ఆది. చదువులలో కూడ మొదటి బీజాక్షరమనగా ఈ పరావాక్కు. ఫలానా వాక్కును ఉచ్చరింపవలెనను సంకల్పము. ఇది భగవంతుని స్వరూపమై యున్నది. ఈ స్థితిలో ఉచ్చరించువానియందే వాక్కు దాగియుండును. ఈ 'పరావాక్కు'ను భగవంతుని పవిత్ర నామముగా అన్నమయ్య కీర్తించుచున్నాడు. ఫలానా వాక్కును ఉచ్చరించు ప్రజ్ఞగా భగవంతుని వెలుగే దిగివచ్చును. ఆ నాలుగు వాక్కులే బ్రహ్మ యొక్క నాలుగు ముఖములు.

3వ చరణము యొక్క తాత్పర్యము

"నా పాలిటి జీవనము, ఓ శ్రీవేంకటేశ్వరా! నీ దాసులను చేరి సేవ చేయుటయే. నీయందు శరణందినవారికి లభించిన దారి యిదియే. ఇదియే సర్వదోషములను హరించునది."

వ్యాఖ్య

మొదటి చరణమును, రెండవ చరణమును వలె ఈ మూడవ చరణమును గూడ పల్లవితో కూర్చుకొనవలెను. కైవల్యప్రాప్తికి, జీవన సాఫల్యమునకు 1. మొదటి చరణమున సమాజమున అంతర్యామి యగు స్వామి సేవ మొదటి సాధనముగా చెప్పబడినది. 2. రెండవ చరణమున భగవన్నామ సంకీర్తనము రెండవ సాధనముగా చెప్పబడినది. 3. మూడవ చరణమున హరిదాసుల సేవ – సత్సాంగత్యము సాధనముగా చెప్పబడినది.

హరిదాసులయిన భక్తుల సందర్శనము వారు చేయు సల్లాపములను వినుట, వారు చేయు సంకీర్తనమున పాల్గొనుట, వారి సాంగత్యము, వారికి సేవచేయుట మున్నగు అంశములతో తన పాలిటి జీవనము సరియగు త్రోవ పట్టినదని అన్నమయ్య వెల్లడించుచున్నాడు. సజ్జనులగు భక్తులు భగవంతుని గూర్చి, ఇంక కొందరు భక్తులను గూర్చి, ఇతరులలోని మంచి గుణములను గూర్చి చెప్పుచుండగా వినుట వలన, ఆ మాధుర్యపు రుచిలో మనస్సు కరగి శరణాగతి పొందును. శరణాగతికి సజ్జన సాంగత్యము దోహదము చేయును. ఎల్లరియెడల అనుకూల దృక్పథము, సర్వజీవ మైత్రి, కరుణ హరిదాసుల సేవ వలన లభించును. కారణము వారాయాగుణములు గలవారగుటయే. వారి సాంగత్యమున మన భక్తి పెంపొంది దృఢమగును. అయస్కాంతమును, ఇనుపముక్కపై రుద్దినచో అదియు అయస్కాంతమగును. హరిదాసుల సద్గోష్ఠిలో మనము కూడ హరిదాస దాసులమై, ఆపై హరిదాసుల మగుదుము. కావున కోరి అట్టివారితో సాంగత్యము నెఱపవలెను. మనకు ఆ కోరిక బలముగా నుండి దేవుని ప్రార్థించినచో, హరిదాసుల సాంగత్యమును స్వామియే మనకు ప్రసాదించును. హరిదాసులయిన సజ్జనులు లోక క్షేమమును, దీన జనుల శుభమును

కోరుదురు. కావున హరిదాసునకు భోజనముపెట్టినచో, వారి కరుణ, లోకహితకాంక్ష, దీన వాత్సల్యము క్రమముగా మనకును సంక్రమించుటయే గాక, ఎందరో దీనులకు భోజనము పెట్టిన దానితో సమానమగును. శ్రద్ధతో హృదయమార హరిదాసుల సేవ చేయవలయును. భగవంతుడు భాగవతమున ఇట్లు చెప్పెను. "నా భక్తులను, దీనులను నన్నుగా చూచువాడు నా భావమును పొందును. అట్లు చూడక వారిని నాకంటె వేరుగా చూచువాడు నరకమును – శోకమును పొందును. గీతలో కూడ కృష్ణుడిట్లు చెప్పెను. "నా భక్తునకు నాశము లేదు. 'నన్ను' శరణంది, 'నేనే' సమస్తమను అనుభూతి నొందువాడే నిజమైన జ్ఞాని, నిజమైన భక్తుడును. అట్టివాడు నేనే. మేము అభిన్నులము." చరమ స్థాయిలో పరాభక్తియన్నను, బ్రహ్మజ్ఞాన మన్నను ఒకటియే. దాసోఽహం అనెడివాడే క్రమముగా 'దా' తొలగి 'సోఽహం' అగునని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఉపదేశించిరి. అట్టి భక్తుని ఆశ్రయించి, వారికి మనసారా నమస్కరించి, పరిప్రశ్నలు వేసి, సేవించి వారినుండి 'నా' జ్ఞానమును పొందుమని స్వయముగా శ్రీకృష్ణుడే అర్జునున కుపదేశించెను. శ్రీరాముడు వశిష్ఠాదులను, శ్రీకృష్ణుడు సాందీపని గర్గ వ్యాసాదులను పూజించిరి. మన కాదర్శమై నిలిచిరి. కావున సజ్జనుల మైత్రితో నాకు పని లేదు. సద్గురువులతో నాకు పనిలేదు. నా స్వయం సాధనతోనే భగవంతుని పొందెదనని బీరములు భావించువాడు ఆ అతిశయభావము తొలగు వరకు వేచియుండవలసి వచ్చును. హరిదాసుకు గుర్తేమి? కృష్ణుడే చెప్పెను. సర్వ భూతహితుడు, కరుణాళువు, అహంకార మమకారములు లేనివాడు, మానావమానములకు సముడు, నిందా స్తుతులకు సముడు, నిత్య సంతోషి, ఎవరి చేష్టల వలనను తాను ఉద్వేగము చెందక, ఎవరికిని తాను ఉద్వేగమును కల్గింపక, 'నా'యందే స్థిరముగా బుద్ధిని సమర్పించినవాడు, నేనే సమస్తము అని సందర్శించువాడు అని. అడుగడుగునకు స్వామి చింతనలో మేను మఱచువాడు, అఖిల ప్రపంచంబు శ్రీవిష్ణుమయమని మెలగువాడు, వినయశీలి, అన్యకాంతలను అమ్మగా చూచువాడు, తోటి హరిదాసులను హరిగానే భావించువాడు, వ్యక్తులను, వస్తువులను, విషయములను, పరిస్థితులను చూడక హరినే వారిగా దర్శించువాడు. ఇట్టివాడు ప్రహ్లాదుడని భాగవతమున వర్ణింపబడినది. నిజమైన హరిభక్తుడు 'నేనే భక్తుడను, నాకు వేఱు భక్తులతో పనియేమి?' అని గర్వించడు. అతడు హరి స్మరణలో పొందు ఆనందము, వేఱొక హరి భక్తుని సాంగత్యమున రెట్టింపగునని ఉపనిషత్తులు చెప్పుచున్నవి. హరిదాసులెల్లరు ఆత్మబంధువులు. శరీర సంబంధములు నశించునవి. ఆత్మ బంధుత్వము జన్మాంతరములలో గూడ కొన సాగును. విష్ణుచిత్తుని యింట నడిరేయి కూడ హరిభక్తులతో కలసి హరి సంకీర్తనము వినపడుచుండెడిదనియు, "రాత్రి అయినది, అన్నము వేడిగా లేదు, పప్పు లేదు. కూరలు సరిపోయినన్ని లేవు. దయతో భుజింపుడను" మాటలు వినపడుచుండెడివని రాయలు ఆముక్తమాల్యదలో అతని సజ్జన సేవను వివరించెను. ఒక్కొక్కసారి సాధకుడు, తానెంత మంచిగా ప్రవర్తించినను, పూర్వ కర్మ ఫలముగా దైవ లీలలై కష్టములు, అవమానములు ప్రాప్తింపక తప్పదు. అట్టియెడ, తాను స్వయముగా ఆయా పరిస్థితు లను దైవ లీలలుగా తలంచినను తట్టుకొనజాలడు. సజ్జన సాంగత్యము, సద్గోష్ఠి, హరిభక్తుల సేవ, వారి సన్నిధిలో దైవ లీలలుగా పరిస్థితులు తలంపులుగా గాక, అనుభవమునకు వచ్చును. దీనినే వాసుదేవోపాసనమని నారదుడు, వ్యాసునకు బోధించెను. అవమానములు, కష్టములు దృష్టికే రాకుండ

శ్రీహరి క్రీడయే అనుభవము నకు రావలెనన్నచో, అట్టి అనుభవమున పూర్ణులయిన మహనీయులగు హరిదాసుల సాంగత్యము, సేవ తప్పనిసరి. లేదా కనీసము కొందరు సాధకులు కలిసి శ్రీహరి యొక్క కథలను చెప్పుకొనుట, సంకీర్తనము చేయుట, మహాభక్తుల జీవితములను, ఉపదేశములను చెప్పుకొనుట ఆవశ్యకము. ఒక హరిదాసుడగు మహనీయుడు ఒకని నివాసమునకు రాక ముందున్న పరిస్థితులు, ఆతడు వచ్చి వెళ్ళిన తర్వాత కొంత మారును. మనలోని భక్తి విత్తనము వంటిది. హరిదాసుల సేవ ఎరువు వంటిది. హరి భక్తుడనగా కనపడుచున్న హరియే. మనలోని సర్వ దోషములు, వ్యతిరేక భావములు, మలిన వాసనలు, కామక్రోధ దుఃఖాది కాలుష్యములు, లోకము నన్ను గుర్తింపలేదన్న వేదన – ఇట్టి వన్నియు హరిదాసుల సేవ వలన తొలగును. శరణాగతులయిన భక్తులు, మాకు సూటిగా దేవునితోనే ప్రమేయము గాని, ఇతర భక్తులతో గాదు అనరు. భక్తుల నడుమ స్పర్థ, ఎక్కువ తక్కువ భావము లుండవు. అవి యున్నచో భక్తులు కానేరరు. అన్నమయ్య నిష్కర్షగా తాను ఆచరించిన హరిభక్తుల సేవను, మనకు ఉద్బోధించుట జరిగెను. ఆ రుచిలో ఆతడు మరగెను గావున నరునకు బోధించెను. తాను మహాభక్తుడని ఆత డతిశయింప లేదు. ఎందరో స్వామి దాసుల సేవలో ఆయన తనిసెను. హరిభక్తుల సేవా సాంగత్యముల వలన, కష్టములు వాటిల్లినను మనను అంటవు. ధర్మరాజు వనవాస మున మహర్షుల గోష్ఠిలోను, వారి సేవలోను హాయిగా జీవించెను. మనమును అన్నమయ్య ఉపదేశములు మూటిని ఆచరించి, కైవల్యమును, జీవన సాఫల్యమును పొందుదుము గాక!

* * *

19

3వ సం-419 **కొలిచినవారల** సాళంగము

కొలిచినవారల కొంగుపైఁ డితఁడు
బలిమిఁ దారకబ్రహ్మ మీతఁడు. ॥ పల్లవి ॥

ఇనవంశాంబుధి నెగసిన తేజము
ఘనయజ్ఞంబులఁ గల ఫలము
మనుజరూపమున మనియెడి బ్రహ్మము
నినుపుల రఘుకులనిధాన మితఁడు. ॥ కొలి ॥

పరమాన్నములోపలి సారపుఁజవి
పరగిన దివిజులభయహరము
మరిగిన సీతామంగళసూత్రము
ధరలో రామావతారం బితఁడు. ॥ కొలి ॥

చకితదానవుల సంహారచక్రము
సకల వనచరుల జయకరము
వికసితమగు శ్రీవేంకటనిలయము
ప్రకటిత దశరథ భాగ్యం బితఁడు. ॥ కొలి ॥

ప్రశంసాపత్రముల పుష్పముల చాటున, పతనమను పాము
కాటు వేయుటకు సిద్ధముగా నున్నది.

టీక

కొంగు పైడి = కొంగున గట్టిన బంగారము (ఒకరియ్యకుండగనే తనకు దానుగా లభించిన బంగారము), బలిమిన్ = బలముతోడ (మహిమతోడ), నినుపుల = నిండుగా, పరగిన = ప్రసిద్ధినొందిన, మరిగిన= పారవశ్యము చెందిన, చకిత = విభ్రాంతినొందిన.

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుని శ్రీరామునిగ దర్శించి, రాముని యవతార మహిమను ఆనందోత్సాహములతో వైభవోపేతముగా కీర్తించుచున్నాడు. రామతత్త్వమును అన్నమయ్య తన భక్తిపూరితమగు నిర్మల హృదయమున దర్శించెను. రాముడే తన తత్త్వము నితనికి దర్శింపజేసెను. పైకి రామకథాంశములను మాత్రమే తెలిపినట్లున్నది గాని వానిలోని దివ్యభావములను, అవతార ప్రణాళికను అన్నమయ్య సూచించుచున్నాడు. శ్రీరాముడు సాక్షాత్కరింపగా, అన్నమయ్య యెద పరవశము కాగా, అందుండి ఈ సంకీర్తన వెలువడినది. ఈ సంకీర్తనమున గూడ చరణము లందలి భాగములను పల్లవిలోని భావముతో అనుసంధించవలెను. రాముని మానవోత్తమునిగనే చాలమంది భావింతురు. దేవుని యవతారమని సమ్మతించినను, ఆయన జీవిత సన్నివేశములను ఒక మహనీయ మానవుని జీవితాంశములుగనే తమ మనస్సులందు చిత్రించుకొందురు. మానవోత్తముడనుట సరియే. రాముని జీవితాంశములు గూడ ఈ యంశమున కనుగుణములే. అయినను, వాల్మీకి రామాయణమున బహిరంగముగ రాముడు మానవులలో ఉత్తముడుగ, ఆదర్శ మూర్తిగా కన్పడినను, వ్యంగ్యముగా పరబ్రహ్మమని సూచింపబడెను. ప్రకాశముగ ఆదర్శ మానవోత్తముడు. రహస్యముగ పరబ్రహ్మము. ఇదే రీతిలో వాల్మీకి వలెనే అన్నమయ్య రాముని సంకీర్తించెను.

పల్లవి యొక్క తాత్పర్యము

"తనను కొలిచినవారల కొంగుబంగారము ఇతడు. తన దివ్యమహిమతోడ జీవులను సంసారసాగరము నుండి దాటింపజేయు బ్రహ్మము."

వ్యాఖ్య

రాముని సేవించిన వారికితడు ప్రయత్నింపకుండగనే కొంగున కట్టబడిన బంగారము. అనగా ఎవరీయకుండగనే లభించిన బంగారము. ఇతడనుట అన్నమయ్యకు రామునితో గల అతి సాన్నిహిత్యమును సూచించును. బంగారమను దానికి పైడి అను తెనుగు పలుకు చాల సొబగయినది. బంగారము ప్రకాశించును. అలంకారము. లోహములలో శ్రేష్ఠము. అట్లే రాముడు దివ్యతేజస్సుతో ప్రకాశించు వాడు. సర్వకాలముల, సర్వదేశముల జనుల కితడు అలంకారము. జీవులలో శ్రేష్ఠుడు. భూమి పుట్టిన పిమ్మట ఇంతటి ఉత్తముడు లేడు. బంగారము అలంకారముగా ఉపయోగింపబడినట్లుగనే, రాముని సేవించి స్మరించువారి పాలిట ఇతడు అలంకారముగ ఉపయోగపడును అని కాదు. వారి పాలిట అలంకార

మయినవాడని అర్థము. అనగా వారికి శోభను, దివ్యగుణములను, ఆనందమును ప్రసాదించువాడు. ఈ అలంకారముగా ప్రయత్నము లేకుండగనే, తానుగనే దయతో తన భక్తులకు దగ్గతివాడై కాపాడును. శ్రీరాముడు విశ్వామిత్రుని వెంట తండ్రి యాజ్ఞపై సవినయ ముగా వెళ్లెను. ఎందుకొఅకని అడుగలేదు. తనకు స్వీయ సంకల్పము లేదు. గుర్వాజ్ఞయే తండ్రి యాజ్ఞగా పాటించెను. విశ్వామిత్రుడు రాముని మాత్రము భగవంతునిగనే దర్శించి, ఆతనికి విద్యలు నేర్పుట, మేలుకొలుపుట తన భాగ్యముగా భావించెను. ఇట్లు రాముడాతనికి, తోటి ఋషులకు, అహల్యకు, జనకునకు, మిథిలానగరవాసులకు తన సాన్నిధ్యమను వెలుగే బంగారముగా శోభ కల్గించెను. తనను హృదయములో కొలిచినను చాలు, ఏదియో తన జీవిత సన్నివేశము నెపమున వారికి తన సన్నిధిని ప్రసాదించెను. జనకాదులు, అహల్య ప్రత్యక్షముగా అతనిని అతడు రాక పూర్వము కొలువలేదు. కాని మనసులో నిలిపిరి. భర్త ఇచ్చిన శాపము అహల్యా పాలిటి వరమై, ఆమె రామునికై తపించుచు ఎదురు చూచుచుండెను. రాము డామె పాదములు తాకగనే, ఆమెలో పులకరింత గలిగి, అతనిని సేవించి, అతనికి మాతృస్థానమును పొంది ధన్యురాలై, భర్త యొక్క కలయికను పొందెను. రాముడు తనను గన్న కౌసల్యా దశరథులకు, కైకేయీ సుమిత్రలకు, అంతఃపుర స్త్రీలకు, ప్రజలకు, తమ్ములకు, గుహాదులకు, గిరిజనులకు, ఋషులకు, జటాయువునకు, శబరికి, హనుమదాది వానరులకు, విభీషణాది రాక్షసులకు రక్షకుడై నిలిచెను. వారికెట్టి యుపదేశములు పెద్దగా అతడు చేయలేదు. కేవలము తన సన్నిధి మాధుర్యము చేతనే తనను కొలిచిన వీరెల్లరికి పరమగతిని ప్రసాదించెను. శ్రీరాముని కరుణాదృష్టి ప్రసారముతోనే అడవిలోని ఱాళ్లు, చెట్లు, జంతువులు, నరులు బ్రహ్మానందమున ఓలలాడిరి. యోగులుగా పరిణమించిరి. ఇతడు దివ్యమహిమ గల తారకబ్రహ్మము. నరుని వలె జీవించినను, ఇతని నామమును, గుణములను, చరితను స్మరించిన వారిని తన దివ్యమహిమతో ఉద్ధరించి, వారిని తరింప జేసెను. బ్రహ్మమనగా బృంహణము చెందునదని యర్థము. విత్తనములో చెట్టు యొక్క ధర్మములు చైతన్య స్థాయిలో దాగియుండును. విత్తనము ఆ లక్షణములను భౌతికముగా వెలువరించి చెట్టుగా విస్తరించును. అట్లే సృష్టి ధర్మములను ప్రళయకాలమున తనయందు కరగించి, తిరిగి సృష్టిగా విస్తరించు విత్తన మీతడు. శ్రీకృష్ణుడు గీతలో ఇట్లు తెలిపెను. "జీవులకెల్ల శాశ్వతమయిన బీజమును 'నేన'ని గ్రహింపుము." 'నేను' నుండియే గదా నాది యనబడు సృష్టి వచ్చునది. 'నేను' యొక్క రూపమే నాది. స్థితి మార్పు. అంతియే. కావున రాముడు సృష్టి యను చెట్టునకు విత్తనమని అన్నమయ్య భావము. చెట్టును విత్తనము యొక్క వ్యాపనముగా దర్శించినచో తరించెదము. అనగా విశ్వమును, బ్రహ్మమైన రాముని యొక్క విస్తార రూపముగా దర్శించినచో ఆతడు తరింపజేయును గాన ఆతడు తారకబ్రహ్మము. దశరథ కుమారుడయిన నరునిగా మాత్రమే రాముని భావింపకుడు, అతడు తారకబ్రహ్మమని గ్రహించి, సేవించి, స్మరించి ధన్యులుకండు. అపు డాతడు కొంగుబంగారమై మన బ్రతుకులను పండించి, వానికి వన్నె తెచ్చి, సార్థకములు గావించును. రామాయణమునకు 'దీర్ఘశరణాగతి' యని ప్రసిద్ధి. పైన పేర్కొన్న భక్తులు ఎవరెంతగా రామునికి శరణందిరో అంతగా దగ్గఱైరి. రాముని దయతో క్రమముగా ఎల్లరు పూర్ణశరణాగతులై తరించిరి. రాముని రూపమును, గుణములను, చరితను, మహిమను వర్ణించి వాల్మీకి రామ సాన్నిధ్య మాధుర్యమున సదా ఓలలాడెను.

వేదములలో స్తుతింపబడిన బ్రహ్మమును రాముని యాకృతిలో దర్శించి, అతని జీవితమును వర్ణించి బ్రహ్మత్వమునందెను. కావుననే రామాయణము వేదమనియు, రాముడు వేదములందు స్తుతింపబడిన పరబ్రహ్మమనియు ఆదిశంకరులు కీర్తించిరి. తారకబ్రహ్మ మనగా చిత్రమయిన అర్థము గలదు. రాముడు తాను బ్రహ్మయే గాక, తనను కొలిచిన వారినెల్ల సంసార వ్యామోహాది బంధముల నుండి తరింపజేసి, వారిని తానుగా తీర్చిదిద్ది, వారిని కూడ బ్రహ్మముగా జేయును. ఎంతగా ఆధ్యాత్మిక సాధన చేయుచున్నను, పూర్వాభ్యాసము వలన ఏర్పడు కలుష వాసనలు, వ్యామోహములు, ద్వేషములు తిరిగి తిరిగి రేగుచుండును. రామనామము, రామచరిత, రాముని రూపమును స్మరించి, శరణందగనే అవి వైదొలగును. ఇది రాముని మహిమ. 'రా' యను అక్షరము మంత్రశాస్త్రమున అగ్ని బీజాక్షరమని తెలుపబడినది. ఇది లోనున్న చెడును బయటకు త్రోసి దహించును. 'మ' వెలుపల నుండి మనలోనికి కాలుష్యము రాకుండ కాపాడును. కావుననే రామనామమును తారకమంత్రమందురు. కాశీలో మరణించు వారికి శివుడు రామ తారకమంత్రమును చెవిలో ఉపదేశించునని ప్రతీతి. రామాయణము చివరలో వాల్మీకి ఫలశ్రుతి నిట్లు చెప్పెను. "ఐహికముగా కావలసినవి, సత్సంతతిని, దుఃఖ విముక్తిని, దీర్ఘాయుస్సును, నైర్మల్యమును, కుటుంబ వృద్ధిని, ధాన్య వృద్ధిని, ఆరోగ్యమును, మంచి బుద్ధిని, చివఱకు పరమపదమగు వైకుంఠ స్థితిని రామచరిత, నామము గానము చేయువారు, వినువారు పొందెదరు." భాగవతమున నవమ స్కంధమున పోతన ఇట్లు రామ మహిమను కొనియాడెను. "రామునితో రాకపోకలందు భక్తితో తిరుగువారు, రాముని చూచినవారు, ఆతనిని తాకినవారు ఆదియోగులకు పరమగతి – బ్రహ్మానందమును పొందిరి."

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"రాముడు సూర్యవంశమను సాగరము నుండి ఎగసిన పెద్ద వెలుగు. మహనీయము లయిన యజ్ఞములు ఆచరించుట వలని ఫలము. మానవ రూపమున – మనువు నుండి వచ్చిన రాజు రూపముగ జీవించెడి బ్రహ్మము. నిండుగా రఘువంశమునకు ఇతడు నిధి (అనగా గనియు, ఆధారమును)."

వ్యాఖ్య

అన్నమయ్య రామతత్త్వమును అద్భుతముగా దర్శించుకొని చిత్రించెను. సాగరము నుండి ఎగయునది కెరటము గాని, తేజము గాదు గదా. దీని భావము సూర్యవంశమను సాగరము నుండి ఎగసిన వెలుగను కెరట మన్నమాట. కావున సూర్యవంశమొక తేజోసాగరము. మనువు, ఇక్ష్వాకువు, మాంధాత, యౌవనాశ్వుడు, అంబరీషుడు, హరిశ్చంద్రుడు, సగరుడు, భగీరథుడు, దిలీపుడు, రఘువు మున్నగు సూర్యవంశ రాజులు ప్రజలను ధర్మముగా, ప్రేమతో పాలించిన మహానుభావులైన రాజర్షులు. సూర్యుని వంశ మనగా సూర్యుని అంశలే అని కాళిదాసు సూచించెను. సూర్యుని కిరణములు జీవులకు వెలుగు, శక్తి, జ్ఞానము, నీరు ఇచ్చును గదా. ఆ కిరణములు భౌతికములు గావు. చైతన్య మయములు. ప్రేమప్రవాహములు. ఈ కిరణములే జనులకు ధర్మము నేర్పి, తమ ధర్మపాలనతో వారికి క్షేమము గూర్చుటకై సూర్యవంశ రాజులుగా

దిగివచ్చిరి. కావున సూర్యవంశ మొక వెలుగుల సాగరమని అన్నమయ్య భావము. అందుండి పైకిలేచిన కెరట మనగా ఒక వెలుగుముద్ద రాముడు. పైకెగసిన తేజ మనగా పూర్వ వంశీయులగు రాజులకన్నను శ్రేష్ఠుడనమాట. ఇచట ఒక గంభీరార్థ మున్నది. మామూలు తేజ మయినచో అన్నమయ్య కెరటమను పోలికను చెప్పెడివాడు. ఈ తేజోమయ తరంగము సాగరములో భాగమయినది, దాని సారమయి నది. సూర్యవంశ రాజులలోని మంచి గుణము లన్నియు కలిగిన వెలుగు రాముడు. మరియు సూర్య వంశ మనగా సూర్య కిరణముల గుంపు గదా. అందలి తేజమనగా ఈ కిరణముల గుండా మనకు వెలుగు నిచ్చుచున్నది సూర్యాత్ముడగు నారాయణుడే. ఇది వేద భావము. వాల్మీకి వ్యాస కాళిదాసుల వలె అన్నమయ్య మహర్షి గావున ఇట్లు చిత్రించెను. అట్టి నారాయణుడు నరుడుగా ఎట్లు దిగివచ్చెను? దుష్టరావణ వధ గావించి, ధర్మ సంస్థాపనము గావింపుమని సృష్టిలోను, మానవులలోను గల ఋషులు, దేవతలు వేడగా దిగివచ్చెను. సరే? వచ్చినవాడు ఊరక వచ్చునా! ప్రజలెల్లరు సమష్టిగా కలిసిమెలిసి జీవించు విధానమును అవలంబింపగా, ఆ విధానమును రాజగు దశరథుడు ప్రవర్తింపజేయగా దిగివచ్చెను. వసిష్ఠుని ప్రేరణతో, సుమంత్రుని సలహాపై, ఋష్యశృంగుని ఆధ్వర్యమున దశరథుడు అశ్వమేధము, పుత్రకామేష్టి గావించెను. అశ్వమేధ మనగా గుఱ్ఱమును పెంచుట. ఈ యాగము నెపమున జనుల నొకచోట చేర్చెను. భారతీయుల సమష్టి జీవనమునకు అడ్డుతగులుచున్న రావణుడు యజ్ఞ విధ్వంసకుడు. ఆతని వలని భయముతో ఏ రాజు గూడ యజ్ఞమును తలపెట్టలేదు. గురు ప్రేరణతో దశరథు డాచరించెను. ఆతని యాగములందు నేతులు సాగరము లయ్యెను. అన్నము పర్వతపు రాశులయ్యెను. జనుల నట్లు ఆతడు తనిపెను. కావున యజ్ఞఫలముగా నారాయణుడే రాముడుగా దశరథ కుమారుడై దిగివచ్చెను. ఎప్పుడయిన జనులొకటిగా కలసిమెలసి బ్రతుకుట సాగింతురో వారి హృదయములలో రాముడు శాంతి, ఆనందముల స్వరూపుడై దిగివచ్చుచునే యుండును. సంపద కూడ కొన్నిచోట్ల మాత్రము నిలువయుండక, ఎల్లరికి అనుభవ యోగ్యమగును. ఎవరికి వారుగా బ్రతుకువారికి సుఖశాంతులుండవు. అట్టివా రధిక సంఖ్యలో నున్న ఆ జాతి జారిపడును. రాముడు మనుజ రూపమున వర్తించెను. మానవుడని ఒక అర్థము. మనువంశీయుడని వేరొక అర్థము. పైకి మానవుని వలె మనుగడ సాగించెను. సుఖములను, కష్టములను అనుభవించెను. భార్యతో ఎడబాటు పొందెను. కాని రాముని ప్రతి చేష్ట వెనుక భగవంతుడుగా నెఱపిన విధానము దాగియున్నది. ఉదాహరణకు అహల్య అనగా నాగలి చేత దున్నబడని పొలము. అనగా భక్తిచే దున్నబడక, కలుష భావములను కలుపులు గల హృదయక్షేత్రము. అహల్యను తల్లిగా రాముడు గౌరవించుటతో, ఆమె యుద్ధరింపబడి, పాపవాసనల నుండి బయటపడి పవిత్రయై జగన్మాత అయినది. సీత అనగా నాగటి చాలు. రాము డనగా నీలమేఘము. వీరి కల్యాణమున పంట ఆనందముగా పండును. భరతునకు ముందు తన పాదుకలను అనగా అడుగుజాడలను – తన ధర్మమార్గమునిచ్చి, చివరలో సింహాసనముపై కూర్చుండెను. అనగా మన హృదయములందు ధర్మము నెలకొన్నచో, ఆపై దేవుడు ఆనందస్వరూపుడై వెలుగును. జటాయువుకు, శబరికి నాశము లేని గతిని – అనగా మోక్షము నిచ్చెను. ఇట్లు అనేక సన్నివేశములలో వ్యంగముగా రాముడు తాను బ్రహ్మమునని చెప్పకయే చెప్పెను. కోట్లమంది బలవంతు లయిన రావణుని

బలము చివరలో రణరంగమునకు రాగా, వారిలో ఒక్కొక్కనికి ఒక్కొక్క రాముడై ఎదురు నిలిచి వధించెను. ఈ పని భగవంతుడు గాక ఎవరు చేయగలరు? కావుననే భాగవతమున ఇట్లు చెప్పబడినది. “ఆదిదేవుడయిన రామచంద్రునకు సముద్రమునకు వారధి కట్టుట ఎంత పని? రావణాది రాక్షసులను చంపుట ఎంత పని, వానరుల సాయమెంత? దేవతల కొరకు క్రీడ చూపెను. అంతియే.” తాను దేవుడయినను పెద్దలకు మ్రొక్కెను. వినయమును చూపెననగా వినయమును నేర్పుటయే. మహర్షుల నాకర్షించి, వారిని కృష్ణావతారమున గోకులవాసులుగా సృజించి తన సాన్నిధ్యము నొసంగెను. కావున ఈ యాకర్షణ శారీరకమయిన ఆనందమునకు చెందినది గాదు. జీవులగు భక్తులను ఆకర్షించు భగవంతుని సమ్మోహనత్వము. రాముడు రఘువంశమునకు నిండయిన గని, ఆధారము. కామ క్రోధాదులను యోధులు విరోధులై చొచ్చుటకు వీలుగాని విధముగా ఇక్ష్వాకువు అయోధ్యను నిర్మించెను. సగరుడు కుమారుని దుష్టుడగుటచే త్యజించెను. భగీరథుడు గంగను భూమిపైకి తెచ్చెను. నీటిధారను క్రిందకు తెచ్చు సూర్యకిరణ ప్రభావమున పుట్టిన మహారాజు అతడు. దిలీపుడు తాను సేవించుచున్న ఆవును సింహపు బారినుండి కాపాడుటకై, తనను తాను సింహమునకు అర్పించుటకై సిద్ధపడెను. రఘువు విశ్వజిద్యాగమును గావించెను. ప్రజల నుండి వసూలయిన పన్నును ప్రజలకే మొత్తముగా వినియోగించి నిరాడంబరుడై నిలిచెను. దశరథుడు ప్రజలకు అన్నసమా రాధనము గావించెను. ఇట్టి రఘువంశీయులగు రాజులలోని సద్గుణము లెల్లయు రామునిలో రూపుగొన్నవి. కావున రఘువంశమున కీతడు గని, సంపద యొక్క నిలయము. సద్గుణసంపదకు గని. సూర్యవంశీయులలో అగ్రగణ్యుడగు రఘువు వంశకర్త అయిన రాజర్షి. ఈతని వంశములో పుట్టి, ఈతనిని మించిన సద్గుణములు గలవాడు రాముడు. ఈ రఘువంశ రాజులు తాము విష్ణుభక్తులై, ప్రజలను ధర్మముగా పాలించిరి, భక్తియోగమార్గము నవలంబించి, జనులలో దానిని నెలకొలిపిరి. వీరి పుణ్యజీవనము వలన నారాయణుడు ఈ వంశములో రాముడుగా అవతరించెను. రఘువంశీయుల ఖ్యాతిని నింగికి ఎత్తిన వాడీతడు. నిధానమనగా ఆధారమనియు అర్థము. రాముడు తన పూర్వరాజర్షుల కెట్లు ఆధారమయ్యెను? సూర్యాంతర్వర్తి యగు నారాయణుడగుట వలన, ఈతని నుండియే రఘువంశ రాజులకు సద్గుణము లబ్బినవి. సూర్యుడు తన కాంతిని లోకమునకు వెదజల్లునటుల రఘువంశ రాజులు తమది ఏదియును కాక ఎల్లరికి పంచిరి. ముఖ్యముగా తమ వెలుగును – ధర్మమును పంచిరి. రఘురాముడు తండ్రి వలె ప్రజల నెల్లరిని పరిపాలింపగా, జను లాతని సేవను తండ్రిగా భావించి, తమ తండ్రుల మఱచిరని భాగవతమున చెప్పబడినది. పరిపాలనము రెండు విధములు. 1. అధికారము చలాయించుట. 2. ప్రజల రూపములోని స్వామిని ఆరాధించుచు, వారికి సేవకుడగుట. రాముడు రెండవ మార్గములో ఎల్లరిని మించెను. కావున మహాత్ముడు రామరాజ్యమునకై కలలు గనెను. ప్రజలకు కష్టము కలిగినపుడు, తన కష్టముగనే రాముడు భావించెను. ప్రజలకు సుఖము గలిగినపుడు తండ్రి వలె రెట్టింపుగా సంతోషించెను. కాళిదాసుగారి రఘువంశ కావ్యమును, రామాయణ పిండితార్థంగా అన్నమయ్య ఈ సంకీర్తనము రచించెను. ఇట్టి తారకబ్రహ్మ మయిన రాముని కొలిచెదముగాక. ఆయన రక్షణము పొందెదముగాక.

2వ చరణము యొక్క తాత్పర్యము

“భూమిపై రాముడు పరమాన్నము లోపలి సారము యొక్క రుచి. ప్రసిద్ధులగు దేవతల భయమును పోగొట్టువాడు. పారవశ్యముతో చొక్కిన సీతా మంగళసూత్రము.”

వ్యాఖ్య

అన్నమయ్య భగవంతుడగు రాముని ఇతడు అని పుంలింగముగా వాడుచునే మరల రామావతారము, చవి, భయహరము, సూత్రము అను నపుంసకలింగ శబ్దము లను ప్రయోగించెను. ఇందొక విశేషము గలదు. భగవంతుడు ఆత్మస్వరూపుడు. రాముడుగా మగవాని దేహము ధరించినను, సహజముగా ఆనందచైతన్యమగుటచే ఆడుది గాదు, మగవాడు గాదు. ఆనందము, ప్రేమలకు లింగవివక్ష ఎక్కడిది? కావున అన్నమయ్య నపుంసకలింగ ప్రయోగము గావించెను. పైగా పల్లవిలోను, మొదటి చరణములోను ‘బ్రహ్మమ’ను శబ్దమును వాడెను. ఈ శబ్దము కూడ నపుంసక లింగమే. కావున బ్రహ్మమైన రామునకు విశేషణము లన్నిటిని మూడు చరణము లందును తేజము, ఫలము, నిధానము, చక్రము, జయకరము, నిలయము, భాగ్యము మున్నగు నపుంసక లింగములుగనే ప్రయోగించెను. పరబ్రహ్మము లింగాతీతుడను వేదార్థమును సూచించుటకే అన్నమయ్య ఇట్లు చేసెను. ఇట్టి ప్రయోగములు గావించిన వారు ఇద్దరు, ముగ్గురు కంటె లేరు. వారిలో మొదటివారు ఆదిశంకరులు. దశరథుని పుత్రకామేష్టి చివరలో ప్రాజాపత్యపురుషుడను దేవత పాయసమును గిన్నెలో తెచ్చి దశరథునికిచ్చి అదృశ్యుడాయెను. ఆ పాయసమును దశరథుడు కౌసల్యాదులగు తన భార్యలకు ఈయగా రామాదులు అవతరించిరి. పాయసములో అర్ధ భాగము కౌసల్య కీయబడెను. ఆ పాయసమునే అన్నమయ్య పరమాన్న మనెను. ఇది తెలుగు మాట. అనగా శ్రేష్ఠమయిన అన్నమని అర్థము. అన్నమనగా ద్రవ్యము, భౌతిక పదార్థము. ఈ పదార్థములలో శ్రేష్ఠమనగా దీనికి మూలమయినదని వేదార్థము. మన కంటికి కనపడు, మన నాలుకకు అందు, మన మనస్సున ఊహలకందు సర్వ జగత్తునకు మూలము ఆనందమయ స్థితి. భౌతికము, శక్తిమయము, మనోమయము, బుద్ధి అను నాలుగు కోశములకును పైది వీనికి మూలమైనది ఆనందమయ కోశము. ఇది చోటులోను, మనలోను గలదు. ఈ ఆనందమయ కోశమే పరమాన్నము. దీని సారమైన రుచి పరమాత్మయే. పరమాత్మయే ఆనందసాగరము. ఒక మధుర పదార్థమును నాలుకపై నుంచినపుడు, ఆ పదార్థమునకు, నాలుకకు సంధానమగుట వలన మనస్సు తీయని రుచిని అనుభవించును. మరి పదార్థముల రుచి అశాశ్వతము. ఇక పదార్థములకు అతీతమగు ఆత్మానందపు రుచియే పరబ్రహ్మము. ఈ బ్రహ్మమే రాముడుగ అవతరించెను. కావున ప్రాజాపత్యపురుషుడు దశరథునకు ప్రసాదించినది భౌతికమయిన పరమాన్నము వలె కనపడినను, అది అంతమాత్రమే గాదు. అది వాస్తవముగా ఆత్మానంద స్థితి. ఈ యాత్మానందమే కౌసల్యా గర్భమున నిలిచి రాముడుగ అవతరించెనని అన్నమయ్య రామావతార రహస్యమును సూచించుచున్నాడు. నిఘంటువులలో పండితుడయిన మాత్రము చాలదు ఇట్టి వేదభావము తెలియుటకు. వాల్మీకి వంటి మహర్షికే రాముని దయ వలన దర్శనమిచ్చును. అన్నమయ్యయు ఇట్టి మహర్షియే.

రుచి అనునది అనుభూతియే గాని ద్రవ్యము గాదు. ఇది సాధారణ మగు అనుభూతి గాదు. బ్రహ్మానందము యొక్క రుచి. దీనిని వర్ణింప నలవిగాదు. ఆత్మానుభూతియే రాముడుగా వచ్చెనని సూచించుటకే అన్నమయ్య 'చవి' అను పదమును ప్రయోగించెను. దశరథునికిది ధ్యానమార్గమున ప్రసాదింపబడినది. కౌసల్యకిట్లే అందినది. సాధారణ నరుల వలె జనించిన వాడు గాదు రాముడు. సృష్టికి మూలమయిన బ్రహ్మానందమే రాముడుగా ఆకారము ధరించి దిగివచ్చెను. అవతార మనగా దిగివచ్చునది అని యర్థము. కావుననే 'రామావతారమ'ని అన్నమయ్య పేర్కొనెను. ఈ బ్రహ్మానంద స్థితి లింగాతీతము గావున, అవతారమను నపుంసక శబ్దము ప్రయోగింపబడినది. అవతారుడనియో, అవతారమూర్తియో అని అన్నమయ్య అనలేదు. అవతార మనెను. మరియు రామాయణమున ఈ పరమాన్నము దేవ నిర్మితమగు పాయసమని పేర్కొనబడినది. పయస్సు లనగా పాలు. కావున ఈ పాయసము క్షీరసాగరమందలి క్షీరముతో దేవుడే స్వయముగా తనకు తానే నిర్మించినది. క్షీరసాగరమనగా రెండు అర్థములు గలవు. 1. బ్రహ్మానందానుభూతి ప్రవాహము. 2. క్షీరసాగరమను పేరు గల తారకా వ్యూహము. ఇపుడు దేవుడే స్వయముగా బ్రహ్మానందానుభూతి గదా. తనను తానే దశరథున కీయబడిన పాయసముగా వచ్చెననమాట. మరియు పై తారకలందలి కాంతిప్రవాహమే పాయసము. ఇదియే రాముని స్వరూపమై వచ్చినది. మనలోను, చోటులోను ప్రక్రియలను నడిపించు ప్రజ్ఞలగు దేవతలున్నారు. వీరికి రావణుని వలన భయమేర్పడినది. మానవులలోని ఇంద్రియములు, ప్రాణము, మనస్సు, బుద్ధి మున్నగు వానిని నడిపించు దేవతలు భీతిచెందిరి. రావణుని దురాగతముల ప్రభావమున ఇవి సరిగా పనిచేయుట లేదు. అధర్మము పెరిగి, మానవుల మనుగడ కష్టమై మనస్సుకు శాంతి కఱవైనది. దుర్గుణములు పైచేయి వహించెను. అపుడు దేవతలు, బ్రహ్మతో కలిసి నారాయణునకు మొఱపెట్టుకొనగా, ఆతడు రాముడుగా వారికభయమిచ్చెను. బ్రహ్మ రావణునకిచ్చిన వరమును మన్నించి నరుడుగా వచ్చి రావణుని ససైన్యముగా చంపి, ధర్మమును నెలకొలిపి దేవతల భయమును పోగొట్టెను. స్త్రీలను, సంపదను కొల్లగొట్టిన రావణాదులు వధింపబడుటతో స్త్రీలకు, గ్రామవాసులకు క్షేమము చేకూరినది. మఱల మానవుల నడుమ శాంతిసామరస్యములు, పరస్పరప్రేమ నెలకొనినవి. ఇట్లు సమాజములోనే గాదు, ఏ వ్యక్తియయినను రామనామమును, గుణములను, చరితను కీర్తించి సాగినచో ఆతనిలోని దుర్గుణములు వైదొలగి, సద్గుణములు వెలుగొందును. ఇదియే రాక్షసుల వధ, దేవతల సంతోషము. సీతాదేవికి మంగళసూత్రము కట్టునపుడు రాము డామెయందు పారవశ్యము చెందెను. ఇది భౌతిక సంబంధి యగుట కవకాశము లేదు. కల్యాణ సమయమునకు రామునకు 13 ఏండ్ల వయస్సు. సీతాదేవికి 6వ ఏడు. మఱి పారవశ్య మెట్టిది? సీతాదేవిలోని దివ్యగుణములు కాంతిమంతములై, మంగళసూత్రధారణ సమయమున రామునకు గానవచ్చినవి. తాను విష్ణుడననియు, సీత లక్ష్మీదేవి యనియు లోన స్పృహ గలదు. ప్రకృతి స్వచ్ఛతయందు పరమాత్ముడు పరవశుడగుట సహజమే. సీతాదేవి యొక్క పవిత్రత, స్వచ్ఛత రాముని లోగొన్నవి. ఆమె నిత్యకన్య, శుచిస్మిత యని రామునకు తెలియును. ఆమె నవ్వగనే పవిత్రత రూపొందును. ఇచట పని చేసినది రాముని లోచూపు.

'మరిగిన' అను పదము 'పారవశ్యము చెందిన' అను అర్థమున సొగసుగా వాడబడినది. సీతమ్మకు రాముడు మంగళసూత్రమును కట్టుటయే గాదు, సీత యొక్క మంగళసూత్రమే రాముడని అన్నమయ్య అద్భుతముగా కీర్తించెను. సీతకు, రామునకు శుభమయిన సూత్రము అనగా అనుసంధాన మేర్పడినది. సీత కంఠమందు రాముడు మంగళసూత్రమును కట్టునపుడు ఆమెయందు పరవశుడై తనను తాను మఱచి, తానే ప్రేమగా ఆ సూత్రములో ప్రవేశించి, సీతమ్మతో అనుసంధానము నొందెను. ఇక సీత హృదయము, ఆత్మ రాముడే. రాముని హృదయము, ఆత్మ సీతయే. ఇచట సీత భౌతిక సౌందర్యము నకు రాముడు మోహము చెందెనని భావింప రాదు. అసలు సౌందర్య మనగా కోమలమైన ప్రేమయే. మంగళసూత్రము దంపతుల నడుమ శుభమును, పరస్పర ప్రేమను నెలకొలుపు దారము. సీతకు ఆ దారమే రాముడు. సీతకు శుభమనగా రాముని సన్నిధియే. రామునకు శుభమనగా సీతాదేవి సన్నిధియే. మంగళసూత్ర ధారణ సమయము నుండి వారిట్లే జీవించిరి. ఒకరి నుండి అవతలవారు ఏమియును ఆశింపలేదు. ఆశించినచో వాణిజ్యమగును గాని, ప్రేమ యెట్లగును? సీతారాముల నడుమ నిలిచినది ఆత్మ స్థాయిలోని ప్రేమయే. కావుననే లోకమునకు వారు ఆదర్శ దంపతులుగా వెలసిరి.

3వ చరణము యొక్క తాత్పర్యము

"రాముని పరాక్రమమును గాంచిన రాక్షసులకు యుద్ధరంగమున విభ్రాంతి గలిగినది. వానిని సంహరించిన చక్రమే రాముడు. వనములందు చరించు ఋషులు, గిరిజనులు, వానరు లెల్లరకు జయమును కల్గించిన వాడు రాముడు. వికాసము నొందిన శ్రీవేంకటాద్రి నిలయమైన స్వామియే రాముడు. ఇతడే తనకు తానుగా దశరథునికి భాగ్యమయిన కుమారునిగా దిగివచ్చెను."

వ్యాఖ్య

రావణాదులు రాముని పరాక్రమమును గూర్చి ముందు నరుడే కదా అని నిర్లక్ష్యముతో పొరపడిరి. కాని రణరంగమున దానిని చూచి ఆశ్చర్యము, భయము కలిగి వారికి చేతులు పనిచేయ లేదు. ఖరదూషణాదులు, చివరలో వచ్చిన రావణుని సైన్యము ఇట్లు నిశ్చేష్టులై సంహరింపబడిరి. ఇచట పరాక్రమ మనగా శౌర్యమే కాదు. దానవులనగా తనువు నందు భ్రాంతి గలవారని అర్థము. ఇట్టి దేహభ్రాంతి వారికి రాముని చూడగనే తొలగి, ఆతని దివ్యసౌందర్యమునకు పరవశించి నిశ్చేష్టులయిరి. తర్వాత పోరాడినను, వారి అధర్మ బలము, రాముని ధర్మబలము నెదుట, విష్ణుతేజము నెదుట ఆగలేదు. రావణునకు మారీచుడు ముందే ఇట్లు చెప్పెను. "రాముడు ధర్మస్వరూపుడు. ధర్మము ఆధారముగ గల శౌర్యము నెదుట నీయొక్క అధార్మిక శౌర్యము నిలువలేదు." మండోదరియు రావణుని హెచ్చరించినది. "నీవెందరో స్త్రీలను అపహరించితివి. వారి భర్తలను చంపితివి. నీవు చేసిన పాపకార్యములకు ఎందరో బలి అయిరి. నీ పాపము పండి లక్ష్మీదేవి యయిన సీతాదేవినే అపహరించితివి. నిన్ను సంహరించి స్త్రీలకు, సామాన్య మానవులకు, ధర్మమునకు రక్షణ నిచ్చుటకే విష్ణువే స్వయముగా రాముడుగా దిగివచ్చెను. కావున సీత

నాతని కర్పించి, శరణు వేడుము." రావణుడు ఇట్టి వారి మాటలను పెడచెవిన బెట్టెను. ఆతనితో బాటు రాక్షసు లెల్లరు రాముని వలన మడిసిరి. లక్ష్మణ హనుమదాదుల యందు ప్రవేశించి దానవులను సంహరించి నది గూడ శ్రీరాముని మహిమయే. ఇతడు ప్రత్యేకముగా చక్రమును ధరింప బనిలేదు. ఈతడే చక్రమై దానవులను సంహరించెను. వారి పాపఫలము పక్వమై కాలచక్ర స్వరూపుడయిన రాముని వలన సంహరింపబడిరి. వానరాదులు నాగరికత ఎఱుగని వారు. గుహుడు, జటాయువు, శబరి మున్నగు వనవాసు లెల్లరు అంతియే. కాని రాముని సేవలో నిమగ్నులైరి. శ్రీరాముడు వారికి జయమును కల్గించెను. వానరులకు దానవులను గెలుచుట సాధ్యమా? హనుమంతుని శరీరమున నిప్పు చల్లబడుట శక్యమా? ఇదంతయు సీతమ్మ మహిమ, రాముని దయ. కావుననే హనుమంతుడు రాక్షసులతో తాను రామదాసుడనని ప్రకటించెను. తోటి వానరులతో రాముడు విడిచిన బాణమును నేననెను. బాణమునకు ప్రత్యేక శక్తి యుండదు. విడిచినవాని శక్తిని బట్టి అది పనిచేయును. అట్లే నేను రాముని పరికరమును మాత్రమే. సముద్ర లంఘనము, సీతా దర్శనము అన్నియు రాముని దయయే అని ఆంజనేయుని భావము. తనకొరకై పోరాడి మరణించిన వానరులను గూడ ఇంద్రుని వరముచే రాముడు బ్రతికించెను. తనకని ఏ వరము నడుగలేదు. వారున్నచోట ఆహార పానీయములు సమృద్ధిగా లభ్యమగునటుల భరద్వాజుని వరము వేడెను. వానరులకు దానవులపై విజయమునే కాదు, వారిలోని అల్పత్వమును తొలగించి, వారి యెదలకు వికాసము కల్గించి, వారికి తన సన్నిధినిచ్చెను. అయోధ్యలో సన్మానించెను. సీతమ్మను చూచు నెపమున వానరులు నలుదిక్కులను స్త్రీలను సీతమ్మగానే దర్శించునట్లు చేసినవాడు రాముడు. వానరులను నరులుగా, దివ్యులుగా తీర్చిదిద్దెను. ఇక వానర రాజ్యము గూడ రామరాజ్యమయినది.

ఈ భూమిపైన జీవులకు ఉత్తమ వికాసము నొసగు స్థానము శ్రీవేంకటాద్రి. దానిపై రాముడు శ్రీవేంకటేశ్వరుడుగ నిలిచియుండుట మన భాగ్యము. ఆహా! దశరథుని భాగ్యము ఏమని వర్ణింపగలము! నారాయణునే సుతునిగా పొంది, అతనిని నోరార పిలుచుచు ఒడిలో కూర్చుండబెట్టికొని లాలించెనే! దశరథుని మంచితనము, పవిత్రత, ధర్మపాలనములకు మెచ్చి అతని భాగ్యముగా రాముడతని కుమారుడయ్యెను. శ్రీరాముని వియోగమును ఓర్వలేక దశరథుడు ప్రాణమును విడిచెను. ప్రాణము విడుచు సమయమున రామనామమును స్మరించి, రాముని దివ్యమూర్తి యొక్క సన్నిధిని హృదయమున అందుకొనెను. ఇతని భాగ్యముగా రాముడే స్వయముగా వచ్చెను. భగవంతుడు తన కుమారుడుగా జన్మింపవలెనని దశరథుడు కోరలేదు, యాగము చేయలేదు. అతని ఔదార్యము, ధర్మనిరతికి మెచ్చి రాముడే స్వయముగా అతని భాగ్యముగా ప్రకటించుకొనెను. అనగా కుమారుడుగ వచ్చి, అతనిని ఆనంద పరవశుని జేసెను. 'ప్రకటిత దశరథ భాగ్యమ'ను అన్నమయ్య రచన నుండి స్ఫూర్తినంది, గోపన్నగారు తన శతకమున 'దాశరథీ' అను మకుటమును కూర్చెను.

* * *

20

9వ సం-257

కోడెకాఁడు

సామంతము

కోడెకాఁడు వీఁడె వీఁడె గోవిందుఁడు
కూడె నిద్దరు సతుల గోవిందుఁడు. ॥ పల్లవి ॥

గొల్లెతల వలపించె గోవిందుఁడు
కొల్లలాడె వెన్నలు గోవిందుఁడు
గుల్ల సంకుఁజక్రముల గోవిందుఁడు
గొల్లవారింటఁ బెరిగె గోవిందుఁడు. ॥ కోడె ॥

కోలచేఁ బసులగాచె గోవిందుఁడు
కూలఁగుమ్మెఁ గంసుని గోవిందుఁడు
గోలయై వేలఁ గొండెత్తె గోవిందుఁడు
గూళెపు సతులఁ దెచ్చె గోవిందుఁడు. ॥ కోడె ॥

కుందనపు చేలతోడి గోవిందుఁడు
గొందులు సందులు దూరె గోవిందుఁడు
కుందని శ్రీవేంకటాద్రి గోవిందుఁడు
గొందిఁ దోసె నసురుల గోవిందుఁడు. ॥ కోడె ॥

అనుభూతితో జోడింపబడని మేధాసంపత్తితోడి విజ్ఞానము
తలకు భారమగును. దీనికన్న అజ్ఞానమే మేలు.

టీక

కోడెకాడు = యౌవనోత్సాహము గల మగవాడు, గోవిందుడు = గోవులచే తెలియబడువాడు, కాంతికిరణములచే తెలియబడువాడు, వాక్కులచే తెలియబడువాడు – శ్రీకృష్ణుడు, గుల్ల సంకు = పైన బోలుగా నుండు శంఖము, గోలయై = అల్లరితనము తోడి పసివాడై, గూళెపు = గూడెమునందలి, కుందనము = స్వచ్ఛమైన బంగారము, గొందిఁదోసెను= పారద్రోలెను, మూలకు నెట్టెను, మృత్యువులోనికి త్రోసెను.

పరిచయము

ఈ సంకీర్తనమున శ్రీవేంకటేశ్వరుని శ్రీకృష్ణునిగా భావించి కృష్ణ లీలలను మనోహరముగా అన్నమయ్య తేటతెనుగు పలుకులలో ఒడలు మరచి సంకీర్తన గావించుచున్నాడు. ముఖ్యముగా బాలకృష్ణునిగా వేంకటేశ్వరుని దర్శించి, తనిసి, దీనిని గానము చేసెను. శ్రీవేంకటేశ్వరుని అవతారములలో శ్రీకృష్ణుడు లీలగా నర దేహము ధరించినవాడు. అతని జీవితమంతయు ఆటయే. అతడు క్రీడామయుడైన శాశ్వత శిశువు. ఏ పనిని అతడు 'అమ్మో' అని తలపలేదు. అన్నిటిని ఆటలుగా భావించెను. శ్రీకృష్ణ లీలాసంకీర్తనమున ఎవరికి పారవశ్యము గలుగదు? తీయదనము కన్న తీయనైనవి కృష్ణ లీలలు. ఇక అన్నమయ్యకేల కలుగదు? పూర్వజన్మలో శ్రీకృష్ణునితో మెలగిన సాందీపని మహర్షి గదా! అపుడు స్వామికి గురువగు భాగ్య మబ్బినను, స్వామిని సంకీర్తనము చేయు నవకాశమునకు అతడు నోచుకొనలేదు. ఆ లోటు ఈ జన్మలో భర్తీ అయినది.

పల్లవి యొక్క తాత్పర్యము

"కోడెకాడు ఇతడె ఇతడె గోవిందుడు, ఉత్సాహము గలవాడు. అతడు ఇద్దరు భార్యలను కలిగియుండెను."

వ్యాఖ్య

గోవింద శబ్దము శ్రీకృష్ణునే సూచించినను, శ్రీవేంకటేశునకు పర్యాయమై ప్రసిద్ధి గాంచినది. చిత్రముగా అన్నమయ్యకును ఇద్దరు సతులుండిరి. గోవిందుడనగా ఆవులచే తెలియబడువాడు. ఆవుల నడుమ నున్నవాడు గావున తక్కువవాడని కాదు. ఇతడు పరమాత్మ. ఆవులను పెంచి, వాని నడుమ జీవించినచో స్వామి అనుభూతి దక్కును. మానవ స్త్రీ తన సంతతికి మాత్రమే తన వాత్సల్యమును స్తన్యముగా నిచ్చును. కాని ఆవు తన దూడలకే కాక ఎల్లరికిచ్చును. కావున గోవు మనకు మాత. ఆవులను పెంచుట వలన, వాని విశాల మాతృత్వము మనకు నబ్బి, దేవుని సన్నిధి లభించును. ప్రేమయే గదా ఆనందరూపము. గోకులమున ఉపనిషత్తులే ఆవులుగా అవతరించి నవి. గోవు లనగా కాంతికిరణము లనియు నర్థము. కాంతికిరణము లెవరి నుండి పుట్టుచున్నవో పరిశీలింపగా మూలము సూర్యబింబ మనియు, ఆపై సూర్యబింబము లోపల చైతన్యముగా నున్న 'నారాయణుడ'నియు తెలియును.

గోవులనగా బ్రహ్మజ్ఞాన కిరణములనియు, ఇతరులకు ఆహ్లాదము గావించు వాక్కు లనియు అర్థము. ఇట్టి వాక్కుల వలన స్వామి సాన్నిధ్య మాధుర్యము మనలను ఆవహించును. ఇన్ని విధముల గోవిందుడయిన స్వామి కృష్ణావతారమున ఆలమంద లను గాచెను, గోవింద నామమును పొందెను. ఇచట 'గో' శబ్దము

ఆవుల ప్రాముఖ్య మును, 'కోడె' శబ్దము ఎద్దుల ప్రాముఖ్యమును సూచించును. కావున శ్రీకృష్ణుడు పశుపాలనమును, కృషికర్మను ప్రోత్సహించి గ్రామరాజ్యమును నెలకొల్పెనని అన్నమయ్య సూచించుచున్నాడు. ఈ రెంటివలన లభించునవే పాడిపంటలు. ఇవియే వాస్తవమయిన సంపద. వీనివలన పల్లెలలో జనులు కలిసి హాయిగా బ్రతుకుదురు. ఈ రెండు వృత్తులను చెదరగొట్టి, ప్రజల పాడిపంటలను దోచుకొని, ధనమునకు ప్రాధాన్యము గల కృత్రిమ నాగరికతను పెంచిన దోపిడీని కల్గించిన కారణముగనే కంసుడు వధింపబడెను. అన్నమయ్య జనకమహారాజు వలె, శ్రీరాముని వలె, శ్రీకృష్ణుని వలె ఈ రెంటికి ప్రాధాన్యమొసగినట్లు పల్లవి వలన తెలియుచున్నది. పటిష్టమయిన ఆర్థిక సాంఘిక వ్యవస్థకు ఇవియే పునాదులు. ఈయన ఉపదేశములు అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడు సముచితములే. ఇతడె, ఇతడె యని అన్నమయ్య రెండుమార్లు అనుచు ఉల్లాసముతో, సాన్నిహిత్యముతో గోవిందుని కీర్తించుచున్నాడు. పై అన్ని అర్థములలోను ఈ గోవింద నామము శ్రీవేంకటేశునకు చెల్లును. ఏ ప్రాయమున అయినను కృష్ణుడు ఉత్సాహియే. ఇది నిత్య యువకుని ఉత్సాహము. ఏలననగా స్వామి శరీరాతీతుడు. చైతన్యరూపుడు. శరీరమునకు ఉత్సాహము తరుగును గాని, చైతన్యమునకు అట్టిది ఉండదు. మరియు శ్రీకృష్ణునకును, శ్రీవేంకటేశ్వరునకును బాహ్యరూపములు గాక, దివ్యతేజోమయ దేహములు గలవు. ఇవి నిత్యయౌవనోత్సాహ వంతములు. కావున అన్నమయ్య గోవిందుని 'కోడెకాడ'నెను. మరియు శ్రీకృష్ణుడు వృషభ లగ్నమున చంద్రు దుచ్ఛలో వృషభమున నుండగా జన్మించెను. కావున అన్నమయ్య జ్యోతిశ్శాస్త్రము ననుసరించియు గోవిందుని 'కోడెకాడు' అనెను. వృషభ రాశి కోడెకు సంకేతము గదా! వృషభము 'వీడు'గా అనగా నివాసముగా – లగ్నముగా గలవాడని అన్నమయ్య భావము. మొదటి 'వీడు' నివాసమును, రెండవ 'వీడు' 'ఇతడు' అని సూచించును. శ్రీవేంకటేశ్వరునకు శ్రీదేవి, భూదేవి అని ఇద్దరు సతులు గలరు. శ్రీదేవి యనగా పరాశక్తి. భూదేవి యనగా భౌతికముగా కన్పడునది. శక్తియే పదార్థముగా పరిణమించును. శక్తి యొక్క స్థూలరూపమే పదార్థము. పదార్థము యొక్క సూక్ష్మరూపమే శక్తి. మన శరీరమను పదార్థము కూడ ప్రాణశక్తి చాలనము యొక్క స్థూలరూపమే. ఇట్లు ఇద్దరు సతులుగా కనపడినను వాస్తవముగా ఇర్వురు నొకటియే. ఇక స్వామి అఖండ చైతన్యము. చైతన్యము, శక్తి, పదార్థము ప్రత్తి, నూలుపోగులు, చీర వంటివి. శ్రీకృష్ణుని ప్రధాన సతులగు రుక్మిణిగా శ్రీదేవి, సత్యభామగా భూదేవియు అవతరించిరి.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"కృష్ణుడు గోపికల అమాయిక సరళ హృదయములను ఆకర్షించి, వారి ప్రేమను చూరగొనెను. శంఖ చక్రములను రెండు చేతుల యందు ధరించెను. గోపస్త్రీల ఇండ్ల యందు కృష్ణుడు పెరిగెను."

వ్యాఖ్య

కృష్ణుడు తన దివ్యప్రేమతో ఆకర్షించినది, మోహింపజేసినది గోపికల శరీరములను, ఇంద్రియములను గాదు, వారి హృదయములను. వారి ఆత్మీయమయిన, స్వచ్ఛమగు ప్రేమను చూరగొనెను. వారిని తన

దివ్యదేహముతో తాకి, వారికి అఖండ దివ్యానుభూతి నొసగెను. వారమాయికలు, స్వచ్ఛ హృదయులు, కలిసి బ్రతుకువారు గావున ఇది సాధ్యమయినది. కృష్ణుడు తాను అపహరించిన వెన్నను ఎల్లరు బాలురకు పంచెను. సంపద ఎవరి స్వంతము గాదని నిరూపించుటకే ఈ లీల జరిపెను. అంతేకాక ఆనందానుభూతి యను వెన్నను పంచెను. శంఖచక్రధారి ఇతడు. శంఖము పంచ ప్రాణములను పుట్టించు 'ఓం'కార నాదమునకు ప్రతీక. చక్రము పేరు సుదర్శనము. విశ్వమును విష్ణువుగా దర్శించు అనుభూతియే చక్రము. మన శ్వాసలో నడుచు ఓంకార నాదము శంఖము కాగా, సహస్రారము చక్రము. ఈ రెండును మన హృదయములందు వసించుచున్న స్వామికి ఆయుధములు. ఇట్లు ధ్యానింపవలెను. మరియు ఎల్లరి పలుకులలో స్వామి యుపదేశమును వినుట, పాటించుట శంఖమునకు ప్రతీక. ఎల్లరి రూపములలో స్వామినే దర్శించి, సేవించుట చక్రమునకు ప్రతీక. వేంకటేశుడును శంఖ చక్రములను ధరించెను. స్వామిని ఎట్లు శంఖచక్ర ధారిగా ధ్యానింపవలెనో అన్నమయ్య ఉపదేశించెను. పుట్టినది రాజకుటుంబమున అయినను, కృష్ణుడు పెరిగినది గోప స్త్రీల ఇండ్లలో. ఒక్క యశోద ఇంటిలోనే కాదు, గోపాలబాలుర తల్లులగు గోకులవాసు లెల్లరి ఇండ్లలోను పెరిగెను. ఒక సందర్భమున బ్రహ్మదేవుడు గోపాలబాలురను, ఆవుదూడలను మాయము చేయగా, శ్రీకృష్ణుడు వీరెల్లరి రూపములను తానే ధరించి ఒక సంవత్సరము పాటు గోపస్త్రీల గృహము లందు పెరిగెను. మరియు గోపిక లాతనిని తమ భుజములపై నడిపించి పెంచిరి. వారి భాగ్యమట్టిది.

శ్రీకృష్ణుని యవతారమున రెండు విలక్షణములు గలవు. 1. పారమ్యము. 2. సౌలభ్యము. సర్వజగత్తులో శ్రేష్ఠుడు ఇతడే. అట్టివాడు పల్లెజనులతో ఎంతయో చనువుగా మెలగుచు వారును తనతో చనువుతో మెలగునట్లు తేలికగా వారికి తన సాన్నిధ్యము నిచ్చెను. పల్లవిలో గోవింద శబ్ద ప్రయోగముననే ఈ రెండు విలక్షణములు జోడుగా కలిసియున్నవి. సూర్యాంతర్వర్తి యగు నారాయణుడు ఆవులతోను, ఆలకాపరులతోను కలిసి చరించెను.

2వ చరణము యొక్క తాత్పర్యము

"కృష్ణుడు చంర్నకోలతో పశువులను గాచెను. కంసుడు మృతిచెందునట్లుగా అతనిని గుద్ది క్రుమ్మెను. అల్లరిచిల్లరిగా పసితనముననే తన చిటికెనవ్రేలిపై గోవర్ధనగిరి నెత్తెను. గోపాలుర గూడెము లందలి గోపికలను ఒకచోట చేర్చెను."

వ్యాఖ్య

పశువులను చర్నకోలతో కాచుటలో వానిని కృష్ణుడు కొట్టలేదు. కాపాడెను. ఆతని కోల తాకిన మాత్రముననే పశువులు ఆనందముతో, ఉత్సాహముతో ఉప్పొంగి సాగినవి. దీనినే భాగవతమున భీష్ముడిట్లు చమత్కరించెను. పశువులనగా ఇంద్రియ ములు. వానిని స్వామికి సమర్పించినచో, స్వామికి మనస్సు అను పగ్గమప్పజెప్పినచో, స్వామి కోల యొక్క మాధుర్యమున మునిగి ఇంద్రియములు ఐహిక విషయములందు విముఖములగును. ఉదాహరణకు కన్ను ఎల్లరిలో స్వామిని చూడ అలవాటయినచో, వ్యక్తిగతమయిన

అందముచే ఆకర్షింపబడి మోసపోదు. భక్తునకు కనపడునవెల్ల స్వామి రూపములు. వినపడునవెల్ల స్వామి పలుకులే. భుజించినదెల్ల స్వామి ప్రసాదమే. తాను పలుకు మాటలెల్ల స్వామిని గూర్చిన పాటలే. చర్మమున తాకినవెల్ల స్వామి రూపములనే. జన్మోహనమయిన కృష్ణుని నీలాకాశ దివ్యసుందరరూపమును గనిన వానికి, ఏ వ్యక్తి, ఏ వస్తువు యొక్క అందమయినను ఆకర్షింపదు. ఈ యందము లెల్ల స్వామి సౌందర్యమున భాగములే కదా! కంసుడు పాడిపంటలను హరించి, పల్లెలను ధ్వంసము గావించి, కామమునకు, ధనాసక్తికి ప్రాధాన్యమొసగి ప్రజా పీడకుడాయెను. పన్నెండేండ్ల వయస్సుననే కృష్ణుడు వీరుడగు కంసుని ఏ ఆయుధము లేకయే చంపెను. తన సభలో ప్రవేశింపగనే కంసునకు కృష్ణుడు కాలస్వరూపుడుగా గానవచ్చి భయము కలిగెను. ఇది స్వామి దివ్యలీల. ఇంద్రయాగమును మాన్పించి, కృష్ణుడు నందాదులగు పెద్దలచే ఆవులను పూజింపజేసెను. ఇంద్రుడు మబ్బుల కధిపతి. అతడు కురిపించిన రాళ్ళవాన నుండి కాపాడుటకై చిటికెనవ్రేలి నెత్తి దానిపై గోవర్ధనగిరి నుంచి, కృష్ణుడు గోకులవాసు లెల్లరిని దాని క్రిందకు చేర్చెను. జనులెల్లరు ఒకే గొడుగు – తన నీడ క్రింద బ్రతుకుట నేర్పెను. ఎల్లరిలో ఒక్కడు తానే గదా! ఏడేండ్ల వయస్సు గల బాలకృష్ణునకు దొడ్డ కొండ నెత్తుట చిలిపిచేష్టయే. ఏమాత్రము అతని కాయేడు దినములందును అలసట కలుగలేదు. గోకులవాసులకు రాళ్లవాన నుండి రక్షణ, పలువురు ఒకడుగా బ్రతుకుట – ఈ రెంటిని ప్రసాదించెను. గోపికలకు వేరు వేరు పేర్లు భాగవతమున చెప్పబడలేదు. కారణము, వీరెల్లరు కృష్ణునకు చెందిన వారే. తమ తమ వ్యక్తిత్వములను ఆయనకు సమర్పణమందిన వారగుటచే ఒకటిగా మనుగడ సాగించిరని చివరి పాదమున అన్నమయ్య తెలిపెను. కలిసి బ్రతుకుట అన్నమయ్య ఆశయము, ఉపదేశము. దీనిని ఆతడాచరించి, ఆచరింపజేసి సంకీర్తనము లందు ప్రబోధించెను. 'గూళెము' అను పదమును ప్రయోగించుటలో సమష్టి జీవితమును సూచించెను. కలిసి బ్రతుకుట వ్యక్తుల కెపుడు సాధ్యము? తమరెల్లరు అంతర్యామి యగు స్వామి యొక్క కిరణములే, భాగములే, రూపములే యని అనుభవమునకు వచ్చినపుడు. అట్టి అనుభవమును శ్రీకృష్ణుడు గోపికలకు అనుగ్ర హించెను. నగరములకు దూరముగా కలిసిమెలిసి ప్రకృతితో కలిసి మనుగడ సాగించు అమాయికుల గుంపును 'గూడెము లేక గూళెము' అందురు. కావున అన్నమయ్యకు వీరిష్టులన్నమాట. ఈ గూళెపు బ్రతుకు అతని కిష్టము. ఈ గూళెములో గోపికలే గాక, గోపాలురు, చెంచితలు, భిల్లకాంతలు కూడ నున్నారని భాగవతమున గలదు. ఈ గూడెమువారు భక్తిసాధన వేరు వేరుగా చేయ బనిలేదు. కృష్ణుని వేణుగానము వినిన చాలును. ఎల్లరు కృష్ణుడే అగుదురు. ఇట్టి గుంపును స్వామి అవనము చేయును. అనగా బంధముల నుండి కాపాడును. బృందావనమను సంస్కృత పదమునకు 'గూళెము' తెలుగులో సూటి అనువాదము. అన్నమయ్య ఒకడే ఈ పదము నిట్లు ప్రయోగించెను.

3వ చరణము యొక్క తాత్పర్యము

"కృష్ణుడు బంగారు రంగుతో మెఱయు వస్త్రములను ధరించి, గోకులమున గొందులు, సందులు దూరెను. ఆయన ధరించిన పీతాంబరము యొక్క కాంతులు గొందులలో సందులలో ప్రకాశించెను. కృష్ణుడు అసురులను మృత్యువను మూలకు త్రోసెను. ఈతడు తిరుమలపైని కుందని శ్రీవేంకటేశ్వరుడు."

వ్యాఖ్య

నీలాకాశమే కృష్ణుని విశాల దేహము. సూర్యోదయ సమయమున ప్రకాశించు బంగారు కిరణములే అతని పీతాంబర కాంతులు. అణువణువు, వీథి వీథియు స్వామి తేజస్సుతో ప్రకాశించునదిగా కన్పట్టును. కృష్ణుడు తిరిగిన ప్రతి గొంది, సందు ఆయన నీలశరీర దివ్యకాంతులతో, పీతాంబర శోభతో ప్రకాశించెను. ఇది అన్నమయ్య దర్శనానుభూతి. అన్నమయ్య బృందావనమును భౌతికముగా దర్శించెనో, లేదో గాని లోగన్నులతో దర్శించెను. గతమున జరిగిన శ్రీకృష్ణ లీలలు మరల అన్నమయ్య లోగన్నులకు కన్పడెను. అల్లరి ఆటకాడగు కన్నయ్య అన్నమయ్యకు కానవచ్చెను. అసురులనగా అసువులు – ప్రాణములతో పనిచేయు భౌతిక దేహము నందు భ్రాంతి కలిగి, విషయ భోగలాలసులయిన వారు. తమ భోగములకై జనులకు కీడు చేయుటకు వెనుకాడనివారు. ప్రత్యేకముగా వీరికి కోరలుండనక్కరలేదు. స్త్రీల నవమానించి, జనులను హింసించి, దోపిడీ చేయు వారెల్లరును అసురులే. ఇట్టి లోకకంటకులయిన కంసుడు, నరకుడు, పౌండ్రక వాసుదేవుడు, హంసడిభకులు, జరాసంధుడు మున్నగు అసురులను సూటిగా గాని, పరోక్షముగా గాని కృష్ణుడు నిర్మూలించెను. ధర్మమును నెలకొల్పి ప్రజలను కాపాడెను. భాగవతమున వర్ణింప బడిన శ్రీకృష్ణావతార తత్త్వము నంతటిని తన యెదలో దర్శించి అన్నమయ్య ఈ సంకీర్తనమున తీయగా పొందుపరచెను. దీనిని గానము చేయువారు, వినువారు అన్నమయ్య వలె ధన్యులై, కృష్ణ దర్శనము నొందగలరు.

శ్రీవేంకటేశుడు కుందనివాడట. అనగా నిత్యము ఉత్సాహవంతుడై మార్పు లేని వాడు. ఆయనకు పొంగు లేదు, క్రుంగు లేదు. నిత్యకల్యాణమూర్తి. భగవంతుడు ఆత్మచైతన్యము. కావున మార్పు లేనివాడు. భౌతికమయిన దానికి మార్పు ఉండును. శరీరమున కతీతుడయిన స్వామికి ఉత్సాహము తగ్గదు. పల్లవిలో పేర్కొనబడిన 'కోడెకాడు' గావున ఈ చరణములో చెప్పబడినట్లు కుందనివాడు. చారిత్రకముగా పరిశీలించినచో శ్రీవేంకటేశ్వరుడు శ్రీకృష్ణావతరణమునకు ముందే తిరుమలలో వెలసి నట్లు తెలియుచున్నది. కృష్ణుని అన్నగారగు బలరాముడు తన తీర్థయాత్రల సందర్భమున వేంకటాచలమును దర్శించినట్లు భాగవతమున గలదు. ఈ యంశమును అన్నమయ్యయు తన వేరొక సంకీర్తనమున ప్రస్తావించెను. కావున కృష్ణుని కాలమునకే వేంకటేశ్వరుడు వెలసియున్నాడు. వేంకటేశ్వరుడు వెలసియుండుట వలననే ఈ కొండకు వేంకటాచలమను పేరు వచ్చెను. ఆ కొండ కూడ స్వామి యొక్క ఒక విభవ రూపమే కదా! వేంకటేశ్వరుడే కృష్ణునిగా అవతరించి జరిపిన లీలలను అన్నమయ్య సంకీర్తించెను. బాల్య లీలలనే గాక, కృష్ణుని సమగ్ర జీవిత తత్త్వమును తెలిపెను. ఇట్లే రామాయణమున శ్రీరంగనాథుని ప్రస్తావన గలదు. ఇక్ష్వాకు వంశీయులచే అర్చింపబడుచున్న శ్రీరంగని దివ్యమూర్తిని శ్రీరాముడు తన పట్టాభిషేక సమయమున విభీషణునకు ప్రసాదించెను. 108 తిరుపతులలో తిరుమల, శ్రీరంగము ప్రధానములు గదా!

* * *

21

28వ సం-319 **చల్లరే హరిపై** మోహన

చల్లరే హరిపై జాజరజాజ
చల్లగా సరసపు జాజరజాజ. ॥ పల్లవి ॥

సతతపు వలపుల జాజరజాజ
చతురుల మాటల జాజరజాజ
సతమగు నవ్వుల జాజరజాజ
జతనపు సిగ్గుల జాజరజాజ. ॥ చల్లరే ॥

సముకపు కొసరుల జాజరజాజ
సమరతి కరగుల జాజరజాజ
జమళి తమకముల జాజరజాజ
సమయని యాసల జాజరజాజ. ॥ చల్లరే ॥

జడియని పంతపు జాజరజాజ
సడగుల చేతల జాజరజాజ
జడిగొను చెమటల జాజరజాజ
జడగొను పెనగుల జాజరజాజ. ॥ చల్లరే ॥

చలముల ఒట్ల జాజరజాజ
సలిగెల పగటుల జాజరజాజ
చలువల వినయపు జాజరజాజ
సళుపుల చూపుల జాజరజాజ. ॥ చల్లరే ॥

సంగడిమూకల జాజరజాజ
జంగిలి మతకపు జాజరజాజ
సంగాత మమరిన జాజరజాజ
సంగతి యెరికల జాజరజాజ. ॥ చల్లరే ॥

సారపు మోవుల జాజరజాజ
సారెకు బొలసేటి జాజరజాజ
సౌరుచిమెచ్చుల జాజరజాజ
జారతనంబుల జాజరజాజ. ॥ చల్లరే ॥

సందడి కొలువుల జాజరజాజ
సందుల ఒత్తుల జాజరజాజ
చందురు పాటల జాజరజాజ
సందె చీకటుల జాజరజాజ. ॥ చల్లరే ॥

చాలుకొను సతుల జాజరజాజ
జాలి విరహముల జాజరజాజ
చాలా మరిగిన జాజరజాజ
చౌలూరించే జాజరజాజ. ॥ చల్లరే ॥

చనుగవ గురుతుల జాజరజాజ
చనవుల కొసరుల జాజరజాజ
యెనసెను శ్రీవేంకటేశ్వరు డీతని
చనుమానంబుల జాజరజాజ. ॥ చల్లరే ॥

ఆర్తుని దుఃఖాశ్రువులు నీవు తుడవక మునుపు, నీ బాధవలని కన్నీరు ఎండకుండుగాక!

టీక

కొసరులు = వేడికోళ్ళు, సమరతి = సమమయిన ప్రేమ గల, జమళి= రెట్టింపు, తమకము = తహతహ, జడియని = భయము, మొగమోటము లేకుండ, సడగు = ఉత్సాహము, జడిగొను = ఎడతెరపి లేక అధికమగు, జడగొను = కలియబడు, చలము = పట్టుదల, సలిగె = ఎక్కువ చనవు, చలువ = చల్లదనము, సళుపుల = బాధించు, సంగడి = తోడు, జంగిలి = గుంపు, మతకము = మర్మము, సంగాతము = స్నేహము, సంగతి = పొందు, పొలయు = కలుగు, సౌరుచి = చక్కదనమునకు సంబంధించిన, జారతనము = జారిపడిపోవుట, సందడి = గుంపు, ఒత్తు = త్రోసి కొనుట, చాలుకొను = వరుసగా నేర్పడు, ఎనసెను = ఒప్పెను, చనుమానము = స్నేహము.

పరిచయము

అన్నమయ్య తన పర్యటనలో స్వయముగా పల్లెలలో 'జాజర' అను యుత్సవమును పరికించెను. పల్లెలలోని కన్యలు పరస్పర స్నేహభావముతో, స్వచ్ఛ హృదయలై ఒకరిపై నొకరు పుప్పొడి, గంధపు పొడి వంటి వానితో గూడి పరిమళ ద్రవ్యములను చల్లుకొనుచుండుటను గమనించెను. వారి సరదా, పరస్పరత్వము, నైర్మల్యము ఇతనిని లోగొన్నవి. నిర్మల హృదయములు దేవునికి ఆలయములు గదా. ఒక్కొక్కరు ఇతరుల లోని అంతర్యామి యగు శ్రీవేంకటేశ్వరునిపై భక్తిభావముతో చల్లుచున్న అనుభూతి వారికి కలిగినది. అన్నమయ్య సహృదయుడై ఈ జాజర నానందించి, మానసికముగా వారితో పాల్గొనెను. సర్వాంతర్యామి యగు హరి పైననే ఈ పల్లియ కన్నియలు పరిమళద్రవ్యములను చల్లుచున్న దృశ్య మీతని మనోనేత్రములకు సాక్షాత్కరించినది. ఇక ఈ సంకీర్తనము అతని హృదయము నుండి వెలువడినది. జాజర జరుగుచుండగా వారికి స్వామియెడల గలిగిన పారవశ్యము, వారి మాటల నేర్పు, నిర్మలములగు నవ్వులు, సిగ్గులు, కోరికలు, తహతహలు, పంతములు, చేష్టలు, పెనగులాటలు, సరదాతోడి ప్రమాణములు, స్వామితోడి చనవులు, చూపులు, సమష్టి వర్తనము, కలివిడి బ్రతుకు, ఉత్సాహము, ఒరసికొనుట, వారి పాటలు, వారు నిలిచిన తీరుతెన్నులు, స్నేహము అన్నమయ్యను ముగ్ధుని గావించి ఈ సంకీర్తనమున వర్ణింప బడినవి. అన్నమయ్య పల్లె కన్నియల ఆట మన కండ్లకు కట్టించెను. ఎవరి యెద దీనియెడల స్పందింపకుండును? ఈ కన్యలతో బాటు గాయకులును, శ్రోతలును ఒకరై, వారి మనసు లాడిపాడి జాజర యందు పాల్గొనక తప్పదు. అన్నమయ్య బృందావనమును దర్శించి, తన సంకీర్తనలలో మనకు చూపించెను. తానును సృజించెను. తిరిగి పవిత్ర గ్రామ వ్యవస్థ భారతదేశమున చిందులువేయు సుదినము త్వరలో అవతరించుగాక. జగమెల్ల బృందావన మగుగాక. దివియే భువికి దిగివచ్చు గాక. ప్రాచీన భారతీయ గ్రామ వ్యవస్థ, వసుధైక కుటుంబమున కొక నమూనా యని ఈ సంకీర్తనలో మనకు కన్పించితీరును. భారత ధర్మము సంకుచితము గాదు, విశాల విశ్వమానవ ధర్మమే ఇది.

పల్లవి యొక్క తాత్పర్యము

"హరిపై మీరెల్లరు జాజరలో పాల్గొనుచు చల్లెదరుగాక. చల్లని హృదయములతో ఆనందముగా చల్లుడు."

వ్యాఖ్య

పల్లెపిల్లలు జాజరలో పరిమళములను హరిపై చల్లుచున్న దృశ్యమును అన్నమయ్య గాంచెను. కావున ఇచటే 'చల్లరే' అనగా వారి నుద్దేశించి చల్లుడని అన్నమయ్య పిలుపు నేల ఇచ్చుచున్నాడు? 'చల్లుచున్నారు' అను నంశమునే 'చల్లరే' అను పిలుపులో నినదించుట జరిగినది. మరియు ఇంకను చల్లుడని వారిని ప్రోత్సహించుచున్నాడు. మనము ఈ పిలుపు నందుకొని స్ఫూర్తిగొన నగును. పరిమళములను చల్లు ఉత్సవము పేరు జాజర. యాంత్రికముగా ఉత్సవములను జరుపుకొను కృత్రిమత్వము పనికిరాదు. చల్లని మనస్సులతో, ఆనందోత్సాహములతో హరిపై చల్లు జాజర ఇది యని అన్నమయ్య వర్ణించుచున్నాడు. వీరు చల్లుట సహజ స్వచ్ఛమైన ప్రవర్తనము. ఈ చల్లదనము, ఆనందోత్సాహములు కన్యలలో ఒకరిపై నొకరికి గలది. స్వామి యందు గలది. ఒకరి యందొకరికి చల్లదనము అనగా ప్రేమతో తడిసిన హృదయము లేకున్నచో స్వామిని పూజించినను, ఆయన యందు ఇది లేనట్లే. పరస్పరము చల్లదనము గల వారికే రసము దక్కును. వారి యాట సరస మగును. రసమే గదా బ్రహ్మమని ఉపనిషత్తు చెప్పుచున్నది. చల్లదనము ప్రేమకు, వేడిమి కోపావేశమునకు సంకేతములు. ప్రేమ సమస్థితిని కల్గించును. ఆవేశము విషమస్థితి నిచ్చును. భక్తి యనగా ఇష్ట దైవతము నెడల నెరపు వెఱ్ఱి యావేశము గాదు. బ్రతుకునంతయు ఒక దివ్య లక్ష్యము యొక్క అనగా సమాజ రూపుడగు స్వామికి అంకితము గావించుటయే భక్తి. ఈ అంతర్యామియే ఇష్టదైవతమని భావింపవలెను. కనుక జాజర, భక్తి పెంపుదలలో ఒక చక్కని అంశము. 'జాజర' అను పదమును రెండుమార్లు ప్రయో గించుట పల్లెపిల్లల ఉత్సాహము అధికమని సూచించుటకే. రెండవమారు చివరి 'ర' అన్నమయ్య విడిచిపెట్టెను. ఇందువలన నాదమాధుర్యము ఒనగూడినది. భావములో తేడా రాదు. సాధారణముగా ప్రతి సంకీర్తనమున మూడు చరణము లుండును. జాజర యొక్క సమగ్రమూర్తిని కన్నులకు కట్టించుటకై అన్నమయ్య తొమ్మిది చరణములను గానము చేసెను.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"జాజర సందర్భమున స్వామిపై ఈ బాలికలకు సదా అనురాగమున్నది. వీరు ఒకరితో నొకరు నేర్పుగా, సరదాగా ముచ్చట లాడుచున్నారు. ఎల్లప్పుడు నవ్వు చున్నారు. పూని సిగ్గులను నెఱపుచున్నారు."

వ్యాఖ్య

ఒక్కొక్కరికి ఎల్లరిపై గల అనురాగమే స్వామిపై అనురాగము. భేదభావము లేక ఎల్లరు కలిసి ముచ్చటలాడుచున్నారు. అనురాగము, ఉత్సాహము, ఆనందము నవ్వులుగా వ్యక్తమగుచున్నవి. స్వామి యెడల సిగ్గుపూనుట వీరికి అలంకారము.

2వ చరణము యొక్క తాత్పర్యము

"స్వామికి ఎదురుగా నిలిచి ఆయనను వేడుచున్నారు. ఎల్లరికి ఒకే పరిమాణములో స్వామియందు అనురాగము గలదు. దానితో ఆయనయందు కరగిపోవుచున్నారు. స్వామిపై చల్లవలెనని తహతహ

వారియందు ఇనుమడించినది. స్వామి అనుగ్రహమును పొందవలెనను ఆశ, ఆయనపై పరిమళములను చల్లవలెనను ఆశ తీరుటలేదు."

వ్యాఖ్య

స్వామిని వారేమియు కోరుటలేదు. మరి దేనిని వేడుచున్నారు? ఆయన అనుగ్రహమునే. దివ్యప్రేమను, దివ్యానందమునే. లీలాశుకుడను భక్తు డిట్లు స్వామితో పలికెను "నీవు నాయందు దయ చూపినచో ఇక కావలసిన దేమున్నది? నీ దయయే లేకున్నచో ఇక కావలసిన దేమున్నది?" ఇచట రతి యనగా ప్రేమయే. సమరతి యనగా సమస్థాయిలోని ప్రేమ. ఈ సందర్భమున ఈ యర్థముననే ఈ పదము వాడబడినది. వయసు వచ్చిన స్త్రీ యను అర్థము సరిగాదు. గోపికల భక్తిలో ఎక్కువ, తక్కువలు లేవు. ఎల్లరకు కృష్ణుని యందు ఒకే స్థాయి ప్రేమ గలదు. అట్లే ఈ పల్లె పిల్లలకు స్వామియందు గల ప్రేమ యొక్క స్థాయిలో వ్యత్యాసములు లేవు. అనగా ఒకరికి వేరొకరిపై గల ప్రేమ యొక్క స్థాయిలోను వ్యత్యాసములు లేవు. అందరికిని అందరిపైన ఒకే ప్రేమయే. అదియు పరమప్రేమయే. ఎదుటివారిని 'తనను' గా భావించుటే ప్రేమయొక్క లక్షణము. దీనినే 'ఆత్మీయత' అందురు. ఇది వీరిలో గలదు. ప్రేమ అను భావము సేవను పురికొల్పును. వీరు ఎదుటివారిని స్వామిగ భావించి సేవించిరి. 'సమరతి' యను పదమున విశేషమిది. ఇట్టి ప్రేమలో బాలలు కరగిపోవుట జరిగినది. నీటిపై తేలుచున్న మంచుగడ్డలు నీటియందే కరగుట సంభవించును. అట్లే భగవంతుని ప్రేమ నుండి జనించిన మానవుల మనస్సులు మరల ఆ ప్రేమయందు కరగుట తప్పనిసరి. ఇదియే పారవశ్యము. ఇదియే దివ్యానందము. ఈ పాదమున అన్నమయ్య అద్భుతముగా ప్రేమ నావిష్కరించెను. నిజమైన ప్రేమలో మార్పులుండవు. ప్రేమలోనే ఆనందమున్నది. ప్రేమయే ఆనందము. తోటి జీవులెల్లరను ప్రేమించుటే దేవుని ప్రేమించుట. (ఆహా! ఎంతటి ప్రేమరస సుధైకమూర్తి ఈతడు.) చైతన్య మహాప్రభు, రవీంద్రనాథ టాగూర్ దీనినే తెలిపిరి. ఉత్తర భారతమున చైతన్యుల అనుచరగణము బహుళమై యున్నది. కాని అన్నమయ్యకు ఆంధ్రదేశమున ఈ ఆరువందల ఏండ్లకాలంలో అనుచరణ వర్గము లుప్తమగుట శోచనీయము. జాజరలో పాల్గొనుచున్న కన్యలు ఒకసారి స్వామిపై పరిమళములు చల్లిన పిమ్మట, మరల మరల చల్లవలెనను తహతహ రెట్టింపుగా నయ్యెను. ఇది అభ్యాస మహిమ. మనకు ఇష్టమైన పని ఒకసారి చేసిన పిదప, దానిపై ఇష్టము పెరుగుచుండుట సహజము. చెడు పని విషయము గూడ ఇంతియే. ఇక మంచిపని, అదియు స్వామిని సేవించుటలోని రుచి మరిగిన పిదప తహతహ రెట్టింపుగా నగుట తప్పనిసరి. స్వామియే ఈ తహతహను వీరిలో రేకెత్తించును. స్వామి యొక్క అనుగ్రహమును పొందవలయునను ఆశ, ఆయనపై పరిమళములను చల్లవలెనను ఆశ తీరుటలేదు. ఇది ఎప్పటికిని తీరదు. ఎన్ని జన్మలకైనను 'నీ పదసేవ ప్రసాదింపుమ'ని కులశేఖ రాళ్వారు కృష్ణుని ప్రార్థించెను. "నరకమయినను గైకొనుటకు నేను సిద్ధమే. నీ పాదసేవ మాత్రము విడువనీయకు" అనియు నాతదు వేడెను. ఇచట పల్లెపిల్లలకు గూడ దేవుని పాదసేవ యందలి ఆశ తీరుట యుండదు. మరియు ఒకరిపై ఒకరు చల్లుకొనుటలో గల ముచ్చట కూడ తీరదు. ఇది బృందజీవన మాధుర్యము.

3వ చరణము యొక్క తాత్పర్యము

"భయము, మొగమాటము లేకుండ పట్టుదలతో కన్యలు స్వామిపై జాజర చల్లు చున్నారు. వారు స్వామియెడల ఉత్సాహముతో చేష్టలు చేయుచున్నారు. వారు నిర్విరామముగా స్వామిపై పరిమళములు చల్లు పనిలో నిమగ్నులై యుండగా చెమటలు ఎడతెరపిలేక ఎక్కువ అయ్యెను. స్వామిపై చల్లుటలో ఒకరితో నొకరు సరదాగా పెనగులాడుచున్నారు. కలియబడుచున్నారు."

వ్యాఖ్య

సర్వజగత్తు కధిపతి యగు స్వామి గదా యని కన్యలకు భయము గాని, ఆయన యెడల మొగమాటము గాని జాజరలో లేవు. భయమునకు, మొగమాటమునకు ఆవశ్యకత లేదు. స్వామిలో రెండు భిన్న గుణములు కలిసియున్నవి. 1. పారమ్యము – అనగా సర్వశ్రేష్ఠత. 2. సౌలభ్యము – అందరికి తేలికగా అందుబాటులో నుండుట. కావున స్వామితో వారు చనవు తీసికొనగలుగుచున్నారు. కృష్ణునితో గోపాలురు, గోపికలు ఇట్టి చనవును గైకొని వర్తించిరి. దేవునియందు ఉండవలసినది ప్రేమ గాని భయము గాదు. దైవభీతి గాదు కావలసినది, దైవభక్తి. మొగమాటము లేకుండ దీక్షతో స్వామిపై కన్యలు చల్లుచున్నారు. ఒకరిపై నొకరు చల్లుకొనుటలో భయము లేదు, చనవున్నది. మానవుల నడుమ ఉండవలసినది నిర్మలమైన చనవే గాని భయము గాదు. ఇచట పంతమనగా ఒకరి యెడల ఒకరు అసూయతో పొందు పంతము గాదు, స్వామిపై చల్లవలెనను పట్టుదల. కొందరికి ఒక మంచిపని మొదలుపెట్టునపుడున్న ఉత్సాహము దానిని కొనసాగించుటలో నుండదు. ఇట్లు ఉత్సాహముతో సత్కర్మను కొనసాగించుటనే శ్రద్ధ యందురు. ఇచ్చట కన్నియలు శ్రద్ధతో జాజరలో పాల్గొనుచున్నారు. కార్యక్రమము సాగినకొలది, వారి యుత్సాహము తరుగలేదు, పెరుగుచున్నది. నిరంతరము ఉత్సాహముతో దైవసేవ కొనసాగించుట వలన ఆగకుండ వారికి చెమటలు పట్టుచున్నవి. అయినను వారు ఆట నాపలేదు. ఒకరి మీద ఒకరు కలియబడి పెనగులాడుచున్నారనగా వారి నడుమ కలహ మేర్పడిన దని కాదు. స్వామిపైన త్వరగా చల్లవలెనని ఆరాటపడుచున్నారన్నమాట. ఇదే ఆరాటము తోటివారి యెడల వర్తించుచున్నది.

4వ చరణము యొక్క తాత్పర్యము

"పట్టుదలతో పల్లెపిల్లలు స్వామిని గూర్చి జాజరలో ఒట్లు పెట్టుకొనుచున్నారు. పగటిపూటలందు మిక్కిలి చనవుతో చల్లుచున్నారు. చల్లదనముతో గూడిన వినయముతో చల్లుచున్నారు. తమ చూపులతో స్వామిని బాధించుచు చల్లుచున్నారు."

వ్యాఖ్య

స్వామితో నిన్ను విడువమనియు, మేము కూడ ఒకరి నొకరము విడిపోమనియు ఒట్లు పెట్టుకొనుచున్నారు. ఇది పల్లెలలో పరిపాటి. జనులు ఒకరితో నొకరు కలిసి జీవించుటే, స్వామిని వీడక

భక్తితో కొలుచుట గదా. పగటిపూటలలో అధికమైన చనవుతో ఆడుచున్నారు. రాత్రివేళలందు చల్లుట గూడ తర్వాత పేర్కొనబడినది. చల్లదనము హృదయమునకు సంబంధించినది. దేవుని యెడల వీరికి భయము లేదు గాని వినయమున్నది. వినయమనగా విశేషమైన నయము. నయ మనగా తీసికొని వెళ్ళునది. జీవుని దేవుని వద్దకు చక్కగా చేర్చు లక్షణమే వినయము. సమర్పణ, శరణాగతి స్వామి సంకల్పముల ననుసరించి జీవించుటే వినయము. ఇది బరువు గాదు. హృదయమార పల్లెపిల్లలు గోపికల వలె వినయమును నెఱపు చున్నారని చెప్పుటకే చలువ, వినయము కలిపి అన్నమయ్య చెప్పెను. ఇక వీరి చూపులు స్వామిని బాధించుట యేమి? ఒక్కసారిగా ఎందరో స్వచ్ఛ హృదయలగు వారి ప్రేమతోడి చూపులు స్వామిపై బడి ఆయనలో పూర్తిగా నిండినవని వక్కాణించు టకు అన్నమయ్య ఇట్లు చెప్పెను. ఎందరిదో అత్యధికమగు అనురాగము అజీర్ణ మగునని సరదాగా ఇట్లు తెలిపెను.

5వ చరణము యొక్క తాత్పర్యము

"ఒకరితోడ ఒకరు కలిసి గుంపుగా నేర్పడి జాజరలో స్వామిపై పరిమళము చల్లుచున్నారు. స్వామి చూపులకందకుండ గుంపుగా గుట్టుగా చల్లుచున్నారు. ఒకరితో నొకరికి స్నేహము చక్కగా కుదిరి చల్లుచున్నారు. స్వామియందును వీరికి అనుబంధము ఏర్పడినది. స్వామి యొక్క పొందు నెఱిగి చల్లుచున్నారు."

వ్యాఖ్య

గుంపుగా కలిసిమెలిసి తనను సేవించుటే స్వామికి ప్రీతికరము. ఆధ్యాత్మికరంగమున కూడ కొందరు పోటీలు పడుచుందురు. అవి పనికిరావు. స్వామిని సేవించుటలో తానే ముందుండవలెనను ఆరాటము పనికిరాదు. ఒక్కరుగా గాక కొందరు కలిసి బృందముగా నేర్పడి సాధన చేయుట, సంకీర్తనము చేయుట స్వామి కిష్టము. బృంద సాధనయే మోక్షమునకు సులభోపాయము. ఇతరులతో నాకేమి పని యని తానొక్కడే మోక్షము నొందవలయు ననుకొనుట సంకుచితత్వమే. దివ్యానందము నందరు పంచుకొనవలెను. తల్లికి తన సంతతి యెల్లరు కలిసిమెలిసి జీవించుట సంతోషమును గూర్చును గదా. దేవుని విషయమునను ఇంతియే. కలిసిమెలిసి పరస్పర సహకారముతో జీవించు గుంపుకే వేదములలో గ్రామమని పేరు. ఇట్టివారిపై స్వామి అనుగ్రహము తేలికగా దక్కును. పల్లె కన్నియలు గుంపుగా కలిసి స్వామి కనుచూపుల కందకుండ గుట్టుగా చల్లుచున్నారు. స్వామికి తెలియకుండుటెట్లు సాధ్యము? స్వామికి తెలియును, అంతర్యామి గదా. పిల్లలు మాత్రము తమవైపు నుండి స్వామికి తెలియకుండ గుట్టుగా చల్లుచున్నామని భావించుచున్నారు. స్వామి దీని ననుమతించుచున్నాడు. స్వామికి ముచ్చట, వీరికి ఆట. వీరిలో గూడ ఒకరికి తెలియకుండ ఒకరు పరిమళములను చల్లుకొనుట వారి ఆటలోని సరదాను తెలుపుచున్నది. ఈ జాజర అను కార్యక్రమముతో స్వామితో వీరికి అనుబంధము పెరిగినది. స్వామికి స్వ, పర వివక్ష లేదు. విజ్ఞానముతో పనిలేదు. కలిసి జీవించుట, అమాయికత, సరళత, స్వచ్ఛత, చనవులకు స్వామి ఆకర్షింపబడును గదా.

ఈ గుణములు గల పల్లె పిల్లలకు తనతో అనుబంధమును ప్రసాదించెను. మరియు వీరిలో వీరికి నడుమ గూడ ఈ యాట వలన ఆత్మాను బంధము బలపడినది. పూర్వము పల్లెలలోని ఆటల యొక్క ప్రధాన లక్ష్య మిదియే. ఇల్లిల్లు కలిసి ఒక ఇల్లగుట, ఎల్లరు కలిసి ఒకరగుటయే ఆటల లక్ష్యము. స్వామి యొక్క పొందు అనగా సర్వాంతర్యామి యందు తమ ప్రజ్ఞలు లీనమగునని ఎరిగియే పిల్లలు జాజరలో పాల్గొనుచున్నారు. పరస్పరత్వము గల వారికే ఇట్టి స్థితిని స్వామి కరుణించును. ఒక్కడుగా జీవించువారికి స్వామి సుముఖుడు గాడు. స్వామి వీరికిచ్చు పొందు ఆనందస్వరూపమైనది. అది ఎప్పుడో కల్గునది గాదు. జాజరలోనే పిల్లలకు కల్గుచున్నది. సంగడిమూకలను పదమును పోతన గోపాలకులను గూర్చి వాడెను.

6వ చరణము యొక్క తాత్పర్యము

"సారమైన పెదవులు కలిగి పల్లెపిల్లలు జాజరలో స్వామిపై పరిమళమును చల్లు చున్నారు. మాటికి కలుగుచున్నది జాజర. స్వామి యొక్క చక్కదనమునకు సంబంధించిన ప్రశంసలతో వీరు జాజరలో పాల్గొనుచున్నారు. పిల్లలు పరిమళములు స్వామిపై చల్లుచుండగా అవి జారిపడుచున్నవి."

వ్యాఖ్య

పల్లె పిల్లల అమాయిక హృదములలో స్వామి యెడల గల అనురాగసుధ వారి పెదవుల నుండి స్వామిని కీర్తించు గానముగా వెలువడుచున్నది. భాగవతమున కృష్ణుని అధరామృత మనగా అతని వేణుగానము, ప్రేమపు పలుకులు, గీతోపదేశ మని సంకేతింపబడినది. అట్లే ఇచట ఈ అమాయిక కన్యల పెదవుల నుండి వెలువడునది వారి గానామృతము. వారి హృదయమందలి సారము ప్రేమయే. ఇది గానముగా వ్యక్తమగుచున్నది. ఒకరి యందొకరికి గల నిర్మలప్రేమ అను వారి హృదయ సారము పెదవుల నుండి సరళపు పలకరింపులుగా వెలువడుచున్నది. నాలుక తేనెలూరవలెనని తైత్తిరీయోపనిషత్తు బోధించుచున్నది. తేనె అనగా శ్రోతలకు ఆహ్లాదము కలిగించు పలుకు అని యర్థము. దేవుడు మనకు వివిధావయవముల నిచ్చినది అంతర్యామి యగు తనను సేవించుటకే. ఈ సంకీర్తనమున పిల్లలు దానిని నెరవేర్చుట వర్ణింపబడినవి. "భగవంతుని వర్ణించు నాలుకయే నాలుక, అట్టిది కాని నాలుక ధమ ధమ ధ్వనితోడి ఢక్క" యని ప్రహ్లాదుడు బోధించెను. ఒకసారియో, రెండుమార్లో, మూడుమార్లో స్వామిపై జాజర చల్లుటతో ఈ పని యాగలేదు. ఉత్సాహము పెరుగుచుండగా మాటికిని అది తటస్థించుచున్నది. అనగా పిల్లలు చల్లుటను కొనసాగించుచునే యున్నారు. పిల్లలు స్వామి యొక్క జగన్మోహన మంగళ మోహనాకృతి యొక్క దివ్యసౌందర్యమును మెచ్చు గానములు చేయుచు పరిమళములు ఆయనపై చల్లుచున్నారు. ఆటతో బాటు పాట కలిసినది. పల్లె ప్రజలు పనిపాటలు చేయుట పరిపాటి. ఇది లేకున్న కృత్రిమ నాగరికత గల జనులు పనిపాట్లు చేయుట జరుగును. దేవుని కీర్తించి, కలిసిమెలిసి యాడు వారి నడుమ ఆత్మీయానుబంధము నెలకొనును. ప్రకృతిలోను, జీవజాలములోను గల సౌందర్యమంతయు భగవంతుని సౌందర్యమున రేఖామాత్రమే. దివ్యప్రేమయే సౌందర్యముగా వ్యక్తమగును. భగవంతుడు ప్రేమసుధాసాగరుడు గావున

ఆయన సౌందర్యముగూడ లోకాతీతము, నిత్యము. పిల్లలు స్వామిపైన పరిమళములు చల్లుచుండగా అవి కొంత జారిపోవు చున్నవి. దీనికి కారణము వారి నిర్లక్ష్యము కాదు, పారవశ్యము. పరస్పరము చల్లు కొనుచుండగా కూడ ఇదియే స్థితి కలుగుచున్నది. ప్రేమ అనంతమగునపుడు పరవశుల మగుదుము గదా. జారిన పరిమళములు ఇచట నేలపై బడినను దోషము లేదు. అదియు దేవుని పాదమే యని పురుషసూక్తము వర్ణించుచున్నది. ఇట్లు నేలపై కొంత జారిపడినందుకు కొందరు మనుష్యులకు కోపము రావచ్చునేమో గాని, దేవునకు గాని, మానవతా వికాసము గలవారికి గాని కినుక రాదు. నిబంధనలకన్న స్వామి నైర్మల్యమునకు ప్రాధాన్య మొసగును. మానవుడు నైర్మల్యము కన్న నిబంధనలకు ప్రాధాన్యము నొసగును. ఇట్టివాడు దేవుని యానంద సామ్రాజ్యమున అడుగిడజాలడు. ఇతడు పెట్టుకొన్న నిబంధనలు ఇతనినే బంధించును. నియమములు నైర్మల్యమునకు దోహదపడునంతమేర ఆవశ్యకములే.

7వ చరణము యొక్క తాత్పర్యము

"పల్లె పిల్లలు గుంపుగా కలిసి స్వామిపై పరిమళములు చల్లుచు సేవించుచున్నారు. ఒకరి శరీరమునందు గల సందులలోనికి వేరొకరు ఒత్తుకొనుచున్నారు. చంద్రుని వెన్నెల వంటి పాటలను పాడుచున్నారు. సంధ్యాసమయములందలి చిరుచీకట్లలో స్వామిపై పరిమళములు చల్లుచున్నారు."

వ్యాఖ్య

ఒకరొకరుగా గాక, గుంపుగా ఒక్కసారిగా పిల్లలు స్వామిని సేవించుచున్నారు. స్వామి అంతర్యామి గావున ఇట్టి సామూహిక చైతన్యమునకును, పరస్పర ప్రేమకును సంతసించును. స్వామి సంతృప్తుడయినచో, వర్షములు సకాలమున కురిసి, సస్య సమృద్ధి ననుగ్రహించును. సమష్టి జీవనమునే యజ్ఞ మందురు. ఇది సకాల వర్షము లను కల్గించును. స్వామిపై చల్లుటలో గుంపుగా కూడుట వలన ఒకరి శరీరము లందలి సందులగు భాగములపై వేరొకరు ఒరసికొనుచున్నారు. ఇది కావలయునని గాదు, పోటీవలన గాదు. ఒకరికొకరు అంత దగ్గరగా చేరిరని యర్థము. మనసులు దగ్గర చేరినవి. ఒకటైనవి. ఎల్లరిలో ఒక్కడయిన స్వామి యందు కరగినవి, మరగినవి. దేహస్మృతి లేదు. ఎట్టి ప్రయత్నము లేకయే దేహములును అత్యంత సమీపములుగా చేరినవి. ఇది అన్నమయ్యను అలరించిన అందమైన దృశ్యము. ఇందాతని హృదయము పాల్గొన్నది. దానికి తట్టుకొనలేని పారవశ్యమున మునిగి, తెప్పరిల్లి మనకును దీనియందు పాల్గొను భాగ్యము నాతడు ప్రసాదించుచున్నాడు. చంద్రుని గూర్చిన పాటలనజాలము. చంద్రుని వంటి పాటలను అనగా చంద్రుని వెన్నెల వంటి పాటలను స్వామిని గూర్చి పిల్లలు పాడుకొనుచు చల్లుచున్నారు. 'చంద్రుడు' అనుటకన్న 'చందురుడు' అనుటలో ఎక్కువ సొబగున్నది. వెన్నెల తెల్లనిది. ఆహ్లాదమును గూర్చునది. ఈ పాటలు కూడ నాగరికులు పాడుకొనునవి గావు. పల్లె ప్రజలు పాడుకొనునవి గావున సహజమగు సొగసుదనము ఇందుండును. వారి హృదయములు తెల్లనివి. దుర్భావములను మరకలు లేని నిగ్గుటద్దములు. కావున వారి పాటలును అట్టివే. ఒకరికొకరికి, ఊరిలోని పెద్దలకు, స్వామికిని ఆహ్లాదమును గూర్చునవి.

ఆహ్లాదమును గూర్చువాడు చంద్రుడని కృష్ణుడు గీతలోని పదియవ అధ్యాయమున చెప్పెను. వెన్నెల వన్నియలు ఈ పిల్లలు. జాబిల్లి యొక్క వెన్నెల జాలులే ఈ పాటలు. ఇట్టి పాటలను పాడిన సందర్భమును చివరి పాదమున అన్నమయ్య ప్రస్తావించు చున్నాడు. సూర్యుడస్తమించుట, చంద్రుడు పూర్తిగా ఉదయించుట నడుమ గల సాయంసంధ్యా సమయమున వెన్నెల జాలులయిన పాటలను పిల్లలు పాడుచున్నారు. అనగా అపుడే పొటమరించుచున్న వెన్నెలకు మురిసిపోయి, చందురుని వంటి మోము గల స్వామిని గూర్చి పాటలు పాడుచున్నారు. వారి కాదర్శ మెవరు? చంద్రుడే. ఇతడు వెలార్చు వెన్నెల విశ్వమూర్తి యగు విష్ణుని గూర్చి పాడిన పాట. కాకున్న ఇతని భాష వేరు. ఇది వెన్నెల భాష. ఈ పిల్లల ముఖములును చంద్రుని వలె, లోని ఆహ్లాదమును బయటకు వ్యక్తముచేయు కళలతో విరాజిల్లుచున్నవి. వెన్నెలలో వెన్నెల వంటి పాటలు వీరు పాడుచున్నారు.

8వ చరణము యొక్క తాత్పర్యము

"ఈ స్త్రీలు వరుసగా నిలిచి స్వామిపై పరిమళములను చల్లుచున్నారు. ఇట్లు చల్లుటగా నున్నది జాజర. జాలిపడదగిన వియోగములతో ఈ జాజర కూడియున్నది. పిల్లలెంతయో మరగిరి. ఈ జాజర అను ఉత్సవము రుచులను ఊరించుచున్నది."

వ్యాఖ్య

ఇంతకు పూర్వము గుంపుగా కూడి చల్లుట జరిగినది. ఇపుడు వరుసలో నిలిచి చల్లుట జరుగుచున్నది. ఇది క్రమశిక్షణతో గూడిన వైఖరిని సూచించును. మొదటిది కలివిడితనమును సూచించును. కలివిడితనము ఆవశ్యకమే గాని క్రమశిక్షణయు ఆవశ్యకమే. స్వామితో ఎడబాటు ఒక్కొక్కప్పుడు ఏర్పడి కన్యలు జాలిపడదగిన స్థితిలో దీనలగుచుండిరి. స్వామి యొక్క ఎడబాటు వలన గోపికలు విలవిలలాడి చెట్టు చెట్టును, పుట్ట పుట్టను అడిగిరి. నిజముగా స్వామితో ఎడబాటు ఏర్పడునా? మనలోను, వెలుపల వ్యాపించిన వెలుగయిన స్వామితో ఎడబాటుకు తావు లేదు. కాని ఎంతటి సాధకుడయినను జీవితములో చేయవలసిన పనులు చేయుచు, కొన్ని పరిస్థితులలో అంతర్యామిని మరచుట కవకాశము గలదు. వ్యక్తులు గుర్తున్నంతగా వారి రూపములలో దేవుడు గుర్తుకు రాడు. మహాభక్తులకు గూడ ఇట్టి మరపు వచ్చిన సందర్భములు గలవు. ఈ పల్లె పిల్లలలో గూడ ఈ మరపు వచ్చినంతమాత్రమున వారికి భక్తి లేదనజాలము. వారు స్వచ్ఛమైన, నిండైన భక్తి గలవారు. జీవితమున ఒకటి, రెండుసార్లు మాత్రము, ఒకటి రెండు క్షణములు మాత్రము ఈ మరపు వచ్చి, స్వామితో ఎడబాటు కల్గినట్లు వీరికన్పించినది. స్వామితో ఎడబాటు సాపేక్షకమే గాని, సత్యము గాదు. అనగా వీరి దృష్టికి మాత్రమే గాని, నిజము గాదు. ఇట్లు అంతర్యామిని మరచునపుడు ఉత్తమ భక్తులు వ్యాకులపడుదురు. భగవదనుభూతిలోని రుచిని మరగినవాడు, అది తొలగినపుడు దీనుడగును గదా. చిన్నపిల్లవాని నోటిలో తీపి పదార్థము నుంచగా చాలవరకు అతడు భుజించిన పిమ్మట, పొరపాటున దాని అంచు నోటినుండి జారిపడినచో అతని కెట్లనిపించునో ఊహింపగలము. అంతర్యామిని మరచినపుడు

మిక్కిలి వ్యాకులత చెందుట, భక్తి పెరుగుటకు దోహదపడునని నారదుడు తన భక్తిసూత్రములలో తెలిపెను. ఇట్టి వ్యాకులత యొక్క ప్రాముఖ్యమును ఆధునిక కాలమున శ్రీరామకృష్ణ పరమహంస నొక్కిచెప్పెను. దీనినే అన్నమయ్య ఇచట ప్రస్తావించుచున్నాడు. మరల స్వామితో ఆడుటకు పిల్లలు తపించుచున్నారు. ఈ తపన తర్వాత స్వామి వీరిపై జాలిపడి తిరిగి సాక్షాత్కరించెను. (గోపికలకును ఇట్లే జరిగెను). నేను, ఇతరులు అను భావము తొలగి విష్ణుడే ఇంతయునని స్ఫురించెను. అపుడు కలిగిన భగవదనుభూతి మొదట ఆటపాటలలో కన్న చిక్కనయినది. దీనియందు పిల్లలు అధికముగా మరగిరి. తీపిపదార్థము మరల నోటిలోనికి ఐడగనే ఎక్కువ రుచిగా నుండుట సహజము. రుచి మరగిన కొలదియు రుచి పెరుగును. భగవదనుభూతి యందు మరగిన కొలదియు ఇంకను అది కావలెనన్పించును. చివరకు ఈ కోరికయు వైదొలగి మరగుటయే యుండును. నారదునకిట్లే జరిగినదని భాగవతమున గలదు. పరస్పర ప్రేమ యొక్క ప్రభావము గూడ ఇట్టిదే.

9వ చరణము యొక్క తాత్పర్యము

"పల్లె పిల్లలు తమ వక్షోజములపై దాల్చిన పరిమళములను స్వామిపై చల్లిరి. చనవుతో స్వామిని వేడుచున్నారు. శ్రీవేంకటేశ్వరుడు విలసిల్లెను. ఈతని స్నేహమునకు సంబంధించినది జాజర."

వ్యాఖ్య

తమ వక్షోజములపై దాల్చిన పరిమళములను స్వామిపై చల్లుట సరియేనా? అను శంకకు తావు లేదు. భక్తిలో, మేరదాటిన ప్రేమయే ప్రాణమని విష్ణుచిత్తునకు కృష్ణుడు తెలిపెను. గోదాదేవి తాను ధరించిన పూలదండలనే స్వామికి సమర్పించెను. స్వామి ప్రీతితో వానిని స్వీకరించెను. గోదాదేవి వంటివారే అన్నమయ్య దర్శించిన పల్లె పిల్లలు. వక్షోజములపై దాల్చిన పరిమళము లనగా హృదయమందలి నిర్మల ప్రేమ భావములతో గూడినవని యర్థము. ఈ పరిమళద్రవ్యములపై ఈ పిల్లల వక్షోజముల గుర్తులు పడెను. అనగా వీరి యెదలలోని నిర్మల ప్రేమరసభావములు ఈ పరిమళములలో కలిసిపోయి వానిపై తమ ప్రభావమును చూపినవి. ఈ గుర్తు లెవ్వరికి గానవచ్చినవి? స్వామికి. వీరు చల్లిన పరిమళముల వలన స్వామి వీరి ప్రేమను గ్రహించె ననమాట. అట్లే ఒకరి ప్రేమ నింకొకరు గ్రహించిరి. ఎదుటివాని ప్రేమనే తెలియలేనివాడు ఎదుటివారిని తానెట్లు ప్రేమింపగలడు? అయినను ఎదుటి వాని ప్రేమతో ప్రమేయము లేక తాను ప్రేమించుటే నిజమైన ప్రేమ. ఈ పల్లె పిల్లలు ఒకరినొకరు ప్రేమించిరి. ఎదుటివారి ప్రేమను తెలిసికొనిరి. పిల్లలు స్వామితో మిక్కిలి చనవు గలిగి ఈ చనవును, తన యనుగ్రహమును, సాన్నిధ్యమును కొనసాగింపు మని స్వామిని వేడుచున్నారు. నారాయణుడు సృష్టి మొదట్లో బ్రహ్మ కిట్లానతిచ్చెను. "నీవు నన్ను సర్వాంతర్యామిగా స్మరించినంత సేపు నా సాన్నిధ్యమను దివ్యానుభూతి నీకు దక్కును." కావున పల్లె పిల్లలు స్వామి సాన్నిధ్యముతో బాటు దేనిని గోరిరి? స్వామిని మరవని స్థితిని. గోపికలు కూడ దీనినే గోరిరి. కోరిక లన్నిటిని త్రుంచివేయు కోరిక ఇది. అన్నమయ్యయు దీనినే గోరెను. మనకును నేర్పుచున్నాడు.

శ్రీవేంకటేశ్వరుడు నిర్మల ప్రేమతోడి పల్లెపిల్లల ఆటపాటలకు మెచ్చి వారికి బయట దివ్యమోహనమూర్తి గను, లోన వెలుగుగను విరాజిల్లెను. లోన ఎట్లును ఉన్నాడు. వారికి తన యునికి యందు ఏమరుపాటు లేని స్థితిని ప్రసాదించెను. ఇక స్వామితోడి అనుబంధము వీరియందు స్థిరమై నిలిచిపోయినది. ఇక వీరికి తాము లేరు. స్వామియే యున్నాడు. ఎదుటివారు, తాము గూడ స్వామిగనే అనుభూతి కల్గుటయే స్వామి యొక్క స్నేహము నిలుచుట. ఇదియే గోపికలకు కృష్ణు డనుగ్రహించిన రాసలీల. ఈ స్థితి అన్నమయ్యకును అనుగ్రహింపబడినది. కావున ఇదే స్థితి మనకును అనుగ్రహింపుమని స్వామిని వేడుచు ఈ సంకీర్తనమును గానము చేసెను. ఇది ఆంధ్ర సాహిత్య సరస్వతికి శిరోరత్నము. విశ్వ కవితామాలికలో మణిపూస. ఇది యొక్కటియే ఒక భాగవతము. తెలుగువారి పాలిటి మహాభాగ్యము. వారిపై అన్నమయ్య ద్వారమున శ్రీవేంకటేశుడు కురిపించిన అమృతపు జడివాన. అన్నమయ్య ఆంధ్ర సంగీత సాహిత్య సరస సమ్మేళన లోకమును వెలిగించుచున్న ధ్రువతార. ఇతని కిదే కైమోడ్పు. ఇతడాశించిన గ్రామవ్యవస్థ అనతి కాలమున వెలయుగాక. మనమెల్లరము జాజరలో పాల్గొందుము గాక.

* * *

22

3వ సం-414 **చంచలము మానితేను** వరాళి

చంచలము మానితేను సంసారమే సుఖము
పొంచి హరిదాసుఁడైతే భూమెల్లా సుఖము. ॥ పల్లవి ॥

ఒరుల వేఁడక ఉంటే ఉన్నచోటే సుఖము
పరనింద విడిచితే భావమెల్లా సుఖము
సరవిఁ గోపించకుంటే జన్మమెల్లా సుఖమే
హరిఁ గొలిచినవారికన్నిటాను సుఖమే. ॥ చంచ ॥

కానిపని సేయకుంటే కాయమే సుఖము
మౌనమున నుండితేను మరులైనా సుఖము
దీనత విడిచితేను దినములెల్లా సుఖము
అని హరిఁ దలఁచితే నంతటా సుఖమే. ॥ చంచ ॥

చలము విడిచితేను సంతతము సుఖము
ఇల నాస లుడిగితే నిహమెల్లా సుఖమే
తలఁగి శ్రీవేంకటేశు దాసులైనవారు వీని
గెలిచి నటించఁగాను కిందా మీఁదా సుఖమే. ॥ చంచ ॥

ఐహిక భోగములు, ఆత్మానందము రెండును కోరకుము. వీనిలో ఒకటి కావలసియున్నచో రెండవది అదృశ్యము గావలెను.

టీక

సరవి = రీతి, మరులు = వలపులు, తలగి = తొలగి, విడిచిపెట్టి.

పరిచయము

ఈ సంకీర్తనమందు అన్నమయ్య సుఖమును గూర్చి చక్కగా ప్రస్తావించుచున్నాడు. ఈతడు మెట్టవేదాంతి గాదు. సుఖము గావలెనన్నచో సంసారమును, ఐహికమును పూర్తిగా విడిచిపెట్టవలెనని మెట్టవేదాంతులు భావింతురు. కాని సంసారము మనసులో నున్నదే గాని, వెలుపల ఉండదు. కావున కుటుంబమును, ఇహలోకము నందలి కర్తవ్యములను విడిచిపెట్టుట వలన సుఖము రాదు. అడవులలోనికి పోయినను, మనసులో భార్య, పిల్లల యెడల వ్యామోహము, ధనాసక్తి, కామము, కీర్తికాంక్ష నిలిచియున్నపుడు ఉపయోగము లేదు. అట్లని సంసారమునకు, ధనాదులకు అంటు కొనువాడు సుఖము కొరకని దుఃఖమను దిగుడుబావిలో పడును. సంసారములో నుండుచు, కర్తవ్యములను నిర్వర్తించుచునే ఆత్మసుఖము నందవలెనని అన్నమయ్య సందేశము. ఈ సంకీర్తనలో సుఖమనగా ఐహిక భోగప్రాప్తి కాదు. తన లోపల గలుగు ఆనందస్థితియే. కర్తవ్యములను విడిచిపెట్టువాడు గూడ భోజనమును మానలేడు గదా. సమాజము నెడల చేయవలసిన పనులు చేయకుండగనే వేదాంతము బోధించుచున్నాను గావున సమాజము నాకు భోజనాదులు సమకూర్చి పెట్టవలెనని ఆశించుట పిఱికితనము, దురాశ, యాచకత్వమే గాని వైరాగ్యము గాదు. వైరాగ్య మనగా కనబడు దానియందు, వినబడు దానియందు తృష్ణ లేకుండుట. చేయవలసి నవి చేయుచు, చేయదలచిన వానిని మానుచు, చేయగోరుట అనునది విడుచువాడే విరాగి. సంసారములో తానుండవచ్చును గాని, సంసారము తనలో నుండరాదు. పడవ నీటిలో నుండవచ్చును గాని, పడవలో నీరుండరాదని శ్రీరామకృష్ణపరమహంస బోధించెను. ఇట్లు సంసారములో నున్నను, భగవంతుని యందు శరణాగతి పొందినచో తప్పక సుఖము కలుగును. తోటి జీవులందు వాటిల్లిన పరిస్థితులందు ఇతరుల నడవడి, వారు తనయెడల వర్తించు తీరులందు అంతర్యామిని దర్శించు వానికి ఎప్పుడును సుఖమే అని అన్నమయ్య సందేశ మొసగుచున్నాడు.

పల్లవి యొక్క తాత్పర్యము

"చాంచల్యము మానినచో సంసారమే సుఖము. జాగరూకుడై హరిదాసు డయినచో భూమి యెల్లయు సుఖమే."

వ్యాఖ్య

మనసు ఒక పని చేయుచుండగనే, ఇంకొక దానిపైకి పోవుచుండును. ఉదాహరణకు భోజనము చేయుచున్నవాడు రావలసిన, ఈయవలసిన అప్పులను గూర్చి, కుటుంబములోను, ఆఫీసులోను ఇతరుల ప్రవర్తనను గూర్చి ఆలోచించును. భోజనమును తృప్తిగా చేయలేడు. చేయవలసిన పనినే భగవంతుని

పూజగా భావించి, మనస్సును స్వామికి సమర్పించినచో చాంచల్యము తొలగి, సంసారములో నున్నను సుఖము లభించును. భార్య, పిల్లలు, వృత్తిలోని పనులు ఇతనిని బంధింపవు. అంతయు, అందరును అంతర్యామి యని దర్శించినపుడు ఇతనిలో బంధమునకు తావు లేదు. మనస్సు చంచలము. దీనిని నియంత్రించుట ఎట్లు అని అర్జునుడు కృష్ణుని ప్రశ్నించెను. కృష్ణుడిట్లు బదులు చెప్పెను. "మనసును నియంత్రించుట గాలిని మూటకట్ట యత్నించుట వంటిది. అది సాధ్యము గాదు. అభ్యాసము వలన, వైరాగ్యము వలన సాధ్యమగును. ఏ భావము మనస్సున కలిగినను దానిని నిగ్రహించుటకు యత్నింపకుము. అది నేనని భావించుము. అపుడా భావము మాయమగును. కలిగిన భావమునందెల్ల ఇట్లే 'నన్ను' తలచుము. కొంతకాలమునకు ఈ అభ్యాస బలము వలన, మనస్సున తలంపులాగి నేనగుట జరుగును. మనస్సును నిగ్రహించుట సాధ్యము గాదు. కాని 'నేన'గుట సాధ్యపడును. ఫలితములపై వ్యామోహము కలిగినపుడెల్ల నన్ను తలచుము. అదియే వైరాగ్యము. దానితో ఫలితములపై మోహము తొలగి నన్ను చేరుదువు." నీటియావిరిని స్థిరముగా నుంచలేము. కాని వేడి తగ్గించి నీరుగా మార్చినచో పాత్రలో స్థిరముగా నుండును. అట్లే మనస్సు మనస్సుగా నున్నంత కాలము చంచలముగానే యుండును గాని స్థిరము గాదు. "అది స్వామిని తలచి తలచి స్వామిగా మారినపుడే స్థిరముగా నుండును." అయస్కాంతముచే తాకబడిన ఇనుము అయస్కాంతముగ వర్తించు చున్నది గదా. అట్లే సర్వాంతర్యామి యగు భగవంతుని యందు లయించిన మనస్సు కూడ భగవంతుడుగ మారును. అనగా భక్తునిలో దేవుడే మనస్సుగా ఆలోచించును. బుద్ధిగా సంకల్పించును. సొంత ఆలోచనలు, సంకల్పములుండవు గాన, ఆనందమే యుండును. దేవునియందు లయించిన తన మనస్సు ఉనికిని కోల్పోయినచో అదియే సుఖము. ఆలోచనలాగినపుడు ఆనందమే నిలుచునని పైథాగొరస్ బోధించెను. ఇట్లు మనస్సు ఉన్నంత కాలము చాంచల్యము తప్పదు. చాంచల్యమున్నంత కాలము సుఖముండదు. కావున మనస్సు హారతి యగుటయే మార్గము. మనస్సు అనునది స్వామి యను ఆనందసాగరమున మునిగి, ఉనికిని కోల్పోవగా, సుఖమగును. మొత్తము సాధనా సారము నంతయు అన్నమయ్య చాల తేలికగా ఈ పల్లవిలో చెప్పెను. కావున హరిదాసుడయినచో భూమిపై ఎచ్చట నున్నను, ఏ పరిస్థితిలో నున్నను సుఖమే యనుచున్నాడు. హరికి దాస్యము లేకుండ మాత్రము మనస్సు అను కోనేటిలో బురద చేరి, కలతదేరి, ఆలోచనలను కదలికలు తప్పవు. రెండు పాదములను గూర్చుకొనవలెను. ఏ వ్యక్తిపైన మనస్సు పెట్టినను నిలువదు, సుఖముండదు. ఏ వస్తువుపైన, విషయముపైన అంతియే. ఏది భావించిన, మనస్సు అదియే అగుట దాని స్వభావము. ఇతరులను గూర్చి నిందగా తలంచినచో, ఆ ఇతరులను గూర్చి మన దురభిప్రాయములు మనస్సు నాక్రమించి, అది ఆ లక్షణములతో నిండును. అందువలననే 'గుర్జీఫ్' అను రష్యన్ యోగిపుంగవుడిట్లు చెప్పెను. "ఇతరులను గూర్చి నీవేమి అభిప్రాయపడుచున్నావో, అది నీవే." ఇతరుల మంచిని గూర్చి తలంచినచో అది మన స్వభావముగా రూపొందును. హరి యనగా వ్యక్తి కాదు, వస్తువు కాదు. సర్వాంతర్యామి అయిన చైతన్యము. అనగా ప్రేమసాగరము. ఆనందసాగరము. మనస్సు అనునది అందులో లయించిన, హరియే యగును. వేరొక ఉదాహరణ – తలంపులను కెరటము లాగిపోయి వెనుకకు మరలి తమ మూలస్థానమను

ప్రేమానందసాగరమున చేరును. ఇట్లు హరిదాస్యము ఒకసారియో, అపుడపుడో చేసిన చాలదు. 'పొంచి' చేయవలెనని అన్నమయ్య ఉపదేశము. అనగా జాగరూకుడై ఏ క్షణము గూడ హరిని మఱవకుండ హరి స్మరణలోని రుచిని సదా అనుభవించు చుండవలెను. పూర్వ సంస్కారముల వలన మఱపు వచ్చెనా, రాకూడని తలంపులు, కంగారులు, వ్యామోహములు, దైన్యము, ఒరులను గూర్చి దురభిప్రాయములు మనస్సును ఆక్రమింపవచ్చును. కావుననే 'పొంచి' అను చక్కని తెనుగు పలుకుబడిని అన్నమయ్య ప్రయోగించెను. మరి నిరంతరము హరి సంకీర్తనమో, పూజయో ఎట్లు పొసగును? భౌతికముగా కర్తవ్యములతో జీవితమున్నది గదా. ఇట్టి భౌతిక స్థాయిలో జీవనమునే 'భూమి' యనుట యోగశాస్త్ర పరిభాష. అన్నమయ్య ఈ యర్థమున గూడ 'భూమి' అను పదమును ప్రయోగించెను. అనగా భౌతిక జగత్తులో జీవించుచు, చేయవలసిన పనులుచేయుచు, ఇతర వ్యక్తులతో వ్యవహరించుచు కూడ హరిస్మరణ చేయనగును. హరిదాసులుగా జాగరూకులుగా నుండవలెను. అనగా మనము జీవించు భౌతిక జగత్తు, మనము పనులెవరికి చేయుచున్నామో వారు, ఆ పని, మనలో నుండి నడుపుచున్నవాడు హరి యను వెలుగే అని దర్శించినచో నిరంతరము హరిదాసులుగా నుండవచ్చును. మనస్సు హరియను ఆనందసాగరమున ఓలలాడుచునే పనులు సాగును. పనులు మనవలన జరుగు చున్నవని భావించినచో అహంకార ముండును. ఆనందముండదు. పనులు మన ద్వారా జరుగుచున్నవి. చేయుచున్నది స్వామి. మనము పరికరము మాత్రమే అని భావింపగా, ఒకవైపు పనులు జరుగుతూ, వేఱొకవైపు మనస్సు దేవుడను ఆనందసాగరమున మునుగుటకు అభ్యంతరము లేదు. అపుడు భౌతిక జీవితము కూడ దివ్య సుఖమే.మన జీవితములో ఐహికము, ఆధ్యాత్మికము అని రెండు వేరు వేరు అరలు లేవు.అంతయు ఆధ్యాత్మికమే. ఐహికము కూడ అందులో భాగము కావలెను. ఐహిక జీవితము కూడ ఆధ్యాత్మిక సాధనతో నిండవలెను. ఇదియే వేదోపనిషత్తుల యొక్క, గీత యొక్క సారము. పూర్వ ఋషులు గాని, శ్రీరామ శ్రీకృష్ణాది అవతారమూర్తులు గాని చేయవలసిన పనులు లేవు. కాని వారికి కుటుంబము లున్నవి. వారిది విశ్వకుటుంబము. కాని వారి ప్రజ్ఞ పరబ్రహ్మమై యున్నది. తన ప్రజలే తనకు నారాయణుడని రాముడు పలికెను. తానే నారాయణుడై యుండియు, కృష్ణుడు ధర్మజుని రాజసూయయాగ సందర్భమున వచ్చిన సామాన్య ప్రజలకు గూడ పాదములు కడిగి, ఆ నీరు శిరసున ధరించెను. యాగమున సేవకుడై, సర్వ కార్యములు నిర్వహించెను. ఎల్లరిని పూజించినవాడు కావుననే, కృష్ణుడు అగ్రపూజ కర్హుడని భీష్ముడు సూచించెను. ఒక మేడలోని క్రింది అంతస్తులో దీపము వెలిగించిన అంత వరకే వెలుగు నిచ్చును. కాని పై అంతస్తులో దీపము వెలిగించినచో, క్రింది అంతస్తును కూడ వెలిగించును. ఇది విచిత్రము. అట్లే ఐహికమే ప్రధానముగా జీవించువానికి ఆధ్యాత్మికత అందదు. కాని నిజమయిన ఆధ్యాత్మిక సాధకునకు ఐహికము కూడ దేవుడను వెలుగుతో ప్రకాశించి బ్రతుకు నిజమైన సుఖముతో నిండును. పతంజలి, రామానుజులు, మహాత్ములెల్లరు బోధించినదిదియే. మెట్టవేదాంతుల వలె ఐహికమును తుచ్ఛమని వారు భావింపరు. తుచ్ఛమని భోజనమును గూర్చి భావింపనగునా! దాని నెట్లు భగవంతుని ప్రసాదముగా స్వీకరించునో, భక్తుడు బ్రతుకునెల్ల అట్లే భావించును. బ్రతుకంతయు అతనికి హరి సేవయే. నిరంతర

హరిదాసు దాతడు. ఇక హరి తన స్వరూపమైన సుఖమున తన దాసుని ముంచెత్తును. ఇది స్వామి కరుణ.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"ఒరులను యాచింపకున్నచో, తానున్న చోటనే సుఖము. ఇతరులను నిందింప కున్నచో భావమెల్లయు సుఖమే. కోపించు రీతి లేకున్నచో, జన్మమెల్లయు సుఖమే. హరిని గొలిచిన వారికన్నిట సుఖమే."

వ్యాఖ్య

హరిదాసు హరినే, ఆయన పాదసేవను తప్ప ఏదియు యాచింపడు. ఇక ఇతరుల నేల యాచించును? ఎంత పాండిత్య మున్నను, భగవంతుని గూర్చి ప్రసంగించుచున్నను, కొందరు తమ సంస్కార బలము వలన ధనమును, పదవిని, కీర్తిని కోరి అధికారులను, పాలకులను యాచించు చుందురు. అది సుఖము గాదు. సుఖ భ్రాంతి. హరిదాసుడు తన చేయి క్రింద పెట్టవలసిన పనిలేదు. తమ అధికారము, ధనమును నమ్ముకొన్న వారిని యాచించు వాని గతి ఏమగును? తన పైవారికి బానిసగా బ్రతుకుట, క్రిందివారిపై అజమాయిషీ చలాయించుట. భారతీయులలో ఈ లోప మెక్కువగా నుండుటచేతనే, విదేశీ పాలనకు లొంగి, మ్రగ్గిరి. కావుననే దేవుడు దయతో ఎందరో మహాభక్తులను తన దూతలనుగా పంపెను. వారు ఆయన వెలుగుతో నిండిన ప్రకాశము గలవారు. అన్నమయ్య అట్టివారిలో అగ్రగణ్యుడు. హరి భక్తునకు అండ శ్రీహరియై యుండగా ఎచ్చట నున్నను, ఏ పదవిలో నున్నను, ఆర్థిక పరిస్థితి యెట్లున్నను, సంఘములో పలుకుబడి లేకున్నను ఎప్పుడును సుఖమే. వీనిని గూర్చి స్పృహ అతనికుండదు. స్వామిని గూర్చి స్పృహ వలన స్వామి రూపమగు సుఖమే నిలుచును. హరి భక్తుడు గానివాని బ్రతుకు అడుగడుగున దైన్యమే. హిరణ్యకశిపుడంతటి వాడు తన అధికారమును నమ్మి, హరిని ధిక్కరింపగా నిరంతరము బుదుతడగు ప్రహ్లాదుని గాంచి భయపడెను. ప్రహ్లాదుడు తనను కాపాడుమని శ్రీహరినే యాచింపలేదు, ఇక హిరణ్యకశిపు నేల యాచించును? అడుగకుండగనే స్వామి వలసినవి తీర్చును. తోటివారి భుజములపై మీ చేయి వేసినచో, మీ భుజములపై నా చేయి ఉంచెదనని అవతారమూర్తుల వాగ్దానము. ఇతరులను నిందించుట విడిచినచో భావమంతయు సుఖమే. అనగా చేష్టలతో ఒరులకు కీడు చేయకుండుటే చాలదు. వారిని మాటలతో దూషింపరాదు. నాలుక తేనెలూరుచుండవలెనని ఉపనిషత్తులు చెప్పుచున్నవి. ఇంతకు ఇతరుల యెడ దురభిప్రాయముల వలన నిందావాక్యములు వెలువడునది. మూలము నిర్మలము కావలెను. కావున అన్నమయ్య పరనింద విడిచిన భావము గావలయునని బోధించు చున్నాడు. భావశుద్ధి, వాక్కులో తీయదనము, చేష్టలలో కరుణ ఒలుకవలయును. భావములలో వ్యతిరేకత లేకున్నచో సుఖము. ఇతరులను గూర్చి చెడుగా భావించు సందర్భమున మానవుడు పవిత్రతను, ప్రశాంతిని కోల్పోయి రజస్తమోగుణములకు బద్ధుడై దీనుడుగాక తప్పదు. ఇతరుల సద్గుణములను తలంచినపుడు మనస్సు వికాసము, ప్రశాంతి పొందును. నింద సంకుచితత్వము. గుణప్రశంస విశాలత్వము. ఇతరులలో ఒకవేళ చెడు ఉన్నను, లేకున్నను

దానితో మన మంటుకొనరాదు. ఒకవేళ అవతలవాని బాగును, మేలును కోరువారమైనచో సూటిగా వారితో తల్లి పిల్లలకు వలె మృదుమధురముగా చెప్పనగును. అంతేగాని, ఒకరిని గూర్చి పరోక్షముగా ఇతరులతో చెప్పుట కూడ పరనిందయే. అది తనకు, పరిసరములకు మలినము నంటించును. మరియు ఇతరులను గూర్చిన నిందాభావములు తిరిగి మనవైపుకే తిరిగివచ్చి, ఫలితము లనుభవింపక తప్పదు. నిందించిన వారిని గూడ నిందింపక, దూరముగా తొలగిపోవలెను. పోట్లాడుట, కలహించుట, తిరుగు నింద చేయుట హేయములని కపిలుడు దేవహూతికి బోధించెను. శుకయోగి తనను పరిహసించు వారిని పట్టించుకొనలేదు. అతడు దేవునిగాక వేఱును చూడలేదు. ప్రతి క్షణము అంతర్యామి యగు స్వామిని హృదయమున దర్శించి పరవశించువాడు. లోకులు తనను నిందించినను ఎగ్గులు పలుకనివాడు, వాదులందు చొరబడనివాడు, లోకముతో కర్తవ్యముల వరకే సంబంధము గలిగి, ఇతరుల వ్యవహారములలోను తనకు సాధనతో గాని, కర్తవ్యములతో గాని ప్రయోజనము లేని వ్యవహారములలో తలదూర్చనివాడు, ఏమియు తెలియనివాని వలె నుండి, తన సామర్థ్యమును జూపవలెనను కుతూహలము లేక, ఏ నేర్పును లేనివాని వలె సామాన్యముగా నడిచిపోవుచుండు వాడు శుకయోగి. అతడు భగవదనుభూతితో తిరుగుచుండగా అతడు వెఱ్ఱివాడనుచు అతని వెంట స్త్రీలును, బాలకులును వెఱ్ఱులై తిరుగుచుండిరి. ఆతడు బాలుడు, ఉన్మత్తుడు, పిశాచము వంటివాడు. ఎప్పుడు నింతియే. నారదుడు భక్తుని గూర్చి ఇటుల చెప్పెను. అట్టివాడు గావుననే శుకయోగి వెళ్ళుచుండగా, వ్యాసుడు వెనుకనుండి తన కుమారుని పిలువగా, ఆ కేకలతో చెట్లు గూడ తన్మయములై ప్రతిధ్వనించెను. శుకుడు గూడ శ్రీకృష్ణుని వలె అంతర్యామి అయ్యెను. శ్రీకృష్ణుని గూర్చి శిశుపాలాదులు నిందించినను ఆ మాటలు స్వామికంటలేదు. తనను నిందించి నందుకుగాను కృష్ణుడు శిశుపాలుని చంపినది, ఆతడు చేసిన ప్రజాపీడనము వలన, ధర్మజుని యజ్ఞమును భంగము చేయ చూచుట వలన. ఋషభుడను అవధూతగా స్వామి అవతరించెను. అతడు సంచరించుచుండగా జనులు ఆతనిపై ఉమ్మి వేసిరి. వేయకూడనివి వేసిరి. ఆయనకీ చర్యలు అంటలేదు. ఎదురు పలుకలేదు. అట్టివాడే భగవంతునికి సన్నిహితుడై, భగవత్ సుఖమును పొందును. ధర్మరాజు తమకు జరిగిన అవమానములను సహించెనే కాని, తన జీవితములో ఒక్కసారి గూడ కౌరవులను గూర్చి ఒక్క నిందావాక్యము పలుకలేదు. మనసులోను భావింపలేదు. కావుననే వనవాసమునను, రాజుగా నున్నను సుఖించెను. శ్రీకృష్ణు డాతనిని రక్షించుటను తానే చేపట్టెను. నిందింపక, నిందలు సహించువానికి భగవంతుని రక్షణ, భగవత్సుఖము లభించును. రాముడు వనవాస మున కేగుచుండగా లక్ష్మణుడు కైకేయిని నిందించెను. కాని రాముడు ఆమెను ఎప్పుడును నిందింపలేదు. తమ వనవాసమునకు కారణము దైవయోగమని భావించెను. సీతాదేవిని భరతుడు ఆరాధించెను. సీతమ్మ తనను వలెనే కైకమ్మను గూడ ఆదరించుమని భరతునకు ఆనతిచ్చెను. ఇట్టి సహనమూర్తులే మనకాదర్శము. నిందించుటలో ఉద్వేగము, రోగము ఉన్నది. తనకు జరిగిన నిందను తలచినను రోగమే ఫలితము. నిందింపబడి, హృదయపూర్వకముగా ఓర్చుటే సుఖము. ఇతరు లెవరయినను, తమ బంధుమిత్రులయినను మూడవ వ్యక్తిని గూర్చి నిందావాక్యములు పలుకుచున్నచో వినరాదు. మన మనస్సు కలుషితము గాకుండ జాగరూకత వహింప వలెను. మొగమాటము లేకుండ ఆ నిందావాక్యములను

ఆపుమని చెప్పవలెను. అప్పటికిని అతడు పాటింపకున్నచో విషయమును దైవము వైపు మరలింపవలెను. లేదా దూరముగా జరిగిపోవలెను. అన్నమయ్య అనుభవములో ఇట్లు ఆచరించి, సుఖమును అనుభూతినంది మనకు ప్రబోధించుచున్నాడు. కోపించని విధముగ జీవించినచో జన్మ అంతయు సుఖమే. కోపమునకు కారణము కోరిక, అహంకారము. తన అహంభావము వలన, తన మాటను పాటింపని వానిపై కోపము వచ్చును. తాను కోరినది లభింపకున్నచో విసుగు, చిరాకు గల్గును. దాని కెవరో బాధ్యులనుకొని వారిపై కోపము వచ్చును. పూర్వ దుష్కర్మ ఫలముగ కష్టములు వచ్చును. తన కష్టముల కెవరో బాధ్యులని భావించి, వారిని కోపించినచో లేదా మనసులో వారిపై కోపము వహించినచో రక్తపీడనము, కష్టములు పెరుగును. కోపము జీవుని కర్మచక్రమున త్రోసివేయును. తనకు మంచి చెప్పిన విభీషణునిపై కోపించిన రావణుడు, విదురునిపై కోపించిన దుర్యోధనుడు నశించిరి. శాంతమే సౌఖ్యము. కోపించిన వారిని కూడ కోపింపకుండ ప్రేమించుటే సుఖము. తనను చంపవచ్చిన అంగుళీమాలునిపై బుద్ధుడు, చంపిన వారిపై జాలిపడిన క్రీస్తు, గాంధీలకు నిత్యసుఖమే కలిగినది. అట్లని దుష్టకార్యములు చేయువారితో స్నేహము చేయవలెనని గాదు. ప్రేమ వేరు, కలిసి తిరుగుట వేరు. ఎట్టివారినయినను ప్రేమించవలెను. ఉదాహరణకు ఆకలిగొన్నవాడెట్టి వాడని ఆలోచింపక, అన్నము పెట్టవలెను. కాని అతడు హంతకుడు, జనులను పీడించువాడయినచో వాని సాంగత్యము పనికిరాదు. వానిపై వ్యతిరేక భావములను కలిగియుండరాదు. అట్లని వానితో సాంగత్యము పనికిరాదు. అతనిని అంతర్యామి యొక్క ఒక రూపముగా ప్రేమించి, కరుణ చూపవలెను. ఎవరియందును కోపము లేక, సర్వజీవుల సుఖము గోరువాడే నాకు ప్రియుడని కృష్ణుడు చెప్పెను. "ఇంద్రియములకు విషయములుండును. కంటికి దృశ్యము, చెవికి శబ్దము మున్నగు నవి. ఒకే విషయమునో, వస్తువునో, వ్యక్తినో పలుమార్లు ధ్యానించుట వలన కోరిక కలుగును. కోరిక యున్నచోట దాని వ్యతిరేక కారణములపై కోపము కలుగును. కామక్రోధములు రెండును ఒకే శక్తి యొక్క భిన్న ధ్రువములు. క్రోధము వలన అయోమయములో పడుదురు. అపుడు తెలిసిన మంచి యంశములు కూడ గుర్తుకు రావు. అంత బుద్ధి అనగా ఇది చేయనగును, ఇది చేయరాదను వివేకము నశించును. దానితో మానవుని బ్రతుకు మొత్తము నశించును." కామక్రోధములు దివ్యప్రేమ వలన అదృశ్యములగును. కోపము వచ్చినపుడు అణగించు యత్నము సఫలము గాదు. మనకు ఎవరిపైన కోపము వచ్చినదో వారిని తననుగనే ప్రేమించుటే మార్గము. మరియు "నన్ను కోపము నుండి కాపాడు నీ దివ్యప్రేమను నాలో నింపుమ"ని దేవుని వేడుకొనుచు, శరణంద వలెను. భక్తుల చరితలు గుర్తుకు తెచ్చుకొనవలయును. దేవుని శరణు వేడిన తప్పక ప్రేమ వికసించి, కోపము వైదొలగును. అపుడుండునది సుఖము. పంతము, పట్టుదలలకు ప్రాముఖ్య మిచ్చువాడు శాంతి సుఖములకు నోచుకొనడు. అనారోగ్యము పాలగును. దంపతుల నడుమ; తల్లిదండ్రులు, పిల్లల నడుమ; తోటివారితోను సంబంధములు చెడిపోవును. మానవుడు పంతము, పట్టుదల, తన అభిప్రాయమే నెగ్గవలెనను మొండితనం, కోపం – వీనికన్న శాంతి సుఖములకు విలువ నీయవలెను. దీనికి చదువుతో సంబంధము లేదు. ఇప్పటి నాగరికపు చదువు లెక్కువగా చదివినవారు కూడ కలిసిమెలిసి మనుగడతో సుఖముగా జీవించుటకన్నను కోపమునకు, పంతములకు విలువనిచ్చుట చూచుచున్నాము.

చదువు రానివారిలో ప్రేమ, శరణాగతి, సర్దుబాటుతనమున్నచోట్ల ఇతరులతో సత్సంబంధములు, వ్యక్తిగత సుఖము కలుగుట గమనింపవచ్చును. కావున కోపము వలన తనకు, సమాజమునకు హాని కల్గును. సమత్వము చెడును. కోపించని వానికి బ్రతుకంతయు సుఖమే. వెలుగు వచ్చినచో చీకటి తొలగును. దివ్యప్రేమ, సహనము వికాసమొందిన కోపము తొలగి సుఖము చేకూరును. ఇంతగా సుఖమును గూర్చి చెప్పుచు అన్నమయ్య ఉండకూడనివి – చాంచల్యము, యాచకత్వము, పరనింద, కోపము ప్రస్తావించెను. నాలుగవ పాదమున ఏది యున్నచో ఇవియన్నియు తొలగి సుఖమబ్బునో చెప్పుచున్నాడు. సర్వాంతర్యామి యగు హరిని సేవించుచు దాసుడనని శరణందిన వానిలో ఈ లోపము తొలగును. భగవానుడే సుఖము గావున, స్వామి దయ వలన హృదయమున స్వామియే నిలుచుటతో సుఖముండును. వాస్తవమునకు మానవు డెవరైనను కోరునది సుఖమునే. పై దోషములు గలవాడు కూడ సుఖము కొరకే ఇవియన్నియు చేయుచున్నానని భ్రమించును. దేవుడే కనపడి "ఒక క్షణములో తేల్చుకొనుము నీకేది కావలయునో" అని అడిగినచో ధనము, కామము, పంతము నెగ్గుట, శత్రువులను గెలుచుట – ఇట్టి వెన్నియో అడుగగోరియు ఇన్నియున్నను సుఖముండదని గ్రహించి దేవు డొసగిన సమయము పూర్తియగు లోపు 'నాకు సుఖమే కావలయున'ని బదులు చెప్పును. హరి సేవకునకు ఏ పరిస్థితిలోనయినను సుఖమే. నావంటివానికి ఇట్టి పరిస్థితి వచ్చుట యేమి? అను చిరాకు వలన సుఖము తొలగును. అతిశయమును, మనసును స్వామికి విడిచిపెట్టవలెను. అపుడు సుఖముండును. మరియు పని మాని ఊరక నుండువారికి, తనను పూర్వము నిందించిన వారు, ఆయా సందర్భములు గుర్తుకువచ్చి దైన్య మేర్పడును. అట్లుగాక హరి స్మరణములో, హరి సేవలో పరవశుడగు వానికి ఎప్పుడును సుఖమే. అతని సుఖము ఎచ్చటనైనను, ఎప్పుడయినను చెడదు.

2వ చరణము యొక్క తాత్పర్యము

"కానిపనులు చేయకున్నచో శరీరమే సుఖము. మనలను మోహింపజేయు వలపు లకు మనము గురి అయినను, మౌనముగా నుండినచో సుఖమే. దీనత విడిచినచో అన్ని దినములు సుఖమే. హరిని ఆనుకొని తలచినచో అంతట సుఖమే."

వ్యాఖ్య

శరీరము హేయమని భావింపరాదు. అది దేవాలయము. ఈ శరీరముతోనే మంచిపనులు – భగవదర్పితముగా చేసినచో ఈ శరీరము కూడ బంధము గాక సుఖమగును. ఇతరులకు హాని చేయునవి, విషయ సుఖములకై తపించు పనులు – అనగా చేయ కూడనివి మానినచో ఆత్మానందము కలిగి ప్రాణము, మనస్సు, దేహమునకు కూడ అది దిగును. శరీరము తనదన్పింపక భగవంతుని స్వరూపమని తోచును. ఇదియే సుఖము. ఒక భిల్లకాంత శ్రీకృష్ణుని వేణుగానమును విని పరవశించి, శరణంది, ఆతనిని చేరుటకై నడుము అల్లాడుచుండగా వెళ్ళుచుండెను. అపుడామెకు కలిగిన దివ్యానందము హృదయమును, సంకోచ

వ్యాకోచములను, శ్వాసను, శరీరమును గూడ ఉల్లాసపరచినదని, ఆ యుల్లాస మామెకు భరింపలేనంత అయినదని భాగవత మున చెప్పబడెను. కులశేఖరాళ్వారు శ్రీహరి నిట్లు ప్రార్థించెను. "దోసిలిబట్టి, శిరసు నీ యెదుట వంచి, శరీరము పులకింపగా రోమాంచమై, కంఠము బొంగురువోవగా, కనులు ఆనందబాష్పములతో నిండగా, ఎల్లప్పుడు నీ చరణారవింద సేవామృతమను అనుభూతిని ఆస్వాదించు బ్రతుకును ప్రసాదింపుము." ఈ లక్షణములు మహాభక్తుని లక్షణములని నారదుడు తన భక్తిసూత్రములలో తెలిపెను. ఇది మహాభావ లక్షణములని చైతన్యప్రభువు తెలిపెను. కావున భక్తునకు శరీరము కూడ ఆత్మ యొక్క ఒక స్వరూపముగా అనుభూతి గలుగును. ఇదియే సుఖము. ఇట్టి దివ్య సుఖానుభూతికి నోచుకొనని దేహము గాలి యూదిన తిత్తియట. భార్య తనను మోహింపజేయుచు, వలపులు గొనినను ఆమెను విడిచిపోనక్కఱలేదు. భార్యతో శారీరక సంబంధము తప్పని తూలనాడ పనిలేదు. అన్నమయ్య ఆచరణలో జ్ఞాని, భక్తుడు. ఆచరణకు దూరమయిన తత్త్వవేత్త కాదతడు. ఆతనిది ఆచరణలో పూర్తిగా వలసినది. అతడు బోధించినది జీవన విధానమే కాని, వట్టి తత్త్వమును గాదు. శరీరమునకు భోజనాది పోషణములు గూర్చుట భగవంతుని సేవయే గదా. భార్య యొక్క వలపులకు, ఆమె కల్గించు మోహమునకు మనసులో అంటకుండుటే మౌనము. మనసు భగవంతుని యందుండి, దీనికి అంటబడకుండ ధర్మవిరుద్ధము గాని విధమున దాంపత్య భోగమును పొందుట తప్పు కాదు. సత్సంతతికై కామమును ప్రకృతి ఇచ్చినదని వేదము చెప్పుచున్నది. రఘువంశీయులగు రాజులు సత్సంతానము కొఱకై గృహస్థులు అయ్యెడివారు. ధర్మాచరణకు తోడుపడునదే భార్య. జగత్తును వేంకటేశుడుగా ప్రేమించి సేవించుటకు, గృహస్థాశ్రమ మొక ఆటంకము గాదు. శిక్షణాలయము. సత్సంతతిని పొంది, వారికి మంచి శిక్షణ నొసగి భక్తులుగ, సమాజ సేవకు అంకితులుగా తీర్చి దిద్దుటయు భగవత్ సేవయే. భార్యను, పిల్లలనే ప్రేమింపలేనివాడు లోకమును ప్రేమింపగలడా! ఉట్టి కెక్కలేని వాడు స్వర్గమున కెక్కలేడు గదా. మరి మంచి సంతతిని బడయుటకు భార్య కావలెను గదా. భర్త విత్తనము. భార్య క్షేత్రము. ఒకరినొకరు తమ ఆత్మగా ప్రేమించుటకే వివాహ సంస్కార ముద్దేశింపబడినదని వేదము చెప్పుచున్నది. సీతారాముల వలె దంపతులు అవతలివారిని 'తాను'గా ప్రేమించి, భగవంతునిగా సేవింపవలయును. 'ధర్మమునకు విరుద్ధము గాని కామమును నేను' అని కృష్ణుడు గీతలో చెప్పెను. భార్యతో ధర్మపద్ధతిలో దాంపత్య సుఖము ననుభవించుటలో దోషము లేదని అన్నమయ్య భావము. కాని ఈతడొక నియమమును చెప్పెను. తాను మౌనము వహింపవలెనట. అనగా ఇచట మాట్లాడ కుండుటగాదు. లోని ఇంద్రియములు, మనస్సు మౌనము వహింపవలెను. అనగా కామము మనసున చొరబడరాదు. నా భార్య ఈమె అని యనుచుందుము. 'భార్య' అను అంశము ఆమె దేహమునందు గాని, ప్రాణమునందు గాని, ప్రజ్ఞయందు గాని లేదు. మనము ఒక స్త్రీపై ఆరోపించుకొనిన అభిప్రాయమే భార్య. భార్య యగుట సత్యమయినచో పెళ్ళికాక పూర్వము కూడ కావలయును గదా. కావున భార్య అనునది సత్యము గాదు. ఆమె శరీరము సత్యము గాదు. అదియు భగవంతుని ఆలయమే. ఆమెయు ఆత్మస్వరూపమే. స్వామి యొక్క రూపమే అని భావింపవలెను. కావున అన్నమయ్య ఇచట నేల విడిచి సాము చేయుట లేదు. వైరాగ్యము కొఱకై భార్యను విడువుమని చెప్పుటలేదు. అట్లని ఆమె శరీరము

యొక్క ఆకర్షణకు లొంగుమని చెప్పుటలేదు. తనవరకు ఆమెను ఆత్మగా, స్వామిగనే దర్శించవలయును. తనలో నుండవలసినది శరీరాకర్షణ గాదు, ఆత్మసంబంధమగు దివ్యప్రేమ. ఆమె కష్ట సుఖములు తనవే. తానే ఆమె. రాముని ప్రేమ ఇట్టిదే. కాని ఆమె వలపులు గొలిపినపుడు ధర్మబద్ధముగా సత్సంతతికై శారీరకముగా పొందుట దోషము గాదు. ఆ సందర్భమున గూడ ఆ మరులు దేవుని లీలగా భావించుట, ఆమెను దేవుని స్వరూపముగా భావించినచో ఆమె శారీరకాకర్షణకు మనస్సు లొంగదు. ఇదియే మౌనము. ఇట్టి స్థితిలో కామసుఖమని ప్రత్యేకముగా వేరుగా నుండదు. ఇందును భగవంతుని సాన్నిధ్యమే అందును. ఇది తైత్తిరీయోపనిషత్తునందు చెప్పబడినది. కామసుఖమందును భగవంతుని సాన్నిధ్యమును తాను అనుభూతినొంది, మన కుపదేశించిన అన్నమయ్య వేదర్షి. విశిష్ట దృక్పథ మీతనిది. అవగతమగుట కష్టము. తర్కమునకు లొంగదు. ఎవరికి వారు సాధనలో అనుభవింపవలసినదే. తనలోను, భార్యలోను ఉన్న అంతర్యామిగా నున్న స్వామినే దర్శించిన మునీశ్వరుడు అన్నమయ్య. సాధారణ సమయములందే గాక, దాంపత్య సంయోగమునందును ఈ దర్శనమునకు తెఱపి లేదు. భార్యాభర్తల దేహములు కూడ భగవంతుని వెలుగుతో నిండినవే. అపుడు కలుగునది భౌతిక సుఖము గాదు. శాశ్వతము గాని భౌతిక సుఖము అన్నమయ్యను అంటదు. అపుడు కలుగునదియు ఆత్మసుఖమే. బ్రహ్మానందమే. ఇంతటి పవిత్ర హృదయునకు మనము అనుసరణమే సమర్పించు దక్షిణ. ఇదే విధముగా భార్యయు, భర్తయందు ఆత్మానందమునే పొందవలెను. దైన్య మొక రోగము. కొందరు తమయెడ తామే జాలిపడుచుందురు. మనకన్న కష్టపడుచున్న వారిని గమనింపవలెను. మనకన్న సాంఘికముగా, ఆర్థికముగా పైస్థాయిలోని వారిని గమనించి, ఆ స్థాయి కెదగవలెనని వ్యర్థ ప్రయత్నములు గావించి కుదేలు పడువారున్నారు. ఈ శ్రమలో కొంచెమయినను భగవత్ సేవకు వినియోగించినచో అది శ్రమ గాక, సుఖమగును. తాను ఉపవసించుటకన్న, ఆకలి గొన్నవానికి పట్టెడన్నము పెట్టిన అతనిలో ఆకలి రూపముననున్న స్వామి సంతృప్తుడగును. “నేను ఈ పని చేయలేను” అని భావించరాదు. స్వామి సంకల్పమే మన మాచరించుటకు సంసిద్ధులమయినచో ఆయనయే మనలో నుండి చేయును. మనము పరికరమాత్రులమే. విష్ణుచిత్తుడను ఆళ్వారును పాండ్యరాజ సభకు వెళ్లి, విష్ణుతత్త్వమును బోధింపుమని శ్రీకృష్ణ డాతనికి ఆనతిచ్చెను. అపుడాతడు “నావలననగునే” అను దైన్యమున పడెను. దైన్యము వినయము గాదు. భగవంతుని యందు శరణాగతి తప్పుటయే దైన్యము. అపుడు మరల కృష్ణ డిట్లనెను. “పొమ్మన్నది నేను. నీలోనుండి మాట్లాడునది నేను. నేను చెప్పినట్లు ఆచరించుటే శరణాగతి.” నేనే చేయగలను అని భావించుట అతిశయము. భగవంతుని సంకల్పమయినచో నేను చేయలేనని భావించుట దీనత. ఇవి రెండును పనికిరావు. గాయపడి రక్తము కారుచున్న వాని యెడ దయ నెఱపి, సేవించి, వైద్యము చేయింపవలెనే గాని, ఊరక కన్నీరు నింపిన చాలదు. ఇట్లు కన్నీరు నింపుట మానసిక బలహీనత, దీనత. మరణించిన బంధువులను గూర్చి శోకించుటయు దైన్యమే. ధర్మరాజును యక్షు డిట్లు ప్రశ్నించెను. “ఈ లోకమున విచిత్రమేమి?” ధర్మజు డిట్లు బదులు చెప్పెను. “మరణించిన వానిని గూర్చి శోకించుట. ఏలననగా తన సమయము వచ్చినపుడు తనకును దేహ త్యాగము తప్పదు గదా.” భగవంతుని యందు శరణాగతినొంది, ధైర్యముతో జీవించుచున్నచో దైన్యము మనలను విడుచును.

దినము లన్నియు సుఖమే. మరి పైన చెప్పినట్లు కానిపని చేయకుండుట, మరుల యెడ మౌనము, దీనత విడుచుట ఎపుడు లభ్యమగును? 'ఆని' – ఇది చక్కని తెనుగు పలుకుబడి. 'ఆని' యనగా ఆనుకొని – అనగా 'ఆశ్రయించి' యని అర్థము. ఇతరములగు ఆశ్రయముల జోలికి పోక, హరినే ఆశ్రయించి, ఆయనను తలచుచు, అంతర్యామి యగు స్వామి సేవలో గడిపినచో అన్నిచోట్ల, అన్ని పరిస్థితులలో సుఖమే. ఇతరుల నాశ్రయించినచో అవివేకమగును. తనచే ఆశ్రయింపబడిన వారికే దిక్కులేదు. వారి పదవి, ధనము మున్నగునవి వారినే కాపాడలేవు. వారి నాశ్రయించిన వారి నేమి కాపాడగలవు? మనకు తెలిసినదియు మనలను కాపాడదు. మనమాచరించిన ధర్మమే కాపాడును. ఆ ధర్మము నకు ప్రభువు శాశ్వతుడగు హరి. ఆయనను ఆశ్రయించుట యనగా ఆయన బాటలో జీవించుటే. ఇట్టివారి యునికియే సుఖము. హరి నాశ్రయించిన ప్రహ్లాదాదులు దీని కుదాహరణములు. అన్నమయ్య ఇట్టివాడే. కావున అన్నివేళల ఆతడు సుఖియే. ఆతడే సుఖము. రాజు ఆతని నాశ్రయించెనే గాని, ఆతడు రాజు నాశ్రయింపలేదు. మానము, అవమానము అతనికి లేవు. హరి నాశ్రయించుకొని, బిడ్డ తల్లి యొడిలో పరుండినట్లు హాయిగా నున్నాడు. ఈతనిని కాపాడుట తల్లియగు శ్రీహరి వంతు. తనకు దానితో ప్రమేయము లేదు.

3వ చరణము యొక్క తాత్పర్యము

"పట్టుదల విడిచినచో ఎల్లప్పుడు సుఖమే. భౌతిక జీవితమున ఆశలు వైదొలగినచో, ఇహలోక జీవితమంతయును సుఖమే. పంతములు, ఆశలు తొలగగా, శ్రీ వేంకటేశుని దాసులయిన వారు పైన చెప్పిన పంతమును, కోరికలను గెలిచి జీవితమున తనకీయబడిన పాత్రను పోషించినచో, క్రింద, మీద సుఖమే."

వ్యాఖ్య

పంతము, పట్టుదల స్వాతిశయమునకు చిహ్నములు. అనంత సృష్టిని నడిపించు చున్న దేవుని ప్రణాళికలో మన పంతములకు తావు లేదు. దైవ సంకల్పములకు విరుద్ధములయిన పంతములు విఫలములగుటయే గాక, ఉద్వేగమును, రోషమును, శోకమును కలిగించును. తన పంతము నెఱవేరనివాని కెప్పుడును చింతయే. దుర్యోధనుడు జీవితాంతము పాండవులను నశింపజేయవలెనని పట్టుదలతో, పంతముతో ప్రయత్నించెను. ఆతడు సదా దుఃఖమునకే గురి అయ్యెను. ఏ పంతము లేక, అంతయు శ్రీకృష్ణునికి విడిచి పెట్టిన ధర్మరాజు సుఖమునకు విరామము లేదు. మండోదరి, విభీషణుడు మంచిగా బోధించినను రావణుడు పంతమునకు లొంగెను. "తానొక నరునకు లొంగుట యేమ"ని. ఆ పంతమే అతని వినాశనమునకు దారితీసినది. కార్యదీక్ష మంచిదే. దేనియందు సత్కర్మలయందు? అవియు తానను కొన్న మంచి పనుల యందు గాదు. ఎంత మంచిది అయినను, మనము కోరి పట్టుదల పట్టగనే అదియు వ్యామోహమై, బంధమై నిలిచి మన సాధనకు అడ్డంకుగా నిలుచును. భగవంతునికి, మనకు నడుమ నిలుచును. మనమనుకొన్న మంచి పనులన్నియు నెఱవేరవు. ఇంత మంచి చేయుదమని భావించి

యత్నించినను సఫలము గాలేదని దీనత కలుగును. ఒక్కొక్కసారి తనకెంత ధనము, సామర్థ్యము, పట్టుదల యున్నను నెఱవేరవు. దైవసంకల్ప మున్నచో సత్కార్యమునకు వలయు ధనము, సామర్థ్యము, సహకారము అవియే లభించును. మనము పరికరములని మఱవరాదు. దైవ సంకల్పిత సత్కార్యములందు దీక్ష కావలెనుగాని, మనమనుకొన్న వానియందు గాదు. అసలు మనమేదియు సంకల్పించరాదు. శరణాగతునకు దైవసంకల్పము ఎదుట వెలుగుగా ప్రకాశించు చుండును. లేదా భగవదనుభూతి నిండిన మహనీయుల ద్వారమున తెలియబడును. ఇట్లు తన సంకల్పము చెడు పనులయందు ఎట్లుండరాదో, మంచి పనులయందును ఉండరాదు. దైవాదేశమున్నంత వఱకే మనము ఆయన పరికరములుగా వినియోగింప బడుదుము. గుడులు, బడులు కట్టించుట మంచిదే. కాని దైవ సంకల్పమున్నగాని అవి నెఱవేరవు. దేవునకు మనము ప్రచారము గావింపవలసిన పని లేదు. ఆయన ఎట్లు సంకల్పించునో, దానికి మనము పనిముట్లు, మనము హరిదాసులమే. ఇదియే సుఖము.

ఈ భూమిపైన – ఇల – అనగా ఐహిక జీవితమున ఆశలు విడిచినచో, ఇహలోక జీవితమును విడిచిపెట్టనక్కఱ లేదు. అదియు సుఖమే. ఆశలను మనము విడువలేము. దైవ సేవపై ఆశ పెరిగినచో, ఐహికములగు ఆశలు మనలను విడుచును. మనముగా ఆశలను విడువవలెనని యత్నించునపుడు, వానిపై మనసుపెట్టుటయే జరుగును. అవి పెరుగునే కాని విడువవు. భగవత్ పాదసేవ అను ఆనంద మాధుర్యమునందలి రుచి మరగినచో, ఐహికములగు కోరికలు అవియే మనలను విడుచును. పిల్లవాని చేతిలో బెల్లముండగా దానిని లాగివేసినచో, అతడేడ్చును. అతని మనసు బెల్లము పైననే యుండును. పైనుండి పటికబెల్లమును అందించినచో, బెల్లమదియే చిన్నపిల్లవాని చేతిలో నుండి జారిపోవును. దీనినే గీతలో శ్రీకృష్ణుడు ఉపదేశించెను. కోరికలున్నంత వఱకు వేఱొక కోరికపై దృష్టి, ప్రస్తుతము గల కోరిక యెడల అసంతృప్తి – ఇట్లు శాంతి సుఖములుండవు. ముక్తియందును కోరిక విడువగనే, ముక్తి యుండును. ఇహమును పనికిరాదను మెట్టవేదాంతముతో దానిని విడువరాదు, నిర్లక్ష్యము చేయరాదు. సమాజ రూపమున, దీనుల రూపమున భగవంతుడు దర్శన మిచ్చుచుండగా ఆతని సేవ మాని, ఇహమును విడుచుట నేరమగును. ఐహికములగు కోరికలు మనలను విడువవలెనేగాని, మనము ఇహమును విడవరాదు. తోటి వారనేకులకు అన్నపానీయాదులగునవి కావలసినవి యుండగా, మనకు విలాసము లను కోరు హక్కు లేదు గదా. తాను సరళమగు, నిరాడంబరమగు జీవనమును గడుపువాడే తోటివారికి సేవ చేయగలుగును. విలాస జీవనము గడుపువానికి ఆ అవకాశము లభింపదు. ఇంతకు భగవంతుని సేవలో మునిగినచో, మనము కోరవలెనా! మనకు కావలసిన వేమియో మనకన్నను దేవునకెక్కువ తెలియునను విశ్వాసముండవలెను. ఆయన ఈయకుండునా? అయితే ఈయవలెనని కోరరాదు. ఆధ్యాత్మిక రంగమున కూడ పోటీలు ఏర్పడుటకు కారణము మిగిలిన వారికన్న తనకు ప్రాముఖ్యము, గుర్తింపు, ప్రసిద్ధి లభింపవలెనను కోరికయే. ఒకనికి లక్ష్మీదేవి ప్రత్యక్షమయినదట. వరము కోరుకొమ్మని యడిగినదట. ఈ భక్తుడామెనిట్లు ప్రశ్నించెను. “అమ్మా! నీవు నిజముగా అమ్మవారగు లక్ష్మీదేవియే యయినచో, నీవే దర్శనమొసగగా, ఇక నాకు దేనియందు

కోరిక మిగిలియుండును?" ఆశలున్న వారికి తన ఆశలు తీర్చువారెవరు అను దృష్టి యుండును. ఆశయనగా అండ అనియు అర్థము. ఆశలు మనలను విడిచినచో, మనకెవరండయను దిగులుండదు. శ్రీవేంకటేశుని దాసులైన వారిని పంతములు, ఆశలు అవియే విడిచిపెట్టునని అన్నమయ్య 'తలగి' అను పదమున తెలిపెను. ఇట్టివారు జగన్నాటక రంగమున తమ పాత్రవళకు పోషింతురు. అంతకుమించి వారికి ప్రమేయము లేదు. లోకమునకు సేవకులమే అని భావింతురు గాని లోకమును ఉద్ధరించు వారమని భావింపరు. కామక్రోధములను వీరు గెలిచెదరు. వాస్తవమునకు వీరు స్వామికి దాసులుకాగా, స్వామియే వీనిని గెలుచును. పైకి అర్జునుడు గెలిచినట్లు కనపడినను, గెలిచినది కృష్ణుడే. అర్జునుడు పగ్గములను స్వామికి విడిచిపెట్టెను. అట్లే మనస్సును అంతర్యామి యగు శ్రీవేంకటేశునకు అప్పగించి, ఆయనకు దాసులయిన వారి విషయమున ఆయనయే కామ క్రోధములను గెలుచును. మనము కోరినవి, మన కోపమునకు గురి అయిన వారు, మనము పంతముపట్టిన విషయములు కూడ స్వామి స్వరూపములే యని భక్తితో స్మరింపగనే అవి తొలగును. స్వామి వానిని గెలుచును. ఇట్టి విజయమే భక్తునిలో జరిగినచో అతనికి క్రింద సుఖమే, పైన సుఖమే. అనగా బ్రతికియున్నపుడు, మరణము తర్వాత అని కొందరర్థము చెప్ప వచ్చును. వాస్తవము నకు 'మీద' అనగా ప్రజ్ఞామయమయిన లోకమున – అనగా మనస్సు, బుద్ధులందు. క్రింద అనగా కర్మలను ఆచరించు శరీర కక్ష్య యందు అని వేదములో చెప్పబడినది. కావున పరలోకమనగా నిర్మల హృదయమే. భక్తునకు ఐహికముగా కావలసినవి దేవుని దయ వలన చేరూరును. ఆత్మానందము లభించును. మరియు భగవంతుని పూజించుట యందు, సంకీర్తనము నందు గలుగు దివ్య సుఖమే దైనందిన జీవితము నందును కల్గును. ఈ సంకీర్తనము నానందించిన వారికిని రెండు సందేహములు కలుగవచ్చును. ఒకటి తానెవరిని యాచింపరాదు. నిజమే. ఎవరయిన నిజముగా ఆవశ్యకత యుండి యాచించినచో తనకు చేతనయిన విధముగా సాయపడవలెను. పొసగనిచో కసరరాదని ఎందరో మహనీయులు బోధించిరి. మన ఇంట్లో పనివారిని యాచకులనుగా భావింపరాదు. తల్లిదండ్రుల విధముగా వారియందు వాత్సల్యము నెఱపవలెను. రెండవది మనలకు ఇంకొకరు కీడు చేయుచున్నపుడెట్లు వ్యవహరింపవలెను? వ్యక్తిని చూచినచో ఉద్రిక్తత కలిగి ఎట్లు ఆతనితో వ్యవహరింపవలెనో తోచక దోషములు ఆచరించుట జరుగును. వ్యక్తిని చూచుట రోగము. వ్యక్తిలోని అంతర్యామిని చూచుట యోగము. ఇట్టిచోట తనలోను, ఆ వ్యక్తిలోను గల అంతర్యామిని ప్రేమించి, శరణందినచో ఆ వ్యక్తితో బాహ్యముగ ఎట్లు వ్యవహరింపవలయునో ఆదేశము వచ్చును. ఇంతటి శరణాగతి వచ్చు లోపు, అది వచ్చిన మహనీయుల సలహాలను పాటింపవలెను.

* * *

23

2వ సం-375 **జగన్మోహనాకార** భౌళి

జగన్మోహనాకార చతురుఁడవు పురుషోత్తముఁడవు
వెగటు నాసోదంబు ఇది నీ వెలితో నా వెలితో. ॥ పల్లవి ॥

ఎన్నిమారులు సేవించినఁ గన్నులూ దనియవు
విన్న నీకథామృతమున వీనులుఁ దనియవు
సన్నిధిని మిమ్ము నుతియించి వరుస జిహ్వయుఁ దనియదు
విన్న కన్నది గాదు ఇది నా వెలితో నీ వెలితో. ॥ జగ ॥

కడఁగి నీప్రసాదమే కొని కాయమూఁ దనియదు
బడిఁ బ్రదక్షిణములు సేసి పాదములు నివిఁ దనియవు
నుడివి సాష్టాంగంబు చేసి నుదురునూఁ దనియదు
వెడఁగుఁదన మిది గలిగె నిది నా వెలితో నీ వెలితో. ॥ జగ ॥

చెలఁగి నిను నేఁ బూజించి చేతులూఁ దనియవు
చెలువు సింగారంబు దలఁచి చిత్తమూఁ దనియదు
అలరి శ్రీవేంకటగిరీశ్వర ఆత్మ నను మోహించఁజేసితి
వెలయ నిన్నియుఁ దేరె మును నీ వెలితో నా వెలితో. ॥ జగ ॥

సూర్యోదయకాంతిని తన గుండెకు హత్తుకొను తామరపూవు వలె,
ఈ జగత్తులోని ఏ ఆర్తనాదమునకైనను నీ చెవి స్పందించవలెను.

టీక

సోదంబు = సంగతి (విషయము), వెలితి = లోపము, కడగి = ప్రయత్నించి, బడి = వెంబడించి, వెడగుఁదనము = నిశ్చేష్టత, చెలగి = ఉత్సాహముతో, చెలువు = సొగసు.

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య తన శరీర భాగములు స్వామికి ఎంతగా సేవ చేసినను, తృప్తి కలుగుటలేదని స్వీయానుభూతిని స్పష్టముగా ప్రకటించుచున్నాడు. అది అన్నమయ్య అనుభవమే కాదు, ఎవరి విషయమున అయినను అంతియే. స్వామి జగన్మోహనుడయిన పురుషోత్తముడని మధురముగా స్వామిని దర్శించి సంకీర్తనము చేయుచున్నాడు. ఈ సంకీర్తనమున భక్తిప్రవాహము పొర్లుచున్నది. భక్తుని యెడ, ఇంద్రియములు, శరీరము స్వామి సేవకు సంపూర్ణముగా అంకితమైన తీరు అద్భుతముగా వర్ణింపబడినది. ఎంతగా సేవించుట జరిగినను, తృప్తి కలుగ కుండుట స్వామిలోని లోపమా, తన లోపమా యని చమత్కారముగా సాహితీ ధోరణిలో ప్రశ్నించుట కన్పడుచున్నది. కాని వాస్తవముగా సృష్టి ప్రారంభము నుండి ఇది భక్తుల అనుభవమే. భగవంతుని గుణవైభవ మహిమ యట్టిది. మానవుని పరిమితి యట్టిది. ఇక సంకీర్తనమును ఆనందింతము గాక. ఇందుకు చరణముల భావమును హృదయమున పదిలపఱచుకొని, పల్లవిని దానితో అనుసంధింప వలయును. చరణములను అనుభవించనిది, పల్లవి అనుభవమునకు రాదు. ఇది అన్నమయ్యలోని విశిష్టత.

పల్లవి యొక్క తాత్పర్యము

"ఓ జగన్మోహనమయిన ఆకారము గలవాడా! నీవు నేర్పు గలవాడవు. ఉత్తము డయిన పురుషుడవు. నా సంగతి నాకే వెగటుగా నున్నది. మరి ఇది నీ లోపమా, నా లోపమా!"

వ్యాఖ్య

వేంకటేశ్వరుడు జగత్తును, అందలి జీవులను సమ్మోహపఱచి పరవశింపజేయు ఆకారము గలవాడు. స్వామి నీలాకాశమూర్తి. ఆకాశ నీలము అన్ని రంగులకు మూలము. జీవులను ముగ్ధులను చేయగలది. చోటులోనే జీవు లెల్లరు భాగములై యున్నారు. ఐహికములయిన బాహ్య విషయములు మనస్సును, ఇంద్రియములను మోహింపజేయును. వానియందు లేని సుఖము ఉన్నదని భ్రమించి మానవుడు వానిలో మునిగి దుఃఖమును, అసంతృప్తిని మాత్రమే పొందుచున్నాడు. ఎన్నియో జన్మలకు, చోటు మొత్తము భగవంతుని సమగ్ర స్వరూపముగా దర్శన మిచ్చును. నీలాకాశ దేహుడయిన స్వామి, సర్వ వస్తు విషయములందు, జీవులందు అంతర్యామి యను జ్ఞానము క్రమముగా అనుభవము కలుగును. అపుడు స్వామి యందు భాగములగు వస్తు విషయాదుల ఆకర్షణల నుండి జీవుడు బయటపడును. అఖండమైన మూర్తి స్వామి. ఖండములైనవి బంధుమిత్రాదులతోడి సంబంధములు, వస్తు విషయాదులు. అఖండత్వము సర్వసమ్మోహనము. ఖండత్వము కలిగించు మోహము అశాశ్వతము. స్వామి కల్గించు మోహనత్వము

శాశ్వతము. జగన్మోహనాకారుడనుటలో చిత్రార్థములు రెండు గలవు. జగత్తును మోహింపజేయు ఆకారము గలవాడని ఒక అర్థము. జగత్తే తన యాకారముగా గలిగి మోహింపజేయువాడని వేఱొక అర్థము. ఆకారమనగా చక్కగా చేయబడినది. స్వామి నిరాకారుడు. కాని ఆకారము స్వయముగా దాల్చెను. తానే జగత్తుగా చేసికొనినవాడు. తన ఆకారమే జగత్తు. తానే జగత్తుగా నాయెను. అట్టి జగత్తు మొత్తమును స్వామి ఆకారముగ ధ్యానించినచో, దర్శించినచో జగత్తు, అందలి జీవులు ఆయనయందు పారవశ్యము ననుభవింతురు. ద్రవ్యమయము, శక్తిమయము, ప్రజ్ఞామయము అనబడు మూడు లోకములను మోహింపజేయు నీలకాంతి గలవాడని భీష్ముడు శ్రీకృష్ణుని దర్శించెను. రుక్మిణీదేవి కూడ మొదటిసారిగా శ్రీకృష్ణుని జగన్మోహనుడుగ దర్శించెను. అది స్వామి కలిగించిన ఆకర్షణ. జగత్తు అనగా వాక్కు అనియు అర్థము గలదు. వాక్కును గూడ మోహింపజేయు ఆకారము గలవాడు గూడ. అనగా వాక్కును స్వామి కర్పించినచో, స్వామిని స్తుతించుటకు వినియోగించినచో అందు ఛందోవ్యాకరణాది దోషము లెన్ని యున్నను ఆ వాక్కు తాను పరవశించి పలుకువానిని, శ్రోతలను పరవశింప జేయును. మఱియు వాక్కు తన ఆకారముగా గలిగి మోహింపజేయు వాడనియు అర్థము. భగవంతుని గూర్చిన వాక్కు భగవదాకారమే. అన్నమయ్య సంకీర్తనలు, అతడు వాడిన పలుకులును స్వామి మూర్తులై లోకములను, జీవులను పరవశింపజేయును. అంతేకాదు 'జగన్మోహనాకార' అను పదమే జగన్మోహనుడయిన స్వామి ఆకారము కూడ. ఈ పదము కూడ గానము చేయువానిని, శ్రోతను మోహింపజేసి పరవశతానుభూతిసాగరమున ముంచెత్తును. ఇది అన్నమయ్య అనుభూతి. ఈ యనుభూతిలో అతడు మునిగియుండగా ఈ సంకీర్తనము వెలువడినది. ఇక స్వామి నేర్పు గలవాడు. తానొక్కడే అయినను ఇందరు జీవులుగా తానే అయి, తానే వారి యందంతర్యామియై వారిని రక్షించుచు, తిరిగి వారిని తనలో లయము గావించుకొను నేర్పు ఎంతటిదో ఎవరూహింపగలరు? సృష్టిలోని ఒక పూవు, ఒక తీగె, ఒక పండు, ఒక చెట్టు, ఒక ఏరు, ఒక మబ్బు, వెన్నెల, ఒక తారకయే పరమ సుందరముగా ప్రకాశించుచుండగా ఇన్నిటిని సృజియించుచు, దేనికిని అంటుకొనక నిలుచు నేర్పు ఎంత గొప్పది? చిన్న కుటుంబములోనే సరిపెట్టుకొనుచున్న మానవుడు బంధములలో చిక్కుకొనుచున్నాడు కాని స్వామి విశ్వకుటుంబి అయ్యును చిక్కులలో పడడు. అతడు మాయాశక్తితో గూడియే ఇన్ని కార్యములను నిర్వర్తించును. కాని మాయలో చిక్కు పడడు. మాయతో అతడు క్రీడించును. ఈ మాయనే 'యోగమాయ' అందురు. అనగా ఎందరున్నను అందరిని దారములో పూల వలె గ్రుచ్చి ఒకదాని యందు భాగములుగ జేయు శక్తి. పూవులో రేకల వలెనే, స్వామియందు భాగములుగనే సర్వులును, సర్వమును పట్టియుంచు శక్తియే యోగమాయ. దీనితో క్రీడించు నేర్పు గలవాడే స్వామి. ఎందరు జీవులున్నారో అంతటి వైవిధ్యమున్నది. ఎంత చిత్ర సృష్టి! తన వైపునకు కోరికలను తీర్చు నెపమున ఆకర్షించి, ఆ కోరికలను తనపై మరలునట్లు మోహింపజేసి, ఆ కోరిక కూడ లేకుండ తనయందు నిలుపు నేర్పు స్వామిది. జగన్మోహనాకారుడు గావుననే చతురుడు. ఏ ఒక్క జీవుడు ఏ తప్పు చేసినను, పల్లెత్తు మాట అనకుండ వారే స్వయముగా తమ దోషములను ఎఱుగునట్లు పరిస్థితులను కల్పించుచు

వారిని తన వద్దకు ఆకర్షించు నేర్పు స్వామిది. ఇక స్వామి పురుషోత్తముడు. ఇది షష్ఠీ తత్పురుషగా సాధారణ భావన. కాని గీతలో స్వయముగా స్వామియే 'ఉత్తమ పురుషుడు పరమాత్మ' అని తెలిపెను. కావున పురుషోత్తమ శబ్దము గీతాచార్యుని దృష్టిలో విశేషణ ఉత్తరపదకర్మధారయము. వ్యాకరణమున ఉత్తమపురుష అనగా 'నేను'. అనగా సర్వాంతర్యామి యగు 'నేను'. వేదాంగ వ్యాకరణమున ఈ 'నేనే' పరమాత్మ యని తెలుపబడినది. ఇదియే 'అహం బ్రహ్మాఽస్మి' అను మహావాక్యము.

ఇపుడు అన్నమయ్య మూడు శబ్దములతో స్వామిని మధుర మోహనముగా కీర్తించి, ఆపై ఇట్లు పలుకుచున్నాడు. 'నా సంగతి నాకే వెగటుగా తోచుచున్నది.' వివరములు చరణములలో చెప్పబడుచున్నవి. తానెంతగా స్వామిని కీర్తించి, వివిధ సేవలు చేసినను తన మనసు, శరీర భాగములకు తృప్తి కలుగకుండుటకు కారణ మేమి? లోపము స్వామియందున్నదా? తనయందున్నదా? అని ప్రశ్న. స్వామిలో లోపమేమి యుండును? ఆయనను ఎంతగా కీర్తించినను, ఎన్ని విధములుగ సేవించినను తృప్తి కల్గకుండుట భక్తునకు ఆయనయే కల్పించుచున్నాడా! అనగా ఎంతగా కీర్తించి సేవించినను, ఇంకను వాని కతీతములయిన గుణవైభవములు కలిగియుండుట స్వామి లోపమని ముచ్చటగా అన్నమయ్య ఆరోపించుచున్నాడు. ఇక తృప్తి కలుగకుండుట తన లోపము కూడ అని వెల్లడించుచున్నాడు. రెండు కారణములను జతగూర్చి చెప్పకుండ అదియా, ఇదియా అని ప్రశ్నించుట అన్నమయ్య నేర్పు గాదు. ఆతని యెదలో ఊగిసలాడుచున్న తీరిది. ఇట్టివే భావములను కొందరు వెల్లడించిరి. మురారి తన 'అనర్ఘరాఘవమ'ను నాటకమున 'శ్రీరామునిలో అన్నియు గుణములే. ఒకటే అవగుణమున్నది. అదియేమి? ఎంతగా తన గుణములను కీర్తించినను తరుగకుండుట, తృప్తి కల్గించకుండుట' అనెను. జయదేవుడను భక్తుడు తన 'ప్రసన్నరాఘవమ'ను నాటకమున ఇట్లనెను 'రాముని మించిన కథానాయకుడు లేకుండుటయే అతని లోపము. కావున నేను కూడ ఇంతకు పూర్వకవుల వలెనే రామకథనే రచించుచున్నాను.' ఒక ప్రసిద్ధ శ్లోకము వాల్మీకిని కొనియాడునది గలదు. దాని భావము ఇది. "సదా రామచరిత అను అమృతసాగరమును పానము చేయు చున్నను తృప్తినొందని వాల్మీకికి నమస్కారము. అట్లు తృప్తినొందక సతతము రాముని కీర్తించుటవలననే ఆతని జోలికి కల్మషములు పోలేదు." ఈ పల్లవిలో అన్నమయ్య భావము కూడ నిట్టిదే. ఇక తన సంగతి తనకే వెగటుగా నున్నదట. అనగా ఎంతగా కీర్తించి, సేవించినను తనకు తృప్తి కలుగకుండుట తనకు ఆశ్చర్యమును, వెగటు దనమును కల్గించుచున్నది. తన సంకీర్తనములు, సేవలు తాను స్వయముగా చేసినవి కావే. స్వామియే చేయించుకొన్నవే. మఱి ఈ పరిస్థితి ఏమిటని వెగటుగా నున్నది. ఎంత కొలిచినను, మన కొలతలకు స్వామి అతీతుడు గదా. మఱి ఈతడు మొదటి పాదమున చెప్పబడినట్లు జగన్మోహనాకారుడు, నేర్పరి, ఉత్తమపురుషుడుగా భక్తు డెంత మహనీయుడయినను పలుకులకు, చేతలకు అందునా? వానిని దాటి యుండును. వానిని తానే చేయించుకొన్నను తాను అనుభూతిస్వరూపుడు. కొలతల కెట్లు అందును? మఱి ఇందు ఒక రహస్యార్థము గానవచ్చుచున్నది. అన్నమయ్య వంటి మహాభక్తుని సంకీర్తనలకు, సేవలకు ఎంత శ్రద్ధతో, మధురముగా చేయ బడినను, స్వామికి తృప్తికలుగక, ఇంకను అన్నమయ్య సంకీర్తనలను కోరుచున్నాడు. ఇదియు ఆయన లోపము.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"ఎన్నిమారులు నిన్ను సేవించినను కన్నులు తృప్తిచెందవు. నీ కథామృత మెంతగా ఎన్నిమార్లు విన్నను చెవులు తృప్తినొందవు. మీ సాన్నిధ్యమున మిమ్ము వరుసగా ఎంతగా నుతించినను నాలుక తృప్తినొందదు. మరి ఇది నా లోపమో, నీ లోపమో! నేను ఈ విచిత్రమును వినలేదు, చూడలేదు."

వ్యాఖ్య

ఈ చరణములలో చెప్పబడిన స్వామి సేవలన్నియు వేంకటేశ్వరుని దివ్యమంగళ మోహనరూపము వరకే పరిమితము గాదు. సర్వాంతర్యామి యగు స్వామి పదములు గూడ. అన్నమయ్య కన్నులు స్వామిని ఎన్నిమార్లు చూచినను, ఎంత భక్తితో దర్శించినను తృప్తి పొందవు. స్వామి దివ్య సౌందర్యమును కనులు త్రాగుచున్నవేమో. చూచుట అను క్రియకు బదులు ఇచట సేవించుట అను పదము ప్రయోగింపబడెను. హృదయము పరవశించి, పులకరింతలతో, రోమాంచముతో స్వామిని కనులు దర్శించుట, సేవించుటే యగును. అంతియే కాదు స్వామిని తన చూపులతో ఈ భక్తుడు తీగలతో వలె కట్టుచున్నాడు. మరియు ప్రకృతిని, తోటి జీవులను గూడ భగవంతుని మూర్తులుగా దర్శించి, దర్శించి ఇతని కనులు తృప్తినందుట లేదు. 'కన్నులూ' అను మాటను చివఱ దీర్ఘముతో వాడుటలో అన్నమయ్య తన ఆర్తిని, భక్తిని వక్కాణించుచున్నాడు. భగవత్ సేవలో తన అసంతృప్తిని దీర్ఘము స్పష్టముగా సూచించుచున్నది. జీవులను చూచుచు వారిని దేవుడు కాపాడుగాక యనియు, అన్నమయ్య కరుణతో భావించుచున్నాడు. తిరుమలలో గుడిలో వేంకటేశ్వరుని దర్శనము కలిగిన వెంటనే అన్నమయ్యకు పరిసరములు, ఎల్లరు జీవులు స్వామి రూపములుగనే గానవచ్చెను. ఇదియది యననేల? విశ్వమే స్వామిగ గానవచ్చెను. ఇక అతని ఆనందమునకు మేరలేదు. ఇట్టి దర్శనము బ్రతుకంతయును కొనసాగినది. అయినను తృప్తి కలుగుటలేదు. మతంగమహర్షి శరీర త్యాగము చేయబోవుచు శబరితో చెప్పెనట "భగవంతుడు రాముడుగా వచ్చుచున్నాడు. అతనిని చూచుటకై వేచియుండుమ"ని. ఆమె గురువుగారి నడిగినదట "మరి మీకు రాముని చూడవలెనని లేదా" యని. మతంగమహర్షి ఇట్లు బదులు చెప్పెనట. "ఇపుడు చూడకపోతే గదా" అని. ఈ సంభాషణ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి రామాయణ కల్పవృక్షమున గలదు. భగవంతుని చూచు చూపులే చూపులని ప్రహ్లాదుడనెను. కృష్ణుడు మధురకు తరలిన పిదప ఆతని యెడబాటుకై గోపికలు పరితపించు చున్నారేమో, కృష్ణ దంతట ఉన్నాడని వారికి జ్ఞానబోధ చేయు నుద్దేశ్యముతో ఉద్ధవుడను భక్తుడు బృందావనము చేరెను. అతనికి కన్పించిన దృశ్యము వేరుగా నున్నది. గోపికలు కృష్ణుని దర్శించుచు మాటలాడుచున్నారు. ఆతనికి స్నానము చేయించుచున్నారు. తల దువ్వుచున్నారు. వెన్న నిడుచున్నారు. ఆడుచున్నారు. ఇక ఉద్ధవు డాశ్చర్యపడి గోపికలే తన గురువులని గ్రహించి, వారి చరణ ధూళి శిరసున ధరించెను. శ్రీకృష్ణుడు తనను బృందావనమునకు పంపిన కారణ మవగతమయినది. ఆతడును తక్కువవాడు గాడు. ఐదేండ్ల వయస్సున ప్రతిదినము ఒక బాలుని కృష్ణునిగా భావించి, ఆతనిని సేవించి, భోజనమిడి, ఆ పిదపగాని అమ్మ వద్దకు భోజనమునకై వచ్చెడివాడు గాడు. ప్రహ్లాద నారదాదులకును పరమాత్ముడు విశ్వరూపుడై

సదా దర్శన మిచ్చుచుండును. కన్నులను దేవుడు మనకిచ్చినదే ఆయనను సదా దర్శించుటకు. లేకున్నచో అవి శరీరమను గోడలోని కన్నములే అని ప్రహ్లాదుడు పలికెను. ఇతడు తనను చంపవచ్చిన రాక్షసులలో, ఏనుగులో, పాములలో విష్ణునే దర్శించుటతో రక్షింపబడెను. తనను రక్షింపుమని స్వామి నతడు వేడలేదు. విష్ణుని కన్న వేఱు చూచిన కదా వేడుటకు! బ్రతుకంతయు విష్ణుని మోహనాకార దర్శనము కలుగుచున్నను సంతృప్తి యుండదు. అది స్వామి దివ్యమోహనాకృతి యొక్క మహిమ. భక్తుని అసంతృప్తియు అతని లోపమే. స్వామి కథలు, గుణములు, వైభవములు, లీలలు అమృతములు. అనగా నశింపని ఆనందమును కల్గించునవి. ఎంతగా వీనిని విని యానందించినను అన్నమయ్య చెవులకు తృప్తి కలుగుటలేదు. మేరలేని ఆనందమున తృప్తి యుండునా? ఒక చిన్నపిల్లవానికి నోటిలో ఒక మధుర పదార్థమును ఉంచి అతడు రుచి చూడగనే, పూర్తిగా భుజింపక ముందే, అతని నోటిలో నుండి వెలికి లాగినచో అతని కెట్లుండును? భగవత్ సేవానందమున పరవశించు భక్తుని మనస్సును, అవయవములకు ఇట్టిదే పరిస్థితి. భౌతికమయిన పదార్థమై పోవుట ఉండును. భగవదానందమైపోవుట ఉండదు. కనుక తృప్తి యుండదు. స్వామి కథల అనంత మహిమయా! అన్నమయ్య చెవుల లోపమా! సూతుడు నైమిషారణ్యమున శౌనకాది ఋషులకు హరి యొక్క కథలు ఎంతగా చెప్పెను, ఎన్ని చెప్పెను? పురాణములు, భారతము చెప్పెను. భాగవతము చెప్పసాగెను. కాని శౌనకాదులింకను చెప్పుమని అసంతృప్తితో సూతుని వేడినట్లు భాగవతమున గలదు. విష్ణుని కథలు విను చెవులే చెవులు. వ్యాసుడును నారదుని నుండి విని తృప్తి పొందలేదు. ఇంతకు శరీరమందలి కన్నులు చూచుట చేయలేవు. చెవులు వినలేవు. ఆయా ఇంద్రియముల ద్వారమున పనిచేయునది మనస్సే. మనస్సులోనే ఇంద్రియ ప్రజ్ఞలు గలవు. లోగనులు, లోచెవులు మున్నగునవి గలవు. విష్ణుని కథలలో భక్తుల కథలు, సజ్జనుల సద్గుణములు, తోటివారు చేసిన మంచిపనులు కూడ ఇమిడి యున్నవి. భగవంతుని సన్నిధిలో ఆయనను ఎంతగా కొనియాడినను, ఎన్నిమార్లు ఎన్ని విధములుగా నిర్విరామముగా ప్రస్తుతించినను నాలుకకు తృప్తి లేదని అన్నమయ్య తన అసంతృప్తిని ప్రకటించుచున్నాడు. నాలుక నిచ్చినదే స్వామిని కీర్తించుటకు. అపుడే అది సంకీర్తనమగును. స్వామిని వర్ణించు నాలుకయే నాలుక అనియు, విష్ణుని పొగడని నోరు ఢక్క యనియు ప్రహ్లాదుడు పలికెను. భగవానుని దివ్యరూపగుణ వైభవ లీలాకథలను ఎంతగా స్తుతించినను తృప్తియుండదు. వాని మహిమ అట్టిది. అంతులేనిది. చూచు కనులు, విను చెవులు, వర్ణించు నాలుక వీని ద్వారమున పనిచేయు మనస్సు భగవంతుడను వెలుగుతో చేయబడినవే గదా. ఇక వీనిని స్వామిని ఎంత సేవించినను తృప్తి ఎట్లు గలుగును? ఉపనిషత్తు లిట్లు చెప్పుచున్నవి. "మనస్సు, వాక్కు దేవుని ద్వారము వరకు వెళ్లి లోపలకు వెళ్లలేక వెనుదిరుగుచున్నవి." స్వామి అనుభూతిస్వరూపుడు. మనస్సు, వాక్కు ఆగినపుడే గదా అనుభూతి యుండునది. కావున మనస్సు, వాక్కు ఆయనను వర్ణింపలేవు. మనస్సుతో పనిచేయు శరీరములోని అన్ని భాగములును ఆయనను చేరలేవు. మనస్సుకు, వీనికి ఆయన సేవలో తృప్తి ఎప్పటికిని కలుగదు. పూర్ణ తృప్తి కావలెనన్నచో ఇవి ఆగవలెను గదా. మనస్సుకు, వాక్కుకు, ఇంద్రియములకు అతీతమయిన అఖండానుభూతియే స్వామి. భగవంతుని సన్నిధిలో నాలుక స్వామిని నుతించుచున్నదని అన్నమయ్య పలుకుటలో వైచిత్రి యున్నది. నాలుకతో స్వామిని నుతించినచో స్వామి

సన్నిధి కలుగును. అన్నమయ్య చెప్పిన వాక్యమును తలక్రిందులుగా చదువవలయును. ఋషుల వాక్యములు కొన్ని ఇట్లే యుండును. అనగా వాక్కులు స్వామిని చేరలేవు గాని, స్వామిని వర్ణించినపుడే వానికి సార్థక్యము. ఇట్లు వాక్కులతో స్వామి సంకీర్తన చేసినపుడే పారవశ్యానుభూతియను భగవంతుని సన్నిధికి దారి లభించును. మొదట్లో సంకీర్తనయు, అనుభూతియు కలిసియుండును. ఆపై వాక్కులాగి నోరు మూగవోయి, అనుభూతియే యుండును. మూడవ దశలో అనుభూతిస్వరూపుడైన స్వామియే భక్తుని ద్వారమున వాక్కులు వెలువరించుచు సంకీర్తన చేయును. భక్తుడు అనుభూతిలో మునిగియుండును. కావున తృప్తి లేకున్నను, దైవ సాన్నిధ్య మాధుర్యాను భూతికై స్వామిని నాలుకతో సంకీర్తన చేయక తప్పదు. ఇచట స్వామి కథా గుణ వైభవ లీలలలో భక్తుల సద్గుణములు, వారి జీవితములలో వివిధ సన్నివేశములు, అవతారమూర్తుల దివ్య జీవన ఘట్టములు, తోటివారి మంచి గుణములు కూడ చేరును. వేదవ్యాసులు రచించిన భాగవతమనబడు విష్ణుకథలో ఇవి యన్నియు గలవు. తోటివారల మంచి గుణములు నోరార కీర్తించుటకు గాని, వినుటకు గాని ఇష్టపడనివాడు ఎన్ని పూజలు, నుతులు తనను గూర్చి చేసినను దేవుడు వానిని పట్టించుకొనడు. అతడొక వ్యక్తి కాదు గదా పొగడ్తలకు ఉబ్బుటకు. సంకీర్తన మనునది మన యుద్ధరణకు. ఇది ఇతరుల మంచిని కీర్తించుటకు దోహదకారి యగునట్లుగా చేయవలెను. అనగా దేవుని అంతర్యామిత్వము మఱవరాదు. ఎవరిలోని మంచి అయినను స్వామి నుండి వచ్చినదే గదా. ఇట్లు అన్నమయ్య కనులకు, చెవులకు, నాలుకకు స్వామి సేవలో తృప్తి కలుగుటలేదు. స్వామి మహిమ యంతటిది. ఎంతగా వర్ణించినను అతీతమైనది. అది స్వామి లోపమేమో! లేదా తృప్తి కలుగునంతగా తాను భక్తిశ్రద్ధలతో స్వామిని చూచుట, వినుట, నుతించుట చేయకుండుట తన లోపమా! ఇట్లు అర్థమును భావింపరాదు. ఏలనన, అన్నమయ్య ఇట్లనుచున్నాడు. "ఎంతగా నా కనులు నిన్ను దర్శించినను, నా చెవులు నీ కథామృతమును జుఱ్ఱినను, నా నాలుక ఎంతగా నిన్ను నుతించినను తృప్తినందకుండుట ఎప్పుడును విన్నది గాదు, కన్నది గాదు" (అనగా ఆశ్చర్యముగా నున్నది). కావున అన్నమయ్య భావము "నా లోపమనగా నేను నిన్ను ఎంతగా సేవించినను తనివితీరకుండుటయే.

2వ చరణము యొక్క తాత్పర్యము

"కోరి యత్నించి నీ ప్రసాదమే స్వీకరించినను, శరీరము తృప్తి పొందదు. నిన్ను వెంబడించి నీ చుట్టు ప్రదక్షిణములు ఎన్నిమార్లు చేసినను నా పాదములకు తృప్తి లేదు. నీకు చెప్పుకొని, నా నుదురు నీకు సాష్టాంగ నమస్కారము చేసినను తృప్తి పొందుటలేదు. నాకు అవివేకము కలిగెను. ఇది నా లోపమో, నీ లోపమో మఱి!"

వ్యాఖ్య

నీ ప్రసాదమును స్వీకరింపగోరి, అందులకై ప్రయత్నించి దానిని స్వీకరించినను, శరీరమునకు తృప్తి లేదు. ప్రసాదమును స్వీకరించునది నోరే అయినను, అది మొత్తము శరీరమునకు పంచిపెట్టబడును

గావున ప్రసాదమును స్వీకరించునది శరీరమే అన్ని అన్నమయ్య పలుకుచున్నాడు. స్వామి ప్రసాదము గొనుట ఆతని యభిలాషయని 'కడగి' అను పదము సూచించుచున్నది. ఆ ప్రసాదమునకై అన్నమయ్య సాధన చేసినవాడు. ప్రతిదినము గుడికి వెళ్లి స్వామి కర్పితమయిన నివేదనమును దైవ ప్రసాదముగా అన్నమయ్య స్వీకరించెనని భావింపజాలము. తిరుమల చేరినపుడెల్ల అట్లు స్వీకరించియుండును. తాను సంచరించిన గ్రామములందలి ఆలయములలో స్వామి నివేదనమును ప్రసాదముగా స్వీకరించియుండును. కాని దానికి అతడు తృప్తినొందుట లేదనగా అంతమాత్రమే కాదు. ప్రసాదమనగా 'అనుగ్రహమ'ని అర్థము. మనము అనుదినము మన నివాసమున గాని, ఎచటనయిన గాని స్వీకరించు ప్రతి ఆహార పదార్థము గూడ దేవుని యనుగ్రహమే అని భక్తుల భావన. అందుచేతనే వైష్ణవ సంప్రదాయమున భోజనమునకు 'ప్రసాదము లేదా సాదము' అను ప్రసిద్ధి కల్గినది. భగవంతుని ప్రసాదముగా ఆహారమును ప్రతిదినము అన్నమయ్యయు హృదయమార భావించి శ్రద్ధతో స్వీకరించెను. దేవుడు సూటిగా ఇచ్చినట్లు కనపడదు. కాని మనము భుజించు ఆహార పదార్థములు – ధాన్యము, కూరగాయలు, పప్పులు మున్నగునవి కర్షకుల కృషికర్మ నుండి లభించుచున్నవి. పాలు, పెరుగు, మజ్జిగ, వెన్న, నేయి పశువుల నుండి లభించుచున్నవి. పశుపాలకుల కృషి కూడ ఇవి లభించుటకు కారణము గదా. ఇట్లు కర్షకులు, క్షేత్రములు, పశుపాలకులు, పశువులు – వీని రూపములలోని అంతర్యామి యగు భగవంతుడే మనకు ప్రతిదినము ఆహారమును ప్రసాదించుచున్నాడని భక్తితో భావించి, ఆపై భుజించుట ఆరంభింప వలెను. ఇందులకే ఆపోశనము ఏర్పడినది. గాయత్రీ మంత్రోచ్చారణతో ఆహారమును స్వామికి నివేదన చేసి భుజింతురు. అసలెట్లును ఆహారము కర్షక కార్మిక రూపములలోని అంతర్యామియగు స్వామి ప్రసాదము. మరి ఇప్పుడు మరల నివేదన చేయుట ఎందులకు? ఆ యంశమును గుర్తుకు తెచ్చుకొనుటకు. మరియు తన శరీరములో ఆకలిగానున్న స్వామికి నివేదించుటను గుర్తించుటకును. ఇంతకు ఆహారము భగవత్ ప్రసాదమను పవిత్ర భావన వలన కర్షక కార్మికుల యెడ కృతజ్ఞత కలిగియుండవలెనని శ్రద్ధాభావము కలుగును. వారికి గూడ తమ ద్వారమున సేవ జరుగుటకు సిద్ధపడ వలెను. సమాజమున మనకు ఆహారమును పెట్టుచున్న వారిని నిర్లక్ష్యము చేయు భావము పెరిగిన ఆర్థిక సాంఘిక వ్యవస్థ కూలిపోవక తప్పదు. మరియు తన ఆకలి వంటిదే ఇతరుల ఆకలి యని గుర్తింపు కలిగి, ఆ యాకలిని తీర్చుటకై తన వంతు పనిచేసి, ఆ యాకలి రూపములోనున్న భగవానునకు సేవ చేయు భావము పెంపొంద వలెను. ఇట్లు తాను తీసికొను ఆహారము, భగవత్ ప్రసాదమను పవిత్ర భావము పొందుటతో సమాజము నెడల కర్తవ్యము నిర్వహించు నుత్సాహము, వ్యక్తికి సమాజము నకు సత్సంబంధములు, వివిధ వృత్తుల వారి నడుమ పరస్పర సహకార సామరస్య ములు ఏర్పడును. అన్నమయ్య ఇట్టి పవిత్ర భావము గలవాడు గావుననే తాను స్వీకరించు ఆహారమును స్వామి ప్రసాదమని భావించుట జరిగినది. తన సంకీర్తనలతో అనేక గ్రామములలో గూడ ఇట్టి సామాజిక చైతన్యమును ఆతడు ఉత్తేజపరచెను. ఈ శరీరమును సమాజరూపుడగు స్వామి సేవలో తన శరీరమునకు తృప్తి కలుగ లేదనియు అన్నమయ్య భావము. మరియు ప్రసాదమనగా ఆహార విషయముగా మాత్రమే పరిమితము గాదు. అసలు కాయమే అనగా శరీరమే మనకు దేవు డొసంగిన ప్రసాదము. దానిని భగవంతుని

సేవకు సద్వినియోగపరచనప్పుడు గాలితో నింపిన కొలిమితిత్తి యని ప్రహ్లాదుడు ఉద్ఘాటించెను. పోతనగారు కూడ అన్నమయ్య వాడిన 'కాయము' అను పదమునే ప్రయోగించెను. ఎంతగా ఈ శరీరమును, దానితో గడుపు జీవితమును భగవంతుని సేవలో వినియోగించినను తనకు సంతృప్తి కలుగుట లేదని అన్నమయ్య భావము. శరీరము దేవుని ప్రసాదమై తాను దానిని ఎన్నిమార్లు గ్రహించినను తృప్తి లేదు అనుటలో అన్నమయ్య ఒక మహోదాత్తమగు ఆశయమును ధీరుడై ఉద్ఘాటించెను. అది ఏమి? ఎన్నిమార్లు "నీ ప్రసాదమగు శరీరమును గొని నీ సేవలో దానిని వినియోగించినను, తృప్తి కలుగుటలేదు. కావున ఎన్నిమార్లయినను శరీరములను ధరించుటకు నేను సిద్ధమే" అని. చాలమంది వేదాంతులనబడు వారు ఈ శరీరము తుచ్ఛమని భావింతురు. కాని అన్నమయ్య దీనిని దేవుని ప్రసాదముగా భావించెను. వేదములో దేహమే దేవాలయమని చెప్పబడినది. వేదమును విడిచిన వేదాంతము మెట్ట యగును. మరికొందరు ఈ జన్మలోనే మోక్షము పొంద వలెను. ఇక జన్మలు వద్దు అని దేవుని వేడుకొందురు. వీరి దృష్టిలో మోక్షమనగా జన్మ రాహిత్యము. ఎన్ని జన్మలెత్తినను శరీరమునకే గాని, తనకు గాదని భక్తు డెఱుగును. భక్తుడు శరీరము యొక్క జనన మరణ సమయములందు భగవంతునందే స్థిరుడై యుండును. కావున అతనిని పుట్టుక, గిట్టుక అంటవు. ఈ స్థితి మోక్షము గాని, జన్మరాహిత్యము గాదు. అన్నమయ్య ఈ భావము నచ్చినవాడు. ఇతడు ఋషి, భక్తుడే గాని మెట్టవేదాంతి గాడు, శరీరముతో వచ్చు కష్టములకు వెఱచు పిఱికివాడు గాడు.

భగవంతుని వెంబడించి – అతని దారిని అనుసరించుచు మాటికి స్వామికి ప్రదక్షిణము లాచరించుచున్నను, అన్నమయ్య పాదములకు తృప్తి లేదు. స్వామిని వెంబడించుట అనగా స్వామి యొక్క దివ్యప్రేమమార్గమును అనుసరించుటయే. ప్రదక్షిణమనగా స్వామి ఆలయము చుట్టు గాని, స్వామి మూర్తి చుట్టు గాని ఎడమ వైపు నుండి కుడివైపునకు పాదములతో తిరుగుట. స్వామి గుడి విశ్వమునకు ప్రతీక. స్వామి మూర్తి విశ్వాంతర్యామియే. ఆలయము చుట్టు ప్రదక్షిణము చేయుటలో స్వామి మూర్తి చుట్టు ప్రదక్షిణము చేయుట గూడ చేరును. ఇట్లు ఆలయ ప్రదక్షిణము విశ్వమునకు, విశ్వపురుషుడగు విష్ణునకు చుట్టు తన పాదములతో తిరుగుట. మానవుడు విశ్వమానవుడగుటకిది సోపానము. పాదములతో తిరుగుట యనగా తన జీవితపు అడుగులలో స్వామికి శరణందుచు, ఆయన అడుగుల జాడలలోనే ప్రవర్తించుట. ఇది విశ్వమానవతా సిద్ధికి మార్గము. స్వామి అడుగులనగా సృష్టి యొక్క నడకయే. స్వామి యను పెద్ద వెలుగు నుండి వెలువడు తేజోమయ కిరణముల క్రీడయే సృష్టి యొక్క నడక. కాలగతిలో సృష్టి నడిచి పంచభూతాదులు, సౌర కుటుంబములు, భూమిపై నదీసాగరాదులు, జీవులు పుట్టి పెరుగుట అంతయు స్వామి యొక్క అడుగుల వరుసయే. సృష్టి కథ స్వామి కథయే గాని శాస్త్రవేత్తలు భావించునట్టి దేవునితో ప్రమేయము లేని విజ్ఞానము గాదు. భాగవతమున సృష్టి పరిణామము, అందలి జీవకోటి పరిణామము జమిలిగా సాగుట భగవంతుని కథగా వర్ణింపబడినది. మరి భగవంతుని అడుగు లెట్టివి? ఒక్కొక్క అడుగునకు ఒక పరిణామ దశలో జీవులేర్పడుచుందురు. కావున స్వామి అడుగులు వేయుట అనగా ఆయనయే సృష్టిగను, అందలి వివిధాంశములుగను, వివిధ జీవులుగను దిగివచ్చుట. ఎట్లు దిగివచ్చును? వీరితో

ఎట్లు మెలగును? ప్రేమతో దిగివచ్చును. ప్రేమతో మెలగును. కావున దేవుని అడుగుల జాడలు ప్రేమమయములు. సూర్యుడు తన వెలుగునే కాంతికిరణములుగా తెచ్చి, వానిని ప్రేమతో భావించి, జీవులకు ప్రేమతో కాంతిని పంచును గదా. ఇట్లు స్వామి ఆలయము చుట్టు పాదములతో ప్రదక్షిణము చేయుట అనునది, దేవుని ప్రేమమార్గమును అనుసరించుటకు ప్రతీకగా ఆగమశాస్త్రమున విధింపబడినది. ఈ భావన కాకుండ ఊరక తిరుగుట యంత్రము, గానుగ తిరిగినట్లే అగును. అయినను తిరుగగా, తిరుగగా ఎప్పటికయినను ఈ భావము కలుగకపోదు. మనస్సుతో ప్రదక్షిణము చేయవలెను. వట్టి పాదములతో గాదు గదా. క్రమముగా ఇట్లు అనుదినము చేయుట వలన మనస్సున నిరంతరము విష్ణుడు వెలుగుచు, సన్నిధిని ప్రసరించును. ఇతరము ప్రవేశింపదు. ఒక్కొక్కసారి మనస్సు దుర్జనుల సహవాసము వలన ఎంతగా చెడునో, వారిపై కోపగించుకొనినను అట్లే యగును. కోపించినపుడు మనస్సున దేవుడుండవలసిన చోట శత్రువో, నిందించుటో, కోపమో, దుఃఖమో నిలుచును. విష్ణుని గాక దుర్జనుని గూర్చి యాలోచించినచో ఏమరుపాటు కలుగును. ఇది కలుగకుండ విష్ణుని యందే చిత్తము నిలుచుటకు ప్రదక్షిణ ముపయోగ పడును. అట్టివానికి సంసారమంటదు. ఒక్కొక్కసారి ఆలయమునకు వెళ్ళు అవకాశము దొరకదు. తానున్న చోటు, వెళ్ళిన చోటు - అంతయు దేవాలయమని పవిత్ర హృదయముతో భావించుటే ఆలయ ప్రదక్షిణమగును. అట్లని, కావలయునని ఆలయమును దర్శించి, ప్రదక్షిణ మాచరించుట మాన పనిలేదు. ఎడమ వైపున తానుండి, జీవుడు కుడివైపునకు తిరుగునప్పటికి విశ్వమునంతయు తిరిగి, విశ్వాలయుని చుట్టు తిరిగినట్లగును. అన్నమయ్య పాదములకు ఎన్నిమార్లు దేవాలయ ప్రదక్షిణ మాచరించుచు, దేవుని మార్గము నెంతగా అనుసరించినను తృప్తి కలుగ లేదు. విశాల విశ్వమానవతను ఆరోహించు దివ్యప్రేమమార్గమున అలుపు, అలసట ఎఱుగని బాటసారి అన్నమయ్య. ఈ బాటకు గమ్యము స్వామియే. బాటలో కలుగు తీయని రుచియు స్వామియే. ఈ ఆనందము నెంత అనుభవించినను తృప్తి కలుగునా? సిద్ధి నొందు వఱకు సాధన ఆనందదాయకము గావున ఆగదు. సిద్ధి కలిగిన తర్వాత ఆయానందము ఎట్లును వీడలేదు. ఆపైన కూడ సిద్ధి నిలుచుటకు సాధన సాగవలెను. సాధనలో - బ్రతుకుబాటలో - స్వామి ననుసరించు అడుగుల నడకలో ఇక చాలు ననుటకు అవకాశముండదు. ఇది గ్రహింపక కొందరు సాధకులు తమకొక స్థాయి చిక్కినది, లేదా సిద్ధి కల్గినది అనుకొని ఇక సాధనతో పనిలేదని భ్రమింతురు. ఆధ్యాత్మిక సాధనలో ఒక స్థాయి అనునది లేదు. ఏ క్షణము అంతర్యామియగు స్వామిని మఱచిన, ఆ క్షణమే జారిపడుట జరుగును. సిద్ధి కల్గిన పిదప సాధన ఆపలేదు. బ్రతుకంతయు మలినము తొలగుటకు స్నానము, ఆకలి తీరుటకు భోజనము తప్పవుగదా. అట్లే బ్రతుకంతయు సాధన కొనసాగింపవలెను. ఇక చాలు నను తృప్తి యుండదు. దేవాలయములోనికి ప్రవేశించి, స్వామికి తన ప్రవర అనగా గోత్ర ఋషులను, గోత్రమును, నామమును చెప్పుకొని నుదుటిని స్వామి పాదములపై నుంచుచు ఎనిమిది శరీరాంగములతో బోర్లపడి స్వామికి మ్రొక్కుట పరిపాటి. పెద్దలకు నమస్కరించునపుడు, పిల్లలు తమ గోత్రమును, గోత్ర ఋషులను, నామమును చెప్పుకొనుట సంప్రదాయము. గోత్ర ఋషులను స్మరించుట వలన ఆ ఋషుల

ఆశీస్సులు మనకు లభించును. దేవుని సన్నిధిని చేరుటకు వారు తమ వంతు తోడ్పాటు నందించెదరు. స్వామికి కూడ ఇట్లు ప్రవర చెప్పుకొని ఎనిమిది అవయవములతో బోర్లపడవలెను. ఛాతీ, తల, చూపులు, మనస్సు, వాక్కు, పాదములు, చేతులు, చెవులు – ఇవి ఎనిమిది అంగములు. ఆయా అవయవములతో చేయు పనులన్నియు స్వామికి సమర్పించుటకే ఈ సాష్టాంగ నమస్కారము ప్రతీక. నుదురు స్వామి పాదములపై దాకించి మ్రొక్కుట తన ఆజ్ఞాచక్రమును – భ్రూమధ్య స్థానమును స్వామికి దాకించుట. స్వామి యొక్క కృప జ్ఞానముగా, ఆనందముగా మన భ్రూమధ్యము గుండా మనలోనికి ప్రవేశించును. ఇట్లు ఎన్నిమార్లు చేసినను అన్నమయ్యకు తనివితీరలేదట. తన శరీర భాగములతో స్వామి నెంత సేవించినను, తనకు స్వామి దయ ఎంతగా లభించినను తనివితీరలేదు. స్వామి కరుణాకటాక్షముల యెడ మాత్రము లోభముండవలెనని అన్నమయ్య భావము. అన్నమయ్యకు వెడగు దనము కలిగినది. వెడగుదన మనగా అవివేకమనియు, నిశ్చేష్టత అనియు రెండర్థ ములు గలవు. కాని ఇచట అవివేకమను అర్థము పొసగదు. తన శరీర భాగము లన్నిటితో స్వామిని వివిధములుగ ఎన్నిమార్లు, ఎంతగా, విరామము లేకుండ సేవ చేసికొనగా తృప్తి కలుగకపోగా ఆనందానుభూతి మిక్కుటమయినది. అనగా స్వామి సేవలో ఆనందానుభూతి ఇంకను కావలయునని ఆరాట మితనికి కల్గినది. ఇదియే ఇతని అసంతృప్తి. కాని మిక్కుటమయిన ఆనందానుభూతిలో మునిగి అన్నమయ్య చేష్టలు తప్పెను. పారవశ్యమున ఇంక ఏమియు చేయలేకపోయెను. కాని స్వామి సేవలో ఆనందమున్నది గనుక సేవ చేయకుండ ఉండలేని స్థితియు కలిగెను. ఇట్లు స్వామి సేవ చేయలేడు. సేవ చేయకుండ ఉండలేడు. మొదటిది ఆనందానుభూతి మిక్కుటమగుట వలన. రెండవది ఈ స్థితి కొనసాగుటకు. ఉదాహరణకు అన్నమయ్య వంటి మహాభక్తుడు భగవంతుని సంకీర్తన చేయుచు ఆనందానుభూతిలో పరవశించి, చేష్టలాగి, ఇక మనస్సు, వాక్కు సంకీర్తనము చేయలేని స్థితిలో పడెను. కాని ఈ అనుభూతి కొనసాగుటకై మఱల సంకీర్తనము కొనసాగింపక తప్పదు. ఒకసారి కృష్ణుని తలచి తలచిన రాధ యెదలో కృష్ణుడు నిండెను. కృష్ణుడనగా దివ్యానందమే గదా. రాధా హృదయము ఈ యనుభూతి రసప్రవాహమున మునిగి, కృష్ణుని వేరుగా తలచలేకపోయెను. ఒకసారి నారదునకు నారాయణుని అనుభూతి నిండి తాను వేరుగా లేడు. ఈ యనుభూతి స్థితి శాశ్వతమగుచో బాగుండు నన్పించి వేరై మఱల స్వామిని సంకీర్తన చేయుట కొనసాగించెను. భగవదానందపారవశ్యమున మునిగినను, మఱల వేరై భగవంతుని సేవింపవలెనని అన్నమయ్యకు అన్పించినది. మఱల ఇదే వరుస మఱల మఱల కొనసాగెను. ఇట్లగుటకు వర్ణనమున కతీతమగు స్వామి లోపమో, వర్ణించి సేవించినను తృప్తి కలుగకుండుట అన్నమయ్య లోపమో! యశోదాదేవి బాలకృష్ణుని త్రాటితో కట్ట యత్నించినను, ఎంతసేపటికిని కట్టలేక పోయెను. కారణము, త్రాడు పొట్టిది అగుచున్నది. త్రాడు కృష్ణుని రూపమే గదా. కృష్ణుడను వెలుగుతో చేయబడినదే గదా. తాను కూడ అంతియే గదా. ఇక కృష్ణుని త్రాటితో ఎట్లు కట్టగలదు? త్రాటినే కృష్ణుని రూపమున ధ్యానింపగా కృష్ణుడు తానుగా కట్టువడెను. అన్నమయ్య మనస్సు, వాక్కులు, శరీర భాగములు స్వామి యను వెలుగుతో తయారుచేయబడినవి. అవి ఇంక ఎట్లు స్వామిని సంపూర్ణముగా సేవించి తనియగలవు?

3వ చరణము యొక్క తాత్పర్యము

"ఉత్సాహముతో నిన్ను నేను పూజించినను నా చేతులు తృప్తి పొందుటలేదు. సొగసుగా నీయందు తీయని ఆకర్షణ పొంది చిత్తము ఎంత తలచినను, తృప్తి పొందుటలేదు. మనోహరముగ శ్రీవేంకటపతీ! నన్ను హృదయముతో గలిపి మోహింప జేసితివిగదా. చక్కగా ఇవి యన్నియు తీరెను. ఇంతకు ముందు నీ లోపమో, నా లోపమో!"

వ్యాఖ్య

నీ పూజ చేయవలెనని ఎంతో ఉత్సాహముతో చేసినను, నా చేతులకు తృప్తి కలుగుటలేదని అన్నమయ్య ప్రకటించుచున్నాడు. సాధారణముగా మానవులకు ఒక మంచిపని మొదలుపెట్టునపుడున్న ఉత్సాహము చివరి వరకు కొనసాగదు. కాని అన్నమయ్యకు స్వామి పూజలో ఉత్సాహము తరుగలేదు. దీనినే శ్రద్ధ యందురు. స్వామి నర్చించు చేతులే చేతులు, హరి పూజ చేయని చేయి చెట్టుకొమ్మతో చేయబడు తెడ్డు మాత్రమే. ఇచ్చట శరీరమున సేవ చేయుటకు మనకీయబడిన చేతులను స్వామి పూజకై వినియోగపెట్టవలెనని అన్నమయ్య ఉపదేశము. స్వామి యనగా సర్వాంతర్యామి. కావున కుటుంబ సభ్యులకు, సమాజములో ఎవరికి ఏమి చేసినను అది స్వామి పూజయే యగును. నారదుడిట్లు చెప్పెను. "భక్తికి ముఖ్య సాధన భగవంతునకు తాను చేయు పనులన్నిటిని సమర్పణనొందుట." తోటివారికి వలసినవి తన ద్వారమున జరుగునంత మేర చేయుట వారి రూపములలోని స్వామికి పూజయే. కర్తవ్య పాలనమే అర్చనమని స్వామి వివేకానందులు ఉద్బోధించిరి. కర్మయోగ రహస్య మిదియే. చేయవలసిన కర్మను దేవుని పూజగా చేయుడని లోకమాన్య తిలక్ తన 'గీతారహస్యమను గ్రంథము'న బోధించెను. దానికే కర్మయోగశాస్త్రమని నామకరణము గావించెను. వేయి సంవత్సరములుగా భారతీయులు వేదాంతము పేర ఒకరికొకరు సేవాకార్యమును దేవుని పూజగా చేయకుండుట వలన, దేవుని పూజించుట యనగా అర్చామూర్తిని పూజించుటయేయని దానిని పరిమితము చేయుట వలన, దేశము, సమాజము నెడల కర్తవ్యములను నిర్లక్ష్యము చేయుట వలన భారతదేశము పరదేశీయులకు వశమై, బానిసత్వమున మ్రగ్గినది. మఱల అట్టి స్థితి రాకుండ ఉండుటకై అంతర్యామి పూజను సాగింపవలయును. సమాజ సేవనే భగవత్ పూజగా చేయవలెను. దృక్పథము ఇట్లు శుభముగా వికాసము నొందవలయును. ఇట్టి పూజలో అన్నమయ్య చేతులకు తృప్తి కలుగలేదు. మానవ సేవకు ప్రతిఫలము మధురానందమే. ఆకలిగొన్న వానికి అన్నము పెట్టుట వలన అతనికి కలుగు తృప్తిని దర్శించి తాను పొందు తృప్తియే అసలయిన ప్రతిఫలము. ఏలనన ఈ తృప్తిలో తృప్తి ఎప్పటికి నిండదు. భగవంతునియందు సాగరము నందు నది వలె ఆకర్షణ పొందినది అన్నమయ్య చిత్తము. చిత్తమనగా ఇంద్రియముల గుండా వర్తించు మనస్సు. సింగారమనగా మధురమైన ఆకర్షణ. సాధ్వి యగు భార్య భర్తయందు వలె అన్నమయ్య చిత్తము స్వామియందు ఇట్టి ఆకర్షణను పొందినది. ఈ ఆకర్షణ చాల సొగసైనది. పై చరణములందు తెలుపపడిన పనులన్నియు ఈ యాకర్షణ పొందిన చిత్త మాధారముగ జరుగుచున్నవి. కాని ఈ ఆకర్షణ యొక్క తీయదనమునకు అంతులేదు గావున చిత్తము తనియదు.

తీయదనమను సాగరమునకు అతిశయము కల్గినదని, నేను ఎల్లరికిని కావలయును గదా యని స్వామి దాని అతిశయమును తొలగించెనట. లీలాశుకుడను భక్తుడు పైవిధముగా స్వామిని నుతించెను. స్వామి తీయదనమునకు మూలమయిన తీయదనము. ఎంతటి తీయదనము కన్నను తీయదనము. అట్టి స్వామిని ఎంత స్మరించినను తృప్తి కలుగునా? దినచర్యలో పనులు చేయుచును, బ్రతుకంతయు ఈ స్మరణ సాగవలెను. అన్నమయ్య చిత్తమునకు స్వామి స్మరణములో తృప్తి కలుగలేదు. స్వామియొక్క తీయని ఆకర్షణ అంతగా అతనిని లోగొన్నది. స్వామి తీయదనము గావున, ఆయనను గూర్చిన తలంపులెల్ల తీయనివే. భక్తులను గూర్చి, మంచివారిని గూర్చిన తలంపులు గూడ స్వామిని గూర్చి తలంపులే. సంతోషముతో శ్రీవేంకటేశ్వరుడు అన్నమయ్య హృదయమును, అన్నమయ్యను మోహింపజేసి లోగొనెను. ఇచట అన్నమయ్య 'నన్ను' అను పదమును వాడెను. 'నన్ను' అనగా అన్నమయ్య యొక్క జీవప్రజ్ఞను. ఈ మోహమున బడియే పైన చెప్పబడిన పనులు అతడాచరించెను. స్వామి జగన్మోహను డను పల్లవి పదమును ఇచట కూర్చుకొనవలయును. అయితే ఈ చరణము చివరి పాదమున అన్నమయ్య పైన పేర్కొనబడిన అన్నివిధములయిన తృప్తులను చక్కగా, నిండుగా తీరెనని స్వామితో నివేదించుచున్నాడు. ఇది చరమ దశ. ఈ పరమావధి అయిన స్థితిలో అన్నమయ్య యొక్క చిత్తము, ఇంద్రియాదులు పరమాత్మ యందు కరగిపోయి తృప్తి పూర్ణమయినది. ఇంతకు పూర్వము తృప్తి కలుగలేదు. "మఱి యిది నీ లోపమా, నా లోపమా" అని అన్నమయ్య స్వామిని ప్రశ్నించుచున్నాడు. పల్లవిలోను, చివరి చరణములోను నీ లోపమా, నా లోపమా అనిన ఈ భక్తుడు మొదటి రెండు చరణములందున వరుస తలక్రిందులు చేసి నా లోపమా, నీ లోపమా అని స్వామిని ప్రశ్నించెను. తృప్తి కలుగకుండుటకు నా లోపమే మొదటి కారణమని మొదటి రెండు చరణములందు వెల్లడించెను. చివరి చరణమునందున, దానితో కూర్చుకొనవలసిన పల్లవిలో అసంతృప్తికి మొదటి కారణము స్వామి లోపమే అని పలుకుచున్నాడు. అనగా తానెంతగా తృప్తినొంద యత్నించినను, నీ మహిమ దాని కతీతముగా నుండి, అదియే నీ లోపమయినదని అన్నమయ్య భావము. మొత్తముమీద శరీరముతోను, వాక్కుతోను, మనస్సుతోను, ఇంద్రియములతోను, బుద్ధితోను, హృదయముతోను చేయబడు పనులు స్వామికి సమర్పితము గావింపవలెనని అన్నమయ్య ఉపదేశము.

* * *

24

2వ సం-385 **తందనాన ఆహి** బౌళి

తందనాన ఆహి తందనాన పురే తందనాన భళా తందనాన
బ్రహ్మమొకటే పరబ్రహ్మమొకటే పరబ్రహ్మమొకటే పరబ్రహ్మమొకటే ॥ పల్లవి॥

కందువగు హీనాధికము లిందు లేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతు కుల మింతా నొకటే
అందరికి శ్రీహరే అంతరాత్మ. ॥ తందనాన ॥

నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటు నిద్ర అదియు నొకటే
మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి యొకటే
చండాలుడుండేటి సరిభూమి యొకటే. ॥ తందనాన ॥

అనుగు దేవతలకును అల కామసుఖ మొకటే
ఘనకీట పశువులకు కామసుఖ మొకటే
దిన మహోరాత్రములు తెగి ధనాఢ్యున కొకటే
ఒనర నిరుపేదకును ఒక్కటే అవియు. ॥ తందనాన ॥

కొఱలి శిష్టాన్నములు కొను నాక లొకటే
తిరుగు దుష్టాన్నములు తిను నాక లొకటే
పరగ దుర్గంధములపై వాయు వొకటే
వరుస పరిమళముపై వాయు వొకటే. ॥ తందనాన ॥

కడగి యేనుగుమీద కాయు ఎండొకటే
పుడమి శునకము మీద పొలయు నెండొకటే
కడు పుణ్యులను పాపకర్ములను సరిగావ
జడియు శ్రీవేంకటేశ్వరు నామ మొకటే. ॥ తందనాన ॥

ఒరుల బాధల యెడల నీవు స్పందించు కన్నీటితో తడుపబడిన హృదయక్షేత్రముననే జ్ఞానపుష్పము వికసించి కైవల్యమందును.

టీక

తందనాన = 'తాన' అను మాటకు ముందు చేయుచుండు రాగాలాపము, జానపద గానము, కందువగు = మనచే పాటింపబడుచున్న మార్గమునకు చెందిన, జంతు కులము = పుట్టుక గలవారి గుంపు (జీవుల సమూహము), అండనే = ఆధార స్థలమున, మెట్టు = అడుగుపెట్టు, ఒనర= పొసగగా, కొఱలి = పొంది, పరగ = ప్రసరింపగా, కడగి = పూని, పొలయన్= ప్రసరించునట్టి, జడియు = ఆగకుండ మ్రోయునట్టి.

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య పరబ్రహ్మ మొకటే యని సామాన్య జనులలోనికి జొచ్చి పలుమార్లు నినదించుచున్నాడు. వారి నాకర్షించునట్లుగా పల్లవిలో జానపద మగు రీతి నెన్నుకొనుట జరిగినది. ఇది వేదోపనిషత్తుల సారము. అంతమాత్రము చేత ఆ యా గ్రంథములందలి సిద్ధాంతమును తన మేధతో ఆకళింపుజేసికొని అన్నమయ్య చేసిన రచన గాదిది. అనేక జన్మ సాధనా సంస్కారము వలనను, భగవదనుగ్రహము వలనను తనకు గలిగిన అనుభవమును అన్నమయ్య గానము చేయుచున్నాడు. ఈతని యనుభవము వేదర్షుల అనుభవమునకు సరిపోవుచున్నది. అంతమాత్రము చేత వారి భావములకు నకలుగాదీ సంకీర్తనము. ఇతనికే గలిగిన మొదటి అనుభవము గాదిది. పూర్వ ఋషులకు, భాగవతోత్తములకు కలిగినదే. కాని ఇదే అనుభవము ఇతడు కూడ ఋషి యగుట వలన కలిగినది. ఎప్పటికప్పుడు ఎవరికి వారికి ఇది క్రొత్తది. కావున నవము కాదు, నవ్యము. అన్నమయ్య సృష్టి యంతటను ఒకే పరబ్రహ్మముగా ననుభూతి నొందెను. ఇది అఖండానందసాగరము. ఆకాశము వలె నిర్మలమైన వానికే ఇట్టి దర్శనానుభూతి సిద్ధించును. తనకు కలిగిన దానిని పదిమందికి పంచిపెట్ట నెంచుట ఇతని కరుణకు నిదర్శనము. పరబ్రహ్మానుభూతిని పామరు లనబడు పల్లెజనులకు పంచిపెట్టుటకు సంకీర్తనము, అందును జానపద పద్ధతి మిక్కిలి శ్రేష్ఠమయిన దారి. అన్నమయ్య దీని నెంచుకొనెను. ప్రజలలో ఇంతకు పూర్వమే వాడుకలోనున్న ఫణితిని ఇతడు గైకొనెను. ఈ సంకీర్తనమును సమష్టిగా గానము చేయించుచు ఆనందతాండవమాడించెను. పల్లవిలో చెప్పబడిన పరబ్రహ్మ మొకటే యను అంశము, చరణములలో తెలుపబడిన వాస్తవములకు హేతువు. పల్లవి కారణమును, చరణములు కార్యములను తెలుపుచున్నవి. తన కాలపు సాంఘిక స్థితి అను ప్రవాహమునకు అన్నమయ్య ఎదురీదిన ధీరుడు. ఇతని సందేశము సమకాలికము మాత్రమే గాక, సార్వకాలికము. అందరిలో అంతరాత్మ ఒక్కడే యను ఉపనిషత్తులలోని ఋషుల దర్శనమును అన్నమయ్య జనులకు తేలికగా తెలియు నిదర్శనములతో ఈ సంకీర్తనముతో నిరూపించెను.

మానవులలో ప్రముఖముగా రెండు రకముల వారున్నారు. మొదటి తరగతి వారు మిగిలిన వారికన్న తాము ఎట్లు ప్రత్యేకత కలిగియున్నామోయని తలంచువారు. వీరు ప్రేమలేని వట్టి తెలివి గలవారు. వీరు

కోరునది గొప్పతనము. మిగిలినవారి ఆవేదనలు, వారికి కావలసినవి వీరికి పట్టవు. వీరి అహంభావమే వీరికి ముఖ్యము. కావున అశాంతికి లోనగుదురు. ఇక రెండవ తరగతి వారు, మిగిలిన వారితో తమకు గల సామ్యమును దర్శించి, ఆచరణలో దానిని పాటించి, దాని తీయదనము ననుభవించెదరు. వీరికి వలసినది మంచితనము. మిగిలినవారి ఆవేదనలు, వారికి కావలసినవి ఇట్టి మంచివారికి తమవియే. వీరు ఎల్లరిలోను ఒకేవిధముగ నున్న అంశములను గమనించెదరు. ప్రకృతిని జయించుచున్నామని విఱ్ఱవీగువారు గొప్పవారు. ప్రకృతిని పరిశీలించి దానియందు గల సమదృష్టిని తాము అలవరించు కొని హాయిగా జీవించు నేర్పు గలవారు మంచివారు. వీరు తాము శాంతిగా నుండుటయే గాక, సంఘమునకు శ్రేయస్సును, శాంతిని కల్పింప యత్నించెదరు. మొదటి తరగతి వారెక్కువ సంఖ్యలో నున్నచో ప్రస్తుత మానవ సంఘములో వలె వివిధ రంగములలో పోటీ, అశాంతి ఏర్పడును. రెండవ తరగతి వారెక్కువ సంఖ్యలో నున్నచో పరస్పర ప్రేమ, శాంతి నెలకొనును. అన్నమయ్య రెండవ తరగతి మానవు లను సంకీర్తన మార్గమున తయారుచేసెను. అన్నమయ్య ఇట్టివారిని తయారు చేయు వెలుగుదారిని ఈ సంకీర్తనమున ప్రకాశింపజేసెను. జీవులెల్లరికి సమముగా నున్న నిద్ర, నేల, కామసుఖము, రాత్రింబవళ్లు, ఆకలి, గాలి, ఎండలను, ఎల్లరను కాపాడు హరినామమును చరణములందు ప్రస్తావించెను. మొదటి చరణమున పల్లవిని వివరించుచు 'ఆత్మ' ఎల్లరిలో ఒకటేయని ప్రబోధించెను. మిగిలిన చరణములు పల్లవికి, మొదటి చరణమునకు భాష్యములు. ఈ సంకీర్తనము నాస్వాదించువాడు విశ్వమానవుడగును. వీరితోడి భువి దివి యగును. విశ్వజీవ సోదరత్వము 'ఆత్మ' యొక్క ఏకత్వమాధారముగా నెలకొనును. రాజకీయ సిద్ధాంతములపై గాని, ఆర్థిక సిద్ధాంతములపై గాని విశ్వమానవ సోదరత్వ మేర్పడదు. ఇది చారిత్రక వాస్తవము గూడ. ఒకనికి ఆకలి వేసినపుడు, వేరొకనికి దయ ఏల కలుగుచున్నది? ఇర్వురికి 'ఆత్మ' యొక్కటే గావున. ఇర్వురును 'ఒకే నేను' యొక్క ప్రతిరూపములు గావున. తల్లిదండ్రులకు సంతతిపై ప్రేమ యుండుట రక్తసంబంధము వలన అని తర్కింప వచ్చును గాని ఎల్లరిపైన ప్రేమ ఆత్మీయముగా పెరుగుటకుగాను సోపానముగానే దేవుడు తల్లిదండ్రులు, సంతతి అను సంబంధమును కల్పించెను. ఇట్లు ఆత్మీయ సోదరత్వము ప్రాతిపదికగా వసుధైక కుటుంబ మేర్పడుటయే అన్నమయ్య యొక్క మహోదారమయిన ఆశయము. దానికై కృషి చేయుటలో భాగములే ఆతని జీవితము, సంకీర్తనలు. ఇతని యాశయము ఐదు వందల ఏండ్లలో పూర్తిగా నెరవేరితీరును. పరస్పర స్పర్ధలతో, అశాంతితో కాగిపోవుచున్న ఆధునిక నరజాతికి అన్నమయ్య యొక్క ఈ సంకీర్తన మొక జడివాన. శాంతికై దప్పిగొన్న నరుల కిది సుధానదీ ప్రవాహము. ఈ సంకీర్తన మొక్కటియే ఒక ఉపనిషత్తు. ఒక గీత. ఇది అన్నమయ్య 'ప్రవక్త' యనుటకు నిదర్శనము. సమకాలీన సమస్యలకే కాక, ఏకాలమునాటి సమస్యలకయినను ఇది పరిష్కారము. సమస్యలు మానవుడు కల్పించుకొన్నవి. పరిష్కారములు ప్రవక్తలు, అవతారమూర్తుల చేతులలో, చేతలలో నున్నవి. అన్నమయ్య ఇట్టివారిలో నొకడు. ఇతడొక దేవదూత. మానవులకు తన యుపదేశముల నొసంగుటకై దేవుడు ఇతనిని

వాహికగా సృజించెను. కావుననే ఇతడు 'స్వామి యొక్క అంశ' అనుట సహజోక్తియే గాని, అతిశయోక్తి గాదు. సమాజమున గల భేదములను ఛేదించు స్వామి యొక్క ఖడ్గ మతడు. అయితే ఈ ఖడ్గము నందకము. ఆనందమును గూర్చునది.

పల్లవి యొక్క తాత్పర్యము

"బ్రహ్మమొకటే పరబ్రహ్మ మొకటే."

వ్యాఖ్య

పల్లవిలోన మొదటి పాదము "తందనాన, ఆహి, పురే, భళా" అను పదములతో గూడియున్నది. ఇవి జానపద ఫణితికి చెందినవి. పూర్వకాలమున 'తాన' అను పదమునకు ముందు 'తందనాన' అని రాగము నాలపించుటకు వాడెడివారు. అన్నమయ్య ఈ పదమును గైకొనెను. ఉత్సాహముతో జానపదులు నృత్యసహిత గానము చేయుటకీ పదములు ఉపయుక్తములు. అన్నమయ్య ఈ పదములతో పల్లవిని గూర్చి సామాన్య గ్రామ జనుల నడుమ చిందులు వేయించెను. సంకీర్తనము లోని భావములా మహోదాత్తములు. వీనిని జానపదుల గుండెలలోనికి సూటిగా చొచ్చుకొనిపోవుటకై ఆతడు వారి పదములనే ఎంచుకొనెను. ఇది వారిపై ఈతనికి గల తాదాత్మ్యమునకు తార్కాణము. బ్రహ్మ మనగా వ్యాపించునది. తాను విత్తనమై, సృష్టి అను చెట్టుగా విస్తరించునది యని యర్థము. ఇట్టివాడు స్వామియే. కాని బ్రహ్మమను పదము సంస్కృత భాషలో నపుంసక లింగమునకు చెందినది. దేవుడు ఎల్లరిలోని 'నేను' అనబడు ఆత్మ గావున స్త్రీయు గాదు, మగవాడును గాదు కావున నపుంసక లింగ శబ్దమగు 'బ్రహ్మము'ను వేదర్షులును, వారి బాటనే అన్నమయ్యయు స్వీకరించెను. లేకున్నచో 'దేవుడు' అను పదమునే ప్రయోగించెడివాడు. పరబ్రహ్మ మన్నను ఇదియే భావము. 'పర' అనగా సర్వశ్రేష్ఠమని యర్థము. సాలెపురుగు నోటి నుండి గూడు గట్టుకొన్నట్లు బ్రహ్మము నుండి సృష్టి అల్లుకొనినది. కాని సమస్త సృష్టి కన్న బ్రహ్మము గొప్పదై పరబ్రహ్మ మనబడుచున్నది. నగలెన్ని యున్నను, బంగార మొకటే కదా. అట్లే దేవ దానవ మానవాది జీవులెంద రున్నను ఇందరికి 'నేను' ఒకటే. పరబ్రహ్మ మొకటే. నగలకన్న బంగారము ఉత్తమము. కారణము నగలు బంగారము యొక్క రూపాంతరములు. బంగారమే మూలతత్త్వము. అట్లే పరబ్రహ్మమే సర్వోత్తమము. స్వామికి ఇతరము లేదు గావున, ఇతనికన్న శ్రేష్ఠుడును లేడని గీత చెప్పుచున్నది. పూలు, దారములో వలె బ్రహ్మమునందు ఎల్లరు గ్రుచ్చబడియున్నారు. ఉత్తర ధ్రువప్రాంత సముద్రపు నీరు వేలకొలది మంచుగడ్డలుగా నేర్పడుచుండును. ఇవి నీటి యొక్క స్థితి మార్పులే. వీనికన్న సముద్రపు నీరు శ్రేష్ఠము. శరీరముకన్న జీవుడు, జీవునికన్న ఎల్లరిలో 'నేను'గా నున్న పరమాత్మ శ్రేష్ఠుడు. ఇతనినే లింగ వివక్ష కతీతమయిన 'పరబ్రహ్మము' గా వేదములు పేర్కొన్నవి. నగల రూపమును బట్టి, పరిమాణమును బట్టి తేడాలుండవచ్చును. కాని బంగార మొకటియే కావున, ఈ తేడాలన్నియు సత్యము వలె భాసించునే గాని సత్యములు గానేరవు. సత్యము

పరబ్రహ్మమే. పరబ్రహ్మము గాక వేరొకటి లేదు గావున అన్నమయ్య ఇది 'యొకటే' అని కీర్తించెను. భిన్నత్వము భ్రాంతి. ఏకత్వము సత్యము.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"ఒకడు అల్పుడు, వేరొకడు అధికుడు అను భేదభావములను మనము పాటించు చున్నాము. కాని ఈ భేదములు ఇచ్చట అనగా ఈ లోకములో సత్యమైనవిగా లేవు. కారణమేమి? అందరికిని శ్రీహరియే లోని ఆత్మ. ఈ లోకమున జీవుల సమూహ మంతయు నొకటే. అందరికి శ్రీహరియే అంతరాత్మ."

వ్యాఖ్య

శరీరము, మేధ, బలము, ధనము, అధికార స్థాయిని బట్టి జీవులలో ఎక్కువ తక్కువలను పాటించుచున్నాము. కాని ఈ తేడాలు ఈ లోకమున సత్యములు గావు. మనలో 'నేను' అనబడు వెలుగొకటి, 'నావి' యనబడునవి కొన్ని గలవు. 'నేను' చుట్టు 'నావి' అల్లబడినవి. నీటి యొక్క స్థితి మార్పులే మంచుగడ్డలు. అట్లే 'నేను' యొక్క స్థితి మార్పులే 'నావి' యనబడు బుద్ధి, మనస్సు, ఇంద్రియములు, ప్రాణము, శరీరము మున్నగునవి. వీనిలోని ఆత్మ శ్రీహరియే. సృష్టి కతీతమయిన నారాయణుడే (పరబ్రహ్మమే) సృష్టిలో అంతర్యామి యగు శ్రీహరిగా దిగివచ్చెను. 'శ్రీ' అనగా హరి యొక్క ప్రేమ లేదా శోభ. మట్టియే కుండలుగ మార్పుచెంది, కుండలలోని మట్టిగ నెలకొనియున్నది. అట్లే ఒకే పరబ్రహ్మము సమస్త జీవులుగా దిగివచ్చి వారిలో 'ఆత్మ' గా అనగా 'నేను' గా నెలకొనియున్నది. జీవులెందరున్నను అంతరాత్మ శ్రీహరియే. ప్రతివాడును తనను గూర్చి తాను 'నేను' అనియే పేర్కొనును. ఇందరు 'నేను'లు లేరు. ఉన్నది ఒక్కడే అయిన 'నేను'. అతడే శ్రీహరి. 'శ్రీహరి' అను పదము ఒక వ్యక్తిని సూచించునది గాదు. కావున అన్నమయ్య 'శ్రీహరి మతమని' స్థాపింపలేదు. ఇందు మత ప్రసక్తి లేదు. శ్రీహరి యనగా ప్రేమతో ఎల్లరిలోన శ్వాసను నడుపుచున్న ఆత్మ యనియే అర్థము. అల్పులు, అధికులు అను భేదభావమును పాటించుట యనగా ఒకే ఆత్మయందు ముక్కలను వేరువేరుగా గమనించుట. ఇది అసత్య దృష్టి. సంకుచిత దృష్టి. కెరటములను గమనింపక, అఖండ సాగరమును దర్శింపవలెను. ఇదియే సత్యదర్శనము. అన్నమయ్య మనకు దీనిని ప్రసాదించుచున్నాడు. ముందుగా తాననుభవించెను. జంతువు లనగా పశువులనియే గాదు. 'జ' అనగా పుట్టుట. పుట్టుక శరీరములకే యున్నది. ఆత్మకు లేదు. ఆత్మ, చైతన్య ప్రవాహము. ప్రేమరసప్రవాహము. ఆనందప్రవాహము. శ్రీహరియే ఇది. కులమనగా ఇచట గుంపు అని యర్థము. కావున పుట్టుక గలవి శరీరముల గుంపు. విష్ణువే ఎల్ల శరీరములను తాల్చుచున్నాడు. ఆతడే శరీరములు గల జీవుల కెల్ల అంతరాత్మ. మంచుగడ్డలన్నిటి మూలతత్త్వము నీరే కదా. అట్లే జీవుల మూలతత్త్వము శ్రీహరియే. అంతరాత్మ యనగా లోపలి మూలమయిన 'నేను' అనబడు వెలుగు. నేను, నీవు, అతడు అను భేదములు అసత్యములు. ఉన్నది అఖండమయిన 'నేను' ఒక్కటియే. అదియే అంతరాత్మ యగు శ్రీహరి. శ్రీహరిని ఇట్లు దర్శించు

వారికి జీవులెల్లరు ఒకటిగనే కానుపించెదరు. వారికి భేదదృష్టి యుండదు. ఏకత్వ దృష్టియే యుండును. దీనినే యోగమందురు. ఇదియే అన్నమయ్య యొక్క స్వీయానుభవము, ప్రబోధము.

2వ చరణము యొక్క తాత్పర్యము

"నిండుగా పాలకుడు నిద్రించు నిద్రయు, బంటు ఒక ప్రదేశము నాధారముగ జేసికొని నిద్రించు నిద్రయు నొకటే. ఉత్తమ బ్రాహ్మణుడు అడుగుపెట్టు భూమియు, చండాలుడుండునట్టిది, అతనికి పొసగునది అగు భూమియు నొకటే."

వ్యాఖ్య

పల్లవిలోను, మొదటి చరణములోను తెలుపబడిన సూత్రమును చక్కగా, తేలికగా నిరూపించునట్లు అన్నమయ్య మిగిలిన చరణములను రచించెను. ఈతని చరణములు వేదసూక్తములకు సజీవ భాష్యములు. నిద్ర ఎల్లరి కొకటియే. మనస్సు యొక్క స్వభావములలో భేదములున్నను, నిద్రించునపుడు ఎవరికిని మనసు పనిచేయదు. పాలకుడు లేదా అధికారి హంసతూలికాశయ్యపైననో, ఆధునిక సౌకర్యములు కూర్చబడిన శయ్యపైననో పరుండవచ్చును. హాయిగా నిద్రించితినని నిద్ర నుండి లేచిన పిమ్మట నలువురికి చెప్పవచ్చును. బంటు, తనకు లభించిన ఏదియో ఒక ప్రదేశమున నిద్రింపవచ్చును. కొందరు ఊళ్లపై, గడ్డిపైనను నిద్రింపవచ్చును. కాని వీరుగూడ హాయిగనే నిద్రింతురు. 'హాయి' అనునది నిద్రకు సంబంధించినదే గాని నిద్రించు శయ్యకు సంబంధించునది గాదు. నిద్ర ఎప్పుడు పట్టినది కచ్చితమైన సమయమును ఎవరును, ఏ శాస్త్రవేత్త గూడ నిశ్చయింపజాలడు. నిశ్చయించు మనస్సు నిద్రలో నుండదు గదా. రాజు, బంటు అను భేదములను గమనించు మనస్సు ఆగి పోయిన స్థితియే నిద్ర గావున ఇది ఎల్లరి కొకటియే. 'మెండైన' అను విశేషణము ఇచట బ్రాహ్మణత్వమునకు చెందినది గాదు. 'మెండైన' అను విశేషణము బ్రాహ్మణునకు చెందినది. అనగా బ్రాహ్మణజన్మ నెత్తినంతమాత్రమున ఉత్తముడు గానేరడు. ప్రతి బ్రాహ్మణుడును ఉత్తముడు గాడు. పండితుడయిన వాడు నింతియే. అన్నిటికన్న తేలికయినది తానాచరింపకుండ, ఇతరులకు చెప్పుట. తాను మంచిని నేర్చి, ఆచరించి, బోధించుట బ్రాహ్మణ ధర్మము. ప్రస్తుతము మానవులలో తాను నేర్చుట తగ్గిపోయెను. ఇక ఆచరించుటలో తగ్గుదల తప్పదు గదా. ఇట్టివాడు ప్రబోధ మేమి చేయగల వాడగును? ఒకవేళ ఎంతయో నేర్చినను, ఆచరింపక, బోధించినచో, ఆ బోధల ప్రభావము సమాజముపై ఏమాత్రము నుండదు. అన్నమయ్య ఆచరించి, అనుభవించి, ఉపదేశించి తనవంటి వారిని తయారుచేసెను. 'మెండైన' బ్రాహ్మణు డనుటలో అన్నమయ్య ఉత్తముడయిన బ్రాహ్మణునే ప్రస్తావించుచున్నాడు. చండాలు డనగా నీచజాతిలో పుట్టినవా డనబడువాడు. వీరిర్వురును తమ అడుగులు మోపు నేల యొకటియే. ఎవరయినను ఈ నేలపై నడువవలసినదే. ఎవరి దేహమయినను ఈ నేలలోనికి ప్రవేశింపవలసినదే. ఉత్తమ బ్రాహ్మణుని తల్లియు, చండాలుని తల్లియు నది యొద్దున తమ పిల్లలను

విడిచివెళ్ళగా, వీరిర్వురిలో ఎవడు బ్రాహ్మణుడు, ఎవడు చండాలుడని నిర్ణయింపగలము? మతముల విషయము నింతియే. ఇక ఉప్పెనలో ఇర్వురు కొట్టుకొనిపోయినపుడు గాని, శ్మశానమున శరీరములు దహింప బడిన తర్వాత గాని ఉత్తమ బ్రాహ్మణ, చండాల భేదములు ఎఱుకకు రావుగదా. విద్యా వినయములు గల బ్రాహ్మణుని యందును, గోవు యందును, ఏనుగు నందును, కుక్క యందును, కుక్క మాంసమును తిని బ్రతుకువాని యందును సమముగా 'ఆత్మ'ను దర్శించువాడే పండితుడని గీతలో శ్రీకృష్ణుడు ఘోషించెను. అన్నమయ్య కృష్ణుని వెలుగుచే ఆవరింపబడిన తేజము గలవాడు. పైన పేర్కొనబడిన వారిలో భేదములు గమనించువాని దృష్టిలో నున్నవే గాని, వారిలో లేవు. వారుగా నున్నది శ్రీహరి యొక్కడే. మన కిష్టులయిన వారు కనిపించినపుడు వారియందు దేవుడు కన్పించుటలో విడ్డూరము లేదు. ఇష్టులు గానివారి యందును, ఇష్టములేని విషయము లందును దేవుడే కాన్పింపవలెను. అట్లుగాకున్నచో దేవుని బదులు రాగద్వేషములనే ఆరాధించు దుర్గతి పట్టును గదా. నాస్తికులలోను, దేవుని అస్తిత్వమును దర్శించువాడే నిజమైన ఆస్తికుడు. నాస్తికులను గూడ దేవుడు కరుణించుచు గాలి, నీరు, ఆహారములు ప్రసాదించుచున్నాడు గదా. దేవునికి లేని భేదభావము మనకేల? దేవుడు లేడను వారిలోను దేవుడున్నాడు. దేవుడు లేడనగలరు గాని, ప్రేమను, మానవతను కాదన లేరు గదా! అదియే దైవము. భేదదృష్టి యను దుర్గతిని దాటి, సర్వమున ఆత్మయగు శ్రీహరిని దర్శించుటే జ్ఞానమని భాగవతమున ప్రహ్లాదుడు ప్రబోధించెను. ఇదియే అన్నమయ్య దర్శనము, ప్రబోధము.

3వ చరణము యొక్క తాత్పర్యము

"ప్రియులగు దేవతలకును, గొప్ప పురుగులకును, పశువులకును కామసుఖ మొకటే. ఒక్కొక్క దినము పగలుగా, రాత్రిగా విభజింపబడును. ఈ రెండును, వాని సంధులును ధనవంతునకును, నిరుపేదకును పొసగునట్లుగా ఒకటే."

వ్యాఖ్య

ఆహార నిద్రా భయ మైథునములు పశువులకును, మనుష్యులకును సమానమని పెద్దల వాక్కు. పై చరణమున నిద్రను, నేలను ప్రస్తావించిన అన్నమయ్య ఈ చరణమున కామసుఖమును, కాల విభాగములను ఎల్లర కొకటియని ప్రస్తావించుచున్నాడు. కామసుఖము హేయమే అయినను, ధర్మమునకు విరుద్ధము కానపుడు అదియు తన వైభవమే యని శ్రీకృష్ణుడు గీతలో చెప్పెను. కామసుఖమునకు లక్ష్య మదిగాదు. సత్సంతాన సిద్ధి. ఏమయినను కామసుఖమును గూడ హేయమను దృష్టితో అన్నమయ్య విడిచిపెట్టుట జరుగలేదు. ఆతడు ఆచరణశీలి. అతని ఆధ్యాత్మికత వాస్తవమయిన జీవనముతో అనుసంధానము గలది. గృహస్థుడై ధర్మ నియమబద్ధ మయిన కామ సుఖము నందుచున్నను, మానవుడు భగవంతుని పొందుటలో సందేహము లేదు. మనసు దానికై ఆరాటపడుట, దానియందు తగులుట లేకుండ భగవంతుని

యందుండుటయే సాధన. భార్యాభర్తలును ఒకరికొకరు భగవంతుని స్వరూపులుగా దర్శింపతగి, సేవింపదగినవారు. అన్నమయ్య తానాచరించి, అనుభవించిన దానినే సూటిగా, నిష్కర్షగా మరియు మృదులముగా, తల్లి నచ్చజెప్పు రీతిలో చెప్పుచున్నాడు. కామసుఖము గొప్పవారికి, అందమైన వారికొక విధముగను, సామాన్యులకు, అందము లేనివారికి వేరొక విధముగను ఉండదు. ఎల్లరికిని ఒకటే. శరీరములలో తేడా ఉండవచ్చును గాని, కామసుఖములో తేడా యుండదు. ఈ యంశమును దృఢముగా వక్కాణించి చెప్పుటకై, అన్నమయ్య సృష్టిలో గొప్పవారగు దేవతలను, ఇటు అల్పు లనబడు పురుగులను, పశువులను రెండు ధ్రువములుగా గైకొనెను. యథార్థమునకు దేవతలు భౌతిక దేహములను ఉపాధులుగ గల వారు కాదు. ప్రకృతి ధర్మములకు అధిదేవతలయిన ప్రజ్ఞలు వీరు. వీరు మనకు మేలు చేయు ప్రియులు. మరి వీరిని అన్నమయ్య ప్రస్తావించుటలో సబబు లేదు గదా యని కొందర కన్పించవచ్చును. కాని పైన తెలుపబడిన రీతిలో అత్యధికులుగా తలచబడు వారిని గూర్చి తెల్పుటకై అన్నమయ్య దేవతలను గైకొనెను. ఎవరికయినను కామసుఖ మొకటే యను అంశమును దృఢముగా వక్కాణించుటకే దేవతలను ఉదాహరించెను. మరియు దేవతలు గూడ ఒక్కొక్కసారి భూమిపైకి దేహములతో దిగివచ్చుచుందురు. నారాయణుడు శ్రీరాముడుగ, శ్రీకృష్ణుడుగ ధర్మసంస్థాపన కొరకై భూమిపై అవతరించిన సందర్భమున దేవతలు వరుసగా కొందరు ప్రముఖ వానరులుగను, గోకులవాసులుగను, పాండవులుగను దేహములు దాల్చి స్వామి యొక్క కార్యక్రమములో పాలుపంచుకొన్నట్లుగా రామాయణ, భారత, భాగవతములందు గలదు. అట్టి సందర్భములందు వారు దేవతలే యైనను శరీరములను దాల్చుటచే గృహస్థులై సంతతిని బడసిరి. కామసుఖము ననుభవించిరి. దేవతలుగా ప్రకృతి ధర్మములను పాలించు ప్రజ్ఞలుగా వర్తించినపుడు, వారికి శక్తులున్నవి. ప్రజ్ఞలను మగవారిగను, శక్తులను స్త్రీలుగాను వర్ణించుట పురాణ సంప్రదాయము. ఉదాహరణకు మబ్బును పాలించు ప్రజ్ఞ ఇంద్రుడు. అతని శక్తి యగు మెఱపు శచీదేవి. వీరి నడుమ శారీరక కామము లేకున్నను, దివ్యస్థాయిలో కలయిక ఉన్నది. మెఱపుతో గూడినపుడే మబ్బు వర్షించును గదా. కామసుఖము శరీరములు దాల్చిన దేవతలకును, పురుగులకును ఒకటియే. పురుగుల నడుమ కామసుఖమును గూడ ఉదాహరించుటలో అన్నమయ్య విశిష్ట వాస్తవిక దృక్పథమును నెరపుచున్నాడు. రాత్రింబవళ్లు ఒక్కొక్క దిన పరిమాణము గల కాలమున రెండు విభాగములు. ఉదయ కాలమును, అస్తమయ కాలము నందును ఇవి విభజింపబడి సంధ్యలేర్పడును. ధనవంతునకయినను, పేదవానికయినను ఈ నాలుగును ఒకటిగనే పొసగును. ధనవంతుల కొకవిధముగ, పేదవారికి వేరు విధముగా కాలము వర్తింపదు. మానవుని పరిమిత సంకుచిత దృష్టిలో వివక్ష యుండును గాని, కాలమునకును, ప్రకృతికిని, దేవునికిని ఉండదు. పై ఉదాహరణములు ఈ యంశమును నిరూపించుచున్నవి. రాత్రింబవళ్లలో ఎవరయినను వారి వారి విధులను నిర్వహింపక తప్పదు. పగలు పనిచేయుట, రాత్రివేళ నిద్రించుట ప్రకృతి ఎల్లరికిని సమానముగ విధించినది.

4వ చరణము యొక్క తాత్పర్యము

"గొప్ప గొప్ప భోజనములు పొందు ఆకలియు, తిరిగి తిరిగి సాధారణ భోజనములు తిను ఆకలియు నొకటే. దుర్వాసనలపై ప్రసరించు గాలియును, ఆపై మంచివాసనలపై ప్రసరించు గాలియును ఒకటే."

వ్యాఖ్య

కొందరు విందుభోజనములను పొందవచ్చును. మరికొందరు తిరిగి తిరిగి ఎంతయో శ్రమపడగా అతి సాధారణమయిన అన్నములు వారికి లభించును. మొదటి తరగతివారు పొందుట జరుగును. రెండవ తరగతివారికి అవి దొరకుట జరుగును. మొదటివారు తేరగనే పొందెదరు. రెండవవారు శ్రమపడినగాని దొరకవు. మొదటివారు పొందునవి విందుభోజనములు. రెండవవారికి లభించునవి అతి సాధారణములయిన అన్నములు. మొదటివారికి పంచభక్ష్యపరమాన్నములు భోజనములు గావచ్చును. రెండవవారికి పచ్చడిమెతుకులే భోజనములు గావచ్చును. అయినను రెండు తరగతుల వారికిని ఆకలి యొకటే. ఆకలి వేసినపుడు భుజించు పదార్థములలో తేడాలుండవచ్చును. కాని ఆకలి యొకటే. "ఆకలి రూపమున నేనీ జీవుల దేహములందు వర్తించుచు అన్నమును పచనము చేయుచున్నా"నని గీతలో కృష్ణుడు చెప్పెను. ఆకలి దేవుని స్వరూపము గావున అది అంతర్యామి. ఎవరి ఆకలి యయినను ఒకటే, ఇంతే. అట్లే జీర్ణముచేయు శక్తియు ఎవరిలోనయినను ఒకటే. తన ఆకలివంటిదే ఇతరుల ఆకలి యనియు, దానిని తీర్చువాడే భగవంతు నర్చించు భక్తుడనియు అన్నమయ్య ఉద్బోధ. యజ్ఞయాగాదులలో హవనము చేయు పదార్థముల కన్న ఆకలి గొన్నవారికి పెట్టు అన్నపు ముద్దలు నాకెక్కువ ప్రీతికరములని శ్రీమన్నారాయణుడు సనకాది ఋషులతో చెప్పినట్లు భాగవతము – తృతీయ స్కంధమున గలదు. ఆకలిని జీవులకు దేవు డొసంగిన కారణము, ఇతరులలో తనను దర్శించుటకే యనియు భాగవతమున గలదు. (ఇచట శిష్టాన్నములనగా మంచి యాహారములనియు, దుష్టాన్నములనగా చెడు ఆహారములనియు నర్థము గాదు. శిష్టాన్నములనగా విందుభోజనములు. దుష్టాన్నములనగా సాధారణములగు నాసిరకపు ఆహారములు.) కొన్ని పదార్థములు చెడువాసన కొట్టును. మరికొన్ని మంచివాసన వేయును. ఆ యా పదార్థములందలి పరమాణు సముదాయముల కలయిక వలన వాసన లేర్పడును. గాలి చెడువాసన గల పదార్థములపై ప్రసరించి, ఆ వాసనలను మోయును. ఆపై మంచివాసన గల పదార్థములపై వ్యాపించి, ఆ వాసనలను మోసి తెచ్చును. పదార్థముల వాసనలలో తేడాలుండవచ్చును గాని, ఆ యా పదార్థములపై ప్రసరించి, వాని విభిన్న వాసనలను వహించు గాలి యొకటే.

5వ చరణము యొక్క తాత్పర్యము

"తానుగా పనిగట్టుకొని ఏనుగు మీద కాయు ఎండయును, భూమిపైని కుక్క మీద ప్రసరించు ఎండయును ఒకటే. మిక్కిలిగా పుణ్యకర్మలు చేసినవారిని, పాప కర్మలను చేసినవారిని చక్కగా కాపాడుటకై నిర్విరామముగ నినదించు శ్రీవేంకటేశ్వరుని నామ మొక్కటియే."

వ్యాఖ్య

ఈ భూమిపైని జంతువులలో ఏనుగు గొప్పదిగాను, కుక్క నీచమైనదిగాను భావింప బడుచున్నవి. కాని ఈ రెంటిపైన కాయు ఎండ ఒకటే గదా! ఏనుగు పెద్ద జంతువు గాన ఎండ దానిపై విస్తారముగా పడవచ్చును. కుక్క చిన్న జంతువు గాన దానిపై ఎండ స్వల్పముగా పడవచ్చును. కాని ఎండ ఒకటియే. దానికి పెద్ద జంతువని, నీచ జంతువని వివక్షతో గూడిన సంకుచిత దృష్టి లేదు. ఎండను పరపు సూర్యునకును లేదు. ప్రకృతికెట్టి వివక్షయును లేదు. అట్టిచో ప్రకృతిమాతకు బుట్టి, ఆమెచే పోషింప బడుచున్న మానవులకు ఇట్టి వివక్ష యుండుటలో ఇంగితజ్ఞానము లేదు. ప్రకృతి వలెనే మానవుడును స్వచ్ఛమైన స్వభావము కలిగి, విశ్వవిశాలముగా హృదయమును విస్తారము గావించుకొనవలసియున్నది. అపుడే వ్యక్తికిని, సంఘమునకును క్షేమము గలుగును. ప్రకృతి గూడ మానవునికి సకాలములు, సార్థకములయిన ఎండను, వానను, చలిని, గాలిని, నీటిని, ధాన్యమును ప్రసాదించును. లేకున్నచో మానవునకు గుణపాఠము నేర్పుటకై కరవులు, వరదలు, తుఫానులు, ఉప్పెనలు, భూకంపములు కల్గించును. మానవుని సంకుచితత్వమున కివి ప్రాయశ్చిత్తకాండ గావున తప్పవు. అధికములగు పుణ్యకర్మలు చేసినవారును, పాపకర్మలు చేసినవారును గలరు. పుణ్యకర్మ అనగా ఇతరులకు మేలుగూర్చునది, పాపకర్మ యనగా కీడు కలిగించునది. ఈ రెండు కర్మలలో దేనిని చేసినవారయినను ఆపదలలో చిక్కుకొను నవకాశము గలదు. పూజావ్రతాదులు, దానధర్మములు, సేవలు మున్నగు పుణ్యకర్మలు చేయువారును తాము ఈ మంచి పనులు చేయుచున్నామనుకొనుట వలన, తాము మిగిలిన వారికన్న గొప్పవారమనియు, వారి నుద్ధరించువారమనియు, తాము చేయకున్నచో ఇతరులకు సహాయమెట్లు అందుననియు, తమవలననే లోకము నిలబడుచున్నదనియు, తమను మిగిలినవారు ముఖ్యముగా తమ సహాయమందుకొన్నవారు తమ మంచిని గుర్తించి, తమను గౌరవింపవలెననియు భావించి, మిగిలినవారికన్న తమను వేరుగా, అధికులుగా గమనించుకొనుట వలన అహంభావము వారిలో పెరుగును. తమ పుణ్యకర్మలకు తగిన గుర్తింపుకై తహతహ అతిశయించును. గుర్తించిన వారియెడల రాగము, గుర్తింపని వారియెడల ద్వేషము, తమకన్న పూజ, సంకీర్తన, మంచిపనులు బాగుగా చేయువారి యెడల అసూయ రేకెత్తును. వీరిని సుఖదుఃఖములు ఆటుపోటులై సంసారబంధమను సుడిగుండములోనికి నెట్టివేయును. వీరు తమకు మంచి గుర్తింపు రాలేదని చెడులోనికి జారిపడుట జరుగును. ఎంతటి విజ్ఞానము గలవారిలోను ఇట్టి పల్టీలు తప్పవు. కావున పుణ్యకర్మలు బంగారు సంకెలలు. పాపకర్మలెట్లును ఇతరులకు హాని కల్గించును గాన వాని ఫలితముగా విపత్తులు, కష్టములు తప్పవు. ఇవి ఇనుప సంకెలలు. పైగా తమ ఆపదల కెవరో కారణమనుకొని, పాపచింతన పెంచుకొనుట, మరల క్రొత్త కష్టములు వచ్చుట – ఇట్లు ఒక విషవలయమున చిక్కుకొనుట తప్పదు. కావున ఈ ఇరుతెగల వారికిని రక్షణము కావలసినదే. ఆనందము, పవిత్రతలే రక్షణము. పాపకర్మలు చేయు దశ నుండి మానవుడు ఫలితము నపేక్షించి పుణ్యకర్మలాచరించు దశకు చేరుకొనును. ఆపై పుణ్యకర్మలు, లోకమునకు మేలు

చేయు కర్మలు తాను చేయుటలేదనియు, తాను స్వామి చేతిలో పరికరముననియు, ఈ మంచికర్మల ఫలితముల ననుభవించు రూపములలో స్వామియే యున్నాడనియు భావించి, దైవసంకల్పములను గ్రహించుచు వానిని బట్టి పుణ్యకర్మలను అంతర్యామికి అర్పణము గావించు దశకు చేరును. పుణ్యకర్మలు గూడ తన సంకల్పములతో ఎన్నిటినో నెత్తిన వేసికొనరాదు. అవియన్నియు సఫలములు గానపుడు నిరాశ నిస్పృహ, సంఘముపై జుగుప్స కలిగి అశాంతికి లోనగుట జరుగును. దైవసంకల్పమును స్వీకరించి, దానికనుగుణములగు పుణ్యకర్మలు తన ద్వారమున జరుగుచుండుటలో ఆనందము కలుగును. దైవసంకల్ప మెట్లు తెలియును? తనను తాను స్వామికి అర్పణముగావలెను. అపుడు అహంభావము, రాగద్వేషములు, సుఖదుఃఖములకు తావు లేదు. నిత్యము శాంతి నెలకొనును. తనను తాను స్వామికి సమర్పించుకొనుటకుగాను, ఎల్లప్పుడు ప్రేమతో స్వామిని స్మరింపవలెను. దీనికి శ్రీవేంకటేశ్వరుని నామమును స్మరించుట, సంకీర్తన చేయుట, వినుట దోహదము గావించును. హరినామ స్మరణములో ఎడముండరాదు. స్వామి నామమును మరచిన క్షణముననే అహంభావము, పతనము మనస్సు నాక్రమించును. ఇట్లు పుణ్యకర్మలను పతనము నుండి కాపాడునది శ్రీవేంకటేశ్వరుని నామమే. పాపకర్ములు గూడ ఈ నామమును ఎడములేకుండ స్మరించుచున్నచో, సంకీర్తనము వినుచున్నచో మనసు అందలి తీయదనమున మరగి పాపవాసనలు తొలగును. పాపసంకల్పములు మటుమాయమగును. ఇదియే వాస్తవమయిన రక్షణము. ఉండకూడని భావములు రాకుండ చేయుట రక్షణము. ఇట్టి రక్షణమును శ్రీదేవితో కూడిన స్వామి ప్రసాదించును. పాపములను దుబ్బులను హరినామ సంకీర్తనము కత్తి వలె ఖండించునని భాగవతమున చెప్పబడినది. ఇట్టి కత్తియే అన్నమయ్య. అన్నమయ్యయే సంకీర్తనలుగా నవతరించెనా, సంకీర్తన అన్నమయ్యగా మూర్తిగొనెనా? తాను స్మరించుచున్న నామము గలవాడు సర్వాంతర్యామి యని జీవునకు గుర్తుండవలెను. అపుడిక ఎవరిని ఏ పేరుతో పేర్కొన్నను వారెల్లరు హరిరూపులే యని గుర్తుండును. చేయవలసిన పనులు తన ద్వారమున జరుగుచుండగా, వారినామ స్మరణ సమకాలికముగా సాగనగును. ఇట్లు పుణ్య కర్ములను, పాపకర్ములను వారివారిలోని మలిన భావముల నుండి రక్షించునది స్వామి నామ మొకటే. అంతర్యామి యొక్క అస్తిత్వమును గుర్తింపనివాడు దేవుని నమ్మినను, నమ్మకున్నను నిరాశకు లోనుగాక తప్పదు. హరినామమునకు వివక్ష లేదు. పాపకర్ముడయిన అజామిళుని గూడ నామస్మరణ పవిత్రుని గావించెను. ఫలానావాడు పాపియని మానవుడు గమనింపవచ్చునేమో గాని, స్వామి దృష్టిలో ఎల్లరు తన బిడ్డలే, తన కిరణములే. స్వామి నామస్మరణము, సంకీర్తనము, శ్రవణము జడిగా కొనసాగుట వలన మనకు అందు ప్రీతి పెరిగి మరగుట జరుగును. అంత స్వామి జీవుల నెట్లు చూచునో, వారితో నెట్లు మెలగునో మనకును అదే చూపు, అదే వర్తనము ప్రాప్తించును. తుమ్మెద చుట్టు తిరుగు పురుగు, తుమ్మెదయే అగుచున్నది గదా. దీనినే సాలోక్యముక్తి యందురు. అన్నమయ్య కిట్టిది కలిగెను. స్వామికి జీవులపై గల ప్రేమ, ఇతనిలో గూడ తేజరిల్లి, ఇతడు హరి యవతారమని ప్రసిద్ధికెక్కెను. మనకును ఇతడు ఇట్టి తీయని ప్రేమానుభూతిని ఈ సంకీర్తనములో చిదిమిపెట్టు చున్నాడు. అతనికిదే అంజలి.

వేదధర్మమునే భారతధర్మము లేదా భారతీయ సంస్కృతి యందురు. ఇది శాశ్వత మగు ప్రకృతి ధర్మమే గాని, ఎవరో యొక వ్యక్తి కనిపెట్టినది గాదు. భారతదేశమున పుట్టి, భారతీయు లవలంబించు సంస్కృతి గాన భారతీయ సంస్కృతి గాదు. భారతీయ మనగా ఒకే జ్యోతిని – అంతర్యామిని ప్రేమతో సేవించుట యని యర్థము. దీనిని పాటించుటే భారతీయ సంస్కృతి. పాటించువారు భారతీయులు. సూర్యుడు, చంద్రుడు, మేఘుడు, నదులు, సర్వసములు, శాశ్వతులై వర్తించుచున్నారు. ఇట్లే వేదధర్మము శాశ్వతము, సార్వజనీన విశ్వవిశాల ధర్మము. ఇందు లోపములు గాని, వివక్ష గాని లేవు. కాని సంఘ వ్యవస్థ యొక్క పరిణామ దశలలో నరులు తమ ఆచరణలో ఈ సనాతనమగు పవిత్ర ధర్మము నుండి జారిపడుచుండుట వలన వివిధమలగు మార్పులు చోటుచేసికొనుచుండును. ప్రేమయే ధర్మము. దీనినుండి పతనమైన కొందరు నరుల దోషములు వారివే గాని, భారతీయ సంస్కృతికి చెందవు. ఇది ఎప్పుడును స్వచ్ఛమే. సంస్కృతి వేరు, సంఘ వ్యవస్థ వేరు. సంఘ వ్యవస్థలో ఏర్పడు దోషములను సంస్కృతికి అంటగట్టుట నేరము. సంఘములో నరులు సనాతన ప్రేమ ధర్మమును పాటించుచున్నపుడు, వారు సంస్కృతి గలవారై, ధన్యులగుచున్నారు. కానపుడు సంఘర్షణలు, అశాంతి తప్పవు. ఇట్టి క్లిష్ట పరిస్థితులు నరజాతి చరిత్రలో చాలమార్లు దాపురించినవి. అట్టి సందర్భములలో భగవంతుడే స్వయముగా అవతరించి ధర్మసంస్థాపనము గావించుట గాని, తన వెలుగును కొందరు దూతల రూపమున నేలపైకి పంపి, వారి ద్వారమున ధార్మిక చైతన్యమును, సమష్టి చైతన్యమును ప్రజలలో నెలకొలుపుట గాని జరుగుచుండును. ఈ దూతలే ప్రవక్తలు. ఇది గీతలో స్వామి వాగ్దానము. ఇట్టి అవతారమూర్తులు, ప్రవక్తలు క్రొత్త మతమును గాని, క్రొత్తదగు ధర్మమును గాని స్థాపింపరు. ధర్మము పాతది గాదు, క్రొత్తదియు గాదు. శాశ్వతమైనది. కావుననే దీనిని సనాతనధర్మ మందురు. సూర్యుని వేడిమి సనాతనమే గాని, దానికి పాత క్రొత్తలు లేవు. కొందరు సూర్యాస్తమయమున పెనగులాడు చుందురు. కొందరు సూర్యోదయమున మేల్కాంచియుందురు. ఏ జాతిలో నయినను సంతతిపై తల్లిదండ్రులు నెఱపు ప్రేమ క్రొత్తదియు గాదు, పాతదియు గాదు. ఇది సార్వకాలికము. సంఘ వ్యవస్థా పరిణామమున నరుడు కల్పించుకొన్న వివక్షలను, చిక్కులను, అపార్థములను, సంకుచితత్వములను, ధార్మిక పతనమును అవతార మూర్తులు, ప్రవక్తలు తొలగించి శాశ్వత ధర్మమగు ప్రేమపథమును మరల ప్రతిష్ఠించుట జరుగుచుండును. వీరిది నవపథము గాదు. నవ్యపథము. ఒకే ధర్మమును వివిధ కాలములలో, వివిధ దేశములలో మహాత్ములు క్రొంగ్రొత్త శైలిలో, సరళిలో ప్రబోధింప వచ్చును. మార్గము మాత్రము శాశ్వతము. ఎప్పటికప్పుడే ఆచరించు వారికి వారి వారి అనుభవము నొసగును. ఎవరికి వారికి ఆ యనుభూతి క్రొత్త. అంతియే. శ్రీకృష్ణుడే తానుగా క్రొత్తదిగా ఏమియు బోధించుట లేదనియు, నష్టమైన ధర్మమునే తిరిగి నెలకొల్పుచున్నాననియు పలికెను. తన కాలమున ఏర్పడిన సంకుచిత భావము లను తొలగించుచు స్త్రీ శూద్రులు గూడ బ్రహ్మవిద్య కర్హులే యనియు, తాను 'నేను అయిన అంతరాత్మ నెల్లరిక'నియు తెలిపెను. బుద్ధుడు గూడ యాగముల పేర జరుగుచున్న హింసను

నిర్మూలించి, సనాతన ప్రేమమార్గమునే తాను అనుసరించి, తిరిగి నిలబెట్టెను. కావుననే ఆతనిని తథాగతుడందురు. ఈ మహాత్ములెల్లరు ఒకే సర్వాంతర్యామి వెలుగునుండి దిగివచ్చినవారే. ఒకే ధర్మము నాచరించి ప్రబోధించిరి. ప్రబోధించుట కెంచుకొన్న వైఖరి వేరుగావచ్చును. ఇట్టివారి కోవకు చెందినవాడే 'అన్నమయ్య' అని ఘంటాపథముగ పలుకవచ్చును. శ్రీకృష్ణుడు వేణుగానమును, గీతను ఎంచుకొనెను. అన్నమయ్య సంకీర్తనల నెంచుకొనెను. స్వామి వేణుగానమే అన్నమయ్య హృదయ వీణాతంత్రుల నుండి సంకీర్తనలుగా ప్రతి నినదించినది. అన్నమయ్య శాశ్వత ధర్మమును అనగా ప్రకృతి సహజమగు పరమప్రేమను ఈ సంకీర్తనలో పాదు కొలిపెను. ఒక కులమునకో, జాతికో, వర్గమునకో, శరీర బాంధవ్యమునకో పరిమితమగు ప్రేమ నిర్మలము గాదు. ఇది సంకుచితమై జారిపోవును. ఎల్లరిలో నున్నది 'నేను' అను ఒకే చైతన్యము అను పునాదిపై నిలుచు పరమప్రేమ నిర్మలము, దివ్యము, పరిపూర్ణము. ఇట్టి పరమప్రేమను, సంఘములో పరస్పరత్వమును అన్నమయ్య ఈ సంకీర్తనమున తేలికగు సరళ జానపద వైఖరిలో అద్భుతముగా పాదుకొల్పుట జరిగినది. పరిపూర్ణ మానవత్వమే దివ్యత్వము. వేదమునందలి పురుషసూక్తమున ఘోషింపబడిన విశాల భావమిది. "విశ్వములోని ఎల్లరను 'తాను'గా ప్రేమించుటే జీవిత సాఫల్యమునకు, శాంతికి ఒకే ఒక వెలుగుబాట. సంఘ వికాసమునకు పునాది." ఇదియే ఈ సంకీర్తన మున విస్తరింపబడినది. భగవద్గీతలోని 5వ అధ్యాయమున గల 'విద్యావినయసంపన్నే' అను శ్లోకమునకు ఈ సంకీర్తన మధురమగు భాష్యము.

* * *

25

15వ సం-60 **తెలిసినవారికి** బౌళి

తెలిసినవారికి తెరు విది మఱి లేదు
నలినాక్షుఁ బొగడెడి నామములో నున్నది. ॥ పల్లవి ॥

ఆకసాన లేదు మోక్ష మటు పాతాళమున లే
దీకడ భూలోకమందు ఎందు లేదు
పైకొని ఆసలెల్ల పారఁదోలి వెదకితే
శ్రీకాంతుఁ బొగడేటి చిత్తములో నున్నది. ॥ తెలి ॥

సురలవద్ద లేదు సోదించ నమృతము
సరి దిక్కులందు లేదు జలధిలో లేదు
శరణాగతుల పాదజలములు చేర్చికొనే
హరిదాసులఁ బూజించే అరచేత నున్నది. ॥ తెలి ॥

రాజసాన సుఖమేది రాసి కర్మమందు నేది
ఓజతోడ నియతుఁడై ఉండేవానిది
సాజాని శ్రీవేంకటేశు సరిముద్రలు ధరించే
తేజముతో విజ్ఞానదేహములో ఉన్నది. ॥ తెలి ॥

మోక్షభవన ప్రథమ కవాటము నీకై తెఱచుటకుగాను, నీవు
పసితనములో కోల్పోయిన స్వచ్ఛతను తిరిగి పొందవలసియున్నది.

టీక

ఓజ = ఓజస్సు, సాజాని = సహజ స్వభావమును బట్టి.

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య బ్రతుకును వెలిగించు బాటను గూర్చి మోక్షమును గూర్చి, అమృతమును గూర్చి, సుఖమును గూర్చి తెలుపుచున్నాడు. వాస్తవమునకు మోక్షమన్నను, అమృతమన్నను, సుఖమన్నను ఒకటే స్థితికి మూడుపేర్లు. మోక్షమనగా అన్ని బంధముల నుండి విమోచనము, అమృతమనగా నశింపని స్థితి, సుఖమనగా ఇచట ఆనందము. ఇష్టమైనవి లభించినపుడు కలుగు సుఖమును గాదు ఇచట అన్నమయ్య ప్రస్తావించుచున్నది. అకారణముగ, సహజముగనున్న సుఖమునే ప్రస్తావించుచున్నాడు. దీనినే బ్రహ్మానందమని ఉపనిషత్తులు పేర్కొనినవి. చరణము లలో ఇవి ఎందు లభించునో చెప్పబడినది. పల్లవిలో ఈ స్థితి కలుగుటకు మార్గము చెప్పబడినది. చాల తేలిక అయిన పలుకులలో జీవిత పరమావధియగు స్థితికి దారి, అది లభించు విధానము తెలుపబడినది. సొంత అనుభవము లేనివాడు ఇట్లు వ్రాయలేడు. అన్నమయ్య పూర్వపు ఋషుల వలె, మహాభక్తుల వలెనే స్వయముగా అనుభూతినంది తెలుపుచున్నాడు. ఈతని దివ్యోపదేశము అన్ని కాలముల వారికి, అన్ని దేశముల వారికి పనికి వచ్చునది. మొత్తము మీద భగవంతుని నామమును స్మరించుట, సంకీర్తన చేయుట, హరిదాసులను పూజించుట, శ్రీవేంకటేశుని దివ్య స్వరూప ప్రభావము గల సహజమగు విజ్ఞానము – వీని ప్రాముఖ్యమును ప్రకటించు చున్నాడు. సుఖమునకై వృథా ప్రయాసలు వద్దని హెచ్చరించుచున్నాడు. వాక్కుకు సార్థకత స్వామి నామమును సంకీర్తనము చేయుట, చిత్తమునకు సార్థకత స్వామిని కొనియాడుట, చేతికి సార్థకత హరిదాసులను పూజించుట, విజ్ఞానమునకు సార్థకత స్వామి రూప గుణములు హృదయములో సహజమగుట.

పల్లవి యొక్క తాత్పర్యము

"తెలిసిన వారికి దారి వేఱొకటి లేదు. పద్మముల వంటి కన్నులు గల విష్ణుని పొగడు నామములోనే దారి యున్నది."

వ్యాఖ్య

వెలుగుబాటలో ప్రయాణము సాగింపవలెను. ఆ వెలుగు స్వామియే. స్వామిని చేరు బాటయే వెలుగుబాట. ఈ బాట ఏది? భగవంతుని నామమును సంకీర్తనము చేయుటయే. తన కటాక్షములతో సృష్టియను పద్మమును వికసింపజేయగల శక్తిమంతు డీయన. అట్టి స్వామియొక్క నిర్మల నామమును పొగడుట వలన ఆయన ప్రభావమునకు లొంగి, స్వామి యొక్క దివ్య లక్షణములు మనలను పొందును. నామ సంకీర్తనలోని తీయని రుచి వలన, జీవితమంతయు అంతర్యామియను వెలుగుతో నిండును. నామ సంకీర్తనము చేయుటతో మలిన వాసనలు మాయమగును. నైర్మల్యము మనలను పొందును. నాలుక ఉన్నదే శ్రీహరిని సంకీర్తన చేయుట కొఱకు. నామ ప్రభావము పరిసరముల యందు పనిచేయును. ఇక

ఎవరిని పిలిచినను, వారి పేర్లు శ్రీహరివే అను విశాల దృష్టి ఏర్పడవలెను. ఎవరితో వ్యవహరించుచున్నను, ఏ పని చేయుచున్నను హరి నామమును కీర్తించినచో పవిత్రత నిలబడును. అందరి నామములు స్వామివే అను దృష్టితో పిలుచుట వలన వారియందు ప్రేమ పెరిగి, చుట్టు ఉన్న వారి రూపములతో స్వామియే యున్నాడను అనుభూతి కల్గును. ఇదియే సామీప్య ముక్తి. దేవుడెప్పుడును మనకు సమీపముననే ఉన్నాడను దర్శనము కల్గును. దేవుని నామమును పొగడునపుడు ఆతడు తన తండ్రియనియు, తల్లి యనియు, సఖుడనియు, చివరి దశలో హృదయమునకు భర్త అనియు భావించి తీయని ప్రేమతో వర్తింపవలెను.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"మోక్షము ఒకవైపు ఆకాశమున లేదు. వేఱొకవైపు పాతాళమున లేదు. భూలోకమందును లేదు. ఎందును లేదు. తన నాక్రమించుచున్న కోరికలనన్నిటిని పారద్రోలి వెదకినచో, లక్ష్మీనాథుడగు స్వామిని కొనియాడు చిత్తములో నున్నది."

వ్యాఖ్య

ఆకాశమనగా చోటులోని కనపడని ప్రకాశము, వెలుగు. శ్రీహరి శరీరమది. కాని శ్రీహరిని కీర్తించుట మనసులో అభిరుచిగా లేనపుడు, ఆకాశమున మోక్షముండదు. మోక్షమనగా దానిని గూర్చి అభిప్రాయము గాదు. అన్ని బంధములు వీడిపోవుటే. కోరికలున్నంత కాలము అవి మనసును బంధించును. నెఱవేరినచో సుఖభ్రాంతి. ఇంకను కావలెనను దురాశ, అసంతృప్తి కల్గును. కోరికలకు అంతెక్కడ? దుఃఖమునకు కోరికలే కారణమని గౌతమబుద్ధుడు సెలవిచ్చెను. మనసున ఇది లేకపోతే నేను బ్రతుకలేను, ఈవిధముగా బ్రతుకున జరుగకున్నచో తట్టుకొనలేను మున్నగు అభిప్రాయము లన్నియు మాయమై మనసు ఖాళీ అయి శ్రీహరితో నిండుటయే మోక్షము. ఇది ఆకసమును శ్రీహరి దేహముగా భావింపనపుడు, మోక్షమందదు. ఫలానాచోట నాది అని పీకులాట ఉన్నచోట ఇక మోక్షమెక్కడ? మరియు మనలో కూడ ఆకాశ తత్త్వమున్నది. మన సూక్ష్మదేహములో కంటికి కనపడని తేజోమయ కేంద్రములు ఆరు గలవు. అందులో విశుద్ధచక్రము ఆకాశతత్త్వముతో సంబంధము గలిగియున్నది. ఈ చక్రము కంఠము స్థానముగా గలది. ఆకాశమునకు, మనకు నడుమ వారధి వంటిదీ కేంద్రము. మనము చక్కని వాక్కులను ఉచ్చరించుటకు ఆధారమయినది. ఇతరులను సమ్మోహనపరచు వాక్కులు పలుకుట ఆకసమున కెగయుట. లోపలి హృదయమున భగవంతుని కీర్తించు మంచితనము లేనప్పుడు, వాక్కులలో నున్నను అవి ప్రయత్నపూర్వకముగా తెలివిగా, మాట్లాడునవే గాని, నిర్మలములు గానేరవు. శ్రోతలకు నిజమైన ఆనందపారవశ్యమును కలిగింపనేరవు. కొందరి ప్రసంగము విన్నంతసేపు 'అమ్మో? ఎంత గొప్పగానున్నది' అనిపించును. కాని వాని ప్రభావము శ్రోతల చిత్తములపై పడదు. ఆపై ప్రసంగాంశములను శ్రోతలు విడిచిపెట్టుదురు. దీనికి కారణము ఈ వాక్కులు ఎంత శాస్త్రవిజ్ఞాన సంబంధములయినను, సంగీత సాహిత్యపరములయినను, శ్రీహరిలో హృదయము కరగుచు, కరగించునట్టివి గావు. తప్పిపోయిన బాలునికై తల్లి పడు ఆర్తి, భర్త అనారోగ్యమునకై తపించు భార్య యొక్క ఆవేదన

వంటిది దేవుని కొఱకై వాక్కులలోనికి దిగిరావలెను. మనస్సులో శ్రీహరిని కీర్తింపవలెను. ఆర్ద్రత లేనప్పుడు, నోటిమాటలతో రాగ తాళ లయబద్ధముగా, ఎంత తీయగా పాడినను పాడిన వానికి గాని, వినువానికి గాని సకల బంధ విముక్తి లభింపదు. సంకీర్తనము గాని, ప్రసంగము గాని గుండె నుండి ఉబికివచ్చినపుడే గాయకునకు, వక్తకు, శ్రోతకు బంధవిముక్తి కల్గును. శ్రోతలు ఆ కొలదిసేపయినను పారవశ్యము చెందుదురు. ఎందరు శ్రోతలున్నను, అన్ని చిత్తములుండవు. పాత్రలోని మంచుగడ్డలన్నియు కరగిపోయినచో, ఒకే నీరు అగును గదా. అట్లే ఆ సమయమున ఒకే పరబ్రహ్మమున ఎల్లరి చిత్తములు కరిగిపోవును. ఈ ప్రభావము తర్వాతి జీవితమున గూడ పనిచేసి, భగవద్భక్తి పెరుగును. కావున అన్నమయ్య ఆకాశమందు మోక్షము లేదను వాక్యములో శ్రీహరిని పొగడు చిత్తము లేనపుడు గొప్ప మాటలు, పాటలు వ్యర్థములని హెచ్చరించుచున్నాడు. కంఠము నుండి, మేధ నుండి వెలువడు మాటలు, పాటలు యంత్రము నుండి వెలువడు నట్టివే అగును. ఇట్టి వారికి ప్రసిద్ధి గలుగవచ్చును గాని వారికి గాని, సమాజమునకు గాని వాని ప్రభావముండదు. అంతియేగాక ఆకాశమున మోక్షము లేదను అన్నమయ్య వాక్యమున ఇంకొక ఉత్తమ భావన యున్నది. కంఠస్థాన మగు విశుద్ధి వఱకు తన ప్రజ్ఞ చేరిన జీవులకు కొన్ని సిద్ధులు చేకూరును. ఇవి దేవుని యనుగ్రహములు. వాని ద్వారమున దేవుడు సమాజమునకు మేలు కూర్చ సంకల్పించి ప్రసాదించును. అవి తన సొంతములని భావించువానికి అతిశయము పెరుగును. సిద్ధులాతని బంధించును. అంతవఱకే అతని ప్రయాణమాగిపోవును. భగవంతుని సన్నిధికి చేరలేడు. ఆనందముండదు. చిక్కులు విడిపోవు. తన చిక్కులే విడిపోని వాని మాటల ప్రభావము సమాజముపైన నుండదు. సిద్ధులు క్రూరమృగములై వీనిని భక్షించును. నిజమైన మహాభక్తునికి దేవుడు ఆవశ్యకములయిన సందర్భములందు ఇతని ద్వారమున నలుగురకు మేలు జరుగునప్పుడు ప్రసాదించునే గాని, అతనికి వానియెడల స్పృహయుండదు. భక్తి విద్యుత్తు వంటిది. యోగాభ్యాస సాధన తీగల వంటిది. విద్యుత్తు లేని తీగలు నిరుపయోగములు. భక్తునకు సిద్ధులు తనవను భావమే కలుగదు. భక్తి లేక వట్టి యోగసాధన, ప్రాణాయామాదులు ఆచరించు వానికి ఇవి కొన్ని కలిగినను, రానియెడల స్పృహ కలిగి పతనములోనికి గొనివెళ్లును. ఒక తల్లి పసిపిల్ల వానిని ప్రేమించును. అతడు అమ్మను విడిచియుండలేడు. ఆమెకు విధేయుడై యుండును. ఇది ఆమె ప్రేమ ప్రభావమే కాని వేఱుగాదు. కాని తల్లి, కుమారుని నుండి గౌరవమును, విధేయతను ఆశింపక తాను వానికి తన ప్రేమను కురియుచునే యుండును. అట్లే నిర్మల ప్రేమ గల భక్తుడు జీవులకు తల్లి వంటివాడు. కావున వాని ప్రభావము వారిని మంచిదారి వైపు నడుచుటకు స్ఫూర్తినిచ్చును. కాని ఆ స్ఫూర్తి తానిచ్చుచున్నానని భక్తుడు భావింపడు. అతని చిత్తమున అంతయు శ్రీహరియే. చివరకు చిత్తమే శ్రీహరియగును. ఇదియే మోక్షము. ఆకాశమంత ఎగిరిన పక్షి కానరాదు. తాను ఎగిరిన మేర గాంచి, ఏ పిట్టయు ఆకాశమంతయు కొలిచితినని గర్వింపరాదు. అట్లే జీవితమున ఎంత ఎత్తు ఎదిగినను, భక్తుడు వినయుడై యుండును. ఫలములతో నిండుగా బరువెక్కిన చెట్టు క్రిందికి వంగి యుండునని భర్తృహరి చెప్పెను.

భూమి పైపొరకు దిగువన భూగర్భము వరకు ఏడు అధోలోకములు భాగవతమున వర్ణింపబడినవి. వీనిలో చివరిది పాతాళము. ఇందు జీవులకు వేరు దేహములుండవు. ఖనిజాదులలో గల రాసాయనిక

ధర్మములే ఇవి. వీనికి చైతన్యమున్నది. ఈ పాతాళ జీవుల ప్రభావము అప్పుడప్పుడు భూలోక జీవుల మనస్సులపై కామక్రోధములను రేకెత్తించును. మన దేహమున గూడ ఈ అధోలోకములున్నవి. మన దేహమందలి ఖనిజాదులలోని చైతన్యముల ప్రభావము మన మనస్సుపై పనిచేయును. ఉదాహరణకు రక్తధాతువు నందలి హీమోగ్లోబిన్ యొక్క రసాయనికమయిన మార్పులో కలుగు భేదముల వలన మన మనస్సు యొక్క పోకడలు మారుచుండును. ఈ పాతాళ జీవుల ప్రభావమున మనలో ఇంద్రియము లోలత, రుచికై ప్రాకులాట, కామము రేగుచుండును. వీనివలన బంధము పెరుగునే కాని మోక్షము రాదు. పాతాళము మన మూలాధారము క్రింద మనలో కూడ ఉన్నది. ఇందు జీవించువాని ప్రజ్ఞ, తీవ్రమయిన కామక్రోధాదులకు లోనగుచుండును. వీరికి ఆహార నిద్రా భయ కామములు తప్ప వేరు అంశములు బ్రతుకులో నుండవు. ఇట్టివారికి శ్రీహరి యెడల స్పృహయే యుండదు. ఇట్టివాడు ఎట్టి చెడుపని చేయుటకయినను సిద్ధపడును. ఫలితముగా చిక్కులలో పడును. ఆహార కామాదులలో హద్దులు దాటి వర్తించినచో, ఇతరులకు హని చేయుచో, వాని ఫలితములగు చిక్కులు, కష్టములను ఎదుర్కొనవలసి వచ్చును. ఇక భూలోకమున గూడ మోక్షము లేదని అన్నమయ్య హెచ్చరించుచున్నాడు. భూమిపై గల బాహ్య విషయాదులగు ధనము, ఆస్తి, అధికారము, కీర్తి మున్నగునవి లభించినను వీనిపైన ఆధారపడిన సుఖము వైదొలగును. వీనియందు ఆశల వలన మనస్సు బంధములలో పడును. ప్రశాంతి యుండదు. అట్లే భూమి యనగా మన భూగోళమే కాదు. పృథివీతత్త్వమని అర్థము. ఘనపదార్థము లన్నమాట. అన్ని వసతులు, విలాసములు గల ఇల్లు లభించినను, రుచికరములయిన ఆహారాదులు లభించినను, వస్తుసామగ్రి యెంత లభించినను, మనసులో బంధములు పోవు. వీనియెడల స్పృహ యున్నచో చిక్కులలో పడును. మఱియు భూమి యనగా మనలోని మూలాధారము. ఇందు ప్రజ్ఞ గల జీవుడు సహజాతములగు ఆహారాభిలాష, నిద్రాసక్తి, కామేచ్ఛలలో తీవ్రముగా బద్ధుడగును. ఇట్లు ఈ మూటియందును మోక్షము లేదు. మొత్తముమీద సిద్ధులు లభించినను, ఆహారము, కీర్తి మున్నగునవి లభించినను వానియెడల కోరిక, స్పృహ కలుగకుండ ఉండవలెను. మోక్షము లభించుటెట్లు అని పరిశీలించినచో లక్ష్మీనాథుడగు స్వామిని కీర్తించు మనస్సులో నున్నదని తెలియును. లక్ష్మియే ప్రకృతి. ఆమెను కూడ ఆకర్షించు స్వామియే శ్రీకాంతుడు. విశ్వమంతయు వీరితో నిండి యున్నది. ఇట్టివానికి విశ్వము, తన రూపము కూడ స్వామి రూపమే అన్పించును. ఇదియే సారూప్యముక్తి. హృదయమున నిత్యము స్వామినే కీర్తించు చున్నచో, లోపల, వెలుపల స్వామియొక్క దర్శనమిచ్చును. పరమాత్మని మీది చిత్తమే చిత్తము. శ్రీహరి యొక్క దివ్యమంగళ మోహనత్వము నిండియుండగా ఆ మధురాతి మధురమయిన రుచిని మరగిన వానికి ఏ ఆశలుండవు. క్రమముగా చిత్తము స్థానమున స్వామియే యుండును. ఇక ఆశలు అవియే పారిపోవును. బంధములుండవు. ఇదియే మోక్ష స్థితి. ఆశలుండవు గనుక అవి నెరవేరలేదు అను చింత చిత్తమున కుండదు. నాకు గాబట్టి లభించినవను అతిశయముండదు. కీర్తి గూడ ఇతని నంటదు. ఇతనికి విష్ణునిపై దప్ప వేఱుదానిపై మనసుండదు. కల్పవృక్షపు పూలలోని తేనె యొక్క తీయదనమున రుచి మరగిన తుమ్మెద గడ్డిపూల మీదకు పోవునా? అట్లే అంతర్యామి యగు స్వామియందు మరగిన చిత్తము ఇతరమును చేరదు. ఈ స్థితియే మోక్షము.

కావున అన్నమయ్య రచించిన ఈ చరణమున నాలుగవ పాదమును ముందు గ్రహించి, మూడవ పాదమును ముందు దానితో జోడింపవలెను. అనగా మన ప్రయత్నమున ఆశలను పారద్రోలలేము. బంధములను వదిలించుకొనలేము. శ్రీహరి మీద చిత్తము చేర్చి అతనిని కొనియాడుచుండుచో, ఆశలవియే పారిపోవును. బంధము లవియే విడిపోవును. శ్రీహరి కీర్తనము నందలి రుచి అగ్నివంటిది. ఇది బంధములను, ఆశలను కాల్చును. ఇచట శ్రీహరి కీర్తనమున విష్ణుని వైభవము, అవతారమూర్తుల దివ్యచరితల స్మరణ, భాగవతోత్తములగు ప్రహ్లాదాదుల కీర్తన, మనతోటి వారిలోని మంచి గుణములను, ప్రవర్తనను కూడ సంతృప్తిగా కీర్తించుట గూడ ఇమిడిపోవునని భాగవతమున నారదుడు ఉపదేశించెను. తోటి వారిలోని మంచిని చూడలేని అసూయాగ్రస్తునకు శ్రీహరి కీర్తనమందలి రుచి అందదు. ఎల్లరి మంచి గుణములు శ్రీహరివే.

2వ చరణము యొక్క తాత్పర్యము

"దేవతల వద్ద శోధించినను అమృతము లేదు. దిక్కులందును ఏమాత్రము లేదు. నీటికి గని అయిన సాగరమున లేదు. భగవంతునకు శరణాగతి పొందిన మహాత్ముల యొక్క పాదములను కడిగి, ఆ జలములను తలపైన చేర్చికొనువారికి అమృతము లభించును. హరిదాసులను పూజించు అరచేతిలో అమృతమున్నది."

వ్యాఖ్య

పురాణ గాథలను బట్టి దేవదానవులు క్షీరసాగరమును చిలుకగా అమృతము పుట్టినది. మనకు వలెనే తారకలకును పుట్టుక, పెరుగుదల, లయము గలవు. తారకలు పుట్టుటకు ముందు తేజోమయమైన ధూళి ఏర్పడును. దానిలో సుడిగుండము ఏర్పడును. చోటులో కూడ మన భూమికి వలెనే ఒక మేరుదండము పుట్టి దాని చుట్టును తారకలతో గూడిన గోళ మేర్పడును. ఈ పుట్టుకనే అమృతమును చిలుకు కథగా పురాణములు వర్ణించినవి. ఆపైన ఒక్కొక్క తారక ఒక్కొక్క సూర్యమండల మైనది. మనలో గూడ ఈ కథ జరుగుచుండును. దేవతలు, దానవులు అనగా జీవులలోని మంచి గుణములు, చెడు గుణములు. మంచి గుణములు దేవుని నుండి వచ్చినవి. అపుడు అమృతకలశము పుట్టెను. అదియే మన ప్రాణములు నిలుపుట కేర్పడిన హృదయము. అమృతమనగా హృదయము నందలి ప్రేమ, దివ్యానందము. అసురులనగా ప్రాణమును, దేహమును మోహించి బ్రతుకు దుర్గుణములు. సుర లనగా దేహభ్రాంతి కతీతముగా భగవానుని ఆశ్రయించుకొనిన సద్గుణములు. కథలో స్వామి అమృతమును దేవతలకు పంచిపెట్టినట్లుగా చెప్పబడినది. అమృతమనగా శాశ్వతమగు దివ్యానందము. అది సద్గుణములకే లభించును. కాని సద్గుణములు గూడ శ్రీహరి నాశ్రయించుకొని యున్నంతవరకే సద్గుణములుగా భాసిల్లును. ఉదాహరణకు మనస్సుకు, ఇంద్రియములకు, శ్వాసాదుల కధిదేవతలు గలరు. వీరు సర్వాంతర్యామి యగు స్వామిని దర్శించునంతవరకే సద్గుణములు నిలబడి, ఆనందమగు స్వర్గము లభించును. శ్రీహరి పాదములను విడువగనే, అనగా అంతర్యామిని గానక, వ్యక్తులను చూడగనే సద్గుణములు దాగికొనును. మనస్సుకు, ఇంద్రియాదులకు

రాగద్వేషాదులను దుర్గుణములు అంటును. దానితో ఆనందము కోల్పోవుట జరుగును. ఇదియే స్వర్గరాజ్యమును కోల్పోవుట. కావున తమలో స్వామి పాదములు నిలిచి నంతవరకే ఆనందము. వానిని మరవగనే ఆనందము వైదొలగును. ఇట్లు ఆనందమను అమృతమునకు కేంద్రమగు స్థానమేది? స్వామి పాదములే. దేవతల వద్ద అమృతము శాశ్వతము గాదు. అనగా మనస్సు, ఇంద్రియములు, బుద్ధి మున్నగువాని పోకడ ఒకే రీతిగా నుండవు. శ్రీహరి పాదములు తమలో ఉన్నంతవరకే ఇవి అమృతమును గ్రోలును. శ్రీహరిని విడిచి విషయముల వెంట బడగనే ఆనందము తొలగును. విషయసుఖము మృతము. నశించునది. ఇట్లు అమృతానందము స్వామియందున్నది గాని మనోబుద్ధులు, ఇంద్రియాదులందు లేదు. ఇది ఆత్మానందమై యున్నది. ఆత్మ స్వామియే గదా. ఎన్ని దిక్కులందును లేదు. అనగా నాకు దిక్కెవరు అని చింతించి ధనమునో, అధికారులనో, పాలకులనో, కీర్తినో, వ్యక్తులనో నాకు దిక్కు అని భావించువారికి అమృతానందము లభింపదు. మనము దిక్కు అనుకొన్న వారికి, వస్తువిషయాదులకే దిక్కు లేదు. మొదలు గలిగిన వీరికి అంతము గూడ కలదు. ఇట్లు దిక్కెవ్వరు? అని దీనముగా ఆక్రోశించు వారికి ఎచ్చటను, ఏ దిక్కునను దిక్కు లభింపదు. దిక్కుల కెల్ల దిక్కు అగు పరమాత్మ పాద పద్మములను పట్టుకొనక ఎచట, ఏవిధముగా వెదకినను దిక్కు లభింపదు. అమృత ముండదు. నాలుగు దిశలందు నాలుగు గజము లున్నవని చెప్పుదురు. ఇవి శక్తులు. ఈ శక్తుల కాధారములే విష్ణుని నాలుగు భుజములు. ఈ భుజములందు ఆయన ఆయుధములను ధరించుచున్నాడు. వానిలో పరిధి నుండి కేంద్రములోనికి తిరుగు చున్న ఆయుధమే శంఖము. కేంద్రము నుండి పరిధికి తిరుగుచున్నదే చక్రము. ఇట్లు దిక్కులందు తన తేజస్సునే ఆయుధములుగా నిలిపి, దిక్కులకే దిక్కై కాపాడు చున్నవాడు స్వామి. అట్టి స్వామియందు అమృతముండును గాని దిక్కులందుండదు. అర్జునుడు యుద్ధరంగమున దీనుడై నిలిచెను. తనకు సరియగు మార్గమును దర్శింప జేయువాడు కృష్ణుడని భావించి, స్వామి కిట్లు శరణందెను. "నేను దైన్యము వలన సహజ స్వభావము కోల్పోతిని. ఏమి చేయవలయునో తెలియుట లేదు. నేను ఏది చేయవలయునో నిశ్చయముగా తెలుపుము. నా హితము నాకే తెలియదు గదా. నేను నీకు శరణందువాడనని భావింపుము. నీకు శిష్యుడను." ఇట్లు అర్జునుని వలెనే భగవంతునే మనకు కర్తవ్యమును గూర్చి ప్రశ్నించి శరణందినచో గీతావాణి లోనుండి వినిపించును. స్వామియే దిక్కై, జీవితములో ఎట్టి స్థితిలోనయినను, ఎట్టి వారితో నయినను మెలగు విధానమును నడిపించును. సొంత మేధను చొప్పింపరాదు. సొంత మేధను ప్రయోగించియే కర్మ ఫలితములుగా కొన్ని పరిస్థితు లేర్పడుచుండును. మరల సొంత మేధనే వినియోగించి వాని నెదుర్కొని పరిష్కారములకై అన్వేషించినచో ఇంకను చికాకు లేర్పడును. నరుడు ఏర్పాటుచేసికొను సమస్యలు, చిక్కులు అతని మేధ నుండి పుట్టినవి. పరిష్కారములు దేవుని వద్ద నున్నవి. ఆయనకు శరణందుటే పరిష్కారము. మేధావులయిన వారికి చిక్కులు లేకుండ ఉన్నవా? ప్రపంచమును గమనించినచో ఎంతగా మేధావులయినచో అంతగా చిక్కులుండవని పొరపడు చుందురు. ధృతరాష్ట్రుడు భారతమున గొప్ప మేధావి. ధర్మరాజు తన మేధను, ధృతరాష్ట్రుని మేధకు విరుగుడుగా ప్రయోగింపలేదు. వాసుదేవునే శరణంది, స్వామి చెప్పినట్లు నడిచెను. "మనమేమి కీడు చేసినను ధర్మరాజు వెనుకకు తగ్గుచున్నాడు" అని ధృతరాష్ట్రుడు భ్రమపడెను. భీష్మ ద్రోణ కర్ణాదుల బలముపై

ఆధారపడెను. ధర్మజుడు ధర్మముపై, ధర్మ రక్షకుడయిన కృష్ణునిపై ఆధారపడెను. ధృతరాష్ట్రునకు చేతికఱ్ఱగా ఒక కొడుకు కూడ మిగులకుండ పరిస్థితి దాపురించినది. ధర్మరాజు అమృతుడు. అతని అమృతము కృష్ణుడే. తనను ఇపుడు ఎవరు కాపాడగలరని ఏ దిక్కు వైపు ఆతడు చూడలేదు. ద్రౌపదీ మానాపహరణ ఘట్టమునను అతని దృష్టి కౌరవులపై లేదు. వారిని చంపగల భీమార్జునులపై లేదు. కృష్ణునిపై నున్నది. రక్షణ ఎల్లప్పుడు లభించినది. పాండురాజు బాల్యమున ధర్మజున కిట్లు బోధించెను. "మీకు శుభమేదియో అది నిర్ణయించుటకు కృష్ణుడున్నాడు. ఆతనిని అనుసరింపుడు." రాజ్య మిప్పింపుమని ధర్మజుడు కృష్ణుని దూతగా పంపలేదు. మాకు ఎవరిపైనను పాపపు తలంపులు రాకుండ కాపాడుమని వేడెను. కౌరవులను గూర్చి ఏనాడును నింద చేయలేదు. వారిట్టివారని తలంపు లేదు. అతని తలపులో అన్ని ఘట్టములందు కృష్ణుడే యున్నాడు. అందరియందు అతనికి కృష్ణుడే యున్నాడు. ఇదియే శరణాగతి. ఇట్టివాడు బాహ్యపరిస్థితులతో ప్రమేయము లేక ఎప్పుడును అమృతుడే, అనగా ఆనందించువాడే. కుంతీదేవియు నింతియే. ఆమె కృష్ణునితో ఇట్లు పలికినది. "నా కుమారులు అడవుల పాలయినారనియు, కోడలిని అవమానించు ప్రయత్నము జరిగిన దనియు, ఆపైన తిరిగి వారికి రాజ్యము లభించినదనియు వినుచున్నాను. నా కివేమియు తెలియవు. అన్నిట నీవే దర్శన మిచ్చుచున్నావు. నిన్ను స్మరించుటే నాకు అమృతము. దాని కడ్డువచ్చు తలంపులు, వ్యామోహములు నాలో లేకుండ చేయుము." భాగవతమున కుంతీదేవి భక్తియోగ మొక ప్రముఖ సన్నివేశము. రక్షకుడై స్వామి యుండగా, ప్రత్యేకముగా రక్షింపుమని ఆయనను వేడ పని యేమున్నది? ఇక అమృతము సాగరమునను లేదు. సముద్రస్నానము, నదీస్నానము పరిశుద్ధి నిచ్చును. ఎపుడు? పరిశుద్ధి కావలెనను బుద్ధి యుండి వానిని స్వామి వైభవరూపములుగా దర్శించినపుడు. జలధిగా నయిన స్వామి వద్ద అమృతమున్నది గాని జలధిలో లేదు. క్షీరసాగరము నుండి అమృత ముత్పన్నమాయెను. నిజమే. స్వామి కూర్మావ తారుడై సురాసురులను కాపాడగా, తన స్వరూపమయిన అమృతమును క్షీరసాగరము నుండి రావలయునని సంకల్పించుట వలన. క్షీరసాగర మనబడు తారకా సమూహము ఆకాశములో గలదు. దానిని గూడ జలధి యందురు. అందలి కాంతి విష్ణుని వైభవమే. జలములు నోటిలో పోయగనే దప్పిక తీరును. రుచి గల్గును. దప్పిక, రుచి తీరుట జలములకే ఉన్నచో వాని కవియే త్రాగియుండును. కాని దప్పిక తీరుట మనకు. ఆ తీరిన తృప్తి భగవానుని వైభవమే. ఆ రుచియు స్వామి వైభవమే. ఇట్టి రుచు లెన్నిటికో కేంద్రమయిన అసలు రుచి పరమాత్మ. ఇక అమృత మెచట ఉన్నది? భగవంతునికి శరణుపొందిన మహాభక్తుల పాదజలములను శిరసుపై ధరించువారికి అమృత మబ్బును. శరణాగతులు సదా తమ హృదయములలో శ్రీహరినే తలంతురు గాన, వారి పాదజలములు శ్రీహరి పాదజలములే. వారికని ఏమియు లేదు. వారనియు లేదు. శ్రీహరి యొక్కడే ఉండును. అట్టివారి పాదములను కడుగుట వలన వినయము, వారియందు హరి భావన, వారి పవిత్ర గుణములు మన కబ్బును. వారి పాదజలములు శిరసున ధరించుట యనగా వారు నడిచిన బాటనే తలలో, అనగా తన చిత్తములో పెట్టుకొనుటకు సంకేతము. ఆ పాదజలము లతో తన మనస్సు అను క్షేత్రమును తడుపుట. దానివలన హరి భక్తి యను విత్తు మొలకెత్తి పంటకు వచ్చును. ఆ పంటయే అమృతమయిన ఆనందము. అమృత మనగా ఎప్పటికిని

క్షీణించని పరమప్రేమ యని నారదుడు నిర్వచించెను. కొందరి యందు కొన్నాళ్ళు నిలుచు ప్రేమ మృతము. అది ప్రేమయే గాదు. అందరియందు అన్నినాళ్ళు నిలుచు అనంత ప్రేమయే అమృతము. అది భగవంతుని స్వరూపము. అట్టి దివ్యప్రేమ, అది గలవారి పాదజలములలో గలదని అన్నమయ్య ఉపదేశించు చున్నాడు. వారి దివ్యప్రేమ, మనలో అదివరకే ఉన్నదానిని విస్తరింపజేయును. వారి ప్రభావము అయస్కాంతీకరణము వంటిది. వాస్తవమునకు అఖండమయిన, స్వచ్ఛమైన ప్రేమయే ఆనందము. నశింపని ప్రేమయే, నశింపని ఆనందము. నేనెందుకు ఇతరుల పాదములను కడుగవలెను? వారు నావలెనే చేతులు, కాళ్ళు గలవారే గదా యని గర్వించువారు ఆ స్వాభిమానము దాటువరకు ఆనందమునకై, ప్రేమకై వేచియుండవలసి యున్నది. అట్లని శరణాగతుల పాదములను యాంత్రికముగా గాని, ఏదియో పుణ్యము వచ్చునని గాని, తాను చేసిన పాపములు నశించి, ఆయన స్వీకరించుననియు భావించుచు కడుగుట వ్యర్థమే. మన పాపములను వారి నెత్తిన పడవేయవచ్చునను దుర్గుణము పనికిరాదు. వారి సద్గుణములు తనకంటు నిమిత్తమై కడుగవలెను. ప్రవరుడు సిద్ధుని పాదములను కడిగి, ఆ జలములను అమరగంగగా, విష్ణు పాదజలముగా భావించుటచేత పరమ పరిశుద్ధుడయ్యెను. హరిదాసులను పూజించు అరచేతిలో అమృతమున్నది. ఎంతటి కోమల స్వభావి అన్నమయ్య! ఎంతటి మృదుశీలి, ఎంతటి వినయశీలి! హరికి దాసుడనని గాక హరిదాసులకు దాసుడనని భావించుచున్నాడు. ఇట్లే కులశేఖరాళ్వారు కూడ దేవునితో ననెను. "నీ దాసుల దాసుల దాసుల దాసుడనుగా నన్ను భావింపుము." అంతర్యామి యగు హరికి సేవ చేయు భాగవతోత్తములనే హరిగా భావించి, వారిని తమ అరచేతులతో పూజించినచో అమృతమగు పరమప్రేమ, పరమానందము వారి ద్వారమున మనలోనికి ప్రవేశించును. పూర్వమే మనలోనున్న ఆ లక్షణములను పరిపూర్ణము గావించును. శ్రీరాముడే ఋషులకు పాదపూజ గావించెను. శ్రీకృష్ణుడును కుచేలునకు పాదపూజ చేసెను. రుక్మిణీదేవియు చేసెను. అష్టమహిషులే కుచేలుని భాగ్యమునకు ఆశ్చర్యపడిరి. ధర్మరాజు ఎందరో హరిదాసులను పూజించి, రాజసూయయాగ సందర్భమున హరినే పూజించు భాగ్యము నందెను. తానే భక్తుడను, వేరొక భక్తుని పూజింపనేల యని భావించుట అహంకారము. ఇది తొలగుటకే పూజింపవలెను. అపుడే ఆనందామృతము లభించును. హరిదాసులనే సేవింపలేనివాడు సామాన్యుల నెట్లు సేవింపగలడు? హరిదాసులను తననుగానే భావింపవలెనని హరి యుద్బోధించెను. భగవదపచారము కన్నను భాగవతాపచారము పెద్దపాపము. హరిదాసులలో అగ్రగణ్యుడుహనుమంతుడు. ముందుగా హనుమంతుని సేవించిన వాడే రామానుగ్రహమునకు నోచుకొనును. మరి హనుమంతుడు ముందుగా లక్ష్మణుని గౌరవించి, ఆరాధించెను. సీతమ్మయు ముందుగా లక్ష్మణుని సేవింపుమని హనుమంతునకు సూచించెను. సీతా లక్ష్మణ సమేతుడగు రాముడే హనుమంతుని దైవము. మనకు సీతా లక్ష్మణ హనుమత్సమేతు డగు రాముడే ఆరాధ్య దైవము. ఇర్వురు భక్తుల నడుమ పరస్పర గౌరవాదరములను నేర్పుటకే శ్రీరాముడు హనుమంతుని గుహుని వద్దకు, భరతుని వద్దకు ముందుగా పంపెను. హరిదాసులు ఏ కులమునకు చెందినవారు, ఏ మతమునకు చెందినవారు, ఎంత చదువుకొన్నారను దృష్టి సంకుచితమయినది. ఏ మానవుని యెడలను అట్టి దృష్టి పనికిరాదు. భగవంతుడు ఈ సంకుచిత దృష్టి

కలవారిని దానినుండి బయట పడవేయుటకై ఎన్నో లీలలను నెఱపెను. నామదేవుడు, గోరాకుంభార్, కురువరచినంబి, తిన్నడు హరిదాసులై లోకపూజ్యులైనారు. హరిదాసులను పూజించు చేతులే చేతులు. హరి దాసులకు సేవ చేసి, ఆతిథ్యమిచ్చి, వినయము నెఱపుటలో ఎంతటి అమృతపు రుచి గలదో అన్నమయ్యకు బాగుగా అనుభవము. హరిదాసుల సాంగత్య సంభాషణల వలన, వారిని పూజించుట వలన దేవుడు, హరిదాసులు జీవులనెంత ప్రేమగా చూచెదరో మనకు అట్టి స్థితి కలుగును. అదియే సాలోక్య ముక్తి. అదియే ప్రేమ. హరిదాసులను సేవించువారు శరీరములు, మృత్యువు ఎన్నిమార్లు పొందుచున్నను తాము మాత్రము పరమాత్మ యందు నిలిచిన ప్రజ్ఞ గలవారై అమృతులగుచున్నారు.

3వ చరణము యొక్క తాత్పర్యము

"రజోగుణమున సుఖము లేదు. కర్మ లనేకము చేయుటయందు లేదు. ఓజస్సుతో నియమము గలవానికిది అందును. సహజసిద్ధముగా శ్రీవేంకటేశ్వరుని చక్కని ముద్రలను ఉన్నవి యున్నట్లుగా ధరించు తేజస్సుతో మెఱయు విజ్ఞానమయ దేహములో సుఖమున్నది."

వ్యాఖ్య

రజోగుణము గలవాడు ఒక పని చేయుచుండగనే, వేరొక పనిని గూర్చి ఆలోచించు చుండును. కామక్రోధముల రజోగుణము ఉద్వేగము నొందును. జీవితమను బండికి గూర్చిన బరువును మించిన వేగము గల గుఱ్ఱము వంటిది. ఇట్టివాని జీవితమను బండి బోల్తాకొట్టును. రజోగుణము మానవుని ఎప్పుడును ఏవియో కోరికలతో పనులు చేయుటయందు నిలుపును. అసంతృప్తి, రోషము మిగులును. ఆశ, కార్యములను చేయవలెనను సొంత సంకల్పము, కలుగజేసికొనుట, చేయుచున్నది దోషమయినను మానలేకుండుట, కోరుట, స్వాభిమానము రజోగుణ లక్షణములు. రజోగుణము వర్తించుచుండగా నిద్రయో, మృత్యువో కలిగినచో, మరల ఎల్లప్పుడు కర్మలను అంటించుకొనువాడుగా మేల్కొని, ఫలితము లందు ఆసక్తితో తీరుబడిలేని జీవితము గడుపును. మంచిపనులు కూడ కీర్తి కొరకో, పుణ్యము కొరకో, నేను చేయుచున్నాననను స్వాతిశయముతో, గుర్తింపు కావలెననియో రజో గుణము గలవారు చేయుచుందురు. వీరు తమ ఆవేగము, ఉద్వేగములచే సుఖమును పొందజాలకున్నారు. విసుగు, చిరాకు పొందుచుందురు. రాజసమనగా వాడుకలో ఠీవి యనియు అర్థము గలదు. తన హోదాను, ఠీవిని చూచుకొని మురియువాడు, జనుల నడుమ మిగిలిన వారికన్న తమ కెక్కువ మన్నన కోరుచు సుఖమును కోల్పోవుచున్నారు. ఇక కర్మలెన్ని జేసినను అందు సుఖము లేదు. ఉద్వేగము, కర్మాసక్తి సుఖమును దక్కనీయవు. కర్మలు నేను చేయుచున్నాననను భావముతో పూజాదులు, సేవాకార్యములు చేసినను ప్రతిఫలాపేక్ష, గుర్తింపునందపేక్ష విడిచిపెట్టక మనస్సు వికలమై, ఎపుడును ఉద్రిక్తమై, సుఖము నొందదు. పూజాదులు చేయుచున్నవారు గూడ వాని విధానము – పూజా సామగ్రి, వానిని పెట్టు స్థానములు మున్నగువాని మీద పెట్టిన దృష్టి దేవునిపై పెట్టలేరు. ఒకవేళ దేవునిపై పెట్టినను ఆయనను అంతర్యామిగా భావింపకుండ తమకు ఇష్టమైన

మూర్తిగా భావించు వారికి ఉద్వేగమే కాని సుఖముండదు. సుఖస్థితిలో సమత్వము, ప్రశాంతి యుండును. తాను చేయు పూజకు వలయు సామగ్రి అమర్చ లేదని భార్యపై కోపించువాడు, తాను దేవునకు నివేదింపకుండ పిల్లలకు, ముసలివారికి, ఆకలిగొన్నవారికి పెట్టనని భీష్మించుకొన్నవాడు, ఉపవాసములతో స్వామిని బెదరించువాడు ప్రశాంతి నెట్లు పొందగలడు? కర్మలను విడువ పనిలేదు. మంచి పనులు చేయవలసినదే. కాని ఏమి చేయవలెనో సంకల్పము స్వామిదై యుండవలెను. తమ సంకల్పమయినచో నెరవేరక రోష దుఃఖములే కలుగును. కర్మలకు సంకల్పము, చేయువాడు, చేయు పని, దాని ఫలిత మనుభవించువాడు – అంతర్యామి యగు స్వామియే అను భావము వలన క్రమముగా సుఖము కలుగును. ఇది భావస్థాయి నుండి అనుభూతి స్థాయికి ఎదగవలయును. మానవతా వికాసము లేనివాడు ఎన్ని పూజలు చేసినను అవి దేవుని చేరవు. ఇతడు చేయు పూజలు, స్తోత్రములు స్వామి పట్టించుకొనడు. వానికి ఉబ్బిపోడు. సేవాకార్యములు చేయుచు, తాను చేయుచున్నానను రాజసికభావ మున్నచో ఎంత చేసినను తనకు పరిశుద్ధి ఏర్పడదు. ఏడాది క్రింద తన ప్రవర్తన ఎట్లున్నదో ఇపుడును అట్లే ఉండును. దినదినమునకు, ఏడాదికేడాది తన శీలము, ప్రవర్తనలో ముందంజ కల్గుచున్నపుడే సాధన. ఈ నిష్పత్తిలోనే సుఖము లభించును. ఎంతగా మానవత్వము వికసించునో, అంతగా సుఖము కలుగును. ఎన్ని పనులు – మంచివైనను చేసితివను లెక్క దేవుడు చూడడు. ఏ దృష్టితో చేసితివో అది చూచును. మానవత్వ పరిపూర్ణతయే దివ్యత్వము. పరిపూర్ణ మానవుడే దేవుడగును. కర్మలలో సుఖము లేదనగా కర్మలను విడిచిపెట్టుడని అన్నమయ్య ఉద్దేశ్యము గాదు. సంకల్పము, నేను చేయుచున్నాను, ఈ పని చేయు శక్తి నాది, ఫలానావానికి మేలు చేయుచున్నాను, దీనికి ప్రతిఫలము, గుర్తింపు రావలెనను అపేక్షను విడువవలె ననియు, ఇవి యన్నియు స్వామియే అనియు, తాను స్వామికి పరికరము ననియు గుర్తుండవలెనని అన్నమయ్య ఉద్దేశ్యము. స్వామి సంకల్పమును బట్టి నడువక, మంచి పనులు చేయగోరువాడు ఎన్నో మంచి పనులను నెత్తిన వేసి పులుముకొనును. కొన్ని విఫలములగును. దుఃఖమే ఫలితము. కావున స్వామి సంకల్పమును బట్టి, ఆయన పరికరముగా, కుటుంబ రూపముననను, సమాజ రూపముననున్న స్వామికి పూజగా పనులు చేయుమనియే అన్నమయ్య ఉద్దేశ్యము. గీతలో కృష్ణుని ఉపదేశసార మిదియే. ఎవనికి వానికే తెలియును – ఏ ఉద్దేశ్యముతో చేయుచున్నాడు, తనకు నేనే చేయుచున్నాననే భావమున్నదో లేదో, గుర్తింపు యెడల అపేక్ష ఉన్నదో లేదో – మున్నగున వన్నియును ఇంకొకడు చెప్ప పనిలేదు. అన్నమయ్య చెప్పినట్లు చేయు కర్మాచరణమున తనకే తెలియును శాంతి, ఆనందము తనకు లోపల ఉన్నవని. శాంతి, ఆనందము లేక అహంభావముతో గాని, పులుముకొని గాని చేయు సత్కర్మ లయినను బంధించి ఉద్రిక్తత కల్గించునని ఎవనికి వానికే లోలోన తెలియును. సుఖము ఓజస్సును పొంది నియమములు గలవాడికి లభ్యమగును. ఓజస్సు అనగా 'ఓం'కారము నుండి పుట్టినది. ఓంకారమును పుట్టించునది. ప్రతిదినము 'ఓం'కార మును కంఠము నుండి ఉచ్చరించుచు, దానినే వినుచుండగా, మనస్సు ఆ దివ్యనాదమున లీనమగును. అపుడు కలుగు ఆనందస్థితి ఓజస్సు అనబడును. ఓంకారనాదము నుండి ఉత్పన్నములగు సంకీర్తనములను వినుచున్న వారికిని ఇట్టి 'ఓజస్సు' కలుగును. 'ఓం'కారమును జనింపజేయునది కూడ ఓజస్సే. అది యెట్లు? మనము ఓంకారనాదము

చేయుటకు గాని, సంకీర్తనము చేయుటకు గాని, వినుటకు గాని ఆధారము మన శ్వాసయే. శ్వాసలలో 'సో–హం' అను రెండు ధ్వనులు మనము జపించకుండగనే మ్రోగుచుండును. శ్వాసను గమనించిన ఇది వినబడును. ఇందులో 'స, హ' లు జారిపోగా 'ఓం' మిగులును. ఇది అజప అయిన ఓంకారము. మన ముచ్చరించు ఓంకారమును ఈ శ్వాసయే పుట్టించును. శ్వాసలోని ఓంకార మును వినుట వలన కూడ మనకు ఆనందస్థితి కలుగును. ఇదియు 'ఓజస్సే'. కావున యోగసాధకులు ప్రతిదినము కొలదిసేపు శ్వాసలోని ఓంకారమును వినుచుందురు. ఆపై తామే ఓంకారనాదమును పలుకుచు వినుచుందురు. దీనివలన ఓజస్సు అను శక్తి పుట్టును. ఏలననగా ఓంకారస్వరూపుడు హరి. ఆయన ప్రసాదమే శక్తి. ఈ శక్తి వలన శుక్రము బ్రహ్మరంధ్రము గుండా పైకి ప్రయాణించి సహస్రారమున ఓజస్సు అను దివ్యతేజశ్శక్తిగా మారును. బ్రహ్మచర్యము, జితేంద్రియత్వ మబ్బుట వలన ఈ 'ఓజస్సు' అను దివ్యతేజశ్శక్తి కలుగును. ఇట్లు ప్రణవోపాసన వలన లేదా సంకీర్తన పారవశ్యమున క్రమముగా కామము వైదొలగుచు, పరమప్రేమ పెరుగుచు బ్రహ్మమునందు ప్రజ్ఞ చరించుచు, శుక్రము సహస్రారమును జేరి ఓజస్సు అను తేజశ్శక్తి యగును. ఈ స్థితి పొందిన వారికి ముఖములో వర్చస్సు, కంఠమున శుద్ధ వాక్కు వచ్చును. సహన మేర్పడును. ఈ స్థితిలో సుఖము కల్గునని అన్నమయ్య ఉద్దేశ్యము. ఈతడు ఓంకారనాదము నుచ్చరించి వినెను. తన సంకీర్తనలను ఓంకార నాదము యొక్క విశాల ప్రస్తారముగా రచించి గానము చేసెను. 'స, రి, గ, మ, ప, ద, ని' అను సప్తస్వరములలో మొదటి 'స' – షడ్జము శుక్రమునకు ఆనుగుణ్యము కలది. క్రమముగా భక్తితోడి మధురమగు సంకీర్తనము అభ్యాసమై, ఈ షడ్జమే చివర కూడ గానము చేయబడును. మొదటి 'స' శుక్రముతో అనుగుణమైనది. చివరి 'స' ఓజస్సుతో అనుగుణమయినది. మొదటి షడ్జమే చివరి షడ్జముగా మారును. ఇట్లు మహాభక్తితో సంకీర్తనము చేయువారిలో శుక్రము, ఓజస్సుగా మారి, జీవుడు భగవదానంద స్థితిని పొందునని అన్నమయ్య బోధించుచున్నాడు. ఎట్లు మారినది – ఈ వివరములతో పనిలేకయే ఈ స్థితి కల్గును. శ్రీకృష్ణుడు షడ్జము గాక మిగిలిన స్వరములను ఆరు ఋతువులతో జోడించి, షడ్జమును అనంతకాలమున లీన మొనర్చెను. సప్త ధాతువులకు, సప్త స్వరములకు సంబంధ మున్నదని వేదసూక్తములు చెప్పుచున్నవి. ఒక్కొక్క స్వరము వలన శరీరము నందలి ఒక్కొక్క ధాతువు పుష్టి నొందును. ఇక ఓంకార గానముతో బాటు సాధకుడు నియమములను పాటింప వలెను. ఇవి సాధనలో కావలసిన క్రమశిక్షణ కొరకై ఏర్పాటయినవి. నియమము లనగా ఎవరిని అంటకుండుట మున్నగునవి గావు. పతంజలి మహర్షి నియమము లను ఇట్లు పేర్కొనెను :– లోపలి, బయటి శుద్ధి, నిత్య సంతోషము, మానసిక వాచిక కాయికమయిన పవిత్రతతో లోకహిత కాంక్ష, సత్పురుష సాంగత్యము, సద్గ్రంథ పఠనము, స్వామికి శరణాగతి. ఓజస్సుతో వీనిని కూడ పాటించినచో సహజమైన ఆనందస్థితి కలుగునని అన్నమయ్య బోధించుచున్నాడు. ఇవియన్నియు అన్నమయ్య పాటించి గమ్యము చేరెను.

ఇక సహజ స్వభావముగ శ్రీవేంకటేశ్వరుని ముద్రలు ఉన్నవి యున్నట్లుగా ధరింప వలెను. బాహ్యార్థము స్వామి యొక్క ఆయుధములగు శంఖ చక్రముల ముద్రలను భుజములపై ధరించుట. దీనినే శంఖచక్రాంకిత

మనియు, సమాశ్రయణమనియు నందురు. ఇది చేయించుకొనవచ్చును. కాని ప్రధానమైన ప్రక్రియను ఇచట అన్నమయ్య ఉపదేశించుచున్నాడు. శ్రీవేంకటేశ్వర దివ్యతేజోమంగళ మోహనమూర్తిని నిరంతరము, సహజ ప్రేమతో జీవితమంతట లోపల, వెలుపల ధ్యానించి, ధ్యానించి, ధ్యానము చిక్కబడి స్వామి మూర్తి శంఖచక్రములతో కలిసి మన హృదయమున ముద్ర పడును. మన హృదయము ఆయనయందు ప్రేమతో నిండగా, మన శరీరమునే స్వామి ఆవహించును. మన శరీరమే స్వామి శరీరముగా తనకును, ఇతరులకును దర్శనమిచ్చును. కారణము స్వామి దివ్యమంగళమూర్తి ధ్యానమున మన మనస్సు లీనమై యునికిని కోల్పోవుట. స్వామియొక్క పీతాంబర దివ్యకాంతుల ప్రవాహములో మనస్సు కోల్పోవుట జరుగును. పీతాంబరకాంతు లనగా సూర్యోదయారుణకాంతులు. మన భౌతిక శరీరము స్వామికి శరీరమగుటనే 'నారాయణ కవచము' భాగవతమున ఉపదేశించుచున్నది. మన దేహము భౌతికమే అయినను, స్వామి యొక్క దివ్యతేజస్సు మన భౌతిక శరీరమును ఆవహించును. మనకొక తేజశ్శరీర మేర్పడును. ఈ తేజోమయ దేహము మన భౌతిక దేహము యొక్క పోలికలతో నుండదు. శ్రీవేంకటేశ్వర మూర్తి యొక్క మోహనత్వము ఈ మన తేజశ్శరీరమును ఆవహించుటచే, మన తేజశ్శరీరము శ్రీవేంకటేశ్వరుని మూర్తి యగును. ఇది యూహ కాదు. సత్యము. అన్నమయ్య అనుభూతి ఇది. స్వామియే ఇట్టి మహాభక్తుని కనుల నుండి లోకమును చూడును. ఇట్టివాని చూపుల ద్వారమున స్వామి కటాక్షముల ప్రభావము జీవులపై బడును. ఇతడు స్వామికి ప్రతిరూప మగును. ఇతనిని చూచిన వారికి శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించిన అనుభూతి కలుగును. దైవమే ఇట్టి మహాభక్తుని రూపమును ధరించి సంచరించుచున్నాడని అనుభూతి ఎల్లరకు కలిగి, స్వామి ప్రభావమునకు లోనై వారును క్రమముగా భక్తులగుదురు. ఇట్టివారినే ఆవేశావతారము లందురు. అన్నమయ్యకు ఇట్టి తేజశ్శరీర మేర్పడుటలో సంశయము లేదు. ఆనాటి జనుల కాతడే స్వామిగా చాలమందికి దర్శనమిచ్చి యుండును. ప్రస్తుతము, భవిష్యత్తులో గూడ అతనిని స్వామి యొక్క అవతారముగా భావించి, అతనికి శరణంది, అతని మార్గము ననుసరించు వారికిని అన్నమయ్య శ్రీవేంకటేశ్వరమూర్తిగా అనుభూతి నొసగును. ఆవశ్యకమయినపుడు భౌతికముగా కూడ దర్శనమిచ్చును.

మనలో అయిదు కోశము లున్నవని తైత్తిరీయోపనిషత్తు చెప్పుచున్నది. మొదటిది పైకి కనపడు భౌతిక శరీరము. రెండవది ఈ శరీరమంతట ప్రసరించు ప్రాణశక్తి. మూడవది మనస్సు. నాలుగవది విజ్ఞానమయ కోశము లేక బుద్ధి. అయిదవది ఆనందమయ కోశము. ఇదియే ఆత్మచైతన్యము. ఇది ప్రేమమయ దేహమని శ్రీరామకృష్ణపరమహంస పేర్కొనెను. స్వామి యొక్క సహజస్థితి ఈ యానందమయ కోశమే. స్వామి యొక్క నిరంతర ధ్యానము వలన మనము కూడ ఈ సహజస్థితిని పొందెదము. మన సహజస్థితియు ప్రేమయు, ఆనందమే కదా. కారణము మనము స్వామి యొక్క స్థితి మార్పు అయిన రూపములమే. మనస్సు, అహంకారము వైదొలగగా మనము అసలయిన 'నేను' స్థితిని చేరుకొందుమని రమణమహర్షి బోధించెను. ఈ 'నేనే' ఆత్మ లేక పరబ్రహ్మము. ఇదియే మన సహజస్థితి. ఈ స్థితిని మనము కోల్పోయితిమి. తిరిగి క్రొత్తగా వచ్చిన కృత్రిమ లక్షణములు వదలినచో, సహజస్థితిలో నుందుము.

ఇది వచ్చునది గాదు. మనకు సహజముగా నున్నది. గ్లాసు యొక్క మసి తుడువబడగనే, దీపము యొక్క ప్రకాశము బయటపడును. స్వచ్ఛత మన సహజ స్వభావము. పసిపిల్లలలో ఈ స్థితి యుండును. వయసు పెరిగిన కొలది వేరు భావములు పెరిగి కృత్రిమత్వ మేర్పడును. మనము మోక్షము పొందుట అనునది లేదు. బంధము తొలగిన ఉన్నది మోక్షమే అని రమణమహర్షి బోధించెను. మనము భగవంతుని ఆనంద సామ్రాజ్యమున ప్రవేశింపదలచినచో క్రమముగా కోల్పోయిన పసిపిల్లవాని స్థితికి మరలవలయునని గౌతమబుద్ధుడు బోధించెను. 'సాజాని' అను పదమును ప్రయోగించుటలోని అన్నమయ్య భావమిదియే. సాధారణముగా ఉపా ధ్యాయులు విద్యార్థులకు విజ్ఞానమును బోధించి, ఆపైన ఆనందమును కల్గించుటకు ప్రయత్నింతురు. ఇది అక్రమ మార్గము. ఇట్టి విజ్ఞానము తలకు బరువగునని బుద్ధుడు చెప్పెను. ఇచట అన్నమయ్య వేదర్షుల దారిని అనుసరించి యుపదేశించు చున్నాడు. ముందుగా ఆనందమును కల్గించి – అనుభూతిలోనికి గొనివెళ్లి, ఆపైన విజ్ఞానమును అందింపవలెను. నవీనకాలమున అరవిందులు ఈ మార్గమునే బోధించిరి. ముందుగా మనము భగవదనుభూతి పొందవలయును. మన మనస్సు, బుద్ధి ఆనందస్వరూపుడగు స్వామిలో లీనము గావలెను. వేంకటేశ్వర మంగళమూర్తి యొక్క ధ్యానము వలన, విశ్వరూపుడగు ఆయనను సేవించుట వలన, ఇట్లు మనో బుద్ధులు స్వామిలో లయింపగా, ఆనందరససిద్ధి కలుగును. శిశు స్థితి కలుగును. పరమాత్మయే శాశ్వత శిశు స్థితిలోనివాడు. అపుడు స్వామి యొక్క ముద్రలు మన బుద్ధిపై కూడ బడును. ఆనందము నుండి విజ్ఞానము దిగివచ్చును. దీనినే దర్శన జ్ఞాన మందురు. విజ్ఞాన మపుడు మన సొంతము గాదు. సంకల్పములు, చేయదగిన, చేయదగని కార్యముల విచక్షణ మనది గాదు. ఇవన్నియు స్వామియే. మనకెంత విజ్ఞాన మీయవలయునో స్వామి నుండి అందును. సమాజమునకు మనము ఆ విజ్ఞానమును వినియోగపెట్టిన కొలది దేవుడు తన ఆనందస్థితి నుండి విజ్ఞానమును కరుణించును. కనుక సాధారణ మేధావిలో వలె భక్తునిలోని విజ్ఞానము సొంత తెలివితో సంపాదించుకొన్నది గాదు. ఆనందస్వరూపుడయిన, ప్రేమస్వరూపుడయిన అంతర్యామి యగు 'ఆత్మ' నుండి దిగివచ్చినది. సూర్యరశ్మి నిర్మల జలములో స్వచ్ఛముగా ప్రకాశించినట్లు, ఇట్టి దర్శన జ్ఞానము స్వచ్ఛమయినది. లోపములు లేనిది. మన మేధతో సాధించు విజ్ఞానమున లోపములు, మన అభిప్రాయములతో మసకబారిన అసత్యము లుండవచ్చును. భగవంతుడు కరుణించిన విజ్ఞానము సత్యము, శాంతిదాయకము. కారణము ఆయన సత్యస్వరూపుడు గదా. మనము సాధించు విజ్ఞానమున తలబరువు ఉండును. స్వామి అందించు విజ్ఞానమున శాంతి ఉండును. ఇది ఏ శాస్త్రసంబంధ మయినను సంకీర్తనము వలె కళాత్మకముగా నుండును. ఇపుడు అన్నమయ్య సూచించుచున్నది మన కదివరకే ఉన్న విజ్ఞానమును గూర్చి కాదు. భగవానుని నుండి మనలోనికి దిగివచ్చిన విజ్ఞానమును గూర్చి. ఇట్టి విజ్ఞానదేహ మొకటి భక్తునిలో ఏర్పడును. ఏది అనుభవించినచో ఇక ఏది యయినను తెలియుటకు యత్నింప పనిలేదో దానిని నీకు ప్రసాదింతునని శ్రీకృష్ణుడు అర్జునునకు తెలిపెను. మనము సాధించిన విజ్ఞానము సృష్టిని ముక్కలు ముక్కలుగా విడదీసి పరిశీలించును. భక్తునకు సృష్టి యంతయు ఒకే చెట్టు. అందలి కొమ్మలే సకల శాస్త్రములు, కళలు. మొదటిది విశ్లేషణాత్మక దృష్టి. రెండవది సమగ్ర దృష్టి. మొదటిది నరుని సొంత దృష్టి.

రెండవది భగవంతుని దృష్టి. ఇదియే మనకును భక్తులమైనచో ఇచ్చును. భక్తుడు ప్రత్యేకముగా శాస్త్రవిజ్ఞానమునకై తీవ్ర యత్నము చేయ పనిలేదు. ఇది దివ్యజ్ఞానము. మనలో దీనిని వెలిగించి, స్వామి తనదగు విజ్ఞానముతో గూడిన దేహము నిచ్చును. మనము స్వామి మూర్తిని గుండెలో నిలుపుకొని లోపల, వెలుపల ధ్యానించి, సేవింపవలెను. స్వామి యొక్క తేజస్సు, విజ్ఞానము, ప్రేమ మనలో ముద్రలు పడును. మసక మధ్యలో అద్దుతగులక సూటిగా పడును. ఇట్లు స్వామి యొక్క ముద్రలు గల ప్రతిరూపమైన తేజస్సు, ప్రేమ,విజ్ఞానమయ దేహము మన కేర్పడుటలో సుఖ మున్నదని అన్నమయ్య ఉపదేశించుచున్నాడు. మహాభక్తుడగు సద్గురువు ముందు స్వామి ప్రేమ విద్యార్థులపై ముద్రవేసి, వారిని ఆనందింపజేసి వారిలో తనకు స్వామి ఇచ్చిన విజ్ఞానమును పాదుకొల్పును. కావుననే ఇట్టి మహాత్ముల బోధలు హాయిగను, పండితుల మాటలు తలబరువుగను ఉండును. ఆనందము కల్గినచో విజ్ఞాన మదియే వచ్చును. దానికోసమై ప్రయాస అక్కరలేదు. "మావాడు చదివి చదివి అలసట పొందెను" అని తల్లిదండ్రులు భావించు ప్రస్తుత విద్యా విధానము మారవలెను. మరల భగవద్భక్తితో జోడింపబడి, స్వామియే అందించు విజ్ఞానముతో గూడిన విద్యావిధానము వచ్చితీరును. స్వామి నుండి విజ్ఞానమును పొంది, పిల్లలకు అందించు సద్గురువులు విద్యాలయములలో నెలకొను దినములు వచ్చును. పిల్లలు ఆనందింపగలుగు విజ్ఞానమది. భవిష్యత్తును గూడ దర్శించిన మహనీయుడు అన్నమయ్య. ఇతడు తన జీవితమున పొందిన, పొందించిన అనుభవములనే సంకీర్తనములందు పొందుపరచెను. అతడు సూచించిన విజ్ఞానమునే అపౌరుషేయ మందురు. వేదమిట్టిదే. అనగా పురుషుడు – నరుడు స్వయముగా సాధించినది గాక, అంతర్యామి నుండి దిగివచ్చినదని యర్థము. అన్నమయ్య స్వామి ముద్రలు గల ప్రేమమూర్తి, తేజోమూర్తి, విజ్ఞానమూర్తి. ఆదర్శ సద్గురువగు అన్నమయ్యకు ఆకాశమంత ఎత్తుటి నీరాజనములు.

* * *

26

2వ సం-401 **తే శరణమహం** మంగళకౌశిక

తే శరణమహం తే శరణమహం
శైశవకృష్ణ తే శరణం గతోఽస్మి. ॥ పల్లవి ॥

దశవిధావతార ధర్మరక్షకమూర్తి
దశమస్తకాసుర దళన
దశదిశాపరిపూర్ణ తపనీయస్వరూప
దశావరణ లోకతత్త్వాతీత. ॥ తే శరణ ॥

సహస్రలోచన సంతతవినుత
సహస్రముఖ శేషశయన
సహస్రకర కోటిసంపూర్ణతేజ
సహస్రార దివ్యచక్రాయుధ. ॥ తే శరణ ॥

అనంత చరణ సర్వాధారాధేయ
అనంత కర దివ్యాయుధ
అనంత నిజకల్యాణ గుణార్ణవ
అనంత శ్రీవేంకటాద్రినివాస. ॥ తే శరణ ॥

ఏ జీవిని చూచినా, బాధించినా, దూషించినా,
గౌరవించినా, సేవించినా అది భగవంతునికే తగులుతుంది.

టీక

శైశవకృష్ణ = శిశుస్థితిలో నున్న కృష్ణా!, తే = నీకు, అహం = నేను, శరణం = శరణమును (సమర్పణమును), అహం = నేను, శరణం = శరణమును, తే = నీకు, శరణం = శరణమును, గతః = పొందినవాడను, అస్మి = అగుచున్నాను.

దశవిధ+అవతార = పది విధములగు అవతారములయినవాడా!, ధర్మరక్షక మూర్తి = ధర్మమును రక్షించు స్వరూపము గలవాడా!, దశమస్తక+అసురదళన = పది తలలు గల అసురుడగు రావణుని చీల్చినవాడా!, దశాదిశా పరిపూర్ణ = పది దిక్కుల యందు చుట్టు నిండిన, తపనీయ స్వరూప = ప్రకాశించు స్వరూపము గలవాడా!, దశ+ఆవరణ= పది ఆవరణములతో గూడిన, లోకతత్త్వాతీత = లోకము యొక్క స్వభావమునకు అతీతుడైనవాడా! లోకములోని తత్త్వములకు అతీతుడైనవాడా!

సహస్ర లోచన = వేయి కనులు గల – 'సహస్ర' అను చూపు గల ఇంద్రునిచే, సంతత వినుత = ఎల్లప్పుడు విశేషముగా స్తుతింపబడువాడా!, సహస్ర ముఖ = వేయి నోరులు గల – 'సహస్ర'మే ముఖముగా గల, శేషశయన = శేషుడు శయ్యగా గలవాడా!, సహస్ర కరకోటి = కోటి వేయి కిరణములతో, వేయి కిరణముల అంచులతో కూడి, సంపూర్ణతేజ = చక్కగా నిండిన తేజస్సుతో గలవాడా!, సహస్ర+అర = వేయి అంచులు గల, దివ్యచక్ర+ఆయుధ = స్వయంప్రకాశమైన చక్రము ఆయుధముగా గలవాడా!, సహస్రార = సహస్రారమే, దివ్యచక్ర+ఆయుధ = స్వయమైన తేజము గల చక్రమే ఆయుధముగా గలవాడా!

అనంత చరణ = అంతులేనన్ని పాదములు గలవాడా!, అంతులేని నడక గలవాడా!, అనంతుడయిన శేషుడే తన పాదముగా గలవాడా!, సర్వ+ఆధార+ఆధేయ = సర్వము నకు ఆధారమును, సర్వమును పుట్టింపజేయువాడును, సర్వ+ఆధార+ఆధేయ = తాను ఆధారమైనది గలది ఏదియో ఆ సర్వము తాను అయినవాడా!, అనంత కర దివ్య+ఆయుధ = అంతులేనన్ని చేతులందు దివ్యాయుధములు గలవాడా!, అనంత కర దివ్య+ఆయుధ = అంతులేనన్ని కిరణములతో గూడిన దివ్యాయుధములు గలవాడా!, అనంత నిజకల్యాణగుణ+అర్ణవ = అంతులేనన్ని తన సహజమయిన శుభములగు గుణములకు సాగరమయినవాడా!, అంతులేనన్ని పుట్టుక లేని శుభ గుణములకు సాగరమయినవాడా!, అనంత శ్రీవేంకటాద్రి నివాస! అంతులేని మహిమ గల, శుభస్వరూపమయిన వేంకటగిరి నివాసముగా గలవాడా!, అనంతుడయిన ఆదిశేషుడే శుభమగు శ్రీవేంకటాద్రిగా నివాసమయినవాడా!

పరిచయము

ఈ సంస్కృత సంకీర్తనమున అన్నమయ్య భగవంతుడగు శ్రీవేంకటేశ్వరుని వేద వాక్యములతో స్తుతించి, శరణు పొందుచున్నాడు. ఇది రామానుజులవారి శరణాగతి గద్యను కొంతవరకు పోలియున్నది. ఇందు బ్రహ్మవిద్య, పరబ్రహ్మమను వెలుగు యొక్క మహిమ, సృష్టి యొక్క విలాసము, మంత్రశాస్త్రము, ఖగోళము, శేషశేషిత్వ సంబంధము సులభ పదములతో వర్ణింపబడినది. ఇవియన్నియు స్వామిని గూర్చిన సంబోధనలలో

ఇమిడిపోయినవి. ఎన్ని శాస్త్రములైనను, సృష్టిలోని తత్త్వములయినను భగవంతుని వైభవములుగానే అన్నమయ్య దర్శించెను. ఇదియే భాగవత మార్గము. ఇట్లుగాక వీనిని విడివిడిగా ఎంతగా నేర్చినను తలకు బరువుగా మారునే కాని ఆనందమును కలిగింపజాలవు. తలకు బరువయిన విజ్ఞానముకన్న, అజ్ఞానమే మేలు. స్వామి యొక్క దివ్య విశాలరూపములో ఇవన్నియు భాగములుగా వేదర్షులు దర్శించిరి. ఇదియే అన్నమయ్య దర్శనము. ఈ సంకీర్తనమున వేదవిజ్ఞానముతో బాటు భక్తి, శరణాగతి గూడియుండుట వలన రమ్యత చేకూరినది. కపిలుడు ఇట్లే తత్త్వవిజ్ఞానమును, భక్తియోగముతో జోడించి తల్లికి బోధించెను. మరియు పల్లవిలో శరణాగతిని తెలుపుచు సంకీర్తనమును అన్నమయ్య ప్రారంభించెను. క్రింది చరణముల లోని విజ్ఞానమునకు పునాది ఈ శరణాగతియే అని అతడు చెప్పకయే చెప్పెను. శరణందిన భక్తునకే దర్శన జ్ఞానమును స్వామి ప్రసాదించును. అన్నమయ్య స్వయముగా విజ్ఞానమును సాధించలేదు. భగవంతుని దయ వలననే ఇది అతనికబ్బినది. శరణాగతిలో అన్నమయ్య హృదయకవాటము తెరచుకొన్నది. అందులోనికి స్వామి యను సూర్యుని నుండి విజ్ఞానమను కాంతి ప్రవేశించినది. ఇట్లు స్వామి యొక్క అనుగ్రహమే ఈ సంకీర్తనముగా రూపొందినది. మొదటి చరణమున 'దశ' అను శబ్దము నాలుగు పాదములందును, రెండవ చరణమున 'సహస్ర' అను పదము నాలుగు పాదములందును, మూడవ చరణమున 'అనంత' అను శబ్దము నాలుగు పాదములందును, ప్రారంభమున ప్రయోగింపబడుట అనుప్రాసతో మాధుర్యమును అందించుటే గాక, స్వామియందు భక్తిని, తత్త్వవిశేషములను అందించుచున్నది. ఈ సంకీర్తనము నిత్య పారాయణము చేయదగినది. దీనిని వేదవ్యాసుడు గాని, అతని సహాధ్యాయి గాని మాత్రమే రచించగలడు.

పల్లవి యొక్క తాత్పర్యము

"శిశువుగా నున్న కృష్ణా! నీకు నేను శరణందుచున్నాను, శరణందుచున్నాను, శరణందుచున్నాను."

వ్యాఖ్య

అన్నమయ్య పల్లవిలో శ్రీవేంకటేశ్వరుని శైశవకృష్ణునిగా దర్శించి శరణందు చున్నాడు. శిశు స్థితిలో కృష్ణుడు అమాయికులగు గోకులవాసులతో చనువుగా మెలగి వారికి తన సాన్నిధ్య మాధుర్యమును ప్రసాదించెను. అన్నమయ్య వారిలో నొకడుగా బాలకృష్ణునితో మెలగవలయునని తపించుచున్నాడు. సాధారణ శిశువుతో మెలగుట వలన కూడ మనము కోల్పోయిన శిశు లక్షణములను తిరిగి పొందగలము. అదియే మోక్షస్థితి. మరి పరమాత్ముడే శిశువుగా అవతరించినప్పుడు ఆయనతో మెలగినచో తీయని ఏ స్థితి కలుగునో ఊహింపలేము. చిన్నికృష్ణుని తన్నుచు, గ్రుద్దుచు, అతనిచేత తినిపించుచు, అతని చేతిమీదుగా భుజించుచు, అతనితో ఆడుకొనుటలో, ఆడించుటలో గోపాలురు, గోపికలు పొందిన అనుభూతి ఎంతటిదో! అదియే అన్నమయ్య అభిలాష. కావున శైశవకృష్ణుని సంబోధించుటే కాక, అతని లీలలను తన వర్తమాన జీవితమున ధ్యానమార్గమున అనుభవించి, ఈతడు అందు పాల్గొనెను. కృష్ణుడు శాశ్వత శిశువు కూడ. గోకులమున ఆడుకొను దినములలోను శిశువే. వివాహానంతరము శిశువే. కంసాదుల వధించుటలోను శిశువే.

మహాభారత యుద్ధమున శిశువే. యాదవ వినాశమందును శిశువే. తన నిర్యాణ సమయమునను శిశువే, క్రీడామయుడే. అతని నేవియు అంటలేదు. జీవితమంతయు అతనికి క్రీడయే. అతని కెల్లరి యందును ప్రేమయే. కాని ఎవరిష్టము వచ్చినట్లు వారాతనిని గూర్చి భావించుటలో బాధ్యత వారిదే. తాను మాత్రము శిశువే. ఏ సన్నివేశము గాని, ఏ వ్యక్తి యొక్క చేష్ట గాని అతనిపై ప్రభావము చూపలేదు. సహజముగా శాశ్వత స్వచ్ఛ శిశుమూర్తియే. అన్నమయ్య మూడుమార్లు శరణమను పదమును ప్రయోగించెను. తన శరీరమును, ప్రాణమును, మనోబుద్ధ్యాదులను – అనగా మూడు స్థాయిలలోను శరణందెను. మొత్తముమీద తన బ్రతుకును, తనను తానే శరణందెను. భౌతిక స్థాయిలోను, మానసిక స్థాయిలోను, ఆధ్యాత్మిక స్థాయిలోను శరణందెను. మరియు స్వామిపై భక్తి పెల్లుబుకగా పారవశ్యమున గూడ మూడుమార్లు శరణందెను. తన దేహమును, మనస్సును, హృదయమును మరచెను. శిశుకృష్ణునకే శరణందుటలో విచిత్రము గలదు. ఉపనిషత్తులలో వర్ణింపబడిన నిరాకార నిర్గుణ పరబ్రహ్మమును కొందరు ఉపాసింతురు. ఈ యుపాసన కన్న మధురమయినది, శిశుకృష్ణుని శైశవక్రీడలలో పాల్గొనుట. ఈ యంశమునే లీలాశుకుడను భక్తుడు శ్రీకృష్ణకర్ణామృతమున వెలిబుచ్చెను. ఈ సంకీర్తనమున 'గతః' ఇప్పటికే శరణందితిని అను భూతకాలిక భావమున్నది.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"పది విధములయిన అవతారములుగా అయినట్టివాడును, ధర్మమును రక్షించు స్వరూపము గలవాడును, దశకంఠుడగు రావణుని చీల్చినవాడును, పది దిక్కులందు చుట్టు నిండిన ప్రకాశించు స్వరూపము గలవాడును, పది ఆవరణములతో గూడిన లోకము యొక్క స్వభావమునకు, అందలి తత్త్వముల కతీతుడయినవాడును అగు శైశవకృష్ణునకు మూడుమార్లుగా శరణందుచున్నాను."

వ్యాఖ్య

ప్రతి చరణము యొక్క అంతమును పల్లవితో జోడించి భావింపవలెను. విష్ణువు పది అవతారములను దాల్చినట్లు ఎల్ల రెరుగుదురు. కాని అన్నమయ్య ఇచట స్వామి ఎందుకిట్లు అవతరించెనో వెల్లడించుచున్నాడు. ధర్మరక్షణకై రూపము లేని స్వామి రూపములను ధరించెను. అవతారమనగానేమి? పైనుండి క్రిందకు దిగివచ్చుట అని యర్థము. నిరాకారుడు, గుణాతీతుడయిన స్వామి సగుణుడు, ఒక్కొక్కసారి సాకారుడై దేహమును ధరించును. ధర్మమనగానేమి? జగత్తును ధరించునది. ప్రకృతి లోని సూర్యచంద్రాదులు, పంచభూతాదులు జీవుల నుండి ఏమియు అపేక్షించకుండగనే ప్రేమించుచున్నారు. ఇట్టి ప్రేమయే ధర్మము. మనము ప్రకృతికి, సూర్యునకు పూల మాలలు వేయుట, సత్కరించుట చేయుటలేదు గదా! ఇట్టి ప్రేమధర్మమును ప్రకృతి నుండి మానవుడు నేర్చి దాని నవలంబించినచో సంఘ జీవితము సాఫీగా సాగును. కాని ధర్మమునకు అలసట ఏర్పడుచు, అధర్మము పెరుగుచుండు సందర్భములు కాలగతిలో ఏర్పడుచుండును. ఇదియు కాలపురుషుడయిన స్వామి క్రీడయే. అపుడు స్వామి సాధు సంరక్షణకు, దుష్టశిక్షణకు,

ధర్మసంస్థాపనకు తన్నుతాను సృజించుకొందు నని గీతలో పలికెను. దుష్టులు వేరు, దుర్బలులు వేరు. దుష్టులనగా లోకకంటకులు – రావణాదులు. దుర్బలుడనగా సాధారణ మానవుడు – వ్యక్తిగతములగు బలహీనత లకు లోనయినవాడు. వీరిని స్వామి శిక్షింపడు. వీరికి తగు శిక్షణ నొసగును. రావణాదులను గూడ వ్యక్తిగత క్రోధముతో గాక ప్రజా సంరక్షణకు, ధర్మసంరక్షణకై శిక్షించును. వారికిని ఉత్తమ స్థితిని తరువాత నిచ్చును. అవతారమెత్తుటయు స్వామి క్రీడయే. అయితే అన్నమయ్య ఇచట ఒక చమత్కారమును చేసెను. సంబోధించినది కృష్ణుని. అతడు పది అవతారములను దాల్చెనని తెలుపుచున్నాడు. ప్రసిద్ధ శ్లోక మొకటి గలదు. అందులో పది అవతారములలో ఎనిమిదవవాడుగా బలరాముడు కీర్తింపబడెను. కృష్ణుడు గాదు. పది ఆకృతులు ధరించిన కృష్ణునకు నమస్కారమని కీర్తింపబడెను. 'కృష్ణస్తు భగవాన్ స్వయమ్' అని భాగవతము చెప్పుచున్నది.

ప్రళయమున దాగిన సృష్టి ధర్మములే వేదములు. వానిని తిరిగి వెలుగులోనికి తెచ్చి సృష్టికర్తకు, సృష్టి ధర్మములను స్ఫురింపజేయువాడే మత్స్యావతారము. మన భూమధ్యరేఖకు ఉత్తరమున గల ఆకాశపు డిప్ప యందలి తారకామండలమును శింశుమారచక్ర మందురు. శింశుమార మనగా తాబేలు. దీని తోక ధ్రువతార వద్ద నున్నది. ఈ చక్రము నధిష్ఠించిన ప్రజ్ఞయే కూర్మావతారము. ప్రళయమున దాగిన జగత్తు యొక్క భౌతికమగు అస్తిత్వమును వెలికితెచ్చు అవతారమే వరాహావతారము. గ్రహముల గోళాకారములు ఇంకను భౌతిక ద్రవ్యాకృతి ధరింపని స్థితినే రసాతల మందురు. దీనినుండి ద్రవ్యస్థితిలోనికి విష్ణుడు గ్రహ గోళాకారములను తెచ్చును. తానే దేవుడనని తక్కిన వారందరు అంగీకరింపవలెనను అసురమగు మదమే హిరణ్య కశిపుడు. ఈ గుణము మనలో బ్రద్దలయినచో ఆహ్లాదము కల్గును. ఇదియే ప్రహ్లాదుడు. మదము తొలగి, ఆహ్లాదము కలుగుటకు కావలసిన సంకల్పము – శ్రద్ధ ప్రతి నరునిలోను సింహము వలె దాగియుండును. ఇదియే నరసింహావతారము. మనలో ద్రవ్యమయము, ప్రాణశక్తిమయము, ప్రజ్ఞామయము అను మూడు కక్ష్యలున్నవి. ఇవియే మూడు పదములు. అందలి జీవభావనయే బలి. నేను సద్గుణములు గలవాడ నను అతిశయమే బలి. దీని నాక్రమించు దైవభావనయే వామనుడు. ఈతడు మూడు కక్ష్యలను అంతర్యామిగ ఆక్రమించెను. మానవ జాతిలో అనాగరికములయిన హింసలు, పాలకుల పీడనము పెరిగినపుడు ప్రజలలోనుండి సమష్టిగా పాలకులను ఎదుర్కొను సంఘ నాయకావతారమే పరశురాముడు. ఈతడు నేలపై వర్తించెను. వామనుని వరకు ప్రజ్ఞలు. దుష్టశిక్షణ వరకే పరశురాముని పని. దుష్టశిక్షణయే గాక, ధర్మస్థాపన, ఆదర్శ మానవోత్తమ గుణములు కలబోసిన పూర్ణావతారమే శ్రీరాముడు. ఆపైన నాగలి పట్టి, దుష్టశిక్షణయే గాక, కర్షక వృత్తికి ప్రాధాన్యమిచ్చి, నదీజలములను సాగుబడికై మరలించిన అవతారము బలరాముడు. కలియుగము మొదట రాక్షసులకు సమ్మోహనము కలిగించుటకై కీకట ప్రాంతమున బుద్ధుడవత రించెను. అనగా కామక్రోధాదులను, వానిచే ప్రేరేపింపబడిన దుష్టులను ప్రేమ మార్గమున ప్రభావము కోల్పోవునట్లు చేసెను. పాషండత్వము, అధర్మము అను ప్రమాదము నుండి దేశమును కాపాడెను. గౌతమబుద్ధుడు గాడీతడు. గౌతమబుద్ధుడు గూడ దేవుని అనేకావతారములలో నొకడు గాని,

దశావతారములలోనివాడు గాడు. కలియుగాంతమున పాలకులు దోపిడీకాండ్రై ప్రజలను దోచుకొందురు. వీరిని సంహరించి, అధర్మమును తొలిగించి, ప్రజలను కాపాడి, సత్యయుగమును నెలకొల్పుటకై 'కల్కి'గా భగవానుడు 'శంబల' గ్రామమున ఉదయించును. ఈ గ్రామ మిప్పటికీ దివ్యతేజోమయముగా హిమాలయములందు మహర్షులచే నిర్మింపబడు చున్నది. మత్స్య కూర్మాది అవతారములకు విశిష్ట భావన వేరొకటి గలదు. ఖనిజాదులు పుట్టిన వెనుక భూమియందు జలము వర్షించి మొత్తము నీటితో నిండినది. అపుడు నీటిలో మొదటి జీవి యగు చేప పుట్టినది. నీటినుండి భూమి డిప్ప వలె తేలి తాబేటి వలె గట్టిపడినది. మరియు కూర్మావతార మనగా వేరొక విశేషార్థమున్నది. తల్లి గర్భమున జీవుడు పడిన పిమ్మట సుడిగుండము వంటి కదలిక పుట్టును. మొదటిగా బుడగ వంటి ఆకారమేర్పడును. బుడగ ఏర్పడి ఘనీభవించి ఆపై పిండ మేర్పడును. ఇది కూర్మావతార కథ. అనంత కాలమున పుట్టుక, గిట్టుకల నడుమ ఆయుర్దాయ మను అమృతమును గొనితెచ్చుట జరుగును.

ఇవిగాక అనేక సందర్భములలో ధర్మసంరక్షణకు, ప్రజలను ఆధ్యాత్మిక మార్గమున నడుపుటకు భగవదవతారములు పెక్కులు వచ్చుచుండును. భాగవతమున ఒకచోట 21, వేరొకచోట 27 అవతారములు గూడ చెప్పబడినవి. ప్రధానములయినవి పై పది. ఇకముందు కూడ అంశావతారములు వచ్చునని భాగవతమున చెప్పబడినది. పరిపూర్ణావతారములగు శ్రీరామ, శ్రీకృష్ణులు ఈ సంకీర్తనమున స్తుతింపబడిరి. తమ జీవితమున ఏ క్షణమునను, ఎట్టి పరిస్థితులలోను వీరు ధర్మమునకు కట్టువడిరి. ధర్మసంరక్షణకై జీవితము నర్పించిరి. రాముడు వనవాసము చేయుట, సీతా వియోగమును పొందుట ధర్మరక్షణ కొరకే. కొడుకుగా, భర్తగా, అన్నగా, మిత్రుడుగా, పాలకుడుగా, యజమానిగా అన్ని పాత్రలలోనూ ధర్మమును పాలించి రక్షించెను. కావున రెండవ పాదమున పది తలలు గల రావణుని ఛేదించినవాడని అన్నమయ్య కీర్తించెను. పది తలలనగా పది ఇంద్రియములకు లోలుడై వర్తించుట. ఇతర స్త్రీలను, సంపదను కొల్లగొట్టి, ప్రజలలో సమైక్యమును చెడగొట్టిన రావణుని శ్రీరాముడు బ్రహ్మాస్త్రముతో ఛేదించెను. శిరసును శరీరము నుండి వేరుచేసెను. కావున 'దళన' అను పదము ప్రయోగింపబడినది. అహల్య, గుహుడు, జటాయువు, శబరి, హనుమంతుడు, విభీషణుడు, వానరాదులను వాత్సల్యముతో ఉద్ధరించెను. ధర్మమును రక్షించువాడు ముందుగా తాను ధర్మమును పాటింపవలయును గదా! మారీచుడను అసురుడే రాముని 'ధర్మమే రూపమెత్తినవాడ'ని నుతించెను. శూర్పణఖయు అతని ప్రస్తుతింపక తప్పలేదు. అట్లే శ్రీకృష్ణుడు గూడ తల్లిదండ్రుల యెడ, మిత్రుల యెడ, ఆశ్రయించిన పాండవాదుల యెడ, అమాయికులగు గోకులవాసుల యెడ, గురువులగు గర్గుడు, సాందీపని – వీరి యెడల, ప్రజల యెడల ధర్మమునే పాటించెను. 16,100 మంది స్త్రీలను గూడ కాపాడుటకై వివాహమాడెను. ఇచ్చటను ఈతని మనస్సు దేనికిని అంటువడలేదు. ధర్మరక్షణకై మొగమాటపడలేదు. ఈతడు అఖండ భారత ధర్మస్రవంతిని విశ్వవిశాల మానవ ధర్మముగా తెలిపెను. వేదసారములగు గీతలను బోధించెను. సమగ్ర భారతదేశ నిర్మాణమునకు, ధర్మరక్షణకు బ్రతుకును అంకితము చేసెను. ప్రాణత్యాగమునకు కూడ సిద్ధపడెను. శ్రీకృష్ణుడు ధర్మస్వరూపుడు, ధర్మ సంరక్షకుడు.

శ్రీకృష్ణుని జీవితములో ఈ యంశముల జోలికి పోక, ఆయన చమత్కారములను మాత్రమే చూచుట పాక్షిక దృష్టి. అన్నమయ్య అట్లుగాక పల్లవిలో కృష్ణుని శిశుమూర్తిగ దర్శించి, చరణమునందు ధర్మరక్షకమూర్తిగా కీర్తించెను. ఈతనిది సమగ్ర దర్శనము. శ్రీరామునకును, శ్రీకృష్ణునకును కూడ కష్టములు ప్రాప్తించినవి. అవి కృష్ణుని అనుభవమునకు సోకలేదు గావున శిశుమూర్తి యని అన్నమయ్య పేర్కొనెను. శిశువులకు సుఖదుఃఖము లంటవు గదా! ఇట్లు శ్రీవేంకటేశుడను పరబ్రహ్మమునకు శరణందుచున్న అన్నమయ్య ముఖ్యముగా శ్రీరాముని, శ్రీకృష్ణుని స్మరించెను. రామ స్మరణతో మనలోని ఇంద్రియములు వశములగును. రాముడున్న చోట కాముడుండడని కబీరు సూక్తి. కృష్ణ స్మరణతో మనలో సదా అంతరాత్మ యొక్క గీతాప్రబోధము వినపడుచుండును. మనమును శిశుత్వమునందెదము. ఇక స్వామి పది దిక్కులందును తన తేజస్సును వెదజల్లుచున్నాడు. నారాయణ కవచమున ఇట్లు కీర్తింపబడెను. తూర్పు, దక్షిణము, పడమర, ఉత్తరము అను నాలుగు దిక్కులందును, ఆగ్నేయము, నైరుతి, వాయవ్యము, ఈశాన్యము అను విదిశలందును – మూల లందును, పైన, క్రింద కలిపి పది దిక్కులందును నారాయణ చైతన్యము నిండి యున్నది. ఎవడికి వాడు తాను నిలుచుండిన చోటునుండి ఈ పది దిక్కులను గుర్తింపవచ్చును. ప్రతివాడు కేంద్రమే. పరిధి మాత్రము ఎచటను లేదని పైథాగొరస్ అను యోగి చెప్పెను. తాను నిలుచుండిన చోటునుండి పది దిక్కులందును శూన్యమును గాక, లోన దాగిన దేవుని చైతన్యమును ధ్యానింపవలెను. దేవుని ప్రేమయే ఇచట ఆయన తేజస్సు. అందుండి వెలువడు కాంతి పది దిక్కులయందు వ్యాపించినట్లు అన్నమయ్య భావించెను. మరియు సూర్యుని కాంతి పది దిక్కులందు తాపము – అనగా వేడిమిని కల్గించునట్టిదై వ్యాపించియున్నది. ఇది కంటికి కనపడు కాంతి మాత్రమే గాదు. సౌరశక్తియే ఇట్లు సూర్యుని వెలుగుగా వ్యాపించుచున్నదని శాస్త్రవేత్తలు చెప్పుచున్నారు. అన్నమయ్య ఇంకను లోచూపు గలవాడు. కాంతిగ వచ్చునది సూర్యుని శక్తి. దీని కాధారము సూర్యుని యందు దాగిన చైతన్యము లేక నారాయణుడు. స్వామి యొక్క పరమప్రేమయే సౌరశక్తిగా, సూర్యకాంతిగా వ్యాపించుచున్నది. కావున సూర్యకిరణములు, స్వామి యొక్క ప్రేమప్రవాహపు కాలువలుగా మహర్షులు దర్శించిరి. స్వామి ప్రేమయే మనకు వలసిన వేడిమిని ప్రసాదించుచు ప్రాణశక్తిని అనుగ్రహించుచున్నది. ఇచట కావలెననియే అన్నమయ్య 'తపనీయ' అను పదమును ప్రయోగించెను. 'తపనీయ' అనుటలో ప్రకాశమనియే గాక వేడిమి కూడ జోడింప బడినది. పల్లెలలోను, పొలములలోను సూర్యరశ్మి క్రింద జీవించువారలకు ప్రాణశక్తి ఎక్కువగా నుండును. ఉదయసూర్యుని కాంతులు ఆరోగ్యదాయకములు. సూర్యోదయము నెరుగని వారికి ప్రాణశక్తి అంతగా నుండదు. విశ్వమునకు కేంద్రము కృష్ణుడు. విశ్వ వలయమును ప్రకాశింపజేయు ఉజ్జ్వల రత్న మాతడు. లోకము దశావరణములతో గూడిన తత్త్వము గలది. అనగా లోకము యొక్క స్వభావము, పది ఆవరణములతో గూడినది. తత్త్వ మనగా సారమనియు అర్థము. లోకము అనగా చూపు అనియు అర్థము. మన చూపుకు అనగా మన యూహకు గూడ అందునట్టి జగత్తు. ఇందలి స్వభావము, సారము పది ఆవరణములతో గూడినవి. ఆ పదిని గూర్చి పురుషసూక్తము చెప్పుచున్నది. పది అంగుళములను దాటి పురుషు డున్నాడని చెప్పబడినది. మన హృదయము నాభికి ఎగువన పది వ్రేళ్ళ పైన ఈశ్వరు డున్నాడని ఒక అర్థము.

మరియు వెలుపలి జగత్తును ఘనపదార్థములు, జలములు, అగ్ని (వేడిమి, వెలుగు), వాయువు (చోటులోని స్పందనము), చోటు, మనస్సు, బుద్ధి, అహంకారము – ఈ ఎనిమిదింటిని పనిచేయించు పరాశక్తి, ఈ తొమ్మిదింటికి కారణమైన మూలప్రకృతి మొత్తము పది ఆవరణములు గలది జగత్తు. ఈ పదిని దాటినవాడు పరమాత్ముడు. ఇవి అన్నియు స్వామినుండియే వెలువడుచున్నవి. వీనిలో అంతర్యామిగా లోపల కేంద్రమగు స్వామికి చుట్టునున్న ఆవరణములు పై పది. ఆవరణములనగా ఆవరించునవి. ఈ పదికి ఆవలి వెలుగు స్వామి. మరియు శ్రీచక్రమున తొమ్మిది ఆవరణములు గలవు. నాలుగు శివ చక్రములును, అయిదు శక్తి చక్రములును గలవు. ఇవి అన్నియు కలిసిన శ్రీచక్రము పదియవది. ఆ పదింటికి అతీతము పరమాత్మ. ఇట్టి స్వామికి అన్నమయ్య శరణందెను.

2వ చరణము యొక్క తాత్పర్యము

"సహస్రము – వేయి లోచనములు – కన్నులు గల ఇంద్రునిచే ఎల్లప్పుడు విశేషముగా నుతింపబడువాడా!, సహస్ర – వేయి నోర్లు గల శేషునిపై శయనించు వాడా!, సహస్ర – వేయి కిరణముల సమూహముతో కూడిన బాగుగా నిండిన తేజస్సు గలవాడా! నమస్కారము – వేయి అంచులు గలది యైన దివ్యమగు చక్రము ఆయుధముగా గలవాడా! నీకు శరణందినవాడను."

వ్యాఖ్య

ఇంద్రుడు వేయి కన్నులు గలవాడని పురాణ ప్రసిద్ధి. అట్టి ఇంద్రునిచే స్వామి వినుతింపబడుట సదా జరుగుచుండును. ఇంద్రుడనగా మనలోని ఇంద్రియముల కధిపతి యగు మనస్సున కధిదేవత. ఇంద్రియములు, మనస్సు నిరంతరము లోనున్న స్వామిపై ఆధారపడి యున్నవి. ఆ యంశమును గ్రహించి అవి స్వామి కర్పితము లయినచో ధన్యములగును. ఒక ప్రక్రియను చేపట్టు సూర్యునే ఇంద్రుడని వేదము నందు తెలుపబడినది. సూర్యునకు 1000 రకములగు అక్షరములు (బండి ఆకులు) గలవు. 10 భౌతిక కక్ష్యలోను, 10 శక్తిమయ కక్ష్యలోను, 10 ప్రజ్ఞామయ కక్ష్యలోను పనిచేయుచున్నవి. $10 \times 10 \times 10 = 1000$ గదా. మరియు 'సహస్ర' అనగా వేయి అనియే గాక, మంత్రార్థ మొకటి వేరుగా గలదు. గాలి పీల్చునపుడు 'స' అను ధ్వనియు, విడుచునప్పుడు 'హ' అను ధ్వనియు, మరల గాలి పీల్చునపుడు 'స' అను ధ్వనియు, కంఠ ధ్వనిలో 'ర' అను ధ్వనియు కలిసి 'సహస్ర' అను శబ్ద మేర్పడును. ఇది యొక మంత్రమని, మంత్రశాస్త్రమున గలదు. ఇట్టి 'సహస్ర' అను మంత్రమే లోచనములుగా – చూపులుగా గలవాడే సూర్యుడు. అతనిలో అంతర్వర్తి నారాయణుడు. కావున సూర్యునిచే వినుతింపబడువాడు స్వామి. సూర్యుని కాంతి, సౌరశక్తి నారాయణునిపై ఆధారపడియున్నవి. వేయి ముఖములు గలవాడని శేషునికి ప్రసిద్ధి గలదు. మరియు 'సహస్ర' అను మంత్రమే ముఖముగా గలవాడు శేషుడు. మన భూగోళమున గూడ దక్షిణ ధ్రువము నుండి ఉత్తర ధ్రువము వరకు చుట్టి పనిచేయు చాలనశక్తిగా శేషుడున్నాడు. భూగర్భమున దిగువగా పాతాళమున నున్నట్లుగా శేషుని గూర్చి భాగవతమున చెప్పబడినది. శేషుడు చుట్టలుగా

చుట్టియుండుటచే పాముతో పోల్చబడెను. ఈ శేషుని వలననే భూమి పరిభ్రమించుచున్నది. శేషుని పడగలపై భూగోళము ఆవగింజంత ఉన్నది. భూమి చుట్టును వ్యాపించిన శేషుని తేజస్సులే అతని పడగలు. శేషుడు అంతర్యామి యగు స్వామికి శయ్య. స్వామిలో భాగమే. 'సహస్ర' అను మంత్రము సూర్యునికి అక్షము కాగా, శేషునికి ముఖము. కోటి యనగా నూరు లక్షలనియు, అనేకమనియు, అంచు అనియు అర్థము కలదు. కర మనగా కిరణము. కోటి వేల కిరణముల తేజము గలవాడు, వేల కిరణముల అంచులు గలవాడు స్వామి. ప్రతి తారకయు పెద్ద సూర్యుడే. కోట్ల తారకల కాంతులు స్వామివే. శ్రీకృష్ణుని విశ్వరూపమున అర్జునుడు వేల సూర్యులు ఒకేసారి ప్రకాశించు చున్నట్లు దర్శించెను. అనగా విశ్వరూపుడయిన స్వామి తేజస్సులే కోట్ల తారకల వేల వేల కాంతులు. అన్నమయ్యయు అర్జునుని వలె స్వామి యొక్క విశ్వరూపసందర్శన భాగ్యము నొందెను. అర్జునునకు కృష్ణుడు దివ్యమయిన దృష్టిని ప్రసాదించెను. అనగా లోచూపు నొసగెను. ఇట్టి దృష్టియే స్వామి అన్నమయ్యకును ప్రసాదించెను. మరియు 'సహస్ర' మంత్రమే కిరణముగా గలవాడు సూర్యుడు. ఇట్టి సూర్యులు కోటిమంది తేజస్సులు గలవాడు స్వామి. ఇక స్వామి ఆయుధము చక్రము. భూమిపైనున్న మనకు సూర్యకాంతి ఎంతమేర ప్రసరించుచున్నట్లు కానవచ్చునో ఆ వెలుగు గోళమే చక్రము. మరియు సర్వమున సర్వులలో అంతర్యామిని దర్శించుటనే సుదర్శన మందురు. మన హృదయములో శ్రీవేంకటేశ్వరుడు నిలిచియున్నట్లుగా ధ్యానించినచో మనలోని సహస్రారమే స్వామి యొక్క దివ్యమయిన చక్రాయుధముగా భాసించును. అన్నమయ్యకు ఇట్టి సాక్షాత్కారము ప్రాప్తించినది. అతని హృదయమున స్థిరముగా వేంకటేశ్వరుడు నిలుచుటచే, అతని శిరస్సు నందలి సహస్రారము, సహస్ర దళముల తోడి కమలమై విచ్చుకొని, స్వామి యొక్క చక్రాయుధముగా ప్రకాశించినది. వేయి అరలు గలది సహస్రారము. అనగా సహస్రారమను తామరకు వేయి రేకులు గలవు. మరియు 'సహస్ర' అను మంత్రమే తన అంచుగా గలది. అన్నమయ్యలో యోగ సాధనలో దైవానుగ్రహమున మూలాధారమున గల కుండలినీ శక్తి బ్రహ్మరంధ్రము గుండా సహస్రారమును చేరినది. ఇక అన్నమయ్య స్వామి నుండి వేరుగాలేడు. సహస్రారమున జేరిన అన్నమయ్య ప్రజ్ఞ, పరమాత్మ అను ఆనందసాగరమున మునిగినది. అన్నమయ్య ఆనందమైనాడు. చక్రము జీవుడు, పరమాత్మ అను జంటను ఒకటి చేయునని నారాయణ కవచమున చెప్పబడినది. ఈ స్థితి జరుగుటలో ఒక భౌతిక సాధన కూడ కలదు. అనగా అన్నమయ్య ఏడుకొండలెక్కి స్వామి దర్శనముతో పులకరించెను. ఆ పులకలో అతనికి తెలియవలసిన పని లేకయే కుండలిని అతనిలో సహస్రారమును చేరినది. భక్తి, శరణాగతి, సేవలలో తనియు వారికి ప్రత్యేకముగ యోగ పరిభాష – కుండలిని, షట్చక్రములు తెలియ పనిలేదు. ఇట్లు అన్నమయ్య ఏడవ కొండ చేరి స్వామిని దర్శించుట, అటు అతనిలో ప్రజ్ఞ సహస్రారమును చేరి ఆనందమున మునుగుట ఒకేసారి జరిగెను. బయట గుడిలో గానవచ్చిన స్వామి ఈతనికి తన హృదయముననే నిత్యము గానవచ్చెను. స్వామి ధరించిన తేజోమయ మయిన చక్రాయుధమే తన సహస్రారముగ భాసించెను. ఇది ఈతని అనుభూతియే గాని, వట్టి నుతి గాదు. ఆ యనుభూతిని లోకమునకు పంచిపెట్టు సంకల్పము, స్వామి

నుండి బయలుదేరి ఇతనిని చేరి ఈ సంకీర్తనముగా వెలసినది. కావున ఈ సంకీర్తనను భక్తితో గానము చేసిన వారు, విన్నవారు గూడ అన్నమయ్య స్థితినే పొందగలరు.

3వ చరణము యొక్క తాత్పర్యము

"అంతులేనన్ని చరణములు గలవాడా! సర్వమునకు ఆధారమయినవాడా! సర్వమును పుట్టించువాడునయిన వాడా! భగవంతుడు తనకు ఆధారమయిన సర్వము తానయినవాడా! అంతులేనన్ని చేతులలో దివ్యాయుధములు గలవాడా! అంతులేనన్ని సహజములగు శుభగుణములకు సాగరమయినవాడా! అంతులేని కొండ యగు శ్రీవేంకటాద్రి నివాసముగా గలవాడా! అనంతుడయిన శేషుడే శ్రీవేంకటాద్రి కాగా, అది నివాసమయినవాడా! ఓ శైశవకృష్ణా నీకు శరణందినవాడను."

వ్యాఖ్య

స్వామి అంతులేనన్ని చరణములు గలవాడని అన్నమయ్య దర్శనము. అనగా స్వామి విశ్వరూపుడు గావున, సర్వ జీవుల చరణములు స్వామి చరణములే. అంతులేనంత మంది జీవులు ఆయా గ్రహ తారకాదులందు గలరు. వారి చరణముల నెల్లటిని స్వామి చరణములుగనే అన్నమయ్య హృదయము దర్శించి, అనుభూతి నొందెను. ఇట్టి దర్శనమునే దివ్యదృష్టి యందురు. అంతేగాని ప్రస్తుతమున్న కండ్లు గాక, క్రొత్త కండ్లతోడి చూపులని యర్థము గాదు. కృష్ణుడు అర్జునునకు దివ్యదృష్టి నొసంగెను. అనగా పూర్వము అర్జునుడు జీవులను వేరువేరుగా చూచుట కలవాటు పడినవాడు. ఇపుడు వీరెల్లరుగా నయినది సర్వాంతర్యామి యగు ఒక దేవుడని తలంచుటే గాక అనుభూతి గల్గెను. ఎల్లరును దేవదేవుని శరీరమునందే కన్పడిరి. కావున దివ్యదృష్టి అనగా క్రొత్త కండ్లని గాదు, మనము సమాజమును చూచు దృక్పథము ఉదాత్తమై, దివ్యమగుట. ఇది అన్నమయ్యకు లభించినది. విశ్వమంతయు స్వామి దేహముగనే దర్శనమిచ్చెను. కావున ఎల్లరి పాదములు స్వామి పాదములే. మన భూమిపై జీవుల శరీరములు ఈ భూమి యందలి ద్రవ్యముచే చేయబడినవి. అట్లే ఇతర గ్రహములందును, తారకలందును అచ్చటి పదార్థము చేత గాని, తేజస్సు చేత గాని చేయబడిన శరీరములు గల జీవులున్నారు. మన భూమిపైననే జీవు లున్నారు, ఇతర గ్రహములలో లేరనుకొనుట సంకుచితత్వము, మౌఢ్యము. కొన్ని గ్రహములపై మనకన్న పరిణామమున ప్రగతి పొందిన జీవులును గలరు. ఉదాహరణకు గురు, శుక్ర గ్రహములందు ఇట్టి జీవులున్నారు. సూర్య కిరణములు గూడ పరమ ఋషీంద్రులగు జీవులే. తాను గురువును, భక్తుడనని భ్రమించువాడు ఇతరులు తమ పాదములకు నమస్కరింపవలెనని అభిలషించును. ఒక్కొక్కసారి ఇతరు లట్లు తమ పాదములకు మ్రొక్కుచుండగా పైకి "నాదేమున్నది, అంతయు స్వామి దయ, స్వామికే నమస్కరించుడు" అనుచున్నను మనస్సు లోపల అహంకారమను పొర ఇతరుల నమస్కారములను, గౌరవమును కోరుచునే యుండును. కావున పతనము నొందును. ఇతరుల నమస్కారములను తనకు చెందుచున్నవని భ్రమించు వాడు వాడి చెడుకర్మ ఫలితమును కొంత స్వీకరింపక తప్పదు. ఆ పంపిణీ వలన వ్యాధిగ్రస్తుడు గూడ గావచ్చును.

గుండె గాని, మూత్రపిండములు గాని రోగమునకు గురిగావచ్చును అని ఋషులు చెప్పిరి. మరియు ఇతరుల గౌరవమునకు సంతసించు వానికి ఇంకొక విపత్తు గలదు. తనను గౌరవింపనివారి యెడ తిరస్కార బుద్ధి, జుగుప్స, రోషము, ఫలితముగా దుఃఖము, రోగము కలుగును. మన పాదములకు నమస్కరించి, గౌరవించువాని రూపములో విష్ణువే, మనము గూడ ఇతరుల రూపము లోని విష్ణుని గౌరవింపవలెనని నేర్పుచున్నాడు. గౌరవించుట అనగా గౌరవము నేర్పుటే. మనకు ఇతరులు నమస్కరించినను, మనము ఇతరులకు నమస్కరించినను ఆ నమస్కారము ఇరువురిలో అంతర్యామి యగు స్వామికే సమర్పింపవలయును. మనలను గౌరవించని వారిలో నుండి మన ముఖ మెట్లుండునో స్వామి పరీక్షించు చుండును. మానము, అవమానము రెండును స్వామి లీలలే. గౌరవింపని వానిని ప్రేమించుట అభ్యసింపవలెను. ఇతరుల పాదములు స్వామి పాదములని నమ్ముట చాలదు, నచ్చవలెను. నిజమయిన గురువు, భక్తుడు సర్వుల పాదములు విష్ణుని పాదములుగా భావించి, నమస్కరించి, గౌరవించుటకు సంసిద్ధుడగును. తాను గురువు నని గురువెన్నడు భావింపడు. అనంత చరణుడయిన స్వామికి సేవకుడనని భావించును. అన్నమయ్య ఇట్టివాడు. చరణము లనగా పాదములనియే గాక చరించు రీతులని అర్థము. అనంత చరణుడనగా అంతులేనన్ని మంచి ఆచరణ విధానములు గలవాడు. కావున స్వామిని అన్నమయ్య నీ నడవడిని, నీ ప్రేమను నాకును దయసేయుమని ప్రార్థించుచున్నట్లు ఈ సంబోధనలో తెలియుచున్నది. ఇక సర్వమున కాధారము స్వామి యని భక్తు లెల్లరు కీర్తించుట పరిపాటియే. ఆధేయ మనగా పుట్టించునది, కలుగజేయునది అని అర్థము. కావున సర్వమును పుట్టించినది, సర్వమున కాధారమై నడుపునది, పోషించునది స్వామియే. కాని ఆధేయమను పదమును విశేషార్థములో గూడ అన్నమయ్య ప్రయోగించెను. దేనికి స్వామి ఆధారమై యున్నాడో ఆ సర్వము గూడ స్వామియే యని ఈ విశేష భావము. సర్వజగత్తుకు ఆధారము స్వామియే, మరియు స్వామి తన కాధారముగా గల సర్వజగత్తు కూడ స్వామియే అను విశేష భావమును అన్నమయ్య వెల్లడించెను. ఇది విశిష్ట ప్రయోగము. కుండకు ఆధార మయిన మట్టియే కుండ యను స్థితిలోనికి మార్పు చెందినది. కావున మట్టి తన కాధారమయిన కుండయు మట్టియే. గోధుమపిండితో చపాతీలు చేయుదురు. చపాతీల కాధారము గోధుమపిండియే. మరియు చపాతీ గూడ గోధుమపిండి యొక్క స్థితి మార్పు. కావున ఇదియు గోధుమపిండియే. మొత్తమున జగత్తును, జీవులను పుట్టించిన వాడు – వానికాధారముగా వారియందంతర్యామి అయినవాడు స్వామి, మరియు ఈ జగత్తు, జీవులును స్వామియే. ఇది అన్నమయ్య దర్శనానుభవము. ఇతని దృష్టికి స్వామియే గాక వేరు లేరు. అందరి చేతులు దేవుని చేతులే. ఆయుధములనగా ఇచట యుద్ధ పరికరములనియే గాక చేతులందలి శక్తిసామర్థ్యములు. కావున అంతులేని జీవుల చేతులలోని ఆయుధములు – శక్తిసామర్థ్యములు స్వామివి. మానవునికి సొంత శక్తి యని లేదు. ప్రాణము లేనిది చేయి పనిచేయలేదు. ఆ ప్రాణశక్తి స్వామికి చెందినది. జీవునిది గాదు. అట్లే ఇంకొకరికి పనిచేసి మేలు చేయవలెనను సంకల్పము, ప్రేమ లేనిది చేయి ఏమియు తానుగా చేయజాలదు. ఈ సంకల్పము, ప్రేమ దేవుని నుండి జీవునకు వచ్చును. ఇట్లు అనంతములయిన చేతులలోని శక్తి సామర్థ్యములు స్వామివే గాని, తమవి కావని గ్రహించిన వారికి దేవుని నుండి ఇవి లభించును గాన ఇవి

దివ్యములు. మరియు కరము లనగా కిరణములు. సహస్ర కిరణుడయిన సూర్యుడు ఒకడే కాదు. ఆకాశమున అనంత సంఖ్యలో సూర్యులున్నారు. వీరి కిరణములు – కరములు అనంతములు. కరములను పదమునకు చేతులనియు, కిరణములనియు అర్థము. అనంత సూర్యుల అనంత కిరణములలోని దివ్యాయుధము లనగా దివ్యకాంతులు. ఈ సూర్యకిరణముల కాంతులు భౌతికములయినవి కావు. సూర్యులలో దాగిన దేవుని దయ, ఆయన శక్తియే ఈ కాంతులుగా వచ్చినవి గావున ఈ ఆయుధములు దివ్యములని అన్నమయ్య చెప్పుచున్నాడు. ఇట్లు అనంత సూర్యుల అనంత కిరణములలోని దివ్యకాంతులే ఆయుధములుగా గలవాడు స్వామి. గీతలో ఇవి వివరింపబడినవి. ఇక స్వామి యొక్క శుభములయిన గుణములు – ప్రేమ, కరుణ, ధైర్య స్థైర్యములు, సహనము, సామర్థ్యము మున్నగునవి అనంతములు.

ఇన్నియని పరిమితము చేయలేము. పైగా స్వామి శుభగుణములు సహజములే గాని, ఎవరి నుండియో వచ్చినవి గావు. అవి నిజములు. వీనికి పుట్టుక లేదు. ఆయనకివి సహజ శోభలు. ఈ గుణములు అనంతములనియే గాక, అంతులేని సంఖ్య గల జీవులలో మంచి గుణములు తనవే అయినవాడని వేరొక అర్థము. మరియు ఇట్టి శుభగుణములన్నియు స్వామి ప్రయత్నించి పొందలేదు. ఈ గుణములు తాముగా కోరి నదుల వలె స్వామి యను సాగరమున జేరినవి. కాన స్వామి అనంత శుభగుణసాగరు డనుట స్వామి తత్త్వమును అన్నమయ్య చక్కగా తెలిపెనని గ్రహింప నగును. మరియు 'సాగర' అను పదమును గాక అన్నమయ్య 'అర్ణవ' అను పదమును ప్రయోగించెను. 'అర్+నవ' అనగా క్రొత్త క్రొత్తగా 'అర్' అను రాపిడి ధ్వనిని కలిగినది. సాగర తరంగముల రాపిడిలో ఎప్పటికప్పుడు 'అర్' అను ధ్వని పుట్టుచుండును గావున సాగరమునకు అర్ణవమని పేరు. ప్రళయమున గల చైతన్య జలములలోని రాపిడి వలన చోటులో సౌరకుటుంబములు పుట్టునని వేదమున చెప్పబడినది. చైతన్య జలము లనగా అనుభూతి ప్రవాహములు. ఇట్లు మూడవ చరణము నందలి మూడవ పాదమునకు సమగ్రమయిన భావమిది. అంతులేనన్ని సహజములగు శుభగుణములు, అంతులేనంత మంది జీవులలో వ్యక్తములగుచున్న తన శుభ గుణములు నదుల వలె చేరిన ఆనందానుభూతి సాగరమే స్వామి. అర్ణవ మను పదము ఆనందానుభూతి సాగరమును సూచించుచున్నది. ఎవరిలో శుభగుణము లుండునో, వారు ఆనందము నొందెదరు. ఎవరిలో శుభగుణములు పరిపూర్ణముగా నుండునో, అట్టివాడు దివ్యుడై ఆనందసాగరుడగునని అన్నమయ్య ఉపదేశించుచున్నాడు. స్వామి యొక్క దివ్య గుణములను, అవతార వైభవములను తలచి, తలచి తానును వాని నందెను. మరియు ఇతర జీవులలో గూడ సద్గుణములనే అన్నమయ్య దర్శించి, వానిని శ్రీహరి శుభగుణములుగా హృదయమార సంభావించెననమాట. అతనిది మహోదార హృదయము. ఇట్టి సహృదయుడు గావుననే స్వామి సంకీర్తన రూపమున ఇతని నుండి అవతరించెను. సంకీర్తనము కూడ స్వామి యొక్క అవతారమే. చివరగా అన్నమయ్య అంతులేని కొండ యగు తిరుమల నివాసముగా గలవాడని స్వామిని కీర్తించెను. మరియు అనంతుడనగా ఆదిశేషుడు. శేషుడే ఈ కొండ యొక్క ఆకారమును ధరింపగా శేషశాయి యగు నారాయణుడు శ్రీవేంకటేశ్వరుడుగ ఇచట వెలసెను. శ్రీశైలము నుండి తిరుమల వరకు శేషుడను పాముయొక్క

చుట్టల వలె ఒకే కొండ మలుపులతో నున్నది. ఈ పాము శిరసున శ్రీవేంకటేశ్వరుడును, తోక యందున శ్రీ మల్లికార్జునుడును వెలసిరి. తిరుమల శుభస్వరూపమైనది గావున దానికిని శ్రీశైల మను పేరు వచ్చినది. ఈ శేషాద్రికి కింద శ్రీదేవి యగు మంగాంబికయు, పైన వేంకటేశుడును వెలసినను కలిసియే యుందురు గావున స్వామిని శ్రీవేంకటేశుడని అన్నమయ్య కీర్తించెను. శ్రీదేవి స్వామి వక్షమున నెలకొని యున్నది. అనగా ఆయన హృదయము – ప్రేమ ఆమెయే. అన్నమయ్యకు శ్రీవేంకటేశుడని కీర్తించుట పరిపాటి. అతడు అమ్మవారిని, అయ్యవారిని కలిపి ఒకే వెలుగుగా దర్శించి, సేవించి యానం దించెను. ఇట్టి శ్రీవేంకటేశునకు గతముననే ఈతడు శరణందినవాడయ్యెను. అయినను ఉత్సాహముతో మరల మరల మూడుసార్లు శరణు చెప్పుచున్నాడు. మొత్తముమీద $2 \times 6 = 12$ మార్లు శరణు చెప్పెను. సంవత్సర చక్రమునకు 12 మాసములను అంచులు కలవు అని మహాభారతమున వ్యాసుడు చెప్పెను. సంవత్సర చక్రమును నడిపించు స్వామికి అన్నమయ్య 12 మార్లు శరణు చెప్పెను. పూర్తిగా శరణాగతి పొందినది ఒక్కమారే. చెప్పినది 12 మార్లు. సంవత్సర మొకటియే. అంచులు 12. ఈ సంకీర్తన మొక వేదసూక్తము. దీనిని భక్తిశ్రద్ధలతో గానము చేయువారు, వినువారు అన్నమయ్య వలెనే స్వామికి శరణంది, ఆయన కృపతో ధన్యులై భక్తులై, ముక్తులగుదురు.

* * *

27

2వ సం-377 **దేవ నమో** మాళవి

దేవ నమో దేవ
పావన గుణగణభావ. ॥ పల్లవి ॥

జగదాకార చతుర్భుజ
గగన నీలమేఘశ్యామ
నిగమ పాదయుగ నీరజనాభ
అగణిత లావణ్యానన. ॥ దేవ ॥

ఘనవేదాంతైర్గణన ఉదార
కనక శంఖచక్రకరాంక
దినమణి శశాంక దివ్యవిలోచన
అనుపమ రవిబింబాధర. ॥ దేవ ॥

భావజ కంజభవ జనక
శ్రీవనితా హృదయేశ
శ్రీవేంకటగిరి శిఖర విహార
పావన గుణగణభావ. ॥ దేవ ॥

దేవుడు జీవులెల్లరితో ఎలా మెలగుతాడో, అలా మెలగడమే
ముక్తికి సోపానము.

టీక

పావన గుణగణభావ = పవిత్రములయిన గుణముల సమూహముతోడి భావములు గలవాడా!; దేవ = ఓ దేవా!; దేవ = ఓ దేవా!; నమః = నమస్కారము.

జగదాకార = జగత్తు ఆకారముగా గలవాడా!; చతుర్భుజ = నాలుగు భుజములు గలవాడా!; గగన నీలమేఘశ్యామ = ఆకాశము యొక్క నీలపు రంగు గల మబ్బువలె చామనచాయ గలవాడా!; నిగమ పాదయుగ = వేదములే పాదముల జంట అయినవాడా!; నీరజనాభ = నీటి నుండి పుట్టిన పద్మము నాభియందు గలవాడా!; అగణిత లావణ్యానన = లెక్కించుటకు వీలుకాని సౌకుమార్యము గల ముఖము గలవాడా!

ఘనవేదాంతైర్గణన = గొప్పవయిన ఉపనిషత్తుల యందు శ్రేష్ఠుడుగా గౌరవింప బడినవాడా!; ఉదార = విశాల హృదయము గలవాడా, పైకి వెలుగొందువాడా!; కనక శంఖచక్రకర = బంగారు శంఖ చక్రములను చేతుల యందు; అంక = గుర్తులుగా గలవాడా, భూషణములుగా గలవాడా!; దినమణి శశాంక దివ్యవిలోచన = సూర్యచంద్రులు తన దివ్యములయిన విశేషములయిన కండ్లుగా, ప్రకాశము గల చూపులుగా గలవాడా!; అనుపమ రవిబింబాధర = సాటిలేని విధముగా సూర్యబింబము వంటి పెదవి గలవాడా!

భావజ కంజభవ జనక = మన్మథునకు, పద్మము నుండి పుట్టిన బ్రహ్మకు తండ్రియైనవాడా!; శ్రీవనితా హృదయేశ = లక్ష్మీదేవి అను స్త్రీయొక్క హృదయమునకు ప్రభువైనవాడా!; శ్రీవేంకటగిరి శిఖర విహార= శ్రీవేంకటాచలము యొక్క శిఖరము లందు విహరించువాడా!; పావన గుణగణభావ = పవిత్రములయిన గుణముల సమూహముతోడి భావములు గలవాడా!; నమః = నమస్కారము.

పరిచయము

ఈ సంకీర్తనము నందు అన్నమయ్య భగవంతుని యొక్క దివ్యరూపము, గుణముల యొక్క వైభవమును మనోహరముగ సంస్కృత భాషలో కీర్తించుచున్నాడు. ఇందు ప్రయోగింపబడిన పదములు తెలిసిన వానివలె కన్పట్టినను, ఎంతో నిగూఢములయిన వేదభావములతో కూడియున్నవి. స్వామి దివ్యమంగళమూర్తిని అన్నమయ్య వెలుపలి కళ్ళతోను, లోగనులతోను ఆనందపరవశుడై దర్శింపగా, ఈ కీర్తన వెలువడినది. ఈతని యనుభూతికిది అద్దము పట్టుచున్నది. ఇందలి భావములు, పదములు స్వామి నుండియే ఇతనిలోనికి దిగివచ్చినవి. మామూలు మంచివారు మంచి భావముల నూహించి వానికి సరిపోవు పదములను ఆలోచించి, తూచి ప్రయోగించె దరు. కాని వేదర్షులు, వేదర్షుల వంటి వాల్మీకి వ్యాసాది వేదకవుల కంఠములను వరించి స్వామియే పలుకును. వారు ముందుగా భావముల నూహింప పనిలేదు. వారి వాక్కుల వెంబడి దివ్యభావములు పరుగెత్తుకొని వచ్చునని భవభూతి మహాకవి చెప్పెను. దీనికి కారణము ఇట్టివారు భగవద్దర్శనానుభూతిలో మునిగియుందురు. వీరి పలుకులు చదువుటకును, పాడుటకును మధురముగా నుండును. వాల్మీకి రామాయణమట్టిది. వీరి రచనలు చదివినవారు, పాడినవారు, విన్నవారు గూడ వీరికి

కలిగిన దివ్యానుభూతిలోనే మునుగుదురు. ఇట్టి వేదర్షియైన భక్తకవి అన్నమయ్య అని ఈ సంకీర్తనమున స్పష్టముగ తోచుచున్నది.

పల్లవి యొక్క తాత్పర్యము

"ఓ దేవా! నీవు పరమపవిత్రములైన గుణముల గుంపులతో కూడిన భావములు గలవాడవు. నీకు నమస్కారము."

వ్యాఖ్య

'దేవ' అను శబ్దమునకు సంస్కృతమున 'తనకు తానుగా వెలుగువాడ'ని అర్థము. ఈయన వెలుగే సూర్యచంద్ర తారకాదులందు నిలిచి ప్రకాశించుచున్నది. ఈయన వెలుగు ఆధారము లేనిదే వారు ప్రకాశింపలేరు. మరియు సృష్టికి, సృష్టిలోని జీవులకు లోవెల్గుగా స్వామియే యుండి నడిపించు చున్నాడు. అన్నమయ్య, స్వామి దివ్యమూర్తిని గాంచి పులకించి 'దేవ' అని రెండుమార్లు ప్రేమ ఒలుకగా ఆయనను సంబోధించెను. దేవుడు గుణముల కతీతుడయ్యును, సగుణుడు కూడ. గుణాతీతుడైన దేవుని ధ్యానింప లేము, స్మరింపలేము, సేవింపలేము. ఎందువలననగా ధ్యానింపబడుట, స్మరింప బడుట, సేవింపబడుటయు గుణములే కదా. నిర్గుణుడగు దేవుని స్మరించుచున్నచో కొంతసేపటికి మనలోని దుర్గుణములు పైకిలేచును. దేవుని పొందుటకు ఆయన కల్యాణగుణములు మనము పొందవలెను. ప్రతివాడు దేవుని అంశయే గావున ఆతనిలో దివ్యత్వము దాగియున్నది. కావున దేవుని సద్గుణములు మానవునకు సహజములు. మానవుడు సహజముగా పాపిగాడు, దివ్యుడు. ఈ దివ్యగుణములు వికాసము నందుటకై స్వామియొక్క దివ్య గుణ నామరూప వైభవములను కీర్తించి, ఆయనను సేవింపవలెను. పరమ పవిత్రములైన పరమప్రేమ, శాంతము, సమత్వము, సత్యము, శౌచము, దయ, ఓర్పు, త్యాగము, సంతోషము, సూటియైన నడవడి, మనోనిగ్రహము, తపస్సు, క్షమ, ఆత్మజ్ఞానము, వైరాగ్యము, జీవుల నందరిని ఆకర్షించు అసాధారణ సామర్థ్యము, ధైర్యశౌర్య స్థైర్యములు, నేర్పు, ప్రతిభ, గాంభీర్యము, శ్రద్ధ, వినయము, వేదరక్షణము, శరణాగత రక్షణము మున్నగు పవిత్ర గుణములు గుంపులై స్వామియందు నిలిచినవి. జీవుల యెడల స్వామి నెఱపు భావములు, భావములను పుట్టించు హృదయము ఈ పవిత్ర గుణములతో కూడినవి. భాగవతమున శ్రీకృష్ణుడు ముప్పదిరెండు పావన గుణములతో వర్తించెనని చెప్పబడినది. బలముండియు సద్గుణములను పాటించుట, ధర్మమును తెలిసి పాటించుట, చేసిన మేలు మఱవ కుండుట, సత్యపాలనము, స్థిరమైన నియమములు కలిగియుండుట, సందర్భమునకు తగిన నడవడి, సర్వజీవుల మేలు కొఱకై జీవించుట, బ్రహ్మజ్ఞానము, ఎవరు చూపలేని సామర్థ్యము చూపుట, తాను కనబడిన మాత్రము చేత ఎవరికైనను ఆనందము కలిగించుట, ఆత్మానుభూతి, కోపము జయింపబడుట, తేజస్సు, అసూయ లేకుండుట, అసురవధ యందు దేవతలు గూడ చూపలేని పరాక్రమమును చూపుట అను 16 పావన గుణములు కలవాడని శ్రీరాముని గూర్చి రామాయణమున చెప్పబడినది. ఈ అన్ని గుణములును వేంకటేశ్వరుని యందు అన్నమయ్య దర్శించెను.

ఈ గుణములను వేంకటేశ్వరస్వామి అంతర్యామిగను, అవతారమూర్తిగను, అర్చామూర్తిగను కూడ తెలుపుచున్నాడు.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

ఈ చరణమున అన్నమయ్య స్వామిని "జగత్తే ఆకారముగా గలవాడనియు, నాలుగు భుజములు గలవాడనియు, ఆకాశము వలె నీలమైన వాడనియు, మేఘము వలె గూడ నీలమైన వాడనియు, వేదములు తన పాదముల జంటగా గలవాడనియు, పద్మనాభుడనియు, మన ఊహకందని సౌకుమార్యముతో ఒప్పుచున్న ముఖము గల వాడనియు కీర్తించి, ఆయనకు నమస్కరించెను."

వ్యాఖ్య

స్వామి యొక్క ఆకారము వేంకటేశ్వరుని అర్చామూర్తియే గాదు. అసలు ఆయన యొక్క ఆకారము జగత్తు అని అన్నమయ్య కీర్తించుచున్నాడు. స్వామి విశ్వరూపము, అర్జునునకు వలె ఈతనికి దర్శనమైనది. విశ్వమనగా మార్పులతో గూడినది. వివిధమైనది. ఇట్టి విశ్వము నందలి జీవులు వేరువేరుగా గాక, విశ్వము ఒకడైన విష్ణుడుగా అన్నమయ్యకు దర్శనమైనది. ఈ దర్శనము దేవునిదయ వలననే సిద్ధించినది. చోటు దేవుని దేహమని తైత్తిరీయోపనిషత్తు చెప్పుచున్నది. 'జగత్' అను శబ్దము ఇట్లు వచ్చినది. 'గ' అనగా గమించుట, నడుచుట. మొదటి అక్షరము గూడ 'గ' యే. వరుసగా రెండుమార్లు 'గ' వచ్చినచో మొదటి గ 'జ' గా మారును. కావున 'జగత్' అనగా గగత్. అనగా ఎల్లప్పుడు కదలుచు, మార్పులు చెందునది. కదలిక లేని, మార్పులుచెందని స్వామి యొక్క ఆకారము జగత్తు. ఆకారమనగా చక్కగా చేయ బడినది. జగత్తు పుట్టక ముందు చైతన్యరూపుడగు స్వామి తప్ప వేరొకటి లేదు. మరి జగత్తును సృజించుట ఎట్లు జరిగెను? ఇది నిర్మాణము గాదు, సృష్టి. నిర్మాణమనగా ఒక మేస్త్రీ వంటివాడు వివిధ పదార్థములతో ఇల్లు కట్టుట వంటిది. జగత్తు యొక్క సృష్టి ఇట్టిది గాదు. స్వామియే జగత్తుగా నయ్యెను. మఱల జగత్తులో అంతర్యామి యయ్యెను. ప్రత్తి, చొక్కాగానై, అందు అంతర్యామి అగుచున్నది. నీరే, మంచుగడ్డయై అందు అంతర్యామిగా నున్నది. మంచుగడ్డ నీటి యొక్క స్థితి మార్పు. అట్లే జగత్తు, దేవుని యొక్క స్థితి మార్పు. విశ్వమే విష్ణువని విష్ణు సహస్రనామము నందు చెప్ప బడినది. మరియు జగత్ అనగా వాక్కు కూడ. భక్తుల వాక్కుగా దేవుడు ఆకారము ధరించును.

ఇక స్వామి నాలుగు భుజములు గలవాడుగా అన్నమయ్యకు దర్శనమిచ్చెను. వేంకటేశ్వరుని దివ్యమూర్తికి గల సుందరములైన నాలుగు భుజములు అన్నమయ్యకు దర్శనమిచ్చినవి. మరియు భూమి చుట్టును సూర్యుడు తిరుగుచున్నట్లు మార్గ మేర్పడు చున్నది. అందు ఉదయము, మధ్యాహ్నము, అస్తమయము, నడిరేయి అని నాలుగు విభాగము లేర్పడుచున్నవి. ఇవే అహోరాత్ర స్వరూపుడైన విష్ణుని నాలుగు భుజములు. ఇట్లే శుక్లాష్టమి, పూర్ణిమ, బహుళాష్టమి, అమావాస్య అనునవి మాసస్వరూపుడైన విష్ణుని నాలుగు భుజములు. సంవత్సర చక్రమున మూడు నెలలు కలిసి ఒక కాల విభాగము. ఇట్లు సంవత్సర స్వరూపుడైన విష్ణునకు

ఈ నాలుగు విభాగములే నాలుగు భుజములు. తాను నిలబడిన తావు నుండి నాలుగు దిక్కుల వరకు కనిపించినంత మేర దేవుని భుజములు మనలను రక్షించుచున్నవని అన్నమయ్య భావము. జగదా కారుడయిన స్వామికి ఈ నాలుగు దిక్కులు నాలుగు భుజములుగా నుండును. స్వామి దేహము ఆకాశమని చెప్పబడినది గదా! ఆకాశమునకు రంగు లేదు. చూచు వారికి మాత్రమే నీలము వలె కనబడును. నీలము నుండియే మిగిలిన రంగులు ఏర్పడుచున్నవి. స్వామి నీలాకాశ దేహము గలవాడు కావున నీలవర్ణుడని కీర్తింప బడెను. స్వామి యొక్క అవతారమూర్తులగు శ్రీరామ, శ్రీకృష్ణులు గూడ నీలవర్ణులుగ చెప్పబడిరి. మరియు ఆకాశమందలి మబ్బులు గూడ నీలములే. స్వామి నీలమేఘ వర్ణుడని గూడ ఇచట కీర్తింపబడుచున్నాడు. ఇచట శ్యాముడని అన్నమయ్య కీర్తించెను. శ్యాము డనగా చామన చాయ గలవాడు. కావున కారుమబ్బు వంటి వర్ణము గాదు స్వామిది. ఆయన భౌతిక శరీరము చామన చాయ గలది. ఆకాశ నీలము స్వామియొక్క ఆకృతి చుట్టుగల కాంతివలయము. ప్రతి మానవునకు వివిధ వర్ణముల తోడి కాంతివలయము లుండును. కల్యాణగుణములు గల అవతార మూర్తులకు నీలకాంతి వలయ ముండును. శ్రీవేంకటేశ్వరుని అర్చామూర్తి చుట్టు నీలమగు కాంతివలయముగలదు. ఇది అన్నమయ్యకు దర్శనమిచ్చెను. ప్రతివారికి దర్శనీయము గాదు. ఆకాశము తనకు తాను తెలుపు. మనకు నీలము. వేదములు స్వామి యొక్క పాదముల జంటగా అన్నమయ్యకు దర్శనమిచ్చెను. వేదములనగా ఇచట వేద గ్రంథములని గాదు. శాశ్వతములైన ప్రకృతి ధర్మములే వేదములు. ఇవన్నియు స్వామి యొక్క పాదములై యున్నవి. పాదములతో ఒకచోటి నుండి వేరొక చోటికి అడుగులు వేయుచుందుము. కావున అంతర్యామియైన స్వామి యొక్క అడుగుల జాడలే ప్రకృతి ధర్మములని అన్నమయ్యకు దర్శనమయ్యెను. దర్శనమనగా, దేవుని అనుగ్రహమున ఇతని బుద్ధి యందు తట్టిన సత్యము. సొంత తెలివితో గ్రహించినది గాదు. ఉదా :- సూర్యుడు వేడిమి, ప్రాణశక్తి నిచ్చుట, చంద్రుడు వెన్నెల నిచ్చుట, వరద గూడుకట్టుట, ఇంద్రధనుస్సు ఏర్పడుట, మబ్బు వర్షించుట, భూమి సస్యము నిచ్చుట, నదులు ప్రవహించుట, నీరు మిట్ట నుండి పల్లమునకు ప్రవహించుట, ఒక విత్తు వందల విత్తనములుగా పండుట, చెట్టుకొమ్మకు క్రొత్తగా మారాకు చిగురుట, పిల్లవాడు నేలపై పడగనే ఏడ్చుట, అమ్మకు స్తన్యము చేపుట, సంఖ్యలు మున్నగునవి వేదధర్మములు. ఇవి మార్పులేనివి. ఇవి నేర్పకుండనే తెలియును. ఈ ధర్మము లన్నిటికి మూలమేమి? భగవంతునికి మనపై గల ప్రేమయే. ఇట్టి ప్రేమతోనే స్వామి అడుగులు వేయుటతో – ఆచరణముతో ఈ ధర్మములు పుట్టినవి. నాభి యనగానే కేంద్రము అని అర్థము. స్వామియే సృష్టికి మూలము. ఈయన నాభి యందు నీటి నుండి పుట్టిన పద్మము కలదని అన్నమయ్య కీర్తించెను. ఇది ఒక శాస్త్రీయ సత్యమునకు సంకేతము. ఇచట 'నీరు' అనగా భగవంతుని ప్రేమరస ప్రవాహము. అందుండి పుట్టిన పద్మము జగత్తు. ప్రళయమున ఈ పద్మము ముడుచు కొని యుండును. సృష్టి ధర్మము లన్నియు ప్రళయమునందు సముద్రపు నీటిలో ఉప్పు వలె, స్వామి యందు కరగియుండును. ప్రళయ మనగా ఏమియు లేని శూన్యము అని గాదు. అన్నియు కరగిన స్థితి ఇది. భగవంతుని ప్రేమరస ప్రవాహము నందు ప్రళయకాలమున ముడుచుకొన్న జగత్తు అను పద్మము, సృష్టికాలములో స్వామి సంకల్పమను సూర్యోదయమునకు విచ్చుకొనును. ఇది మొదటగా స్వామి నాభి

యందు వెలుగుల ముద్దగా నేర్పడును. మరియు ఇంతకు పూర్వము చెప్పబడిన కాలములోని నాలుగు విభాగముల కేంద్రమే విష్ణుని నాభిపద్మమని వేదము నందలి విష్ణుసూక్తము చెప్పుచున్నది. స్వామి ముఖము మన ఊహకందనంతగా సుకుమార మైనది. ఇచట లావణ్య మనగా అందమైనదనియే గాక, జీవుల నాకర్షింపగల కోమలత్వము, సౌకుమార్యము గలదని అర్థము. మరియు స్వామి ముఖమను అద్దము నందు విశ్వము ప్రతిబింబించుచున్నదనియు అర్థము. స్వామి ముఖము నుండి వెలువడిన ఒక ఉచ్చారణయే విశ్వమని వేదము చెప్పుచున్నది.

2వ చరణము యొక్క తాత్పర్యము

"స్వామి గొప్పవైన వేదములందలి అంతస్సారములగు ఉపనిషత్తుల యందు భావింపబడినవాడు. అనంత విశాలమయిన మహోదాత్త హృదయము కలవాడు. బంగారు శంఖచక్రములను చేతులకు భూషణములుగను, చేతులందు గుర్తులుగను గలవాడు. సూర్యచంద్రులే ఆయన దివ్యములయిన విశిష్టములగు కన్నులు. వారి ప్రకాశమే స్వామి చూపు. సాటిలేని ఉదయ సూర్యబింబము వంటి పెదవి గలవాడు స్వామి."

వ్యాఖ్య

ఇందు చాల వేదభావములు దాగియున్నవి. వేదాంతము లనగా వేదముల చివరి భాగములు కాదు. వేదముల లోపల సారభూతము లయిన జ్ఞానవాక్యములే విడిగా కూర్చబడి ఉపనిషత్తులని పేర్కొనబడినవి. వేదములు గొప్పవే. ఉపనిషత్తులు గొప్పవే. వేదములకన్న ఉపనిషత్తులు వేరు కాదు. ఉపనిషత్తులు నాలుగు వేదములకు చెందినవి. ఇవి పది మాత్రమే. అన్ని ఉపనిషత్తులును సర్వాంతర్యామి అయిన పరబ్రహ్మమునే ప్రతిపాదించును. దేవుని సన్నిధికి తీసికొని వెళ్లునది అని "ఉపనిషత్తు" అను పదమున కర్థము. ఇక స్వామి ఉదారుడనగా అత్యంత విశాల హృదయుడు, ఓర్పు, ప్రేమ, దయగల వాడనియే గాక వేరొక విశేషార్థము – 'పైకి వెలుగుచున్న వాడ'ని అర్థము గలదు. స్వామి వెలుగు పైది అనగా అన్నిటికన్న గొప్పది. ఇచట పైది అనగా బయటకని కాదు. అన్నిటికన్న పైది అని అర్థము. స్వామి వెలుగులోని ముక్కల వంటివారే దేవతలెల్లరు. జీవులు ఆ వెలుగులోని రేణువులు. ఇక స్వామి ఎడమ, కుడి చేతులందు శంఖ చక్రము లుండును. అంతేగాక అరచేతులయందు శంఖ చక్రముల గుర్తు లున్నవని అన్నమయ్యకు దర్శనమాయెను. శంఖము పేరు పాంచజన్యము అనగా ఓంకారనాదము. ఇది పంచభూతములను పుట్టించునది. మరియు భగవంతుడు పంచభూతములలో అంతర్యామిగా నుండియు అవతార మూర్తులుగా, అర్చామూర్తులుగా, సకల జీవులుగా జనించు శక్తి గలవాడు. ఈ శక్తినే పాంచజన్యమను శంఖ మందురు. శంఖనాద మగు 'ఓం'కారము, మనము శ్వాసలో వినవచ్చును. ఇక చక్రము పేర్లు సుదర్శనము, సునాభము. ఒకడు తాను నిలబడిన బిందువు అను 'నాభి' యనగా కేంద్రము నుండి గమనించినచో కానవచ్చు దిక్చక్రమే విష్ణుని చక్రము. మరియు ఎల్లరి యందును, అన్నిటి యందును స్వామిని దర్శించు అనుభవమే

సు-దర్శనము. ఈ దర్శనమే చక్రమై మనలను కాపాడును. ఈ దర్శనము గూడ మనకు స్వామి దయ వలననే కలుగును గావున ఆయన కరమునకు అలంకారమని చెప్పబడెను. జీవుని శ్వాసలో వినబడు ఓంకారము శంఖము కాగా, ఆతనిలో విచ్చుకొన్న సహస్రారమే చక్రము. కరములనగా కిరణము లనియు అర్థము. స్వామి యను వెలుగు యొక్క కిరణములే ఈ రెండును అనియు అన్నమయ్య దర్శనము. ఇతనికి ఓంకారనాద శ్రవణము, సర్వమున స్వామి దర్శనము నిత్యము స్వీయానుభూతులు. వేంకటేశ్వరుని దివ్యమూర్తి తలంపుకు రాగానే, ఇతనికి శంఖ చక్రము లిట్లు కానవచ్చును. బంగారు శంఖ చక్రములని అన్నమయ్య ఏల పేర్కొనెను? ఇతనికి సమాధి స్థితిలో హృదయమున శంఖ చక్రములు ఈ రంగులో కనిపించె ననమాట. ఇక లోచనములనగా చూపులనియు, చూచుటకు సాధనము లనియు రెండర్థములు. స్వామి కండ్లు దివ్యములు, విశిష్టములు. ఈయన విశ్వ రూపుడు. సూర్యచంద్రులే స్వామి కన్నులుగా అన్నమయ్యకు దర్శనమయ్యెను. ఈతని కీర్తనలో తన ఊహలు కావివి. తనకు స్వామి ప్రసాదించిన దర్శనములు గావున పరవశత్వమున ఈ కీర్తన తానుగనే వెలువడినది. దినమణి యనగా పగటి కాలమును తన కాంతిచే కల్గించు రత్నము. అనగా సూర్యుడు. తారక లన్నియు సూర్యులే. కావున ఈ సూర్యులన్నిటికి మూలమయిన తత్త్వము, చంద్రతత్త్వము స్వామి కను లన్నమాట. ప్రతి వ్యక్తిలోను సూర్యుడు ఆత్మ లక్షణములకు, చంద్రుడు మనో లక్షణము లకు కారకుడు. సూర్యుడు కాంతి ప్రసార కేంద్రము. చంద్రుడు కాంతి స్వీకార కేంద్రము. సూర్యకాంతి కిరణములు స్వామి కుడి కంటి చూపులు. చంద్రుని వెన్నెల జాలులు స్వామి ఎడమ కంటి చూపులు. ఆత్మజ్ఞానము, శక్తి, వేడిమి, వెలుగు, సంకల్పశక్తి మున్నగు లక్షణములు స్వామి కరుణతో ఆయనకు కుడి కంటినుండి వెలువడు చూపులై మనలను పొందును. ప్రసన్నత, దయ, హాయి ఆయన ఎడమ కంటి చూపులై మనలను పొందును. ఇట్లు వేడిమి, వెన్నెల ఆయన ప్రేమపు చూపులే కాని ప్రకృతి శక్తులు గావు. స్వామి కరుణామృత తరంగములే ఆయన కడగంటి చూపులు. సైన్సు ఈ అంశమును గుర్తించుటకు కొంతకాలము పట్టును. శాస్త్రవేత్తల తెలివితో సంబంధము లేక, అన్నమయ్య వంటి మహాభక్తుల కిది అనుభవ సత్యము. సూర్యచంద్రులలోను మనకంటె ఎన్నియో రెట్లు అధికముగా ప్రజ్ఞ, చైతన్యము, జ్ఞానము, ప్రేమ ఉన్నవి. మనలోనే ఇవి ఉండగా, మనలను కన్నతల్లి యగు ప్రకృతిలో ఇవి ఎంతగా నుండవలెను? ప్రకృతి నడకలో దానియంతట అదియే జరుగును. ప్రకృతిలో దాగిన చైతన్యమగు స్వామి యొక్క ప్రేమ వలన, సంకల్పము వలన, శక్తి వలన జరుగును. కావుననే లక్ష్మీదేవియే సూర్యకాంతిగను, చంద్రుని వెన్నెలగను ప్రకాశించుచున్నదని శ్రీసూక్తము చెప్పుచున్నది. అధర మనగా క్రింది పెదవి. స్వామి యొక్క క్రింది పెదవి సాటిలేని విధమైన శోభతో వెల్గొందుచున్నది. ఉదయసూర్యుని బింబము ఎఱ్ఱగా నుండును. ఆవిధముగ స్వామి పెదవి ఎఱ్ఱనై అరుణకాంతులను విరజిమ్ము చున్నది. అధర మనగా ధర కానిదనియు అర్థము. ధర అనగా భూమి. కావున అధర మనగా భౌతికమునకు అతీతమయిన, దివ్యమయిన వెలుగని యర్థము. కావుననే శ్రీకృష్ణుడు గోపికలకు అధరామృతము నందించెనని భాగవతమున చెప్ప బడినది. భౌతికసుఖము లన్నియు మృతములే - నశించునవే. ఆత్మసుఖమే అమృతము, శాశ్వతము. స్వామి క్రింది పెదవిని ధ్యానమున దర్శించిన అన్నమయ్యకు సూర్యోదయ సమయపు అరుణకాంతులే

గాక, ఆత్మసుఖ మందుచున్నది. ఇది అతని ధ్యానమును బట్టి అతనికి కలుగు అనుభవమే కాని, అతడు స్వామి పెదవిని సామాన్య కవుల వలె ఊహించి, సూర్యబింబముతో పోల్చి వ్రాయలేదు. ఇచట పోలిక గాదు. ఉదయారుణ సూర్యబింబమే విశ్వరూపుడైన స్వామి అధరమని అన్నమయ్య దర్శనము. మనకు గానవచ్చు సూర్యకాంతి భౌతికము గాదు. అది చైతన్యశక్తి ప్రవాహము. ఉదయారుణ సూర్యకాంతి మనకు శక్తిని, జ్ఞానము నిచ్చును. స్వామి క్రింది పెదవి నుండి వచ్చు అరుణకాంతి, జ్ఞానము నిచ్చునదని అన్నమయ్య భావము.

3వ చరణము యొక్క తాత్పర్యము

"నీవు మన్మథునకు, బ్రహ్మకు కన్నతండ్రివి. నిన్ను ఎప్పుడు ఆశ్రయించియుండు లక్ష్మీదేవి హృదయమునకు విభుడవు. శ్రీవేంకటాద్రి శిఖరమునందు విహరించువాడవు. పరమ పవిత్రములగు శుభగుణములతో గూడిన భావములు గలవాడవు. నీకు నమస్కారము."

వ్యాఖ్య

విష్ణువు మన్మథునకు తండ్రియని పురాణములందు ప్రసిద్ధి గలదు. మన్మథుని అన్నమయ్య ఇచట భావజు డనెను. మన మనోభావముల నుండియే కోరిక పుట్టి, అది మన మనస్సును చిలుకుచుండును. ఇట్టి కోరికల కధిపతియే మన్మథుడు. మనస్సునకు కూడ ఆధారముగ స్వామి యున్నాడు. మనలో అంతర్యామి యగు ఆత్మగా నున్న స్వామి యందు కోరికలు పుట్టవు. 'ఆత్మ' యనగా ప్రేమానుభూతియే గాని కోరికలతో కూడినది కాదు. కోరిక యున్నచోట అనుభూతి యుండదు. ఏ వస్తువునయినను, విషయమునయినను మానవుడు కోరినపుడు, ఆ వస్తు విషయాదులు లభించినను, లభింపకున్నను తృప్తి యుండదు. మరి కోరికల పుట్ట మనస్సు. మనస్సు నుండి సుఖము నీయజాలని కోరికలు పుట్టుచున్నవి. అయినను మనస్సు అనునది చైతన్య మను సాగరము నుండి లేచిన ఒక కెరటము. అఖండ చైతన్యమే విష్ణువు. కెరటమే మనస్సు. అందలి తుంపురులే కోరికలు. కావున మన్మథునకు, విష్ణువు తండ్రి యని కీర్తింపబడెను. ఇక సృష్టికర్త యగు బ్రహ్మను కూడ కన్నతండ్రి విష్ణువు. ప్రళయము నందును చైతన్యముగా నున్న నారాయణుడే సృష్టి చేయ సంకల్పము తనయందు కలుగగా, సృష్టి చేయుటకుగాను తానే వేరొక ప్రజ్ఞగా దిగివచ్చెను. ఉదాహరణకు నిద్రించుచున్న వేళ జీవభావమగు 'నేను' ఉండదు. కాని అంతర్యామి యగు 'నేను' ఉండును. ఈ 'నేనే' పరమాత్మ. అట్లే అఖండమగు 'నేనే' నారాయణుడు. సృష్టి చేయుటకుగాను ఈతడే ఖండమగు 'నేను' గా దిగివచ్చును. ఈతడే బ్రహ్మ. కావున బ్రహ్మను పుట్టించిన తండ్రి, స్వామి. శ్రీదేవి స్వామి యొక్క సంకల్పశక్తి. ఆయన యొక్క ప్రేమ, లక్ష్మి అనగా లక్షణములు గలది. స్వామి యొక్క దివ్యగుణ శోభయే లక్ష్మి. 'శ్రీ' అనగా ఆశ్రయించి యుండునది. మానవుని గుణములు – మానవుని ఎల్లప్పుడును అంటుకొని యుండును. అట్లే లక్ష్మీదేవి ఎల్లప్పుడు స్వామి నాశ్రయించుకొని యుండును. స్వామి హృదయమునందే గదా ప్రేమాది దివ్య గుణములు పుట్టునది. కావున లక్ష్మీదేవి విష్ణు వక్షఃస్థలము నందుండునని యనిరి.

మరల ఆమె హృదయమును ఆతడు ఏలుచుండును. కావున స్వామి, ఆమె హృద యేశ్వరుడు. ఒకరినొకరు విడిచియుండుట జరుగదు. స్వామి శుభమైనదియు, పాపములను హరించునదియు నగు తిరుమల శిఖరములపై విహరించుచుండును. ఇచట అన్నమయ్య 'గిరి' యనెను. 'గిరి' అనగా మాట అనియు అర్థము. కావున తోటివారికి శుభమును గూర్చుచు, తనలోని పాపవాసనలను తొలగింపగల తీయని మంచి పలుకులలో రసానుభూతిగ స్వామియే వివరించునని అన్నమయ్య భావము. వేదర్షులకు, కాళిదాసుకు కూడ ఇట్లే దర్శనము కలిగెను. ఇందొక విశేషమున్నది, తన ద్వారమున వెలువడుచున్న సంకీర్తనలలోని వాక్కులే శ్రీదేవి – లక్ష్మీదేవి – మంగాంబిక అనియు, ఆ వాక్కులందలి రసానుభూతియే వేంకటేశ్వరుడనియు, ఈ కీర్తనల గానము, వినుట వలన శుభము కలిగి, పాపము తొలగుననియు అన్నమయ్య ధ్వనించుచున్నాడు. 'గిరి శిఖరము' అను పదమును వాడుటలో ఇంతటి సూక్ష్మ మున్నది. పైగా వేంకటగిరి శిఖరములందు స్వామి విహరించుట అన్నమయ్యకు గానవచ్చెను. స్వామి గర్భాలయమందును ఎల్లప్పుడును నిలిచియే యున్నాడు. అంతేగాక, స్వామి ఒకే సమయమున ఎన్ని రూపముల నయినను ధరింపగలడు. తిరుమలకు వచ్చిన అన్నమయ్యకు శ్రీవేంకటేశ్వరుడు ఆ కొండ శిఖరముపై వివిధ ప్రదేశములందు విహరించుచు గానవచ్చెను. మొత్తము శిఖర మంతటను గాన వచ్చెను. స్వామి కనబడని చోటే లేదు. అసలు తిరుమల శిఖరమే స్వామి యొక్క వేఱొక రూపు. మరియు ఇతనిలోని సహస్రారమే శ్రీవేంకటగిరి శిఖరము. అందు అనుభూతిగా స్వామి వెలసియున్నాడు. స్వామి నిట్లు దర్శించుటలో, ఆయన పావన గుణములు గుంపులై, తన నావహింపగా అన్నమయ్య ఒడలు మరచి చివరి వాక్యమును పలికెను. పల్లవిలో 'పావన గుణగణభావ' యనుటలో స్వామిని పవిత్ర గుణములు గలవాడనుట యున్నది. మూడవ చరణపు చివరలో మరల ఇట్లే అనుట యేల? తనలో గూడ ఇట్టి పావన గుణములను గుంపుగా ఆవహింపజేసిన వాడని అన్నమయ్య ఉద్దేశ్యము. స్వామి గుణములను నిత్యము స్మరించినచో, అవి మనలను ఆవహించునని అన్నమయ్య మనకిచ్చిన సందేశము.

* * *

28

1వ సం-269 **నమో నారాయణాయ** శ్రీరాగము

నమో నారాయణాయ
నారాయణాయ సగుణబ్రహ్మణే సర్వ
పారాయణాయ శోభనమూర్తయే నమో. ॥ పల్లవి ॥

నిత్యాయ విబుధసంస్తుత్యాయ నిత్యాధి
పత్యాయ మునిగణ ప్రత్యయాయ
సత్యాయ ప్రత్యక్షాయ సన్మానససాం
గత్యాయ జగదవనకృత్యాయ తే నమో. ॥ నమో ॥

అక్రమోద్ధత బాహువిక్రమాతిక్రాంత
శుక్రశిష్యోన్మూలనక్రమాయ
శక్రాది గీర్వాణవక్రభయభంగని
ర్వక్రాయ నిహతారిచక్రాయ తే నమో. ॥ నమో ॥

అక్షరాయాతినిరపేక్షాయ పుండరీ
కాక్షాయ శ్రీవత్సలక్షణాయ
అక్షీణ విజ్ఞానదక్షయోగీంద్రసం
రక్షానుకంపాకటాక్షాయ తే నమో. ॥ నమో ॥

కరిరాజవరదాయ కౌస్తుభాభరణాయ
మురవైరిణే జగన్మోహనాయ
తరుణేందుకోటీరతరుణీ మనస్స్తోత్ర
పరితోషచిత్తాయ పరమాయ తే నమో. ॥ నమో ॥

పాత్రదానోత్సవప్రథిత వేంకటరాయ
ధాత్రీశకామితార్థప్రదాయ
గోత్రభిన్మణిరుచిరగాత్రాయ రవిచంద్ర
నేత్రాయ శేషాద్రినిలయాయ తే నమో నారాయణాయ ॥ నమో ॥

అభ్యాసమనేది కాసేపు చేసేది గాదు, ప్రతి క్షణము కూడ
అంతర్యామిని స్మరించడం సాగాలి.

టీక

నమో నారాయణాయ = నారాయణునకు నమస్కారము, సగుణబ్రహ్మణే = గుణములతో కూడిన పరబ్రహ్మమైన వాడును, సర్వపారాయణాయ = ఎల్లరు జీవులకు లోతైన ప్రయాణమయిన వాడును, శోభనమూర్తయే = శుభమును కలిగించు రూపము గలవాడును, నారాయణాయ = నారాయణునకు, నమః = నమస్కారము.

నిత్యాయ = శాశ్వతుడును, విబుధసంస్తుత్యాయ = విశేషమయిన బుద్ధి గలవారి చేతను, దేవతల చేతను చక్కగా స్తుతింపబడువాడును; నిత్యాధిపత్యాయ = ఎల్లప్పుడు అంతటికిని పాలకుడయినవాడును, మునిగణప్రత్యయాయ = మునుల గుంపులకు విశ్వసనీయుడయిన ఆప్తుడయిన వాడును, సత్యాయ = సత్యము తానే అయిన వాడును, ప్రత్యక్షాయ = కనుల కెదుట నిలుచువాడును, సత్+మానస సాంగత్యాయ= మంచి మనసు గల వారికి కలయిక అయిన వాడును, జగత్+ అవనకృత్యాయ = జగత్తును, వాక్కును కాపాడు పనిగలవాడు నగు; తే = నీకు, నారాయణాయ = నారాయణునకు, నమః = నమస్కారము.

అక్రమ ఉద్ధత = అధర్మముగా, గర్వము కలిగి; బాహువిక్రమ+ అతిక్రాంత = తమ భుజబలముచే అతిక్రమించిన, శుక్రశిష్య+ఉన్మూలన= శుక్రుని శిష్యులగు అసురులను సమూలముగా సంహరించుటలో, క్రమాయ= సామర్థ్యము గలవాడును, శక్ర+ఆది = ఇంద్రుడు మున్నగు, గీర్వాణ = దేవతల యొక్క, వక్రభయ = వంకరతోడి భయమును, భంగ= తొలగించుటలో, నిర్వక్రాయ = వంకర లేనివాడును, నిహత+ అరిచక్రాయ= శత్రు సమూహములు తనచే చంపబడినవాడును అగు, తే = నీకు, నారాయణాయ = నారాయణునకు, నమః = నమస్కారము.

అక్షరాయ = నాశము లేనివాడును, నాశము లేని ఓంకారము తానయిన వాడును; అతినిరపేక్షాయ = అపేక్షలు లేకుండుట మిక్కిలిగా గలవాడును, పుండరీక+అక్షాయ = తెల్లతామర వంటి కన్నులు గలవాడును, శ్రీవత్సలక్షణాయ = శ్రీవత్సమను పేరు గల పుట్టుమచ్చను తన దేహముపై గుర్తుగా గలవాడును, అక్షీణ = నాశము లేని, విజ్ఞాన = విశేషమయిన జ్ఞానము గలిగిన, దక్షయోగీంద్ర = దక్షుడను యోగీంద్రుని, సమర్థులగు యోగీంద్రులను; సంరక్ష+ అనుకంపా = చక్కగా రక్షించుటను అనుసరించు దయతో కూడిన, కటాక్షాయ = క్రీగంటి చూపులు గలవాడును అగు, తే= నీకు, నారాయణాయ= నారాయణునకు, నమః = నమస్కారము.

కరిరాజ = గజేంద్రునకు, వరదాయ = శ్రేష్ఠమయిన స్థితియగు వరము నిచ్చిన వాడును, కౌస్తుభ+ఆభరణాయ = కౌస్తుభమును ఆభరణముగా గలవాడును, మురవైరిణే = మురాసురునకు శత్రువైనవాడును, జగన్మోహనాయ= జగత్తును మోహింపజేయువాడును, తరుణ+ ఇందు = యౌవనము నందలి చంద్రుడు (శుద్ధాష్టమి నాటి చంద్రుడు), కోటీర = కిరీటముగా గల శివుని యొక్క, తరుణీ = భార్య యగు పార్వతీదేవి యొక్క, మనస్+స్తోత్ర = మనస్సు నందలి స్తుతిచే, పరితోషచిత్తాయ = సంతోషమే

మనస్సుగా గలవాడును, పరమాయ = సర్వశ్రేష్ఠుడును అగు, తే = నీకు, నారాయణాయ = నారాయణునకు, నమః = నమస్కారము.

పాత్రదాన+ఉత్సవ = తగిన వారికి దానము చేయు ఉత్సవమునందు, ప్రథిత= ప్రసిద్ధినొందిన, వేంకటరాయ = వేంకటప్రభూ, ధాత్రీశ = భూమికి ఈశ్వరులగు వారికి (ప్రభువులకు), కామిత+అర్థ= వలసిన ప్రయోజనములను, ప్రదాయ= ఇచ్చువానికి, గోత్రభిత్+మణి = కొండలను ఛేదించిన ఇంద్రునికి సంబంధమగు మణి వంటి, రుచిర = కాంతి గల మనోహరమైన, గాత్రాయ = శరీరము గలవానికి, రవిచంద్ర నేత్రాయ = సూర్యచంద్రులు కన్నులుగా గలవానికి, శేషాద్రినిలయాయ = శేషాద్రి నిలయమైన వాడును అగు, తే = నీకు, నారాయణాయ = నారాయణునకు, నమః = నమస్కారము.

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య భగవంతుని తత్త్వమును వేదోపనిషత్ భావము లతో ప్రస్తుతించెను. ఇందు సంగీతము, సాహిత్యము, ఆధ్యాత్మికత మంచి మేళవింపును పొందినవి. అయితే భక్తితో గూడని వట్టి వేదతత్త్వ వివరణ వృథా. అన్నమయ్య భక్తి నిండయిన హృదయముతో స్వామిని కీర్తించి, భక్తిని పై అంశములతో జోడించెను. ఈ సంకీర్తనము నిత్యము పారాయణ చేయదగినది. ఇందులో మొదటిలోనే స్వామిని సగుణబ్రహ్మముగా సంబోధించుటలో అన్నమయ్య ఉపాసనలోని విశిష్టత తెలియు చున్నది. నిర్గుణబ్రహ్మమును ఉపాసించుట సాధ్యముగాదు. ఉపాసింపబడుట ఒక గుణమే కదా. విశ్వమే తన ఆకారమయినవాడు; ప్రేమ, దయ, జగన్మోహనత్వము మున్నగు కల్యాణగుణములు గలవాడు అయిన దేవుని కీర్తించి, సేవించుట వలననే మనను స్వామి గుణములు ఆవేశించును. ఆ గుణములతో మన జీవనము సాగు చున్నపుడు కలుగు ఆనందస్థితి నిర్గుణము. అంతకన్నను త్రిగుణములకు అతీతమనుట ఒప్పు. సేవింపవలసినది విశ్వాకారుని. కీర్తింపవలసినది, అనుసరింపవలసినవాడు సగుణ బ్రహ్మము. కలుగు సిద్ధి గుణాతీతము. సాధన సగుణబ్రహ్మమునకు సంబం ధించినది. ఈ సందర్భమున సాధకుడు, పరబ్రహ్మము, సాధన ఉండును. ఇది విశిష్టాద్వైతము. అనుభూతి క్రమముగా పెరుగుచుండును. అది చిక్కపడి, సిద్ధి కలుగును. ఇది అద్వైతము. పై మూడు అంశములతో గూడిన సాధన సాగుచు, సమకాలికముగనే పరిపూర్ణ సిద్ధి కలుగును. కావున పరిపూర్ణతా దశలో గూడ సగుణబ్రహ్మోపాసన, నిర్గుణమగు అనుభూతి కలిసియే యుండును. ఇట్లుగాక సగుణబ్రహ్మమును సేవించుట తక్కువ స్థాయి అనుకొనుట భ్రమ. నిర్గుణబ్రహ్మమును సేవించుట పొసగునది కాదు. దుఃఖమునే కల్గించునని శ్రీకృష్ణుడు గీతలో చెప్పెను. శ్రీరాముని, శ్రీకృష్ణుని, శ్రీవేంకటేశ్వరుని దివ్యమూర్తులను, దివ్యగుణములను కీర్తించుటలోని పారవశ్యము, నిర్గుణోపాసనలో కలుగదు. కనులు మూసికొని ఇట్టి ధ్యానము చేయు వానికి కలుగు ఆనందము ఎండమావిలోని నీరు వంటిదే. ఈ సంకీర్తనమున స్వామి దివ్యగుణములను, దివ్యకృత్యములను, దివ్యవైభవమును కీర్తించిన అన్నమయ్య ధన్యుడయినాడు. ఈ సంకీర్తన వేదసూక్తములతో పోలినది. ఇది యొక ఉపనిషత్తు. అనుప్రాసలు దీనికి నాదమాధుర్యమును సమకూర్చినవి.

పల్లవి యొక్క తాత్పర్యము

"నారాయణునకు నమస్కారము. సగుణబ్రహ్మమయిన వాడును, ఎల్లరికి చివరగా పొందవలసిన వాడును, శుభమును కలిగించు రూపము గలవాడును అయిన నారాయణునకు నమస్కారము."

వ్యాఖ్య

నారాయణుడు అనగా సృష్టికి మొదలయిన దేవుడు. అనుభూతిస్వరూపుడు. సూర్యునిలోన చైతన్యమై నీటికి ప్రయాణము కల్గించువాడు. నారాయణుని దర్శన మనగా భక్తుడే భగవంతుడుగా నగుట. అదియు నారాయణుని అనుగ్రహమే. వేదము నందు ఉపాసింపదగిన మంత్రములు అయిదు. 1. ఓం, 2. సో-హం, 3. గాయత్రి, 4. అష్టాక్షరి – ఓం నమో నారాయణాయ, 5. పంచాక్షరి – నమశ్శివాయ. మిగిలిన మంత్రములు తర్వాతి కాలమున భక్తులు దర్శించినవి. వేదకాలము నుండియు 'నమో నారాయణాయ' వాడుకలో నున్నది. ఆనందపదమైనదిగా నున్నది. దీనినే భగవద్రామానుజులు శ్రీరంగనాథ గోపురము మీద నుండి క్రిందనున్న సకల జనులకు ఉపదేశించెను. నారాయణుడే శ్రీవేంకటేశ్వరుడగుటచే, స్వామిని నారాయణునిగా సంబోధించి అన్నమయ్య నమస్కరించుచున్నాడు. రెండు చేతులు జోడించి నమస్కరింప వలెను. అయిదు జ్ఞానేంద్రియములు, అయిదు కర్మేంద్రియములు, మనస్సు కలిపి స్వామికి సమర్పణ పొందుటకు నమస్కారముద్ర ప్రతీక. మరియు మనము వేరు గాదు అనెడి అనుభవమునకు సూచన ఇది. ఈ పరమపావనమైన మంత్రమును సంకీర్తనమున జేర్చి సకల జనులకు ముక్తిసాధనమును ప్రసాదించిన మహోదార హృదయుడు అన్నమయ్య. దీనిని కొందరికి పరిమితము చేయక, ఎల్లరకు పంచిపెట్టిన ఉదాత్తుడీతడు. ఈ మంత్రజపమునకు ముందు ఇందలి అక్షరములను ఇట్లు శరీరాంగములందు న్యాసము చేయదగునని భాగవతమున చెప్పబడినది. తలయందు 'ఓం'; నోటియందు 'న'; గుండెయందు 'మో'; ఛాతియందు 'నా', పొట్టయందు 'రా'; తొడలయందు 'య'; మోకాళ్లయందు 'ణా'; పాదములందు 'య'. ఇట్లు న్యాసము చేయవలసిన అక్షరములు కాంతిమయములు. అపుడు నారాయణుడే మంత్రమూర్తియై సాధకుని యందు నిలుచును. ఇతనియందు చరించు చుండును. అనగా ఇతనిలోనుండి మాటలాడుచు, వర్తించుచుండును. ఈ పద్ధతిన ఉపాసించిన వసుదేవుని నుండి నారాయణుడు కుమారుడుగా దిగివచ్చెను. ఇట్లు న్యాసము చేయుట భాగవతమందలి నారాయణ కవచమందు ఉపదేశింపబడినది. అయితే ఈ న్యాసము చేయకపోయినను తప్పు లేదు. మంత్రమును సంకీర్తనముగా ప్రణవము మినహాయించి, అన్నమయ్య సకల జనులకు ప్రసాదించెను. భక్తితో ఇట్టి సంకీర్తనము నారాయణ దర్శనమును కలిగించును. సృష్టికి మూలమయిన నారాయణుని ఎట్లు కీర్తింపగలము? ఎట్లు సేవింపగలము? ఇతడు గుణాతీతుడు గదా. వట్టి అనుభూతి స్వరూపుడు గదా. నారాయణుడే విశ్వముగా వ్యాపించి సగుణబ్రహ్మమైనాడు. సూర్యచంద్రులు, మేఘుడు, తారకాదులు, భూమి, నదీ సముద్రారణ్యములు, వృక్షములు మున్నగువాని ద్వారమున పనిచేయుచున్న ప్రకృతి ధర్మములు శాశ్వతములు; ఇవి నారాయణుని దివ్యగుణములే. సృష్టికి పూర్వమున్న అంతర్యామి నారాయణుడు. సృష్టిలోని అంతర్యామి యగు సగుణబ్రహ్మముగా ఆ నారాయణుడే దిగివచ్చెను.

సృష్టిలోని అంతర్యామియగు సగుణబ్రహ్మమును ఉపాసించినవానికే సృష్టికి అతీతమైన నారాయణతత్త్వము దర్శనమిచ్చును. ఈ జగత్తు అశాశ్వతము, దీనితో నాకేమి పని, నేను సూటిగా నిర్గుణ పరబ్రహ్మమును ధ్యానింతునని పట్టు పట్టువాడు సమాజము నెడల కర్తవ్యముల నుండి పారిపోవుచున్నాడు. కావున వానికి దుఃఖమే గతియని శ్రీకృష్ణుడే చెప్పెను. ఈ సగుణబ్రహ్మమే విష్ణువు, వాసుదేవుడు. ఈతడే రామకృష్ణాదులగు అవతారములు గను, వేంకటేశ్వరునిగను వెలసెను. మరియు ప్రహ్లాద నారదాదులు, అన్నమయ్య వంటి మహాభక్తులలో నుండి వ్యక్తములగుచున్న సద్గుణము లన్నియు ఈ సగుణ బ్రహ్మమగు శ్రీహరివే. కనుక సగుణబ్రహ్మముగా వచ్చిన నారాయణునకు నమస్క రించుటతో ఈ గుణములు మనకు సంక్రమించును. మనలో మొగ్గగానున్న ఇవి వికసించి, గుబాళించును.

సర్వ జీవులకు పారాయణమయినవాడు నారాయణుడు. అనగా ఎల్లరు ఆయనను గూర్చి ప్రతిదినము పారాయణము చేయవలెను అని సామాన్యార్థము. కాని పార మనగా అంతు లేక లోతు. సర్వ జీవుల అనేక జన్మలలోని ప్రయాణము యొక్క లోతు నారాయణుడని అసలయిన అర్థము. గమ్యము నారాయణుడే. సాధనయు నారాయణుడే అని రామానుజులు సెలవిచ్చిరి. ఉపేయము, ఉపాయము స్వామియే యని వారు శ్రీభాష్యమున ఉపదేశించిరి. అనగా పొందదగిన గమ్యమగు స్వామి ఆనందానుభూతి స్వరూపుడు. సాధన కూడ ఆనందమే కాని శ్రమ కాదు. సాధన దశలో ఆనందానుభూతి కలుగుచుండుటలో 'తాను' గుర్తుండును. సిద్ధి దశలో తాను గుర్తుండడు. స్వామి, సాధన అనబడు జీవి ప్రయాణము యొక్క లోతు కూడ. మనస్సు, బుద్ధి మున్నగువాని లోతు ఎవరు? ఇవి ఎవరివో అట్టి 'నేను' అనబడు ఆత్మవి. ఆత్మయే నారాయణుడు. సాధన దశలో గలుగు దివ్యానుభూతి యొక్క లోతు కూడ స్వామియే. ఈ అనుభూతి చిక్కబడినపుడు 'తన ప్రజ్ఞ' స్వామియను ఆనందసాగరమున మునిగిపోవును. ఇట్లు పారాయణమను శబ్దమును ఈ అర్థములో అన్నమయ్య ఒక్కడే ప్రయోగించెను.

జీవులెల్లరు ఏమి కోరినను, దాని వెనుక ఆనందమునే గదా. వేయిమందికి కాగితములిచ్చి మీకు కావలసినది వ్రాయుడని మూడు నిమిషముల సమయమిచ్చినచో ధనము, ఉద్యోగము, అధికారము, పాండిత్యము – ఇట్టివెన్ని వ్రాసినను కొట్టివేసి చివరకు ఆనందమనియే ఎల్లరు వ్రాయుదురు. ఆనందము లేని జీవనమున ఇవి యన్నియు గాడిద బరువులే. జీవితమనగా ఆనందమును వెదకుటయే. అట్టి ఆనందము తనలోనే నారాయణుడుగా నున్నది; జీవులెల్లరు నారాయణుని నుండియే వచ్చిన వారు గావున, చివరకు ఎన్నో జన్మల ప్రయాణము తర్వాతనైనను స్వామినే పొందక తప్పదు. కావున ఇప్పుడే ఆ సాధనను మొదలుపెట్టుడని అన్నమయ్య హెచ్చరించుచున్నాడు. ఎవరినుండి వచ్చితిమో ఆయననే చేరవలెను. ఆది, అంతము ఆయనయే. జీవి ప్రయాణము ఒక వృత్తము వంటిది. బయలుదేరిన చోటునే చేర వలెను. సాగరము నుండి వెల్వడు కెరటములు మరల వెనుకకు మరలి సాగరమునే చేరును. సాగరము నారాయణుడు. కెరటము జీవుడు. నారాయణుడు ప్రేమ సాగరము. మనమును ఆ ప్రేమను పొందినచో నారాయణుడుగా నగుదుము. ఎట్లు ప్రేమింపవలెను? ఎల్లరిని, 'నేను' అనియే ప్రేమింపవలెను. ఇది తప్ప వేరు మార్గము

లేదని పురుషసూక్తము చెప్పుచున్నది. ఆ 'నేను' ఎవరు? నారాయణుడే. ఈయన మూర్తి సర్వ శుభముల నిచ్చును. నారాయణుని శంఖ చక్ర గదా పద్మ ధారిగనో, వేంకటేశ్వరస్వామిగనో దర్శించి భక్తితో కీర్తించినను అన్ని శుభములు కల్గును. కాని ఇంతమాత్రము చాలదు. ఇష్టదైవతము యొక్క మూర్తిని ఎంతగా కొలిచినను చాలదు. ఆ మూర్తి విశ్వమూర్తియని తెలియవలెను. నమ్ముట చాలదు. అనుభవమున స్వామి విశ్వమూర్తిగా దర్శనమీయవలెను. నేలయు, నింగియు నిండి నంతమేర ఎవరును కానరాక, వేంకటేశ్వరుని దివ్యమూర్తియే అన్నమయ్యకు దర్శన మొసగెను. ఇట్టి దర్శనము పొందినవానికి శుభములన్నియు పరిపూర్ణముగా చేకూరును. విష్ణు సహస్రనామమున శుభములన్నియు ఇట్లు కల్గునని చెప్పబడినది. ధర్మము, ఐహికముగా కావలసినవి, సంతతి, మోక్షము కల్గును. అయితే ఈ స్తోత్రమున మొదటనే 'విశ్వం విష్ణుః' అని చెప్పబడినదని గుర్తింపవలెను. నారాయణుడే వాసుదేవుడు, విష్ణువు. ఇతడు చక్కగా కాపాడుగాక అని చివరి శ్లోకమున చెప్పబడినది. మరి శుభములనగా సంపద, సత్సంతతి మాత్రమే కాదు. అసలు శుభము – భగవంతుని సంస్మరణానందము. అశుభము స్వామిని మరచి దుఃఖముపాలగుట. ఈ దుఃఖమను ఆపద నుండి మనలను కాపాడి, బ్రహ్మానందము నీయగలుగు విశ్వమూర్తి యగు నారాయణుడు ఐహికముగా మనకు కావలసినవి ప్రసాదింప లేకుండునా? అన్నిటికన్న శుభము భగవదానందమగు కైవల్యమే. దీనినే నిశ్శ్రేయస మందురు. ఐహికములు గావలసిన అన్నవస్త్రాదులను అభ్యుదయమందురు. ఈ రెంటినీ శ్రీరాముడు ప్రసాదించునని రామాయణమున గలదు. విశ్వమూర్తి యగు సగుణ బ్రహ్మమును సేవించువారికి కావలసిన ఐహికములు, మోక్షము కల్గును. సగుణ బ్రహ్మమును సేవించుట యనగా సమాజములోని ఇతర జీవుల రూపములుగా నున్న నారాయణుని సేవించుట, మరియు ఇతరులలోని సద్గుణములను నారాయణుని కల్యాణ గుణములుగా గ్రహించి, మనసార కీర్తించుట.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"శాశ్వతుడును, దేవతలచేతను, విశేషమైన బుద్ధి గలవారి చేతను చక్కగా స్తుతింప బడు వాడును, సదా సమస్తమునకు పాలకుడైన వాడును, మునుల సమూహములకు విశ్వసనీయుడయిన ఆప్తుడును, సత్యమైన వాడును, కండ్ల కెదురుగా కన్పడువాడును, మంచి మనసు గలవారికి చక్కని గతిగా తన కలయిక అయిన వాడును, జగత్తును, వాక్కును కాపాడుట తన పనిగా గలవాడును అయిన నారాయణుడగు నీకు నమస్కారము."

వ్యాఖ్య

జగత్తు మొత్తముగా నిరంతరము ప్రయాణించుచుండును. ఊరకనే అట్లే నిలిచి యున్నట్లు కనపడునే గాని భ్రమించుట శాస్త్రీయ సత్యము. అందలి సౌర కుటుంబ ములు, పదార్థములు, అందలి పరమాణువులు, శక్తి గూడ సదా చరించుచుండును. జగత్తు మొత్తముగాను, అందలి పదార్థములు విడివిడిగాను వివిధములుగా నున్నది. మార్పులకు లోనగుచుండును. మన ఊహకందు సమస్తము అంతియే. కావున దీనిని విశ్వమందురు.

భగవంతుని యొక్క ఒక స్థితి మార్పే విశ్వము. విశ్వమునకు మార్పుండును. కాని దానికి మూలమును, అందు అంతర్యామియునగు దేవునకు మార్పుండదు. దేవుడు అఖండ చైతన్యము గావున సదా అట్లే యుండును. శాశ్వతుడు. ఉదాహరణకు మట్టితో కుండలు తయారు చేయబడును. కుండలకు మార్పు గలదు. కాని మట్టికి మార్పు ఉండదు. కావున అశాశ్వతములయిన పదార్థములను ఆశించి, వానిని నమ్ముకొన్నవాడు శాశ్వత సుఖమునకు నోచుకొనడు. వాని సుఖము, అతడు కోరిన పదార్థములు ప్రాప్తించుటపై ఆధారపడి యుండును. అవి అశాశ్వతములు గనుక వానివలన లభించు ననుకొను సుఖము కూడ భ్రమయే కాని సత్యము కాదు. నిత్యుడగు స్వామిసేవ వలని ఆనందమే నిత్యము. దేవుడు అంగి. అనగా మొత్తమయిన వాడు. ఆయన చేయు ఒక్కొక్క ప్రక్రియ లేక ఒక్కొక్క గుణమును దేవతలందురు. దేవత అనగా దివ్యత. వీరు స్వామిలో అంగములు లేక భాగములు. కావున వీరి అస్తిత్వము, దేవునిపై ఆధారపడి యున్నది. ఉదాహరణకు ఒక మానవుని శరీర భాగముల ఉనికి ఆ మానవునిపై ఆధారపడి యుండును. మానవుని ప్రవర్తనపై, అతని శరీర భాగముల ఆరోగ్యము ఆధారపడి యుండును. ఇట్టి దేవతలు నిర్వర్తించు పనులన్నియు దేవుని సంకల్పానుసారమే జరుగుచుండును. దేవతలకు స్వతంత్రముగా పనిచేయు శక్తి లేదు. వారి శక్తి దేవుని ప్రసాదము. ఈ విషయమును సూచించు కథ కేనోపనిషత్తు నందు గలదు. ప్రకృతిలోని ఒక్కొక్క ధర్మమును నడిపించు ప్రజ్ఞయే ఒక్కొక్క దేవత. ప్రకృతి మొత్తములోని ప్రజ్ఞయే స్వామి. ఇట్లు దేవతలు తమ ద్వారమున దేవుడు నిర్వర్తించుచున్న పనులు, విశ్వమునందంతర్యామి యగు దేవునకే అర్చనములగుచున్నవి. వీరు నిత్యము స్వామిని చక్కగా స్తుతించుచుందురు. సూర్యుడు, చంద్రుడు, మబ్బులు, నదులు మున్నగువారి ధర్మములు, జీవుల కుపయోగపడు చుండును. ఎట్టి ప్రతిఫలాపేక్ష లేక వీరు చేయు పనులు అంతర్యామి అర్చనములు గావున వీనిని యజ్ఞములందురు. మనలో కూడ ఇంద్రియములను, ఆకలిని నడిపించు దేవతలు గలరు. వీరు గూడ మన హృదయము నివాసముగా గల భగవంతుని స్తుతించుచుందురు. ఆయన సేవకే వీరంకితము గావలెను. భగవంతుని సేవకు అర్పితము గాని జీవుని శరీరము నందలి దేవతలు దుఃఖమునకు లోనగుదురని భాగవతము చెప్పుచున్నది. మనలోని దేవతలకు, విశ్వమునందలి దేవతలకు చక్కని అనుసంధానమే న్యాసవిద్య యని వేదమున వివరింపబడినది. విబుధులనగా విశేషముగా తెలియు వివేకము గలవారు కూడ. అనగా జీవులను గాక, అంతర్యామి యగు ఒకే దేవుని తెలియు బుద్ధి గలవారు. ఇట్టివారు ఎవరితో, ఏమి మాటలాడినను దేవుని స్తుతించుటగానే చేయుదురు. స్వామిని కీర్తింపని నోరు ఢమఢమ ధ్వనితోడి ఢక్క మాత్రమే యని ప్రహ్లాదుడు చెప్పెను. దేవతలు, దేవుని స్తుతించుట మరచిరా, అసురుల చేతిలో పడిపోవుట జరుగును. మరల విష్ణు పాదములే వీరికి శరణ్యము. అనగా మన ఇంద్రియములు, మనస్సు భగవంతుని అంతర్యామిత్వమును మరచిన క్షణమున రాగద్వేషాదులగు అసురులకు పట్టువడి, ఆనందమను స్వర్గరాజ్యమునకు దూరమగుట జరుగును. మరల విష్ణు పాదములను శరణు గోరుచు, విష్ణుని సంస్తుతి చేయుటతో అంతర్యా మిత్వము స్మరణకు వచ్చి, అసురులు విష్ణునిచే హతులై, వీరికి ఆనందమను స్వర్గము లభించును. ఇది ఎప్పుడో జరిగిన కథ గాదు. ఎప్పుడును ప్రతి జీవిలోను జరుగు కథగా వేదపురాణములందు బహు విధములుగా వర్ణింప

బడినది. దేవతలు స్వామిని గూర్చి చేయు స్తుతులకు సంకేతములుగా ప్రత్యేకముగా పురుషసూక్తము, విష్ణుసూక్తములు వేదమునందు గలవు. 'విబుధసంస్తుత్యాయ' అను సమాసమును అన్నమయ్య ఒక చిత్రమయిన అర్థమున కూడ వాడెను. అది యేమనగా స్వామిని ఎవరు సంస్తుతి చేయుదురో, వారు విశేషమయిన బుద్ధి కలవారై దివ్యులగు చున్నారు. వీరిలో దేవుడే బుద్ధిగా పనిచేయును. తమ పలుకులలో వ్యాకరణ దోషము లున్నను, భగవంతుని మనసార, నోరార భక్తితో స్తుతించుట వలన మనుజునిలో చక్కని వివేకము, జ్ఞానమదియే కల్గును. కావున జ్ఞానమను బిడ్డకు భక్తి తల్లి. స్వామి ఎల్లప్పుడు విశ్వము నధిష్ఠించి పాలించును. కావున అన్నమయ్య 'అధి' అను ఉపసర్గను చేర్చెను. సృష్టి, స్వామికి నిలయమని అర్థము. తన ఆలయమగు విశ్వమును దేవుడే పాలించుచున్నాడు. అందరికి కావలసిన శక్తి ఆయన ప్రసాదమే. విశ్వమునకు ప్రభువాయనయే. భాగవతమున 'జన్మాదస్య' అను మొదటి శ్లోకముననే ఈ విషయము చెప్పబడినది. విశ్వమునకు పుట్టుక, పాలనము, లయము ఎవరి వలన ఏర్పడుచున్నవో అట్టి స్వామిని స్తుతించెదముగాక. మునులు గణములుగా కలిసి జీవింతురు. ప్రతి ఋషి యొక్క ఆశ్రమమున వందల కొలది శిష్యులుండిరని రామాయణమున వర్ణింపబడినది. ఋషిగణము లెల్లరికి శ్రీరాముడు పాదాభివందనము గావించెను. ఇది మన కాదర్శము. ఎల్ల ఋషీంద్రులును రామునిగని సమ్మోహితులై, ఆయన యందు విశ్వాసముంచిరి. రాముడు వారి విశ్వాసమునకు దగినట్లు అసురుల వధించి ఋషులకు, పామరులకు ఆప్తుడాయెను. మును లనగా ఇంద్రియములు, మనస్సు, వాక్కు ఎంతవరకు పనిచేయవలెనో ఆమేర నెరిగి లోకము నందు వర్తింపజేయువారు. అదియు లోకమున స్వామిని ఆలోకించుచుందురు. అంతేకాని మాటలు మాని యుండుట మౌనము కాదు. మాటలు మాని, మనస్సున ఆలోచనలు ఎక్కువ చేయుట వలన రక్తపీడనము పెరుగును. లోకముతో మునికి ఎంతవరకు పని? తన ద్వారమున స్వామి ఎంతవరకు లోక హితమును చేయ సంకల్పించునో అంతమేరయే. ఆపైన లోకములో జరుగు వ్యవహారములు మునికి పట్టవు. అయితే లోక హితార్థ కార్యముల నుండి తప్పించుకొనువాడును ముని కాదు. సుఖములకు పొంగక, దుఃఖములకు క్రుంగక రాగము, భయము, క్రోధము విడిచి, తనయందు స్థిరమైన బుద్ధి గలవాడే 'ముని'యని కృష్ణుడు గీతలో నిర్వచించెను. ఇట్టి మునులకు ఆధారము ధనము, పాండిత్యాదులు గావు. ఆధారము స్వామియే. స్వామి వీరికి తండ్రి, సఖుడు, ప్రియుడు నయిన ఆప్తుడు. శ్రీకృష్ణావతారమునను మునులు పాండవులున్న వనమునకు వచ్చిన కృష్ణుని దర్శించి తనిసిరి. వేంకటాచలమున మునులు వివిధ రూపములతో కన్పడుచు గాని, కనపడకుండ గాని స్వామి సన్నిధిలో నున్నారు. స్వామిని విశ్వసించినవాడు ముని యగుననియు, తల క్రిందులుగా అర్థము చెప్పుకొనవలెను. స్వామియే సత్యమైన వాడు. అనగా ఉన్నవాడు. జగత్తు స్వామి యొక్క కల వంటిది. కలలో మన యొక్క మనస్సే వివిధ రూపములను ధరించును. వివిధ సన్నివేశములు కలలో జరుగు చున్నంతసేపు వాస్తవము లన్పించును. కాని మేల్కొనగనే కలలో గనినవన్నియు అసత్యములనియు దెలియును. అట్లే జగత్తు స్వప్నము. స్వామియే సత్యము. సత్య స్వరూపుడయిన స్వామిని కొలిచినచో జగత్తులోని విషయములపై వ్యామోహము వీడును. స్వామి కంటికి ఎదుటనే కన్పడుచుండును. అనగా ఊహకందని వాడయ్యును, రూపములు లేనివాడయ్యును స్వామి మన

కనుల యెదుట కానవచ్చు ఎల్ల రూపములు తనవియే అయినవాడు. వస్తుదృష్టితో గాక సత్యదృష్టితో గనువానికి ఎదుట నిలిచినదంతయు విష్ణురూపమే. ఇదిగాక అర్హతను బట్టి స్వామి ఇష్టదైవతము రూపములోను సాక్షాత్కరించుటలో వింత లేదు. మరియు సరిగా గనువానికి 'తాను'గా నున్నదియు స్వామియే యని అనుభవమునకు వచ్చును. తన రూపము, ఎల్ల రూపములు, స్వామివిగ దర్శన మిచ్చుటయే సారూప్య ముక్తి. ఇట్లు మూడు విధములుగ స్వామి భక్తునకు ప్రత్యక్ష మగుచున్నాడు. మంచి మనస్సు గలవారికి చక్కని గమ్యము స్వామియే. సాంగత్య మనగా సంగతి యొక్క భావము. సంగతి యనగా చక్కని గమ్యము మరియు కలయిక కూడ. మంచి మనస్సు గలవారి మనస్సు, అంతర్యామి యందు లీనమై, ఆయన కలయిక అను భాగ్యమును పొందును. అయితే ఈ కలయిక విచిత్రమైనది. మనము ఒక వ్యక్తిని కలిసినప్పుడు ఇర్వురు నుందురు. కాని మనస్సు స్వామిని గలియగా ఇక అది యుండదు. స్వామియే మనస్సు స్థానమున నుండును. ఉదాహరణకు ఒక రుమాలునందు కర్పూరపు ముద్ద నుంచి వెల్గించినచో రుమాలు కాలిపోయి, తన యునికిని కోల్పోవును గదా. ఇక ఏయితర వస్తువును రుమాలు నందుంచిన దాని వాసనయే రుమాలు కంటును. అట్లే మనస్సు దేనిని భావించినచో దాని వాసన దీనికంటును. స్వామినే కలిసినచో మనస్సే ఉండదు. స్వామి అనుభూతియే నిలుచును. ఇదియే మన పరమావధి. దీనికి దారి కూడ అంతర్యామిని నిత్యము స్మరించుచు సేవించుటయే. విష్ణు స్మరణ వలననే మనస్సు మంచిదగును. చివరకు తానే విష్ణువగును. 'సత్' అనగా 'మంచి' అని ఒక అర్థము. 'అస్తిత్వము' అని వేరొక అర్థము. అస్తిత్వమనగా శాశ్వతముగానున్న భగవంతుడే. స్వామియందలి మనస్సే మంచి మనస్సు అని అన్నమయ్య వ్యంగ్యముగా చెప్పుచున్నాడు. నాస్తికుడు గాని, స్వామిని స్మరింపనివాడు గాని ఎంతగా మంచిపనులు చేసినను, అవతలివారి గుర్తింపు కోరి, దానికై వెంపర్లాటలో చిక్కుకొని, అది లభింపనపుడు రోష దుఃఖములకు గురియగుట జరుగును. సర్వాంతర్యామి యగు స్వామి కర్పితముగా మంచి పనులు చేయువానికి తాను చేయుచున్నానను స్పృహ యుండదు గావున గుర్తింపుతో పని లేదు. అతని మనస్సు విష్ణుమయ మగును. స్వామి జగత్తును రక్షించు పని చేయు చుండును. అన్నమయ్య స్వామిని గూర్చి కీర్తించిన కొన్ని విశేషములు వ్యక్తిగత సాధనకు చెందినవి. కొన్ని జగత్తుకు చెందినవి. విశ్వమునందు అంతర్యామిగా ప్రకృతి ధర్మములను నెఱపుచు జగత్తును కాపాడుచున్నవాడు స్వామియే. ఇదిగాక అవతారమూర్తులుగ కూడ లోకకంటకుల బారి నుండి జగత్తును కాపాడుచున్నాడు. వేంకటేశ్వరుడుగ వెలసి, జనులను ఆకర్షించి, కాలక్రమమున వారు సజ్జనులు, భక్తులగుటకు దారి కల్పించుచున్నాడు. శ్రీవేంకటేశ్వర దర్శనము, స్వామి స్మరణము, సంకీర్తనము అతనిని పాపవాసనల నుండి కాపాడును. యజ్ఞయాగాదులతో పని లేదు. స్వామి సంకీర్తన స్వరూపుడు. సంకీర్తనము, తోటి జీవుల రూపములలోని స్వామికి ప్రేమతో సేవ – ఈ రెండు ఆయుధములతో స్వామి జీవులను కాపాడు చుండును. మరియు అధర్మము పెరిగి నపుడు అన్నమయ్య వంటి పరమభక్తులను పంపి, వారి నావహించి జగత్తును కాపాడును. జగత్తు అనగా వాక్కు అనియు అర్థము. 'జగత్' అనగా ఎప్పుడును నడచునది. వాక్కు కూడ ఒకరి నుండి ఒకరికి ప్రయాణించును గదా. 'గ' ను రెండుమార్లు ప్రయోగించునపుడు మొదటి 'గ', 'జ' అగును. స్వామిని కీర్తించినపుడే మన వాక్కుకు రక్షణము లభించును. ఆరోగ్యము,

ఆహ్లాదము, పరస్పర సహకారము లభించును. మన వాక్కుకు రక్షణ మనగా వినువారికి, తనకు ఆహ్లాదము, ఆనందము, శుభము అగుటయే. ఇది ఎదుటివారిలోను, తనలోను స్వామిని దర్శించిన వానికే సాధ్యము. ఇట్టివారి ద్వారమున స్వామియే తీయగా మాటలాడును. ఎదుటివ్యక్తిని చూచినవాడు, వాని మాటల, చేష్టల ప్రభావమునకు లొంగి ఎదురు మాటలాడును. ఎదుటి వ్యక్తిలో భగవంతుని దర్శించు వానిపై ఆ వ్యక్తి మాటలు, చేష్టలు ప్రభావము చూపవు. తనలోని దేవుడే మాటలాడును. దుర్యోధనుడెంత పరుషముగ మాటలాడి నను ఆతని యందు వాసుదేవునే దర్శించిన ధర్మరాజు మాట ఎప్పుడు పరుషముగా గాక, మృదులముగానే యుండెడిది. దుర్యోధనుడు తన స్వభావమును వీడకున్నను, ధర్మరాజు తన స్వభావమును వీడలేదు. ఇతనికి శ్రీకృష్ణునకు శరణాగతి తప్ప వేరు స్వభావమని లేదు. దుర్యోధనుని పరోక్షమున గూడ తమ్ముడగు భీముడు రెచ్చగొట్టి నను, ధర్మరాజు దుర్యోధనుని నిందింపలేదు. అందువలననే దుర్యోధనునకు భీముడన్నచో భయము లేదు. ధర్మరాజన్నచో భయము, గౌరవము. తన దోషము, అతని గుణము తనకు తెలియును గావున ఇతడు ఎప్పుడును ధర్మజుని ముఖము తేరిపార చూడలేకపోయెను. రెండుమార్లే పలకరించెను. ఆ రెండుమార్లును ధర్మజుని 'అనఘా' అనియే సంబోధించెను. ధర్మరాజు నాలుకపై కృష్ణుడే నాట్యమాడి అతని మాటను కాపాడెను. ఇట్టి నారాయణునకు అన్నమయ్య నమస్కరించుచున్నాడు. ఈవిధములయిన అనుభవములు అతనికి కలిగినవి. వేంకటేశ్వర దర్శనము, స్వామివిశ్వరూపసందర్శనము, సత్యసందర్శనము, తన మనస్సు స్వామియందు లీనమగుట, తన మాట తనదిగాక స్వామియే మాటలాడుట, పాట పాడుట మున్నగునవి. స్వామియే మాట అయ్యెను. పాట అయ్యెను. భక్తుని వాక్కును కాపాడిన స్వామి అతని జగత్తును – శరీరమును, ప్రాణమును, మనస్సును కూడ కాపాడును.

2వ చరణము యొక్క తాత్పర్యము

"అధర్మ పద్ధతిలో గర్వించి, తమ భుజబల శౌర్యములతో లోకములను అతిక్ర మించిన శుక్రుని శిష్యులగు అసురులను సమూలముగా సంహరించు సామర్థ్యము గలవాడును, ఇంద్రుడు మున్నగు దేవతల వంకరయైన భయమును తొలగించుటలో వక్రత లేనివాడును, శత్రుసమూహము తనచే వధింపబడినవాడును అగు నారాయణుడగు నీకు నమస్కారము."

వ్యాఖ్య

ఇచట అన్నమయ్య హిరణ్యకశిపుడు, రావణుడు, నరకుడు మున్నగు అసురులను శుక్రుని శిష్యులని పేర్కొనెను. ఇందొక విశేషము గలదు. శుక్రుడను గ్రహము జాతకమున అక్రమ స్థితిలో అనగా చెడినచో జాతకునకు తీవ్ర కామము, అధర్మ పద్ధతిలో విషయ భోగములందు లాలసత ఉండును. అర్థ కామములే వీరికి కావలసినది. ధర్మముతో పని లేదు. మోక్ష ప్రస్తావనయే యుండదు. వీరొకవేళ బ్రహ్మను గాని, శివుని గాని అర్చించినను వారిని అంతర్యామిగ భావించక, ఒక శక్తిమంతుడగు వ్యక్తిగనే ఆరాధింతురు. కావుననే వీరికి కామక్రోధములు, మదమత్సరములు వదలవు. వీరు శుక్ర శిష్యులనుటలో వేరొక ముఖ్య

విశేషము గలదు. శుక్రధాతువునకు శిష్యులు అనగా దానిని దుర్వినియోగపరచునట్టి అధార్మికమయిన, తీవ్ర కామబద్ధులని అర్థము. కామము నుండి క్రోధము, దాని నుండి అసత్యమును సత్యముగా పొరబడు భ్రాంతి, దాని నుండి తెలిసిన మంచి మరపునకు వచ్చుట, ఆపై వివేకము నశించుట, ఆపై జీవునకు వినాశము కలుగునని గీతలో శ్రీకృష్ణుడు చెప్పెను. కామముతో అసురులు ఎంతటి ఘోరమయిన పనులకు అయినను ఒడిగట్టుచుందురు. రావణుడు వందలమంది పురుషులను చంపి, వారి భార్యల నపహరించి పాపము చేయుట వలన, ఆ స్త్రీలను కాపాడుటకే విష్ణువు రాముడుగా అవతరించి, అతనిని పరిమార్చెనని స్వయముగా మండోదరియే చెప్పినట్లు రామాయణమున గలదు. పరస్త్రీలను, పరుల సంపదను కొల్లగొట్టు రాజ్యమే లంక. లంకను ఆ పాపముల నుండి విముక్తి గావించినవాడు రాముడు. రావణ నరకాది అసురులు క్షుద్రశక్తులను, ఆయా కాలమున పరిణమించిన శాస్త్రీయ విజ్ఞానమును లోక వినాశమునకు ఉపయోగించిరి. వారి బలశౌర్యములు ధర్మమును భంగము చేసినవి. వారిని వారి వంశస్థులు కొందరు సమర్థించిరి. కావుననే స్వామి అట్టివారిని సమూలముగా ధర్మరక్షణకై పెకలించెను. క్రమ మనగా ధర్మ పద్ధతి. శ్రీకృష్ణుడు నరకాసురుని చెఱలోనున్న పదునారువేల నూరుమంది రాచకన్నెలను విడిపించెను. వారెల్లరు నారదుని ఉపదేశమున కొన్ని యేండ్లపాటుగా శ్రీకృష్ణునే భర్తగా వరించి ధ్యానించుచుండిరి. పైగా ఇపుడు వారిని సంఘమున విడిచిపెట్టినచో అత్యాచారములకు గురికావచ్చును. శ్రీకృష్ణుడు వారి వేడికోలును మన్నించి వివాహమాడి కాపాడెను. తానుగా ఎవరినీ కోరలేదు. కోరిన వారిని స్వీకరించెను. అట్లే జరాసంధుని భీమునిచే చంపించి, ఆతని సైన్యమును, ప్రజలను కాపాడెను. అతని చెఱలోనున్న 18,000 మంది రాజకుమారులకు విముక్తి కలిగించెను. పరస్త్రీని అవమానించిన కౌరవులు తమ పాప ఫలితము ననుభవించిరి. తమ్ముని భార్యపై అత్యాచారము జరిపిన వాలిని వధించి రాముడు ధర్మమును కాపాడెను. తనకైనను, ఎవరికైనను ధర్మ మొకటే. ఇట్లు పరస్త్రీ కాముకులై వారి నపహరించిన వారికి తగిన శిక్ష వధయే యని శ్రీరాముడుగా, శ్రీకృష్ణుడుగా స్వామి చేసిన నిర్ణయము. అసురులనగా కోరలుండ నక్కరలేదు. పరస్త్రీలను, పరుల సంపదను కొల్లగొట్టువారెల్లరు అసురులే. కంసుడు మధురలో వేశ్యాలోలుపత్వమును పెంచెను. పల్లెసీమలలోని సంపదను కొల్లగొట్టి, ధనముగా మార్చి నగరమునకు తరలించెను. ఇట్లు శుక్ర శిష్యులనుటలో అన్నమయ్య ధర్మవిరోధులయిన కాముకులు అను భావమును ప్రకటించెను. మనలో కూడ భగవంతుని సంకీర్తనమున, సేవలోను మునిగినవాని కామ క్రోధాది అసురులను స్వామియే పరిమార్చును. శుక్రమును ఓజస్సుగా, దివ్యకాంతిగా భక్తునిలో మార్చును. ఇంద్రుడు, అగ్ని మున్నగు దేవతలు అంతర్యామిని మరచి, తమ బలమును గుర్తుకు తెచ్చుకొనుటే వక్రత. సద్గుణవంతు లైనను, తాము సద్గుణములు గలవారము అని గుర్తున్న క్షణములలో, ఇతరులలో దుర్గుణములు కన్పడుట జరుగును. ఇతరులలో దుర్గుణములు చూచుట వలన సద్గుణవంతులను కూడ దుర్గుణములు చేరును. అపుడు తాను మిగిలినవారికన్న ఎక్కువ మంచి గుణములు గలవాడనన్న భావము వృత్తమై మనలోనుండి చావదు. ఇదియే ఇంద్రాదులకు కలిగిన వంకర భయము. వానిని చంపుట సాధ్యము కాదని వేదములలో చెప్పబడినది.

దేవతలు అంతర్యామిని మరచినపుడెల్ల, అసురుల బారిన పడక తప్పదు. మరల అంతర్యామి యగు విష్ణుని శరణు వేడగా, స్వామి వారి వక్ర భయమును నివారించుటలో సామర్థ్యము, సూటితనము నెఱపును. ధర్మమును నిలబెట్టుటయే నిర్వక్రత. హిరణ్యకశిపునితో పోరాడి ఓడిపోయిన దేవతలు నారాయణునితో మొఱబెట్టుకొన్న సందర్భమున వెంటనే వారిని స్వామి కాపాడలేదు. ఎందుకనగా వారే స్వయముగా అసురుని ఎదుర్కొన యత్నించిరి. ఎట్టి ఎదుర్కోలును నెరపక, తనను చంప యత్నించిన వారిలోను అంతర్యామినే దర్శించిన ప్రహ్లాదునకు ఆపద వాటిల్లినపుడు స్వామి ఆతనిని కాపాడెను. ఆతనితో బాటు దేవతలును కాపాడ బడిరి. చీకటితో పోరాడినచో అది పోదు. వెలుగును చూపించినచో అదియే వైదొలగును. అట్లే మనలోని కామ క్రోధాది దుర్గుణములతో ఎన్ని జన్మలు పోరాడినను మన కపజయము తప్పదు. ఈ చెడు గుణములు తొలగవలెనని గట్టిగా వానినే తలంచుట వలన వాని బలము పెరుగును. అట్లు ఆ గుణములందును, అవి గలవాని యందును స్వామి వైభవలీలను దర్శించినచో, స్వామి వెలుగులో అవి మటుమాయమగును గదా. మనలో కామ క్రోధ లోభములు రజోగుణము నుండి పుట్టినవి. ఇవి, ఇంక మూడు – మోహ మద మత్సరములే మన శత్రువులు. ఈ భావములు ఎందరిలోనో గుంపులుగా పొదసూపుచుండును. మనము విడిచిపెట్టక స్వామినే తలంచి, సేవించుచున్నచో మన పోరాటము, పటిమలతో పనిలేక స్వామియే తొలగించును. నిందించు వారిలోను స్వామియే ఉన్నాడు కదా. స్వామిని దుష్ట హృదయుడని ఒక గర్వి యన్నట్లుగా భాగవతమున ఒక కథ కలదు. దుష్టహృదయు డనగా దుష్టమైన హృదయము గలవాడని గాదు. దుష్టమైన హృదయములలో తానుండి వెలుగుగా ప్రకాశించునని తెలియకనే అతడు ప్రశంసించెను. ఫలానావారు నాకు శత్రువులను భావమే మన శత్రువు. దీనిని తొలగించువాడు శ్రీహరియే. ఫలానా వానిలోను, మనలోను, మన భావములోను అంతర్యామి గదా. అంతేగాని భగవాను నకు శత్రువులని ఎవరుండరు. ధర్మసంస్థాపన, సాధు సంరక్షణములే దేవుని అవతార కార్యములు. మన హృదయము లందును ఆర్తితో పిలిచినచో నిలిచి, మనలను కాపాడుటలో వింత లేదు. మనకు ఎవరియందైనను శత్రుభావన ఉండరాదు గాని, ఎవరికయిన మనపై నున్నచో దానితో మనకు ప్రమేయము లేదు. ఈ యర్థముననే ధర్మరాజు అజాతశత్రువయ్యెను. శ్రీకృష్ణుని కౌరవ సభకు రాయబారమునకు పంపుచు ధర్మజుడు స్వామిని రాజ్య మిప్పింపుమని వేడలేదు. "మాకు ఇతరులయందు – కౌరవుల యందు వ్యతిరేక భావములు కలుగకుండ కాపాడుము" అని ప్రార్థించెను. కావుననే అన్ని విధములుగ కాపాడు బాధ్యత శ్రీకృష్ణుడు తన భుజములపై వహింపవలసి వచ్చినది.

3వ చరణము యొక్క తాత్పర్యము

"నాశనము లేనివాడును, ఏమాత్రము ఎట్టి అపేక్ష లేనివాడును, తెల్లతామర వంటి కనులు అక్షులు గలవాడును, శ్రీవత్సమను పుట్టుమచ్చ తన ఛాతీపై గుర్తుగా గలవాడును, నశింపని విజ్ఞానముతో సమర్థులగు యోగీంద్రులను చక్కగా రక్షించుటలో దయతో కూడిన క్రీగంటిచూపులు గలవాడు నగు నారాయణుడగు నీకు నమస్కారము."

వ్యాఖ్య

గీతలో కృష్ణుడు పరబ్రహ్మమును గూర్చి 'అక్షరుడ'ని చెప్పెను. జగత్తు మార్పులకు లోనగును గాని, లోని అంతర్యామి ప్రజ్ఞకు మార్పు లేదు. నాశనము లేదు. శరీరమను చెట్టుపై జీవుడు, పరమాత్మ అను రెండు పిట్టలున్నవి. జీవుడను పిట్ట పుణ్య పాప కర్మ ఫలితములను తీయని పండ్లను, చేదు పండ్లను తినుచుండును. పరమాత్మ యను పిట్ట సాక్షిగా చూచుచుండునని ఋగ్వేదమున గల సుపర్ణ సూక్తమున ఒక పొడుపుకథ గలదు. జీవుని స్వభావము, గుణములు, చేష్టలు లోన ఆత్మగానున్న దేవునకంటవు. ఆతడు క్షరము – నాశము లేనివాడు. మరియు 'అ' కారము నుండి 'క్ష' కారము వరకు గల అక్షరములలో తేడా ఉండవచ్చును గాని ఇవి అన్నియు ఓంకార నాదమను ఒకే శబ్దము యొక్క ముక్కలు. అసలైన అక్షరము ఓంకారము. ఇది మొదలూ, చివరా లేనిది. ఇదియే ఆకాశమందును, గ్రహ తారకాది గోళముల పరిభ్రమణము నందును, జీవుని శ్వాస యందును తనకు తానుగా ధ్వనించుచున్నది. ఇందుండియే సప్త స్వరములు, సప్త లోకములు, సప్త ధాతువులు పుట్టినవి. ఇట్టి ఓంకారమే పరబ్రహ్మము. కాన స్వామిని అక్షరుడని అన్నమయ్య సంబోధించుచున్నాడు. తన ద్వారమున రచనలుగా దిగివచ్చిన సంకీర్తనములలోని స్వరములు, ధ్వనులు వేరుగా వచ్చును. కాని వీని నేపథ్యమున ఓంకార నాదమున్నది. దాని అవతారములే తన సంకీర్తనలు. ఆ నాదము అక్షరము. అదియే నారాయణుడైన వేంకటేశ్వరుడని అన్నమయ్య చిత్రమయిన భావమును ఇందు ప్రకటించెను. అనగా తాను రచించినవి గావు సంకీర్తనలు. ఈ సంకీర్తనలుగా అవతరించినది ప్రణవనాద స్వరూపుడగు స్వామియే. స్వామియే సంకీర్తనమను అవతారమును ధరించెనని భావము. కావున వీనిని గానము చేయువారు, వినువారు స్వామి యొక్క సాన్నిధ్య మాధుర్యమున ఓలలాడుచు, వారును తనవలెనే అక్షరు లగుదురని అన్నమయ్య హామీ ఇచ్చుచున్నాడు. స్వామి కే మాత్రము అపేక్షలు లేవు. ఆయనకు ప్రియులు, అప్రియులు లేరు. ప్రియములు, అప్రియములు లేవు. అన్నియు తానయిన వానికి ఇది కావలయునని కోరిక ఉండదు గదా. మరి అప్రియులు లేనిచో అసురులనేల సంహరించెను? ధర్మరక్షణకై, లోకకల్యాణమునకై. అంతేకాని రావణాదులపై వ్యక్తిగతముగా కోపము స్వామికి లేదు. శ్రీరాముడు రావణునకు ఉత్తరక్రియలు చేయుటకు సంసిద్ధుడయ్యెను. కృష్ణుడు జరాసంధ నరకాదుల వధ పిమ్మట వారి కుమారులకే రాజ్య మప్పగించెను. తానే రాజ్యమును ఆశింపలేదు. కృష్ణుడు స్వయముగా గీతలో ఇట్లు చెప్పెను. "అర్జునా! నాకీలోకమున చేయవలసినది గాని, పొందవలసినది గాని, పొందగోరునది గాని ఏమియు లేదు. కాని లోకకల్యాణము కొరకై పనులను స్వీకరించి నిర్వర్తించుచున్నాను. నీవును అట్లే చేయుము." శ్రీరాముడు, శ్రీకృష్ణుడు అవతరించినది గూడ బ్రహ్మాదులు, భూదేవి మొఱపెట్టుకొనుట వలననే గాని స్వామికి స్వయముగా ఏ కోరికయును లేదు. అంతమాత్రమున ధర్మాధర్మ ఘర్షణలో కల్పించుకొనకుండ ఊరక చూచుచుండు నని గాదు. ధర్మరక్షణ కొరకై కొందరిచేత ప్రార్థింపబడుట, తానవతరించుట తన క్రీడ. వేంకటేశ్వరుడుగా కూడ బ్రహ్మయొక్క ప్రార్థనపై అవతరించెను. ఎట్టి అపేక్షలు లేని స్వామి సృష్టి స్థితి లయములను చేయుచున్నాడు గదా. జీవులపై దయ నెఱపుచున్నాడు గదా. సృష్టి స్థితి లయములు

తన భార్యయగు అమ్మవారు నిర్వహించు చుండగా తాను వెనుక ఉన్నా దంతియే. సృష్టి చేయవలెనని ఆయన సంకల్పింపలేదు. ఆ సంకల్పమదియే ఆయన యందు కలిగెను. అది ఆయన క్రీడ లేక లీల. సృష్టి స్థితి లయములు స్వామికి వినోదములే గాని అపేక్షలు గావు. అపేక్షలు గలవానికి ఆనందముండదు. ఎట్టి కోరికలు లేని స్థితియే స్వామి గావున అఖండానందాను భూతియే తాను. మరి జీవులను అనుగ్రహించుట అను కోరిక ఉన్నది గదా అని కొందరి సందేహము. ఆ యనుగ్రహము కూడ అమ్మవారే. అనుగ్రహించుట స్వామికి స్వభావమే గాని కోరిక కాదు. తల్లి పిల్లకు పాలిచ్చుట స్వభావము. తనకొరకయిన కోరిక గాదు. కావుననే స్వామి దయ కొందరిపైన అని యుండదు. సూర్యరశ్మి ఎల్లరిపై సోకును. తలుపులు, కిటికీలు తెరచిన వారి ఇండ్లలో ప్రవేశించును. మూసికొన్న వారి ఇండ్లలో చొరబడదు. ఈ తేడా ఆయా వ్యక్తులకే గాని, సూర్యరశ్మికి సంబంధించినది గాదు. అట్లే దేవుని దయ అను ప్రవాహమున ఎవరయినను స్నానమాడవచ్చును. అసురులను చంపిన స్వామి వారిని గూడ తనలోనికి స్వీకరించును. భాగవతమున ఇట్లు చెప్పబడినది. "తన మరణ సమయమున అసుర గుణములు గలవారు, ఓ శ్రీహరీ! నిలు నిలు, పోకు పోకు మనుచు శ్రీహరిని తలంచుచు ప్రాణము విడిచెదరు." వారికి మంచి ఉత్తర జన్మలు కలుగును. పూతనకు యశోదకు వలె మాతృస్థాన మిచ్చిన స్వామి దయకు కొలబద్ద యేమున్నది? స్వామి తెల్లతామర వంటి అక్షులు గలవాడు. తామర మొగ్గగా నుండి క్రమముగా వికసించును. అట్లే స్వామి చూపులు మొగ్గలుగా ముడుచుకొన్నప్పుడు ప్రళయము, క్రమముగా విచ్చుకొనగా సృష్టియు తటస్థించును. ఇక తెల్లతామర లనుటలో స్వచ్ఛములయిన చూపులని భావము. తెలుపు ఏడు వర్ణములకు వెనుక గలదు గదా. కావున ఏడు రంగుల కిరణములకు మూలమయిన సూర్యకాంతి వంటి చూపులు గలవాడని అర్థము. అక్షము అను పదమునకు చూపు అనియు, బండి చక్రపు ఆకు అనియు అర్థము. సంవత్సరమను బండి చక్రమునకు గల ఆరు ఋతువులు ఆకులు. ఇవి స్వామి చూపు అయిన సూర్యకాంతి నుండి ఏర్పడుచున్నవి. స్వామి కనుచూపుల నుండి సూర్యుడు జనించు చున్నాడని పురుషసూక్తము చెప్పుచున్నది. స్వామి అవతరించినపుడు, ఆయన వక్షఃస్థలముపై శ్రీవత్సమను పుట్టుమచ్చ నెలకొనియుండును. ఇది అత్యంత శుభలక్షణము. ఇది శ్రీరామునకు, శ్రీకృష్ణునకు, శ్రీవేంకటేశ్వరునకు గలదు. శ్రీవత్సమను పుట్టుమచ్చ గలవానిగా స్వామిని ధ్యానించినచో శుభగుణములు మనకు చేకూరును. దక్షుడను ప్రజాపతి గలడు. భూమిపై గల జీవులలో 'నేను ఫలానా జీవిని' అను అహంకారము దేవుని నుండి వేరగుటకు ఇతడధిపతి. ఈతడు లేకున్నచో సృష్టి సాగదు. కాని ఇది యున్నచో అహంకారము వలన దేవుడు మఱపునకు వచ్చి, సంసార బంధమున చిక్కుకొనును. ఈ దక్షుడు నేనే దక్షుడను – సమర్థుడనను అహంకారముతో తన జీవితమగు యాగమున, విశ్వాంతర్యామికి చోటు లేకుండ చేసెను. అనగా తన జీవితమున సమాజ హితమునకు చోటు లేదు. ఇట్టి జీవితము రోగములు, బాధలపాలై నశించును. ఇదియే దక్ష యజ్ఞ విధ్వంసనము. శివుడుగా ఈ పని చేసిన స్వామియే మరల దక్షునిపై దయతలచి నారాయణుడుగా దర్శనమిచ్చి, అతని జీవిత క్రతువు సమాజ హితమున కంకిత మగునట్లు గావించి, దానిని పూరించెను. శివుడన్నను, నారాయణుడన్నను ఒకటే వెలుగు. కావున అహంకారముతో వచ్చిన జీవి, దానిని స్వామికి అర్పించి శరణందవలెను. ఇందు

జ్యోతిశ్శాస్త్రపరమైన వేదార్థము కూడ కలదు. దక్షుడనగా సంవత్సరమును నడిపించు ప్రజాపతి. సంవత్సరము మీనరాశితో అంతమగును. మరుసటి సంవత్సరము మేషరాశితో మొదలగును. ఇదియే స్వామి దక్షుని తల తెగగా, గొఱ్ఱె తల అతికించినట్లుగా సంకేతింపబడినది. మేష మనగా గొఱ్ఱె. మరియు యోగీంద్రు లెల్లరు నశింపని విజ్ఞానము గల సమర్థులు. విజ్ఞాన మనగా తమకందిన విద్యను సమాజ హితమునకై వినియోగపరచుట అని యర్థము. అపుడు మాత్రమే విద్య నశింపదు. ఎవరికిని అందింపకుండగను, ఎవరికిని ఉపయోగ పెట్టకుండగను నిలువయుంచునది చదువే గాని విద్య గాదు. ఇది నశించును. ఆంగ్లభాషలో ఒక సామెత గలదు. నేర్పుట అనునది తాను బాగుగా నేర్చుకొనుట కొక మంచి మార్గము. వట్టి శాస్త్రపాండిత్యము వ్యర్థమే కాక హానికరము గూడ. ఇది లోక హితమునకు ప్రయోగింపబడినపుడే నశింపని విజ్ఞానమగును. లేకున్న అది ఎదగదని తైత్తిరీయోపనిషత్తు చెప్పుచున్నది. అన్నమయ్య 'అక్షీణ విజ్ఞానమను' సమాసమును ఈ యర్థములో ప్రయోగించెను. కావుననే మనువు ఇట్లు శాసించెను. "డబ్బులు తీసికొని వైద్యము చేయువాని వద్ద చికిత్స పొందకుడు!" అనగా వేరు వృత్తితో జీవనోపాధి గడించి, వైద్యము ప్రతిఫలము కోరకుండ చేయవలెను. వైద్యము, విద్య అమ్ముడు పోరాదు. అవి రెండును అమ్మకమునకు పెట్టబడిన ప్రస్తుత కాలము భూగోళ చరిత్రలో చాల శోచనీయమయినది. వేదవిద్యను అమ్మరాదు. వేదవిద్యను విప్రులు కలియుగములో అమ్ముకొందురని రోమశమహర్షి ధర్మరాజుతో తన పరితాపమును వెలిబుచ్చెను. ప్రజల మేలుకొరకై వినియోగము పొందిన విజ్ఞానము నశింపకుండుటయే గాక, అందు ఇట్టివానికి నేర్పు, సామర్థ్యము పెరుగును. కావలసినది ఒక మంచిపని చేయుటలో నేర్పు గాని, పాండిత్యము గాదు. 'కర్మలను నేర్పుగా చేయుటయే యోగమ'ని కృష్ణుడు చెప్పెను. ఇట్టి నేర్పు గలవారు యోగీంద్రులు. వారి నెప్పుడును స్వామి రక్షించుచుండును. 'నేను నేర్పు గలవాడను' అను అతిశయ భావము పుట్టకుండ స్వామియే తన రూపమున చేయుచు, సమాజ రూపమున స్వీకరించుచున్నాడను భావము నిచ్చి స్వామి వీరిని కాపాడును. శరణాగతి పొందిన యోగీంద్రుల కిది దక్కును. పైగా ఎంత విజ్ఞానమున్నను, ఎంతగా దానిని సంఘము నకు వినియోగించుచున్నను దైవసాన్నిధ్య మాధుర్యము లేనపుడు అది వ్యర్థము. భక్తులకు స్వామి తన సాన్నిధ్యమను తీయదనము నిచ్చి రక్షించును. ఉదాహరణకు వైద్యుడు గాని, ఉపాధ్యాయుడు గాని, గాయకుడు గాని తన ద్వారమున జరుగుచున్న పనిలో సంతృప్తిని, ఆనంద మాధుర్యము ననుభవింపవలెను. ఇతరులకు ఏ సేవ చేసినను అంతే. భగవంతుని స్మరించుచు, ఆయనకు అర్పితముగా పనులు జరుగు చున్నచో విజ్ఞానము, నేర్పు పెరుగుటతో, దైవానుభూతి విరామము లేకుండ కొనసాగును. ఇదియే దేవుని రక్షణము. ఇట్లు రక్షించుటకై, యోగులను అనుసరించి దయతో క్రీగంటి చూపులను చూచునట. అనగా ఎంతగా స్వామి వైపు శరణాగతులమై మనము జరుగుదుమో, అంతగా ఆయన దయ మనకు అనుభవమునకు వచ్చును.

భాగవతమున ఒక కథ గలదు. బలరామకృష్ణులు గోపబాలురతో కలిసి గోవులను పాలించుచు, గోకులమునకు దూరముగా వెళ్లిరి. గోపాలకులకు ఆకలి కలిగెను. శ్రీకృష్ణుడు పంపగా, వారు దగ్గరలోని

మునిపల్లెకు వెళ్ళి, మునులను ఆహారము కొరకై వేడిరి. మునులు తాము చేయుచున్న క్రతువులనాపక, ఆహారము నిచ్చుటకు నిరాకరించిరి. దేవుడే సజీవముగా వచ్చినను, ఆయన విగ్రహములకు నివేదన పెట్టకుండ, ఆయన సజీవ స్వరూపమునకు పెట్టమను అజ్ఞానము వారి నావరించినది. మరల కృష్ణుని పనుపున గోపాలురు మునిపత్నులను చేరి ఆహారమును గోరిరి. వేదము రాకుండుట వలన, క్రతువులు చేయకుండుట వలన వారు బ్రతికిపోయిరి. అవి వద్దని కాదు. దానివలన అహంకారము రారాదు. మగవారి అడ్డుకోలును పట్టించుకొనక మునిపత్నులు శ్రీకృష్ణుని వద్దకు వచ్చి భోజనములను ఎల్లరకు వడ్డించి, స్వామి సాన్నిధ్య మాధుర్యమును అనుభవించిరి. వారు అడుగకయే స్వామి వారికి ఇట్లు వరమిచ్చెను. "మీ భర్తలు, తండ్రులు, సోదరులు మిమ్ములను కోపింపరు." మునిపత్నులు తమ నివాసములకు చేరుసరికి మగవారు వారియెడల ప్రసన్ను లగుటయే గాక, వారికి దక్కిన భాగ్యమును కొనియాడిరి. తమ అజ్ఞానమునకు పశ్చాత్తాపము చెందిరి. ఇట్లు వారిలో పశ్చాత్తాపము కలిగించి, స్వామి రుక్మిణీ కల్యాణ సందర్భమున వారిని పిలిపించి సన్మానించెను. అప్పటికి వారికి స్వామి సన్నిధి లభించినది. ఇట్లు స్వామి సాధకులు తనవైపు పూర్తిగా జరుగునట్లు సన్నివేశ ములు కల్పించి, తన సన్నిధి నిచ్చును. ఇది ఆయన కరుణాకటాక్షముల మహిమ. ఇక గోపాలురకు, గోపికలకు, ఉద్ధవునకు, మైత్రేయునకు, వ్యాసాదులకు ఎట్లును స్వామి సాన్నిధ్యము లభించెను. సాందీపని మహర్షికి శిష్యరూపమున సాన్నిధ్య మనుగ్రహించెను. గురుదక్షిణగా మృత్యువువాత పడిన గురు కుమారులను స్వామి బ్రతికించి తెచ్చినపుడు సాందీపని ఋషి కృష్ణుని నుతించెను. కృష్ణుడట్లు వినయముతో పలికెను. "ఇదంతయు తమ యాశీస్సుల ఫలము." వినయమును చూపుట అనగా వినయమును నేర్పుటయే.

4వ చరణము యొక్క తాత్పర్యము

"గజేంద్రునకు వరింపదగిన ఉత్తమ స్థితి నిచ్చినవాడును, కౌస్తుభమును ఆభరణముగా గలవాడును, మురాసురునికి శత్రువైన వాడును, జగత్తును మోహింప జేయువాడును, అష్టమీ చంద్రుని కిరీటముగా గల శివుని యొక్క భార్య యగు పార్వతీదేవి మనస్సు నందలి స్తుతిచే మిక్కిలి సంతోషము పొందిన చిత్తము గలవాడును, సర్వశ్రేష్ఠుడు నయినవాడు నగు నారాయణుడగు నీకు నమస్కారము."

వ్యాఖ్య

గజేంద్రునకు మొసలి బారి నుండి ప్రాణ రక్షణము నిచ్చిన స్వామి అంతమాత్రమే గాక, తన స్థితినే ఇచ్చెను. ఇదియే వరింపదగిన శ్రేష్ఠ స్థితి గదా. కావుననే గజేంద్రుడు పీతాంబరుడు, చతుర్భుజుడయ్యెనని భాగవతమున చెప్పబడినది. ఎంతటి దయ! భగవంతుడు భక్తుని తానుగానే అనుగ్రహించెను. ఈ దయకు అంతున్నదా? సంసార బంధమే మొసలి. తన సొంత సాధన యను పోరాటముతో అతిశయించిన జీవుడే గజేంద్రుడు. చివరకు తనకు శరణందిన జీవునికి స్వామి సందర్శనముతో సర్వాంతర్యామి దర్శనముతో రక్షణ నిచ్చును. మరియు అతనిని గూడ అంతర్యామిగా చేయును. స్వామిని కౌస్తుభరత్నధారిగా ధ్యానించినచో

నిర్మల హృదయము, శుద్ధ వాక్కు లభించును. కౌస్తుభమనగా భూమిపై జనులు చేయు స్తుతుల గుంపు. నరకాసురుని సేనానులలో ముందు నిలిచినవాడు మురాసురుడు. ఇతనికి స్వామి శత్రువుగా కన్పించెను. ఇతనిని వధించి, స్వామి నరకుని కోటలో ముందునకు సాగెను. మురుడు అయిదు తలలు గలవాడై అనగా అయిదు ఇంద్రియముల సుఖములకు వశుడైన మనస్సు గలవాడై, గర్జించుచు, శక్తి అను ఆయుధమును శ్రీకృష్ణునిపై ప్రయోగింపగా, అది ఉల్క వలె వచ్చుచుండెను. దానిని కృష్ణుడొకే బాణముతో త్రుంచి, ఆపై అతని గదను త్రుంచి, తన బల్లెముతో అతని తలను పడవేసెను. భగవానుడు ఆకాశదేహుడుగ జగన్మోహనుడు. జీవులను వేరువేరుగా గమనించినచో కలుగునది సంసార మోహము. ఇది దుఃఖ కారణము. జగత్తు నంతయు దేవుని రూపముగా తలంచినచో, స్వామి అట్టివానిని మోహింపజేసి పారవశ్యమును కలిగించును. భేదదృష్టి దుఃఖ కారణమగు మోహము. ఏకత్వదృష్టి ఆనందకారణమగు మోహము. భగవానుడు కల్గించు దివ్యానందానుభూతి పారవశ్యమున ఒక కిరణమాత్రము రుచిచూచిన వానికైనను ప్రాపంచిక విషయ భోగానుభవములు రేణువులుగా కన్పించును. శివుడు అష్టమీ చంద్రుని శిరస్సున ధరించునని పురాణ ప్రశస్తి. భక్తియోగసిద్ధిలో మనస్సు లయమగును. అయినను దేహముతో చేయవలసిన కర్తవ్యములను చేయుట కొరకై భగవంతుడే భక్తుని మనస్సుగా పనిచేయును. చంద్రుడు మనఃకారకుడు. కావున శివుడు అష్టమీ చంద్రుని ధరించినవాడని చెప్పబడినది. ఈయన భార్య పార్వతీదేవి. ఈమె శిరస్సుపై గూడ అష్టమీ చంద్రుడుండును అని లలితా సహస్రనామ స్తుతిలో చెప్పబడినది. పార్వతి ప్రకృతి. ఈమె కూడ భక్తుని మనస్సులోని మంచి తలంపులుగా, మంచి వాక్కులుగా పనిచేయును. నిత్య యువతి యగు పార్వతీదేవి సదా తన మనస్సులో నారాయణుని స్తోత్రము చేయుచుండును. ఒకే శక్తి మూడుగా నయినది. దేవుని ఇచ్ఛాశక్తి అనగా సంకల్పము లక్ష్మీదేవి. జ్ఞానశక్తి సరస్వతి. క్రియాశక్తి పార్వతి. ఈమె నిరంతరము తాను సృష్టిలో చేయు కార్యములు అంతర్యామి యగు నారాయణునికి స్తుతిగా చేయుచుండును. ఇదిగాక పార్వతీపరమేశ్వరులు సదా నారాయణుని తలంచుచుందురని సంప్రదాయము గలదు. ఈమె చేసిన స్తోత్రములే వేదసూక్తములు, భక్తుల సంకీర్తనములు. భక్తుల మనస్సులందు భాసిల్లు దేవుని గూర్చి సంకీర్తనము మనలోని పార్వతీదేవి ప్రేరణ యని అన్నమయ్య భావము. పార్వతీదేవి మనస్సు అనగా భక్తుడు ఆమెను ప్రార్థింపగా ఆమె ఆవేశించిన భక్తుని మనస్సు అని అర్థము. మరియు అష్టమీ చంద్రుడనగా ఒకవైపు జగత్తులోని వ్యక్తులతో మెలగుచునే, అంతర్యామిని దర్శించు మనస్సు అని అర్థము. ఈ స్తోత్రములకు స్వామి సంతోషించు మనస్సు గలవాడగును. అనగా మనస్సు స్థానమున సంతోషమే ఉన్నవాడన్నమాట. పరితోషము తోడి చిత్తము గలవాడని గాక, పరితోషమే చిత్తముగా గలవాడని అర్థము చెప్పవలెను. నారాయణుడు సర్వశ్రేష్ఠుడు. గీతలో కృష్ణుడిట్లు చెప్పెను. "నాకన్న ఇతరము లేదు. నేను దారమును. నాయందు రత్నముల వలె అన్నియు గ్రుచ్చబడియున్నవి. కావున నాకంటె శ్రేష్ఠుడును లేడు." ఇతర మున్నప్పుడు గదా పోటీ. అర్జునుడిట్లు స్వామిని నుతించెను. "నీకు ఇతరము లేదు. సమము లేదు. ఇక అధిక మెట్లుండును?" వేంకటేశ్వరస్వామికి సముడయిన దేవుడు గతములో లేడు, ఇకముందు ఉండడని శ్లోక మొకటి ప్రసిద్ధిలో నున్నది. వేంకటేశ్వరుడు సర్వాంతర్యామి గదా. ఆయనకు ఇతరమే లేనపుడు పోటీ

యెక్కడిది? దేవుళ్లు ఉందురా? దేవుడొకడే. అతడే అంతర్యామి. అతనినే నారాయణుడని, వేంకటేశుడని అన్నమయ్య స్తుతించుచున్నాడు. దేవుడనగా పోటీపడుటకొక వ్యక్తి గాదు, అంతర్యామి అయిన ఒకే వెలుగు. అర్జునునకు ముందు, వెనుకలందు, సర్వమునందు కృష్ణుడే దర్శన మొసంగెను. భగవానుడు ఉత్తమపురుషుడు. అంతర్యామి యగు 'నేను' శరీరముకన్న, జీవునికన్న అతీతుడు. వానిలోని అంతర్యామియు గావున పరముడు.

5వ చరణము యొక్క తాత్పర్యము

"తగినవారికి, తగిన సమయమున, తగిన విధముగా దానము చేయుట అను ఉత్సవమున ప్రసిద్ధినొందిన ఓ వేంకటప్రభూ! భూమికి ఈశ్వరులగు పాలకులను వలసిన ప్రయోజనములు ఇచ్చువాడును, ఇంద్రనీలమణి వంటి కాంతితో గూడిన మనోహరమయిన దేహము గలవాడును, సూర్యచంద్రులు కనులుగా గలవాడును, శేషాద్రి తన నిలయమైన వాడును అగు నారాయణుడగు నీకు నమస్కారము."

వ్యాఖ్య

వేంకటేశ్వరస్వామి భక్తులై, తగిన ప్రవర్తన గలవారికి అనగా సమాజరూపములోని తనకు అర్చన చేయువారికి, వారి వారి పూర్వపుణ్య కర్మఫలములు అనుభవము వచ్చు సమయమునకు, తన సాన్నిధ్యముతో బాటు వారికి భౌతికములగు అన్న వస్త్రాదులను ప్రీతితో ప్రసాదించుటలో ప్రసిద్ధుడు. అయితే తనను లేదన్నవారికిని అన్నవస్త్రాదులిచ్చు దయామయుడు స్వామి. అయితే భక్తులకు మాత్రమే శాంతిని, ఆనందమున లీనమగు స్థితిని ప్రసాదించును. పాపవాసనలను త్రెంచును. సమాజ మును ప్రేమించి సేవించువాడు నాస్తికుడయినను, ఆస్తికుడే. ఆస్తికుడయినను సమాజమును ప్రేమింపక, సేవింపనిచో అతడు నాస్తికుడే. కారణము అతని దృష్టిలో దేవుడనగా తన కోరికలు తీర్చుచు, తన ఆదేశములను పాటించు సేవకుడగు ఒక వ్యక్తియే గాని, సమాజము నందలి అంతర్యామి కాడు. కావున దేవుడు వీరియెడల ఎట్టి పక్షపాతమును చూపడు. దేవుడు పరస్పరత్వముతో బ్రతుకునట్లు జీవులను సృష్టించెను. దీనిని పాటించువారి జీవితమే యజ్ఞము. ఇట్టివారికి కావలసిన భౌతికము లగు ఆవశ్యకములను గూడ స్వామి నెరవేర్చును. అన్య మెఋగక, అంతర్యామి యగు స్వామిని సేవించువారి యోగ క్షేమములను వహింతునని కృష్ణుడు గీతలో అభయమిచ్చెను. తగిన విధముగా కూడ స్వామి తగినవారికి ప్రసాదించును. ఒక్కొక్క సారి భక్తునికి పూర్వ కర్మఫలమును బట్టి కష్టములను, అవమానములను గూడ ఇచ్చి, వారిలో శరణాగతిని పరిపక్వము చేయును. సమయము రాగానే కాపాడును. ప్రహ్లాదుని, గజేంద్రుని, విభీషణుని, పాండవులను, కుచేలుని, ద్రౌపదిని ఇట్లే కాపాడెను. విభీషణునకు రాముడిట్లు అభయమొసంగెను. "నీవాడను నేనని ఎవరు శరణందినను, ఎవరి నుండి ఎట్టి భయము కలుగకుండ నేను కాపాడెదను. ఇది నా నియమము." శ్రీకృష్ణు దందించిన చరమ శ్లోక భావమిది. "ఎంత మంచిదయినను జీవుడు కోరినచో అది వ్యామోహమై నిలిచి అడ్డగించును. ధర్మమనగా నా సంకల్పము. కావున ఏది ధర్మము, ఏది అధర్మము అను విచికిత్స నాకు విడిచిపెట్టి, నన్ను శరణు పొందుము. నా సంకల్ప మెప్పుడును లోకహితము, ధర్మమే కావున దాని ననుసరించు వానిని

సర్వ పాపముల నుండి విముక్తిని గావింతును. శోచింప పని లేదు." మహాభారత యుద్ధమున భీష్మ ద్రోణ కర్ణ దుర్యోధనులను చంపు ఘట్టములందు దోషము పాండవుల కంటకుండ, ఆ బాధ్యత శ్రీకృష్ణభగవానుడు తన భుజములపై వేసికొనెను. ధర్మరక్షణ కొరకై, దానికడ్డువచ్చిన వారెవరయినను తొలగింపబడక తప్పదని స్వామి నిర్ణయము. వేంకటేశ్వరుడు తొండమాన్ చక్రవర్తిని, కుమ్మరివానిని, అన్నమయ్యను తగిన విధముగా అనుగ్రహించెను. భగవదనుగ్రహము ఎల్లరి యెడలను ఒకటే విధముగా ప్రసరించును. కాని పాత్రతకై మనము సాధన చేయవలెను. వర్షము పర్వత శిఖరాగ్రములపై నిలువదు. లోయలలో పడినది నిలిచిపోవును. అట్లే గర్వము గల వారిపై దైవానుగ్రహము నిలువదు. వినయము గల వారిలో నిలిచిపోవును. ఇట్లు భక్తులను కరుణించుట స్వామికి ఉత్సవము. సాధారణముగా భగవంతుని యనుగ్రహమున మనకు వలసినవి లభించుట మనకు ఉత్సవము. కాని భక్తులకు దేవునిపై ప్రేమకన్న, దేవునకు భక్తులపై ప్రేమ ఎన్నియో రెట్లు అధికమగుటచే భక్తులను దయచూచుట ఆయనకే ఉత్సవమని అన్నమయ్య తలక్రిందులుగా చెప్పెను. అన్నమయ్య 'ధాత్రీశ' అను పదమును ప్రయోగించెను. ధాత్రి అనగా జీవులను ధరించు భూమి. ఈశుడనగా జీవుల హృదయములను ఒక్కటి చేసి, తనవైపు ఆకర్షించి, ఆ హృదయములను పాలించువాడని అర్థము. అంతేకాని ఊరక ప్రభువులని అర్థము గాదు. ఈశత్వ మనునది యోగసిద్ధిగా పతంజలి పేర్కొనెను. మానవుడు విశాల పరమప్రేమగా ఇతరులలోనికి అంతర్యామిగా వ్యాపించుటను ఈశత్వమందురు. ఉదాహరణకు రాముడు ప్రజాపాలనమును అధికారముగా భావింపక, ప్రజల రూపములోని దేవుని ఆరాధనగా భావించెను. తండ్రి వలె ప్రజలను రామచంద్రుడు పరిపాలింపగా, తమ తండ్రి రామచంద్రుడని భావించి ప్రజలు తమ తండ్రుల నెల్లరను మరచిరని భాగవతమున గల నవమ స్కంధమున చెప్పబడినది. రాముడు, ధర్మజుడు వనవాసమునకు వెళ్లుచుండగా ప్రజలు వారిని అనుసరించిరి. వారు ప్రజల హృదయములకు ఈశ్వరులు. ఇట్టి ప్రజాపాలకులే శ్రీకృష్ణదేవరాయల వంటివారు. వీరికి వలసిన ప్రయోజనమేమి? ప్రజా క్షేమమే. ఇట్టి పాలకుల పాలనలో పాడిపంటలను, ప్రజా సౌభాగ్యమును భగవంతుడు ప్రసాదించును. పాలకులకు ప్రజలే దేవుడు. ప్రజలకు పాలకుడే దేవుడు. మరియు వీరికి కావలసిన వానిని గూడ ప్రసాదించును. రాజర్షులయిన జనకాదులకు స్వామి ప్రసాదించినవి ఊహింపరానివి. జనకునకు సీతాదేవినే కుమార్తెగా ప్రసాదించెను. అశ్వపతికి సౌరశక్తి యగు సావిత్రిని కుమార్తెగా ప్రసాదించెను. స్వామి ఇంద్రమణి నీలకాంతి గలిగినవాడు. నీలాకాశదేహుడు. నీలమేఘము వంటి ఛాయ గలవాడని ప్రసిద్ధినొందినవాడు స్వామి. అన్నమయ్య ఇంద్రనీలమణి కాంతి గలవాడని ఇచట స్వామిని వర్ణించెను. ఇంద్రుడు వర్షించు మబ్బుల కధిపతి. కావున ఇంద్రనీలమణి యనగా మెఱపుతో గూడిన వానమబ్బు అనియు అర్థము. ఇంద్రనీలమణి యొకటి కలదు గూడ. దీని కాంతి స్వామి తేజస్సుగా వెలసియున్నది. ఈ కాంతితో స్వామి జీవులను ఆకర్షించుచు, వారి మనస్సులను హరించుచున్నాడు. ఎప్పటి కయినను ప్రతి జీవియు తాను నీలాకాశదేహుడగు స్వామిలో భాగమునని గ్రహించి, ఆయనయందు రమింపక తప్పదు. స్వామి ఏకత్వము. భిన్నత్వ మెప్పుడును జనులను ఆకర్షింపజాలదు. వారి మనస్సుల నడుమ కలహములను కల్గించును. ఏకత్వ మెప్పుడును అందరి మనస్సుల నాకర్షించి, తానే ఆ స్థానమున

నిలుచును. ఆకాశము మన చూపుకు నీలముగను, దానికది ఏ రంగు లేని తెలుపుగను ఉండును. నీలము అన్ని రంగులకు మూలము. రంగులన్నియు ఒకే కాంతియొక్క స్పందనలోని తేడాని బట్టి ఏర్పడినవే. సప్త లోకములకును, సప్త స్వరములకును మూలము నీలమణి కాంతి దేహుడయిన స్వామియే. 'ఆకాశ నీలకాంతి'ని లేదా ఇంద్రనీలమణి యొక్క కాంతిని స్వామి దేహకాంతిగా ప్రతిదినము ధ్యానించు వాని మనస్సు క్రమముగా సమాధిలోనికి చొచ్చును. భగవంతుని యందు సదా లీనమైయుండును. నీలకాంతికున్న శక్తి ఏ రంగునకు లేదు. స్వామి సూర్యతత్త్వము – చంద్రతత్త్వము అనునవి రెండు కన్నులుగా గలవాడు. విశ్వరూపుడయిన స్వామికి సూర్యచంద్రులు కనులు. అర్జునుడు కూడ విశ్వరూపుడగు కృష్ణుని దర్శించి ఇట్లే స్తుతించెను. సూర్య లక్షణములగు జ్ఞానము, వెలుగు; చంద్ర లక్షణములగు ప్రసన్నత, ఆహ్లాదము, ప్రేమ స్వామి కనుల చూపులుగా ధ్యానించువారికి ఈ దివ్య లక్షణము లబ్బును. శేషాద్రిపై ఇట్టి నారాయణుడే వేంకటేశ్వరుడుగా వెలసియున్నాడు. అన్నమయ్య ననుసరించి మనమును ఈ సంకీర్తనమును భక్తిశ్రద్ధలతో పాడుకొనుచు స్వామి అనుగ్రహమునకు పాత్రులగుదుము గాక. ఈ చివరి చరణము ఈ సంకీర్తనమున ఫలశ్రుతి వంటిది.

* * *

29

5వ సం-193

నాకుఁ జెప్పరె

శంకరాభరణం

నాకుఁ జెప్పరె వలపు నలుపో తెలుపో
నూకి పోవఁగరాదు నుయ్యో కొండో. ॥ పల్లవి ॥

పొలఁతి మరునికి వెరవ పులియో యెలువో
ఉలుకు దుమ్మిదమోఁత ఉరుమో మెరుమో
తిలకింపఁ జందనము తేలో పామో
యెలమిఁ గోవిలకూఁత యేదో పోదో. ॥ నాకు ॥

పొదలిన చలిగాలి పొగయో వగయో
వదలిన కన్నీరు వాఁగో వంకో
ఉదరమునఁ బన్నీరు ఉడుకో మిడుకో
ఎదుటఁ దలవంచుకొను టెగ్గో సిగ్గో. ॥ నాకు ॥

అసమశరుపై పరపుటదనో పదనో
పసగలవాని మోవి పంచదారో తేనో
అసమగతి వానిరాక ఆదో పాదో
రసికు వేంకటేశు పొందు రాజ్యమో లక్ష్మో. ॥ నాకు ॥

పూవులో రేకులన్నియు ఉన్నట్లే, 'తన'లో మనస్సు, బుద్ధి, ఇంద్రియాలు ఉండటమే యోగము.

టీక

నూకి = విడిచిపెట్టి, ఎలువు=ఎలుగుబంటి, ఉలుకున్ = భయపడుటకు, ఏదు = అడవిపంది, పోదు = దున్నపోతు, పొదలిన = వ్యాపించిన, వంత = శోకము, మిడుకు = మంట, ఎగ్గు = తప్పు, అదను= సరియైనది, పదను = అనుకూల సమయము, ఆదు = ఆపదలో అండ, పాదు = స్థిరమైన ఆధారము. (చెట్టు పాదు).

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య తన హృదయమును స్త్రీగా సంభావించుకొని శ్రీవేంకటేశ్వరుని తనకు నాథునిగా భావించి భగవంతుని కొఱకై ఆకర్షణ పొందుటను వివరించెను. సామాన్యముగా స్త్రీ తన ప్రియుడైన భర్తయందు పొందు భావములనే ఈతడు గ్రహించి మధురభక్తిపరముగా వర్ణించెను. ఇది సమన్వయము కాదు. ఉన్నదానిని స్వీకరించుటయే. అట్లే దంపతుల నడుమ భగవంతునియందు తనకు గల ఆకర్షణను పెంపొందించునదిగా సంభావించెను. ఇట్లు బాహ్యార్థమున ఈ సంకీర్తనమున స్త్రీ పురుషాకర్షణ విషయమునకు సంబంధించిన దశలు – భయ విరహాదులు వర్ణించినట్లు కనపడును. కాని ఇవి అన్నమయ్య హృదయమున భక్తి పరములై అనుభవమునకు వచ్చెను. తన స్వీయానుభవమును ఈ సంకీర్తనలో ఆతడు వెల్లడించెను. పల్లవిలో మధురభక్తి యొక్క స్వరూపమును గూర్చి సూచించెను. మొదటి చరణమున భగవంతుని చేరు సాధనలో తావులేదని ఘోషించెను. రెండవ చరణమున భగవంతుని పొందుకై తన హృదయమున కలిగిన ఆవేదన, ఆర్తి, పరితాపము వెల్లడింపబడినవి. మూడవ చరణమున భగవంతుని అనుగ్రహము వలన ఆయన పొందుతో తనకు గలిగిన అనుభూతిని తీయగా వర్ణించెను. రాధయు, గోపికలును తమ మధుర భక్తి సాధనలో కృష్ణుని యెడల ఇట్టి దశలను అనుభవించిరి. అన్నమయ్యకు గోపికల మధురభక్తి ఆదర్శమై, స్ఫూర్తినిచ్చినది. ఇంతకు ఈ దశలన్నియు భగవంతుని క్రీడలో భాగములే. జీవిత ప్రయాణమున సాధకునకు తాను పొందు అనుభూతి దశలుగా కన్పడినను వాస్తవమున కివి స్వామి క్రీడలు, స్వామి భక్తునితో ఆడు ఆటలు. తన సన్నిధికి భక్తుని చేర్చుకొనుటకై స్వామి నెఱపు లీలలు. అన్నమయ్య చరమస్థితిని చేరుకొని, తాను చేసిన సాధనను, భక్తియోగపు వెలుగులో మన ఎదుట ప్రకాశింపజేయుచున్నాడు.

పల్లవి యొక్క తాత్పర్యము

"నాకు తెలియజెప్పుడు వలపు నలుపో, తెలుపో. ఈ వలపును బావియనియో, కొండ అనియో భావించి వలపును విడిచిపెట్టి పోరాదు."

వ్యాఖ్య

స్త్రీ పురుషుల నడుమ ఆకర్షణను 'వలపు' అని అందురు. ఇది ఎట్టిదియో తెలియని ఒక ఉద్వేగము. ఈ ఆకర్షణకు లొంగినవాడు తాను దీనినుండి జారిపోవుదునని గాని, గమ్యమును చేరలేనని గాని దానిని విడిచిపెట్టడు. ఇచట చివరి చరణము నందలి రసికుడైన వేంకటేశ్వరుని పొందును జోడించి పల్లవిని,

మిగిలిన చరణములను సంభావింప వలెను. ప్రేమరసస్వరూపుడైన భగవంతుని యందు కలుగు వలపే భక్తి. స్త్రీ వివాహమున వరుని వరించును. అనగా అతనికి తనను తాను సమర్పించు కొనును. పల్లవిలో 'వలపు' అనగా అన్నమయ్య వంటి భక్తుని హృదయము భగవంతుని వరించుట. అనగా భగవంతునికి సమర్పితమై, నిండుగా ప్రేమించుట. ఈ ప్రేమ భగవంతుని యొక్క ఒక రూపమునందే గాక, సర్వరూపములు తానైన స్వామియందు పొందినచో దానినే పరమ ప్రేమ లేక భక్తి యందురు. ఇది స్త్రీ పురుషాకర్షణ వలె ఉద్వేగము కాదు. అనుభూతి. ఉద్వేగమున మనస్సు బురదతో కలతచెందిన నీటివలె నుండును. అనుభూతి స్వచ్ఛమైన, బురద తేరిన శరన్నదీప్రవాహము వలె నుండును. అన్నమయ్య భక్తిని గూర్చి ఇది నలుపు కాదు, తెలుపు కాదు అని వర్ణించుచున్నాడు. నలుపు తమోగుణమునకు, తెలుపు స్వచ్ఛమైన సత్త్వగుణమునకు ప్రతీకలు. దేవుని పూజించువాడు తమోగుణము నుండి సత్త్వగుణమునకు ప్రయాణించును. ఈ ప్రయాణము కొన్ని జన్మలు సాగును. తమోగుణముతో దేవుని పూజించువారు తమ శత్రువులు నశింపవలెననియు, పెద్దలు చెప్పిన మార్గమును వ్యతిరేకించు పద్ధతిలోను సాగును. వీరు ఎంతగా తపస్సు ఆచరించినను దానియందు దంభము, అహంకారము కలిగియుందురు. వారికి కామరాగములు బలీయమగును. మూఢమైన పట్టుదలతో తపస్సు చేయుట తన దేహమును క్షీణింపచేయుట – ఉపవాసాదులు చేయుట, ఇతరుల వినాశము గోరి తపస్సు చేయుట వీరి లక్షణములు. రజోగుణము గలవాడు సత్కారము కోరియో, గౌరవమును కోరియో, పుణ్యమునో, ఐహిక లాభమునో కోరి దేవుని పూజించును. ఇతడు ఇతరులకు తెలియునట్లుగా పూజాదులాచరించును. ఇట్టివారు కోరిన సత్కారములు, గుర్తింపులు, ఐహిక సుఖములు లభింపనపుడు వీరి పూజ సడలును. ఇది స్థిరము గాదు. సత్త్వగుణము గలవాడు భగవంతుని ఏ పేరుతో పూజించినను సర్వాంతర్యామిగా భావించి ప్రేమించును. ఫలము కోరక పూజాదులు చేయును. తన సాధనను విడిచిపెట్టడు. బుద్ధిమాంద్యము, పొరపాటు చేయుట, మోహము చెందుట తమోగుణ లక్షణములు. ఆశ, ఒక పని చేయవలెనను సొంత సంకల్పము, చేయుచున్నది మానలేకుండుట, ఆధిక్యబుద్ధి, పట్టుదల రజోగుణ లక్షణములు. హృదయ వికాసము, దయ, త్యాగము, నిర్వ్యలత్వము, ఉద్వేగము లేక ప్రశాంతముగ నుండుట సత్త్వగుణ లక్షణములు. ఇపుడు భగవంతునియందు భక్తి పెరుగుచున్న కొలది, సాధకుడు తమస్సు నుండి సత్త్వమునకు చేరును. సత్త్వగుణము మంచిదే, కాని భక్తి పరిపూర్ణమైనపుడు ఏ గుణమునకు అంటుపడడు. సత్త్వ గుణమునకు గూడ అతీతుడగును. అనగా మంచి గుణములు కలిగియున్నను, మంచి పనులు చేయుచున్నను అవి తనకు సంబంధించినవని భక్తుడు భావింపడు. భక్తి రసానుభూతి ప్రవాహము. స్వచ్ఛమైన నీటికి ఏ రంగు ఉండనట్లు భక్తి తమస్సుకు, సత్త్వమునకు కూడ అతీతమైనది. అనుభూతికి గుణముండదు గదా! తనలో వర్తించుచున్న మంచి గుణములు శ్రీహరివనియు, తన ద్వారమున స్వామియే సత్కర్మలను – తాను సంకల్పించినవి చేయుచున్నాడనియు భావించును. కావున అన్నమయ్య భగవంతుని మీద వలపును నలుపు, తెలుపు గాని అనుభూతియని వర్ణించెను. భగవంతుని చేరు సాధనలో పూర్వ సంస్కారముల వలన ఒక్కొక్కసారి తప్పులు చేయుట దొర్లుచుండును. కొందరికి ఉద్వేగములు తొందరగా పోవు. అంతమాత్రముచేత తాను గుంటలో పడిన వాని వలె పతనము చెందునేమో యను భయమక్కఱలేదు.

దయామయుడైన భగవంతుడు సద్గురువు రూపముననో, పరిస్థితుల రూపముననో, సత్సాంగత్యముననో లేదా అంతర్వాణిగనో సాధకుడు క్రింద పడకుండ అతనిని కాపాడును. 'నీవాడను నేన'ని సమర్పణ పొంది భగవంతుని అంతర్యామిగా దర్శించి సేవించుట, నిత్యము స్మరించుట చేయవలెను. అపుడు ఒక్కొక్కవేళ ఇతరులపై కోపము కలిగినను, అవతలి వ్యక్తియందు అంతర్యామి దర్శనమిచ్చును. కోపము వైదొలగును. ఏ బలహీనత వచ్చినను భగవంతుని పాదములు శ్రద్ధతో గట్టిగా స్మరించి, తనను కాపాడుమని వేడినచో స్వామి తప్పక జారిపడకుండ కాపాడును. భక్తులలో లోపములున్నను భగవంతుడు వానిని సర్దుబాటు చేయుటకు పరిస్థితులు కల్పించునేగాని, వానిపై కోపించి విడిచిపెట్టడు. విదురునకు తనను సభ నుండి దుర్యోధనుడు వెడలగొట్టు చుండగా ధృతరాష్ట్రుడు మౌనము వహించెనని అతనిపై అలుక గలదు. అది కొన్ని యేండ్లపాటు నిలబడెను. 'నీవంతర్యామివి గదా! నన్నీ చెడుభావము నుండి కాపాడ లేవా?' అని రెండు చేతులెత్తి విదురు డాక్రోశించగనే, ఉద్ధవుడు అను మహాభక్తుడు దర్శనమిచ్చి, అతనికి శ్రీకృష్ణుని సాన్నిధ్యమును కల్పించెను. అంతటితో విదురునకు అలుక తొలగి ప్రశాంతి లభించెను. తన మనస్సులో ఇక ధృతరాష్ట్రుడు లేడు. అంతయు కృష్ణుడే. "ఇంతకు పూర్వము ఎన్ని తప్పులు చేసినను 'నేను' తప్ప వేఱు లేరని తలంచి నన్ను భజించినచో అతడు నా దృష్టిలో సాధువే. అతడు నాయందే నిలిచియుండును" అని కృష్ణుడు చెప్పెను. సాధన కొంతవఱకు చేసి శరీరము విడిచినను, మరుజన్మలో అది కొనసాగునట్లు దేవుడనుగ్రహించును. ఒకవేళ కొంతకాలము సాధన చేసి, స్వామిని మఱచి క్రిందపడినను అతనిని మఱల భగవంతుడు లేవనెత్తునే గాని విడిచిపెట్టడు. దీనికి అజామిళుని కథ ఉదాహరణము. అట్లే సాధకుడు భగవంతుని చేరుట అనగా పెద్ద కొండ నెక్కుట, నావలన సాధ్యము కాదని వెనుకంజ వేయపనిలేదు. జీవులెల్లరు దేవుని నుండియే జనియించిన వారు గావున దేవుని కొఱకు వారు తపింపక తప్పదు. తపించిన వారిని స్వామి తన కొండకు తానే రప్పించుకొనును. మోక్షమునకు భగవదనుగ్రహమే ప్రధానకారణము. అది నది వంటిది. మన సాధన బోదెకాలువ వంటిది. సముద్ర మధ్యము నుండి వెలువడిన కెరటము తిరిగి సముద్ర మధ్యమున చేరక తప్పదు. గమ్యము చేరితీరును. సందేహింప పనిలేదు. "భగవంతుని గూర్చి ప్రవచనముల వలన, తెలివి వలన మనము పొందలేము. మన హృదయము అన్నమయ్య వలెనే స్వామికి సమర్పితమైనచో అనగా స్వామిని వరించినచో, తప్పక స్వామి దానిని వరించి తన సన్నిధికి చేర్చును" అని ముండకోపనిషత్తు చెప్పుచున్నది. "లెమ్ము, మేల్కొనుము, గమ్యము చేరువరకు ఆగకుము, బలహీనుడనని భావింపకుము" అని ఉపనిషత్తులు, వివేకానందులు ఘోషించిరి. మనము అమృత పుత్రులము, తిరిగి అమృతస్వరూపుడైన దేవుని పొందితీరెదము. ఇచట 'నూయి' అనగా మూలాధారమనియు, కొండ యనగా సహస్రారమనియు భావింపనగును. భగవంతుని యందు వలపుగొన్న హృదయము గలవాని ప్రజ్ఞ కామక్రోధాదులకు నిలయమగు మూలాధారమునకు జారిపడునని భయపడనక్కఱలేదు. ఆనంద నిలయమగు సహస్రారమును చేరలేనేమో యను సందేహ మక్కఱలేదు. దేవునిపై నిండైన భక్తి, ప్రపత్తియున్న చాలును. ఇది పతివ్రతయైన భార్యకు భర్తయందు గల భావము వలె నుండవలెను.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"ఓ స్త్రీ! మన్మథుని గూర్చి భయపడుటకు అతడు పులియో, ఎలుగుబంటో కాదు. నీవు భయపడుటకు తుమ్మెద మ్రోత ఉరుమో, మెఱపో కాదు. పరిశీలింపగా చందనము తేలుగాని, పాముగాని కాదు. సంతోషముతో కూడిన కోయిల కూత అడవిపందియో, దున్నపోతో కాదు."

వ్యాఖ్య

బాహ్యార్థమున ప్రియుడైన భర్తను పొందగోరు స్త్రీ కామమును గూర్చి కామమునకు దోహదపడు తుమ్మెద మ్రోత, చందనము, కోయిల కూతలను గూర్చి భయపడి వెనుకంజ వేయనక్కఱలేదు. ఇందు అన్నమయ్య చెప్పదలచిన భావము తన హృదయ మునే స్త్రీగా సంబోధించి యిట్లున్నది. భగవంతుని పొందు కోరిన జీవితమున ఎప్పటికైనను కలిగి తీరును. కాని సాధనలో కొంతకాలము తానున్న స్థితి గుర్తుకు వచ్చి తాను సర్వాంతర్యామియైన భగవంతుని పొందలేనేమో యను భయము కలుగును. భగవంతుడు పరమప్రేమస్వరూపుడు. సామాన్య మానవుని మనస్సులో సంకుచితత్వము, కామక్రోధములు, అశాంతి యుండును. అందువలన ఇట్టి శంక కలుగుట కవకాశ మున్నది. అన్నమయ్య తన హృదయము నుద్దేశించినను, వాస్తవమునకు మన ఎల్లరి హృదయములకు ఉద్బోధించుచున్నాడు. మనము తప్పక భగవంతుని స్థితిని చేరెదమని హామీ ఇచ్చుచున్నాడు. తుమ్మెద మ్రోత యనగా జీవుని ప్రజ్ఞ క్రిందనుండి పైకి కుండలినీ శక్తితో కలిసి వెన్నెముక మీదుగా ఎక్కుచుండగా ఒక్కొక్క చక్రము దాటుచున్న కొలదియు దాని కనుగుణమైన రీతిలో నాదము వినపడుచుండును. దీనిని విని భయపడనక్కఱలేదు. ఇది ఉరుమో, మెఱపో కాదు. తీయని తేనెను త్రాగి మత్తెక్కిన తుమ్మెద మ్రోత. ఆ నాదము విను నపుడు మన హృదయముపై మాధుర్యము చిందుచుండును. ఇచట వెన్నెముకయే వీణ. దానిపై వెడలిన స్వరములే ఈ తుమ్మెద మ్రోతలు. వీణ యొక్క తంత్రులు షట్చక్రములు, సహస్రారము. ఒక్కొక్కసారి ఈ నాదము ఉరుము వలె నుండవచ్చును. ఈ ఉరుము నీలమేఘస్వరూపుడైన స్వామి యొక్క గర్జన. ఇక మెఱపు భక్తుని భగవంతుని వద్దకు చేర్చు కుండలినీశక్తి యొక్క వెన్నెముకలోని స్వరూపము. అమ్మవారు మెఱపుతీగ యనియు, స్వామి మేఘమనియు వేదమునందు వర్ణింప బడెను. ఈ పాదమున 'ఉరుమో, మెఱపో' అన్న మాటలలో అవి రెండును కాదు, భయపడనక్కఱలేదని ఒక అర్థము. సాధన దశలో సాధకునకు వినపడు నాదము, లోకంటికి కనపడు మెఱపు ఒక స్థాయి ఆనందము నిచ్చును. అప్పటికి దానితో నలవాటుపడని సాధకుడు ఈ యనుభవములకు భయపడవచ్చును. అట్లు భయపడ నక్కఱలేదని అన్నమయ్య బోధ. ఈ యనుభవములు కలిగినవి, నేను సిద్ధుడనైతినని గర్వించి సాధన మానరాదు. ఈ యర్థమున 'ఉలుకు' యనగా 'ఉద్వేగము చెందుట'. భక్తి యనగా ఉద్వేగము, సిద్ధులు కావు. వానికి లొంగక దాటవలెను. శరీరమునకు చందనము పూసినపుడు ఎట్లుండునో, సాధనలో ఒక్కొక్కసారి సూక్ష్మ దేహమునకు ప్రాణమయ కోశమునకు చందనము పూసిన అనుభవము కలుగును. ప్రియుడైన భర్తయందు కలిగిన వియోగవేదనను తొలగించు కొనుటకు చందనమును లేపనముగా వాడుదురు. అట్లే ఇచట భగవంతుని యందు భక్తుడు పొందు ఆర్తి దశలో సూక్ష్మదేహమునకు

చందన చర్చ జరిగినట్లుండును. చందనమునకు స్త్రీ భయపడ పనిలేదు. అది తేలు, పాము గాదు. అట్లే సాధకుడు గూడ పైన చెప్పబడిన చందన చర్చకు భయపడ పనిలేదు. ఈ యనుభవమునకు ఉలికిపాటు, ఉద్రిక్తత చెందక, స్థిరముగా భగవంతుని యందే మనస్సు నిలుపవలెను. అదియే లక్ష్యము. లక్ష్యసిద్ధికి సిద్ధులయెడ ఉద్రిక్తత విఘ్నము. పూజలో, సంకీర్తనమున భగవంతుని స్మరణమున, మహాపురుషుల సన్నిధిలో ఇట్లు ప్రాణమునకు, మనస్సుకు చందనము పూసినట్లుగా అనుభవము కలుగును. ఇది గతమున అభ్యాసము లేక వింతగా నుండుటచే ఉలికిపడు నవకాశము గలదు. లేదా నాకే కలిగినదని, ఇంతటితో నేను పరిపూర్ణుడ నైతినని గర్వించు నవకాశమును గలదు. సాధకుడు భగవంతుని పొందికనే గోరి వీనియెడల దృష్టిని ప్రసరింపనీయరాదని అన్నమయ్య హెచ్చరిక. వసంతకాలమున కోయిల హాయిగా కూయుచుండును. కోయిల కూత స్త్రీకి తన భర్తను గూర్చిన ఆకర్షణకు దోహదము చేయును. ఆ కూతకు స్త్రీ భయపడదు. అట్లే అది సంతోషకరమే. కాని భర్తను పొందువఱకు ఆమె ఆగదు. ఈ కోయిల కూత దానికి దోహదకారి మాత్రమే గాని విఘ్నము కాదు. అట్లే సాధనలో భక్తుని హృదయ మున భగవంతుని స్మరణము వలన, సంకీర్తనము వలన లేదా సంకీర్తనములను వినుట వలన భగవదర్పితములగు సత్కర్మలు చేయుట వలన లోపల కోయిల కూసినట్లు ప్రణవనాదము వినపడి, మాధుర్యమును కలిగించును. ఇది వసంత కాలమున, అనగా వసించు వర్తమాన కాలమున సదా వినపడును. తుమ్మెద మ్రోత ఝుంకారము వలె నుండును. కోయిల కూత కుహూ, కుహూ యని పంచమ స్వరమున నుండును. ఈ పంచమ స్వరము కూడ మిగిలిన స్వరముల వలెనే ఓంకారము యొక్క ప్రస్తారమే. నాదశరీరుడైన భగవంతునిలో ఇదియొక భాగమే. సంకీర్తనము గావించువారి నోటి వెంట వచ్చు పంచమ స్వరము శ్రోతల హృదయముల నలరించును. ఇదియొక స్థాయిలోనిది. ఇంతకంటె ఉన్నతస్థాయిలో ఈ పంచమ స్వరము దానికదియే హృదయ వీణాతంత్రులపై మ్రోగుచు వినపడుచుండును. దీనికి అలవాటు లేక భయపడరాదు. దీనియెడల మోజు పెంచుకొని గర్వింపనురాదు. సాధన మానరాదు. ఇట్టివానియందు దృష్టి సారింపక, భగవత్పాదపద్మముల యందు హృదయము స్థిరముగా నిలువవలెను. ఇట్టి అనుభవములు సాధన నడుమ కలిగినపుడే, భగవత్సాన్నిధ్యము కలుగదేమో, వీనితోనే సరియేనా అనియు నిరాశపడ పనిలేదు. మఱియు ఈ చరణమునందొక విశేషమున్నది. భగవంతు డంతర్యామియని దర్శించు భక్తునకు తన లోపల గలుగు అనుభవములు భగవంతుని వైభవములే అన్పించును. తనవని అన్పించదు. సద్గుణ వికాసము ప్రధానము. ఏడాదికేడాది సమాజము తోడి ప్రవర్తనలో మెరుగుదల ప్రధానము. మఱియు వెలుపల వాతావరణమున, పరిసరములందునను భగవంతుని వైభవములే గానవచ్చును. పులి, ఎలుగుబంటి, తుమ్మెద మ్రోత, ఉరుము, మెఱపు, చందనము, తేలు, పాము, కోయిల కూత మున్నగు వివిధములగు విభిన్నాంశము లందును భక్తుడు స్వామినే దర్శించును. మఱియు ఒక సంకేతార్థము చివఱి పాదమున గలదు. శ్రీకృష్ణుడు గోకులమున సంచరించుచు నెమళ్ల వలె, కోకిలల వలె రకరకముల పిట్టల వలె ధ్వనులు చేయగా గోపిక లాకర్షింపబడిరని గలదు. శ్రీకృష్ణుని రూపము, పలుకే ఈ పిట్టలలో, వాని కంఠస్వరములలో గోపికల కనుభూతమైనదనియు, అందుచేత వీనియందు గోపికలకు ప్రత్యేక దృష్టి లేక అంతయు కృష్ణుడుగానే అనిపించెను. అట్లే అన్నమయ్య

హృదయమునకు పైన చెప్పబడిన వాతావరణము నందలి వివిధ జంతువులు, పిట్టల యందు, వారి ధ్వనులందు ప్రత్యేక దృష్టి లేదు గావున, వాని కాతడు వేరుగా భయముతో గాని, ఇష్టముతో గాని స్పందింపలేదు. అన్నియు స్వామియే ననియే స్పందించును. ఆ స్పందనయే భక్తి.

2వ చరణము యొక్క తాత్పర్యము

"వ్యాపించిన చలిగాలి పొగయా, వగయా! విడిచిన కన్నీరు వాగా, వంకయా! కడుపుపైన చల్లుకొను పన్నీరు వెచ్చనా, మంటయా! ప్రియుడైన భర్త ఎదుట తల వంచుకొనుట దోషమా, సిగ్గా!"

వ్యాఖ్య

చలిగాలి హేమంతమున బాగుగా వ్యాపించును. అపుడు స్త్రీకి తన ప్రియుడైన భర్తయందు విరహార్తి పెరుగునే గాని తగ్గదు. చలిగాలి వలన సహజముగా విరహతాపము తగ్గవలెను. కాని పెరుగును. దానివలన మనస్సులో సహజముగా నుండవలసిన స్థితి యుండక, పొగ క్రమ్మినట్లగును. ఆర్తి పెరుగును. పొగయో, వగయో అనగా రెండు గూడ యని ఇచట అర్థము. సహజస్థితి భర్తతో కలిసియున్నప్పు డుండును. ఇప్పుడు వియోగ వేదన వలన దానిపై పొగమంచు క్రమ్మినట్లయినది. ఆమె విరహార్తితో విడిచిన కన్నీరు వాగుగనో, వంకగనో అగును. 'వాగు' అనగా సూటిప్రవాహము. 'వంక' యనగా మెలికలు దిరిగిన నీటిప్రవాహము. ఇపుడీమె కన్నీరు ఈ రెండును అగును. కడుపుపై చల్లుకొన్న పన్నీరు చల్లదనమును, హాయిని ఈయకపోగా, విరహార్తి నింకను పెంచి వేడిని, మంటను కలిగించును. ఇక భర్త ఎదురైన తరువాత ఆతని ఎదుట స్త్రీ సిగ్గుపడి తలవంచుకొనును. అప్పటివరకు అతని రాక కొరకు విరహతాపముతో బాధపడుచున్న స్త్రీ సిగ్గుతో తల వంచుకొనుట విచిత్రము. కాని స్త్రీకి ఇది సహజము. భర్త ఎదుట తల వంచుకొనుట తప్పు కాదు. అది స్త్రీకి సహజ స్వభావమైన సిగ్గు. లోపల భర్త సాన్నిధ్యమునందు ఎంత ఇష్టమున్నను సిగ్గుగా తలవంచుట సముచితము. అదియే స్త్రీకి అలంకారము. అట్లే తనకు ప్రియుడైన ప్రభువగు స్వామి కొరకు అన్నమయ్య వంటి మహాభక్తుని హృదయము విరహార్తి నొందుచున్నది. మొదటి చరణమున భగవత్సాధనలో కలిగిన కొన్ని అనుభవములు తెలుపబడినవి. కాని పరిపూర్ణమైన భగవదనుభూతి యనగా భగవంతుని యందు జీవుడు లీనమగు అనుభూతి ఇంకను కలుగలేదు. దానికొరకై భక్తుని హృదయము పొందు వియోగతాపము రెండవ చరణమున వర్ణింపబడినది. హేమంతమున ప్రకృతి యంతయు చలిగాలి వ్యాపించును. విరహార్తురాలగు స్త్రీ వలెనే భక్తుని హృదయము ఈ చలిగాలికి తృప్తినొందక భగవంతుని పొందుట కొరకై తపించును. చలిగాలి సహజముగా హాయిగొలుపవలెను. కాని భక్తుని హృదయమునకు తాపమును పెంచును. చలిగాలి తగిలినను, చన్నీట తెల్లవారు జాముననే మునిగి స్నానము చేసినను హాయి కలుగకపోగా, దేవుని కొరకై తాపము పెరుగును. అపుడు భక్తుని హృదయమునకు శాంతి లేకుండపోయి, పొగమంచు దానిని కప్పును. మంచు చల్లనే. కావున దీని సంకేతము భగవంతునికై పొందు తాపములో ఆయనను సదా స్మరించుట వలన హాయిగా నుండును. కాని ఇది పొగమంచు. ఒకవైపున హాయిగా నున్నను, వేరొక వైపున హృదయమునకు పొగ గ్రమ్మి, ఏమియు తోచని స్థితిలో

పడును. వియోగ వేదన పెరుగును. కావున చలిగాలి భక్తుని హృదయమునకు పొగమంచు, వగ కూడ. గోపికలు హేమంత ఋతువున వచ్చు ధనుర్మాసమున (మార్గశీర్షమున) శ్రీకృష్ణుని తమ హృదయేశ్వరునిగా వరించి, విరహార్తితో వ్రత మాచరించినట్లుగా భాగవతమున గలదు. గోదాదేవియు ఇదే కాలమున విల్లిపుత్తూరులో గల శ్రీకృష్ణుని పొందుట కొరకై విరహార్తితో శ్రీవ్రతము నాచరించెను. దీనినే 'తిరుప్పావై' యందురు. అట్లే అన్నమయ్య హృదయము గూడ గోపికల వలె, గోదాదేవి వలె స్వామి కొరకై హేమంతమున విరహతాపము నొందినది. గోదాదేవి స్వామి కొరకైన తాపముతో మనసు కేమియు తోచక నిద్రపట్టని స్థితిలో నుండెను. స్వామి ఆమెకు నిద్రపట్టనీయలేదు. అటులనే అన్నమయ్య హృదయము గూడ ఏమియు తోచని స్థితిలో పడినది. ఇదియే పొగమంచు కప్పిన స్థితిగా వర్ణింపబడినది. స్వామి కొరకై వియోగ వేదన పెరిగి భక్తుని కంటివెంట నీరు వెడలి వాగుగా ప్రవహింప సాగినది. సుడులు తిరిగినది. భగవదనుభూతి కొంతమేర గలిగి, పరిపూర్ణమగు లోపున ఇట్టి ఆర్తి, దానివెంట కన్నీరు భక్తునకు సహజము. ఐహికములగు సుఖభోగాదులకై నదుల వలె కన్నీరు కార్చు వారున్నారు. కాని భగవంతుని కొరకై గుండె నిండుగ వ్యాకులత గలిగి ఒక్క బొట్టు కన్నీరు చాలుననియు, భగవంతుడు ఇట్టివానికి తప్పక తన సాక్షాత్కారానుభూతి నిచ్చుననియు శ్రీరామకృష్ణపరమహంస సెలవిచ్చెను. గోదాదేవికి శ్రీరంగని సాక్షాత్కారమే గాక, ఆయనతో కల్యాణమే జరిగినది. ఆయన హృదయము తానైనది. గోపికలు కృష్ణ దర్శనమునే గాక, ఆయనతో ఆడిపాడిరి. అన్నమయ్య హృదయమునకు గూడ ఇట్టి అనుభూతి కలుగబోవుచున్నది. అది మూడవ చరణమున వర్ణింపబడినది. మండుచున్న నిప్పుపై నీటిని కొంచెము చల్లినపుడు ఇంకను నిప్పు యొక్క వేడిమి పెరుగును. ఇచట అన్నమయ్య తన హృదయమున భగవంతుని పొందుకొరకై కలిగిన విరహార్తిని చల్లార్చుకొనుటకు స్వామిని గాఢభక్తితో స్మరించి, సంకీర్తనము గావించెను. ఆ స్మరణ, సంకీర్తనములే ఇచట తన కడుపుపైన చల్లుకొన్న పన్నీరుగా అన్నమయ్య వర్ణించెను. కాని ఈ స్మరణ, సంకీర్తనముల వలన స్వామియెడల వియోగ వేదన ఇంకను పెరిగెను. స్మరణ వలన, సంకీర్తనము వలన అనుభూతి కలుగును. కాని అది పరిపూర్ణము కావలెనను తాపము గూడ తీవ్ర మయ్యెను. విరహతాపము, భగవంతుని స్మరణము వలయము వలె తిరుగుచున్నవి. ఈ తాపము యొక్క తీవ్రతనే అన్నమయ్య ఉడుకనియు, మిడుకనియు వర్ణించెను. తాపము తీవ్రమై, ఇతని గుండె మండసాగిన దనమాట. ఈ భక్తుని వేదనను గమనించిన స్వామి అతనిని కరుణింపనెంచి అతని హృదయముననే సాక్షాత్కరించెను. హృదయము జీవునిది, సాక్షాత్కరించినది సర్వాంతర్యామి. హృదయమున స్వామి ఎట్లును వసించి యున్నాడు. ఇపుడు ప్రత్యేకముగా సాక్షాత్కరించుట యనగా భక్తుని తన సన్నిధికి చేర్చుకొనుటకు సిద్ధపడుట – తన అనుభూతిని ప్రసాదించి భక్తుని హృదయమును తనలో ఒదిగించుకొనుటకు సిద్ధమగుట. ఇపుడు తన లోగంటికి దర్శనమిచ్చిన స్వామిని చూడగనే భర్తను గాంచిన వధువు వలె అన్నమయ్య హృదయము వినయముతో మోకరిల్లెను. ఇది తప్పుగాదు, తగిన పని. స్త్రీ లక్షణమగు సిగ్గు గూడ కలిగినది. గోపికలు ఒక దశలో కృష్ణుని చూచి అతని గానమును విని ఆనందించిరి. కాని తాను సర్వాంతర్యామినని కృష్ణుడు వారికి అనుభూతి నీయ సంకల్పించి మాయ మయ్యెను. ఇక కృష్ణుని కొరకై పుట్ట పుట్టన, చెట్టుచెట్టున వెదకుచు విరహార్తితో తపించిరి. కృష్ణుడు

దయతో వారికి మరల కనపడెను. ఇప్పుడు గోపికలకు ఆతని యెడల సిగ్గు గలిగినది. అప్పుడు కృష్ణుడే వారిని తాకి, వారితో రాసలీల ఆడెను. ఇపుడు అన్నమయ్యయు గోపికల వలెనే విరహతాపము నొందెను, స్వామి దర్శనముతో సిగ్గుపడెను. స్వామియే అతని హృదయమును అక్కున జేర్చుకొనబోవుచున్నాడు.

3వ చరణము యొక్క తాత్పర్యము

"సాటిలేని బాణములు గల మన్మథునిపై మనసు నిలుపుట సరియైనదా, ఇది అనుకూల సమయమేనా! పస గలవాని పెదవి పంచదారయా, తేనెయా! సాటిలేని నడక గలవాని రాక ఆపదలో ఆదుకొనునట్టిదా, స్థిరముగా పాదుగా నిల్చునదా! రసస్వరూపుడగు వేంకటేశ్వరుని కూడుట రాజ్యమా, లక్ష్మియా!"

వ్యాఖ్య

కామాకర్షణ బలీయమైనదగుటచే దాని కధిపతియైన మన్మథుని సాటిలేని బాణములు గలవాడని వర్ణించుచుందురు. ప్రియురాలు తన ప్రియుడైన భర్తపై మనసు నిలుపుట సరియైనదేనా, అనుకూల సమయమేనా అని ప్రశ్నించుటలో రెండును ఔనినియే అన్నమయ్య భావము. అట్లే సామర్థ్యము గల భర్త యొక్క పెదవి తనను తాకుట పంచదారయా, తేనెయా అనుటలో రెండును గూడ అను భావము గలదు. సాటిలేని గమనము గల – జీవనమార్గము గల భర్త యొక్క రాక ఆపదలో అండయా, స్థిరమైన పాదు వంటి ఆధారమా అనుటలో రెండును అని భావము. సాటిలేని బాణములు గలవాడు నిజముగా మన్మథుడు కాడు. అతనిని కన్నతండ్రి యైన నారాయణుడు. ఇచట బాణ మనగా ఆకర్షించు రీతి యని అర్థము. మరియు 'శర' శబ్దమున 'శ, ర' ఉన్నవి. వీనికి 'ఈం' కలిపిన 'శ్రీం' ఏర్పడును. ఈ బీజాక్షరము భగవంతుని అనుగ్రహమునకు, శుభస్థితికి చిహ్నము. భౌతికాకర్షణ కన్న మానసికరమైన ఆకర్షణ మిన్న. దానికన్నను ఆత్మసంబంధమైన ఆకర్షణ ఎన్నియో రెట్లు మిన్న. సర్వాంతర్యామి యగు భగవంతుని అనుభూతిలో గల ఆకర్షణ సాటిలేనిది. అట్టి స్వామి యొక్క రాక కల్గినది. ఇప్పుడా స్వామిపై తన హృదయము నిల్పుట సముచితము. జీవి యొక్క బ్రతుకులో వెదకునది సుఖస్వరూపమైన భగవంతునే కదా! ప్రతివాడు సుఖమునే కోరును. అది భగవంతుడని తెలిసినను, తెలియకున్నను దానికొరకై వెదకుచుండును. కావున బ్రతుకనగా భగవంతునికై వెదకుట. అట్టి స్వామి అరుదెంచుట అనగా అనుభూతి నిచ్చుటకై సిద్ధపడుట జరిగినది. ఇక అన్నమయ్య హృదయము ఇప్పటివరకు స్వామికై తపించినది గావున ఇపు డాయన పొందగోరుట తగినదే. భగవంతుని పొందగోరుట తగనిదెట్లగును? మరియు ఆ పొందునకు సమయ మెప్పుడును అనుకూలమే. అంతేగాక ప్రస్తుతము అన్నమయ్య హృదయము విరహాగ్నితో కాగుచుండుట వలన స్వామిని పొందుటకు సమయ మనుకూలము, ఇతని హృదయము తగినది కూడ. సూర్యుడు తన కాంతిని ప్రవేశపెట్టుటకు సిద్ధముగా నున్నను తలుపులు, కిటికీలు తెరచిన వాని ఇంటిలోనికి ప్రవేశించును. అట్లే భగవంతుని దర్శనానుభూతికై తపించి ఆర్తి పొంది వేచియున్న హృదయము తన కవాటములను తెరచుకొనును. ఆ హృదయమున స్వామికి తప్ప వేరొక అంశమునకు తావు లేదు. అట్టి భక్తిగల అన్నమయ్య హృదయము స్వామి అనుభూతిని పొందుటకు అర్హమై సంసిద్ధముగా నున్నది. సర్వశ్రేష్ఠుడై, అన్నిటిని

మించిన అనుభూతి నీయగల వాడు స్వామి. తన కితరము లేనివాడు. కావున పస గలవాడని అన్నమయ్య తెలుగులో సహజసుందరముగా వర్ణించెను. భగవంతుని పెదవి యనగా రెండర్థములు గలవు. అంతర్యామి ప్రజ్ఞ జీవ ప్రజ్ఞను తనలోకి ఒదిగించుకొనుటకు, కౌగిలించుకొనుటకు ముందు జీవప్రజ్ఞకు ఇచ్చు మధురమైన అనుభూతిని గూర్చిన నాంది, స్వామి యొక్క పెదవినుండి వెలువడు తీయని పలుకు. అది యోగసిద్ధిలో ఓంకారము. అన్నమయ్యకు స్వామి కట్టెదుట సాక్షాత్కరించి తీయగా పలుకరించుట గూడ జరిగినది. ఈ తీయదనమునే కృష్ణుని అధరామృతమని భాగవతములో వర్ణించిరి. 'ధర' కు సంబంధించిన భౌతికమైన సుఖమంతయు మృతమే – అశాశ్వతమే – నశించునది. ఆత్మా నందము నశింపనిది, శాశ్వతమైనది, కావున అమృతము. అన్నమయ్యకు ఇట్లు లోనుండి ఓంకార నాదరూపమైన స్వామి పలుకరింపు, వెలుపల నుండి స్వామి దర్శనమిచ్చి పలకరించిన తీరు, తోటి జీవులందరి రూపములలోని అంతర్యామి యగు స్వామి పలుకరింపు పంచదారకన్న పంచదార, తేనెకన్న తేనె యైనది. ఏ వ్యక్తి పలికినను ఇతనికి స్వామి పలుకరింపే. ప్రకృతియందలి భాగములైన తిరుపతి కొండ, దానిపైన తీర్థములు, చెట్లు, ఊళ్లు ఇతనితో మాటలాడినవి. ఏ భాషలో? ఆత్మ భాషలో. మాటలాడిన దెవరు? వాని రూపమున శ్రీవేంకటేశ్వరుడు. ఆ మాటలకు స్పందించిన అన్నమయ్య యొక్క తీయని యెదకు తీయదనము కన్న తీయని అనుభూతి కలుగకుండునా? భగవంతుని యొక్క గమనము సాటిలేనిది. భగవంతు డను వెలుగు యొక్క నడకయే సృష్టి మొత్తము. భగవంతుడను వెలుగు యొక్క కిరణముల ప్రసారమే సృష్టి. తననుండి తననే సృష్టిగా వెలువరించిన వాడు. 'గతి' అనగా పొందదగిన గమ్యమని గూడ అర్థము. జీవిత గమ్యము భగవంతుని సాక్షాత్కారానుభూతియే. అనగా తన లోపల, వెలుపల భగవంతుడే దర్శనమిచ్చి అనుభూతిగా నిలుచుట. ఇదిగాక మానవునకు జీవిత గమ్యము లేదు. మరియు ఆర్తితో పిలిచిన వెనువెంటనే భక్తుని ప్రోచుటకై వచ్చు రక్షకుడు దేవుడు. ప్రహ్లాదాదుల విషయములో నిట్లు జరిగినది. ఇదేవిధముగా అన్నమయ్య విరహార్తితో పిలువగనే స్వామి వచ్చి అతని యెదుట నిలిచెను. అతని వెలుపల, లోపల తానై ప్రకాశించెను. అట్టి స్వామి రాక ఆదు, పాదు గూడ యగును. అనగా ఆపదలో, ఆర్తిలో ఆదుకొనువాడు స్వామియే. గజేంద్రునకు, ద్రౌపదికిని, వానరులకును ఇట్లు నిలిచెను. అంతేగాక శరణాగతితో తపించువారి జీవితములందు స్థిరముగా ఆధారమై నిలిచి, వారికి తన సంకల్పము ననుసరించి కావలసిన క్షేమము లిచ్చును, తన అనుభూతి నిచ్చును. భగవంతుడు సర్వాధారుడు. ఏ భక్తుడు తనను భగవంతునకు సమర్పించుకొనునో, అట్టివానికి తనను తాను సమర్పించుకొనును. వేదాధ్యయనము, యజ్ఞ దాన తపస్సులు భక్తుడు చేయవచ్చును, చేయకపోవచ్చును. కాని నిర్మలమైన, నిండైన హృదయముతో స్వామిని ప్రేమించినచో, స్వామి విశ్వరూపుడుగా నిరంతరముగా దర్శనమిచ్చును. ఈ విషయమును స్వామి గీతలో చెప్పెను. మన జుట్టు మన కాధారము కాదు. అట్లే మనము కానివి, మనవి యని భ్రమించుచున్నవి అగు బలము, ధనము, అధికారము మున్నగునవి కాపాడలేవు. మనము ఎవరినుండి వచ్చితిమో, ఎవరి వెలుగులో కిరణములమో అట్టి స్వామియే మనకాధారము. ఈ అంశము నచ్చుటకు కొన్ని జన్మలు పట్టును. పైవానిని నమ్మిన కౌరవులు నశించిరి. భగవంతుని, ఆయన స్వరూపమైన ధర్మమును నమ్ముటయే గాక, ఆశ్రయించి, అనుసరించిన పాండవులు

రక్షణమును, మోక్షమును పొందిరి. ధనాదులను నమ్మినవాడు ఎన్నో జన్మలు పల్టీలు గొట్టి దేవుని ఆశ్రయించుటకు సిద్ధమగును. భగవానుడు భక్తుని హృదయములో తనను తానే పాదుకొల్పును. అప్పుడు భక్తుని హృదయస్థానమున భగవంతుడే ప్రకాశించును. వేంకటేశ్వరుడు రసికుడు. అనగా రసస్వరూపుడు. దేవుడు రసస్వరూపుడని ఉపనిషత్తులో చెప్పబడినది. కొందరు దేవుడు నిర్గుణుడు గావున, అన్నిటికి సాక్షి గావున జడు డన్నట్లు భావింతురు. ఆ భావము పొరపాటు. భగవంతుడు గుణముల కతీతుడైనను, రసము – ప్రేమ, ఆనందము తన రూపమైనవాడు. శ్రీకృష్ణుడు సాధారణముల వలె కన్పించు తన పలుకులతో, చిరునవ్వులతో, నడకలతో, అలుకలతో, క్రీగంటిచూపులతో, గోపికల హృదయముల నాకర్షించి, వారిని రసమున ముంచెత్తెను. అట్టి స్థితినే తనకు గూడ ప్రసాదింపుమని భీష్ముడు నిర్యాణ సమయమున ప్రార్థించెను. అట్టి ఆనందసాగరుడగు శ్రీవేంకటేశ్వరుని 'పొందు' – అనగా పొందుట, కూడిక – రాజ్యము, లక్ష్మి రెండుయునని అన్నమయ్య కీర్తించుచున్నాడు. భగవంతుని పొందు దశలో నది, సాగరమున ప్రవేశించుచున్నట్లుగా అనుభూతి కలుగును. దానితోపాటు భక్తుని ప్రజ్ఞ కొంచెము మినుకు మినుకు మనుచుండును. తన యునికి సందేహములో పడును. సీతమ్మను చూచినపుడు హనుమంతునకు మొట్టమొదట ఈ స్థితి కలిగెను. తరువాతి దశలో – అనగా సిద్ధి దశలో భగవంతుని పొందుట గాక, పొందు కల్గును. అనగా స్వామి యొక్క కూడిక గల్గును. స్వామియందు జీవుడు పూర్తిగా ఆనందించును. సర్వాంతర్యామి యను ఆనందసాగరమున భక్తుని ప్రజ్ఞ నదియై, లోన పూర్తిగా ప్రవేశించును. ఈ స్థితిలో భక్తుని ప్రజ్ఞ యని వేరుగా నుండదు. భక్తునికి, భగవంతునికి భేదము లేదు. ఈ స్థితినే ఉపనిషత్తులలో 'స్వారాజ్య' మనిరి. తన అసలు స్వరూపమైన ఆనందసామ్రాజ్య మని అర్థము. దీనినే అన్నమయ్య ఉద్దేశించెను. ఇక ఈ స్థితిలోని వానికి లక్ష్మి కూడ లభించును. భక్తుడు కానివాని దృష్టిలో లక్ష్మి యనగా సంపద. కాని లక్ష్మి యనగా లక్ష్మీదేవి. వాస్తవమునకు వేంకటేశ్వరుని ఆశ్రయించిన శుభలక్షణ సంపద. లక్ష్మి యనగా లక్ష్మలతో, గుర్తులతో కూడినదని యర్థము. ఇచట గుర్తు లనగా భగవంతుని కల్యాణ గుణములు – దయ, ధైర్యము, అనంతప్రేమ, ఊహింపరాని సామర్థ్యము, సహనము, ఆర్తుని కాపాడుటకై సంసిద్ధత మున్నగునవి. ఈ గుణములు భగవంతుని పొందగల్గిన భక్తునకు కూడ లభించును. కాని ఇవి తనవని అతడు భ్రమింపడు. తనలోనుండి భగవంతుడే ఈ గుణములను ప్రకాశింపజేయుచున్నాడను సత్యమును ఎఱుగును. ఇతరులు ఈ గుణములు తనవని కొనియాడినను పొంగి పొరపడడు. వినయమును అభినయింపడు. హృదయపూర్వకముగా ఈ లక్షణములు అమ్మవారి స్వరూపము లనియు, దేవుని దివ్యగుణము లనియు అనుభవములో నుండును. అన్నమయ్యకు భగవంతుని పొందుట, పొందు, అందుగల ఆనంద సామ్రాజ్యము, దేవుని శుభ లక్షణములు ఆయన దయవలన సిద్ధించెను. కావున వేంకటేశ్వరునకును, అన్నమయ్యకును భేదము లేదు. కారణము అతని యునికి స్వామికన్న వేరుగా లేదు. ఇట్లు ఈ సంకీర్తనమును గానము చేసిన వారికిని, వినువారికిని గూడ ఇదే స్థితి అన్నమయ్య రూపవ ఖన స్వామి ఆశీస్సులు లభించును. ఎల్లరును ఈ స్థితిని పొందవలెననియే అన్నమయ్య యొక్క అనుతాపము.

* * *

30

6వ సం-113 **నాలం వా** రీతిగౌళ

నాలం వా తవ నయవచనం
చేలం త్యజ తే చేటీ భవామి. ॥ పల్లవి ॥

చల చల మమ సంసద్ఘటనే కిం
కులిశహృదయ, బహు గుణవిభవ
పులకిత తనుసంభృత వేదనయా
మలినం వహామి మదం త్యజామి. ॥ నాలం ॥

భజ భజ తే ప్రియభామాం సతతం
సుజన స్త్వం నిజసుఖనిలయ
భుజ రేఖా రతి భోగిభవసి కిం
విజయీభవ మద్విధిం వదామి. ॥ నాలం ॥

నయ నయ మా మనునయన విధం తే
ప్రియకాంతాయాం ప్రేమభవం
భయహర వేంకటపతే త్వం మ
త్ప్రియో భవసి శోభితా భవామి. ॥ నాలం ॥

యోగమనేది జీవితమున సరైన వైఖరే కాని ఏదో
సాధించేది కాదు.

టీక

నాలం వా = చాలదా, తవ నయవచనం = నీ ఓదార్పు మాట, చేలం = నా కొంగు, త్యజ = విడువుము, తే = నీయొక్క, చేటీ = సఖిని, భవామి = అయ్యెదను.

చలనం = కదలుము, కదలుము (వెళ్ళిపో, వెళ్ళిపో), మమ = నాయొక్క, సంసత్+ఘటనే = కలయిక తటస్థించుట, కిం = ఏల?, కులిశ హృదయ = వజ్రము వంటి హృదయము గలవాడా!, పులకిత = పులకరించిన, తను = శరీరము నందు, సంభృత = మిక్కిలిగా భరింపబడుచున్న, వేదనయా = వేదనతో బాటుగా, మలినం = కలుషభావమును, వహామి = వహించుచున్నాను, మదం = అతిశయ మును, త్యజామి = విడుచుచున్నాను.

తే = నీవు, సతతం = ఎల్లప్పుడు, ప్రియభామాం = ప్రీతి గల స్త్రీని, భజ, భజ = సేవింపుము, సేవింపుము, త్వం = నీవు, సుజనః = మంచివాడవు, నిజసుఖ నిలయ = నీ సహజమయిన, మొదలుతో సంబంధం లేని ఆనందమునకు నిలయ మైనవాడా!, భుజరేఖా = నా భుజములపైని నీ చేతి గీతలతోనే, రతి భోగి = ఆనందమును అనుభవించువాడవు, భవసి= అగుచున్నావు, కిం = ఏల?

విజయి = విజయము పొందిన వాడవు, భవ = కమ్ము, మత్+విధిం= నా నియమమును, వదామి = చెప్పుచున్నాను, తే = నీయొక్క, అనునయన విధం = ఓదార్పు విధానముతో, మాం = నన్ను, నయ, నయ = తీసికొని వెళ్ళుము, తీసికొను వెళ్ళుము, ప్రియకాంతాం = ఇష్టమైన కాంత యందు ప్రేమ కలుగువాడవు, వేంకటపతే = ఓ వేంకటేశ్వరా, భయహర = భయమును తొలగించువాడవు, భయమును తొలగింపుము, త్వం = నీవు, మత్+ప్రియం = నా ప్రియుడవు, భవసి = అగుచున్నావు, శోభితా = (అపుడు నేను) శోభిల్లుదానను, భవామి = అగుచున్నాను.

పరిచయము

ఈ సంకీర్తనములో అన్నమయ్య తనకు స్వామియెడల గల భక్తి యొక్క సాధనలో మూడు దశలను వర్ణించెను. 1. స్వామికి చెలికత్తె యగుట, 2. స్వామిపై అలుక పూనుట, 3. స్వామికి ప్రియురాలై శోభిల్లుట. ఈ మూడు దశలును స్థూల బాహ్యార్థము నకు కనపడును. అయితే ఈ సంకీర్తనమున భక్తియోగ సాధనలోని మూడు దశలు లోగంటికి తెలియవచ్చుచున్నవి. 1. తనయందు ఆత్మకు చుట్టునున్న ఆవరణములను తొలగింపుమని వేడుక. 2. స్వామి ఇతర భక్తులను ఆదరించుచుండగా సంతోషించి, స్వామికి పరికరముగా నగుట. 3. స్వామి తన హృదయేశ్వరుడు కాగా, తాను భగవంతునిలో ఒదిగి ప్రకాశించుట. ఇక ఈ రెండు రీతులను అన్నమయ్య పొందిన అనుభూతి వివరింపబడుచున్నది. అన్నమయ్య శ్రీకృష్ణ భక్తురాలగు గోపిక వలె తనను తానే సంభావించుకొని, ఆ స్వచ్ఛమయిన ప్రేమతో స్వామితో పలుకుచున్నాడు.

పల్లవి, చరణముల యొక్క తాత్పర్యము

స్వామి తన కొంగు పట్టుకొనెను. అన్నమయ్య ఇట్లు స్వామిని వేడుచున్నాడు. "నా కొంగు విడువుము. నా కొంగు పట్టుకొననక్కరలేదు. నీ ఓదార్పు పలుకులు చాలవా! నాకవియే చాలును. నేను నీ సఖినై, నీ సేవలో తనిసెదను. నీవు వజ్రము వంటి కఠినమైన హృదయము గలవాడవు. నాతో కూడిక నీకెందుకులే! నీవు నానుండి వెడలిపొమ్ము. అయితే నీవు ఎన్నియో కల్యాణ గుణములను వైభవము గలవాడవు. నీవు నా కొంగు పట్టుకొన్నప్పుడు నా శరీరము పులకరించినది. అంతట నా శరీరము నిన్ను పొందవలెనను పరితాపమును భరించుచున్నది. కాని నాలో ఇంకను కొన్ని మలినభావము లున్నవి. మదమును విడిచిపెట్టుచున్నాను. నీకిష్టమయిన స్త్రీనే నీవు ఎల్లప్పుడు సేవింపుము. నీవు చాల మంచివాడవు. నీవు వాస్తవమయిన సుఖమునకు నిలయమయిన వాడవు. నా భుజములపై నీవు నీ అరచేతులుంచుచున్నావు. ఆ యరచేతి గీతలు నా భుజములపై ముద్రనొందినవి. నీవు విజయుడవు కమ్ము. నా నియమమును చెప్పుచున్నాను. నీయొక్క ఓదార్పు మాటలతో – అనగా నేను నిన్ను అనుసరింపగా నీవెంటనే నన్ను గొనిపోగలిగిన మెత్తని తీయని పలుకులతో నీవు నన్ను తీసికొని వెళ్ళుము. నీవు నీకు ప్రియమయిన స్త్రీలయందు ప్రేమను పొందగల వాడవు. ఓ వేంకటేశ్వరా! నీవు భయమును పోగొట్టగలవాడవు. నాకు ప్రియుడవు గమ్ము. నేను శోభిల్లుదాన నగుదును."

వ్యాఖ్య

పై మాటల వివరము నిట్లు చెప్పుకొనవచ్చును. "నీవు వజ్రము వంటి కఠిన మయిన హృదయము గలవాడవు. అనగా నన్ను దయచూచుట లేదు. నాతో కూడిక నీకెందుకులే! నానుండి వెడలిపొమ్ము. నీవెన్నియో కల్యాణగుణములను వైభవముగా గలవాడవు. వాత్సల్య, మాధుర్య, గాంభీర్య, ఔదార్య, ధైర్య స్థైర్యాది కల్యాణ గుణములతో శోభిల్లుచున్నవాడవు. నీవు పుట్టుకకు అతీతుడవు గావున దేహధారులు పొందు భ్రాంతి నీకుండదు. (విభవ మనగా వైభవమే గాక, పుట్టుక లేని స్థితి యనియు అర్థము.) సహజముగా గుణాతీతుడయ్యును, జీవులపైన, సృష్టిపైన అపార కరుణతో ఈ సద్గుణములు కలిగి శోభిల్లుచుందువు. నాలో ఇంకను కొన్ని మలిన భావములు మిగిలియున్నవి. నీ స్పర్శకు, కౌగిలికి తగిన యోగ్యత నాకింకను ఏర్పడలేదు.

అన్ని మలిన భావములకు మూలమయిన అతిశయభావమును విడిచిపెట్టు చున్నాను. నాకింకను అర్హత ఏర్పడకుండుటచే నీకిష్టమయిన భక్తురాలినే సేవింపుము. అంతమాత్రముచేత నేను నిన్ను నిందింపజాలను. నీవు సద్గుణుడవు. నీ సుఖము సత్యమైనది. నీ సుఖము నీలోనిదే గాని, నీకు వెలుపలి పరిస్థితులపై ఆధారపడినది గాదు. (నిజమనగా పుట్టుక లేనిది – ఆధారము లేనిది – తనదయినది). నీ అరచేతి గీతలు నా భుజములపై ముద్రనొందినందులకే నాకు ఆనందము నొసగి, నీవు ఆనందించుచున్నవాడవగుట ఏమి? ఇదియే చాలు నా ఆనందమునకు. నీవు నా మనస్సును గెలుచుకొమ్ము.

నీవు నాయందు నీ ఆనందము నింపుటకును, నాయందు నీవు ఆనందించుటకును నేను నా నియమమును చెప్పుచున్నాను. నీ మెత్తని ఓదార్పు మార్గమున నన్ను గొనిపొమ్ము. నీకు ప్రియమయిన స్త్రీలయందు ప్రేమను పొందగల వాడవు. (భక్తు లెల్లరు స్త్రీలని భావము). ఓ వేంకటేశ్వరా! నీవు సంసార భయమును, నీ వియోగము వలని భయమును పోగొట్టగలవాడవు. నా భయమును తొలగింపుము. నాకు ప్రియుడవు గమ్ము. నన్ను నీ ప్రియసతిగా ఏలుకొమ్ము. నీ అనురాగము వలని ఆనందముతో నేను శోభిల్లుదును సుమా!

ఇక ఈ సంకీర్తన యందలి నిగూఢ భావ మిట్లున్నది. ఆత్మ సచ్చిదానంద స్వరూపము. నిర్మల చైతన్యము. సర్వవ్యాపకము. అదియే సహజ స్థితి. దాని చుట్టు 'నేను, నాది' అను అహంకార మమకారము లల్లుకొన్నవి. వానితో కామక్రోధాది మలినములు జనించును. వీని నావరణములని ఆధ్యాత్మిక విద్యలో పేర్కొందురు. ఈ యావరణములనే అన్నమయ్య వస్త్రమని (చేలము) సంకేతించెను. దీనిని తొలగించుకొనుట జీవునికి సాధ్యము కాదు. కావున అన్నమయ్య దానిని తొలగింపు మని స్వామిని వేడుకొనుచున్నాడు. ఇచట ఈతడు గోపికా భావము ననుభవించు చున్నాడు. నాకింకను ఆవరణములు తొలగలేదు కావున, నిండుగా నీ కౌగిలిని అనగా నీ స్వరూపమగు ఆనందములో మునుగు స్థితికి అర్హత ఇంకను నాకు రాలేదు. ఇప్పటికి నాతో ఓదార్పు పలుకులు చాలు. నయవచనము లనగా ఓదార్పు మాట లనియే కాదు, 'నయ' అనగా 'తీసికొని వెళ్ళు' అని అసలర్థము. ఆవరణముల వలన, నేను నీ సన్నిధికి రాలేకున్నాను. నీవే నీ దివ్యమైన పలుకులతో నన్ను నీ సన్నిధికి తీసికొనివెళ్ళుము. శ్రీకృష్ణావతారమున ఈ పల్కుల తీయదనమే వేణుగానమైనది. ఇది ఓంకారనాద ప్రస్తారము. కావున అన్నమయ్య తన శ్వాసలో స్వామి యొక్క వేణుగానమయిన 'ఓంకార' నాదమును విను సాధన తనలోన చేయుచున్నాడన్న మాట. అంతియేగాక, తన బాహ్యజీవితమున గూడ తోటివారి పలుకులను, నిందా స్తుతులు రెంటిని – వారి రూపములలో స్వామియే లీలగా పలుకుచున్నాడని గ్రహించి, వానిని స్వామి సన్నిధికి చేర్చు సాధనములుగా స్వీకరించుచున్నాడనమాట. మొదటిది ప్రణవోపాసనము. రెండవది వాసుదేవోపాసనము. భాగవతమున నారదుడు ఈ రెంటిని ఆచరించి ఉద్బోధించెను. ప్రస్తుతమునకు నీకు సఖినై సేవలు చేసెదను. ఇదియే కైంకర్య భక్తి. సేవతో ప్రారంభమై, ఆనందానుభూతిగా ఇది పరిణమించును. పూర్ణశరణాగతి నాకింకను రాలేదు. నాలోని అహంకార మమకారాది ఆవరణము లింకను విడువలేదు. నాపై దయచూపి, దానిని తొలగింపకుండ, అట్లు వజ్రము వలె కఠినమయిన హృదయముతో ఊరకుంటివేల? పూర్ణశరణాగతి రానంతవరకు నాతో కలయిక ఎట్లు జరుగును? నన్నెట్లు నీలో ఒదిగించుకొందువు? కావున వెడలి పొమ్ము అని అన్నమయ్య తన ఆర్తినే వెలిబుచ్చుచున్నాడు. పైకి చూడగా స్వామిని వజ్రహృదయుడవని నిందించుచున్నట్లు అనిపించును. లోన చూడగా తనపై ఇంకను దయ చూపలేదని బ్రతిమిలాడుట తెలియును. నీ వసలు బహుగుణవిభవుడవు. శ్రీరామ, శ్రీకృష్ణాది అవతారమూర్తులుగాను సద్గుణములతో వర్తించి మంచివాడ వయితివని భావము. అంతేకాక మంచివారెల్లరిలోని మంచితనము నీదే కదా యని భావము.

మంచి తట్టుట, మంచి పలుకులు, మంచి చేయుట, మంచిగా బ్రతుకుట భగవంతుని వెలుగునుండియే కలుగును కదా! ఎన్నో మంచి గుణముల విభవము గలవాడవు. నీకు ప్రత్యేకముగా సంపదలతో పనియేమి? అనంత ప్రేమ, అనంత కరుణ, అనంత క్షమ, అనంత ధైర్యము – వంటి కల్యాణ గుణములే నీ సంపద. మరియు 'విభవ' అనగా పూర్వము చెప్పబడినట్లు పుట్టుక లేనివాడవయినను అవతార మూర్తుల శరీరములు ధరించియు, భాగవతోత్తములయిన వారి ద్వారమున వర్తించుచును నీవు విశేషమయిన పుట్టుక గలిగి సకల సద్గుణములతో శోభిల్లు చున్నావు. స్వామి పుట్టుక లేనివాడై, బహురూపములతో పుట్టుచున్నాడని పురుష సూక్తము చెప్పుచున్నది. ఆ భావమునే అన్నమయ్య 'బహు గుణవిభవ' అను సంబోధనలో అందించెను. మరియు ఏ జీవిలోని మంచిగుణముల నయినను అంతర్యామి యగు శ్రీహరి గుణములనుగానే మనసార కీర్తించుటయే భాగవత మనియు, ఇదియే హరిని చేరు దారి యనియు నారదుడు వ్యాసునకు బోధించెను. ఇట్టి సంకీర్తనల సమాహారముగ భాగవతము రచింపుమని ప్రేరేపించెను. అన్నమయ్య సంకీర్తనల సమాహారము గూడ ఒక భాగవతమే. అయితే తనలో ఇప్పుడు రెండు స్థితులు కలిసియున్నవని అన్నమయ్య ప్రకటించుచున్నాడు. నీవు నా వస్త్రమును తాకుట వలన, అనగా నా హృదయమునకు కొంత అనుభూతి నొసగి, ఆవరణములు తొలగింప సంకల్పించుట వలన నాకు పులకరింత కలిగినది. ఈ యనుభూతి పరిపూర్ణము గావలెనను పరితాపము గలిగినది. 'అహం' ఎంతగా తొలగుచుండునో, అంతగా ఆనందము ప్రవహించు చుండును. అయితే ఇంకను పూర్తిగా నాలో మలిన వాసనలు తొలగలేదు. ఇపుడు నీ యనుభూతి కొరకై పరితాపము, కొంత పూర్వ కలుష వాసన కలిసియున్నవి. మలినభావము లనగా ఇతరులను గూర్చి చెడు అభిప్రాయములు మున్నగునవి. వీనికి మూలమేది? తానితరులకన్న జ్ఞాని ననియో, భక్తుడ ననియో, కవి ననియో ఏదియో ఒక ప్రాతిపదిక మీద ఆధారపడిన స్వాతిశయమే. ఇదియే మదము. నేను ఉపాసనలు చేయుచున్నాను, నేను సంకీర్తనములు చక్కగా రచించి, గానము చేయుచున్నానను భావము కూడ మదమునే సూచించును. ఇది మిగిలినవారి కన్న ఆధిక్య భావము. మిగిలినవారిలోను, తనలోను – ఉదాహరణకు గాయకునిలోను, శ్రోతలలోను, సేవించువారిలోను, సేవలందు కొనుచున్న వారిలోను అంతర్యామిగా నున్నది స్వామియే గదా! స్వామి ప్రసాదమే గదా రచన, గానము, సేవ, ప్రసంగము మున్నగునవి ఆచరింపగలుగుట. కావున ఈ అతిశయభావమే స్వామికిని, భక్తునికిని అడ్డుగోడగా నిలుచునని గ్రహించిన అన్నమయ్య దానిని విడిచిపెట్టుచున్నాడు. ఈ స్థితిలో సంకీర్తనము తనవలన జరుగునది గాదనియు, తన ద్వారమున స్వామియే చేయుననియు తట్టును.

అన్నమయ్య తరువాతి చరణమున నీకిష్టురాలయిన స్త్రీనే సేవింపుమని అలుకతో పలికినట్లు కన్పడును. కాని నిన్ను సేవించు సఖిగానే యున్నాను. నీ యనుభూతి నందుటకు వలయు నర్హత గల ప్రియభామను గాలేదు. సర్వసమర్పణము జరిగినపుడే స్వామికి మన హృదయము ప్రియభామ యగును. సర్వసమర్పణ పొందిన అతిశయము పూర్తిగా విడిచిన భక్తులనే ప్రియభామలుగ స్వీకరించి వారిని సేవింపుము – అనగా నీ యనుభూతినిమ్ము. నేనింకను అతిశయమును విడుచుచున్న స్థితిలోనే యున్నాను. ఇంకను

పూర్తిగా విడువలేదు. స్వామికి ప్రియభామల వంటివారయిన మహాభక్తులపై అన్నమయ్య అసూయను గాక ఆదరమును, ఆరాధనాభావమును, గౌరవమును ఇందు నెరపుచున్నాడు. వారనుసరించిన ప్రపత్తి మార్గమే నాకును అనుసరణీయమని ఇతని భావము. క్రొత్త దారి లేదు. దారి శాశ్వతమయినది. అనుసరించు వానికది క్రొత్త యనుభూతి నిచ్చుచుండును. కావున క్రొత్తది వలె అన్పించును. ఇదియే నవ్య మార్గము. నవ మార్గము కాదు. భక్తులయిన పెద్దల ద్వారముననే భగవంతుని ఆశ్రయింపవలెను గాని సూటిగా గాదని విశిష్టాద్వైత సంప్రదాయము. విభీషణుడు ఆంజనేయ, జాంబవంతాది భక్తుల ద్వారముననే శ్రీరాము నాశ్రయించెను. శబరి తన గురువు ద్వారమున ఆశ్రయించెను. ఉద్ధవుడు గూడ గోపికల నాశ్రయించి, వారిని అనుసరించిన పిమ్మటనే శ్రీకృష్ణునికి దగ్గరవాడయ్యెను. మనము గురు పరంపరను గౌరవింపవలయును. అన్నమయ్య ఇట్లు తనకన్న ముందున్న మధుర భక్తులను కీర్తించుచున్నాడు. నీవు సుజనుడవు అనగా మంచివాడు అనియే గాక, మంచి జన్మ గలవాడవు. ఇది ఎట్లు పొసగును? పుట్టుక లేని స్వామి అవతారమూర్తులు గాను, అర్చామూర్తులుగాను, చివరకు సమస్త జీవులుగాను పుట్టుచున్నాడు గదా! వీరందరిలోని మంచి నీదే కదా! నీవు నీ సహజమగు సుఖమునకు నిలయమయిన వాడవు. 'నిజ' అనగా పుట్టుక లేని యనియు అర్థము. నీవు సుఖస్వరూపుడవు. సామాన్య జీవులు పొందు సుఖము, వారికిష్టమయిన వ్యక్తుల కలయిక, ఇష్ట వస్తువుల సిద్ధి, ఇష్టమయిన పరిస్థితులు, ఇష్టమయిన పరిసరముల నుండి పుట్టుచుండును. ఇవి తొలగగనే ఈ సుఖము కూడ తొలగి దుఃఖము కలుగును. దేవుని విషయ మట్లు గాదు. ఆయన సుఖము సహజము. దేనినుండి పుట్టునది కాదు. ఆయనయే సుఖము. ఈ సుఖము ఐహికములగు సుఖ దుఃఖముల కతీతమయిన ఆత్మసుఖము. దీనికి స్వామియే మూలము, స్వరూపము. కావున మనకు నిజమయిన, అసలయిన సుఖము గావలెనన్నచో స్వామినే ఆశ్రయింపక తప్పదు. పైన స్వామి మంచివాడనియు, ఎన్నో మంచి గుణముల సంపద కలవాడనియు తెలిపిన అన్నమయ్య ఇపుడు స్వామిని నిజ సుఖ నిలయుడనుచున్నాడు. ఈ మూడు సంబోధనలను కలిపి గ్రహింపవలెనని అతని యుద్దేశ్యము. స్వామి యొక్క మంచితనము, సర్వ భూతదయ, సహనము, సమత్వము మున్నగు సద్గుణములను మన మలవరచుకొని, అవి మన సహజ సంస్కారములయినపుడే, మనకు సహజ సుఖము కలుగునని అన్నమయ్య దివ్యోప దేశము. దేవుని గుణముల నలవరచుకొనకుండ, దేవు నాశ్రయించుట బూటకము. సద్గుణములకు, నిజమయిన సుఖమునకు సంబంధము పెనవేసికొని యున్నది. సద్గుణములయిన ప్రేమ, కరుణ, సహనాదులు లేకుండగనే, సుఖమునకై వెదకు వాని ప్రయత్నము వ్యర్థము కాక తప్పదు. ఇదియే మహాభారత సారము. కౌరవులు అసూయాది దుర్గుణములు కలిగి, రాజ్య భోగములను మరణాంతము అనుభవించినను శాంతి సుఖములకు నోచుకొనలేదు. ఏనాడు వారికి కునుకు పట్టలేదు. పాండవులు ధర్మమునకు, దైవమునకు శరణందుటచే, రాజ్యములో నున్నను, అడవులందున్నను సుఖశాంతులకు నోచుకొనిరి. దైవము ధర్మస్వరూపము. ధర్మాచరణ లేకుండ, దైవ విగ్రహముల నర్చించినను సుఖము దక్కదని అన్నమయ్య ఇచట దృఢముగా చెప్ప దలచెను. ధర్మము ఆచరణలోనికి వచ్చినపుడు

సద్గుణమనబడును. కావున స్వామి బహు గుణవిభవుడు. స్వామి అన్నమయ్య భుజములను తాకుటతో, ఆయన అరచేతి గీతలు ఈ భక్తుని భుజములపై బడి ఆనందానుభవము కలిగినది. స్వామి స్పర్శకు ఇతనికి గిలిగింతలు కలిగినవి. ఇచట స్వామి స్పర్శ కల్గుటయు, అన్నమయ్య భుజము లపై స్వామి దివ్య హస్తరేఖలు పడుటయు నిజమే. అన్నమయ్యపై స్వామి కురిపించిన కరుణ యట్టిది. అంతేగాక స్వామి ఇతనిని లోక హితము కొరకయిన తన కార్యక్రమ ములో పరికరముగా వాడుకొని, అతని కానంద మొసగెనని సూక్ష్మ భావము. స్వామి ఇతని భుజములపై తన చేయి వేసి జీవితమున నడిపింపసాగె ననమాట. ఇంతమాత్రము అనుభూతి అన్నమయ్యకు పూర్తి తృప్తి కలిగింపలేదు. అన్నమయ్య భుజములపై స్వామి హస్తముల నుంచెననియే గాక, పాదములను కూడ ఉంచె ననియు చెప్పనగును. గోపిక అగు అన్నమయ్య భుజములపై స్వామి తన పాదముల నుంచి ఎగురుట జరిగినది. స్వామి పాదము నందలి శంఖచక్రాది దివ్యరేఖల స్పర్శ వలన ఇతని కానందము కలిగినది. లీలాశుకుడను భక్తుడు గోపికల నిట్లే వర్ణించెను. ఇక స్వామిని ఇతడు విజయుడవు గమ్మని పలుకుచున్నాడు. స్వామి సహజముగానే విజయుడు. మరి అన్నమయ్య ఇట్లేల పలికెను? తన మనస్సుపై, ఇంద్రియములపై 'తన'పై విజయము పొందుమని వేడికోలిది. ఆదిశంకరులు కూడ దేవుని ఇట్లే వేడిరి. లీలాశుకుడు గూడ నీ వేణుగానముతో నాపై విజయుడవు కమ్మని కృష్ణుని వేడెను.

ఇక మూడవ స్థితిని గూర్చి ఇట్లు ప్రస్తావించుచున్నాడు. పూర్తిగా నీ యనుభూతి అఖండముగా నాలో నిండుటకు నేనొక నియమమును తెలుపుచున్నా ననుచున్నాడు. నిన్ను అనుసరించు పద్ధతిలో నీవు నన్ను నీవెంట తీసికొనివెళ్ళుమని వేడుచున్నాడు. ఇక దేవుడు నడచు దారియే ఇతడు నడచు దారి యగును. దేవుడెట్లు జీవులను ప్రేమించునో, అదియే అన్నమయ్య నడిచిన దారి. స్వామి తన కిష్టులయిన కాంతలందు ప్రేమను పొందువాడు. ఈయన ఎల్లరిని ప్రేమించును. స్వామి కిష్టులని వేరుగా లేరు. కాని అన్నమయ్య కొందరిని 'కాంతలు' అనెను. కాంతలు అనగా ఆకర్షించు వారని యర్థము. స్వామినే తమ భక్తితో ఆకర్షించు మహాభక్తులు. స్వామి ప్రేమ యొక్క అనుభూతిలో మునుగుదురు. విద్యుత్తునకు పక్షపాతము లేదు. కాని మన ఇంట్లో విద్యుత్ప్రసారము జరుగుటకు, ప్రధానమయిన స్విచ్ 'ఆన్' చేయవలెను గదా. కామక్రోధాదులు, సుఖదుఃఖాదులతో గూడిన సంసార భయమును తొలగించు వాడు స్వామి. మరియు భయమేల కలుగును? ఇతరమును చూచుట వలన. అంతయు అంతర్యామి యయిన స్వామి అయిన వానికి భయముండదు. కావున నాకు నీవు అంతర్యామిగా, ఇతరము లేనివాడవుగా దర్శనమొసగి నా భయమును తొలగింపుమని అన్నమయ్య స్వామిని వేడుచున్నాడు. అంతటితో నీవు నాకు ప్రియుడవగు భర్త వగుచున్నావని స్వామి కితడు సంపూర్ణ శరణాగతినందెను. స్వామి భర్త ఆయెను. ఇతని హృదయము భార్య ఆయెను. స్వామి యొక్క కౌగిలిలో ఈతని హృదయము ఒదిగిపోయెను. ఇతని ప్రజ్ఞ అంతర్యామి ప్రజ్ఞలో కరగిపోయెను. అంత అన్నమయ్య యెద గోపిక వలె శోభించినదాయెను. అనగా దివ్యానందముతో నిండినదాయెను.

ఇట్లు మూడు సోపానములు ఈ కీర్తనలో అన్నమయ్య వర్ణించెను. మొదటి సోపానము : స్వామికి సేవ చేయు సఖి యగుట. ఈ దశలో 'నేను సేవ చేయు చున్నాన'ను భావముండును. రెండవది స్వామికి తాను పరికరమై స్వామియే తన ద్వారమున తన సేవ చేయించుకొన్నాడని తెలియుట. స్వామి దారినే తాను నడచుట. మూడవది స్వామికి ప్రియమైన భార్యగానై, స్వామి కౌగిలిలో ననగా అఖండానంద ప్రేమరససాగరమున మునిగి శోభిల్లుట. ఈ స్థితిలో స్వామియే సేవించును, జీవించును. అన్నమయ్య జీవనము సాగుట యనగా స్వామి సాగుటే. ఇదియే మానవ జీవితమునకు పరమ శోభ. సంకీర్తనము కూడ భగవంతుని సేవ గదా. మొదటి దశలో భక్తుడు స్వామిని సంకీర్తించును. రెండవ దశలో స్వామియే భక్తుని ద్వారమున సంకీర్తనము గావించును. మూడవ దశలో భక్తుని యునికి ఇక ఉండదు. స్వామియే సంకీర్తనము గావించును. ఇదియే సాధనకు పరమావధి. ఇట్లు భక్తి సాధనను, సిద్ధిని సులువైన సంస్కృత భాషా పదములలో తన అనుభూతితో రంగరించి రచించి అన్నమయ్య మన కాదర్శమూర్తియై తారక వలె శోభిల్లుచున్నాడు.

* * *

31

1వ సం-91

నాఁటికి నాఁడే

సామంతం

నాఁటికి నాఁడే నా చదువు
మాటలాడుచును మఱచేటి చదువు. ॥ పల్లవి ॥

ఎనయ నీతని నెఱుఁగుటకే పో
వెనకవారు చదివిన చదువు
మనసున నీతని మఱచుటకే పో
పనివడి యిప్పటి ప్రౌఢల చదువు. ॥ నాఁటికి ॥

తెలిసి యితనినే తెలియుటకే పో
తొలుతఁ గృతయుగాదుల చదువు
కలిగిన యీతనిఁ గాదననే పో
కలియుగంబులోఁ గలిగిన చదువు. ॥ నాఁటికి ॥

పరమని వేంకటపతిఁ గనుటకే పో
దొరలగు బ్రహ్మాదుల చదువు
సిరుల నితని మఱచెడికొరకే పో
విరసపు జీవుల విద్యల చదువు. ॥ నాఁటికి ॥

భూతకాలమునందు జీవించుట వ్యర్థము, భవిష్యత్తును గూర్చి యూహించుటయు వ్యర్థమే, ప్రస్తుతకాలములో నుండుట యోగ సాధనలో భాగము.

టీక

ఎనయన్ = కలిగించుటకు.

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య సూటిగా భగవంతుని తెలుపు చదువే చదువనియు, మిగిలిన చదువులు వ్యర్థములనియు చెప్పుచున్నాడు. పూర్వపు చదువులు భగవంతుని తెలుపునవి. ప్రస్తుత కాలపు చదువులు దేవుని మఱచునవని చెప్పుచున్నాడు. అన్నమయ్య కాలమునాటికే ఈ పరిస్థితి దాపురించినదని గ్రహింపవచ్చును. ఈనడుమ దాక చదువులు పొట్టకూటి చదువులు. ఇప్పుడు దానికి కూడ పనికిరానివి. కలియుగ ప్రభావమున, చదువులు అంతర్యామి సేవకు వినియోగపడకుండ పోవుచున్నవి. మరియు లౌకిక విజ్ఞానమెంత వచ్చినను, భగవంతుని తెలుపు చదువు లేకుండుటచే నైతికత, ధార్మికత లోపించుచున్నవి. ఆర్థిక, రాజకీయ, సాంఘిక వ్యవస్థలపైననే గాక, విద్యా విధానముపై కూడ అన్నమయ్యకు స్పష్టమయిన దృక్పథమున్నది. అన్నమయ్య స్పృశింపని అంశము లేదు.

పల్లవి యొక్క తాత్పర్యము

"ఇప్పటి చదువు ఏనాటికి ఆనాటికే పనికివచ్చునది. మాటలాడు చుండగనే మరపునకు వచ్చు చదువు **ఇది.**"

వ్యాఖ్య

అనగా ప్రస్తుతమున చదువు ఎప్పటికప్పటికే సరిపోవును. భవిష్యత్తుకు పనికిరాదు. ధార్మిక, ఆధ్యాత్మిక జీవనమునకు పనికిరాదు. లౌకికమయిన చదువు అయినను కొన్ని యేండ్లపాటు సమాజమును సేవించుటకు పనికిరావలెను. అట్టి సేవ వలన దానంతట అదియే జీవనోపాధి లభించును. ఇట్టివానికి భవిష్యత్తులో నా బ్రతుకెట్లు సాగునను భయముండదు. పని చేసి, దేవుని కర్పితము గావించువానికి భవిష్యత్తును గూర్చి భయముండదు. ఇప్పటి చాల చదువులు సమాజమునకు పనికివచ్చునది దేనినయినను ఉత్పత్తి చేయుటకు గాక, ఊరక డబ్బు సంపాదించుటే లక్ష్యముగా గలవి. కావున మరునాడు నాకెట్లు జరుగునను భయము మనను వెంటాడుచుండును. ప్రతి విద్యార్థి ఈ భయముతో నున్నాడు. పైగా ఆధునిక కాలమున విదేశీయుల పాలనలో బానిసగా బ్రతుకుచు వారికి ఊడిగము చేయుటకై చదువుట అలవాటయి నది. ఆతర్వాత కూడ స్వయంఉపాధిపై విశ్వాసము లేక, ఉపాధికై ఎవరినో యాచించుట ఏర్పడినది. పై అధికారులకు బానిసత్వము, క్రిందివారిపై పెత్తనము – ఇవియే ప్రస్తుతపు చదువులు నేర్పుచున్నది. పైగా ఈ చదువులలో సృజనాత్మకత లేదు. విద్యార్థులలో గల సృజనాత్మక ప్రతిభను, పరిశోధన ప్రజ్ఞను చంపి, ఊరక సమాచార మందించు చదువులు ప్రాచుర్యములో ఉన్నవి. ఉపాధ్యాయుడు చెప్పిన సమాచారమును, పాఠ్యగ్రంథములలోని అంశలను బట్టీపట్టి, గుర్తుంచుకొని పరీక్షలలో వ్రాయుటయే జరుగుచున్నది. ప్రస్తుత పరీక్షలు విద్యార్థి యొక్క జ్ఞాపకశక్తికి పరీక్షలే గాని, అతని ప్రతిభకు, ఆలోచనాశక్తికి కాదు. దర్శన జ్ఞానమునకు అసలు తావే లేదు. ఎంతసేపు

పాఠ్యాంశమును బట్టీ పట్టి పట్టి నేటి విద్యార్థి యౌవనముననే మతిమరపునకు గురియగుచున్నాడు. చదువు పేర అక్షరాస్యత అమ్మబడుచున్నది. మానవ ప్రతిభలోని సృజనాత్మకత; భగవంతుని నుండి, ప్రకృతిని గమనించుట నుండి జ్ఞానమందుట – దర్శన జ్ఞానము; అవగాహన శక్తి, ఇతరులకు అందించు శక్తి లోపించుచున్నవి. బట్టీపట్టుట అను ఒకే దిశగా చదువు సాగుచున్నది. దైవభక్తికి, శీల నిర్మాణమునకు అసలు తావే లేదు. ఇతరులతో మాట్లాడుచునే తాము చదివిన అంశములు మరపునకు వచ్చుచున్నవి. కారణము జ్ఞాపకము విషయము వరకే విద్యార్థి కృషి పరిమితమై, జ్ఞాపకశక్తికి పని ఎక్కువై తగ్గుచున్నది. ఒక యంత్రమును దాని శక్తికి మించి వాడినచో తొందరగా చెడిపోవును గదా. ఈ దినమున చదివిన చదువు, ఆ దినము వరకే జ్ఞప్తి, మరునాటికి మరపునకు వచ్చుచున్నది. ఇప్పటి చదువులను గూర్చి అన్నమయ్య ఊహించుట ఎంత చిత్రము! ప్రస్తుత విజ్ఞానశాస్త్రము భగవంతుని తెలియుటతో సంబంధము లేనిది. అపరిపూర్ణమైనది. రాజకీయ, ఆర్థికాది విషయ పరిజ్ఞానము అవాస్తవము. దేవుని మరచు చదువులో హాయి లేదు. కావున అదియు మరపునకు వచ్చును. చదువులో మర్మము భగవంతుని పొందించునదే అని ప్రహ్లాదుడు ఘంటాపథముగ చెప్పెను.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"వెనుకటివారు చదివిన చదువు భగవంతుని తెలియుటను పొందుటకే. ఇప్పటి నేర్పరుల చదువులు పనిగట్టుకొని దేవుని మరచుటకు ఉపయోగపడుచున్నవి."

వ్యాఖ్య

పూర్వకాలమున వృత్తుల విద్యలు ఉన్నవి. వీనితోబాటుగా ప్రధానముగా వేదములు, ఉపనిషత్తులు, గీత, రామాయణ భారత భాగవతాదులు. భగవంతుని గూర్చి; మనకు, ఆయనకు గల సంబంధమును గురించి, మనము భగవంతుని పొందు మార్గమును గురించి, వ్యక్తికి – భగవంతుని స్వరూపమయిన సమాజమునకు నడుమ సత్సంబంధములను గూర్చి; మానవునకు, మానవునకు నడుమ ప్రేమనుగూర్చి, ఆ ప్రేమ వ్యక్తికి పరిమితముగాక, అంతర్యామియగు దేవునికి సంబంధించినదై యుండుటను గూర్చి చదువు లుండెడివి. అక్షరాస్యత లేనివారు కూడ దేవుని గూర్చి చదువు మాత్రము గలవారు. దైవభక్తి, పరస్పర సహకారము, సద్గుణములు గలవారు. ఇప్పటికాలపు చదువులు ప్రయత్నపూర్వకముగా దేవుని మరచునవి. అక్షరాస్యతకే పెద్దపీట. భగవంతుని తెలియుటతో పనిలేదు. భక్తితోను, భగవదనుభూతితో పని లేదు. ఇక సమాజముతో సత్సంబంధములు, మానవుల నడుమ పరస్పర సహకార మెట్లుండును? దైవభక్తికి తావు లేనిచోట మానవత్వమునకును ఉండదు. దైవభక్తి యనగా సర్వమును దైవముగా ప్రేమించుట. ప్రేమ లేని మనిషి మనిషే కాడు. ఇట్లు మానవత్వమును చంపు చదువులు ప్రస్తుతము సాగుచున్నవి. భగవంతుని తెలియుట అనగా భగవంతుని అనుభూతి నొందుట. ఉత్తమ కక్ష్యలోని దివ్యానంద మును ప్రస్తుత విద్యార్థి లెఱుగరు. విషయభోగములే ఇప్పటి చదువులకు పరమావధి. ఎంత తెలివి, ఎంత

ఉన్నతములగు పట్టాలు సాధించినచో అంతగా దైవమును మరచుట గొప్పతనము క్రింద పరిగణింపబడుచున్నది. దైవభక్తికి సంబంధించిన చదువు చాదస్తముగా భావింపబడుచున్నది. వేదములు, రామాయణాదులు చదివినచో జీవనోపాధి జరుగదను భయము వ్యాప్తి చేయబడినది. ఇది అంతయు కలి ప్రభావము.

2వ చరణము యొక్క తాత్పర్యము

"మొదట కృతయుగాదులలో కావలయునని భగవంతునియం దాసక్తితో అతనిని తెలియుటకే చదువు నేర్చెడివారు. కలియుగములో తలక్రిందులైనది. భగవంతుని కాదను చదువు ఇపుడమలులో నున్నది."

వ్యాఖ్య

ప్రహ్లాదుడు భగవంతుని ప్రకటించు చదువే చదువని, భగవంతుని చెప్పెడి గురువే గురువని ధైర్యముగా సభలో పలికెను. తోటి విద్యార్థులకు గూడ భగవంతుని తెలుపు విద్య నేర్పెను. అపుడు రాజకుమారు డయినను, ప్రకృతికి దగ్గరగానున్న గురుకులములకు వెళ్లి పన్నెండేళ్లు భిక్షుకుడై గురువును సేవించి, అతని వద్ద బ్రహ్మవిద్యను అభ్యసించ వలసినదే. అసలు చదువు ప్రారంభమే ఉపనయనముతో. ఉపనయనమనగా సమీపమునకు తీసికొని వెళ్లుట. ఎవరి సమీపమునకు? గురువు యొక్క సమీపమునకని బాహ్యార్థము. ఎవరి వద్దకు తీసికొనివెళ్లవలయునో వాని వద్దకు. అనగా భగవంతుని వద్దకు చేర్చునది అని అసలయిన అర్థము. కావున సాధారణ విద్యలతో బాటుగా, భగవంతుని తెలియు విద్య, భగవదనుభూతి కల్గించు విద్య, భగవంతుని యునికిని సమస్తములో దర్శించి సేవించు విద్య, తానే భగవంతుని యందు కరగిపోవు విద్యలో శిక్షణ ఇచ్చుట జరిగెడిది. ఈ శిక్షణ పన్నెండేళ్లు అయిన పిమ్మట, ఒక యేడు దేశాటనము గావించుట ఏర్పాటు చేయబడినది. దేశమున గల జనుల స్థితిగతులను గ్రహించి, వారిలో అంతర్యామిని ఆచరణలో దర్శించి, వారితో సామరస్యమున మెలగుటకిది నిర్దేశింపబడినది. ఆపైననే వివాహము. అసలు భగవంతుని గూర్చిన చదువు తల్లివద్దనే ప్రారంభమయ్యెడిది. తల్లియే జోలపాటలతో, లాలిపాటలతో దైవభక్తిని పిల్లలకు నేర్పెడిది. మహాత్ములెల్లరు తల్లిదండ్రుల శిక్షణలో భగవద్భక్తి అలవడినవారే. ప్రస్తుత కాలమున తల్లిదండ్రులే తమ పిల్లలు లౌకికములయిన పెద్ద చదువులు చదివి, విదేశములకు వెళ్లి, ధనమును బాగుగా సంపాదింపవలయునని ఆశించుచున్నారు. మానవుని జీవితమున గొప్పతనము, మంచితనము అని రెండంశములు గలవు. తమ పిల్లలు వ్యక్తిగతముగా తెలివిలో, చదువులో, ధనములో, సామాజిక స్థితిలో గొప్పవారు కావలెనని తల్లిదండ్రుల ఉద్దేశ్యము. మంచివారు కావలెనని, తమ చదువును సమాజరూపములోని భగవంతుని సేవకై వినియోగించు భక్తులు కావలయునని వారు ఆశించుటలేదు. వారి పెంపకమును బట్టియే పిల్లలు తయారగుచున్నారు. తల్లిదండ్రుల నడవడియే వారికి గీటురాయి. వీరి పద్ధతిని బట్టియే వారి పద్ధతి. భగవంతుని పొందుటే జీవిత పరమావధిగా కృతయుగాదులలో చదువులు గలవు. మొదట తల్లిదండ్రులను, ఆచార్యుని, అతిథిని, దీనుని దేవుడుగా పూజించుట నేర్పబడినది.

ఉపనిషత్తులందిట్లు చెప్పబడినది. ఇపుడు తల్లిదండ్రులు పిల్లల గొప్పతనము నకై ప్రాకులాడుటలో, పిల్లల పరమావధి మారినది. తమ తల్లిదండ్రులను గౌరవించుటలేదు. అప్పుడు లబో, దిబో అని పెద్దలు ఏడ్చి లాభము లేదు. పిల్లలను అట్లు తయారు చేసినది తామేకదా. భగవంతుడు అంతర్యామి. పరమ ప్రేమ స్వరూపుడు. ఆనందస్వరూపుడు. ఆయనను గూర్చి జీవిత సాధన చేయు చదువులేని పిల్లలలో పోటీ పెరుగును. పోటీవలననే విద్య పెరుగునను తప్పుడు సామెత వాడుకలోనికి వచ్చినది. తన కుమారునకే మొదటి మార్కు రావలయునని తపించు తల్లిదండ్రులు పెరిగిరి. ఇట్టివారి శిక్షణలో పిల్లల నడుమ చదువులోను, ఆపై అన్ని రంగములలోను పోటీ పెరిగి వినాశనముకు దారితీయుచున్నది. ధృతరాష్ట్రుడిట్టివాడే. తన కుమారులకే రాజ్యము దక్కవలెనని, మొదటి నుండియు వారికి నూరిపోసెను. తమ్ముని కుమారుల రాజ్యముపై కుట్రపన్ని కాజేసెను. అతని పిల్లలు అతని దారినే ప్రయాణించిరి. చివరకు తనకు తోడుగా అతనికి ఒక్కడు కూడ మిగులలేదు. పైగా లక్షలమంది సామాన్య జనులు యుద్ధమున మరణించిరి. ధర్మమును గూర్చి, దేవుని గూర్చి ఆతడు తన పిల్లలకు నేర్పకుండుటయే చివరకు లోకవినాశనమునకే దారి తీసినది. అటువైపు పాండవులకు పసితనముననే తల్లిదండ్రులు ధర్మమును, ధర్మమే తానయిన కృష్ణునియందు శరణాగతిని, ప్రజలను బిడ్డలుగా ప్రేమించుటను నేర్పిరి. చిత్రమేమనగా కృష్ణుడు పుట్టకమునుపే ధర్మరాజుకు కృష్ణరూపమున భగవానుడున్నాడని తెలుపబడి, కృష్ణభక్తి అలవడినది. మఱియు శతశృంగ పర్వతమునందలి ఋషుల శిక్షణలో పాండవులు కృష్ణభక్తిని, ధర్మజీవనమును అలవరచుకొనిరి. శ్రీకృష్ణుని రక్షణలో జీవించిరి. వేదకాలమున కృతయుగమున గార్గి, మైత్రేయి మున్నగు స్త్రీలు కూడ వేదము నేర్చిరి. సీతాదేవియు గాయత్రి నుపాసించి, సంధ్యావందనము చేసినట్లు రామాయణమున గలదు. అందరి పిల్లలకు మంచి మార్కులు రావలెనను బుద్ధిని తల్లిదండ్రులు పిల్లలకు నేర్పవలెను. ప్రతిఫలాపేక్ష తోడి జీవనము, ఐహికమయిన ఉన్నతియే ఆశయముగా గల చదువు కలియుగములో ప్రాచుర్యములోనికి వచ్చినది. పోటీలు పెరిగినవి. సామరస్యము నశించుచున్నది. భగవంతుని తెలుపు చదువు లేకున్నచో ఐహిక భోగములందు ఆశ, చివరకు కామక్రోధ దుఃఖాదులు మిగిలి ఎంత చదువు వచ్చినను, ధనమున్నను, పదవి ఉన్నను బ్రతుకు నరకప్రాయమే. శాంతి లేదు, హాయి లేదు, ఒకరికొకరు లేరు. భగవంతుని తెలుపు చదువు నేర్చినచోగాని జీవిత పరమావధియగు బ్రహ్మానందము లభింపదు. తనయందు, అందరు జీవుల యందు ఒకే భగవంతుని చూచువాడే, ఇతరుల మేలు కూడ తమ మేలే అని గ్రహించి, ఆ పద్ధతిలో బ్రతుకు సాగింపగలడు. ప్రహ్లాదుడు గర్భస్థుడుగనే, నారదుని నుండి నారాయణోపాసనను గ్రహించెను. అడుగడుగున దైవచింతనా మాధుర్యమున దేహమును మఱచెను. ఏ పనిచేయుచునైనను, దైవార్పణ బుద్ధితో విశ్వమును చూడక, విశ్వమునే విష్ణుడుగా చూచెను. పెద్దల యెడల దాసుడై మ్రొక్కెను. ఈతని చూపులలో అన్యకాంతలే లేరు. అందరు తల్లులే. దీనులను తల్లిదండ్రుల వలె కాపాడెను. సఖులను సోదరులుగా భావించెను. గురువులను దైవముగా దలచెను. ఆటకోసమైనను అసత్య మాడలేదు. అందము, గొప్పవంశము, చదువు ఉన్నను గర్వము పొందలేదు. విషయ భోగానుభవమున కవకాశమున్నను వానియందు ఇతనికి ఆసక్తి లేదు. ఇతని వస్తు దృష్టి, వ్యక్తి దృష్టి లేవు. విష్ణుదృష్టియే గలదు. ఇతని జీవన విధానమిది. సర్వశాస్త్రములు

శోధించినను ఒక్కటే సారమయిన చదువని ప్రహ్లాదుడు చెప్పెను. భార్యాపుత్రాదుల యందు వ్యామోహముతో గూడిన సంసార సాగరమును సొంత తెలివితో దాటలేము. విష్ణుభక్తి అను నావ తోడుగా దాటుట యొక్కటే ఉపాయము. విష్ణుభక్తిని చదివి, దానితో జీవించిన వానికి సమస్యలుండవు. చిక్కులుండవు. భగవంతుని నుండియే ఈతనికి ఎప్పటికప్పుడు కర్తవ్యములు వెలుగువలె అందుచుండును. సొంత అభిప్రాయములు, రాగద్వేషము లుండవు. ఏ పరిస్థితిలో నయినను ఆనందమే. ఇప్పటి చదువులు చదివిన వారితో ఆనందము, శాంతి గానరావు. ఎంత ఎక్కువ చదువు చదివినచో అంతగా ఆందోళన, కంగారు, ఆరాటము, అభద్రత, ముందును గూర్చి భయము, తనను ఇంకొకరు మించెదరేమో అను అసూయ, కామక్రోధాదులు కలిగి, ముఖమున అశాంతి కొట్టవచ్చినట్లు కానవచ్చుచున్నది. అట్లని అన్నమయ్య విజ్ఞాన శాస్త్రమును చదువుటను నిరసించుట లేదు. భగవద్భక్తి అలవడినచో, ఈ చదువులు సార్థకములగును. సమాజమున కుపయోగపెట్టు సద్బుద్ధి కలుగును. తాను సుఖించి, నలుగురను సుఖపెట్టుట జరుగును. దైవభక్తి లేని చదువు వలన తనకు అశాంతి, నలుగురకు ఇబ్బంది కూర్చుట జరుగును. ఆరోగ్యమునిచ్చు వైద్యులలోను ఇట్టిదే స్థితి. పాలకులలోను ఇదే స్థితి. ఉపాధ్యాయులలోను ఇదే స్థితి. ముఖమున హాయిని సూచించు కళ యేది? భగవంతుని సంకీర్తన చేయు వారి ముఖమున నిరంతరము ఆనందము తాండవించుచుండును. కలియుగమున రగిలిన చదువు అనుటలో ఏర్పడిన చదువని ఒక యర్థము. ఈ చదువు, డబ్బు పొందుట ఆశయముగా గలది అని నిగూఢార్థము. కాని అసలు కలిగినవాడెవడు? శ్రీవేంకటేశ్వరుడే. సంపద కధిదేవత యగు లక్ష్మీదేవికి భర్త గదా. కావున స్వామియందు భక్తి ప్రపత్తులు గలవారికి దివ్యానందముతో బాటు, కావలసిన ఆర్థికమయిన ఉపాధి కూడ లభించునని అన్నమయ్య 'కలిగిన యీతని' అను పదమున తెలుపుచున్నాడు.

3వ చరణము యొక్క తాత్పర్యము

"లోకములకు ప్రభువులగు బ్రహ్మ, ఇంద్రుడు మున్నగు వారు కూడ సర్వశ్రేష్ఠమని వేంకటేశ్వరుని నిత్యము దర్శించుటకే చదువుచున్నారు. రసము లేక సారము, ఆనందము లేని జీవుల చదువులు ధనము కొఱకై ఏర్పడి, దేవుని మఱచుటకే ఉన్నవి."

వ్యాఖ్య

సృష్టికర్త యగు బ్రహ్మయు, దేవతల ప్రభువగు ఇంద్రుడును కూడ సర్వాంతర్యామి యగు వేంకటేశ్వరుని యందు భాగములే. భాగములు తమయందున్న అంతర్యామి యాజ్ఞలను బాటించుచు, ఆయనను సేవించువారే. ఉదాహరణకు ఒక జీవుని శరీరాంగములు అతని యాదేశమును పాటించును గదా. ఆయా పదవులందు బ్రహ్మాదులను పరమాత్మయే నియమించెను. కావున బ్రహ్మ తాను జగమును సృష్టించు చున్నానని భావింపకుండ తనలోను, సృష్టిలోను, తనచే సృష్టింపబడుచున్న జీవులలోను అంతర్యామిగా ఉన్న వేంకటపతినే సేవించుచున్నాడు. తనకు సృష్టిచేయు సంకల్పము, జ్ఞానము, శక్తి స్వామియే తనకిచ్చెనని

బ్రహ్మ యెఱిగి విష్ణునకు శరణంది యున్నాడు. ఇంద్రుడును మబ్బుల ద్వారా వర్షించుట అను సేవలో స్వామిచే నియమింపబడెను. మనలోను ఇంద్రియములను నడిపించువాడుగా నియమింపబడెను. ఇట్లు తనకు నియోగింపబడిన పని స్వామిసేవగా భావించుచున్నాడు. సమస్త దేవతలును ఇంతియే. ఈ భావన నుండి జారినచో పతనమగుదురు. చిక్కుల పాలగుదురు. వారట్లు జారి పడకుండ, స్వామినే నిరంతరము తలచు చదువును చదువుచున్నారు. ప్రకృతి ధర్మ విజ్ఞానమే వేదము. ఈ విజ్ఞానమును స్వామియే బ్రహ్మకిచ్చెను. కావున వేదముల నిచ్చెనని పురాణములలో కథగా చెప్పబడినది. ప్రకృతిలోని వివిధ పదార్థములకు వారి వారి ధర్మములను, ఆ ధర్మములతో కలిపి బ్రహ్మ వారిని సృష్టించును. ఉదాహరణకు మబ్బు వర్షించుట, సూర్యచంద్రులు వరుసగా వేడిమి, వెన్నెల ఇచ్చుట. ఈ ధర్మముల జ్ఞానమే వేదము. స్వామియే ఈ ధర్మజ్ఞానమగు వేదమును బ్రహ్మకిచ్చెను. అనగా ఇట్లు సృష్టింపవలెనని, ఇట్లు ప్రకృతి ధర్మములను ఏర్పాటు చేయవలెననియు బ్రహ్మకు అతని లోపల తానుండి తట్టించెను. ఈ విజ్ఞానమే సరస్వతి. సరస్వతిని బ్రహ్మ వద్దకు పంపినది విష్ణుడని భాగవతము చెప్పుచున్నది. ఎప్పుడయినను బ్రహ్మాదులకు స్వామి మరపునకు వచ్చి, తమ శక్తి గుర్తుకువచ్చినచో స్వామి, వారిపై దయతో గర్వభంగమును చేసిన సందర్భములు గలవు. మఱల వారు బుద్ధి తెచ్చుకొని, స్వామిని స్మరించుచుందురు. ఇట్లు జారిపడకుండ విష్ణువే సమస్తమను గుర్తుండు చదువు వారు చదువుచుందురు. శ్రీకృష్ణావతార గాథలో బ్రహ్మయు, ఇంద్రుడును స్వామిని వంచింపబోయి తామే మోహము పొంది, మరల శరణందిరి. బ్రహ్మ స్వామికి తలవంచి మ్రొక్కి యిట్లనెను. “వేదములందు గూడ ఊహింపలేని నిన్ను ఈ భూమిపైన, ఈ అడవిలో, ఈ ఆలమందలో తమ సమస్త భావములు నీయందే సమర్పించుకొన్న, చదువురాని ఈ గొల్లపిల్లలలో ఒక్కని పాదధూళి నా తలపైన చాలును. నాకీ బ్రహ్మ పదవి అక్కఱలేదు.” ఇంద్రుడు ఱాళ్ళవాన కురిపించగా, ఆరేండ్ల బాలకృష్ణుడు తన చిటికెనవ్రేలిపై పర్వతము నెత్తి గోకులవాసులను దాని క్రిందకు చేర్చి కాపాడెను. ఏడు దినముల తర్వాత ఇంద్రునకు బుద్ధి వచ్చి, స్వామికి మ్రొక్కెను. లీలాశుకుడను భక్తుడు ‘త్రిలోకాధిపతి’యగు ఇంద్రుని గర్వమును తొలగించినవాడని కృష్ణుని నుతించెను. బ్రహ్మాదులకే విష్ణుని స్మరణ మఱచినచో దిక్కులేనపుడు, మనమెంత? కాని ప్రస్తుతము చదువులు, విరసములయినవి.

సృష్టికి సారమైన స్వామిని తెలుపునవి గావు. కావున ఆనందమను రసానుభూతి వీరివలన గలుగదు. తలకు బరువు పెరుగును. వేదములు చదివినను మ్రొక్కుబడిగా చదువుటయేగాని, అందలి సారమగు విష్ణునియందు భక్తి గలిగియుండి, రసానుభూతి నందుటలేదని అన్నమయ్య ఆవేదన. ధనాసక్తితో చదువులు స్వామిని మఱపింపజేయు చున్నవి. వేదవిదులును వేదమును విష్ణుసేవకై గాక ధనమునకు అమ్ముకొనుటకై ఉపయోగించుచున్నారు. కావున వీరి జీవితమున ఆనందరసము దక్కుటలేదు. ధనము వచ్చినచో, ఇక స్వామి అసలు గుర్తే ఉండదు. చాలమంది ధనవంతులలో ధన మదమేగాని, స్వామి నామస్మరణ యందలి మాధుర్యము తెలియదు. ఇట్లు అన్నమయ్య కాలమున గూడ ఇతర దేశీయుల ప్రభావము వలనగాని, సనాతన ధర్మపోషకులగు మహారాజులు స్థిరముగా నిలబడక, సంఘమున అవ్యవస్థ ఏర్పడిగాని చదువులు

ధనము కొఱకై, పాడై ఉండవచ్చును. అన్నమయ్య వర్ణించిన చదువుల పరిస్థితి ఆధునిక కాలపు విద్యావిధానమున ఇంకను అధికముగా దెబ్బతిన్నది. అన్నమయ్య విద్యా విధానమును నిందించుట లేదు. ప్రజలు మోసపు చదువులలోబడి భగవంతుని మఱచి, నిజమైన శాంతిని, ఆనందమును కోల్పోయి, జీవితము వ్యర్థము చేసికొను చున్నారని ఆవేదన పొందుచున్నాడు. సరియైన విద్యావిధానమునకు దిశా నిర్దేశము చేయుచున్నాడు. ఈ ఋషి తపఃఫలితముగా, కొంతకాలమునకు ఈతడాశించిన విద్యావిధానము మఱల అమలులోనికి వచ్చునని ఆశింపవచ్చును. మనము దానివైపు ముందడుగు వేసెదముగాక. ఇంక కొద్దికాలములో సైన్సు, బ్రహ్మవిద్య ఒకే నాణెము నకు బొమ్మ, బొరుసుల వలె కలిసి చదువుకొను దినములు వచ్చును. భగవంతుని స్మరణ లేనిది, సైన్సు ఇక ముందుకు సాగని క్షణము వచ్చునని నవీన కాలములోని గొప్ప శాస్త్రవేత్త యగు ఐన్‌స్టీన్ మహాశయుడు జోస్యము చెప్పెను. ఇతనిని మిగిలిన శాస్త్రజ్ఞులు పిచ్చివాడనిరి. ఈ పిచ్చి ఎల్లరకెక్కు దినము వచ్చి తీరును. ఈ సంకీర్తనము చదువులను గూర్చి వట్టి వివరణ గాదు. ఇట్టి దివ్య విద్య వచ్చుటకై అన్నమయ్య ఈ సంకీర్తన రూపమున తపస్సు చేసెను, ఇది సంగీత సాహిత్యమయ తపము. ఇది ఫలించి తీరును. మహాభక్తులలో నుండి దేవుడే మంచి సంకల్పములు పుట్టించి ఫలింపజేయును.

* * *

32

3వ సం-320

నిండుమనసే

జౌళి

నిండుమనసే నీ పూజ
అండఁ గోరకుండు టదియు నీ పూజ. ॥ పల్లవి ॥

ఇందు హరి గలఁ డందు లేఁడనేటి
నిందకుఁ బాయుటే నీ పూజ
కొందరు చుట్టాలు కొందరు పగనే
అందదుకు మాను టదియే నీ పూజ. ॥ నిండు ॥

తిట్టులు గొన్నని దీవెనె గొంతని
నెట్టుకోనిదే నీపూజ
పెట్టిన బంగారుపెంకును నినుమును
అట్టే సరియనుటదియు నీ పూజ. ॥ నిండు ॥

సర్వము నీవని స్వతంత్రముడిగి
నిర్వహించుటే నీ పూజ
పర్వి శ్రీవేంకటపతి నీ దాసు ల
పూర్వమనియెడి బుద్ధి నీ పూజ. ॥ నిండు ॥

యోగాభ్యాసము చేసేవారికి అంతర్యామిని స్మరిస్తూ శరీరాన్ని వదిలిపెట్టుటయే గాని చనిపోవుట యుండదు. వీరు చిట్టచివరి వరకు అంతర్యామి యందు మేల్కొనియుంటూ, తెలివి తప్పరు.

టీక

నెట్టుకోనిదే = పట్టుకొననిదే, పర్వి = పరుగెత్తి, చుట్టు తిరిగి.

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య దేవుని పూజను నిర్వచించుచున్నాడు. పూజ యనగా పదునారు ఉపచారములతో దేవుని మూర్తిని వేదమంత్రముల విధానమున అర్చించుట యనియే. కాని మనసు నర్పింపకుండ దేవు నర్చించుట పూజ ఎట్లగును? పూజా విధానమునందు పూజకు వలసిన సామగ్రిని అమర్చుటయందు పెద్దలు ఒక శాస్త్రీయమైన విధానము నేర్పరచిరి. ఇది మనకు క్రమశిక్షణ నేర్పుట కొరకే. కాని కొందరు తమ మనస్సును దీనియందు పెట్టినంతగా దేవునియందు పెట్టరు. ఉదాహరణకు దీపమున ఎన్ని వత్తులు వేయవలెను, ఎటువైపు పెట్టవలెను, మడిబట్ట ధరించవలెనా, లేక ఉతికిన బట్ట సరిపోవునా, హారతిచ్చునపుడు మధ్యలో కర్పూర మారిపోయినచో ఆపద కలుగునేమో – ఇట్టి మీమాంసతోనే కొందరికి పూజ వెళ్ళిపోవును. పురుషసూక్త విధానమున దేవు నర్చించుట మంచిదా, వైఖానసాగమ విధానమున అర్చించుట మంచిదా – ఇట్టి చర్చలకిచ్చిన ప్రాధాన్యము భక్తిశ్రద్ధల కీయరు. ఒకవేళ భక్తితో దేవుని మూర్తి నర్చించినను, అతడంతర్యామి యని భావింపక పోవుట వలన తమ తమ ఇష్టదైవతములను గూర్చి వీరాభిమానములు గలిగి ఘర్షణలు చెలరేగును. అంతర్యామియని దేవుని భావించి అర్చించువాడు తన దినచర్యను, బ్రతుకునే పూజగా స్వామికి సమర్పించుకొనును. ఈ సాధనలో అర్చామూర్తిని పూజించుట యనునది సోపానముగా అతడు స్వీకరించును. పూజ, ప్రార్థన, జపము వంటివి దేవునితో మనకు అనుసంధానమును కూర్చు ప్రక్రియలు. అనగా రేడియో స్విచ్ ఆన్ చేయుట వంటివి. ఆపై నిత్యజీవితమును సమాజరూపుడైన అంతర్యామికి అర్చనముగా సమర్పించి ఆనందించుట రేడియోలోని కార్యక్రమమును వినోదించుట వంటిది. జీవితములో ఇతరులతో వ్యవహరించునపుడు మనము నెరపు సత్యము, అహింస, ఇంద్రియ విజయము, కరుణ మున్నగు సద్గుణములే స్వామికి సమర్పించు పుష్పములని పెద్దలు పేర్కొనిరి. ఏ పని చేసినను అది నీ యారాధన మగునట్లుగా నన్ను నడిపించుమని శంకరాచార్యులవారు స్వామిని వేడిరి. అన్నమయ్య ఈ సంకీర్తన మున వెల్లడించిన భావములు భగవద్గీతలోని పన్నెండవ అధ్యాయమున భగవానుడు పేర్కొనిన భక్తుని గుణములకు దగ్గఅగా నున్నవి. భక్తి యనగా ఉద్వేగముతో ఇష్ట దైవతమును గూర్చి కేకలు వేయుట గాదు. నిజమైన భక్తునకు తన ఇష్టదైవము సర్వాంతర్యామియైన వెలుగుగా దర్శన మిచ్చును. అట్టి భక్తుని లక్షణములను అన్నమయ్య తాను జీవించి, మన కిచట ఉద్బోధించినాడు. ఈ లక్షణములు కలిగి యుండుటే స్వామి పూజ యని యుద్ఘాటించుచున్నాడు. అన్నమయ్య చెప్పిన ఈ పూజ లేనివాడు మూర్తిపూజ లెంత చేసినను వ్యర్థమే. ఇక అన్నమయ్య బోధించిన పూజలను గ్రహింతముగాక! అతని ఉపదేశము నచ్చుటకు తగిన సంస్కారము కావలసియున్నది.

పల్లవి యొక్క తాత్పర్యము

"నిండుమనసే నీ పూజ. అండను కోరకుండుటయే నీ పూజ."

వ్యాఖ్య

నిండుమనసనగా నిర్మల మనస్సు. మరియు ఇంకొకటి మనస్సున స్థానము లేక స్వామి మాత్రమే స్థానముగానున్న మనస్సు. మనసంతయు స్వామితో నిండినపుడే అది పూజ యగును. ఉదాహరణకు కొందరు పూజ చేయుచుండగా ఇంటివాకిట ఆకలితో కేకలిడువానిని దేవునికింకను నివేదన పెట్టలేదను నెపమున ఈసడింతురు. ఆ వచ్చినవాడు దేవు డనియు, అతనికి పెట్టు ఆహారమే నివేదన మనియు భావించుటకు మనసొప్పదు. అట్లే పూజ మధ్యలో వీథిలో నొకడు మూర్ఛనొందగా అతని కుపచారములు చేసినచో తన మడి భంగమగును, దేవున కపచారమగును అని కొందరు భయము చెందెదరు. ఆ వచ్చినవాడు దేవుడనియు, ఆతని సేవయే అసలైన పూజ అనియు భావించుటకు కొందరికి మనసొప్పదు. ఇట్టి మనస్సు నిండుమనస్సు గాదు. ఇట్టివాడొకడు తన పై అధికారి వెంటనే రమ్మని ఒక దూతతో కబురుచేసినచో, పూజను మధ్యలో ఆపి వెడలిపోవును. తన పై అధికారిలో అంతర్యామి ఉన్నాడని అతడు బుకాయించును. ఆ అంతర్యామి ఆకలిగొన్నవాని యందు, మూర్ఛితుడైనవాని యందు, దీనుని యందు లేడా? 'నిండుమనసు' అనునది నిర్మలమైన, హృదయపూర్వకమయిన అచ్చమైన స్థితిని చక్కగా సూచించును. అనుభవించినవాడే ఇట్లు పదప్రయోగము చేయును. మర్మము లేని మనస్సు సాధకుడు భగవంతుని పొందుటకు మొదటి మెట్టు. తన పిల్లవానికి స్నానము చేయించి, భోజనము పెట్టునపుడు గల తల్లి మనసు నిండైనది. ఆ మనసుతో చేసినదే పూజ. ప్రేమ తప్ప ఇందులో నేను చేయుచున్నానను భావము నకు తావు లేదు. నిండుమనసుతో చేసినదే నీ పూజ అనుటకు బదులుగా నిండు మనసే నీ పూజ అనుచున్నాడు. స్వచ్ఛమైన, వేరు అభిప్రాయములు లేని మనసే దేవుని కర్పితమగు పూజాపుష్పము. ఆకు అయినను, పూవు అయినను, పండయినను, నీరైనను నిండుప్రేమతో అర్పించినచో 'నేను' ప్రీతితో స్వీకరింతునని గీతలో కృష్ణుడు చెప్పెను. గోపాలుర చల్దిఅన్నములు, గోపికల వెన్నముద్దలు, శబరి ఎంగిలిపండ్లు స్వామి కిష్టమైనంతగా నిండుమనసుతో చేయని పెద్ద యాగముల ప్రసాదములనబడు పురోడాశములు కూడ ఇష్టము గాదు. నాకు రక్షగా ఎవరున్నారు? అను ప్రశ్న భక్తునకు పుట్టదు. ఏ పరిస్థితిలోను ఇతనికి దేవుడే అండ, ఆశ్రయము. దేవుడు ధర్మస్వరూపుడు. ధర్మాచరణమున దేవుడు అండగా నిలుచును. భక్తుడు రాజులను, ధనవంతులను, అధికారులను ఐహికముగా ఎంత గొప్పవారయినను వారిని ఆశ్రయింపడు. అట్లని ఎవరిని దూషించుట, తక్కువగా చూచుట చేయడు. అతని దృష్టిలో పాలకులయినను, పాలితులయినను; ధనవంతు లయినను, ధనహీనులయినను భగవంతుని స్వరూపములే. కావున అంతర్యామి అయిన స్వామియే అండ అని భావించు భక్తునకు ఎటువైపు, ఏ ద్వారము నుండి దేవుడు అండగా కాపాడునో ఊహించుట సాధ్యముగాదు. ప్రత్యేకముగా ధనమునో, అధికారమునో, పాండిత్యమునో, కీర్తినో, కొందరు వ్యక్తులనో అండగా భావించిన వారు భంగపడక తప్పదు. అందరికి అండయగు స్వామియే అసలయిన అండ అని శరణందిన వానికి ఏవిధముగా రక్షణ లభించునో చెప్పలేము. గజేంద్రుడు తన బలమును, ద్రౌపది భీష్మ ద్రోణాదులను, తన తార్కిక ప్రశ్నను ఆశ్రయింపగా ఆపదల నుండి బయటపడలేదు. స్వామిని ఆశ్రయింపగనే రక్షణ లభించెను. ధర్మరాజు మహా మేధావి

అయినను శ్రీకృష్ణుని, ఆతడు నిర్దేశించిన ధర్మమార్గమునకు తన తెలివిని సమర్పించుకొని జీవించిన వాడగుటచే స్వామి అండ అతనికి సదా నిలిచెను. శ్రీకృష్ణుడు నిర్యాణము చెందిన తర్వాత గూడ అతనికి కృష్ణుడున్నాడు. ఒక అవతారమూర్తినో, సద్గురువునో వ్యక్తిగా భావించి ఆతనిని అండగా భావించినవాడు ఆ మూర్తి అదృశ్యుడు కాగానే కంగారుపడును. అట్లుగాక ఆ మూర్తి శాశ్వతమైన వెలుగనియు, ఆతడు నిర్దేశించిన మార్గమున నడిచినచో, ఆ వెలుగు యొక్క సాన్నిధ్యము తనకు సదా యుండునను విశ్వాసము గలవాడే భక్తుడు. తిరుమలలో నున్నవాడు మాత్రమే వేంకటేశ్వరస్వామి అనుకొన్నచో అన్నమయ్యకు స్వామి అండ లభించెడిదిగాదు. స్వామిని అంతర్యామిగా భావించి, స్వామి యొక్క బాటలో జీవించుట వలన ఆయన అండ అతనికి నిరతము నిలిచెను. ఇట్లు స్వామి సన్నిధియే అసలయిన అండ. స్వామిని గూడ ఆయన సాన్నిధ్యమునుగాక వేరొకదానిని కోరినచో అది అండ అయినట్లు కోరినవాని భావము. అది సరికాదు. స్వామి సేవయు, ఆయన సాన్నిధ్యపు తీపి తప్ప భక్తునికి వేరు కోరిక ఉండదు. అట్టిదియే పూజ. భక్తి యనగా ఉద్వేగము గాదు. దేవుని యందుండవలసినది భక్తి గాని, భయము గాదు. భయముతో పూజించుట పూజ గాదు.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"ఇచట హరి యున్నాడు. అచట లేడను దోషభావము లేకుండుటే పూజ. కొందరిని బంధువులనియు, కొందరిని పగవారనియు ఈ భావములందు అతుక్కొనుట మానుటయే దేవుని పూజ."

వ్యాఖ్య

తనకు నచ్చిన వస్తువుల యందు, విషయములందు, వ్యక్తుల యందు దేవుడున్నా డనియు, తనకు నచ్చనివారి యందు లేడనియు భావించుట దోషము. కొందరు తనకు ఇష్టమయిన వారిని దైవస్వరూపులుగా భావించుచు, తమకు ఇష్టులు కానివారిని దైవస్వరూపులు గానివారని భావింతురు. అది దోషము. భగవంతుడు సర్వాంతర్యామియే గాని కొన్నిచోట్ల ఉండుట, కొన్నిచోట్ల ఉండకపోవుట అని భావించుట మన లోపమే గాని, ఆ భావము సత్యము గాదు. హిరణ్యకశిపుడు ప్రహ్లాదునితో ఇట్లని గద్దించెను. "నాకంటె వేరొక ప్రభువు గలడా! నేను వెదకితిని. నారాయణుడు ఈ విశ్వములోన లేడు. మరి అతడెందురా? ఎక్కడ గలడు? ఏవిధముగా వర్తించును? నిన్ను, విష్ణుని కూడ చంపెదను." ఒకవైపు నారాయణుడు విశ్వమున లేడనుచు, అతనిని చంపెదనని గద్దించుచుండుట అతని లోని ఘర్షణను సూచించుచున్నది. అపుడు ప్రహ్లాదుడు "హరి పంచభూతములలో, ప్రకృతిలో, ఓంకారమున, అన్నిట ఈశుడు గలడని చెప్పుచు, వెదక పనిలేదని చెప్పెను. ఇందు గలడు, అందు లేడని సందేహము వలదు. స్వామి సర్వమునందు నిలిచియున్నాడు. ఎచటెచట వెదకిన, అచటచటనే గలడని" ఉద్ఘాటించెను. శ్రీహరి స్తంభమునందును గలడు. జడహృదయమున గూడ గలడు. ప్రశ్నించువాని రూపమునను గలడు. తాను పూజించు మూర్తియందే గాక, చేతనములు, నిశ్చేతనములు అను భేదము లేక, తనకు నచ్చుట, నచ్చకుండుట అను భేదము లేకుండ అన్నిట, అందరి యందును స్వామిని దర్శించుటే పూజ. పూజను

భక్తిశ్రద్ధలతో చేసినట్లుగనే, జగత్తులో అట్లే వ్యవహరించుట పూజ. తాను వాడు వస్తువులను నిర్లక్ష్యము చేయక, వృథా చేయక సద్వినియోగము చేయవలెను. ఏ ప్రదేశమైనను దేవాలయమని భావింపవలెను. మనకు నచ్చు అభిప్రాయములు గలవాడు, నచ్చని అభిప్రాయములు గలవాడును దేవుని లీలారూపములేయని దర్శింపవలెను. రెండవది సాధనలో అందుటకు సత్సాంగత్యము తప్పనిసరి. తన మతమును, తాను నమ్ము పేరు గల దేవుని నమ్మువారే దేవుని దయకు పాత్రులు, మిగిలినవారు పాపులని భావించుట దైవ ధర్మమునకు విరుద్ధము. ఏ పేరుతో పిలిచినను, ఏ రూపమున భావించినను ఒక్క వెలుగే యున్నది. విశ్వవ్యాపకమయిన వెలుగు లేనిచోటు లేదు. కావున ఆ వెలుగును విష్ణు దందురు. విష్ణువనగా వ్యక్తి గాదు. విశ్వమున వ్యాపించిన చైతన్యమగు వెలుగు. ఆ వెలుగే అర్చామూర్తిగను దర్శింపబడవలెను. ఇదియే అన్నమయ్య దర్శనము. ప్రహ్లాదుడు తనను చంప యత్నించిన హిరణ్యకశిపుని చంపి, తనను కాపాడుమని శ్రీహరిని వేడలేదు. తన తండ్రి యనిగదా అను భావముతో విడిచిపెట్టమనలేదు. దేవున కెట్టి సూచనయు చేయలేదు. దేవుని సంకల్పము గాక, తనకని వేరు సంకల్పము లేదు. ఇదియే పూజ. కొందరు తనకు చుట్టములు అని వారియందు బంధము పెంచుకొనుట, కొందరియందు పగను బూనుట అను భావములందు అంటుకొన కుందుటే పూజ. తనకు మేలు చేసిన వారు గాని, తాను ఇష్టపడిన వారు గాని, తనను పొగడువారు గాని దైవస్వరూపులుగా భావించుటలో వింతలేదు. కాని తనకు కీడు చేసిన వారని తాననుకొనిన వారు, తనకు నచ్చని అభిప్రాయములు, పనులు గలవారు, తనను అవమానించినవారు దైవస్వరూపులుగా దర్శనమిచ్చుట కావలయును. అదియే పూజ. మనము ప్రేమతో పెంచిన పిల్లలు కూడ, పెద్దవారయిన పిమ్మట తనకు నచ్చని పనులు చేసినచో వారు తమను గౌరవించలేదను కోపము తల్లిదండ్రులకు వచ్చు చుండును. అది ప్రేమ గాదు. పిల్లలను తమ పట్టుక్రింద నుంచవలెనను అతిశయమే దీనికి కారణము. పిల్లలను పెంచుటయు దేవుని పూజ అని భావించినచో ఈ ప్రమాదము రాదు. తమ కుటుంబ సభ్యులతో, సమాజ సభ్యులతో మెలగునపుడు రాగద్వేషములతో వర్తింపక దైవభావనతో, ప్రేమగా వర్తించుటే పూజ. అపుడే శాంతి, ఆనందము కలుగును. రాగద్వేషములతో వర్తించు వారికి సుఖదుఃఖముల ఆటుపోట్లు తప్పవు. మనకు పగవారు – శత్రువులు లేరు. ఫలానా వారియందు శత్రువులను భావము, పగ – ఇవియే మన శత్రువులు. తమకు పగయుండకపోవుటే పూజ. పగ వలన పగ అణగదనియు, పాము ఇంటిలో తిరుగు చున్న విధముగా పగ మనసులో నున్నచో భీతి నిలుచునని ధర్మరాజు తెలిపెను.

2వ చరణము యొక్క తాత్పర్యము

"తిట్టులు కొన్నియని, దీవెనలు కొన్నియని మనస్సులో పట్టు లేకుండుటే పూజ. ఒకచోట గల బంగారు పెంకును, ఇనుమును ఒకే విధముగా భావించుటే పూజ."

వ్యాఖ్య

శత్రు మిత్రులకు, మానావమానములకు, శీతోష్ణములకు, సుఖదుఃఖములకు, నిందా స్తుతులకు సమముగా నిలుచువాడే తన భక్తుడని గీతలో కృష్ణుడు చెప్పెను. తన చేతలచే, మాటలచే, తలంపులచే

ఎవరికిని ఉద్వేగము కలిగింపక, ఎవరి వలన తానుద్వేగపడక నిలుచువాడును, బంగారమును, మట్టిని సమముగా చూచువాడే తన భక్తుడనియు కృష్ణుడు చెప్పెను. భక్తుడు శత్రువులు, మిత్రులు అనుకొను వారియందు స్వామినే చూచును. అట్లే తనను అభిమానించు వారియందు, ఆ యభిమానము నందు, తనను అవమానించు వారియందును, ఆ యవమానము నందును భక్తుడు భగవంతునే అనుభవించును. కనుక అతనికి సుఖదుఃఖము లుండవు. నిందాస్తుతులను, వానిని ఆచరించు వారిని స్వామిగా చూచును. ఇట్లు వీని కంటుకొనకుండుటయే భక్తి యొక్క లక్షణము. ఇట్టివాడు నిత్యము హాయిగా నుండును. అతని కెప్పుడును ఆనందమే యుండును గావున, ఆనందమునకు వేరు కారణముండదు. అందువలన ద్వేషమునకు కారణముండదు. కోరదు గనుక కోరికయు నశించును. ఇక శోకముండదు. ఒక సన్నివేశము తనకు శుభమనియు, వేరొకటి అశుభమనియు భావించుట యుండదు. కనుక ఎప్పుడును వారి స్థితి ఆనందమే. ఏది లభించినను ఆతడు తృప్తినే అనుభవించును. ఇదియే పూజ. మంచివారనియు, చెడువారనియు ఇతడు వేరుగా చూడడు. వీరియందు దేవుని యునికినే గమనించును. మంచివారు, చెడువారు అనునవి మన యభిప్రాయములే గాని సత్యము లనుటకు వీలులేదు. ఒకవేళ ఒక సందర్భమున తప్పు చేసినను, అంతమాత్రమున అతడు చెడ్డవాడు గాడు. మంచిపనులు చేయుట, చెడుపనులు చేయుట ఉండును గాని, మంచివారని, చెడ్డవారని యుండదు. చెడు చేయుట మానసిక బలహీనత. దానివలన ఆతనికి మానసిక క్షోభ తప్పదు. ద్వేషించుట, తిట్టుటయు అంతియే. వీనిని చేయువారి యెడల చూపవలసినది దయ, సానుభూతి. వీరుకాక, లోకకంటకులై వేలాది జనులను హింసించువారు అరుదుగా నుందురు. వారిని శిక్షించుటకై, లోకమును రక్షించుట కొరకే దేవు డవతరించుచుండును. తనను దీవించువారిని వినయముతో గౌరవించుట సరియే. వారినుండి ఇతరుల మేలు కోరు మంచిగుణము మనము నేర్వవలయును. కాని మురిసిపోయి, దీవెనల కంటుకొన్నచో, అవి లభింపనపుడు శోకింపవలసి వచ్చును. మనలను పొగడువారి మాటలకు పొంగిపోరాదు. అపుడు నిందలకు క్రుంగవలసివచ్చును. మనలను పొగడినవారి మాటలలో నిజముగా మన మంచి గుణములున్నచో అవి స్వామివే, మనవి గావని గుర్తింపవలెను. మనము చేసితిమనుకొను మంచి పనులను ఇతరులు పొగడినచో, ఆ పనులు మనలోనుండి చేసినది స్వామి యని గ్రహింపవలయును. అట్లుగాక మనలనే పొగడుచున్నారని భావింపరాదు. ప్రతి ప్రశంసాపత్రము చాటున పతనమను పాముకాటు సిద్ధముగా నుండునని గౌతమబుద్ధుడు చెప్పెను. తనను తిట్టిన వారి తిట్లలో గూడ నిజముగా మన తప్పులను గూర్చి ప్రస్తావన యున్నచో, మన తప్పులను సరిదిద్దుకొనుమని దేవుడు వారిలోనుండి ఉపదేశించుచున్నాడని భావింపవలయును. మన తప్పులు లేకుండ, తిట్లు వచ్చినచో, వారిని ప్రేమింప వలెనని, వారి మాటలు దేవుని ఆటలనియు భావింపవలయునని స్వామి యుపదేశించుచున్నాడనమాట. ఇతరుల తప్పులను, నిందలను క్షమించుట గూడ ఒక స్థాయి వరకు మంచిదే. ఆపైన, సాధనలో అది తొలగవలెను. ఇతరులను క్షమించుటకు మన మెవరము? క్షమించుచుండుటలో ఇతరుల తప్పులను గుర్తించు స్వభావమున్నది. ఇది కలుషభావము. జారిపడవేయును. తప్పులు చేసినవారు, మనలను నిందించువారు, వారి నిందలు, తప్పులు దేవుని యునికితో నిండినవని

భావించుటే పూజ. రామాయణమున గుహుడు భరతుని సోదర హంతకుడని నిందించెను. ఆపై భరతుని మంచితనము గ్రహించి క్షమింపుమని వేడెను. భరతుడు "క్షమించుటకు నేనెవరు? నీవే నన్ను క్షమింపవలెను. మా అన్నగారు అడవులలో నుండగా నీవు ఆదరించితివి. నేనపుడు తాతగారి ఇంటిలో సుఖించు చుంటిని." భరతుని ఉదార హృదయమునకు మెచ్చి, గుహుడాతనితో "నీవంటివాడు నేలపై లేడు. నీవు ఆకాశము వలె నిర్మలుడవ"ని పలికెను. ఈ ప్రశంసకును భరతుడు పొంగిపోలేదు. నిందాస్తుతులలో పొంగిపోక, క్రుంగిపోక నిలుచువాని ప్రజ్ఞ స్థిరమై యుండును. దీనికి స్వామి సంస్మరణమే సాధనము. భక్తునకు బంగారము, ఇనుము, ఱాయి ఒక్కటియే. వానియన్నిటియందు నున్నది భగవంతుడే. ఇట్టివానికి ప్రత్యేకముగా బంగారముపై, ధనముపై ఆసక్తి యుండదు. భగవంతుడను అత్యంతము విలువయిన బంగారము తనలో వెలుగుచుండుటను దర్శించినవాడు, తన వెలుపల అదే వెలుగును దర్శించినవాడే భక్తుడని అన్నమయ్య ఒక సంకీర్తనమున తెలిపెను. ఇట్టి భక్తునకు దేవుడే బంగారము గాని, బంగారము బంగారమనిపించదు. స్త్రీపురుషాకర్షణను, ధనమునందు, బంగారమునందు ఆసక్తిని కోల్పోయినవాడే నిజమైన భక్తుడు. భగవంతుని సాన్నిధ్య మాధుర్యమునకు ఇచ్చిన విలువ, భక్తుడు దేనికిని ఈయడు. తనను తానే దేవుడు భక్తునకు సమర్పించుకొనును. ఇక ఐహికముగా కావలసినవి ఈయలేకుండునా? వీని నియ్యగలుగు దేవునికన్న, వీనిని విలువగలవానివిగా భావించుట అవివేకము. బంగారమనునది భుజించునది గాదు. దీనికి, ఆహార పానీయములకు, గృహమునకు వలయు సామగ్రికి గల విలువ లేదు. ఇది గ్రహించిన నిజమైన ఆర్థిక శాస్త్రవేత్త అన్నమయ్య. పాడిపంటలకన్న, ఇంటిసామగ్రికన్న వట్టి డబ్బుకు లేని విలువను కట్టబెట్టి దాని వెంబడి పడువాడు – ధనమునకు, బంగా రమునకు బానిసయైనవాడు తోటి మానవుల కపచారము చేయువాడే. శ్రీరామకృష్ణ పరమహంసగారి భక్తి వైరాగ్యములను పరీక్షించుటకై నరేంద్రుడు ఆయన దిండు క్రింద రూపాయ నాణెము నుంచెను. శ్రీరామకృష్ణులు 'తేలు కుట్టినట్లు' బాధపడిరి.

3వ చరణము యొక్క తాత్పర్యము

"ఓ వేంకటపతీ! అంతయు నీవని భావించి, స్వతంత్ర భావమును విడిచిపెట్టి, జీవించుటే నీ పూజ. నీవెంబడి భక్తితో పరుగులెత్తి నీ దాసులగుటయే అత్యంతము విలువయినది, అదియే జీవితములో అద్భుతమను బుద్ధియే నీ పూజ."

వ్యాఖ్య

తనదని ఏమియు లేక, తాను స్వామికి వశుడనని గుర్తింపవలెను. మనము శ్వాస, ఆకలి, దప్పిక, నిద్ర, గుండె పనిచేయుట, వేడిమి, వెలుగు, వెన్నెల, వాన, నీరు, సస్యములు – ఇట్టివాని విషయములో దేవునిపై ఆధారపడియున్నాము. మనము స్వతంత్రులము కాము. స్వామి యనెడి వీణలో తీగలము మాత్రమే. శ్వాస వలెనే మన తలంపులు, మాటలు, నిర్ణయములు, సంకల్పములు, పనులు స్వామియే మనలోనుండి చేయు స్థితికి మన మెదగవలెను. ఇందుకుగాను వీని నన్నిటిని స్వామికి సమర్పణ పొంద వలెను. తనను

తానే శరణు పొందవలెను. ఇదియే పరతంత్రత. భగవంతుని సంకల్పమును బట్టి నడువవలెను. మన సొంతమను భావమును దేనిని గూర్చియు నుండరాదు. భరతునిది పారతంత్ర్య భక్తి. రాముడు చెప్పినట్లుగా రాజ్యమునకు వెళ్లి, రామ పాదుకలను సింహాసనముపైనను, తన హృదయ సింహాసనము పైనను ఉంచి, ప్రజలను పాలించుట రామ పాదసేవగా చేసెను. ప్రజల సమస్యలను రాముని పాదుకలకు నివేదించెను. రాముని సంకల్పమును గ్రహించి, వాని ప్రకారము పాలించెను, జీవించెను. సేవాభక్తి గొప్పదే. కాని ఇందులో నేను సేవ చేయుచున్నా నను భావమునకు చోటున్నది. దీనితోబాటు 'తాను కర్తన'ను స్వతంత్ర భావమును విడిచినచో భక్తికి నిండుదనము చేకూరును. శ్వాస మనము పీల్చుటలేదు గదా. అట్లే సంకీర్తనములు, సద్భావములు, సత్కర్మలు గూడ మనము చేయుచున్నామనుట గాక, స్వామియే మనలోనుండి చేయు స్థితి రావలెను. ఇందు 'అహంకారము'నకు చోటులేదు గావున స్వామియే యుండును కాన ఆనందమే యుండును. విశిష్టాద్వైత మున ఇది ముఖ్యాంశము. "నేను చేయుచున్నాను, నేను చేసిన మంచిపనికి గుర్తింపు, ఫలితము మరల నన్ను చెందవలెను" అను భావములను త్యాగము చేయుటయే అసలయిన త్యాగముగా రామానుజులవారు తన శ్రీభాష్యమున పేర్కొనిరి. ఈ త్యాగము వలన విరామము లేని శాంతి లభించునని శ్రీకృష్ణుడు గీతలో పన్నెండవ అధ్యాయమున తెలిపెను. నేను పూజ చేయుచున్నానను భావము మిగిలియున్నప్పుడు మనసులో స్వామి యుండడు, ఇక పూజ ఉండదు. ఊరక శరీర భాగము లాడు చుండును. ఈ అతిశయ భావము వలన తన పూజకు ఇతరులు సహకరించుట లేదు అను కోపతాపములు, ఇన్నాళ్లుగా ఇంతగా పూజలు చేసినను దేవునకు దయ రాలేదు, కలసివచ్చుట లేదను దైన్యము, దైవ నింద మిగులును. ఇక పూజ ఎక్కడిది, శాంతి ఎక్కడిది? కొందరు మనస్సును బిగబట్టి పూజ చేయుదురు. పూజ పూర్తియగు నప్పటికి రక్తపీడనము, ఉద్వేగము వచ్చును. మనస్సును దేవునకు సమర్పణ పొంద వలెను, విడిచిపెట్టవలెనే గాని బిగపట్టరాదు. బిగపట్టు యత్నమున ఉద్వేగము, మనసు నిలకడగా కుదురుటలేదను దిగులు, రోగము ఏర్పడును. నిండుమనసుతో, పరమప్రేమతో దేవుని సర్వాంతర్యామిగా అనుభవించి సమర్పణ పొంది చేయు పూజయే పూజ. అపుడు దేవుడే పూజ చేసికొనును. కావున "నీ పూజ నీవే చేయించు కొనుమ"ని భక్తుడు దేవుని వేడును. భక్తుని బ్రతుకే పూజ. భగవంతుని దాస్యము లభించుట జీవితమున మహాభాగ్యము, అద్భుతమయిన అదృష్టమని అన్నమయ్య భక్తిపారవశ్యమున పలుకుచున్నాడు. ధనము, విజ్ఞానము, పదవి, కీర్తి లభించుటలో భాగ్యము లేదు. ఇవి సుఖము నీయజాలవు. సుఖభ్రాంతినే కలిగించును. సర్వ జీవుల రూపములలోని దేవునికి తాను దాసుడ నను వినయభావము, శరణాగతి భావమున్న యెడల పనులు చేయకుండ ఉండలేడు. అట్లని సొంత పనులని విడిగా నుండవు. తనకొరకు గాని, కుటుంబము కొరకు గాని, తోటివారి కొరకు గాని చేయు పనులన్నియు దేవుని పూజయే యగును. మొత్తము స్వామి అను దివ్యానుభూతి మరగిన వానికి ఇతరులకన్న గొప్పవాడనను అతిశయభావ ముండదు. అతిశయ మున్నచోట ఆనందముండదు. సృష్టి స్వరూపుడగు దేవుని యెడల దాస్యభావ మున్నచోట ఆనందముండును. ఆనందము కావలెనని ఎవడు కోరడు? కాని ఎండమావిలో నీటి కొరకై వెదకినట్లుగా, విషయభోగములందు, స్వాభిమానము నందు, అసూయ యందు, పగ సాధించుట యందు ఆనందము

కొరకై వెదకు చుందురు. ఈ యత్నము కౌరవులకు వలె వ్యర్థమగును. ఎన్ని జన్మలకయినను, ఎప్పటికయినను ఆనందస్వరూపుడును, సర్వ కారణకారణుడునగు శ్రీహరి పాదముల వద్దకు రాక తప్పదు. ఏ యొక్క వ్యక్తికిని మనము వేరుగా బానిసలము కారాదు. బానిసత్వము మరణము కన్న ఘోరము. వ్యక్తులకు బానిసలగుట భయము చేతనో, స్వప్రయోజనము కొరకో. సృష్టి మొత్తముగానున్న స్వామికి దాసులము కావలెను. అట్టి దాస్యమబ్బుట దైవానుగ్రహము, మహాభాగ్యము. ఎవరో మహాభక్తులు మనము దాసులము కావలయునని భావించుటలో నుండి దైవానుగ్రహము మనపైన వర్షించి, దాసుల మగుదుము. కొందరు ఆధునికులు "నా ఇష్టము వచ్చినట్లు చేసెదను, స్వేచ్ఛ కావలయున"ని భక్తుల మార్గమును తూలనాడుచున్నారు. కాని ఇట్టివారికి నిజముగా స్వేచ్ఛ యున్నదా? వీరు మనస్సు, ఇంద్రియముల యొక్క ఇచ్ఛ ప్రకారము నడచుచు, వానికి దాసులుగా బ్రతుకుచు శోకము పాలగుదురు. స్వేచ్ఛ యనగా మనలో ఆత్మగానున్న స్వామికి దాసులమై ఆయన ఇచ్ఛ ప్రకారము జీవించుటే. దేవునియందు మన స్వతంత్రతను విడిచి, ఆయనకు వశులగుట, దాసులగుటయే అసలయిన స్వేచ్ఛ. ఈ దాస్యముకన్న మించిన భాగ్యము లేదు. ఇది మన యూహ కందదు గావున అదృష్టము. ఇంతకు పూర్వము అనేక జన్మలలో కలుగలేదు కావున అపూర్వమను అర్థము వచ్చును. కాని ఈమాట ఆతని వినయమే. ఇవి అన్నమయ్య యొక్క మహోదాత్త భావములు. భక్తియోగసాధనా సారములు. అన్నమయ్య భావములు నచ్చవలెను. ఆపై అనుసరింపవలెను, ఆచరింపవలెను. ఆతడు పొందిన దాస్యము, భగవంతునికి వశమగు బుద్ధి పొందవలెను. ఆనందసాగరమున ఓలలాడ వలెను. ఇట్లు ఆ మహాపురుషుని ఆశీస్సులు మనకు లభించుగాక. మనము కూడ ఎవరి నయిన దీవించుచున్నామని భావించుచుందుము. అది పొరపాటు. ఆశీర్వదించు నది దేవుడు. మనము చేయవలసినది ఇతరులను కాపాడుమని దేవుని వేడుటయే. అన్నమయ్య దేవునికి, మనకు వాహిక. తాను హరిదాసుడై పొంగిపోవుచున్నాడు. కావున మనకొరకై దేవుని వేడుటయే ఆయన దీవెన. పూజ పేరుతో ఉద్వేగము కాని, సొంత తెలివిని ప్రదర్శించుట సరికాదని ఈ సంకీర్తనమందు అన్నమయ్య సందేశము. సముద్రపు కెరటముల వలె జీవిత సన్నివేశములలో ఎగసిపడుట గాక, సాగర మధ్యమునన్న శాంతస్థితిలో నుండవలయునని, అదియే పూజ యొక్క లక్షణమని అన్నమయ్య సందేశసారము.

* * *

33

6వ సం-74 **పలుకు తేనెలతల్లి** అభేరి

పలుకు తేనెలతల్లి పవళించెను
కలికితనము విభుని కలసినదిగాన. ॥ పల్లవి ॥

నిగనిగని మోముపై నెరులు గెలకుల చెదర
పగలైనదాక చెలి పవళించెను
తెగని పరిణతులతో తెల్లవారినదాక
జగదేకపతి మనసు జట్టిగొనెగాన. ॥ పలుకు ॥

కొంగు జారిన మెఱుగు గుబ్బలొలయగ తరుణి
బంగారు మేడపై పవళించెను
చెంగలువ కనుగొనల సింగారములు దొలక
అంగజగురునితోడ అలసినదిగాన. ॥ పలుకు ॥

మురిపెంపు నటనతో ముత్యాలమలగుపై
పరవశంబున తరుణి పవళించెను
తిరువేంకటాచలాధిపుని కౌగిటఁ గలసి
అరవిరై నునుచెమట నంటినదిగాన. ॥ పలుకు ॥

ఎక్కడో ఒకచోట సాధనలో కూర్చుండి రాగద్వేషాలు పోవాలంటే పోవు.
నిరంతరం మనం ప్రవర్తించే తీరులో ఇతరులతో నెరపే సంబంధ
బాంధవ్యాలలో అభ్యాసంతో రాగదేషాలను నశింప చేసుకోవాలి.

టీక

కలికితనము = హృదయము నాకర్షించు నేర్పు, నిగనిగని = నిగనిగ ప్రకాశించు, నెరులు = గిరిజాల జుట్టు, కెలకు = ప్రక్క, పరిణతి = పరిపాకము, జట్టిగొనెన్ = సరిపోను విధమును గైకొనెను, గుబ్బలు = స్తనములు, ఒలయ = ప్రకాశింపగా, చెంగలువ = ఎఱ్ఱకలువ, సింగారము= ఆకర్షించునట్టి అందము, తొలక = ఒలకు చుండగా, మలగు = పందిరిమంచము, అరవిరై = సగము విచ్చుకొన్నదై.

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య అలివేలుమంగమ్మ వేంకటేశ్వరస్వామితో కలసి పవళించిన తీరును మనోజ్ఞముగ సహజమైన రీతిలో, సొసగైన పదము లొలికించుచు రచించెను. ఇందు అతిశయోక్తులు లేవు. ప్రియుడైన భర్తతో, ప్రియురాలికి కలుగు పారవశ్యమును ఒక క్రమపద్ధతిలో హృద్యముగ చిత్రించెను. అయ్యవారితో గూడిన పవళింపునందు అమ్మవారియందు ఒలికిన సొగసులను తల్లియందు బిడ్డకు కలుగు ఆరాధనాభావముతో వర్ణించెను. అమ్మవారిని 'పలుకు తేనెలతల్లి' అని స్తుతించుట వేదకవుల కవితను పోలియున్నది. తేనెల వంటి పలుకు లన్నమయ్యవి కూడ. ఇతని పలుకు తేనెలలో అమ్మవారు, భగవంతునితో కలిసి దాగి పవళించియున్నది. ఇట్లు అన్నమయ్య సంకీర్తనములోని పలుకులు అమ్మవారు. అందలి ఆనందము నొలికించు భావము స్వామివారు. వీరిర్వురి కలయికయే అన్నమయ్య సంకీర్తనము. వేదము నందలి సరస్వతీ సూక్తమున మంచిభావము బ్రహ్మగను, తీయని పలుకు అతని భార్య యగు సరస్వతిగను వర్ణింపబడెను. వాల్మీకి రామాయణమున శబ్దబ్రహ్మ, వాల్మీకికి దర్శనమిచ్చి ఇట్లు సూచించినట్లు కలదు. "గిరులు, సరస్సు లున్నంత కాలము నీ రామాయణము నిలుచును." 'గిరు' లనగా కొండలే కాక వాక్కులనియు అర్థము. 'సరస్సు' లనగా రసముతో కూడిన భావములనియు అర్థము. బ్రహ్మదేవుని సూచన ఇట్లున్నది. "నీవు కంగారుపడ పనిలేదు. వ్రాయగల సామర్థ్యమున్నదా, లేదా యను శంకకు తావు లేదు. సీతామహాలక్ష్మియే నీ వాక్కుగా దిగివచ్చును. రామనారాయణుడే అందలి భావముగా దిగివచ్చును. సీతారాముల దాంపత్యమే నీ సాహిత్యము." ఈ సూచన అన్నమయ్యకును వర్తించును. భర్తయందు అనురాగము తోను, సంతతియైన జీవులపై వాత్సల్యముతోను ప్రకృతియై పలుకరించు అమ్మ అలివేలుమంగమ్మ. లక్ష్యమును బట్టి ఒకే ప్రేమను అనురాగముగను, వాత్సల్యము గను పేర్కొందురు. ఈమె ప్రేమ తేనె. కావున ఆ ప్రేమనుండి వెలువడు పలుకులు తేనె. తైత్తిరీయోపనిషత్తునందు ఇట్లున్నది "నాలుక ఎప్పుడును తేనెలూరుచుండవలెను." అమ్మ పలుకరింపు కన్న తియ్యనైన తేనె ఏమున్నది? అన్నమయ్య అమ్మ నిట్లు 'పలుకు తేనెలతల్లి' అనుటలో ప్రకృతి రూపమున జగన్మాత అతనిని పలుకరించినదని తెలియుచున్నది. అంతేగాక స్వయముగా అమ్మవారు అతనికి సాక్షాత్కరించి, తన తేనెపలుకులతో అతనిని తీయని లోకములకు గొనిపోయినదని తెలియుచున్నది. తన అనుభవములోనికి రానిది ఏదియు అన్నమయ్య పలుకడు. కాళిదాసు తన 'రఘువంశము'న మొట్టమొదటగా పార్వతీపరమేశ్వరులను గూర్చి ఇట్లు ప్రార్థించెను. "వాక్కు, అర్థముల వలె మీరు కలసియున్నారు. నానుండి వెలువడు రచనలలో వాక్కుగా, అర్థముగా మీరే దిగిరండు." భవభూతి తన కవిత్వమును పరమాత్మ యొక్క శోభ యనెను. వీరి సరసన స్థానము అన్నమయ్యది.

చైతన్యస్వరూపుడగు స్వామిని 'పురుషుడం'దురు. ఆయనలో దాగియున్న మాయా శక్తి వెలువడి సృష్టిని సంకల్పించును. ఈ మాయాశక్తి మూడు గుణములతో కూడిన ప్రకృతి యని భాగవతము తెలుపుచున్నది. పురుషుడు ప్రకృతితో క్రీడించుట వలన సృష్టి ఏర్పడుచున్నది. వీరిరువురి దాంపత్యక్రీడ అన్నమయ్య యొక్క ఈ సంకీర్తన రూపమున వెలసినది. ఈ క్రీడ ఈ సంకీర్తనమున తీయని సాహిత్యరూప మెత్తినది. అమ్మవారు ప్రతి జీవియందు మూలాధారమున కుండలినీశక్తిగా నున్నది. ఈమె జీవుని ప్రజ్ఞను సహస్రారము నందలి ఆనందమయుడగు స్వామి వద్దకు చేర్చును. స్వామిలో ఆమె లయించి ఒకటై విహరించునని ఆదిశంకరులు వర్ణించిరి. అపుడు జీవుని ప్రజ్ఞ అంతర్యామి ప్రజ్ఞ యగు భగవంతుని యందు లీనమగును. జీవుని స్వభావమగు పరిమిత ప్రేమ, భగవంతుని స్వభావమగు పరమప్రేమగా వికసించును. ఆ పరమప్రేమయే అమ్మవారు. ఇట్లు జీవుని దేవునిగా తీర్చు తల్లి ఆమె. స్వామితో కూడిన ఆమె పవళింపును వర్ణించిన ఈ సంకీర్తనమును శ్రద్ధాభక్తులతో పాడువానికిని, వినువానికిని పైన చెప్పబడిన స్థితిని అమ్మ ప్రసాదించును. వారి పలుకులలో గూడ అమ్మ తేనెయై దిగివచ్చును. స్వామి భావమై శయనించును. ఇతడే అన్నమయ్య అగును. ఎల్లరిట్లగుటయే అన్నమయ్య లక్ష్యము.

పల్లవి యొక్క తాత్పర్యము

"తేనెల వంటి పలుకులు గల తల్లి యగు అలివేలుమంగ, భర్త యగు వేంకటేశ్వరుని హృదయము నాకర్షించు నేర్పుతో ఆయనను కలసినదిగాన, ఆయన పవళించిన శయ్యపైననే ఈమె గూడ పవళించెను."

వ్యాఖ్య

మొదటి పాదములోని భావమునకు హేతువును అన్నమయ్య రెండవ పాదమున చెప్పెను. స్వామి జీవుల వలె ఎట్టి ఆకర్షణకు లొంగడు. మాయకతీతుడు. కాని మంగాదేవి ఆయన హృదయమును గూడ తనవైపు ఆకర్షింప నేర్పు కలది. అట్టి ఈమె నేర్పుకు ముగ్ధుడై స్వామి ఏకశయ్యపై ఈమెతో కలియక తప్పలేదు. తేనెలొలుకు తన పలుకులతో అమ్మవారు స్వామి నాకర్షించినదని అన్నమయ్య వర్ణించుచున్నాడు. భార్య యొక్క అందముకన్న ఆమె పలుకులలోని తేనెయే భర్తను చక్కగా ఆకర్షించునను జీవన వాస్తవమును అన్నమయ్య వ్యక్తము చేసెను. భర్తతో కలసిన మంగాంబిక ఇంకను ఆయన శయ్యను విడువక అచటనే పరుండియుండెను. భగవంతుడు మాయ కతీతుడైనను సృష్టి జరుగుటకు ఆమెతో కలియుట తప్పదు. మాయ లేకున్నచో భగవంతుడొక్కడే యుండును, సృష్టి యుండదు. సృష్టి కొరకై ఆయన మాయతో కలియును. ఆమె ఆకర్షణకు లొంగును. ఆమె ఎవరో కాదు, తననుండి వెలువడిన తన ప్రేమయే, తన శక్తియే, తన సంకల్పమే. స్వామి మాయతో క్రీడించుట సరసుడైన భర్త తన భార్య కాపురమునకు వచ్చిన దినములలో ఆమె కోరికలను నెరవేర్చుట వంటిది. ప్రకృతి, పురుషుల కలయికతో సృష్టి వచ్చినది. ఇది చాలదు. సృష్టి ముందుకు సాగవలెను. అందులకే అమ్మవారు స్వామి యొక్క మంచముపై పవళించుట కొనసాగిన దని అన్నమయ్య అభివర్ణించెను. అట్లే జీవుని ఆధ్యాత్మిక ప్రయాణమునందు కూడ తన ప్రజ్ఞ భగవంతునందు

కలసిన చాలదు. ఈ ఆనందానుభవము పరమప్రేమగా తన నిజజీవితమున తోటిజీవుల యెడ వ్యక్తము కావలెను. తానొక్కడే ధ్యానమున ఉట్టి గట్టుకొని ఊరేగుట చాలదు. నిజజీవితమే సంకీర్తనము గావలెను. దీనినే అమ్మవారు, స్వామిని కలసిన తరువాత కూడ ఆయన శయ్యపైననే పవళించి యుండుటగా అన్నమయ్య సంకేతించెను.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"జగత్తు మొత్తమునకు తానొక్కడే పాలకుడగు స్వామి మనస్సుకు సరిపోయే రీతిలో వర్తించెను. స్వామితోడి కలయికల వలన కలిగిన ఆనందము పరిపాకము నింకను చెందకుండుటచే, తెల్లవారిన వరకు ఆమె స్వామి మనస్సున కనుగుణముగ వర్తించుచు ఆయన నాకర్షించుట మానలేదు. ఈ కారణముగ పగలు వచ్చువరకు గూడ స్వామి యొక్క ప్రియురాలైన అమ్మవారు పవళించెను. అపుడు నిగనిగ ప్రకాశించు ఆమె ముఖముపై ఆమె యొక్క గిరిజాల జుట్టు ఒక ప్రక్కకు చెదరిపోయినది."

వ్యాఖ్య

ఈ చరణమున అన్నమయ్య నాల్గవ పాదము నుండి మొదటి పాదము వరకు భావలోకమున ప్రయాణించెను. భగవంతుని తోడి కలయిక వలన కలిగిన ఆనందము నెడల అమ్మవారికి తృప్తి కలుగలేదు. స్వామి మనస్సున కనుగుణముగ ఈమె ప్రవర్తించుచు ఆకర్షింపసాగినది. ఆమె మోము నిగనిగ మెరయుచుండెను. ఆమె యొక్క గిరిజాల జుట్టు ప్రక్కకు చెదరుచుండెను. జీవులకు పరిణామమున మొదటిలో అంతర్యామి యందు మెలకువ కలుగక, జగత్తులోని వివిధ వస్తు విషయ వ్యక్తులందే కలుగుచుండును. దానితో రాగద్వేషములు, సుఖదుఃఖములు, ఆటుపోట్లు తప్పవు. వీరు అందరి రూపములలో నున్న స్వామియందు నిదురించుచుందురు. వీరికి స్వామి యందు మెలకువ వచ్చుటయే పగలు వచ్చుటగా అన్నమయ్య సంకేతించెను. జీవులకు అంతర్యామి యందు మెలకువ కలిగించుట కొరకై జగన్మాత కృషి చేయుచుండును. స్వామి యొక్క అనుగ్రహమును తాను స్వీకరించి, జీవులపై వర్షించుచుండును. దీనినే అమ్మవారు స్వామి శయ్యపై పవళించుటను కొనసాగించుటగా అన్నమయ్య అభివర్ణించెను. వర్షించునవి మబ్బులు. అమ్మవారి యొక్క దయావర్షమును కురియు మబ్బులు ఆమె శిరస్సుపై నుండు కేశపాశములు. అమ్మవారి ముఖము నిగనిగ మెఱయుచుండును. 'నిగనిగ' అను పదము తెలుగులో సొబగైనది. కురులు మబ్బులు కాగా, 'నిగనిగ' మెఱపులు. ఇది వేద భావము.

2వ చరణము యొక్క తాత్పర్యము

"ఎఱ్ఱ కలువవంటి తన కనుల చివరలందు స్వామి నాకర్షించునట్టి అందము లొలుకుచుండగా అలమేలుమంగ స్వామితోడి కలయిక వలన అలసినది. కావున యువతియగు ఆమె బంగారు మేడపై పవళించెను. అపుడు కొంగు జారగా మెఱయు చున్న ఆమె వక్షోజములు ప్రకాశించుచున్నవి."

వ్యాఖ్య

'సింగారమ'ను పదము సింగారమైన పదము. అంగజుడనగా శరీరము నుండి పుట్టు ఆకర్షణకు అధిదేవతయైన మన్మథుడు. అంగజగురు డనగా మన్మథుని తండ్రి యగు వేంకటేశ్వరస్వామి. స్వామితో గూడి అలసినది గావున మంగాదేవికి నిద్ర చాలలేదు. కావున ఆమె కనులు ఎఱ్ఱగలువల వలె నైనవి. సాధారణముగా నిద్ర చాలని వారి కండ్లలో కాంతి, ఉత్సాహము ఉండవు. కాని అమ్మవారి కనుకొనలలో స్వామి నాకర్షించు సొబగులు ఒలుకుచుండెను. అలసిన తరువాత నిద్రపట్టి, ఆ నిద్రలో కొంగు జారినది. ఆమె వక్షోజములు తేజస్సుతో మెఱయుచుండెను. ఈ స్థితిలో ఆమె బంగారు మేడపై పవళించెను. అన్నమయ్య స్వామిని మన్మథుని తండ్రి యనెను. మన్మథుని అందము శరీరమునకు సంబంధించినది. అతని తండ్రియగు స్వామి అందము దివ్యమైనది. ఇది ఆత్మ సంబంధమైనది. అమ్మవారు శక్తి, స్వామి ఆత్మ. వీరి కలయికయే సృష్టి యొక్క నడక. స్వామి యొక్క ఒక కన్ను చంద్రుడు గదా. అతని నుండి వెలువడు వెన్నెలకు అమ్మవారి కనులు ఎఱ్ఱకలువ లైనవని విశేషార్థము. అమ్మవారి పాలిండ్లను గూడ వేదర్షులు సూర్యచంద్రులుగా అభివర్ణించిరి. ఈ వేదభావమునే అన్నమయ్య కూడ అనుభూతినొంది, వానిని మెఱుగుగుబ్బ లనెను. మెఱయుట సూర్యచంద్రుల స్వభావము గదా. అమ్మవారిని 'తరుణి' యని అన్నమయ్య వర్ణించెను. సృష్టికి మొదలుగా నుండిన అమ్మవారు యువతి ఎట్లగును? పదార్థములో మార్పులుండును గాని, ప్రేమస్వరూపిణి యగు శక్తికి మార్పుండదు. అమ్మవారు దివ్యప్రేమస్వరూపిణి, అనంతశక్తియు గావున నిత్యయువతి. సూర్యోదయ కాలమున బంగారు కాంతులు ప్రసరింపబడుచుండును. ఇవి భౌతికములు గావు. సూర్యుని యందు దాగియున్న శక్తి అమ్మవారే. కావుననే ఈమెను సౌరశక్తి యనియు, సూర్య లక్ష్మియు నందురు. సూర్యుని యందున్న ఆత్మచైతన్యము స్వామి. ఇట్లు అమ్మవారు, స్వామివారు ఉదయకాలమున మెఱయుచున్న బంగరుకాంతుల సమూహమను మేడపై పవళించియున్నారు. ఇట్టి విశిష్ట పదప్రయోగము వేదములందును, విష్ణు సహస్ర నామములందును గలదు. శయనించుట యనగా పైన కనపడువానిలో కనపడకుండ దాగియుండుట అని వేదార్థము.

3వ చరణము యొక్క తాత్పర్యము

"శ్రీవేంకటాద్రీశ్వరుని కౌగిట అమ్మవారు కలసిపోయినది. ఆ సందర్భమున నునుపైన చెమట స్వామివారి చర్మముపై మెఱసెను. ఆ చెమట అమ్మవారి కంటినది. అమ్మవారింకను పూర్తిగా మేల్కాంచలేదు. సగము మూతపడినవగు కన్నులు సగము తెరచియే యుండెను. అమ్మవారు అరవిచ్చిన పూవువలె నుండెను. కావున ఆ యువతి పారవశ్యమున ముత్యాల పందిరిమంచముపై పవళించెను. పవళించునపుడు మురిపెముగా నటించెను."

వ్యాఖ్య

కౌగిలి సందర్భమున ఉత్సాహమున మగవానికి చెమట పట్టుట సహజము. స్వామి చెమట అధికమైనది గాదు. నునుపైనది, అచ్చుటచ్చుట గలది, సుకుమార మయినది. స్వామి కౌగిట కలియుట వలన అమ్మవారికీ

చెమట అంటినది. సూర్యోదయము కానున్నపుడు గూడ ఆమె కింకను పూర్తిగా మెలకువ రాలేదు. సగము విచ్చిన పూవు వలె నుండెను. కనులు కొంత మూతపడియుండెను, కొంత తెరవబడియుండెను. స్వామియందలి పారవశ్యముతో ఆమె పవళించెను. పవళించుటకు ముందు మురిపెముగా నటించెను. అనగా లేని భావమును నటించెనని యర్థము గాదు. మురిపెముతో వర్తించెనని మాత్రమే అర్థము. భర్త యొక్క సరసము నెడల ఈమె నెరపిన స్పందన, ఈగారము. స్వామి విరాడ్విగ్రహము యొక్క చర్మము స్పర్శ జ్ఞానమునకు ఆధారమని భాగవతము ద్వితీయ స్కంధమున చెప్పబడినది. స్వామి చర్మము వాయువనియు చెప్పబడినది. వాయువు నుండి 'నునుపు' అనగా మెఱపు తోడి 'అగ్ని', చెమట అనగా జలములు పుట్టినవని అన్నమయ్య సంకేతించెను. స్వామి యొక్క కౌగిలిలో ఇవియన్నియు ప్రకృతి కంటెను. 'కౌగిలి' యనగా సృష్టిలో దాగిన పరాశక్తి యగు అమ్మవారు, ఆత్మ యగు స్వామియందు కలసి ఆనందించుట. ఈ యానందమున తాను కొంత విచ్చుకొనలేదు. అనగా స్వామియందే పారవశ్యము నందియున్నది. కొంత విచ్చుకొన్నది. అనగా సృష్టి చేయుటకు ఉన్ముఖమగుచున్నది. జగత్తును, జీవులను సృష్టించునది ప్రకృతి యగు అమ్మవారే. కాని యా పని చేయు చున్నపుడు ఆమె తన స్వామిని మరవలేదు. అదే సమయమున స్వామియందు ఆనందపారవశ్యము నొందియున్నది. అమ్మవారి ఈ ప్రవర్తన మన కాదర్శము. మనము చేయవలసిన పనులను చేయుచునే అంతర్యామిని భావించుచు ఆనందములో మునుగవలెను. బంగారము సూర్యోదయ కాంతికి, ముత్యము చంద్రుని వెన్నెలకు ప్రతీకలని జ్యోతిశ్శాస్త్రము చెప్పుచున్నది. ముత్యాల పందిరిమంచ మనగా ఇచట విరగాయుచున్న చంద్రుని వెన్నెల. ఇట్లు అమ్మవారు ఉదయసూర్యుని యందును, పున్నమి చంద్రుని యందును ప్రేమగా, శక్తిగా దాగియున్నదను వేదభావమును అన్నమయ్య తన సంకీర్తనలో పరోక్షముగా తెలిపెను. సీతాదేవిని, పున్నమి చంద్రుని వెన్నెలలో దాగిన శక్తిగా హనుమంతుడు దర్శించినట్లు సుందరకాండమున గలదు. సూర్యకాంతియు, చంద్రుని వెన్నెలయు అమ్మవారికి తన బిడ్డలకు జీవులపై గల వాత్సల్య ప్రవాహములు. అన్నమయ్య ఈ సంకీర్తనమున ఒక శాస్త్రవేత్తగా, వేదర్షిగా, మహాభక్తుడుగా, ప్రేమమూర్తిగా సరస సాహితీస్రష్ట యగు కవీశ్వరుడుగా దర్శన మిచ్చుచున్నాడు. సూర్యచంద్రులకు, ప్రకృతికి లేని వివక్ష మనము నెరపరాదనియు, వాని ధర్మమైన ప్రేమనే నెరపవలెననియు అన్నమయ్య ఉపదేశము. అట్టిచో మనకును స్వామి కౌగిలియను అఖండానందానుభూతి సిద్ధించును. పలుకు – పవళించు, కలికితనముల – కలిసినది, నిగనిగని – నెరులు, పగలైన – పవళించెను, తెగని – తెల్లవారిన, జగదేకపతి – జట్టిగొనె, కొంగు – గుబ్బ, బంగారు – పవళించెను, చెంగలువ – సింగారములు, అంగజగురుని – అలసినది, మురిపెంపు – ముత్యాల, పరవశంబున – పవళించెను అను పదముల జంటలో అన్నమయ్య అనుప్రాసతో గూడిన లయను ప్రయోగించి, గానమాధుర్యమును గూడ సాధించెను. సరస్వతీదేవి యొక్క రెండు పాలిండ్లు గదా సంగీత సాహిత్యములు. ఈ రెంటి సరస సమ్మేళనమీ సంకీర్తనమున గలదు.

* * *

34

1వ సం-457 **పట్టినదెల్లా** లలిత

పట్టినదెల్లా బ్రహ్మము
దట్టపు జడునికి దైవంబేలా. ॥ పల్లవి ॥

ఘనయాచకునకు కనకమే బ్రహ్మము
తనువే బ్రహ్మము తరువలికి
ఎనయఁ గాముకున కింతులే బ్రహ్మము
తనలో వెలిఁగేటి తత్త్వంబేలా. ॥ పట్టిన ॥

ఆఁకటివానికి నన్నమే బ్రహ్మము
లోకమే బ్రహ్మము లోలునికి
కైకొని కర్మికి కాలమే బ్రహ్మము
శ్రీకాంతునిపైఁ జింతది యేలా. ॥ పట్టిన ॥

భువి సంసారికి పుత్రులె బ్రహ్మము
నవ మిందరి కిది నడచేది
ఇవలను శ్రీవేంకటేశుదాసులకు
భవ మతని కృపే బ్రహ్మము. ॥ పట్టిన ॥

'మన కుటుంబములోనివారు మన అభ్యాసానికి అడ్డు'
అనుకొనేవారు యోగాభ్యాసానికి పనికిరారు. తన అభ్యాసము
కోసమే అలాంటి పరిస్థితులు దేవుడు కూర్చాడు.

టీక

తరువలి = బలవంతపెట్టువాడు, ఎనయన్ = తటస్థించు, తత్త్వము= సారము.

పరిచయము

అన్నమయ్య ఈ సంకీర్తనలో తన కాలమునాటి సమాజమున గల చాలమంది యొక్క మనస్తత్త్వమును, వర్తనమును గమనించి వారికి గల ఐహిక లాలసతకు, దైవము నెడ విముఖతకు ఆవేదన చెందుచున్నాడు. మానవులకు కావలసినది ఆనందమే. ఎల్లరును కోరున దదియే. జీవితమనగా ఆనందమును వెదకుటయే. కాని ఎండమావిలో నీరున్నదని పొరపడు వానివలె, ఐహిక విషయములందు ఆనంద మున్నదని పొరపడుచున్నాడు. మంచినీటి కొలను వంటివాడు ఆనంద స్వరూపుడయిన భగవంతుడని గ్రహింపలేకున్నాడు. ఇట్టిదే ఆవేదనను కులశేఖరాళ్వారు తన ముకుందమాలలో ప్రకటించెను. భగవన్నామములను సంకీర్తనము చేయుటకు చేతనై కూడ, మానవులు భోగాసక్తితో దుఃఖముల వైపే పరుగిడుచున్నారని అతడు ఆవేదన చెందెను. ఈ సంకీర్తనలో అన్నమయ్యది కూడ సమకాలీన మానవుల స్థితిని గూర్చి ఆవేదనయే గాని నింద గాదు.

పల్లవి యొక్క తాత్పర్యము

"మానవుడు తన మనస్సు ఐహిక జగత్తులో దేనియందు గట్టిగా పట్టుకొనునో అనగా అంటుకొనునే దానినే బ్రహ్మము అనగా దేవుడుగా అత్యంత ప్రాముఖ్య మొసగి పొరపడుచున్నాడు. దట్టమయిన మందబుద్ధి గల వానికి సర్వాంతర్యామి అయిన దైవముపై దృష్టి లేదు."

వ్యాఖ్య

దేవుడు ఈ అన్ని రూపములు తానయినవాడు. ఐహిక భోగములు కూడ దేవుని లీలారూపములే కాని మానవుడు వీటన్నిటియందు అంతర్యామిగా నున్న స్వామిని చూడక, ఈ వస్తు విషయములనే చూచుచు ఇవియే ఆనందము నిచ్చునని పొరపడు చున్నాడు. జడు డనగా జగమంతట వెలుగుచున్న దేవుని యందు మేలుకొననివాడు. ఈ జడత్వము దట్టముగా క్రమ్ముకొనిన వారియందలి మందబుద్ధిని తొలగించువాడు స్వామియే. మనము చేయవలసినది స్వామికి శరణాగతి యని భాగవతము చెప్పు చున్నది. ఈ జడునకు కామము, ధనము, అధికారము, పాండిత్యము, కీర్తి మున్నగునవి పట్టును గాని, దైవము గాదు.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"కొందరు బంగారమును అనగా ధనమును ఎక్కువగా యాచించుచుందురు. ఇతరులను డబ్బు కొరకు గాని, తమ స్వప్రయోజనములకు గాని నిర్బంధించువారు కొందరు. బ్రతుకులో తటస్థించిన సందర్భములలో కాముకులకు స్త్రీలే దైవముగా కనిపింతురు. వీరెల్లరు తమ లోపల వెలుగుచున్న తత్త్వమును పట్టించుకొనకుండుట శోచనీయము."

వ్యాఖ్య

వాస్తవమునకు తమ బ్రతుకుతెరువు కొరకని గాని, భగవత్ సేవకని గాని ఎవరిని యాచింప బనిలేదు. కర్తవ్యమును, బ్రతుకును భగవదర్పితము చేయువానికి భగవ దనుగ్రహమే సంపద. నిజమయిన భక్తులు యాచింపరు. కాని ఆశగల వానికి బంగారము, ధనము దేవుడుగా కనిపించును. సర్వముగా కనిపించును. మానసికముగా కూడ ఇతరుల నుండి దేనినయినను ఆశించువాడును యాచకుడే యగును. ఇట్లు ఆశింపకుండుట ఆధ్యాత్మిక సాధనలో మొట్టమొదటి సోపానమగు 'యయము' నందలి అంశముగా పతంజలి తన యోగసూత్రములలో శాసించెను. గుర్తింపు నాశించుటయు యాచకత్వమే. బహు శాస్త్రములు చదువుట వేరు, తెలియుట వేరు, దేని నాశింపకుండుట వేరు. కొందరు యాచకులయిన పండితులను గూడ అన్నమయ్య గమనించెను. ధర్మపరులు, దైవభక్తులయిన వారి వెంట, వలసిన ధనము కుక్క వలె వెంటబడును. ధనము వెంట కుక్క వలె పడరాదు. ధర్మార్జిత ధనమును సద్వినియోగ పరచవలెనే గాని, ధనము మనసున అంటరాదు. ఇతరులను అప్పు ఈయుడని నిర్బంధించువారు కొందరు. లేదా తమవద్ద అవసరమునకు అప్పు తీసికొని, తిరిగి తామడిగిన సమయమునకు తీర్చలేని పరిస్థితిలోని వారిపై దయలేక వారిని ఋణము దీర్చుమని నిర్బంధించువారు మరికొందరు. ఏ విషయమున అయినను ఇతరులను బలవంతపెట్టు వారికి శరీరమే దేవుడుగా కనిపించును. తమ శరీర సుఖమునకై, అవతలవానిని బలవంతపెట్టి వారిని బాధించుటకు వీరు వెనుకాడరు. వీరు అవతలి వారియందు అంతర్యామిని చూడరు. మరికొందరు ఇతరులపై తమ అభిప్రాయములను రుద్దుదురు. ఇంకను మరికొందరు తాము ఇతరులకు చేసిన మేలుకు బదులుగా గుర్తింపు, ప్రతిఫలముల కొరకై బలవంతపెట్టుదురు. వీరెల్లరు తమ శరీరము తామని పొరపడువారు. ఇక కాముకులకు స్త్రీలే దైవముగా కనిపించెదరనుటలో స్త్రీ నింద లేదు. స్త్రీల శరీరములందు మగవారు పొందు కామభోగాసక్తియే ప్రస్తావింపబడు చున్నది. కామము, ధనాసక్తి, కీర్తికాముకత సాధకునకు అవరోధములని అన్నమయ్య పేర్కొనెను. దేవుడన్ని ఆకారములందు సారమగు తత్త్వము. హారములు, గాజులు, ఉంగరముల సారము బంగారమే కదా! ఈ తత్త్వము ప్రతివానిలోన వెలుగుగా ప్రకాశించుచున్నది. మన మనస్సుకు, బుద్ధికి, హృదయ స్పందనకు, ప్రాణమునకు, ఇంద్రియములకు ఆధారమయిన ఈ వెలుగే దైవము. 'తాను' అను జీవుని పరిమిత మగు 'అహం' ఎక్కడ లయించునో అచ్చటనున్న అసలయిన 'తాను' లేక 'నేను', సర్వాంతర్యామి యగు అపరిమిత చైతన్యము. తనలోని ఈ వెలుగును ఈశ్వరుడుగా దర్శించువాడు ఎల్లరిలోను ఈ వెలుగునే దర్శించును. సూర్యచంద్రాగ్నులను వెలిగించు వెలుగు కూడ తానే అని గీతలో కృష్ణుడు చెప్పెను. పైన నుడివిన దర్శనమునే పరమ ప్రేమ లేక భక్తి యందురు. ఇదియే ఆనందము లేక రసము. ఈ చరణమున అన్నమయ్య యాచకు డాశించు కనకమందును, శరీర భ్రాంతి గలవాని శరీరము నందును, కాముకుడు కామించు స్త్రీల శరీరములందును అంతర్యామిగా నున్న బ్రహ్మమును పట్టించుకొనక, ఆ యా విషయములందు ఆసక్తి గొనుచున్నారనుట అతడు ప్రయోగించిన చమత్కారము. లోపలి జ్యోతిని త్రావుడని కులశేఖరాళ్వారు ఉపదే శించెను.

2వ చరణము యొక్క తాత్పర్యము

"ఆకలిగొన్న వానికి అన్నమే దేవుడు. ఐహిక విషయములం దాసక్తి గలవానికి ఇహలోక విషయములే బ్రహ్మము. కర్మాసక్తునికి కాలమే బ్రహ్మము. ఈ మూడు తరగతుల వారికిని శ్రీకాంతునిపై చింత యుండటలేదు. కారణమేమిటో?"

వ్యాఖ్య

సామాన్యముగా ఆకలితో నున్నవాడు సర్వాత్ముడగు శ్రీహరిని దలచలేడు. ఆకలిని తట్టుకొనజాలడు. అట్లని ఆకలిగొన్న వానికి అవతలివాడు అన్నము పెట్టక వేదాంతము చెప్పవలెనని అర్థము గాదు. ఇచట కొందరు తిండిపైననే ఎక్కువ దృష్టిని పెట్టుకొను చున్నారనియే అన్నమయ్య ఆవేదన. కొందరు రుచి కోసమై భుజించుటను కూడ అతడు గమనించెను. ఐహిక విషయములందు ఆసక్తి గలవారికి – కంటికింపైన దృశ్యము, చెవికింపయిన మాటలు, నాలుకకు రుచి అయిన పదార్థము మున్నగు ఇంద్రియార్థములందు మునుగు వారికి ఇవి యన్నియు గల ఐహిక లోకమే దేవుడుగా అనగా సర్వస్వముగా కనిపించును. అతడు ఇహ – ఈ లోకమును దాటి చూడలేడు. లోకమనగా చూపని యర్థము. ఇతని చూపునకు ఇహలోకము – భోగము లందించు లోకముగానే కన్పట్టును గాని, ఈ లోకము అంతర్యామి యగు స్వామి యొక్క విశ్వరూపముగా గానరాదు. ఈ జగత్తును చూడవచ్చును, దానియెడల కర్తవ్యములను నిర్వర్తింపనగును. కాని చూపు మరలవలెను. లోచూపు మాత్రము స్వామి యందుండ వలెనని అన్నమయ్య భావము. ఇదియే గీతాసారము. పనసపండును చీల్చుటకు ముందు చేతులకు నూనె రాసుకొనవలెను, లేకున్నచో పనస జిడ్డు అంటును. అట్లే భగవంతుని హృదయము నందిడుకొని, సంసారము నందు ప్రవర్తింపనిచో చిక్కులలో పడుట జరుగునని శ్రీరామకృష్ణపరమహంస సెలవిచ్చెను. నిరంతరము ఆ పని చేయవలెను, ఈ పని చేయవలెను అనుచు తీరిక లేక శ్రమపడుచున్నాననుకొనుచు రజోగుణముతో వర్తిల్లువాడు ఒక పని చేయుచునే, తరువాతి పనిని గూర్చి ఆలోచించును. ఏ పనిని సక్రమముగా నిర్వర్తింపజాలడు. ఎన్నియో ఆశలను సాధించు నెపమున, ఎన్నో పనులను నెత్తిన వేసికొని, అసలయిన ఆనందము, శాంతి నొందుటకు మాత్రము తనకు తీరిక యుండదు. ఎందులకింత తపనపడుచున్నావని యడిగినచో సుఖము కొరకని అతడు సమాధానమిచ్చును. అదియే అతనికి దక్కదు. ఇతడు కాలము వెంట పరుగులిడుచుండును. గతమును గూర్చి – దీనిని చేయలేకపోయితి ననియో, భవిష్యత్తు ఎట్లుండునని చింతించుటతోనే ఇతని బ్రతుకు తెల్లవారును. వీరికి కాలమే దేవుడుగా కానవచ్చును. కాలపాశముల కితడు బద్ధుడు. కాలమునకు వశుడై, కర్మలతో వేగలేక మనస్సులో నిరంతరము ఆందోళనకు గురియగుచు బ్రతుకు వానికి కాలసర్పపు కాటు తప్పదు. ఏ క్షణము కూడ అతడు సుఖించలేడు. కర్మలనగా వట్టి లౌకికములనియే గాక, అన్నమయ్య దృష్టిలో వైదికములు గూడ. అనగా జప తప హోమాదులు. వేనినో ఆశించి, ఈ కర్మలను ఆచరించు వానికి వానియందున్న శ్రద్ధ, ఈ కర్మలకు గమ్యమైన పరమాత్మ యందుండదు. ఇట్టివారినే పూర్వమీమాంసకు లందురు. వీరు కర్మలకిచ్చు ప్రాధాన్యము దేవున కీయరు.

జగత్తు అంతయు కార్య కారణ సంబంధముపై ఆధారపడియున్నదని వీరి నమ్మకము. నా తెలివితో ఫలానా పనిచేసి దాని ఫలితమును తప్పక సాధించెదనని వీరి విశ్వాసము. భగవదనుగ్రహముపై వీరికి విశ్వాసముండదు. ప్రస్తుత కర్మ చేయుట సరియే, మరి పూర్వము చేసిన కర్మ యొక్క ఫలితమును కాలవశమున అనుభవింపక తప్పదు గదా! కర్మవాదులు చేయ వలసినవి చేయక, చేయగోరిన కర్మలను చేయుచు, వాని ఫలితములు అనుభవమునకు వచ్చినపుడు తలబొప్పికి లోనగుదురు. ఇంతకును లోకమున కార్యకారణ సంబంధము గొలుసుకట్టు వలె వర్తించుట నిజమే. కాని ఈ మొత్తము జగత్తు యొక్క వ్యూహము నకు, కార్యకారణ సంబంధమునకు నేపథ్యమున నున్న తత్త్వమేది? సర్వకారణ కారణుడగు శ్రీహరియే అని భాగవతము చెప్పుచున్నది. శ్రీహరి యందు భక్తితో, ఆతనికి సమర్పణముగా కర్మల నాచరింపవలెననియే అన్నమయ్య భావము గాని, చేయవలసిన కర్మలను విడిచిపెట్టుడని కాదు, చేయగోరినవి మానుడని. అన్నమయ్య మెట్టవేదాంతి గాదు. బ్రహ్మార్పణముగా కర్మలను చేయవలెను. ఏ కర్మలు చేయ వలెనో, ఆయా పరిస్థితుల రూపములోని అంతర్యామి యగు స్వామి నుండి వెలువడు సంకల్పములను అనుసరింపవలెనే గాని, తన సంకల్పములు పనికిరావు. పరిస్థితులను బట్టి ఏమి చేయవలెనో దైవమే తనలోనుండి సంకల్పించును. తనకు మాత్రము అది చేయవలెను, ఇది చేయవలెను అను సంకల్పములుండరాదు. పెనుగాలికి అటునిటు ఊగి పడిపోవు చెట్టు వలె స్వయముగా పనులు తలపెట్టువాని బ్రతుకు దుఃఖముతో గూడిన పతనమునకు గురియగునని అన్నమయ్య హెచ్చరిక. తాము కోరిన కొన్ని కర్మలు దైవసంకల్పానుసారమై యున్నచో నెరవేరినట్లు కనిపించును. అపుడు కలుగు సుఖము బయటి పరిస్థితులపై, కోరికలు నెరవేరుటకై ఆధారపడిన సుఖము. మరల కొన్ని నెరవేరక దుఃఖము తప్పదు. కావలసినది సుఖదుఃఖాతీతమయిన ఆత్మసుఖము. ఇదియే భగవంతుడు. కొందరు వైదిక కర్మలను ఆచరించువారు కూడ ఫలనా క్రతువు, ఇంత జపము చేసితిమి గావున, దేవుడు మాయెడల ఏల దిగిరాడని, ఆయనపై సవాళ్ళు విసరువారు, ఇన్ని యేండ్లుగా దేవుని పేర ఉపవసించుచున్నాను గాన దేవుడు నా కోరిక ఏల ఈడేర్చడని దేవునే బెదరించువారును గలరు. వీరికి కర్మలపై, ఉపవాసములపై నున్న ఆసక్తి దేవునిపై నుండదు. దేవుడిట్టి బెదరింపులకు లొంగదు. వీరిని గాంచి జాలిపడుచు, క్రమముగా తనవైపు వీరి చూపును మరల్చును. ఈ మూడు రకముల వారును శ్రీకాంతునిపై దృష్టి పెట్టుటలేదు. సుఖము కొరకై తపించుచు జీవితము వెళ్ళదీయుచు చివరకు వాస్తవ సుఖమయిన స్వామి యొక్క అనుభూతి దక్కకుండగనే వీరి ఆయుస్సు తరిగిపోవుచున్నది. ఇచట అన్నమయ్య 'శ్రీకాంతు'దను పదమును సాభిప్రాయముగా ప్రయోగించెను. 'శ్రీ' అనగా నిత్యము స్వామిని వీడక ఆశ్రయించు లక్ష్మీదేవి. అనగా ప్రకృతి శోభ, స్వామి సల్లక్షణ సంపద. కాని కొందరి దృష్టిలో 'శ్రీ' అనగా ధనము, కీర్తి, పదవి మున్నగు ఐహిక విషయములందు ఉచ్చ స్థితి. వాస్తవమునకు 'శ్రీ' యగు లక్ష్మీదేవి యొక్క కాంతుడు వేంకటేశ్వరుడు. అనగా 'శ్రీ' ని గూడ ఆకర్షించు అయస్కాంతము వంటివాడు. ఈయనను చింతింపక, ఈయనను ఆశ్రయించిన 'శ్రీ' ని ధనముగా పొరపడి అందులకై తపనతో వర్తించుట వింత యని అన్నమయ్య వంత చెందుచున్నాడు. మనకు వలసిన సంపద వంటి ఐహికములను గూడ ప్రసాదించు శ్రీకాంతుని విడిచి,

మానవులు ఐహికముల వెంట పడుట శ్రీహరి యొక్క మాయ గాక మరియేమి? ఆ మాయాశక్తియే శ్రీదేవి. మాయను దాటుటకు శ్రీదేవితో గూడిన స్వామిని ఆశ్రయింపవలయును.

3వ చరణము యొక్క తాత్పర్యము

"ఈ భూమిపై సంసారికి సంతతియే దేవుడు. ప్రస్తుత కాలమున ఇట్లు ధనము, కీర్తి, ఐహిక భోగములు, పుత్ర వ్యామోహము, ఆశలు – వీనిలో దిగబడి మానవులు సుఖములనే కోరుచు, దానినందక దుఃఖములోనికి దిగబడుచున్నారు. ఒక హద్దుకు ఆవల ఇట్టివారున్నారు. ఈవల శ్రీవేంకటేశుని దాసులున్నారు. ఇట్టివారికి తమ పుట్టుక, బ్రతుకు స్వామితో నిండి దర్శనమొసగును. వీరికి స్వామి యనుగ్రహమే దేవుడుగా అనుభవమునకు వచ్చును."

వ్యాఖ్య

సంసారమనగా భార్య, పిల్లలు గాదు. వారిపై తనకు గల వ్యామోహము. ఈ వ్యామోహము గలవాడు సంతతికై కూడబెట్టును. పిల్లలకు భక్తియోగ సాధన నేర్పక, ధనాదులను ఎట్లు మిగిలిన వారికన్న బాగుగా సంపాదింపవచ్చునో నేర్పును. చివరకు పుత్ర వ్యామోహమున, మిగిలిన తల్లిదండ్రుల సంతతి గూడ తమ సంతతివంటి వారే యని మరచి, వారి క్షేమమును భంగపరచుటకు సిద్ధపడెదరు. తరగతిలోని అందరు పిల్లలకు మంచి మార్కులు రావలెనని భావింపక, తమ కుమారునకే మొదటి మార్కు రావలెనని ఆశించి, పిల్లలలో అట్టి ఆశను నూరిపోయువారు గలరు. ఇట్టివారి సంఖ్య అధికమయినచో సమాజములో పోటీ పెరిగి రాజకీయ ఆర్థిక వ్యవస్థ కుప్ప కూలిపోవును. స్పర్థ వలన విద్య వర్ధిల్లునను సామెత సరియైనది గాదు. ఎవరి కర్తవ్యము వారు పాలించిన, వలసిన ఫలితము దేవుడిచ్చును గదా! భారతమున ధృతరాష్ట్రుడు పుత్ర వ్యామోహమను గ్రుడ్డితనమున ఎల్లరు కుమారులను కోల్పోయెను. అట్లే తన సంతతి యెడల వ్యామోహముతో చరించువాని సంతతి సమాజమునకు పనికిరానివారై, చివరకు తల్లిదండ్రుల యెడల తమ కర్తవ్యములను విడిచి, నశించెదరు. తల్లిదండ్రులు కొందరు జీవితాంతము తమ సంతతి తమ అదుపు, ఆజ్ఞలకు లోబడి యుండవలెనని పట్టుతో వ్యవహరింపగా, పిల్లల నుండి తిరుగుబాటు నెదుర్కొనక తప్పదు. కోపము, దుఃఖము, స్పర్థకు లోనుగావలసి వచ్చును. అట్లని పిల్లలను ప్రేమతో పెంచవద్దని అన్నమయ్య అభిప్రాయము గాదు. పిల్లలను పెంచుటను దైవార్చనగా చేయుడని వేదము చెప్పుచున్నది. వారియెడల, అందరియందు వలెనే ప్రేమను నెరపవలెనే గాని ప్రత్యేక వ్యామోహము పనికిరాదు. కర్తవ్యములు తప్పవు. వారికి దైవభక్తి, సద్గుణములు నేర్పుచు, సమాజమునకు పనికివచ్చు వారినిగా తయారు చేయవలెను. గృహస్థాశ్రమము విశ్వమంతయు నిండియున్న స్వామిని సేవించుటకు ఒక సోపానమే. తన ఇంటిని గుడిగా తీర్చినవాడు, క్రమముగా విశ్వమును గుడిగా దర్శింపగలుగును.

ఈ సంకీర్తనమున అన్నమయ్య సమాజమును నిశితముగా పరిశీలించిన తీరు అతడు సమాజ శ్రేయస్సుకై పొందిన ఆవేదన, మానవులు మాధవుని వైపు మరలి సుఖింపవలెనను కరుణ వ్యక్తమగుచున్నది.

అయితే అంతమాత్రమున సమకాలీన సమాజమున గాని, ఏ కాలమునాటి సమాజమున గాని ఎల్లరు మానవులిట్లు లౌకిక భోగాసక్తులుగా వర్తింపరు. కావుననే అన్నమయ్య ఒక హద్దుకు ఆవల వారు, ఈవల స్వామి దాసు లున్నారని తెలిపెను. పూజలు చేయువారు కొందరు గడపకు ఆవల ఒక కాలు, ఈవల ఒక కాలు పెట్టువారున్నారు. స్వామి కల్యాణగుణములే ఆయన శోభ. జగత్తే శ్రీదేవి రూపము. వీరు 'శ్రీ'ని లౌకిక భోగరూపిణిగ భావింపరు. భక్తులు జగత్తును లక్ష్మీదేవిగను, అందలి అంతర్యామిని వేంకటేశ్వరునిగను దర్శించి, సేవించి, అనుభవించెదరు. దేవుడన్నను, ఆయన దయయన్నను భేదము లేదు – సూర్యుడు, సూర్యకాంతి వలె. ఆ దయ వలన తమ పుట్టుక, జీవితము ధన్యము లయినవనియు, ఆ దయయే దేవుడుగా దర్శనమిచ్చినదనియు అన్నమయ్య అనుభూతి. ఈ సంకీర్తన యందు భక్తినే గాక, వ్యక్తిగత, సామాజిక జీవితముల తత్త్వమును వడగట్టి సారమును పిండి అన్నమయ్య మనకందించెను. మనము కూడ ఆతని వలెనే శ్రీవేంకటేశు దాసులమై, స్వామిదయయే బ్రహ్మముగా అనుభూతినంది, జన్మను దానితో నింపుకొందముగాక! ఇట్టిచో ఒకవేళ అయాచితముగ ధనము, కీర్తి, పదవి మున్నగునవి లభించినను అవియెల్ల స్వామి లీలలుగనే దర్శనమిచ్చును గాని, మన మనస్సులందు వానికి వేరుగా స్థానముండదు. మరి అన్నమయ్య సాళువ నరసింహరాజు యొక్క ఆశ్రయమును పొందెనుగదా యని కొందరికి శంక కలుగ వచ్చును. కాని వాస్తవమునకు రాజే ఇతని నాశ్రయించెను గాని, ఈతడు రాజు నాశ్రయింపలేదు. ఆపై తనను గూర్చి కీర్తన రచింపుమని రాజు కోరగా, అన్నమయ్య మన్నింపలేదు. రాజు ఇతనిని చెఱలో పెట్టగా, స్వామి దయవలన సంకెలలు అవియే తెగిపోయెను. ఇట్లు రాజుకు, అతడు నిమిత్తముగా సమాజమునకు భక్తియోగమును అన్నమయ్య అందించుటకే, స్వామి రాజు ఈతని నాశ్రయించునట్లు చేసెనే గాని, అన్నమయ్య రాజాశ్రయమును గోరలేదని గ్రహింపవలెను. రాజాశ్రయ మును గోరిన వానికి, సంకెలలు త్రెంపునంతగా దేవుని కృప లభింపదు గదా! దేవుని కృపవలన ఈ సంకెలలే గాదు, పూర్వజన్మమునందే సంసారపు సంకెలలు ఇతని విషయమున తెగిపోయినవి. ఆ కృపయే ఇతని పాలిటి బ్రహ్మము. రాజు తన కొసంగిన అగ్రహారము లందలి పల్లెలలో ఆధ్యాత్మికత పునాదిగా గల గ్రామ వ్యవస్థను, వ్యక్తిగత సుఖములను పాటింపకుండ, సంఘమంతయు ఒక్క మానవుడుగనే నిలుచు పల్లెలను అన్నమయ్య నెలకొల్పెను. భజనము, భోజనము ఎల్లరను కలిపియే ఏర్పాటు చేసెను.

* * *

35

3వ సం-359

పంటల భాగ్యులు

దేవగాంధారి

పంటల భాగ్యులు వీరా బహువ్యవసాయులు
అంటిముట్టి యిట్లఁ గాపాడుదురు ఘనులు. ॥ పల్లవి ॥

పొత్తుల పాపమనేటి పోడు నఱికివేసి
చిత్తమనియెడు చేను చేనుగా దున్ని
మత్తిలి శాంతమనే మంచి వానపదనున
విత్తుదురు హరిభక్తి వివేకులు. ॥ పంటల ॥

కామక్రోధాదులనే కలుపు దవ్వివేసి
వేమరు వైరాగ్యమనే వెలుఁగు వెట్టి
దోమటి నాచారవిధుల యెరువులు వేసి
ఓముచున్నారు జ్ఞానపుఁ బైరుద్యోగజనులు. ॥ పంటల ॥

ఎందు చూచిన శ్రీవేంకటేశుఁ దున్నాఁడనియెడి
అందిన చేనిపంట లనుభవించి
సందడించి తమవంటి శరణాగతులుఁ దాము
గొంది నిముడుకొందురు గురుకృప జనులు. ॥ పంటల ॥

మనయందు ప్రేమ లేనివారి యెడల గూడ ప్రేమ
చూపడం అలవరచుకోవాలి.

టీక

వ్యవసాయులు = కర్షకత్వము చేయువారు, దీక్షతో పాటుపడువారు; అంటి = విడువకుండ పట్టుకొని; పోదు = తుప్పలతో గూడిన అడవినేల; చేను = పొలము, పైరు; మత్తిలి = పరవశత్వముచెంది; పదనున = పదునుకాగా; వెలుఁగు = కంచె; దోమటిన్ = కొనసాగునట్టి; ఓముట = కాపాడుట; సందడించి = గుమికూడి; గొందిన్ = నిశ్చయముగా.

పరిచయము

ఈ సంకీర్తనమున జీవిత సాధనను అన్నమయ్య కృషికర్మతో పోల్చెను. వ్యవసాయ మను పదము కృషికర్మకు, మనస్సును, బుద్ధిని, ఇంద్రియములను ఒకే లక్ష్యము వైపు చేయు సాధనకు సరిపోవును. రెండవ అర్థమున ఈ పదమును శ్రీకృష్ణుడు గీతలో రెండవ అధ్యాయమున ప్రయోగించెను. పంటను కంచెవేసి రక్షించినట్లు వైరాగ్యమనే కంచెతో మనస్సును నిగ్రహించి కాపాడుకోవలెనని అన్నమయ్య రైతులు చేయు పనులతో, సాధకుడు చేయవలసిన పనులను ఒక క్రమమున పోల్చుట అద్భుతముగా నున్నది. గీతావాక్యమునకు ఈ సంకీర్తన చక్కని భాష్యమని చెప్ప వచ్చును. ఇట్టి సాధకులు జ్ఞానులై ఘనులగుదురు. ఎన్నో దినములపాటు చేసిన వ్యవసాయమునకు ఫలితముగా వచ్చు పంటలో అంతట శ్రీవేంకటేశు దున్నాడను అనుభూతిని పోల్చుచున్నాడు. ఇదియెంతయు సహజమైన పోలిక. ఇక కలుపులను పెఱికివేయుట, దున్నుట, విత్తువేయుట, ఎరువు పెట్టుట మున్నగు వ్యవసాయపు పనులతో సాధనాక్రమమును పోల్చుట చక్కగా నున్నది. సాధకుల యెదలలో చక్కగా ప్రేరణను, శ్రద్ధను, సాధన రీతిని ఈ సంకీర్తనము పాదుకొలుపుచున్నది. అన్నమయ్య వ్యవసాయదారుల నడుమ ఎక్కువగా సంచరించి, వారి పనులను బాగుగా ఎఱిగి యుండెనని తెలియుచున్నది. ఒకవైపు సాధనను తెలుపుటయేగాక, వ్యవసాయ ప్రాధాన్యమును వెల్లడించెను. పల్లవిలో చెప్పబడిన భాగ్యము చివరి చరణమున కూర్చి గ్రహింపవలెను. రైతులు లోకమునకు పంటలందించు సేవాభాగ్యము గలవారు.

పల్లవి యొక్క తాత్పర్యము

"వ్యవసాయమును చక్కగా చేయువారు, దాని ఫలితముగా లభించు పంటను అనుభవించువారు భాగ్యవంతులు. మహనీయులు తమకు లభించిన పంటను విడిచి పెట్టకుండ వృథా కాకుండా కాపాడుచున్నారు."

వ్యాఖ్య

పల్లవిలో వ్యవసాయ మేమిటో, పంట ఏమిటో స్పష్టముగా చెప్పబడలేదు. మొదటి రెండు చరణములందు వ్యవసాయము, చివరి చరణమందు పంట స్పష్టముగా తెలుపబడినవి. కావున చరణములను గ్రహించి, ఆపైన పల్లవిని వానితో జోడించు కొనవలసియున్నది. వ్యవసాయము చేయుట యనగా ఇంద్రియములను, మనస్సును, బుద్ధిని ఏకముఖముగా చేయు సాధన. ఏకముఖ మనగా సర్వమందు వెలుగుచున్న స్వామి.

స్వామియందు వీనిని సమర్పించి విడిచిపెట్టు సాధన చేయవలెను. ఇక బుద్ధి స్వామియందే నిలిచియుండును. దీనికి సొంత సంకల్పములు, నిర్ణయములు ఉండవు. ఇవన్నియు అంతర్యామి అగు 'ఆత్మ' నుండియే ప్రసరించి, బుద్ధిలో ప్రతిఫలించును. నిర్మలమగు కోనేటిలో ప్రతిఫలించు సూర్యరశ్మి వలె, శరణాగతి నొందిన బుద్ధియందు భగవంతుని సంకల్పములు, కర్తవ్య నిర్ణయములు స్పష్టముగా వెలుగుచు ప్రతిఫలించుచుండును. అందుకుగాను బుద్ధికి సంబంధించిన వ్యవసాయము శ్రద్ధగా చేయవలెను. బుద్ధి అనగా వివేచన చేయు ప్రజ్ఞ. దీనిని అందరిలో ఏకత్వమను వెలుగుగా నున్న స్వామివైపే మరల్చ వలెను. ఇట్టి సాధన చేసిన వారికి భగవదనుభూతి అను పంట లభించును. అంతర్యామి అనుభూతియే ఇది. ఇట్టివారి దృష్టిలో అనేకత్వ ముండదు. ఏకమైన స్వామి వెలుగే దర్శనమగును. వీరు గొప్ప భాగ్యవంతులు. డబ్బు మున్నగునవి భాగ్యములు కావు. భగవదానందానుభూతియే అసలయిన భాగ్యము. ఇదియే జీవిత పరమావధి. శ్రీరామకృష్ణులు దీనినే వక్కాణించి చెప్పిరి. లభించిన దివ్యానుభూతి యను పంటను పోగొట్టుకొనకుండ దానిని శ్రద్ధగా పట్టుకొని తగిలియుండు కాపాడుకొనువారే మహనీయులు. యోగసిద్ధి వచ్చినది గదా అని తృప్తి చెందరాదు. సిద్ధి వచ్చు వరకు సాధన చేయవలెను. సిద్ధి లభించిన పిదప అది నిలబడుటకై సాధనను కొనసాగించి ఆ స్థితిని నిలబెట్టు కొనవలయును. ఇక నాకేమియు ఫర్వాలేదను నిబ్బరము పనికిరాదు. ఎప్పుడు అంతర్యామి యగు స్వామిని మఱచిన, అపుడే పూర్వపు మలిన సంస్కారములు మరల మొలకెత్తును. అవి దాగియుండి, అనుకూల సమయము రాగానే మరల మొలకెత్తును. అనుకూల సమయ మనగా అతిశయముతో భగవంతుని విస్మరించి, సాధనను ఆపుటయే. దీనిని గూర్చి భాగవతమున ఉద్ఘాటింప బడినది. విశిష్టాద్వైతమున దీనికి చాల ప్రాధాన్యమున్నది. ఈ పల్లవిలో పంటలు + అభాగ్యులని విడదీయరాదు. పంటల = పంటలు గల, భాగ్యులు = భాగ్యశాలురు (పంటలే భాగ్యముగా గలవారు) అని అన్నమయ్య భావము. వీరావ్యవసాయు లనగా ఆనందమను పంట గల భాగ్యులగు వీరే వ్యవసాయులని అతని భావము.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"ఆధ్యాత్మిక సాధన అను వ్యవసాయమున పాపముతోడి సంబంధమను తుప్పలతో గూడిన అడవినేలను నరకవలెను. చిత్తమనియెడు చేనును, చేనును దున్నినట్లు దున్నవలయును. పారవశ్యమున శాంతమనెడు మంచివాన కురిసి, చిత్తమను చేను పదునుకాగా, ఆ యనుకూల సమయమున వివేకులయినవారు 'హరిభక్తి' అను విత్తనమును నాటెదరు."

వ్యాఖ్య

పాపము తుప్పల వంటిది. పాపమనగా పరులను పీడించుట అని మనువు చెప్పెను. ఇతరులను మానసికముగా, వాచికముగా, కాయికముగా హింసింప కుండుటయే అహింస. ఇది పరమధర్మము. దీనిని ఆధునిక కాలమున వ్యక్తిగత జీవితముననే గాక, జాతీయరంగముననను ఆయుధముగా ప్రయోగించి

గాంధీ మహాత్ముడు సఫలుడాయెను. పాపాచరణము చేయువాడు – అనగా ఇతరులను బాధించువాడు సాధనలో ముందుకు సాగలేడు. ఇది తుప్పల వంటిది. ముందుగా వీనిని తొలగింపవలెను. పాపములతో పొత్తు తుప్పలతో గూడిన చిట్టడవి. 'పొత్తు' అనగా పాపమును ఆచరించుటయు, మనసున పాపపు తలంపులు వచ్చుటయు గూడ. పాపము చేయువారితో స్నేహము చేసినను, వారి సాంగత్య ప్రభావమున పాపవాసనలు మనకంటును. పాపదృశ్యములను – కామమును, ద్వేషమును రెచ్చగొట్టు దృశ్యములను సినిమాలలో చూచుట, వానిని గూర్చి ఆసక్తిగా వినుటయు ముందు కాలక్షేపమన్పించును. కాని మన మనస్సు యొక్క లోతుపొరల లోన ప్రభావము చూపి, మన బాహ్య మనస్సుకు తెలియకుండగనే, ఆయా సందర్భము లలో కామ క్రోధాదులకు మనము లొంగిపోవుట జరుగును. కావున సాంగత్యము ఏ రకముగనయినను పాపముతో పనికిరాదు. నేను మంచివాడనే, కాలక్షేపమునకు ఆయా దృశ్యములను ఊరక వినోదించుచున్నానని పొరపడరాదు. సాధకునిపై పరిసరముల ప్రభావమున లోన మూల నెచటనో దాగిన పాపపుతలంపులు బలము పుంజుకొనును. మహనీయులగు పరమభక్తులు లొంగకుందురు. కాని వారసలు వాని జోలికే పోరు గదా. గత జీవిత సన్నివేశములలో మనలను కోపించిన వారిని, అవమానించిన వారిని, మనకు కీడు చేసిన వారు అన్పించిన వారిని గుర్తుకు తెచ్చుకొనరాదు. ఇట్లు గుర్తుకు తెచ్చుకొనుటయు పాపముతో పొత్తే. పశువులకు, పసిపిల్లలకు ఇట్టి గుర్తులుండవు. వారి వలె మనము వర్తింపవలయును. పశువులు అనుకూల ఋతువు ఏర్పడినపుడే సంతతికై కామము ననుభవించును. కాని నాగరికత, మేధ పెరిగిన వారమని గర్వించు నరులు ఋతువు యొక్క ఆనుకూల్యము రానపుడును కామసంబంధములగు తలంపులు చేయుచుందురు. ఆయా వాఙ్మయమును గోప్యముగా చదువుచుందురు. ఇది మనోవ్యాధి. అట్లే పశువుకు లంచమీయ జూపినను, ఆకలికి మించి భుజింపదు. నరుడు దీనికి వ్యతిరేకముగా వర్తించును. ఆకలి తీరుటకై రుచిని ఉపయోగించువాడు యోగి. రుచికి లొంగి, ఆకలిని మించి భుజించువాడు రోగి. కామక్రోధములకు, విషయాసక్తులకు దూరము గావలెను. కొందరు తమ మిత్రులతోడి మొగమోటమునకై ఆహార పానీయములలో రోగమును తెచ్చునవి స్వీకరింతురు. వారివలెనే ఆచరణకు లొంగుదురు. వారి పాపములో పాలుపంచు కొనెదరు. ఉదాహరణకు మనము భగవంతుని సంకీర్తనలో నుండగా, బంధుమిత్రులలో ఒకరు వచ్చి మనలను చెడు సినిమాకు రమ్మన్నను వెళ్ళ పనిలేదు. మృదులముగా అతనికి నచ్చజెప్పవలెను. ఒత్తిడి చేసినచో లొంగరాదు. తన కార్యక్రమమును కొనసాగించుచున్నచో, నచ్చినవాడు పాల్గొనును. నచ్చనివాడు వెడలి పోవును. అతడు సూచించిన కార్యము విషయమున మనము మొగమాటపడనేల? మనము చేయుచున్న సంకీర్తనము విషయమున అతడు మొగమాటపడును. చెడు పనికి మొగమాటపడడు. మంచిపనికి మొగమాటపడుట నరుని విచిత్ర స్వభావము. పాపముతో పొత్తు అను తుప్పలతోడి చిట్టడవిని నఱకివేయవలెను. అనగా మొదలంట పూర్తిగా నఱకవలెను. 'వేసి' అను చిన్న పదమును గూడ అన్నమయ్య సార్థకముగా వాడెను. చిత్తమనగా ఇంద్రియముల ద్వారమున పనిచేయు మనస్సు. కంటి ద్వారమున దృశ్యము చూచునది, చెవి ద్వారమున వినునది – ఇట్లే ఇంద్రియముల ద్వారమున బాహ్యప్రపంచమున వర్తించునది మనస్సే. మనస్సు లేని వట్టి ఇంద్రియములు పనిచేయనేరవు.

శవము యొక్క ఇంద్రియములు గాని, నిద్రించువాని ఇంద్రియములు గాని పనిచేయవు. చిత్తము ఇంద్రియముల ద్వారమున బాహ్య విషయములందు వర్తించుచుండును. తనకు ఇష్టమైన వానియందు వర్తించును. అవి చేయకూడనివి గూడ గావచ్చును. చిత్తమును నిరోధించుట సాధ్యముగాదు. వృత్తి యనగా వర్తించుట. చిత్తవృత్తులు నిరోధింపబడుటయే యోగము. అనగా కంటి ద్వారమున చూడకూడనివి చూడరాదు అనియే గాని అసలు చూడరాదని గాదు. ఇట్లే మిగిలిన ఇంద్రియముల విషయమున గూడ. మరి మనస్సు ద్వారమున బాహ్య విషయములు సరివి గాకున్నను అందు వర్తించుటకు కారణమేమి? వానిచేతను ఆకర్షింపబడుట. దీనికి కారణము అభ్యాసము. ఈ వివరములన్నియు పతంజలి మహర్షి తన యోగసూత్రములలో తెలిపెను. ఇపుడు చిత్తవృత్తులను మనము అరికట్టలేము. మనము చేయవలసినది చిత్తము నాకర్షించు విషయములను గూడ అంతర్యామియే యని భావించుట. ఈ అభ్యాసము పెరిగిన కొలది పూర్వపు దురభ్యాసములు వైదొలగును. ఉదాహరణకు ఆరోగ్యమునకు భంగ కరమయిన మద్యమును స్వీకరించుట, చిత్తము దానియందు వర్తించుట అభ్యాస మగుట వలన. ఈ యభ్యాసమును మరల్చుటెట్లు? ఇంతకన్న ఆకర్షణీయమగు మంచి పానీయమును సేవించుట; ఆ సమయమునకు చిత్తమునకు భగవత్ సంకీర్తనమునో, సేవాకార్యమునో అంటింపవలెను. మొదట ఇది అంత ఇష్టముండదు. కాలక్రమమున ఇది అభ్యాసమున ఇష్టమగును. సరిగాని విషయములందు వర్తించు చిత్తమునకు భగవంతుని సేవను, స్మరణను మాటిమాటికి అంటించుటే అభ్యాసము. ఇక అక్కరలేని వానిని పట్టించుకొన కుండుట వైరాగ్యము. అభ్యాస వైరాగ్యముల సాయముతో చిత్తవృత్తులు నిరోధింపబడునని పతంజలి, శ్రీకృష్ణుడు బోధించిరి. చిత్తవృత్తులను మన మరికట్టలేము. చిత్తమును స్వామి కర్పించినచో, స్వామియే చిత్తవృత్తులను నిరోధించును. ఇట్లు చిత్తమునకు భగవంతునితో సంబంధము నిత్య మేర్పడుటకు యత్నము నిరంతరము సాగవలెను. ఈ యత్నమున చిత్తమనే చేనును, చేనును వలె దున్నవలెను. ఇచట 'చేను'ను అన్నమయ్య రెండుమార్లు ఏల వాడెను? మొదటి చేను పొలము. రెండవ చేను పైరు. ఇచట చేను అనగా సస్యము, పైరు అనియు అర్థము గలదు. పొలమును దున్నుట, పైరు బాగుగా వచ్చుటకు అనుగుణముగా చేయవలెను. అట్లే చిత్తమనే పొలమును, దివ్యానందమను పైరు నిండుగా కల్గుట కనుగుణముగా దున్నవలెను. మరి నాగలి ఏది? భగవంతుని యందు అర్పితమగు బుద్ధియే. ఇదియే శరణాగతి. మన చిత్తము దేనియందు వర్తించుచున్నదో ఆ విషయము లేక వస్తువు; చిత్తమునందు వర్తించుట; చిత్తము – ఈ మూడును అంతర్యామి యగు భగవంతుని స్వరూపములే అను భావముతో ఆయన యందు ప్రపత్తి కలిగియుండవలెను. ఇదియే ఇచట నాగలి. ఈ సందర్భమున ఒక ఉదాహరణమును లీలాశుకుడను భక్తు డిట్లు కథగా చెప్పెను. "గోకులము నుండి పాలు, పెరుగు, వెన్న వరుసగా కుండలలో పెట్టుకొని, శిరస్సుపై నుంచి ఒక గోపిక మధురకు అమ్ముటకై వెళ్లినది. కావున ఆమె చిత్తము భగవంతుని యందే వర్తించుచున్నది. కృష్ణుడు గాక ఆమెకు వేరు లేదు. తానమ్ము పాలు, పెరుగు, వెన్నలను 'గోవింద, దామోదర, మాధవ' అని సంబోధించుచున్నది. వానిని గొనువారిని గూడ దేవుని ఈ నామములతోనే సంబోధించుచున్నది. ఇక అమ్ముట అను పని చేయు తన చిత్తమున గూడ కృష్ణుడే. ఇట్లు కర్త, కర్మ, క్రియ అను త్రికోణము

అంతర్యామి అయిన భగవంతుడే యను ప్రేమతో ఆమె వర్తించుచున్నది." ఇట్లు భక్తియను నాగలితో చిత్తమను చేనును చక్కగా దున్నినచో భగవదనుభూతి అను పైరు నిండుగా పండును. ఇక చేనిలో పైరు పండుటకు వాన కావలెను. అది చేను పదును అగుటకు అనుగుణముగా సకాలమున, సరియగు మోతాదులో కురియవలెను. ఆ వాన ఏది? భగవంతుని యందు పరవశించి శాంతము వహించుట. ఏ వ్యక్తియందును, ఏ విషయము నందును, ఏ సన్నివేశము నందును, ఏ పరిస్థితి యందయినను ఒకే సమత్వ స్థితిలో నుండుటయే 'శాంతము'. కొందరు పరిస్థితులను ధైర్యముగా ఎదుర్కొనవలెనని చెప్పుచుందురు. ఇది సరిగాదు. ఎదుర్కొనుటకు మనమెంతవారము? ఎదుర్కొనుటలో పల్టీలు కొట్టెదము. అట్లని తప్పించుకొనరాదు. వచ్చిన పరిస్థితులు, ఎదురైన సన్నివేశములు, వ్యక్తులు – అంతర్యామి అని భావించి, ఆ స్వామికి శరణాగతి పొందవలెను. అప్పుడు శాంతము కలుగును. శాంతములో ఉద్వేగముండదు. సమత్వముండును. కర్తవ్య నిర్వహణతో పని మనకు. ఫలితమునందు దృష్టి లేకున్నచో, ఏ రకముగా వచ్చినను సమత్వముండును. ఇట్టి శాంత స్థితి కలుగుటకు మత్తిలవలెను. అనగా కర్తవ్యము, దానిని మన ద్వారమున చేయువాడు, ఫలభోక్త, ఫలము అన్నియు స్వామియే యని ఆయనయందు పరవశింపవలెను. ఆ పారవశ్యపు తీయని రుచిలో సమత్వము నిలబడును. సమత్వమే యోగమని కృష్ణుడు చెప్పెను. ప్రహ్లాదుడు, ధర్మరాజు మున్నగువారు ఇట్టి సమత్వములో నిలిచిరి. శాంతము వహించిరి. కారణము, వారు భగవంతునియందు ఉన్మత్తులై శరణందుటయే. మనము చేయవలసినది శరణాగతి, పొందవలసినది పారవశ్యము. స్వామి ఇచ్చునది శాంతమను వాన. అంబరీషునిపై కోపించిన దుర్వాసుడు 'కృత్య' అను శక్తిని ప్రయోగించెను. అంబరీషునకు దుర్వాసునిపై కోపము గాని, కృత్య యెడల భయము గాని గలుగలేదు. కారణ మాతడు వీరిని చూడలేదు. విష్ణునందే శరణంది మత్తిలియుండెను. దేవుని దయ వలన శాంతము ఆతని రూపుదాల్చెను. విష్ణువు సుదర్శనముతో ఆ కృత్యను ఛేదించెను. అనగా నర్థమేమి? సమస్తమున విష్ణుని దర్శించుటయే సుదర్శనము. దానితో దుర్వాసుడు, కృత్య అంబరీషుని నేమియు చేయజాలరైరి. పదివేల మందికి అన్నము పెట్టుమనియు, లేకున్న శపించెదననియు దుర్వాసుడు ధర్మరాజును బెదరించెను. ధర్మజుడు గాని, ద్రౌపది గాని కంగారుపడలేదు. ద్రౌపది శరణందినది కృష్ణునకు. స్వామి అక్షయపాత్రలో ఏమూలనో మిగిలిన కూర ముక్కను, మెతుకును భుజించి అతిథులకెల్లను సంతర్పణ గావించెను. శాంతమను వాన చక్కగా కురియగనే, చేను పదునగును. ఆపైన ఇది చేయదగినది, ఇది చేయదగనిది అని ఎరిగిన వివేకము గలవారు 'హరిభక్తి' అను విత్తును చిత్తమను చేనున నాటుదురు. భక్తి యనగా పరమప్రేమ. ఇది కొందరు వ్యక్తుల యందు పరిమితము గాక, సంకుచిత పరిధులను దాటి సర్వాంతర్యామి యగు విష్ణునందు నిలుచును. ఇట్టివారు ఎందరి నడుమనున్నను ఏకాంతమునే కలిగియుందురు. అనగా ఒకటే అంతము – గమ్య మగు శ్రీహరి యందే యుందురు. వారికి లోన తాను, వెలుపల ఇతరులు ఉండరు. వీరే ఏకాంత భక్తులు లేక అనన్య భక్తులు. అంతేగాని ఏకాంత భక్తి యనగా ఒంటరిగా కూర్చుండి ఎప్పుడును శ్రీహరిని ధ్యానించుట, భజించుట మాత్రమే కాదు. ఇవి ఆవశ్యకములే. ఇవి హరిభక్తికి సాధనములే గాని 'భక్తి' కావు. అట్లే అనన్యభక్తి యనగా విష్ణుని దక్క ఏ దేవుని కొలవనను భావము గాదు. విష్ణువనగా సర్వాంతర్యామి.

ఆయనకు అన్యము లేదని భావించు భక్తియే అనన్య భక్తి. ఇట్టి భక్తికి సాధన సామగ్రిగా వ్యాసుడు పూజాదులను, గర్గుడు దేవుని లీలాకథలను, శాండిల్యుడు దేవునియందు ధ్యానబుద్ధిని, నారదులు దేవునికి సమర్పితములుగా అన్ని పనులు చేయుటను సూచించుచున్నారు. ఇవన్నియు భక్తికి సామగ్రియే గాని భక్తి కాదు. భక్తి యనగా పరమప్రేమ ప్రవాహము. ఇందెవరైనను స్నానమాడవచ్చును. నదీ ప్రవాహమునకు వివక్ష లేదు. అది సర్వసమము. అట్టిదే హరి భక్తి. ఎవరినయినను ముంచెత్తగల దివ్యప్రేమయే హరి భక్తి. హరి భక్తుని సన్నిధిలో ఎవనికయినను ఆనందమే. భక్తునికి, ఎవని వద్దనయినను ఆనందమే. హరి భక్తుడు నిత్య సుఖి. భక్తి కొలతలకందదు. కారణము లేకుండగనే ఇతరులను సుఖపెట్టుటతో తాను సుఖపడుటయే భక్తుని లక్షణము. భక్తి అమృతము. అనగా శాశ్వతము. భక్తి గలవాడు ఎట్టిత్యాగమున కయినను సిద్ధుడగును. ఆనందముగా నుండును. తృప్తిగా నుండును. భక్తిని పొందినచో కోరిక యుండదు. శోకము, చింత, ద్వేషము, విషయాసక్తి ఉండవు. ప్రత్యేకముగా ఒక పరిస్థితిలో ఉత్సాహముగా నుండుట యని యుండదు. ఎప్పుడును ఉత్సాహమే. భక్తిని అనుభవించువాడు ఉన్మత్తు డగును, జడుడు గాడు, జడుని వలె లౌకిక విషయములనెడ ఉండును. తనయందు తాను ఆనందించుచుండును అని నారదుడు తన భక్తిసూత్రములలో తెలిపెను. "అడుగడుగునకు మాధవానుచింతన మున మేను మఱచువాడ"ని ప్రహ్లాదుని గూర్చి చెప్పబడెను. హరి భక్తి మూర్తిగా నున్నవాడు ప్రహ్లాదుడు. మన అన్నమయ్యాయు. చిత్తమను చేనున నాటవలసిన విత్తనము హరి భక్తి. అపుడు ఆనందమను పంట పండును.

2వ చరణము యొక్క తాత్పర్యము

"కామ క్రోధములు కలుపుల వంటివి. వీనిని సమూలముగా త్రవ్వి తొలగించు కొనవలెను. ఆ పంటకు పలుమార్లు వైరాగ్యమను వెలుగు పెట్టవలయును. అనగా కంచెవేసి రక్షించుకోవలయును. భగవంతుని సేవగా తన జీవితమున ఆచరింపవలసిన పనులను కొనసాగింపవలయును. ఇవియే ఎరువులు. కర్షకులెట్లు వ్యవసాయము చేయుదురో, ఉత్+యోగ జనులు జ్ఞానమను పైరును కాపాడుకొనుచున్నారు."

వ్యాఖ్య

పొలములో కలుపు మొక్కలుండును. ఇవి పంట వచ్చుటకు ఆటంకములు. ఇవి సమూలముగా పెఱికి పారవేయబడవలెను. చిత్తమను చేనున కామ క్రోధములే కలుపులు. వీనితో పోరాడినచో లాభములేదు. ఎన్ని జన్మలకయినను సాధన తెమలదు. ఏలననగా పోరాడుట యనగా వానిని గట్టిగా ధ్యానించుటయే కదా. ధ్యానించిన కొలది వాని బలము పెరుగును. ఒక గురువుగారు శిష్యునకు మంత్రోపదేశము చేసి, ఉదయము మేల్కాంచగానే కోతి గుర్తుకు రాకూడదని హెచ్చరించెనట. శిష్యుడు నిద్రింపబోవు ముందు కూడ "నాకు కోతి గుర్తుకు రాకూడద"ని ధ్యానించెను. ఉదయమున మేల్కాంచగనే 'గురువుగారిట్లు చెప్పిరి. కాన కోతి గుర్తుకు రాకూడదు' అని భావించెను. ఇట్లు వ్యతిరేక భావముతో కోతి గుర్తుకు రానేవచ్చినది. ఎన్ని జన్మలిట్టి సాధన చేసినను విసుగు, చిరాకు కల్గుటయే గాని శాంతి లభింపదు. శాంతి కలుగని

సాధన ఎందులకు? కోతి సంగతి విడిచి, నిద్రించుటకు ముందు, మేల్కాంచగనే శ్రీహరిని భక్తితో స్మరించినచో కోతి గుర్తునకు రానేరాదు. ఒకవేళ గుర్తుకు వచ్చినది. కొంప మునిగినదిలేదు. ఆ కోతి గూడ హరి రూపమే అని ధ్యానింపవలెను. ఇదియే రాజయోగ మార్గము. అట్లే కామక్రోధాదులు తొలగిపోవలె నన్న దివ్యప్రేమను, సహనమును పెంపొందించుకొనవలెను. కామమనగా స్త్రీపురుషాకర్షణయే గాదు, కోరిక ఏదియయినను కామమే. ఇది మనలను ఆకర్షించును. ఇది నెరవేరనపుడు క్రోధ మావేశించును. ఇది వికర్షణ. మనస్సుకు ఎప్పుడును సంకీర్తనమో, భగవదర్పితముగా ఇంటి పని, సమాజము కొరకయిన పని గాని, సత్సాంగత్యము గాని, మంచి గ్రంథముల పఠనము గాని ఏదియో మంచిపని అప్పజెప్పవలెను. కామ క్రోధములు తొలగుటకు అవి లేనివారి సాంగత్యము చేయవలెను. అపుడు కామ క్రోధములు వచ్చుటకు తీరికయుండదు. తీరికయున్నచో పూర్వాభ్యాసము వలన అవి ఆవేశించును. మనల నాకర్షించు విషయములు, మనము కోపము కలిగించు ననబడు సన్నివేశములు, వ్యక్తులు గూడ భగవంతుని స్వరూపములే యని గ్రహించి దర్శించుటే దారి. ఎవరికయినను మనపై కోపము వచ్చినచో అట్టి రోగమునకు గురియగు వానిపై జాలిపడవలెను. పలుమార్లు వైరాగ్యమను పెద్ద కేక వేయవల యును. పైరును జంతువులు పాడుచేయకుండ, మిడుతల దండు, పిట్టలు ధాన్యము జోలికి పోకుండ రైతులు కేకలు వేయుచుందురు. పంట చేతికి వచ్చిన పిదప, చేతనయినమేర వానికి వేయవచ్చును. ఈలోపు వానివలన పైరుకు నష్టము కలుగనీయరాదు. అందులకై వేయు కేక ఆవశ్యకము. చిత్తమను చేనున వేయు కేక ఏమి? వైరాగ్యము. ఇందు సాధనకు విఘ్నములను తొలగించును. విఘ్నములు మనలోనే యుండును గాని, వెలుపల నుండవు. అట్లే వైరాగ్యము చిత్తములోనుండి పుట్టి వెలువడవలెను. ఇంద్రియములను ఆకర్షించువానిలో ఎఱిగిన వానిని, విన్నవానిని పట్టించుకొనకుండ వానికి లొంగకుండుటే వైరాగ్యము. కుటుంబము నెడల, సమాజము నెడల కర్తవ్యము లను విడిచిపెట్టి, కాశీకి వెళ్లిపోయి సన్న్యాసము పుచ్చుకొనుట వైరాగ్యము క్రిందకు రాదు. హృదయము లేకుండ ప్రవర్తించుట వంచన గాని, వైరాగ్యము కాదు. హృదయవైశాల్యమే వైరాగ్యము. సంసారము విశాలమయినవాడే సన్న్యాసి. ఇంద్రియములను ఆకర్షించు ఐదు విషయములందు రాగము తొలగుటే వైరాగ్యము. వర్తమానమున మనము చేయుచున్న పనిమీద నుండి దృష్టి ఏ ఆకర్షణ వైపుకు లొంగరాదు. మనము దేనియందు ప్రసరింపజేసిన, దానియందుననే మనస్సు, ఇంద్రియములు పనిచేయవలెను. తన సొంత విషయమున ధనాదులు వచ్చినను, నష్టపోయినను లొంగరాదు. ప్రపంచము మొత్తము యొక్క క్షేమము నెడల రాగము పెరిగిన, మన విషయమున వైరాగ్యము కల్గును. కావున హరియందు అనురాగము వికసించిన కొలది, విషయభోగములందు వైరాగ్యము గలుగును. వైరాగ్యమున్నది కదా యని, మనలను క్రిందకు పడవేయు సన్నివేశముల లోనికి జొరబడరాదు. నా మనస్సు పవిత్రము గావున కామప్రేరక దృశ్యములను చూచినను చెదరదు అని చూచుట పనికిరాదు. అట్లని ఆ దృశ్యములు కనపడినపుడు కనులు మూసికొని మనస్సున వానినే ధ్యానించుట ఆత్మవంచన, డంబాచారమే కాని వైరాగ్యము కాదు. ఒక స్త్రీయెడల పవిత్ర భావమున గాక, కామ భావముతో చూచినది గదా అని తన కంటిని పొడిచికొనుట వివేకమా! కంటి ద్వారమున చూడనెంచినది మనస్సు. అంతే కాని కన్ను బాధ్యమా, కాదు.

ఇట్టి సందర్భమున మనము చూడవలయునని భావింప కున్నను ఇట్టి దృశ్యములు కనపడగా, ఆ స్త్రీని జగన్మాతగా మనసారా భావించి, హృదయమున ఆరాధనాభావము పొందవలయును. ఆ దృశ్యమును చూడగోరుట అంతట ఆగిపోవును. తల్లిని కామదృష్టితో చూచుట సాధ్యమా? ప్రహ్లాదుడీ దారి నవలంబించెను. శ్రీరామకృష్ణపరమహంసయు దీనినే ఆచరించి ఉద్బోధించెను. ఆపై తానే లోకమునకు అమ్మననియు, ఎల్లరు తన బిడ్డలను హృదయపు లోతులలో భావించుటయు వైరాగ్యమునకు దోహదపడును. ఈ నిర్మల భావములు తలంపులు, భావములు మాత్రమే కాదు అనుభూతి కావలయును. అందలి రుచిని మరగవలెను. అందులకై 'నీ స్థితిని నాకీయుమని' అమ్మవారిని వేడుకొనవలెను. ఇది అభ్యాసము కావలెను. వైరాగ్య మనునది వ్యతిరేకత అను లక్షణము కాదు. అనగా రాగము లేకుండుట కాదు. ఇది అనుకూలత యొక్క వికాసము. అనగా విశిష్టమయిన, విశాలమయిన రాగము. అపుడు జీవన సంగీతము దివ్యమగు అనురాగమను రాగముతో పలుకును. తీపియందును. రాగము భౌతికము. వైరాగ్యము ఆత్మ సంబంధి. ఒక వస్తువునందరి రాగము, కోరిక ఎపుడు తొలగును? ఆహార పానీయములు కూడ లేనివారి యెడ ప్రేమ, కరుణ అను ఆత్మీయ భావము లొందుటే వైరాగ్యము. ఇది పలుమార్లు పెట్టవలసిన కేక. అనగా ఒక సందర్భమున వైరాగ్యమున్నదని అజాగ్రత్త వహింపరాదు. సదా వైరాగ్యభావము అను కేక విడువ రాదు. ఇక ఆచార విధులనగా మడి, పూజాది క్రతువులని ఇచటి యర్థము గాదు. పూజాదులు వద్దని గాదు. కాని అన్నమయ్య ఉద్దేశించినది ధర్మాచరణమును. ఏది ధర్మమో, ఏది అధర్మమో ఋషులు విధించిరి. వారు చెప్పినట్లు ధర్మాచరణమును నిర్విరామముగా చేయుచుండవలెను. అదియే ఎరువు. ప్రతిదినము ఒకే వేళకు, వీలయినంత వరకు ఒకే ప్రదేశమున ప్రార్థన, ధ్యానము వంటివి చేయుటయు క్రమశిక్షణకు మంచిది. సాధన, మనస్సున ఉన్నది యనుట చాలదు. వాక్కులో, శరీరముతో చేయు ఆచరణములోనికి దిగిరావలెను. ఉదాహరణకు 'ఆకలిగొన్న వానికి అన్నము పెట్టవలయునని నాకు మనసులో నున్నది' అనుట చాలదు. మన వద్ద వసతి ఉన్నపుడు తప్పక పెట్టవలెను. మనము మనసుతో భుజింపము గదా. నోటితోనే భుజింతుము గదా. అట్లే కొందరు ఓపిక యుండియు, సమయముండియు సంకీర్తనమును మనసుననే చేయుదునని తృప్తిచెందరాదు. హృదయముతోను, నోటితోను చేయవలెను. నోటితో చేయుటకు వీలుకానప్పుడు చిత్తమున చేయవలెను. సాధన ఎరువు వంటిది. ఎరువు వేయని విత్తనమున్నను ఎదుగదు. అట్లే హరి భక్తి యను విత్తు చిత్తమను చేనున ఉన్నను, అది ఎదిగి పంట వచ్చుటకు, సత్సాంగత్యము, సంకీర్తనము, భగవదర్పితమగు జీవితాచరణము అను ఎరువులను కొనసాగింప వలయును. ఇచట 'దోమటిన్' అనగా 'ఆపుదల లేక కొనసాగించుచు' అని అర్థము. కొన్నాళ్లు చేసితిమి గదాయని పై ఆచరణములను ఆపరాదు. సత్యపాలనము, అహింస, జితేంద్రియత్వము, ఇతరుల సొమ్మును ఆశింపకుండుట, భగవత్ చింతనము, నైర్మల్యము, ధర్మాచరణము, సేవ మున్నగునవి సాగుచునేయుండవలెను. ఏ పని యందైనను స్వామిని స్మరించుట మానరాదు. స్వామి స్మరణ లేకున్నచో ఎంత మంచి పని అయినను, పూజ అయినను బంధించును. అతిశయమునే పెంచును. ఆచరణము కొనసాగవలెను. చిరకాలము నిరంతరము సాధన సాగి, దృఢముగా నిలువవలెనని పతంజలి చెప్పెను. ఒకసారి వ్యాసులవారి శిష్యుడగు జైమిని మహర్షి

తాను జితేంద్రియుడ నైతిని, ఇక ప్రతిదినము చేయు భగవత్ స్మరణ అక్కరలేదని అతిశయించెను. ఒక నదిలో స్నానము చేయుచు భగవంతుని స్మరణను నిర్లక్ష్యము చేసెను. ఇంతలో ఒక అందమైన స్త్రీ సమీపమున స్నానమాడుచుండెను. ఆమెను చూచి జైమిని మోహితుడై ఆమెను చేరబోయెను. ఆమెయు అతనిని సమీపించెను. జైమిని ఆమెను కౌగిలించుకొనెను. అపుడు కనులు మూసియుండెను. కాని స్త్రీ యొక్క కౌగిలిగా లేదు. జైమిని కనులు తెరచెను. ఎదురుగా గురువుగారగు వ్యాసులవారు నిలుచుండి నవ్వుచుండిరి. శిష్యుని పతనము గానీయకుండ, వ్యాసులే దయతో ఆ స్త్రీ రూపము ధరించి వచ్చిరి. అదియే భగవంతుని అంతర్యామిత్వ స్మరణ కొనసాగినచో, స్త్రీ కూడ దేవుడుగనో, అమ్మవారుగనో దర్శనమై యుండెడిది గదా. మోహమునకు వశుడగుట జరిగెడిది గాదు. ఇక వ్యవసాయము చేయు జను లెవరు? ఉద్యోగపు జనులట. అనగా ఉత్+యోగము కలవారు. 'ఉత్' అనగా సర్వోత్తముడగు 'పరమాత్మ యగు నేను నందు' యోగ మనగా కలయికకై యత్నించు ఉత్తమ సాధకులు. వీరు పైరును కాపాడుకొనుచున్నారు. పైరేది? జ్ఞానము. భక్తి యను విత్తు, జ్ఞాన మను పైరుగా ఎదుగునని అన్నమయ్య ఆళ్వార్ల బోధనా సారమును చక్కగా, సోదాహరణ ముగా, సూటిగా, తేలికగా తెలిపెను. జ్ఞాన మనగా తెలియువాడు, తెలియబడునది, తెలియుట – ఈ మూటిని వెలిగించు అంతర్యామి యొకడే అను ఎఱుక. ఈ యెఱుక మేధకు సంబంధించినది గాదు. నిర్మల హృదయమునకు సంబంధించినది. ఈ పైరును కాపాడుకొనుట ఎప్పుడును మనసు దేవునియందు సమర్పణ పొందుటచే కలుగును. దీనినే ఉద్యోగమందురు. కావున భక్తి, ప్రపత్తులు లేకున్న జ్ఞానమబ్బదు. జ్ఞాన మనగా పాండిత్యము గాదు.

3వ చరణము యొక్క తాత్పర్యము

"ఎందు చూచినను శ్రీవేంకటేశు దున్నాడనెడి వ్యవసాయ ఫలితముగా అందిన పంట. దీనిని జనులు అన్నమయ్య వంటి శరణాగతులైనపుడే అనుభవించెదరు. మరియు భక్తులెల్లరు గుమికూడి, గురుదేవుల కృపతో నిశ్చయముగా తామును, తమవంటి శరణాగతులు కలిసి ఇముడు కొందురు."

వ్యాఖ్య

సాధన అను వ్యవసాయమునకు ఫలితమైన పంట ఏది? భక్తియను విత్తు, జ్ఞానమను పైరుగా పెరిగి అంతట స్వామి యున్నాడను అఖండ దివ్యానుభూతి యను పంట ననుభవించుటే. అన్నమయ్య దివ్యసందేశ మిదియే. తాను అనుభవించి యున్నా డగుటచే మనకు తన సంకీర్తనము లందు ప్రసాదించుచు, ఉపదేశించుచున్నాడు. జీవిత పరమావధి ఇదియే. భగవంతుని మూర్తిగా మాత్రమే గాక సర్వాంతర్యామిగా దర్శించి అనుభూతినొందిన మహాభక్తుడు, దివ్యజ్ఞాని, కవి, గాయకుడు, ఋషి అన్నమయ్య. ఋషి అగుటచేతనే ఇట్టి కవి కాగలిగెను. తాను కూడ స్వామి యొక్క అంతర్యామిత్వమునకు విడిగా లేడు. నిర్మలప్రేమ గల హృదయమే దేవాలయము. అదియే సాగుబడి అయిన మంచి పొలమే. అందుననే ఆనందమను పంట పండును. దేవుడు జీవులతో ఎట్లు మెలగునో అన్నమయ్య వంటి భక్తుడట్లే మెలగును. ఇదియే సాలోక్యముక్తి.

చుట్టునున్న ప్రకృతి, జీవులు దేవుడే అని దర్శించుట సామీప్య ముక్తి. తన రూపమున గూడ దేవుడే చరించుచున్నాడను దర్శనమే సారూప్య ముక్తి. చెంబులోని నీరు, నదిలోని నీటిలో బోర్ల ముంచినట్లు తన పరిమిత జీవ ప్రజ్ఞ, సర్వ వ్యాపకమయిన భగవంతుడను ఆనందసాగరమున మునుగుటయే సాయుజ్య ముక్తి. ఇవియన్నియు అన్నమయ్యకు కలిగినవి. సాయుజ్య ముక్తియే చివరగా లభించు పంటను అనుభవించుట. ఇది అనుభూతియే కాని తెలివితో గ్రహించుట కాదు. ఎందైనను స్వామి యున్నాడను అనుభూతిలో మునుగవలెనే కాని మేధతో తెలియుట చాలదు. ఇది నిరంతర సాధనను ఆచరణమున బెట్టుటలో లభించును. ఇదియే జీవనమున కావలసినది. ఇది లేనిది యెన్ని యున్నను వ్యర్థమే. ముందుగా దేవుని అతడందుము. ఆపైన నీవందుము. ఆపైన తన ప్రజ్ఞ కరగిపోగా 'నేను' అగును. "తమవంటి శరణాగతులు" అను సందర్భమున అన్నమయ్య సూచించుట లేదు. ఇతర భక్తులను సూచించుచున్నాడు. కాని మనమాతని గ్రహింపవలెను. పైన చెప్పబడిన అఖండ దివ్యానుభూతి అను పంటను తాము అనుభవించుటే కాక, భక్తులయినవారు తమవంటి శరణాగతులయిన మిగిలిన భక్తులతో గలిసి గుమికూడి పంచుకొందురు. నిజమైన రైతు తానొక్కటే పంట ననుభవింపడు. తోటివారితో పంచుకొనును. వేదకాలమున ఊరి పొలమందరిది. అందరు కలిసి వ్యవసాయముచేసి, ఫలసాయమును అందరు కలిసి అనుభవించెడివారు. అట్లే భక్తులు తోటివారితో కలిసి అనుభూతిని పంచు కొందురు. ఇట్టి సన్నివేశములు రామాయణమున వనవాసులగు ఋషుల నడుమ, వాల్మీకి నారదుల నడుమ, భారత భాగవతాదులలో వ్యాసనారదుల నడుమ, సూత శౌనకాదుల నడుమ, గోపికల నడుమ, గోపాలబాలుర నడుమ తటస్థించినవి. ఆంజనేయుడు తనకు ప్రసాదింపబడిన సీతామాత దర్శన దివ్యానందమును వానరులెల్లరకు పంచెను. రాధాదేవియు, తన కృష్ణానుభూతిని గోపికలకు పంచెను. శ్రీకృష్ణుడే అన్నము నెపమున అనుభూతిని తోటి గోపాలురకు పంచెను. ఏ భక్తు డయినను వేఱొక భక్తుని సాంగత్యమును కోరును. ఇతర రంగములలో పాల్గొనువారి నడుమనున్నట్లుగా భక్తుల నడుమ పోటీ, కలహము ఉండవు. పండితుల నడుమ ఉండవచ్చును. మేధావుల నడుమ తప్పక ఉండును. శరణాగతులగు హరిదాసులు ఒకే జీవి యొక్క అవయవముల వలె విశ్వ కుటుంబీకులై జీవించెదరు. ఈ యుగమున సమష్టి సాధనకు మిక్కిలి ప్రాధాన్యము, ఆవశ్యకత గలవు. భక్తులలో ఆత్మ యొకడే అను దివ్యానుభూతి యొకటే. ఆత్మయే స్వామి. తమకు కలిగిన దివ్యానుభూతి అను పంట కలకాలము – జన్మ జన్మలందు నిలుపవలెనన్నచో గురుకృప కావలెను. చివఱి పాదమునే 'గురుకృప' అను సమాసమునకు గురు కృపను అని గాక 'గురుకృప వలన' అను అర్థము గ్రహింపనగును. గురుదేవుల కృపతో భక్తులు అనుభూతిని నిశ్చయముగా ఇముడుకొందురు. తమలో నింపుకొందురు. తామందులో ఇమిడి పోవుదురు. అనగా లీనమగుదురు. ఒక వంద చెంబులలోని నీటిని తెచ్చి, చెంబులన్నిటిని నదీ ప్రవాహమున గల నీటిలో బోర్ల ముంచినచో, చెంబులలోని నీరు వేరువేరుగా నుండదు. ఒకటిగా నుండును. అదియే నది నీరు. అట్లే భక్తులు అనుభూతి ప్రవాహమున లీనమై, ఒకటిగా మనుగడ సాగించుట నిశ్చయము. ఈ భావము అన్నమయ్య స్వీయానుభవమునుండి వెడలినది. ఆతడు

చుట్టు గల గ్రామములలోని తన సంకీర్తనా ప్రవాహమున ముంచెత్తెను. వారొకటై మనుగడ సాగించిరి. ఆతని శిక్షణమున పైన చెప్పబడిన వ్యవసాయము గావించి ఆతనిచే భక్తులుగా తీర్చిదిద్దబడి సంకీర్తనలో పొందిన దివ్యానుభూతి జీవితములో అఖండమై, ధారాస్రవంతి కాగా అందు మునిగిరి. ఇదియే అన్నమయ్య వారికి ప్రసాదించిన పంట. ఈ పంట శాశ్వతముగా నిలబడుట గురుకృప వలన లభించును. వీరికి అన్నమయ్య గురువు కాని నిజమయిన గురువు ఈ యనుభూతిగా నయినను తాను గురువునని భావింపడు. ఇపుడు సద్గురువులని సామాన్యార్థమున వాడెను. మఱియు తన గురువును కూడ సూచించెను. ఆ గురువు యొక్క దయ వలననే తనకు, తనతోటి భక్తులకు అంతయు స్వామియే అను పంట అనుభవమునకు వచ్చినదని తెలిపెను. నా కొక్కడికే కలుగ వలెనను సంకుచితత్వము పనికిరాదు. ఎల్లరితో కలిసి అనుభవింపవలయును. భగవంతుని దయ, మనపై గురువుల ద్వారముననే కురియును. గురువుతో పనియేమి యని అతిశయించినవాడు, ఆనందమునకు నోచుకొనడు. ఆ అతిశయము పోవుటకు సాధన లోపల సాగదు. బయటకు ఎంత చేసినను ఉపయోగము లేదు. అట్లే తానే గురువునని భావించు వారికిని అతిశయము నిలుచును గావున సాధన సాగక, ఆనందమను పంట లభింపదు. ఆధ్యాత్మిక సాధనలో గురువు యొక్క ప్రాముఖ్యము తప్పనిసరి. అంతయు స్వామి అను అనుభూతిలో మునిగినవాడే గురువని అన్నమయ్య పరోక్షముగా ఇచట నిర్వచించెను. గురువు, దైవము ఒకేసారి కన్పడినచో ముందుగా గురువుకే మ్రొక్కెదనని కబీరుదాసు పల్కెను. అన్నమయ్య వంటి వాని దృష్టిలో వీరిర్వురని లేరు. గురువుగనే దైవము దర్శనమిచ్చును. మహాయోగి శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారిట్లే చెప్పిరి. కావుననే కృప అను పదము వాడబడెను. భగవదనుభూతి సిద్ధించిన పిదప కూడ అది నిలుచునది గురుకృప వలననే. కావుననే గురుపరంపర చెప్పబడినది. నిజమైన గురువు తన అనుభూతి అంతయు తన గురువు యొక్క దయయే అని భావించును. గురువును కాదని దేవుని సూటిగా చేర యత్నించువాడు అమ్మను కాదని, అయ్యను సమీపింప యత్నించువాడు. కొందరు కలియుగమున గురువుతో పనిలేదని ఒక మార్గమును నెలకొలిపి దానికి తాము గురువులగుచున్నారు. గురుకృప చందురుని వెన్నెల వంటిది. అమ్మ పెట్టు వెన్నముద్ద వంటిది. సిద్ధపురుషులగు అన్నమయ్య వంటి సద్గురువులు శాశ్వతులై, చిరంజీవులై, అమృతులై, ఎప్పుడును కొందరు భక్తులను తయారుచేసి వారి ద్వారమున పనిచేయుచుందురు. వీరు ఆ భక్తులకు భౌతికముగా దర్శనమీయ పనిలేదు. ఆవశ్యకమని భగవదాజ్ఞ అయినపుడు గురువు భౌతికముగా దర్శనమిచ్చును. మనలను హృదయకక్ష్యలోనే తమ భక్తి నొసగి, మార్గదర్శనమును కల్పింపగల మహనీయులు ఇట్టి గురువులు. అన్నమయ్య వంటి గురుదేవుల కృప మనపై వెల్లివిరియుగాక. ఈ సంకీర్తనమున తెలుపబడినట్లు జీవన వ్యవసాయము సాగి, అంతయు వేంకటేశుడను పంట అనుభవమునకు వచ్చుగాక. ఒక్కొక్కసారి అంతర్యామియను వెలుగుగా మాత్రమే కాక శ్రీవేంకటేశ్వరుడు విశ్వవ్యాపకుడై తిరుమలలోనున్న మూర్తిగనే దర్శనానుభూతి నిచ్చుచుండును. అన్నమయ్య దీనిని కూడ పొందెను. మనల నాతడు పొందించుగాక. గురువు యొక్క మహిమ ఎంతటిదనగా శాస్త్రములలో చెప్పబడిన ఆచరణ విధులలో ఏది సరియయిన దని వివాదమేర్పడినపుడు తేల్చునది పరమాత్మయే. 'నేను శాశ్వత ధర్మ సంరక్షకుడన'ని కృష్ణుడు చెప్పెను.

అట్టి పరమాత్మకు సమర్పణ పొందినచో కర్తవ్యము స్ఫురించును. లేదా పరమాత్ముని యనుభూతిలో నుండిన సద్గురువులను ఆశ్రయించినచో, వారు కర్తవ్యమును బోధించెదరు. శాస్త్రము కన్న అంతరుద్బోధమే ప్రమాణమని శ్రీ వేటూరి వారి యుద్బోధ. అంతరాత్మగా గురువనే దర్శింపవలెను. అన్నమయ్య గురువులను గూర్చి పల్లవిలో 'ఘనులని' పేర్కొనెను. ఘనులనగా గొప్పవారని కాదు. భగవ త్సాక్షాత్కారానుభూతి గల మహనీయులని అర్థము. మఱియు ఘనమనగా మబ్బు అనియు అర్థము. మబ్బు వానను వలె, వీరు దేవుని దయను భక్తులపై కురియుదురు. వైద్యశాస్త్రము కన్న వైద్యుడే రోగికి మేలు చేయగలడు. అట్లే శాస్త్రములకన్నను గురుడే ప్రమాణము. సద్గురువుకు పగ్గాలప్పగించాక ఇక చింతకు తావే లేదు. "గురువు యొక్క కృపా దృష్టియే శిష్యునకు అన్నపానీయాలు" అని షిర్డీ సాయిబాబా చెప్పిరి.

* * *

36

4వ సం-167

పదియారు వన్నెల

వరాళి

పదియారు వన్నెల బంగారుకాంతులతోడ
పొదలిన కలశాపుర హనుమంతుఁడు. ॥ పల్లవి ॥

ఎడమచేతఁ బట్టె నిదివో పండ్లగొల
కుడిచేత రాకాసిగుంపుల గొట్టె
తొడిఁబడ నూరువులతోఁ దూరుపు మొగమైనాఁడు
పొడవైన కలశాపుర హనుమంతుఁడు. ॥ పది ॥

తొక్కి యక్షకుమారునిఁ దుంచి పెడగాళ్ల సంది
నిక్కించెను తోఁక యెత్తి నింగి మోపను
చుక్కలు మోపఁ బెరిగి సూతు వద్ద వేదాలు
పుక్కిటఁ బెట్టెఁ గలశాపుర హనుమంతుఁడు. ॥ పది ॥

గట్టి దివ్యాంబరముతో కవచకుండలాలతో
పట్టపు శ్రీవేంకటేశు బంటు తానాయ
అట్టె వాయువుకును అంజనిదేవికిని
పుట్టినాఁడు కలశాపుర హనుమంతుఁడు. ॥ పది ॥

ప్రేమతోనుంటే నీవే అభివృద్ధి చెందుతావు గాని,
వతలివానికేమీ లాభము లేదు.

టీక

పొదలిన = పొంగిన, పండ్లగొల = పండ్ల గెల, తొడిన్+పడ = తొందరపడగా, ఊరువు = తొడ, తొక్కి = గట్టిగా నిలబడి, నిక్కించెను = పైకి లేవదీసెను, మోవను = తాకగా, సూతుడు = సూర్యుడు.

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య కలశాపురములో నెలకొనిన హనుమంతుని రూపమును, పరాక్రమమును, విద్వత్తును అద్భుతముగా వర్ణించెను. అతని తల్లిదండ్రు లను కూడ ప్రస్తావించెను. మరియు అతని తేజోమయ పరాక్రమాదులకు కారణమును చివరి చరణము రెండవ పాదమున తెలిపెను. శ్రీవేంకటేశ్వరుని బంటు తానగుటయే హనుమంతుని మహిమకు కారణము. వేంకటేశ్వరుని శక్తి, తేజస్సులు హనుమంతు నావేశించెనని పరోక్షముగా సూచించెను. ఇచట వేంకటేశ్వరు డనగా ఆమూర్తిగా వెలసిన శ్రీరాముడనియే. పల్లవిలో హనుమంతుని తేజస్సును, మొదటి చరణమున హనుమంతుని రూపమును, రెండవ చరణమున పరాక్రమమును, వేదవిద్యా పారీణతను, చివరి చరణములో ఆయన ధరించిన వానిని, అతని తల్లిదండ్రుల నామములను తెలిపెను. ఈ సంకీర్తనమును పాడుకొనువారికిని, వినువారికిని హనుమంతుడు ధ్యానమున స్థిరముగ నిలిచి, శక్తిని, బలమును, తేజస్సును, విద్యలను అనుగ్రహింపగలడు. రాయలసీమలోని కలశాపురమున గల హనుమంతుని అన్నమయ్య దర్శించి, పులకించి అప్పటికప్పుడే ఆశువుగ ఈ కీర్తనను పాడెనన్పించు చున్నది. రామాయణమన్న అన్నమయ్యకు ఎంతయో ఇష్టము. అందలి ప్రధాన పాత్రధారి యగు హనుమంతుడు మహాభక్తుడగుటచే, దాస్యభక్తికి ఆదర్శమగుటతో అన్నమయ్యకు ఆరాధ్యుడయ్యెను. మనకుగూడ ఇంతియే. కన్యాకుమారి నుండి కాశ్మీరము వరకు దేవాలయములు గల భక్తాగ్రేసరుడు హనుమంతుడు. కలశాపుర హనుమంతుడు విగ్రహమున స్వయంమూర్తిని అన్నమయ్యకు దర్శింపజేసెను. మన కండ్ల యెదుట హనుమంతుడు కన్పడునట్లుగా అన్నమయ్య వర్ణించెను. కలశాపురము మనము వెళ్ళి ఆయనను ఈ సంకీర్తనములో దర్శింపగలము. ఈ సంకీర్తన గానము, వినుట ఆరోగ్యప్రదము, అనారోగ్యమును తొలగించునది.

పల్లవి యొక్క తాత్పర్యము

"కలశాపురమున హనుమంతుడు పదియారు వన్నెలు గల బంగారు కాంతులతో పొంగిన ఆకృతిలో నున్నాడు."

వ్యాఖ్య

హనుమంతుడు ఉదయసూర్యుని కాంతులతో విరాజిల్లెడివాడని రామాయణమున గలదు. హనుమంతుడు మన సూర్యుని కంటె పెద్ద సూర్యు డనియు వాల్మీకి సూచించెను. కావున బంగారు కాంతులు గలవాడు. దేవునికి పదునారు కళలు గలవు. వీనిని అర్చామూర్తిని ప్రతిష్ఠించు సమయమున ఆవాహనము చేయుదురు. కాని భక్తి శ్రద్ధలతో ఇట్లు చేసినపుడే పదునారు వన్నెల – కళాతేజస్సులతో

సజీవముగా స్వామిమూర్తి దర్శనమిచ్చును. కలశాపుర హనుమంతు డిట్లు పదునారు వన్నెలతో ఉదయ సూర్య కాంతులతో, సజీవ కళతో అన్నమయ్యకు దర్శన మొసగెను. ఉదయ సూర్యుడు జ్ఞానమును, శక్తి నిచ్చును. హనుమంతుని అనుగ్రహము వలననే అన్నమయ్య అతనిపైనను, శ్రీరాముని పైనను సంకీర్తనములను, ద్విపద రామాయణమును రచించుట జరిగినది. పదునారు వన్నెలు పదునారు గుణములకు సంకేతములు. ఇవి దయ, ఔదార్యము, శౌర్యము, గాంభీర్యము వంటివి. ఇంతేగాక, పాడ్యమి నుండి పూర్ణిమ – పదునైదు కళలు, ఆపై అమావాస్య ఒక కళ కలిసి చంద్రుని కళలు పదునారు. ఈ పదునారు కళలు దేవుని విగ్రహములందు శోభిల్లుచుండును. భగవానుని ముఖము చంద్రమండలముతో పోల్చబడినది. మరి హనుమంతుడు శౌర్యసంపన్నుడు గదా, ఈయన ముఖము చంద్రుని వలె ఎట్లుండునని సంశయింప బనిలేదు. శౌర్యము దుష్టశిక్షణ చేసి, ధర్మస్థాపన, సాధు రక్షణకే గాని సహజ గుణము ఔదార్యము, చంద్రుని వలె జనులకు ఆహ్లాదము కలిగించుట. సామాన్యులను కాపాడుటకు హనుమంతుని కంటె వీరుడు శౌర్యమును ప్రదర్శించెనే గాని, ఆతని సహజ గుణము కరుణయే. కావున కోరికలు లేక రామ సేవను, వానర సేవను చేపట్టెను. వానరులకు భగవంతుని సాన్నిధ్యమును కలిగించి, వారి నైతిక స్థాయిని, ప్రజ్ఞా స్థాయిని ఉదాత్తము గావించెను. భక్తుడనగా ఇట్లుండవలెనని హనుమంతుని చూడగనే తట్టును. ముందు బలముగాదు తట్టునది. దాస్యభక్తికి స్ఫూర్తినిచ్చిన వాడాతడు.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"కలశాపుర హనుమంతుడు తన ఎడమ చేతితో పండ్లగెల పట్టియున్నాడు. కుడిచేతితో రాక్షసుల గుంపును చఱచి చంపెను. సాధు రక్షణకై, రామకార్యము నిమిత్తమై, త్వరత్వరగా తన తొడలు ముందుకు చాచెను. అనగా కాళ్లు ముందడుగు వేసెను. తూర్పు ముఖముగా నున్నాడు. ఎత్తుగా నున్నాడు."

వ్యాఖ్య

ఇది కలశాపురమున నెలకొనిన హనుమంతుని రూపము యొక్క వర్ణనము. సరళములయిన తెనుగు పదముల సొంపుతో స్వామిని మనకు అన్నమయ్య కనులకు కట్టించుచున్నాడు. హనుమంతుడు అరటి తోటలలో సంచరించుచుండునని ప్రతీతి. యోగీంద్రులు కొందరు కదళీ వనమున తపస్సు చేయుట జరిగినది. హనుమంతు డిచట తన ఎడమ చేతితో అరటిపండ్ల గెలను పట్టుకొనియున్నాడు. తనను కొలిచి, అనుసరించు వారికి వలయు ఆహారమును, తీయని దివ్యములగు అనుభవాలను ప్రసాదించుట కిది గుర్తు. కుడి చేతితో రక్కసుల గుంపును కొట్టి చంపెను. మనలోని అసుర గుణములగు కామ క్రోధాదులను చంపుట కిది గుర్తు. మొదటిది దివ్యగుణము లను ప్రసాదించుటకు – అనగా ఉండవలసినవి జీవితములో ఇచ్చుటకును; రెండవది ఉండకూడని చెడు గుణములను తొలగించుటకును గుర్తులు. తనను వేడిన సాధు జనులను కాపాడుటకై శీఘ్రముగా తొడలు కదల్చి అడుగులు ముందుకు వేయుచున్న రీతిలో హనుమంతుడు కలశాపురమున నున్నాడు. ఆతనికి గల దీనవాత్సల్యమున కిది గుర్తు. వానరులకు మృతి కల్గినపుడును, లక్ష్మణుడు మూర్ఛిల్లినపుడును హనుమంతుడే వెంటనే వెళ్ళి ద్రోణాద్రిని తెచ్చెను. సంజీవనితో వారిని

బ్రతికించెను. గాయపడిన వారిని, అవయవములు తొలగిన వారిని ఇతర మూలికలతో నయము చేసెను. తన వలెనే దీనులను, సాధువులను సేవించుటకై ముందడుగు వేయుటకు మనకు స్ఫూర్తి నిచ్చుచున్నాడు. సాధు రక్షణ, దీన రక్షణ అతనికి అత్యంతము ప్రీతి పాత్రములగు కార్యములు. ఇవి రామునికి ఇష్టము గదా! వానరులెల్లరు సాగర లంఘనమునకై వెనుకంజవేయగా, హనుమంతుడు రామస్మరణతో ముందడుగు వేసెను. మహేంద్రగిరి నుండి లేచుచు, కాళ్ళు తొందరపడినట్లు గానవచ్చెను. కలశా పురమున స్వామి తూర్పు దిక్కు ముఖము పెట్టియున్నాడు. తూర్పున తన గురువగు సూర్యుడున్నాడు. సూర్యుని ఆత్మ యగు శ్రీరాముడున్నాడు. కావున తూర్పువైపు తిరిగియున్నాడు. వారియెడల పూజ్యభావమును నెఱపుచున్నాడు. తూర్పు బ్రహ్మజ్ఞాన మును ఇచ్చు దిక్కుగా పెద్దలు పేర్కొనిరి. ఇది ఇంద్రుని దిక్కు. భక్తులకు జితేంద్రి యత్వము గల మనస్సును ప్రసాదించుటకై హనుమంతు డిచట తూర్పు దిక్కువైపు తిరిగియుండును. హనుమంతుడు జ్ఞాని, జితేంద్రియుడని అర్థము. మనకును – శరణాగతులమయినచో జ్ఞానమును, జితేంద్రియత్వమును ప్రసాదించును. సూర్యోదయ మగునది తూర్పు కొండన. ఉదయమున తూర్పు వైపుకు తిరిగి సూర్యునికి నమస్కరించు వారికి శక్తి, జ్ఞానము లభించును. సూర్యునిలో ఆత్మ యగు నారాయణుడే సర్వజగత్తుకు ఆత్మ. సూర్యునికి పూషుడనియు పేరు గలదు. పోషించువాడని యర్థము. సూర్యబింబము సూర్యుని శరీరము వంటిది. మన శరీరమున ఆత్మ ఉన్నట్లే, సూర్యబింబమున ఆత్మ ఉన్నది. వేదములోని ఈశావాస్యోపనిషత్తులో ఒక మంత్రమున్నది. సూర్యుని బంగారు బింబములోను, మానవుని దేహములోను ఉన్నది ఒకే ఆత్మ యని దర్శింపుడని. అట్టి ఆత్మయే నారాయణుడు. ఆతడే శ్రీరాముడు. సూర్యవంశ శ్రేష్ఠుడు. కావున హనుమంతుడు తూర్పు దిక్కున తిరిగి యుండుటలో సూర్యబింబమునను, తనయందును ఆత్మగా నున్న శ్రీరామునకు హృదయమున మ్రొక్కుచున్నాడని యర్థము. తూర్పు దిక్కు ఉదయకాలమున వంగి యున్నట్లు కనపడును. ఆ దిక్కును వినత యందురు. ఉదయ సూర్యుడు వైనతేయుడు. అతని యందు దాగినవాడు నారాయణుడు. ఇట్లు హనుమంతుడు గరుడ వాహనుడగు శ్రీహరినే, ఇచట శ్రీరామునిగా భావించి తూర్పు వైపున వినయముతో నిలచెనని భావము. ఈతని బలమునకు, రాక్షసులను చంపు శక్తికి ఈ వినయమే కారణము. అన్నమయ్య ఈ చరణములోన ముందు హనుమంతుని బలమును, శక్తిని చెప్పి ఆపై వానికి కారణమగు వినయమును సూచించుచున్నాడు. కలశాపురమున హనుమంతుడు ఒకవైపే తిరిగియుండును. చాల ఎత్తైనవాడు. అనగా ఎవరికి వినయ ముండునో అతడే లోకములో ఉత్తముడని సంకేతముగా అన్నమయ్య చెప్పుచున్నాడు. భగవానునికి, పెద్దలకు, ఆకాశమునకు వినయముతో నమస్కరించుచు, ఎల్లరిలోని అంతర్యామి యగు రాముని యెడల వినయముతో వర్తించువాడు గావుననే హనుమంతుడు సర్వోత్తముడు. సీతాదేవి హనుమంతుని ఇట్లు ప్రశ్నించెను. "నీవు కాబట్టి సాగరమును దాటి వచ్చితివి. కిష్కింధలో నీవంటి బలవంతు లెంతమంది గలరు?" ఆతడే అందరికన్న బలవంతుడని సీత ఎఱుగును. ఆతని వినయమును పరీక్షించుటకై ఇట్లు ప్రశ్నించినది. హనుమంతు డిట్లు బదులు చెప్పెను. "అమ్మా! అచట నాకు సమానులు, నాకన్న గొప్ప బలవంతులే ఉన్నారు గాని నాకన్న తక్కువ వారెవరును లేరు." సీతమ్మ ఇతని వినయమునకు ప్రీతినందినది.

2వ చరణము యొక్క తాత్పర్యము

"హనుమంతుడు ఆకాశమున దృఢముగా నిలబడెను. అక్షకుమారుని చంపెను. పెడగాళ్ల సందులో తన తోకనెత్తి పైకి లేవదీసెను. ఆకాశమును తాకునట్లుగా, తారకలను తాకునట్లుగా పెరిగిపోయెను. సూర్యుని వద్ద వేదములను నేర్చి, వానిని పుక్కిటబట్టెను."

వ్యాఖ్య

అక్షకుమారుడు రావణుని పెద్ద కుమారుడు. అశోకవనమును ధ్వంసము చేసి హనుమంతుడు అచటి రాక్షసులను చంపెను. ఆపై వచ్చిన జంబుమాలిని, మంత్రి కుమారులను, ఐదుగురు సేనానులను కొన్ని నిమిషముల కాలములో చంపెను. అంతట రావణు నాజ్ఞపై అక్షకుమారుడు హనుమంతునిపైకి వెడలి, తన పరాక్రమమును ప్రదర్శించెను. హనుమంతుడు ఆకాశమునకు ఎగసి, తన అరచేతి దెబ్బతో అతని గుఱ్ఱములను, రథమును గూల్చెను. అక్షకుమారుడు కూడ క్రింద నుండి ఆకాశమున కెగసెను. హనుమంతు డాతని పాదములు పట్టుకొనెను. అంతకు ముందు తాను దృఢముగా ఆకాశమున నిలబడెను. అక్షకుమారుని గరుడుడు, సర్పమును వలె పట్టుకొని వేయిమార్లు త్రిప్పి, నేలపైకి వేగముగా విసరికొట్టెను. అపుడు అక్షుని శరీరము నందలి సంధులు విరిగి చనిపోయెను. అంత హనుమంతుడు తన కాళ్ళు వెనుకకు మరల్చి వాని సందులో తన తోక నుంచి పైకి లేవదీసెను. బాల్యమున ఆకాశమును, తారకలను తాకునట్లు పెరిగెను. ఇచట సూతు డనగా సూర్యుడని యర్థము. ఇట్లు పెరిగిన హనుమంతుడు సూర్యుని వద్ద వేదములను పుక్కిటపట్టెను. సూర్యుని వద్ద హనుమంతుడు వేదాదులను నేర్చినట్లు ప్రసిద్ధి గలదు. సూర్యుని వద్దకు వెళ్ళుటకై హనుమంతుడు ఆకాశమును, తారకలను దాకెను. అంతగా తన శరీరమును పెంచెను. పూర్వమీతడే ఒక పెద్ద సూర్యుడు. అయినను నేలమీదకు వచ్చెను గాన విద్యలను నేర్వవలెను. సద్గురువు సూర్యుడాయెను. వేదములలో సూర్యునకు 'ఏకర్షి' అను పేరు గలదు. అనగా ఏకత్వమును దర్శించువాడు. తన కాంతిలోను, కిరణములలోను, వాని ప్రభావము విస్తరింపగా అనుభవించుచున్న జీవులలోను 'తన'లోనే దర్శించును. ప్రతి జీవుడు శరీరములోనికి ప్రవేశించిన సూర్యకాంతి రేణువు అని మహర్షులు చెప్పుచున్నారు. సూర్యుని చుట్టు అల్లుకొను దారముల వంటివి కిరణములు. వానితో సౌరకుటుంబము, అందలి జీవుల పరిణామము సాగుచున్నది. సూర్యునిలోని భావములే వివిధ గ్రహముల రూపములు పొందుచున్నవి. సూర్యుడు త్రయీమూర్తి యని వేదములు చెప్పుచున్నవి. సూర్యుని గమనమున సామవేదము, అతని కాంతిప్రసారమున ఋగ్వేదము, దాని ప్రభావమున యజుర్వేదమున్నవి. సూర్యుని గూర్చి 'కవి' యని వేదములలో చెప్పబడినది. సూర్యుని యూహలే గ్రహములు, భూమి, దానిపై నదీ సాగర పర్వతారణ్య భూములు, జీవులు, వీని పరిణామము. హనుమంతుడు తేజశ్శరీరుడని రామాయణమున సూచింపబడినది. ఒకసారి కాదు, ఎన్నోమార్లు ప్రకాశించు తేజమే దేహమైన వాడని చెప్పబడినది. ఇతని తేజము నుండి కాంతులు వెలువడెననియు చెప్పబడినది. రావణుడు గూడ సభలోనికి వచ్చిన హనుమంతుని గూర్చి "ఇతడు సామాన్య వానరుడు గాదు. తేజశ్శరీరి. వానర రూపమును మాత్రమే ధరించెను" అని గ్రహించెను. హనుమంతుడు

కామరూపుడు గూడ. ఆవశ్యకమైనపుడు ఏ రూపమయినను ధరింపగలడు. ఇచట సూర్యుని వద్దకు వెళ్ళుట, ఆకాశమును, తారకలను తాకుట ఎంత బలవంతులయిన వానరుల కయినను సాధ్యము గాదు. మహాబలవంతుడయిన వాలికే సాధ్యముగాదు. రావణుడు వాలిని మించినవాడని హనుమంతుని గూర్చి భావించెను. తేజశ్శరీరి కావుననే ఆకాశమును, తారకలను తాకుట, సూర్యుని చేరుట సాధ్యమయినవి. సూర్యుని మ్రింగబోవుట యనగా సూర్యునిలోని జ్ఞానమును, శక్తిని తనలోనికి ఆవహింపజేసికొనుట యని సంకేతార్థము. సూర్యుని వద్ద ధ్యానమార్గమున ఇతడు వేదములు నేర్చెను. అనగా ధ్యానమార్గమున భాషకు, భాషలోని ఊహలకు అతీత మయిన కక్ష్యలో నేర్చెనని అర్థము. ఉదాహరణకు పాశ్చాత్యులకు మన భాష రాదు. కాని స్నేహముగా నుండి పరస్పరావగాహన పొందుటకు అవకాశమున్నది. భక్తులకు భావాతీత స్థాయిలో అనుభూతి కలిగి, భగవంతుని నుండి మహర్షుల ద్వారమున విజ్ఞానము సంకల్పములుగా అందును. ఆ చిన్న సంకల్పములు తర్వాత వారికి భావములుగా, వాక్కులుగా విస్తరించును. ఇప్పటికిని కొందరు హిమాలయము లందలి మహర్షులు నేలపై ఎంతయో దూరముగనున్న భక్తులకు ఇట్లు విజ్ఞానమును ఉపదేశించుట జరుగుచునే యున్నది. అట్టి గ్రంథములు గూడ కలవు. ధ్యాన మార్గమున భక్తుడు సమర్పణ పొందినపుడు ఇతని బుద్ధి యొక్క ఉనికి మాయమై ఋషుల నుండి విజ్ఞానమందును. ఒక్కొక్కసారి కలలోను అందును. అట్టిచో హనుమంతుని వంటి కారణజన్ముడయిన మహాభక్తునకు సూర్యుని నుండి విజ్ఞానము ధ్యానపథమున అందుటలో ఆశ్చర్యము లేదు. సూర్యుడనగా బింబము మాత్రమే కాదు. మనకన్న లక్షల రెట్లు చైతన్యము గలవాడు. సూర్యునకు చైతన్యముండుట వలననే, దాని ముక్కలు జీవులలోనికి వచ్చినవి. సూర్యునకు, హనుమంతునకు ధ్యానమార్గమున అనుసంధానము జరిగినది. వేదములనగా వేదగ్రంథములని గాదు. శాశ్వతమగు సృష్టి విజ్ఞానము, ప్రకృతి ధర్మములు, భగవంతుని వైభవ సంపదగా హనుమంతుని లోగనులకు సూర్యుడు కట్టించెను. కనులకు, లోగనులకు అధిదేవత సూర్యుడే అని పురుషసూక్తమున గలదు. మన సూర్యుడు గూడ ఏడు తారకల కధిపతులగు తేజోమూర్తులగు సప్తర్షుల నుండి ఈ విజ్ఞానమును ధ్యానమున పొందెను. ఈ విజ్ఞానము సహాయముననే గ్రహ పరిణామమును, ఆయా గ్రహములపై జీవ పరిణామమును నడిపించుచున్నాడు. మన మనుకొనునట్లు సూర్యకాంతి యనునది వట్టి భౌతికము గాదు. అది వట్టి శక్తియును గాదు. సైన్సు ఇంకను తేల్చుకున్నది. సూర్యకాంతి, చైతన్యము యొక్క వ్యక్తీకరణము. సూర్యునిలో అంతర్యామి యగు నారాయణుని ప్రేమవిజ్ఞానము, జీవము కలిసి కాంతిగా వెలువడుచున్నది. ఇందున్న విద్యుత్తే జీవము. అయస్కాంతత్వమే ప్రేమ. విజ్ఞానము గూడ భావములు దాటిన స్థాయిలో ఈ కాంతిగా రూపు కట్టుకొన్నదని వేదములలోని అరుణ మంత్రములు చెప్పుచున్నవి. మనము నేర్చికొను విజ్ఞానము భావస్థాయి వరకే పరిమితము. శాస్త్రవేత్తలకు, ఋషులకు తట్టుచుండును. న్యూటన్ మహాశయునకు భూమ్యాకర్షణ శక్తి యున్నదని తట్టినది. తన తెలివితో గ్రహించినది కాదిది. ఆ సమయము వచ్చినపుడు దేవుడు కొందరికి తట్టింపజేయును. అట్లు తట్టిన విజ్ఞానమునే దర్శన జ్ఞానమనియు, అపౌరుషేయమైన వేదమనియు నందురు. వేదమొకటే అయినను మూడుగా నయినది. 1. ఋగ్వేదము – ఇది ఉచ్చారణ. 2. సామవేదము – ఇది ఉచ్చారణకు ఆధారమైన ప్రాణప్రక్రియ. 3. యజుర్వేదము – మనస్సు, దానినుండి

వెలువడు మన కర్మాచరణము. ఈ మూడును మనలోనే గాక విశ్వమున నుండి ప్రకృతి ధర్మములుగా విస్తరించుచున్నవి. మహర్షులు కూడ వేదకాలమున దేవుని నుండి వేదవిజ్ఞానమును తమ లోపల దర్శించి, ఆపై గ్రంథములుగా వెలువరించిరి. ఉదాహరణకు 3×2 = 6 అనునది శాశ్వతమయిన సృష్టి విజ్ఞానము. దీనిని ఎక్కముల పుస్తకములో వ్రాసికొనుచున్నాము. ఎక్కముల పుస్తకముల వంటివి వేదగ్రంథములు. ఎక్కముల వంటివి వేదములు. వీనిని హనుమంతుడు సూర్యుని నుండి దర్శన మందెను. శాశ్వతములను సృష్టి విజ్ఞానకోశము, ప్రకృతి ధర్మములు పూర్తిగా హనుమంతునకు సూర్యుని నుండి దర్శనమిచ్చుట వలన అన్నమయ్య వేదముల నాతడు పుక్కిటఁ బట్టెనని కీర్తించెను. ఒక్కొక్క ఋషికి కొంత కొంత అందుట జరుగును. హనుమంతునకు పూర్ణముగా అందినది. చెట్టుకొమ్మల వంటివి విజ్ఞాన శాఖలు. చెట్టే అందినది హనుమంతునకు. పుక్కిట బట్టుట యనగా వినువానికి పూర్తిగా చెప్పగల్గు శక్తి కూడ అబ్బినదని యర్థము. మహాభక్తుడగుటచే ఇతనిని మొదటిసారి చూచిన రాముడే స్వయముగా లక్ష్మణునితో ఇట్లు పలికెను. "ఇతడు నా హృదయమున ప్రవేశించెను." వేదవిజ్ఞానమునే గాక, సంస్కృతమున రచింపబడిన వేదములు గూడ హనుమంతునకు సూర్యుని కృప వలన అబ్బినవి. వీనిని సుస్వరముగా పలుకగలవా డీతడు. ఇచట సూర్యుని నుండి, వేదముల నుండి నేర్చె ననగా వేఱొక విశేషమున్నది. సూర్యునిలోని 'ఆత్మ' యగు శ్రీమన్నారాయణుని అంతర్యామిత్వము అనుభూతమైనదనమాట. కావుననే మొదటిసారి శ్రీరామలక్ష్మణులను చూచినపుడు, వీరు నరులు గారనియు, దివినుండి దిగివచ్చిన దైవస్వరూపులనియు గుర్తించెను. మరియు సౌరకాంతిని గూర్చి, సౌరకుటుంబమును గూర్చి, సౌరశక్తిని గూర్చి ఇతనికి తెలిసినదనమాట. సూర్యుని నుండి వేదములను పుక్కిటబట్టుట దివ్యాంబరధారణము, కవచకుండలములను ధరించుట – ఇవియన్నియు గలిగి హనుమంతుడు శ్రీరామునకు దాసుడయ్యెను. సాధారణముగా బలము, పరాక్రమము, శక్తి, విజ్ఞానము, సామర్థ్యము ఉన్నవాడు వేరొకరియెడ తలవంచడు. కాని హనుమంతుడు సర్వ శక్తియుక్తులున్నను శ్రీరామునికి బంటు అయ్యెను. రాముని దివ్యగుణము లాతనిని లోగొనెను. హనుమంతుని హృదయ సింహాసనమున రాముడగు శ్రీవేంకటేశుడు పట్టము గట్టుకొనెను. జ్యోతిశ్శాస్త్రమున సింహరాశి హృదయచర్యకు ప్రతీక. హృదయ స్వభావము ప్రేమ. జీవుని హృదయమున తానే యుండును. నేను ఫలానావాడను, ఇంతవాడను, ఫలానావారి కొడుకును, ఫలానా ఆమెకు భర్తను, ఫలానావారికి తండ్రిని – ఇట్టి అభిప్రాయములు గట్టిగా ముడివేసి కొనియుండును. తన పదవి, ధనము, పాండిత్యము, ప్రసిద్ధి గట్టిగా బంధించును. కాని హనుమంతుని వంటి మహాభక్తుని హృదయమున జీవుడుండడు. తాను, తన బలపరాక్రమాదులు, శక్తియుక్తులు, విజ్ఞానము గుర్తుండవు. ఉండున దొక్కడే. సర్వాంతర్యామి యగు భగవంతుడే. కావుననే హనుమంతుని హృదయ సింహాసనమున స్వామి నిలిచెను. ఇక ఇట్టి భక్తుడు స్వామికి బంటుగా, అనగా స్వామి తన ద్వారమున సంకల్పించు కార్యక్రమములకు పరికరముగా వినియోగపడును. ఇక ఇతని శరీరము, వాక్కు, బుద్ధి, బలము మున్నగునవి ఇతనివి గావు. స్వామి నుండియే కార్యసంకల్పము, నేర్పు, విజ్ఞానము, శక్తి, బలము మున్నగునవి హనుమంతునికి చేరినవి. పై చరణములలో చెప్పబడిన హనుమంతుని

సర్వశక్తియుక్తులకు ఆధారము అతని గుండెలో క్రమముగా నెలకొన్న స్వామియే యని అన్నమయ్య అద్భుతముగా తెలిపెను. ఇట్లు భక్తుని లోతు భక్తునకే తెలియును. హనుమంతుని బల జ్ఞాన రహస్యము అన్నమయ్యకు తెలియును. స్వయముగా హనుమంతుడే వానరులతో సముద్ర లంఘనమునకు ముందు ఇట్లు చెప్పెను. "నేను శ్రీరాముడు వదలిన బాణమును. కావున సముద్రమును దాటెదను." ఇట్లు రామ నామమను ముద్రను ధరించి, ఇతరులపై తనకు గల అభిప్రాయ ముద్రలతో గూడిన సంసార సముద్రమును దాటెను. తన గుండెలోని రాముడే అంతట దర్శనమిచ్చెను. రాక్షసులను సంహరించు సందర్భమున గూడ లంకలో ఇట్లు ఘోషించెను. "నేను రామదాసుడను. రామలక్ష్మణ సుగ్రీవులకు జయమగుగాక." తన గొప్పతనమును గూర్చి ఏమాత్రము ఎచటను ప్రస్తావింపలేదు. సీతాదేవి యానతిన తేజోమయ విశ్వరూపము ప్రదర్శించిన హనుమంతుడు చంద్ర సూర్యులను తాకెను. ఇదియు ఆ తల్లి దయయే యని భావించెను. హనుమంతు డిప్పటికిని శ్రీవేంకటేశుని బంటే. స్వామిని సేవించు వారిని కాపాడుటకై హనుమంతుడు దీక్ష వహించెను. స్వామిని గూర్చి సంకీర్తనము జరుగుచున్న చోట తలవంచి ఏదియో రూపమున నిలిచి యుండును. ఆనందబాష్పములతో ఆతని కనులు నిండియుండును. ధర్మమూర్తులయిన పాండవులను గూడ కాపాడెను. ఇప్పటికిని గంధమాదన పర్వతముపై నున్నాడు. వాయుదేవుని అనుగ్రహము వలన, అంజనీదేవి అను పవిత్రమూర్తికి వెంటనే జన్మించెను. 'అట్టె' అనగా మన ఊహకందని రీతిలో వెనువెంటనే అని యర్థము. వాయుసుతు డనగా అగ్ని యని వేదము చెప్పుచున్నది. ఆత్మజ్ఞానికి మిగిలినది తెలియుటలో వింత లేదు. ఆత్మజ్ఞానము విత్తనము. విజ్ఞానమంతయు చెట్టు. హనుమంతుని వేదవిజ్ఞాన మును అతని ముఖవర్చస్సును బట్టి, పలుకు తీరును బట్టి గమనించి రాముడు లక్ష్మణునితో ఇట్లనెను. "ఋగ్వేదమున శిక్షితుడు, యజుర్వేదమును ధరించినవాడు, సామవేద విద్వాంసుడు గానివాడు ఇట్లు మాటలాడజాలడు." ఇతడు ఈ మూటిని పుక్కిటబట్టిన వాడని రాముడు గ్రహించెను. ఈ వేదవిజ్ఞానమును సూర్యుని ద్వారమున హనుమంతునకు ప్రసాదించినది నారాయణుడగు రాముడే కదా. హనుమంతుడు చక్కని మాటలలో నేర్పరి. మంచిపనులు చేయువాడు. భక్తితో సంకీర్తనమును జతకూర్చి సంకీర్తనము చేయగలవాడని శ్రీరాముని భావము. హనుమంతుని మనసార ఆరాధించి, అనుసరించు వానికి బలము, ఆరోగ్యమే గాక వేదవిజ్ఞానము, ఆత్మజ్ఞానము, దైవభక్తి, సంకీర్తనమున తాను పరవశించి, శ్రోతలను పరవశింప జేయుట ప్రసాదింపబడును. దీనికి అన్నమయ్యయే తార్కాణము. భక్తితో పారవశ్య మును తానొందుచు చేయు సంకీర్తనమునే సామవేద మనియు, గాంధర్వవేద మనియు అందురు. రామాయణమున ఈ విద్యలో నిపుణులు ముప్పురు దర్శనమిచ్చెదరు. 1. శ్రీరాముడు, 2. భరతుడు, 3. హనుమంతుడు.

3వ చరణము యొక్క తాత్పర్యము

"కలశాపుర హనుమంతుడు దివ్యములయిన వస్త్రములను కట్టెను. కవచకుండల ములు గలిగియున్నాడు. సింహాసనమున పట్టాభిషిక్తుడగు శ్రీవేంకటేశునకు తాను బంటు అయ్యెను. వాయుదేవుని వరప్రభావమున అంజనీదేవికి మానవులు ఊహించని రీతిలో వెంటనే జన్మించెను."

వ్యాఖ్య

హనుమంతుడు కట్టిన వస్త్రములు అతనికి అర్చకులు కట్టినవే. కాని అన్నమయ్య కంటికి అవి దివ్యములై దర్శనమిచ్చినవి. చూచువాని సంస్కారమును బట్టి చూచు రీతి యుండును. దివ్యములనగా తమకు తాముగా వెలుగుచున్నవని యర్థము. అంబరము లనగా వస్త్రములని పై అర్థము. ఆకాశపు పొరలని విశేషార్థము. ఇది వేదార్థము. ఇట్టి వేదార్థములతో పదములను ప్రయోగించుటలో వాల్మీకి వ్యాసుల వలె అన్నమయ్య నేర్పరి. ఇట్లు స్వయముగా వెలుగుచున్న ఆకాశపు పొరలే హనుమంతుని వస్త్రములుగా అన్నమయ్యకు హనుమంతుని దయ వలన కన్పించెను. హనుమంతుని కవచము కూడ ఇతనికి కనపడినది. అన్నమయ్య ధ్యానమున హనుమంతుడు నిండి, ఇతనిని రక్షించు నిమిత్తమై కవచమును ఇతని చుట్టు ఆవరింప జేసెను. ఇదిగాక కవచ మనగా తొడుగు. భగవంతుడు హృదయమున నిలువగా భక్తుని దేహమే భగవంతునికి కవచ మగునని భాగవతము చెప్పుచున్నది. కుండలము లనగా చెవులకు ధరించు గుండ్రని నగలు. హనుమంతుని ఈ చెవిపోగుల నుండి మంచి వాక్కులు సదా వినుచుండుట అన్నమయ్యకు సంక్రమించినది. పెద్దల సన్నిధిలో మంచిమాటలు వినుటయం దాసక్తి జీవిత సాధనలో ప్రధానము. వినిన పిదప గదా, ప్రేరణ కలిగి ఆచరించి, అనుభవించునది. తానెంతటి భక్తుడయినను, జీవితాంతము వేరొకరి వద్ద మంచిమాటలు వినుచుండవలసినదే. అడిగిన వారికి చెప్పుచుండవలసినదే. ఇది వేదములో నియమము. తన ద్వారమున వెలువడుచున్న సంకీర్తనములను గూడ శ్రోతల వలెనే అన్నమయ్య పాడుచునే విని యానందించెను. ఈ స్వభావము హనుమంతుని నుండి ఇతనికి సంక్రమించినది. మొట్టమొదటగా శ్రీరామ కథను సంకీర్తనము గావించినది హనుమంతుడే. ఇతని సంకీర్తనమునకు శ్రోత సాక్షాత్తు సీతమ్మ తల్లియే. ఇట్లు కాంతులు, బలము, రాక్షసులను సంహరించు శక్తి, ఆర్తులగు భక్తులను కాపాడు సామర్థ్యము, వినయము, అక్షకుమారుని చంపు శక్తి, ఆకాశమును, తారకలను తాకుట ఇతనికి కల్గెను. అగ్నియనగా చోటులో దాగిన వేడిమి, వెలుగు, విద్యుదయస్కాంత శక్తి కలిసిన ప్రాణశక్తి. ఈ శక్తియే హనుమంతుడుగా రామాయణ కాలమున దిగివచ్చెను. సృష్టికి కేంద్రము అగ్ని. పరిధి విష్ణువు. రామాయణమున వీరే హనుమంతుడు, శ్రీరాముడు. ఒకనిని గూర్చి చెప్పునపుడు అతని తల్లిదండ్రులను, అతని గురువును చెప్పవలెను. ఆపై ఆతడు ఆరాధించు దేవుని చెప్పవలెను. అన్నమయ్య హనుమంతుని విశేషముల నన్నిటిని గూర్చి చెప్పి, అతని తల్లిదండ్రులగు అంజనీ వాయుదేవులను, గురువగు సూర్యుని, దైవమగు శ్రీవేంకటేశుని ప్రస్తావించెను. బంటును ఆశ్రయించినపుడే దైవసన్నిధికి చేరెదము. కావున ముందుగా మనము హనుమంతుని ఆశ్రయించి, కీర్తించి, ఆతని గుణముల ననుసరించి, ఆతని చేదోడుతో స్వామి ఒడిలోనికి చేరెదముగాక. ఆ కారణముననే హనుమంతుడు భక్తులను భగవంతుని సన్నిధికి చేర్చు ఆచార్యులలో అగ్రగణ్యుడని పెద్దలు చెప్పుదురు. వానరులకే కాదు, మనకును ఆచార్యుడు. అన్నమయ్య ఇట్టి ఆచార్యుల కెల్ల ఆచార్యు డగు కలశాపుర హనుమంతుని కీర్తించి ధన్యుడయ్యెను. తాను శ్రీవేంకటేశుని దాసు డయ్యెను. మనమును ఆ బాటను పట్టెదముగాక. ఈ సంకీర్తనమును పాడువారికిని, విను వారికిని హనుమంతుని ఆశీస్సులు, శ్రీవేంకటేశుని దయ అనుభూతికి వచ్చును.

* * *

37

15వ సం-50

పాపము చేరువ

గుజ్జరి

పాపము చేరువ ప్రాణునికి
ఏపున బుణ్యంబేదో గాని. ॥ పల్లవి ॥

ముక్కున నున్నది ముంగోపంబిది
ఎక్కువ శాంతం బిందున్నదో
చిక్కని యాసలు చేతిలో నున్నవి
గక్కున విరతే కానము గాని. ॥ పాపము ॥

కన్నుల నున్నది కామాంధకారము
ఎన్నిక విజ్ఞాన మెందున్నదో
ఉన్నది నాలుక నూరక దైన్యము
ఇన్నిట ధైర్యం బెరుఁగము గాని. ॥ పాపము ॥

అవిగో తనువున ననాచారములు
ఇవల సద్ధర్మం బెందున్నదో
వివర మొసఁగి శ్రీవేంకటేశ నా
భవ మీడేర్చఁగ బ్రదికితిఁ గాని. ॥ పాపము ॥

జీవితములో సంఘటించే సన్నివేశాల వలన చెదరని స్థితి రావాలి.

టీక

ఏపు = ఆధిక్యము, గక్కున = వెంటనే, విరతి = విషయసుఖాసక్తి లేకుండుట.

పరిచయము

ఈ సంకీర్తనలో అన్నమయ్య సమాజ పరిస్థితి యెడల తన ఆవేదనను వెల్లడించు చున్నాడు. అట్లని సాధారణ సంఘ సంస్కర్తలు చేసినట్లుగా సంఘ దూషణ ఈతడు చేయలేదు. మహాభక్తులకు, వట్టి సంఘసంస్కర్తలకు తేడా ఉన్నది. సాధారణ సంఘ సంస్కర్తలకు సంఘమునెడ జుగుప్స ఉండును. సంఘాన్ని ఉద్ధరించుచున్నామనే అతిశయముండును. సంఘములో వారు దోషములనే చూచెదరు. వారి యాయుర్దాయము సంఘమున దోషములు వ్రేలెత్తి చూపుటతోనే చెల్లిపోవును. ఆత్మ సంస్కరణ చేసికొనకుండగనే వీరు సంఘ సంస్కరణకు దిగజారి పడుదురు. సంఘోద్ధరణ బాధ్యతను వీరు తమకు తాముగా తమ భుజస్కంధములపై వైచికొందురు. కావుననే వీరి సామాజిక స్పృహ వారి కాలము వరకే పరిమితము. వీరి ప్రసిద్ధి గూడ శాశ్వతము గాదు. మహాభక్తు లట్లు గాదు. వీరి దృష్టిలో సంఘము దేవుని స్వరూపము. ముందుగా వీరు తమను తాము సంస్కరించుకొందురు. సంఘమును తాము సంస్కరించుచున్నామనే అతిశయభావము వీరికుండదు. సంఘము నెడ వినయముతో గూడిన ఆవేదన యుండును. వీరి సామాజిక స్పృహ శాశ్వతము. వీరి ప్రసిద్ధి కూడ ఎప్పటికిని మాసిపోదు. అన్నమయ్య ఇట్టివాడు. ఇతనికి సంఘము నెడ సానుభూతియే గాని, జుగుప్స లేదని ఈ సంకీర్తనలో తెలియుచున్నది. సంఘములో కొందరికి ఉండకూడని నడవడిని జూచి ఇతడు కరుణించెను. ఇతని యెద ఆర్ద్రమయినది. కారణము సహజ సుకుమారము గదా! పైగా తాను పొందుచున్న దివ్యానుభూతి అందరికి అందవలెనన్న తపనతో ఈ సంకీర్తనను రచించెను. విషయ భోగలాలసులను నిందింపలేదు. వారి పరిస్థితికి జాలిపడి, వారు భక్తియోగము నందలి తీయని రుచి నెరుగకుండిరని గుండెలో ఆవేదన పడినట్లు ఈ సంకీర్తనము స్పష్టము చేయుచున్నది. పైగా తన కాలమునాటి సమాజమునకే గాక, ఎప్పటి సమాజమునకైనను ఇది వర్తించును. కావుననే అన్నమయ్య ప్రసిద్ధి శాశ్వతము. చెరిగిపోనిది. ఈ సంకీర్తనము కూడ సమాజము రూపములోని స్వామికే అంకితము గావించిన వాడీతడు. సంఘమున కొందరిలో కాలక్రమమున రావలసిన పరిణామమును స్వామియే తెచ్చునని గ్రహించి, స్వామినే వేడుచున్నాడు. సంఘ సంస్కర్తల చర్యలు సంఘర్షణకు దారితీయును. మహాభక్తులగు మానవోత్తముల చర్యలు సామరస్యమునకు దారితీయును. కావున వీరు సమాజమునకు తండ్రి వంటివారు. ఇతని ఆవేదన, తండ్రి ఆవేదన. ఇక అన్నమయ్య ఋషి యొక్క గుండె అను కొండ నుండి పారిన ఆవేదనా ప్రవాహ మిట్లున్నది.

పల్లవి యొక్క తాత్పర్యము

"ప్రాణము గల జీవునకు పాపము దగ్గరగా నున్నది. పుణ్య మెట్లు పెరుగునో మరి!"

వ్యాఖ్య

పాపమనగా ఇతరులకు కీడు చేయుట. పుణ్యమనగా మేలు చేయుట. అంతియే. చనిపోయిన తర్వాత ఏదో ఉట్టి కట్టుకొని ఊరేగు భోగము కాదు. పుణ్యము పవిత్ర మయినది. ఇతరులకు మేలు చేయుట కనీసపు మానవత్వము. ఇది కానిది వ్యక్తి యొక్క ఐహిక జీవితము గూడ గడువదు. సంఘములోని వ్యక్తులు ఒకరికొకరు కలిసి జీవింపనిది, నడువనిది ఏ వ్యక్తి యొక్క మనుగడయు సజావుగా సాగదు. అయోమయములో పడును. భగవంతు డిట్లు పరస్పరము మేలు చేసికొను ఆవశ్యకతను బిగించెను. ఇచట ప్రాణుడు అను పదము ప్రయోగింపబడినది. అనగా ప్రాణము నిలుచుటకయినను, ఆ ప్రాణమిచ్చిన దేవుని యొక్క స్వరూపులగు జీవులకు మేలు చేకూర్చక తప్పదని అన్నమయ్యా హెచ్చరిక. వట్టి జప తపో ధ్యానాదులు పవిత్రతకు త్రోవ చూపునే గాని, పవిత్రతను చేకూర్చలేవు. పరహితాచరణ మొక్కటియే దానిని గూర్చునని అన్నమయ్య ఘంటాపథముగ వక్కాణించుచున్నాడు.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"ముక్కున ఎక్కువ కోపమున్నది. ఇక అధికమయిన ప్రశాంతి ఎందున్నదో. కొందరు మానవులు ఐహికమగు ఆశలను చేతిలో పెట్టుకొనుచున్నారు. ఆశలు పొడమినంత త్వరగా మానవులలో విషయభోగముల నెడ వైరాగ్యము కానరాదు."

వ్యాఖ్య

పల్లవికి ఈ చరణము అనుబంధము. అధిక ప్రశాంతి పరోపకారమున నున్నది. ఏలననగా ఇతరుల రూపములలో నున్నది స్వామియే గావున, మానవుడు చేసిన పరోపకారమునకు సంతసించి, చేసిన వానికి ప్రశాంతి నిచ్చును. ప్రశాంతి రూపమున తానే వారి బ్రతుకులో ఎల్లప్పుడు వెలసియుండును. తాను భుజించునప్పుడుకన్న, తన బిడ్డ భుజింపగా ఆ బిడ్డ ఆకలి తీరుట వలన తల్లికి ప్రశాంతి లభ్యమగుటను దేవుడే సృష్టిలో ఏర్పరచెను గదా! ఇదే ప్రేమ ఎల్లరి యెడలను విస్తరించినచో, పరమ ప్రశాంతి చిక్కును. ముక్కున కోపమున్న వారికి ఆవేశమే గాని, ప్రశాంతి యుండదు. తమ ఆశలు, చిక్కులు ఎప్పటికిని తీరవు. ఒకదాని వెంబడి ఒకటి మొలచుకొని వచ్చుచునే యుండును. ఒక ఆశ తీరినట్లు కనిపించగనే వచ్చు సుఖము, వేరొక ఆశ అను అసంతృప్తికి, దుఃఖమునకు విత్తనము. కావున ఆశ తీరుట వలన వచ్చు సుఖము వాస్తవ సుఖము కాదు. ఒక కష్టమునకు వేరొక కష్టమునకు నడుమ ఏర్పడు విరామమునే కొందరు సుఖమని పొరబడుచున్నారు. స్వామి పాదారవింద సేవాసుఖమే నిజమైన సుఖము. ఇది ఐహికములగు సుఖ దుఃఖములకు అతీత మయినది. మరియు ఇద్దరు వ్యక్తులు ఒకే వస్తువునో, భోగమునో ఆశించినచో స్వామి ఎవరికని ఇచ్చును? ఇర్వురును తన బిడ్డలే కదా! పోటీ పెరిగి, సమాజ స్థితి అస్తవ్యస్తమగును. పూర్వ కర్మఫలము లనుభవింపక తప్పదు. అంతేగాని, ప్రస్తుతము పెంచుకొన్న ఆశలు నెరవేరునని భావింపజాలము. చేతిలోనున్న ఆశలనగా మిక్కిలి దగ్గరగా మానవులు ఆశలను

అంటిపెట్టుకొన్నారనియు, తమ చేతులలోనే తమ ఆశలు నెరవేరుట యున్నదని గర్వించుచున్నారనియు అన్నమయ్య భావము. చేతులలో నున్నవయినను అవి చిక్కవట. ఎంత చక్కగా, సూటిగా చెప్పినాడు! నిజమునకు జీవి తానాశింప బనిలేదు. తన కొసగవలసిన వేవియో ఆ నిర్ణయమును దేవునకు విడువవలెను. తాము మాత్రము చేయవలసినవి చేయవలయును. చేయగోరినవి గాదు. వైరాగ్య మనునది రాగము లేని స్థితి. ఇది ఎట్లు లభించును? అంతర్యామి యయిన భగవంతుని పాదసేవలోని మకరంద మాధుర్యపు రుచిలో మరగుట వలన. అవతలివారి సుఖమే, తన సుఖముగా భక్తు డనుభవించును. అపుడు లభించునదే వైరాగ్యము గాని, ఇంటి బాధ్యతల నుండి పారిపోవుట వలన గాదు.

2వ చరణము యొక్క తాత్పర్యము

"కొందరు మానవుల కన్నులలో కామమను చీకటి క్రమ్ముకొని యున్నది. భగవంతుని తెలిసి, అనగా అనుభవించి, అట్టి జ్ఞానమును బ్రతుకుబాటలో సద్విని యోగము చేయుటను మానవుడు ఎంపిక చేసికొనవలెను. భగవంతుని యందు విశ్వాసము లేనివారు ఎప్పుడును దీనులై యుందురు. వారి నాలుకపై దిగులు ఎల్లప్పుడును తాండవించు చుండును. తమ పరిస్థితికి తామే జాలిపడి శోకమును వెలిబుచ్చుచుందురు. అన్ని పరిస్థితులలోను ధైర్యముగా నుండుట కానవచ్చుటలేదు."

వ్యాఖ్య

కోరికలను కారుచీకట్లలో కండ్లు గానక బ్రతుకను కారడవిలో క్రిందపడుటయా, అంతయు భగవంతునితో నిండియున్నదనియు, ఆయన క్రీడ అనియు గ్రహించి, బ్రతుకును ఆయనకు సమర్పణ పొంది, ఆ వెలుగుబాటలో పయనించుటయా మానవుడే తేల్చుకొనవలయును. ఇచట కామమనగా స్త్రీ పురుష శరీరాకర్షణయే గాదు, ఐహిక విషయభోగములందలి కోరిక. విజ్ఞానమనగా తాను నేర్చిన విద్యను, మరియు భగవంతుని జ్ఞానమను అనుభవమును జీవితమున తన ప్రవర్తనలో సద్విని యోగము చేసికొనుట. పదిమందికి ఉపయోగపెట్టుట. స్త్రీ పురుష శరీరధారులుగను, ఆయా శరీరములుగను ఉన్నది చైతన్యమయుడయిన భగవంతుడే. శరీరములు భౌతికముల వలె గన్పడునే గాని, ఇవి చైతన్యము యొక్క ఘనీభవ స్థితులే. భగవంతుడు పరమప్రేమస్వరూపుడు. కావున భగవంతుని రూపములగు స్త్రీ పురుష దేహములందు గల పరస్పరాకర్షణ భ్రాంతి మాత్రమే. ఇది యొక ఇంద్రజాలము. భగవంతునే స్త్రీలు పురుషులందును, పురుషులు స్త్రీల యందును దర్శింపవలెనని అన్నమయ్య ప్రబోధము. సంఘమును దేవుని స్వరూపముగా ప్రేమించువానికి సొంత కోరిక లుండవు. ఈ రెండు దారులలో ఒకటి మానవునకు అతని పరిణామ దశను బట్టి నచ్చును. కావుననే అన్నమయ్య 'ఎన్నిక' అను పదమును ప్రయోగించెను. దేవుడు సాక్షి మాత్రమే. అయితే ఏదియో ఒకనాడు జీవుడు కామమార్గము నుండి మరలి తన మార్గమును పట్టునట్లుగా పరిస్థితులను దేవుడు కరుణతో కల్పించితీరును. అందులకే ఇన్ని జన్మలు. దేవుని అంతర్యామిత్వమునందు విశ్వాసముండవలెను గాని, ఆయన గొప్పతనము, మహిమలందు చాలదు. ఇట్టి

విశ్వాసము లేనివారికి ఎంత ఉన్నను, తృప్తి యుండదు. తమ పరిస్థితికి తామే సదా సానుభూతి కలిగి యుందురు. తమకంటె కష్టములలో నున్నవారిని వీరు చూడలేరు. వారిపై కృప వహింపలేరు.

3వ చరణము యొక్క తాత్పర్యము

"శరీరమున ఆచరింపకూడని పనులు కానవచ్చుచున్నవి. ఇక ఇటువైపు మంచి ధర్మ మెందున్నదో గదా. శ్రీవేంకటేశ్వరా! ధర్మాధర్మముల వివరము నాకు తెలిపి, నన్ను ధర్మమార్గమున నడుపుచు నీ పాదముల చెంత నిలిపి బ్రదికించితివి. నా పుట్టుకను ధన్యము చేసితివి. కావున బ్రతికిపోతిని."

వ్యాఖ్య

ఆచరింపకూడని పనులు అనగా మనస్సునను, మాటలోను, చేతలలోను ఇతరులకు ఇబ్బంది కల్గించునవి, తనకు అనారోగ్యమును, అశాంతిని గూర్చునట్టివి. ధర్మ మెంత తెలిసినను కాపాడదు. ఆచరించినంత వరకే కాపాడును. అపుడే అది సత్‌ధర్మ మగును. సత్ అనగా ఉన్నది. ఉన్న తత్త్వము స్వామి యొక్కడే. అతడే పరంజ్యోతి. కావున అంతర్యామి యగు స్వామి కర్పితమయిన ధర్మాచరణమే కాపాడునని అన్నమయ్య హెచ్చరించుచు, జనులను ధర్మమునందు, దైవమునందు మేలుకొలుపుచున్నాడు. 'సత్' అను ప్రయోగమున విశేషమెంతయో గలదు. తాను ధర్మమని అనుకొన్నది ధర్మము గాకపోవచ్చును. అది వ్యామోహమై నిలిచి సాధనకు అడ్డు వచ్చును. స్వామి సంకల్పమే అసలు ధర్మమని 'సత్' అను పదములోని విశేషము. ఇట్లు ధర్మాచరణకు సంకల్పము దేవుడే. దానిని స్వీకరించు తోటి జీవుడు దేవుని స్వరూపమే. తన ద్వారమున వెలువడు ధర్మాచరణము కూడ దేవుడే. ఇట్లు కర్త, కర్మ, క్రియ మూడును దైవమే అయిన స్థితిని అన్నమయ్య అనుభవించి, మనకు ప్రబోధించుచున్నాడు. జనుల కితడు చేయునది వట్టి బోధ కాదు. వారిని తన ఆచరణతో, సంకీర్తనలతో ఆకర్షించి ధర్మము వైపు, దైవము వైపు మరల్చుట. వట్టి మంచి పనులు చేయుట చాలదు. నేను చేయుచున్నాను, ఫలానావారికి, ఫలానా పని చేయుచున్నానను స్పృహ ఉండరాదు. ఈ మూడును స్వామియే అని సమర్పణ పొందవలెనని స్పష్టముగా అన్నమయ్య 'సత్ ధర్మము' అను పదమున తెలిపెను. దేవునకు శరణందుట యనగా ఆయన మార్గమునకు, అడుగుజాడలకు శరణందుటయే. ఇట్లు శరణందిన అన్నమయ్యను ధర్మపథముననే చేయిపట్టి నడిపించి, జారిపోకుండ స్వామి కాపాడెను. కావున ధర్మమునకు మూలము శరణాగతి, సమర్పణము. భగవత్సేవ యను ధర్మము నాచరించుట వలననే పుట్టుక ధన్యమగునని అన్నమయ్య ప్రస్ఫుటము చేసెను. నిజమయిన బ్రతుకిదియే. 'నేను బ్రతికిపోతిని' అనుట తెనుగు నుడికారపు సొంపు. ఇది తెలుగు భాషలో తప్ప, ఏ భాషలోను గానరాదు.

* * *

38

5వ సం-138

పొద్దిక నెన్నఁడు

సామంతము

పొద్దిక నెన్నఁడు వొడచునొ పోయిన చెలి రాదాయను
నిదుర గంటికిఁ దోఁపదు నిమిషంబొక యేఁడు. ॥ పల్లవి ॥

కన్నుల నవ్వెడి నవ్వులు గబ్బితనంబుల మాటలు
నున్నని యొయ్యారంబులు నొచ్చిన చూపులును
విన్నఁదనంబుల మఱపులు వేడుకమీరిన యలపులు
సన్నపుఁజెమటలుఁ దలఁచిన ఝల్లనె నామనసు. ॥ పొద్దిక ॥

ఆఁగిన రెప్పల నీరును నగ్గలమగు పన్నీటను
దోఁగియుఁ దోఁగని భావము దోఁచిన పయ్యెదయు
కాఁగిన దేహపు సెకలును కప్పిన పువ్వుల సొరబులు
వేఁగిన చెలి తాపమునకు వెన్నెల మండెడిని. ॥ పొద్దిక ॥

దేవశిఖామణి తిరుమలదేవునిఁ దలఁచినఁ బాయక
భావించిన యీ కామిని భావము లోపలను
ఆవిభుఁడే తానుండిఁక నాతఁడె తానెఱఁగఁగవలె
నీ వెలఁదికిఁ గల విరహంబేమని చెప్పుదము. ॥ పొద్దిక ॥

వయస్సుతో సంబంధము లేకుండా పసివాడుగా లోపల నిలిచియుండాలి.

టీక

గబ్బితనము = కపటము; నొచ్చిన = బాధపడిన; విన్నదనము = దైన్యము; అలపు = అలసట; తోగిన = తడిసిన; సొరబు = చిక్కిపోవుట (ముడుచుకొనుట), వడలిపోవుట.

పరిచయము

ఈ సంకీర్తన యందు అన్నమయ్య స్వామికి ప్రేయసి యగు భార్య యొక్క భావమును అనుభవించుచు భక్తితో నిండిన హృదయము గలవాడై, భగవంతుని కొరకు తన ఆర్తిని వెల్లడించుచున్నాడు. స్వామి తనకు అనుభవమిచ్చి అదృశ్యుడైనాడు. స్వామి మరల వచ్చి, తన యనుభూతి నీయవలెనని ఆరాటముతో అన్నమయ్య తన చెలిని స్వామి వద్దకు రుక్మిణీదేవి అగ్నిద్యోతకుని శ్రీకృష్ణుని వద్దకు పంపిన విధముగా రాయబార మంపెను. తన ఆర్తిని స్వామికి గుండె కరుగునట్లు తెలిపి, ఆయనను తనవద్దకు గొనిరమ్మని పంపెను. ఇచట చెలి యెవరు? అన్నమయ్య గురుడే. గురుడే భగవంతుని, భక్తుని వద్దకు గొనితెచ్చును. భక్తుడు సూటిగా, స్వయముగా దేవుని చేరలేడు; దేవునకు హృదయమును సమర్పించుకొనువానికి గురుడే శిక్షణ నొసగి, భగవంతునికి భక్తుని ఆర్తిని తెలిపి, స్వామి సాన్నిధ్యమును భక్తుని వద్దకు దెచ్చును. అయితే ఇట్టి సద్గురువెవరు? తాను అప్పటికే భగవదనుభవమున మునిగినవాడై యుండవలెను. తాను అయస్కాంతమయిన వాడే, ఇనుప ముక్కను ఆకర్షించి దానిపై రుద్దినచో దానిని అయస్కాంతముగా మార్చగలడు. ఇచట దేవుని గూర్చి తెలిసిన చాలదు. దేవుని యనుభూతితో సదా మునిగియుండ వలెను. రామాయణమున భగవంతుడగు శ్రీరాముని సుగ్రీవాది వానరుల వద్దకు సద్గురువగు హనుమంతుడు గొనివచ్చిన ఘట్టము స్మరింపదగినది. భగవంతునికి, భక్తునికి సద్గురువు వారధి.

పల్లవి యొక్క తాత్పర్యము

"ప్రొద్దు ఇక ఎప్పటికి పొడుచునో, తన తరపున వెళ్లిన చెలి యింకను రాలేదు, అసలు రాదా! కంటికి నిదుర వచ్చుటలేదు. ఒక్కొక్క నిమిషము ఒక ఏడుగా గడుచుచున్నది."

వ్యాఖ్య

పూర్వము వివరింపబడిన విధముగా ఆర్తి, తాపము బాధించుచున్న సందర్భమున కాలము ఆలస్యముగా జరుగుచున్నట్లు అన్పించును. ప్రొద్దు ఎప్పటికి పొడుచునో! అనగా ఎప్పటికి స్వామి వచ్చునో! తన కనుభూతి ఎప్పటికి వచ్చునో! అని అన్నమయ్య ఆరాటము. రుక్మిణి, కృష్ణుని వద్దకు తనచే పంపబడిన గురువు ఎప్పటికి వచ్చునో, అని ఆరాటపడెను. అట్లే అన్నమయ్యయు. ఇది భగద్వియోగమును ఓర్వలేని భక్తునకు సహజమయినది. నారదుడు తన భక్తిసూత్రములలో ఇట్లు చెప్పెను. తాను చేయు కర్మలన్నియు భగవంతునకు సమర్పింపబడుట, భగవంతుడు మఱపునకు వచ్చినపుడు పరమ వ్యాకులత చెందుట భక్తికి సాధనము. "వ్యక్తులందరి రూపములలో నున్న అంతర్యామి యగు స్వామి యందలి పరమప్రేమయే భక్తి. ఇట్టి భక్తి అలవడుటకు సకల కర్మలు అంతర్యామికి సమర్పింపబడవలెను. మరియు భగవానుడు మఱపునకు వచ్చి,

జీవులు జీవులుగానే గుర్తువచ్చి దైవానుభూతి కోల్పోయినపుడు పరమవ్యాకులత కలుగవలెను. ఈ వ్యాకులతయే భగవత్ స్మరణ యగును".శ్రీరామకృష్ణులును దీనినే బోధించిరి. ఇట్లే అన్నమయ్యయు భగవదనుభూతికై పరమవ్యాకులత పొందుచున్నాడు. ఇతని కంటికి నిద్ర వచ్చుటలేదు. కనులు మూతపడుటలేదు. అనగా స్వామిని జగత్తులో వెదకుచున్నవి. వ్యక్తులలో, సన్నివేశములలో, పరిస్థితులలో, పరిసరములలో స్వామిని దర్శింప ఇతని కనులు తహతహలాడుచున్నవి. భగవంతుని యందు నిద్ర వచ్చుట లేదు. మేల్కొనియున్నాడు. "ప్రొద్దు ఇక ఎన్నడు పొడుచునో" అనగా సర్వము బ్రహ్మమయమను జ్ఞానము ఎప్పటికి తనకు అనుభవమునకు వచ్చునో అని అన్నమయ్య ఆరాటము. నిద్ర వచ్చుటలేదు అను అంశములోని నిగూఢ భావమిది. నిమిషమనగా ఱెప్పపాటు. ఒక్కొక్క ఱెప్పపాటు కూడ ఒక ఏడుగా గడుచుచున్నది. భగవద్విరహము అన్నమయ్యలో ఎంత తీవ్రముగా నున్నదో ఈ వాక్యము సూచించుచున్నది. మనము ఎంతగా జగత్తులో చేయవలసిన పనులను చేయుచున్నను, ఏ ఒక్క ఱెప్పపాటు కూడ భగవదనుభూతి లేకుండ ఉండరాదని అన్నమయ్య హితవు. అనగా కర్తవ్యములను విడిచిపెట్టుడని కాదు. దేవుని అనుభూతితో కూడిన నిమిషములతో కూడిన జీవన కాలమునే నైమిశారణ్యమందురు. మనము ఎవరికి చేయుచున్నామో, వారు స్వామియే అను ప్రేమభావము అనుభవములో నుండవలెనని అతని హితవు. ఇతడు ఇట్టి అనుభవమునకై ఆర్తితో తపించుచున్నాడు. వెళ్ళిపోయిన కాలము మరల రాదు. ఇప్పటి క్షణము వెంటనే గతములోనికి జారిపోవుచున్నది గదా! ప్రతి క్షణము భగవదనుభూతిలోనే గడుపవలెను. ప్రహ్లాదుడిట్లు తండ్రితో పలికెను, "దేవదేవుని చింతించు దినము దినము".

మొదటి చరణము యొక్క తాత్పర్యము

స్వామి అన్నమయ్యకు కనపడి తన పలుకులతో, చేష్టలతో ఇతనిని ఆనందసుధా వర్షమున తడిపించెను. ఈ విలాసమును గుర్తుకు తెచ్చుకొని అన్నమయ్య పరితపించు చున్నాడు. "స్వామి సరసముగా – ప్రేమరసముతో తన కన్నులలోనే నవ్వులను ప్రదర్శించి, నన్ను ఆకర్షించెను. స్వామి పలుకులు కపటములు, అతని ఒయ్యారములు నున్ననివి. చూపులు ఆవేదనతో కూడినవి. అపుడపుడు స్వామియు మనవలెనే దైన్యముతో మఱపులు పొందెను. వేడుకతో నాతో ఒయ్యారము మీర గడిపిన మీదట స్వామికి అలసట కల్గెడిది. చిఱుచెమటలు పట్టెడివి. స్వామి యొక్క ఈ విలాసములు తలచినంతనే నా మనసు ఝల్లనెను."

వ్యాఖ్య

కన్నులలో నవ్వులెట్లు వెలయును అను శంకకు తావు లేదు. అవతారపురుషులతో, పరమభాగవతోత్తములతో చరించినచో ఇది మనకును అనుభవమునకు వచ్చును. ఇంతకును ఆ భాగ్యము పట్టవలెను. అది స్వామి అవ్యాజకరుణ తప్ప మన అర్హతతో కూడ ఒక్కొక్కసారి సంబంధముండదు. శ్రీకృష్ణుడును కన్నులతో నవ్వగా గోపికలే కాక, గోవులు, జింకలు, చెట్లు, నదులు కూడ, ఆపై గోదమ్మయు మురిసి పొంగిపోవుట జరిగెను. అది అసాధారణమయిన నవ్వు. తోటి మానవుల నవ్వు (ఎంత మంచివారయి

నను సరే) మన మానసిక స్థాయిని, బుద్ధి స్థాయిని దాటి సంతోషమును కలిగింప జాలదు. కాని భగవానుని నవ్వు, అందునను కన్నుల నుండి వెడలు నవ్వు ఆత్మకు గిలిగింతలు పెట్టి మనో బుద్ధీంద్రియాలదులను మరపునకు దెచ్చి, అత్యుత్తమమగు దివ్యానందమును ప్రసాదించును. ఆ నవ్వెట్లుండునో అన్నమయ్య వర్ణింపలేదు. అది వర్ణనకు అతీతము. అనుభవించి తీరవలసినదే. అది చిఱునవ్వుకన్న తీయనైనది. స్వామి కంటి నుండి వెలువడు నవ్వులే చాలు భక్తులకు దివ్యానుభూతి నిచ్చుటకు. ఇక స్వామి మాటలు కపటములు. పైకి అనురాగమును అభినయించుచు గుండె నలరించి, ఆపై పట్టించుకొనని మాటలు కావున కపటపు మాట లనబడుచున్నవి. కాని నిజముగా స్వామివి కపటపు మాటలా – కావు. వారలు దానిని స్వీకరించుటయే గాక, అదే ప్రేమను తమ తోటిజీవులపై వర్షించుదాక వేచియుండును. ఆపై మాత్రమే తన నిజ దర్శనమును – అనగా భగవదనుభవమును పూర్ణముగా ప్రసాదించును. ఈలోపు స్వామి మాటలు కపటపు మాట లన్పించును. శ్రీకృష్ణుడు ప్రతి గోపికతో ఎంతో ప్రేమతో మాటలాడెను. ఎవరికి వారే తానే స్వామికి దగ్గర అన్పించు మాటలివి. కాని ఆ భావము రారాదు. అది తొలగి, ప్రతి గోపిక, మిగిలిన వారిలో స్వామిని దర్శించి, పరస్పర నిర్మల ప్రేమతో మెలగుదాక, స్వామి కనుమరుగయ్యెను. ఆపై తిరిగి కానిపించెను. అపుడు స్వామికెల్లరు దగ్గఱే యనిపించినది. ప్రత్యేకత, వ్యక్తిత్వము అఖండత్వములో లయింపవలెను. అంతవరకు స్వామి మాటలు కపటపు మాట లన్పించును. స్వామి ఒయ్యారములు సుకుమారము లయినవి. వానిని దర్శించిన వారికి పారవశ్యము కలుగును. అది అన్నమయ్యకు సిద్ధించినది. గోవులను మేపుచు, సాయంకాలమున శ్రీకృష్ణ డింటికి తిరిగివచ్చు వేళ అతని ఒయ్యారపు నడకలు వీక్షించి, గోపికల చూపు లట్లే నిలిచినవి. వారికి ఱెప్పపాటు కలుగలేదు. ఎడమ కాలిపై అడ్డముగా చాచిన కుడికాలు గలిగి కృష్ణుడు వేణుగానము చేసెను. ఆ ఒయ్యారమునకు భూమి మొత్తము పరవశించినదనియు, ఆయన పాదముద్రలు తగిలినచోట నేల పులకించి, పంట బాగుగా పండినదనియు భాగవతము చెప్పుచున్నది. ఇట్లే వేంకటేశ్వరుడు, అన్నమయ్య వద్దకు తన ఒయ్యారపు నడకలను ప్రదర్శించుచు వచ్చి అతనికి పారవశ్యము కలిగించెను. మఱియు భక్తుడు, భగవంతు నికై ఆర్తి పొందిన చూపులతో వేచియున్నట్లుగా, అంతకంటె ఎన్నో రెట్లు బాధతో, తహతహతో స్వామి చూపులు వెలయించెను. ఈ బాధ, తహతహ దేనికి? భక్తుని తన వద్దకు చేర్చుకొని యుద్ధరించుటకు. అతనిని గూడ అంతర్యామిని చేయుటకు. గోపికలకై కృష్ణ డిట్లు చూచెను. అన్నమయ్య కొరకై వేంకటేశ్వరు డిట్లు చూచెను. స్వామి సన్నిధి కొరకై భక్తులు ఎట్లు దైన్యము నొందుదురో, స్వామియు అంతకంటె ఎన్నో రెట్లు భక్తుడగు అన్నమయ్య కొరకై దీనుడై, ఆ దైన్యముతో నిండిన యెదతో తనను తాను మఱచెను. ఇది వినూత్నమగు అనుభవము. ఇచట దైన్యమనగా శోక మని భావింపరాదు. భక్తుని తన సన్నిధికి చేర్చుకొని, అతనికి తన యనుభూతి నొసంగవలెనను ఆరాటము. అది మిక్కిలి యెక్కువైనపుడు స్వామి దీనుడుగా కాన వచ్చెను. దైన్యమెంత యెక్కువగా నున్నదనగా స్వామికి తన యునికియే మరపునకు వచ్చినదని అన్నమయ్యయు గమనించెను. భగవంతుని సన్నిధిలో భక్తుడు తనను తాను మరచుట సహజము. కాని భక్తుని సన్నిధిలో భగవంతుడు గూడ తనను తాను మరచుట విచిత్రము. ఇది స్వామికి అన్నమయ్యపై గల అపార కరుణ వలన. అతని భక్తికి తాను లొంగి, తనను

తాను మరచి, మాటలు రాక, చేష్టలు లేక నిలిచెను. ఆహా! ఎంతటి మహాభాగ్యశాలి అన్నమయ్య. రాధ విషయమున కృష్ణున కిట్లు మరపు వచ్చినదని లీలాశుకుడు వర్ణించెను. రాధాదేవి, కృష్ణుని యందు చిత్తము వశముకాగా, పెరుగు లేని కుండలను కవ్వముతో చిలుకసాగినది. ఇది భక్తురాలి మైమరపు. ఇక కృష్ణుడామె హృదయమునందు తన చూపు నిలిపి, దేవు డయినను మరపు కలిగి ఒక ఎద్దును, ఆవు అని భ్రమించి పాలు పిదుకుటకై దాని నాపెను. అన్నమయ్యయు రాధ వంటివాడు. ఇచట వేరొక విశేషమున్నది. అన్నమయ్యను చూచి, అతని భక్తికి మురిసి కరుణతో స్వామి తనను తాను మఱచెను. అనగా తానిక వేరుగా నుండక, అన్నమయ్య హృదయమును ఆవేశించి, అందను భవముగా నిండెను. అన్నమయ్యకు "తాను అన్నమయ్యను" అను ప్రజ్ఞ శూన్యమై స్వామియే నిండెను. ఇంతటి ఉత్తమోత్తమమగు అనుభూతిని వెల్లడించుటకు మాటలు చాలవు. అయినను "విన్నదనంబుల మఱపులు" అను తేటతెనుగు తీయను పలుకులలో అన్నమయ్య పొదిగి ప్రకటించెను. 'మఱపు' అనునది గాఢానుభూతికి నిదర్శనము. అట్టి యనుభూతిని దేవునకే కల్గించిన అన్నమయ్య ఎంతటి ధన్యుడు! అన్నమయ్యపై ప్రేమతో, మిక్కిలి ముచ్చటతో సరదాగా స్వామి గడుపగా స్వామికి అలుపు వచ్చినది. అంతగా స్వామి ఇతనితో గడిపెను. ప్రియురాలగు భార్యతో మురిపెముతో గడిపిన భర్తకు సన్నని చెమటలు పట్టినట్లు స్వామికి చెమటలు పట్టెను. నునుచెమటలు పట్టుట ప్రణయోన్మత్తతకు గుర్తు. భక్తునకే గాక, భగవంతునికి కూడ ఈ స్థితి కలుగక తప్పలేదు. అసలు ప్రణయమనగా నేమి? భౌతికాకర్షణ గాదు. ప్ర = చక్కగా, నిండుగా; నయము = తీసికొని వెళ్లునది. భార్యను భర్త వద్దకు, భర్తను భార్య వద్దకు తీసికొని వెళ్లు తీయని భావము. వద్దకు అనగా పరస్పర శరీరముల వద్దకని గాదు. ఒకరి హృదయమును, వేరొకరి హృదయము వద్దకు చేర్చి ఒకరుగా చేయునంతటి తీయని అనుబంధము. ఇదియే స్వామికి, అన్నమయ్యకు నడుమ వెలసినది. ఇది ఉన్మత్తతను ఇరువురకును కలిగించినది. ఉన్మత్తత అనగా పిచ్చి, మహోన్నతమయిన అనుభూతి. ఎవరిని వారు మఱచిపోవునట్లు చేయునది. అదియే స్వామికిని కలిగినది. కావుననే మఱపులు, చెమటలకు సంబంధము గలదు. ఈపైన స్వామి తనను అలరించిన తీరులు, అనురాగపు ప్రకటనలు ఆగిపోయినవి. ఆర్తి పూర్ణమగుటకై స్వామి ఇట్లు ఆట ఆడెను. ఇపుడు పై తీపిగురుతులు తలపుకు వచ్చి, అన్నమయ్య మనసు ఝుల్లనుచున్నది. తీయని గురుతు గావున తీయని అనుభవము, ఆ తీయని సన్నివేశములు ఇపుడు లేవుగావున బాధ – ఈ రెండును కలిసి ఇతని మనస్సు కళవళ పడినది. ఝుల్లన్నది. గతములోని తీయని యనుభవ మొక్కసారిగా వర్తమానమున గుర్తుకువచ్చి, కలచివేసినది. ఇట్లే తన జీవితములో తటస్థించిన భాగవతోత్తములయిన వారి యొక్కయు, ఎల్లరి యొక్కయు ఎట్టి చేష్ట లయినను స్వామి లీలావిలాసములుగనే అన్నమయ్యకు అన్పించి, గుండెకు ఒక వింత అనుభూతి కలుగుచున్నది.

2వ చరణము యొక్క తాత్పర్యము

"నా కనుఱెప్పల నీరు ఆగిపోయినది. నా పైట అధికమైన పన్నీటితో తడిసియు, తడువనట్లున్నది. నా దేహము మండుచు, సెగలు చిమ్ముచున్నది. నేను అలంకరించు కొన్న పూలు వడలిపోయినవి. స్వామిని

తెమ్మని నేను పంపిన చెలి, స్వామిని నా వద్దకు తీసికొని రాలేకపోయితినని తాపముతో మండుచున్నది. నా చెలియొక్క తాపమునకు చంద్రుని వెన్నెల గూడ చల్లగా నుండక, సూర్యుని ఎండవలె మండుచున్నది."

వ్యాఖ్య

భగవానుని రాకకై, భగవదనుభవమునకై అన్నమయ్య ఆర్తి వలన పొందిన కన్నీరు ఎంతకును స్వామి రాకపోవునప్పటికి కనులు వేచివేచి, ఇంకిపోయెను. కన్నీరు స్రవించుట ఆగిపోయెను. వియోగభారము హద్దు దాటిపోయినపుడు కన్నీరు గూడ రాదు. విరహతాపము వ్యక్తమగుటకు కూడ సాధ్యము గాకున్నది. స్వామి వచ్చి తనకు రసానుభవమును ప్రసాదించునను ఆశతో పైటపై అన్నమయ్య భార్యా భావముతో అధికముగా పన్నీరు చల్లుకొనెను. కాని ఎంతసేపటికిని స్వామి రాలేదు. ఇక పైటపైని పన్నీరు కొంతమేర ఇంకిపోవుచున్నది. కావున పైట తడిసియు తడువ నట్లున్నది. అనగా చల్లుకొన్న పన్నీరంతయు పైటపై నిలువలేదు. విరహార్తికి చిహ్నమైన కన్నీరు ఇంకిపోయినది, రసానుభవముపై నున్న ఆశతో కూడిన పన్నీరు కొంతమేర ఇంకిపోయినది. అనగా స్వామి రాకయెడల కొంత ఆశ అన్నమయ్యలో మిగిలియున్నది. భగవంతుడు భక్తునిలో ఆర్తిని పెంచి, అది పరిపూర్ణమైన తరువాత తప్పక తన సాన్నిధ్యము నిచ్చి తన అనుభూతిని ప్రసాదించితీరును. భగవంతుని నుండి వెలువడిన జీవి అనేక జన్మల ప్రయాణములో సుఖము కొరకై అన్వేషించును. కాని ఆ సుఖము తనలోను, వెలుపలను ఉన్న అంతర్యామి యగు స్వామి యని తెలియక వెంపర్లాడు చుండును. ఐహిక భోగముల వలన సుఖము కలుగునని భ్రమపడును. కొన్నాళ్లకు ఆ భ్రమ తొలగి, నిజమైన సుఖము స్వామియే యని గ్రహించును. సుఖానుభూతి స్వరూపుడగు స్వామి కొరకై ఆర్తినొందును. స్వామి ప్రీతితో ఇట్టి భక్తునకు తన అనుభవమును కొంతమేర రుచి చూపించును. ఇది పై చరణములో సంకేతముగా వివరింపబడినది. స్వామి మొదట ఒక దివ్యమోహనమూర్తిగా దర్శనమిచ్చి ఆట లాడును. ఆపై విశ్వరూపుడై కాన్పించి, వివిధ లీలలతో సయ్యాటలాడును. అయినను స్వామి యనుభూతి పూర్ణముగా నిండులోపల భక్తునకు ఆర్తి ఆగదు. ఈ ఆర్తిలో తాపమున్నది, హాయి ఉన్నది. మొత్తముమీద జీవితమనగా అన్ని దశలలోను సుఖము కొరకు వెదకులాటయే. అనగా తెలిసినను, తెలియకున్నను బ్రతుకనగా భగవంతుని కొరకై అన్వేషణయే. భగవంతుని సాన్నిధ్యము చిక్కబట్టు లోపల కొంత అనుభూతియు, కొంత ఆలోచనయు కలిసియుండును. పైట పన్నీటిలో తడిసియు, తడువకుండుట దీనిని సూచించును. విరహార్తి వలన దేహము మండి సెగలు క్రమ్ముచున్నది. ఇచట భౌతికదేహమనియే అనరాదు. భౌతికదేహము లోపల సూక్ష్మదేహము ప్రాణశక్తి మయమై, ఆపై ప్రజ్ఞామయమై యున్నది. ప్రాణశక్తియే దేహమునకు ఆవశ్యకమైన మేర వేడిమిని నిలుపును. అది ఇపుడు మండి సెగలు గ్రమ్ముచున్నది. అనగా భగవంతుని కొరకైన ఆర్తి వలన సూక్ష్మదేహమున వేడిమి ఎక్కువైనది. మనస్సు గూడ మండుచున్నది. అన్నమయ్య స్త్రీ భావముతో ధరించిన పూలు వడలిపోయినవి. పూలు స్త్రీలకు ప్రీతికరములైన అలంకారములు. ఇచట పూలు వడలినవని చెప్పుటలో అన్నమయ్య భావ మిట్లున్నది. అలంకారముల పైనను, ఐహిక సుఖముల పైనను, దేహము పైనను, దేహ సంబంధముల పైనను వ్యామోహములు సడలినవి. తన వద్దకు భగవంతుని

గొనితెచ్చి, భగవదనుభూతిని కలిగించుటకు వాహికగా పని చేయుచున్న సద్గురువే ఇచట అన్నమయ్య చెలి. విశిష్టాద్వైతమున భగవానుడు సూర్యునితోను, గురువు చంద్రునితోను పోల్చబడిరి. గురువు అన్నమయ్యకు భగవ దనుభవము కలుగవలెనని తపించుచున్నాడు. ఆ తాపము తీవ్రమై వేగుచున్నది. జ్యోతిశ్శాస్త్రమున సూర్యుడు తండ్రిని, చంద్రుడు తల్లిని సూచించును. అందువలననే సద్గురువు అమ్మవంటి వాడని చెప్పబడినది. తల్లి ఎప్పుడును పిల్లల యెడల చంద్రుని వెన్నెల వంటి ప్రసన్నతనే కురియుచుండును. అట్టి కరుణను తనయందు నెఱపుచున్న తన సద్గురువు తనకొరకై తపించుచుండుట వలన, ఆయన ప్రసన్నత గూడ అన్నమయ్యకు బాధ కలిగించుచున్నది. వెన్నెల మండుట, ప్రసన్నత బాధకలిగించుట అసహజము. తన సద్గురువు తనయందు దయతో ఎంతగా తపించుచున్నాడో యని అన్నమయ్య హృదయము దహించుకొని పోవుచున్నది. అందువలన గురువు యొక్క కరుణయు, చంద్రుని వెన్నెలయు ఇతనికి బాధనే కలిగించుచున్నవి. ఇదియొక విచిత్రమైన బాధ. దీనిని భావించుటలో అన్నమయ్య రసభావనా మార్గమున శిఖరమును చేరెను.

3వ చరణము యొక్క తాత్పర్యము

"దేవతలలో శిఖ యందు గల రత్నము వంటివాడగు శ్రేష్ఠుడు తిరుమలదేవుడు. ఆ స్వామిని తలచిన, విడువక భావించిన ఈ కామిని హృదయభావము లోపల నున్నది ఆ ప్రభువే కావున, ఆతడే ఈమె భావమును, హృదయమును, విరహ తాపమును ఎరిగితీరవలయును. అంతియేకాని, ఇంకొకరికి ఇది వివరించి చెప్ప దగినది గాదు, చెప్పగలిగినది కాదు. వేఱొకడు ఎఱుగలేడుగూడ".

వ్యాఖ్య

శరీరమున తలపై శిఖ అత్యంతము పైభాగము. ఇది సహస్రార ప్రాంతము. ఇందలి మణి తిరుమల దేవుడు. ఎల్లరియందును ఆరు చక్రములు దాటగా, ఏడవదగు సహస్రారమున ఆత్మానుభూతిగా వెలసియున్నవాడు స్వామి. కావున భూగోళమున కూడ దీనికి గుర్తుగా తిరుమల – శ్రీపర్వతమున ఏడవ కొండపైన వెలసిన దేవుడని అన్నమయ్య పేర్కొనెను. దేవతలలో శ్రేష్ఠు డెవడగును? శరీరావయవములలో శ్రేష్ఠ మేది? ఈ అవయవము లన్నియు తన భాగములై, అందు అంతర్యామిగానున్న 'ఆత్మ' శ్రేష్ఠము. ఉల్లిపాయ పొరలలో ఏది గొప్పది? అన్ని పొరలు తనలో భాగములై, వానియందు అంతర్యామి అయిన ఉల్లిపాయ గొప్పది. ఆభరణములలో ఏది గొప్పది? ఇవియన్నియు దేనితో చేయబడినవో అట్టి బంగారము గొప్పది. అట్లే దేవతలెల్లరు ఎవరియందు అంగభూతులో – భాగములో, ఎవరు అంగియో – అనగా ఏ వెలుగుచేత వీరెల్లరు చేయబడిరో అట్టి అంతర్యామి యగు వెలుగు వేంకటేశ్వరుడు. ఆయనయే సర్వదేవతలలో శ్రేష్ఠుడు. ఆయన ఆత్మ. వీరు శరీరభాగముల వంటివారు. మన శరీరమునందును 'ఆత్మ'గా స్వామి ఉన్నాడు. పంచేంద్రియ ప్రవృత్తులను, ప్రాణమును, మనోబుద్ధులను నడిపించువారుగా దేవతలున్నారు. 'ఆత్మ' తాను, నేను. వీరు 'నేను'కు చెందినవారు. అట్లే మొత్తము చోటులో ఆత్మ దేవుడు. పంచభూతాది దేవతలు, జీవులు ఆయనలో భాగములు గావున ఆయనయే శ్రేష్ఠుడు. దేవత అనగా 'దివ్యత' అని యర్థము.

అనగా దేవుని యొక్క ఒక్కొక్క చర్యను సూచించును. మనలో ఒక్కొక్క పనిని చేయుటకు ఒక్కొక్క అవయవమున్నది గదా. అయితే ప్రత్యేకమగు ఉనికి దేనికిని లేదు. ఒక్కొక్క దేహ భాగమునకు రైలుబండిలో ఒక్కొక్క టిక్కెట్టుతో పని లేదు. శరీరికి ఒకటే చాలును. అట్లే దేవతలెల్లరు అంతర్యామి యగు దేవుడు చేయుచున్న ఒక్కొక్క చర్యను సూచింతురే గాని, ఆయనకన్న వేరుగా లేరు. ఇది తెలియని పాశ్చాత్యులు, భారతీయులు చాలమంది దేవతలను పూజింతురని ఎగతాళి చేసిరి. దేవత లెందరున్నను, వారెల్లరు స్వామి యొక్క గుణములే కాని వేరు కారు; గుణములకన్న అవి గలవాడు శ్రేష్ఠుడు గదా! ఇట్లు సర్వదేవతా శ్రేష్ఠుడు తిరుమల దేవుడు. జీవులు కూడ స్వామిలో భాగములే, స్వామి రూపములే. ఉదాహరణకు, ఉత్తర మహాసాగరమున నీరు, వేల మంచుగడ్డలుగా కట్టుకొనును. ఆ మంచుగడ్డలకు ఆధారము నీరే. అందున్నది నీరు. అవి నీటియొక్క స్థితి మార్పులే కాని వేరు కాదు. జీవులు కూడ దేవునితో ఇట్టి సంబంధమునే కలిగియున్నారు. వీరి సంబంధమునే శేషశేషిత్వ సంబంధమని భాగవతము, విశిష్టాద్వైతము చెప్పుచున్నవి. అంగములకు, అవి గలవానికి గల సంబంధమనమాట. అట్టి స్వామిని నిరంతరము తలచుచు, క్షణము కూడ విడువక భావించుచున్నాడు అన్నమయ్య. ఏ క్షణము దేవుని స్మరణ మానినచో, ఆ క్షణమే జీవుడుండును. జీవుని పూర్వ సంస్కారములలోని మాలిన్యములు గూడ పైకిలేచును. భక్తితో భగవంతుని స్మరించి నంతసేపు, సంకీర్తన గావించినంతసేపు మనలో మన స్థానమున దేవుడుండును. ఎప్పుడాపిన, అప్పుడే మరల మన పూర్వ వాసనలు చేరును. మరి పనులు మాని, ఎల్లప్పుడు దేవుని స్మరించుట కుదురునా? కుదరదు గదా! కావున చేయవలసిన పనులను దేవుని చేతి పనిముట్లుగా చేయుచు, ఎవరికి చేసిపెట్టుచున్నామో వారిలోను, పనులలోను, తనలోను అంతర్యామి యగు స్వామినే స్మరింపవలెను. సాధన చిక్కబట్టినప్పటికి స్వామి స్మరణ, కర్తవ్యాచరణ సమకాలికముగా సాగును. అయినను పనులు మనము చేయునవి గావు. మన వలన జరుగునవియు గావు. మన ద్వారమున స్వామియే చేయునవి. కలము పాటలు వ్రాయునా? వ్రాయునది కవి. కలము పరికరము మాత్రమే. కావున శ్రీరామకృష్ణ లిట్లు చెప్పిరి, "పనసపండు కోయుటకు ముందు నూనె పూసికొనుము. లేకున్న పనస జిడ్డు అంటుకొనును. అట్లే ఐహిక జీవితమున కర్మలలోనికి దిగుటకు ముందుగనే దేవుని స్మరింపుము. లేకున్నచో సంసారతాపమను జిడ్డు అంటును." ఈ నూనె ఎంతసేపు మన చేతికంటి యుండ వలెను? పనసపండు కోయునంతసేపు. అట్లే దైవస్మరణ ఎంతసేపు చేయవలెను? జీవనము సాగునందాక – అన్ని కర్మలలోను. ఈ ప్రశ్న ఆగిపోవు వరకు. ఆపైన ఎట్లును దైవస్మరణ సాగును. సాధన, సిద్ధి వచ్చువరకు చేయవలెను. ఆపైన సిద్ధి నిలబడుటకై చేయవలయును. శ్రీరామకృష్ణ లిట్లు చెప్పిరి, "చెట్టుపైనున్న పిట్టలు చప్పట్లు చరచినంతసేపు ఎగిరిపోవును. ఎప్పుడు చప్పట్లు ఆపుదురో, అపుడే అవి మరల వచ్చి చెట్టుపై చేరును. అట్లే సంసార వృక్షమున గల పాపవాసనలు, భగవంతుని స్మరణ యున్నంతసేపు వైదొలగి, అది ఆపగనే మరల చేరును." కావుననే అన్నమయ్య 'పాయక భావించిన' అను పదములను ప్రయోగించెను. చిన్నమాటలలో ఎంతయో సాధనకు చెందిన సందేశము నిచ్చెను. పైకి చూచినచో ఈ సంకీర్తన ఆతని స్వీయాను భూతి అన్పించును. కాని మనయెల్లరికి ఉపదేశము. అయినను ఒకటి గుర్తుండ వలయును. మనము దైవము సంకల్పించిన పనులు ఆపినచో,

అవి ఆగవు. ఇంకొకని ద్వారమున దైవము నెరవేర్చుకొనును. మనము పరికరము లగుట వలన మనము బాగుపడుదుము. అంతియేగాని దైవమునకు ఏమియు వచ్చునదియు లేదు. ఉదాహరణకు, ఆకలి గొన్నవానికి అన్నము పెట్టినచో మనము పరిశుద్ధులమై, దేవుని సన్నిధికి దగ్గరగుదుము. మనము పెట్టకున్నచో, ఆకలి గొన్నవానికి నష్టము లేదు. ఏలననగా, అతని కర్మను బట్టి అన్నము పెట్టువాడు వేరొకడు లభించును. ఒక ఓటు పెరుగవలెనను తహతహ దేవునకు లేదు. శరణాగతినంది, స్వామి సంకల్పించిన కార్యములు నెరవేరుటకు పరికరములయిన వారిని మాత్రము తన సన్నిధికి చేర్చుటకు దేవుడు ఆరాటపడును. దేవుని స్మరించినపుడు, ఆయన గుణములు మనకంటును. ఎవడికి వాడు తనను, తన చుట్టునున్న వారిని తలచినచో వారి వారి గుణము లంటును. ఎవరిని గూర్చి మనమేమి తలచుచున్నామో, అది మన మనమాట. ఫలానావాడు ఇట్టి గుణములు గలవాడని స్మరించుట జరుగగా, మనము ఆ గుణములు గల వారమగుచున్నాము. మంచివైనను, చెడువైనను ఇదియే సత్యము. కావున భగవంతుడు తన వద్దకు వచ్చి, తన అనుభూతి నిచ్చుటకు గాను, ఆయన మంచి గుణములను తాను పొందవలయుననియు, అందుకుగాను క్షణము వదలక స్వామిని భావింపవలయు ననియు, అన్నమయ్యకు తెలియును. కావున దానినే సాగించెను. తాను కామిని యట. కామిని యనగా కామము – కోరిక గలది. తాను స్వామియందు కోరిక గల స్త్రీ అని ఆతడు భావించెను. ఈ కోరిక, మిగిలిన కోరికలను కాల్చివేయును. కావుననే 'కామిని' అను పదమును అన్నమయ్య ప్రయోగించెను. 'దేవుడు సర్వాంతర్యామి' అని అన్నమయ్య అనుభవమున కెఱుక. కావున తన హృదయమున గూడ ఆతడే యున్నాడు గావున అందలి భక్తిభావముగా, విరహార్తిగా ఉన్నది గూడ అంతర్యామియగు స్వామియే. కావున దాని నాత డెఱుగు నని అన్నమయ్య దృఢ విశ్వాసము. తన విరహమును చెప్పుటకు వలనులేదు. విరహముతో గూడ అన్నమయ్య దేవునే భక్తితో నిత్యము స్మరించుచుండుటచే, ఇక మాటలేమి వచ్చును? పైగా చెప్పవలసిన పనిగూడ లేదు. తనలోని దేవునకు అంతయు తెలియును. దేవుడు సహస్రారమందు దివ్యజ్ఞానానుభవముగను, హృదయమునందు ప్రేమానుభూతిగను ఉన్నాడు. కావున తనపై ప్రేమతో తప్పక తనవద్దకు చేరి తన అనుభూతి నిచ్చునని అన్నమయ్య విశ్వాసము. మరి ఇచట గురువు పాత్ర యేమి? గురు రూపముగా నున్నది గూడ దేవుడే. సిఫారసు చేయునది, చేయించుకొనునది ఆతడు. ఈ సంకీర్తనమున వేరొక గొప్ప విశేషమున్నది. భక్తుడు భగవంతుని చేరుట జరుగదు. భగవంతుడే భక్తుని వద్దకు చేరి అతనిని తనలోనికి స్వీకరించును. మనము దేవుని పొందుట అనునది సరికాదు. దేవుడే మనలను పొందును. కాని ఇది అనుభవ ముతో తెలియుటకు ముందు మనము దేవుని పొందవలయునని అనుచుందురు. మంచుగడ్డ నీటిలో కరగుట జరుగును కాని, నీరు మంచుగడ్డలో కరుగునా? నదిలోని నీటిని ఒక సీసాలోనికి పట్టుచుందుము. సీసాను నదీజలములపైన వెల్లకిల ఉంచుట సాధారణ జీవితము. అట్లుగాక సీసాను నదీజలములలో బోర్లించి ఉంచగా, సీసాలోని నీరు నదీజలములలో లీనమగును. ఇదియే ఎడతెగని భగవదనుభూతి గల భక్తుని జీవితము. నది నీరే భగవానుడు. సీసాలోని నీరే జీవుడు. సీసాను నదీ జలములలో బోర్లించుటయే పరాభక్తి. ఈ స్థితి అన్నమయ్యను పొందినది.

* * *

39

3వ సం-322 **భక్తి నీపై దొకటె** శుద్ధవసంతము

భక్తి నీపైదొకటె పరమసుఖము
యుక్తి చూచిన నిజం బొక్కటే లేదు. ॥ పల్లవి ॥

కులమెంత గలిగె నది కూడించు గర్వంబు
చలమెంత గలిగె నది జగడమే రేఁచు
తలఁపెంత పెంచినాఁ దగిలించు కోరికలు
ఎలమి విజ్ఞానంబు ఏమిటా లేదు. ॥ భక్తి ॥

ధనమెంత గలిగె నది దట్టమౌ లోభంబు
మొనయుఁ జక్కందనంబు మోహములు రేఁచు
ఘనవిద్య గలిగినను కప్పుఁ బైపై మదము
ఎనయఁగఁ బరమపద మించుకయు లేదు. ॥ భక్తి ॥

తరుణు లెందరు అయిన తాపములు సమకూడు
సిరులెన్ని గలిగినను చింతలే పెరుగు
ఇరవయిన శ్రీవేంకటేశ నినుఁ గొలువఁగా
పెరిగె నానందంబు బెళకు లిఁకలేవు. ॥ భక్తి ॥

ఎదుటివాళ్ల కంటే మనం ఏవిధంగా గొప్పవాళ్లమో అని గుర్తుంచు కున్నవాడికి బ్రహ్మవిద్య ఎట్టి పరిస్థితులలోను బోధపడదు.

టీక

మొనయున్ = ఒప్పుచున్న; ఎనయగన్ = పొందుటకు; బెళకులు = చలనములు.

పరిచయము

ఈ సంకీర్తనమున భగవదానందమును అడ్డుకొను ఉండకూడని లక్షణములను అన్నమయ్య పేర్కొనెను. ఇవి గర్వము, కలహప్రీతి, కోరికలు, లోభ మోహ మదములు, తాపములు, చింతలు. ఇవి మానవుని మనస్సులోని విఘ్నములే కాని, బయట నున్నవి గావు. కాని కొన్ని పరిస్థితులు వీనిని పెంచుటకు అవకాశము లిచ్చును. ఈ దుర్గుణములు విత్తుల వంటివి. వీనిని పెంచుటకు దోహదపడు ఎరువుల వంటి కొన్ని పరిస్థితులు గలవు. ఒక్కొక్క గుణమును పెంచునది ఒక్కొక్క పరిస్థితి. వీని సంబంధమును అన్నమయ్య చక్కగా వర్ణించెను. ఇది ఒక సామాజిక శాస్త్రవేత్త యొక్క పరిశోధన వలె కన్పించును. కాని వాస్తవమునకు అన్నమయ్య ఆధ్యాత్మిక పునాదిగా గల సమాజమును దర్శించినవాడు. కావున ఈ ఆధ్యాత్మికత యొక్క నేపథ్యమున, సమాజమును ఇతడు సమగ్రముగ పరిశీలించెను. అది యొక సంఘ సంస్కర్త వలె గాదు. తననే సంస్కరించుకొనని వాడు సంఘము నేమి సంస్కరించును? సంఘ సంస్కరణకై ప్రత్యేక ప్రయత్న మక్కరలేదు. చరణములలో చెప్పబడిన చెడు గుణములు తొలగు నుపాయమును కూడ అన్నమయ్య దృఢముగా పేర్కొనెను. అదియే భక్తి. దీనిని పల్లవిలో పొందుపరచెను. కావున చరణము లందలి భావమును పల్లవితో జోడింపవలెను. చివరి చరణమున జీవిత పరమావధి యగు ఆనందమును నిర్దేశించెను. దానికి వలయు సాధనము శ్రీవేంకటేశుని కొలుచుట యనియు స్పష్టము చేసెను. ఇట్లు భక్తి, స్వామి సేవ వికసించినచో, వ్యక్తిగత స్థాయిలోను, క్రమముగా సమాజ స్థాయిలో ఈ దుర్గుణములు తొలగును. ఉత్తమ సమాజ మేర్పడును. సమాజమున వ్యక్తులు భాగములు. సమాజ శరీరి స్వామి. జీవులు ఆయనలో భాగములు. ఈ యంశమును గుర్తించి, స్వామిని భక్తితో సేవించినచో వ్యక్తి శీల ముత్తమమై, సమాజమున సమష్టి చైతన్య మేర్పడును. వ్యక్తికి, సమాజమునకు మంచి సంబంధము లేర్పడును. ఇవి కాకుండ, ఎంతగా ఆర్థికమయిన ప్రణాళికలు, రాజకీయములయిన మార్పులు (ఉదాహరణకు రాచరికము నుండి ప్రజాస్వామ్యము నకు), సాంఘిక సంస్కరణలు చేపట్టినను సఫలము గానేరవు. ఇవి చేపట్టువారు, ఈ కార్యక్రమములలో పాల్గొనువారు, ఉత్తమ శీలవంతులు గాకున్నచో పేర్ల మార్పే గాని వ్యవస్థ అట్లే యుండును. ఈ కార్యక్రమములు పామరజనుల స్థాయికి చేరవు. సమాజమున సమష్టి చైతన్యము వచ్చినపుడే పురోగతి లభించును. అందుకు వ్యక్తులు శీలవంతులు గావలెను. శీలము వ్యక్తిగతము, సామాజికమని రెండు విధములు. ఒకడు నిత్యము దేవుని పూజింపవచ్చును. ఎవరి జోలికి పోడు, మద్యపానాది దురభ్యాసము లతనికి లేవు. మంచిదే. ఇది వ్యక్తిగత శీలము. కాని ప్రక్కవాని ఇల్లు తగులబడుచున్నను పట్టించుకొనకుండుట సామాజిక శీలము లేకుండుట యగును. ఇట్లు రెండు రకముల శీలములు వికసింపవలెను. దీనికి పునాది ఎల్లరియందును అంతర్యామిని దర్శించి ప్రేమించి సేవించుటయే. దీనినే అన్నమయ్య పల్లవి యందును, చివరి చరణము నందును నిర్దేశించెను. అపుడు వ్యక్తిగా బ్రహ్మానందము, సమాజమున సుఖశాంతులు

వర్ధిల్లునని ఉద్ఘాటించెను. అన్నమయ్య ఆధ్యాత్మికత పునాదిగా సాంఘిక వ్యవస్థను దర్శించి, ఉత్తమ వ్యవస్థను నిర్దేశించిన మహనీయుడు, ప్రవక్త. ఈతని భక్తి శ్రీవేంకటేశ్వరుని దివ్యమంగళమూర్తిని కొలుచుటతో ఆగలేదు. విశ్వవ్యాప్తి నందినది. ఈ సంకీర్తనమున ఈయన చెప్పిన అంశములు ఇప్పటికిని, ఎప్పటికిని వాస్తవములే. వీనిలో కొన్నిటిని మహాభారతమున విదురుడు బోధించెను. అన్నమయ్య పేర్కొనిన దుర్గుణములు ఆయా పరిస్థితులలో పెరుగుట కవకాశము గలదనియే అతని యుద్దేశ్యము. అంతియేకాని తప్పక ఈ గుణములు పెరుగునని గాదు. ఆయా అనుకూల పరిస్థితులున్నను, దుర్గుణములు లేకుండిన ప్రహ్లాదుని వంటి వారు గలరు. అన్నమయ్యయు ఇట్టివాడే.

పల్లవి యొక్క తాత్పర్యము

"నీపై భక్తి ఒకటే అత్యంత శ్రేష్ఠమయిన సుఖము. నేర్పుతో పరిశీలించిన ఇంత కంటె నిజము వేరొకటి లేదు."

వ్యాఖ్య

మనము సుఖము లనుకొన్నవి మన కిష్టమయినపుడు కలుగునవి. ధనాసక్తి గలవానికి ధనము, అధికార పిపాస గలవానికి అధికారము చేకూరినచో సుఖము కల్గునను భ్రాంతి గలుగును. ఇది నిజమయిన సుఖమయినచో శాశ్వతము గావలయును గదా. ధనాదులు నశింపగనే ఈ సుఖము కూడ నశించును. అసలు ఇట్టి సుఖము ననుభవించునప్పుడు గూడ నరుడు ఇంతకంటె పైసుఖమును గూర్చి చింతించుచు సుఖపడలేడు. ప్రతి భౌతిక సుఖము, దుఃఖ మను వృక్షమునకు విత్తనము. మానవుని దృష్టిలో సుఖమనగా రెండు దుఃఖముల నడుమ గల విరామమే గాని అసలయిన సుఖము అనుభవమునకు రాదు. ఇట్లు పరిస్థితులపై ఆధారపడిన సుఖములు సుఖభ్రాంతులే గాని సుఖములు గావు. ఎండమావిలో నీటివంటివి. మిక్కిలి శ్రేష్ఠమైన సుఖమేది? శాశ్వతమయినది, సహజమయినది, బయటి పరిస్థితులపై ఆధారపడనిది. ఈ సుఖమునకు పుట్టుక, నాశము లేవు. మొదలు, చివరలు లేవు. కావున ఇట్టి సుఖమే నిజమైనదనియు, దానికి సాటి వేరొకటి లేదనియు అన్నమయ్య చమత్కరించుచున్నాడు. నిజమనగా పుట్టుక లేనిది, మొదలు లేనిది. కావున దీనికి వినాశము, చివర కూడ ఉండవు. ఇది ఏది? పుట్టుక, నాశము లేనివాడగు భగవంతుని యందు గల ప్రేమయే. వాస్తవమునకు ప్రేమయు, ఆనందము నొకటే. పదియేండ్ల క్రితము తప్పిపోయిన కుమారుడు అకస్మాత్తుగా కనపడగనే తల్లికి ప్రేమ ఉబికి పొంగును. అపుడానందము కల్గును. మాటలు కొంతసేపటి వరకు రావు. కావున ప్రేమయే ఆనందము. అయితే ఈ యుదాహరణమున తల్లికి తన కుమారుని పైననే ప్రేమ పరిమితమయినది. పిల్లవాడు దూరముకాగానే, ఆనందము దూరమగును. లేదా పిల్లవానికి కష్టము వచ్చిన యెడల ఈమె సుఖమును కోల్పోవును. అట్లుగాక ఇదే ప్రేమ అపరిమితమై, ఎల్లరిపైనను విస్తరించినచో నిర్మలమగును. అనంతమగును. అపుడు కలుగునది అనంత సుఖము. ఇందు కొందరియందు ప్రత్యేక వ్యామోహమునకు తావు లేదు. తన పిల్లలపై ప్రేమను విడిచిపెట్టుడని అర్థము

గాదు. విశ్వకుటుంబములో వారును ఒకరు. కాకున్న, వారి యెడల కర్తవ్యములుండును. ప్రేమ మాత్రము పరమమగును. అపుడు గలుగు సుఖము కూడ పరమమే. అంతకంటే సుఖము లేదు. ఈ పరమప్రేమనే 'భక్తి' యని నారదుడు తన భక్తి సూత్రములలో నిర్వచించెను. అనగా ఒక వ్యక్తి యెడల పరిమితముగా గాక, సర్వము నందు గల ఒకేయొక వెలుగగు అంతర్యామి – స్వామి యెడల విస్తరించినచో దానిని భక్తి యందురు. భక్తిలో వివక్ష యుండదు. ఈ పరమప్రేమలో గుర్తింపు కొరకు, ప్రతిఫలము కొరకు అపేక్ష యుండదు. కారణముండదు. దేవునియందు, దైవస్వరూపమగు సమాజము నందు గల ప్రేమకు కారణ మేదియు నుండదు. మరి ఈ పరమప్రేమయే ఆనందము. కావున అన్నమయ్య సర్వాంతర్యామి అయిన దేవునిపై గల పరమప్రేమయే పరమ సుఖమని పేర్కొనెను. ఇతడు చెప్పినది తర్కమున కందదు. ఎవనికి వాడనుభవించి తీరవలయును. భగవంతుడు పరమప్రేమ స్వరూపుడు. అది యొక జీవనదీ ప్రవాహము. కావున స్వామి ఆనందస్వరూపుడు. స్వామియే సత్యస్వరూపుడు, ప్రేమ స్వరూపుడు, ఆనందస్వరూపుడు. ఆతని కథలను వినుట, నామమును స్మరించుట, వైభవమును సంకీర్తనము చేయుట స్వామి యందలి భక్తికి దోహదము చేయును. చివరకు జీవితమున సర్వ కర్మాచరణమును అంత ర్యామికి సమర్పించుట, స్వామిని మఱచినపుడు ఆ స్థితిని తట్టుకొనలేకపోవుటయు భక్తికి వలయు సాధన సామగ్రి. వ్యక్తులను చూచుట, సన్నివేశములను, పరిస్థితులను గమనించుట రాగద్వేషములను, ఫలితముగా సుఖ దుఃఖములను కల్గించును. అంతర్యామి యగు స్వామిని, స్వామి లీలలను ప్రేమగా దర్శించుట సుఖ దుఃఖములకు అతీతమయిన పరమ సుఖముగా నగును. పరమసుఖ మనగా పరిస్థితులపై నాధారపడని సుఖము. సహజ సుఖము. భగవంతుని స్మరించుట వలన ఆయన సహజ గుణమగు పరమప్రేమ మన కబ్బును. మనము కూడ ఆయన నుండి వచ్చినవారమే గావున మనకు ఇదియే సహజగుణము. ఇది కల్గినచో పరమసుఖము కల్గును. దీనినే కృష్ణుడు అత్యంత సుఖమనియు, ఉపనిషత్తులు బ్రహ్మానందమనియు పేర్కొనుట జరిగినది. ఇదియే నిజము. ఎంత నేర్పుగా పరిశీలించినను ఇంతకంటె సత్యము లేదని అన్నమయ్య ఉద్ఘాటించుచున్నాడు. పరమప్రేమయే పరమసుఖమని ఆత డనుభవించి తెలిపెను. యుక్తిగా పరిశీలించుడని ఆతడు సూచించెను. యుక్తి అనగా నేర్పు అని ఒక అర్థము. అసలయిన అర్థము కూడియుండుట. పూవు నందలి రేకల వలె అంతరాత్మ యగు స్వామి యందు తన బుద్ధిని, మనస్సును, ఇంద్రియములను కూర్చుకొనుటయే యోగము. ఇదియే యుక్తి. అనగా స్వామికి వీనిని సమర్పించినచో నిజమైన సుఖ మేదియో తెలియనగును. గీతలో 'యుక్తి' అను పదమును కృష్ణుడీ అర్థములోనే వాడెను. ఇదియే సరియగు నేర్పు. అంతియే కాని యుక్తి అనగా ఇచట ఉపాయము గాదు.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"కులము – వంశము ఎంత గొప్పదయినచో అంతగా గర్వము కలుగును. పంత మెంతగా కల్గిన, అది కలహమునే రెచ్చగొట్టును. తలచుట ఎంత పెరుగునో, అంతగా కోరికలు పెరుగును. ఈ మూటిలో ప్రీతి కల్గించు విజ్ఞానము లేనే లేదు."

వ్యాఖ్య

కుల మనగా గుంపు అనియు, వంశ మనియు అసలు అర్థము. నవీన కాలమున కుల మను మాటకు వేరొక అర్థము వచ్చినది. వేదకాలమున ప్రస్తుతమున్న కులములు లేవు. వర్ణవ్యవస్థ యున్నదని వేదసూక్తములు తెలుపుచున్నవి. వర్ణములు వేరు, కులములు వేరు. వర్ణములు ఒకడు చేయు పనిని బట్టి, దానియందు అతనికి గలుగు అభిరుచిని బట్టి నిర్ణయింపబడును, జన్మను బట్టి గాదు. కులము జన్మను బట్టి నిర్ణయింపబడుచున్నది. అగ్రకులమున పుట్టిన వారమని కొందరికి గర్వము పెరిగి తక్కువ కులముల వారిని తక్కువగా చూచుట కలదు. అట్లే గొప్ప వంశమున పుట్టినచో, మాది ఇంత గొప్ప వంశమను గర్వము పెరుగును. తాను శరీర మను భ్రాంతియే దీనికి కారణము. కుల మనునది మానవుని అభిప్రాయమే గాని సత్యము గాదు. మేము భరతవంశీయుల మను గర్వము కౌరవులకు ఉండెడిది. అది వినాశము నకు దారితీసినది. పంతము పెరిగినచో కలహమును రేపును. ఒకడు అవతలి వానిని ఒక నింద చేసినచో, నిందింపబడిన వాడు సహించినచో ఇబ్బంది లేదు. ఇతడు కూడ పంతముతో అతనిని మరల నిందించుట, ఆపై పగబూనుట ఇర్వురి నడుమ కలహమును రెచ్చగొట్టును. నిందించుట ఉద్రేకము. ప్రాణమయ కక్ష్య, నింద వలన, కోపము వలన గందరగోళమై, చెదరగొట్టబడి రోగములు కల్గించును. నిందను సహించినచో కొన్నాళ్లకు నిందించిన వాడు సర్దుకొనును. ప్రేమ అతనిని సరిచేయును. ఒకవేళ అతడు సర్దుకొనకపోయినను నిందింపబడిన వానికి విపత్తు లేదు. పూర్వ కర్మఫలముగా దైవమే ఆ రూపమున లీల చూపెనని గ్రహించుట! ప్రేమించిన సహనము లభించును. నిందించిన వాని మానసిక స్థితికి మనము జాలిపడి అతనిని చక్కజేయుమని దేవుని ప్రార్థింపనగును. నిందింపబడుటలో తృప్తి గలదు. సహనము లేక పంతము పూనినచో తగాదా పెచ్చుపెరుగును, ముందు మాటలతో, ఆపై చేతలతో. కొందరు పండితుల నడుమ, సంస్థల నడుమ ఈ కలహము గానవచ్చును. కొందరు కలహమును మనసులోనే పెంచుకొందురు. కొందరు బయటపెట్టుదురు. ఎంతయో సైన్సు తెలిసి, చంద్రమండలముపై అడుగు పెట్టిన నరుడు లక్షలమంది తోటి నరులను సంహరించుచు, ఒక దేశము ఇంకొక దేశముతో పోరాడుచు ప్రపంచ సంగ్రామమునకు నడచుచున్నది. ఇప్పటికే రెండు జరిగినవి. పశువుల కన్న మేధావుల మనుకొను నరజాతి కిది సిగ్గుచేటు. ఇద్దరు నరుల మధ్య కలహములు వారి వారి వంశములకు విస్తరింపవచ్చును. ఒక వస్తువునో, విషయమునో పలుమార్లు తలచిన కొలది దానిని పొందవలెనను కోరిక పెరుగును. ఆ వస్తువుతో, విషయముతో మనము అంటుకొని కోరిక బలపడును. ఉదాహరణకు మద్యపాన మలవాటు లేనివాడు కూడ ఒక మిత్రుని బలవంతము మీద ఒకసారి దానికి పాల్పడినచో, దాని ధ్యానము పెరిగి, దానిని మరల రుచి చూడవలెనను కోరిక పెరిగి బలపడును. అభ్యాసములు చాలవరకు ఇట్లు పెరిగినవే. వానియందు నిజముగ రుచియుండి గాదు. అభ్యాస బలము వలన – అనగా తలచి తలచి దాని యందు రుచి లేకున్నను కోరిక పెరుగును. ఒక్కొక్కసారి రుచికర పదార్థమయినను ఆకలిని మించి, ఆరోగ్యము నతిక్రమించుచు భుజించు కోరిక ఇట్లే ఎక్కువమార్లు తలచుట వలన పెరుగును. స్త్రీ పురుషాకర్షణ కూడ ఇట్లే పెరుగును. గర్వమునందు గాని,

కలహము నందు గాని, కోరికల యందు గాని ప్రీతిని – సుఖమును గూర్చు విజ్ఞానము లేదు. ఎన్ని శాస్త్రముల విజ్ఞానమయినను సుఖమును గూర్చలేక, బరు వయినచో అట్టి విజ్ఞానము నిరుపయోగము. విజ్ఞాన మనగా తనకు అబ్బిన ఏ శాస్త్ర మయినను, సమాజ రూపుడగు అంతర్యామి సేవకై వినియోగపడునది. ఉదాహరణకు వైద్యశాస్త్రమున అపార పాండిత్యమున్నను, రోగుల యందు ప్రేమ లేక, వారికి సేవ చేయక, ధనాసక్తితో చరించుచున్నప్పుడు అతని వైద్యశాస్త్ర పాండిత్యము నిరుపయోగము. పదిమందికి పనికివచ్చు విజ్ఞానము గర్వము వలన, కలహము వలన, కోరికల వలన నశించును. వంశ గర్వము వలన విజ్ఞానమును సమాజమునకు ఉపయోగపెట్టలేము. కలహప్రియత్వము వలన మన కిష్టములేని వారికి ఉపయోగ పెట్టలేము. కోరికల వలన, వానికే ప్రాధాన్యమిచ్చి, అవతలివారి బాధను పట్టించు కొనము. ఇచట విజ్ఞాన మనగా వివేకమనియు అర్థము. అనగా ఏది చేయదగినది, ఏది చేయదగనిది అను విచక్షణ. కులగర్వాదులలో మ్రగ్గువాడు ఏది చేయకూడదో దానినే చేయును. కారణము గర్వము, పంతము, కోరికలు ఉద్వేగమును పెంచి, మన సమత్వమును, విచక్షణము, బుద్ధిని నశింపజేయును.

2వ చరణము యొక్క తాత్పర్యము

"ధన మెంతగా పెరిగినచో, అంతగా లోభము దట్టమగును. మెఱయుచున్న అందము ఆకర్షణ కల్గించి, మోహమున పడవేయును. గొప్పగా పాండిత్యము గలిగి నను, మదము పెరిగి పెరిగి మానవుని కప్పివేయును. వీనివలన పరమపదమును కొంచెము కూడ పొందలేము."

వ్యాఖ్య

ధనము పెరిగిన కొలదియు, ఇంకను సంపాదింపవలెనను దురాశ పెరుగును. ధనాసక్తియు మద్యపానము వలె ఒక చెడు వ్యసనము. చాలమంది ధనికులు తామార్జించిన ధనమును అనుభవింపరు. ఇంకొకరికి పెట్టరు. ఊరక ధనము ఒక మూల యందుండును. ఎవడును ఆహారమును భుజించును గాని ధనమును కాదు గదా. స్వచ్ఛమైన గాలి, నీరు, కలుషితము గాని వాతావరణము, ఆహారధాన్యములు, ఆరోగ్యము కన్న డబ్బుకు – నాణెములకు, కాగితములకు ప్రాధాన్య మిచ్చు నరుడెంత వివేకి? ఒకనాడు నాణెములు, కాగితములు రద్దు చేయబడుచున్నట్లు శాసనము చేయబడినచో ఏమి జరుగును? ఈ కాగితములు నీటిని కాచుకొనుటకును పనికిరావు. వీనిపై వ్యామోహము ఎంతటి అవివేకము? ధనము పెరిగినకొద్ది త్యాగబుద్ధి తగ్గును. తోటివారు ఆకలికి మాడుచున్నను, తానింకను డబ్బును సంపాదింపవలెనను దురాశ పెరుగుచుండును. ఒకవేళ విలాసములకు వ్యయించినను, లేదా దాచిపెట్టినను, ఎందరో పనిచేయు వారికి ఆకలికి తగిన ఆహారము లభింపని స్థితిలో ఇట్లు విలాసములు భోగించుటకు, డబ్బును దాచుటకు మనకు హక్కు ఉన్నదా? లేదు. త్యాగములోని ఆనందపు రుచికి ధనాసక్తుడగు లోభి నోచుకొనడు. మరణించు వేళ ఈ డబ్బు వెంట రాదు. కాని దానినే తలచుకొనుచు కొందరు చనిపోవుదురు. వాస్తవమయిన మరణము ధనాసక్తి అను పాముకాటు. ఒక్కొక్కడు తాను దాచుకొన్న డబ్బు, తాను దానిని దాచిన స్థానము గుర్తుకురాక,

కన్పడకున్నచో గిలగిలలాడుదురు. ధనాసక్తి రోగ కారణ మగును. లోభి తప్పక మరుజన్మలో దరిద్రుడు గావలసివచ్చును లేదా ఇతరులకు ఆకలికి అన్నము పెట్టనివానికి మరుజన్మలో అజీర్ణరోగ మేర్పడును. భౌతికముగా నొప్పుచున్న అందము, శారీరకాకర్షణను పెంచును. తాను చైతన్యము నను సంగతి మఱపునకు వచ్చును. తాను నేర్చిన విద్యలు మఱపునకు వచ్చును. బలవంతముగా మనసు ఆ చక్కదనమువైపు లాగివేయబడును. మోహములో మునుగును. మోహ మనగా ఏది సత్యము, ఏది అసత్యము, ఏది చేయదగినది, ఏది కాదు మున్నగు విచక్షణను కోల్పోయి ఏమరుపాటు చెందించునట్టి తీవ్రమయిన ఉద్వేగము. మనస్సు అయోమయములో పడును. ఆ యందమును అందుకొనవలెనని అన్పించును. కొందరు ఆచరణలోనే జారులగుచున్నారు. కొందరు అంతగా దిగజార కున్నను, మనస్సులో ఆ యందమునే తలంచుచు, అటు లాగివేయబడిన మనస్సు కలవారై కర్తవ్య నిష్ఠ లేక అయోమయములో పడుచున్నారు. యుక్తవయస్సులోని కుమారుడగు భీష్ముడుండగా, ముసలి వయస్సున శంతనుడు సత్యవతి యొక్క అందముచే ఆకర్షింప బడి, మోహితుడై, అధర్మము నాచరించెను. అతని కామమునకు ఫలితముగా తీవ్ర కాముకుడగు విచిత్రవీర్యుడు జన్మించెను. తీవ్ర కామాసక్తుడై ఇతడు రోగముతో మరణించెను. శంతనుని కామము కౌరవుల వరకు దుర్బుద్ధిగా విస్తరించి మహాభారత యుద్ధమునకు, ప్రజా వినాశమునకు దారితీసెను. స్త్రీల యెడల వికారపు చేష్టలను ప్రదర్శించుటతో సరిపెట్టుకొనువారు మరికొందరు తీవ్రమయిన మోహ మావేశింపగా తన జీవితమంతయు దాని చుట్టు తిరుగుచుండును. ఒక్కొక్కడు చెప్పుచుండును – “నాకు ఆకలిగా నున్నది గావున ఆమె అందము గుర్తుకువచ్చి అన్నము తినబుద్ధి యగుటలేదు, నిద్ర వచ్చుటలేదు, చదువుకొనబుద్ధి అగుటలేదు.” ఇదంతయు మానసిక వ్యాధి. ఒక్కొక్కడు కామము కనులను కప్పగా, క్రూరత్వము తోడై, తాను పొంద దలచిన స్త్రీ లభ్యము కానపుడు ఆమెను బలాత్కరించుట, హరించుట లేదా ఆమెను ఏదియో నెపమున అవమానించుట చేయుచుండును. ఇతని స్వభావము ఎంతయో వికృతమై, లోక హాని కల్గించుచుండును. చివరకు వీరికి వినాశము తప్పదు. రావణుడు, దుర్యోధనుడు ఇట్టివారు. కామమొక పిచ్చి. వశము తప్పించును. అజామిళుడు ఎన్నియో విద్యలు నేర్చినవాడే. ఒకనా డీతడొక అందాలరాశి యగు స్త్రీని చూచి, భార్య, పిల్లలను విడిచి ఆమె వెంటపడెను. ఆమె కొరకై ధనమంతయు వెచ్చించెను. దారిదోపిడీలకు కూడ దిగెను. ఎనుబది సంవత్సరములు వచ్చినను మోహ మాతని వీడలేదు. ఇది దౌర్బల్యము. వరూధిని ప్రవరుని అందమునకు మోహితురాలై తపస్వి యగు ఆతని వెంటపడి భంగమందెను. ఆతడు ఆమెను గూడ శ్రీహరిగా దర్శించి జితేంద్రియుడై నిలిచెను. విశ్వామిత్రుడు కూడ సాధన దశలో మేనక అందమునకు మోహితుడయ్యెను. ప్రస్తుత కాలమున ఈ మోహమునకు ‘ప్రేమ’ యను పవిత్ర పదమును తొడిగి, దానికి సంబంధించిన వాఙ్మయమును వెలువరించుచున్నారు. అందమునకు ఆకర్షితుడైనవాడు ఆత్మీయ ప్రేమకు, ఆనందము నకు నోచుకొనడు. అసలు అందమనగా నేమి? ఎవని దృష్టికి వారిది. స్త్రీ యొక్క గాని, పురుషుని యొక్క అందము ప్రకృతి సౌందర్యములో ఒక రేఖామాత్రము. ఒక సెలయేరు, పూవు అందముగా నున్నవి. వానిని కామించుట జరుగునా? లేదు గదా. ప్రకృతి మానవునకు తల్లి. తనకు

బిడ్డల యెడ వాత్సల్యమే బాహ్యసౌందర్యముగా రూపొందించును. సుందరమనగా చక్కగా హృదయము తడిసిపోవుటయే. అనగా తోటివారి బాధలకు స్పందించు హృదయము యొక్క స్వభావము. ఇదియే కరుణ. ఎల్లరు సుఖశాంతులతో, ఆరోగ్యముతో, తగు ఆహారము దొరకి వర్ధిల్లవలెనను అభిలాషనే సౌందర్యమందురు. ఇదియే ప్రేమ. ప్రకృతిమాత యొక్క ప్రేమయే బాహ్యమగు అందముగా వ్యక్తమగుచున్నది. ఇట్లే నరుల అందము కూడ అందులో భాగమే. వాస్తవముగా ప్రేమ గల హృదయమే సుందరమయినది. శారీరక సౌందర్యము నకు ఇట్టివాడు వశుడు గాడు. ఉదాహరణకు అందకత్తె యగు తల్లిని, బిడ్డ కామించుట జరుగునా? ప్రతి స్త్రీని అట్లేల భావింపరాదు! ఒక స్త్రీ యొక్క చక్కదనము కనబడినపుడు 'ఓహో! నా అమ్మ అందకత్తె యని భావింతును'ని శ్రీరామకృష్ణ పరమహంస తెలిపెను. ప్రకృతిమాతకు ప్రతిరూపములే స్త్రీలు. కావుననే తన వాత్సల్యమునే స్తన్యరూపముగ సంతతి కందించును. మనకు ఇతర స్త్రీ తల్లి గాకపోవచ్చును. కాని ఆమె బిడ్డలకు తల్లియే గదా. ఒక తల్లిగా ఆమెను ఆరాధించుటలో, ఒక బిడ్డగా వాత్సల్యము నెఱపుటలో ఎంతటి మాధుర్యమున్నది! పూవు యొక్క అందమును చూచి భగవంతుని వైభవమును గుర్తుకు తెచ్చుకొనవలెనే గాని వానిని నలిపివేయరాదు. అట్లే స్త్రీ యొక్క అందము భగవంతుని వైభవములలో నొకటి. ఆమెకు మనస్సు, బుద్ధి గలవు. ఆమెయు ఆత్మస్వరూపిణియే. ఆత్మకు ఏ తేడాయు లేదు. మనము పొందవలసినది సర్వాంతరాత్మ యగు శ్రీహరి యందాకర్షణ. శంకర భగవత్పాదులు జగన్మాత నిట్లు ప్రార్థించుచున్నారు. "అమ్మా! నిన్ను కీర్తించి కొలుచుచున్నాను. నీ పాదములను సేవించుచున్నాను. నన్ను ఆవేశింపుము. నాకు గూడ నీ స్థితి నిమ్ము." ఇట్లు స్త్రీల పాదములను జగన్మాత పాదములుగా దర్శించుటతో సాధన మొదలిడి, ఎల్లరకు తానే 'అమ్మ' యగు స్థితివరకు సాగును. భారతీయ సంస్కృతిలో బిచ్చగాండ్రు గూడ స్త్రీలను 'అమ్మా!' అని పిలుచుట అలవాటు. కాళిదాసు, శంకరులు జగన్మాతృ సౌందర్యమును తాము బిడ్డలై కీర్తించిరి. మోహవికారము అను జబ్బు నివారణ మగుటకు, స్త్రీల యందు జగన్మాతృ దర్శనమే ఔషధము. వాత్సల్యముతో వారి నాదరించుట వేరొక దివ్యౌషధము. ఈ సద్గుణములు అభ్యాసములై హృదయమున స్వభావములై నెలకొనగా మోహమునకు తావు లేదు. ఇందులకై జగన్మాత నిట్లు వేడవలయును. "అమ్మా! నీ కరుణాకటాక్షములను ప్రవాహమున నన్ను స్నాన మాడించుము. దానితో నేను ధన్యుడ నగుదును." విద్య లెన్ని నేర్చిన ప్రాచీనములయిన జ్యోతిశ్శాస్త్రము, వ్యాకరణము, ధర్మశాస్త్రములు, వేదవేదాంతములు, కావ్యములు గాని, నవీనములయిన సైన్సులు గాని ఎంత నేర్చిన అంతగా మదము హెచ్చును. ధనము వంటిదే పాండిత్యము. ఆచరణకు దిగని బ్రహ్మవిద్య వలన కూడ పొగరు బలియును. కీర్తిపై మోజు పెరుగును. ఒక గ్రంథాలయమున పనిచేయు కూలీవాడు తన తలపై ఎన్నియో పుస్తకములు మోసినట్లే, ఆచరణకు, అనుభూతికి జోడింపబడని పుస్తకములు మస్తకములకు భారమే. పాండిత్య మదమున తాను జ్ఞానినని, ఇతరులు అజ్ఞానులని వారిని తక్కువగా చూచుట, వారిని ఉద్ధరింపవలెనను అతిశయము పెరుగును. వీరివలన తమకును, సమాజమునకును హాని జరుగును. తనను తాను ఉద్ధరించుకొన్న చాలు. లోకము దేవుని స్వరూపము. మన శ్రోతలు భగవంతుని స్వరూపములు. వారికి మనము సేవకులమని,

పండితులు మని మఱవరాదు. అదిగాక ఇట్టివారి విజ్ఞానమున కూడ ఒక లోపముండును. వీరిది తాముగా సంపాదించుకొన్నది. అసలయినది, కావలసినది అంతర్యామి యగు దేవుడు ప్రసాదించునది. దీనిని దర్శనజ్ఞాన మందురు. ఇది కలిగిన వారికి బ్రహ్మవిద్య యందలి లోతులను, ఏ విషయము నందలి లోతుల నైనను దేవుడే అనుగ్రహించును. నిఘంటు జ్ఞానము కన్న, దైవానుగ్రహరూపమైన జ్ఞానము మిన్న. ఆచరణకు నోచు కొనని విజ్ఞానముకన్న అజ్ఞానమే మేలు. అసలయిన విద్యకు కావలసినది తన మేధ కాదు. శరణాగతి. నలుగురికి మేలు చేయవలెనను ప్రేమ. శరణాగతులయిన భక్తులు మాటలాడుచుండగా అప్రయత్నముగనే వారి ద్వారమున అదృశ్యులగు మహర్షులు పలుకుదురు. చోటే సమస్త విజ్ఞాన భాండాగారము. దాని తాళపుచెవులు మహర్షుల వద్ద నున్నవి. భగవంతుని శరణందు భక్తులకు తెలిసియో, తెలియకయో మహర్షులతో సమాచార సంబంధ మేర్పడును. ఇట్టి మహర్షులు సూక్ష్మదేహములతో చిరంజీవులై యున్నారు. ఆవశ్యకమైనపుడు భౌతిక దేహములు దాల్చి మన నడుమ జీవింతురు. ధూర్జటి అను భక్తకవి ఇట్లు చెప్పెను. "వాక్కు – దాని అర్థము, వినువాడు, చెప్పువాడు భగవంతుడే." చెప్పువాడును, వినువాడును స్వయముగా విష్ణువే. ఇది గుర్తుండి, మన శ్రోతల రూపములలోని స్వామికి మాటలను పూలతో పూజ చేయవలెను. గాయకుడు గాని, వ్యక్తి గాని దీనిని గుర్తుంచుకొనవలయును. అసలయిన పండితుడు సమదర్శి. ఇది కాని పాండిత్యము మదమును హెచ్చించుననియు, అది పరిశుద్ధికి, వికాసమునకు ఏమాత్రము తోడ్పడదనియు, పతన హేతువనియు హెచ్చరించుచున్నాడు. అన్నమయ్య ఎచ్చటను తన కిన్ని శాస్త్రవిద్యలు వచ్చునని తెలుపలేదు. వినయము వలననే విద్య శోభిల్లును. వినయము లేని విద్య వట్టి చదువు, అక్షరాస్యతయే. ప్రస్తుత విద్యా విధానము వినయము, సేవాభావము, సద్గుణ ములను కలిగించునదిగా లేదు. అంతర్యామి కర్పితమగునపుడే విద్యలకు సార్థకత. లోభ మోహ మదములతో పట్టువడిన వానికి పరమపదము పొందు అవకాశ మించుక కూడ లేదు. పరమపదమనగా శ్రేష్ఠమయిన స్థానము. అనగా మన మెవరి నుండి వచ్చితిమో అట్టి భగవంతుని చేరుట. భగవదానంద స్థితి అఖండమై, ఆగక నిలుచుట. మానవుడే దేవుడగుట. అనగా దేవుని వలెనే అంతర్యామిత్వమునందు మానవుడు విశ్వమానవుడగుట. విశ్వమే యగుట. విష్ణుడగుట. విష్ణుపదము – అనగా విష్ణుని స్థితి యగు అఖండ దివ్యానందము, సర్వాంతర్యామిత్వము కలుగుట. దీనికి సూటిదారి పరమప్రేమ రూపమైన భక్తియే. ప్రేమగా మనము ఇతరులలోనికి వ్యాపింపవలయును. ఇట్టిదే భక్తి. ఇది నీటిధార వలె గాక, ఆగని నూనెధార వలె సాగవలెనని రామానుజులవారు బోధించిరి. లోభ మోహ మదములు గలవారికి, ఈ పరమానందము ఏమాత్రము దక్కదు. ఎంత ధనమున్నను తృప్తి యుండదు. కామాకర్షితునకు దివ్యానందపు రుచి తెలియదు. పాండిత్యమదము గలవానికి శిరో భారమే దక్కుడు. ధనము గలవాడు లేనివారిని, కామాసక్తుడు స్త్రీల శరీరములను, పండితుడు చదువురాని వానిని మానవత్వముతో వీక్షింపడు. స్త్రీలతో కాముకుడు సహజ స్థితిలో వర్తింపడు. వీరెల్లరు సహజమైన మానవత్వము నుండి చెదరి, వికారముల నొందును. మానవత్వమే లేనప్పుడు ఇక ఎదుటివారిలో భగవంతుని దర్శించుట, కొంచెమయినను బ్రహ్మా నందము నొందుటకు తావెక్కడ? ఆదిశంకరులు శివు నిట్లు ప్రార్థించిరి. "నా మనస్సు అను కోతి మోహమను అడవిలో

తిరుగుచున్నది. యువతుల అందమను కొండలపై వర్తించుచున్నది. కోరికలను కొమ్మలపై ఎగురుచున్నది. నీవెట్లును బిచ్చగాడవే గదా. దీనిని నీ పాదభక్తి యను త్రాటితో గట్టిగా కట్టివేసి నీవెంట గొనిపొమ్ము." మన యందరి తరపున ఆయన ప్రార్థన ఇది.

3వ చరణము యొక్క తాత్పర్యము

"యువతులు – భార్యల సంఖ్య అధికమయిన బాధలు ఎక్కువగా చేరును. సంపద లెంత ఎక్కువయినచో అంతగా చింతలు పెరుగును. అందరికిని పొందదగిన స్థానమును, ఆధారమునయిన శ్రీవేంకటేశా! నిన్ను కొలువగా నాకు ఆనందము పెరిగెను. ఇక చలనములుండక, మనస్సు నీయందే కరగి స్థిరమగుచ్నుది. ఎవరిట్లు నిన్ను కొలిచినను ఇంతియే."

వ్యాఖ్య

భార్యలు ఎక్కువయినచో కామాసక్తి, వారి నడుమ కలహములు, వానిని తీర్ప యత్నములు, అందరిని సంతోషపెట్టు యత్నమున ఆయాసపడుట, వారి వారి బంధువులలో కొందరు కుయుక్తులు పన్నగా వానికి లోబడి నశించుట మున్నగునవి తటస్థించును. శ్రీకృష్ణునకు ఈరకముగా తాపము లేదు. అవతారమూర్తి యగు కృష్ణునిచట ప్రస్తావింపరాదు. అన్నమయ్య స్వవిషయమును కాదు. సంఘములో పాలకులు, ధనవంతులు కొందరు బహుభార్యాలోలురై పడిన పాట్లు ఇతడు పరికించెను. ఏకపత్నీవ్రతము పురుషునకు, పాతివ్రత్యము స్త్రీకి పెద్దలచే విధింపబడెను. ఆదర్శ దంపతులుగా సీతారాములే సృష్టిలో నిలబడిరి. ఏకపత్నీవ్రతుడయిన శ్రీరాముడు, అత్యంత కాముకుడగు రావణుని చంపగలిగెను. సంపదలు పెరిగినచో వానిని కాపాడు యత్నమున బ్రతుకును వ్యర్థము చేయుట, వానిని పెంచుకొనుట యందు వ్యసనము, కాలము, శ్రమ, శక్తి వృథా యగుట జరుగును. వీనిని ఇంకెవరును కాజేయకుండ చూచుకొనుట, ఒక్కొక్కసారి కోర్టుకు ఎక్కి వ్యాజ్యములలో చింతలు పొందుట, నిత్య భయము కలుగును. సంపన్నుడే కాని సుఖముండదు. ఇంతగా సంపదకై ప్రయత్నించు శ్రమపడుచున్నావేమి యని ప్రశ్నించినచో సుఖము కోసమని బదులు చెప్పును. కాని ఆ సుఖము ఇంచుకంతయు లభించుటకు తీరిక లేకయే చనిపోవును. సుఖము కొరకని దుఃఖము, శ్రమపడు వాడెంతటి అవివేకి? జాలిపడ దగినవాడు. సుఖము కొరకై యత్నించువాని కెన్నటికిని సుఖము కలుగదు. సుఖము తన స్వరూపమే. సుఖముగా నుండుటకు మార్గము సుఖముగా నుండుటయే. ఈ సుఖము తనలోనే దైవస్వరూపమై, ఆత్మయై యున్నది. ఇట్టి సుఖమునే బ్రహ్మానంద మందురు. దైవీగుణములను – ప్రేమ, కరుణ, సహనము మున్నగు వానిని అభ్యసించిన కొలది సుఖము లభించును. సద్గుణములే సుఖము. సుఖ మనునది, తనను గాక ఇంక ఏ యితరము వలనను లభింపదు. కౌరవులకు సంపదలు మిక్కుటముగా నున్నవి. కాని పాండవుల రాజ్యభాగముపై కూడ కన్ను వేసిరి. దానితో పాండవుల యెడ అసూయ, పగ, వారి యభివృద్ధిని ఓర్వలేకుండుట, కపటముతో వారిని బాధించుట, చివరకు వినాశము దాపురించినవి. ఎల్లరికిని స్థానము శ్రీవేంకటేశుడు. ఆయన తేజోగర్భమునందే ఎల్లరు

నిలిచియున్నారు. జగత్తు కాధారమాయనయే. అట్టి స్వామిని కొలుచుట వలననే ఆనందము పెరుగును. కారణము ఆయనయే ఆనందస్వరూపుడై ఎల్లరిలో నున్నాడు. కావున అంతర్యామి యగు స్వామిని సేవించిన వానికే ఆనందము దక్కును. అకారణముగ ఇతరులను సుఖపెట్టువానికే అకారణముగ సుఖము దక్కును. ఇట్టి సుఖమునే ఉపనిషత్తులు ఆనందమని పేర్కొనెను. 'ఆనందవల్లి' ప్రత్యేకముగ ఒక అధ్యాయమును ఋషులు దర్శించిరి. ఇట్టి బ్రహ్మానందపు తీయని రుచిని మరగిన వానికి ఇక మనస్సుకు చలనముండదు. అది ఆనందమున కరగును గావున, కదలిక యుండదు. భయము, కామ క్రోధాదులుండవు. ధనము, విద్య, వంశము దుర్మతులకు మదము కలిగించు ననియు, సద్బుద్ధి గల వారలకు ఇవియే వినయము, అణకువ తెచ్చునని విదురుడు చెప్పెను. అట్టి సన్మతి స్వామి సేవ వలన, భక్తి వలన లభించును. అపుడీ మూటికి భక్తు డంటుకొనడు. జనకుడు, ప్రహ్లాదుడు, కులశేఖరాళ్వారు, శ్రీకృష్ణదేవరాయలు మున్నగు వారు పాలకులయినను పై మూడు కలిగియున్నారు. చిక్కులలో పడలేదు. కారణము వారు స్వామికి భక్తులగుటయే. ఆకారము, వంశము, విద్య గొప్పవే యయినను ప్రహ్లాదుడు గర్వము నొందలేదు. అనేక విషయములు ఐహికములయినవి లభించినను అతడు మోహితుడు గాలేదు. వయస్సు, బలము, అధికారమున్నను కామ క్రోధములను పొందలేదు. స్త్రీలు అంతఃపురమున ఎందరున్నను మోహము నొందలేదు. హనుమంతుడు కూడ రావణాంతఃపుర స్త్రీల నడుమ జితేంద్రియుడై నిలిచెను. సీతనే వారియందు దర్శించెను. విశ్వమందు, చూచిన వస్తువులందు, వినిన విషయములందు వస్తుదృష్టి లేక, ఇతర దృష్టి లేక శ్రీహరినే దర్శించి భక్తితో కొలుచుట వలన ప్రహ్లాదుడు ఎప్పుడును ఆనందము పెరుగుచుండగా, స్థిరుడై నిలిచెను. కావున ఆ మార్గమునే అన్నమయ్య ఆచరించి, మనకు నిర్దేశించుచున్నాడు.

* * *

40

3వ సం-561 **భావములోన** **శుద్ధధన్యాసి**

భావములోన బాహ్యమునందును
గోవింద గోవింద యని కొలువవో మనసా. ॥ పల్లవి ॥

హరి యవతారములే అఖిల దేవతలు
హరిలోనివే బ్రహ్మాండంబులు
హరి నామములే అన్ని మంత్రములు
హరి హరి హరి హరి హరి యనవో మనసా. ॥ భావము ॥

విష్ణుని మహిమలే విహితకర్మములు
విష్ణుని పొగడెడీ వేదంబులు
విష్ణుడొక్కడే విశ్వాంతరాత్ముడు
విష్ణువు విష్ణువని వెదకవో మనసా. ॥ భావము ॥

అచ్యుతు డితడే ఆదియు నంత్యము
అచ్యుతుడే అసురాంతకుడు
అచ్యుతుడు శ్రీవేంకటాద్రిమీద నిదె
అచ్యుత అచ్యుత శరణనవో మనసా. ॥ భావము ॥

చేయవలసిన పనిమీదకు వెళ్లినవాడు బాగుపడ్డాడు గాని,
చేయకూడని పనులు రాసుకుంటే ఆయుర్దాయం సరిపోదు.

టీక

అవతారములు = దిగివచ్చుటలు, రూపాంతరములు, విహిత = నియమింపబడిన, అచ్యుతుడు = జారిపడు స్థితి లేనివాడు.

పరిచయము

ఈ సంకీర్తనమున తన మనస్సును సంబోధించి వరుసగా స్వామిని సేవింపు మనియు, కీర్తింపుమనియు, వెదకుమనియు, శరణుపొందు మనియు అన్నమయ్య కోరుచున్నాడు. తన మనస్సునకే గాక, మన ఎల్లరి మనస్సులకు ఇది ఉపదేశముగా వర్తించును. శరీరముతో, ఇంద్రియములతో పనులు చేయుచున్నను, మనస్సుతో గూడినపుడే ఇవి పనిచేయగల్గును. కాన భగవంతుని గూర్చి చేయు సేవలు మున్నగునవి కూడ మనస్సుతోనే చేయవలెను. మనస్సు నుండి ఇవి భౌతిక జీవితమునకు దిగి రావలెను. మనసే బంధములకు కారణము. మనస్సులోను, ఇతరులతో వర్తించు బయటి జీవితములోను కూడ స్వామి సేవ సాగవలెను. స్వామిని సేవించునపుడు ఆయనను గూర్చి గోవిందుడనియు, సంకీర్తనము చేయునపుడు హరియనియు, వెదకునపుడు విష్ణువనియు, శరణాగతి పొందునపుడు అచ్యుతుడనియు ఒక క్రమమున అన్నమయ్య భావించెను. పల్లవిలో దేవుని సేవను గూర్చి చెప్పెను. ఆ సేవ యొక్క వివరములు చరణములందు చెప్పబడినవి. ఇందు చెప్పబడిన ఉపదేశములు పాటింపకుండ పల్లవిలో చెప్పబడిన సేవ సాధ్యము కాదు. కావున పాఠకులు ముందుగా చరణములను భావించి, వానితో పల్లవిని కూర్చుకొనవలెను. స్వామిని కీర్తించుట, స్వామిని అన్వేషించుట, స్వామికి శరణాగతి చెందుట అను మూడు ప్రక్రియలు కూడినపుడే స్వామిని పొందుట యను ప్రక్రియ నిండారును. ఎన్ని మంత్రములున్నను ఆయా మంత్రములకు అధిదేవతలైన వారెల్లరుగా హరియే దిగివచ్చుచున్నాడు. కావున హరినామము కీర్తించిన చాలును. విశ్వమునకు ఆత్మయై వ్యాపించిన వాడు విష్ణు వొక్కడే. కావున జీవితమున ఏ పని చేయుచున్నను ఆయనను వెదకుచు గమనింపవలెను. స్వామియే సత్యము, మొదలు, చివర. స్వామి ఆనంద స్వరూపుడు. ఆ స్థితి జారిపోదు. అట్టి అచ్యుతునే శరణందవలెను. భగవంతుడు మనలోను, వెలుపలి విశ్వములోను అంతర్యామి. కావున మన భావములో ఆయనను స్మరింపుచు సేవింపవలెను. బాహ్య జీవితమునందును, ఇతరులుగా కన్పడుచున్న గోవిందునే సేవింపవలెను. ఇట్లు వ్యక్తికి, సమాజమునకు హితమును గూర్చు సందేశమును అన్నమయ్య ప్రసాదించెను. పల్లవిలోని మొదటి పాదమున భావము లోన, బాహ్యమునందును అని అన్నమయ్య సూచించెను. క్రింది మూడు చరణము లందు చెప్పబడిన హరి సంకీర్తనము, విష్ణుని వెదకుట, అచ్యుతుని శరణందుట మనస్సులోని భావమునందును ఇతరులతో మెలగు బాహ్యజీవితమునందును కొనసాగవలెను అని అన్నమయ్య అందించిన సందేశము.

పల్లవి యొక్క తాత్పర్యము

"ఓ మనసా! భావములోన, బయటను గూడ గోవింద, గోవిందయని కొలువుము."

వ్యాఖ్య

గోవిందుడనగా గోవుల చేత తెలియబడువాడు, పొందబడువాడు. గోవు మానవులకు తల్లి వంటిది గనుక ఆమె నర్చించిన చోట భగవంతుని సాన్నిధ్యము ఎక్కువగా లభించును. భగవంతుడు మనలను పొందుట జరుగును. గోవులనగా మంచి వాక్కు లనియును, జ్ఞానకిరణము లనియును అర్థము. ఇతరులకు ఆహ్లాదమును కలిగించు మాటలు పలుకు వానియందును, అంతటను వ్యాపించిన స్వామి వెలుగును దర్శించిన వానియందును ఆయన సాన్నిధ్యము ప్రకాశించును. కావున స్వామికి గోవిందుడని పేరు. ఈ పేరు సూటిగ శ్రీకృష్ణునికి వర్తించినను వేంకటేశ్వరునకు కూడ వర్తించుచు ప్రసిద్ధమైనది. మనస్సుకు రెండు రకములైన ప్రవర్తనలు గలవు. 1. తనలో తాను భావించుట. 2. తనకు బయట గల జగత్తుతోను, జీవులతోను, ఇంద్రియముల ద్వారమున వర్తించుట. మనస్సునందు గోవింద యనుచు అంతర్యామియైన స్వామిని భావింపవలెను. మనస్సునందే భావింపలేనివానికి బయట అంతర్యామి దర్శనమీయడు. మనస్సునందు ఈ భావన సదా నిలువవలెను. ఆపైన ఇతరులతో మాటలాడునపుడు, మెలగునపుడు కూడ వారి రూపములలోని స్వామిని దర్శించుట అభ్యాసమగును. మనస్సులో ఇతరులు భాసించుట మాని, వారుగ స్వామియే భాసించుట జరిగినచో మన పలుకులు, చేష్టలతో గూడిన బహిరంగ జీవితమున కూడ స్వామి యొక్క ఉనికి అనుభవములోనికి వచ్చును. కావుననే అన్నమయ్య 'గోవింద' అను శబ్దమును ప్రయోగించెను. భావములోన స్వామిని సేవింపనివాడు తన బయట జీవితమున సేవింపలేడు. ఈ యంశము లలితా సహస్రనామమున సూచింపబడినది. గోకులము నుండి ఒక గోపిక మధురకు వచ్చి పాలు, పెరుగు, వెన్న అమ్ముచున్నది. ఆమె భావము కృష్ణుని కర్పితమైనది. కావున తానమ్ముచున్న పదార్థములను, తననుండి వానిని కొనువారిని గోవిందునిగ భావించి, వారి రూపములలోని స్వామినే కొలిచినది. భగవంతుని గూర్చి సంకీర్తనమును, ఇతరుల సద్గుణములను హృదయమునందు భావింపవలెను. వెలుపలకు గానము చేయవలెను. ఇది హృద్గీథ విద్య, ఉద్గీథ విద్య యని వేదము చెప్పుచున్నది.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"హరియే సకల దేవతలుగ దిగివచ్చెను. బ్రహ్మాండములన్నియు హరియందు గలవు. అన్ని మంత్రములును హరి నామములే. ఓ మనసా! హరి హరి హరి హరి హరి యనుము."

వ్యాఖ్య

ఇంద్రాది దేవతలెల్లరు ఆయా ప్రకృతి ధర్మముల కధిపతులైన ప్రజ్ఞలు. నారాయణుడే హరియై ఎల్లరు దేవతలుగ దిగివచ్చెను. అనగా స్వామి యొక్క రూపాంతరములే దేవతలెల్లరు. బంగారము వివిధములైన నగలుగ మార్పుచెందును. అయినను ఈ నగల సారము బంగారమే. నగలన్నియు బంగారముతో చేయబడినవే కదా! అట్లే అంతర్యామి యగు హరి యను వెలుగు చేతనే దేవతలు చేయబడిరి. వీరు హరి యొక్క రూపాంతరములైన వెలుగులు. హరి అఖండమైన వెలుగు. అందలి ముక్కలు దేవతలు. ఈ విషయము

తైత్తిరీయోపనిషత్తు నందును చెప్పబడినది. ఒక వ్యక్తిని పిలిచిన చాలును, అతని శరీరము యొక్క భాగములను విడివిడిగా పిలువ పనిలేదు కదా. దేవతలు అంతర్యామికి అవయవముల వంటివారని పురుషసూక్తము చెప్పుచున్నది. 'హ' అను ధ్వని నిశ్వాసము, 'ర్' అను ధ్వని కంఠనాళము నందలి రాపిడిని కలుగజేయును. ఈ రెండును కలసియే 'హ్రీం' అను మంత్రము పుట్టినది. స్వామి యొక్క నిశ్వాసగ, ఉచ్చారణగ జగత్తు వచ్చినది. అందలి దేవతలును వెలువడిరి. కావున హరి అను పదమును స్వామి పరముగ అన్నమయ్య వాడెను. ఒక్కొక్క సూర్యుని చుట్టు గ్రహములు తిరుగుచున్నవి. ఇవన్నియు కలసి ఒక బ్రహ్మాండమగు చున్నది. ప్రతి తారకయు ఒక పెద్ద సూర్యుడే. కావున చోటులో బ్రహ్మాండము లెన్నియో కలవు. చోటు స్వామి యొక్క తేజోమయ దేహమని వేదములలో చెప్ప బడినది. కావున బ్రహ్మాండములన్నియు హరియందే ఇమిడియున్నవి. హరి యొక్క దేహమున భాగములై యున్నవి. కావున 'అందు' అను సప్తమీ విభక్తి ప్రత్యయమునే వాడవలెను. షష్ఠిని వాడినచో హరి వేరు, బ్రహ్మాండములు వేరను భావము వచ్చును. ఉదాహరణకు 'నా కలము' అన్నప్పుడు నేను వేరు, కలము వేరగును. అయినను అన్నమయ్య అందు అను అర్థమున 'లోన' అని వాడెను. కొందరు పెద్దలిట్లు వాడుట జరిగినది. ఏ దేవతను గూర్చి ఉపాసించుచు మంత్రమును జపించినను ఆ దేవతను అంతర్యామి యొక్క రూపముగనే భావింపవలెను. వేదములందు ఋషులు ఈ భావముతోనే వివిధ దేవతా సూక్తములను దర్శించిరి. అట్లుగాక దేవతలను అంతర్యామియైన హరికన్న వేరుగ భావించి మంత్రములను జపించినచో బ్రహ్మానంద మగు కైవల్యము లభింపదు. మంత్రమనగా మననము చేయుట వలన కాపాడునది అని అర్థము. కాపాడుట అనగా కైవల్యము నిచ్చుటయే. ఇట్లు అన్ని మంత్రములను హరి నామములుగా భావింపక తప్పదు. హరినామమును కీర్తించుట యోగక్షేమము లను ప్రసాదించును. కావున అన్నమయ్య 'హరి' యని సదా సంకీర్తనము చేయుమని మనస్సు నుద్దేశించి పలుకుచున్నాడు. ఈ సంకీర్తనము మనస్సులోను వాక్కులోను గూడ సాగవలెను. పంచభూతములతో గూడిన జగత్తుతో వ్యవహరించునపుడు హరిని స్మరించుటకు సంకేతముగ అన్నమయ్య ఈ నామమును ఐదుమారులు పలికెను. భారతదేశమున బహుదేవతారాధనము గలదను వాదము, అన్నమయ్యచే త్రోసివేయ బడినది. దేవుని ఏకత్వము నెలకొల్పబడినది. హరి యనగా పాపములను హరించు వాడనియు నర్థము.

2వ చరణము యొక్క తాత్పర్యము

"విష్ణుని విస్తార వైభవములే మానవ జీవితమున ఆచరించుటకుగాను నియమింప బడిన కర్మలు. వేదములు విష్ణునే కొనియాడుచున్నవి. విష్ణువొక్కడే విశ్వమునకు లోపలి ఆత్మ. ఓ మనసా! విష్ణువు, విష్ణువని వెదకుము."

వ్యాఖ్య

విష్ణువనగా విశ్వమున వ్యాపించిన వాడని యర్థము. అంతర్యామి యగు వెలుగన మాట. ప్రకృతియందు భాగములగు సూర్యచంద్రులు, మేఘములు, పంచభూతములు, నదులు, చెట్లు మున్నగునవి తమ తమ

ధర్మములను నిర్వర్తించుచుండుట జరుగు చున్నది. అంతర్యామి యగు విష్ణుని శక్తి యగు ప్రకృతిచే నియమింపబడిన కర్మలివి. ఇవి శాశ్వత ధర్మములు. వీనిని ప్రకృతిలోని భాగములు దాటవు. ఇన్ని కర్మములకును మూలధర్మము పరమప్రేమయే. ఇట్టి పరమప్రేమ యను ప్రవాహమే విష్ణుడు. ఈ ప్రవాహము యొక్క విస్తారములయిన వైభవములే ఈ ప్రకృతి ధర్మములన్నియు. విష్ణుని నేపథ్యముననే ఇవి సాగుచున్నవి. ఆధారము లేకున్నచో ఇవి సాగవు. నదీ ప్రవాహమే లేనిచో పంటకాలువలకు స్థానమే లేదు కదా. ప్రకృతిని అనుసరించుచు మానవులు ఎవరి యభిరుచిని బట్టి వారు సమాజమునకు సేవారూపమైన కర్మలు చేయవలెనని ప్రకృతి నియమించినది. ప్రకృతిలోని శాశ్వత ధర్మములే వేదములు. అవి గ్రంథరూపము దాల్చినవి. వేదగ్రంథములందు ఋషులు మానవులకు మార్గదర్శకములయిన కర్తవ్యములను నియమించిరి. వీనిలో కొన్ని వ్యక్తికిని, వ్యక్తికిని మారును. కొన్ని వయస్సును బట్టి మారును. కాని ఎల్లరకు సమానమైనవి చాల కలవు. తల్లిదండ్రులను, ఆచార్యుని, అతిథిని, దీనులను, సమాజమును దేవుని రూపములో దర్శించుట వంటివి. ఇవి అన్నియు ఋషులు ఏర్పరచినను వీనికి మూలము ప్రకృతిలోని చైతన్యమగు విష్ణుని యందు కలదు. కావున విష్ణుని వైభవము యొక్క విస్తారములే వేదవిహిత కర్మలని అన్నమయ్య పేర్కొనెను. ప్రకృతి ధర్మములకు పరమావధి విష్ణు సేవయే. ఉదాహరణకు మబ్బు వర్షమునిచ్చి జీవుల రూపములలో నున్న విష్ణుని సేవించుచున్నది. వేదగ్రంథములు కూడ వివిధ దేవతలను పొగడినట్లు కనపడినను వీరెల్లరు తనలో భాగములు గాగల అంతర్యామి యగు విష్ణునే పొగడు చున్నవి. కొందరు ఎఱుకలేక వేదములు బహుదేవతలను పొగడుచున్నవనియు, ఉపనిషత్తులు వేదములపై విప్లవము కలిగించి ఒకే దేవుని పొగడుచున్నవనియు పొరపాటుగ భావించుచున్నారు. కాని వాస్తవమునకు ఉపనిషత్తులు వేదములలోని సారములే గాని వేరుగావు. వేదములలోనే అంతర్యామి యగు ఒకే దేవుని పొగడుట జరిగినట్లు పురుషసూక్తము, విష్ణుసూక్తము మున్నగునవి నిరూపించుచున్నవి. అన్నమయ్య కాలము నాటికే పై పొరపాటు వాదము ప్రాచుర్యములో నుండెను. భారతదేశములోనికి ఇతర దేశముల నుండి ఈ వాదము ప్రవేశించినది. ఆతడు వేదములు ఒకే అంతర్యామియైన దేవుని పొగడుచున్నవని మరల ఈ సంకీర్తనలో పాదుకొల్పెను. సనాతన భారతీయ వేదసంప్రదాయమును పునరుజ్జీవనము గావించు గొప్ప ఉద్యమమును అన్నమయ్య నడిపెనని ఈ సంకీర్తనలో తెలియుచున్నది. విశ్వ మనగా వివిధములైన మార్పులతో కూడిన సమస్తమని అర్థము. ఎన్ని వైవిధ్యము లున్నను వానిలోని సారమైన వాడొక్కడే. అతడే విష్ణువు. శరీరము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, ప్రాణము మనలోని వివిధ భాగములు. కాని ఈ అన్నిటిలోని నేను అను వెలుగు ఒకటే. ఇదియే ఆత్మ. అట్టి సమస్తమున 'నేనై'న వెలుగు విష్ణువు. పరిసరములను, పదార్థములను, జీవులను గమనించక అంతర్యామి యగు విష్ణునే వారియందు దర్శించు అనుభూతి కొరకై మానవుడు జీవింపవలెను. మానవ జీవన పరమావధి ఆనందమే కదా. ఇట్టి ఆనందము విష్ణువని అన్నమయ్య భావము. కావున జీవించుట అనగా విష్ణుని వెదకుట. మరియు ఏ పదార్థము – సజీవములు గాని, నిర్జీవములు గాని పరిశోధించి దాని మూలసారము కొరకై వెదకగా క్రమముగా పరమాణువులు, శక్తి, లోపలి ఆత్మయగు

విష్ణువు తెలియవచ్చును. సజీవములందును, నిర్జీవములందును విష్ణువే నెలకొనియున్నాడు. కావుననే అన్నమయ్య 'విష్ణువ'ను పదమును రెండుమార్లు ప్రయోగించెను.

3వ చరణము యొక్క తాత్పర్యము

"స్వామి యొక్క స్థితి జారిపడనిది. ఇతడే మొదలు, చివరయు. ఇట్టి అచ్యుతుడే అసురులను అంతము చేయువాడు. శ్రీవేంకటగిరిపై ఇతడే వెలసియున్నాడు. ఓ మనసా! అచ్యుత, అచ్యుత అని శరణనుము."

వ్యాఖ్య

చ్యుత మనగా జారిపడుట, పతనము అని అర్థము. ఇది జీవునకుండవచ్చును గాని దేవునకుండదు. స్వామి పరమప్రేమసాగరుడు, పరమానందసాగరుడు. ఈ అనంతప్రేమ నుండి, అఖండానందము నుండి స్వామి జారిపడుట జరుగదు. జీవులకు స్వామి తన ప్రేమను చిదిమిపెట్టుచు ప్రసాదించును. వారు చేయు నిందలను పరమ సంతోషముగ స్వీకరించును. ఇట్టి అచ్యుతుడే సృష్టికన్న ముందున్నవాడు. సృష్టి, ప్రళయములలో లీనమైనపుడు ఉన్నవాడును ఇతడే. ఉదాహరణకు నీరు ఉష్ణోగ్రత తగ్గి మంచుగడ్డ అగును. తిరిగి ఉష్ణోగ్రత పెరిగినపుడు నీరగును. మంచుగడ్డ వంటి సృష్టికి ముందున్నవాడు, మొదటివాడు స్వామియే. సృష్టి మంచుగడ్డ వలె కరగినపుడు చివరన ఉన్నవాడు స్వామియే. జగత్తుకు మొదటగా, చివరగా అయినది ఆయనయే. విశ్వమును సృజించుట, తిరిగి లీనము గావించుకొనుట స్వామియే. అచ్యుతుడే అసురులను చంపువాడు. అసురులనగా ప్రాణము వలన బ్రతుకుచున్న శరీరము చుట్టు తిరుగుచున్న కామ క్రోధాదులు తీవ్రముగా గలిగి, ఇతరులను హింసించువారు. రావణ శిశుపాలాది అసురులను స్వామి వధించెను. మరి స్వామి పరమప్రేమ స్వరూపుడు గదా. వీరినేల చంపెను? వీరు గావించిన నిందలను తాను వ్యక్తిగతముగా సహించెను. కృష్ణుడు తనను నిందించినందుకు గాదు శిశుపాలుని చంపినది. ఎందరికో ప్రజలకు కీడు చేసి, పవిత్రమయిన యాగమును భంగపరచ యత్నించుట వలన వధించెను. తన బిడ్డలగు అసంఖ్యాకులగు జనులను కాపాడుటకై వారియందలి కరుణతో స్వామి అసురులను వధించెనే గాని వారిపై ద్వేషముతో గాదు. అసురులను వధించునపుడు గూడ, స్వామి తన ప్రేమ అను స్థితినుండి క్రిందకు దిగజారక, వారిని గూడ కరుణించి, తనలో లీనము గావించుకొనెను. కావుననే అచ్యుతుడను పదమును అన్నమయ్య ప్రయోగించెను. సామాన్యులట్లు గాదు. ఇతరులను చంపు నపుడు క్రోధము, పగ కలిగియుందురు. సహజమగు ప్రేమ, కరుణలను కోల్పోవుదురు. దేవు డంతర్యామి గావున ఆయన దృష్టిలో అసురులును తనలోని భాగములే. తన బిడ్డలే. స్వామి భక్తులలోని అసుర భావములను తొలగించును. ఇట్టి అచ్యుతుడగు భగవంతుడే శ్రీవేంకటాద్రిపై నెలకొనియున్నాడు. సర్వాంతర్యామి యగు వాడే ఇచట దివ్యమంగళ మోహనమూర్తిగా నున్నాడు. ఈ కొండనెక్కి భక్తితో వేంకటేశ్వరస్వామిని దర్శించి, స్మరించిన వానికి ఆయన అంతర్యామిగా దర్శన మొసగును. ఇట్టి భక్తునకు పతనము లేని, తనదగు అఖండానందస్థితినే అనుగ్రహించును. మానవుని మనస్సు అచ్యుతునకు శరణందవలెనని అన్నమయ్య ఉద్బోధించుచున్నాడు. శరణాగతి నొందుట యనగా

అంతర్యామిని దర్శించి, పవిత్ర కర్మలను స్వామి కర్పితములుగా ఆచరించుటయు; ఏది చేయవలెనో, ఏది చేయరాదో అను విచికిత్సను స్వామికి విడిచిపెట్టుటయు, స్వామి సంకల్పము తన ద్వారమున తీర్చబడుచుండగా తాను స్వామికి పరికరముగా నుండుటయు. స్వామి తనను కాపాడునని నమ్ముట మాత్రమే చాలదు. ఇది స్వామి గొప్పతనమును నమ్ముట. స్వామి అంతర్యామిగా నచ్చి అనుభవమునకు రావలెను. ఇదియే శరణాగతి. ఈవిధముగా స్వామికి శరణందిన వానిని పతనము లేని నిత్యానంద స్థితి పొందును. స్వామిని పల్లవిలో తెలుపబడినట్లు తన భావములోను, బాహ్యజీవితమునందును శరణందవలెను గావున అన్నమయ్య 'అచ్యుత' అను పదమును రెండుమార్లు ప్రయోగించెను.

* * *

41

1వ సం-191 **బ్రహ్మ కడిగిన పాదము** ముఖారి

బ్రహ్మ కడిగిన పాదము
బ్రహ్మము తానె నీ పాదము. ॥ పల్లవి ॥

చెలగి వసుధ గొలిచిన నీ పాదము
బలి తల మోపిన పాదము
తలకక గగనము తన్నిన పాదము
బలరిపు గాచిన పాదము. ॥ బ్రహ్మ ॥

కామిని పాపము కడిగిన పాదము
పాము తలనిడిన పాదము
ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము
పామిడి తురగపు పాదము. ॥ బ్రహ్మ ॥

పరమయోగులకు పరిపరివిధముల
వరమొసగెడి నీ పాదము
తిరువేంకటగిరి తిరమని చూపిన
పరమపదము నీ పాదము. ॥ బ్రహ్మ ॥

కర్తవ్యం ఏం చెయ్యాలో ఆలోచించు గాని, ఏం చెయ్యకూడదో ఆలోచించకు.

టీక

చెలగి = విజృంభించి, తలకక = చలింపక, పామిడి = శక్తితో గూడి, తురగము = త్వరగా పోవునది.

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య శ్రీవేంకటేశుని పాదములను స్మరించిన ఆనందో త్సాహములో వాని వైభవమును మనోహరముగ వర్ణించుచున్నాడు. పల్లవిలో ఈ పాదమే బ్రహ్మమని అతడు స్థాపించెను. మొదటి రెండు చరణములందు స్వామి పాదముల మహిమను వేదపురాణగాథల ప్రశస్తి ఆధారముగ కొనియాడెను. చివరి చరణమున శ్రీవేంకటాద్రి మహిమను స్తుతించెను. పల్లవిలో చెప్పబడినట్లు బ్రహ్మమే తానగుట వలననే ఈ పాదమునకు చరణములలో కీర్తింపబడిన మహిమ దక్కినది. ఈ సంకీర్తనమును పాడుట వలన, వినుట వలన, స్మరించుట వలన స్వామి పాదములు హృదయములో ముద్రితములై, రక్షగా నిలిచి మధురానుభూతిని ప్రసాదించును. స్వామి యొక్క వామనావతారమును, శ్రీరామావతారమును, శ్రీకృష్ణావతారమును, గజేంద్ర రక్షణాది కథలను అన్నమయ్య ప్రస్తావించుటయు జరిగినది. చనవుతో స్వామిని సంబోధించుచు అన్నమయ్య ఆయన పాదమును స్తుతించెను.

పల్లవి యొక్క తాత్పర్యము

"స్వామి పాదము బ్రహ్మ కడిగినది. అంతేగాక, బ్రహ్మమే తానయినది."

వ్యాఖ్య

బ్రహ్మ సృష్టికర్త. స్వామి వామనావతారమున క్రమముగ మూడు లోకములను ఆక్రమింపగా బ్రహ్మ స్వామి పాదములను కడిగినట్లు పురాణగాథ. ఇదిగాక ఇంకొక గంభీరమయిన వేదభావమున్నది. భగవంతుని పాదమనగా నాలుగవ వంతు అని వేదార్థము. అమృతమయమయిన స్థితిలో మన యూహకందని దేవుని వెలుగులో మూడు వంతులు గలవు. ఒక వంతు సమస్త జగత్తుగా దిగివచ్చినది. ఉచ్చారణ కూడ అంతియే. బయటకు మనముచ్చరించు భాషలోని వాక్కు నాలుగవ వంతు మాత్రమే. దీనివెనుక భావము, అనుభూతి, సంకల్పము అను మూడు స్థాయిలు మనలోన దాగియున్నవి. సృష్టియు దేవుని యుచ్చారణమే యని వేదమున ఋషులు దర్శించిరి. బ్రహ్మ విశ్వమును సృష్టి చేయుట అనగా విశ్వము యొక్క రూపములోని స్వామి యొక్క ఒక పాదమును సేవించుటయే. పెద్దల పాదములను సేవించుటలో శిరసు వంచి మ్రొక్కుట, పాదములను కడిగి ఆ నీరు శిరసుపై చల్లుకొనుట ముఖ్యాంశములు. కావున బ్రహ్మ స్వామి పాదమును సేవించెను అను విషయమును సూచించుటకై అన్నమయ్య 'కడిగెను' అని వర్ణించెను. బ్రహ్మ వలెనే మనము స్వామి పాదముగా విశ్వమును భావించి సేవింపవలెను. బ్రహ్మ మొదటగా మనకు నేర్పిన విద్య గావున దీనిని బ్రహ్మవిద్య యందురు. ఇది చదువు గాదు. విశ్వమునే విష్ణు పాదముగా మనము సేవింపవలెనను ఆచరణము ఇది. చోటులో గల విష్ణుతారక అంచున గల కాంతిధార యొక్క సుడిగుండమునే ఆకాశగంగ యందురు. దానికి సమీపమున ప్రజాపతి తారక గలదు. ఈ తారకను ఈ ఆకాశగంగా

కాంతిధార అందినది. అనగా ఈ తారకకు అధిపతి యగు బ్రహ్మగ విష్ణు పాదము నుండి పుట్టిన ఆకాశగంగా కాంతిధారతోనే ఆ పాదమును కడిగినట్లు వేదర్షులు దర్శించి తెలిపిరి. మరియు వేంకటేశ్వరస్వామి యొక్క మూర్తి మన దేహము వలె గానవచ్చినను మొత్తము పరబ్రహ్మమను అఖండజ్యోతియే. ఈ మూర్తిలో తల అని, ఛాతీ అని, పాదములని వేరుగా చూచుట ఒక పద్ధతి. ఇట్లుగాక అన్నమయ్య వేరొక పద్ధతిలో ఈ సమగ్రమూర్తిలోని ఏ భాగమయినను వేరువేరుగా గాక, బ్రహ్మమే తానయినదిగా కీర్తించెను. ముఖ్యముగా మనచే సేవింపదగు పాదమునే బ్రహ్మముగా దర్శించెను. భౌతిక పదార్థములో విడిభాగములను గమనింపవచ్చును గాని, చైతన్యము లేక ప్రేమ యను వెలుగులో విడిభాగములను గమనించుట ఎట్లు? 'బ్రహ్మ' అను శబ్దము పుంలింగము. ఇది సృష్టికర్తను సూచించును. 'బ్రహ్మము' అను శబ్దము నపుంసక లింగము. బ్రహ్మమనగా సృష్టికిని, సృష్టికర్త యగు బ్రహ్మకును మూలమయిన దేవుడు. దైవము లింగవివక్షకు అతీతమయిన వెలుగు గావున 'బ్రహ్మము' అని నపుంసక లింగములో వేదర్షులు పేర్కొనిరి. నపుంసకలింగ మనగా స్త్రీ పురుష భేదమునకు అతీతమని మాత్రమే వీరి భావము. దీనినే అన్నమయ్యయు పాటించెను. విష్ణు పాదసేవ, విష్ణు సేవయే. విష్ణు పాదమనగా విశ్వము. ఇదియు విష్ణువే.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"ఓ స్వామీ! నీ పాదము విజృంభించి భూమిని గొలిచినది. బలి యొక్క తలపై మోపబడినది. చలనము లేకుండ స్థిరముగా నిలిచి ఆకాశమునే తన్నినది. బలాసురునకు శత్రువగు ఇంద్రుని కాపాడినది."

వ్యాఖ్య

ఈ చరణము స్వామి యొక్క వామనావతార గాథను ప్రస్తావించుచున్నది. బలి చక్రవర్తి సాధువే. ఇతడు తనకున్నదంతయు ఎల్లర కొసంగెను. ఇది విశ్వజిద్యాగము. ఇతడు ఇంద్రు నోడించి, స్వర్గరాజ్యము నొందెను. స్వామి ఇంద్రుని కాపాడుటకై బలిని ద్రొక్కవలసి వచ్చినది. వామనుడై అతనిని మూడడుగులు దానము కోరెను. ఒక అడుగులో భూమిని, వేరొక అడుగులో నింగిని ఆక్రమించెను. మూడవ అడుగును బలి కోరికపై అతని శిరసుపై నుంచి అతనిని సుతలమునకు త్రొక్కెను. పైకి చూచినచో స్వామి ఇంద్ర పక్షపాతి యనియు, బలిని అన్యాయముగా సుతలమునకు త్రొక్కె నన్పించును. కాని ఇందలి గంభీరార్థమిది. బలిచక్రవర్తి త్యాగి యగుట వలన పుణ్యకర్మ ఫలమైన స్వర్గసుఖము నొందెను. కాని తాను త్యాగినని ఇతనికి గుర్తున్నది. గుర్తు శిరసున నుండును గదా. ఆ గుర్తును మాత్రమే విష్ణువు త్రొక్కెను. ఇంద్రుడు కోరిన స్వర్గము నాతని కిచ్చెను. ఏదియు కోరక, స్వామి పాదస్పర్శనే గోరిన బలిలోని నేను త్యాగినను గుర్తును మాత్రమే త్రొక్కి, అతనిని సుతలమున కధిపతిని గావించి, అతనికి తానే ద్వారపాలకుడుగ పనిచేసెను. అనగా కర్తృత్వమును తొలగించి, త్యాగికి స్వామి అమృతానందమిచ్చి, అతనిని తానే సేవించును. ఇదిగాక వేదార్థము ఈ కథలో ఇట్లు దాగియున్నదని విష్ణుసూక్తములు, భాగవతము తెలుపుచున్నవి. విష్ణువు మూడు లోకములను తన మూడు అడుగులతో ఆక్రమించెను. (ఇచట పాదమనగా అడుగు).

ద్రవ్యమయము, శక్తిమయము, ప్రజ్ఞామయము అగు మానవుని నిర్మాణమే మూడు అడుగులు. ద్రవ్యమయ మనగా భౌతిక పదార్థమగు శరీరము. శక్తిమయ మనగా ప్రాణము. ప్రజ్ఞామయ మనగా మనోబుద్ధులు మున్నగునవి. అందలి జీవభావనయే బలి. దానిని ఆక్రమించు అంతర్యామి యగు దైవభావమే వామనుడు. దేవుడు 'ఆత్మ' గావున, మొదట ఆకారము లేనివాడు గావున పొట్టివాడని చెప్పబడెను. కాని మూడు లోకములను తన వెలుగుతో నింపెను గావున త్రివిక్రముడాయెను. వ్యక్తుల శరీరము, ప్రాణము, మనోబుద్ధులు గూడ భగవంతుని వెలుగుతోనే చేయబడినవి. శరణాగతు డయిన భక్తునిలో ఈ మూడును దివ్యములగును. వ్యక్తిలోనే గాక, విశ్వమునను ఈ మూడు లోకములు గలవు. వసుధ యనగా వస్తువులను ధరించు భూమి లేక భౌతిక జగత్తు. ఇది మొదటిది. దీనిని స్వామి గొలిచెను. అనగా తన వెలుగుతో నింపెను. స్వామి వెలుగుతోనే ఇది ఏర్పడెను. ఆపై చలనము లేక, స్థిరముగా పెరిగి ఆకాశమునే తన్నెను. అనగా అందలి ప్రాణశక్తియు స్వామి వెలుగుతోనే ఏర్పడినది. ఇది రెండవది. మూడవది ప్రజ్ఞామయము. ఆకాశమును ఆక్రమించిన పిదప స్వామి తన మూడవ అడుగును బలి తలపై మోపుట జరిగినది. కావున తలకక గగనము తన్నిన పాదము, బలితల మోపిన పాదము అను వరుసలోనే అన్నమయ్య రచింపగా తర్వాతి కాలమున లేఖనములలో ఈ వరుస తలక్రిందులై యుండవచ్చును. ఈవిధముగ బలి తలపై తన యడుగు నుంచి స్వామి ఇంద్రునకు అతని స్వర్గరాజ్య మిప్పించి కాపాడెను.

2వ చరణము యొక్క తాత్పర్యము

"నీ పాదము కామముతో వర్తించిన అహల్య యొక్క పాపమును కడిగినది. కాళియుడను పాము యొక్క తలపై ఉంచబడినది. నీయందు ప్రేమతో కూడిన నీ భార్య యగు లక్ష్మీదేవి సేవించుచున్న పాదము నీది. అమితశక్తితో త్వరగా నడుచు పాదము నీది."

వ్యాఖ్య

శ్రీరామావతారమున రాముడు అహల్య యొక్క పాపమును కడిగెను. అహల్య తన భర్త యగు గౌతముని రూపమును ధరించిన ఇంద్రునితో కామసుఖము ననుభవించి పాపము చేసెను. ఇచట ఇంద్రుడనగా ఇంద్రియముల ద్వారమున పనిచేయు మనస్సుకు అధిదేవత. అప్పటివరకు భర్త యొక్క తపస్సుకు తోడ్పడుచున్న అహల్యకు తన మనస్సున భర్తతోడి కామసుఖము కొరకై ఆసక్తి కలిగెను. తన మనస్సును ఇంద్రుడే భర్త యొక్క రూపమును ధరించెను. తపోనియమములో నున్న స్త్రీకి ఇట్టి ఆసక్తి కలుగుటయే పాపము. అంతియేగాని చాలమంది భావించునట్లుగా ఇంద్రుడు ఒక వ్యక్తి కాడు. అహల్య పరపురుషునితో కామసుఖమును పొందలేదు. శాపమునకు గురియైన అహల్య తపస్సు చేయుచు రాముని కొరకై ఎదురుచూచినది. రాముడు విశ్వామిత్రుని వెంట తమ్మునితో గూడి అహల్య వద్దకు వచ్చెను. రాముడు, ఆమె స్త్రీ గావున తల్లిగా భావించి ఆమె పాదములు తాకి నమస్కరించెను. ఆమెను పతితగా భావింపలేదు. అంతట అహల్య కూడ రాముని పాదములు కడిగి ఆతిథ్యమిచ్చినది. ఆమెలో దాగిన

కామమను పాపవాసన రాముని పాదములను ఆమె కడుగుటతో తొలగిపోయినది. కావుననే అన్నమయ్య 'కడిగిన' అను పదమును ప్రయోగించెను. ఈ పదము సందర్భోచితము. వాస్తవ కథ ఇట్లుండగా, భర్త యొక్క శాపము చేత అహల్య 'ఱాయి' అయ్యెననియు, రాముని పాదములు తాకుటచే ఆమె తిరిగి స్త్రీ రూపము ధరించినదనియు కథ ప్రాచుర్యములోనికి వచ్చినది. రాముని పాద మహిమను వర్ణించుటకు ఇట్లు కొందరు ఈ కథను కల్పించిరే గాని, వాస్తవము మాత్రము కాదు. రాముని పాదములను అహల్య కడిగినది, ఆమె పాపమును రాముని పాదము కడిగెను. ఈ వాస్తవమును అన్నమయ్య వర్ణించెను. రాముని పాదము అహల్యలోని కామమను పాపమును కడిగెననగా, దానిని తొలగించి, ఆమెకు పరిశుద్ధత నిచ్చినదని అర్థము. (ప్రాచుర్యములోనున్న అవాస్తవ కథను అన్నమయ్య విశ్వసించియుండినచో 'ఱాతిని నాతిగ చేసిన పాదము' అని వర్ణించి యుండెడివాడు. ఇట్లుగాక వాల్మీకి రామాయణమున గల కథను అన్నమయ్య గ్రహించెను.) కాళియుడను పాము తన విషముతో గోకులము నందలి యమునానది మడుగును విషమయము గావించి గోవులను చంపుచుండెను. అపుడు శ్రీకృష్ణుడు తానేమగుదునని శంకింపక, కడిమిచెట్టుపై నుండి యమునా నదిలోనికి దూకి కాళియుని పడగలపై నాట్యమాడెను. (ఇట్లు శ్రీరామ, శ్రీకృష్ణావతారములందు ప్రదర్శింపబడిన స్వామి పాదమహిమ అన్నమయ్య స్తుతించుటలో వేదార్థ మొకటి గలదు. అహల్య యనగా హలము చేత దున్నబడని భూమి. అనగా నియమబద్ధత యను నాగలి చేత దున్నబడని మనస్సు అను పొలము. రాముని పాదములను స్మరించినచో మనస్సున కోరికలు, పాపములు తొలగి పవిత్రత కలుగును. కాళియు డనగా గతమును గూర్చి, భవిష్యత్తును గూర్చి కలతనొందించు కాలబంధనము. అన్నికాలములు తానే అయిన విష్ణుని పాదములను స్మరించినచో ఇది తొలగిపోవును.) "ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము" అనగా ప్రేమతో లక్ష్మీదేవి సేవించుచున్న పాదమని బాహ్యమగు అర్థము. 'ప్రేమపు' అనగా 'ప్రేమతో గూడిన', 'ప్రేమగల' అని అర్థము. 'సతి' యనగా జగత్తు యొక్క ఉనికికి ఆధారమైనదని అర్థము. ఈ ఆధార మెవరు? స్వామిని ఆశ్రయించుకొన్న శక్తియగు లక్ష్మీదేవి. ఆమెయే ప్రాణముగా చోటులోను, జీవులలోను పనిచేయుచున్నది. ఆమెయే ఎల్లరకు జీవము. ఈమె కాధారము స్వామి. లక్ష్మీదేవి అను శక్తి స్వామికి భార్యయై, సదా ఆయన నాశ్రయించు కొని యుండును. కారణము ఆయన ఎల్లరకు ఆత్మ. ప్రాణము, ఆత్మను ఆశ్రయించు కొనియుండునని అన్నమయ్య 'శ్రీసతి' యను పదమున తెలిపెను. లక్ష్మీదేవి స్వామి యందు ప్రేమతో కూడినది. కావున అన్నమయ్య 'ప్రేమపు' అను పదమును వాడెను. భగవంతుని దయయే అమ్మవారని 'శ్రీసూక్తము' నందు గలదు. ఈ భావమునే రామానుజులు తెలిపిరి. కనుక 'ప్రేమపు' అనగా వేదార్థము 'ప్రేమయే తానైన' అని. లక్ష్మీదేవి స్వామి పాదములను సదా సేవించుచున్నది. అనగా స్వామిని సేవించుచున్న మొట్టమొదటి భక్తురాలు ఈమె. స్వామి పాదమనగా విశ్వమే. విశ్వమునకు కావలసిన సంపదను ప్రేమతో అందించుటయే స్వామి పాదసేవ. స్వామి పాదము దీనులైన భక్తులను కాపాడుటకై అత్యంత శక్తిసామర్థ్యములతో మిక్కిలి త్వరగా నడుచునది. గజేంద్రుడు, ప్రహ్లాదుడు వంటి వారిని కాపాడుటకై స్వామి పాద మిట్లు వర్తించినది. స్వామి ద్వారకలో నున్నను మానసంరక్షణకై మొఱలిడిన ద్రౌపదిని కాపాడుటకై కురుసభకు ఆయన పాదము తేజోమయమై త్వరగా నడిచి వచ్చెను. అన్నమయ్యను రాజు

చెరసాలలో నుంచి సంకెలలు వేయించెను. స్వామి పాదము అతిశక్తిమంతమై త్వరగా నడిచివచ్చి అన్నమయ్యను కాపాడినది. భౌతికముగా కనపడకపోయినను, దివ్యస్థితిలో జరిగినదిది. స్వీయానుభవమును కూడ అన్నమయ్య ఈ పాదమున సూచించెను. ఇతడు స్వామి పాదమును పారవశ్యమున కీర్తించెను.

3వ చరణము యొక్క తాత్పర్యము

"నీ పాదము గొప్ప యోగులకు అనేక విధములుగా వరమొసగుచుండును. శ్రీవేంకటాద్రి స్థిరమైనదని తెలుపు పరమపదమిది."

వ్యాఖ్య

పరమయోగు లనగా యోగులలో శ్రేష్ఠులు. తమ ఇంద్రియములు, ప్రాణము, మనసు, బుద్ధి అనునవి దారమునందు పూల వలె, 'ఆత్మ' యగు స్వామియందు గ్రుచ్చబడి, పూవునందలి రేకల వలె స్వామి యందలి భాగములై వర్తించుటే యోగము. ఈ స్థితియే జీవితపరమావధి. కావుననే శ్రీకృష్ణుడు, 'నీవు యోగివి' కమ్మని అర్జునునకు బోధించెను. ఈ స్థితిలో సదా నిలుచువారే నారదాదులగు పరమయోగులు. వీరు ఏ కర్మయు చేయక ఊరకుండరు. స్వామి పాదమగు విశ్వమును సేవించుచుందురు. ఇట్టివారికి స్వామి పాదము వరము ననుగ్రహించును. వర మనగా సాధారణముగా కోరికను తీర్చుట యని భావించుచుందురు. వర మనగా శ్రేష్ఠస్థితి యనియు అర్థము. వర మనగా వరింపదగిన స్థితి యని సూటి యర్థము. అనగా ఆత్మసమర్పణ పొంది, పొందదగిన స్థితి. అది ఏమి? భగవంతుని అంతర్యామి స్థితి. భక్తుడు భగవంతుడుగా అంతర్యామి యగుటయే వరము. దీనికి భక్తుని సాధన చాలదు. దీనిని స్వామి భక్తులకు లేక పరమయోగులకు ప్రసాదించును. స్వామి వరదహస్తము తన పాదమును చూపుచుండుటలోని భావమిదియే. తన పాదములను సేవించినచో వరము నిత్తునని స్వామి హస్తము సూచించుచున్నది. శ్రీవేంకటాద్రి యనగా శుభమును చేకూర్చునది, పాపములను పోగొట్టునది. పరమపద మనగా అన్నిటిలో శ్రేష్ఠమైన స్థానమని అర్థము. అది ఏది? విష్ణువు యొక్క స్థానమే పరమపదమని విష్ణుసూక్తము చెప్పుచున్నది. అనగా అంతర్యామిత్వము, అఖండ ఆనందసాగరమని భావము. స్వామి పాదసేవ వలన ఈ పరమపదము కలుగును. చోటులోని పాలపుంత అను తారకల గుంపులో గల విష్ణుతారకను గూడ పరమపద మందురు. అది తేజోరూప మైనది. దాని భౌతికరూపమే శ్రీవేంకటాద్రి. పరమపదమును చేరినవాడు జారిపడడు. ఆనందస్థితిలో స్థిరముగా నుండును. శ్రీవేంకటాద్రియు భక్తిశ్రద్ధలు గలవానికి అట్టి స్థితిని ప్రసాదించును. కావున అదియు స్థిరమే. అంతర్యామి యగు స్వామి యొక్క పాదసేవగా సత్కర్మను ఆచరించినంత కాలము పరమానందము స్థిరమై నిలుచును. ఇట్టి భక్తుని జీవితమే శ్రీవేంకటాద్రి యగునని అన్నమయ్య స్వీయానుభూతి నుండి ఉపదేశించుచున్నాడు.

* * *

42

3వ సం-577 ముద్దుగారే యశోద కురంజి

ముద్దుగారే యశోద ముంగిటి ముత్యము వీడు
తిద్దరాని మహిమల దేవకీ సుతుడు. ॥ పల్లవి ॥

అంతనింత గొల్లెతల అరచేతి మాణికము
పంతమాడే కంసుని పాలి వజ్రము
కాంతుల మూడులోకాల గరుడపచ్చపూస
చెంతల మాలోనున్న చిన్నికృష్ణుడు. ॥ ముద్దు ॥

రతికేళి రుక్మిణికి రంగుమోవి పగడము
మితి గోవర్ధనపు గోమేధికము
సతమై శంఖచక్రాల సందుల వైడూర్యము
గతియై మమ్ము గాచేటి కమలాక్షుడు. ॥ ముద్దు ॥

కాళింగుని తలలపై కప్పిన పుష్యరాగము
ఏలేటి శ్రీవేంకటాద్రి ఇంద్రనీలము
పాల జలనిధిలోన పాయని దివ్యరత్నము
బాలుని వలె తిరిగీ పద్మనాభుడు. ॥ ముద్దు ॥

మంత్రాలు జీవితాలను నడపడంగాక జీవితమే ఒక
తారకమంత్రం కావాలి.

టీక

తిద్దరాని = తెలియరాని (వర్ణింపరాని), మాణికము = కెంపు, మోవి= పెదవి, మితి = కాలవ్యవధి, సతము = శాశ్వతము, పాయని = విడిచిపెట్టని.

పరిచయము

ఈ సంకీర్తనము బహు జనాదరణ పొందినది. శ్రీకృష్ణుని దివ్యస్వరూపమును మన లోగనుల ముందు అన్నమయ్య ఈ సంకీర్తనలో నిలిపెను. కృష్ణుని జీవితములోని వివిధ సందర్భములు ఇందు వర్ణింపబడెను. ఆయా సన్నివేశములందు కృష్ణుడు అన్నమయ్యకు నవరత్నములుగా దర్శనమొసంగెను. అన్నమయ్య కృష్ణుని నవరత్నము లతో తానుగా ఊహించి పోల్చినట్లు కానరాదు. ఇతని భక్తికి మెచ్చి కృష్ణుడే తన జీవిత సన్నివేశములను, వాని కనుగుణములైన వివిధ రత్నములుగా తాను ప్రకాశించిన విధానమును అన్నమయ్యకు దర్శనమిచ్చెను. ఆ దర్శనమునకు సంబం ధించిన అనుభూతిలో అన్నమయ్య ఓలలాడెను. అతని దర్శనమునకు నిదర్శనముగా ఈ సంకీర్తనము వెలువడినది. నవరత్నములలో ఒక్కొక్కటి ఒక్కొక్క గ్రహమునకు సంబంధించినది. కృష్ణుడు సర్వ గ్రహములకు అధిపతియైన స్వామియే. అయినను తన మూర్తి భక్తుల హృదయములలో నిలుచుటకై తన జీవిత వైభవమును వారికి కొంత తెలియుటకై తన జాతకచక్రములోని వివిధ భావములందు ఆయా గ్రహముల స్థితిని అనుమతించెను. ఆయా గ్రహము లిచ్చు మంచి లక్షణములను తన జీవితమున మలచుకొనెను. భగవానుని ప్రకాశము ఈ సంకీర్తనలో మనోహరముగా ప్రస్ఫుట మైనది. అంతియేగాక అన్నమయ్య యొక్క జ్యోతిశ్శాస్త్ర పరిజ్ఞానము ఇందు ప్రస్ఫుట మైనది. కృష్ణుని జాతక మిట్లున్నది. లగ్నము వృషభము. అందు చంద్రుడు ఉచ్చ చెందియున్నాడు. లగ్నమున కేతువు గూడ ఉన్నాడు. మూడవ స్థానమగు కర్కాటకమున గురుడు ఉచ్చ చెందియున్నాడు. నాల్గవ స్థానమగు సింహమున సూర్యుడు స్వక్షేత్రమున నున్నాడు. ఐదవ స్థానమగు కన్యలో బుధుడు ఉచ్చ చెందియున్నాడు. ఆరవ స్థానమగు తులలో శుక్రుడు స్వక్షేత్రమందును, శని ఉచ్చ యందును ఉన్నారు. ఏడవ స్థానము వృశ్చికము. దాని అధిపతియైన కుజుడు తొమ్మిదవ స్థానమగు మకరము నందు ఉచ్చ చెందియున్నాడు. ఈ వివరములన్నియు ఈ సంకీర్తనమందు దాగియున్నవి. ఒక్కొక్క గ్రహమునకు ఒక్కొక్క రత్నము అనుగుణమైనది. ముత్యము చంద్రునకు సంబంధించినది. మాణికము సూర్యునకు సంబంధించినది. వజ్రము శుక్రునకు సంబంధించినది. గరుడపచ్చ బుధునికి సంబంధించినది. పగడము కుజునకు సంబం ధించినది. గోమేధికము రాహువునకు సంబంధించినది. వైడూర్యము కేతువునకు సంబంధించినది. పుష్యరాగము గురువునకు సంబంధించినది. నీలము శనికి సంబంధించినది. కృష్ణుని ఆయా జీవిత సందర్భములందు చక్కగా పనిచేసిన గ్రహముల స్వభావములను తెలుపుటకై అన్నమయ్య ఆయా గ్రహములకు సంబం ధించిన రత్నములను ప్రయోగించెను. ఈ సంకీర్తనమున సాహిత్యము, సంగీతముతో పాటు అందు శాస్త్రపరిజ్ఞానము దాగియున్నది. శాస్త్రము కవితకు లొంగదు. కాని అన్నమయ్య అట్టి శాస్త్రమును కళగా మలచెను. సంగీత సాహిత్యములందు

పొదిగెను. పల్లవిలో సూచింపబడిన కృష్ణుని మహిమలు క్రింది మూడు చరణములందు వర్ణింప బడినవి. చరణములు చదివినగాని పల్లవి అవగతము కాదు.

పల్లవి యొక్క తాత్పర్యము

"దేవకి ప్రసవించిన బిడ్డడగు కృష్ణుని మహిమలు తెలియరానివి, వర్ణించుటకు, తెలుపుటకు సాధ్యము కానివి. ఇతడు యశోద ముంగిట ముద్దుగారుచున్న ముత్యము."

వ్యాఖ్య

పుట్టుక లేని భగవానుడు దేవకికి పుట్టుటయే కృష్ణుని మొదటి మహిమ. పుట్టుక లేని దేవుడు పుట్టుక గల అవతారమూర్తిగా వచ్చునని వేదమునందలి పురుషసూక్తము చెప్పుచున్నది. దేవకి అతని శరీరమును ప్రసవించగా, వసుదేవుని మీదుగా నారాయణ తేజము ఈ శరీరమున ప్రవేశించెను. దేవకి కృష్ణుని 12 నెలలు గర్భమున ధరించెను. సామాన్య మానవుల వలె గాక కృష్ణుడు కారాగారమున జన్మించెను. కృష్ణుని కథ జగత్తు యొక్క కథకు ప్రతీక. దేవుడే జీవుడుగా ప్రతి శరీరమున ప్రవేశించుటయే కృష్ణుని కారాగార జన్మము. జీవుని శరీరమునకు మావి తెగుటయే కృష్ణుడు వ్రేపల్లెకు చేరుట. కంసుడు నియోగించిన కావలివారు నిద్రించుచుండగా కారాగారపు గడియలు, తాళము అవియే తెరవబడెను. వసుదేవుడు, కృష్ణుని ఒక తట్టలో నుంచి తలపై మోయుచు వ్రేపల్లెకు తీసికొని వెళ్లుచుండగా వానకు గొడుగు వలె ఒక పెద్ద త్రాచుపాము కృష్ణునికి నీడ పట్టెను. యమునానది చీలి త్రోవ నిచ్చెను. యశోద మేల్కాంచలేదు. ఆమె ప్రక్కన ఆడు శిశువును గైకొని వసుదేవుడు కృష్ణుని అచట ఉంచెను. వ్రేపల్లె వాసులు యశోదయే కృష్ణుని కనినదని భావించిరి. యశోదయు అట్లే భావించి పెంచినది. ఇది కృష్ణుని రెండవ మహిమ. ఇట్టి మహిమలెన్నియో అతడు తన జీవితమున నెఱపెను. యశోదకు ఎదుటగా కృష్ణుడు ముద్దుగా, సుకుమారముగా నున్నాడు. ఆమెకు ముద్దుగొలుపుచున్నాడు. అతడు ముత్యము వలె మెఱయుచున్నాడు. ముత్యము తెల్లగా నుండును. కృష్ణుడు శ్యామలదేహుడు. అట్టి కృష్ణుని తెల్లని ముత్యముతో పోల్చుట ఎట్లు? మెఱయుట కృష్ణునకు, ముత్యమునకు సమాన లక్షణము. మిగిలిన రత్నముల విషయమున గూడ నింతియే. ముత్యము చంద్రునికి సంబంధించినది. కృష్ణుని జాతకమున చంద్రుడు ఉచ్చ జెంది లగ్నమున నున్నాడు. లగ్నము సమగ్ర జీవితమును సూచించును. కృష్ణుడు తన జీవితము మొత్తమునందు చంద్రుని వలె ప్రేమయను వెన్నెలను జీవులపై కురిసెనని అన్నమయ్య భావము. ఈ ప్రేమ స్వచ్ఛము. దీనిని గైకొనువారి స్వభావములలో తేడా లుండవచ్చును గాని కృష్ణుని ప్రేమలో వివక్ష లేదు. మరియు ఎట్టి పరిస్థితిలోను కృష్ణుడు నిశ్చలుడై, ప్రసన్నుడై నిలిచెను. శైశవ దశలోనే మొదటగా యశోదకు తన సాన్నిధ్యముచే, తన దివ్యస్వరూప సందర్శనమును కృపజేసి ఆమె కాహ్లాదమును కలిగించెను. కావుననే ఉత్తరభారతదేశమున శ్రీకృష్ణ చంద్రుడను పేరు వాడుకలోనికి వచ్చెను. కృష్ణుడు రోహిణీ నక్షత్రమున జన్మించెను. రోహిణి చంద్రునకు ఇష్టురాలైన భార్య. అనగా ఇరువది ఏడు నక్షత్రములలో ప్రముఖమైనది. ఇందు జన్మించినవాడు

జగత్తుకు వెన్నెలను పంచువాడు, అత్యంతమైన దివ్యాకర్షణ గలవాడు. కృష్ణు డిట్టివారిలో ప్రథమ గణ్యుడు. 'యశోద' అనగా యశస్సు నిచ్చునది. ఆమెను స్మరించిన వారికి యశస్సు కలుగును. ఈ సృష్టిలో ఆమెకన్న భాగ్యము గలవారెవ్వరు?

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"వయస్సులో పెద్దవారు, చిన్నవారు అయిన గోపికల అరచేతిలోని మాణిక్యము కృష్ణుడు. కృష్ణునిపై పగబట్టి, అతనిని చంపుటకై పంతముపూనిన కంసుని పాలి వజ్రమీతడు. మూడు లోకములకు తన కాంతులను పంచిపెట్టు లేత ఆకుపచ్చల పూస కృష్ణుడు. మాకు సమీపముగనే, మాలోననే చిన్నికృష్ణు డున్నాడు."

వ్యాఖ్య

ఈ సంకీర్తనమున ప్రస్తావించబడిన గోపికలెల్లరు కృష్ణుని కంటె పెద్దవారు. కొందరు అధిక వయస్సు గలవారు, కొందరు అల్ప వయస్సు గలవారున్నారు. ఈ అంశమున అంత, ఇంత అను మాటలలో మనము కంటితో చూచి కొలుచుచున్నట్లుగా అన్నమయ్య చక్కగా చెప్పెను. గోపికలు కృష్ణుని తమ అరచేతులలో ఆడించిరి. పల్లవిలో చెప్పబడినట్లు యశోదయే గాక, వ్రేపల్లెలోని గోపికలు చిన్నికృష్ణుని ఆడించి ఆనందించిరి. ఆ సందర్భమున కృష్ణుడు వారి అరచేతులలో కెంపు వలె ప్రకాశించెను. కెంపు సూర్యునికి సంబంధించిన రత్నము. సూర్యుడు కృష్ణుని జాతకమున నాల్గవదగు మాతృస్థానమున నున్నాడు. కావున గోపకాంతలు చిన్నికృష్ణుని తమ కుమారునిగ భావించి పెంచిరనియు, వారెల్లరకు కూడ కృష్ణుని యొక్క తల్లులగు భాగ్యము లభించినదనియు అన్నమయ్య భావము. సూర్యుడు స్వక్షేత్రమున నున్నాడు. కావున ఇచట కృష్ణుడు లోకమంతటికి వేడిమిని, వెలుగును, ప్రాణశక్తిని, జ్ఞానమును ఇచ్చు చున్నాడని అన్నమయ్య భావము. ఒకసారి బ్రహ్మ గోపాలబాలురను అంతర్ధానము గావించెను. అపుడొక సంవత్సరము పాటు కృష్ణుడే వీరెల్లరి రూపమును ధరించెను. గోపికలు ఈవిధముగ కృష్ణునే తమ కుమారుడుగ తమ అరచేతులలో పెంచు భాగ్యమును పొందిరి. గోపకాంతలకు వేదవిద్య రాకున్నను, వారు క్రతువులు చేయకున్నను తమ అరచేతులతో శ్రీకృష్ణుని ప్రేమతో పెంచిన కారణముగా వారి ప్రజ్ఞలు, శరీరము, ఇంద్రియములు, ప్రాణము, మనస్సు, బుద్ధులను దాటి ఆత్మ యగు కృష్ణునందు లీనమయినవని అన్నమయ్య చెప్పదలచెను. సూర్యుడు ఆత్మ కారకుడని జ్యోతిశ్శాస్త్రము చెప్పుచున్నది. సూర్యునికి చెందిన మాణికమును పేర్కొని అన్నమయ్య పై భావమును ధ్వనించెను. కంసుడు ప్రజలను పీడించి, వారి సంపదను అపహరించెను. గ్రామములను ధ్వంసము గావించెను. మద్యపానమును, వేశ్యా లోలుపత్వమును పెంచెను. కృష్ణుడు ధర్మసంస్థాపనకై అవతరించెను. కంసుడు అతనిపై పగ పెంచుకొని పంతముతో ఆతనిని చంపుటకు పలుమార్లు ప్రయత్నించెను. కృష్ణుడు తన పన్నెండవ ఏటనే కంసుని వధించెను. కంసుడు మహాబలసంపన్నుడు. కృష్ణుడా పన్నెండేండ్ల బాలుడు. కొండలను ఇంద్రుని ఆయుధమగు వజ్రము భేదించినది. అట్లే కొండ

వంటి కంసునిపాలిటి వజ్రమై కృష్ణుడు అతనిని వధించెను. వజ్రము, శుక్రునికి సంబంధించిన రత్నము. శుక్రుడు పరమప్రేమకు అధిదేవత. కృష్ణుని జాతకమునందు ఆరవ స్థానమున నున్నాడు. ఆరవది శత్రు స్థానము. కంసుని గూర్చి కృష్ణుడు తన శత్రువని భావింపకున్నను, కంసుడు కృష్ణుని గూర్చి శత్రువని భావించెను. ఇచట కంసుని పాలిటి వజ్రము అని కృష్ణుని గూర్చి అన్నమయ్య వర్ణించుటలో శత్రువును జయించెనని భావము. మరియు శుక్రుడు స్వక్షేత్రమగు తుల యందున్నాడు. కావున కంసుని చేత పీడింపబడుచున్న సామాన్య జనులపై పరమప్రేమ వలననే కృష్ణు డాతనిని చంపవలసి వచ్చినదని అన్నమయ్య దివ్యభావము. అంతేగాక తనచే చంపబడిన కంసునకు గూడ ప్రేమతో మంచి జన్మను కృష్ణుడు ప్రసాదించెను.

మరియు కృష్ణుడు గరుడపచ్చల పూసతో పోల్చబడెను. గరుడపచ్చలు బుధగ్రహ సంబంధులు. బుధుడు బుద్ధికి, వివేకమునకు, విజ్ఞానమును చక్కగా బోధించు సామర్థ్యమునకు అధిపతి. కృష్ణుని జాతకమున బుధుడు ఉచ్ఛ యగు కన్యలో అయిదవ స్థానమున నున్నాడు. అయిదవ స్థానము ప్రతిభా స్థానము. కావున కృష్ణుడు మహా బుద్ధిశాలి, వివేకవంతుడనియు, అఖండ విజ్ఞానమును, ధర్మమును ప్రజల కందించె నని అన్నమయ్య భావము. కృష్ణుడు అర్జునునకు గీతావాణి విన్పించెను. తన సాన్నిధ్యము చేత, వేణుగానము చేత ప్రజలలో జ్ఞానమను కాంతిని వెదజల్లెను. మూడు లోకము లందు అనగా ద్రవ్యమగు భూలోకమునందు, శక్తిమయమగు భువర్లోకమునందు, ప్రజ్ఞామయమగు సువర్లోకమునందును తన బుద్ధి నుండి జ్ఞానకాంతులను వెదజల్లెను. శరీరములను, ప్రాణములను, మనస్సులను శుద్ధి చేసినవాడు కృష్ణుడు. కృష్ణుడు ఇట్టి మహిమలు – అనగా మానవాతీతమైన అసాధారణ చర్యలు చేపట్టెను. చిన్నికృష్ణుడు జీవులెల్లరి అతి సమీపమున అనగా లోననే అంతరాత్మగా నున్నాడని అన్నమయ్య బోధించుచున్నాడు. దేవుడెక్కడో దూరముగా లేడు. మనలోనే వెలుగుగా నున్నాడు. ఒకే అంతర్జ్యోతి యని కులశేఖరాళ్వారు కీర్తించెను. విద్యుత్తు, బల్బులలో నున్నను మీట నొక్కినప్పుడే అది కాంతిగా వ్యక్తమగును. అట్లే మనలోననే దేవుడున్నను స్మరించినపుడే స్వామి సాన్నిధ్యము మనకనుభవమునకు వచ్చును. అన్నమయ్యకు, ఆతని అనుచర బృందమునకు ఇట్టి అనుభవము కల్గినదని చివరి పాదమున తెలుప బడుచున్నది.

2వ చరణము యొక్క తాత్పర్యము

"కృష్ణుడు రుక్మిణీదేవితో రతికేళిని నెఱపునపుడు, ఆమె పాలిట పగడము వంటి రంగు పెదవి. పరిమిత కాలవ్యవధిలోనే గోవర్ధనగిరి నెత్తి, దాని పాలిట గోమేధిక మయ్యెను. రెండు భుజములలో శంఖ చక్రములను సదా ధరించి, ఆ రెంటి నడుమ కంఠహారమున వైడూర్యము గలవాడు కృష్ణుడు. మనలకు అండయై గాచునట్టి కమలముల వంటి కన్నులు గలవాడు."

వ్యాఖ్య

శ్రీకృష్ణుడు సర్వాంతర్యామి యయిన పరమాత్మ. రూపాతీతుడు. ధర్మస్థాపనకై లీలగా మానవ దేహమును ధరించెను. కావున మానవ ధర్మానుసారము గృహస్థు డయ్యెను. నిరంతరము ఆత్మగా దివ్యానంద స్థితిలో

నుండు కృష్ణుని కామవాసన అంటదు. అతనిని స్మరించిన వారికే అంటదు గదా. అయినను గృహస్థుడుగా సంతతిని పొందు ధర్మము కొరకై భార్య యగు రుక్మిణితో భౌతిక క్రీడ చేయక తప్పలేదు. సంతతి కావలసి వచ్చినపుడు, కృష్ణుడు ఆ కక్ష్యలోనికి మనస్సును దింపెను. భార్యను పొందు సమయమునను రుక్మిణీ కృష్ణులకు దివ్యానంద స్థితియే గాని, ఉద్వేగము లేదని భాగవతమున తెలియుచున్నది. భౌతికముగా పొందుట యందు వారికి ప్రత్యేకమగు ఆసక్తి లేదు. సంతతి కొరకు మాత్రమే అది వర్తించెను. పగడము కుజునకు సంబంధించినది. కృష్ణుని జాతకమున భార్యాస్థానమగు వృశ్చికమున కధిపతి యగు కుజుడు మకరమున ఉచ్చ చెంది, ఉచ్చ గురుని దృష్టిలో నున్నాడు. కుజుడు పరాక్రమమునకు అధిపతి. కృష్ణుడు పరాక్రమముతో రుక్మిణిని చేపట్టెను. మరియు కృష్ణుడు రుక్మిణిని భౌతికముగా పొందిన సందర్భమునను, భగవదానంద మును ప్రసాదించెను. ఆ భౌతిక క్రీడలో ఆమెను ముద్దాడు కృష్ణుని పెదవి పగడముగా మెఱయుచున్నదని వర్ణించుటలో అన్నమయ్య ఈ భావము నిమిడ్చెను. ఇంద్రుడు కురిపించిన ఱాళ్లవాన నుండి గోకులవాసులను కాపాడుటకై ఏడు దినములపాటు కృష్ణుడు గోవర్ధనగిరిని తన కుడి చిటికెనవ్రేలిపై ఎత్తిపట్టెను. గోమేధికము రాహు గ్రహ సంబంధి. రాహువు ఛాయాగ్రహమే గాని అతనికి ఆకారము లేదు. కావున కృష్ణుడు నీడ వలె మిక్కిలి తేలికగా ఎత్తెనని యర్థము.

శంఖము ఓంకారమునకు, చక్రము అందరిలో అంతర్యామిని దర్శించుటకు ప్రతీకలు. ఈ రెంటిని స్వామి సదా ధరించుచు భక్తులను కాపాడుచుండును. ఈ రెంటి నడుమన స్వామి కంఠహారమున వైడూర్యమున్నది. ఇది కేతు సంబంధి. కేతువు మంచి ప్రయత్నమునకు, మోక్షమునకు కారకుడు. కావున కృష్ణుడు భక్తులలో మంచి సాధనను పెంచి, వారికి మోక్షమిచ్చువాడని అన్నమయ్య భావము. స్వామి కమలముల వంటి అక్షులు గలవాడు. అనగా తామరల వంటి కనులు గలవాడు. ఇట్టి విశాలనేత్రుడగు స్వామి మనలను కాపాడు అండ. ధనము, అధికారము, పాండిత్యము మున్నగునవి కాపాడవు. అంతర్యామిగ స్వామిని స్మరించినచో, ఇతరులను గూర్చిన మలినభావములు వైదొలగును. ఇదియే స్వామి మనకిచ్చు అసలయిన రక్షణ యని భారతమున ధర్మరాజు తెలిపెను.

3వ చరణము యొక్క తాత్పర్యము

"కాళియుని తలలపై కప్పిన పుష్యరాగము స్వామి. ఎల్లరిని ఏలునట్టి శ్రీవేంకటాద్రిపై నిలిచిన ఇంద్రనీలము స్వామి. పాలసముద్రములోన విడువని దివ్య రత్నము స్వామి. ఇతడు పద్మము నాభియందు గలవాడు. ఇట్టి స్వామి గోకులమున బాలుని వలె తిరుగుచున్నాడు."

వ్యాఖ్య

కాళియుడను విషసర్పము తన కాటులచే గోకులమందలి గోవులను చంపు చుండెను. గోవులను కాపాడుటకై కృష్ణుడు కడిమిచెట్టు నుండి దూకి, ఆ పాము యొక్క పడగలను త్రొక్కి, వానిపై నాట్యమాడెను. అపుడాతని పాదము పుష్యరాగము వలె నున్నది. పుష్యరాగము గురుడు లేక బృహస్పతి గ్రహమునకు

సంబంధించిన రత్నము. కృష్ణుని జాతకమున గురుడు కర్కాటకమున విక్రమ స్థానమున ఉచ్ఛ చెందియున్నాడు. అనగా అఖండమయిన బ్రహ్మానుభూతి, జ్ఞానము తానైనవాడు కృష్ణుడు. ఈ గురుడు వృశ్చికమును శుభదృష్టితో వీక్షించుచున్నాడు. వృశ్చికము సర్పములకు – అనగా బొరియలలో తిరుగుచు, విషముచే స్పృహను కోల్పోవునట్లు తిరుగువాని స్థానము. అనగా తీవ్రములగు భౌతిక శరీర వాసనలగు కామ క్రోధము లను సర్పములచే కాటువడ్డవాడు ఉద్వేగములకు లోనై, తన నిజస్వరూపమగు శాంతిని, ఆనందమును, ప్రేమను కోల్పోవును. శ్రీకృష్ణుని మహిమా వైభవ లీలలను స్మరించినచో, ఆ భౌతిక వాసనలను గూడ స్వామి లీలలుగా దర్శించినచో కామ క్రోధములను కాళియుడు త్రొక్కబడును. కర్కాటకము హృదయ స్థానము. తన హృదయమున కాళియ మర్దనుడగు కృష్ణుని స్మరించు వానిలో స్వామి విక్రమించి, అతని శారీరక వాసనలను పోగొట్టునని అన్నమయ్య భావము. దీనికి అనుగుణ మయిన శ్లోకము భాగవతమున నున్నది. స్వామి పాదకాంతులు కాళియుని పడగలపై మెఱసెను. అనగా స్వామి చరణములను ఆశ్రయించి, ఆయన అడుగుజాడలలో ప్రేమమార్గమున నడచు వానిలో కామక్రోధములు వైదొలగును. స్వామి ఎల్ల లోకములను పాలించుచు శ్రీవేంకటగిరిపై వెలసియున్నాడు. అతడు ఇంద్రనీలము వలె ప్రకాశించుచున్నాడు. నీలము శని గ్రహమునకు సంబంధించిన రత్నము. కృష్ణుని జాతకమున శని తులలో ఉచ్ఛ చెందియున్నాడు. కావున కార్యదీక్ష, ఒక లక్ష్యమునకు అంకితమయిన జీవితము, క్రమశిక్షణ, శ్రద్ధ, కోరికలు ఏమియు లేని వైరాగ్యము గలవాడు కృష్ణుడని అన్నమయ్య భావము. పైకి కన్పడు కృష్ణుడు భోగి వలె కన్పట్టును. కృష్ణుని నిజతత్త్వము వైరాగ్యము. దీనిని అన్నమయ్య దర్శించి, కవితారూపమున గానము చేయుచున్నాడు. ఇంద్రనీలమణి వలె మెఱయుచున్న స్వామి దేహమును దర్శించి, ధ్యానించినచో స్వామి యొక్క పై గుణములు మనకును సంక్రమించును.

కృష్ణుడుగా అవతరించినవాడు, వేంకటగిరిపై వెలసినవాడు అసలు ఎచ్చటివాడు? పాలసముద్రమునందు ఎడబాయక నిలుచు దివ్యరత్నము. పాల జలనిధి అఖండ బ్రహ్మానుభూతి ప్రవాహమే. ఇది సృష్టికి మూలము. ఆకాశమున ఈ పేరున గల తారకా వ్యూహమున మెఱయుచున్న గొప్ప తారకగా గూడ నారాయణుడు నిలిచి యున్నాడు. స్వామి దివ్యరత్నము. ఏల? ఈయన నుండి వెలువడి ప్రసరించు కాంతి ధారయే తారకలకును, సూర్యచంద్రాగ్నులకును ఆధారమై యున్నది. ఈయన కాంతి దివ్యము. అనగా స్వయముగా ప్రకాశము గలది. దీనికాధార మేదియు లేదు. ఇదియే సమస్తమున కాధారము. గీతలో 15వ అధ్యాయమున కృష్ణుడీ యంశమును స్వయముగా తెలిపెను. ఇదియే భావము అన్నమయ్య పదములలో అవతరించినది. ఈ నారాయణుడే ఎల్లరిలో ఆత్మగా వెలసి, వారి బుద్ధులపై తన కాంతిని ప్రసరింప జేసి వానిని సక్రమమార్గమున నడిపించు గాయత్రిగా వెలసియున్నాడు. దాని ననుసరించుట మానవులకు విడిచిపెట్టబడినది. ఇట్లు లోక సృష్టికి మూలమై, సర్వమున కాత్మయై, ఆనందప్రవాహము తానే అయి ఉన్న పరమాత్ముడు గోకులమున బాలుని వలె తిరుగుచున్నాడు. స్వామి నిత్య శిశువు. 'తిరిగీ' అనగా 'తిరిగెను' అని భూతకాల విషయము గాదు. తిరుగుచున్నాడను వర్తమానకాల విషయముగ అన్నమయ్య

భావించెను. అనగా ఇతనికి కృష్ణుని లీలావైభవము ఈ సంకీర్తనమున వర్ణింపబడిన విధముగ ఎప్పుడును దర్శనమిచ్చుచునే యున్నది. అన్నమయ్యకు కృష్ణుడు గతమున వర్తించినవాడు గాడు. నిత్యము వర్తమానమున హృదయపు లోతులందు కానవచ్చు వాడు. కృష్ణుడు పద్మనాభుడైన నారాయణుడు. జగత్తు, ప్రళయమున నారాయణుని నాభియందు పద్మముగా ముడుచుకొని యుండును. సృష్టి స్వామి సంకల్ప కిరణముచే విచ్చుకొనుచుండును. నాభి యనగా కేంద్రము. ఈ విశ్వమను పద్మమునకు కేంద్ర మైన రత్నము నారాయణుడే. ఈతని కాంతియే విశ్వమును ప్రకాశింపజేయుచున్నది. ఇట్లు ఈ సంకీర్తనమున నవరత్నములతో పోల్చబడిన కృష్ణుని దివ్య మహిమలు, దివ్య గుణములు చివరి పాదమున పద్మనాభునితో సంధింపబడుట అన్నమయ్య యొక్క సముచిత దివ్యదర్శనమునకు నిదర్శనము. ఆయా గ్రహ దోషముల నివారణకు ఆయా రత్నములు ధరించుట పరిపాటి. కాని ఈ గ్రహములు స్వామికి దాసులు. స్వామి అనుగ్రహము కలిగినచో గ్రహములతో పనియేమి. ఈ రత్నములు భౌతికములు. కృష్ణుడు దివ్యరత్నము. స్వామి స్మరణ యున్నచో రత్నములను ధరింప బనిలేదని అన్నమయ్య అనుభవము, ఉద్బోధ.

* * *

43

4వ సం-45

యజ్ఞమూర్తి

వరాళి

యజ్ఞమూర్తి యజ్ఞకర్త యజ్ఞభోక్త విన్నిటాను
యజ్ఞాది ఫలరూప మిటు నీవై యుండవే. ॥ పల్లవి ॥

పరికించ జీవులకు ప్రాణమవైన నీకు
నిరతిఁ బ్రాణప్రతిష్ఠ నేము సేసేమా
మరిగి మా పూజలంది మమ్ముఁగాచెడికొరకు
హరి నీమూర్తి ప్రాణ మావహించవే. ॥ యజ్ఞ ॥

జగతికి నీ పాదజలమే సంప్రోక్షణ
జిగి నీకు సంప్రోక్షణ సేయువారమా
పగటున నన్ను నేఁడు పావనము సేయుటకు
అగు పుణ్యతీర్థముల అభిషేకమందవే. ॥ యజ్ఞ ॥

వేదములు దెచ్చిన శ్రీవేంకటేశ నేము నీకు
వేదమంత్రముల పూజావిధి సేసేమా
యీదెస నీదాసులమయిన మమ్ముఁగాచుటకు
వేదమూర్తివై యిందే విచ్చేసియుండవే. ॥ యజ్ఞ ॥

ఎవడైనా తప్పు చేశాడా, ఒప్పు చేశాడా అని ఆలోచించేవాడికి
దారిన పోయే దరిద్రం అంతా అంటుకుంటుంది.

టీక

జిగి = శోభతో, పగటున = ప్రకటింపగా.

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య స్వామిని యజ్ఞస్వరూపునిగా, యజ్ఞఫల రూపునిగా కీర్తించుచున్నాడు. యజ్ఞ మనగా బాహ్యముగా చేయు హోమ క్రియయే గాదు. వేదములందు యజ్ఞమనగా 'ప్రతిఫలాపేక్ష లేకుండ, లోకహితార్థమై చేయు కర్మ' అని నిర్వచింపబడినది. ఎందరో కలిసి అందరి కొఱకై చేయు పని. దీనికి గుర్తుగా హోమ ప్రక్రియ ఏర్పడినది. తర్వాతి కాలమున బాహ్యమైన హోమాదులే ప్రధానములై, యజ్ఞమందలి లోపలి సారభావము జారిపోయినది. అట్టి స్థితిలో శ్రీకృష్ణుడు గీతలో మఱల యజ్ఞమునకు సరియగు వేదార్థమును నెలకొల్పెను. అర్జునునితో స్వామి యిట్లనెను. "నాకు ఏ పని చేయవలసిన అక్కఱలేదు. (ఉదాహరణకు కృష్ణపరమాత్మ పాండవ దూతయై, అసూయాపరులగు కౌరవుల వద్దకు వెళ్ళవలసిన పనిలేదు. కాని ప్రపంచ శాంతికై తన వంతు మానవ ప్రయత్నము చేయుటకై తన స్థాయిని పట్టించుకొనలేదు. అట్లే భక్తుడయిన అర్జునుని రథమునకు సారథి అయ్యెను. ఆ పని ఈయన చేయ పనిలేదు. కాని తన నాశ్రయించిన వానిని కాపాడుట, ధర్మమునకు విజయమును చేకూర్చుట కృష్ణుడు తన భుజములపై వైచుకొనెను. అర్జునుని గుఱ్ఱము లకు ప్రతి దినము స్నానము చేయించెను.) కాని లోకహితము కొఱకై పనిచేయు చున్నాను. నాకు కావలసినదేదియు లేకున్నను లోకహితము నాకు ఆశయము గావున ఇట్లు జీవితమునే యజ్ఞముగా నిర్వహించుచున్నాను. నీవు కూడ అట్లే చేయుము. యజ్ఞము కొఱకు గాని మిగిలిన పనులు చిక్కులలో పడవేయును. కావున యజ్ఞము కొఱకై అపేక్షలు లేక పనిచేయుము. ఇతరులకు ఎట్టి పని చేయకుండ భుజించువాడు దొంగ. ఇచట యజ్ఞమనగా లోక క్షేమము కొఱకు 'నేను చేయు చున్నాను, నాకు గుర్తింపు, ఫలానా ఫలితము ఇట్లు రావలయును' అను భావములు లేకుండ పనిచేయుట. యుద్ధము కూడ నీ రాజ్య భోగముల కొఱకు గాక, సంఘ హితమునకై, ధర్మమునాచరించుటకై చేయుము. నేనే యజ్ఞమును, యజ్ఞకర్తను, భోక్తను, నీవు పరికరము మాత్రమే అని గ్రహింపుము." కృష్ణుడు ఈ అర్థముతోనే ధర్మరాజుచే రాజసూయాగము చేయించెను. ఆనాడు పాలకులు ప్రజా సేవకులగుట వలన, వారెల్లరిని ధర్మమార్గమున నెలకొలిపి, ధర్మమూర్తి యగు ధర్మజుని గొడుగు క్రిందకు దెచ్చి ప్రజలకు హితము కలుగునట్లు ధర్మ పరిపాలన సాగుటకై, అఖండ భారత నిర్మాణమునకు ఈ రాజసూయమును జరిపించెను. అడ్డువచ్చిన లోక కంటకుడగు జరాసంధుని భీమునిచే చంపించెను. అతని సేన జోలికి పోలేదు. రాజసూయమున మూడు సంవత్సరముల పాటు నిరతాన్న సమారాధనము జరిగినది. దశరథుడు గావించిన యాగమున అన్నపురాశులు కొండలయినవనియు, నేయి సాగరమయిన దనియు వాల్మీకి వర్ణించెను. ఇట్లు ప్రజాసేవ, ప్రజలను ఒకచోట చేర్చుట అను యజ్ఞము సాగించుట వలననే రాముడతనికి కుమారుడుగా జన్మించెను. ఇట్లు యజ్ఞమున జనులందరు కలిసికట్టుగా మెలగుచు, పనిచేయుచు, కలిసి బ్రతుకుట అను దివ్య భావమున్నది. జీవితమే యజ్ఞము గావలెను. కలిసి పనిచేయుచు, కలిసి ఒకే పదార్థమును భుజించుట,

సర్వమును కలిసి అనుభవించుటయే యజ్ఞ ప్రసాదము. సమష్టి చైతన్యమును యజ్ఞము పాదుకొల్పును. అన్నమయ్య తన సంకీర్తనములనొక యజ్ఞముగా నిర్వర్తించెను. తన ఆనందము కొఱకే గాదు, భగవత్ ప్రీతికై, లోక హితముకొఱకై వీనిని రచించి గానము చేసెను. యజ్ఞభావమున ముఖ్యమైన అంశములు 1. భక్తునకు ప్రతి పని యజ్ఞమే. జీవితమే యజ్ఞము. 2. లోక హితము కొఱకై పనిచేయవలయును. తన నిత్య దినచర్యలోని వృత్తికి చెందిన పనులను, గృహ కృత్యములను, తన దేహమునకు జేయు పనులను గూడ అంతర్యామికి సమర్పితము గావింపవలయును. అంతర్యామి యన్నను, సమాజమన్నను ఒకటే 3. ఆ సత్కార్యములకు కర్త కూడ స్వామియే. తాను పరికరము మాత్రమే. ఉదాహర ణకు కలము రచింపదు గదా. రచించువాడు కవి. కలము రచనలో కవి ఉపయోగించు పరికరము మాత్రమే. అట్లే మనము చేయుచున్నామని భావించు మంచి పనులన్నిటికి కర్త దేవుడే. సంకల్పము ఆయన నుండియే రావలెను. మనము పరికరములమే. యజ్ఞ భావన వ్యక్తికి, సమాజమునకు మంచి సంబంధములు నెలకొలుపును. సమాజమున వ్యక్తి భాగమే అను భావమును స్థిరపఱచును. మొత్తము సమాజమునే ఒక మూర్తిగా తీర్చును. ఇట్టి పవిత్రమయిన భావముతోనే అన్నమయ్య పల్లవిలో 'యజ్ఞమ'ను పదమును వేదర్షుల వలె, కృష్ణుని వలె ప్రయోగించెను. అంతియేకాని వట్టి హోమాదుల భావములో గాదు. ఇవి జీవిత యజ్ఞ నిర్వహణకు శిక్షణ నిచ్చునవి మాత్రమే. అంతవఱకే వీని అక్కఱ. అదియు జీవిత యజ్ఞ నిర్వహణకు ఇవి శిక్షణ సాధనములని గుర్తించి, శ్రద్ధతో ఆచరించినచో మాత్రమే ఆ శిక్షణకు పనికివచ్చును. లేకున్న మ్రొక్కుబడులు, యాంత్రికములై అనుభూతినీయవు. ఈ కాలమున పాశ్చాత్య నాగరికతా ప్రభావమున చాలమంది నీవు ఈ మంచిపని – నల్వురకు పనికివచ్చునది చేయుమని గాని, నీ వృత్తి ధర్మమును కూడ సమాజ శ్రేయస్సుకై అర్పింపుమనియు చెప్పినచో ఫలానా పని చేసినచో నాకేమి వచ్చును? వృత్తి కూడ వేతనము కొఱకే గదా అని బదులు చెప్పుదురు. కావున దేశము పతనమునకు చేరుచున్నది. అన్నమయ్య యొక్క ఈ సంకీర్తనమున గల సందేశము నరజాతిని నిజమైన యజ్ఞభావము నందు మేలుకొలుపుచు, ఉత్తమ సమాజ నిర్మాణమునకు దోహదము చేయును.

పల్లవి యొక్క తాత్పర్యము

"భగవానుడే వ్యక్తి జీవితమున అన్ని అంశములందును యజ్ఞమును తన రూపముగా గలవాడు. యజ్ఞమును చేయువాడు, యజ్ఞ ఫలమును అనుభవించువాడు. యజ్ఞ యాగాదుల ఫలమే తన రూపమైనవాడు. ఈ రీతులలో నీవు ఉండవే?"

వ్యాఖ్య

ఉండవే అనగా ఉన్నావు గదా యని భావము. విష్ణు సహస్రనామమున ఇట్లు తెలుపబడినది. స్వామియే యజ్ఞమును భరించువాడు యజ్ఞ కర్త. యజ్ఞమును గలవాడు. యజ్ఞ భోక్త. యజ్ఞమునకు వలసిన అవకాశములను కల్పించువాడు. యజ్ఞమును పరిపూర్ణము చేయువాడు. యజ్ఞసారము. సృష్టియే మొదటి

యజ్ఞము. పరమపురుషుడైన భగవంతుడు తన తేజస్సును సమర్పించుకొని ఈ యజ్ఞమును చేసెను. ఆతడు చేసిన యజ్ఞము వలననే ప్రకృతి వర్తించుచు, మనము వేడిమి వెలుగులు వెన్నెలవాన మున్నగువానిని పొందుచున్నాము. సృష్టి అను యజ్ఞమే స్వామి స్వరూపము. ఇది అన్నమయ్య భావము. మన ద్వారమున జరుగుచున్న లోక హితార్థమయిన మంచిపని అను యజ్ఞము కూడ మనది గాదు. అదియు స్వామి యొక్క రూపమే, వైభవమే. భక్తుని జీవితమను యజ్ఞమే స్వామి రూపము. అవ్యక్తము నుండి భౌతిక జగత్తును వెలికి దెచ్చినవాడు గావున వరాహావతారమూర్తికి యజ్ఞవరాహు డని పేరు కలిగెను. ఆయన చేసిన పని యజ్ఞము. ఆయన రూపము యజ్ఞమే. అనగా సృష్టియే. సృష్టియను యజ్ఞము వెలికిరాక ముందు స్వామియే ప్రళయమున ఉండును. అతని నుండియే సృష్టి వెలువడుచున్నది గావున అతడే యజ్ఞ కర్త. ఒక వాక్కును ఉచ్చరించుటకు ముందు, ఉచ్చారణ, ఉచ్చరించువానిలోనే యుండును. భిన్నము గాదు. కాని ఉచ్చరింపబడునపుడు, అతని నుండి వెలువడును గావున అతడే దానికి కర్త. తన సంకీర్తనయను యజ్ఞము స్వామియే. ఆ సంకీర్తనము చేయువాడు స్వామియే. ఇది అన్నమయ్య అనుభవము. అట్లే లోకహితము కోసమై చేయు పని, స్వామియే చేయువాడు. మన ద్వారమున అది జరుగును గాని, మన వలన గాదు. మనము నిమిత్తమాత్రులము. ఉదాహరణకు, ఆకలిగొన్నవానికి ఒకడు అన్నము పెట్టకున్నచో, ఆవేళ అతనికి అన్నము దొరకు యోగమున్నచో, అతనికి ఇంకొకరి రూపమున స్వామి అన్నము పెట్టును. సంకీర్తనమయినను అంతియే. మనము గానము చేయుట వలన శ్రోతలు పరవశులగుచున్నారని పొరపడరాదు. అట్లు పొరపడినచో మనము పతనము పొందెదము. మఱియు కొన్నాళ్ళకు, శ్రోతలు కూడ ఆనందించుట ఆగును. కారణము గానము చేయునపుడు మన యునికి గుర్తుండుటయే. గాయకునకు తన యునికి, శ్రోతల యునికి గుర్తుండక తాను, శ్రోతలు, సంకీర్తనము స్వామి స్వరూపములని గ్రహించినచో తానుండక, అనుభూతి యుండును. పారవశ్య ముండును. శ్రోతల విషయమున కూడ అంతియే. ఇట్టి గానముననే గాంధర్వగాన మందురు. తన తెలివితో పాడునది ఎంత విద్వత్తు ఉన్నను అధమస్థాయి గానమే. తన హృదయముతో పాడుచున్నను తాను గుర్తున్నచో అది మధ్యమస్థాయి గానము. తానుండక, గానమదియే స్వామి సాగించుచు తన కంఠమును వినియోగించుకొనుట ఉత్తమస్థాయి గానము. ఇదియే గాంధర్వ వేదము.

తననుండి సృష్టి వేరుగాకున్నను, వేరు వలె వెలికివచ్చిన పిమ్మట, ఆ సృష్టి యజ్ఞము అనుభవించువాడును స్వామియే. ఒక సంకీర్తనకు రాగ తాళ లయలను గూర్చిన గాయకుడు, దానిని అనుభవించును గదా. లోకహితము కొఱకై మంచిపని జరిగినపుడు దానిననుభవించు జీవుని రూపమున నున్నదియు స్వామియే. యజ్ఞము యొక్క ఫలితము మనకు చెందునని భావింపరాదు. ఆ ఫలము ననుభవించువాడు స్వామియే. ఆ ఫలము కూడ స్వామియే. ఉదాహరణకు అన్నము పెట్టుట జరిగినపుడు పెట్టుట అను యజ్ఞము స్వామియే. పెట్టువాడు స్వామియే. దానిని భుజించువాడు స్వామియే. భుజింపగా అతని ఆకలి తీరి తృప్తిగలుగుట అను ఫలితము స్వామియే. అతని తృప్తి వలన అన్నము పెట్టువానికి గలుగు తృప్తి యను

ఫలము స్వామియే. సంకీర్తనము, దానిని పాడువాడు, శ్రోత, అతడు, గాయకుడు అనుభవించు ఆనందము స్వామియే. ఇట్లు నాలుగు అంశములను నీవే అయి ఉన్నావు గదా అని అన్నమయ్య స్వామిని కీర్తించుచున్నాడు.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"పరిశీలింపగా జీవులకు ప్రాణము నీవే. ఈ స్థితిలో శ్రద్ధతో నీ మూర్తులకు మేము ప్రాణమును ప్రతిష్ఠించుట యేమి? మరి ప్రతిష్ఠ యొక్క పనియేమి? మాయందు వాత్సల్యముతో మరగి ఓ హరీ మా పూజలందుకొని, మమ్ము కాపాడుట కొఱకై నీ మూర్తిలో ప్రాణమును ఆవహింపజేయుదువు గదా."

వ్యాఖ్య

సమగ్ర దృష్టితో పరిశీలించినచో ఒక సత్యము తెలియునని అన్నమయ్య తెలుపు చున్నాడు. జీవులకు ప్రాణము స్వామియే. చోటులోనున్న చైతన్యముగా నున్న విష్ణువే, అందలి ప్రాణశక్తిగా రూపొందుచున్నాడు. ఉదాహరణకు నీటి యావిరియే నీరుగా స్థితిమార్పు చెందును. చోటులోని ప్రాణశక్తి కొలనులోని నీటి వంటిది. మనలోని ప్రాణశక్తి, చోటులో నున్నదే. చోటు నుండియే మనలోనికి ప్రాణము ప్రవేశించుచున్నది. కొలను నీరే కదా చెంబులోనికి వచ్చునది. ఇట్లు జీవుల ప్రాణముగా స్వామియే నున్నాడు. శ్వాస మనము చేయునది గాదు. మనకు శ్వాసించు పని ప్రకృతి మనకప్ప జెప్పినచో ఏమగును? శ్వాసించు చుండగనే ఏదో తలంపు వచ్చి, శ్వాస ఆగి ప్రాణము దేహము నుండి వెడలును. కావున దయతో ప్రకృతి శ్వాసించు ప్రక్రియను మనకప్ప జెప్పలేదు. మన హృదయమున నున్న స్వామియే ప్రాణరూపుడై మనయందు ప్రేమతో శ్వాసించుచున్నాడు. మన శరీరమున ప్రాణశక్తిని పంచుచున్నాడు. ప్రాణము వలననే శరీరము నిలుచుచున్నదని తైత్తిరీయోపనిషత్తు, ప్రశ్నోపనిషత్తు చెప్పుచున్నవి. అన్నము వలననే శరీరము నిలుచుట నిజమయినచో శవమునకు అన్నము పెట్టినచో బ్రతుక వలెను గదా. ఎక్కువ అన్నము తినువాడు అధిక శక్తిమంతుడు కావలెను గదా. అట్లుగాక ఆకలిని మించి భుజించువాడు అనారోగ్యము పాలగుచున్నాడు. కారణము, ప్రాణశక్తి చెదరి పోవుటయే. ప్రాణమను శక్తికి ఆహారము ఇంధనము వంటిది మాత్రమేయని ఆయుర్వేదము చెప్పుచున్నది. సూర్యరశ్మి, స్వచ్ఛమయిన వాయువు, పరిశుద్ధ జలము, మితమయిన తగిన ఆహారము దృఢమైన ప్రాణశక్తికి దోహదపడును. స్వామియే జీవులకు ప్రాణమై యుండగా, దేవాలయములలో స్వామి యొక్క అర్చారూపములను ప్రతిష్ఠించు సందర్భములందు 'ప్రాణప్రతిష్ఠ' అను కార్యక్రమమును మనము చేపట్టుట విడ్డూరము. అర్చా విగ్రహమున ప్రాణమును, 16 కళలను ఆవాహన చేయుట ఆగమశాస్త్ర నియమము. దీనిని అన్నమయ్య ఎఱుగును. మనకు ప్రాణమగు స్వామి మూర్తిలో ప్రాణమును ప్రతిష్ఠించుటకు మఱి కారణమును అన్నమయ్య అద్భుతముగా చిత్రించెను. ఈ భావము తార్కికము, వైజ్ఞానికము గాదు. భక్తిప్రపత్తుల నుండి ఉద్భవించినది. స్వామి అంతర్యామియే. జీవుల శరీరము లెల్ల స్వామి యొక్క సజీవ విగ్రహములు. విగ్రహములనగా విశేషముగా గ్రహింప దగినవి. శరీరములను, ఱాళ్ళను, కాగితములను చూడక, వానియందు పరమాత్మను గ్రహింపవలెను. సజీవ

విగ్రహములు గల జీవులను దేవునిగా ఆరాధించుటకుగాను, ఱాళ్ళతో గాని, మట్టితో గాని, కాగితములతో గాని చేయబడిన విగ్రహములను ఆరాధించుట సోపానము. నిర్జీవములని వానిని నిర్లక్ష్యము చేయరాదు. వానిని పూజించుట వఱకు పరిమితమే కాదు గాని, వానిని బహిష్కరింపరాదు. అంతట ఉన్న స్వామి విగ్రహములలో నుండలేడా! ఈ విగ్రహములను గూడ సజీవము చేయుటకై ప్రాణప్రతిష్ఠ చేయుట ఆవశ్యకమని పెద్దల అభిప్రాయము. కాని అన్నమయ్య చెప్పిన కారణము భక్తితోడిది. జీవులకు తోటి జీవుల రూపములలో గల అంతర్యామిని అర్చించుటలో శిక్షణ నిచ్చుటయే స్వామికి జీవులపై గల వాత్సల్యము. ఈ వాత్సల్య ముతో సంతోషముగా ఉత్సహించి స్వామి జీవుల పూజలందుకొని, వారిని కాపాడుట కొరకే అర్చావిగ్రహములందు తన ప్రాణశక్తిని ఆవహింపజేయుచున్నాడు. జీవుల ప్రార్థనను మన్నించి, ప్రాణమును విగ్రహములందు ప్రతిష్ఠించుకొనుచున్నాడు. మానవులు కాదు దేవుని మూర్తులందు ప్రాణప్రతిష్ఠ చేయునది. స్వామియే తన ప్రాణశక్తిని ఆయా మూర్తులందు ప్రతిష్ఠించుకొనుట జరుగుచున్నది. భక్తుల ప్రార్థనను, ఆవాహనను మన్నించుచున్నాడు. ఆయా మూర్తులను సేవించి, భక్తులు ధన్యులై వారిలో భక్తి పెరుగగా, అందరిలో దేవుని దర్శించుట జరుగును. ఇదియే దేవుడు వారిని కాపాడుట. కాపాడుట యనగా ఆపదలనుండి అను భావము పరిమితము. పెద్ద ఆపద ప్రక్కవారియందు దేవుని దర్శింపకుండుట. ఈ యాపద వలన శోకము, కామక్రోధాదులు పెరిగి బ్రతుకు నరకమగును. జీవులను ఈ యాపదనుండి కాపాడి, తన విశ్వరూప దర్శనము నిచ్చుటకు శిక్షణగా అర్చామూర్తులందు స్వామి ప్రాణమును ఆవహింపజేసికొనుచున్నాడు. కావున వీనిని శిలలని భావింపరాదు. స్వామియనియే భావించి భక్తిశ్రద్ధలతో పూజింపవలెను. లేకున్నచో పూజ వ్యర్థము. అన్నమయ్య వేంకటేశ్వరమూర్తిని ఇట్లే అర్చించి ధన్యుడాయెను.

శ్రీరామకృష్ణపరమహంస కాళికాదేవి విగ్రహమును శిలగా గాక, అమ్మగనే భావించి, ప్రతి యుపచారమును భక్తి శ్రద్ధలతో ఆచరించెను. ఉదాహరణకు నైవేద్యమును సమర్పించుచు "అమ్మా! దీనిని భుజింపుమ"ని బ్రతిమిలాడెడివారు. అమ్మవారు వాస్తవముగనే భుజింపగా, ఆ శేషము పరమహంస పాలిటి ప్రసాద మయినది. దానిని భక్తులకు పంచి, శేషమును ఆయన స్వీకరించెడివారు. స్వామి వారి అర్చామూర్తిని నిజముగా స్వామియనియే హృదయమార విశ్వసించినచో, మఱియు స్వామి నిజముగానే తాను నివేదించు ఆహారమును స్వీకరించునని విశ్వసించినచో కొంతమంది నివేదనము పెట్టనేపెట్టరు. స్వామి స్వీకరింపడు, మఱల అది తమకే లభించునను దృఢవిశ్వాస ముండుట వలననే కొందరు నైవేద్యములను పెట్టుదురు. ఇది పెట్టుటయే గాని సమర్పణము గాదు. అట్లుగాక స్వామియే విగ్రహమున ఆవేశించి యున్నాడని విశ్వసించి, భక్తితో పూజించి, నివేదన మర్పించి, దానిని ప్రక్కనున్న వారికి అర్పించి, మిగిలిన శేషమును తాను భుజించినపుడే అది ప్రసాదమగును. అట్లుగాక తానే నేరుగా భుజించినచో అది లడ్డు లేక కొబ్బరియే అగును. దైవ ప్రసాదము గానేరదు. జీవుల దేహములను దేవుని విగ్రహములుగా అర్చించుటలో శిక్షణ నిచ్చుటకే విగ్రహములలో స్వామి ప్రాణము నావహింపజేయుట జరుగుచున్నది. ఇక స్వామియా! ఆయన ఎట్లును సర్వమును తానుగానే యున్నాడు గదా. విగ్రహారాధన, స్వామి కొఱకు గాదు, మన యుద్ధరణకు

అని గుర్తింపవలెను. కావున అర్చా విగ్రహమున స్వామిని ప్రతిష్ఠించుట యనగా స్వామి అందున్నాడని గుర్తించుట. దీనికొఱకే ఆగమ విధులు పుట్టినవి. మనమెవరము, ఎంతవారము స్వామిని ప్రతిష్ఠించుటకు! తనకుగా స్వామియే ప్రాణ ప్రతిష్ఠనొందుచున్నాడు. ఆగమ విధులను సశాస్త్రీయముగా పాటించుచు, ప్రాణప్రతిష్ఠను జరిపినను పై భావములేక, అతిశయమున్నచో భక్తి లోపించును. ప్రతిష్ఠ నామమాత్రమగును. అట్టి ఆలయము లలో స్వామి విగ్రహములందున్నను భక్తి లేని వారియెడ ఆయన సాన్నిధ్యము లభింపదు. దగ్గఱలో సంకీర్తనము జరుగుచున్నను, అది అతని యెడల లేనట్లే. దానియనుభూతి అతనికందదు గదా. అట్లే భక్తి శ్రద్ధలు లేక ఎంత శాస్త్రీయముగా ప్రతిష్ఠించినను, స్వామి సాన్నిధ్యము లభింపదు.

2వ చరణము యొక్క తాత్పర్యము

"జగత్తును నీ పాదములనుండి వచ్చిన నీరే శుద్ధి చేయు సామర్థ్యము గలది. అట్టియెడ, శోభగా నీకు మేము శుద్ధిచేయు జలముతో అభిషేకించువారమా! మేము సంప్రోక్షణము చేయుట ఒక నెపము మాత్రమే. వాస్తవము ప్రకటింపవలెనన్నచో ఆ నెపమున నన్ను నేడు పావనము చేయుటకే తగిన పవిత్ర తీర్థములతో నీవు మాచేత అభిషేకింపబడుచున్నావు".

వ్యాఖ్య

అన్నమయ్య స్వామికి మనము చేయు సేవలన్నిటిని మనము చేయగలవారము గాదనియు, సర్వ జగత్తుకు ఆధారభూతుడై మనము సేవించు అంశములు తననుండి ఏర్పడినవనియు, కాని మనలను అనుగ్రహించుటకే మన యీ సేవలను స్వామి అనుమతించుచున్నాడనియు వినయముతో, భక్తితో తెలుపుచున్నాడు. స్వామి పాదముల నుండి పుట్టిన ఆకాశగంగయిన కాంతిప్రవాహమే క్రమముగా మన సూర్యుని వెలుగై, మబ్బు వర్షించు నీరగుచున్నది. మబ్బు నుండి కురియు సహజమయిన వాన నీటినే 'గంగ' యనుట వేద సంప్రదాయము. స్వామి మేఘమూర్తి గదా. బావులలో గాని, నదులలో గాని ఉన్న నీటిని కూడ గంగ యనుట పల్లెలలో పరిపాటి. బావి త్రవ్వు చుండగా నీరు పడినచో గంగ పడినదని పల్లె ప్రజలు సంబరపడుదురు. కావున గంగానది నీరే కాక, భూమిపై గల నీరెల్లయు స్వామి పాదముల నుండి పుట్టిన గంగాజలమే. ఇది ఉదాత్తమైన ఋషిభావన. వేదర్షులు ఇట్లే భావించిరి. శంకర భగవత్పాదులు గంగా జలమును త్రాగుచు ఇది అమ్మవారి స్తన్యమని అనుభూతి పొందిరి. వేదర్షులు కవులు కూడ. సాధారణ కవులు తమ సొంత ప్రతిభతో ఊహలు చేయుదురు. వేదర్షులు సృష్టిలోను, ప్రకృతిలోను ఉన్నదానినే భగవంతుని వైభవమని గుర్తించి పరవశించి గానము చేసిరి. అన్నమయ్యయు ఇట్టివాడు. ఈ చరణమునందలి అతని భావము, దేవుని యెడల భక్తితో పరవశించిన ఆతని గుండె నుండి ఊరిన గంగ. ఈ చరణము గంగా జలము వలె పావనమైనది. మానవులు త్రాగుటకు, స్నానము చేయుటకు, ఇంటి సామగ్రిని పరిశుభ్రము చేసికొనుటకు ప్రకృతిలోని నీరే ఆధారము. నీరు అనగా వట్టి ద్రవము గాదు. అందు విద్యుత్తు దాగియుండును. అనగా జీవశక్తి దాగియుండునని వేదమునను, ఆయుర్వేదమునను చెప్పబడినది. జలవిద్యుత్తును గూర్చి

వేదములందు ప్రశంస గలదు. విద్యుత్తును వినియోగపఱచు కొనుట మానవునకు తెలియునుగాని, విద్యుత్తు అనగా నేమియో ఏ శాస్త్రవేత్తకును తెలియుటకు అవకాశము లేదు. చోటునందు దాగిన జీవశక్తియే మబ్బులలో మెఱపుగను, నీటిలో జీవాధార శక్తిగను ఏర్పడినది. నీరే జీవాధారమని ఆయుర్వేదము చెప్పుచున్నది. సూర్యరశ్మి, స్వచ్ఛమైన గాలి, స్వచ్ఛమయిన నీరు ఈ మూడు మనలో ప్రాణశక్తి పెంపుదలకు మూలాధారములు. సస్యములది నాలుగవ స్థానము. నీటిని కలుషితము చేయు మానవుడు, ప్రకృతికి, మొత్తము జీవజాతికి ద్రోహము చేయుచున్న వాడగు చున్నాడు. ఇట్టి నీటిని మనము త్రాగునపుడు గాని, స్నానము చేయునపుడు గాని పవిత్రమూర్తి యగు ఒక దేవతగా భావించుట మఱచితిమి. కాని అన్నమయ్య తన బ్రతుకులో నీటిని ఎపుడు త్రాగినను, వాడినను స్వామి పాదముల నుండి వచ్చినదిగను, ఆయన పాదముల స్పర్శతో దివ్యమైనదిగను భావించి తన మనస్సులో ఆరాధించెను. ఇది ఋషి భావన. గోడమీద పోసికొన్నట్లుగ, మనము స్నానము చేయరాదు. విష్ణు పాదముల నుండి పుట్టిన గంగగా నీటిని స్మరించి నమస్కరించుచు స్నానమాడవలెను. గంగాది పావన నదులలో అంతర్వాహినిగనున్న జీవశక్తి మనము వాడు నీటిలో ప్రవేశించుగాక యని ధ్యానింపవలయును. అపుడు మనలో జీవశక్తి పెంపొందును. మనస్సు నిర్మలమగును. హృదయము స్వామికి నివాసమగును. స్వామి పాదజలములను భావముతో మనము నీటితో స్నానము చేయుచో ఎంతటి ఉత్సాహము, శక్తి, పవిత్రత మనల నావహించునో అనుభవించిన వారికే తెలియును. పూర్వము ఋషులు నదీస్నానము చేయునపుడు విశ్వమంతయు విష్ణుని దేహ మనియు, తాము స్నానమాడు, పానము చేయు జలములు స్వామి పాదములనుండి వచ్చు చున్నట్లుగా దర్శించి పులకించి, పారవశ్యమున నీటిలో నృత్యముచేసిరి. అన్నమయ్యయు అట్టివాడే. మనలను శుద్ధిచేయు నీటికి తండ్రియగు స్వామికి మనమేదియో చాల వైభవముగా అభిషేకము చేయుచున్నామనియో, స్నానము చేయించుచు స్వామి మూర్తిని పరిశుద్ధి గావించుచున్నామనియో భావించుట అవివేకమని అన్నమయ్య అనుచున్నాడు. నిత్య పవిత్రమూర్తి యగు స్వామికి స్నానమదేల? యని శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు శ్రీరాముని గూర్చి పలికిరి. అయితే తనను అభిషేకించుటకు, స్నానము చేయించుటకు స్వామి మనలను కృపతో అనుమతించు చున్నాడు. అంతేకాని మనలను పరిశుద్ధులను గావించు జలములను తన పాదముల నుండి పుట్టించు స్వామిని, ఆ జలములలోనే పరిశుద్ధి గావించుటకు మనమెవరము? ఎంత వారము? భక్తుడు స్వామికి స్నానము చేయించునపుడు భక్తి భావన, ఆనందము పెల్లుబుకును. అసలు స్వామికి పూజాది కార్యక్రమములు ప్రారంభించుటకు ముందే అర్చామూర్తిని సర్వాంతర్యామిగ ధ్యానించి, నీ పూజ నీవే చేయించుకొనుమని ప్రార్థింపవలెను. ఇది రామానుజులవారి ఉపదేశము. అపుడేమగును? మనము స్వామి మూర్తినే గాదు, విశ్వమూర్తియగు స్వామిని పూజించుచు, స్నానము చేయించుచున్న వారమగుదుము. మన హృదయము పావనమై, పరిమితములు, సంకుచితము లగు వాసనల నుండి విముక్తమై, విశ్వ విశాలముగా వికసించుట జరుగును. అట్లు మనలను పరిశుద్ధులను గావించుట కొఱకు పవిత్ర జలములతో తాను మనచే అభిషేకింపబడుచున్నట్లు స్వామి ప్రకటించుకొనుచున్నాడు. ఈ ప్రకటన మనపై కృపయే

గాని, ఆయనకు పరిశుద్ధితో పనిలేదు. స్నానము అక్కఱలేదు. పరిశుద్ధిని కోల్పోయిన వానికి పరిశుద్ధి కల్గుటకై స్నానము ఆవశ్యకము. ప్రతిదినము కొంతసేపటికి స్నానము చేసిన పిదపను, మానవ దేహమునకు మలినమంటును. అది తొలగుటకై స్నానము ప్రతిదినము ఆవశ్యకము. పూర్వకాలమున ఋషులు మూడుపూటలందున స్నానమాచరించెడి వారని వాల్మీకి రామాయణమున తెలియుచున్నది. వాల్మీకి 'తమసా నదీ జలములను' ప్రసన్నములనియు, మంచి మనుష్యుని మనస్సు వలె నున్నవనియు నుతించెను. నదీ జలముల స్నానము వలన మంచి మనస్సు మనకు కలుగును. ఏల? నదులు దేవతా స్త్రీలు. వివక్ష ఎఱుగని విశ్వ ప్రేమ గలవారు. వాని స్పర్శతో మనకును ఆ స్వచ్ఛత అంటును. స్వామి నిత్యపరిశుద్ధుడు. పరిశుద్ధతయే మూర్తిగా గలవాడు. ఆయనకు సంకుచితత్వమను అపరిశుద్ధి లేదు. విశాలప్రేమ యను పరిశుద్ధి గలదు. అపరిశుద్ధతయే స్వామిని ఏ క్షణమునను అంటనపుడు, పరిశుద్ధి కల్గించుటకై స్నానమేల? మనలను పరిశుద్ధులను గావించుటకే దేవుడు తనకు స్నానము చేయుటను అనుమతించుచున్నాడు. అన్నమయ్యది ఋషి భావము, నిర్మల భావము, వినయ భావము, కోమల భావము, సున్నిత భావము, లలితోదార భావము. ఈ భావము లేనివానికి ఈ చరణము తట్టదు. ఇట్లు స్వామిని స్నానము చేయించుటకు దాస్యభక్తి, సఖ్యభక్తి, మధురభక్తి ఉపకరించును. దాసుడు యజమానికి, సఖుడు సఖునకు, భార్య భర్తకు స్నానము చేయించును. దీనికన్న వాత్సల్య భక్తిది అగ్రతాంబూలము. లీలాశుకుడను భక్తుడు యశోద కృష్ణుని స్నానమాడించిన రీతినిట్లు భక్తి ఉప్పొంగగా వర్ణించెను. "వరాహావతారము దాల్చినపుడు స్వామి యొక్క ఒక్క రోమ రంధ్రమును గూడ సముద్ర జలములన్నియు కలిసియు నింపలేకపోయినవి. కాని యశోద స్వామి యొక్క సమగ్ర రూపమును తన దోసిటి నీటితో స్నానమాడించినది. ఆమె వాత్సల్యమునకు స్వామి కట్టువడిన తీరు ఇది." అన్నమయ్య కూడ స్వామి నభిషేకించు సందర్భమున ప్రతిదినము ఇట్టి యశోదా భావముతో తాదాత్మ్యము చెందెను. తాను స్నానమాడించిన కృష్ణుని అల్పమూర్తినే కాదు. భావనను బట్టి విశ్వమూర్తిని. మనము కూడ అన్నమయ్య వలె, యశోద వలె అనుదినము స్వామిని ఇట్లు స్నాన మాడించినచో పావనత్వము త్వరగా మనలో పరిపూర్ణమగును. ఉపనిషత్తులందు, వేదములందు వెదకినను పరబ్రహ్మము దర్శన మీయడు. యశోద యింటిలో స్నానము చేయించుకొనుచునో, వెన్న తినుచునో, ఱోటికి కట్టబడియో కానవచ్చును. వాత్సల్య భక్తికున్న మహిమ యట్టిది. యశోదకన్న భాగ్యశాలురెవ్వరు? విశ్వపురుషుని స్నాన మాడించి, ఆమె విశ్వమాత అయినది. ఈ చరణమున అన్నమయ్య అట్టి స్థానమును పొందుచున్నాడు. హనుమంతుడు కూడ లంకలో సీతాదేవిని సంస్కారము అనగా స్నానాదులు లేనిదానినిగా చూచెను. అనగా సంస్కారము లామెకక్కఱలేదని గ్రహించెను.

3వ చరణము యొక్క తాత్పర్యము

"శ్రీ వేంకటేశా! నీవే వేదములు తెచ్చితివి. అట్టి నీకు వేదమంత్రములతో పూజా విధానమును చేయువారమా! ఇట్లు, నీ దాసులయిన మమ్ము కాపాడుటకే, వేదమూర్తివై ఇందు విచ్చేసియున్నావు గదా!"

వ్యాఖ్య

స్వామి మత్స్యావతారమున వేదములను దెచ్చి బ్రహ్మకిచ్చెను. వేదములనగా శాశ్వత సృష్టి ధర్మములు. పంచభూత లక్షణములు. సూర్యుని వేడిమి వంటివి. ప్రళయకాలమున ఇవి స్వామియందు కరగిపోవును. వీనిని ప్రళయములోనికి, అనగా అవ్యక్త స్థితిలోనికి గొనివెళ్ళు ప్రజ్ఞకే సోమకాసురుడని పేరు. వీనిని తొలగించి, మఱల ఆ సృష్టికి చెందిన శాశ్వత ధర్మములను అవ్యక్తస్థితి నుండి వెలికి వ్యక్తము గావించి సృష్టికర్త కిచ్చెను అనగా తట్టించినవాడు నారాయణుడు. ఉదాహరణకు, మానవునకు నిద్రను నిత్య ప్రళయ మందురు. ఈ దినము నిద్రలోని కొరుగుటకు ముందు మనలను గూర్చి మనకున్న స్మృతులు, భార్య పిల్లలు ఫలానావారని గుర్తులు, చదివిన విషయములు నిద్రలో అవ్యక్త స్థితిలో దాగియుండును. ఉదయము మేల్కొంచగనే వాని నన్నిటిని స్వామియే మనకు గుర్తువచ్చునట్లు చేయును. మనలను, మన తల్లిదండ్రులను, భార్య, పిల్లలను, మిత్రులను, వృత్తి ధర్మములను, చదివిన అంశములను మనము గుర్తించుటకు యత్నింపబనిలేదు. వాటికవియే గుర్తువచ్చునని కొందరు భావించుచున్నారు. అది తప్పు. నిద్రలో గూడ ఉండు చైతన్యమగు స్వామి తనలో దీనిని దాచియుంచి, మనము మెలకువ పొందగనే, మనకు తట్టింపజేయును. పటికబెల్లము నీటిలో కరిగినను, దాని స్థితి యుండదుగాని దాని రుచి దాగియుండును గదా. అట్టిదే వేదములు అవ్యక్తములో దాగియుండుట. ఉదాహరణకు ఒక విద్యార్థి నిద్రకు ముందు అయిదు లెక్కలను చేసెను. మెలకువ వచ్చిన పిమ్మట, ఆరవ లెక్కను మొదలుపెట్టెను. పూర్వపు అయిదు లెక్కలు గుర్తుకు వచ్చునట్లు చేయునది మనలో అంతర్యామియగు స్వామి. ఒక తల్లి మెలకువలో నున్నప్పుడు తన సంతానముపై ప్రేమ కురియును. నిద్రలో ఆ ప్రేమ వ్యక్తము గాదు గాని అవ్యక్తముగా దాగియున్నది. మెలకువ రాగానే, దానిని స్వామి వెలికితెచ్చును. మఱల తల్లికి పిల్లలపై ప్రేమ వ్యక్తమగును. ఇట్టి ప్రకృతి ధర్మములే వేదములు. వానిని సృష్టికర్తకే గాక, తనకు హృదయమును సమర్పించుకొన్న భక్తులకు కూడ స్వామియే వేదములను అందించును. సృష్టి విజ్ఞానమును, మనము చేయవలసిన పనులను తట్టించును. అనగా ప్రసాదించును. ఇట్టి వేదములను దర్శించిన మహర్షులు వేద గ్రంథములుగా రూపొందించిరి. వేదములనే దెచ్చిన స్వామికి, మనము వేదమంత్రములతో పూజ చేయుట ఎంత విడ్డూరము! మనకు ఈ వేదమంత్రములు, పూజా విధానము, భక్తిశ్రద్ధలు ప్రసాదించిన స్వామికి మనమెంతటివారము పూజించుటకు! నేను చాల బాగుగా వేదమంత్రములను నేర్చితిని. ఉచ్చరింపగలను. పూజ చక్కగా చేయగలను అను అతిశయ భావములు ఎంత మూఢములు! మఱి స్వామి మన పూజను, వేద మంత్ర పఠనమును ఏల అనుమతించుచున్నాడు? వేదములే అనగా శాశ్వత ప్రకృతి ధర్మములే తన రూపముగా గలవాడై ఈ పూజలను, వేద మంత్రోచ్చారణమును చేయించుకొని, తన భక్తులయిన దాసులను కాపాడుటకై మాత్రమే దీని ననుమతించు చున్నాడని అన్నమయ్య భావము. వేద విధానముతో స్వామిని పూజించిన వారికి ప్రకృతి వలెనే స్వచ్ఛత, సరళత, ప్రతిఫలాపేక్ష లేకుండ సహజ స్వభావముగా ధర్మము నాచరించు బుద్ధి అలవడవలెననియే స్వామి ఆశయము. ప్రకృతిని, అందలి భాగములయిన సూర్యచంద్ర

మేఘాదులకు, వాయువుకు వారాచరించుచున్న ధర్మములు సహజములు. కాని మానవుడు అర్థకామముల కొఱకే కర్తవ్యమును చేయుచుండును. మానవునికి సహజ ధర్మస్వభావము నందించుటకే ఈ పూజలను స్వామి అనుమతించుచున్నాడు. స్వామిమూర్తి శిలయనియే భావింపరాదు. శాశ్వత ధర్మములు రూపుగొన్నవని భావించవలయును. మఱియు అర్చామూర్తిని పూజించుట వలన క్రమశిక్షణము, ఆపై సమాజమే రూపమైన స్వామిని అర్చించు జీవన మబ్బును. అట్టి లక్ష్యము పూజించువాని యెదలో స్థిరపడవలెను. ఇక జీవితమే ఒక యజ్ఞము. అర్చనము అగును. మాటలాడు ప్రతి మాట వేదమంత్రమగును. అన్నమయ్య జీవనమే యజ్ఞము. ఆతని సంకీర్తనమే వేదము. మనకును ఇట్లగుగాక యను ఆశయముతో అన్నమయ్య ఈ సంకీర్తనమును వెలువరించెను.

* * *

44

10వ సం-27

రచ్చకెక్కితివి

సాళంగనాట

రచ్చకెక్కితివి పండరంగి విఠలా
పచ్చిదేరే వింతలోనె పండరంగి విఠలా. ॥ పల్లవి ॥

గుట్టు గల దొరవని కొసరి చూచినంతనె
రట్టుగా నవ్వేవు పండరంగి విఠలా
మట్టుమీరి తమకపు మాఁటలనె నీవలపు
బట్టబయలె సేసేవు పండరంగి విఠలా. ॥ రచ్చ ॥

సాగిననబలలోన సన్న సేసినంతలోనె
రాగిదేలించేవు పండరంగి విఠలా
వేగిరపుఁ జేఁతలనె విరివి నీ మోహ మెల్ల
బాగుగా వెళ్ళవేసేవు పండరంగి విఠలా. ॥ రచ్చ ॥

తతి నీవున్న చోటికి దగ్గర వచ్చినంతనె
రతిఁ గూడితివి పండరంగి విఠలా
గతియైన శ్రీవేంకటనాథ యేలితివి
పతివై కోవిలకుంట్ల పండరంగి విఠలా. ॥ రచ్చ ॥

చుట్టుప్రక్కల మనుషులుంటారు, పరిస్థితులుండవు.
పరిస్థితులనేవి మానసిక జనితమైన వ్యాధులు.

టీక

రచ్చకెక్కితివి = బయటకు వ్యక్తమయితివి, వెలసితివి; పచ్చిదేరేవు = పచ్చిగా నుంటివి, రట్టుగా = ఊరకనే, మట్ట = హద్దు, తతి = తగిన సమయము, కొసరి = కోరి, గుట్టు = ధైర్యము.

పరిచయము

అన్నమయ్య తిరుమలపై వెలసిన శ్రీవేంకటేశునే గాక, వివిధ క్షేత్రములను దర్శించి అచటి అర్చామూర్తులుగా నున్న స్వామిని సేవించి సంకీర్తించెను. అయితే ఏ మూర్తి నయినను శ్రీవేంకటేశుని ప్రతిమూర్తిగానే సేవించి, కీర్తించెను. ఇదియే సరియయిన విధము. పరబ్రహ్మము సర్వవ్యాపి. కావున తన ఇష్టదైవమునే మిగిలిన అన్ని దేవ రూపములలోను, జీవరూపములలోను దర్శింపవలెను. శ్రీవేంకటేశ్వరుని భక్తాగ్రేసరు డగు అన్నమయ్య, శ్రీ పాండురంగని భక్తాగ్రేసరుడగు పురందరదాసు కలిసికొనిరట. అన్నమయ్యను పురందరదాసు శ్రీవేంకటేశ్వరుడే అనియు, పురందరదాసును అన్నమయ్య శ్రీ పాండురంగడే యనియు గౌరవించిరట. అన్నమయ్య శ్రీవేంకటేశునిపై రచించిన ఒక సంకీర్తనను అనుసరించుచు, పురందరదాసు పండరి విఠలునిపై వ్రాసెనట. పండరిపురమున వెలసిన విఠలుడే, కర్నూలు జిల్లాలోని కోవిలకుంట్ల గ్రామమున వెలసెను. అన్నమయ్య మనుమడగు చినతిరుమలయ్య ఈ విఠలుని దర్శించి, తనిసి ఈ సంకీర్తనను రచించి గానము చేసెను. అచట పండరంగి విఠలుడు ఇతనికి సాక్షాత్కరించి, అతనిని తన చూపులతో, పలుకులతో అలరించి, తనయందు కరిగింపజేసి యానందింపజేసెను. దేవుని ఏ మూర్తి అయినను ఇతనికిట్టి అనుభూతి కలుగుటలో వింత లేదు. ఏలనన, మూర్తులు వేరుగా కనపడినను అంతర్యామి ఒకడే గదా! పండరిపురములోని దైవతమునకు పాండురంగడనియు, విఠలుడనియు రెండు పేర్లు గలవు. దక్షిణదేశమున శ్రీరంగనాథుడున్నాడు. జగన్నాటక రంగమునకు నాథుడీతడు. శ్రీకృష్ణుడు పుండరీకుడను భక్తునకు భీమరథీ నదీతీరమున సాక్షాత్కరించి అచట వెలసెను. అపుడు పుండరీకుని పేర పౌండరీకమను నామము మొదట క్షేత్ర పదముగా ప్రసిద్ధమయినది. ఆపైన శ్రీరంగ శబ్దములోని 'రంగ' అను పదము దానితో కలిసి ఇచటి దైవతమునకు పాండురంగడని పేరు వచ్చెను. ఇక విఠల శబ్దము విష్ణు శబ్దము యొక్క ఒక రూపమే. ఈ విఠల శబ్దము పాండురంగ శబ్దమునకు ముందే ప్రసిద్ధిలో నున్నది. కొంతకాలమునకు విఠల నామము పండరినాథుడగు పాండురంగనికి చేర్చబడినది. పుండరీకుని పేర పౌండరీకమను క్షేత్రము వెలసి, క్రమముగా పండరిపురమయినది. పాండురంగని యొక్కయు, ఈ క్షేత్రము యొక్కయు ప్రస్తావన స్కాంద కూర్మ పద్మ పురాణములందే యున్నది. ఆదిశంకర భగవత్పాదులును పాండురంగని స్తుతించిరి. శ్రీవేంకటేశ సంప్రదాయము నందు వలెనే పాండురంగ సంప్రదాయమునను మంత్ర తంత్ర యోగ విద్యా రహస్యములు గలవు. ఆయా శాస్త్రములలో విద్వాంసుడే గాక, దానిని భక్తితో జోడించి, సమాజమునకు సేవ చేసిన భాగవతోత్తముడగు చినతిరుమలయ్య పండరి విఠలుని భక్తితో ఇచట సంకీర్తనము గావించెను. (పాండురంగ శబ్దముకన్న పండరి శబ్దమే 'పుండరీక' అను శబ్దమునకు దగ్గరగా నున్నది). భక్తి లేని వట్టి శాస్త్రముల విజ్ఞానము విద్యుత్ప్రసారము లేని తీగవంటి దగును అని ఈ సంకీర్తనమున తెలియును.

పల్లవి యొక్క తాత్పర్యము

"పాండురంగ విఠలా, కోవిలకుంట్లలో నీవు వ్యక్తమయితివి, వెలసిన కొలదినాళ్ళకు జనులలో నీకు ప్రసిద్ధి ప్రారంభమైనది."

వ్యాఖ్య

స్వామి సహజముగా నిరాకారుడు. సర్వాంతర్యామి. అయినను మానవులకు భక్తి యబ్బుటకు అర్చామూర్తిగ బయటకు వ్యక్తమగుచుండును. విగ్రహారాధన సర్వాంతర్యామి సేవకు పునాది వంటిది. పునాది లేక మేడ నిలువదు గదా! స్వామి యొక్క దివ్య సుందర మంగళ మోహనమూర్తిని, అతని రూప గుణ వైభవమును సంకీర్తించుట జీవితమను మాగాణమున భక్తి యను బీజము నాటి, మోక్షమను ఫలమును ప్రసాదించును. అయితే పునాది వద్దనే ఆగరాదు. భారతభూమి యందలి వివిధ ప్రదేశములందు అర్చింపబడుచున్న వివిధ దైవతమూర్తులు మూడు రకములు. 1. స్వామి స్వయముగా వెలసిన మూర్తులు. 2. దేవతలు గాని, మహర్షులు గాని ప్రతిష్ఠించిన మూర్తులు. 3. ఆగమశాస్త్ర విధి ప్రకారము మానవులు కళలను ఆవాహనము చేసి ప్రతిష్ఠించిన మూర్తులు. తిరుమలలోని శ్రీవేంకటేశ్వరుడు, శ్రీరంగ నాథుడు, పాండురంగడు స్వయముగా వ్యక్తమయిన మూర్తులు. ఇపుడు అన్నమయ్య కోవిలకుంట్లలోని పాండురంగ విఠలుడు కూడ అంతర్యామిత్వము నుండి జనుల కొరకు ఒక ఆకారము ధరించి వ్యక్తమయ్యెనని చెప్పుచున్నాడు. మరియు వెంటనే జనులా స్వామిని దర్శించి, సేవించుట మొదలయ్యెను. ఆయన మహిమ అట్టిది. జనుల నుద్ధరించుటకు అట్టి ప్రభావమును వేగముగా చేపట్టెను.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"నీవు మిక్కిలి ధైర్యము గల ప్రభువు అని నేను నిన్ను కోరి ప్రేమతో చూచినంతనే, ఊరకనే ఎట్టి కారణము లేకయే నవ్వుచుందువు. హద్దుమీరి నీవు నాయందెక్కువ కుతూహలముతోడి మాటలతోనే నీ ప్రేమను బయటపెట్టుచున్నావు."

వ్యాఖ్య

పండరి విఠలుడు మిక్కిలి ధైర్యము గల ప్రభువట. ఇతరమును చూచువానికి భయము. తనకు వేరెవ్వరు లేనివాని విషయమున భయమునకు తావు లేదు. తనకు తానే ధైర్యము. భక్తుల ధైర్యము కూడ స్వామియే. శ్రీకృష్ణుడే పాండురంగడై వెలసెను గదా! కృష్ణుడు పుట్టుటయే చెరసాలయందు. పుట్టినప్పటి నుండి పిశాచముల గొడవ. ఆపై కాలయవన జరాసంధాదుల దండయాత్రలు. చివరలో యాదవుల నడుమ అన్యోన్య కలహములు. ఏ స్థితిలోగూడ కృష్ణుని ధైర్యము చెక్కుచెదరలేదు. తనకు కష్టములు కలుగకపోలేదు. అప్పుడును తన కెవరు అండ అని అతడు ఎవరి వైపు చూడలేదు. తల్లిదండ్రుల వైపు గాని, అన్నగారి వైపు గాని చూడలేదు. వారే తన ననుసరించిరి. తనకు శరణాగతులయిన పాంచాలీ పాండవాదులకు తానే యండయై నిలిచెను. వారి ధైర్యము కృష్ణుడే. కృష్ణ స్మరణలో, రక్షణలో వారు

కష్టములను దాటిరి. తనకు సమీప బంధువులుగా నున్నను తనకు శరణాగతి నొందక, పరస్పరము కలహించుకొన్న యాదవులకు తాను అండగా నిలువలేదు. తననుండి చివరలో వారికి రక్షణ లభింపలేదు. ఇక గోకులవాసులకు, తనకు భేదము లేని ప్రేమాను బంధము. సర్వసమర్పణ, అచ్ఛమైన ప్రేమ ఎవరి యందుండునో వారికి కృష్ణుడే ధైర్యము. ఇతడే సర్వలోక ప్రభువు. అట్టివాడవని నిన్ను చూపులతోనే వేడుచున్నానని అన్నమయ్య భావము. ఏమి వేడుచున్నాడు? పాండవుల వలె రక్షణనా, కాదు. యాదవుల వలె భోగములనా, కాదు. గోకులవాసుల వలె స్వామి సాన్నిధ్య మాధుర్యమును మాత్రమే. సామీప్యము వేరు, సాన్నిధ్యము వేరు. యాదవులు కృష్ణుని భౌతిక దేహమునకు చుట్టములై, దానికి సమీపమున వంద యేండ్లకు పైగా జీవించిరి. వీరిలో ప్రతివారి పేర్లు వ్యాసుడు తెలిపెను. అనగా వీరిలో ఎవరి వ్యక్తిత్వము వారిది. కావున వీరి నడుమ పరస్పర కలహము లేర్పడెను. ఈనాటి కాలమునను ఆధ్యాత్మిక సంస్థల నడుమ ఇట్టి స్పర్థ లేర్పడుట జరుగుచునే యున్నది గదా! కాని అతని సాన్నిధ్యము వారికి సిద్ధింపలేదు. వ్రజవాసులతో కృష్ణుడు పన్నెండు ఏండ్లే కలిసి జీవించెను. కాని అతనితో ఎడబాటు వారికెప్పుడును లేదు. అతడు వారి హృదయములందు నిరంతరము దివ్యానుభూతిగ వెలసియే యున్నాడు. సమస్తమున దర్శన మిచ్చుచునే యున్నాడు. ఇది సాన్నిధ్యము. దేవుని భౌతికమూర్తిని చూచి, ఐహిక సుఖములను కోరువారికి దేవుని అంతర్యామిత్వము దర్శనమీయదు. సాన్నిధ్య మాధుర్యమందదు. చినతిరుమలయ్య వ్రజవాసుల వలె సర్వాంతర్యామి యనుభూతి యను సాన్నిధ్యమును విఠలుని నుండి కోరుచున్నాడు. ఈ కోరికు తన చూపులలోనే ప్రకటించు చున్నాడు. విఠలుని చూచినంతనే అతనికి ప్రేమ మిక్కుటమై, అనుభూతియై నోట మాట రాక చూపులే మిగిలెను. ఇంతగా వేడినను, ఊరకనే స్వామి నవ్వుచున్నాడే కాని తన కౌగిలి నిచ్చుటలేదు. అనగా ఇంకను పూర్తిగా తన యనుభూతి నిచ్చుట లేదని చినతిరుమలయ్య ఆవేదన. కౌగిలి అనగా భక్తునికి తన యునికి పూర్తిగా మరపునకు వచ్చి, తన మనస్సు స్థానమున దేవుడే నిలుచుట. తానింతగా వేడుచున్నను, తన యందు అనురాగమును ప్రకటించి కుతూహలముతోడి మాటలను హద్దుమీరి పలుకుట తోనే ప్రొద్దుపుచ్చుచున్నాడు గాని స్వామి ఇంకను నిండైన అనుభూతితో తన హృదయాన్ని నింపలేదు. దేవునికి, భక్తునకు నడుమ హద్దులుండునా? తన ప్రేమపు చూపులకు బదులుగా విఠలుడు ప్రేమపు పలుకులను తన సంకల్పానుసారము మాటలాడుచున్నాడు. ఆ మాటలలోనే చినతిరుమలయ్యపై తనకు గల ప్రేమను వెల్లడించుచున్నాడే గాని అనుభూతి నింపలేదు. మొత్తముమీద స్వామి ఇతనితో మాటలాడు దశ వరకు వచ్చెనన, అతని అదృష్ట మెంతటిది?

శ్రీకృష్ణుడు గోపగోపికలతో ఇట్లే మాటలాడి, చివరకు అనుభూతితో నింపెను. ఇదంతయు స్వామి క్రీడ. భక్తుని ఆవేదన నిండారు వరకు స్వామి ఇట్లు ఆడుచుండును. ఈ చరణమునందు విశేష మొకటి కలదు. ఈ కవి సమాజములోని జీవులనే విష్ణువుగా ప్రేమతో చూచుచున్నాడు. ఇది విష్ణూపాసనము. వారి మాటలనే స్వామి పలుకులుగా భావించుట వాసుదేవోపాసనము. కాని చూచువాడుగాను, పలుకులను వినువాడుగాను తానున్నాడు. తాను లేక స్వామియే తానుగా నుండు స్థితియే నారాయణోపాసనము. దీనికొరకే ఇతని ఆవేదన.

2వ చరణము యొక్క తాత్పర్యము

"పందరంగి విఠలుడు తన నాశ్రయించిన స్త్రీకి సైగ చేసిన మాత్రమున ఆమెలోన తన అనురాగమును కురిపించి, ఆమెను ఆనందములో తేలించును. వెన్వెంటనే చేయు చేష్టలతోనే విస్తారమయిన తన ప్రేమను బయటకు వెళ్ళబెట్టును."

వ్యాఖ్య

ఇచ్చట కవి తనను తాను స్త్రీగా భావించుచున్నాడు. మరియు తన వలెనే ఇట్టి భావము గల వారెల్లరును స్త్రీలే. మీరాబాయి వల్లభాచార్యులవారికి సందేశమంపినది గదా – జీవులెల్లరు స్త్రీలే, భగవంతుడొక్కడే పురుషుడని. స్వామి తన సైగతోనే తన నాశ్రయించిన భక్తుల యెదలను తన అనురాగములో తేలించును. ఈ భక్తులు అబలలని కవి తెలిపెను. ఎల్లరికి బలము శ్రీహరియే కదా! జీవులెల్లరును స్వామిపై ఆధారపడినవారే కాని స్వతంత్రులు గారని ఆళ్వార్లు, రామానుజులవారు తెలిపిరి. ఇదే సంప్రదాయమును కవి అనుసరించెను. కాని కొందరు మూఢులై తమకేవియో సొంత బలము, ధనము, పదవి, పాండిత్యము మున్నగునవి ఉన్నవని పొరపడు చుందురు. వాస్తవమునకు మనదని ఏదియు లేదు. అంతయు స్వామి ప్రసాదమే. బ్రతుకుటకు మూలమైన శ్వాసయే దేవుని ప్రసాదము. తాము అబలలమని గుర్తించి, స్వామి నాశ్రయించిన వారికే ఆయన అనురాగము అనుభవమునకు వచ్చును. మిగిలినవారిపై కూడ ఆయన అనురాగముండును, గాని వారి యనుభవమునకు రాదు. నిద్రపోవుచున్న వానికి తీయని సంకీర్తనము ప్రక్కన సాగుచున్నను లేనట్లే కదా. స్వామి ప్రేమ భక్తుని తేలించినట్లు గుర్తేమి? అదే ప్రేమ తన ద్వారమున లోకముపై ప్రసరించును. కావున అన్నమయ్య స్వామి ప్రేమలో మునిగి, దాని నెల్లరకు పంచెనని భావము. స్వామి తననెట్లు ప్రేమతో చూచెనో, తోటివారి నితడు అట్లే ప్రేమతో చూచెను. ఇదియే సాలోక్య ముక్తి యని రామానుజులు చెప్పిరి. గొట్టములో ప్రవహించు నీరు గొట్టము యొక్క సొంతము కాదు. అది నదిది. గొట్టము నీరు ఇండ్లలోనికి వచ్చుటకు వాహిక మాత్రమే. అట్లే దేవుని ప్రేమకు మనము వాహికలము మాత్రమే. లోకములోని తల్లిదండ్రుల ప్రేమ, భార్యాభర్తల ప్రేమ, సఖుల ప్రేమ దేవుని ప్రేమ యొక్క అంశలే. తనకు శరణాగతి పొంది, స్వామితోనే తన బ్రతుకును నింపుకొను కవి వంటివారి యెడ స్వామి వెన్వెంటనే తన చేష్టలలో తన ప్రేమను చక్కగా వెల్లడించును. స్వామి ఈయనతో మాటలాడెను, తాకెను, దగ్గరకు చేర్చెను. అతనికి వలసినవి కూర్చెను. మోక్షమీయగల స్వామి ఐహికముగా కావలసినవి దీర్చుట వింత గాదు. అయితే మనము కోరిన విచ్చుట గాక, మనకు కావలసినవి ఇచ్చును. ఇచట పందరి విఠలుడు ఆకారము ధరించి, తనయెడల వివిధ చేష్టలను ప్రేమతో వెలయించుట మాత్రమే గాదు, సమాజములో ఇతనిని ఎందరో తమ ప్రేమతో ఆదరించిరనమాట. అట్లు ఆదరించిన వారి రూపములలో విఠలుడే ఈతనికి గాన్పించెను. వారి ప్రేమయే స్వామి ప్రేమ. ఈ చరణములో మొదటి రెండు పాదములలో ఈయన ద్వారమున స్వామి తోటి జీవులపై ప్రేమ చూపినట్లు చెప్పబడినది. తర్వాత రెండు పాదములలో సమాజములోని ఎందరో మానవుల రూపములతో స్వామి ఇతనిని ప్రేమతో ఆదరించినట్లు చెప్పబడినది.

ఇట్లు ఈ చరణములో కవి శాశ్వత సందేశమును మానవునకు, సమాజమునకు అందించుచున్నాడు. 1. ఎవరు సమాజములోని జీవులను ప్రేమింతురో వారికే తోటి జీవుల ప్రేమ విశేషముగా, వేగముగా దక్కును. 2. ఇట్లు ఒకరినొకరు ప్రేమతో ఆదరించుకొనుచు, జీవించు మానవులతోడి సమాజము అన్ని రంగములలో వర్ధిల్లును. ఈ పరస్పర ప్రేమ లేని సమాజమున కుల మత ఘర్షణలు, వర్గ కలహములు పుట్టి అది దెబ్బతినును. కావున భక్తి సాధనలో సమాజముతో సత్సంబంధములు కల్గియుండుట ప్రధానము. 3. ప్రేమ అసలు ఎవరిదీ గాదు, దేవునిదే. మానవుల నడుమ పరస్పర ప్రేమ వ్యక్తిగతమయినచో కొంతకాలమునకు సన్నగిల్లును. ఒకరియందొకరికి దైవభావన యున్నచో అట్టి పరస్పర ప్రేమ శాశ్వతముగా నిలబడును. 4. సృష్టిని నడిపించుచున్నది శక్తి, బలము గావు. ప్రేమయే. మధురభక్తి యనగా భావోద్వేగము గాదు. భర్తకు భార్య వలె సమాజ పురుషుడగు దేవున కాత్మనివేదనము గావించుకొని, సమాజమును దేవునిగా ప్రేమించి ఆనందించుట యని కవి ఈ చరణమున చక్కగా నిరూపించెను. భాగవతమున వ్రజవాసులిట్లే జీవించిరని గలదు.

3వ చరణము యొక్క తాత్పర్యము

"ఓ విఠలా! తగిన సమయమున నీవున్నచోట దగ్గరకు వచ్చినంతనే, నన్ను నీ యనుభూతిలో ముంచి, నా ప్రజ్ఞ యొక్క యునికి లేకుండ జేసితివి. జీవులెల్లరికి నిన్ను చేరుటే గమ్యము, నిన్నాశ్రయించుటే మార్గము. ఓ స్వామీ! నీవే కోవిలకుంట్లలో పండరంగి విఠలుడవై వెలసితివి. నీవే వేంకటేశ్వరుడవై లోకములను పాలించుచున్నావు. నన్ను ఏలితివి."

వ్యాఖ్య

తగిన సమయమున స్వామిని చేరుట యనగా స్వామికి ఉల్లాసము తనయెడల అనుకూలముగా ఉన్నప్పుడని అర్థము కాదు. స్వామి ఎప్పుడును మనయెడల అనుకూలుడే. అతనికి దగ్గరవాడని, దూరపువాడని లేదు. ఇట్టి భావములు మానవుల లోని మనోవ్యాధులు. జీవుడనేక జన్మల పరిణామమున ఎప్పుడో ఒకప్పుడు తనలోనే స్వామి వెలుగై యున్నాడని, అసలు తాను స్వామియందు భాగముననని, తానుగా నయినది స్వామియే యని గ్రహించి, స్వామి నాశ్రయించును. ఇదియే దగ్గర చేరుటకు తగిన సమయము. సమయము తగినదా, కాదా యను అంశము జీవునకు సంబం ధించినదే గాని, దేవునికి సంబంధించినది కాదు. అయితే దేవుడు దయతో ఇట్టి తగిన సమయమును జీవున కొకప్పుడు ప్రసాదించితీరును. ఎట్టివాడయినను ఎప్పుడో ఒకప్పుడు స్వామికన్న తనకు దగ్గర ఎవరును లేరని గ్రహించును. ఈ గ్రహించుట తెలివికి, చదువుకు సంబంధించినది గాదు. మానవుని భౌతిక శరీరమున తగు ప్రాయమున మీసములు, గడ్డము వచ్చును. అట్లే ఆధ్యాత్మిక పరిణామమున ఒకప్పటికి స్వామి తనకు దగ్గర అనిపించి, ఆశ్రయించును. ఇందు వేరొక విశేషము గలదు. స్వామికి నేను దగ్గరివాడనను భావము లేశమయినను పుట్టరాదు. మిగిలినవారు కాదన్పించుటతో పతనము తప్పదు. స్వామియే మనకు దగ్గర – అనగా ఎల్లరకు అను భావము పుట్టవలెను.

స్వామి యనగా సమాజమున అంతర్యామి గావున ఎల్లరు తనకు దగ్గర వారన్పించవలెను. నిజముగా స్వామివారము మనము గాని, మనవాడు స్వామి కాదు. ఇట్లు భావించువాడు మిగిలినవారితో సామరస్యముతో మెలగుట వలన స్వామికి దగ్గరగును. ఇట్లు కవి జీవితమున జరిగినది. జీవుని మనస్సు అను పంజరములో ఆకాశ దేహుడగు దేవుని చిలుకను వలె బంధింప జూచుట వెఱ్ఱితనము. అట్లుగాక స్వామి యను ప్రేమసాగరమున, జీవుని మనస్సు కాలువ వలె లీనముగావలెను. ఇదియే ఇతనికి స్వామి దయచేసిన రతి స్థితి.

గతి యనగా అండ, గమ్యమనియు; దానిని చేరుటకు నడుచు దారి యనియు రెండర్థములు గలవు. కావున మన సిద్ధి స్వామియే. సాధనము స్వామియే. ఆనంద స్వరూపుడగు దేవుని చేరుటకు జపతపాదులతో శ్రమపడుచున్నాననుకొనుట మూఢత్వము. స్వామిని చేరుట ఆనందము. అందులకు సాధనయు ఆనందమే. దీనినే రామానుజులు ఉపాయము, ఉపేయము – రెండును స్వామియే అని గట్టిగా తెలిపిరి. కొందరు తిరుమలలోని శ్రీవేంకటేశ్వరుని సన్నిధిని చేరుటకై వెడలు మార్గమున ఐహిక చింతలు చేయుచు సాగి, స్వామి దర్శనమగు క్షణమున కనులు మూసికొందురు. అట్లుగాక మార్గమున స్వామి చింతనము, గమ్యము చేరగానే స్వామి దర్శనము గావలెను. స్వామి జగత్తుకు తల్లి, తండ్రి, భర్త కూడ. ప్రకృతి రూపమున తల్లి. అంతరాత్మగా తండ్రి. భరించి, క్రీడించి, అనుభూతి నిచ్చువాడుగా భర్త. ఏలిక. కావున కవి 'పతి' అను పదమును వాడెను. పతి యనగా పాలించువాడు, ఏలిక. ఈ సంకీర్తనమున ఇతడు వేదసారమును, విశిష్టాద్వైత మార్గమును పిండికొట్టి పంచెను. (కోవిలకుంట్లలో పాండురంగ విఠలుడు సాలగ్రామ శిలారూపమున వెలసెనని ప్రసిద్ధి.)

* * *

45

1వ సం-458 **రూకలై మాడలై** వకుళాభరణం

రూకలై మాడలై రువ్వలై తిరిగీని
దాకొని ఉన్నచోటఁ దా నుండ దదివో. ॥ పల్లవి ॥

ఒకరి రాజుఁజేసు నొకరి బంటుగఁ జేసు
ఒకరి కన్నెకల వేరొకరికి నమ్మించు
ఒకచోట నున్న ధాన్య మొకచోట వేయించు
ప్రకటించి కనకమే భ్రమయించీ జగము. ॥ రూకలై ॥

కొందరి జాళెలు నిండు కొందరికి సొమ్ములవు
కొందరి పుణ్యులఁజేసుఁ గొందరి పాపులఁజేసు
కొందరి కొందరిలోన కొట్లాట వెట్టించు
పందెమాడినటువలెఁ బచరించు పసిఁడీ. ॥ రూకలై ॥

నిగనిగమనుచుండు నిక్షేపమై యుండు
తగిలి శ్రీవేంకటేశు తరుణియై తా నుండు
తెగని మాయై యుండు దిక్కు దెసయై యుండు
నగుతామాపాల నుండి నటియించు బసిఁడీ. ॥ రూకలై ॥

నేర్పరితనము అనగా తెలివిని ప్రదర్శించుట గాదు, అన్నీ
తెలిసియు సామాన్యుని వలె మెలగుటయే నేర్పరితనము.

టీక

మాడ = దీనారములో సగము (16 తులముల ఎత్తు బంగారు నాణెము), రువ్వ = దమ్మిడి, జాళెలు = నాణెములుంచు సంచులు, పచరించు= మెలగు, నిక్షేపమై యుండు = దాచబడియుండు.

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య సమాజముపై బంగారము యొక్క ప్రభావమును, దానికి నరుని బానిసత్వమును, లొంగుబాటును సూటిగా తెలుపుచున్నాడు. ఆనాడే కాదు, ఈనాడు ఇంక ఎక్కువగా ఈ లక్షణములు కన్పట్టుచున్నవి. సాధారణ సామాజిక స్థితికి ఈ సంకీర్తనము అద్దము పట్టుచున్నది. ఇచట బంగారమను పదము ధనము నకు పర్యాయముగా వాడబడినది. నిజమయిన ధనము సూర్యరశ్మి, గాలి, నీరు, చోటు, పాడి, పంటలు మున్నగునవి. ప్రాచీనకాలమున గల గ్రామ వ్యవస్థలో ఇవియే సంపదగా భావింపబడినవి. ఆదినములలో ధనమునకు అస్తిత్వము లేదు. అందరు కలిసి పనిచేయుట, కలిసి గ్రామ సంపద అనుభవించుట ఉండెను. వేదము లందలి "అగ్నా విష్ణుసూక్తము" దీనిని సూచించుచున్నది. కావున జనులు సుఖించిరి. కాని నగరములు పెరిగి, నాగరికత ముందుకుపోగా, వినిమయము కొరకు ధనమును మానవుడే సృష్టించెను. తాను సృష్టించిన ధనమునకు మానవుడు తానే బానిసయై, తాను తృప్తిని గోల్పోవుచున్నాడు. ధనము నార్జించుటకై ఇతరులను – ముఖ్యముగా కర్షక కార్మికులను, గ్రామవాసులను పీడించుట జరుగుచున్నది. దాచిన ధనము కాపాడదు. ఎందరో అన్నవస్త్రాదులకు నోచుకొనని పరిస్థితులలో కొందరు ధనమును కూడబెట్టుకొనుట దొంగతనము, దోపిడీ అని కృష్ణుడు గీతలో చెప్పెను. కంసాదులు పల్లెల పాడిపంటలను దోచుకొని, ధనమునకు ప్రాధాన్యమిచ్చి ప్రజలను పీడించుట వలననే కృష్ణుడవతరింపవలసివచ్చినది. అతడు కొన్ని వందల గ్రామములను మరల ధనమునకు చోటులేని వానిని పరస్పర ప్రేమ, పాడిపంటలే సంపదలయిన వానిని సృష్టించెను. ఇట్టి వ్యవస్థను నిర్మించుటకే ధర్మరాజును రాజును చేసెను. ఆపై పరీక్షిత్తును ఆతని వారసుని గావించెను. కొందరు పాడిపంటను నమ్ముకొన్న అమాయిక ప్రజలను గూడ ధనము ఎఱచూపి, వంచించి వారిని యాచకులుగా మార్చుచున్నారు. ఇట్టి ధన ప్రాధాన్యము గల నాగరికత పెరిగినచో, పంటభూము లుండవు. ఇతర దేశములకు బానిసలగుట తప్పదు. ఈ సంకీర్తనమున ఆదర్శమయిన ఆర్థిక వ్యవస్థను అన్నమయ్య సూచించుచున్నాడు. అర్థ కామములు ప్రధానములై ధర్మమును కాదన్నపుడు, సామాజిక జీవితము విచ్ఛిన్నమగును. ధర్మాచరణము వలన అర్థ కామము లవియే నెరవేరును. జీవితము ధర్మము కొరకు గాని, అర్థ కామముల కొరకు గాదు. ఇచట కామమనగా కుటుంబ పోషణకు వలయు సామగ్రి. ధనమెక్కువ సాధించి, విలాసములకు లొంగినవారు ఒకవైపు, ఆకలి తీరనివారు ఇంకొక వైపు ఉండరాదు. ధనమును లోభి తాను అనుభవించడు, ఇతరులకు త్యాగము చేయడు. చివరకది నశించును. దేశము యొక్క ఆర్థిక, సామాజిక వ్యవస్థ కూడ ధర్మముపై, ఆధ్యాత్మికతపై, దేవుని శరణాగతిపై ఆధారపడి యుంచుట వేదర్షుల విధానము. దానినే అన్నమయ్య మరల ప్రబోధించుచున్నాడు. శరణాగతులగు జనుల నడుమ పరస్పర సహకారము నెలకొనును. అదియే

అసలయిన సంపద. సంపదను కాదని, ధనము వెంటబడువాని అవివేకమును అన్నమయ్య ఆవేదనతో వెల్లడించు చున్నాడు.

పల్లవి యొక్క తాత్పర్యము

"బంగారము – ధనము రూకలుగా, 16 తులముల బంగారు నాణెములై, దమ్మిడీలై తిరుగుచుండును. దానిని దాచిపెట్టు చోట దాగియుండదు."

వ్యాఖ్య

ప్రకృతి ఇచ్చు సంపదను కాదని, తాను సంకల్పించుకొన్న బంగారు నాణెములను, తోలు నాణెములను, కాగితములను నమ్ముకొను వాడెంత మూర్ఖుడు! నాణెములను, కాగితములను భుజింపడు గదా. ఆమాత్రము గుర్తింపనివాడు చంద్రమండలముపై కాలు పెట్టినను మూర్ఖుడే. వీనిని నమ్మి జనులు పెరిగినచో సమాజము యుద్ధము వైపు, వినాశము వైపు ప్రయాణించును. ధనమును ఒకచోట దాచి నిలిపియుంచ రాదు. అది తిరుగుచుండవలెను. పాడిపంటలు, నీరు, స్వచ్ఛమైన గాలి, ఆవశ్యకమగు వస్తుసామగ్రి సంపద; ఇదిగాక, నాగరిక యుగమున ధనము కూడ స్థానము గొని యున్నది. కాని సంపదకు ఎక్కువ వినియోగము, ధనమునకు తక్కువ వినియోగము కలుగవలెనని అన్నమయ్య ఉపదేశము. ఆ ధనము కూడ ప్రవహించుచుండవలెను. ధర్మపద్ధతిలో ధనమును ఆర్జించి, ఇంటి ఆవశ్యకములకు వ్యయించి, మిగిలిన దానిని మరల ధర్మమునకు ఖర్చు పెట్టవలెను. ధర్మార్థకామములు ఒక త్రికోణము. ధర్మము నుండి అర్థ కామములు లభింపవలెను. మిగిలినది ధర్మములో లయింప వలెను. ఇది ఆదర్శ ఆర్థిక వ్యవస్థ. ఇట్లుగాక విలాసములకు, భోగములకు ధనము నధికముగా వ్యయించుట నేరమని అన్నమయ్య అభిప్రాయము. నిరాడంబరత్వము, సరళత్వము ఆవశ్యకములు. ఆడంబరముగా ధనమును దుర్వినియోగపరచుట మృత్యువునకు – రోగములకు కారణమగును. ఎందరో ఆహారము, వసతి, వస్త్రములకు నోచుకొనని పరిస్థితులలో, కొద్దిమందికి ఆడంబరములకు, విలాసములకు ధనము వ్యయించు హక్కు లేదు. అట్లు వ్యయించుట నేరము. తానే విలాసములకు వ్యయించువాని వద్ద ఇతరులకు తోడ్పడుటకు ధనమెట్లు మిగులును? మరియు ధనమును నిలువయుంచుకొనక, ప్రవహింపజేయుచుండవలయును. అనగా ఇతరులకు ఉపాధి కలుగుటకై మనవద్ద ఎక్కువగానున్న ధనము వినియోగపడవలెను. అట్లుగాక ధనమును ఏమార్గమున అయినను ఆర్జించి, కూడబెట్టి, నిలువయుంచుట ఆర్థికపరమైన నేరము. ధనము దానికదియే విలువయినది కాదు. తన అవసరములు తీరుటకును, ఆపై ఇతరుల అవసరములు తీరుటకును ధనము వినియోగపడ వలయునే గాని, దానిని నిలువయుంచినచో, వినియోగము లేక మూలపడును. సంఘమున ఎవరికిని ఉపయోగపడక నిల్వయుండినచో, దేశములోని కర్షక కార్మికుల పరిస్థితి దుర్భరమై, పాడిపంటలకు కఱవేర్పడి, దేశము యొక్క ఆర్థిక వ్యవస్థ పేకమేడ వలె కూలిపోవునని అన్నమయ్య హెచ్చరిక. ధనప్రవాహమునకు ఎవడును సొంత దారుడు గాదు. ప్రవాహమున గ్రుక్కెడు మంచినీరు త్రావుటయే గాని, ప్రవాహము నంతయు మ్రింగెదననువాడు మూర్ఖుడు. అట్లే ధనము ఒక చేతి నుండి మనకు వచ్చి,

వలసినమేర వినియోగమై మరల వేరొక చేతిలోనికి వెళ్ళవలెను. సమాజ రూపుడగు దేవుని నుండి మనకు వచ్చి, మరల సమాజమును చేరవలెను. నాణెములు, రూకలు దాచినవానికి గూడ చివరకు తిండి, నీరు దొరకవు. విలాససామగ్రి గాని, నిలువయుంచిన ధనము గాని భుజింపలేము గదా. ఇతర దేశముల నుండి ఆహార పదార్థముల దిగుమతిపై ఆధారపడి దేశము యొక్క ఆర్థిక వ్యవస్థ పతనమగును. ఇట్లు దేశములో సంపదకు వలయు వనరులు – నదులు, పొలములు మున్నగునవి అధికముగా నున్నను, ప్రస్తుత భారతదేశమున పేదరికము పెరుగుటకు కారణ మిదియే. వనరుల నుపయోగింపకుండ, నాగరికతను పెంచ చూచుట నేరము. దేశము యాచక దేశము కావలసివచ్చును. దేశమున పేదరికము కృత్రిమముగా కల్పితము. కొన్ని శతాబ్దములకు పూర్వమే, ప్రస్తుత దేశ పరిస్థితిని ఊహించిన అన్నమయ్య మహాద్రష్ట. ఉదాత్త సామాజిక, ఆర్థిక వ్యవస్థను నిర్దేశించిన అర్థశాస్త్రవేత్త. సామాజిక పరిణామమును దర్శించినవాడు. వట్టి ఆధ్యాత్మికవేత్త కాడని ఈ పల్లవి తెలుపుచున్నది. దాచినచోట ధనముండదు. తరములు గడచుకొలది, అది తొలగును. లేదా వినియోగము లేక ఊరక నిలిచియుండు ధనమున్నను లేనట్లే. ధనదాస్యము గొప్పదగు చెడు వ్యసనము. దీనికి లొంగువాడు తనకు, సంఘమునకు చేటు దెచ్చును. కొందరు తాము తమకు అవసరమయిన ఆహారాదులకు కూడ ధనమును వినియో గింపక, లోభులై అసంతృప్తులై జీవచ్ఛవముల వలె నుందురు. భగవంతు డిట్టి ఆర్థిక వ్యవస్థను సహింపడని అన్నమయ్య హెచ్చరిక. మరల ధర్మరాజ్యము – గ్రామ రాజ్యము – రామరాజ్యము నెలకొని సంపదకు వినియోగము పెరిగి, ధనము ప్రాధాన్యమును కోల్పోవును. అపుడు వ్యక్తుల వద్ద నిలువయుండిన ధనము – నాణెములు, కాగితములు ఎందుకు పనికిరాకుండపోవును. అట్టి శాసనములు ఏర్పడును. సంఘసేవ చేయనివాడు, స్వామికి సమర్పణ పొందనివాడు, సోమరియైన వాడు శోకింపక తప్పని స్థితి వచ్చునని అన్నమయ్య హెచ్చరిక. సంఘ పరిణామమును దర్శించిన ఋషి అన్నమయ్య. అసలయిన సంపద మానవునకు మానవునకు నడుమ ప్రేమయే. ధనముతో గాని పనులు మానవుల తోడ్పాటు వలన జరుగును. మానవు నకు మానవుడే సంపద. తాను సృష్టించిన ధనముకన్న తాను విలువయినవాడని మానవుడు గ్రహించవలెను. తనకన్న తన జుట్టు గొప్పదనుకొన్నవాడు మూఢుడు గదా. దివ్యమానవతామూర్తి యగు అన్నమయ్య ధనము కన్న మానవునకు, ధర్మ స్వరూపుడయిన దైవమునకు పెద్దపీట వేసెను. భవిష్యత్తులో తిరిగి మానవతా ప్రాధాన్యము గల వ్యవస్థ ఏర్పడక తప్పదని దర్శించెను. కావుననే దాచిన ధనముండ దనెను. రూక యనగా ఆనాటి ఒక నాణెము.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"ధనము ఒకరిని రాజుగా చేయును. ఒకరిని బంటుగా చేయును. ఒకడు తాను ధనవంతుడను కావలెనని కల కనగా, అతని కల ఇలలో వాస్తవము గాదు. ధనము వేరొకరిని నమ్మించును. ఒకచోట నున్న ధాన్యమును, వేరొకచోట వేయించును. బంగారము – ధనము తన ప్రభావమును చూపి ప్రపంచమును భ్రమింపజేయును."

వ్యాఖ్య

ధనము గలవాడు పాలకుడగుచున్నాడు. ఇతనికి పాలకున కుండవలసిన ధర్మబుద్ధి, ప్రజలను బిడ్డలుగా ప్రేమించు స్వభావము, వారిని పాలింపగల సామర్థ్యము లేకపోయినను, ధన మధికముగా కలిగియుండుటచే పాలకుడగుచున్నాడు. దానివలన ప్రజలకు హాని జరుగును. ధనము అధికారమును పట్టియుంచును. అధికారము ధన సంపాదనకు సులభమగు వక్రమార్గము. ఇట్లు ఈ రెంటికిని విషవలయ సంబంధము గలదు. రాచరికమైనను, ప్రజాస్వామ్యమని పెద్ద పేరు పెట్టినను ధనమునకు, అధికారమునకు సంబంధమున్నచో తల పగులకొట్టు కొనుటకయినను ఏ ఊయి అయినను ఒకటియే. ధనము లేనివాడు పదవిలోనికి వచ్చి, ప్రజలను పాలింపగల సామర్థ్యమున్నను, ధర్మబుద్ధి యున్నను బంటుగా మాత్రమే అగును. దీనినే వర్ణసాంకర్యమని శ్రీకృష్ణుడు గీతలో పేర్కొనెను. ఒక వృత్తికి అర్హుడయిన వాడు ఆ వృత్తిలోనికి రాకుండపోవుట గాని, రాలేకుండపోవుట, అనర్హుడు ఆ వృత్తిలోనికి వచ్చుట వర్ణసాంకర్య మనబడును. జన్మతో సంబంధము గలది కాదు వర్ణము. ధన ప్రభావమున ఇట్టి తారుమార్లు జరుగుచుండును. ఒకడు ధనవంతుడను కావలెనని పగటి కలలు కనును. కాని ఆతనికి ధనము లభింపదు. ఇట్టి కలగనని వానికి ఒక్కొక్కసారి లభ్యమై, తాను ధనవంతుడనైతినని నమ్మకము కలిగించును. కర్షకుడు సంవత్సరముపాటు మొత్తము సమాజమునకై కృషిచేసి పండించిన ధాన్యము అతనికి అనుభవయోగ్యము కాకుండ పోవుచున్నది. ఇతడు ధనవంతులగు దళారీల, పాలకుల వంచనకు గురియై, తాను పండించిన ధాన్యమును అమ్ముకొనవలసిన పరిస్థితి ఏర్పడుచున్నది. ధాన్యమునకు తగిన ఖరీదు లభ్యము కాకున్నది. కొనుగోలుదారునకు, కర్షకునకు నడుమ గల దళారీలు ఈ ధాన్యమును తక్కువ ధరకు కృషీవలుల నుండి కొని ఎక్కువ ధరకు కొనుగోలుదార్లకు అమ్ము చున్నారు. పనిచేయకుండ, దళారీ చేసినవారు పనిచేయు వారిని వంచించి ధనవంతు లగుచున్నారు. ధాన్యము పండించిన వారి నుండి, పనిచేయని వారి వద్దకు చేరు చున్నది. ఇది ధన ప్రభావము. ఒకప్పుడు ధన ప్రభావము లేని దినములలో దళారీలకు స్థానము లేదు. గ్రామములనుండి సంపద నగరములకు చేరుటలేదు. రామరాజ్యమున రాజధాని యొక్కటియే నగరము. మిగిలినవన్నియు పల్లెలే. ఏపల్లె కాపల్లె స్వయం పోషకత్వము కల్గియుండెను. ధనముతో పనిలేదు. పనిచేసిన వారు ధాన్యమును కలిసి స్వీకరించిరి. గ్రామములు, నగరములపై ఆధారపడలేదు. ఇప్పుడు గ్రామ జనులు తమ పాడిపంటలను నగరములవారు గొనిపోగా, తాము కొనుగోలు చేయు దుస్థితి ఏర్పడినది. ఇట్లు కృషీవలులు దోపిడీకి గురియగుచున్నారు. ఈ పరిస్థితి అన్నమయ్య కాలమునాటికే కొంత పొడసూపిన దనమాట. ప్రస్తుతము పరిపక్వమయినది. ఇట్లు ధన ప్రభావమునకు లొంగిన జనులు, అదియే సంపదయని పొరపడి దానికొరకై ఇతరులను వంచించుట, కృత్రిమ దారిద్ర్యమును కల్పించుట జరుగుచున్నది. కొందరు కృషీవలులు గూడ నాగరికుల మోసమునగు గురియై సంపదలగు పాడి, పంటలకన్న ధనమునకు విలువనిచ్చుట జరుగుచున్నది. ధన మిట్లు వివిధ ప్రజలకు విలువయినది గాకున్నను, విలువయి నదిగా భ్రమింపజేయుచున్నది. ఇంత సమగ్రముగా సమాజమున ధన ప్రభావమును, దానివలన నైతికముగా,

ఆర్థికముగా జరుగు హానిని గ్రహించిన నేర్పరి అన్నమయ్య. ఈ నేర్పు అతనికి గల విశాలదృష్టికి, నిండైన మానవతకు నిదర్శనము. అతని దృష్టిలో నైతికతను కాదన్న ధన ప్రాబల్యము సంఘ వినాశమునకు దారితీయును. ఇప్పటి పరిస్థితులు అతని దృక్పథము సరియైనదని నిరూపించుచున్నవి. సామాజిక, ఆర్థిక, రాజకీయ, కళారంగముల వంటివి ఏవియైనను ఆధ్యాత్మికత అను పునాదిపై ఆధారపడినచో స్థిరముగా నిలబడును. లేకున్నచో ఒకనాటికి కుప్పకూలును. ఏ సిద్ధాంతమయినను అంతర్యామి అయిన భగవంతుని ప్రేమించి, శరణంది సేవించుటతో సంబంధము లేకున్నచో అపజయము నెదుర్కొనక తప్పదు. ఆశయము మంచిదయినను, ఆధ్యాత్మికత పునాదిగా లేకపోవుటతో ఆధునిక యుగమున సామ్య వాదము కొంతకాలము జనులను ఆకర్షించినను అపజయము చవిచూచుచున్నది.

2వ చరణము యొక్క తాత్పర్యము

"కొందరికి ధనపు నాణెములు దాచు సంచులు నిండుచున్నవి. మరికొందరికి సొమ్ములగుచున్నవి. ధనము కొందరిని పుణ్యులుగా చేయుచున్నది. కొందరిని పాపులుగా చేయుచున్నది. కొందరికి, మరికొందరికి కలహములు పెట్టుచున్నది."

వ్యాఖ్య

కొందరికి ధనపు సంచులు నిండుచున్నవి. మరికొందరికి ధనము సొమ్ములగు చున్నవి అనగా అందరాని ఆభరణముల వలె అగుచున్నవి. అనగా కావలసినంత లభ్యమగుట లేదు. భగవంతునికి శరణంది, తోటివారిని గూడ తానుగా భావించి అనగా అవతలి పరిస్థితిని తన పరిస్థితిగా అనుభూతినందుచో ఇట్లు జరుగదు. మానవులకన్న, ధనమున కెక్కువ ప్రాధాన్యమిచ్చుట వలన ఇట్లు జరుగుచున్నది. దేవుడుగాక వేరు చూడక, ఆతనిని ప్రేమతో సేవించుచు, దేవుడను పూవునందు తన జీవితాంశములను రేకులుగా గ్రుచ్చుకొనువాని యోగక్షేమములను తప్పక దేవుడు వహించును. ఈ విశ్వాసము లేనిచోటనే, ధనమునకు ప్రాబల్యము పెరుగును. దేవుని గూడ ధనముతో మెప్పింపజూచు మేధావులు గలరు. దేవునకు చందాగా ధనము నీయజూపు కొందరు, దీనులను పట్టించుకొనరు. దేవుడు ధనవంతులను గూడ ఆకర్షించును. క్రమక్రముగా వారు ధనముకన్న దేవుని సాన్నిధ్యము విలువయినదని గ్రహించి, అందలి రుచి మరుగును. ఇట్లు దేవుడు ఎల్లరను చివరకు తనవైపుకు ఆకర్షించును. అయితే ధనము గలవాడన్న మాత్రమున చెడ్డవాడని అన్నమయ్య ఆరోపించుటలేదు. అతడు పూర్తిగా సమాజమున జరుగుచున్న వాస్తవములను గమనించిన ప్రజ్ఞా చక్షువు. కొందరు ధర్మబద్ధముగా తమకు లభించిన ధనము సద్వినియోగపరచుచున్నారు. అర్థ కామముల కొరకు వీరు ధర్మము చేయుటగాక, ధనహీనులను తక్కువగా చూడక, ధనమునకు పెద్దపీట వేయక, ధర్మమునందే నిలుచుచున్నారు. ధనమును నిలువ ఉంచక ప్రవహింపజేయుచు, ఆ వచ్చిన ధనమును తిరిగి ధర్మము కొరకే వ్యయించుచున్నారు. తాము ధనమునకు సొంతదారులమని భావింపక, దానికి ధర్మకర్తలమనియే భావించి, త్యాగము చేసి పుణ్యాత్ములగుచున్నారు. ధన త్యాగము చేసినంతమాత్రమున

తమలో పరిశుద్ధత పెరుగదు. ధనము తమది కాదనియు, భగవంతుడే దానికి సొంతదారనియు, సమాజ రూపమునున్న ఆయనకు అర్పించుటయే ధర్మమని నమ్మి, తామేదో త్యాగము చేసినవారమను భావమునే త్యాగము చేయువారే అసలయిన త్యాగులు, పరిశుద్ధులు, పవిత్రులై వికాసము నొందుచున్నారు. తాను త్యాగము చేయుచున్నానను అతిశయమును త్యాగము చేయనంత కాలము ఇతని మనస్సు వికసించదు. పుణ్యాత్ముడు అనగా పవిత్ర హృదయుడు గాలేడు. కొందరు కీర్తికోసము, దానము చేయువారున్నారు. వారు దానము చేయుట మంచిది. పదిమందికి ప్రయోజనము చేకూరునే గాని, వీరికి ప్రత్యేకముగా పరిశుద్ధత కలుగక, అతిశయము ఇంకను అతిశయించును. ఇట్టివారిని గాక, అసలయిన త్యాగులను అన్నమయ్య ఇచట సంభావించెను. కీర్తికై దాన ధర్మాదులు చేయువారు, తమ ద్వారమున ప్రయోజనము పొందిన వారిని తమ క్రింద పడియుండగోరి, వారిపై పెత్తనము చలాయించుట రివాజు. దీనికంతటికి కారణము తమకు లభించిన ధనము భగవత్ప్రసాదమనియు, సమాజములో ఎందరియో కృషి యొక్క ఫలితమనియు అన్పించక, తామే దానికి సొంతదారులమని తలంచుటయే. భగవంతుడిచ్చిన దానిలో కొంత భగవంతునకిచ్చి, నేనిచ్చానని భ్రమించుట ఎంతటి అవివేకము. బెల్లముతో దేవుని విగ్రహమును తయారుచేసి, తిరిగి అందులోనే కొంత గిల్లి ఆయనకు నైవేద్యము పెట్టుటయే దానము. దానము చేయునది తనది గాదు. తానే స్వామికి చెందినవాడు గదా. ఇక ఇదే ధనము కొందరిని పాపులను చేయుచున్నది. వీరు ధనమును ఇతరులను పీడించి, అధర్మ ముగా ఆర్జింతురు. వీరికి అర్థ కామములే ప్రధానము. ధర్మము గాదు. అనగా సమాజమునెడ కర్తవ్యమును ఆచరింపకుండగనే, అనైతికముగా ధనార్జన గావింతురు. కావున వీరు ధనమునకు బానిసలై పాపులగుచున్నారు. ఇక వీరు ఇతరులకు దానము చేయునదేమియు నుండదు. లోభులై ధనమును కూడబెట్టుకొనుట, తమకు విషయ సుఖములను సమకూర్చుకొనుటలోనే వీరి బ్రతుకు తెల్లవారును. వీరికి శాంతి యుండదు. సంఘమున వీరు ధనార్జనకై చేయు పనుల వలన హాని జరుగును. పరపీడనమే కదా పాపము. వీరి విధానమిది. పరోపకారమే పుణ్యము. ఒకే ధనమును కొందరు దీనికి, కొందరు దానికి వినియోగించుచున్నారు. కావున ధన ప్రభావమునకు లొంగుటయా, లేదా అన్న అంశము ధనములో లేదు. మానవునిలోనే యున్నదని ఈ పాదమున అన్నమయ్య స్పష్టము గావించెను. ధన ప్రభావము పెరిగిన వ్యవస్థలో ఎక్కువమంది ధనమునే కోరి, ధర్మమును, దైవమును విడిచినపుడు వారి మధ్య స్పర్థ, ఆపైన కలహములు ఏర్పడును. ఒక్కొక్కసారి ఒకరినొకరు చంపుకొనుటకు కూడ సిద్ధపడుదురు. మానవత్వము నశించును. ఒక్కొక్కసారి ధనవంతులయిన వారి నడుమ కలహము, పోటీ ఏర్పడినపుడు సాధారణ జనులు ధరలు పెరిగి నలిగిపోవుదురు. ఇట్టి పోటీవలన వస్తువుల నాణ్యత పెరిగి, ధరలు తగ్గునని కొందరు తప్పుడు సిద్ధాంతములను ప్రచారము చేయుచున్నారు. ఈ సిద్ధాంతము పాశ్చాత్యులలో ఎక్కువ ప్రాచుర్యములోనున్నది. వాస్తవమును గమనించినచో, ధనస్వామ్య వ్యవస్థలో ధరలు పెరుగుట, జనులు ఇక్కట్లపాలగుటయే జరుగుచున్నది. భారతము సభా పర్వమున ఇట్లు చెప్పబడినది. భరతదేశములోని సామంతరాజులు రాజసూయయాగ సందర్భమున ధర్మరాజుకు కానుకలెన్నియో చెల్లించిరి.

అయితే ఆతడు వానిని సొంతముగా వాడుకొనలేదు. ప్రతిదినము కొన్ని వేలమందికి మూడేండ్లపాటు భోజనము పెట్టి, వస్త్రాదులను గూర్చి ఆ డబ్బును వ్యయించెను. నడిరేయిన ధర్మరాజుకు పదివేల మంది భోక్తలతో గలిపి వడ్డించి, ఆపైన ద్రౌపది భుజించెను. కావుననే శ్రీకృష్ణుని రక్షణము వారికి లభించినది. దుర్యోధనుడు ధర్మరాజునకు అర్పింపబడుచున్న కానుకలు చూడగా అతనికి కన్నుగుట్టినది. ధనము, అధికారముల యెడ కోరిక ఇతనిలో అసూయను పెంచి, మాయాద్యూతమునకు, చివరకు మహా భారత యుద్ధమునకు, ప్రజా నాశనమునకు దారితీసినది. అంతేగాని చాలమంది పొరపడినట్లు ద్రౌపదీదేవి నవ్వునకు పరాభవింప బడి గాదు అతడు పాండవులను బాధించినది. ద్రౌపది అపహసించునా! అది కల్పితము. ధన వ్యామోహము, అధికార వ్యామోహమే అతని కలహప్రియత్వమునకు కారణము. వీనికి లోనై, అతడు పాండవుల వనవాసమున వారిని ఎన్నోమార్లు అవమానింప ప్రయత్నించెను. రహస్యముగా చంపింప యత్నించెను. కాని వారు ధనమునకు గాక, ధర్మస్వరూపు దయిన శ్రీకృష్ణునకు శరణాగతులగుటచే, విజయము వారినే వరించినది. మహాభారత గాథా సారమిది. ధనమునకు గాక, ధర్మమునకు, దేవునికి శరణాగతికే విజయము లభించునని. రామాయణమున రావణుడు లంకలో సీతను ధన ప్రాబల్యమును చూపి ఇట్లు ప్రలోభపెట్ట యత్నించెను. "యౌవనములోనున్న భార్యను భోగములతో సుఖపెట్టక, అడవికిదెచ్చి కష్టములపాలు చేసిన రాముడు నీకు తగినవాడుగాడు. నేను నిన్ను పట్టపురాణిని గావించి సమస్త సుఖభోగములో ముంచెత్తెదను. నన్ను వివాహము చేసికొనుము." సీత ధర్మమే ప్రధానమని యెంచి, ధర్మమూర్తి యగు రామునకే తాను చెందినదానినని చెప్పి, రావణు డీయజూపిన ధనభోగాదులను నిరాక రించెను. కామము, కాంచనాసక్తి వ్యక్తి సాధనకు, సమాజ శ్రేయస్సుకు ఆటంకములని శ్రీరామకృష్ణ పరమహంస బోధించెను. మానవునితో ధనము పందెమాడును. అనగా మానవునిలో సహజముగా నున్న మానవత్వముతోను, ప్రేమతోను పందెమాడి తుదకు వానిని లొంగదీయును. తనకు సహజముగానున్న మానవతను, ప్రేమను చంపుకొని ధనము, విలాసములకే తనను తాను సమర్పించుకొన్నవారల అంతరంగమునకు, బాహ్య మనస్సుకు నడుమ సంఘర్షణ సాగుచుండును. దీని ఫలితముగా రోగములు వచ్చుచున్నవి. భారత దేశమున హూణులు, బర్బరులు, యవనులు మన దేశమున గల సహజ సంపదలను చూచి కన్నుకుట్టి దోచుకొను దోపిడీగాండ్రుగా వర్తించిరి. భారతీయులలో కొందరు ధనదాహులై వారికి తోడ్పడిరి. అట్లే విదేశముల నుండి వచ్చి మనదేశము నాక్రమించిన వారెవరయినను మొదట మన సంపదను కొల్లగొట్టి, దోపిడీ చేయుటకే వచ్చిరి. ఆపై మన దేశమున కొందరు ధనలోభమున వారికి సాయపడిరి. కొందరు పాలకులు ఒకరితో నొకరు కలహించుచు, కొందరు విదేశీయులు ఇయ్యచూపిన ధనమునకు లొంగుటతో, విదేశీయులగు దోపిడీకాండ్రకు ఈ దేశమును ఆక్రమించి అధికారమును చేజిక్కించుకొనవలెనని ఆశ పుట్టెను. మొదట ధనాశతో వచ్చిరి. ఆపై సామ్రాజ్యమును ఆశించిరి. వారి వాణిజ్యమును బంధించినచో, వారి పాలన మాగునని యెంచియే మహాత్ముడు స్వదేశీ ఉద్యమమును, విదేశీ వస్తు బహిష్కారమును చేపట్టెను. ప్రస్తుతము అగ్రరాజ్యమనబడు దానిలోని కొందరు ధనవంతుల ధనాశకే ఇతర బలహీన దేశములు బలియగుచున్నవి. ఇట్లు అన్నమయ్య ఆనాడు చెప్పిన హెచ్చరికలు

ఎప్పటికినీ పాటింపదగినవే. ఈనాడు అన్నదమ్ములు, చివరకు దంపతులు కూడ ధనము కొరకై కలహించుట జరుగుచున్నది. ఒకే ఇంట్లో నివసించుచున్నను ఎవరిది వారిదే. ఆహా! కలి ప్రభావము – ధన రూపమున – వేదములు, అవతారమూర్తులు, అన్నమయ్య వంటి మహాభక్తులు పుట్టిన పుణ్యభూమి యందున్నను పనిచేయుచున్నది. ప్రస్తుత నాగరికత ధన ప్రాబల్యము కలిగి పల్లెల నుండి జనులను నగరములకు తరలించి, స్వతంత్రోపాధి లేకుండజేసి విదేశముల వారికి, ఇచటి ధనవంతులకు యాచకులుగా మార్చి మానవుల నడుమ హృదయానుబంధములను తొలగించి, ఆ స్థానమున యాంత్రికత నెలకొలుపుచున్నది. మానవునికన్న విలువయినదా బంగారము! కాని కలి ప్రభావమున దాని ప్రాబల్యము పెరిగినది. వేదాంతమును, మానవతను ప్రవచించు పెద్దలు కూడ బంగారమునకు ఆశపడుట చిత్రముగా నున్నది. తనకన్నను కొందరికి తాము అలంకరించుకొను బంగారమున కెక్కువ విలువని భ్రమ కలిగి, బహిరంగ ప్రదర్శనలు గావించుటలో భుజములు ఎగురవేసికొందురు. బంగారము, ఖరీదయిన దుస్తులు – ఇట్టివి మానవత్వముతో పందెమాడుచున్నట్లున్నదని అన్నమయ్య ఆవేదన. మనిషి మరమనిషిగా మారుచున్నాడు. అయితే ఎప్పుడును వ్యవస్థ ఇట్లుండదు. మానవ సమైక్యాన్ని వ్యతిరేకించే పద్ధతులన్నియు మాసిపోయి, తిరిగి వసుధైక కుటుంబ మేర్పడితీరును. ఈ ఏర్పాటుకు భంగకరమైన ధన ప్రాబల్యము తొలగిపోవును.

3వ చరణము యొక్క తాత్పర్యము

"బంగారము నిగనిగమనుచుండును. దాచబడియుండును. ఇంతకును లక్ష్మీ స్వరూపమే గదా. కావున శ్రీవేంకటేశ్వరుని యందు ప్రీతి గలిగిన భార్యయై యున్నది. అడ్డులేని మాయయై మానవుని వంచించుచున్నది. ఇదియే మనకు దిక్కు, అండ అని మానవుని బంగారము మోసపుచ్చుచున్నది. అతని జీవిత గమనము దాని దిశ వైపుగానే సాగుచున్నది. జీవిత గమ్యమే ధనమగుచున్నది. ఇట్లు బంగారము – ధనము నటన చూపుచున్నది."

వ్యాఖ్య

బంగారమెట్లును నిగనిగమని మెఱయుచుండును. ఇదిగాక అన్నమయ్య సూచించు అర్థము వేరు గలదు. బంగారము ధనమునకు ప్రతినిధి. ఇది మానవుని ముందు మెఱయుచున్నట్లు కన్పడి అతనిని లోగొనుచున్నది. దాని మెఱపులకు మానవునికి కనులు కనపడుటలేదు. అనగా బుద్ధి పనిచేయవలసిన రీతిలో పని చేయుటలేదు. లోఁగన్ను గ్రుడ్డిదైనది. కొందరు బంగారు నగలను ప్రదర్శించుచున్నారు. బంగారము అలంకారమా! శరీరమున కలంకారము భగవంతుని సేవ. చెవుల కలంకారము భగవంతుని కథలను వినుట. భుజముల కలంకారము సాయము కావలసిన వారిని సేవించుట. తలకు అలంకారము పెద్దలకు వినయముతో మ్రొక్కుట. కాళ్ళకు అలంకారము భూమిపై గల అణువునెల్ల స్వామి ఆలయముగా భావించుట. తానే దేహము విడువక తప్పదు. తనవెంట బంగారము, ధనము వచ్చునా? మరికొందరు ధనమును దాచుకొందురు. నిత్యము అది అపహరింపబడు నేమో, తొలగునేమో అను భీతితో జీవింతురు.

దాని నింకను ఎట్లు పెంచవలయునో అను ఆశలతో, పన్నుగడలతోనే జీవితము దొర్లిపోవును. పాపము! వీరికి జీవించుటకు సమయము చాలకనే జీవనము వెళ్ళిపోవుచుండును. కొండచిలువ నోట చిక్కిన వారి బ్రతుకే ధనదాసుల బ్రతుకు. అయితే అన్నమయ్య ఒక దివ్యబోధ చేయుచున్నాడు. సృష్టిలోని సకల సంపదలకు తల్లి లక్ష్మీదేవి. శ్రీసూక్తమున ధనమనగా 'అగ్ని, వాయువు, నీరు, సస్యము' లనియు, ఇవి లక్ష్మీస్వరూపములనియు చెప్పబడినవి. ఈ లక్ష్మీదేవి స్వామికి భార్యయై ప్రీతితో సేవించుచున్నది. నిజమైన ధనము లక్ష్మీదేవి దయారూపము. అట్టి లక్ష్మికి భర్తయైన స్వామిని సేవింపక, ధనము వెంబడి దాసులై పడుట ఎంత చిత్రము! అంతర్యామిగా స్వామిని నిత్యమర్చించినచో, మనకు రావలసినది మన వద్దకు స్వామి నుండి, అమ్మవారి చేతులమీదుగా నడచివచ్చుట వాస్తవము. కాని ధనము మాయాస్వరూపమై, దాని ప్రభావము ఆగుటలేదు. అనగా విలువ లేనిదానిని విలువ గలదానిగ భ్రమింపజేసి, అసత్యమును సత్యముగా పొరపడు నట్లు చేసి, సత్యమును మరుగుపరచు శక్తి గలది. సత్యము భగవానుడు. ఆయన స్వరూపమైన ప్రేమ, ధర్మము, శాంతి, ఆనందము–వీనిని గోల్పోయి, అనారోగ్యముతో బాధపడుటకైనను ఇష్టపడును గాని, నరుడు ధనాశను విడువడు. తనకు దిక్కు ధర్మస్వరూపుడైన దేవుడై యుండగా, వ్యక్తి బ్రతుకు దేవుని స్వరూపమగు సంఘమై యుండగా, కాదని ధనమునే దిక్కుగా నమ్ముచున్నాడు. తన బ్రతుకును, ప్రాణమును, ఆయుస్సును, తనకు దేవుడిచ్చిన అన్ని శక్తిసామర్థ్యములను ధన దిశగా మరలించు చున్నాడు. ధనమే గమ్య మితనికి. ఇచట దిక్కు అన్నను, దెస అన్నను ఒకటే అర్థము గదా. అన్నమయ్య ఏల ఒకే అర్థము గల రెండు పదములను ప్రయోగించెను? దిక్కు అనగా అండ. దెస అనగా దిశ. తాను పయనించు దారి, తన గమ్యము. ఇట్లు ఎంతటి విజ్ఞానినయినను, వేదపండితుని అయినను, మేధావినయినను ధనము ఆడించుచున్నది. భారతము అరణ్యపర్వమున రోమశ మహర్షి ధర్మరాజున కిట్లు జోస్యము చెప్పెను. "కలియుగమున విప్రులు వేదమును ధనమునకై అమ్ముకొందురు." అనగా వేదములందు ఋషులు చెప్పిన మార్గమున నడచుటగాక, ఊరక వేదములను వల్లించుచు, వేదార్థమును విప్పిచెప్పుచును ధనార్జనకై ఈ విజ్ఞానమును అమ్ముకొను యాచకులగుదురు. ఈ జోస్యము ఎందరో విప్రులకే గాక, ఎందరో మేధావులకు, విజ్ఞానులకు, ఉపాధ్యాయులకు వర్తించును. సాధారణ జనులకు సరియగు దారిని చూపవలసిన బాధ్యత గల వీరే ధనదాసులగుట, ధనము యొక్క ఆట ఎంత గొప్పదో తెలుపుచున్నది. విజ్ఞానులు, వేదవేత్తలు, మేధావులు గూడ ధన ప్రభావమునకు లోనగుట అన్నమయ్యకు ఒకవైపు విచిత్ర మన్పించుచున్నది. వేరొకవైపు ఆవేదన కలుగుచున్నది. ఇంకొకవైపు ఎల్లరు దేవుని అంశలే గావున ప్రతి మానవునిలో దివ్యత్వము దాగియుండి ఆనందమునకై అందరు వెదకుదురు గాక. తప్పక మరల ధనము యొక్క ఇంద్రజాలము తొలగి మానవునకు, ధర్మమునకు, దైవభక్తికి ప్రాముఖ్యము ఏర్పడు కాలము వచ్చునను ఆశయు, భావి దృష్టియును రేకెత్తుచున్నవి. "ధనమూలమిదం జగత్" అనునది తప్పుడు సామెత.

పూర్వము 14వ శతాబ్దమున ఇద్దరు మహనీయులైన మిత్రులుండిరి. 1. విద్యా రణ్యులు. 2. వేదాంతదేశికులు. వీరిర్వురు బాల్యమున సహాధ్యాయులు. బాల్య మిత్రులు. కాని విద్యారణ్యులు ఆదిశంకరుల

తర్వాత అంతగా అద్వైత సిద్ధాంత వ్యాప్తికి కృషిచేసినవారు. కాగా, వేదాంతదేశికులు శ్రీరామానుజుల తర్వాత అంతగా విశిష్టాద్వైత సిద్ధాంత వ్యాప్తికి కృషిచేసినవారు. ఇర్వురి మైత్రి భంగము నొందలేదు. విద్యారణ్యులు తమ తపో మహిమతో హరిహరరాయలు, బుక్కరాయలచే విజయనగర సామ్రాజ్యమును స్థాపింపజేసి, వారికి సచివుడై విజయనగరమున వసించెను. వేదాంత దేశికులు మాత్రము శ్రీరంగమున తనకు సరిపోవు వరకు భిక్ష నెత్తుకొని శ్రీరంగనాథుని సేవ చేయుచుండెను. విద్యారణ్యులు, వేదాంతదేశికులను విజయనగరమున కాహ్వా నించెను. అచట రాజాశ్రయమున సుఖముగా బ్రతుకవచ్చుననియు కబురంపెను. వేదాంతదేశికులు మాత్రము మిత్రుని సహాయమును సున్నితముగా నిరాకరించిరి. రాజాశ్రయములోని సుఖభోగముల కన్న శ్రీరంగని సేవయు, భక్తులగు సాధారణ మానవులిచ్చు ఆహారమే తనకు తృప్తి నిచ్చుననియు కబురంపెను. ఇట్లు భగవంతుని ఆశ్రయములో ఆనందించువాడు ధనాశ్రయమును కోరడని అన్నమయ్య సంకీర్తన సారము. మానవుడు ఒక రూపాయ నోటును నాటి, వేల రూపాయల నోట్లను పుట్టించగలడా? లేదు. ఇక దాని విలువ ఎంత? విత్తనము భగవంతుడిచ్చినది. దానిని పొలములో నాటినచో ఎన్నో విత్తనములు వచ్చుచున్నవి. దేవుడిచ్చినది సస్యసంపద. మానవులు కల్పించుకొన్నవి నాణెములు, నోట్లు. మొదటిది విలువయి నది. రెండవది ఖరీదయినది. మానవుడు రెండవదానికి విలువనీయక, మొదటి దానికి విలువ నీయవలెనని అన్నమయ్య సందేశము.

* * *

46

3వ సం-355 **వినరో భాగ్యము** శుద్ధధన్యాసి

వినరో భాగ్యము విష్ణుకథ
వెనుబల మిదివో విష్ణుకథ. ॥ పల్లవి ॥

ఆదినుండి సంధ్యాది విధులలో
వేదంబయినది విష్ణుకథ
నాదించీనిదె నారదాదులచే
వీథి వీథులనే విష్ణుకథ. ॥ వినరో ॥

వదలక వేదవ్యాసులు నుడివిన
విదిత పావనము విష్ణుకథ
సదనంబైనది సంకీర్తనయై
వెదకిన చోటనే విష్ణుకథ ॥ వినరో ॥

గొల్లెతలు చల్లలు గొనకొని చిలుకగ
వెల్లివిరియాయ విష్ణుకథ
యిల్లిదె శ్రీవేంకటేశ్వరు నామము
వెల్లిగొలిపెనీ విష్ణుకథ. ॥ వినరో ॥

అజ్ఞానం అంటే ప్రకృతిలో ఉన్నదాన్ని మనం చూసే విధానం.
జ్ఞానం అంటే ప్రకృతి మనకు దర్శనమిచ్చే విధానం.

టీక

సదనము = నిలయము, గొనకొని = పూని, వెల్లివిరియాయెను = ప్రవహించెను, వెల్లిగొలిపెను = వ్యాపింపజేసెను.

పరిచయము

దేవునికి ఎన్నో పేర్లుండగా, ఇచట అన్నమయ్య విష్ణువనియే పేర్కొనెను. అనగా సర్వాంతర్యామి యని యర్థము. విష్ణుకథ యొక్క ప్రాముఖ్యమును అన్నమయ్య ఈ సంకీర్తనలో ప్రస్తుతించెను. కాలక్రమమున అది ఎట్లు వ్యాప్తి పొందినదో వివరించెను. వేదకాలమున సంధ్యావందనాది నిత్య ప్రార్థనలలోను, ఆపైన నారదాది దేవర్షులచే చేయబడిన గానములోను, అటుపిమ్మట వివిధ పురాణేతిహాసములందు ముఖ్యముగా భాగవతమునందును, సంకీర్తన రూపమును దాల్చియు విష్ణుకథ వర్ణింపబడినది. ఇంతయేల వెదకిన చోటునందే యున్నదని దర్శించి అన్నమయ్య ప్రకటించెను. గోకులమున గోపికలు మజ్జిగ చిలుకుచు పాడుకొన్నదిది. శ్రీవేంకటేశ్వరుని నామము విష్ణుకథను ప్రవహింపజేయుచున్నది. జీవుడు, స్వామి నుండి వెడలి వచ్చుచున్నాడు. తిరిగి స్వామిని చేరుట జన్మజన్మల పరమావధి. సముద్రము నుండి వెలికి వచ్చిన తరంగము తిరిగి సముద్రమునే చొచ్చుట సహజము గదా. అట్లు స్వామిని చేరు సాధనసామగ్రిలో భక్తియే శ్రేష్ఠమయినదని ఆదిశంకరులు నొక్కిచెప్పిరి. భక్తి యనగా విశ్వమునందు అంతర్యామి యయిన విష్ణువునందు బంకవలె అతికియుండు పరమ ప్రేమ. ఇది ఎట్లు లభించును? విష్ణు భక్తులగు మహానుభావులను సేవించుటవలనని నారదాదులు సూత్రీకరించిరి. పూజలు మొదలయినవి భక్తి పొందుటకు వలసిన సామగ్రి క్రిందకు వచ్చునే గాని, భక్తి క్రిందకు రావు. వంటచెఱకు వండబడిన పదార్థము గాదు గదా. భక్తిని పొందుటకు విష్ణుకథలను చదువుట, గానము చేయుట, విని యానందించుట ఉపయుక్తములని గర్గ మహర్షి తెలిపెను. ఈ సంకీర్తనమున అన్నమయ్య ఈ మార్గమును ప్రస్తుతించుచున్నాడు. కృష్ణునికి నామకరణము, ఉపనయనము చేసిన మొదటి గురువు గర్గుడు. విద్యలు నేర్పిన రెండవ గురువు సాందీపని. ఎవరిని, దేనిని తలచిన మన మనస్సు అదియే యగును. రుమాలులో ఏ వాసన గల పదార్థము నుంచిన, రుమాలు ఆ వాసన గొట్టును. నిప్పుకణికను దానిలో నుంచినచో రుమాలే మాయమగును. అట్లే మనస్సును విష్ణు నందు సమర్పించుకొన్నచో అది మాయమై దాని స్థానమున విష్ణుడు నిలుచును. మనస్సు నందు విష్ణుని నిలుపుకొనుట అసాధ్యము. ఏలననగా మనస్సు పరిమిత జలప్రవాహమగు వాగు వంటిది. విష్ణుడనగా విశ్వమున వ్యాపించిన చైతన్యమగు వెలుగు. ఇతడు అపరిమిత జలప్రవాహమగు సాగరము వంటివాడు. వాగు సాగరము నందు లీనము గావలెను. అట్లే, మనస్సు అంతర్యామి యందు సమర్పితమై కరగి పోవలెను. మనస్సు, భౌతిక దేహముతో ముడిపెట్టుకొని జీవుని, మిగిలిన సంఘము నుండి వేరుచేయు ఖండ ప్రజ్ఞ. ఇది సర్వాంతర్యామి యగు విష్ణుని యందు కరగినచో జీవుడు సంఘముతో తాదాత్మ్యసిద్ధి పొందును. నరుడు నారాయణుడగును, అనగా విశ్వమానవుడగును. మనస్సును విష్ణునకు శరణాగతి లేదా సమర్పణ చెందుటెట్లు? "నేను శరణాగతి పొందుచున్నాను" అని మనస్సు భావించుచున్నప్పుడు

దాని యునికి గలదు గదా. ఇక శరణాగతికి స్థానము లేదు. మనలను వంచించు మనసును వంచింపవలెను. ఎట్లు? ధ్రువుడీ బాటను భాగవతమున చూపెను. దేవుని చరణముల నర్చించుచు, విశ్వప్రేమానురాగముల నభ్యసించి విష్ణుకథా శ్రవణమున మనస్సు అర్పణము కాగా విష్ణువు యొక్క స్వరూపమగు ఆనందము ననుభవించుట. ఇట్లుగాక పరబ్రహ్మాను ధ్యానము చేసి తాము కల్పించుకొన్న ఆనందమును తామే అనుభవించుచు, ఇది భగవదానందమని కొందరు పొరపడుచున్నారు. వారికి కల్గునది ఆనందము యొక్క అభాసయే గాని ఆనందము గాదు. ఇది ఎండమావిలో నీరు వంటిది. విష్ణుకథలను చదువుట, సంకీర్తనము చేయుట, వినుట వలన మనస్సు మాయమగును. అపుడు కల్గునదే నిజమైన ఆనందము. కావున భక్తుల సన్నిధిలో విష్ణుని కథాసుధను గ్రోలువానికి దేహము, సంసార బంధములు మరపునకు వచ్చును. నీ కథలను భక్తులు గానము చేయుచుండగా విని ఉన్మత్తుడనగు భాగ్యము నీయుమని ధ్రువుడు విష్ణుని వేడెనే కాని తండ్రి తొడపై ఎక్కింపుమని యడుగలేదు. కొందరు మంచివారు మాకు విష్ణుకథా సంకీర్తనముతో బనిలేదు, వట్టి సత్కర్మ నాచరింతుమని బింకముతో భీష్మించుకొనుచుందురు. వీరాచరించు సత్కర్మ కొనసాగదు. ఏలననగా వీరు తోటి మానవుల యెడల చూపు ప్రేమ పరిమితము. పూర్ణము గాదు. కొన్నాళ్లకీ సత్కర్మ యాంత్రికముగా, మ్రొక్కుబడిగా సాగి, ఆపై నిరాశ కలిగి, సంఘమును చీదరించుకొని ఆగిపోవును. సత్కర్మ కొనసాగవలెనన్నచో సమాజముపై ప్రేమ పూర్ణమై, అవిచ్ఛిన్నమగు జీవనదిగా ప్రవహింపవలెను. ఇట్టి ప్రేమ కలుగుటకు తోటివారి యందును, తన యందును 'నేను' గా నున్న విష్ణుని గుర్తించి వాని కథలను కీర్తించుట, వినుట తప్పనిసరి. బల్బులు ప్రకాశించుటకు విద్యుత్తు వానియందు ప్రవహింపవలెను గదా. అట్లే జీవిత దినచర్యలో సత్కర్మాచరణము కొనసాగుటకు 'పరమప్రేమ' అను విద్యుత్తు ఎడతెగక ప్రవహింపవలెను. ఈ విద్యుత్తు యొక్క ప్రసారమునకు మీట నొక్కుట వంటిది విష్ణుకథ. కావుననే అన్నమయ్య దీనికింత ప్రాముఖ్యము నొసంగెను. ఇట్లు ఈ సంకీర్తనమున పైకి విష్ణుని నుతించుచున్నట్లు కన్పడుచున్నను, సామాజిక సందేశము కూడ గలదు. సమాజము గాక, వేరుగా విష్ణుదని ఉట్టిగట్టుకొని ఊరేగుట లేదు. భగవంతుడు కావించిన సృష్టి క్రమము, ఆయన ధరించిన అవతారముల గాథలు, విష్ణు భక్తులగు ప్రహ్లాద నారద ధ్రువాంబరీష గోపికాదుల కథలు, కలియుగమున జీవించిన అన్నమయ్య వంటి ప్రవక్తల జీవిత చరిత్రలు, ఎల్లరి మంచిగుణములను వర్ణించు కథలు – ఇవి అన్నియు విష్ణుకథ క్రిందకే వచ్చును. ముఖ్యముగా విష్ణు వనగా విశ్వవ్యాపకుడు గావున ఎవరు విష్ణుని ప్రేరణతో సమాజమున విష్ణుని దర్శించి ఏ పని చేసినను అది విష్ణుకథయే అగును. విష్ణు వనగా వ్యక్తి గాడు. సర్వ వ్యాపకమయిన వెలుగు కావున సజ్జనుల గుణములను గూర్చిన కథ లెల్లయు విష్ణు కథలే. ఈ భావమునే అన్నమయ్య పరోక్షముగా ప్రకటించెను.

పల్లవి యొక్క తాత్పర్యము

విష్ణుకథ వినుట భాగ్యము. దీనిని ఎల్లరు విందురుగాక. సర్వ జగత్తుకు వెనుక గల బలము విష్ణుకథయే.

వ్యాఖ్య

విష్ణుని కథలలో ఆయన లీలలు, వైభవము, కరుణాది సద్గుణములు గూడి యుండును. సజ్జనుల సద్గుణములు కూడ శ్రీహరివే. కారణము ఎల్లరికి అంతరాత్మ ఆతడే కదా. తోటివారిలోని సద్గుణములను, వారి జీవితములోని మంచి ఆచరణను తెలుపు సన్నివేశములను గూడ వినుట విష్ణుకథలను వినుటయే. ఇందువలన మనలో దాగియున్న దివ్యగుణములు క్రమముగా విచ్చుకొని పుష్పించును. ఇది మహాభాగ్యము. విష్ణుకథా శ్రవణమున మనస్సు కరగిపోవును. ఇదియే సమర్పణము. మనస్సు పని చేయుచున్నంతసేపు ఆలోచనలు, ఆవేశములే గాని అనుభూతికి తావెక్కడ? విష్ణు కథా శ్రవణమున మనస్సు ఉండక అనుభూతి దాని స్థానమున నిలుచును. ఇంతకన్న భాగ్యమేమున్నది? విష్ణుచిత్తు డనబడు పెరియాళ్వారు ఇంట ప్రతి నడిరేయి కూడ ఇతర ప్రాంతముల నుండి వచ్చిన వారికి ఆతిథ్య మొసంగబడుచుండెడిది. విష్ణుని కథల సంకీర్తనము, శ్రవణము జరుగుచుండెడివి. వీథులలో బోవువారు వీనిని వినెడివారని ఆముక్తమాల్యదలో తెలుపబడెను. ఏ విజ్ఞానశాస్త్రము విన్నను, దానిని విష్ణుని లీలగా విన్నచో హాయిగా నుండును. లేకున్న అది వేదాంతమైనను, సైన్సు అయినను బరువే. జగత్తుకు వెన్నుదన్నుగా నిలుచు బలము విష్ణుని శక్తియే. తారకా గ్రహ గోళముల భ్రమణమునకు, ప్రకృతి నడకకు, జీవుల శ్వాసకు, ఎవరికే శక్తి యున్నను అది విష్ణుని నుండి వచ్చినదే. ఒక మానవుని చేతికి పనిచేయగలుగు శక్తియు, కాలికి నడుచు శక్తియు, కంటికి చూచు శక్తియు గలవు. కాని ఇవన్నియు ఆ మానవుని శక్తిగానే గమనింపబడును గాని, వేరువేరుగా గాదు కదా. అట్లే ఎల్లరి బలమున కాధారము విష్ణుని బలమే. "ఎవరి బలమున నీవు నన్ను ధిక్కరించు చున్నావ"ని హిరణ్యకశిపుడు హుంకరింపగా ప్రహ్లాదుడు బలవంతులకు, బలము లేనివారికి, నీకు, నాకు, బ్రహ్మాదులకు, ప్రాణులకు బలమైన వాడెవ్వడో అట్టి స్వామియే తనకు బలమని బదులు చెప్పెను. భగవంతుడనగా ఆరు గుణములు గలవాడని రామానుజులు చెప్పిరి. వానిలో బలమొకటి. అన్నమయ్య భావములో బలమనగా భౌతికశక్తియే గాక బుద్ధిబలము, ఆత్మబలము కూడ. ఇట్టి బలము గూడ ఎల్లరికి విష్ణుకథయే. విష్ణుని వెలుగే శరణాగతులకు ఈ బలముల నిచ్చును. విష్ణుని తీయని కథాగానము, శ్రవణముల వలన దేహబలము, బుద్ధిబలము, ఆత్మబలము పెరుగును. నిరాశ తొలగి నిత్యోత్సాహము అలవడును. ఉత్సాహము తొలగినపుడెల్ల విష్ణు కథలు ఉత్సాహము నిచ్చును. ఆయురారోగ్యముల నొసంగును.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"మొదటినుండి సంధ్యావందనము మొదలగు నియమిత కార్యక్రమములో వేద మైనది విష్ణుకథయే. నారదుడు మున్నగువారిచే వీథివీథులందు నాదముగా ప్రస్తారము చేయబడినది విష్ణుకథయే."

వ్యాఖ్య

సృష్టి మొదటినుండియు ప్రతి ఋషియు, దేవతయు తాము చేయుచున్న పను లన్నియు విష్ణుకథా సంకీర్తనములే. వేదమనగా తెలియవలసినది. అది ఏది? తనను తానే. తన నిజస్వరూపమయిన దేవుని. ఋషులు, దేవతలు చేయుచున్న పనులన్నియు విశ్వాంతర్యామి యగు విష్ణునికి అర్చనములే. వానిలో

తెలియబడవలసిన బ్రహ్మ జ్ఞానము అందుచున్నది. ఇదియే విష్ణుకథ. విశ్వామిత్ర మహర్షి గాయత్రీ మంత్రమును దర్శించెను. ఎల్లరి బుద్ధులను నడిపించు తెల్లని వెలుగయిన సూర్యాత్ముని మనము వరింతుము గాక అని ఈ మంత్రార్థము. గాయత్రీ మంత్రములో చెప్పబడిన ఆ వెలుగు విష్ణువే. ఈ మంత్రజపము ఆచరింపవలసినదిగా నియమింపబడినది. దీనికి పూర్వపీఠికలుగా ఆచమనము, సంకల్పము, అర్ఘ్యప్రదానము, ధ్యానము; ఉత్తర పీఠికలుగా సూర్యోపస్థానము విధింపబడినవి. ఇవన్నియు ఎల్లరిలో నొక్కడగు విష్ణుని దర్శించి సేవించుటకు ఉద్దేశింపబడినవి. ఈ విధులను పాటించుట వలన అంతర్యామి ఎఱుక కలుగును. ఇదియే వేదము. సంధ్యావందనము ఉదయాస్తమయములందు, మిట్టమధ్యాహ్నమున విధింపబడినది. ఇదియేగాక పదునారు ఉపచారములతో పూజ, హోమాదులు గలవు. ఈ యన్నిటిలో అంతర్యామినే భావింపవలెనని అన్నమయ్య ఇచట స్పష్టము చేయుచున్నాడు. అనగా సంధ్యాది కార్యములను యాంత్రికముగా చేయుట గాక తమచే అర్చింపబడుచున్న, ధ్యానము చేయబడుచున్న, స్తుతింపబడుచున్న వాడు వ్యక్తి గాదు, అంతర్యామి వెలుగు అని స్మరించవలెను. అందులకే 'విష్ణు' కథ యని అన్నమయ్య ప్రయోగించెను. ఇట్లు చేయుట వలన విష్ణువు ఎఱుకకు అనగా అనుభవమునకు వచ్చును. ఇదియే వేదము. ఇదియే లక్ష్యము. నాలుగు వేదములను గూడ భావ, భాషా సహితముగా మహర్షులు విష్ణుని సేవించియే దర్శించిరి. వేదము లన్నియు విష్ణుకథలే. ఇదిగాక ఇచట వేరొక పవిత్రభావ మున్నది. వాక్కు అను ఋగ్వేదము, శ్వాస యను సామవేదము, ఆచరణ యను యజుర్వేదములతో గూడినవే దైవిక కార్యక్రమములన్నియు. వాక్కు, శ్వాస, ఆచరణశక్తి విష్ణుని కృపయే. విష్ణుని కథలే కర్మ అను భక్తితో నాచరించినచో బ్రహ్మజ్ఞానము కల్గును. కొందరిట్లు గాక భక్తిజ్ఞానముల కంటె పూజాది కార్యక్రమములను చేయవలసిన విధివిధానమునందే శ్రద్ధ పెట్టుట వలన ఎంతగా వానిని ఎన్ని ఏండ్లు చేసినను వికాసము, పరిశుద్ధత, బ్రహ్మానందము గలుగవు. సంధ్యాదులను పద్ధతి ప్రకారము చేయవలసినదే గాని, లోచూపు ప్రేమతో గూడి అంతర్యామిపై నుండవలయునని అన్నమయ్య ఈ పాదములందు ప్రసాదించుచున్న ఉపదేశము. ఉదాహరణకు భార్యలో, పిల్లలలో, ఒరులలో విష్ణుని చూడలేనివాడు సంధ్య, పూజా హోమాదు లెంత క్రమశిక్షణతో చేసినను వారిపైన రాగద్వేషములు పెరుగక తప్పదు. తాను పూజ చేయు వేళకు భార్య ఏర్పాట్లు సరిగా చేయలేదనియు, పిల్లలు అల్లరి చేయుచున్నారనియు, ఎవరో విఘ్నములు కల్పించుచున్నారనియు నన్పించి, వారిపై కోపము కలుగును. విఘ్నములు మనసులో నుండును గాని వెలుపల నుండవు. లోన, వెలుపల విష్ణునే గనువానికి సంధ్యాదులు వికాసము కల్గించును. హృదయమును పరిశుద్ధము గావించును. లేనివానికి బరువగును. దేవుని పూజించునపుడు, ఆకలి గొన్నవారికి అన్నము పెట్ట నిరాకరించువాడు, తనకెవరో ధనము నీయవచ్చినచో నిరాకరించునా? లేదు. తన పైఅధికారి కబురంపినచో వెళ్లకుండ ఆగునా? లేదు గదా. నారదుడు, తుంబురుడు మొదలగు గాయకులగు మహాభక్తులు అన్ని లోకము లందును విష్ణుకథలనే నాద ప్రస్తారము చేయుచు చరించుచున్నారు. వాల్మీకికి, వ్యాసునికి, ప్రహ్లాదునకు, ధ్రువునకు, పరాశరునకు విష్ణుకథలను సామమార్గమున గానము చేసి యుపదేశించినది నారదుడే. ఇతడెప్పుడును నారాయణుని సూచించు 'ఓం' కారమును, వీణపై మీటుచుండును. ఇతడు

చేయు విష్ణుకథా సంకీర్తనకు యోగీంద్రులే పారవశ్యమున మునుగుదురని భాగవతమున గలదు. ప్రతివాని వెన్నెముక యను వీణపై నారదుడు లోనుండి 'ఓం' కార నాదముగా విష్ణుని కీర్తించుచునే యుండును. వినుటకు సిద్ధమైన అన్నమయ్య వంటివానికి వినపడును. ప్రహ్లాదుడు అసుర బాలురకు విష్ణుకథలను బోధించెను. అంబరీషాది రాజర్షులు ప్రజలకు వీని నందించుటకు గాయక బృందముల నేర్పాటు చేసిరి. స్వయముగా శ్రీరాముడే కుశలవులు గానము చేయుచున్న తన కథను తన సభలో ఎల్లరకు విన్పింపజేసెను. సాక్షాత్తు శ్రీకృష్ణుడే ఆసేతుహిమాచలము రామకథా సంకీర్తనములను, ప్రవచనములను ఉద్ధవుని ద్వారమున ఏర్పాటు చేయించెను. విష్ణుకథలు కలికల్మష హరములు గదా. కామక్రోధములను, దుఃఖమును, అభిప్రాయ భేదములను తొలగించి శ్రోతలలో ఏకత్వమును నెలకొల్పుటకై నారదాదులు సామలుగా విష్ణుకథలను పాడిరి. ఇచట అన్నమయ్య 'నాదించెను' అని ప్రయోగించెను. అనగా విష్ణుకథలను ఊరక ప్రవచించుట చాలదనియు, వానిని గానము చేయవలె ననియు అతడు సూచించుచున్నాడు. సాహిత్య మెంత విశిష్టమయినదైనను, నాద మాధుర్యముతో గూడనిది పరిసరములను ప్రభావితములు గావింపగలది గాదని నారదుడే వ్యాసున కుపదేశించెను. ఇదియే భాగవతము పుట్టుట కారంభము. ఇట్లు విష్ణుకథా సాహిత్యము, సంగీతముతో కలిసి పాడబడినప్పుడు దానిని సంకీర్తనమందురు. అదియే అన్నమయ్య అనుసరించిన దివ్యపథము.

2వ చరణము యొక్క తాత్పర్యము

"విడిచిపెట్టకుండ వేదవ్యాసులు పలికినది విష్ణుకథనే. ఇది పవిత్రమైనదిగా తెలియ బడినది. వెదకిన చోటనే విష్ణుకథ సంకీర్తనగా నిలయమయినది."

వ్యాఖ్య

వేదవ్యాసుడు 18 పురాణములను, మహాభారతమును రచించియు తనలోని శ్రీహరి సంతృప్తిచెందలేదని గమనించెను. ఈ రచనలన్నిటిలో ఎంతయో విజ్ఞానము, బ్రహ్మవిద్య త్రవ్విపోసెను. కాని ధర్మమును, విజ్ఞానమును బోధించెనే గాని విష్ణు గుణలీలా కీర్తనము పూర్తిగా చేయలేదు. భారతము నందును శ్రీకృష్ణుడు ఒక పాత్రయే గాని నాయకుడగు ప్రధాన పాత్ర గాడు. భగవదనుభూతి ఎట్లు గల్గునో చెప్పునవి వేదోపనిషత్తులు, పురాణేతిహాసములు. దానిని గూర్చి చెప్పునవి కాని భగవదనుభూతిని సూటిగా నిచ్చునవి గావు. భగవంతుని గుణములను, లీలలను, వైభవమున సామ మార్గమున గానము చేసినపుడే సూటిగా అనుభూతి కల్గునని నారదుడు వ్యాసునకు బోధించెను. సత్యపాలనము, భూతదయ, పితృవాక్య పరిపాలనము, ఏకపత్నీవ్రతము, పాతివ్రత్యము, త్యాగము, అహింస మొదలగునవి ధర్మములు. కాని ఈ ధర్మములను తమ జీవితములందు పాటించిన వారియందు అవి గుణములగును. ఇవి తృప్తి నిచ్చును. ఉదాహరణకు సత్యమును పాలించుము అను ధర్మమును చెప్పుటకన్న, హరిశ్చంద్రుని కథ జనులను ఆకర్షించును. భూతదయ, త్యాగములను గూర్చి చెప్పుటకన్న శిబి, దధీచి మున్నగు మహాత్ముల కథలు రమణీయములు. పితృవాక్య పరిపాలనాది సమస్త ధర్మములు రాము డాచరింపగా అవి గుణములయినవి. ఈ ధర్మముల

బోధకన్న సీతారాముల కథ ఆకర్షించును. ఇపుడు సమస్త సద్గుణములు విష్ణునందు నెలకొనియున్నవి. స్వామి నుండియే ఎంతటి సజ్జనునకైనను సద్గుణములు సంక్రమించును. కావున విష్ణుని కథలను, రామకృష్ణాది దివ్యావతారమూర్తుల గాథలను, సృష్టి జరిగిన క్రమము గూడ విష్ణులీలగను, ప్రహ్లాద నారద ధ్రువాంబరీష గోపికాదులగు భక్తుల కథలను వారి సద్గుణముల చుట్టు పేర్చి నాదమాధుర్యముతో గూర్చి కీర్తించుమని నారదుడు వ్యాసునకు ఉపదేశించెను. భక్తుల చరిత్రలు, సజ్జనుల జీవిత సన్నివేశములు గూడ విష్ణుకథలే. ఇట్టి విష్ణుకథల కూర్పే భాగవతము. భాగవతము పాడుటకును, చదువుటకును తీయగా నుండును. కావున అన్నమయ్య వ్యాసుని రచనలన్నిటిని ప్రస్తావించినను, ముఖ్యముగా నిచట ముచ్చటించినది భాగవతమును గూర్చియే. ఇందలి విష్ణుకథలు పామరజనులకు విజ్ఞాన భారమును కల్గింపక సూటిగా దివ్యానందానుభూతి నొసంగును. పామరజనుల హృదయములలో ఆత్మగా నున్న విష్ణువు, వ్యాసుని భాగవత రచనకు ఆనందించెను. ఇట్టి గ్రంథము సృష్టిలో ఇంతవరకు రాలేదు. వేదములు జ్ఞానభాండాగారములు. భాగవతము రససాగరము. శ్రోత, పఠితల కన్న ముందుగా కవి తన రచనలో ఆనందింపవలెను గదా. ఇట్లు వేదవ్యాసుడు ఏమాత్రము విరామము లేకుండ విష్ణుకథను భాగవతముగా పలికెను. అనగా భాగవతమున విష్ణుని సంకీర్తనము లేని కథ గాని, సన్నివేశములు గాని లేవు. ఎన్ని కథలున్నను అన్నియు విష్ణుని లీలలే గావున ఒకే విష్ణుకథ ఇందున్నది. భాగవతమున దాగిన రసానుభూతి అంతగా లేకున్నను 'విష్ణుపురాణము' నందు గూడ విష్ణుకథయే ఉన్నది. సృష్టి క్రమమునే విష్ణుని కథగా పరాశరమహర్షి దర్శించి ఈ పురాణమును రచించెను. ఇతడు వేదవ్యాసుని తండ్రి. ఇతని యితర శిష్యులే మైత్రేయుడు, సాందీపని. 'వేదవ్యాసుడు' అను పదమును అన్నమయ్య అర్థవంతముగా ప్రయోగించెను. వేదములను వ్యాసము అనగా వివరించి కూర్పు చేసిన మహాను భావుడే తృప్తిచెందక విష్ణుకథగా భాగవతము రచించి తృప్తుడయ్యెనని అన్నమయ్య భావము. భాగవతమున ఎన్నో కథలున్నను అన్నియు శ్రీకృష్ణుని వద్దకు చేర్చునవే. కృష్ణుడు భాగవత వృత్తమునకు కేంద్రము. కృష్ణుడే భాగవత నాయకుడు. భాగవత మార్గమున సంగీతము, సాహిత్యము రసవంతముగ గూర్చబడినవి. భారతాదులలో ఇట్టి పొందిక లేదు. మిగిలిన కావ్యములు బ్రహ్మానందమును బోలిన రసానందమును ఇచ్చును. విష్ణుకథతో గూడిన భాగవతము బ్రహ్మానందమునే ఇచ్చును. శ్రద్ధతో దీనిని పాడువారు, వినువారు పవిత్రముగా జీవింపకుండ ఉండజాలరు. వారి జీవితము కూడ భాగవతము గాక మానదు. వారును విష్ణు వగుదురు. వ్యాసుడు రచించెను గాని పలుకుట యేమి? అను శంక కలుగవచ్చును. వ్యాసుడు తన కుమారుడగు శుకునకు దీనిని విన్పించెను. శుకుడు ఋషులు, ప్రజల సభలో పాడి విన్పించెను. పరీక్షిత్తు దీనిని ఏడు దినములపాటు విని ముక్తుడయ్యెను. సాహిత్యము యొక్క ప్రయోజనము సమాజ శ్రేయస్సు. కాని సమాజమునకు తాత్కాలికమైనది గాని, పాక్షికమైనది గాని యగు సందేశము నిచ్చు పాటలను విన్నను, నాటకములను చూచినను తాత్కాలికానందము, పాక్షిక స్ఫూర్తి కలుగును. కాని విష్ణుకథను పాడుట వలన, వినుట వలన అఖండమైన శాశ్వతానందము, జీవితమునకు వలయు సమగ్ర స్ఫూర్తి కలుగును. ఆనందము యొక్క రుచి మరగినవాడు దానిని విడువలేడు గదా. ఆనందము శాశ్వతము గావలెనన్నచో విష్ణువు యొక్క సద్గుణములు మనకును అలవడక తప్పదు. విష్ణువు

సర్వాత్మ. కావున స్వామి ప్రేమకు వివక్ష, పరిమితి లేవు. విష్ణుకథ పాడుట, వినుట వలన మనకును ఈ ప్రేమ అబ్బి పావనుల మగుదుము. కావున ఎల్లరిని పావనులనుగా చేయునది యని విష్ణుకథకు ప్రసిద్ధి గలిగినది. ఇట్లు ప్రతి పదమును సార్థకముగ అన్నమయ్య వాడెను. విష్ణుకథా గానము, శ్రవణము వలన అన్నమయ్యయు పావనుడైనాడు. తన గురువు వద్ద విని, జనుల కందించెను. తనకు పవిత్రతకు కారణమును విష్ణుకథగా అతడు తెలుపుచున్నాడు.

వేదములలో, సంధ్యాదులలో, నారదాదుల గానములో, వ్యాసుని రచనలలో – ఒకటేమిటి ఎచట వెదకిన అచటనే విష్ణుకథ యున్నది. ఎట్లున్నది? సంకీర్తన అను రూపము తన నిలయముగా నున్నది. విష్ణు వంతట నున్నాడు. బంగారము నగ లన్నిటిలో నున్నది. అట్లే విష్ణుడు అంతట, అందరిలో నున్నాడు. ఎవరిలోని మంచి యైనను విష్ణుకథయే. ఎట్టి ప్రవర్తనము అయినను విష్ణుని వైభవమే. కెరటముల ఎట్టి గమనమయినను సాగరము యొక్క క్రీడయే గదా. కావున ఎచటనయినను విష్ణుకథ ఉన్నది. మనము వెదకిన లభించును. సూర్యరశ్మి యున్నను తలుపులు తెరవవలెను గదా. దైవము అంతట ఉన్నాడు. కాని వానియందు మేల్కొన్నవానికి దైవానుభూతి గలుగును. మేలుకొనని వానికిని దేవుడున్నాడు గాని, ఆ యనుభూతి దక్కదు. ఉదాహరణకు తేలు నిద్రించువాని శరీరముపై ప్రాకుచున్నను, అది యున్నను అతనికి దాని యునికి అనుభవమునకు రాదు గదా. కావున వెదకవలెనని అన్నమయ్య ఉద్బోధ. అనగా విష్ణుని యంతర్యామిత్వమునందు మేల్కొనుడని అతని యావేదన. అపుడు ఎచటనయినను విష్ణువే కానవచ్చును. ఎవరి జీవితమయినను విష్ణుకథగానే అన్పించును. విష్ణుకథ వెదకినచోట ఏ రూపమున నున్నది? సంకీర్తనయే తన రూపముగా, నిలయముగా నెలకొనియున్నది. వేదరూపమునను, సంధ్యాది పూజల రూపమునను, నారదాదుల గాన రూపమునను, వ్యాసుని భాగవత రూపమునను గల విష్ణుకథ సంకీర్తన రూపము దాల్చినది. సంకీర్తనము విష్ణుకథలకు నిలయము. పై అన్నిటికన్న సంకీర్తనము తేలికగా పాడువారికి, వినువారికి విష్ణువు యొక్క అనుభూతిని ప్రసాదించును. భక్తిశ్రద్ధలతో చేయబడు సంకీర్తన సందర్భమున విష్ణువు గాక, గాయకునకు, శ్రోతకును వేరు గానరాదు. ముందు, వెనుకల, ప్రక్కల, లోపల, వెలుపల స్వామి జ్యోతిగా దర్శనమిచ్చుటతో ఆనందమున మునుగుట జరుగును. సంకీర్తనమైపోయిన పిమ్మట కూడ అది శ్రోతలను ఆకర్షించుచు అలరించుచునే యుండును. గుండె చెవులకు నిరతము వినపడుచునే యుండును. ఇక ఇతడు తప్పు చేయలేడు. పరమపవిత్రుడగును. బ్రతుకంతయు సంకీర్తనయై, ఆనందముగా సాగిపోవునని అన్నమయ్య తెలుపుచున్నాడు. వేదము చదివినను, పూజలు చేసినను సాగని భగవదనుభూతి సంకీర్తన సందర్భమునను, అయిన తర్వాతను గూడ కొనసాగి తీరును. ఇది సంకీర్తన యొక్క విశిష్టత. సంకీర్తన యనగా మంచివారిలో మంచివాడైన విష్ణుని కీర్తించుట, విష్ణుని గూర్చి మంచిగా – అనగా భక్తిశ్రద్ధలతో, సమర్పణతో కీర్తించుట. మరియు ఎల్లరి మంచి యనగా మేలు కొరకు విష్ణుని కీర్తించుట. మొత్తముమీద విష్ణుని గూర్చి భక్తిశ్రద్ధలతో జనుల హితము కొరకై కీర్తించుటను 'సంకీర్తన' యందురు. అన్నమయ్య తన సంకీర్తనలన్నియు విష్ణుకథామృత స్రవంతులని ఇచట పరోక్షముగా పేర్కొనెను. సమాజ పరిస్థితులను గూర్చి, సమాజ హితమును గూర్చి, విశ్వమానవైక్యమును గూర్చిన అతని సంకీర్తనలు గూడ

విష్ణుకథలేనా యని కొందరికి సందేహము కలుగవచ్చును. అన్నమయ్య దృష్టిలో సమాజమునకును, విష్ణునకును భేదము లేదు. భాగవతమున నారదుడు వ్యాసున కొసగిన మొదటి యుపదేశము విశ్వమే విష్ణుడని. విష్ణు సహస్రనామ స్తోత్రమున మొదటనే 'విశ్వం విష్ణుః' అని గలదు. అనగా విశ్వము విష్ణుడే. అందలి అంతర్యామి విష్ణువే. కావున అన్నమయ్య వర్ణించిన సమాజ పరిస్థితులు, సమాజ హితము విష్ణు సేవయే. వానికి సంబంధించిన కీర్తనలును విష్ణు కథలే. పరిస్థితులలోను, జీవుల చేష్టలలోను వెదకినచో విష్ణువే దర్శనమిచ్చును.

3వ చరణము యొక్క తాత్పర్యము

"గోపకాంతులు మజ్జిగలను తమ ప్రయత్నముతో చిలుకగా, విష్ణుకథయే ప్రవహించినది. ఇదిగో, ఇదిగో ఈ విష్ణుకథయే శ్రీవేంకటేశ్వరుని నామమును వ్యాపింప జేసినది."

వ్యాఖ్య

గోకులమున గోపికలు మజ్జిగలను ప్రయత్నించి చిలుకుచున్నారు. అపుడు విష్ణు కథలు పాడుకొనుచుండిరి. వారికి కృష్ణుని లీలలు విష్ణుకథలు. కృష్ణు డిట్లు నవ్వెను. ఇట్లు పాలు త్రాగెను. ఇట్లు వెన్న దొంగిలించెను. ఇట్లు గోపబాలురకు వెన్నను పంచి పెట్టెను. ఇతని పాదము లిట్లుండును. ఇతని యాకర్షణ చాల మధురమైనది. ఇట్లు మద్దిచెట్లను గూల్చెను. ఇట్లు కాళియుని మర్దించెను. ఇట్లు కొండ నెత్తెను. ఇట్లు వారిలో వారు మాటలాడుకొనుచు, పాటలు పాడుకొనుచు చల్లలు చిలుకసాగిరి. కృష్ణలీలామృతమే ప్రవహించెను. గోపికల యెదలందు ప్రవహించుటే గాక, వారు చిలుకు చల్లలందును ప్రవహించెను. చల్లలను పదము చల్లని తెనుగు పలుకుబడి. అన్నమయ్యది చల్లని యెద. గోపికల యెదలు అంతియే. కృష్ణుని కరుణ, ఆతని లీలలు చల్లనివే. కావున గోపికలు చిలుకుచున్న మజ్జిగను అన్నమయ్య 'చల్ల' యనెను. గోపిక లెల్లరు ఒకేసారి చల్లలు చిలుకుచు, కలిసి కృష్ణ కథలు పాడుకొనుచు, ఆడుకొను చున్నారు. చల్లలు చిలుకగా వచ్చునది వెన్న. ఇచట కృష్ణ కథలు ఆనందరసముగా ప్రవహించి చల్లలో కలిసిపోయెను. ఇపుడు వెలువడు వెన్న నవనీతము – అనగా ఎప్పటికప్పుడు క్రొత్తగా తీసికొనిరాబడు దివ్యానుభూతి. చల్లలు ప్రేమతో నిండిన గోపికల హృదయములు. వెన్న ఆనందము. ప్రేమతోడి చల్లని యెదలలోనే ఆనందము నిండునని అన్నమయ్య తాత్పర్యము. పూర్వజన్మలో తానును ఒక గోపికయై ఇట్టి అనుభూతి పొందలేక పోయితినను వెలితి అన్నమయ్యలో గలదనిపించుచున్నది. ఈ జన్మలో సంకీర్తనతో చల్ల చిలుకు దృశ్యమును గానము చేయుచుండగా తానును ఒక గోపికయై వారితో కలసి విష్ణుకథలు పాడుచున్న అనుభూతినందెను. ఇది యతని పాలిట స్వామి యనుగ్రహము. నారదుడు భక్తిసూత్రములలో పరమప్రేమ రూపమగు భక్తికి ఉదాహరణములుగా వ్రజగోపికలను పేర్కొనెను. వ్రజగోపికలు కృష్ణుని నుండి ఏమియు గోరలేదు. మోక్షమును గూడ కోరలేదు. అతని యొంటిపై దుమ్ము దులిపి, స్నానము చేయించి, జుట్టు దువ్వి, శిరముపై నెమలిపింఛము నమర్చి, వెన్న పెట్టి అతడు తినుచుండగా ఆనందించుటే చేసిరి. ఇతర బాలురను గూడ కృష్ణునిగనే సేవించిరి. ఆతనికి ఆత్మార్పణమైరి. వారిది బృంద జీవితము.

కృష్ణకథాసుధ వారు చిలుకు చల్లలలో ప్రవేశించి ప్రవహించినదను వర్ణనము అన్నమయ్య యొక్క అద్భుతానుభూతికి దర్పణము. వ్యాసుడో, శుకుడో ఇట్టి వర్ణన చేయగలుగును. అన్నమయ్య చాల గ్రామములందు తల్లులచే ఇట్లు చల్లలు చిలికించుచు, విష్ణుకథలను పాడించి, ఆ కథాసుధా రసమును తాను గ్రోలుచు, వారిచే గ్రోలింపజేసెను. ఈ పాదము అతని ప్రత్యక్షానుభూతి. మనము కూడ మనము చేయవలసిన పనులు చేయుచునే, విష్ణుకథా గానము చేయవలెననియు, అపుడు శ్రమయుండక నిత్యానందోత్సాహములు వెల్లివిరిసి అందు మనము ఓలలాడ గలమనియు అన్నమయ్య యుపదేశము.

భాగవతమున భక్తుల వరుసలో శిరోరత్నములుగ స్తుతింపబడినవారు గోపికలు. ఉద్ధవుడు బృందావనమునకు వచ్చినపుడు గాంచిన దృశ్యమిదియే. గోపికలు చల్లలను చిలుకుచుండగా, విష్ణుకథలు వారి యెదలలో, పలుకులలో వెల్లివిరిసినవి. వీరు ప్రయత్నించి చిలుకుచున్నారనగా దేవుని కథలను పాడుట, చల్లలు చిలుకుట కలిపి సాగింప శ్రద్ధ చూపుచున్నారని యర్థము. కృష్ణుడు భౌతికముగ బృందావనమును వీడినను, గోపికలకు అతని ఎడబాటు లేదనియు, అతడచ్చటనే పూర్వము వలెనే యుండి, వారి కానందము కల్గించుచున్నాడనియు ఉద్ధవునకు దర్శనమయ్యెను. శ్రీకృష్ణుని విశ్వరూపము కనులార అతడు గాంచి, గోపికల పాదములకు శిరసా మ్రొక్కెను. ఈ దృశ్యము అన్నమయ్య కండ్లలో పడి ఈ సంకీర్తనలో సుధను ఒలికినది. గొప్ప జ్ఞాని యగు ఉద్ధవుడు చదువురాని అమాయికల పాదములకు మ్రొక్కి వారిని స్తుతించెను. అన్నమయ్యయు అదే మార్గమును పట్టెను. విష్ణుని గనలేని జ్ఞానము కన్న, కనగలుగు అజ్ఞానమే చాలు గదా. విష్ణుకథయే శ్రీవేంకటేశ్వరుని నామముగా వ్యాపించినది. ఇల్లిదె యనుటలో అన్నమయ్యకు ఈ యంశము ప్రత్యక్షముగా అనుభవములోనికి వచ్చినదనమాట. విష్ణుని సమగ్ర కథ అంతయు శ్రీవేంకటేశ్వరుని నామములోనే ఇమిడియున్నది. అన్నమయ్యకు శ్రీవేంకటేశ నామ సంకీర్తనమున ఈ యంశము తెలియవచ్చినది. విష్ణుకథ యనగా సర్వాంతర్యామి వైభవమే గదా. శ్రీవేంకటేశ్వరుని నామమును భక్తితో జపించగా, జగత్తు యొక్క నడక ఎల్లయు, జీవుల వర్తన ఎల్లను అంతర్యామి వైభవముగా అన్నమయ్యకు పొడకట్టినది. అతని యనుచరులై, అతనితో గలిసి శ్రీవేంకటేశు నామము చేసిన వారెల్లరికిని ఇట్లే పొడ సూపినది. భక్తితో వేంకటేశు నామము చేయుచుండగా విష్ణుకథలగు రామాయణ భాగవతములు అన్నమయ్య ఎదుట తమను తాము సాక్షాత్కరించుకొన్నవి. కావున శ్రీరామకృష్ణులను గూర్చి, నరసింహుని గూర్చి ఇతడు వారి చరిత్రలలో దాగిన గూఢాంశములను మనోజ్ఞముగా గానము చేసెను. ఇతడు ఎన్నియో క్షేత్రములను దర్శించెను. అహోబిలములో విద్యాభ్యాసము గావించెను. తన యాత్రలో యాదగిరిగుట్ట, పూరీ జగన్నాథము గూడ దర్శించెను. ఎచట ఏ దేవతామూర్తిని గాంచినను ఇతనికి వేంకటేశ్వరుడే ఆ మూర్తిగా ప్రత్యక్షమాయెను. కావుననే ఏ సంకీర్తనమున అయినను చివరలో శ్రీవేంకటేశుని ప్రస్తావించక విడిచిపెట్టలేదు. ఇష్టదైవముగా వేంకటేశ్వరుని సంభావించెను. కాని ఒక్క వేంకటేశ్వరుడే దేవుడనుకొన లేదు. ఆ స్వామి ఒక రూపమునకే పరిమితుడుగా గాక సర్వ రూపములను దాల్చిన వెలుగుగా అన్నమయ్యకు అనుభూతి కల్గెను. ఈ మార్గమే మనకును ఆదర్శము. ఈవిధముగ అన్నమయ్య తనకు తెలిసినది, తాననుకొన్నది గాక, తనకు తెలియ వచ్చినది, అనుభూతికి వచ్చిన దానినే సంకీర్తనలో పొదిగెను. వాస్తవమునకదియే పొదిగినది.

* * *

47

15వ సం-142

వేఱొక్కరూ లేరు

వేఱొక్కరూ లేరు విశ్వమింతా నీ మహిమే
యేరీతి నీవే కలవు ఇతరము లేదు. ॥ పల్లవి ॥

తల్లివై రక్షింతువు తండ్రివై పోషింతువు
ఇల్లాలివై మోహమిత్తువు నాకు
ఒళ్ళై పెరుగుదువు ఒగి బురాకృతమౌను
ఇల్లు ముంగిలైవుందు వింతా నీ మహిమే. ॥ వేఱొక్క ॥

గురుడవై బోధింతువు కొడుకవై యీడేర్తువు
అరుదై నిధానమవౌదు నీవే
దొరవై నన్నేలుదువు దూతవై పని సేతువు
ఇరవైన సిరులిత్తు వింతా నీ మహిమే. ॥ వేఱొక్క ॥

దేవుడవై పూజగొందు దిక్కు ప్రాణమౌదువు
కావలసినట్టౌదు కామించినట్లు
శ్రీవేంకటేశ నీవే చిత్తము లోపల నుండి
ఈవల వైకుంఠమిత్తు వింతా నీ మహిమే. ॥ వేఱొక్క ॥

దైవభీతి వలన దైవాన్ని తెలుసుకొనే బుద్ధి ఎన్నడూ ఉండదు.
దైవభక్తి వలన మాత్రమే తెలుస్తుంది.

టీక

విశ్వము = వైవిధ్యములతోను, మార్పులతోను కూడిన దంతయు; మహిమ = వెలుగు యొక్క విస్తారము; మోహము = ఆకర్షణ, మైమఱపు; ఒగి = లెస్సగా; నిధానము = ఆశ్రయము, నిధి; ఇరవు = స్థిరము; వైకుంఠము = కుంటువడని స్థితి.

పరిచయము

ఈ సంకీర్తనము వేదసారము, గీతాసారము. వేదోపనిషత్తులందు ఋషులు సన్న్యాసులని చెప్పబడలేదు. చాలమంది గృహస్థులని కూడ తెలుపబడినది. వారు విశ్వమునే విష్ణునిగా దర్శించి మురిసిరి. భారత రణ మధ్యమున శ్రీకృష్ణుడు విశ్వము తన రూపముగా అర్జునునకు దివ్యదర్శన మొసంగెను. భీష్ముడు, విష్ణు సహస్ర నామమున 'విశ్వం విష్ణుః' అను మంత్రము నుపదేశించెను. భాగవత ప్రారంభమున నారదుడు వ్యాసునకు విశ్వమే విష్ణువని యుపదేశించెను. విశ్వమున ప్రతి జీవునకు తోటి జీవులతో తల్లి, తండ్రి, భార్య, గురువు, కుమారుడు, దొర, సఖుడు మున్నగు సంబంధములు గలవు. సాధారణముగా రెండు రకములుగా వర్తించు జీవులుందురు. 1. తల్లిదండ్రులు, భార్య, సంతానము, మిత్రులు, సమాజములోని ఇతర జీవులతో సంబంధములు పెట్టుకొని జీవించువారు. వీరు తమకు నచ్చినవారి యందు మిత్ర భావము, నచ్చనివారి యందు శత్రుభావము కలిగియుందురు. తల్లిదండ్రులు, భార్య, పిల్లలు – వీరియందు కూడ తన అభిప్రాయములను వారు అంగీకరించినంత కాలము రాగము, అంగీకరించనప్పుడు వారియందు విముఖ భావము కలిగి యుందురు. ఇట్టివారికి నచ్చిన విషయములు, వ్యక్తులు, వస్తువులు తారసిల్లినపుడు సుఖము, నచ్చనివి లభించినప్పుడు లేదా నచ్చినవి లభించనప్పుడు దుఃఖము కలుగు చుండును. శత్రువులు, మిత్రులు అను భావము, రాగద్వేషములు, సుఖదుఃఖములు, మున్నగు బంధములలో చిక్కుకొందురు. వీరు సంసారజీవులు. 2. మరికొంతమంది సంసార మనగా భార్యాబిడ్డలు, చుట్టములు, ఇల్లు వాకిలి అనుకొని బాధపడుచు, వీరు బంధములను భావించి, వీనినుండి త్రెంచుకొని ఎచ్చటనో మోక్షమను ఆరుబయలునకు పోయి విశ్రాంతి తీసికొనవచ్చునని పొరపడి వ్యర్థములుగా ప్రయత్న ములు చేయుచుందురు. కుటుంబ సభ్యుల నడుమ, సమాజములో నున్నచో బంధములు, వ్యామోహములు పెరుగునని భయపడి దూరముగా పారిపోవుదురు. కర్తవ్యముల నుండి తప్పించుకొన ప్రయత్నింతురు. ఎచటికి పోయినను వీరికిని బంధములు తప్పవు. సమాజమునకు దూరముగా పోయినవానికి కూడ, లేదా సమాజమునకు చేయవలసిన కర్తవ్యములను విస్మరించి నిరంతరము తపోధ్యానాదు లలో గడుపు వారికి కూడ వ్యక్తులు, వారితోడి సంబంధములు మనస్సులోనికి రాక తప్పదు. సుఖ దుఃఖములు పెరుగక తప్పదు. ఇట్టివారిని గూర్చి శ్రీకృష్ణుడు గీతలో 'మిథ్యాచారుల'ని చెప్పెను. (డంబమైన ఆచరణ గలవారు). ఉదాహరణకు ఆకర్షించు అందమైన దృశ్యము కనపడినప్పుడు ఆకర్షణకు లొంగెదనేమో యని భయపడి కనులు మూయువాడు. కనులు మూసినను మనస్సులో ఆ దృశ్యము కనపడుచునే యుండును. ఆ దృశ్యమును కావలయునని చూడరాదు. అదియే కనపడినపుడు దానిని స్వామిగా దర్శింపవలెను. వేదాంతులు తమ

పోషణకై ఇతరులపై ఆధారపడక తప్పదు. అది అధర్మము కదా! ఏమియు పని చేయకుండ, ఇతరులకు వేదాంతము చెప్పెదనని వారినుండి ఆశించువాడు సోమరి యగును గాని, విరాగి ఎట్లగును? తోటి జీవులు కష్టములలో నుండగా, తాము ముక్తి అనుకొన్నదాని కొరకై వీరు తపించుచుందురు. వారనుకొను ముక్తి వారనుకొను అభిప్రాయమే గాని, అసలు ముక్తి గాదు. వీరును సంసారజీవులే. ఈ రెండు పద్ధతుల జీవితము గూడ జీవులను చిక్కులలో పడవేయును. శ్రీకృష్ణుడు బోధించినది ఈ మార్గము కాదు. ఈ రెంటి నడుమ ఉన్నది సత్యమైన బాట. మనస్సే గదా బంధమునకు, ముక్తికి కారణము. సంసారమనగా భార్య, పిల్లలు మున్నగువారు కాదు. వారిని గూర్చిన మన మనస్సు లోని భావములు, రాగద్వేషాదులు. రుమాలులో ఇంగువ కట్టినచో దాని వాసన కొట్టును. కర్పూరముంచినచో దాని వాసన కొట్టును. ఏ పదార్థముంచిన దాని వాసన కొట్టును. నిప్పును మూటగట్టినచో నిప్పు వాసన అంటదు. రుమాలు నిప్పు లోనికి మాయమగును. మనస్సున ఎవరిని గూర్చి ఎట్లు భావించినచో, మనస్సు ఆ భావమే అగును. కాని విశ్వాంతర్యామియైన విష్ణుని భావించినచో, తన ఉనికినే కోల్పోవును. ఇదియే ముక్తి. అనగా తనచే భావింపబడుచున్న వ్యక్తులు, విషయములు, వస్తువులు, భావించుచున్న తన మనస్సు గూడ ఎవరిచే తయారుచేయబడుట జరిగినదో, అతడే విష్ణువు కావున, విష్ణుని భావించి సేవించినచో మనస్సు స్థానమున విష్ణువే ఉండును. ఇదియే బ్రహ్మానంద స్థితి. ఈ స్థితికి విఘ్నములు పరిసరములు గాని, పరిసర వ్యక్తులు గాని కావు. వారియెడల మనకున్న రాగద్వేషాదులతో కూడిన బంధములు. కావున చేయవలసినది కుటుంబము నుండి, సమాజము నుండి, పరిసరముల నుండి పారిపోవుటయు గాదు. వారితో వ్యవహరించుచు మనస్సున వారియెడల భావము లంటుకొనుటయు కాదు. వారియెడల దృక్పథము మారవలెను. అంతియే. తల్లిదండ్రులు, భార్య, కుమారుడు, గురువు, మిత్రులు, తోటివారు – వీరిని వీరిగా చూడక, విష్ణువుగా దర్శించుట కావలసిన దృక్పథము. వారియెడల చేయవలసిన కర్తవ్యములే దేవునికి అర్చనము. కుటుంబము, సమాజము నడుమనే యుండి దీనిని చేయనగును. తన రూపమున కూడ విష్ణువే ఈ పనుల నాచరించు చున్నాడు. కుటుంబము రూపమున, సమాజము రూపమున అంతర్యామి యగు విష్ణువే అర్చనమందుకొనుచున్నాడు. అర్చనము కూడ విష్ణువే. మొదట సాధన దశలో తాను విష్ణువునకు పరికరముగా నుండును. ఉదాహరణకు రచయిత చేతిలో కలము పరికరము మాత్రమే కదా. సిద్ధి దశలో తానుండడు, విష్ణువే ఉండును. ఇట్లు విశ్వమునే విష్ణువుగా భావించి సేవించుటనే శ్రీకృష్ణుడు గీతలో బోధించిన భక్తితో కూడిన కర్మయోగము. ఉపనిషత్తులు కూడ ఇట్టి కర్మయోగమునే బోధించెను గాని కర్మలను విడిచిపెట్టుటను గాదు. కుటుంబమును, సమాజమును విడువరాదు. వారియందు సంగమును – మనస్సు అంటుకొనుటను విడువవలెను. ఇది ఎట్లు లభించును? తాను విడువలేదు. సంగము తనను విడువవలెను. ఇది ఎట్లు? సంగము కుటుంబము రూపములో, సమాజములోనున్న అంతర్యామి యందుంచినచో ఆయా వివిధ రూపములందు విడివిడిగానున్న సంగము దానంతట అదియే మనలను విడుచును. ఉదాహరణకు యౌవనమున భార్యను తాకినపుడు ఒకవిధమైన సంతోషము కలుగును. సంతతి

నెత్తుకొన్నప్పుడు వేరొక విధమైన సంతోషము కలుగును. ఇవి లభించనపుడు సంతోషము వైదొలగును. అట్లుగాక భార్య, సంతతి, సమస్తము విష్ణుమయమని దర్శించినపుడు కలుగు దివ్యానుభూతి స్థిరముగా నుండును. దానికి విరామముండదు. అన్నమయ్య కూడ వేదర్షి వలె, శ్రీకృష్ణుని వలె, గీతను రచించిన వ్యాసుని వలె జీవనసారమును పిండి ఈ సంకీర్తనలో మన కనుగ్రహించెను. తాను సర్వమును విష్ణువుగా అర్చించి, అనుభూతినంది మనకు బోధించెను. ఆచరణ, అనుభవము లేనివారి వాక్యములు తేలికగా, సూటిగా ఉండక, పాండిత్యపు మెఱుగుతో కప్పబడి తికమక పెట్టును. అన్నమయ్య మహాభక్తుడు గావున విశ్వమును విష్ణువుగా దర్శించిన పరవశతానుభూతిలో ఈ సంకీర్తన అదియే వెలువడినది. దీనిని అన్నమయ్య రచించెననుట దుస్సాహసము. అతడు అంతర్యామి అనుభూతిలో మునిగియుండగా, ఆ అనుభూతియే ఈ సంకీర్తనలో ఒదిగినమేర ఒదిగినది. సంకీర్తనము విశ్వరూపుడైన విష్ణుని గూర్చి. సంకీర్తనము గావించినది కూడ విష్ణుడే. సంకీర్తనమును స్వామియే.

పల్లవి యొక్క తాత్పర్యము

"విశ్వమింతయు నీయొక్క విస్తారమైన రూపమే. నీ వెలుగే ఇంతయు. నీవుగాక వేఱెవరు లేరు. ఏవిధముగనైనను నీవే ఉన్నావు. ఇతరము లేదు."

వ్యాఖ్య

విశ్వమనగా సమస్తమని అర్థము. సామాన్యముగా జగత్తని భావించుచుందురు. కాని అసలర్థము సమస్తమని. సమస్తమనగా అంతయు. కావున అంత, అంత అని అన్నమయ్య వాడియుండుట పొసగదు. అంతయు, ఇంతయు – అనగా 'ఈ అంతయును' అని అర్థము 'ఈ' అనగా మన ఊహకందునది, అందనిది కూడ కలిసి. సృష్టిలో ఇతడు, ఈమె అనబడువారు, ఇది అనబడునవి కలిసినదంతయు విష్ణుని మహిమయే. అంతియేగాక, 'ఇంత' అను పదమును ప్రయోగించుటలో విశ్వమును విష్ణుని రూపముగా తాను పొందిన అనుభూతిని సూటిగా, దృఢముగా చెప్పుట కలదు. తనది భావము మాత్రమే కాదు, పండిన అనుభూతి అనియు సూచింపబడుచున్నది. 'విశ్వమింత' అని అనవచ్చును. 'ఇదంతా నీ మహిమే' అనవచ్చును. 'ఈ సమస్తము నీ మహిమ' అని మొదటిదాని కర్థము. 'అంతయు ఇంతగా నీ మహిమ' అని మహిమను వక్కాణించుట రెండవ యర్థము. విశ్వమనగా వివిధములైన వానితో కూడినదనియు, మార్పులు కలది యనియు వేఱొక అర్థము – వేదములో కలదు. ఆభరణములకు మార్పులుండును. ఆభరణములలో రకములుండును. కాని ఆభరణములు దేనితో చేయబడినవో అట్టి బంగారములో రకములుండవు. మార్పులుండవు. చొక్కాలు, చీరలు మున్నగు వస్త్రములలో రకము లుండవచ్చును. ఇవి కొంతకాలమునకు వన్నె తగ్గవచ్చును, మసి పట్టవచ్చును, చినిగిపోవచ్చును, శిథిలము గావచ్చును. ఇట్టి మార్పులనేకము పొందవచ్చును. కాని ఈ వస్త్రములన్నియు దేనితో చేయబడినవో అట్టి ప్రత్తిలో రకరకములుండవు, మార్పులుండవు. అట్లే విశ్వములోని వస్తువులలో, విషయములలో రకరకము లుండవచ్చును, మార్పులు

కూడ ఉండును. ఇందలి జీవుల దేహములు, ప్రకృతి సంపదలు, సౌరకుటుంబములు మార్పునకు లోనగును. పుట్టును, పెరుగును, తిరిగి చోటులోనికి లీనమగును. వీని ఆకారములలో, ప్రక్రియలలో తేడాలుండవచ్చును. కాని విష్ణుడొకడే విశ్వమున అంతర్యామి. అతనికి మార్పు లేదు. మొదలు, మధ్యము, చివఱ లేవు. మహిమ యనగా ఇచట గొప్పతనమని అర్థము కాదు. వెలుగు యొక్క విస్తారమని వేదార్థము. విత్తనము చెట్టుగా నగుట అనునది ఒక విస్తారము. విశ్వమను చెట్టుకు మూలము విష్ణుడను వెలుగే. బంగారమే వివిధ రూపములలో నగలుగా విస్తరించును. అట్లే విష్ణువు నామ రూపములు లేనివాడయ్యును వివిధ నామములు, వివిధ రూపములుగా గల విశ్వముగా నయ్యెను. ఉత్తర ధ్రువప్రాంతమున గల మహాసముద్రమునందు ముందు భాగమున నీరు అనేకములైన పరిమాణము లలో, ఆకారములలో మంచుగడ్డలుగా కట్టుకొనును. ఈ మంచుగడ్డలన్నియు కలిపి ఒకే సముద్రపు నీటి యొక్క విస్తారము. అట్లే అంతర్యామి చైతన్యము అగు విష్ణుని విస్తారమే ఈ విశ్వము. మన ఊహకందు విశ్వము అంతర్యామి చైతన్యము యొక్క వ్యక్త స్థితి. ఇది విష్ణునిలో నాలుగవ వంతు. మిగిలిన మూడు వంతులు మార్పుకు లోనుకాని, మన ఊహకందని స్థితిలో విష్ణువు నందు కలవని వేదములోని పురుషసూక్తము చెప్పుచున్నది. ఈ నాలుగవ వంతయిన విశ్వము విష్ణుని విస్తారమే. స్థితి మార్పే. మంచుగడ్డలు నీటియొక్క స్థితి మార్పులే గదా! దీనినిబట్టియే విశ్వము విష్ణుమయమని చెప్పబడినది. " 'నా'కంటె వేఱు లేదు. నాయందే ఈ సమస్తము దారమునందు పూలవలె గ్రుచ్చబడినద"ని కృష్ణుడు గీతలో చెప్పెను. " 'నా'యందు జీవులున్నారు. 'నా'యందు వారుండుట వలన వారియందు నేనుండుట జరుగుచున్నది" అనియు చెప్పెను. మట్టితో చేయబడిన కుండలు మట్టియందున్నట్లు లెక్క. కావున కుండల యందు మట్టి కలదు. ఇట్లు విశ్వములోని జీవులయందు విష్ణుడున్నాడు. మట్టి కాని కుండ లేదు. అట్లే విష్ణువు కానిది వేఱెవరును లేరు. ఏరీతిగనైనను అఖండ చైతన్యమైన స్వామియే ఉన్నాడు. స్వామికన్న వేఱు లేదు. స్వామియే బ్రహ్మగా, రుద్రుడుగా, ఇంద్రాది దేవతా ప్రజ్ఞలుగా, చోటులోని ప్రజ్ఞగా, కాలముగా, ప్రకృతిగా, పంచభూతములుగా, వాని లక్షణములుగా, సమస్త తారకాగ్రహగోళాదులుగా, భూమిగా, భూమిపై గల నదీ సాగర పర్వతారణ్యములుగా, ఖనిజములుగా, వృక్షములుగా, పక్షులుగా, జంతువులుగా, నరులుగా, నరుని యందలి శరీరము, ఇంద్రియములు, ప్రాణము, మనస్సు, బుద్ధిగా, ఆత్మయగు అంతర్యామిగా నెలకొనియున్నాడు. ఇదియే ఏరీతిగనైనను స్వామియే ఉండుట అని అన్నమయ్య వర్ణించెను. జీవులలో స్వభావముల తేడా ఎంత ఉన్నను జీవులెల్లరు స్వామి రూపులే. స్వామిగాక ఇతరము లేదు, ఇతరుడు లేడు. జీవులను గాక వారి రూపములలో విష్ణుని చూచి సేవించుటే విష్ణూపాసనము. జీవుల స్వభావములు, చేష్టలు, మాటల రూపమున నున్న స్వామిని చూచి ప్రేమించుటయే వాసుదేవోపాసనము. వివిధములగు కెరటములను చూడగ, సాగరమును చూచుట వంటిదిది. ఇట్టి రెండు ఉపాసనలు గావించినవాడు అంతర్యామి యగును. ఇదియే నారాయణోపాసనము. ఈ స్థితి బ్రహ్మానందసాగరము. ఈ స్థితిలో కూడ భక్తుడు కుటుంబమును, సమాజమును విడువడు. తాను, వారు, ఎల్లరు స్వామియే అయినప్పుడు స్వామి కంటె వేఱుగా ఇతరులను చూచెదనేమో యను భయముండదు, అట్లు చూచుట ఉండదు. భయపడు వాడు భక్తుడు కాజాలడు.

భక్తుడు అచటనే యుండును. నారదు డిట్లే మాతృసేవ చేయుచు తరించెను. మేడనెక్కిన తరువాత మెట్లను ఎవడు కూల్చి వేయును? అట్లే సిద్ధి వచ్చిన తరువాత గూడ భక్తునిలో సాధన కొనసాగును. 'మహిమ' యను పదము పురుషసూక్తమున వెలుగు యొక్క విస్తారమను అర్థమున వాడబడినది.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"తల్లివై కాపాడెదవు, తండ్రివై పోషించెదవు. భార్యవై నన్నాకర్షించి మైమఱపు కల్పించెదవు. శరీరమై పెరుగుదువు. లెస్సగా పూర్వము చేసిన కర్మ యగుదువు. ఇల్లుగా, ముంగిలిగా నీవే ఉందువు. ఇంతయు నీ మహిమయే."

వ్యాఖ్య

పల్లవిలోని భావమున కనుగుణముగా చరణములలో వివిధ వ్యక్తులను, వస్తువు లను స్వామిగా దర్శించి, తన అనుభవమును జోడించి అన్నమయ్య మనకు ప్రబోధించు చున్నాడు. ఏ జీవుడైనను సూటిగా ఆకాశము నుండి ఊడిపడడు. తల్లిదండ్రులకు జన్మింపక తప్పదు. శ్రీరామ, శ్రీకృష్ణులు గూడ నంతియే. తల్లి తొమ్మిది మాసములు మన శరీరమును భరించును. తన వాత్సల్యమునే స్తన్యముగా మనకిచ్చును. పిల్లల మలమూత్రములను క్షాళనము చేయును. తన కుమారున కెంత వయస్సు వచ్చినను ఆతనికి ఆపద రాకుండ కాపాడ ప్రయత్నించును. తల్లి యొక్క వాత్సల్యమునకు లౌకిక ప్రపంచమున సాటిలేదు. ఈ వాత్సల్యము భగవంతునికి మనమీద నున్న వాత్సల్యమునకు ప్రతిరూపము. తల్లి రూపమున మనలను కాపాడుచున్నది స్వామియే. కావున ఉపనిషత్తులలో 'మాతృదేవో–భవ' అని చెప్పబడినది. అనగా – తల్లి దేవునిగా అయినవాడవుకమ్ము అని అర్థము. తల్లిని దేవునిగా పూజించి, ఆదరించ వలెనని దీని భావము. శ్రీరాముడు తన తల్లులను మువ్వురిని ఇట్లే పూజించెను. భరతునకు తల్లియగు కైకేయి యందు కోపముండెను. రాముడు ఆమెను ఆదరించుమని, దేవునిగా పూజించుమని తమ్మునికి ప్రబోధించెను. భరతుడు హృదయపూర్వకముగా ఆ ప్రబోధమును స్వీకరించిన తరువాతనే రాముడు ఆతనికి తన పాదుకల నిచ్చెను. అనగా తన వెలుగుబాటను ప్రసాదించెను. కైకేయిని కూడ కౌసల్యను వలె గౌరవించి నపుడే నీకు రామ దర్శనము లభించునని ముందుగనే భరతుని భరద్వాజుడు హెచ్చరించెను. శ్రీకృష్ణుడు సృష్టిని తన బొజ్జలో ఇముడ్చుకొన్నవాడు. అట్టివాని బొజ్జ యశోద యొక్క త్రాటిచే కట్టబడినది. మాతృవాత్సల్య ప్రభావమట్టిది. తాను స్వయముగా దేవుడయ్యును శ్రీకృష్ణుడు యశోదను, దేవకిని దేవునిగా సేవించి నట్లు భాగవతమున కలదు. తల్లి సంతానమునకు కావలసినవి ప్రత్యక్షముగా సమకూర్చి రక్షించును. తండ్రి పరోక్షముగా సంతానమునకు కావలసినవన్నియు సమకూర్చి పోషించును. పిల్లల క్షేమమే వీరికి క్షేమము. పిల్లల ఆపద వీరికి ఆపద. పిల్లల సంతోషము వీరికి రెట్టింపు సంతోషము. తనకు సంతతిని ప్రసాదించి, వారిపై తన వాత్సల్యమును కురియు భాగ్యమును కల్పించెనని స్త్రీ భర్తను గూర్చి భావించును. కావుననే తెలుగునాట ఏ స్త్రీయు తన భర్త యని చెప్పదు. మా అబ్బాయి వాళ్ల నాన్న అనియో, మా అమ్మాయి వాళ్ల నాన్న అనియో

చెప్పును. అట్లే పురుషుడును తనకు ప్రతిరూపమగు సంతానమును ప్రసాదించి, వారిని తాను ప్రేమతో పోషించు భాగ్యమును కల్పించినదని భార్యను గౌరవించును. కావుననే నా భార్య అని ఏ పురుషుడును అనడు. మా అబ్బాయి వాళ్ల అమ్మ అనియో, మా అమ్మాయి వాళ్ల అమ్మ అనియో అనును. సంతతి యను పంటకు తండ్రి విత్తనము, తల్లి క్షేత్రము. తన భార్య తన సంతానమును లాలించునపుడు చూచి తండ్రి ఆనందించును. ఇట్లే తల్లియును. ఈ ఆనందమే మోక్షమునకు ప్రథమ సోపానమని వేదము చెప్పుచున్నది. పెళ్లి కాకముందు వధూవరులు, పెళ్లి అయిన తరువాత దంపతులు, పిల్లలు కలిగిన తరువాత తల్లిదండ్రులగుదురు. తల్లిదండ్రుల నడుమ అనురాగమను ముడిని పిల్లలు వేయుదురు. తల్లి రూపమున కాపాడునది, తండ్రి రూపమున పోషించునది దేవుడే యని పిల్లలు భావింపవలెను. శ్రీరాముడు తండ్రి మాటపై అడవికి వెళ్లెను. శ్రీకృష్ణుడు వసుదేవుని పాదములను సేవించెను. తల్లిదండ్రులను స్వామిగా గాక, నరులుగా భావించినచో కొందరికి ఒక వయస్సు వచ్చునప్పటికి వారిపై గాక, వారిచ్చు ఆస్తి, ధనములపై దృష్టి మరలును. తనకు శరీరము నిచ్చి, పెంచి పోషించిన వారినే నిర్లక్ష్యము చేయుట జరుగును. అట్లుగాక వారిని బాల్యము నుండియే భగవంతుడని గుర్తించినచో, వారిపై భక్తిభావము చెక్కుచెదరదు. తల్లిదండ్రుల రూపమున దేవు డున్నాడని తెలియనివాడు ఐహిక జీవితముననే ఓడిపోవును. ఇక ఆతనికి ఆధ్యాత్మికత వట్టి బూటకము. ఉట్టి కెక్కలేని వాడు స్వర్గమున కెక్కలేడు గదా! యక్షునకు ధర్మరాజు తల్లిదండ్రులను గూర్చి ఇట్లు చెప్పెను. “భూమి కంటె గొప్పది తల్లి. ఆకాశము కంటె గొప్పవాడు తండ్రి.” ధర్మవ్యాధుడను కసాయివాడు తన తల్లిదండ్రుల సేవయే దేవుని పూజగా నిర్వర్తించి బ్రహ్మజ్ఞానమును పొంది, కౌశికుడను బ్రాహ్మణునకు బోధించినట్లు భారతమున గలదు. ‘పితృదేవో-భవ, ఆచార్యదేవో-భవ’ యనియు వేదమున గలదు. చంద్ర సూర్యులు మన సౌరకుటుంబమునకు తల్లిదండ్రులు. జగత్తునకు తండ్రి స్వామి. భగవంతుడు సర్వజీవులను సృష్టించి వారికి తండ్రి అయ్యెను. కెరటములకు సముద్రము వలె జీవుల కాతడే తండ్రి. తానే ప్రకృతిలోని పంచ భూతములుగానై, తనునుండియే సర్వజీవులకు దేహము లిచ్చి తల్లి అయ్యెను. అర్జునుడు విశ్వరూపుడైన కృష్ణుని గాంచి ఇట్లు స్తుతించెను. “సకల చరాచరమునకు నీవే తల్లివి, తండ్రివి. నీవే పూజ్యుడవు, నీవే గురుడవు. నీవుగాక ఇతరము లేదు. ఇక నీకు సాటివాడు, అధికు డెవ్వడుండును? అంతయు విస్తరించిన నీ మహిమ సాటిలేనిది.” స్వామియే సూర్యుని ద్వారమున వేడిమిని, వెలుగును, శక్తినిచ్చి తండ్రియై పోషించు చున్నాడు. స్వామియే చంద్రుని ద్వారమున తన వెన్నెలతో ఓషధులను పెంచి, మనకు కావలసిన ఆహారమును సమకూర్చి తల్లిగా రక్షించుచున్నాడు. ‘ఆలు’ అనగా స్త్రీ అనియు, భార్య అనియు అర్థములు కలవు. ఇల్లాలనగా ఇంటికి యజమానురాలైన భార్య అని అర్థము. యజమానురాలనగా పెత్తనము చేయునది కాదు. ఇంటిలోని వారిని-భర్తను, పిల్లలను, అత్తమామలను, అతిథులను ఆదరించున దని అర్థము. కావుననే శ్రీరాముడు సీతను గూర్చి ‘గృహలక్ష్మి’ యని పలికెను. ఈ అర్థముననే తెలుగువారు భార్యను గూర్చి ఇల్లాలని పేర్కొను సంప్రదాయ మేర్పడినది. ‘ఆలు’ అనగా స్త్రీ అనియే కాదు, భార్య అనియే కాదు, లక్ష్మీదేవి వలె శోభ నిచ్చునదని తెలుగువారి భావన. ఈ

అర్థముననే అన్నమయ్య ఇచట 'ఇల్లాల'ను పదమును వాడెను. తనకు భార్య రూపమున కూడ భగవంతుడే దర్శనమిచ్చి, తన్నాకర్షించి తనను మైమరపించుచున్నాడట. ఎంతటి విశాలమైన, ఉదారమైన, ఉదాత్తమైన భావము! తన శరీరము యొక్క అందముతో భార్య భర్త నాకర్షించును గావున ఆమెను బంధ కారణమని కొందరు భావింతురు. బంధము వారి మనస్సులో నున్నది. ఇల్లాలిని గూడ భగవంతునిగా దర్శించి, ఆరాధించిన అన్నమయ్యకు ఆమె కలిగించు ఆకర్షణ కూడ భౌతికమైన కామముగా గాక భగవదాకర్షణగాను, ఆమె దాంపత్య భోగమున కలిగించు మైమఱపు కూడ భౌతికమైనదిగాక, భగవదనుభూతి తోడి మైమఱపుగాను అనుభవము కలిగెను. ఈ భావమే తైత్తిరీయోపనిషత్తులో ఋషి దర్శించెను. సాధారణ సంసారజీవి భార్య కలిగించు కామాకర్షణకు లొంగును. వేదాంతి దానిని గూర్చి భయపడును. భక్తునకు భార్యయు భగవంతుడే, ఆమె కలిగించు ఆకర్షణయు భగవంతుని వైభవమే. అనగా స్వామి వైభవమే. ఈ దృష్టి అన్నమయ్యది. ఇది ఋషి దృష్టి. కావుననే ఇతడు ఇంటిని, ఇల్లాలిని వేదాంతము పేర విడిచిపెట్టలేదు. అట్లని కామాకర్షణయే సర్వస్వముగా దానికి లొంగలేదు. తన హద్దులలో కామమును ఉంచి, గృహస్థాశ్రమ విధి నిర్వహణకై భార్య కోరిక ప్రకారము సంతానమును కలిగించి తీరవలెను. దానిని మించి మనస్సును కామము ప్రాధాన్యము వహింప కుండుట కూడ బ్రహ్మచర్యమే. అట్లే ఒక వయస్సు తర్వాత భార్యాభర్తలు కామ భోగములను పరిత్యజించి, ఆత్మీయ సహచరులుగా మాత్రమే జీవించుచు, గృహస్థాశ్రమ విధులను నిర్వహించుట కూడ బ్రహ్మచర్యమే. కామమునకు లొంగరాదు, దానిని ధర్మపద్ధతిలో సద్వినియోగము గావించుకొని, క్రమముగా దాని కతీతుడు గావలెను. మనస్సు బ్రహ్మయందు చరించుట బ్రహ్మచర్యము. కావున భక్తి అలవడిన కొలదియు కామము తొలగిపోవుట సత్యము. అంతేగాని అణచుకొనుట సత్యమార్గము కాదు. స్వేచ్ఛా కామము వలన ఎంత నష్టమున్నదో, కామము నణచుకొనుట వలన అంత నష్టమున్నది. మానసిక వ్యాధి గాని, శారీరకమైన తీవ్రవ్యాధి గాని కలుగును. వివాహమగు వరకు పూర్తిగా నిష్కామజీవనము, గృహస్థాశ్రమము నందు సంతతి కొఱకై నియమముతో కూడిన కామము, అటుపైన కామముతో ప్రమేయము లేని దాంపత్య సహజీవనము ఋషుల మార్గము. అన్నమయ్య ఈ మార్గము ననుసరించుటే గాక, భార్య కల్పించు ఆకర్షణయందు కూడ భగవంతుని వైభవమును దర్శించి, భగవదనుభూతినే పొందెను. ఇది ఇతని విశిష్టత, భగవదున్మత్తత. భార్య కల్పించు మోహ విషయమున భగవంతుడు, అతని వైభవము గుర్తుకువచ్చి అరకమైన మైమఱపు కలుగుట అసాధారణమైనది. అన్నమయ్య దృష్టిలో శరీరము కూడ స్వామియే. కొందరు ఆత్మను చైతన్యమనియు, శరీరమును జడముగను భావించి, దానిని తుచ్ఛ మందురు. ఇట్టివారు మెట్టవేదాంతులు. వీరు కూడ శరీరమునకు వలయు భోజనాదులు స్వీకరించుట మానరు కదా! సమాజము నెడల కర్తవ్యమును తప్పించుకొనుటకు ఈ మెట్టవేదాంతము వీరికి పనికివచ్చును. అన్నమయ్య వేదాంతి కాదు, అతడు సరియైన జీవన విధానము నవలంబించి, దానినే బోధించెను. ఇతనిది ఆచరణలో, అనుభవ ములో వాస్తవిక దృక్పథము. చేతనమని, జడమని వేఱుగా లేవు. ఇవి స్వామి వెలుగులోని ముక్కలు. చైతన్యము యొక్క స్థితి మార్పే మనము జడమనుకొను భౌతిక పదార్థము. ఇవి రెండును

పరస్పరము స్థితి మార్పు చెందును. ఉదాహరణకు ఒక ఖనిజమునందు పరమాణువులున్నవి. అందు శక్తి యున్నది. దానియందు చైతన్యమున్నది. ఖనిజములలో అది నిద్రించుచున్నది. సజీవ శరీరములలో అది మేల్కొని యున్నది. పరమాణువులతో కూడిన భౌతిక పదార్థము చైతన్యము యొక్క స్థితి మార్పే. ఇట్లే శరీరము కూడ ఆత్మచైతన్యము యొక్క స్థితి మార్పే. కావుననే సంస్కృత భాషలో శరీరమను అర్థమున కూడ 'ఆత్మ' అను పదమును వాడుట కలదు. శరీరము తుచ్ఛమైనచో, దానిని మనకు ఇచ్చిన దేవుడు వెఱ్ఱివాడా? దానిని అంతర్యామి సేవలో సద్వినియోగము చేయుటకై సాధనముగా స్వామి ప్రసాదించెను. దుర్వినియోగము చేసికొనిన యెడల మనమే దానిని పాడుచేసికొనువార మగు చున్నాము. వాస్తవమునకు శరీరము కూడ దేవుని ప్రసాదమే కాదు, దేవుని స్వరూపమే. ఇదియే వేదర్షుల భావము, శ్రీకృష్ణుని బోధ, అన్నమయ్య భావము. అన్నమయకోశము కూడ స్వామియే అని అన్నమయ్య దృక్పథము. కనుక శరీరముగా శిశుదశ నుండి వార్ధక్యము వరకు పెరుగుచున్నది స్వామియే. ఆకలి దప్పులు స్వామి స్వరూపములే. కావున వానిని తీర్చుకొనుట స్వామి సేవ. మన శరీరమునకు శుభ్రత కల్గించు స్నానాదులు కూడ స్వామి సేవయని శ్రద్ధగా ఆచరింపవలెను. తాను గాదు భుజించు నది, ఆకలి రూపముననున్న స్వామియే. తాను గాదు శ్వాసించుచున్నది, శ్వాసరూపుడగు స్వామియే. శరీరము తనది కాదు, తాను కాదు. స్వామియే, స్వామిదే. కనుక శరీరము కూడ ఇతరుల శరీరముల వలెనే స్వామియే అని ఎఱుగుట సారూప్య ముక్తి. తనను తాను కించపరచుకొనరాదు, మిగిలిన వారికన్న అధికుడ ననుకొనరాదు. తనకు దేహమును, ఆకలిని ఇచ్చినది ఇతరుల దేహములను, ఇతరుల ఆకలిని అంతర్యామిగా గుర్తించి సేవించుటకే. శరీర భోగమునకు ప్రాధాన్య మీయరాదు. అట్లని శరీరమునకు వలసినవి మానరాదు. "ఉపవాసాదులు చేసి తమ శరీర రూపములో నున్న నన్ను కొందరు మూఢులు కృశింపజేయుచున్నార"ని కృష్ణుడు గీతలో ఉద్ఘాటించెను. ఉపవాసములపేర దేవుని బెదిరింపరాదు. అంతకన్న ఇతరుల ఆకలిని తీర్చుటలో దేవుడు సంతుష్టి చెందును. తన ఒళ్లు పెరుగుచున్నదని భావించువాడు యౌవనమున గర్వించును, ముసలితనమున శోకించును. మరణ సమయమున గిలగిలలాడును. వయస్సు పెరుగుచున్న కొలది ఆయుస్సు తరుగుచుండును. తన శరీర రూపమున కూడ దేవుడే పెరుగుచున్నాడని భావించిన అన్నమయ్యకు ఏ దశలోను కూడ వికారములు లేవు. అంతయు స్వామి వైభవమే. మరణ మెప్పుడు వచ్చునాయని వేచిచూడరాదు. వచ్చినప్పుడు భయపడరాదు. పుట్టుక, గిట్టుక – రెండును అన్నమయ్యకు స్వామి మహిమలే కావున సమములే. కొందరు వేదాంతులు శరీరముతో జీవించుట నరకప్రాయమని యెంచి, ఈ జన్మ చాలు, ఇక మఱల జన్మ నెత్తకుండ కరుణింపుమని స్వామిని వేడుచుందురు. వీరు శరీరము బంధకారణమని భయపడువారు. భయపడుట భక్తుని లక్షణము గాదు. ఎన్ని శరీరములు వచ్చినను, స్వామియే ఆ రూపములతో తన మహిమను చూపుచున్నాడను సత్యమును గ్రహింప వలెను. అన్నమయ్య వంటి భక్తులు తమ శరీరములను కూడ స్వామిగా భావింతురు కావున పునర్జన్మకు భయపడరు. వారికి జన్మలన్నియు స్వామి మహిమలే. మరియు శరీరము రూపమున స్వామియే పెరుగుచున్నాడనుట వలన అన్నమయ్య ఒక ధర్మమును

బోధించుచున్నాడు. ఆకలికి భుజించుచు, రుచిని ఆకలికై వినియోగపరచుకొనవలెను. అంతియేగాని రుచి కొఱకై ఆకలి లేనప్పుడు కూడ భుజించుట, తాను దేహమునని పొరబడుట యగును. ఆకలిని తీర్చుటలో రుచిని వినియోగపరచుటే గాని, దానికి లొంగరాదని అన్నమయ్య ఉద్బోధ. తన శరీరమును చూచి అన్ని దశలలో ఇది స్వామి రూపమని అన్నమయ్య ఎంతగా మురిసినాడో! కొందరు తాము ఇంతకుముందు చేసిన పుణ్యకర్మల ఫలిత ముగా ఐహిక సుఖములు – ధనము, కీర్తి, అధికారము, గుర్తింపు మున్నగునవి లభించినపుడు తమ తెలివియని భుజములు పైకి ఎగుర వేయుదురు. పూర్వము చేసిన పాపకర్మల ఫలితముగా కష్టములు వచ్చినపుడు 'దేవుడు కల్పించెన'ని ఆయనపై అభియోగము లారోపింతురు. జీవి యొక్క శరీరమునకు ఎట్లు పరిణామము కలదో, అతని ప్రజ్ఞకు కూడ అట్లే గలదు. దీనినే ఆధ్యాత్మిక పరిణామమందురు. ఇందు పరిపూర్ణ దశ యగు భగవదనుభూతి నిండుటకు అనేక జన్మలు పట్టును. ఈలోపు సొంత తెలివి పనిచేసి కొన్ని పాపకర్మలు చేయుట, కొన్ని పుణ్యకర్మలు చేయుట, వాని ఫలితము లనుభవించుట, వానినుండి గుణపాఠములు నేర్చికొని సర్దుకొనుట జరుగుచుండును. ఎప్పటికోగాని పుణ్యకర్మలు కూడ తన ద్వారమున జరుగునవే గాని, తనవలన కాదనియు వానికి వలయు సంకల్పములు, శక్తిసామర్థ్యములు స్వామియే అనియు ఎఱుకకు రాదు. ఈ పరిణామ మిట్లేల జరుగవలయును? మొదటనే జీవిని మహాభక్తుడుగా, మంచివాడుగా ఏల పుట్టించ రాదని ప్రశ్నించుట అవివేకము. ఏలయనగా సృష్టి వచ్చిన తర్వాత అందులో భాగముల మగు మనము సృష్టిని నిర్వహించు స్వామిని ఇట్లేల చేసితివని ప్రశ్నింపవచ్చునా? జీవుని ఈ ప్రయాణము, కర్మలు చేయుట, గుణపాఠములుగ ఫలితములు పొందుట – ఈ మొత్తము దేవుని ప్రణాళికలో, వ్యూహములో భాగము. ఇది ఒక క్రమపద్ధతిలో జీవుడు అజ్ఞానము నుండి భగవంతుని యందు మేల్కొను జ్ఞానము నందుకొనుటకు గాను దేవుడే ఏర్పాటు చేసెను. ఈ 'క్రమపద్ధతి' అను అర్థమున అన్నమయ్య 'ఒగి' అను పదమును వాడెను. అతని కవిత్వమున వ్యర్థపదము లుండవు. ఇట్లు పూర్వము చేయబడిన కర్మలు, వాని ఫలితములు, దేవుని మహిమయని భావించువానికి శోక ముండదు. తాను చేసిన తప్పును సర్దుకొనుటయే గాని, ఊరక దానినే తలచుకొని ఏడ్చుట ఉండదు. ఏడ్చుచు గూడ దానినే మిక్కిలిగా తలచువాడు ఆ ధ్యాన బలమున మరల మరల ఆ తప్పునే చేయసాగును. గతములోని తప్పులు, గుణపాఠములు స్వీకరించి మరల చేయకుండుట కొరకే గాని, తలచి తలచి ఏడ్చుటకు గాదు. ఇట్లు ఏడ్చుచు గతమును తలచువాడు జారిపడి, మరల పైకి ఎక్కవలసి వచ్చునని బుద్ధుడు బోధించెను. సాధకుడు తప్పులు చేసినను వానిని సర్దుకొనునే గాని, అందులకై శోకింపడు. అన్నమయ్య తన ఆధ్యాత్మిక ప్రయాణమును, పూర్వకర్మను స్వామిగనే దర్శించిన మహానుభావుడు. 'ఒళ్ళై పెరుగుదువు ఒగి బురాకృతమౌను' – ఈ పాదమున వేరొక విశేషమున్నది. మన శరీరము దేవుడే కావున, దానిని ఆరోగ్య వంతముగా నుంచుకొనుట దైవసేవ. ఒకవేళ పూర్వ దుష్కర్మ ఫలితముగా అనారోగ్యము సోకినను దానిని గూర్చి శోకింపక దానియందును అంతర్యామినే దర్శింపవలెను. ఆరోగ్యమును గూర్చి నియమములను పాటింపవలెను. పూర్వకర్మ ఫలముగా అనారోగ్యము వచ్చినచో శోకించి, భయపడరాదు. సరియగు వైద్యము

పొందవలెను. జీవునకు తన ఇల్లు, ముంగిలి అని లేవు. ఇవి దేవాలయములు. దేవుని ప్రసాదములు. దేవుని స్వరూపములు. తానెప్పుడు ఇల్లు కట్టుకుందునా అని అంగలార్చువాడు అవివేకి. తన శరీరమే అద్దె కొంప. భగవంతునకు తాకట్టు పెట్టబడిన బంకు. దీనిని తనదని భావించుట భ్రమ. మనకు ఇల్లు ఎపుడు ఈయవలెనో మనకన్న స్వామి కెక్కువ తెలియునని విశ్వసింపవలెను. ఇంటిని ఇచ్చుటయే కాదు, ఇంటిగా అవతరించునదే స్వామియని అన్నమయ్య భావించుచున్నాడు. ప్రాచీనకాలమున ఇంటికి వచ్చిన పదిమందితో కలియుటకు 'ముంగిలి' యని ఉండెడిది. ఇప్పుడు డబ్బు కొఱకై అద్దెకిచ్చుట కొఱకని ముంగిలి లేకుండ ఇల్లు కట్టుకొనుచున్నారు. ప్రకృతిశోభ యగు గాలి వలన కలుగు ఆరోగ్యముకన్న డబ్బు ప్రధానమని భావించు ఆధునిక మానవుని తెలివి ఇట్లు తెల్లవారుచున్నది. అన్నమయ్య ఇంటిలో ముంగిలి ఉండెడిది. అందు తోటి గ్రామస్థులతో సమావేశములు, సంకీర్తనలు సాగెడివి. ఇంటిలోన దేవుడే కాదు, ఇంటిలోని, ముంగిలిలోని అణువణువు స్వామియే అనియు అన్నమయ్య దర్శించి పులకరించుచున్నాడు. ఇతనికి తన ఇల్లే కాదు, అన్ని ఇళ్లును స్వామియే. నిర్జీవ మనబడు దానిని కూడ అఖండచైతన్యమను బ్రహ్మముగా దర్శించిన అన్నమయ్య ఎచ్చోటనైనను, ఏకాలమునైనను, ఎవరి నడుమ నైనను, ఏ పరిస్థితిలోనైనను స్వామి యను బ్రహ్మానందసాగరమున ఓలలాడెను. చోటు భగవంతుని స్వరూపము. చోటులో మనము ఇల్లు కట్టుకొని 'ఇది నా చోట'ని మనలను మనము సంకుచితపరచుకొను చుందుము. ఇంటిలోనికి చోటెట్లు వచ్చినది? చోటులో ఇల్లు కట్టుకొనుట వలన. చోటు అనగానేమి? స్వామి వెలుగు యొక్క విస్తారము. ఒక శిల్పి ఒక రాతిపై దేవుని ఒక రూపమును చెక్కి, ఆ రూపమును దేవుడనుచున్నాడు. అది నిజమే. కాని రాయి మొత్తము దేవుడనుట ఇంకను సత్యము అని అనిబిసెంట్ యను ఒక యోగిని చెప్పెను. పూర్వకాలమున ఒక గృహస్థుని ఇల్లు ముంగిలి అతిథుల రూపములోని స్వామికి ఆవాసముగ నిలిచెడిది. విష్ణుచిత్తుని ఇల్లు ఇట్టిది. అన్నమయ్య తన ఇంటిలోను, ముంగిలిలోను స్వామి యొక్క యునికిని అనుభూతినందుటచే, ఇట్లు అతిథులకు సేవ చేసెనని మనము గ్రహింపవలెను. గోదాదేవియు ఇంటిని దేవుని పాదమందలి రేణువుల సమూహముగా భావించెను. కావున ఆమె ఇల్లు సంపదతో నిండినదని అన్పించినది. సంపద యనగా ఇట్టి భావనయే. ఇది గలవారికి కొఱత యుండదు. మొత్తముమీద 'ఇంతా' నీ మహిమయే అని అన్నమయ్య స్వామిని కీర్తించుచున్నాడు. ఇది, ఈతడు, ఈమె అనుబడున దంతయు నీ వెలుగేయని అన్నమయ్య ఆనందమున పులకరించి, దైవానుభూతితో నిండిన హృదయము నృత్యమాడగా ఈ చరణము వెలువడినది.

2వ చరణము యొక్క తాత్పర్యము

"గురుడవై బోధించెదవు, కొడుకువై కావలసినవి తీర్చెదవు. అరుదైన ఆశ్రయము నీవగుదువు. దొరవై నన్ను పాలించుదువు. దూతవై నాకు కావలసిన పనిని చేసి పెట్టెదవు. స్థిరమైన సంపదలిత్తువు. ఇంతయు నీ మహిమయే."

వ్యాఖ్య

అన్నమయ్య తనకు స్వామి ప్రసాదించిన విశ్వరూప సందర్శనానుభూతిని ఈ చరణమునందు కొనసాగించుచున్నాడు. గురుడనగా చీకటిని తొలగించువాడని అర్థము. చీకటి అనగా అజ్ఞానము. అనగా స్వామికన్న ఇతరమును చూచుట. జగత్తును ఎట్లు తెలియవలెనో తెలియకుండుటయే అజ్ఞానము. వెలుగు వచ్చినచో చీకటి అదియే పోవును. ఆ వెలుగే జ్ఞానము. అనగా తెలిసికొనువాడు, తెలియబడువాడు, తెలిసికొనుట ఒకే అంతర్యామి అను దర్శనమే జ్ఞానము. ఈ వెలుగు ప్రతివానిలోను హృదయమందు సంసిద్ధముగా నున్నది. సర్వహృదయవాసి యగు స్వామియే ఆ వెలుగు. కనుక అసలైన గురువు అంతర్యామియైన స్వామియే. ఆదిశంకరులు చెప్పిన ఒక పొడుపుకథ గలదు. "విశ్వమను మఱ్ఱిచెట్టు ఒకటి గలదు. దానికి మూలమై స్వామి యున్నాడు. అతడు యువకుడు. శిష్యులైన దేవతలు, ఋషులు, జీవులు మార్పుకు లోనగు చుందురు. కనుక ముసలివారు. గురువు మౌనముతోనే శిష్యుల సందేహములను తొలగించును." స్వామి మన మెఱిగిన భాషలోనేగాక, మన హృదయములో నుండి అంతర్వాణిగా బోధించుచునే యుండును. విశ్వమును తన రూపముగనే దర్శించు మని సదా మనలను మేలుకొలుపుచుండును. ప్రకృతి ద్వారమున జగద్గురువైన పరమాత్మ మనకు సద్గుణముల నుపదేశించుచునే యున్నాడు. ఉదా :– భూమి రూపమున ఓర్పును; వాయువు రూపమున జీవులకు ఆరోగ్యము నిచ్చుటయు; నీటి రూపమున పరిశుభ్రత కల్గించుటను, తాపము తీర్చుటను; అగ్ని రూపమున పవిత్రతను, వెలుగును పంచుటను; మేఘముల రూపమున అన్నము పెట్టుటను స్వామి మనకు ఉపదేశించుచున్నాడని భాగవతమున ఉద్ధవగీత యందు గలదు. జీవితమున ప్రతి సన్నివేశమున, ప్రకృతిలోని ప్రతి అంశమున, జంతువు ద్వారమున మనకు స్వామి యొక్క ఉపదేశ మందుచుండును. శరణాగతులకు ఇవి సూటిగా అందును. జీవుడు దేవుని రూపమే గావున సహజముగా మంచి గుణములు గలవాడు. కాని మనస్సుతో ఇతరమును చూచుట వలన రాగద్వేషాదులను, కృత్రిమ గుణము లను పొందుచున్నాడు. ఈ కృత్రిమ గుణములు దీపపు గ్లాసుకు పట్టిన మసి వంటిది. మసిని తుడిచినచో, లోపలనున్న దివ్యజ్యోతి, జ్ఞానజ్యోతి, సద్గుణములు అవియే ప్రకాశించును. ఈ మసి తుడిచివేయుటకుగాను భౌతికముగా మహనీయుడైన గురువు యొక్క మార్గదర్శనము కావలెను. అతడు భగవంతునితో తాదాత్మ్యసిద్ధి పొందినవాడు కావలెను. ఇతడు మనందరి లోపల దాగియున్న గురువగు పరమాత్మకు వెలుపలగా వెలువడిన రూపమే. శ్రీకృష్ణపరమాత్ముడే అర్జునునకు గీతను బోధించుచు, భగవంతుని వెలుగును దర్శించిన జ్ఞానులయిన వారికి నమస్కరించి, వారికి మనసారా సేవచేసి, పరిప్రశ్నలు వేసి, 'నన్ను' తెలియుమని యుపదేశించెను. పరిప్రశ్నలనగా దేవుని గూర్చినవి. గురువు యొక్క ప్రాముఖ్య మెట్టిది. ఇతడు క్రొత్తగా మనలో లేనిదానిని తెలుపుట యుండదు. మనలోనున్న వెలుగగు పరమాత్ముని యందు ఇతడు మేల్కొలుపును. బోధించుట యనగా మేల్కొల్పుట యని అసలైన అర్థము. కావున గురుడవై బోధింతువని అన్నమయ్య స్వామిని కీర్తించెను. బోధ యనగా teaching అని కాదు. Awakening (మేల్కొలుపుట), Enlightening అనగా లోనున్న వెలుగును ప్రకాశింపజేయుట. ఈ

గురువు తానాచరించి, మన కుపదేశించును. కావున ఇతని నాచార్యుడందురు. ఇతడు జీవితములో మనము నడువవలసిన బాటను చూపించు టార్చిలైటు వంటివాడు. కావున గురువు ఉపాస్య దైవము. ఇతనిని భగవంతునిగా భావించి సేవింపవలెను. గురువు యొక్క ప్రేమ, తల్లిదండ్రుల ప్రేమకన్న ఎన్నో రెట్లు అధికము. నిజమైన గురువు శిష్యుని తనంతవానిగా చేయుటకై తపించును. మనమాతనికంతేవాసులము కావలెను. అనగా అతని హృదయము లోపల మన స్థానము నెలకొనవలెను. మన ప్రవర్తన అట్లుండవలెను. గురువును సేవించుట యనగా అతని నొక వ్యక్తిగా మాత్రమే గాక, విశ్వాంతర్యామి యగు వెలుగుగా అందరియందు దర్శించి సేవించుట. గురువనగా ఆతడు ఆచరించి చూపిన మార్గమే. దాని ననుసరించుటే ఆతని నుపాసించుట. గురువు తనను ఎంతగా ప్రేమించెనో, ఇతరులను తానంతగా ప్రేమించినచో ఆయన శరీరమున్నను, లేకున్నను మనకాయన సాన్నిధ్యము నిరంతరముండును. నిజమైన గురువు తన శిష్యులను తనకన్న తక్కువవారని భావింపడు. తానధికుడనని గర్వింపడు, తాను గురువు ననుకొనడు. శిష్యులలో స్వామిని దర్శించును. శిష్యులకు మార్గమును నేర్పుటను స్వామి పూజగా భావించును. మఱి ఇట్టి మహాత్ముడగు గురువు మనకెట్లు లభించును? మనకు అందినమేర మంచిగా ప్రవర్తించుచు, ప్రతిదినము నిద్రించు సమయమునకు ముందు తనవద్దకు మహాత్ముడైన గురుని పంపుమని దేవుని వేడ వలెను. గురువే శిష్యుని వద్దకు వచ్చును. శిష్యుడు తన గురువు నెంపిక చేసికొనలేడు. అసలైన భక్తుడు మిగిలిన మహాత్ములైన గురువులకన్న తన గురువే గొప్పవాడని భావింపడు. గురువులకు మార్కులు వేయడు. అట్లని గురువులను మార్చడు. తన గురువును అంతర్యామిగా భావించి, అందరు గురువుల లోను, అందరిలోను అతనినే దర్శించును. ఇట్లు గురు రూపమున మనవద్దకు వచ్చి బోధించువాడు స్వామియే అని అన్నమయ్య భావించుచున్నాడు. గురువు శిష్యునకు రెండవదగు దివ్యజన్మ నిచ్చును. తనను స్వామి వద్దకు చేర్చు గురువు కూడ స్వామియే. అన్నమయ్య అట్లు భావించెను. కొడుకు లేక కుమార్తె తన శరీరమునుండి మాత్రమే వచ్చుట జరుగదు. తల్లిదండ్రుల కామభోగమునకు ఫలితముగా జన్మించు సంతానము తల్లిదండ్రుల నాదరింపరు. ఆత్మీయతతో, అనురాగముతో కలిసిమెలిసి జీవించు దంపతులు సమాజ హితమునకు పనికివచ్చు మంచివారు పుట్టవలెనని ముందుగా దేవుని గూర్చి తపింపవలెను. ఆపైన దేవుని సంకల్పానుసారముగా వారిరువురి నడుమ భౌతిక దాంపత్యము నెలకొని, అది ఒక నిమిత్తముగా సత్సంతతి కలుగును. ఇట్టి సంతానమును కని, పెంచి, పోషించుటేగాక వారికి ఆధ్యాత్మిక మార్గమున శిక్షణ నిచ్చుట తల్లిదండ్రుల కర్తవ్యము. అప్పుడట్టి సంతానము తల్లిదండ్రులకు సేవ చేసి, వారికి కావలసిన వానిని సమకూర్చి, వారు నడపిన భక్తిమార్గమున నడచెదరు. తల్లిదండ్రులు కొడుకునుండి దేని నాశింపక ప్రేమతో పెంచిన యెడల సామాన్యముగా కొడుకు వారికి కావలసినవి ఈడేర్చును. ఇట్టి కొడుకు రూపమున ఈడేర్చుచున్నది దేవుడేయని అన్నమయ్య దర్శించి, మనకు బోధించుచున్నాడు. ఇట్లు భావించుట వలననే అన్నమయ్య కుమారులు గూడ అతని వలెనే భక్తులైరి. ఆ వంశమున కొన్ని తరముల వఱకు భక్తులుదయించిరి. కొడుకును స్వామిగా గాక, తన కుమారుడని భావించి అతనిని తమ పట్టుక్రింద

ఎప్పుడు నుంచుకొనవలెనని ఆశించు తల్లిదండ్రులకు సంతానము నుండి నిరాదరణ, జీవితమున శోక రోషములు తప్పవు. స్వామియే మనకు అసాధారణమైన ఆశ్రయము. నీవాడను నేనని ఆశ్రయించినచో, అతని కభయమిచ్చెదనని శ్రీరాముడు పలికెను. మనకాశ్రయము – కాపాడునది ధనము, పదవి, తెలివి, పలుకుబడి మున్నగునవి కావు. మనలను కాపాడునది దైవమే. కనుక అసలైన ఆశ్రయము స్వామియే. మనల నాపదల నుండి కాపాడునని నమ్ముట చాలదు. అది ఆశ్రయించుట కాదు. సర్వాంతర్యామిగా ఆతనిని గుర్తించి, కీర్తించి, సేవించి, ఆతని దివ్యగుణములను పొందుటయే ఆతని నాశ్రయించుట. దేవుడనగా ఆతని ధర్మమార్గమే గాని, ఒక వ్యక్తివఅకే పరిమితుడు గాడు. ధర్మమే దైవస్వరూపము. ధర్మములను, కర్తవ్యములను, దైవసమర్పితములుగా గావించు వానికి తప్పక స్వామియే ఆశ్రయముగా నిలుచును. ప్రహ్లాదునకు, గజేంద్రునకు, విభీషణునకు, అంబరీషునకు, గుహునకు, హనుమంతునకు, ధర్మరాజుకు స్వామి ఆశ్రయమై నిలిచెను. నిధానమనగా 'నిధి' యని కూడ అర్థము. నిధి యనగా గని. స్వామి దేనికి గని? సద్గుణములకు గని, ప్రేమకు గని, ఆనందమునకు గని. తన స్థితినే భక్తునకు ప్రసాదించు దయా సాగరుడు స్వామి. ఐహికముగా కావలసినవి సకాలమునకు తీర్చకుండునా? రక్షించ కుండునా? "ఇతరమును చూడక నన్నే విశ్వముగా చూచి సేవించువాని యోగక్షేమము లను నేను వహింతున"ని కృష్ణుడు గీతలో చెప్పెను. ఎప్పటికైనను మనకు ఆశ్రయము, నిధి స్వామియే అని గుర్తింపక తప్పదు. ఆతనిని స్మరించిన వారికి ఆ నిధి నుండి సద్గుణములు, ప్రేమ, ఆనందము లభించును. అన్నమయ్య స్వామిని ఇట్లు హృదయ పూర్వకముగా ఆశ్రయించి, ఆ నిధి నుండి రక్షణను, సద్గుణములను, ఆనందమును పొంది మనకు బోధించు చున్నాడు. ప్రభువు రూపమున పాలించుచున్నది గూడ స్వామియే. ప్రజలను కన్న బిడ్డలుగా తాను తండ్రియై పాలించు ఏలికను భగవంతునిగా భావించుట సహజము. ఏలుట యనగా తెలుగులో హృదయములను చూరగొనుట అని అర్థము. ఇట్టివాడే సరియైన పాలకుడు. సరియైన దొర, ప్రజలను దేవుడుగా దర్శించి సేవించును. జనులును అతనిని స్వామిగా భావింపవలెను. అన్నమయ్య తన కాలమునాడు వాడుకలోనున్న 'దొర' అను పదమును ప్రయోగించెను. రాజును రాజుగా చూచినచో, తనను సన్మానించినపుడు ప్రభువునందు ప్రీతియు, అతడు చెఱసాలలో పెట్టి బాధించి నపుడు కోపమును అన్నమయ్యకు కలిగియుండెడివి. కాని దొరను స్వామిగా భావించుటచే ఈ రెండు సన్నివేశములందును దొర చేసిన పనులు స్వామి లీలలుగా అన్నమయ్యకు పొడసూపెను. అతడు సముడై నిలిచెను. కావుననే అతడు దేవు నాశ్రయించెనే గాని రాజు నాశ్రయింపలేదు. రాజే అన్నమయ్యను సత్కరించెను, బాధించెను, మరల సర్దుకొనెను. ఒక్కొక్కసారి ప్రజలలో సామూహిక చైతన్యము, పరస్పర ప్రేమ కొరవడినపుడు వీరికి తగినవాడు పాలకుడై వీరిని పీడించును. వీరి కర్మఫలమును స్వామియే ఆ పాలకుని రూపమున ఇచ్చుచున్నాడు. "నావిష్ణుః పృథివీ పతిః" అనగా ఇదియే అర్థము. ప్రజలలో సామూహిక చైతన్యము, పరస్పర ప్రేమ అధికమైనపుడు వాని కనుగుణముగా మంచి పాలకుడు వచ్చును. ఒకవైపు 'దొరవు నీవే', వేఱొకవైపు 'దూతవు నీవే' అని రెండు ధ్రువముల యందు నిలిచినవారిని గూడ స్వామియే అని అన్నమయ్య

భావించుచున్నాడు. మనము పూజ చేయు చున్నపుడు మన పైఅధికారి కబురు చేసినచో పూజ మానియైనను వెళ్ళెదము. కాని మనము పూజ చేయుచున్నపుడు ఆకలిగొన్నవాడు మన ఇంటి ముంగిట నిలిచి మొఱపెట్టుకొన్నను "పూజ పూర్తికాలేదు, దేవునకు నివేదనము కాలేద"ను నెపమున అతనిని పట్టించుకొనము. మనకు కబురు పంపిన అధికారి రూపమున నున్న దేవుడే ఆకలిగొన్న వారి రూపమున మన మర్పించు నివేదనమును స్వీకరించుటకై సిద్ధముగా నున్నాడని గుర్తింపము. పైవానిలో కనపడు దేవుడు మనకు క్రిందివానిలో కనపడడు. ఇది చిత్రము. కాని అన్నమయ్యకు అటు ఇటు స్వామియే. తనకు పనులు చేసిపెట్టు వాడును, తాను తెలిపిన సమాచారమును అవతలివారి కందించు దూతయును, తనకు వేరొకనితో మంచి స్నేహమును గూర్చు మధ్యవర్తియును స్వామిగనే అన్నమయ్యకు కన్పట్టెను. మైకులో ఉపన్యాసములు చెప్పు పండితునకు మైకు ఏర్పాటు చేయువాడు సహకరింపనిచో ఏమగును? కావున మేధావులు, పండితులు పనివారిని, తమ క్రిందిస్థాయిలోని వారిగా చూడక, వారిని భగవంతునిగా భావించి ఆదరింపవలెనని అన్నమయ్య మనకు బోధించుచున్నాడు. మనలను గౌరవించువారు, గౌరవించుటను నేర్పుచున్నారని అర్థము. మనలను గౌరవించు వారిలో, మనకు పనులు చేయువారిలో, దూతలలో స్వామి ఉన్నాడని మనకు నచ్చ వలెను. అసలైన సంపద అనగా సద్గుణములే. సంపదలకు సిరులని పేరు. 'సిరి' యనగా 'శ్రీ'. 'శ్రీ' యనగా స్వామి నాశ్రయించునది. స్వామిని ఆశ్రయించు ప్రకృతి శోభ – గాలి, నీరు, ఆహారము, వేడిమి, వెలుగు, వెన్నెల, ప్రేమ, త్యాగము, సహనము మున్నగు సద్గుణములు సిరులు. ఇవియే అసలైన సంపద. ఇవియే స్థిరమైన సంపద. ఈ సంపద రూపమున గూడ స్వామియే ఉన్నాడు. భక్తికన్న మించిన ధనమేమున్నది? మరియు ప్రజలకు వలయు పాడిపంటలు అసలైన సంపద. ఎంతటి ధనవంతుడైనను రూపాయల నోట్లను, నాణెములను భుజింపలేడు గదా. ఆధునిక మానవుడు ఎంత చదువుకున్నను, ఈమాత్రము ఇంగితజ్ఞానము లేక ధనము కొఱకై వెంపర్లాడుట వలన ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుచున్నది. స్థిరమైన సద్గుణ సంపదను అన్నమయ్యకు స్వామి ప్రసాదించెను. ప్రకృతి శోభ యంతయు అన్నమయ్యకు మురిపెమును కలిగించెను. పల్లెలలో జీవించిన అతనికి పాడిపంటలను సమృద్ధిగా స్వామి ప్రసా దించెను. పరస్పర ప్రేమతో గూడిన సామాజిక జీవనము, పాడిపంటల చుట్టు వృత్తు లల్లుకొను దేశమున ఎప్పటికిని కఱవుండదు. స్థిరమైన సంపదగా వారి నడుమ భగవంతుడే దిగివచ్చునని అన్నమయ్య దివ్యోపదేశము. అన్ని కాలములకు, అన్ని దేశములకు పనికివచ్చు జీవన విధానము నాతడుద్బోధించెను. గురుడు, కొడుకు, ఆశ్రయము, దొర, దూత, సిరులు – ఇంతయు నీ వెలుగు యొక్క విస్తారమే అని అన్నమయ్య మనసార కీర్తించుచున్నాడు.

3వ చరణము యొక్క తాత్పర్యము

"దేవుడవై పూజలు స్వీకరించుచున్నావు. దిక్కు నీవే. ప్రాణమగుచున్నావు. నీవు సంకల్పించిన విధముగా నాకు కావలసినవిగా అగుచున్నావు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవే చిత్తములోపల నుండి ఇచటనే వైకుంఠ మిచ్చుచున్నావు. ఇంతయు నీ మహిమయే!"

వ్యాఖ్య

దేవుడనగా తనకు తానుగా వెలుగువాడు. సూర్యచంద్రాదులను, ప్రకృతిని, మనలను వెలిగించువాడు. అట్టి దేవుడు మనచే మూడు విధములుగా పూజలు స్వీకరించు చున్నాడు. అర్చామూర్తులుగ – ఆలయములందలి, ఇండ్లయందలి విగ్రహములుగా పూజలు స్వీకరించుచున్నాడు. శ్రీరామ శ్రీకృష్ణాది అవతారమూర్తుల, మహాభక్తులకు ప్రహ్లాదుడు మున్నగువారి గుణములను మనము సంకీర్తనము చేయుట, వినుట, చదువుకొనుట కూడ స్వామికి పూజయే. ఎవరిలోనైనను గల మంచి గుణములను గుర్తించి కీర్తించుట స్వామికి పూజయే. విశ్వమందలి జీవుల రూపములలోని స్వామికి సేవ పూజయే. ఇది అంతర్యామి పూజ. జీవుల దేహములు స్వామి సజీవ విగ్రహములు గదా! ఈ మూడు విధములైన పూజలను అన్నమయ్యచే చేయించుకొని స్వామి స్వీకరించెను. అన్నమయ్య ధన్యుడాయెను. భక్తునకు 'నాకు దిక్కెవ్వర'ను ప్రశ్న ఎప్పుడును పుట్టదు. ఎట్టి పరిస్థితియందైనను అతనికి స్వామియే దిక్కు. చంటిపిల్లవాడు తల్లిదండ్రుల నెట్లు దిక్కుగా భావించునో, అంతకంటె ఎన్నో రెట్లు భక్తుడు దేవుని గూర్చి భావించును. సీతమ్మను చూడగానే హనుమంతునకు 'నాకు దిక్కెవర'ను భావన నశించి, 'ఆమెయే దిక్క'నిపించెను. 'దిక్కు' అనగా ఆపదలలో కాపాడువాడనియే గాదు. పూర్వ కర్మ ఫలమును బట్టి ఏ పరిస్థితి వచ్చినను స్వామి పాదారవింద భక్తి స్థిరముగా నెలకొనుటే భక్తుని లక్షణము. దీని నిమ్మనియే భక్తుడు దేవుని ప్రార్థించును. దేవుడు దీనినిచ్చు దిక్కు. భక్తుడు పూర్వకర్మను బట్టి తనకు వచ్చిన కష్టములను రద్దు చేయుమని దేవుని వేడడు. అపుడు గూడ నీ పాదభక్తియే స్థిరముగ నిల్పుమని దేవుని వేడును. కులశేఖరాళ్వారు స్వామి నిట్లే ప్రార్థించెను. తనకన్న కష్టములలో నున్న వారిని భక్తుడు గమనించి సేవించును. స్వామిని సంస్మరించుట మానడు. అట్లని స్వామి ఆపదలను తొలగించడని గాదు. పూర్వ కర్మానుభవము నిచ్చి, తగు సమయమున తాను సంకల్పించిన విధముగ భక్తుని కాపాడును. స్వామియే దిక్కని స్మరణ యున్నచో కష్టములలో కూడ భక్తుని ఆనందము విడువదు. చోటులో ప్రాణశక్తి యున్నది. అదియే శ్వాసించుచున్నది. అదియే విద్యు దయస్కాంతశక్తిగా, వేడిమిగా, వెలుగుగా పనిచేయుచున్నది. అదియే సౌరశక్తిగా వెలువడుచున్నది. భూమి సూర్యుని చుట్టు తిరుగుచుండుట వలన ఈ ప్రాణశక్తి భూమిలోనికి ప్రవేశించుచున్నది. ఆపై జీవుల లోనికి ప్రవేశించుచున్నది. గాలి, నీరు, సూర్యకాంతి ప్రాణశక్తికి వాహికలు. శరీరమను సజీవ యంత్రమునకు ఆహారము ఇంధనము మాత్రమే. శవమునకు అన్నము పెట్టినను ప్రాణము రాదు గదా. మనలోని ప్రాణశక్తియే దేహమును, మనస్సును పనిచేయించుచు జీవితమును నడుపుచున్నది. చోటులో నున్న ప్రాణశక్తి మనము పీల్చు గాలి ద్వారమున మనలోనికి ప్రవేశించుచున్నది. ఇదియే జీవనాధారము. చోటులో అంతర్యామిగా నున్న పరమాత్మ యొక్క పరమప్రేమయే ఈ ప్రాణశక్తి. అనగా పరమాత్మయే ప్రేమగను, ప్రాణముగను పనిచేయుచు మన కాధారమై యున్నాడు. శ్వాస మనము పీల్చుట లేదు. శ్వాసక్రియను దేవుడు మనకు విడిచి పెట్టలేదు. ఆతడే హృదయమున ప్రాణశక్తిగా నుండి శ్వాసించుచున్నాడు. దేవుని ప్రేమ ఎంతని చెప్పగలము? మేము కోరిన విధముగ, కావలసినట్లుగా నీవగుచున్నావని రెండవ పాదము యొక్క పై

అర్థము. కామించినట్లు అనగా మనము కోరిన విధముగా అని కాదు. ఇతరులకన్న ఎక్కువ మార్కులను, సుఖభోగములను కోరినచో దేవునకు నచ్చునా? దేవుడు సర్వసముడు. మనము స్వామిని సంకీర్తనము గావించుట ఆయనకున్న పవిత్ర గుణములను పొంది, ఆనందించుటకే గాని, ఆయన కొరుగున దేమియు లేదు. హరి పూజనము, హరి సంకీర్తనములకు లక్ష్యము మన ఉద్ధరణమే. మన పొగడ్తలకు పొంగిపోయి స్వామి మన కోరికలను తీర్చునని చెప్పజాలము. ఇచట 'కామించినట్లు' అనగా స్వామి సంకల్పించినట్లని అర్థము. మనము కోరినట్లని కాదు. వేదమునందు ఇదియే అర్థము గలదు. మనకు కావలసిన వస్తువులు, సంఘటనలు, పరిస్థితులు మనకన్న స్వామికే బాగుగా తెలియును. ఆయన మనకేవి ప్రసాదింపవలెనని సంకల్పించునో ఆయా రూపములు, అట్టి విషయములు, సన్నివేశములు, పరిస్థితులు స్వామియే. ఒక్కొక్కసారి స్వామి మనయందు దయతో సత్పురుషులను మనవద్దకు పంపించును. వారును స్వామియే. కొన్నియెడల మన కోరికలు ఆయన సంకల్పముల కనుగుణమైన సందర్భమునందు అవి తీర్చబడవచ్చును. అంతమాత్రముచేత మన కోర్కెలు తీర్చ బడెనని అర్థము కాదు. స్వామి సంకల్పము మనకు కావలసిన రూపముగా వచ్చెనని అర్థము. ఆంగ్లభాషలో ఒక కథ గలదు. ఒక రాజు తాను తాకినదెల్ల బంగారము కావలెనని ఒక దేవతను కోరెనట. ఇంటిలోని వన్నియు బంగారమాయెను. ఆహారము కూడ బంగారమాయెను. తినుటకు, త్రాగుటకు వీలులేదు. చివరగా కుమార్తె నాతడు తాకగా ఆమెయు బంగారుబొమ్మ అయినది. అప్పటి కాతనికి తెలివి వచ్చినది. బంగారమునకు విలువ లేదని. విలువ ఉన్నది అనుబంధమునకు, ప్రేమకు అని గ్రహించి వలవల ఏడ్వగా అతని కియ్యబడిన వరము ఉపసంహరింపబడినది. అప్పటి కాతడు శాంతి పొందెను. ఎల్లరి చిత్తము లోపల ఆత్మగా వేంకటేశ్వరుడే ఉన్నాడు. కాని ఆయనను స్మరించినపుడే ఆ వెలుగు యొక్క ప్రకాశము మనపై బడును. చిత్తమునకు ఒక చిత్ర స్వభావమున్నది. దేనిని స్మరించిన అది యగును. నిత్యము అంతర్యామి యగు స్వామిని స్మరించుట వలన, స్వామి సేవలో మునుగుట వలన చిత్తము తన ఉనికిని కోల్పోవును. దాని స్థానమున స్వామి ఉండును. స్వామియే మనస్సుగా, ఇంద్రియములుగా, బాహ్యజగత్తులోని విషయములుగా నుండును. ఈ స్థితినే వైకుంఠమందురు. వైకుంఠమనగా భౌతిక పదార్థములతో చేయబడిన లోకము కాదు. కుంటువడని అనగా జారిపడని స్థితి. అది ఏది? పరమాత్మ యొక్క స్థితియే. వైకుంఠమన్నను, వైకుంఠుడైన విష్ణువన్నను, వైకుంఠవాసులన్నను ఒకటియే. కావుననే దేవాలయ ద్వారపాలకులకు కూడ శంఖచక్రము లుండును. వైకుంఠ స్థితి అఖండ ప్రేమసాగరము. అనంతమగు ఆనంద సాగరము. దీనినే పరమపద మందురు. ఇందు ప్రవేశించినవాడు విష్ణువు వలె అంతర్యామి యగును. ఇట్టివారినే 'నిత్య సూరుల'ందురు. ఈ స్థితి చనిపోయిన తర్వాత రావలసినది కాదు. లేదా కొలదిసేపు ధ్యానమున కలుగునది మాత్రమే కాదు. అన్నమయ్య 'ఈవల' అను శబ్దమును వాడెను. అనగా ఇచట – ఐహిక జీవితమున అని అర్థము. భక్తునకు ఐహికమనియు, ఆధ్యాత్మికమనియు వేరు వేరు జీవితములు లేవు. ఇరువది నాలుగు గంటలు మెలకువలోను, కలలోను, నిద్రలో కూడ భక్తుడు పరమాత్మ యందు ఐక్యమైన స్థితిలో ఉండును. దీనినే తురీయస్థితి యని మాండూక్యోపనిషత్తు పేర్కొను చున్నది. పైన చెప్పినట్లుగా తల్లిదండ్రులతో, భార్యతో, శరీరముతో, పిల్లలతో,

గురునితో, దొరతో, సేవకునితో, సమాజమున ఇతర జీవులతో, తటస్థించు పరిస్థితులతో, సన్నివేశములతో మెలగుచున్నపుడే ఈ అంతర్యామిత్వమును, బ్రహ్మానందసాగరమున మునుగుటకు స్వామి మనకు ప్రసాదించు నని అన్నమయ్య మనకు బోధించుచున్నాడు. అన్నమయ్యకు ఈ స్థితిని స్వామి ప్రసాదించెను. కావున ఇతడు నిత్యసూరులలో ఒకడాయెను. ప్రహ్లాద నారదాదులలో ఒకడాయెను. ఇతడు గూడ ఒక ఆళ్వారు. ఈ వైకుంఠ స్థితిని పొందుటకు మన సాధన నిమిత్తము. ఈ స్థితి భగవంతు డిచ్చు ప్రసాదము. కావుననే స్వామి ఇచ్చునని అన్నమయ్య పలికెను. తాను పొందెనని అనలేదు. మనము వైకుంఠమును పొందుట ఉండదు. వైకుంఠమే మనలను పొందును. ఇదియే దైవానుగ్రహము. ఈ స్థితి యొక్క రుచిని మరగిన అన్నమయ్య మన ఎల్లరలకు దీనిని ప్రసాదింపుమని స్వామిని వేడుచున్నాడు. 'ఇది అంతయు నీ వెలుగే' అనుచున్నాడు. పూర్తిగా స్వామికే శరణంది తన చిత్తము శూన్యమై స్వామితో నిండినదై యున్నాడు. ఇదియే కృష్ణుని వేణువు యొక్క స్థితి. తన దేదియో ఉన్నదను భావము కొంచెము కూడ అన్నమయ్యకు లేదు. తానే స్వామికి చెందినవాడు, తనది ఏమున్నది? తాను, తనది అనబడునవి, ఎదుటివి, వెనుకవి, అన్ని దిక్కులందు నున్నవి అయిన జీవజాలము అన్నమయ్యకు స్వామియే. ఈ సంకీర్తనమును నిత్యము గానము చేయువాడు గాని, వినువాడు గాని, చదువు వాడు గాని తన ఉనికిని కోల్పోయి వైకుంఠమను బ్రహ్మానందసాగరమున ఓలలాడుట జరుగును. ఈ సంకీర్తనము మొత్తమునకు ఫలశ్రుతి చివరి పాదమున గల వైకుంఠ స్థితి. "విశ్వమంతయు స్వామియే" అని దర్శించి సేవించిన వానిని ఈ స్థితి పొందును. ఇట్లు పల్లవిని చివరి పాదముతో జోడింపవలెను. ఈ సంకీర్తనమున గురుడవై బోధింతువని గలదు. ఇచట గురుడై మనకు బోధించుచున్న అన్నమయ్యయే స్వామి యని మనము భావించి, దర్శించి, శరణంది, అతని సాన్నిధ్యమునే స్వామి సాన్నిధ్యపు తీయదనముగా అనుభవించుదుముగాక!

* * *

48

5వ సం-268 **శిన్నెక తేవే** మేచబౌళి

శిన్నెక తేవే శెలువుని తా
వెన్నలు సవిగొను వెన్నుని తా. ॥ పల్లవి ॥

మూటల్ మాటల్ మూరల్ బారల్
బాటల్ సదివే బాసలు తా
నేటల్ నీపుల్ వేలుపు గుడుపుల్
తేటలు మరగిన దేవుని తా. ॥ శిన్నెక ॥

వాకుల్ చీకుల్ వాదుల్ పోదుల్
సోకపు తొల్లిటి సుద్దుల్ తా
పోకులు లోకుల్ పొడగఁగ మనిపెడి
కేకిగరుల తల కిష్ణుని తా. ॥ శిన్నెక ॥

బగ్గుల్ నగ్గుల్ బాపుల్ సొరగా
దగ్గర వెఱపగు తపసుల తా
సిగ్గుల్ వాపెడి శ్రీవేంకటపతి –
నగ్గపు సొమ్ముల యాతని తా. ॥ శిన్నెక ॥

తనకేది కావలయునో ఇతరులకు కూడ అదే కావలయునని
గుర్తించుటయే ధర్మమును గుర్తించుట.

టీక

శిన్నెక = వన్నెలాడి, శెలువు = ప్రియుడు, నీపుల్ = కడిమిచెట్లు, నేటల్ = అపహాస్యములు, నర్మగర్భములు, కుడుపు = నైవేద్యము, తేట = తేఱిన మజ్జిగ, స్వచ్ఛత, పోకులు = నడవడి, కేకిగరుల = నెమలిపింఛముల, బగ్గల్ = భగ్గలు – మంటలు, నగ్గల్ = నవ్వులు, ముక్కలు, చొరగా = ప్రవేశించగా, లీనముకాగా, అగ్గపు = అధికమయిన, బాపుల్ = వింతలు.

పరిచయము

ఈ సంకీర్తనము జానుతెనుగు పదములతో నిండియున్నది. ఇంతటి తేట పలుకు బడులలో అన్నమయ్య శ్రీకృష్ణుని దివ్యక్రీడను రమ్యముగా వర్ణించెను. భాగవత రసమును గ్రోలుటయే గాక, ఈ పుట్టుకలోను శ్రీకృష్ణుని దర్శించి, తానొక గోపికయై, అతని యాటలను దర్శించి, అందు తాను పాల్గొన్న ధన్యుడు. కృష్ణుని రాకకై విరహ పడెను. ఈ సంకీర్తనమున తానొక గోపికయై కృష్ణుని తెమ్మని వేరొక గోపికను వేడు చున్నాడు. భగవంతుని సన్నిధికి మనముగా చేరలేము. భగవంతుడు మనకు తన సాన్నిధ్య మాధుర్యానుభూతిని ప్రసాదించును. అదియు ఒక సద్గురువు ద్వారమున. భగవద్దర్శనము, భగవత్ సాన్నిధ్యము తనకు సిద్ధించిన వాడు మాత్రమే మనకిప్పింప గలడు. అయస్కాంతమును మాత్రమే ఇనుపముక్కపై రుద్దినచో, అదియు అయస్కాంత మగును. ఊరక 'అయస్కాంతత్వము' అను పెద్ద పుస్తకమును ఇనుపముక్కపై రుద్దినచో ఎట్టి మార్పును రాదు. అట్లే భగవంతుని గూర్చి వర్ణించు పండితుల గ్రంథముల కన్న, భగవదనుభవము నిత్యము గల మహనీయుల సాంగత్యము, వారి సేవ మనకును భగవదనుభవము నిచ్చును. తాను నారాయణుడుగా అయిన నరుడే, మనలను కూడ నారాయణుడుగా తీర్చగలడు. ఇట్టివారి రచనలు కూడ పండిత రచన లీయలేని భగవదనుభవమును ఇయ్యగలవు. వాల్మీకి వ్యాసు లిట్టివారే గదా! కృష్ణుని తనవద్దకు తీసికొనివచ్చి, అతని సాన్నిధ్యము నిప్పింపుమని అన్నమయ్య ఇట్టి సద్గురువును వేడుచున్నాడు. తానే స్వయముగా సద్గురు స్థానములోని వాడయినను, అన్నమయ్య వేరొక సద్గురుని వేడుట మనకాదర్శమును నెలకొలుపుచున్నది. ఇతరులను గౌరవించుట యనగా మనకు గౌరవించుటను నేర్పుటయే. గోపికలకు కూడ కృష్ణ సన్నిధి నిప్పించినది రాధాదేవి గదా! అన్నమయ్య కొన్ని సంకీర్తనలు గోదాదేవి రచించిన 'తిరుప్పావై'ను పోలియున్నవి. బహుశః అన్నమయ్య వేడిన గోపిక, అతని గురువగు 'ఆదివన్ శఠకోపయతి' గారు కావచ్చును. వినయమును చూపినవాడు గాన మనకు వినయమును నేర్పుచున్నాడు. ఇక సంకీర్తనము లోనికి ప్రవేశింతము గాక!

పల్లవి యొక్క తాత్పర్యము

"ఓ వన్నెచిన్నెలల చెలీ! వెన్నలు రుచి చూచు కృష్ణుని నావద్దకు తెమ్ము. అతడు నాకు ప్రియుడు."

వ్యాఖ్య

చెలువుడు అనగా మనస్సును దొంగిలించిన ప్రియుడని అర్థము. కృష్ణుడు వెన్నలు రుచి చూచిన వాడని అన్నమయ్య వర్ణించెను. కృష్ణుని కిష్టమయిన ఆహారము వెన్న అని ఎల్ల రెరుగుదురు. వెన్నను

సంస్కృతమున నవనీతమందురు. భక్తుడు, భగవంతుని యందు నెరపు ప్రేమ ఇది. ఇది ఎవరికి వారికి క్రొత్త యనుభవము. ఎవరి ప్రేమ వారిదే కదా! ప్రేమ ఒక దివ్యానుభూతి. ఎవరి అనుభూతి వారిదే. మనము స్వీకరించు ఆహారము విషయముననే, ఒకే పదార్థమయినను ఎవరి రుచి వారిదే గదా! కృష్ణున కిచ్చునపుడు భక్తుని ప్రేమ. కృష్ణుడు పంచిపెట్టునపుడు భగవదనుభవము. ఇక అన్నమయ్య ప్రేమ అన్నమయ్యదే. 'వెన్నలు సవిగొను వెన్నుడ'నుటలో చక్కని లయ, అనుప్రాస ఉన్నవి. అంతమాత్రమే గాక, నిగూఢభావ మున్నది. శ్రీకృష్ణుని సుందర మూర్తిని అన్నమయ్య చూడగోరెను. నిజమే. అయితే కృష్ణునొక వ్యక్తిగా అతడు భావింపలేదు. సర్వవ్యాపకుడగు విష్ణునిగా భావించెను. కావున అనంత విశ్వమును, అనంతుడగు స్వామి మూర్తిగా ఇతడు ప్రేమించి దర్శింపగోరెను. ఇదియే నిజమయిన భక్తి.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"కృష్ణుని మాటలా మూటలు. బాటలా మూరలు, బారలు మాత్రమే. అతడు పలుకు మాటలు – చేయు వాగ్దానములు నర్మగర్భములు. సంచరించు చోట్లు కడిమిచెట్లు. గోకులవాసులు ఇంద్రాది దేవతలకు అర్పించు నైవేద్యముల నితడు స్వీకరించును. మజ్జిగ తేటలను స్వీకరించుటలో ఆనందించువాడీతడు. ఇతనిని గొని రమ్ము."

వ్యాఖ్య

తన నాశ్రయించిన అమాయికలగు గోపికలతో కృష్ణుడు ఎంతో ప్రేమతో ఎన్నియో మాటలాడును. కాని వారిని తన వెంట గొనివెళ్లు బాట మూర, బారను మించి యుండదు. అంతటితో కనపడకుండ పోవును. అతడు అభయమిచ్చు వాగ్దానములతో నిగూఢభావ ముండును. సూటిగా నమ్మదగినవి కావు. ఎప్పుడును యమునా నదీ తీరమున గల కడిమిచెట్లపైనను, వాని నడుమను తిరుగుచుండును. అమ్మవారికి కూడ కడిమిచెట్టు ఇష్టము. కాళిదాసు ఆమెను 'కదంబవనవాసిని' అని కీర్తించెను. కడిమిచెట్టు పైనుండియే కృష్ణుడు యమునా నది మడుగులోనికి దుమికి కాళియుని మర్దించెను. కడిమిచెట్టు పైనుండి వచ్చు గాలి కూడ ఆరోగ్యప్రదమనియు ఆయుర్వేద మున చెప్పబడినది. బహుశః అన్నమయ్య నివసించిన ప్రాంతముననుకడిమిచెట్లు ఎక్కువగా నుండియుండవచ్చును. లేదా అన్నమయ్య సూక్ష్మదేహముతో బృందావన మున కడిమిచెట్ల నడుమ తిరిగెనేమో! కృష్ణునకు మజ్జిగపైని తేట ఇష్టము. ఇది మజ్జిగ యొక్క సారము. అంతేగాక స్వచ్ఛమైనది. ప్రకృతిలో సహజసిద్ధమైనది, కృత్రిమము కానిది అయిన ఆహారము కృష్ణున కిష్టము. కృష్ణుడు జీవితమంతయు పాలు, మజ్జిగ, మీగడ, వెన్నలే భుజించెనని భాగవతము చెప్పుచున్నది. ఈ చరణము నందు ఇంకను వేద ధ్వనులతో కూడిన భావములున్నవి. స్వామి పలుకులు, వేణు గానము అనురాగముతో కూడినవి. మిక్కిలి తీయనయినవి. తనలోని తీయదనమునే తన పలుకులలోనికి, వేణుగానములోనికి కృష్ణుడు ఒలికించెను. కావున ఈతని మాటలు అధికములని గాదు, అందలి తీపి అధికము. అయితే భక్తుల నతడు సాధన మార్గమున శోధించును. ఈతని మాట, పాటల మాధుర్యమునకు వశము లయిన హృదయములతో గోపికలు కొంతమేర అతని ననుసరించిరి. కాని ఇంతలో అతడు అంతర్ధానమందెను.

కారణమేమి? మనము పొందినంత భగవదనుభవము, భగవదనుగ్రహము ఇంతవరకెవరికిని కలుగలేదని వారికొక క్షణ మన్పించినది. ఈ యంశమును వ్యాసుడు స్పష్టముగా భాగవతమున చెప్పెను. అన్నమయ్య భాగవత సారము ననుభవించి, తన సంకీర్తనలలో పిండి యిచ్చెను. కృష్ణుడంతట వ్యక్తిగా బయట కనపడక గోపికలలోననే దాగెను. కావున అతడు నడిపించిన బాట చాల స్వల్పమని అన్నమయ్య చమత్కరించెను. ఇది కృష్ణుని లోపము గాదు. భక్తుల సాధన లోని వెనుకబాటుతనము. అయితే గోపికలు వెన్వెంటనే తమ లోపమును గుర్తెరిగి చెట్టు చెట్టును, పుట్ట పుట్టను, సమస్త జీవజాలమును కృష్ణుని చూపుదని బ్రతిమిలాడి, అతనికై వెదకిరి. అనగా వారియందుని కృష్ణుని దర్శించిరి. ఈ ఘట్టమే అన్వేషణ. ఇది రాసపంచకమున మూడవది. ఇదియే కృష్ణుడు వారినుండి ఆశించినది. గోపికలు తనను వ్యక్తిగా మాత్రమే గాక, సకల జగత్స్వరూపునిగ దర్శింపవలెనని అతడు కొంత దూరము తనవెంట వారిని గొనివెళ్ళి వారి లోపలనే దాగెను. ఈ యంశమును అన్నమయ్య తన ఈ చరణమున నిక్షేపించెను. కృష్ణుడు భక్తుల కిచ్చు వాగ్దానములు పూర్తిగా నమ్మరానివి, రహస్యములయిన భావములతో కూడినవని అన్నమయ్య చమత్కరించెను. అనగా పైకి చూచిన కృష్ణుని నిందించినట్లు అనిపించును. కాని భక్తుడు భగవంతుని చేరు సాధనలోని మెలకువలను, దశలను అన్నమయ్య తెలిపెనని గ్రహింపవలెను. కృష్ణుడు మీ యోగక్షేమములను నేను వహింతునని బాస చేసెను. మిమ్ములను నాలోనికి స్వీకరింతునని హామీ ఇచ్చెను. కాని దీనివెనుక ఒక నియమ మున్నది. ఈ హామీ ఎప్పుడు చెల్లును? గీతలోనే స్వామి స్పష్టముగా ఇట్లు సెలవిచ్చెను. ఈ సెలవును ప్రకటించు రెండు శ్లోకములను చరమ శ్లోకములుగా నిత్యము వానిని హృదయమున భావింపవలెనని రామానుజులవారు తన 'శరణాగతి గద్య'లో ఉపదేశించిరి.

1. అనన్యాశ్చింతయంతో మాం యేజనాః పర్యుపాసతే ।

తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥

2. సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।

అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥

వీని భావము సంగ్రహముగా నిట్లున్నది. 1. ఇతరమును చూడక, అంతట అందరియందు నన్నే దర్శించి, ఎవరు భక్తితో నన్ను సేవించెదరో, నాయందే ఎల్లప్పుడు తమ మనస్సులను సమర్పించుకొందురో, వారికి నా సాన్నిధ్యమిచ్చి, వారికి క్షేమమును కల్గింతును.

2. ఇది మంచి, చేయదగినది; ఇది చెడు, చేయకూడనిది అను విచికిత్స నాకు విడిచిపెట్టి, అంతట నిండిన నాకు శరణంది, నా సంకల్పమునే ధర్మముగా ఆచరించు వానికి పాపవాసనల నుండి విముక్తిని ప్రసాదింతును. శోకింప పనిలేదు. ఈ రెండు శ్లోకములు 'శరణాగతి'ని చక్కగా తెలుపుచున్నవి. కనుక భక్తుల వైపు నుండి ఇతరమును చూడక స్వామినే చూచు దృష్టితోడి సేవ, శరణాగతి – ఈ రెండును ఉన్నప్పుడే స్వామి ఇచ్చిన వాగ్దానము పనిచేయును. ఇదియే అన్నమయ్య మనకు చెప్పదలచు కొన్నది.

దేవుని గూర్చి తన నిర్వచనములను, తన సిద్ధాంతములను గూడ సమర్పణము పొందవలెను. దేవుడు వీని కతీతుడు. అనంతుని, ఈ పరిమితులలో బంధింప జూచుట అవివేకము. తనవి యనబడు వానిలో తన తెలివి, తర్కము, సిద్ధాంతములు, వ్యక్తిత్వము గూడ గలవు. వీనితో బాటు తనను తానే సమర్పణము పొందవలయును. సద్గురువు పూర్తిగా గమ్యమున కొక్కసారే చేర్చడు. బ్యాటరీ దీపము వేసి, దాని కాంతిలో మనలను కొంతదూరము నడిపించును. ఆపై మరల అదే దీపము వేసి మరల కొంతదూరము నడిపించును. ఇట్లు క్రమముగా గమ్యమును చేర్చునని శ్రీరామకృష్ణపరమహంస సెలవిచ్చిరి. కృష్ణుడు కొద్దిమేర బాట తనవెంట గోపికలను నడిపించి, అంతర్ధానము చెందుటలోని పరమార్థమిది. దేవతలనగా ఇంద్రియములకు, మనస్సుకు, బుద్ధికి అధిదేవతలు. వీనికి మనమిచ్చు నివేదనములు వారికే అని భావించినచో ఇంద్రియ తృప్తి, తాత్కాలికమగు మానసిక సుఖము, ఇన్ని విషయములు నాకు తెలియును అను భావముతోనే దారి ఆగిపోవును. ఇవి నిజమైన ఆనందము గావు. ఇంద్రియములు, మనస్సు, బుద్ధి ఈ అన్నిటిని స్వామికే సమర్పింపవలెను. వీటన్నిటిగా అయి, వీటి కతీతుడై యున్న ఆత్మయే కృష్ణుడు. కావున చూడదగిన దృశ్యము, వినదగిన పలుకు, భుజించు ఆహారము, మనస్సులోని తలపు, తెలిసికొను అంశము – అన్నియు అంతర్యామి యగు స్వామికే నివేదింపవలెనని అన్నమయ్య ఉపదేశము. దేవుడు తేటలు మరగినవాడనగా స్వచ్ఛమైన, పవిత్రమైన హృదయము లందు తన అనుభూతిని నింపుటయే గాక, తాను కూడ అట్టి హృదయములకు వశమైన సంతోషముతో చొక్కునని యర్థము. గోపికలట్టివారే. అన్నమయ్యయు అట్టివాడే. తాను స్వామియందు, స్వామి తనయందు పొందిన అనుభూతినే ఇచ్చట నిగూఢముగా ధ్వనింపజేయుచున్నాడు. ఆత్మీయత అన్నమయ్య కవితలో ఎక్కువగా కనిపించును. అనగా స్వీయానుభూతియే గానవచ్చును.

2వ చరణము యొక్క తాత్పర్యము

"కృష్ణుని వాక్కులు చికాకులు పెట్టుచుండును. అతడు చేయు వాదములు ఆగుట లేదు. జ్ఞానమును కలిగించునవి. ఊహకు, తర్కమున కందనివి. మొదట ఇతడు చెప్పు మంచి తీయని మాటలు, తర్వాతి కాలమున శోకమును కలిగించును. అతని నడవడిని లోకులు పొగడుచుండగా, భక్తులను సరియగు మార్గమున నడిపించును. ఇతని తల నెమలి పింఛములతో అలరారుచుండును. ఇతనిని తీసికొనిరమ్ము."

వ్యాఖ్య

కృష్ణుని మాటలలోని భావము ఒక్కొక్కసారి వాచ్యముగా నుండక, లోపల నిగూఢార్థము కలిగి చికాకు కలిగించుచుండును. ఉదాహరణకు గోపికల వస్త్రముల నపహరించిన తదుపరి వారితో నిట్లనెను. "నే నన్యుడనే... మీలోన నెప్పుడునున్నాడ, నేను జూడని మర్మమెద్ది గలదు." వీనిలోపలి భావమిది. "మీకు నేను పరాయివాడను కాను అనగా మీకంటె వేరు కాను. మీరెల్లరు నా స్వరూపములే. మీ హృదయములందు ఆత్మగా ఎప్పుడునున్నాను. మీలోని రహస్యములలో నాకు తెలియనిది గలదా? అనగా మీ బుద్ధి, మనస్సు, ప్రాణము, ఇంద్రియములు మున్నగు శరీరము లోపలి భాగములకు నేనే కదా ఆధారమును. అందలి మనోభావములు నాకు తెలియును గదా! స్థూలార్థమున అతని మాటలు చికాకుపరచును. అతని వాదములు

మన తర్కమునకు, ఊహకు అందనివి. గోపికలు కృష్ణుని వద్దకు రాగా, "మీమీ ఇండ్లకు పొందు, ఇటుల ఒంటరిగా నావద్దకు రావచ్చునా? మీ భర్తలను సేవింపుడు" అనెను. అనగా మీరు నన్ను చేరవద్దని గాదు. ఇచట నానుండి పొందిన భగవదనుభూతిని మీ ఇండ్లలో కర్తవ్యములు నాకర్పించుచు పొందుడు. ఎందరి నడుమ కర్తవ్యములు చేయుచున్నను, అందరిలో నున్న ఒకడనగు నాయందు మనస్సు ఉన్నచో మీరు ఒంటరిగా నున్నట్లే. ఏకాంత భక్తులే. మీ భర్తలయందు కూడ నన్నే చూడుడు. ఇట్లు కాదనుటకు వీలులేని బోధలివి. మొట్టమొదట తీయగా మాట్లాడి, కృష్ణుడు తర్వాత కన్పడకుండ పోవును. దానితో గోపికలకు, వారి వలెనే అన్నమయ్యకు విరహ వేదన హెచ్చెను. మాటలలో మధురానుభూతినిచ్చి, అది నిలబడవలెనన్నచో తనను స్మరించుట సదా సాగుటకై అదృశ్యుడై కృష్ణుడు ఆర్తిని పెంచెను. మరియు పైపై అర్థము వచ్చు కృష్ణుని మాటలు కూడ బ్రహ్మజ్ఞానమును ప్రసాదించును. అతని నడవడికలు జనులు మెచ్చునవి. వానిని సంకీర్తనము చేయువారి బ్రతుకులను అతడే నడిపించును. పైగా అతడు ఇతరుల కొరకై ధైర్యముతో తన సంగతి చూచుకొనకుండ అసురులను, కాళియుని మర్దించుటకు సిద్ధపడిన విధానము, ఆవులను పూజించి మేపుట, పంటను వృద్ధిచేయుట, కలిసి బ్రతుకుట, అందరితో చనువుగా ఒకడుగా మెలగుట. ఎట్టి పరిస్థితిలోను నవ్వు చెదరకుండ ఇతరులను నవ్వించుట వంటి ప్రవర్తనలు మన కాదర్శములు. కృష్ణుడు చేసిన కొన్ని ఘనకార్యములు దివ్యములు, మనవలన గానివి. కాని అతని మంచి గుణములు, ప్రేమ, నిత్యానందము, త్యాగము, నిత్యము లోక హితార్థమై పనిచేయుట వంటి నడవడికలను మన మనుసరింపవలయునని అన్నమయ్య 'పోకులు, మనిపెడి' అను చిన్న పదముల ద్వారమున ఉద్బోధించెను. నెమలిపించము వివిధ వర్ణముల సమ్మేళనము. అట్లే సృష్టిలోని రకరకములయిన వైభవమంతయు శ్రీకృష్ణుని తలపైని అలంకారము. ఉదాహరణకు మబ్బులు అతని కురులు. అతని నవ్వు మెఱపు. తల చుట్టు వెలయుచున్న పింఛపుదండ ఇంద్రధనుస్సు. అతని కరుణా కటాక్షములే వాన నీరు. ప్రకృతి వైభవమంతయు అతనిదే అని భాగవతము కీర్తించు చున్నది. అన్నమయ్య ఇట్లు కృష్ణుని దర్శించి, పులకరించి మురిసి ఈ చరణము గానము చేసెను. అదియునుగాక 'మనిపెడి' అను పదములో వేదభావ మున్నది. ఎల్లరి జీవులలో నున్న వెలుగై స్వామి గాయత్రీ స్వరూపుడై వారి బుద్ధులను నడిపించు చుండును. ఆయన నుండి వచ్చిన సంకల్పములను సూర్యకాంతి నిర్మలబుద్ధి అను స్వచ్ఛమైన నీటిలో చక్కగా ప్రతిబింబించును. ఈ సంకల్పములను బట్టి మనుగడ సాగించువాడు దేవుని సన్నిధి ననుభవించును. దివ్యుడగునని అన్నమయ్య భావము. ఈ మహాభక్తుడు గాయత్రీ మంత్రమును శ్రద్ధతో ఉపాసించినవాడు.

3వ చరణము యొక్క తాత్పర్యము

"శ్రీకృష్ణుని నవ్వులు భగ్గులు – మంటలు. అందువలన ఇతని వద్దకు ప్రవేశించుట చాల ఆశ్చర్యపడదగిన సన్నివేశము. మరియు కొనియాడదగినది గాదు కూడ. తపస్సులగు మునులు కూడ అతని దగ్గర జేరి భయపడుచుందురు. అట్టి కృష్ణుని నావద్దకు తీసికొనిరమ్ము. అట్టి తపస్సుల సిగ్గులను పోగొట్టెడివాడు శ్రీవేంకటనాథుడు. అతని సంపద అత్యధికమయినది. వేంకటపతి అయిన శ్రీకృష్ణుని ఓ వన్నెల చెలీ! నావద్దకు తీసికొనిరమ్ము."

వ్యాఖ్య

భగవంతుని నవ్వులు ఆనందదాయకములు. పరిశుద్ధి నొసంగునవి. అవి మరి మంట లెట్లగును? అన్నమయ్య ప్రయోగము చిత్రముగా నున్నది. ఇది అతని దర్శనము. పైకి నవ్వులుగా నున్నను, కృష్ణుడు సృష్టి స్థితి లయ కారకుడయిన పరబ్రహ్మము. ఒకవిధమైన నవ్వులో నుండి బ్రహ్మాండ గోళములను కల్పించును. వేరొక విధమైన నవ్వులో నుండి జగత్తును పోషించును. ఆశ్రితులకండగా నిలుచును. మరియొక రకమైన నవ్వులో జగత్తును, బ్రహ్మాండ గోళములను లయించును. కాలమను సాగరపు టొడ్డున బ్రహ్మాండ గోళములను పిచుకగూళ్ళను సృజించు చిత్రమయిన శిశు వీతడు. ఇతని నవ్వు సామాన్యముగా అనంత దయను వెల్లివిరిసి, భక్తుల నానందసాగరమున ఓలలాడించును. గోపికల కట్టి స్థితి కలిగినది. శిశుపాల జరాసంధ దుర్యోధనాదుల పాలిట మృత్యువయినది. భారత యుద్ధమున రెండు సేనల నడుమ రథముపై కూర్చుండి కృష్ణుడు నవ్వుచునే కౌరవసేన యొక్క ప్రాణములను హరించెను.

స్వామికి శుచిస్మితుడని పేరు గలదు. పవిత్రతయే తన నవ్వుగా వెల్లివిరియువాడు. అంతేగాక అతి పవిత్రమయినది అగ్ని. ఇతని నవ్వు అగ్ని యని పురాణములలో చెప్పబడినది. కావుననే అన్నమయ్య 'బగ్గల్' అనెను. కృష్ణుని నవ్వు అను అగ్ని నుండి వెలువడు మంటలలో ఎదుటివారి మలిన భావములు కాలిపోవునని అన్నమయ్య దర్శనము. ఆహా! ఎంతటి ఉదాత్త దృష్టి ఇతనిది. పురాణకర్త యగు వ్యాసుని యెద ఈతనిది. ఇట్లు నవ్వులు గల స్వామి వద్దకు చేరుట యన్న తపోధనులగు మునులకు కూడ భయమే. మరి తపస్సులు, క్రతువులు, వేదాధ్యయనాదులు, మంత్ర తంత్రో పాసనములు మున్నగునవి ఏవియు రాని గోవులు, గోపాలురు, గోపికలు, చెంచితలు కూడ సహజ స్వచ్ఛముగా కృష్ణుని చేరి ఆతనితో ఆడుకొనిరి. వారికి తామింతటి వారమను స్పృహ లేదు. సరళత, అమాయికత, అచ్చమయిన గుండె వారి సొత్తు. వారికి స్వామి సులభుడు. ఒక్కొక్కసారి మునులకు మేము మునులమనియు, ఇంతటి తపస్సు చేసినవార మనియు గుర్తుండును. వీరిలోని ఈ లోపమే స్వామి వద్దకు చేరుటకు అడ్డుగా నిలచునే కాని స్వామిలో తేడా ఏమియు లేదు. స్వామికి దగ్గర, దూరములు లేవు. మనకే ఈ రెండును. కృష్ణుడు పనుపగా గోపాలబాలురు మునిపల్లె లోని ముని పత్నుల వద్దకు బోగా, వారు ఆహారపదార్థములను వెంటనే తెచ్చి స్వామికి, అతని సఖులకు సమర్పించి ధన్యులయిరి. కాని మునులు క్రతువులు చేయుచున్నామను నెపముతో రాలేకపోయిరి. ఆ క్రతువులకు గమ్యము అతడే కదా! ఇట్టి వారెప్పుడును ఉందురు. ఒకడు దేవునికి పూజ చేయుచున్నాడు. ఇంకను నివేదనము అర్పింపలేదు. ఇంతలో అతని ఇంటి వాకిట ఒకడు ఆకలిగొని నిల్చుండి, ఆహారమునకై అర్థించుచున్నాడు. ఈ పూజ చేయుచున్న వాడు 'నేనింకను స్వామికి నివేదనము పెట్టలేదు. నీకు పెట్టను పొమ్మని' కసరును. ఆ వచ్చినవాని ఆకలి స్వామియే కదా! అతని కాహారమిడుట స్వామికి నివేదనమే గదా! సజీవ విగ్రహములను పూజించుట కిష్టము లేనివాని కెన్నటికిని స్వామి సన్నిధి – భగవదనుభవము – శాంతి లభింపవు. ఇతనికిని ఆకలిగొన్న బిచ్చగాని స్థితి వచ్చినగాని మానవత్వము మేల్కొనదు. ఇట్టివాడు ఉత్తరజన్మలో బిచ్చగాడుగా పుట్టక తప్పదు. ఒకసారి ఒక ఉపాసకురాలు

శ్రీరామకృష్ణపరమహంస వద్ద బాలగోపాలుని అర్చించుట నేర్చినది. బాలకృష్ణునకు నివేదన మర్పించు లోపలనే ప్రతిదినము ఈమె మనుమడు ఆ పదార్థమును భుజించుచుండెను. ఆమె కసరినది. బాధపడినది. తన పరిస్థితిని శ్రీరామకృష్ణులకు తెలిపినది. వారిట్లనిరి "ఏమీ! బాలకృష్ణునికై నివేదించుటకు నీవుంచిన పదార్థమును బాలకృష్ణుడే నీ మనుమడుగా వచ్చి స్వీకరించెనని ఏల యనుకొనరాదు?" అంతటితో ఆమెకు జ్ఞానోదయమయినది. ఇట్టివారిని చూచి, వారి సంకుచిత బుద్ధికి, విగ్రహములో నుండి స్వామి నవ్వుకొనును. ఒకసారి యశోద కృష్ణుని ఇట్లడిగినది. "నీవెప్పుడును బ్రాహ్మణులు చేయు యాగముల వైపు పోనేపోవు. ఎప్పుడును గోపబాలురతోనే మెలగుచుందువేమి?" కృష్ణుడు బదులుగా నవ్వెను. ఆ నవ్వులోని పరమార్థమును లీలాశుకుడిట్లు వర్ణించెను. "అమ్మా! బ్రాహ్మణులు చేయు యాగముల చెంతకు పోవుటకు నాకు సిగ్గుగా నున్నది. గోపాలురతో కలిసి బురదలో ఆడుకొనుటయే నాకెంతో ప్రీతిగా నున్నది." స్వామి నవ్వులో ఇట్టి వింత లెన్నియో ఉండును. శ్రీకృష్ణుని ఏడుపు కూడ విచిత్రమే. ఒకసారి అతడు ఇంటిలోని పెరుగుకుండను పగులగొట్టెను. యశోద కోపించి ఱోట గట్టెను. కృష్ణుడు కన్నీరు పెట్టుకొనుచు ఏడ్చెను. యశోద సముదాయించెను. తాను పరమాత్ముడయ్యును ఇట్టి చిత్ర లీలలను ప్రదర్శించి, యశోదాదుల చిత్తముల నాతడు లోగొని తన యనుభూతి నొసగెను. అయితే, తన దగ్గరకు చేరుటకు భయపడుచున్న తపస్వులను కూడ స్వామి విడిచిపెట్టడు. వారికి క్రమముగా మేము తపస్సు చేయుచున్నామను అతిశయమును తొలగించి, సిగ్గును, దేహభ్రాంతిని వదలించి తన వద్దకు చేర్చుకొనును. దీనికి ఉదాహరణమే అనేక పూర్వజన్మలలో తపసులాచరించి తనకై ఆర్తినందిన మునులను స్వామి కృష్ణావతార మున తోడి గోపబాలురుగా గొనితెచ్చెను. వీరి కేమియు వేదము రాదు, తపము చేయుట రాదు. అచ్చమైన అనురాగ మొక్కటే వీరిలో కలదు. కావున కృష్ణునకు దగ్గరయిరి. ఏ కారణముల వలన మనము స్వామికి దగ్గరగా చేరలేకపోవుచున్నామో, ఆ కారణముల నాతడు కరుణతో తొలగించును. శ్రీవేంకటేశ్వరుని సంపదలు అత్యధికములని అన్నమయ్య కీర్తించెను. ఈ చివరి చరణములో ఈ యంశమెందులకు? పైన చెప్పిన విధముగా స్వామికి దగ్గరయిన వానికి ఇట్లు అన్పించును. సృష్టిలోని ప్రకృతి వైభవ మంతయు స్వామి సంపదయే. సంపద అనగా వేడి, వెన్నెల, గాలి, నీరు, పాడి, పంటయే గాని డబ్బు గాదని అన్నమయ్య చెప్పదలచెను. ప్రకృతిలోని పైవన్నిటిని స్వామి సంపద అని వచ్చినవారు కలిసిమెలిసి వానిని అనుభవింతురు. ధనమును నమ్మినవాడు, ఇతరుల సంపదను దోచుకొని తాను అశాంతుడై, సమాజము నకు కీడు చేయువాడగును. నిజమైన భక్తుడయిన వాడు తనకు సిద్ధించిన సంపదను సొంతమైనదిగా భావించక స్వామిదే అనుకొని, ఇతరులతో కలసి అనుభవించును. దీనినే ముక్తి యని రామానుజులు పేర్కొనిరి. దీనిని కపిలుడు భాగవతమున బోధించెను. సామాజిక ఆర్థిక వ్యవస్థ ఎట్లుండవలెనో ఆధ్యాత్మికత అను పునాదిపై అన్నమయ్య దర్శించి మనకందించి ప్రవక్త ఆయెను. అంతేగాని, ఈ చరణమున వేంకటేశ్వరుడు చాల బంగారు ఆభరణములను ధరించువాడు, ఎంతో డబ్బు గలవాడని యర్థముగాదు. వీనిని స్వామి కోరలేదు. మానవుల కిష్టమైన వానిని స్వామికి అమర్చిరి. శ్రీకృష్ణ లీలలలోని పరమార్థము నింత తేటగా తెలిపి, భక్తిసాధనా రహస్యములను, సమర్పణమును, ఉత్తమ సమాజస్థితిని విప్పిజెప్పిన అన్నమయ్య పూజనీయుడు.

* * *

49

1వ సం-468 **సకల జీవులకెల్ల** దేసాక్షి

సకల జీవులకెల్ల సంజీవి యీ మందు
వెకలులై యిందరు సేవించరో యీ మందు. ॥ పల్లవి ॥

మూఁడులోకము లొక్కట ముంచి పెరిగినది
పోఁడిమి నల్లనికాంతిఁ బొదలినది
వేఁదుక కొమ్ములు నాల్గు పెనచి చేయివారినది
నాఁడే శేషగిరిమీఁద నాఁటుకొన్న మందు. ॥ సకల ॥

పడిగెలువేయింటి పాము గాచుకున్నది
కడు వేదశాస్త్రముల గబ్బువేసేది
యెదయక వొకకాంత యెక్కుక ఉండినది
కడలేని యంజనాద్రిగారుడపు మందు. ॥ సకల ॥

బలుసంకుఁజక్రముల బదనికె లున్నది
తలఁచినవారికెల్లఁ దత్త్వమైనది
అలరిన బ్రహ్మరుద్రాదులఁ బుట్టించినది
వెలుఁగుతోడుత శ్రీవేంకటాద్రి మందు. ॥ సకల ॥

నీ కర్తవ్యమును మాత్రమే దృష్టిలో ఉంచుకొని నీ పనిని
నీవు చేసుకొనిపోతూ ఉంటే ఆటంకములు రావు.

టీక

వెకలురు = ఉన్మత్తులు, పోడిమి = మోహనము తోడి శోభ కల్గిన, పొదలి = వ్యాపించి, వారి = పట్టుకొని, గబ్బు = పరిమళము, ఎడయక= ఎడంబాటు, కడ = మేర, బదనిక = పెద్ద వృక్షాలపై పెరిగే తీగలాంటి మూలిక. ఇది అమృతంలాంటి దివ్యౌషధం, సంకు = శంఖము.

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య భగవంతుడగు శ్రీవేంకటేశ్వరుని సంసార మనెడి రోగమునకు మంచి మందుగా కీర్తించుచున్నాడు. ఇట్టి వర్ణనము ఆళ్వారుల రచనల లోను గలదు. కులశేఖరాళ్వారు ముకుందమాలలో ఇట్లనెను. "కృష్ణుడను జ్యోతి మనలోనే ఉన్నది. ఇది సాటిలేనిది. అది అమృతమైన మందు. దానిని త్రాగుడు. ఓ మనసా! భగవంతుడను దివ్యమగు మందు వ్యామోహములను నివారించునది. అసుర గుణములను తొలగించునది. మూడు లోకములకు సంజీవని యిది. భక్తులకు మిక్కిలి మేలు గూర్చునది. సంసార భయములను రోగములను నాశనము చేయునది. ముక్తిని కల్గించునది. దీనిని త్రావుడు. ఈ శరీరము మార్పులకు లోనగుచుండును. ఎప్పటికయినను ముసలితనమునంది పడిపోవును. ఎన్ని మందులు వాడినను ఈ పడిపోవుట ఆగదు. అమృతమైన భగవంతుడను రసాయనమును త్రావుడు." ఆళ్వారు లెల్లరి భక్తిని పుణికిపుచ్చుకొన్న అన్నమయ్య స్వామిని దివ్యమగు మందుగా కీర్తించుచు ఇంకను ఈ మందు యొక్క మహిమను, వైభవమును హృదయమార ఉత్సాహముతో వర్ణించుచున్నాడు. ఈ మందును తాను లోన స్వీకరించి, అనుభూతి నంది మన కుపదేశించుచున్నాడు. దేవుని మనము స్వీకరించు మందుగా భావించుటలో ఒక విశేషమున్నది. దివ్యమూర్తిగా వేంకటాద్రిపై వెలసినను, స్వామి అమృతమయమైన, అఖండమైన, ఆనందానుభూతియే. కావున ఈ మూర్తిని అర్చించి, ధ్యానించి, కొలిచి, ఆ అనుభూతిని స్వీకరించుడని అన్నమయ్య భావము. ఈ సంకీర్తనలో ఎన్నియో వేద భావములు లోన దాగియున్నవి. మహాభక్తుడగు అన్నమయ్య, స్వామినే అనుభూతి యను మందుగా స్వీకరించుట వలన స్వామి దయతో ఆ మందు యొక్క మహిమ దర్శనమీయగా ఈ సంకీర్తనము వెలువడినది.

పల్లవి యొక్క తాత్పర్యము

"జీవులెల్లరికి ఈ మందు సంజీవి. ఇందరును ఈ మందును పరవశులై సేవించుడు."

వ్యాఖ్య

జీవు లెల్లరు సంసార రోగముతో బాధపడక తప్పదు. సంసారమనగా భార్య, సంతానము, ధనము మున్నగువాని యందలి వ్యామోహము. త్రిగుణముల ప్రభావము వలన కామ క్రోధాదులలో మనస్సు చిక్కుపడువాడు సంసారజీవి. దీనికి కేంద్రము అహంకారమే. అఖండమైన, సర్వవ్యాపకమయిన ఆత్మయే దేవుడు. దేవుని వెలుగును ముక్కలుగా చూచు దృష్టి గలవాడే జీవుడు. తోటి జీవుల దేహములను, వానితో గల తానారోపించుకొన్న రాగద్వేషాదులను చూచుచు దుఃఖమను రోగము వలన పీడితు డగుచున్నాడే

కాని, జీవుడు ఆయా వ్యక్తులలో, వస్తువులలో, పరిసరము లలో, పరిస్థితులలో అంతర్యామి యగు దేవుని చూడకున్నాడు. ఇట్టివారికి సర్వము తానయిన స్వామి సంసార రోగమును పోగొట్టు మందు. ఇతరులను తననుండి వేరుగా గమనించుటయే రోగము. తనలోను, ఇతరులలోని స్వామిని దర్శించుటే యోగము. యోగమున్నచో రోగముండదు. సంజీవి యనగా చక్కని జీవనమును ఇచ్చునది అని యర్థము. అనగా ఆనందముతో గూడిన దివ్యజీవనము నిచ్చునది. మరియు మరణించు వారిని గూడ మరల బ్రతికించగల మహిమ గల మందుకు 'సంజీవి' అను పేరు పురాణములందు ప్రసిద్ధము. రామాయణమున హనుమంతు డిట్టి మందు తోనే లక్ష్మణుని బ్రతికించెను. ఇచట భగవంతుని స్మరణ లేని క్షణమే అసలయిన మృతి యనియు, భగవంతుని స్మరణ ఉన్న క్షణమే అమృత మనియు అన్నమయ్య భావము. స్వామిని నిత్యము స్మరించిన జీవుడు బంధములను రోగముల నుండి విముక్తుడై తన అసలు స్థితి యగు ఆనందమున నిలుచును. స్వామి యను మందును సేవించుడని అన్నమయ్య ఉపదేశించుచున్నాడు. సేవించుట యనగా రెండర్థములు గలవు. 1. మందును స్వీకరించుట. 2. పాదసేవ చేయుట. ఈ సందర్భమున ఈ రెండర్థములును సరిపోవును. అంతర్యామి యగు స్వామి పాదములను సేవించుటే స్వామి యను మందును స్వీకరించుట అని అన్నమయ్య నిర్వచనము. 'వెకలులై' సేవించుడని ఆతని యుపదేశము. అనగా పరమాత్మ యందు మత్తత పొంది, పరవశులై సేవించుడని భావము. సాధారణముగా మందును సేవించుటలో రోగి కిష్టముండదు. తప్పనిసరి గావున గ్రహించును. కాని జీవుడు భగవంతుడను అమృత మగు మందును సేవించునపుడు తప్పనిసరియై మ్రొక్కుబడి వలె గాక, ఉన్మత్తుడై స్వీకరింపవలెను. వాస్తవమున హృదయ సమర్పణతో ఈ మందును సేవించునపుడు తాను, ఈ మందు, మందును స్వీకరించుట అని మూడంశము లుండుట జరుగదు. మూడును తానే అయి స్వామి నిలుచును. స్వామి ఆనందరసము గావున జీవుడు గూడ ఈ స్థితిలో ఆనందరసమే యగును. దీనినే ఉన్మత్తత, పారవశ్యమందురు. ఉదాహరణకు భగవత్ సంకీర్తన చక్కగా సాగుచున్నపుడు, భక్తుడయిన శ్రోతకు గాయకుడు, గానము, తాను – ఇతరుల వ్యవహార దృష్టిలో వేరుగా కానవచ్చును గాని, తనకు గాదు. తనకు మూడు లేవు. మహాభక్తులు పసిపిల్లల వలె, ఉన్మత్తుల వలె, పిశాచముల వలె చరించెదరని నారదుడు భక్తి సూత్రములలో ప్రకటించెను. ఋషభుడు, శుకయోగి, గోపికల వంటి వారిట్లే యుండిరి. శుకయోగిని చూచి బాలురు పిచ్చివాడనుకొని వెంబడించిరని భాగవతమున చెప్పబడినది. అన్నమయ్యయు ఇట్టివాడే. ప్రతి జీవియు ఏదో ఒక పిచ్చి గలవాడే. చివరకెల్లరు స్వామి యెడల పిచ్చికి రాకతప్పదు. వెంటనే రండని మనలను అన్నమయ్య ఆహ్వానించుచున్నాడు. అందులోని రుచి మరగిన వాడగుటచే మన యెడలను అతని యారాట మట్లున్నది. 'వెకలులు' అను తెనుగు పదములో ఇంతటి భక్తిపారవశ్య స్థితిని చక్కగా అన్నమయ్య సూచించెను.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"భగవంతుడను మందు మూడు లోకముల నన్నిటిని ఒకేసారిగా ముంచి పెరిగినది. లోకములను మోహింపజేయగల శోభతోడి నీలకాంతితో ప్రకాశించుచు, వ్యాపించియున్నది. ఆటగా నాలుగు కొమ్మలు పెంచి, చేతితో పట్టుకొన్నది. ఎప్పుడో శేషాద్రిపై నెలకొన్నది."

వ్యాఖ్య

భగవంతుని కొన్ని అవతారములను, శోభను అన్నమయ్య ఇచట కీర్తించుచున్నాడు. వామనావతారమున స్వామి మూడు లోకములను తన తేజస్సులోనికి స్వీకరించి, వానిని దాటి పెరిగినవాడయ్యెను. వామనుడనగా పొట్టివాడు. భగవంతుడు ఆత్మయైన వాడు. ఆత్మ విశుద్ధమయిన ఆనందరసమగు చైతన్యమే కాని పదార్థము గాదు గావున పదార్థమున కుండు కొలతలు ఆత్మ కుండవని ఇచటి భావము. విష్ణువు తన్ను దానము చేసికొని, సృష్టియందు అంతర్యామి యగు చున్నాడు. మూడడుగులు బలిని యాచించెను. జగత్తులో మూడు లోకములు గలవు. 1. భూలోకము – ద్రవ్యమయము, 2. భువర్లోకము – శక్తిమయము, 3. సువర్లోకము – ప్రజ్ఞామయము. ఈ మూడవదానిలో మనస్సు కొద్ది భాగమే. కావున ఈ మూడవ దానిని మనస్సు అర్థము చేసికొనలేదు. ఆత్మ యగు విష్ణువు మొదటి రెంటియందును అంతర్యామియై, వానిని దాటి మూడవ దానిని కూడ ఆక్రమించి తనలో ముంచెత్తెను. ఈ మూటిలోను అంతర్యామియై పెరిగెను. ఇట్లు ఇతడే త్రివిక్రముడయ్యెను. రెండు పాదములతో భూమి, ఆకాశముల నడుమనున్న దానిని కొలచి మూడవది యగు పరమపదముతో త్రివిక్రముడయ్యెను. మూడవ అడుగును బలి యొక్క తలపై పెట్టె ననగా జీవుని 'అహంకార ప్రజ్ఞ'ను యాచించి, తన అంతర్యామిత్వములోనికి అతనిని గైకొని ఉద్ధరించుచున్నాడని భావము. మనలోని జీవభావనను ఆక్రమించు దైవ భావనయే వామనుడు. మొదటగా మన భూమిపై మానవుడు పుట్టుట ఈ అవతారముతోనే జరిగినది. తనయొక్క శరీరము, ప్రాణము, మనస్సు అను మూడు లోకము లందు వ్యాపించి, అతనిని తనలోనికి స్వామి లోగొన్న అనుభూతి అన్నమయ్యకు కలిగినది. స్వామి నీలకాంతితో ప్రకాశించుచున్నాడు. ఈ కాంతి సకల లోకముల యందు వ్యాపించి యున్నది. నీలాకాశమే స్వామి దేహము. ఆకాశము కంటికి కనపడని దివ్యకాంతి – చైతన్య తేజము కలిగినది. ఆకాశము జగత్తు అంతట వ్యాపించియున్నది. కావున స్వామి నీలకాంతియు వ్యాపించియున్నది. మరియు 'పోడిమి' అనగా శోభతోడి మోహనత్వము గలదన్నమాట. జగత్తులోని జీవులను, వస్తువులను విడివిడిగా గమనించినచో మోహము కల్గును. అనగా అంతటనున్న స్వామి మరపునకు వచ్చి, చిక్కులు కలుగును. ఆకాశములో అన్నియు భాగములే. అట్లే స్వామిలో ఎల్లరు భాగములే. జీవులను గాక, అంతర్యామి యగు స్వామిని దర్శించినచో దివ్యమైన మోహము – అనగా పారవశ్యము కలుగును. అపుడు పై మోహము విడుచును. మూడు లోకములను – అనగా మన దేహమును, ప్రాణమును, ప్రజ్ఞను మోహింప జేయు కాంతిగలవాడని భీష్ముడు భాగవతమున కృష్ణుని నుతించెను. ఇంతేకాక శ్రీవేంకటేశ్వరుని దివ్యమూర్తి వెనుక గల దివ్యమగు నీలకాంతి లోకమంతట ప్రకాశించుచు వ్యాపించి యున్నదని అన్నమయ్య అనుభూతినంది మనకు తెలుపు చున్నాడు. వేంకటేశ్వరుడు విశ్వవ్యాప్తమగు మోహన నీలకాంతితో శోభిల్లుచు ఇతనికి కన్పడెను. సాధారణ జీవులకు శ్రీవేంకటేశ్వరుడు తిరుమలలోనే యున్నాడు. అన్నమయ్యకు ఆ స్వామియే అంతట ఉన్నాడు. ఇక స్వామి నాలుగు కొమ్ములు గలవాడని అన్నమయ్య వర్ణించెను. యాదగిరిలో లక్ష్మీనరసింహస్వామికి నాలుగు కోరలు గలవు. అన్నమయ్య ఈ స్వామిని కీర్తించెను. కొమ్ములనగా కోరలనియు అర్థము గలదు. స్వామి నరసింహమూర్తియై తన నాలుగు కోరలను పెంచినవాడై, చేతితో హిరణ్యకశిపుని ఒడిసి పట్టుకొని

క్రీడగా చంపెను. స్వామి కాలస్వరూపుడు. స్వామి యొక్క నాలుగు కోరలు మనకు కనిపించు సూర్యోదయము, మిట్ట మధ్యాహ్నము, సూర్యాస్తమయము, నడిరేయి. ఈ నాలుగు స్థితులును మాసము నకును, సంవత్సరమునకును, ప్రతి సౌరకుటుంబమునకును గలవు. జీవిలో హిరణ్య కశిపుడను అసురుడు 'మదాంధత' అను గుణముగా నున్నాడు. ఈ మదము సర్వాంత ర్యామి యొక్క ఉనికిని అంగీకరింపదు. ఇతరులపై తన అధికారమునే నమ్మును. అధికార మదము ఇతరులను బాధించును. తన కుమారులు సూర్యతేజము గల లక్ష్మీదేవిని ఆశ్రయించి భక్తులు గావలయునని వారి తండ్రి 'హిరణ్య' శబ్దముతో పేర్లు పెట్టెను. కాని వీరు లక్ష్మి యనగా ధనము, అధికారమని నమ్మిరి. నరుని హృదయములోనే నారాయణుడున్నాడు. హృదయమునే జ్యోతిశ్శాస్త్రమున సింహరాశి యందురు. కాని జీవుడు తన హృదయమున స్వామిని చూడక, తన యునికినే చూచునుగావున అది నిర్జీవమగు స్తంభమగును. మరల భక్తిమార్గమున శరణందినచో నారాయణుడు అందుండియే నరసింహుడై అనుభూతినిచ్చి, మదమను ఏనుగును సంహరించును. ఇట్లు మదము జీవులకు కలుగుట, శరణాగతి వలన స్వామి దయతో అది తొలగుట స్వామి క్రీడ. కావుననే 'వేడుక' అని అన్నమయ్య ప్రయో గించెను. దుష్టసంహారము స్వామికి ఆటయే గాని, శ్రమ కాదు. ఏలయనగా ఆ దుష్టుని హృదయమున వసించువాడును స్వామియే. తనయొక్క ఒక రూపమే దుష్టుడు. తన ఒక రూపమును తాను ఉపసంహరించుట స్వామికి వేడుకయే గాని, శ్రమ కాదు గదా. అసురుని చేతితో ఒడిసిపట్టి, స్వామి అతనిని చీల్చి చంపెను. చేయి సంకల్పమును అమలుచేయుటకు సంకేతము. మనలోని దుష్టగుణమను మదమును తొలగింప స్వామి సంకల్పించుటయే తన చేతితో పట్టుట. ఆపై గల్గునది జీవునకు కల్గునది ప్రహ్లాదమే. అనగా దివ్యానందమే. ఈ క్రీడ అంతయు కాలక్రమమున జరుగుటచే నరసింహుడు కాల విభాగములగు నాలుగు కోరలు గలవాడుగా వర్ణింప బడెను. మరియు కాలమును దేవునిగా అర్చించువానిలో ప్రహ్లాదు డుదయించెను. మదము వైదొలగును. ఈ స్వామియే శేషగిరిపై వేంకటేశ్వరుడుగను వెలసియున్నాడు. స్వామి ఎప్పుడువెలసెనో చరిత్ర నిర్ణయింపజాలదు. బలరాముడు కూడ వేంకటేశ్వరుని దర్శించెనని భాగవతమున నున్నది. స్వామిని ముందుగా అన్నమయ్య తెలుపుచున్నాడు గావున 'వెలసెను' అనకుండ 'నాటుకొనెను' అని పలికెను. మందుకు ఔషధమని పేరు. అనగా ఓషధి నుండి పుట్టినది. ఓషధి మొక్క గావున నాటుకొన్నదనుట సబబు. ఎవరును నాటలేదు. దానికదియే ఈ మందు నాటుకొన్నది. అనగా వేంకటేశ్వరమూర్తిని ఎవరును ప్రతిష్ఠింపలేదు. తనకు తానుగా ఆయన వెలసెను. ఈ స్వామి శేషగిరిపై వెలసెను. శేషుడే తిరుపతి కొండగా ఆకారము ధరించెను. మనలో గూడ వెన్నెముకయే శేషాద్రి. ఇపుడు తిరుమలపైన గల వేంకటేశ్వరుడే సర్వవ్యాపిగను, తన సహస్రారము నందునను అన్నమయ్య దర్శించెను. ఇది మూడు విధములయిన ఒకే దర్శనము.

2వ చరణము యొక్క తాత్పర్యము

"వేయి పడగలు గల పాము తాను శయ్యయై సేవించిన మందు ఇది. చాల వేదములందు, శాస్త్రములందు మంచి పరిమళమును గుబాళించినది. మంగాంబిక యను కాంత ఎడబాటు చెంది, కొండ నెక్కుట పొసగని మందు. మేరలేకుండ అంజనాద్రిపైని గరుడ సంబంధమగు మందు."

వ్యాఖ్య

ఆదిశేషుడు వేయి పడగల పాము. అనంతకాలమే శేషుడు. విశ్వశక్తి యగు శేషుడు తన పడగలపై సమస్త తారకలను రత్నములుగా ధరించును. మనలోను, భూమిలోను కుండలినిగా శేషుడున్నాడు. మనలో 'సహస్ర' అను మంత్రము యొక్క తేజస్సు గలవాడై మన వాక్కును, శ్వాసను, పాము బుస వలె ప్రసాదించుచున్నాడు. అనంతస్వరూపుడగు శేషుని పొలుసులందు బ్రహ్మాండములు గలవు. ఇతడు స్వామికి శయ్య. ఇంతియేగాక, క్షీరసాగరమను పేరు గల తారకా వ్యూహమున ఆదిశేషుడను తారకల గుంపు గలదు. శేషుడు కాలమై ప్రళయము నందును స్వామియందుండును. శేషుడు విశ్వమును భరించుచు, స్వామికి దాసుడుగా తనను గూర్చి భావించును. ఇతని వలెనే మనము కూడ భావించినచో మన హృదయమే స్వామికి శయ్య కాగలదు. ఈ శేషుడే శేషాద్రిగా వెలసి స్వామిని శిరసున ధరించుచున్నాడు. శేషము గలవాడు స్వామి. అనగా శేషి. ఆయనలో భాగమగు శేషము శేషుడు. పరబ్రహ్మమను వెలుగు నాలుగు వేదములందును, వేదాంగములగు ఆరు శాస్త్రములందును పరిమళమును గుబాళించినది. వేదములు నాలుగు. 1. ఋగ్వేదము, 2. సామవేదము, 3. యజుర్వేదము, 4. అధర్వణ వేదము. వీనియందు స్వామిని గూర్చిన కీర్తనము, ఆయనను పొందు విధానము వర్ణింపబడినది. మన ప్రాణమగు సామ యందును, వాక్కు అగు ఋక్కు నందును, మనస్సు తోడి కర్మల యందును అంతర్యామియై స్వామియే యున్నాడు. ఇక శాస్త్రములు ఆరు. ఛందస్సు వేదపురుషుడగు పాదము. కల్పము ఆయన చేయి. వ్యాకరణము ఆయన ముఖము. శిక్ష ముక్కు. జ్యోతిశ్శాస్త్రము కన్ను. నిరుక్తము చెవి. ఇవి అన్నియు వేదములందు కీర్తింపబడిన దేవుని తెలియుటకు ఉపయోగపడును. కాని భక్తి వినా, వీని పాండిత్యము వ్యర్థము. ఇక అమ్మవారగు అలివేలుమంగ ఏడుకొండల క్రింద నున్నది. కొండలపైన స్వామి నెలకొనియున్నాడు. కావున స్వామి యొక్క ఎడఁబాటుతో అమ్మవారు కొండ నెక్కక ఉండినది. ఈమె కాంత. స్త్రీ. కావున కొండ నెక్కలేదని ఒక అర్థము. కాని కాంత యనగా ఆకర్షించునదని యర్థము. కావున స్వామి ఆమె ఆకర్షణకు లోనై ఆమెను తనవద్దకు చేర్చుకొనునని అన్నమయ్య సూచించుచున్నాడు. దీనిలోని నిగూఢభావ మిట్లున్నది. మన వెన్నెముకయే ఏడు కొండలు. ఇందు ఆరు చక్రములు, సహస్రారము గలవు. వెన్నెముక అడుగున మూలాధారమున మంగాంబ కుండలినిగా ఉన్నది. పైన సహస్రారమున స్వామి ఉన్నాడు. ఈ కుండలిని వెన్నెముకగుండా ప్రయాణించుచు, ఆరు చక్రములను దాటి స్వయముగా స్వామిని చేరలేదు. ఆమె చేరకున్నచో, జీవుడు భగవంతుని చేరలేడు, భగవదనుభూతి పొందలేడు. కాని అమ్మవారగు కుండలిని, తన బిడ్డలగు జీవులను తండ్రి యగు స్వామి వద్దకు చేర్చుటకై ఆయనను ఆకర్షించును. స్వామి అపుడు తన దయ అను సుధాధారను వర్షించును. ఆయన దయయు అమ్మ యొక్క ఒక రూపమే. ఆ దయ యొక్క సాయముతో కుండలిని సహస్రారమును చేరి, స్వామి యందు లయించును. జీవుడు కూడ ఆమెతో పాటు పైకి వెళ్లగా, ఇతడును పరమాత్మ యందు లయించును. అపుడు అఖండానుభూతి మాత్రమే యుండును. తిరిగి ఆ యనుభూతి ఇట్టి భక్తుని ద్వారమున ఇతర జీవులకు దివ్యప్రేమగా పంచి పెట్టబడును. ఇదంతయు అన్నమయ్య

తన సాధన సిద్ధింపగా పొందిన అనుభూతి. 'కాంత' అను పదమును ప్రయోగించుటలో ఇంతటి యోగభావము నాతడు ఇమిడ్చెను. ఏడు కొండలలో ఒకదానికి అంజనాద్రి యనియు పేరు గలదు. అంజన మనగా కాటుక. ఈ కాటుక వేసి చూచినచో స్వామి యను నిధి గోచరించును. అమ్మవారి వాత్సల్యమే ఈ కాటుక. ఆ తల్లిని సేవించి, ఆమె వాత్సల్యమును పొంది, ఆ కాటుకతో స్వామిని దర్శింపవలెను. ఈ కాటుకతో కన్పడు నిధి యగు స్వామినే అన్నమయ్య మందుగా వర్ణించెను. ఆమె కనుచూపులలోని వాత్సల్యమే ఆమె ధరించిన కాటుక. ఇదియే అంజనాద్రిగా రూపొందెను. ప్రకృతిని, స్త్రీలను అమ్మగా దర్శించినచో ఈ కాటుక మనకు లభించును. ఆపై గరుడాద్రియు గలదు. స్వామిని అన్నమయ్య గారుడపు మందు అని కీర్తించుచున్నాడు. గరుడుడు అమృతమును తెచ్చి పాములకు పంచిపెట్టిన వాడు. వాని విషమును హరించినవాడు. ఇతడు స్వామికి వాహనము. స్వామిని భక్తితో అంతర్యామిగ కొలిచిన వారిలోని కామ క్రోధములను పాములలోని దుఃఖమను విషము హరింపబడి, అమృతమను ప్రేమ, ఆనందము లభింపగలవు. మనలోను ఉచ్ఛ్వాస, నిశ్వాసలను రెండు ఱెక్కలతో ప్రాణ ప్రక్రియగా గరుడుడున్నాడు. ఈ ప్రాణ ప్రక్రియ 'ఆత్మ' యగు స్వామిని వహించును. తనలోను, ఎల్లరిలోను శ్వాసగా గరుడుని, ఆత్మగా విష్ణుని దర్శించిన వారికి అమృతానుభవమను లభింప గలదని అన్నమయ్య భావము. ఇట్టి అమృతమును తెచ్చువాడగు గరుడుడే గరుడాద్రిగా రూపొందియుండి వేంకటేశ్వరస్వామిని వహించుచున్నాడు. ఈ అమృతానంద రసానుభవము అంతము లేనిది. ఇది కొలతల కందనిది. కావున కడ లేనిదని అన్నమయ్య తెలిపెను.

3వ చరణము యొక్క తాత్పర్యము

"ఈ చరణంలో అన్నమయ్య 'బదనిక' శబ్దాన్ని మాండలికంగా ప్రయోగించారు. స్వామి అనే దివ్య ఔషధ వృక్షం శంఖుచక్రాలనే రెండు 'బదనికలు' కలిగివున్నది. అద్భుతమైన ఈ మూలికలు రెండూ దుష్టసంహారకాలే కాక శిష్టరక్షకాలు కూడ. స్వామి యను మందు తనను తలచిన వారికెల్లను సత్యస్వరూపమై యున్నది. జగత్తులో ఒప్పుచున్న బ్రహ్మ, రుద్రుడు మున్నగు వారిని పుట్టించినది. శ్రీవేంకటాద్రి యందు గల వెలుగే ఈ మందు."

వ్యాఖ్య

స్వామి శంఖము ప్రణవనాదమునకు సంకేతము. ఇందుండియే పంచభూతములు పుట్టును. ఓంకారమును పైకి ఉచ్చరించుచు వినువారి ప్రజ్ఞ, ఆ నాదమునందు లయించి, అంతశ్శత్రువులగు కామ క్రోధాదులు బెదరును. మనము గమనింపగల్గిన మేర మన చుట్టును నేల, నింగి కలిసియున్నట్లున్నది చక్రము. సూర్యకిరణములు ఎంతవరకు ప్రసరించినట్లు భూమిపై నుండి కనిపించునో దాని నడుమనున్న వెలుగు బంతినే విష్ణుని సుదర్శనచక్రమందురు. దీనిని తెలిసినచో అంతయు స్వామియే అను సు = చక్కని, దర్శనము కలుగును. ఇదియే చక్రము. దీనిని ధ్యానించిన వారిలో వేరు భావములను అసురులు

హరింప బడుదురు. కావున ఇచట రెండు యోగసాధనలు చెప్పబడినవి. 1. ప్రతి దినము ఓంకారనాదము నుచ్చరించుచు, దానిని వినుట. ఎల్లరి పలుకులలోను స్వామినే వినుట – ఇది శంఖము. 2. ఎల్లరిలో స్వామినే కనుట – ఇది చక్రము. ఈ శంఖ చక్రముల ధ్యాన సాధన అసురగుణములను సంహరించును. ఇవి వాడితనము గలవి. అనగా తీవ్ర సాధనతో ఈ సాధన చేయవలెను. 'శంఖచక్రధారి దీర్ఘాయుస్సు నిచ్చు మందు.' ఈ గుర్తులను నివాసగృహము వెలుపల చిత్రించుట వలన దుష్ట శక్తులు తొలగుటకు వీలు కలుగును. స్వామి యను మందు తలచిన వారిలో సత్యమును దర్శింపజేయును. సత్యమనగా ఉన్నది. జగత్తుగా కన్పడు దానిలో సత్యము స్వామియే. అంతర్యామి యగు స్వామిని తలచినచో ఆయనయే సత్యుడు, శాశ్వతుడు అని అనుభవమున ఎఱుకకు వచ్చును. ఇక నారాయణుడగు వేంకటేశ్వరుని నుండియే బ్రహ్మ రుద్రాదులు జనించిరని వేదము చెప్పుచున్నది. సృష్టి, స్థితి, లయము–ఈ మూటియందును అంతర్యామి నారాయణుడు. కావున సృష్టి కర్త యగు బ్రహ్మ, లయ కర్త యగు రుద్రుడు అతని నుండి వచ్చినవారే. మరియు విశ్వచైతన్యమగు నారాయణుడే రోదసిలో – అనగా అంతరిక్షములో శక్తితరంగములను ప్రసరించు రుద్రుడైనాడు. మిగిలిన దేవత లెల్లరు నారాయణుని నుండియే పుట్టిరి. మొత్తమున భాగములు పుట్టును గదా. పూవు వంటి వాడు నారాయణుడు. రేకల వంటివారు దేవతలు. మనయందును 'ఆత్మ'గా నారాయణు డున్నాడు. ఆయన నుండి భాగములుగ బుద్ధి, మనస్సు, ప్రాణము, ఇంద్రియముల కధిపతులగు దేవతలు వచ్చుచున్నారు. అన్నమయ్య కీర్తించుచున్న మందు మామూలు మందు గాదు. జ్యోతితో నిండినదిది. అందరిని, అన్నిటిని వెలిగించునది. సూర్యచంద్రాగ్నులను వెలిగించునది. మనలో బుద్ధి యను వివేకమును, ప్రేమను వెలిగించునది. ఇది అన్నిటికి మూలమైన వెలుగు. దీనిని వెలిగించునది లేదు. గోడపై విద్యుద్దీపము నుంచినచో దాని కాంతిలో ఇంటిలోని వస్తువులు కానబడును. ఇపుడు చూచువాడు, దీపము, వస్తువులు గలవు. ఇట్టి దీపము, దాని వెలుగులో వస్తువులను చూచువాడు, వస్తువులు లేకుండ వెలుగొక్కటే యున్నదనుకొనుడు. అట్టిదే వేంకటేశ్వరుడను వెలుగు. కావుననే ఈయనను 'పరంజ్యోతి', అన్నిటికన్న ఉత్తమమయిన వెలుగు, వెలుగులకు వెలుగు అని వేదములు వర్ణించుచున్నవి. జీవితము నంతయు ఈ వెలుగుతో నింపుకొన్నచో అన్నమయ్య వలె ధన్యుల మగుదుము. ఇతరమును చూచుట అను అజ్ఞానమనెడి చీకటి స్థానమున అంతయు తానే అను జ్ఞానమనెడి వెలుగు నిత్యము దర్శనమిచ్చును. తానే ఆ వెలుగుగా నగును.

* * *

50

2వ సం-132 **సర్వోపాయముల** మలహరి

సర్వోపాయముల జగతి నా కితఁడే
ఉర్వీధరుఁడు పురుషోత్తముం డితఁడే. ॥ పల్లవి ॥

సకల గంగాదితీర్థస్నానఫలము లివి స్వామి పుష్కరిణి జలమే నాకు
సకల పుణ్యక్షేత్రావాసయాత్ర లివి సరి వేంకటాచలవిహార మిదియే
సకల వేదాధ్యయనశాస్త్రపాఠంబు లివి శౌరిసంకీర్తనం బిదియే నాకు
సకల కర్మానుష్ఠానముల యితని కిచ్చుటఁ జాతుపడి కైంకర్య మిదియే. ॥ సర్వో ॥

ఉపవాసతపము లివి యితని ప్రసాదంబులొగి భుజింపుటే నాకు దినదినంబు
జపరహస్యోపదేశంబు లితని పాదజలంబులు శరణనేటి సేవ యొకటే
ఉపమింపఁ బుణ్యపురుషుల దర్శనము నాకు నొగి నిచటి బహువృక్ష దర్శనంబు
ఎపుడుఁ బుణ్యకథాశ్రవణంబు లిచ్చోటియెన్నఁగల బహుపక్షి కలకలంబు. ॥ సర్వో ॥

తలంపుగల యోగంబులందు శ్రీవైష్ణవులఁ దగులు సంవాస సహయోగంబు
వెలయ నిందుమహోత్సవంబులిన్నియు నితని విభవంబు లెసఁగు తిరునాళ్లు నాకు
చెలఁగి యిటు దేవతా ప్రార్థనింతయు నాకు శ్రీవేంకటేశ్వరుని శరణాగతి
అలరునా సంపదలు ఇతని పట్టపురాణి అలమేలుమంగ కడకంటిచూపు. ॥ సర్వో ॥

బ్రహ్మ నుండి చీమ వరకు గల అన్ని జీవరాశుల పట్ల గౌరవం,
ప్రేమ కలిగియుండుటయే భక్తి.

టీక

జగతి = ప్రపంచము, వాక్కు; పురుషోత్తముడు = పురుషులలో మంచివాడు, ఉత్తముడైన పురుషుడు; చాతుపడి = సమర్పణ పొంది; ఒగి= చక్కగా.

పరిచయము

ఈ సంకీర్తనమున క్షేత్రయాత్రలు, తీర్థస్నానములు, వ్రతములు, సత్సాంగత్యము మున్నగునవన్నియు తనకు వేంకటేశ్వరునితోనే ముడివడియున్నవని అన్నమయ్య ప్రకటించుచున్నాడు. పెద్దలు చెప్పిన సాధన లన్నియు వేంకటేశునితోను, తిరుమల తోను ఇతనికి సంబంధించియే వర్తించినవి. అన్నమయ్య ఇతర క్షేత్రాదులను దర్శించి నను, సత్పురుష సహవాసాదులను నిర్వర్తించినను వేంకటేశ్వరుని తన ఇష్టదైవతముగా భావించి, ఆతని కొలుచుట ప్రాతిపదికగా సాధన చేసెనన్నమాట. అయితే తన ఇష్ట దైవమునే సర్వాంతర్యామిగా భావించుట వలన ఇదియే సరియగు బాట. సాధారణ ముగా దాక్షిణాత్య వైష్ణవ సంప్రదాయమున సాధన అంతయు తిరుమలలో వెలసిన శ్రీవేంకటేశ్వరునితో గాని, శ్రీరంగనాథునితో గాని, కంచి వరదరాజస్వామితో గాని అల్లుకొని యుండును. వేంకటేశ్వరుని మూర్తిని, ఆయన సేవను, ఆయన వాసమగు కొండను అన్నమయ్య హృదయమున నిలుపుకొని ఆ దైవమునే విశ్వమయుడుగా దర్శించి, సేవించి ధన్యుడాయెను. వేంకటేశ్వరుడే దేవుడు, ఇతర రూపములలో దేవుడు లేడని అన్నమయ్య అనలేదు. అట్లనుట సంకుచితత్వ మగును. అట్లని తన ఇష్టదైవమగు వేంకటేశ్వరుని విడిచి, వివిధ సాధనలయందు మనసు చరించినచో చిత్తచాంచల్యమగును. అన్నమయ్య నడిచిన దారి సూటిగా, నడిమిగా నున్న దారి. శ్రీవేంకటేశ్వరునే తన సాధనకు, సిద్ధికి కేంద్రముగ నిలుపుకొని, ఆ స్వామిని సర్వము నందు దర్శించుటయేగాక, భక్తిసాధన సామగ్రి నంతటను ఆ స్వామితోనే నింపు కొనెను.

పల్లవి యొక్క తాత్పర్యము

“జగత్తులో అన్ని ఉపాయములతోనే గమ్యము నాకితడే. మరియు ఉపాయములు కూడ ఇతనితోనే అల్లుకొని యున్నవి. ఇతడే భూమిని ధరించుచున్నవాడు, ఉత్తము డయిన పురుషుడు.”

వ్యాఖ్య

జగత్ అనగా ప్రపంచమే గాక, వాక్కు అనియు అర్థము కలదు. భక్తి సాధన సామగ్రినే ఉపాయములందురు. పూజావ్రతాదులు, సత్సాంగత్యము, యాత్రలు, సేవ మున్నగునవి. ఇన్ని ఉపాయములతోను అన్నమయ్యకీ ప్రపంచము నందును, వాక్కు నందును గమ్యము శ్రీవేంకటేశ్వరుడే. జీవితమున తన నుండి వెలువడు ప్రతి వాక్కు కూడ స్వామితో నిండినది. స్వామికే సమర్పితమయినది. అన్ని ఉపాయముల లోను శ్రీవేంకటేశ్వరుని తన తీయని పలుకులతో సంకీర్తనము గావించుటయే అన్నమయ్యకు మిక్కిలి ఇష్టమయిన ఉపాయము. ఉపేయము అనగా పొందదగిన గమ్యము శ్రీవేంకటేశ్వరుడే. ఆతనిని పొందుటకు ఉపాయములును ఆయనయే. విశిష్టాద్వైతమున ఉపాయము, ఉపేయము భగవంతుడే

అని చెప్పబడెను. ఉపేయ మయిన స్వామి ఆనందస్వరూపుడు, ప్రేమరసైకమూర్తి. ఉపాయములును ఆనంద స్వరూపములు, ప్రేమమయములు. సాధన శ్రమతో గూడినది కాదు. సాధన, హృదయపూర్వకముగా చేయబడుచున్నపుడే, ఆనందసిద్ధి లభించును. అంతేగాని ఎంతో ప్రయాసతో సాధన చేసిన తర్వాత వచ్చు సిద్ధి మాత్రమే ఆనందమనరాదు. సాధన ఎంత శ్రమగా నున్నది అని భావించువాడు సాధన చేయుటలేదని అర్థము. బలవంతమైన సాధన ఏల? ఉదా :- సంకీర్తన కార్యక్రమము పూర్తి అయిన తర్వాత వచ్చునదే గాక, సంకీర్తనము జరుగుచున్నపుడే స్వామి యొక్క అనుభూతియగు అఖండానందము కలుగును గదా. కనుక అన్ని ఉపాయములతో గమ్యము స్వామియే. అన్ని ఉపాయములును స్వామియే. వెంట వచ్చు పాథేయకము అనగా అమృతము వంటి పాలతో చేయబడిన పాయసపు మూటయు స్వామియే. వేంకటేశ్వరుడు ఏడుకొండలపై నున్నాడు. క్రిందనున్న భూమిని ధరించుచున్నాడు. ఉర్వి యనగా బరువైనదని యర్థము. బరువుగలదేది? ఘన పదార్థము. అన్నిటికన్న బరువుగలది జగత్తులోని భౌతికకక్ష్య. ఇది దేనిపై ఆధారపడి యున్నది? లోనున్న చైతన్యము మీద. ఆ చైతన్యమే స్వామి. మన శరీరము కూడ భౌతికమే. ఇదియు ఉర్విలో భాగమే. ఇది తనకు తానుగా పనిచేయుటలేదు. గుండె కొట్టుకొనుట, శ్వాసక్రియ, ఆకలి, నిద్ర శరీరము పుట్టించుకొనలేదు. మనస్సు కూడ పుట్టించుకొనలేదు. ఈ ప్రక్రియలను నడుపుచున్నవాడు ఆత్మచైతన్యముగా వెలసిన దేవుడే. దేవుని ప్రేమ శరీరమును ధరించుచున్నది. సైన్సు దీనిని నమ్ము దశకు చేరుటకు కొంతకాలము పట్టును. విజ్ఞానశాస్త్రము ద్రవ్యము, శక్తి దాక వచ్చినది. చొక్కా, నూలుపోగులు దాక వచ్చినది. ప్రత్తి దాక ఇంకను ఎదగలేదు. ప్రేమస్వరూప మగు చైతన్యము దాక వికాసము పొందలేదు. అయితే శాస్త్రవేత్తల జీవితము కూడ దేవుని ప్రేమ వలననే సాగుచున్నది. కనీసము తల్లిప్రేమ కదా బాల్యమున ఎల్లరిని ధరించునది. ఆ ప్రేమ ఎవరిది? స్వామికి జీవులపై గల ప్రేమలో జననీజనకుల ప్రేమ ఒక చిన్న భాగము. అఖండప్రేమయే దేవుడు. భూమి, సూర్యకిరణాల కాంతి ప్రసారము వలన ధరింపబడుచున్నది. సూర్యకాంతి లోపల దాగిన అంతర్వర్తి నారాయణుడే కదా. భూమిని మోయు ఒక శక్తిమయమయిన తేజస్సు గలదు. అది పాము వలె చుట్టలు చుట్టుకొని యుండును. దాని తేజస్సులోని వెలుగులే పడగలు. వానితో ఈ భూమి ధరింపబడుచున్నది. ఈ శక్తిమయ తేజస్సునే ఆదిశేషుడందురు. శేషుడనగా దేవునిలో ఒక అంశయే. ఇట్లు శేషుని రూపమున స్వామియే ఉర్విని ధరించుచున్నాడు. ఈ శేషుడే శేషాద్రిగా వెలసెను. ఇక వేంకటేశ్వరుడే ఉత్తముడైన పురుషుడు. పురుషోత్తమ శబ్దము విశేషణ ఉత్తరపద కర్మధారయ సమాసము. వ్యాకరణమున ఉత్తమపురుష అనగా 'నేను'. ఇట్లు జగత్తు మొత్తమునకు 'నేను' అనగా ఆత్మ స్వామియే. జగదంతరాత్మయే తిరుమలపై శ్రీవేంకటేశ్వరుడుగా వెలసెను అని అన్నమయ్య ఎదలో దర్శించి తనియుచున్నాడు. కావున ఇతడు వేంకటేశ్వర దివ్యమూర్తిని, ఆ విగ్రహము వరకే పరిమితమయిన వాడుగా గాక, సర్వజగత్తు యొక్క 'ఆత్మ'గా అనుభూతినొందుచు, పల్లవిలోనే తన ఈ అనుభూతిని స్పష్టము గావించుచున్నాడు. ఏ జీవుడయినను తనను నేను, ఎదుటివానిని నీవు, ఎక్కడో ఉన్నవానిని అతడని అనుచుండును. అన్నమయ్యకు 'నేను, నీవు, అతడు' లేరు. ఈ మూడుగా నున్నది ఒకడే 'నేను' అయిన వేంకటేశ్వరుడే. ఇదియే వేదసారము. ఇది ఇతని అనుభూతియే గాని, తెలిసికొన్నది, ఊహించినది మాత్రమే కాదు. తన భావనను అనుభూతి పొందజాలిన వాడే సంకీర్తనమున గానము చేయగలుగును.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"గంగ, యమున మున్నగు తీర్థములలో స్నానము చేసిన ఫలము నాకు స్వామి పుష్కరిణి యందలి నీరే. బదరి, కాశి, శ్రీరంగము మున్నగు అన్ని పుణ్యక్షేత్రములకు వెళ్ళి, అచట వసించుటకు తిరుమలలో సంచరించుటే సమానము. అన్ని వేదములను, శాస్త్రములను చదువుట, నేర్చుట నాకు శౌరి సంకీర్తనమే. అన్ని పూజా యాగాది క్రతువులను ఆచరించుట నాకు సమర్పణతో గూడిన స్వామి యొక్క సేవయే."

వ్యాఖ్య

గంగాది నదులు పవిత్రమూర్తులు. ఈ నదులలో స్నానమాడుట వలన పవిత్రత, పరిశుద్ధత కలుగును. కావున ఈ నదులను తీర్థములందురు. అనగా తరింపజేయు స్థానములు. వానిలో స్నానము చేయుటను అన్నమయ్య కాదనుటలేదు. కాని తనకు మాత్రము అన్ని నదులందు స్నానమాడిన ఫలము స్వామి పుష్కరిణియే. పుణ్యనదుల జలములు ఆయా నదీదేవతల భౌతిక దేహములు. కాని మనకు వలెనే నదులకును లోపల చైతన్య ప్రవాహములు గలవు. ఈ ప్రవాహము లన్నియు స్వామి పుష్కరిణిలో చేరియున్నవి. కావున సకల తీర్థస్నాన ఫలము, స్వామి పుష్కరిణి యందే అన్నమయ్యకు లభించెను. అనగా అన్ని నదులలో స్నానమాడుట వలన కలుగు పరిశుద్ధత ఇతని దేహమునకును, ప్రాణమునకును, హృదయమునకును కలిగెను. నదిలో చేపల వలె స్నానమాడిన వారికిట్టి పరిశుద్ధత కలుగదు. పుష్కరిణిని పరిశుద్ధతామూర్తి యగు అమ్మగా భావించి, ఆ జలములను అమ్మ యొక్క దయారసముగా భావించు భక్తుల కిట్టి పరిశుద్ధత కలుగును. పుష్కరిణీమాత ఇతనిని తన ప్రేమతో తడిపి, తన కరుణాకటాక్షములలో స్నానమాడించినది. ఇతడు తరించెను. సనకాది మహర్షులు కూడ స్వామి పుష్కరిణి యందు స్నానమాడి దర్శనమునకై వేచియుండెడి వారట. క్షేత్రములు భగవంతుని సన్నిధి మహిమ వలనను, మహర్షుల తపోభూము లగుట వలనను, ఆయా చోటులకు వెళ్ళి, అచట కొన్నాళ్ళుండి ధ్యానాదులను చేయుట వలన సాధన మెరుగుపడును. మనసులో నెలకొన్న మాలిన్యములు తొలగును. ఆనందానుభూతి ఇంటిలో ధ్యానాదుల వలన కంటె అధికముగా గలుగును. కావున క్షేత్ర యాత్రలు చేయుట సంప్రదాయమయినది. కాని అన్నమయ్యకు సకల క్షేత్రములు కలిసి తిరుమలయందే దర్శనమిచ్చినవి. ఇచట చరించుచుండుటే సకల క్షేత్రములందు చక్కగా వసించుట వలని ఫలితము నిచ్చుచున్నవి. అసలు యాత్ర అనగా ప్రయాణము. జీవుడు ప్రయాణింపవలసినది హృదయముతో, అందున్న పరమాత్మ వద్దకు. ఈ ఆత్మపరమయిన యాత్రకు బాహ్యమగు ప్రతీకయే క్షేత్ర యాత్ర. తిరుమల చేరి, అచట సంచరించి, వేంకటేశ్వరుని దర్శించుటతో అన్నమయ్యకు హృదయమున స్వామి దర్శనానుభూతి కలుగుటయే గాక, స్థిరమై నిలిచినది. కావున తిరుమల సంచారమే ఇతనిపాలిటి సకల క్షేత్ర యాత్రల కలయిక. ఇందలి విశేషమేమనగా మానవ శరీరమందలి నాడులను నదులతో పోల్చుట సంప్రదాయము. ఈ నాడులు సూక్ష్మశరీరము నందు కొన్ని గలవు. ఇవి ఇడ, పింగళ, సుషుమ్న. ఇవి తేజోమయ ములు. కంటికి గానరావు. వీనినే గంగ, యమున, సరస్వతి అందురు. ఈ మూడు నదులను స్వామి పుష్కరిణిలో సంగమించినవి. అందులో స్నానమాడుటతో అన్నమయ్య

యొక్క ప్రజ్ఞ పరిశుద్ధములయిన ఈ నాడులను దాటినది. భ్రూమధ్య మందు నిలిచెను. ఇక సూక్ష్మదేహమందలి కొన్ని స్థానములనే క్షేత్రములందురు. భ్రూమధ్యమే ప్రయాగ. దాని పైస్థానమే కాశి. క్షేత్రములన్నియు ఆరు చక్రముల నడుమ స్థానము చెందియున్నవి. అన్నమయ్య విహరించిన వేంకటాచలము సహస్రార స్థానము. అన్ని క్షేత్రములను దాటిన పిదప ప్రజ్ఞ సహస్రారమును చేరును. కావున తిరుమలలో చరించుట, సకల క్షేత్ర యాత్రలు చేయుటకు సరియని అన్నమయ్య పలికెను. వేదములను సస్వరముగ, సుస్వరముగ పలికినను, శాస్త్రములను పఠించి నను వీనిని లోక హితార్థము, తన హృదయము పవిత్రమైన వికాసము పొంది భగవంతుని సన్నిధిని చేరుటకు వినియోగింపబడనపుడు వ్యర్థములు. వేదమును అధ్యయనము చేయుట అని అన్నమయ్య ప్రయోగించెను. అధి – అనగా వేదమును ఆధారముగా గొని, అయనము = జీవిత ప్రయాణము గావించుట. ఇది మంచిదే. కాని హృదయమున విష్ణుభక్తి లేనిది ఇవియేవియు తనకు ఆనందము గాని, ఇతరులకు మేలు గాని చేయలేవు. స్వామి సంకీర్తనమునందు హృదయము కరగి, బ్రహ్మానందము కలుగుట, తనకేగాక శ్రోతలకును గలుగుట జరుగును. కావున వేదాధ్యయనము, శాస్త్ర పఠనములు తనకు శౌరి సంకీర్తనమని అన్నమయ్య పలికెను. శౌరి యనగా శూరుని మనుమడగు శ్రీకృష్ణుడు. సంకీర్తనమనగా సమ్యక్ కీర్తనము. మనసార దేవుని కీర్తించుటయే సంకీర్తనము. దీనివలన మనలోని మలిన సంస్కారములు తొలగి పరిశుద్ధత ప్రాప్తించును. వేదశాస్త్రములో చెప్పబడిన విధముగా జీవితపు నడక సంకీర్తన యొక్క స్ఫూర్తి వలన సాగును. బ్రహ్మానందమను తేనె యొక్క రుచిలో హరిసంకీర్తనమున మరగిన మనస్సు, అన్య విషయములను ఉమ్మెత్తపూల పైకి పోదు. సహజముగనే ఇట్టి భక్తుని జీవనమార్గము వేదమార్గమే యగును. ఇట్టి భక్తుని పాటయే సామవేదమగును. ఇతని దినచర్య యజుర్వేదమగును. మాటలు ఋగ్వేదమగును. ఇక జపములు, తపములు, క్రతువులు, ధ్యానము, అభిషేకాది కర్మల నాచరించుట అన్నమయ్యకు స్వామికి సమర్పణతో గూడిన సేవయే. ఇవి యన్నియు చేయవద్దని గాని, చేయపనిలేదని గాని అన్నమయ్య ఉద్దేశ్యము గాదు. వీని నాచరించుటలో దేవునందు సమర్పణ లేక, మ్రొక్కుబడిగా చేసినచో వ్యర్థములు. వేదాధ్యయనము గూడ అంతియే. వేదములు భగవంతుని నుండి మహర్షులకు తట్టిన దివ్యజ్ఞాన సంపుటులు. అట్లే అన్నమయ్య సంకీర్తనలు గూడ స్వామి నుండి తట్టినవే. కావున ఇవి వేదములతో సమానములు. ఇవి స్వామి పాదపద్మముల నుండి ప్రసరించిన తేనెవాకలు. అన్నమయ్య వంటి భక్తశేఖరుని జీవితమంతయు స్వామికి సమర్పితమే. అన్ని పనులు స్వామి సేవయే. ప్రత్యేకముగా అర్చన అని లేదు. ఐహిక జీవితమున చేయు పనులన్నియు అంతర్యామియు స్వామికి అర్చనయే. ఉదాహరణకు ఆకలిగొన్న వానికి అన్నము పెట్టుట, ఆ జీవిగానున్న స్వామికి నివేదనము చేయుటయే. నడువలేని వారికి చేయూతనిచ్చుట స్వామి పాదములను అర్చించుటయే. వస్త్రములు లేనివానికి వస్త్రమిచ్చుట స్వామికి వస్త్రమును సమర్పించుటే. రోగికి సేవ చేయుట, నారాయణుని కైంకర్యమే. కైంకర్య మనగా ఈ పని, ఆ పని అని గాక మేలుగూర్చు పని ఏదయినను, ఎవరికయినను హరి సేవ చేయుట. శ్రీవైష్ణవ సంప్రదాయమున అతిథులను స్వామిగా భావించి, 16 ఉపచారములు చేయుట గలదు. ఎవరికి నమస్కరించినను, స్వామికి మ్రొక్కుటయే. ఎచటకు వెళ్లినను దేవాలయమునకు వెళ్లుటయే. ఎవరి

సద్గుణములను కీర్తించినను కేశవ సంకీర్తనమే. నిత్య కర్మలు, నైమిత్తిక కర్మలను కర్మలు రెండు విధములు. సంధ్యావందనము మున్నగునవి నిత్య కర్మలనియు; యజ్ఞములు, పితృకర్మలు నైమిత్తికములని సామాన్య మైన అభిప్రాయము. కాని నిత్య మాచరించు కర్తవ్యములు భగవంతున కర్పించుటే నిత్యకర్మ. ఎవరయిన ఆపదలో నున్నపుడు సేవించుటే నైమిత్తిక కర్మ – సందర్భమును బట్టి చేయునది.

2వ చరణము యొక్క తాత్పర్యము

"స్వామి ప్రసాదములను ప్రీతితో, శ్రద్ధతో ప్రతిదినము స్వీకరించుటే నాకు ఉపవాస తపములు. స్వామి పాదజలములను శరణు అను సేవ యొక్కటే జపరహస్యముల ఉపదేశములు. తిరుమలలో గల ఎన్నో చెట్లను దర్శించుటే నాకు సత్పురుషుల దర్శనముతో పోల్చదగినది. తిరుమలలోని పక్షుల కలకల ధ్వనులను వినుటయే నాకెప్పుడును పవిత్ర కథలను వినుట."

వ్యాఖ్య

ఈ చరణము అన్నమయ్య తిరుమల సంచారమున ఒడలు మరచి, ఆనంద పారవశ్యమున హృదయము నర్తించుచుండగా వెలువడినది. ఉపవాసమనగా ఉప = భగవంతుని సమీపమున; వాసము = మనస్సు వసించుట. ఇది తెలియక తమ ఆకలిని చంపుకొని కొందరు శరీరమును కృశింప జేసికొని, ఆకలి రూపముననున్న నాకు ద్రోహము చేయుచున్నారని కృష్ణుడు గీతలో పలికెను. వీరు అవివేకులనెను. ఉపవాసములు చేసితిమి, ఎందుకు ఫలానా కోరికలు తీర్చవు అని దేవుని బెదరించు వారును గలరు. దేవుడిట్టి అరపులకు బెదరడు. భగవంతుని సమీపమున మనస్సు నిలుచుటే ఉపవాసము. అట్లు నిలుపుటకు నిత్యము పవిత్రములయిన మంచి పనులను, కర్తవ్యములను చేయుచు స్వామికి అర్పితములు గావింపవలెను. ఊరక ఉన్నచో మనసున అడుగున దాగియున్న మలిన వాసనలు త్రాచుల వలె పైకిలేచి కాటువేయును. అట్లని అధికాహారమును భుజింపరాదు. మితముగా – అనగా ఆకలికి సరిపోను, ఆరోగ్యకరమైన ఆహారమును భుజింపవలెను. ఎట్లు భుజింపవలెనో అన్నమయ్య చక్కగా ఉపదేశించుచున్నాడు. స్వామి ప్రసాదముగా భావించి భుజింపవలెను. అందులకే ఆపోశనము, గాయత్రీ పఠనము ఏర్పడినవి. తాను భుజించు ఆహారము ఎందరి కృషి ఫలితమో గుర్తుండుట ఆవశ్యకము. వారి రూపములోనున్న స్వామి అందించిన ప్రసాదమే తాను భుజించు ఆహారమని అన్నమయ్య భావము. ఇది వేదభావము. గీతలో కృష్ణుడిట్లు ఉపదేశించెను. "ఇతరులకు పనిచేసిపెట్టి, అట్లు లభించిన ఆహారమును స్వీకరించినచో దానిని యజ్ఞప్రసాద మందురు. తనకొరకు కృషి చేయుచున్న సమాజము యొక్క హితమునకై ఏమియు పనిచేయకుండ తనకోసము తినువాడు దొంగ. వృత్తుల నిర్వహణలో రెండు విధాన ములు గలవు. (1) తన జీతము కోసము చేయుట. ఇతడు జీతమునకు బానిసగా దుఃఖముతో బ్రతుకును. (2) లోకహితము కొరకై, భగవంతుని సేవగా వృత్తిపని చేసి, వచ్చిన దానిని భగవంతుని ప్రసాదముగా స్వీకరించుట. ఈ రెండవ విధానమునే అన్నమయ్య పాటించెను. అంతేకాని, కర్తవ్యములను విడిచిపెట్టి, దేవుని గుడిలో లభించు ప్రసాదమునకై

ఎదురుచూచువాడని అర్థముగాదు. ఇంతకును ఇతరులకు పనిచేసిపెట్టుట పెద్ద త్యాగమేమియు గాదు. కృతజ్ఞత నెఱపుటయే. ముఖ్యముగా అన్నమయ్య ఈ పాదమున మనకు ఆహారము నిచ్చుచున్న కర్షకులకు మేలు చేయుటనే భగవదారాధనముగా నిర్వర్తించుచు, ప్రసాదముగా ఆహారము భుజింపవలెను అని ఉద్బోధించుచున్నాడు. ఈ ఉపదేశము సార్వకాలికమయినది. కర్షకుల రూపమున నున్నది భగవంతుడే యని గుర్తుండవలెను. వేదవేత్తలు తమను గౌరవించుచున్న కర్షకులను, కార్మికులను నారాయణమూర్తులుగా దర్శించుట నేర్పవలెను. శాస్త్రములలో ఇట్లు చెప్పబడినది, "దేవఋణము, ఋషిఋణము, పితృఋణము, మనుష్య ఋణము, పశుఋణము తీర్చనిది తాను భుజించుటకు అర్హుడు గాడు." ప్రతిదినము ఆకలిగొన్న వానికి, పశువులకు ఆహారము పెట్టి, శేషము స్వీకరించినచో అది ప్రసాదమగును. ఇట్లుగాక గుడిలో దేవునకు నివేదితమయిన పదార్థమును స్వీకరించినను అది ప్రసాదము గాదు. దేవాలయములో తాను దేవునకు సమర్పించుకొన్న నివేదనము, ఆయన మనకిచ్చినదే. దానిని దీనులకు పంచి, శేషమును ఇంటికి తెచ్చి, తాను, కుటుంబ సభ్యులు భుజించుట చేయవలెను. సమాజసేవ నేర్పుటకే దేవాలయ వ్యవస్థ ఏర్పడినది. తపమనగా మనస్సు, వాక్కు, కర్మ పవిత్రముగా నుంచుటే. ఈ తపము సమాజ రూపములోని స్వామిని సేవించి, ఆ రూపములో దేవుడిచ్చిన ఆహారమును ప్రసాదముగా భావించుటలో సిద్ధించును. ఆహారమును ఈ పవిత్ర భావము లేక భుజించినచో అది జీర్ణము గాదు. ఇతరులకు ఏమియు పెట్టకుండ భుజించువానికి, తరువాతి జన్మలో పేదరికము గాని, అజీర్ణరోగము గాని వచ్చును. కొందరు శిష్యులు పెద్దల నుండి మంత్రజపములను రహస్యముగా ఉపదేశము నొందెదరు. సృష్టి మొదటినుండియు జ్ఞానము, తపస్సు, వేదశాస్త్రాధ్యయన ముల ద్వారమున దేవుని పొంద యత్నించు మార్గమొకటియు, దేవునికి శరణంది స్వామిని అందరిలో అంతర్యామిగ దర్శించి ప్రేమతో సేవించు భక్తిమార్గ మొకటియు ప్రాచుర్యములో నున్నవి. మొదటి మార్గమున తమ సాధనతోనే దేవుని పొందగలమను ధీమా, జీవితములో సొంత కర్తవ్య నిర్ణయములు ఉండును. కావున ఎపుడయినను ఈ మార్గానుయాయులు పతనము పొందు అవకాశము కలదు. ఏలననగా ఇవి లేక సేవాధర్మములో జీవించు వారిని అవమానించు గర్వ మేర్పడవచ్చును. రెండవ మార్గమున ప్రపత్తి, ప్రేమ ప్రధానము. ఈ మార్గానుయాయులకు కర్తవ్య నిర్ణయములు తమవిగావు, దేవునివే. కావున వీరికి అహంకారము, పతనము చెందు అవకాశము లేవు. మొదటివారికి నేను సాధన చేయుదునను పట్టు ఉండుటచే భగవదానందము ఎండమావిలో నీటి వలె మెరయునే గాని, ఎద దానితో నిండదు. భక్తులకు, సేవా ధర్మనిష్ఠులకు ఎప్పుడును భగవదనుభూతియే. మొదటివారు, మిగిలిన వారిని నిందించు అవకాశము గలదు, రెండవ వారికి మిగిలినవారు లేదు. అందరు స్వామియే. ప్రేమ తప్ప, నిందకు వారిలో చోటు లేదు. బ్రహ్మకు ముందున్న వైకుంఠము భక్తి మార్గమునకు, సేవాధర్మమునకు నిలయము. బ్రహ్మ సృష్టిలోనిది మొదటి మార్గము. కావున మొదటిదగు జ్ఞానమార్గముకన్న రెండవదగు భక్తి మార్గము ముందున్నది. అన్నమయ్య ఈ మార్గము నెంచుకొని వైకుంఠానుభవములో నున్నాడు. జ్ఞానమార్గము వారు కోతిపిల్లల వంటి వారు. కోతిని పట్టుకొని క్రింద పడకుండు భారము కోతిపిల్లలదే. ఇక భక్తిమార్గము వారు. వీరు పిల్లికూనల వంటి వారు. వీరి భారమును భగవంతుడే, పిల్లి వలె భరించును.

నిజముగా జప మనగా పెద్ద పూస ఎప్పుడు వచ్చునాయని ఎదురుచూచుచు మాల త్రిప్పుట, మంత్రమును యాంత్రికముగా జపించుట గాదు. ఓంకారమును పలుకుచు వినుచుండుట ముఖ్య జపము. ఇది రహస్యముగా ఉపదేశమొందుట అనగానేమి? రహస్య మనగా ఎవరికి చెప్పగూడదని గాదు. ఒంటరి స్థితిలోనిది యని అర్థము. ఒంటరి స్థితి అనగా అంతయు తానైన ఒక్కడగు భగవంతుని స్థితియే. ఇదియే రహస్యము. ఉప = సమీపమునకు, దేశము = దిక్కు చూపించునది. జపము యొక్క లక్ష్యము ఇట్లు అందరిలో ఒకడుగానున్న భగవంతుని చేరు దారిన జీవన ప్రయాణము సాగించుటే. ఈ ప్రయాణము మనసార చేయనపుడు వట్టి మంత్ర జపములు వ్యర్థములు. నేను గొప్ప ఉపాసకుడనని డప్పు కొట్టుకొనుటకు గాని, ఇతరులు కొందరు తనను ఉపాసకుడుగా గుర్తించి, గౌరవించగా తాను పతనము పొందుటకుగాని పనికి వచ్చును. అన్నమయ్య అసలయిన జపమును సూచించుచున్నాడు. ఇది ఆతని అనుభవము. దేవుని పాదజలములను శరణు పొందుట అను సేవ యొక్కటే జపము. పండితులు కొందరు తమ పాదములను పామరులు కడుగుచుండగా పైకి వినయ మును నటించినను, లోలోన మురిసిపోవు చుందురు. కాని తమ పాదములను కడుగుచున్న పామరుల రూపములో నున్నది వేంకటేశ్వరస్వామియే అని గుర్తించి, వారి పాదములను కడుగుటకు మనసారా సిద్ధపడవలెను. వారంగీకరింపకున్నచో అది వేరే సంగతి. కాని భక్తుడు తానుగా సిద్ధపడును. అన్నమయ్య అట్లు సిద్ధపడెను. ఆ తీర్థమును శిరమున చల్లుకొనుటకు సిద్ధపడవలెను. ఈ అంశమును ఎవడికి వాడు లోన శోధించుకొనవచ్చును. భగవంతుని పాదజలములను శరణందుట అనగా అవి తనను ఆపదల నుండి రక్షించునని నమ్ముటగాదు. వానివలన తాను పరిశుద్ధుడగుదునని అనుభవమున తెలియుట. ఈ భావన లేనపుడు ఎంతసేపు దేవుని అభిషేకించినను, ఎంతగా స్వామి పాదతీర్థమును సేవించినను యాంత్రికతయే గాని, అనుభూతి కలుగదు. ఆ పాదజలమును పూర్తిగా శరణందువాడు, తప్పక ఆ పాదములను సేవించును. భగవంతుని పాదములను సేవించుట అనగా స్వామి దివ్యమంగళమూర్తి పాదములను పూలతో అర్చించి, పాదజలములు శిరసున చల్లుకొనుటయు, ఆపైన సత్పురుషుల యెడలను ఇట్లే వర్తించుటయు, దీనుల రూపములో నున్న స్వామిని వారికి కావలసినవి కూర్చుటలో సేవించుటయు. అన్నమయ్య వంటి మహాభక్తునికి ఈ మూడును ఒకటిగానే సిద్ధించి యనుభూతి నొసగినవి. ఇతరులకు సేవ చేయుట వలన వారి రూపములలోని దేవుని తృప్తి వలన తాను ఉద్ధరింపబడి, బాగుపడుట జరుగునని విశ్వసింపవలెను. అంతేగాని తన తోడ్పాటు లేకున్నచో అవతలివానికి దిక్కు లేదని భ్రమపడరాదు. మనము కాకున్న, అవతలివాని కర్మ ఫలమును బట్టి దైవానుగ్రహము వలన వేరొకడు అతనిని సేవించును. సత్పురుషులను, దీనులను నాకన్న వేరుగా చూచువాడు నరకబాధ నొందునని భాగవతమున నారాయణుడు పలికెను. ప్రణవజపము యొక్కలక్ష్యమేమి? మనస్సును హృదయమున నిరోధించుట యని కృష్ణుడు, పతంజలి బోధించిరి. మనస్సు, ఇతరములను గూర్చి అభిప్రాయముద్రలతోడి పుట్ట. మనిషిని, మనిషిని వేరుచేయునది. జీవుని స్థానము మనస్సు. హృదయము ఈశ్వరుని స్థానము. ఇది పరమ ప్రేమాలయము. మనస్సుతో జీవించువాడు సంఘముతో వేరుపడి జీవించును. హృదయముతో జీవించువాడు సంఘమునెడ ప్రేమతో జీవించి, ఈశ్వరుడే యగును. మనస్సును, హృదయమున నిరోధించుట

యనగానేమి? జీవుడు తన భావములను, తనను ఈశ్వరునకు శరణందుట. ఓంకారనాదము గానము చేయుచు, వినుట వలన మనస్సు ఈశ్వరుని చేరును. ఈ స్థితి తనకు స్వామి పాదజలములకు శరణందుట వలన గలుగుచున్నది గావున తనకు జపమనగా శరణాగతియే యని అన్నమయ్య నొక్కిచెప్పుచున్నాడు. శరణందినవానికి వేరు భావములుండవు. సొంత భావము లుండవు. ఈతడు సంఘముతో తాదాత్మ్యమునందును. దేవుని సంకల్పములే ఇతని ద్వారమున పని చేయును. అన్నమయ్య స్థితి యిది. అన్నమయ్యకు తిరుమలలోని ఎన్నో వృక్షములను చూడగనే, సత్పురుష దర్శనమను అనుభూతి కలిగినది. ఎందరో సజ్జనులయిన భక్తులే, తిరుమలలో చెట్ల రూపములతో నిలిచి, స్వామిని సేవించుచు, ఆయన సాన్నిధ్యమున నిలుచుచున్నారు. భక్తులగు యాత్రికులకు దేవుని సాన్నిధ్య మాధుర్యము కలుగుటలో తోడ్పడుచున్నారు. అన్నమయ్యకు ఇట్టి తోడ్పాటు లభించినది. చెట్లను మనకంటె పరిణామమున వెనుకనున్నవానిగా నరుడు గమనించును. కాని వీనిని మనకన్న ఉత్తమ స్థాయిలోనున్న సత్పురుషులుగా అన్నమయ్య దర్శించెను. భాగవత మున స్వయముగా శ్రీకృష్ణుడే ఎండ, వాన, చలులలో నీడను, పండ్లను ఇచ్చు సామాన్య వృక్షములనే కీర్తించెను. ఇక తిరుమలలో వెలసిన వృక్షముల సంగతి చెప్పనేల? శ్రీకృష్ణ సాన్నిధ్యమునకై ఎన్నో జన్మలుగా పరితపించుచుండిన పరమ ఋషీంద్రులే బృందావనమున నరులుగా, పశుపక్ష్యాదులుగా అవతరించిరి. ఇంకను చోటు చాలనందున, కొందరు చెట్లుగా నవతరించిరని భాగవతమున చెప్పబడినది. తిరుమలలోని వృక్షములు కూడ ఇంతియే. వీని నీడలో, వీని సన్నిధిలో అన్నమయ్య హృదయము అప్రయత్నముగా ఉత్తమస్థాయి కెదిగి, ఎగిరి స్వామి సన్నిధిని చేరెను. అట్లే తిరుమలలోని పక్షుల కలకలారావములే విష్ణుని పవిత్ర కథాశ్రవణములని అన్నమయ్య సొంత అనుభవము. విష్ణుని పుణ్యశ్రవణకీర్తనుడని విష్ణు సహస్రనామము కీర్తించినది. అనగా ఆతని గూర్చి విన్నను, కీర్తించినను మానవుడు పవిత్రుడగును. ఇపుడు అట్టి హరి యొక్క దివ్యగాథలు, లీలావైభవ గానములు తిరుమలలోని పక్షుల ధ్వనులలోనే అన్నమయ్యకు వినపడెను. అవి మామూలు పక్షులా, కాదు పరమ భాగవతోత్తములు. వాని ధ్వనులు విష్ణుని కథాగానములు. అయితే అందరి కిట్టి అనుభూతి కల్గునా? పక్షుల స్వరములు విష్ణుకథా గానములయినను, వానిని విను సంస్కార స్థాయిని బట్టి అన్నమయ్యకు కల్గిన అనుభవము కలుగును. విష్ణుచిత్తుడను ఆళ్వారుగారి ఇంటిలో నడిరేయి కూడ విష్ణుకథా గానము, శ్రవణము జరుగుచుండగా, ఇంటి ముందు బాటపై నడుచువారి కీగానము వినపడెడిదని రాయలు ఆముక్త మాల్యదలో వర్ణించెను. అన్నమయ్యకు ఇప్పుడు అంత పని లేదు. తిరుమలలో సంచరించుచుండగా, పక్షుల వివిధ స్వనములే గజేంద్ర మోక్షణము, ప్రహ్లాద రక్షణము మున్నగు విష్ణుని లీలాకథల గానములైనవి. ఆహా! ఎంతటి మహోదాత్త స్థాయికి చెందిన మహాభక్తు డీతడు! అణువణువు స్వామి ఆలయమే. కనినదెల్ల స్వామి రూపే, వినపడినదెల్ల హరి లీలాకథయే మహాత్ములకు.

3వ చరణము యొక్క తాత్పర్యము

"నా తలంపులందు గల యోగము శ్రీవైష్ణవులను వెంబడించు సహవాస యోగము కలదు. తిరుమలలో జరుగుచుండు మహోత్సవము లన్నియు స్వామి వైభవములతో ఒప్పు తిరునాళ్ళు నాకు. శ్రీవేంకటేశ్వరుని

శరణాగతి చెందుటయే, నాకు సకల దేవతా ప్రార్థనము. స్వామి పట్టపురాణి యగు అలమేలుమంగ యొక్క కరుణతోడి కడగంటి చూపులే నాకు సంపదలుగా శోభిల్లుచున్నవి."

వ్యాఖ్య

విశ్వమయుడయిన విష్ణుని, ఆతని గుణవైభవస్వరూపిణి యగు శ్రీదేవితో కలిసి సేవించు మహాభక్తులతోడి జీవించుట స్వామిని చేరుటకు తప్పక కావలయును. నరజన్మమున మహాపురుషుల సాంగత్యము లభించుట మహాభాగ్యమని ఆదిశంకరులు పేర్కొనిరి. భాగవతమున ఎంతటి సాధకునకయినను భక్తులగు సజ్జనుల సాంగత్యము యొక్క ఆవశ్యకత నొక్కిచెప్పబడినది. వ్యాసునంతటి వారికి నారదుని సహవాస మావశ్యకమయినది. పరాశరునకు అంతియే. శుకదేవుని సాంగత్యముననే పరీక్షిత్తు ఏడు దినములలో ముక్తినందెను. స్వయముగా భగవానుడే సత్యమును దర్శించిన జ్ఞానులను దర్శించి, వారికి మ్రొక్కి సేవింపుమని అర్జునునకు ఉపదేశించెను. నిజమే. అన్నమయ్యకును ఇట్టి యోగీంద్రుల సాంగత్యము సిద్ధించినది. సజ్జన సాంగత్య మొక యోగము. యోగ మను పదము మహాభాగ్యమను అర్థమున ఇచట ప్రయోగింప బడినది. యోగ మను పదము ఇచట జ్యోతిశ్శాస్త్రపరము. భగవత్సన్నిధిని చేర్చుదాని కంటె భాగ్య మేమున్నది? కాని అన్నమయ్యకు ప్రస్తుతము తన తలంపులందే అట్టి యోగము లభించుచున్నదని అన్నమయ్య ప్రకటించుచున్నాడు. ఈ వాక్యమున గంభీర భావ ములు రెండు ఇట్లున్నవి. 1. తన తలంపులే పరిపూర్ణముగా భగవంతునితో నిండినవై, నాపాలిట విష్ణుభక్తుల సాంగత్య ఫలితమును ప్రసాదించుచున్నవి. 2. నా తలపులలోనే నారద పరాశర వ్యాస శుక మైత్రేయాది మహాభక్తులు మెదలు చున్నారు. వారు శాశ్వతులు. నా తలపులలో వారు మెదలుచు, తమ సూక్ష్మదేహము లతో నా యెదుట సాక్షాత్కరించుచున్నారు. వీరినే భాగవత దేహు లందురు. భగవదను భూతియే వీరి దేహము. ఆవశ్యకమైనపుడు భౌతిక దేహములను గూడ సంకల్పించగనే ధరించి కాన్పింపగలరు. ఇట్లుగూడ అన్నమయ్య యెదుట వారు సాక్షాత్కరించిరి. స్వామియే తనలో నిండగా, స్వామి దూతలు తన యెదుట కన్పించుట వింత గాదు. తిరుమలలో జరుగు వివిధోత్సవము లన్నియు అచట అర్చకాదులు నిర్వహించు చున్నవిగా అన్నమయ్యకు కానరాలేదు. స్వామి యొక్క వైభవముల తోడి తిరునాళ్ళుగా గోచరించెను. ఆయన సంకల్పము లేనిది, ఎవరేమి జరుపగలరు? ఆయన వైభవమును ఆయనయే ప్రకటింపవలెను గాని, నరుడేమి చేయగలడు? స్వామి పల్లకీపై ఊరేగు చుండగా, జనులు స్వామికి నమస్కరించుటను గమనించిన పూజారులు, బోయీలు జనులు తమకే నమస్కరించుచున్నారని భావింతురా? అట్లు భావించిన ఎంతటి అవివేకము! స్వామి వైభవమును స్వామియే తీర్చికొనవలయును. ఎవరయినను నిమిత్తమాత్రులే. స్వామి వైభవమున పాత్రధారులగుట భాగ్యము. అంతియే. ఇచట తిరుమలలో జరుగు ఉత్సవములనే గాక, అన్నమయ్య తన బ్రతుకంతయు స్వామి వైభవోత్సవమే అని ఆనందముతో తెలుపుచున్నాడు. సామాన్య మానవునకు పండుగ దినములలో ఉత్సవముగా నుండును. కాని అన్నమయ్యకు ప్రతి క్షణము మహోత్సవమే. ప్రతి సన్నివేశము స్వామి వైభవపు తిరునాళ్ళే. శ్రీవేంకటేశ్వరుని యందు భాగములే సమస్త దేవతలు. కావున వారిని విడివిడిగా

ప్రార్థింప పనిలేదు. ఒక మనిషిని అతని పేరుతో పిలుచుట చాలు. అతని దేహము నందలి మనస్సును, ప్రాణమును, ఇంద్రియములను, శరీర భాగములను విడివిడిగా పిలువనక్కరలేదు. విశ్వ దేహుడయిన విష్ణునికి శరణాగతి చెందుట చాలును. సమస్త దేవతల కిరీటములకు వారు తన పాదములకు నమస్కరించుచుండగా, కాంతి నొసగునవి స్వామి పాదరజోరేణువులు. స్వామి ఒక్కొక్క పాదరేణువే ఒక్కొక్క తారక యగుచున్నది. సర్వాంతర్యామిని సేవించిన చాలును, శరీరేంద్రియాదులకు, బుద్ధికి కావలసినవి అవియే వచ్చును. వీనికై ప్రత్యేక ప్రయత్నమక్కరలేదు. అన్నమయ్యకు సంపదలు అమ్మవారి కరుణాకటాక్షములే. అవి లేనపుడు ఎన్ని సంపదలున్నను శాంతి యుండదు. అవియే అసలు సంపద. కాన అమ్మవారి కరుణాకటాక్షములు చాలు. శాంతినిచ్చి, స్వామి దరికిచేర్చు అమ్మ మనకు సంపదలను ఎంతవరకు ఆవశ్యకమని ఆమె సంకల్పించునో అంతవరకు ఈయ లేకుండునా! మరియు అమ్మవారి కనులు సూర్యచంద్రులు. అన్నమయ్య ఆ పాదమున ఉదాత్త సామాజిక దృక్పథమును, ప్రకృతి వైభవమును సూచించుచున్నాడు. సూర్యుడిచ్చు కాంతి, వేడిమి, శక్తి, ఆత్మజ్ఞానము; చంద్రుడిచ్చు వెన్నెల, ప్రసన్నత, పిండోత్పత్తి, ఓషధుల పెరుగుదల అమ్మవారి కరుణా కటాక్షములే యని వేదర్షుల వలెనే అన్నమయ్య దర్శనము. ఈ పాదమున ఇంకొక విశేషము గలదు. అమ్మవారిని తన హృదయమున ఆవాహన చేసి, తన కనులగుండా ఇతర జీవులను దయజూడుమని ప్రార్థించువాడు అమ్మవారితో తాదాత్మ్యమునందును. తాను అమ్మవారయినగదా, అయ్యవారిని చేరగలుగుట. కావున అమ్మవారి కడగంటి చూపులకు నోచుకొనుట యనగా తానే జీవులెల్లరికి అమ్మయై, వారిని బిడ్డలుగా ప్రేమించుట. ఇదియే అసలయిన సంపద. దీనిని అన్నమయ్యకు అమ్మవారు అనుగ్రహించినది. దీనిని సంపదగా భావించువాడు జీవజాతికి తల్లి, తండ్రి యగును. ఈ స్థితి గలవాడే భక్తుడు. భగవంతు డిట్టివాడయిన అన్నమయ్యను తన దరికి చేర్చెను. అమ్మవారనగా అయ్యవారి ప్రేమయే. కనుక ముందుగా అమ్మ కరుణను అన్నమయ్య పైరీతిలో వేడుచున్నాడు.

* * *

51

2వ సం-423 **నారాయణాచ్యుతానంత** సామంతం

నారాయణాచ్యుతానంత గోవింద హరి
సారముగ నీకు నే శరణంటినే. ॥ పల్లవి ॥

చలువయును వేఁడియును సటలసంసారంబు
తొలఁకు సుఖ మొకవేళ దుఃఖ మొకవేళ
ఫలము లివె యీరెండుఁ బాపములు పుణ్యములు
పులుసుఁ దీపునుఁ గలపి భుజియించినట్లు. ॥ నారా ॥

పగలు రాత్రుల రీతి బహుజన్మ మరణాలు
తగుమేను పొడచూపు తనుఁ దానె తొలఁగు
నగియించు నొకవేళ నలఁగించు నొకవేళ
వొగరుఁగారపువిడె ముబ్బించినట్లు. ॥ నారా ॥

ఇహముఁ బరమును వలెనె యెదిటికల్లయు నిజము
విహరించు భ్రాంతియును విభ్రాంతియును మతిని
సహజ శ్రీవేంకటేశ్వర నన్నుఁ గరుణించి
బహువిధంబుల నన్నుఁ బాలించవే. ॥ నారా ॥

భగవంతుని నుతించుట భగవంతుని యందుండుటకు
సహకరించును.

టీక

సటల = మాయతో గూడిన; నలగించు = బాధించు.

పరిచయము

ఈ సంకీర్తనమున అన్నమయ్య, జీవితమున వాటిల్లు రెండు విధముల సన్నివేశము లను వర్ణించెను. ఆయా సన్నివేశములు సహజములనియు, ఈ రెండు రకముల అనుభవములు తనను అంటకుండ కరుణతో పాలింపుమనియు స్వామిని వేడు చున్నాడు. రెండు రకములగు సన్నివేశములు పుణ్య పాప ఫలములే యనియు గ్రహించిన అన్నమయ్య సుఖ సన్నివేశములను ఉంచి, కష్ట సందర్భములను రాకుండ జేయుమని గాని, వచ్చినను వేగముగా తొలగింపుమని గాని సాధారణ మానవుల వలె వేడుటలేదు. ఆ సన్నివేశములు కూడ మానవ జీవితమున సుఖముల వలె రావలసినవే యనియు, స్వామి కరుణయుండి, స్వామి పాలించుచున్నచో ఎట్టి పరిస్థితులలోను సమముగా నుండుట జరుగుననియు అన్నమయ్య భావించుచున్నాడు. అయితే స్వామి కరుణ తనయందు పనిచేయుటకు శరణాగతి ఆవశ్యకము. అట్టి శరణాగతిని అన్నమయ్య ప్రకటించుచున్నాడు.

పల్లవి యొక్క తాత్పర్యము

"నారాయణ, అచ్యుత, అనంత, గోవింద, హరి హృదయమంతయు అర్పించి, నీకు నేను శరణంటిని గదా."

వ్యాఖ్య

మొదట అయిదు దివ్య నామములతో స్వామిని సంబోధించుచున్నాడు. 1. నారాయణ. నారములకు అయనమైన వాడని అర్థము. మూడు కక్ష్యలలో ఈ అర్థము సరిపోవును. 1. నారములనగా జలములు – ఇచట జలములనగా ప్రళయమునందలి చైతన్య జలములు. ఇవి అచ్చమయిన అనుభూతి ప్రవాహములు. వీనినే క్షీరసాగర జలము లందురు. ఇందుండు పరబ్రహ్మము గుణాతీతుడు. ఈయననే నారాయణుడందురు. ఇందుండియే సకల సృష్టి వెలువడినది. ఇదిగాక క్షీరసాగర మనబడు తారకా కాంతివ్యూహ మొకటి చోటులో గలదు. ఆ తారకా వ్యూహము నందుండు దివ్యప్రజ్ఞను నారాయణుడందురు. ప్రళయ చైతన్య జలములందలి పరబ్రహ్మమే ఈ దివ్యప్రజ్ఞ. 2. ప్రతి సూర్యునందును అంతరాత్మగా ఈ నారాయణుడే వెలసియున్నాడు. సూర్య కిరణముల ద్వారమున భూమిపైన గల నీటిని వేసవికాలమున ఆవిరిగా పైకి పీల్చి, తిరిగి వర్షాకాలమున వాననీరుగా క్రిందికి కురియును. నీటికి ఇట్లు పైకి ఆవిరిగా వెళ్ళుట, మరల క్రిందికి నీరుగా దిగివచ్చుట అను రెండు మార్గముల ప్రయాణము గలదు. నారముల యొక్క – నీటి యొక్క అయనము – అనగా ప్రయాణమునకు కారకుడు గావున స్వామికి నారాయణుడను పేరు వచ్చెను. 3. నారమనగా సమస్తము బ్రహ్మమను జ్ఞానము లేక ఎఱుక. ఇది కలిగించు మార్గమే తానయిన వాడు, దీనిని ప్రసాదించువాడు నారాయణుడు. ఈ ఎఱుక అనుభవము నిండుగా నేర్పడినపుడు జీవునిలో తన

యునికి మరపునకు వచ్చును. తనను తాను మరచవలెనని ఎంతగా ప్రయత్నించినను మరపు రాదు. నారాయణుడు హృదయము నావేశించినపుడు, తన యునికి సహజముగా తొలగిపోవును. అనేక జన్మల ప్రయాణమున జీవుడు, నారాయణుని పొందికకై ఆకర్షణ పొందక తప్పదు. ఈ ఆకర్షణయు ఆనందముగనే యుండును. ఇదియే శృంగారము. ఆకర్షణ ఫలించి, దేవునియందు జీవుడు లీన మగుట శృంగారరస పరిపూర్ణత. అపుడు సహజముగా జీవుని వ్యక్తిగత ప్రజ్ఞ మరపునకు వచ్చి, తన యునికిని కోల్పోవును. ఈ స్థితి మహామాధుర్యానుభూతి. ఈ స్థితియే నారాయణోపాసన మనియు భాగవతమున పేర్కొనబడినది. ఇట్లు నారాయణుడే శృంగారరసాధిదేవుడు. ప్రళయమునకును, ఈ స్థితికిని భేదము లేదు. ఇక అన్నమయ్య స్వామిని 'అచ్యుత' అని పేర్కొనెను. అనగా చ్యుతి – జారిపడుట లేనివాడు. ఆనందసాగరము, ప్రేమసాగరమయిన స్థితి నుండి దేవుడెప్పుడును క్రిందికి జారిపడడు. శ్రీకృష్ణావతారమున గూడ, స్వామి అచ్యుతుడుగా వర్తించెను. ఇక 'అనంత' అనియు సంబోధించెను. స్వామి అంతము లేనివాడు. ఆది లేదు గావున ఈయనకు అంతమును లేదు. సృష్టికి ముందు, సృష్టిగను, సృష్టి వెనుకను స్వామియే ఉండును. భౌతిక పదార్థమునకు మొదలు, చివర ఉండును. చైతన్యమునకుండవు. స్వామి అంతము లేని ప్రేమసాగరము. స్వామి గోవిందుడు. బ్రహ్మజ్ఞానపూరితములగు దివ్యవాక్కులచే అందు అనుభూతి అయినవాడు. జీవుల పాపవాసనలను హరించు వాడు. నిశ్శ్వాసయందలి 'హ', కంఠధ్వని యందలి 'ర్' కలిసి స్వామియే దిగివచ్చును గాన హరి. నారాయణుడే జీవులలోనికి శ్వాసగా, హరిగా దిగివచ్చును. హరి సగుణుడు. అన్నమయ్య సారముగ స్వామికి శరణందు చున్నాడు. 'సారము' అను పదము ఆ మహాభక్తుని గుండె పూర్తిగా దేవుని స్మరణమను నీటితో తడిసి, వెలువడినది. సారమనగా తన వ్యక్తిత్వము మొత్తము – తన బుద్ధి, మనస్సు, ఇంద్రియములు, ప్రాణము, శరీరము, ఆదర్శములు, ఆశయములు, అభిప్రాయములు, జీవితము – ఇది యది అననేల తానే. అన్నిటికన్న ప్రేమ మానవుని జీవనసారము. ఈ ప్రేమ తనపైననే, తనకెక్కువ యుండును. అట్టి ప్రేమ స్వామికి సమర్పితమయినది. 'తనది' యని అన్నమయ్యకు దేనియందును అభిప్రాయము లేదు. 'తనది', 'తాను' స్వామికి శరణమగుట జరిగినది.

మొదటి చరణము యొక్క తాత్పర్యము

"ఈ సంసారము మాయసంసారము. ఇందు చల్లదనము, వెచ్చదనము అను రెండు పరస్పర వ్యతిరేకములగు అనుభవములు కలుగుచున్నవి. ఒక్కొక్కసారి వచ్చిన సుఖము తొలగిపోవును. ఒక్కొక్కసారి వచ్చిన దుఃఖము తొలగును. ఈ రెండు సుఖ దుఃఖములు పుణ్య పాపముల ఫలితములు. పులుపు, తీపి కలిసి తినినట్లుగా ఈ అనుభవములు కలిసి వచ్చుచుండును."

వ్యాఖ్య

ఈ సంసారమనగా ఏమి? భార్య, పిల్లలు, ధనము, మిత్రులు, చుట్టములు గారు. వారియందు మనకు గల సంగమే సంసారము. అవి అంటుకొనుటయే సంసారము. అవి ఏల అంటుచున్నవి? మాయ వలన అని అన్నమయ్య సమాధానము. కావున సటల సంసారమనెను. అశాశ్వతములయిన వానిని

శాశ్వతములని భ్రమ పడుట, అసత్యములందు సత్యమును ఆరోపించుట, విలువ లేనివానిని విలువ గల వనుకొనుట మాయ. పై సంబంధములు అశాశ్వతములు. ఆయా సంబంధ రూపములలో నున్నది స్వామియే. అతడే శాశ్వతుడు. సత్యము. కనపడు వ్యక్తుల రూపములు, సన్నివేశములు, పరిస్థితులు సత్యము గావు. అట్లే ధనము, అధికారము, పాండిత్యము, మనము నిజమని భ్రమపడు సిద్ధాంతములు విలువ లేనివి. విలువయి నది భగవంతుని సాన్నిధ్యమే. కాని మాయకు వశుడగు జీవుడు పొరపడుచున్నాడు. ఈ పొరపాటు వలన సంసారమునబడి (సంగమున) సుఖ దుఃఖముల ఆటుపోట్లకు గురియగుచుండును. దేవుడే మాయను కల్పించినను ఆయన కది క్రీడ. ఆయన మాయాతీతుడు. జీవుడు మాయాబద్ధుడు. పాము నోటిలోని విషము, పాము నేమియు చేయదు. ఇతరులను కరచినచో హాని చేయును. సౌకర్యము, అసౌకర్యము అనునవి సంగ దోషములే కాని సత్యములు గావు. చలికాలములో చలిగా నుండుట, ఎండా కాలములో ఎండగా నుండుట ప్రకృతిలో సహజములగు జంటలు. వీనిని అసౌకర్యము లని మాయాబద్ధుడయిన సంసారజీవి పొరపడును. చలి, ఎండ, ఆకలి, దప్పిక మున్నగునవి దేహమున కేమి కావలెనో ప్రకృతి ఏర్పాటుచేసిన క్రమశిక్షణ విధాన ములు. చలిగా నున్నదన్నచో దేహమును కప్పి కాపాడుకొనుమని హెచ్చరికయే గాని, చలికి భయపడుట పనికిరాదు. దుప్పటి, శాలువ వాడుట మన కర్తవ్యములని తెలుపుటయే చలి యొక్క ఉపదేశము. అవి లేనపుడు ఏడ్వ పనిలేదు. అట్లే సన్నివేశ ములు. పాఠములు చదువుట మాని, చదువవలసి వచ్చినందులకు ఏడ్చునట్టి విద్యార్థి వంటి మూర్ఖుడు సౌకర్యములకు సంతసించి, అసౌకర్యములకు బాధపడువాడు. చలి, ఎండ వలెనే సుఖ దుఃఖములు జీవితమున ఏర్పడుచుండును. ఇవి మనకు వెలుపలి సన్నివేశములు. వీని అనుభవము లేనిదే, వానికి అతీతముగా భగవ దనుభవముతో బ్రతుకుట తెలియదు. సుఖములకు పొంగ పనిలేదు. దుఃఖములకు క్రుంగ పనిలేదు. అవి కలిగినపుడు ఏమి చేయవలెనో వానిని చేయవలెను. దివ్యాను భూతిలో బ్రతుకవలెను. సుఖ దుఃఖములు మనసున కంటకుండ వాని అనుభవమును విడిచిపెట్టవలెను. సుఖ దుఃఖ సన్నివేశములు మనసునకు అంటుకొనరాదు. నాకిట్లు జరుగవలెను, ఇట్లు జరుగరాదు, ఇది నాకు అవమానము, ఇది గౌరవము మున్నగు అభిప్రాయములున్నచో సన్నివేశములు సుఖ దుఃఖముల వలె కన్పించి అంటుకొనును. కాని అన్నమయ్య వంటి మహాభక్తునకు ఒకసారి సుఖము తొలగి కష్టము వచ్చినను, వేరొకసారి కష్టము తొలగి సుఖము కలిగినను – ఈ రెండు రకముల సన్నివేశములు కనబడునవి. వీని రూపమున కూడ స్వామినే దర్శించుటచే భగవత్ సాన్నిధ్యము ఏ పరిస్థితిలోనయినను అతని కుండెను. దానినే మనకు అన్నమయ్య ఉపదేశించుచున్నాడు. సంసారజీవి మనస్సు దేనినో కోరుచుండును. దేనినయినను కావలెనని కోరినను, అక్కరలేదని కోరినను కోరికయే అగును. అన్నమయ్య వంటి భక్తుడు కోరికలుండ రాదనియు కోరడు. అతనికి ఏ కోరికతోను పనిలేదు. కోరికలు దాటిన దైవానుభూతి అతనికి దక్కినది గదా. అతనికి ఇదికాక వేరు జీవితము లేదు. సుఖము, కష్టము అను సందర్భము లుండవు. సర్వము భగవదధీనములని అతని కెఱుకయే. అయితే అసలు కష్ట సుఖములు ఏల కలుగవలెను? పూర్వము చేయబడిన పాప, పుణ్య ఫలములే ఇవి. భగవంతుడు కూడ కర్మసాక్షియై ఈ ఫలముల నిచ్చును. భక్తుడైన అన్నమయ్య పాప పుణ్య

ఫలములను సమదృష్టితో చూచెనే గాని, వానికి చిక్కలేదు. ఆతనికి పొంగుట, క్రుంగుట లేవు. భోజనములో పులుపు, తీపి, రెండును కలిపినపుడే రుచిగా నుండును. అచ్చము తీపియే యైనచో వెగటుపుట్టును. అట్లే కష్ట సుఖములు కలిసిన బ్రతుకును భక్తుడు హృదయపూర్వకముగా స్వీకరించునే కాని, కష్టములు వద్దనడు. రెంటిని భగవంతుని ప్రసాదములుగా గ్రహించి, సుఖ దుఃఖాతీత మయిన దివ్యానందమున జీవించును. 'పులుపు, తీపి' అను పోలిక ఎంతయో సహజముగా నున్నది. పాపము చేసి, వాని ఫలితముగా వచ్చు కష్టములు వచ్చినపుడు మాత్రము వానిని వద్దనుట, తొలగింపుమని దేవునికి మ్రొక్కుట, వాని నెదుర్కొన యత్నించుట అవివేకము. కష్టములు దేవుడిచ్చినవి, సుఖములు తన తెలివి వలన వచ్చినవని కొందరు పొరపడుచుందురు. కావున కష్టములలో దేవుని నిందింతురు. ఇంతగా పూజించినను, దయచూపని వాడందురు. మహాభక్తుడు అట్లుగాక, కష్టములను, సుఖములను రెంటిని దేవుని కృపగా గ్రహించి, రెంటియందును జీవింపక, దేవుని యందు జీవించును. కష్టములను, చిక్కులను, సమస్యలను ఎదుర్కొనుట కూడ అవివేకమే. తన సొంత తెలివితో తెచ్చుకున్న చిక్కులను, మరల ఆ తెలివితోనే ఎట్లు విడదీయగలడు? ఆ నెపమున క్రొత్త చిక్కులు తెచ్చిపెట్టుకొనును. ఏ రకమున ఉద్వేగము చెందినను పరిష్కారము తట్టదు. చిక్కులు, ఆపదలు, సమస్యలు వచ్చి నపుడు దేవుని వానియందు దర్శించి, ఆయనకు శరణందిన వాని బుద్ధి సమత్వము నందును. అప్పుడేమి చేయవలెనో దైవము సూటిగా తట్టించును. లేదా మహాభక్తుల ద్వారమున కర్తవ్యములను బోధించును. ధర్మరాజు కష్ట సుఖములు రెంటియందును కృష్ణుని పాదములు విడువలేదు. శరణాగతి తప్పలేదు. కావుననే అరణ్యవాసమునను భగవత్ సాన్నిధ్య మాధుర్యమునే అనుభవించెను. అతనికి ఆయా కష్ట సుఖ సందర్భము లందు కృష్ణుడు సూటిగా గాని, నారదుడు, వ్యాసుడు, ఇతర ఋషుల ద్వారముల గాని కర్తవ్యములను ఉపదేశించి నడిపించెను. కుంతీదేవి కృష్ణునితో చివరగా తన కుమారులకు రాజ్యము వచ్చిన తర్వాత ఇట్లనెను, "నా పిల్లలకు కష్టములు, సుఖములు కలిగెనని కొందరనుచున్నారు. నాకేమియు తెలియదు. అన్ని సన్నివేశములందును నీ దివ్యవైభవమే నాకు దర్శనమిచ్చుచున్నది." పాపమని తెలిసియు మానవు డెందుకు ఆచరించుచున్నాడు? రజోగుణము నుండి పుట్టిన కామ క్రోధములే పాపాచరణకు కారణములని కృష్ణుడు గీతలో చెప్పెను. దీపపు గ్లాసుకు మసి వలె, నిప్పుకు పొగ వలె, గర్భమునకు మావి వలె పాపము వెంటనంటి యుండును. ఈ మసిని, పొగను వదిలించుకొనుటకే సాధన. వీనిని తుడిచివేయువాడు దేవుడే. మనము శరణాగతి చెందినపుడు స్వామి ఈ పనికి పూనుకొనుము. సుఖ దుఃఖములందు సమత్వము యోగమనబడును. దుఃఖములకు యోగి ఉద్వేగము చెందదు. సుఖములు వచ్చినపుడు వానిని పొందునే గాని సుఖేచ్ఛ పొందడు. ఉదాహరణకు కారు కావలసి నపుడు కుదిరినచో కొని దానిని పనులకై సద్వినియోగపరచును. అంతేకాని దానిపై మోజు పడడు. సుఖ దుఃఖములకు సముడే ముని, ధీరుడు. ఇతడు అమృతత్వము నొందునని గీతలో కృష్ణుడు బోధించెను. తనకన్న ఎక్కువ కష్టములలో, దైన్యములలో నున్న జీవులపై దయ కలిగి వారి రూపములలో నున్న స్వామిని సేవించినచో, తన దుఃఖములు మరపునకు వచ్చును. కాని సంసారజీవి తన కష్టములనే అధికముగా తలంచి దుఃఖము పాలగును.

2వ చరణము యొక్క తాత్పర్యము

"జీవి ఎన్నో జన్మలెత్తుచుండును. వాస్తవమునకు దేహములు ధరించుచుండును. మరల ఆ దేహములను విడుచుచుండును. మరణము, జననము దేహములకు తప్పవు. ఇవి పగలు, రాత్రి వంటివి. మన పూర్వ కర్మకు తగిన దేహము ఏర్పడును. కొంతకాలము తర్వాత దానియంతట అదియే తొలగును. భగవంతుడు, జీవుని వాని వాని కర్మలను బట్టి ఒకసారి నవ్వించును, వేరొకసారి ఏడ్పించును. తాంబూల ములో వగరు కొంత, కారము కొంత కలిపి ఉత్సాహము కల్పించినట్లు జీవితమున తాంబూలమున నవ్వు, ఏడ్పు రెంటినీ దేవుడిచ్చును. కాని రెంటియందును ఉత్సాహ మును, తృప్తిని విడువరాదు అని దేవుని యానతి."

వ్యాఖ్య

పాత దుస్తులు పనికిరాని దశకు చేరినపుడు, వానిని విడుచుట, క్రొత్త దుస్తులు ధరించుట సహజములగు మార్పులు. వీనికి చింతింపబనిలేదు. వేరొక ఊరికి బదిలీ అయినపుడు గాని, ప్రస్తుత నివాసమున్న సౌకర్యములు గల ఇంటికి మారునపుడు శోకించుట అవివేకము. ఇచట అన్నమయ్య పుట్టుక, గిట్టుకలను పగలు, రాత్రిలతో పోల్చెను. పుట్టినవాడు గిట్టక తప్పదు. గిట్టినవాడు పుట్టక మానడు. ఈ మార్పులు మార్చగలిగినవి కావు. ఇక శోకించుట ఏల అని కృష్ణుడు చెప్పెను. పుట్టినప్పటి నుండి గిట్టుట వరకు జీవితము పగటి వంటిది. జీవి ప్రజ్ఞ, పనిచేయు స్థితి. గిట్టుక, నిద్ర వంటిది గాన రాత్రితో పోల్చబడినది. మరణము పెనునిద్ర. దేహము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి పనిచేయవు. కాని సంస్కారములు మాత్రమే అట్లే ముద్రలుగా మిగిలియుండును. తనకు సంబంధమున్న వ్యక్తులు, తాను చరించిన ప్రదేశములు గుర్తుండుట జరుగదు. కాని రాగద్వేషములు వాసనా రూపమున ముద్రలై మిగిలియుండును. మరణించునపుడు భయపడువానికి మత్తుమందును వలె ప్రకృతిలోని కొన్ని ప్రజ్ఞలు–యమదూతలు స్పృహను తప్పించి, జీవుని దేహములో నుండి ఇవతలికి లాగుదురు. అసలు ఈ స్పృహతప్పుట, మృత్యుభీతియే మృత్యువు. అన్నమయ్య వంటి మహాభక్తుని విషయము వేరు. వీరి ప్రజ్ఞ సర్వాత్ముడగు హరి యందు నిలిచియుండుటచే స్పృహ తప్పుట యుండదు. హాయిగా దోస తొడిమను వలె వీరు దేహమును విడుచుదురు. వీరు మరణింపరు. అమృతులు. మృత్యుంజయులు. బాల్య, కౌమార, యౌవన, వార్ధక్యముల వంటిదే వేరొక దేహమును పొందుట యని కృష్ణుడు చెప్పెను. వయస్సు గడుచుచున్న కొలది శోకించువాడు నిత్యము మరణించువాడే. వయస్సున వచ్చుచున్న మార్పులను భగవత్ సేవకై సద్వినియోగ పరచుకొనువాడే యోగి. అహోరాత్రములు కాలపురుషునిలోని రెండు పార్శ్వములు. అట్లే జీవునకు జనన మరణములు. మనకు వచ్చు క్రొత్త శరీరము, పూర్వజన్మలోని మన తలపులు, పలుకులు, చేష్టలు, జీవన విధానముపై ఆధారపడియుండును. మనకెట్టి శరీరము వచ్చునో, ఏ తల్లిదండ్రులకు పుట్టెదమో మన నిర్ణయముతో ప్రమేయమున్న అంశములు గావు. మన పూర్వ జీవనసరళిని బట్టి, పూర్వ దేహాంత సమయమున పరిణామమున ఏ దశను చేరుదుమో, దానిని బట్టి క్రొత్త పుట్టుక యుండును. 'తగు మేను' అనుటలో ఇంత భావమున్నది. ఈ శరీరము నిమ్మని అడుగు హక్కు జీవికి లేదు. అర్జునుని ప్రశ్నకు కృష్ణుడిట్లు

బదులు చెప్పెను. "అధ్యాత్మిక సాధన చేయుచు, అది పూర్తికాకముందే దేహము విడిచిన వారు, తమ సాధనను కొనసాగించి భగవంతుని సాన్నిధ్యము నందుటకు అనుకూలమయిన పెంపుదల నిచ్చు తల్లిదండ్రులకు జన్మింతురు. శరీర బలహీనత వలన సాధన చక్కగా చేయలేని వానికి సాధన కనుకూలమగు బలమైన శరీరము కలుగును. దీనులకు దాన ధర్మములు, మానవసేవ చేయవలెనని బలమైన కోరిక ఉండి వానిని అంతగా చేయలేనివాడు, శ్రీమంతుని ఇంట పుట్టి దానధర్మాదులు, సేవ చేయవలయు పరిస్థితులను పొందెదరు." ఇక శరీరము తనకుతానే తొలగును. అనగా ఒక జీవి ఆయుర్దాయ మెప్పుడు ముగియునో ఆ జీవి ఊహకందదు. (మహాభక్తులు, యోగులకు తెలియును.) దేహము తగు సమయము వచ్చినపుడు తొలగిపోవును. వైద్యులెంతటివారయినను, విదేశము లందు చదివిన సర్టిఫికెట్లు చూపినను, దేహాంతమాగదు. కావుననే ఆయుర్వేదమున ఇట్లు చెప్పబడినది, "చికిత్స చేయుట వరకే వైద్యుని పరిమితి. రోగ నివారణ దేవుని పని." దేహము విడుచునపుడు కంగారుపడరాదు, భీతి చెందరాదు, శోకింపరాదు. ఈలోపే సంసార వ్యామోహములనుండి బయటపడవలెను. మనము చేసిన సాధన, హరి సంస్మరణ ఆ సమయమున మనకు మృత్యువు లేకుండ దేహమునకు మాత్రమే అంతమును ఇచ్చును. ఇదియు దైవానుగ్రహము. వాస్తవమునకు సజీవ దేహములోని ఖనిజాదులు, బయటి పంచభూతాదులలోని తమ మూలస్థానములను చేరును. తిరిగి క్రొత్తదగు సజీవ దేహమున గూడుకట్టుకొనును. దేహాంతమప్పుడు వద్దనుకొన్నను అది ఆగదు. ఈలోపు, కావలెనని కోరినను రాదు. పరిస్థితులకు తట్టుకొనజాలక, దేహాంతమును కోరినను రాదు. కర్మానుభవము తప్పదు. దానిని దైవానుభూతితో ఓర్వక తప్పదు. ఆత్మహత్య చేసికొనువాడు ఆపై జన్మలలో క్రిమి కీటకాదులుగా రావలసివచ్చును. కర్మానుభవమును వాయిదా వేయుటకు యత్నింపరాదు. కులశేఖరాళ్వారిట్లు దేవుని వేడెను. "వస్తుసంపదలు, విషయభోగములు నేను కోరను. పూర్వకర్మను బట్టి ఏ పరిస్థితి నాకు రావలెనని నీవు భావింతువో దానినే ఇమ్ము. ఏమి చేయవలెనో నీవే నిర్ణయించి తెలుపుము. ఎన్ని జన్మలందైనను నీ పాదములందు స్థిరమైన భక్తిని మాత్రము నిలుపుము." దేహాంతము పెద్దల వలన తెలిసినపుడు, ఆందోళన చెందక, భగవత్ స్మరణలో, భగవత్ గుణకథా శ్రవణములో కాలము గడుపవలెను. పాముకాటు వశమున వారము దినములలో మరణింతునని తెలిసిన పరీక్షిత్తు 'నేను మృతుండనౌదున'ని భావించెను. శుకయోగి నుండి భాగవతము విన్న పిదప, భగవంతుని యందు నిలిచి, దేహమును విడిచెను. కాన అమృతుడాయెను. మన కర్మనుబట్టి దేవుడొకపరి నవ్వించును. ఒకపరి ఏడ్పించును. ఇవి ఆయనకు క్రీడలు. ఒకరిపై పక్షపాతము గాని, వేరొకరిపై ద్వేషము గాని స్వామికుండవు. ఒకే వ్యక్తిని కూడ ఇట్లు నవ్వించును, ఏడ్పించును కూడ. స్వామికి ప్రియులు, ప్రియులు కానివారు లేరు. దైవమునకు ద్రోహము చేయువాని యందును, ఆయనకు ద్రోహబుద్ధి యుండదు. దేవుడు శాపమిచ్చుట పురాణకథలలో గానరాదు. ఋషులైనను శాపమీయ వచ్చును గాని విష్ణువు గాని, శివుడు గాని శపించిన సందర్భములు లేవు. "నాకు ఇష్టుడు, పగవారు లేరు" అని కృష్ణుడు చెప్పెను. ఎవరును స్వామికి దగ్గర కారు, దూరము కారు. ఈ రెండు భావములు మనవే. నవ్వించుట సరియే, ఏడ్పించుట ఏల? ఈ రెండు పరిస్థితులను తన కరుణగానే స్వీకరించి, పాఠములను నేర్చి, ఈ రెండు పరిస్థితులందును తనయందే

నిలిచి, ఈ పరిస్థితులకు అతీతముగా తన అనుభూతిని క్రమముగా జీవునకు ప్రసాదించుటే దేవుని ఆట. మనము సహింప దగిన వగరు అను రుచితో కూడి తాంబూలమున కారముండును. రెండు విభిన్న రుచులు కలిసిన తాంబూలమే క్రొత్తదగు చక్కని రుచినిచ్చి, మనకు ఉత్సాహమిచ్చును. అట్లే కష్ట సుఖములను రెండు రకములయిన పరిస్థితులు కూడిన జీవితములోనే భగవదనుభూతి అను క్రొత్త రుచి లభించును. ఇది లోపల కలుగునది. ఈ రుచిని దేవుడనుగ్రహించును. దానినే అన్నమయ్య జానుతెలుగులోని 'ఉబ్బించినట్లు' అను పదముతో సూచించెను. ఎంత చక్కని పోలిక – బ్రతుకులో వగరు, కారము కలిసిన తాంబూలము వంటిదట బ్రతుకు. అచ్చము కష్టములు లేక సుఖములే కలుగువానికి సోమరితనమబ్బును. ఉదాహరణకు పెద్దల నుండి సంక్రమించిన ఆస్తిని కరగించి, భుజించుచు, ఏ పనియు చేయనివాడు, ఆస్తి కరుగగనే దరిద్రుడగును. జీవితములో ఎవరికిని సాయపడకుండుటచే, ఎవరి సాయమందక కష్టముల పాలగును. గిలగిల లాడును. కావున కష్టములకు లొంగక, దైవస్మరణతో, అప్పుడు ఏమి చేయవలెనో ఆ నేర్పును దేవుని నుండి గ్రహించి పాటింపవలయును. అట్లే గౌరవమును కోరిన వాడు, తప్పక అగౌరవముపాలై ఏడ్చును. నాయంతటి మంచివానికి ఇంతటి అవమానమా! అని దుఃఖము, రోషము, పగ కలుగును. అవమానించిన వానిని ఏమియు చేయలేనపుడు తనపైన తనకే జాలి కలుగును. ఇది సాధనకు పెద్ద విఘ్నము. అసలు గౌరవమును, సుఖమును జీవుడేల కోరును? 'తాను' కేంద్రముగా ఆలోచించుట వలన. అట్టి 'తాను' శరణందినపుడు ఈ కోరికకు తావుండదు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడుగా గూడ దేవునకే కష్టసుఖములు వచ్చెను. మనమెంత? మనము కూడ దైవానుభూతిలో నిలిచినచో దేవునకు ఇవి ఎట్లు క్రీడలగునో మనకును అగును. ధర్మరాజు యక్షున కిట్లు చెప్పెను. "భార్యాభర్తలు కలిసినదే కుటుంబము. అట్లే కష్టసుఖములు కలిసినదే జీవితము."

3వ చరణము యొక్క తాత్పర్యము

"ఇహము, పరమును వలెనే ఎదుటివారి కల్లమాటలు, సత్యములయిన పలుకులు వర్తించును. బుద్ధిలో ఒకసారి భ్రమయును, వేరొకసారి భ్రమ తొలగిన స్థితియు కలుగును. ఇట్టి జంట స్థితులలో, ఓ వేంకటేశ్వరా నన్ను దయచూచి అనేక విధములుగా పాలింపరాదా!"

వ్యాఖ్య

ఐహికము, ఆధ్యాత్మికము అను జంట వలెనే ఎదుటివారు కొందరు మనతో కల్లలాడుట, నిజము చెప్పుట జరుగుచుండును. బుద్ధిలో ఒకసారి అసత్యమును సత్యముగా భ్రమించుస్థితి, భ్రమ తొలగి సత్యమును దర్శించు స్థితియును కలుగు చుండును. ఇచట విభ్రాంతి యనగా విశేషమయిన భ్రాంతి కాదు. విగతమైన భ్రాంతి. అసత్యము, స్వప్నము వంటి జగత్తును, అందలి అశాశ్వత విషయములును సత్యములుగా, శాశ్వతములుగా ఒక్కొక్కసారి అనిపించును. దైవానుగ్రహమున ఈ స్థితి తొలగి, సత్యము అంతర్యామియగు స్వామి యని ఎఱుక కలుగును. మంచుగడ్డ కన్పడుట భ్రాంతి. అందు నీరు దర్శనమిచ్చుట విభ్రాంతి.

అట్లే వివిధ విషయములతో గూడి, మార్పులు చెందు విశ్వము, అందలి వ్యక్తులు కన్పడుట భ్రాంతి. విశ్వమునందు, వ్యక్తుల యందు అంతర్యామి యగు స్వామి దర్శన మిచ్చుట విభ్రాంతి. ఈ రెండును జీవితమున తప్పవు. ఇహము, పరము వంటివే ఇవి. మొదటి భ్రాంతి స్థితినే ఇహ లోకమున జీవించుట, రెండవ విభ్రాంతి స్థితినే పరలోక జీవనము లేక దివ్యలోక జీవనమందురు. నీటిని చూచినవాడు మంచుగడ్డను విడువడు. ప్రత్తిని చూచినవాడు చొక్కాను ధరించుట మానడు. ఒక చొక్కా చినిగినచో ఏడ్వడు. ప్రత్తి యున్నదిగదా అని ధైర్యము. ఈ చొక్కాయే కావలెనని కోరి దానికి బానిసగాడు. అట్లే పరలోక జీవనము గడుపువాడు బ్రతికియున్నపుడే, అనగా ఇహమునందే గడుపును. ఐహిక వస్తువులను సద్వినియోగపరచుకొనును. కుటుంబము, సమాజము నెడల కర్తవ్యము లను విడువడు. అన్నిటియందు ఒకనినే అనుభవించును. ఆ ఒక్కడే స్వామి. ఏ వస్తువు లేకున్నను, ఏ వ్యక్తిపై రాగద్వేషములతోను చిక్కుపడడు. శ్రీవేంకటేశ్వరుని స్థితి సహజ స్థితి. జీవికి వలె సుఖ దుఃఖముల అనుభవములు స్వామిపై పనిచేయవు. తనను నిందించిన వారిని, తన యునికిని కాదన్న వారిని గూడ అన్నవస్త్రాదు లొసగి కరుణించును. స్వామి సహజస్థితి అఖండమగు, అవ్యాజమగు ప్రేమ. అనంతమగు ఆనందము. ఇవి చెదరవు. జీవులకు తన ప్రేమలు చిదిమిపెట్టువార లందించు నిందలు స్వీకరించుట స్వామికి పరమ సంతోషము. భక్తుల స్తుతులతో బాటు, కొందరి నిందలు గూడ స్వామికి తన శాశ్వతమగు ఆటయే. ఓ వేంకటేశ్వరా! నన్ను దయతో పాలింపుము. అనగా నీ సహజ స్థితినే నాకును అనుగ్రహింపుము అని అన్నమయ్య వేడికోలు. స్వామి దీని నిచ్చుటకు ఎప్పుడును సంసిద్ధుడే. జీవుడు దైవాంశ గావున, అతని కిదియు సహజ స్థితియే. కాని ఆతడు మాయకు చిక్కి, తన సహజ స్థితి నుండి చెదరి సుఖదుఃఖాదులగు జంటలకు లొంగును. దేవునికి మాయ అధీనమున నుండును గాన, ఆయన సహజ స్థితిలోనే ఎప్పుడు ఉండును. మాయను దాటవలెనన్న, దేవుని శరణందవలెను. అట్లు అన్నమయ్య శరణందినట్లు పల్లవిలో సూచించెను. తన హృదయమున దేవునికే స్థానమున్నది. కావున ఆతనికి దేవుని సహజ స్థితి తప్పక కలిగినది. 'పాలింపవే' అనుటలో పాలించుమని వేడికోలుతో బాటు 'ఏల పాలింపవు?' అను చనవు కూడ కలదు. దేవుని వద్ద అన్నమయ్యకు చనవిట్టిది. దీనికి కారణ మితని శరణాగతియే. ఈ సంకీర్తనము సమత్వమును, శరణాగతిని ఉద్బోధించునది. ఈ యుద్బోధ అన్ని కాలములకు, అందరికి పనికి వచ్చునది. తాను ఈ సమత్వమును అనుభవించి, దానికి కారణమైన శరణాగతిని పొంది అన్నమయ్య ఉపదేశించుచున్నాడు.

* * *